భావవీణ ప్రత్యేక సంచిక

టి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
కందుకూరు ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా

&

కె.ఆర్.కె. ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
అద్దంకి, బాపట్ల జిల్లా

అంతర్జాతీయ సదస్సు

తెలుగు సాహిత్యం – విభిన్న ప్రక్రియలు, ధోరణులు

తేదీలు 24, 25 ఆగష్టు 2022

International Journal of Telugu Literary, Culture and Language Studies

Vol. 19-Issue-08 SPL.Edition-Monthly-August, 2022-ISSN No.2456-4702

నిర్వహణ :

ఇరు కళాశాలల తెలుగు శాఖలు



మాతెలుగు తల్లికి మల్లెపూదండ – మాకన్న తల్లికి మంగళారతులు

BHAVA VEENA (భావవీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య - సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishna Rao
E-mail : parisodhanatelugu@gmail.com

Ph : 7989781963,
9490847482
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 19, Issue. 8, August 2022 (Spl. Issue) ISSN No.2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-

EDITORIAL BOARD

Chief Editor

Dr. PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy)., M.Ed.,M.PMl(Edu), Ph.D.,

C/o. Dr. Busi Venkataswainy

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 798978 1 963.

ADVISORY COMMITTEE

1. **Prof. G Yohan Babu,** MA., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi, M.A., PhD.**
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy, M.A., PhD.**
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi** Venkataswainy, M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
Associate Professor, Dept. of Telugu &
Chairman, BOS Philothrophy& Religion Studies,
Andhra University, Visakhapatnam.
5. **Dr. Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) Ph.D
Research Scientist, Centre for Applied Linguistics and Transaction Studies, Universityof Heidelberg, Germany.
6. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., Ph.D.
HOD, Dept. of Telugu,
Hyderabad Central University, Hyderabad, Telangana.
7. **Prof. T. Ramaprasad Reddy**
Dean, Faculty of Arts & Education,
Yogi Vemana University Kadapa, Andhra Pradesh.
8. **Dr. T. Swaruparani,** M.Sc., M.Ed., M.Phil., Ph.D.
Principal,
St Joseph's College of Education for Women,
Sambasivapet, Guntur, Andhra Pradesh.

ASSOCIATE EDITORS

1. **Dr. N. R. SADASIVA REDDY,** M.A.,M.Phil,PhD.
Associate Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO,** M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu, Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU,** M.A., M.Phil, PhD.
Associate Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD. HOD,
Dept. of Telugu
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.

5. Prof. N.V. **KRISHNA RAO,** M.A., M.Phil, PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.

6. **Prof. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu,
Kakatiya University, Warangal District. Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Deptof Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai, Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor,
Dept. of Telugu, Yogi Vemana University, Kadapa.

9. **Prof. P. R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
University of Hyderabad, Gachibowli - 46.
Hyderabad. Telangana.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr.D.ESWARARAO.M.A.,**
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VI JAVA KUMAR,** M. A.,M.Phil,PhD.
Vice Principal,
Govt. Degree College, Yemmiganuru.

14. **Dr. K, RAVI,** M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Narayanapuram.

15. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
Govt. Arts College, Rajahmundry.

16. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Potti Sriramulu University, Bommuru.

17. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

18. **Dr. N. Rambabu, M.A.,** M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical Literature,
Nellore.

19. **Dr. G Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

20. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

21. **Dr. M. Prasad,** MA, M.A. (San), PhD.
Diploma in Maliyalam. School Assistant (Telugu)
Govt. High School, Rapuru, SPSR Nellore.

22. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

LEGALADVISER

Dr. A. GURAVAIAH, ***M.A., L.L.M., Ph.D.***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

D.T.P. & PRINTING

S.S. GRAPHICS, Nagarampalem, GUNTUR-4.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు – **ఎడిటర్**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail: parisodhanatelugu@gmail.com.Printed at: GLS Enterprises, Kavitha Nagar, Guntur- 522 002.
Ph. 94 94 660 509.

టి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల

కందుకూరు, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్ : 523 105.

(Established in 1966) (ISO 9001 : 2015 Certified)

Affiliated to Acharya Nagarjuna University.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల

అద్దంకి, బాపట్ల జిల్లా, ఆంధ్రప్రదేశ్

(Established in 1984) (ISO 9001 : 2015 Certified)

Affiliated to Acharya Nagarjuna University.

రెండు రోజుల అంతర్జాతీయ అంతర్జాల సదస్సు ప్రత్యేక సంచిక

తెలుగు సాహిత్యం - విభిన్న ప్రక్రియలు, ధోరణులు

24 & 25 ఆగస్టు 2022

నిర్వహణ

ఇరు కళాశాలల తెలుగు విభాగాల వారి

సంయుక్త ఆధ్వర్యంలో

తెలుగు సాహిత్యం – విభిన్న ప్రక్రియలు, ధోరణులు

అంతర్జాతీయ అంతర్జాల సదస్సు

భావేచన : ప్రత్యేక సంచిక
ISSN No.2456-4702
RNI No. APTEL/2003/12253
UGC CARE – Journal – Arts & Humanities

ప్రథమ ముద్రణ	:	ఆగస్టు 2022
ప్రతులు	:	500
వెల	:	500/-
కాపీలకు	:	టి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కందుకూరు, కె.ఆర్.కె. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అద్దంకి.
గమనిక	:	ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - సంపాదక వర్గం.
ఎడిటోరియల్ చిరునామా	:	హోలీ హౌస్ అపార్ట్‌మెంట్స్, పోస్టల్ కాలనీ, 4వ లైను, గుంటూరు - 522 002.
డి.టి.పి. & ప్రింటిగ్	:	తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్, గుంటూరు జిల్లా.

టి.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

కందుకూరు, ఎస్.పి.ఎస్.ఆర్ నెల్లూరు జిల్లా

&

కె.ఆర్.కె. ప్రభుత్వ డిగ్రీ కళాశాల

అద్దంకి, బాపట్ల జిల్లా

తెలుగు సాహిత్యం-విభిన్న ప్రక్రియలు-ధోరణులు
అంతర్జాతీయ అంతర్జాల సదస్సు

తేదీలు 24-25 ఆగస్ట్ 2002

సదస్సు సంచాలకులు

డా.కె. సుజాత, తెలుగు విభాగాధిపతి

టి.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కందుకూరు

షేక్ షానాజ్ బేగం, తెలుగు అధ్యాపకులు

టి.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కందుకూరు

డా.సి.హెచ్.అనిత, తెలుగు విభాగాధిపతి

కె.ఆర్.కె పభుత్వ డిగ్రీ కళాశాల, అద్దంకి

తెలుగు సాహిత్యం-విభిన్న ప్రక్రియలు-ధోరణులు

అంతర్జాతీయ అంతర్జాల సదస్సు

ప్రధాన సంపాదకులు

డా.కె.సుజాత, తెలుగు విభాగాధిపతి

టి.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కందుకూరు

షేక్ షానాజ్ బేగం, తెలుగు అధ్యాపకులు

టి.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కందుకూరు

డా.సి.హెచ్.అనిత, తెలుగు విభాగాధిపతి

కె.ఆర్.కె పభుత్వ డిగ్రీ కళాశాల, అద్దంకి

కోశాధికారి

డా.కె.మాలకొండయ్య, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు

V.Balasubrahmanyam
MLC
Prakasam, Nellore, Chittoor
Teachers' Constituency, Floor Leader
Progressive Democratic Front
Cell: 94900 98912

Off: Progressive Democratic Front
Flat No.C-34, Lotus Legend
Apartments, Kummara Palem Centre,
Vijayawada-520012, Ph(Fax):0866-2412412

Res: D.No.27-1-1304,Balaji Nagar
Nellore-524 002
E-mail:vbsjvv@gmail.com

శుభాభినందనలు



సమాజంలోని ప్రతి గతి దాని చలనం, క్రియాశీలత్వం పురోగామితత్వం, విలువలు, ఆకాంక్షలు అనే వాటిపై సాహిత్యం ఆధారపడి ఉంటుంది. సాహిత్యం సమాజ ప్రతిబింబంగాను సమాజాన్ని ప్రోత్సహించేదిగాను ముందుకు నడిపించేదిగాను ఉంటుంది. తెలుగు నేలపై అనేక రాజకీయ, సామాజిక పరిణామాలు, కొన్ని సందర్భాల్లో తీవ్రమైన సంక్షోభాలు, సంచలనాలు పుట్టుకొచ్చాయి. దానికి తగ్గట్లుగానే పురోగామితత్వం, సమరశీలత్వం ముందుకు తీసుకువెళ్లే చొరవ అవసరమనుకున్న ప్రతి దశలో తెలుగు సాహిత్యం కొత్త పుంతలు తొక్కింది.

తెలుగు ప్రజల్ని ఆధునికతవైపు నడిపించాలి, వారిలో శాస్త్రీయ దృక్పథం కలిగించాలి అనుకున్న కందుకూరి, గురజాడ వంటి వారి అభ్యుదయ భావాల ఫలితంగా తెలుగు సాహిత్యంలో నూతన ధోరణులు, ప్రక్రియలు పురుడు పోసుకున్నాయి. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మరొక అంశం– అనువాద సాహిత్యం. ప్రపంచవ్యాప్తంగా సాహిత్యంలో వచ్చిన ప్రతి ధోరణిని తెలుగువారు అందిపుచ్చుకున్నారు ఇంటర్నెట్ ఆధారంగా కూడా కొత్త కొత్త ధోరణులు తెలుగు సాహిత్యంలో చోటు చేసుకున్నాయి.


తెలుగు సాహిత్యంలో ఎన్ని పరిణామాలు చేసుకున్నాయి, ఎన్ని ప్రక్రియలు ధోరణులు వచ్చాయి, ఎన్ని స్రవంతులు ఇందులో కలిసాయి,అంతేకాకుండా తెలుగు సాహిత్యం ఏ వైపు నుంచి ఏ వైపుకి ప్రయాణించింది ప్రయాణిస్తోంది. ఇంకా ఏ ఏ వైపులకి ప్రయాణించవలసి ఉంది మొదలగు ఎన్నో అంశాలు చర్చకు తీసుకువచ్చే విధంగా తెలుగు సాహిత్యం– విభిన్న ప్రక్రియలు, ధోరణులు అనే అంశంపై అంతర్జాతీయ సదస్సును నిర్వహించ పూనుకున్నందుకు ఇరు కళాశాలల వారికి మరియు ఈ సదస్సులో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికి హృదయపూర్వక అభినందనలు.

(విభవు బాల సుబ్రహ్మణ్యం)

Ph : 0869 - 2220093 (O)
Cell : 9948121715
Fax : 0863-2230149

GOVERNMENT COLLEGE FOR WOMEN (A)
(NAAC ACCREDITED B^{++} GRADE)
sambasivapet, GUNTUR - 522 001, Andhra Prades, India

Dr. V.R. Jyotsna Kumari
M.Com., M.Phil., Ph.D.
Principal



అభినందన

మన తెలుగు భాష అజంత భాష. అందుకే మన భాష మధురమైనది. అటువంటి తెలుగు భాషలోని అనంతమైన సాహిత్యమంతటిని ఒకచోటుకి తీసుకువచ్చే విధంగా ఒక వెబినార్ నిర్వహించడానికి సన్నద్ధమయినందుకు, దానికి తగ్గట్లుగా "తెలుగు సాహిత్యము – విభిన్న ప్రక్రియలు ధోరణులు" అనే అంశము ఎన్నుకున్నందుకు టి. ఆర్. ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల కందుకూరు, మరియు కె. ఆర్. కె. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అద్దంకి, కళాశాలల తెలుగు విభాగాలకు నా శుభాకాంక్షలు.

అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని నిర్వహింపబడుతున్న ఈ అంతర్జాతీయ అంతర్జాల సదస్సులు సాహిత్య మధనం జరగడానికి తద్వారా వచ్చిన సాహిత్యసుధను విశ్వవ్యాప్తంగా పంచుకునేందు కు దోహదపడతాయి.

ఈ సదస్సు జయప్రదంగా నిర్వహింపబడాలని కోరుకుంటూ, ఈ అంతర్జాతీయ అంతర్జాల సదస్సును నిర్వహిస్తూదేశ విదేశీయ సాహితీ వేత్తలను, సాహిత్యాభిమానులను, అధ్యాపకులను, పరిశోధక విద్యార్థులను ఈ బృహత్తర కార్యక్రమములో భాగ స్వాములను చేసినందుకు ఇరు కళాశాలల వారికి శుభాభినందనలు.

V.R. Jyotsna

Email: idcollege.guntur@gmail.com, web : www.gcwguntur.ac.in

T.R.R.GOVT DEGREE COLLEGE
KANDUKUR-523 105
[Affiliated to Achatya Nagarjuna University]

Dr.M.Ravi Kumar, M.Sc, M.Phil, Ph.D,
PRINCIPAL

Tele Fax : 08598 -223546
Mobile : 9440221228
Mail ID: gdckandukur@gmail.com
Web site: www.gdckandukur.ac.in



శుభాభినందనలు

"కదిలేది కదిలించేది
మారేది మార్పించేది
పాడేది పాడించేది
మునుముందుకు సాగించేది
పెనునిద్దుర వదిలించేది
పరిపూర్ణపు బ్రదుకిచ్చేది" కవిత్వం అంటూ కవిత్వాన్ని నిర్వచించారు మహాకవి శ్రీశ్రీ. నిజమే. సాహిత్యం మనిషిని మనిషిగా తీర్చిదిద్దుతుంది. మానవీయ విలువలను పెంచుతుంది. సంస్కారాన్ని నేర్పుతుంది. కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంచుతుంది. అంతేకాకుండా మనసుకి గొప్ప ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని ఇస్తుంది.

అశేష ప్రజానీకాన్ని అలరించిన, అలరిస్తున్న సాహిత్య ప్రక్రియ పాట. పాట అలసిపోయిన మనసుకి విశ్రాంతినిస్తుంది. బాధలో ఉన్న మనిషికి ఓదార్పునిస్తుంది. నిరాశలో ఉన్న మనిషికి ధైర్యాన్నిస్తుంది. అటువంటి గొప్ప సాహిత్యాన్ని చదవటం ఎంతైనా అవసరం. అట్టి గొప్ప సాహిత్యాన్ని గూర్చి సృజించిన కవుల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే.

తెలుగు సాహిత్యం ఒక మహాసముద్రం లాంటిది. క్షీరసాగర మధనంలోంచి ఒక్కొక్కటి పుట్టుకొచ్చినట్లుగా తెలుగు సాహిత్యంలోంచి కూడా విభిన్న ప్రక్రియలు, ధోరణులు వచ్చాయి. ఆయా అంశాలన్నింటిని సమన్వయ పరుస్తూ మా టి.ఆర్.ఆర్. ప్రభుత్వ కళాశాల మరియు కె.ఆర్.కె. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అద్దంకి తెలుగు విభాగాల వారు "తెలుగు సాహిత్యం – విభిన్న ప్రక్రియలు, ధోరణులు" అనే అంశంపై సదస్సు నిర్వహింప పూనుకున్నందుకు గాను వారికి నా అభినందనలు తెలియచేస్తున్నాను.

దేశవిదేశాల నుండి ఈ సదస్సులో పాల్గొంటూ మా ఈ సదస్సును జయప్రదం చేస్తున్న పెద్దలకు, సాహితీవేత్తలకు, సాహిత్యాభిమానులకు, అధ్యాపకులకు, పరిశోధక విద్యార్థులకు అందరికి హృదయపూర్వక శుభాభినందనలు.

PRINCIPAL
T.R.R. GOVT. DEGREE COLLEGE
KANDUKUR-523105
S.P.S.R. Nellore District.

Estd.:1964 NAAC-B GRADE
DEPARTMENT OF COLLEGIATE EDUCATION
K R K GOVERNMENT DEGREE COLLEGE,
ADDANKI- BAPALTA DISTRICT, A.P - 523201
Dr. V. MOHANA RAO., M.A., M.Phil., Ph.D., Cell: - 91-9441518793
PRINCIPAL E-mail: - gdcaddanki@gmail.com
Website:- www.krkgdcaddanki.ac.in



శుభాభినందనలు.

"ఏ దేశమేగినా ఎందు కాలిడినా
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము"

అన్న మహా కవి రాయప్రోలు వాక్కులు నిత్యం స్మరించుకోదగినవి. ప్రపంచీకరణ నేపథ్యం లో మాతృ భాషా సంస్కృతులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిది. సుసంపన్నమైన తెలుగు సాహిత్య వైవిధ్యాన్ని చర్చించుకోవలసిన దానికి ఈ సదస్సు ను ఒక వేదికగా భావించవచ్చు.

"తెలుగు సాహిత్యం -విభిన్న ప్రక్రియలు ధోరణులు" అనే అంశంపై సదస్సును ఒక సమిష్టి యజ్ఞం లా తలపెట్టి కె. ఆర్ .కె ప్రభుత్వ డిగ్రీ కళాశాల,అద్దంకి. మరియు టి .ఆర్ .ఆర్ ప్రభుత్వ కళాశాల, కందుకూరు. తెలుగు విభాగం వారికి మరియు అత్యంత విలువైన సమయాన్ని వెచ్చించిన విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు వారు సమర్పించిన వ్యాసాలను మరియు ఈ సదస్సు విజయవంతమవ్వడానికి కారకులైన ప్రతి ఒక్కరికీ శుభాభినందనలు తెలియజేస్తున్నాం.

V. Mohana Rao
Principal
K.R.K. Govt. Degree College
ADDANKI-523 201,
Bapatla Dist., (A.P.)

" ముందుమాట "



డా॥ కొమ్మనబోయిన సుజాత,
శాఖాధిపతి, తెలుగు విభాగం
టి.ఆర్.ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల కందుకూరు.
సెల్ : 9440011770

తెలుగు భాషలో సాహిత్యం మొదలైనప్పటి నుండి ఇప్పటివరకు వచ్చిన సాహిత్యాన్ని ఒక్కసారి బేరీజు వేసి చూసినట్లయితే ఎంత ప్రక్రియా వైవిధ్యం, ఎన్ని ధోరణులు, ఎన్ని నూతన పోకడలు ప్రవేశించాయో కదా అనుకుంటే గొప్ప ఆశ్చర్యం కలుగుతుంది. తెలుగు భాషలో వచ్చిన సాహిత్యం, ఆ సాహిత్యంలో వచ్చిన విభిన్న ప్రక్రియలు,

ఆ ప్రక్రియలపరంగా కూడా గొప్ప వైవిధ్యం అదేవిధంగా తెలుగు సాహిత్యంలో వచ్చిన అనేకమైన ధోరణులు వీటన్నింటి దృష్ట్యా చూస్తే ఎంత అద్భుతమైన, అనంతమైన సాహిత్యం ఉంది మన తెలుగుభాషలో అనుకుంటే గొప్ప గర్వంగా కూడా అనిపిస్తుంది. ఈ సందర్భంగా "ఏది సులభమ్ముగ సాధ్యపడదు లెమ్ము" అనే దాశరధి గారి గాలీబ్ గీతాల్లోని పంక్తి జ్ఞాపకం వస్తుంది. నిజమే కదా, ఎంతోమంది మహానుభావులైన కవులు, రచయితలు సాహితీమూర్తులు ఎంత కృషి చేస్తే మన భాషలో ఇంత సాహిత్యం సమకూడిందో కదా అనిపించి సాహితీ కృషీవలులైన వారందరికి శిరసువంచి నమస్కరించాలనిపిస్తుంది. 'అక్షరమాల అమృతభాండం' అన్నట్లుగా అక్షయపాత్ర వంటి మన తెలుగు సాహిత్యమనే అమృతభాండాన్ని నింపిన, నింపుతున్న ఆయా సాహిత్యామృతమూర్తులందరికి వందనాలు.

అనంతమైన ఈ తెలుగు సాహిత్యాన్నంతటిని చర్చకు తీసుకురావాలనే ఆలోచనతో మేము ఈ సదస్సును నిర్వహించడం జరిగింది. తెలుగు సాహిత్యంలో ఎంత వైవిధ్యం ఉందో ఈ సదస్సులో చర్చించబడిన అంశాలు కూడా అంతే వైవిధ్యంతో కూడి ఉండడం సంతోషకరమైన విషయం. మా ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగాను, ఆత్మీయ అతిథులుగాను విచ్చేసిన పెద్దలందరి ప్రసంగాలు, అదే విధంగా పత్ర సమర్పణ చేసిన వారి ప్రసంగాలు వెరసీ ఒక అద్భుతమైన జ్ఞానవాహినిగా ప్రవహించాయని చెప్పొచ్చు. ఆవిధంగా చూచినప్పుడు ఒక మేధోమథనం జరిగిందనేది సుస్పష్టం.

నిరంతరాయంగా 138 మంది 12 సెషన్స్‌లో పత్రసమర్పణ చేయడం సదస్సు జయప్రదంగా నిర్వహించబడినదనడానికి ఆనవాలుగా భావిస్తూ మా ఈ సదస్సు విజయవంతం కావడంలో ప్రత్యక్షంగాను, పరోక్షంగాను కారకులైన ప్రతి ఒక్కరికి మా ఇరు కళాశాలల తెలుగు విభాగాల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాము.

CONTENTS (విషయ సూచిక)

1.	“ఆధునిక తెలుగు కవిత్వ వికాసం – ధోరణులు”	రాధిక మంగిపూడి	18
2.	“పౌరాణిక, చారిత్రక నాటకాలు – చలం విలక్షణ దృష్టికోణం”	డా॥ ఇరపని మాధవి	21
3.	“తెలుగు సాహిత్యం – విభిన్న ప్రక్రియలు”	డా॥ రేవూరు అనంత పద్మనాభరావు	31
4.	చిత్తూరు కథా సాహిత్యం	ఆచార్య ఎం.రామనాథం నాయుడు	34
5.	మాండలిక కథా సాహిత్యం	డా॥ కొమ్మనబోయిన సుజాత	39
6.	రంగనాయకమ్మ నవలల్లో స్త్రీ పాత్రలు	డా॥ చిలకా అనిత	43
7.	“సినిమాలు, సీరియళ్ళలో బాలల సమస్యల చిత్రణ”	షేక్ షానాజ్ బేగం	50
8.	స్త్రీవాదం	డా॥ గుంటుపల్లి గౌరి	56
9.	ఆముక్తమాల్యద–వర్ణనా వైశిష్ట్యం	డా. నల్లపనేని విజయలక్ష్మి	61
10.	ఆనందమే అందం – హాస్యం	పరుచూరి విజయలక్ష్మి	66
11.	అన్నమాచార్య సంకీర్తనల్లో మానవహక్కుల పరిశీలన	డా॥ డి. ధాత్రికుమారి	70
12.	అస్తిత్వవాద నవలలు – అధీరనాయకులు	డా.టి. జాన్‌కిరణ్‌బాబు	75
13.	శ్రీ గుర్రం జాషువా ఖండకావ్యాలు – భారతీయత	డా॥ పైడిపాటి ఉమానాథ శర్మ	80
14.	ఆధునిక కవిత్వం – వివిధ ఉద్యమాలు	డా. బి. సరస్వతి	86
15.	అజంతా ‘స్వప్నలిపి’ – సహస్రముఖీనత	డా॥ పి. విజయకుమార్	90
16.	దళితవాద సాహిత్యధోరణులు–పరిశీలన	డా॥ టి. వెంకటస్వామి	98
17.	ధిక్కార స్వరం ‘దిగంబర కవిత్వం’	భమిడిపాటి గౌరీ శంకర్	104
18.	తెలుగు సాహిత్య ప్రస్థానం నన్నయ నుండి నేటివరకు	డా॥ కపిల భారతి	108
19.	ఇతి బాధల్లో కలసి నడిచే స్నేహం	డా. మెండా దేవానంద్ కుమార్	110
20.	రాట్నవి బ్రహ్మపత్రము – విభిన్నధోరణి	డా॥ సి. నర్సింహులు	114
21.	సీమ కథలు – విద్యావిధానం	కె. గీత	118
22.	ప్రాచీన సాహిత్యం చదవాలా? ఎందుకు?	డా॥ పి.ఎ. సత్యనారాయణ	123
23.	‘వందేళ్ల కథకు వందనాలు’ కథలు – శిల్ప వైవిధ్యం	మళ్ళా పెంచల ప్రసాద్	126
24.	దక్షిణాంధ్ర యుగంలోని వర్ణ వ్యవస్థ	వై. శివకుమార్	131
25.	శ్రీకాళహస్తి మాహాత్మ్యం – పాత్రల వైశిష్ట్యం	డా॥.ఎం.లక్ష్మయ్య	134
26.	ధూర్జటి మాధురీ మహిమ – శ్రీకాళహస్తీశ్వర శతకం	డా॥ అడపా కేదారి	138
27.	తెలుగువీరుల శౌర్యపరాక్రమాలకు ప్రతీక ‘ఓరుగల్లు–వీరగల్లు’	తంగి ఓగేశ్వరరావు	143
28.	“బోయి భీమన్న రాభీలు – పరిశీలన”	రుద్రపాక జితేంద్రకుమార్	150
29.	తెరచాటు – సాంఘిక నాటకం	డా. జూరెడ్డి నిర్మల	153
30.	సమసమాజ స్థాపనకు ఆలంబన అభ్యుదయ కవిత్వం	దేవరపల్లి రామయ్య	157

31. దళిత సాహిత్య – నేపధ్యం – ఆవిర్భావ వికాశాలు – ప్రసార సాధనాల పాత్ర	డా॥ యస్. శారద	162
32. అస్త్ర విద్యలు నాడు – నేడు	డా॥సముద్రాల ప్రిస్కిల	166
33. నన్నయ సూక్తులు	డా॥ దొప్పలపూడి సుజాత	168
34. పోతన భాగవతం – వైశిష్ట్యం	డాక్టర్ బి.చక్రవర్తి	170
35. పాతికేళ్ల తెలుగు కథ (1990–2014) – కుటుంబ జీవన చిత్రణ	తలారి హరిష్ కుమార్	174
36. శ్రీవేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనసంస్థ ప్రచురిత 'హితోపదేశ' గ్రంథ విశిష్టత	వడ్లమూడి యోగీశ్వరరావు	177
37. జిల్లేళ్ళ బాలాజీ "నా బాల్యం కతలు" రూప వైవిధ్యం	డా॥ జంపాల అనూరాధ	182
38. మనిషి కోసం వెతికే "తవ్వకం"	డా॥ సుంకర గోపాలయ్య	187
39. నానీలు – చేనేత జీవన చిత్రణ	డా. రాపోలు శ్రీనివాస్	190
40. పేరెన్నిక గన్న పేరులేని పేరంటాలు నిగమశర్మ యక్క	డా॥ (శ్రీమతి) ఎ. ఈశ్వరమ్మ	194
41. ముస్లిం మైనార్టీల కథలు సాంస్కృతిక అంశాల పరిశీలన	మహ్మద్ నౌరీన్	199
42. చారిత్రక నవల – 'కన్నగి'– ఇతివృత్త పరిశీలన	డా॥ కుమ్మెత లక్ష్మీనారాయణరెడ్డి	204
43. రుబాయి ప్రక్రియ – ఒక పరిశీలన	గుత్తికొండ చంద్రకళ	209
44. దళిత స్త్రీ వాద చైతన్యం	డాక్టర్ డి. కృపారావు	213
45. రాయలసీమ కన్నీటి కావ్యం 'పెన్నేటిపాట'	డా. కటుకం శారద	215
46. యుగాంతంలో స్నేహబంధం	ఎస్ రామస్వామి	219
47. అత్యాధునిక ప్రక్రియలు – వీక్షణం	డా. పాండురంగం కాళియప్ప	223
48. ఆదివారం ఆంధ్రప్రభ కథలు – ఇతివృత్త వైవిధ్యం	పి.దర్గాబాబు	228
49. నాయుని కృష్ణమూర్తి కథలు – కుటుంబ సంబంధాలు	యం.దీనదయాళం	231
50. దిగంబర కవిత్వంలో జ్వాలాముఖి – సూర్యస్నానం	డా॥ లోపింటి గిరీష్ కుమార్	235
51. 'కళాకేళి' సాహిత్య పత్రిక అవతరణ – వికాసం	డా॥ కిలారి గౌరినాయుడు	238
52. ఆచార్య గుండెడప్పు కనకయ్య కథలు – దళిత నేపథ్యం	కోష్ట గోవిందరావు	241
53. లఘు కవితా ప్రక్రియ – రెక్కలు	డా॥ కె.చెన్నకేశవ రెడ్డి	245
54. పురాణ వాఙ్మయం – తెలుగు వారి జీవన పథం	డా॥ పి. మాధవి	249
55. కలం వారధిపై కళాకారులు	డా ఎం.సమత, ఎం.టి.జ్యోత్స్న	253
56. ఎన్ పూజిత నవలల్లో స్త్రీ చైతన్య పాత్రలు	పి.జ్యోతి	258
57. నండూరి హృదయాంతరంగంలో "ఎంకి" సోయగం	డా॥ వి. శివనాగార్జున రెడ్డి	263
58. రావిశాస్త్రి బుద్బుదం కథ – మానవ జీవన చిత్రణ	డా॥ బత్తల అశోక్ కుమార్	267
59. శ్రీముకుంద శతకము – భక్తితత్వం	గుడేలి రమేష్	272

60. ఆధునిక తెలుగు సాహిత్యం – మానవతావాదం — డాక్టర్ ఎం.రవీంద్రబాబు — 276
61. రాయలనాటి ప్రబంధ కవులు – ప్రసిద్ధ కావ్యాలు — డా॥ చుక్కా యశోద — 280
62. మహాభారతంలో రాజనీతి — కె. సుజన — 284
63. నీతిశతకాల్లో మానవీయ విలువలు — డా॥ బి. సునీత — 287
64. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం – ముందడుగు, మా భూమి నాటకాల పాత్ర — డా॥ లావూరి విజయ — 291
65. తెలుగు సాహిత్యంలో – భావకవిత్వం విశిష్టత — సాకేటి సత్యనారాయణ — 295
66. పురాణ వాఙ్మయము – తెలుగు సాహిత్యము — డా॥ హరీష్ కుమార్ శ్రీధర — 298
67. ప్రయోగాత్మక నాటకం త్రిజాకీ యమదర్శనం — డాక్టర్ వై. శ్రీలత — 303
68. ముదిగంటి సుజాతారెడ్డి అలంకార విమర్శ ధోరణి–విశ్లేషణ — శ్రీపతి మారుతి — 306
69. భానుమతి నవలలో సంఘ సంస్కరణ భావాలు — అంకిరెడ్డి సునీల్ కుమార్ రెడ్డి — 312
70. తెలుగు నాటికలు – సమకాలీన స్త్రీల స్థితిగతులు — డా॥ వి.కె.టి. మహాలక్ష్మి — 318
71. స్వీయచరిత్ర – ఒక పరిశీలన — కె.విజయలక్ష్మి — 321
72. శ్రీశ్రీ మహా ప్రస్థానం – అభ్యుదయ దృక్పథం — డా॥ బూర్గుల స్వరూప — 324
73. ఆరుద్రగారి అద్వితీయ రచనలు – అభ్యుదయం — సాకే సాయిసుష్మ, సాహితి మోదుగుల — 326
74. తెలంగాణ గిరిజన కథ –సామాజిక విశ్లేషణ — బానోత్ స్వామి — 330
75. తెలుగులో శతక సాహిత్యము — డా॥ పాండుల సాయిలు — 336
76. బి.సి. అస్తిత్వవాద కవిత్వం – 'సమూహం' సంకలనం — డా॥ పెబ్బేటి మల్లికార్జున్ — 340
77. తెలుగు సాహిత్యంలో ద్విపద కావ్యాలు — వంగాల సంపత్ రెడ్డి — 344
78. భావకవిత్వం – ఎంకి పాటలు — డా॥ సూరపరాజు వసంత కుమారి — 347
79. ప్రొఫెసర్ తుమ్మపూడి భారతి గారు రాసిన 'ఫ్రీజర్ కథలు'లోని సామాజికత — సాహితి మోదుగుల — 350
80. తెలంగాణ వీరోచిత కథ 'గొల్లరామవ్వ' — వి. రాజేశ్వరి — 354
81. రాళ్ళపల్లివారి "తారాదేవి" ఖండకావ్యం– ఒక పరిశీలన — కె. సంగాలు — 359
82. తెలుగు సాహిత్య ప్రక్రియా పారిజాతం –దండకం — ఎమ్. ప్రదీప్ — 362
83. ఆధునిక వచన కవిత్వ ప్రకియ – నానీలు విశిష్టత — నిదానకవి. నీరజ — 366
84. కథాసాహితి కథల సంకలనాలు – కులవివక్ష కథాంశాల పరిశీలన (2008 నుండి 2019 వరకు) — లెంక సత్యనారాయణ — 370
85. రావిశాస్త్రి కథలు – శిల్పం – భాష — డా॥ యస్.సి. సంజీవరెడ్డి — 376
86. స్త్రీవాద కవిత్వం – పరిశీలన — నూనావతు పార్వతి — 379
87. తెలుగులో స్త్రీల కథా సాహిత్య ధోరణులు — డా॥ మురాడి శ్యామల — 383
88. ఆధునిక తెలుగు కథ (2001–2010) –మధ్యతరగతి కుటుంబాల దీనస్థితి — డా. కోలా శేఖర్ — 388

89. తెలుగు కవయిత్రుల కవిత్వం ఆనాటి స్త్రీల సామాజిక స్థితిగతుల చిత్రణ	డా॥ ఎన్. సూర్యకాంతి	393
90. వేయి పడగలు నవల – సామాజిక దృక్పథం	తురంగి విశ్వనాధము	398
91. భావకవి కృష్ణశాస్త్రి కవిత్వం	వై. విజయలలిత	403
92. యిక్కుర్తి నరసింహారావు – "చైతన్య స్వరాలు" చదువు ప్రాధాన్యత గేయాలు	డా॥ జి.శ్రీనివాస్	406
93. శ్రీ ముప్పాళ్ళ రంగనాయకమ్మగారి బలిపీఠం నవల – సామాజిక చిత్రణ	యం. భీమయ్య	409
94. కవితా ప్రక్రియలో 'సినీవాలి' నివాళులు	డా. యస్. బేబీ రమణి	413
95. ఆర్థిక దుస్థితి వికృత రూపం – ఆశాకిరణం	శ్రీకాంత్ నామ	416
96. అలిసెట్టి ప్రభాకర్ వచనకవిత్వం	పిన్నోజి నరేశ్	419
97. అమెరికా తెలుగు కథలు – స్త్రీ – పురుష సంబంధాలు	డా. పలివెల చిరంజీవిరావు	421
98. కర్నూలు జిల్లా రైతు కథలు – కరువుచిత్రణ	పూలరాతి నరసప్ప	426
99. ఒంటెద్దు రామలింగారెడ్డి గారి ఆధుని భారతం 'అవినీతి పర్వం' – సింహావలోకనం	యస్. విద్యాసాగర్	431
100. బెజ్జంకి శ్రీ లక్ష్మీ నరసింహ శతకం– సమీక్ష	గూడూరి శైలజ	435
101. వర్ణవ్యవస్థను నిరసించిన 'దళిత సాహిత్యం'	డా॥ దార్లపూడి శివరామకృష్ణ	439
102. దళిత వాదం – కవిత్వం	డా॥ బి. వెంకటయ్య	443
103. తెలంగాన ఉద్యమంలో పాట – భాషా సాహిత్యాంశాలు	డా॥ ఎన్. దీపిక	447
104. "పునశ్చరణం" – కవితా సంపుటిలో సమకాలీన సాహిత్యం	డా॥ జె.వి. సుధీర్ కుమార్	451
105. "మెదక్ జిల్లా కథా సాహిత్యం : వస్తు విశ్లేషణ"	జి. దుర్గాప్రసాద్	454
106. కాశీఖండాంతర్గత గుణనిధి పాత్ర ఔపదేశిక ప్రతిపత్తి	గోమారపు కవిత	457
107. గురజాడ కవిత్వం – సార్వజనీనత, సార్వకాలీనత	డా॥ కొయ్యా శ్రీనివాసులు	460
108. భారతీయ సంస్కృతి–విశిష్టత	కె.యన్.సుందరేశ్వరరావు	464
109. తెలుగు సాహిత్యంలో వైష్ణవ భక్తి ఉద్యమం	డా॥ కె. సుధాకర్	468
110. ఒంద్రుమట్టి నవల – సామాజిక పరిశీలన	ఇనమల కళ్యాణి	471
111. తెలుగు సాహిత్యం – విభిన్న ప్రక్రియలు – ధోరణులు సమకాలీన తెలుగు నవలలలో సంఘం – సామాజిక దృక్పథం	డా॥ హెచ్. కిషన్	476
112. వేమన పద్యాలలో మూర్ఖత్వ ఖండన	డా॥ ఇ. కోన ప్రభ	485
113. కోడూరి కౌసల్యాదేవి నవలలు–ఒక పరిశీలన	డా॥ దండెబోయిన పార్వతీదేవి	488
114. "నేటి సాంఘిక జనజీవనంపై ఇతిహాసాల ప్రభావం"	మాల్యాద్రి మార్తాటి & ఎం. సుధామయి	493
115. బోయి భీమన్న రచనలు పరిశీలన	ఎల్లోబ మమత	495

116. మన నిత్యజీవితంలో వేమన పద్యాల ప్రాధాన్యం	కే.హరీష్ కుమార్	497
117. సాక్షి 'ఫన్‌డే' కథల్లోని – మానవ సంబంధాలు	పరుసు మణి	501
118. నా వచన కవిత రూపాలలో – సమాజహితం	కవాడపు లలిత	505
119. ప్రసన్నధర్మం సావిత్రోపాఖ్యానం తులనాత్మక పరిశీలన	పిండి నాగరాజు	509
120. "పరదేశి రూతు హరికథలో స్త్రీ పాత్ర చిత్రణ"	పెరుమాళ్ళ దైవకృప	512
121. తెలుగు కవిత్వంలో – మానవతావాదం	డా॥ పొందరి లక్ష్మణరావు	515
122. తెలుగు సాహిత్యంలో అధివాస్తవికత ధోరణి – ఒక పరిశీలన	ఆర్. రమాదేవి	519
123. ఆధునిక కాలంలో ఇతిహాస సంబంధ రచనలు – భిన్న దృక్పథాలు	సంపత్ కుమార్ బానోజి	522
124. పల్లెనీ, ప్రకృతినీ సత్కరించిన కవి గోరటి వెంకన్న	డా॥ చింతల రాకేశ్ భవానీ	528
125. శ్రీకాళహస్తీశ్వర శతకం	డా॥ ఏ.వెంకటప్రసాదు	533
126. శ్రీనాథుని కవితా వైదుష్యము	కానాల రామచంద్రారెడ్డి	536
127. శ్రీరామ్మూర్తిగారి కథలు– సామాజిక చిత్రణ	బలరామమహంతి శశికళ	539
127. రావిశాస్త్రి కథలు – శిల్పం – అనుభూత ఐక్యత	డా॥ ఆర్.యన్. రవికుమార్	541
129. స్త్రీవాద సాహిత్యం – సామాజికాంశాలు	తేలు వెంకట కుమారి	544
130. తెలుగు నాటకం – సామాజిక చైతన్యం	డాక్టర్ నేలటూరి అనిత మార్గరెట్	548
131. 'తెలుగు సాహితి ప్రక్రియలలో శతకాలు, ప్రాధాన్యత: ఒక అవలోకనం'	డా॥ డి.సహదేవుడు, డా॥ యం.హరిప్రసాద్	552
132. దేవరకొండ బాలగంగాధర తిలక్ 'అమృతం కురిసిన రాత్రి' కవితా సంపుటి: సామాజిక జీవన చిత్రణ	రామకృష్ణ ఇరుకుల్ల	555
133. కూచిమంచి తిమ్మకవి శతకాలలో సమాజం–భాష–సంస్కృతి	తంత్రవహి శ్రీరామమూర్తి	566
134. ఆధునికతకు అద్దం – గురజాడ కన్యాశుల్కం	డా॥ వొలుపు కనకరాజు	572
135. కావ్యప్రక్రియలో గంగుల శాయిరెడ్డి "కాపు బిడ్డ" విశిష్టత	డా॥ మామిడాల రమేశ్ బాబు	577
136. భావకవిత్వం – ఎంకి పాటలు	డా॥ సూరపరాజు వసంత కుమారి	580
137. భాగవతం – అంబరీషుని వైష్ణవభక్తి	కె.మహేష్	584
138. తెలుగులో కరోనా వ్యాధిపై వచ్చిన సాహిత్యం – పరిశీలన	ముత్తినేని సంతోష్ కుమార్	588
139. History of Journals in Nellore and Bapatla during Colonial period In India; 1882-1947	Dr. Seelam Srinivasa Rao	591
140. Poet-Saint Fusion: Analysing the Works of the MedievalIndian Bhakti Poets	Dr. Ratnottama Das	596

"ఆధునిక తెలుగు కవిత్వ వికాసం – ధోరణులు"

-రాధిక మంగిపూడి, రచయిత్రి, వ్యాఖ్యాత, అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాల రూపకర్త, సింగపూర్



తెలుగు సాహిత్యం అనాది నుండి మన నిత్య జీవితాలతో పెనవేసుకుపోయింది. భాషకు భావాన్ని జోడించి ప్రాణం పోసేది సాహిత్యం. అందమైన భావవ్యక్తీకరణ కవిత్వం యొక్క ముఖ్య లక్షణం. అందుకే అందులో భిన్న రీతులు కాలానుగుణంగా జనించి అందరినీ ఆకట్టు కుంటున్నాయి. తొలుత తెలుగు కవిత్వం పామరుల కన్నా ఎక్కువగా పండితరంజకంగా ఉండేది. పద్య గద్య కావ్యాలు, ప్రబంధాలు, శతకాలు, శాస్త్ర పౌరాణికేతిహాస భాష్యాలు మొదలైనవి ముఖ్యంగా ఉండేవి.

ప్రబంధ కావ్యయుగంలోని కవిత్వం తీసుకుంటే.. భాష యొక్క మాధుర్యం, పదబంధాల అమరికలోని అందం, భాష ద్వారా వర్ణన, రసవర్ణన, అలంకారములు, ఛందస్సు మొదలైన వాటికి ప్రత్యేక ప్రాధాన్యత ఉండేది ఆ రోజుల్లో. పాఠకులను భక్తి జ్ఞాన మార్గాలవైపుకు మళ్ళించడానికి గాని, లేక చారిత్రాత్మక సంఘటనలను, పౌరాణిక కథలను, మన సంస్కృతిలోని గొప్పదనాన్ని సాహిత్యం ద్వారా నిక్షిప్తం చేయడానికి కానీ అవసరమైన ఇతివృత్తాలు ప్రధానంగా ఎంచుకోబడేవి.

కాలానుగుణంగా పామరులను కూడా రంజింపజేసే విధంగా కవిత్వంలో పరిణామం చోటు చేసుకుంది. సమకాలీన సాంఘిక పరిస్థితులు దానికి ముఖ్య కారణం. నడవడిక నేర్పే నీతి కథలు పుట్టాయి. పల్లవి– చరణాలతో పాటలు పుట్టాయి. బుర్రకథ హరికథ వంటి జానపద కథాగాన కళారీతులు వచ్చాయి. కథలను అభినయ పూర్వకంగా దృశ్యరూపంలో అందించే పద్య నాటకాలు వచ్చాయి. జానపద, పౌరాణిక, చారిత్రాత్మక నాటకాలనుండి సాంఘిక నాటకాలు పుట్టాయి.

క్రమంగా ఛందోబద్ధ సంప్రదాయక కవిత్వం నుండి వచన కవిత్వం పుట్టింది. మాటల కన్నా ప్రజలను సూటిగా ప్రభావితం చేసే పాటలు మరింత ప్రాచుర్యాన్ని సంపాదించాయి. అన్నమయ్య తొలి తెలుగు వాగ్గేయ కారునిగా పేరుపొందాడు. వాడుక భాషలో వత్రికలు ప్రారంభ మయ్యాయి. గిడుగు రామ్మూర్తి పంతులు, గురజాడ వంటి మహానుభావులు వ్యవహారిక భాషా ఉద్యమాన్ని ప్రారంభించారు. ఫలితంగా గ్రాంధిక భాష మరుగునపడి నెమ్మదిగా అనేక నూతన కవితా ప్రక్రియలు మొలకెత్తాయి.

సాంఘిక దురాచారాలు, సంఘంలోని అసమానతలు, కులమత వ్యత్యాసాలు మొదలైన సామాజిక అంశాలపై ఎన్నో రకాల కవితలు ప్రారంభమయ్యాయి. మహాకవి గురజాడ, శ్రీ శ్రీ, గుర్రం జాషువా, మొదలైన ప్రముఖ కవులు అద్భుతమైన కవితా సంపుటులను వెలువరించారు. ముత్యాలసరాలు, గబ్బిలం, మహాప్రస్థానం మొదలైనవాటిని వీటికి ఉదాహరణలుగా చెప్పవచ్చు. రాయప్రోలు సుబ్బారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి వంటి మహానుభావుల కలం నుండి భావకవిత్వ శకం ప్రారంభమైంది. ఇంకొకపక్క విప్లవాత్మక కవిత్వం, ప్రబోధాత్మక కవిత్వం, దేశభక్తి కవిత్వం, దళితవాద కవిత్వం, స్త్రీవాద కవిత్వం వంటి వివిధ ప్రక్రియలు అందరినీ సంఘటిత పరిచేందుకు దోహదపడి, అందరిలోనూ కొత్త ఉత్తేజాన్ని నింపాయి.

అనువాద కవిత్వం దేశంలోని ఇతర భాషల సాహిత్య విశేషాలను తెలుసుకోవడానికి సహకరించింది. ఇతర రాష్ట్రాల, ఇతర దేశాల సామాజిక పరిస్థితులను అర్థం చేసుకునేందుకు ఉపకరించింది. సృజనాత్మకత అన్ని విధాలా వికసించింది. తెలుగు కవిత్వం యొక్క పరిధి పరిపూర్ణంగా విస్తరించింది. సినీ కవిత్వం దీనిని మరొక మలుపు తిప్పింది. చలనచిత్రాల కోసం ప్రత్యేకించి

వ్రాయబడిన పాటలు, పద్యాలు ప్రేక్షకుల మనసులను సూటిగా హత్తుకోవడం ప్రారంభమైంది. మరొక పక్క ఆకాశవాణి భక్తి గీతాలు, లలిత గీతాలు, దేశభక్తి గేయాలు అందరి మనసులను అలరించేవి.

ప్రవాసీయులలో కూడా కవులు, కవయిత్రులు ఎక్కువగా ప్రోత్సహించబడి చక్కటి రచనలను అందించడం మొదలైంది. ప్రవాసీ కవిత్వం ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. క్రమంగా లఘు కవితల యుగం ప్రారంభమైంది. తక్కువ పదజాలంలో ఎక్కువ అర్థాన్ని సూక్ష్మంగా సూచించే విధంగా మినీ కవితలు సాహితీ లోకాన్ని ఆకర్షించడం మొదలుపెట్టాయి. కవిత్వం రాయాలనే కోరిక ఉన్నా, సంప్రదాయక రీతులను ఆకలింపు చేసుకొని వ్రాయగలిగే పట్టు లేని ఔత్సాహిక రచయితలకు కూడా ఈ కొత్త ప్రక్రియలు సులువైన మార్గాన్ని చూపించాయి. కొన్ని ప్రక్రియలు ఇతర భాషల నుండి తీసుకోబడితే, కొన్ని ప్రక్రియలు ప్రత్యేకంగా మన తెలుగువారిచే సృష్టించబడ్డాయి. క్లిష్టమైన సంప్రదాయక పద్య ఛందస్సును పక్కనపెట్టి సులువుగా సాగే మాత్రాఛందస్సు, అంత్యప్రాసలు వంటి నియమాలతో అనేక రకాల నూతన మినీ కవితా ప్రక్రియలు ప్రాచుర్యంలోనికి వచ్చాయి. వాటికి కొన్ని ఉదాహరణలను చూద్దాం.

నానీలు :

రఘు కవితా ప్రక్రియల్లో ఎక్కువ ప్రాచుర్యం పొందినవి నానీలు. ఇవి నాలుగు పాదాల కవితలు. మొత్తం 20 నుండి 25 అక్షరాలు ఉండాలి. నానీల సృష్టికర్త ఆచార్య ఎన్. గోపి. నాలుగు పాదాలలో రెండు యూనిట్ల పరస్పర సంబంధం కానీ పోలిక గానీ వ్యక్తం కావాలి.

ఉదా: ఎడారి బావిలో
నీళ్ళు ఊరాయి
కష్టజీవి గుండెల్లో
ఆశ ఊరినట్లు

మొగ్గలు :

మొగ్గలు మూడు పాదాల కవిత్వం. ఇది డా. భీంపల్లి శ్రీకాంత్ ప్రారంభించిన ప్రక్రియ. మొదటి రెండు పాదాలు ఒక అంశాన్ని చెబితే మూడవ పాదం దానిని సమర్థించేదిగా ఉంటుంది. ప్రతి పాదంలోనూ 3-5 పదాలు ఉండాలి. మొదటి పాదంకు కొనసాగింపుగా రెండవ పాదం ఉండాలి. అంటే మొదట పాదంలో వాక్యం అంతం కారాదు.

ఉదా: అనుభవాల పునాదులపై సంస్కృతితో
గోడలు కట్టి, నిజాయితీ పైకప్పును వేయి.
ఎన్ని తుఫానులొచ్చినా కూలని ఇల్లు అదే

సమ్మోహనాలు :

సమ్మోహనాలు మూడు పాదాల కవితలు. మొదటి రెండు పాదాలకు అంత్యప్రాస ఉండాలి. మొదటి రెండు పాదాలకు పదేసి(10) మాత్రలు ఉండాలి. ముక్తపదగ్రస్త రీతి.. అనగా మొదటి పాదం చివరి పదం, రెండవ పాదం మొదటి పదంగాను, రెండవ పాదం చివరి పదం, మూడవ పాదం మొదటి పదంగాను మొదలవ్వాలి. మూడవ పాదానికి అంత్యప్రాస లేదు. మూడవ పాదంలో (20 మాత్రలు) తొలి పదిహేను మాత్రలలో విషయాన్ని రూఢీ చేసి, తర్వాత ఐదు మాత్రలలో నామ ముద్రతో గానీ సంబోధనా పదంతో గానీ ముగించాలి. లఘువు (I) ఒక మాత్రగా, గురువు (U) రెండు మాత్రలుగా లెక్కింపబడతాయి. ఈ ప్రక్రియ సృష్టించినవారు శ్రీ నాగమోహన్ యెలిశాల

ఉదా: సాధనే యోగము
యోగమే మోక్షము
మోక్షమే పరమపద స్థానమౌ ఈశ్వరా!

మణిపూసలు :

మణిపూసలో నాలుగు పాదాలుంటాయి. ఇవి మాత్రా ఛందస్సులో ఉంటాయి. 1,2,4 పాదాల్లో అంత్యానుప్రాస మరియు 10, 11, 12 మాత్రల నుండి ఏదైనా ఒక సంఖ్యను ఉపయోగించాలి. అనగా ఈ పాదాల్లో మాత్రలు సమానంగా ఉండాలి. 3వ పాదానికి అంత్యానుప్రాస ఉండరాదు. 10

నుండి 12 మాత్రలుండాలి. 3, 4 పాదాల్లో కవితా మెరుపుండాలి. లఘువు (I) ఒక మాత్రగా, గురువు (U) రెండు మాత్రలుగా లెక్కింపబడతాయి.

ఉదా: పడిలేచే అలను చూడు
చివురించే మ్రోడు చూడు
నిస్పృహలో క్షీణించకు
మనిషికెపుడు ఆశ తోడు

హైకూలు :

ఇది జపాన్ కవితా ప్రక్రియనుండి తీసుకోబడినది. హైకూలో మూడు పాదాలు ఉంటాయి. మొదటి పాదంలో ఐదు అక్షరాలు, రెండవ పాదం ఏడు అక్షరాలు, మూడవ పాదం ఐదు అక్షరాలు ఉండాలి. దీనిని ఎక్కువగా తాత్విక లేదా ఆధ్యాత్మిక భావాలను, ఆలోచనా సరళిని తెలియ జేయడానికి ఉపయోగిస్తారు.

ఉదా: మది కోర్కెలు
సముద్రపుటలలు
ఆగవెపుడూ

కైతికాలు :

కైతికాలు అనేవి 6 పాదాల నూతన సాహిత్య వచన గేయ కవితా ప్రక్రియ. దీని రూపకర్త శ్రీ గోస్కుల రమేష్. కైతికాలలో 1,2,3,4,పాదాలలో 9 నుండి 12 మాత్రలు ఉండాలి. 2,4 పాదాలలో అంత్యానుప్రాసలో ఉండాలి. 5వ పాదంలో "వారెవ్వా" లేదా పై నాలుగు పాదాలను బలపరిచే మకుటం, లేదా సరైన పదము గానీ వాడాలి. 6వ పాదంలో కవితాత్మక వాక్యం, నూతన పదబంధం లేదా జాతీయం కొసమెరుపులా ఉండాలి. 5,6 పాదాలలో మాత్ర ఛందస్సు నియమం అవసరం లేదు. కాని సరితూగే అక్షరాలు ఉండాలి. పెద్ద వాక్యాల రూపంలో ఉండకూడదు.

ఉదా: ప్రేమతోడ జన్మనిచ్చి
బంధమొసగు కన్నతల్లి
మమతలన్ని రూపుమాపి
ఒడిని జేర్చు నేలతల్లి
వారెవ్వా జీవితమే
వింతైన ప్రయాణమే

ఇలా ఇంకెన్నో లఘు సాహితీ ప్రక్రియలు నేడు అందుబాటులో ఉన్నాయి. ఇంకెన్నో కొత్తకొత్తవి పుడుతున్నాయి. అయితే ఇక్కడ తెలుసుకోవలసిన విషయం ఏమిటంటే ఎన్ని కొత్త పోకడలు వచ్చినా సంప్రదాయక రీతులు మారలేదు. వాటి వన్నె తగ్గలేదు. సాంకేతిక అభివృద్ధి అంతర్జాల సామాజిక మాధ్యమాల ద్వారా సాహిత్యం యొక్క విస్తృతి పెరిగింది. పాఠకులు పెరిగారు. అలభ్యమైన పుస్తకాలు ఎన్నో మళ్లీ పి.డి.ఎఫ్‌ల రూపంలో దర్శన మిస్తున్నాయి. యూట్యూబ్ ఛానళ్ళ ద్వారా ఎన్నో పుస్తకాల గురించిన సమీక్షలు, అలాగే ఆడియో రూపంలో వస్తున్న పుస్తకాలు కూడా పెరిగాయి. వాట్సాప్ ఫేస్‌బుక్‌ల ద్వారా సాహిత్యం క్షణంలో ఆస్ట్రేలియా నుండి అమెరికాకు చేరుతోంది. రచయితల సంఖ్య కూడా పెరిగింది. సాహిత్యానికి తగిన ప్రోత్సాహం లభిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా సాహిత్య సంస్థల సంఖ్య పెరిగింది. అంతర్జాల సదస్సుల ద్వారా ఎంతోమంది ప్రాచీన కవుల రచనలు మళ్ళీ వెలుగు చూస్తున్నాయి. కవి సమ్మేళనాల ద్వారా ఎంతో మంది ఔత్సాహిక కవుల రచనలకు ఆదరణ లభిస్తోంది.

ప్రాచీన కవులు చూపించిన మౌలికమైన కవితా పరిధులను దాటకుండా, తెలుగు భాష యొక్క ఔన్నత్యాన్ని కాపాడుతూ, తెలుగు సాహిత్యం ప్రపంచవ్యాప్తంగా అన్ని భాషల వారికి చేరే విధంగా చక్కటి ప్రస్థానాన్ని కొనసాగించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

ధన్యవాదాలు

– రాధిక మంగిపూడి

"పౌరాణిక, చారిత్రక నాటకాలు – చలం విలక్షణ దృష్టికోణం"

డా॥ ఇరపని మాధవి, అసోసియేట్ ప్రొఫెసర్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు



తెలుగు సాహితీ జగత్తులో మరిచిపోలేని పేరు చలం. చలం సృష్టించిన సాహిత్యం ఒక సంచలనం. తాను నమ్మిన సిద్ధాంతాలను తన రచనలకే పరిమితం చేయక అదే జీవన విధానాన్ని అవలంభించి సమాజం ఒకవైపు తాను ఒకవైపు అనేంతగా వ్యతిరేకత ఎదురైనా నిలబడగలగటం చలంకే సాధ్యం. స్త్రీ విద్యని, స్త్రీ స్వేచ్ఛని కాంక్షించిన స్త్రీ పక్షపాతి చలం. చిన్నతనం నుంచి స్త్రీలు పడుతున్న కష్టాలను, అవమానాలను చూసినవాడు కావటం చేత కుటుంబం వెలివేసినా తన భార్యను, భార్య అక్కను చదివించాడు. అలాగే పసివాడుగా తాను పడిన కష్టాలు తన పిల్లలు పడకూడదని పిల్లలను అమితంగా ప్రేమించాడు. "బిడ్డల శిక్షణ" అనే రచనలో పిల్లలని దయగా, ప్రేమగా పెంచాలని చెప్పారు. చలం జీవితాన్ని, రచనలను పరిశీలిస్తే ఆ రెండింటికి వ్యత్యాసం కనిపించదు. చలం రచించిన 98 కథలలో శశిరేఖ, వివాహం, మైదానం, అరుణ, అమీనా, బ్రాహ్మణీకం, జీవితాదర్శం, దైవమిచ్చిన భార్య వంటి నవలల్లో సమాజంలో స్త్రీలు పడుతున్న బాధలను చిత్రించారు. ఆ కాలంలో స్త్రీలు ఎలాంటి స్వేచ్ఛను కోరుకుంటారో, ఎందుకు కోరుకుంటారో తన రచనల ద్వారా తెలియజేశారు. రచయిత భావాలే వారి రచనల్లో ప్రతిబింబించటం సర్వసాధారణంగా జరిగేదే. చలం భావజాలం అతడి కథలు, నవలల్లోనే కాక పౌరాణిక, చారిత్రక నాటకాలలోనూ కనిపించటం విశేషం.

అప్పటికే త్రిపురనేని రామస్వామి చౌదరి రామాయణం, భారత, భాగవతాలపై నాటకాలు రాశారు. 1911లో "కురుక్షేత్ర సంగ్రామం"లో పాండవుల విజయం ధర్మమార్గం కాదని చెప్పారు. "శంబుక వధ" లో శూద్రుడైన శంబుక మహర్షిని మత సంరక్షణార్థం, రాజనీతి నిమిత్తం శ్రీరాముడు చంపినట్లు చిత్రీకరించారు. మూడవ నాటకం "ఖూనీ". పౌరాణిక కథలను నాటకేతి వృత్తాలుగా మలిచేటప్పుడు మూలంలో ఉన్నదానిని అర్థం చేసుకొని హేతుబద్ధంగా ఆలోచించి మంచిని మంచిగా, చెడుని చెడుగా నిరూపించ ప్రయత్నించినవారు కొందరు. మొత్తం అంధవిశ్వాసాలుగా నిరూపించ ప్రయత్నించినవారు కొందరు. అవతార పురుషులు, దేవతా స్వరూపాలుగా కాక సాధారణ మానవులుగానే స్వీకరించి మనుషులలోని రాగద్వేషాలు, కోపతాపాలు, బలహీనతలు వారిలోనూ ఉన్నాయని నిరూపించ ప్రయత్నించిన వారు కొందరు. ఏది ఏమైనా యద్భావం తద్భవతి అనేది సత్యం. రచయిత మనసులో ఏ భావం ముద్రపడిందో అదే నాటకంలోనూ కనిపిస్తుందనేది యదార్థం. అందుకే చలం గారి పౌరాణిక, చారిత్రక నాటకాలను పరిశీలించి నప్పుడు ఆయనలోని భావజాలమే ఆ పాత్రలలోనూ కనిపిస్తుంది. మూలంలో ఉన్న పాత్రల ఔన్నత్యాన్ని తగ్గించి తాను నివశిస్తున్న సమాజంలోని తన కాలానికి అనుగుణంగా ఈ రచనలు చేశారనిపిస్తుంది. అయితే ఈ నాటకాలలోనూ చలం స్త్రీ పక్షమే వహించారు.

చలం 1921లో 'చిత్రాంగి', 1924లో హరిశ్చంద్ర 1924లో 'సావిత్రి', 1935లో 'జయదేవ', 1937 'శశాంక', 1947లో 'పురూరవ' నాటకాలు రచించారు. వీరి ఇతర రచనల్లో లాగానే ఈ నాటకాలలోనూ వీరు ప్రేమనుకునే ప్రేమకే అగ్రపీట వేశారు. ప్రేమ పేరిట, ఆరాధన పేరిట కనిపించిన స్త్రీనల్లా కోరుకునే స్త్రీలోలత్వం కూడా ఈ రచనల్లో ఉంది. ఒకవేళ ఎవరైనా స్త్రీలోలురు కాకపోతే వారిది పైపై నటన మాత్రమే అని, మనసులో వారి కోరికలు వేరు, పైకి చూసే తీరు వేరు అనేవిధంగానే ఈ రచనలు

సాగాయి. చలంకు అబద్ధం అంటే అసహ్యం. తాను ఏం ఆలోచిస్తున్నాడో అదే చెప్పటం చలం అలవాటు. కానీ సమాజంలో అనేకమంది దీనికి భిన్నంగా వేదికలపై స్త్రీ ఉద్ధరణ గురించి, ఆదర్శాల గురించి ఉపన్యాసాలిచ్చి ఇంట్లో స్త్రీలను మాత్రం హీనంగా చూడటం చలంకి నచ్చని పరిస్థితి. మిగిలిన చలం రచనల్లో ఏవిధంగా బాధ్యతలు, బంధనాలు లేని స్వేచ్ఛని చూస్తామో అదే విధమైన స్వేచ్ఛ ఈ నాటకాలలోనూ కనిపిస్తుంది. ఎప్పుడో త్రేతాయుగంలోనో, చరిత్రలోనో జరిగిన కథలుగా కాక సమకాలీన సమాజంలో తాను చూస్తున్న సంఘటనలుగా చిత్రించారీ నాటకాలను చలం.

1. చిత్రాంగి : తెలుగు సాహితీ జగత్తులో చెరగని కీర్తి ప్రతిష్టలతో నాటి నుండి నేటివరకు విశిష్టస్థానాన్ని కలిగినవాడు రాజరాజనరేంద్రుడు. అటువంటి రాజరాజ నరేంద్రుడికి కళంకం లాగా ప్రచారంలో ఉన్న కథ సారంగధరుడి, చిత్రాంగిల కథ. చారిత్రకంగా ఇది యదార్ధమో కాదో తెలియదు కానీ రాజరాజనరేంద్రుడు చిత్రాంగిని వివాహం చేసుకోగా చిత్రాంగి అతడి కుమారుడైన సారంగధరుడిని వలచిందని, దానికి సారంగధరుడు అంగీకరించని కారణంగా అతడిపై కక్షగట్టి అతడికి భయంకరమైన శిక్ష పడేటట్లు చేసిందని, అతడి చావుకు కారణమైందనేది అందరూ చెప్పే కథ. రాజమండ్రిలో ఇప్పటికీ సారంగధరుడిని కరుణించిన ఈశ్వరాలయాన్ని సందర్శించే వారికి ఈ కథ చెప్పబడుతుంది. ఈ కథలో చిత్రాంగిని చిత్రించిన దానికి భిన్నంగా చలం ఎంతో ఉదాత్తంగా "చిత్రాంగి" నాటకంలో చిత్రాంగిని తీర్చిదిద్దారు. తల్లిదండ్రులు లేని చిత్రాంగిని పెద్దనాన్న యుగంధరవర్మ, అతడి కుమారుడు సుబుద్ధి ఎంతో ప్రేమగా పెంచుతారు. చిన్నతనంలోనే చిత్రాంగికి, సారంగధరుడికి వివాహం నిశ్చయమవుతుంది. దానితో యుక్తవయస్సుకొచ్చిన సారంగధరుడు చిత్రాంగి కోసం వారి రాజ్యానికొచ్చి ఎక్కువ కాలం గడుపుతుంటాడు. సుబుద్ధి సారంగధరుడికి ప్రాణమిత్రుడు. ముగ్గురూ ఎంతో సంతోషంగా కాలం గడుపుతుంటారు. చిత్రాంగికి పువ్వులన్నా, పూలతోటలన్నా చాలా యిష్టం. చిత్రాంగి, సారంగధరుడు తమ భవిష్యత్తు గురించి ఎన్నో కలలు కంటారు. ఒకరంటే ఒకరికి ప్రాణం.

రాజరాజనరేంద్రుడి మంత్రి జగన్నాధం. జగన్నాధం మంచివాడుకాదు. కుటిల స్వభావి. జగన్నాధాన్ని ఎక్కువగా ఆటపట్టిస్తూ ఏడిపిస్తుంటుంది చిత్రాంగి. ఆమె తిక్క కుదర్చాలనే ఉద్దేశ్యంతో జగన్నాధం రాజరాజనరేంద్రుడికి ఆమె మంచిదికాదని, చాలా గడుగ్గాయని, ఆమెని సారంగధరుడికిచ్చి వివాహం చేస్తే అతడికి చాలా కష్టాలొస్తాయని, చిత్రాంగిని భరించగల సామర్థ్యం ఇంక ఎవ్వరికీ లేదు రాజరాజనరేంద్రుడు మాత్రమే దానికి తగినవాడని ఎన్నోరకాలుగా చెప్పి రాజరాజనరేంద్రుడి మనస్సు మారుస్తాడు. చిత్రాంగి అందచందాలు చూసిన రాజరాజనరేంద్రుడికి కూడా ఆమెపై మనసౌతుంది. సారంగధరుడి తల్లి రత్నాంగి ఎంతగానో భర్తను ప్రాధేయపడుతుంది. కోడలు కాదగిన పిల్లను మీరు చేసుకోవటం తగదని, ఎంతో కీర్తిప్రతిష్టలు కలిగిన మీరు అపకీర్తి తెచ్చుకోవద్దని, సారంగధరుడికి అన్యాయం చేయవద్దని, ఎందరితో ఉన్నా ఇంతవరకూ తానెప్పుడూ అడ్డు చెప్పలేదనీ, కానీ ఇప్పుడు ఇది వారిద్దరి ప్రేమకు సంబంధించినదని ఎంతగానో నచ్చచెప్పటానికి చూస్తుంది. ఆమె కన్నీరు కూడా రాజరాజనరేంద్రుడి మనసు కరిగించలేకపోతుంది. జగన్నాధం సలహాతో సారంగధరుడిని తమ రాజ్యానికి పిలిపించి తాను యుగంధరవర్మ దగ్గరకెళ్ళి చిత్రాంగిని తనకిచ్చి వివాహం చెయ్యమని, అది ఆమెకెంతో మేలుచేస్తుందని చెబుతాడు. ముసలివాడైన రాజుకు చిత్రాంగిని ఇవ్వటానికి సందేహిస్తున్న యుగంధరవర్మను బెదిరిస్తారు. తండ్రి ద్వారా విషయం తెలుసుకున్న సుబుద్ధి ఎంతమాత్రం ఈ వివాహానికి అంగీకరించేదే లేదని చెబుతాడు. ఇదంతా జగన్నాధం పన్నాగమని తెలుసుకుంటాడు. తప్పని పరిస్థితులలో చిత్రాంగి ఒప్పుకుంటే

నరేనంటాడు. చిత్రాంగి అంగీకరిస్తుంది. తాను అంగీకరించకపోతే తన తండ్రికి, అన్నకు కష్టం కలుగుతుంది. అంతేగాక రాజరాజనరేంద్రుడిని చేసుకోకపోతే జగన్నాధం అన్న అయిన ముసలివాడిని వివాహం చేసుకోవలసి వస్తుంది. అదే జరిగితే ఇంక సారంగధరుడిని చూసే అవకాశం కూడా ఉండదు. అదే రాజరాజనరేంద్రుడిని వివాహం చేసుకుంటే కనీసం సారంగధరుడిని చూడగలుగుతుందని ఆలోచించి ఇష్టంలేని వివాహానికి అంగీకరిస్తుంది.

విషయం తెలిసి తనని నిందించిన సారంగధరుడికి తానెందుకు అంగీకరించవలసి వచ్చిందో చెబుతుంది. అంతేకాదు ఇప్పటికీ మించిపోయింది లేదు తనను చేసుకుంటానని తండ్రికి చెప్పి అతడిని ఎదిరించమంటుంది. దానికి సారంగధరుడు తండ్రిని ఎదిరించలేనంటాడు. ఎదురు నిలబడి మాట్లాడలేనంటాడు. నీ మనసు తెలుసుకోబట్టే ఈ వివాహానికి అంగీకరించానంటుంది. వివాహం అయిన తర్వాత సారంగధరుడు చిత్రాంగినే తల్చుకుంటూ బాధపడుతుంటాడు. చిత్రాంగి రాజరాజనరేంద్రుడుతో ఎంతో ప్రేమగా ఉంటూనే అతడిని మాటలతోనే సంతోష పెడుతుంది కాని తనను తాకనివ్వదు. మళ్ళీ జగన్నాధం రాజరాజనరేంద్రుడి మనసులో అనుమాన బీజం నాటి అతడిని వేటకు వెళుతున్నట్లు చెప్పమని అతడు వెళ్ళిన తర్వాత సారంగధరుడికి చిత్రాంగి రాసినట్లుగా లేఖ రాసి పంపుతాడు. సారంగధరుడు ఆ లేఖ చూసి తల్లి వారిస్తున్నా వినకుండా చిత్రాంగి దగ్గరొస్తాడు. ఇద్దరూ ఎంతగానో బాధపడతారు. సారంగధరుడు తల్లి స్థానంలోనే ఇంక చిత్రాంగిని చూడగలనంటాడు. చిత్రాంగి కూడా అదే సబబంటుంది. సారంగధరుడు వెళ్ళిపోతాడు. చిత్రాంగి బాధతో స్పృహతప్పి పడిపోతుంది. వచ్చిన రాజరాజ నరేంద్రుడు సారంగధరుడే చిత్రాంగిని ఏదో చేశాడని కోపంతో కన్నకొడుకని కూడా చూడకుండా అతడికి కాళ్ళూ, చేతులు నరకమని శిక్ష విధిస్తాడు. నిజం చెప్పబోయిన సుబుద్ధిని సారంగధరుడు వారిస్తాడు. జరిగినది తానూ చెప్పడు. భయంకరమైన శిక్ష అమలుచేయబడుతుంది. స్పృహలోకొచ్చిన చిత్రాంగి రాజరాజనరేంద్రుడు నుండి విషయం విని ఎంత పొరపాటు చేశారంటూ కత్తి తీసుకొని కిటికీలోనుంచి క్రింద పడిపోతుంది. ఆమె సారంగధరుడి దగ్గరకొచ్చి రక్తం మడుగులో నున్న అతడిపై పడి తానూ కత్తితో పొడుచుకొని చనిపోతుంది.

ఈ నాటకంలో చాలాసార్లు జగన్నాధం పాత్రచేత "యిష్టపడకపోవడమంటూ వొకటుంటుందా యేమిటి ఆడవాళ్ళకి ! యిష్టం అని, రాజరాజు చేత "పెళ్ళిగాని పిల్లమీద ప్రేమేంటి" అని పలికించాడు. అనేక సందర్భాలలో చిత్రాంగి సంభాషణలు అలోచింపచేసే విధంగానూ, మగవాడి స్వార్థాన్ని ప్రశ్నించే విధంగానూ ఉంటాయి.

సారంగధరుడు చిత్రాంగి తన తండ్రిని వివాహం చేసుకుంటుందని తెలిసి ఆమెని తప్పుబట్టే సందర్భంలోని సంభాషణ.

"చిత్రాంగి : అడుగు మీ నాయనగారిని, ఇంక నాకేమిగతి చావుతప్ప

సారంగ : అదే నయమేమో !

చిత్రాంగి : నీకేం లాభం

సారంగ : కాని, నీ సంగతి... యీ ముసలిరాజును... నేననలేను ఆ మాటలు

చిత్రాంగి : అనక్కరలేదు. నాకు తెలుసు. ఈ విచారం నాకోసం కాదు. ఇంకొకరిని పెళ్ళి చేసుకొంటే నువ్వు సహించలేవు. నేను నీదాన్ని కదూ, నీ వస్తువును కదూ మరి ! ఇంకొకరిదాన్ని కావడానికి వొప్పుకుంటావా? మొగాళ్ళు ఆలోచించే పద్ధతే అది"

అంటూ మగవారి ఆలోచనా తీరును తెలిసేవిధంగా రాశారు చలం. చిత్రాంగి ఆవేదనను "నన్ను ప్రాణంలేని

దానిలాగా ఇతను రాజుకొడుకు యితనితో స్నేహం చెయ్యమని, నేను ప్రేమించి మనసిచ్చి, మాటిచ్చిన తరువాత కాదు, కాదు నువ్వు నా కళ్ళకే బాగున్నావు. నన్నే పెళ్ళిచేసుకోమంటే, మృగాన్నయినా, అభిమానం చావని దాన్నయితే, యెట్లా వుంటుంది నాకు ? నాది హృదయము కాదు, నాకు ప్రాణం లేదూ, ఒక్క మొగవాళ్ళకే ! నాకు ప్రేమలేదూ, బుద్ధిలేదూ, యిష్టం లేదూ ? నేను గొడ్డునా, ఎవరు కొంటే వారితో నడవడానికి" అని చిత్రిస్తూ చలం స్త్రీ ఇష్టానికి, ఆలోచనకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలియజేస్తూనే స్త్రీ హృదయాన్ని ఆవిష్కరించారు. అంతేకాక స్త్రీ ప్రేమ తప్ప మరేమీ కోరుకోదని "నీకేం ? మొగవాడివి. ఆడదానికి ప్రేమ తప్ప జీవనం లేదు. నీకు రాజ్యము, జయాభిలాష, పరిపాలనం ముందు తర్వాతే పెళ్ళి, బిడ్డలు. నాకో ? నీవు తప్ప నాకు లోకమేది ?" అని చిత్రాంగి చేత పలికించి అదే తన రచనలో నిరూపించారు.

2. హరిశ్చంద్ర : హరిశ్చంద్ర అందరికీ తెలిసిన పౌరాణిక కథ. సత్యం కోసం రాజ్యాన్ని, భార్యను, బిడ్డను త్యజించగలిగిన సత్యసంధుడిగా హరిశ్చంద్రుడు నాటి నుండి నేటివరకు ఎందరినో ప్రభావితం చేశాడు. సత్యాగ్రహంతో స్వాతంత్ర్యాన్ని సాధించిన గాంధీ మహాత్ముడే ప్రత్యక్ష నిదర్శనం. హరిశ్చంద్రుడి కష్టాలతో కరుణరసాత్మంగా సాగే హరిశ్చంద్ర నాటకాన్ని ఎంతో హాస్యంగా రాశారు చలం. సమాజంలోని పురుషపుంగవుడి లాగానే హరిశ్చంద్రుడిని చిత్రించారు. హరిశ్చంద్రుడు ఋషులకు కోపం వస్తే శాపం ఇస్తారనే భయం చేత వారి పట్ల ఎంతో వినయంగా ఉన్నట్లు, ఏకపత్నీవ్రతుడు అనిపించుకోవటం కోసం ఇతర స్త్రీల పట్ల మనసు కలిగినా నిగ్రహించుకున్నాడని, హరిశ్చంద్రుడు అనిపించుకోవాలనే కాంక్షతోనే అబద్ధాలు చెప్పకుండా ఉన్నాడని, వాస్తవానికి అతడి మనసులో ఉన్నది వేరని తెలిపేటట్లుగా హరిశ్చంద్రుడిని చిత్రించారు. హరిశ్చంద్రుడి చేత సగటు పురుషుడిలాగానే "వాసేయ్ ఇట్లారా! కూచో పాట విందాం". అట్లా పళ్ళికిలిస్తా నుంచోకపోతే కుర్రాణ్ణి పిలవరాదూ?" "నవ్వకే ! కొంపతీస్తావు. నవ్వకే నీ నవ్వుమండా!", "వొసే రావే, ఆయనతో వాదమేమిటీ?" "నీ పతివ్రతా ధర్మాలు మరచిపోతున్నావు. భర్త యిచ్చేసిం తర్వాత నీకేం హక్కు వుంది ? సీతలా పతితో అడవిలో తిరగటం లభించింది, పతి నీడ భార్య", అయితే "ఆడది చేతులు జాడించుకొంటూ పక్కన నడుస్తూ ఉంటే, మొగాణ్ణి నేను పిల్లవాణ్ణి మొయ్యనా? యింకా కాలు నెప్పెట్టింది పట్టమన్నావు కావు. మొగాడు తనే బరువులు మోసుకుంటె పెళ్ళామెందుకు ? నువ్వు పడ్డ సంగతి ఎవరికి తెలుస్తుంది, నేను మోసిన సంగతి బయటకొస్తుంది గాని, "నిప్పులో దూకు చల్లారుతుంది. నీ పతివ్రతా మహత్యం చూపించు", "కొన్నవాడు ఆజ్ఞలో వుంచుతాడు. యజమానుడు లేకుండా స్త్రీ ఒక్క నిమిషం వుండవచ్చా ? అందులో నా భార్య ! అట్లా అయితే నాపేరు ఒక్క గడ్డిపరక్కి అక్కరకొస్తుంది ?", "మళ్ళీ మనం కలుసుకున్నప్పుడు రాముడు మల్లే నిన్నింకోసారి నిప్పులో దూకించి శుద్ధి చేసుకుంటాలేవే ?", "ఏమిటి ! ఏమిటి! చక్రవర్తిని పెళ్ళిచేసుకొని, యింతకాలం పతివ్రతా శిరోమణినని పేరుపొంది, యిప్పుడు భర్తనొదిలి లేచిపోతావా ఎవడితోనో ?", "ఆ మాల పిల్లలు వొస్తే నీ కోసం వాళ్ళని నేను పొమ్మనలేదూ ? యీ మాలాడితో యిప్పుడు వెళ్ళిపోతావా యింతా నన్ను ప్రేమించి", "భార్య భర్తని అట్లా తిట్టకూడదని యెన్నిసార్లు చెప్పాను ? నాకేం ? నీకే నష్టం పరలోకంలో", "ఇంతకన్నా అదృష్టమేముంది మనిద్దరికీ! భర్త చేతుల్లో చావు లభించే అదృష్టం ప్రతిస్త్రీకి లభిస్తుందా ! సత్యం కోసం భార్యని కూడా చంపాడనే కీర్తి యింకొకరికి దొరుకుతుందా? ఈ మహాత్యాగాల కీర్తి చిరంగా, ఆచంద్రార్కంగా ఇల్లా నిలిచి, ప్రతి స్త్రీ ప్రతి పురుషుడు సత్య సంధత్వానికి నన్నూ, పాతివ్రత్యానికి నిన్నూ ఆదర్శంగా కీర్తిస్తా వుంటారు. అంతకంటే ఈ పాడుజన్మకి కావలసిందేమిటి?" పలికించారు. హరిశ్చంద్రుడు భార్యపట్ల,

బిడ్డపట్ల ఎంత నిర్దయగా వ్యవహరించాడో చూపించారు చలం.

అనేక సందర్భాలలో హరిశ్చంద్రుడు సీతను ఉదహరించటం గమనించవచ్చు. కానీ రాముడి కంటే చాలా ముందువాడు హరిశ్చంద్రుడు. హరిశ్చంద్రుడు రాముడు పుట్టకముందే ఎలా సీతను ఉదహరించగలడు. ఇది చలం గారు సమాజంలో పురుషులు పతివ్రతల పేర్లు చెప్పి స్త్రీలను ఎలా కట్టడి చేస్తున్నారో, భయపెట్టి అదుపులో వుంచుకోవాలని చూస్తున్నారో తెలియజేయడానికి రాశారనిపిస్తుంది. ఇంకా చలంగారు తమ ఆత్మకథలో "తన తండ్రి గురించి చెబుతూ'' నా మొదటి జ్ఞాపకం అయిదేళ్ళప్పుడు మా నాన్న నన్ను కొట్టడం, రెండో జ్ఞాపకం ఆయన నన్ను కొట్టడం, మూడో జ్ఞాపకం మళ్ళీ కొట్టడం.... మా నాన్న అంటేనే ద్వేషం నాకు..... ఎంత హీనుడో ఎంత నీచుడో ఆ మనిషి.... మా తల్లి వరసగా పిల్లల్ని కని అర్భకురాలై పక్కమీదనే పడుకుని వుండేది. ఒకటి రెండుసార్లు చావుకి సిద్ధమయింది. ఐనా వొదిలేవాడు కాదు ఆ దయగల భర్త." అని చెప్పారు. ఆ జ్ఞాపకాలతోనే హరిశ్చంద్రుడి చేత లోహితాస్యుడిని భయపెట్టడం కోసం "వొరె లోహితా .. రా... వొస్తావా, రావా ? రా వెనక్కిరా, రావూ,.. చాంతాడు...." అనిపించారు. హరిశ్చంద్రుడు ప్రతిసారీ చాంతాడు అంటుంటాడు. అలాగే లోహితాస్యుడి చేత "నాన్నకే యేం చేతకాదూ, అట్లా తిట్లు తింటాడు", "నాన్న లేకపోతే పోనీ అమ్మా ! నేనుంటాలే", "అమ్మా ! అమ్మా! వెధవనాన్న ఎక్కడ పోగయినాడో ! కొడితే కొట్టాడు. పెద్దవాణ్ణవగానే నాన్నని చంపేస్తా", "యాడవకమ్మా! నాన్న దగ్గిరకంటే యీయన దగ్గిరే హాయిగా వుంటాము" అని పరికించారు. పసితనంలో పిల్లల మనసులో ముద్రపడిన భావాలు వారిని ఎంతగా ప్రభావితం చేస్తాయో చలం జీవితం, వారి రచనలూ తెలియజేస్తాయి.

ఇంక ఈ నాటకంలో చంద్రమతి పాత్రని మూలంలోకన్నా భిన్నంగా చిత్రించారు. నిరంతరం చంద్రమతి హరిశ్చంద్రుడిని ప్రశ్నిస్తూనే ఉంటుంది, హెచ్చరిస్తూనే ఉంటుంది, పరిహసిస్తూనే ఉంటుంది. ఋషులకు అంత భయపడనవసరం లేదంటుంది. విశ్వామిత్రుడితో వాదిస్తుంది. అన్యాయంగా అతడికి రాజ్యం ఇవ్వవద్దని హరిశ్చంద్రుడికి చెబుతుంది. రాజ్యం ఇచ్చిన తర్వాత ఇంక అప్పేంటి అంటుంది. లేని అప్పు ఒప్పుకోవటం సత్యం కాదు, అబద్ధమంటుంది. నక్షత్రకుడు విశ్వామిత్రుడి పనిమీద అతడు పంపగా వచ్చాడు కాబట్టి అతడికి విశ్వామిత్రుడే జీతం ఇవ్వాలి కానీ మనమెందుకివ్వాలని ప్రశ్నిస్తుంది. హేతుబద్ధమైన ఆలోచనకు చంద్రమతి పాత్ర చిరునామాలాగా చలం ఈ పాత్రని చిత్రించారు. చంద్రమతి చేత "యేమిటండీ, పనీపాటాలేక తిని కూచుని యీ బైరాగికి రాజ్యమిచ్చేసి పోతామంటారు. యింట్లో సుఖంగా కూచుంటే తోచడం లేదా యేమిటి? మీరూరుకోండి కాస్సేపు. యీయన సంగతేమిటో కనుక్కుంటాను", "పొమ్మనండీ. యీ దొంగ అప్పు మన నెత్తినబెట్టి కొంపదీస్తాడు", "మనముంటేనే నాన్న ఇట్లా వున్నారు. మనం లేకపోతే బతకడమే తెలియదు నాన్నకి పాపం వెర్రినాన్న", "అయ్యో నిప్పులో వురకమంటారేమిటి, పిచ్చా మీకేమన్నా", "బాబూ నేను పతివ్రతను కాను, నన్ను మాత్రం నిప్పులో తొయ్యకండి", "ఏమిటండీ నన్నమ్ముతారా... ఆ కొన్నవాడు దుష్టుడై నన్నేమన్నా చేస్తే" "నా యిష్టం లేనిది బలవంతంగా అమ్ముతున్నారు. మీరు కొంటారా ?" "సత్యమేమిటండి యిప్పుడు ? అన్యాయంగా సొమ్ము లాగుతుంటే, అయ్యో, మీ కీర్తి కాలిపోను", "జాలిని చంపే అసత్యవ్రతం వుండి యెందుకండీ ! అట్లాంటి సత్యనియమం వల్లే యింతవరకొచ్చింది నా బతుకు", "మీకు పిచ్చి మరీ మితిమీరిపోయింది", "పో, పో ! నీకో భార్య కూడానా ? నీ భార్య నెన్నడో అమ్ముకున్నావు. రత్నమంటి బిడ్డ చస్తే నంతోషించినవాడివి, నీ మొహం చూడవచ్చా! పాతివ్రత్యమనీ, కీర్తి అని ఏడిపించుకుతిన్నావు", "భర్తేమిటి, భార్యేమిటి ? అనుకోలేదేం వున్నన్నాళ్ళూ పాతివ్రత్యమని

ఏడిపించి చంపారు", "కీర్తి సరేలెండి. నేను కూడా పోయింతరువాత మీ బతుకెట్లానండీ ?" అని పలికించారు.

భర్త అంటే భార్యకుండే ప్రేమే ఇక్కడ కనిపిస్తుంది. తను లేకపోతే భర్త ఎలా అనే స్త్రీ సహజమైన జాలి ఇక్కడ కనిపిస్తుంది. మూలంలోలాగా కాక ఈ నాటకంలో చంద్రమతి తలని నరికి హరిశ్చంద్రుడు పిచ్చివాడైనట్లుగా రాశారు రచయిత. స్త్రీకి స్వతంత్రం, ఇష్టం ఉంటాయా అనే సమాజంలోని భావాన్ని, ఇంకా సమాజంలో నిమ్నవర్ణాల పట్ల ఉన్న చులకనభావం, అస్పృశ్యత ఎలా పాటించ బడుతుందో కూడా అనేక సందర్భాలలో ఈ నాటకంలో చిత్రించారు. నక్షత్రకుడి చేత భార్యని, బిడ్డని అమ్మవద్దు, అది మహాపాపం అని పలికించారు. "ప్రజలు ఏది నిజమంటే అదే నిజమన్నమాట. ప్రజలెన్నడూ నిజాన్ని నిజమనరు. అబద్ధమంత నిజంగా యింకేది కనపడదు వాళ్లకి!", "పెళ్లాన్నమ్ముకోడం కంటే ఎవణ్ణన్నా చంపి తీసుకొని రావడం నయం", "నాకే భార్య, కొడుకు వుంటే వెయ్యి అబద్ధాలు చెప్పి రక్షించుకుంటా గాని యిట్లా కటికవాడికి అమ్ముకుంటానా ? మీ సత్యదీక్ష ఏ తప్పు చెయ్యకుండా నిలబెట్టుకోవాలి. అంతేగాని సమస్త ఘోరాలూ చేసి సత్యకీర్తి సంపాయిస్తావా ? నిన్ను చూసి యింకోడు భార్యని మూడు రూపాయలకమ్ముతాడు గంటసేపు. మీ యిద్దరికీ భేదమేమిటి ?" అని నక్షత్రకుడు అన్న మాటలు ఆలోచింపచేస్తాయి.

3. సావిత్రి : యముడితోనే మెప్పు పొంది భర్త ప్రాణాలను తిరిగి తెప్పించిన పతివ్రతగా సావిత్రి అందరికీ పరిచయమే. మూలంకన్నా భిన్నంగా ఒక ప్రేమకథలాగా దీనిని రాశారు చలం. ప్రేమ ఎంత గొప్పదో నిరూపిస్తుందీ నాటకం. పాత్రల స్వభావాలనే మార్చివేశారు. మూలంలో అశ్వపతి సావిత్రిదేవిని ఆరాధించి ఆమె వరం వల్ల కలిగిన బిడ్డకి సావిత్రి అనే నామకరణం చేసి అల్లారుముద్దుగా పెంచుతాడు. వివాహం విషయంలోనూ తన బిడ్డ అభిప్రాయానికే ప్రాధాన్యతనిస్తాడు. మహాభారతం అరణ్య పర్వంలోని సావిత్ర్యుపాఖ్యానంలో అశ్వపతి

"తల్లి ! నీ గుణరూప వృత్తములకెందు
తగినవరు నీవ యిమ్ముగఁ దడవి నెమ్మి
నీదు మనసున కెక్కిన నృపకుమరుఁ
గోరి వరియింపు మిదియ నాకు ప్రియంబు" అని సావిత్రితో

"ఈ కన్నియ నా కూఁతురు
మా కులమునకెల్లఁ దెప్ప మనుజోత్తమ నీ
వీ కన్నియఁ గోడలుగాఁ
గైకొనుము మదీయ వచన గౌరవబుద్ధిన్" అని ద్యుమత్సేనుడితో చెప్పటం కనిపిస్తుంది. అలాగే యముడు కూడా సావిత్రి పట్టుదలకు, ధర్మనిరతికి మెచ్చి

"తనులతాంగి ! భవదుదారవాగ్భంగికి
మెచ్చు వచ్చె నాత్మ నిచ్చువాడ
వేఁడు మొక్కవరము విభుని జీవిత మొక్క
టియును దక్కనేది యయిన నొండు"
"అనిన నంతకుఁ డిట్లను నతివ ! నీవు
ప్రకట ధర్మ విశేషతత్పరవు గాన
యింక నొక వరమిత్తుఁ బ్రాణేశు బ్రతుకు
వలదుగాని యొండడుగుము వలయుదాని" అనటం కనిపిస్తుంది.

వీటన్నిటినీ చలం తాను సమాజంలో చూస్తున్న పరిస్థితుల కనుగుణంగా మార్చారు. అశ్వపతి సావిత్రి సత్యవంతుడిని వివాహం చేసుకోవడటానికి అంగీకరించడు. అయినా సావిత్రి ప్రేమించిన సత్యవంతుడిని వివాహం చేసుకుంటుంది. సత్యవంతుడి ప్రాణం తీసుకు వెళుతున్న యముడితో సావిత్రి వెళుతుంది. అక్కడ సత్యవంతుడు చంద్రికతో వుండటం చూస్తుంది. అది యముడి మాయ. తన ప్రేమ నిజమైతే సత్యవంతుడు ఇతరుల పట్ల ఆకర్షితుడు కాడనుకుంటుంది. యముడిని తన భర్త ప్రాణం

ఇవ్వమంటుంది. దానికి ప్రతిగా అతడు ఒకరాత్రి తనతో గడపమంటాడు. భర్త ప్రాణం కోసం సరేనంటుంది. ముందు భర్తను బ్రతికించమంటుంది. భర్త బ్రతికిన తర్వాత అన్నమాట ప్రకారం యముడి దగ్గరకు వెళుతుంది. దగ్గరకొచ్చిన అతడిని కత్తితో పొడవబోతుంది. యముడు సంతోషించి ఇదంతా నీ ప్రేమను పరీక్షించటానికే అంటాడు.

ప్రేమ గొప్పదనాన్ని తెలిపేవిధంగా సావిత్రిచేత "మృత్యునును జయించలేని ప్రేమ ప్రేమకాదు", ప్రేమిస్తున్న హృదయం వొకటి యెండి శూన్యమయిందంటే, ప్రేమవల్ల జనించి, వృద్ధిపొంది, ప్రేమే ఆధారంగా నిలిచివుండే చండతేజ శోభితాలైన బ్రహ్మాండాలతో సహా యీ ప్రపంచమంతా శూన్యమవుతుంది. మృత్యువే ప్రేమకు అంతమైతే, ఆనందధామంలో నిర్నిద్రతేజులై వెలిగే ప్రేమమూర్తి అయిన సర్వేశ్వరుడు కూడా మృత్యువుతోనే అంతమై భస్మమవుతాడు", "ప్రేమ మోసగిస్తుందనుకోలేదు. ప్రేమే ద్రోహం చేస్తే, జీవించేది దేనికోసం ?" "ప్రేమ క్షమించలేని పని వుందా ?" "నీకు ధైర్యం తగ్గినప్పుడు నీ బదులు కూడా ప్రేమ ధైర్యం తెచ్చుకోవాలి. సమయాన్ని బట్టి ఔన్నత్యం పొందని ప్రేమ ప్రేమా?", "ప్రేమతో అధర్మం వీలులేదు", "ప్రేమకి అజ్ఞానం లేదు" అని పలికించారు చలం. ప్రేమ స్వరూపిణిగా సావిత్రిని చిత్రించిన చలం అశ్వపతి చేత "కలుసుకోడానికి వీలులేదు. సావిత్రీ, నా మాట విను. మృత్యువు వలె యితని సమీపం నించి పారిపో. కలుసుకున్నావా, నీ జీవితం భగ్నమైపోతుంది. అతన్ని కలుసుకోవడానికి ప్రయత్నిస్తే అతడిని చంపి నిన్ను రక్షించుకుంటాను" అని, యముడి చేత "రాత్రి, యీ పక్కమీద నువ్వు నాకు సంపూర్ణంగా, స్వాధీనమవుతానని వాగ్దత్తం.... ఈ వాగ్దత్తం నిలుపుకోకపోతివా, అతన్ని రక్షిస్తున్న ఈ హస్తమే అతన్ని మళ్ళీ నిర్మూలనం చేస్తుంది" అని పలికించి పురుషస్వభావం ఎలా ఉంటుందో చూపారు.

స్త్రీలు ఎప్పుడూ నిర్మల స్వభావులే, ప్రేమ మూర్తులే. వారికి ఇష్టమైన వ్యక్తితో వివాహం జరిగితే వారు భర్త కోసం ప్రాణమైనా ఇస్తారు. ఇష్టం లేని వ్యక్తులతో వివాహం జరిగినపుడో, తమకన్నా చాలా పెద్దవారితో వివాహం జరిగినప్పుడో మాత్రమే వారు పాతివ్రత్యాన్ని పక్కనబెట్టి ఇతరుల పట్ల ఆకర్షితులవుతారని చలం అభిప్రాయం. ఈ అభిప్రాయాన్ని బలపరిచే విధంగానే ఈ నాటక రచన సాగింది.

4. జయదేవ : చలం తన ఆత్మకథలో "పరస్త్రీతో సంగమమే కాదు ఆ విధమైన మనోవాంఛ సహితం పాపం. నా రొమాన్స్ అనేది నా రక్తంతో కలిసి నాతోనే పుట్టింది. ఎంత ప్రయత్నించీ శృంగార వాంఛని ఈనాటివరకూ జయించలేక పోయినాను. అదే లేకపోతే, నేను ఎందుకు బతికి? స్త్రీతో కొన్నాళ్ళు స్నేహమయితే, మాలోని శృంగారభావం పాతబడి, ఇంక నన్ను ఆకర్షించడం మానేసేది. అప్పుడు యింకో కొత్త శృంగార సంబంధం కోసం కొట్టుకునేవాణ్ణి. ఇది గొప్ప ప్రేమా కాదు. ఉత్త కామమూ కాదు." అని తనలోని ద్వంద్వ భావాలనీ తెలిపారు. ఒకపక్క పాపమంటూనే అదే తన బలహీనతంటారు చలం. చలం ఈ భావజాలమంతా జయదేవ నాటకంలో కనిపిస్తుంది. గొప్ప భక్తుడైన జయదేవుడిని స్త్రీలోలుడిగా చూపటం చలం గారికే సాధ్యమేమో.

జయదేవుడంటే స్త్రీలంతా మోహంలో మునిగిపోతుంటే జయదేవుడు రాణీవాసం ముందు నిలిచి ఆ రాణిని స్వాధీనం చేసుకోవాలని పాడుతూ ఉంటాడు. చాలా రోజుల తర్వాత ఆ రాణికి అతడిపట్ల ఇష్టం కలిగి వచ్చేసమయానికి పద్మావతి మృత్యుశయ్యపై ఉందని తెలిసి జయదేవుడు పద్మావతి దగ్గరకెళతాడు. "కళా ప్రోత్సాహిని, నా హృదయాధి దేవతవు. నీవు లేని ప్రపంచమేదీ '" అని జయదేవుడు దుఃఖిస్తాడు. ఆమె కోరికపై పాడుతూ ఉండగానే ఆమె మరణిస్తుంది. "దోషిని, నా బుద్ధే నా అపరాధాలే నా పద్మావతిని నాశనం చేశాయి. ఏం చెయ్యను? యీ బుద్ధిని కాల్చనా ? చంపనా ? నా బుద్ధిని ఎట్లా కట్టివెయ్యను ?

ఎట్లా నాశనం చెయ్యను ? ఈ సంచారం, ఈ యిల్లు, ఈ స్త్రీలు – నేనింక సన్యాసిని, బైరాగిని, సమస్త వాంఛల్ని కాలుస్తుంది, వైరాగ్యం ! నా బుద్ధినే బంధిస్తుంది" అని జయదేవుడు సన్యాసం స్వీకరిస్తాడు. అతడిని కోరివచ్చిన రాణిని నా హృదయరాజ్ఞీ అని కౌగిలించుకుంటాడు. మళ్ళీ తన సన్యాసం గుర్తొచ్చి "మనసా ! మళ్ళీ వాంఛలో, మళ్ళీ స్త్రీ మాయలో పడుతున్నావు. జాగ్రత్త" అనుకుంటూ అక్కడి నుంచి వెళ్ళిపోతాడు. జయదేవుడు పాడుతూ వుంటే యతి అయిన అతడిని భర్త ఆజ్ఞపై సేవిస్తుంటుంది సువర్ణముఖి. సువర్ణముఖి సౌందర్యానికి "సన్యాసినైనా, సర్వసంగ పరిత్యాగినైనా, ఏమిటీ ఆకర్షణ, ఈ స్త్రీ సౌందర్యం నన్ను పిశాచివలె పీడిస్తోంది" అని అనుకుంటూనే ఆమెకు తన కోరిక తెలియజేస్తాడు. ఆమె నిరాకరిస్తుంది. గదిలో ఒంటరిగా దొరికిన ఆమెపై పడగా బయటున్న భర్తను ఆమె గట్టిగా పిలుస్తుంది, లోపల నుంచే విషయం చెబుతుంది. బయటున్న భర్త ముందు మహాపురుషుడిని దూషిస్తున్నావంటాడు. తర్వాత "నీ సౌందర్యం ఆ మహాత్ముల దృష్టి నాకర్షించమనేదే, అసాధారణ భాగ్యం మనకు, మాటలాడకు, ఆయన్ని సంతుష్టిపరచు" అంటాడు. నా సౌందర్యమే నా శీలాన్ని మింగిందని ఆమె అగ్నితో తన ముఖాన్ని కాల్చుకుంటుంది. తన వశుత్వాన్ని నిందించుకుంటూ జయదేవుడు తన కళ్ళవల్లే ఇదంతా జరిగిందని కత్తెరతో కళ్ళు పొడుచుకుంటాడు. ఇంక స్త్రీలందరూ తన బాధనుంచి విముక్తులవుతారనుకుంటాడు.

ముళ్ళపొదల్లో పడి మూలుగుతూ పాడుతున్న జయదేవుడిని వృద్ధభిక్షుకి తన కుటీరానికి తీసుకెళుతుంది. ఆమె కాషాయవస్త్రం మన్మథ బాణాలకు కవచమనుకున్నావా? నర్వేంద్రియాలనూ బంధిస్తే మాత్రం కళాపూర్ణమైన నీ వుష్ణరుధిరాన్ని యెట్లా మార్చగలవు ? తీవ్ర యోగసాధన వల్ల తప్ప" అని చెబుతుంది. జయదేవుడు తనకు అరణ్య సంచారమే నయమని అడవుల్లోనే చరిస్తుంటాడు. అతడి గాన మాధుర్యానికి అతడి దగ్గరకు గొల్లపిల్ల అయిన యశోద వస్తుంది. తమ ఊరికి రమ్మని ఆహ్వానిస్తుంది. అతడు రానంటే తానే అతడికి ప్రసాదం తెస్తానంటుంది. అతడు పాడుతూ ఆనందంలో మునిగి పోతుంటాడు. యశోదను పాట నేర్చుకోమంటాడు. ఆమెకు పాట నేర్పుతూ ఆమె కంఠమాధుర్యానికి, ఆమె స్పర్శకి మళ్ళీ వివశుడవుతాడు. ఆమెని తాకితే ఆమె నన్ను మలినం చేశారు, ఈ శరీరం నా ప్రియుడిది, గానంతో మరిపించి ధ్వంసం చేయాలనుకున్నారు అంటుంది. మళ్ళీ ఎంత ఘోరం చేశానా, నీ పాదాలు తాకనీ అంటూ ఆమె పాదాలు ముట్టుకోబోతే యశోద పక్కకు తప్పుకుంటుంది. జయ దేవుడు ముందుకు నడిచి అగాధంలోకి జారిపడిపోతాడు.

ఈ నాటకం ద్వారా చలం వైరాగ్యం అనేది వస్త్రధారణ వల్ల కలిగేది కాదని తెలియజేశారు. వృద్ధభిక్షుకి చేత "వైరాగ్యమా ? అంటే? ఎప్పుడు కలుగుతుంది ప్రపంచ సుఖాలమీద వైరాగ్యం ? మోక్షం మీద మోహం కలిగినప్పుడు అల్పులకు వైరాగ్యం సులభం, తీవ్ర వాంఛలు వాళ్ళలో లోపం గనుక. నీవంటి ఉత్తమ పురుషులకి వైరాగ్య మెందుకు? నీ సౌందర్యవాంఛ, నీ కామశక్తిని, నీ గానమాధురి, నీ కవితాగ్ని, అన్నీ ఈశ్వరుడి పాదాల వద్ద అర్పించే పుష్పాలుగా మారాలి. ఆ పుష్పాన్ని వికసింపజేసే ఆకాశతేజం ఉదయించినప్పుడు యీ చిన్ని వెలుగులన్నీ, ఈ స్వల్ప వాంఛలన్నీ, ఆ దివ్యతేజస్సులో లీనమౌతాయి" అని పలికించి తనలో అంతర్గతంగా దాగున్న వైరాగ్యం గురించి తెలియజేశారు. చిన్నతనంలో ఎంతో భక్తిభావం కలిగివున్న చలం మళ్ళీ చివరకు రమణమహర్షి ఆశ్రమానికి చేరటం గమనించవచ్చు. తన కుమార్తె అయిన సౌరిస్ మాటే రమణ భగవానుడు తనకు చెప్పే సందేశంగా భావించేవారు. "తెలీని ఓ మహాశక్తి, జ్ఞానమో నన్ను కనిపెట్టి రక్షిస్తోందని ఓ వెర్రినమ్మకం నాకుండేది" అని చలంగారే చెప్పారు.

5. శశాంక : ఇదీ పురాణ కథే. దేవతల గురువైన బృహస్పతి భార్య అయిన తార, శిష్యుడైన చంద్రుడు అతడికి తెలియకుండా ఒకరిపట్ల ఒకరు అనురక్తులయ్యారనేది

తెలిసిన కథ. దీనిని చలం మార్చి రాశారు. చలం రచనలు, ఆలోచనా విధానం, ప్రవర్తన కారణంగా సమాజం నుంచి ఎంతో వ్యతిరేకతను అతనొక్కడే కాకుండా అతడి కుటుంబమంతా ఎదుర్కోవలసి వచ్చింది. భార్య రంగనాయకమ్మ అతడి ధోరణికి విసిగి రమణ మహర్షి ఆశ్రమానికి వెళ్ళినా అన్నిటికీ అతీతులుగా ఉండవలసిన అక్కడి భక్తులు కొందరు ఆమెను బాధపెట్టడం చూస్తాం. చలం అలాంటి సమాజాన్ని కోరుకోడు, లక్ష్యపెట్టడు. చలం కోరుకునే సమాజంలోని వ్యక్తులు ఎంత ఉదాత్తంగా ఆలోచిస్తారో అలాంటి ఆలోచనలతో బృహస్పతి పాత్రని, తాను సమాజంలో చూసే సామాన్య జనంలాగానే ప్రవర్తించే దేవతలు, మునుల పాత్రలని ఈ నాటకంలో చూడవచ్చు.

"యితరులలో కనపడే మాలిన్యమెప్పుడూ హృదయ దర్పణాల ప్రతిబింబమైన స్వకీయ కల్మషమే" అని నమ్మిన బృహస్పతి భార్య తార. ప్రపంచ రసాస్వాదనమే తపస్సు అని తారలో వున్న అపారమైన ప్రణయ పాతాళగంగను విజృంభింపజేసి సాఫల్యం చేసుకునే శక్తి తనకు లేదని బృహస్పతి తలుస్తాడు. అదే తారతోనూ "ప్రేమ ఆత్మ సమర్పణమైనప్పుడే స్వీకరణార్హము... అదిగాక నేనే నీ ప్రేమకు అర్హుణ్ణి కానని అనుకొంటాను నిశ్చయంగా" అని అంటాడు. "నా హృదయంలోని భయంకర వాంఛ నన్ను సృష్టించిన విధాతకన్నా అర్ధమౌతుందో కాదో ! భక్తి, ఆయువు, రాజ్యం కోరినవాళ్ళేకాని, వరాల్లోకల్లా వుత్కృష్టమైన ఈ వరాన్ని ఎవరూ కోరలేదో !... యెవరూ నిరాకరించలేని లావణ్యాన్ని భిక్షమడుగుతాను. మోహినే కాదు. యెవరూ నా నుంచి హృదయాన్నీ నేత్రాల్నీ మరల్చుకోలేకపోవాలి. నా ముఖదర్శనమయిందో, తుషార ధవళ సుందర శరీర, నిర్మల హృదయ, విద్యానిలయ, పావన చరిత, వాణి, ప్రచండ తీవ్ర మోహార్తిచే వున్మత్తమై, సర్వనైతిక, అభిమాన, బంధత్యాగ మొనర్చి నా పాదధూళి వెనువెంట పరువులెత్తాలి" అని వాంఛించే శశాంకుడు బృహస్పతి శిష్యుడు. బృహస్పతి చెల్లెలు అనూరాధ అతడి స్నేహితురాలు. ఎప్పుడూ ప్రకృతిలో గడపటం ఆమెకి ఇష్టం. వారిద్దరి స్నేహం చూసి తారే ఈర్ష్యపడుతుంటుంది. అనూరాధ "నీ దేహ సౌందర్యంతోనే కాని యింక ఏవిధాన ఆకర్షించడం వుత్తమంగా తోచదా శశీ ! అంతేనా స్త్రీ నుంచి కోరేది నువ్వు ? అదేనా వున్నతాదర్శం మానవుడికి ? గురువుగారి నడగావా?" అని చంద్రుణ్ణి ప్రశ్నిస్తుంటుంది. ఎంతో ఉన్నతంగా జీవించాలనే వ్యక్తి తార శశాంకుడి పట్ల ఆకర్షితురాలవుతుంది. ఇద్దరూ దగ్గరవుతారు. తప్పుచేసి గురుద్రోహం చేశాననే భారంతో చంద్రుడు వెళ్ళిపోతాడు. ఏకాంత సాధన నుంచి వచ్చిన బృహస్పతి విషయం తెలుసుకొని తార కోరికపై శశాంకుడిని తీసుకువస్తాడు. విశ్వామిత్రుడు, దేవేంద్రుడు, గౌతముడు బృహస్పతికి నీతిబోధ చేయాలని వచ్చి నిరాశతో వెళతారు.

6. పురూరవ : ఈ నాటకంలో ఎన్నో భావాలు కనిపిస్తాయి. ప్రేమ, పెళ్ళి, సమాజం, వేదాంతం, స్త్రీల ఆలోచనలో ఉన్న ఔన్నత్యం పురుషులలో లేదనే భావం అన్నీ కనిపిస్తాయి. మూలంలో ఉన్న కథలో మార్పులు చేసి రాసిందే ఈ నాటకం కూడా.

ఊర్వశి పురూరవుడి దగ్గరకొస్తుంది. తనవరో తనకే తెలీదంటుంది. కాకపోతే పురూరవుడి పిలుపుమేరకే తాను వచ్చానంటుంది. శరీరమే కాదు ఎక్కడా భూలోకంలో లేని వింత వెలుగు ఆకర్షణలో ఊర్వశి ఉంటే మనసుపై కమ్ముకున్న అనృతం, ఐశ్వర్యం, గర్వం, అహంకారం, అధికారం పొరలుతో పురూరవుడుంటాడు. ఆమె ప్రేమని గుర్తించడు. చివరికి ఆమె సౌందర్యానికి పాదాక్రాంతుడవుతాడు. తనతో తన రాజ్యానికి రమ్మంటాడు. తనమాట కాదననంటే వస్తానంటుంది. అలాగేనని తీసుకెళతాడు. రాజ్యంలో రాజ్యకార్యాలన్నీ మానివేసి ఊర్వశితోనే గడుపుతుంటాడు. కానీ చివరకు ఒకరోజు నగారా శబ్దానికి ఏం ఆపద కలిగిందో అని పురూరవుడు వెళ్ళబోతే ఊర్వశి వద్దంటుది. అంతకముందే ఒక ఆగంతకుడు ఊర్వశిని చంపటానికి ప్రయత్నించి పురూరవుడి చేతిలో చస్తాడు. పురూరవుడు మధ్యలో తన భార్యనూ గుర్తుచేసుకుంటాడు.

ఊర్వశిని వదలలేడు. చివరకు పురూరవుడు ఊర్వశి మాట కాదని వస్త్రాలు ధరించి బయటకు వెళ్ళటంతో ఊర్వశి వెళ్ళిపోవటం జరుగుతుంది. ఊర్వశి కోసమే తపస్సు చేస్తాడు పురూరవుడు.

చలం తన భావాలని ఆత్మకథలో "ఇది పాపమా? ఇంత ఆనందకరనైనది పాపమా ? ఎందుకు పాపం? భార్యతో లేని పాపం ఇంకో స్త్రీతో పాపమెట్లా అయింది ? ఈ శృంగార ఆనందాన్ని తెలీని జడులు, ఇట్లాంటి అబద్ధపు నిబంధనలు ఏర్పరచారా? ఇదంతా ఒక భార్యని కట్టుకోవటం వల్లనే గదా ! స్త్రీని తలుచుకుంటే పాపం... " అంటూ తెలియజేశారు. మధ్య మధ్యలో దేవుడి ప్రస్తావన తెస్తూనే ఉంటారు చలం. ఈ పురూరవ నాటకంలో ఎంతో లోతైన విషయాలు ఎన్నో ఊర్వశి ద్వారా పలికించారు. అర్థమయ్యా, అవ్వనట్లుంటాయి ఊర్వశి మాటలు. ఇందులోనూ ప్రేమకే పెద్దపీట. ఊర్వశి వివిధ సందర్భాలలో పురూరవుడితో "విజ్ఞానం, విశాలం ఎక్కణ్ణించి వస్తాయి. శృంగారంలోంచి, ప్రేమలోంచి గాక", "బాధ్యతలు, విధులు, భయాలు అనే ముళ్ళు మనసునించి తప్పిపోతేనేగాని ఆనందానికి స్థలం ఏర్పడదు", "ఈ జ్ఞాపకాల్ని వొదలాలి నువ్వు వొదలకపోతే ఎక్కడికి వెళ్ళీ ఎవరుగా మారీ ప్రయోజనం లేదు. కాని ఆ జ్ఞాపకాల్నే వదలగలిగితే ఎక్కడికీ కదలనే అక్కర్లేదు", "శాపాలూ, వరాలూ అంత బుద్ధిలేని వ్యవహారాలనుకోకు", "మనకు అర్థం కాని సత్యమే సమస్య. బాధ అంత బాధ కాదు, బాధ కలుగుతుందనే భయమంత", "ఆ సమయంలో ఏం చెయ్యాలో అదే తెలుస్తుంది. ఏం చెయ్యను? అనే ప్రశ్నని నిర్మూలించగలిగితే ఆ ప్రశ్నే ఈ ప్రపంచంలో దారుణం", "పాపం ఎంత తపన పడుతున్నావు ఎట్లా అర్థం చెయ్యను నీకు. ఊర్వశి నీ ప్రేయసి అయిందన్న వరం, ఇతరులకు కూడా ఆ అనుభవం ఉన్నదనే బాధలో ఎంత న్యూనతని పొందింది నీ మనసులో !" "వెన్నెల అందరి హక్కు కావడం వల్ల, వెన్నెలలోని ఆహ్లాదం తగ్గిందా నీకు", "ఈ లోకంలో మృత్యువూ అంతే. నా మాట నమ్ము, అంత ఘోరంగా విధిని తిడతారా మానవులు. ఈ దుఃఖం, వ్యధ, రోగం అంతా వాళ్ళకే తెలీని మనుష్యుల స్వంత అవసరాలు, నిగూఢ వాంఛలు, చావుకి ఏడుస్తారా? ఆ ఎడబాటుని బతికిన వాళ్ళూ, చచ్చినవాళ్ళూ ఇద్దరూ కోరుకుంటేనే జరుగుతుంది. నిజం విను. ఈ సృష్టిలో క్రూరత్వమూ, అన్యాయమూ అనే పదాలు వినబడవు. ఎక్కడా లేవు, నమ్ముతావా ?" అని చెబుతుంది. ఇవన్నీ చలం మననులోని మాటలే ఊర్వశి నోటంట వచ్చాయనిపిస్తుంది. ఈ విధంగా చలం నాటకాలని మిగిలిన వారికన్నా భిన్నంగా చూపారు.


"తెలుగు సాహిత్యం – విభిన్న ప్రక్రియలు"

డా॥ రేఫూరు అనంత పద్మనాభరావు, విశ్రాంత అదనపు డైరక్టర్ జరనల్, దూరదర్శన్ – ఢిల్లీ. సెల్ : 9866586805

తెలుగుశాఖ ప్రాచీనత : కందుకూరు ప్రభుత్వ కళాశాల తెలుగుశాఖ అతిప్రాచీనం. 1967లో నేను అధ్యాపకుడిగా చేరే నాటికి శాఖాధ్యక్షులు శ్రీ జంధ్యాల లక్ష్మీ నారాయణశాస్త్రి, ఉపన్యాసకులుగా ఆర్.యస్. సుదర్శనా చార్యులు, పి.వెలుగొండయ్య అధ్యాపకులుగా నడిపినేని సూర్యనారాయణ ఉన్నారు. తర్వాతి సంవత్సరాలలో సర్వశ్రీ యల్లలరాజు శ్రీనివాసరావు, సి. రంగారెడ్డి, జి.వి. నారాయణ, కేతు విశ్వనాథరెడ్డి, ఏ.వి.ఆంజనేయులు, పి.జోసెఫ్, శ్రీమతి ఏ.వి. సుబ్బమ్మ ప్రభృతులు తెలుగు శాఖను సుసంపన్నం చేశారు.

విభిన్న ప్రక్రియలు : తెలుగు సాహిత్యానికి వెయ్యి సంవత్సరాల సుధీర్ఘ చరిత్ర వుంది. నన్నయతో మొదలైన సాహితీ ప్రక్రియలు బహుముఖాలుగా విస్తరిల్లి ప్రపంచ సాహిత్య చరిత్రలో సుస్థిరస్థానం సంపాదించుకొన్నాయి. నేను 55 ఏళ్ళ క్రితం పని చేసిన తిక్కవరపు రామిరెడ్డి ప్రభుత్వ కళాశాల, అద్దంకి ప్రభుత్వ కళాశాలలు రెండు రోజుల సాహితీ సెమినార్ ఏర్పాటు చేయడం అభినందనీయం. ఈనాటి నా ప్రసంగంలో సప్తవర్ణ శోభితమైన ఇంద్రధనుస్సులా ఏడు ప్రక్రియలను స్థూలంగా ప్రస్తావిస్తాను.

1. శతకాలు : తెలుగులో శతక వాఙ్మయం విస్తారమైంది. చిన్నతనంలో పిల్లలకు సుమతీ శతకం, వేమన శతకం, దాశరథీ శతకాది పద్యాలను కంఠస్థం చేయించేవారు. నీతిని బోధించే శతకాల ద్వారా భావితరాల యువకులను తీర్చిదిద్దేవారు. కందుకూరి రుద్రకవి రచనలపై నేను పరిశోధన చేశాను. అందువలన రుద్రకవి బలవదరీ శతక పద్యాన్ని ఉదహరిస్తున్నాను.



చం : కలశ పయోధి మీద తరగల్ మఱి హోయనిమ్రోయ, వేయుభం
గుల తలపాన్పు పాము బుసకొట్టగ, నేగతి నిద్ర చెందెదో
అలసత చీమ చిటుకన్నను నిద్దురరాదు మాకు నో
బలవదరీ దరీకుహర భాస్వదరీ యదరీ దరీ హరీ !

(చాటు పద్య మణిమంజరి)

2. అష్టకాలు : తెలుగులో విశిష్ట ప్రక్రియ అష్టకం. సంస్కృతంలో చాలా అష్టకాలున్నాయి. వివాహ సమయంలో ముహూర్త కాలానికి వ్యవధి వుంటే మంగళాష్టకాలు పఠిస్తారు. కందుకూరి రుద్రకవి రచించిన జనార్ధనాష్టకాన్ని ఆరుద్ర పీఠికలో, బాపు బొమ్మలతో అందంగా ముద్రించి 1971లో కందుకూరు ప్రభుత్వ కళాశాలలో ఆరుద్ర చేత వి.ఏ.కె.రంగారావు ఆవిష్కరింపజేశారు. రంగారావు వేషధారణ చేసి అష్టకంలోని పద్యాలను జనార్ధనస్వామి ఆలయంలో నృత్యాభినయం చేశారు. రుద్రకవి "జనార్ధనా ష్టకంలోని పద్యాలు ఎన్నటికీ వాడని పుష్పమంజరులని" ఆచార్య పింగళి లక్ష్మీకాంతం తమ ఆంధ్రసాహిత్య చరిత్రలో ప్రశంసించారు. అష్టకంలో తొలి పద్యం :

సిరులు మించిన పసిడి బంగరు జిలుగు దుప్పటి జారగా
చరణ పద్మము మీద దేహము చంద్రకాంతులు దేరగా
మురువు చూపుచు వచ్చినావో మోహనాకృతి మీరగా
గరుడవాహన ! దనుజమర్దన ! కందుకూరి జనార్ధనా !

తెలుగులో చాలా అష్టకాలు వెలువడ్డాయి. 1974లో కందుకూరు రచయితల సంఘం ఆధ్వర్యంలో మాలకొండలో

నృశింహ క్షేత్రంలో జరిగిన కవి సమ్మేళనంలో నేను రచించిన మాల్యాద్రి నృసింహాష్టకంలో తొలిపద్యం ఇది :

సిరిని దాల్చిన బిరుదు మగనికి చెలిమి నాతో నేలరా?
గిరి నివాసులమైన మమ్ముల గేలి చేసెడి దేలరా?
సరసమాడగ సమయమిదియా ! సవతిపోరు మరేలరా?
మరులు గొలువగ వలదుపోరా ! మాల్యాద్రి నరసింహమా!

3. ఉదాహరణం : తెలుగులో మరొక విశిష్టప్రక్రియ ఉదాహరణం. ఇందులో ఏడు విభక్తులలో ఒక్కొక్క వృత్తము, కళిక, ఉత్కళిక చొప్పున 7×3 = 21 చివరలో సార్వ విభక్తికములో వృత్తము, కళిక, ఉత్కళిక, అంకితాంక పద్యము మొత్తం 25 ఉంటాయి. నిడుదవోలు వెంకటరావు ప్రత్యేకంగా తెలుగులో వెలువడిన ఉదాహరణ పట్టికనిస్తూ, ఆయా ఉదాహరణలను ప్రస్తావించారు. పాల్కురికి సోమన రచించిన బసవోదాహరణం తొలి తెలుగు ఉదాహరణగా పేర్కొనవచ్చు. ప్రకాశం పంతులుపై వున్న అభిమానంతో నేను ప్రకాశోదాహరణం రచించాను. అందులో ఒక పద్యం–

షష్ఠీ విభక్తిలో వృత్తపద్యం నాది :

ఉ : భారతవీరమాత తన బంగరు బిడ్డలకుగ్గుపాలతో
నేరుపు వీరగాథలననేకము, శాంతినహింసను దెల్పు దో
ష్పారత దేశభక్తిని ప్రచారము సేయ నమస్కరింత్రు, వి
స్తార యశోవిశాలునకు, ధైర్య సమన్విత సుప్రకాశకున్
కాలక్రమేణా ఈ ప్రక్రియకు ఆదరం తగ్గిపోయింది.

4. యక్షగాన ప్రక్రియ : యక్షగానం ప్రధానంగా జానపదుల వినోద ప్రక్రియ. కన్నడ సాహిత్యంలో 'ఎక్కలగాణ' 12వ శతాబ్ది నాటికే ప్రసిద్ధం. చక్రపురి రాఘవాచార్యుని విప్రనారాయణ చరిత్ర తెలుగు యక్షగాన వాఙ్మయంలో ప్రాచీనం. 16వ శతాబ్దివాడైన కందుకూరి రుద్రకవి సుగ్రీవ విజయం రచనా ప్రక్రియలో నూతనం. కందుకూరులో వెలసిన సోమేశ్వర జనార్ధనస్వామికది అంకితం. తాళ ప్రధానములైన త్రిపుట, జంపె, కురచజంపె, అటతాళము, సకతాళము మొదలైనవి సుగ్రీవ విజయంలో ప్రయోగింపబడ్డాయి. యక్షగాన వాఙ్మయంపై డా.యస్.వి. జోగారావు పరిశోధనా గ్రంథం ప్రామాణికం. కంకంటి పాపరాజు రచించిన విష్ణుమాయా విలాస యక్షగానం ప్రసిద్ధం. దినవహి ఓబయమంత్రి గరుడాచల యక్షగానం ప్రాచీనం. కూచిపూడి సంప్రదాయంలో యక్షగాన ప్రదర్శన ప్రాధాన్యం సంతరించుకొంది. బందా కనకలింగేశ్వరరావు ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో ప్రొడ్యూసర్‌గా పనిచేస్తున్న కాలంలో అనేక యక్షగానాలను పాత్రధారులచే రికార్డు చేయించారు. కేవలం వినోదం కోసమేగాక మత ప్రచారం కోసం పురాణేతిహాస కథలను బౌద్ధమత ప్రచారానికి అశోకుడు స్వీకరించి ప్రదర్శింపజేసినట్లు తెలియవస్తున్నది. ఆనాటి యక్షగానాలలో సంవాదశైలి అధికం.

17వ శతాబ్ది వాడైన అప్పకవి 'అంబికా వాద' యక్షగానం రచించినట్లు తెలిసినా నేడది దొరకడం లేదు. యక్షగాన పదాలు 'సంగీత తాళ నిర్ణయమ్ము' గలవని వేంకటకవి లక్షణ శిరోమణిలో తెలిపాడు. సుగ్రీవ విజయాన్ని ఉత్సవాదులలో ప్రదర్శించియుండవచ్చునని వేటూరి ప్రభాకరశాస్త్రి పేర్కొన్నారు. ఈ యక్షగాన ప్రదర్శనకు సూత్రధారుడు ప్రధానవ్యక్తి. దక్షిణాంధ్ర వాఙ్మయంలో యక్షగానాలు విరివిగా వెలువడ్డాయి.

5. అవధానం : అష్టావధానం, శతావధానం ఆంధ్రుల సొత్తుగా చెప్పవచ్చు. తిరుపతి వేంకటకవులు, కొప్పరపు కవులు, రామకృష్ణ కవులు అవధాన జైత్రయాత్రలు చేసి ఈ విద్యను చిరస్థాయి చేశారు. రాజులు, జమీందారులు ఈ విద్యకు ప్రోత్సాహం కల్పించారు. స్పర్ధతో ఈ విద్య వృద్ధి పొందింది. 20వ శతాబ్ధి ఉత్తరార్ధంలో ఇది సంఖ్యాపరంగా వృద్ధిచెంది సహస్రావధానము, పంచ

నహస్రావధానము వరకు విస్తరించింది. అలానే నాట్యావధానము, నేత్రావధానము, గణితావధానము ఇలా బహుముఖాలుగా వెల్లివెరిసింది. ఇప్పుడు వందకు పైగా అవధానులు ఆంధ్ర రాష్ట్రాలలో ప్రదర్శనలిస్తున్నారు. నేను 1969లో కందుకూరు కళాశాలలో అధ్యాపకుడిగా అష్టావధాన ప్రదర్శనకు స్వీకారం చుట్టి పలు ప్రదర్శనలు ఇచ్చాను.

6. అచ్చతెనుగు కావ్యాలు : తెలుగు సాహిత్యంలో ఇదొక నూతన ప్రక్రియ. పాల్కురికి సోమన "బలుపొడ తోలు సీరయనును, పపసరుల్, గిలుసపారు కన్ను, వెన్నెల తల, సేదూకుత్తుకయు" అంటూ ఒక అచ్చతెనుగు పద్యం ప్రాచీనం. కంకంటి పాపరాజు రచించిన అచ్చతెనుగు రామాయణం అతి ప్రసిద్ధం. ఇటీవల పాలవర్తి శ్యామలానంద ప్రసాద్ అచ్చతెనుగులో అష్టావధానాలు ప్రదర్శిస్తున్నారు. అచ్చతెనుగు కావ్యాలకు అంతగా ప్రాచుర్యం లభించలేదు.

7. పద్యనాటక ప్రభంజనం : 20వ శతాబ్ది తొలినాళ్ళలో తెలుగునాట పద్య నాటక రచన ఉధృతంగా కొనసాగింది. తిరుపతి వెంకట కవుల పాండవోద్యోగ విజయాలు అత్యంత ప్రసిద్ధం. ఇందులో పద్యాలు – అదుగో ద్వారక, ఆలమందలవిగో" – బావా ఎప్పుడు వచ్చితీవు – ఐనను పోయి రావలెను – వంటి నాటక పద్యాలు పల్లీయుల నాలుకలపై నర్తిస్తున్నాయి. రాగయుక్తంగా పద్యాలు చదివే సాంప్రదాయం ప్రబలింది. సత్యహరిశ్చంద్ర, చిత్రనళీయం, విషాదసారంగధర వంటి నాటకాలు వెలశాయి. పల్లెల్లో ఈ ప్రదర్శనలకు ప్రాచుర్యం లభించింది.

ఈ విధంగా ఇంద్రధనుస్సు వలె తెలుగు సాహిత్య ప్రక్రియలు బహుముఖాలుగా విస్తరిల్లి ప్రపంచ సాహిత్యంలో తన స్థానాన్ని నిలుపుకొంది.

చిత్తూరు కథా సాహిత్యం

ఆచార్య ఎం.రామనాథం నాయుడు, తెలుగు శాఖాధిపతి, కర్నాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం,
ముక్త గంగోత్రి, మైసూరు -570 006. సెల్ : 87623 57996



'చిత్' అంటే మనస్సు. మంచి మనస్సుగల పండితులకు నిలయం చిత్తూరు ప్రాంతం. చిత్తూరు ప్రాంతపు ప్రజల మాట, ఆట, పాట, భాష, యాస వంటివి ప్రత్యేకంగా నిలుస్తాయి. తెలుగు, తమిళు, కన్నడ భాషల యాసలతో చిత్తూరు కథా సాహిత్యం త్రివేణి సంగమంలా అలరారుతోంది. ప్రాంతీయ జీవన విధానాన్ని చిత్రించడంలో, కథానికా వస్తువు కొత్త మలుపు తిరగడంలో చిత్తూరు కథలు ముఖ్యపాత్ర వహించాయి.

మనిషి మనిషికీ, ఇంటింటికీ, పల్లె పల్లెకూ ఒక్కొక్క కథ వుంటుంది. ఆ కథల్లో నేటి సమాజాన్ని ప్రతిబింబింప జేసే వస్తువు, వాడుక భాష ముఖ్యంగా వుంటుంది. నేటి కథకులు కొత్త జీవనంతో కూడుకుని వున్న వాస్తవికతను బహుముఖాలుగా ఆవిష్కరిస్తారు. వారు తమ ప్రాంతీయ మూలాలను సాంస్కృతిక, సామాజిక కోణాలను అత్యాధునిక కథల్లోకి తీసుకువస్తున్నారు. వస్తు పరంగానే కాకుండా రూప పరంగా కూడా అత్యాధునిక తెలుగు కథా ప్రక్రియలో కథకులు ఆర్థిక స్థితిగతులు, సంస్కృతులు, జీవన సరళి వంటి విషయాలను పాఠకుల కళ్ళకు కట్టినట్టు, వారిని ఆకట్టుకునే విధంగా వివరించే ప్రయత్నం చేస్తున్నారు.

అత్యాధునిక తెలుగు కథా సాహిత్యంలో ఎక్కువగా కథకులు వారి చుట్టూ వున్నటువంటి సామాజిక, సాంఘిక, ఆర్థిక వంటి విషయాలకు సంబంధించిన ఇతివృత్తాలను ఎంచుకోవడం జరుగుతుంది. ఆ ఇతివృత్తాలు వేటికవే వైవిధ్యభరితంగా వుంటాయి. విన్నవి, కన్నవి లేదా అనుభవంలోకి వచ్చిన విషయాల నుంచి ప్రేరణ పొందుతారు. అత్యాధునిక కథల్లో ముఖ్యంగా మానవతా వాదం, సమాజం పట్ల బాధ్యత అడుగడుగునా కనపడుతుంది. సామాజిక స్పృహతో, ప్రజల సమస్యల పట్ల అవగాహన కలిగిన వారుగా వాస్తవిక జీవితానికి అతి దగ్గరగా వున్న వస్తువును ఇతివృత్తాలుగా ఎన్నుకుని, వివిధ పాత్రలలో వైవిధ్యభరిత కథలను రచిస్తున్నారు.

నవ నాగరికతవల్ల నాటి కుటుంబ వ్యవస్థ దిగజారిపోయింది. తల్లితండ్రి, ఎనుకుముందు, వాయి వరస వంటి వాటికి విలువ లేకుండా పోయింది. నేడు భూములకు విపరీతమైన విలువ పెరగడంతో మానవీయ విలువలు అతి దారుణమయ్యాయి. నేడు చిన్న పిల్లల నుండి పెద్దవాళ్ళవరకు చరవాణితో సహవాసం. అవసరం అలాంటిది. నిదానమే లేదు. అంతా దూకుడు జీవనం. దాంతో మాటల్లేవు, ఆటల్లేవు. కాలక్షేపం లేదు. అలాగే తాగుడు సమాజంలో దురాచారమని తెలుసు. అయినా నేటి యువత మత్తుకు బానిస అవుతున్నారు. ఆరు నూరైనా నూరు ఆరైనా డబ్బు సంపాదించాలి. అందరితో పాటు జల్సాచేయాలి. కష్టపడకుండానే సుఖపడాలనే ధ్యేయంతో దేనికైనా పాలుమాలుతున్నారు. నాడు పరుల సొమ్ము పాశానంతో సమానమని భావించేవారు. నేడు డబ్బే ముఖ్యమని, దానిని ఎలాగైనా సంపాదించాలని భావిస్తున్నారు. మోసాలు దౌర్జన్యాలు ఎక్కువయ్యాయి. 'డబ్బుకు లోకం దాసోహం' అయింది.

రాయలసీమలో ఒక జిల్లాగా వున్న చిత్తూరు ప్రాంతంలో కయ్యా, కాలువ కలిగిన చిన్నపాటి సేద్యపు

కుటుంబాలు ఎక్కువ. వ్యవసాయం వీరికి ముఖ్య జీవనాధారం. వీరి పొలాల్లో కొంత మడి, కొంత చేను వుంటుంది. వర్షంపై ఆధారపడిన చిన్నకారు రైతులు వర్షాల్లేక నీటికోసం అప్పులు చేసి బోర్లు వేస్తున్నారు. దీంతో బావులు, చెరువులు ఎండిపోయాయి. పోటీపడి బోర్లు వేసినా నీటిజాడ కన్పించడం లేదు. తిండి గింజలు పండించుకోవడం కష్టమై, కుటుంబ బాధ్యత భారమై, కరువు ధాటికి తట్టుకోలేక గంజికోసం రైతుకూలీలవుతున్నారు. వలస పక్షులవుతున్నారు. ఒకప్పుడు ధనధాన్యాలతో తులతూగిన రైతు కటిక దరిద్రుడవుతున్నాడు. ఈ కోణంలో చిత్తూరు ప్రాంతంలో కథలకు వైవిధ్యభరితమైన 'వస్తువు'లు దొరుకుతున్నాయి.

రొమ్మును చీల్చి రాయలసీమ గుండెను వాస్తవంగా చూపే కథలెన్నో ఈనాడు వెలుగు చూస్తున్నాయి. రైతుల బతుకులను చిన్నాభిన్నం చేస్తున్న కల్తీ మందులు, కల్తీ విత్తనాలు వంటి వాటిని సమాజం అరికట్ట లేకపోతుంది. రైతులకు తాగునీరు, సాగునీరు లేక విలవిలలాడుతున్నారు. కరువు కాటకాలతో తమకు జన్మనిచ్చిన, తాము ప్రేమగా పెంచుకున్న, తమకు ఎంతో సహాయంగా వుండిన ఆవులను, ఎనుములను, గొర్రె, మేక, కుక్క, కోడి వంటి వాటిని మేపలేక సంతకు తోలి వచ్చినకాటికి ధార పోస్తున్నారు. మునలి ముదకను మంచాన పడేసి జీవనోపాధిని వెతుక్కుంటూ ఉండూరును వదలి వెళ్ళిపోతున్నారు. 'అరచేతిలో పుండుకు అద్దమేల' అన్నట్టు నేటి సామాజిక స్థితిగతులకు అద్దం పట్టే అత్యాధునిక కథలెన్నింటినో మన కథకులు రచించి, ఇతరులను ఆలోచింపజేస్తున్నారు.

చిత్తూరు ప్రాంతపు తొలి కథకుడుగా కె.సభా నుండి నేటి యువ కథకుల వరకు చిత్తూరు ప్రాంతపు జీవన విధానాన్ని ప్రతిఫలించే విధంగా రైతు జీవనంలోని కష్టాలను, కడగండ్లను తమ అత్యాధునిక కథల్లో చిత్రించి చిత్తూరు కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నారు.

శతాబ్దాల తరబడి వెంకటేశపెరుమాళ్ మాదేవుడని తమిళులు, తిమ్మప్ప మా ఇలవేల్పని కన్నడిగులు, గోవిందుడు అందరివాడని తెలుగువారు చిత్తూరు జిల్లాలో స్థిరపడడం అదృష్టంగా భావిస్తారు. మూడు భాషల ప్రాభవంతో మూడు ప్రాంతాల జీవన విధానం ఒక అధ్యయనంలా చిత్తూరు ప్రాంతపు అత్యాధునిక కథా సాహిత్యం సాగిపోతోంది.

అలనాటి అన్నమయ్య నుంచి నేటి అత్యాధునికుల వరకు, జానపద కథా సాహిత్యం నుంచి అత్యాధునిక కథా సాహిత్యం వరకు ప్రజల ఆధ్యాత్మిక, నైతిక, సామాజిక జీవన వైవిధ్యాన్ని చాటుతూ, భాషయాసలతో, మాండలిక పదాలతో యువకథకులు తెలుగు కథానిక పురుడు పోసుకున్న ఈ నేల మీద విభిన్నమైన అత్యాధునిక తెలుగు కథా సాహిత్యాన్ని సృష్టిస్తున్నారు.

నాటి చిత్తూరు కథా సాహిత్యాన్ని పరిశీలిస్తే 'వ్యవసాయం' ప్రధానంగా అగ్రకులాల అధీనంలో వుండేది. నాడు బావుల నుండి కపిల బానలతో, యాతంతో నీళ్ళు తోడేవాళ్ళు. చెరువులలో తూముకు నీళ్ళు అందకపోతే 'గూడ' వేసి తమ పంటలను పండించుకునే వాళ్ళు. అయితే రెండు మూడేళ్ళకొకసారి కరువు కాటేస్తున్నప్పటికీ ప్రజలు నిశ్శబ్దంగా కరువు కాటకాలను అనుభవించేవాళ్ళు. అయితే ఆనాడు ఒకరిపై ఒకరికి కసి, కక్షలు ఎక్కువగా వుండేవి. దాంతో వర్గాలుగా విడిపోయి ఒక వర్గంపై మరోవర్గం దాడిచేసి కసి తీరా నరుక్కునేవాళ్ళు. అగ్ర కులాలకు పేదకులాలు బలై, భయం భయంగా అణగిమణగి జీవనం సాగించేవాళ్ళు.

జనపదాలలో గుడిసెలు, అడ్డపిండ్లలో జీవనం సాగించే పేదలు భత్యం లేక ఏ పూటకాపూట అంగళ్ళలో

ఉప్పు, మిరపకాయలు వంటి వాటిని కూడా అప్పు తెచ్చుకునేవాళ్ళు. అయితే అప్పుతీర్చే వరకు అంగడివాడు భత్యం ఇవ్వకపోతే డబ్బున్న ఆసామి దగ్గరి కెళ్ళి అప్పు అడిగితే ఏముందరా నీదగ్గర నాబొంద అప్పు ఇవ్వడానికి అని గదమాయిస్తూ నగ, నట్ర, భూమి, తోట వంటివి కుదువ బెట్టమని చెప్పి తెల్ల కాగితాల మీద వేలిముద్రలు వేయించుకునేవారు. కాయకష్టం చేసేపేదలు ఈ బాధలను భరించలేక, సంసారాన్ని సాకలేక చెడు వ్యసనాల బారిన పడి తాను కట్టిన తాళిని కూడా తెంపుకెళ్ళి తాకట్టుపెట్టే ప్రబుద్ధులు కూడా వున్నారు. ఇంకొంతమంది తాము సంపాదించుకున్న గొర్రె, మేక, ఆవు, దూడ, చెట్టు చేమలను అవసరాలకు భూస్వాములకమ్మి వాటిని వాళ్ళ ఇంటి దగ్గరే మేపుతూ జీతగాళ్ళుగా తమ జీవితాన్ని కొనసాగించేవాళ్ళు. దీనికంతటికీ కారణం పేదరికం, నిరక్షరాస్యత.

ఒకనాడు రాయలసీమ రతనాలసీమ. ఇప్పుడు రాళ్ళసీమ, కరువు సీమ. "పేరు గొప్ప ఊరుదిబ్బ" అన్నట్టు తిండిలేదు, గంజిలేదు అంటూ వాపోతున్నారు. ఒకప్పుడు బాగా బతికిన చిత్తూరు ప్రాంతపు ప్రజలు నేడు పేదరికంతో, ఆకలిమంటలతో అలమటిస్తున్నారు. "బతికుంటే బలిశాకు తిని బతకొచ్చు, ఊపిరుంటే ఉప్పమ్ముకుని బతకొచ్చు" అంటూ చెరువుల్లోని గొడి గడ్డలు, ఈతకాయలు, కలబందమట్ట, నాగదేరు కాయలు, ఊడక్కాయలు, వెలక్కాయలు, నెల్లికాయలు వంటివి కాలానికి తగినట్టు ఏవి దొరికితే అవి తిని బతుకు జీవుడా అంటూ దుర్భర జీవితాన్ని సాగిస్తున్నారు.

ఒకప్పుడు నిరంతరం గలగల పారే ఏరులు నేడు కరువయ్యాయి. చెరువులు నీళ్ళులేక వెలవెలబోతున్నాయి. పాడు పడిన బావులు, పంటలు లేని బీడు భూములు, ఎండిన చెట్లు, ఎర్రటి ఎండలు, బక్క చిక్కిన రైతులు, చైతన్యం లేని యువత చిత్తూరు ప్రాంతంలో కళ్ళకు కట్టినట్టు కనిపిస్తాయి. ఒకటి రెండు సమస్యలైతే తట్టుకోగల శక్తి వుంటుంది కాని నీరు, విద్యుత్తు, చదువు, ఉద్యోగ, ఆహార, ఫ్యాక్షన్, భూస్వామ్య, కూలీల, దోపిడీ, కులాధిపత్యం, అస్తివంటి సమస్యలనేకం. వీటితో చిత్తూరు ప్రాంతపు జనులు అతలాకుతలం అవుతున్నారు.

చిత్తూరు ప్రాంతపు సమస్యలను చూచిన వినిన ఎంతోమంది సాహితీవేత్తలు అత్యాధునిక వస్తువులను ఎన్నుకుని తమకు తోచిన విధంగా, విభిన్న శైలితో వివిధ రకాలుగా ఉత్తమ కథలను పాఠకలోకానికి అందిస్తున్నారు. ఇవి సమకాలీన సమాజానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలకు వర్తించేవిగా వున్నాయి. అలాగే సమాజంలోని బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారి ఎత్తు పల్లాలను నేరుగా చూపించినవి అత్యాధునిక కథలు. ఈ కథలు నిర్మాణంలోనూ, ఇతివృత్తంలోనూ, పాత్రచిత్రణలోనూ ఎంతో నేర్పరితనం, నాణ్యత కలిగి వున్నాయి. చిత్తూరు కథకులు రచించిన అత్యాధునిక కథలన్నింటిలో ఇతివృత్తం ఏదో ఒక సామాజికాంశంతో ముడిపడి వుంటుంది. వారి హృదయాలలోంచి జాలువారిన అక్షర సత్యాలు కాబట్టి చిత్తూరు కథలన్నీ ఆసక్తిగా చదివిస్తాయి. ఆలోచనలు రేకెత్తిస్తాయి. మనస్సును కుదిపేస్తాయి. అత్యాధునిక తెలుగు కథలు సమాజంలోని లోటుపాట్ల గురించి తెలపడం వాటిని రూపుమాపడం కోసం అంతరించినవి. వీటిలో స్త్రీ, పురుషుల మధ్యగల సంబంధాలు, హరించుకుపోతున్న నైతిక విలువలు, బడుగు బలహీనవర్గాల చిత్రణ, స్త్రీల మానసిక స్థితి, నవనాగరికత పేరుతో విచ్చల విడిగా పెరిగిపోతున్న నీలిచిత్రాల జోరు, తల్లీ బిడ్డల మమకార స్థితుల వంటి విభిన్న అంశాలు, సంఘటనలు కేంద్రంగా మలచబడ్డాయి.

చిత్తూరు ప్రాంతంలో కులాచారాన్ని నమ్ముకుని బతుకులీడుస్తున్న సంచారజాతులైన నక్కలోళ్ళు,

మొండోళ్ళు, దొమ్మరోళ్ళు, ఇర్లోళ్ళవంటి వారి గురించి వైవిధ్యంతో కూడిన అత్యాధునిక కథలను యువకథా రచయితలు రాసి, సమాజంలో మార్పును తీసుకురావడానికి ఎంతో కృషి చేస్తున్నారు.

అత్యాధునిక కథ సమకాలీన సామాజిక స్థితిగతులను కళ్ళకు కట్టినట్టు చిత్రిస్తుంది. ఈ కథలకు వస్తువు సమకాలీన సమాజమే. భాష సరళంగాను, విషయం సమకాలీనమైనదిగాను వుండడం వల్ల కథ పాఠకుని హృదయానికి బాగా హత్తుకుపోతుంది. కథల్లో సృష్టించిన పాత్రలు వాస్తవిక దృక్పథాన్ని చాటుతాయి. అలాగే కథా ఇతివృత్తానికి తగినట్టుగా పాత్రలు ఇమిడిపోతాయి. అత్యాధునిక కథల్లో సామాజిక వాస్తవికతను దర్శించవచ్చు.

ప్రపంచీకరణ, సబళీకరణ, ప్రైవేటీకరణల నేపథ్యంలో మానవజీవితంలోని ఏకోణానైనా అత్యాధునిక కథకు వస్తువుగా నేటి కథారచయితలు స్వీకరిస్తున్నారు. వర్తమాన జీవితానికి సంబంధించిన మానవుని ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు బలహీనతలు, వైఫల్యాలు మొదలైన విషయాల నన్నింటినీ అత్యాధునిక కథా ప్రక్రియ ప్రతిబింబింపజేస్తూ వుంది. అలాగే సమాజం నిరంతరం మార్పు చెందుతూ వుంటుంది. సమస్యలు కూడా వివిధ రకాలుగా మారి, ఎదురవడంతో మానవుని ప్రవర్తనలో అమితమైన తేడా కనిపిస్తుంది. విభిన్న సమస్యలకు పరిష్కారాలను వెతకటం, మానవీయ విలువలను గుర్తించడంలో ఎన్నో మార్పులు జరిగి అత్యాధునిక కథలకు సరికొత్త వస్తువులుగా లభించడం గమనించవచ్చు.

అత్యాధునిక సమాజంలో విభిన్నమైన, వైవిధ్యమైన కథా వస్తువులను ఎన్నుకుని, తమ తమ కథలలో వివిధ పాత్రలను సమాజానికి దగ్గరగా తమ శిల్ప నైపుణ్యంతో మలచి, ఆ పాత్రల ద్వారా సమాజంలో మార్పు తీసుకురావాలని చిత్తూరు ప్రాంతపు కథా రచయితలు ప్రయత్నిస్తున్నారు. అలాంటి కథారచయితల కథలను పాఠకులు అనక్తిగా చదువుచున్నారు. ఆ కథల్లోని కొన్ని విషయాలు వారి హృదయాలకు హత్తుకునిపోయి, వారిలో వివిధ రకాల ఆలోచనలు రేకెత్తించి కన్నీళ్ళు పెట్టిస్తాయి. మనసును కుదిపేస్తాయి. ఆ కుదుపులో సమాజంలో మార్పు అనివార్యమవుతుంది.

అత్యుత్తమ కథను చదవడానికి పట్టే సమయం కన్నా చదివిన తర్వాత పాఠకుడిని ఆలోచింపజేసే సమయమే ఎక్కువ. మంచి కథలు ఎక్కువ మందిని ప్రభావితం చేయడమే కాక చాలామంది జీవితాలకు అద్దం పట్టడం కథానిక యొక్క ముఖ్య లక్ష్యం. లక్షణం కూడా. అందుకే మానవుని జీవితంలో సంక్లిష్టత పెరిగే కొద్దీ అత్యాధునిక కథా వస్తువులో వైవిధ్యం పెరుగుతోంది.

నేడు వస్తువు వైవిధ్యంతోపాటు అత్యాధునిక కథల విస్తృతికూడా పెరిగింది. అత్యాధునిక చిత్తూరు కథా సాహిత్యం అన్ని వాదాల, అన్ని వర్గాల, అన్ని ప్రాంతాల వాళ్ళు సృష్టిస్తున్నారు. తమతమ ప్రాంతాల, వర్గాల ప్రజల జీవితాలకు దర్పణం పట్టడానికి 'కథ' ఎంతో వుపయోగ పడుతూవుంది. విషయ వైవిధ్యంతో ఆవిర్భవిస్తున్న అత్యాధునిక కథ వ్యావహారిక భాషతోపాటు వివిధ మాండలిక పదాలను వెలుగులోకి తెస్తున్నారు. "కాదేది కవిత కనర్హం" అని శ్రీశ్రీగారు అన్నట్టుగానే "కాదేది కథ కనర్హం" అని నేటి చిత్తూరు యువ కథా రచయితలు అంటున్నారు.

తెలుగు కథ ఆవిర్భావంలోనే సమాజంలోని సమస్యలపై దృష్టి సారించింది. తక్కువ పరిణామంతో ఎక్కువ ప్రభావాన్ని చూపే కథా ప్రక్రియ మానవజీవన సంబంధమైన అంశాలనన్నింటినీ స్వీకరించడం గొప్పవిషయం. ఈ పరిజ్ఞానంతోనే చిత్తూరు కథా రచయితలు వైవిధ్యంతో కూడిన విషయాలను వస్తువులుగా గ్రహించి చక్కటి కథలను రచించారు. నేటికీ రచిస్తున్నారు. వీరి అత్యాధునిక కథలు

మానవత్వపు విలువలతోకూడి మణిదీపాలుగా వెలుగు తున్నాయి.

నేడు ప్రాంతీయ పరమైన విభిన్నమైన కథాంశాలతో వెలువడుతున్న అత్యాధునిక కథలు విశిష్టతను సంతరించుకున్నాయి. ప్రాంతీయత జిల్లాల వరకు పాకి ఆయా జిల్లాల స్థాయిలో జిల్లా రచయిత సంఘాలు, సాహిత్య సంస్థలు ఆయా జిల్లాల కథా రచయితలచేత అత్యాధునిక ఉత్తమ కథలను రాయించి, కథా సంపుటాలుగా గ్రంథస్థం చేసి పాఠకలోకానికి అందుబాటులో వుంచుతున్నారు.

తెలుగు సాహిత్యంలో కథా ప్రక్రియ ఎంతో విస్తృతిని సాధించినప్పటికీ, నేటి కథారచయితలు వర్గాలుగా విడిపోయి శత్రువులుగా రూపాంతరం చెందటం బాధాకరం. కథకు వివక్షత ఎలా వుండకూడదో కథా రచయితలకు సైతం వివక్షత వారి దరి చేరకూడదు. లేదంటే తెలుగు కథా ప్రక్రియ కలుషితమయ్యే ప్రమాదం వుంది.

పత్రికలు మొదటి నుంచి తెలుగు కథలకు ఆధారం. పత్రికలలో వచ్చే కథల జీవితం చాలా తక్కువ. కాబట్టి చిత్తూరు కథలకు శాశ్వతత్వం కల్పించాలంటే వివిధ రచయితలు రాసిన కథలను సంపుటాలుగా, సంకలనాలుగా వెలువరించాలి. ప్రముఖ సాహితీ సంస్థలు ఉత్తమ కథా రచయితల అత్యాధునిక కథలను సంపుటాలుగా ముద్రించి ప్రజలలో కథల పట్ల ఆసక్తిని పెంపొందింపజేయాలి. సమాజంలో మార్పురావడానికి ప్రయత్నించాలి. పరిశోధకులు అత్యాధునిక కథా సాహిత్యంపై విశేషంగా పరిశోధనలు జరపాలి.

ఆధార గ్రంథాలు :

1. ఆధునిక కథా రచయితలు, 1982, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు.
2. తెలుగు సాహిత్య సమీక్ష, 1985, నాగయ్య.జి, నవ్యపరిశోధక ప్రచురణ, తిరుపతి.
3. తెలుగు కథానిక, 2012, రాంబాబు వేదగిరి, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.
4. వాఙ్మయి, 1998, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.
5. చిత్తూరు కథ, 2014, బాలసుబ్రమణ్యం, పేరూరు, తెలుగు భాషోద్యమ సమితి, తిరుపతి.
6. తెలుగు కథానికలు, ఎం.ఎ. తెలుగు పాఠాలు, కర్నాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, మైసూరు.

****

మాండలిక కథా సాహిత్యం

డా॥ కొమ్మనబోయిన సుజాత, తెలుగు అధ్యాపకులు , టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కందుకూరు.
సెల్ : 6301787798

"కథలంటే పైపైని వున్నాయనుకున్నావేమో! అవి కల్పించడానికి చాలా ప్రతిభ ఉండాలి. వాటి విలువ తెలునుకోడానికెంతో పరిజ్ఞానం ఉండాలి. అవి చెప్పడానికెంతో నేర్పుండాలి. అవి వినడానికెంతో రుచి ఉండాలి. అవి బోధపరుచుకోవడానికెంతో బుద్ధి సూక్ష్మత ఉండాలి. కథలు వెలుగిస్తాయి. బుద్దికి పదునుపెడతాయి. మనస్సుకి ఉత్సాహము, ఉల్లాసమూ కలిగిస్తాయి." ఇవి కథను గురించి శ్రీపాద సుబ్రహ్మణ్యశర్మగారి మాటలు.

మనిషి పుట్టినప్పుడే కథలు పుట్టాయి. మనిషితోపాటే కథలు పెరిగాయి. కాబట్టి మానవ జీవితంలో కథకున్న వయస్సు మానవుడి వయస్సంత. కథ చెప్పడం అత్యంత ప్రాచీనమైన పురాతనమైన కళ అని చెప్పొచ్చు. బహుశా పాటకంటే కూడా ముందు పుట్టిన కళ కావచ్చు. కథలు వినాలి, కథలు చెప్పాలి అనే కోరిక మానవునిలో సహజంగా ఉండే లక్షణం. కథలన్నీ కూడా జీవితంలోంచే పుడతాయి. ప్రతి మనిషి జీవితం ఒక కథే. జీవితం అనేక మలుపులు తిరిగినట్టే కథ కూడా అనే మలుపులు తిరుగుతుంది. జీవితంలో జరిగే రోజువారి సంఘటనలెన్నో కథలుగా మలచబడ్డాయి. వీటికి మంత్రాలు, మహిమలు, అద్భుత శక్తులు తోడయితే అతి పాతకథ. వాస్తవ జీవితాన్ని ఆసక్తికరంగా చిత్రిస్తే అది కొత్త కథ.

జంతు ప్రతీకలనుంచి అద్భుతాలు, మహిమలనుంచి, ఆంగ్ల సాహిత్యం ప్రభావంతో నేరుగా సమాజంలోకి వచ్చిన నేటి ఆధునిక కథకూడా శిల్పపరంగా కొత్తది కావచ్చునేమో కాని కథా కథనం దృష్ట్యా మాత్రం పాతదే.

తెలుగు కథ పుట్టు పూర్వోత్తరాలను పరిశీలించే ముందు మనకు గుర్తుకు వచ్చేది ఈగ కథే. లేదా అనగనగా ఏడుగురు రాజు బిడ్డల కథ. కథలు చెప్పే విద్యలో మన తెలుగువాళ్లు బాగా ఆరితేరినవాళ్ళు. ఎవరికి ఏమాత్రం తీసిపోనివాళ్ళు అనడంలో ఎలాంటి సందేహంలేదు. అంతర్జాతీయంగా కూడా పోటీకి నిలవగల కథా సాహిత్యం మన తెలుగులో ఉన్నందుకు తెలుగు వారిగా మనం గర్వపడాలి.

తమ మేధాశక్తితో, కల్పనా చాతుర్యంతో సృష్టించిన కథలెన్నో ఇప్పటికీ సజీవంగా ఉన్నాయి. ప్రజల నాలుకలమీద నాట్యమాడుతున్నాయి. మరీ ముఖ్యంగా అమ్మల, అమ్మమ్మల, నాన్నమ్మల నాలుకలమీద వయ్యారాలు పోయిన తెలుగు కథ ఒక్కసారిగా వందల సంవత్సరాలు ముందడుగు వేసి గురజాడ వారితో కరచాలనం చేసింది. ఎన్నో దిద్దుబాట్లు చేసుకుంది, వైవిధ్యాన్ని సంతరించుకుంది. సందేశాత్మకంగా సాగింది. కొత్త పోకళ్ళతో సరికొత్త వాకిళ్ళు తెరిచింది.

అటువంటి కొత్త పోకళ్ళలో ఒకటి మాండలిక భాషలో కథలు రాయబడటం. ఈ విషయంలో కూడా గురజాడవారు మార్గదర్శనం చేశారు.

నేడు తెలుగు కథ అనంత ముఖాలుగా వికసించింది. ఆధునిక సమాజంలోని భావాలన్నీ తెలుగు కథలో ప్రతిఫలించాయి. సమాజంలోని ప్రతి సమస్యని తెలుగు కథ స్పృశించింది. అస్తిత్వవాద ధోరణి, చైతన్య స్రవంతి విధానం వంటి ఆధునిక సాహిత్య ధోరణులు తెలుగు కథలో విస్తరించాయి. తెలుగు కథ శిల్పపరంగా కూడా ఎంతో వైవిధ్యాన్ని సంతరించుకుంది.

తెలుగు కథలో ప్రస్తుతం కనిపిస్తున్న ప్రధానమైన మార్పు మాండలిక భాషలో రచింపబడటం, రచయితలు వారి వారి మాండలికాల్లోని సొగసు, సౌందర్యాలను కథల్లో చొప్పించి, భద్రపరిచి తెలుగువారి కందించడం తెలుగు

భాష పరిరక్షణపరంగా కూడా చాలా సంతోషించదగ్గ విషయం. ఇవాళ పాఠకులు కూడా అన్ని రకాల మాండలికాలను చదువుకోవడంలో ఆసక్తి చూపుతున్నారు.

ఒక మాండలికాన్నో, ఒక స్థలాన్నో, ఒక ప్రాంతాన్నో లేక ఒక వ్యక్తినో ప్రధానంగా చేసుకుని వచ్చిన సాహిత్యం తెలుగులో ముని మాణిక్యం కాంతం కథలు, సత్యం శంకరమంచి – అమరావతి కథలు, పి. రామకృష్ణారెడ్డి – పెన్నేటి కథలు, మా గోఖలే కథలు, వంశీ పసలపూడి కథలు, భానుమతి రామకృష్ణ – అత్తగారి కథలు, మా వేములవాడ కథలు, శిష్లా ఉమామహేశ్వరరావు సిపాయి కథలు, బి.వి.ఎస్. రామారావు రచించిన గోదావరి కథలు, నామిని సుబ్రమణ్యం నాయుడు రచించిన పచ్చనాకు సాక్షిగా, సినబ్బ కతలు, మిట్టూరోడి కతలు మొ॥న కథలు. ఖదీర్ బాబు – దర్గామిట్ట కతలు, పోలేరమ్మ బండ కతలు, సోమరాజు సుశీల ఇల్లేరమ్మ కథలు, సం.వె. రమేష్ – ప్రళయ కావేరి కతలు, గోపిని కరుణాకర్ – దీపం చెప్పిన కతలు, మా తిరుపతి కొండ కథలు, పెద్దింటి అశోక్ కుమార్ – మా వూరి భాగోతం కతలు, నక్కా విజయరామరాజు భట్టిప్రోలు కథలు, మావూరి కథలు, వి.ఆర్. రాసాని రచించిన మావూరి కథలు.

ఇవేకాక సీమ కథలు, వంశధార కథలు, నాగావళి కథలు, బత్తుల ప్రసాద్ సగిలేటి కథలు మొదలగునవన్నీ ఒక ప్రదేశాన్నో ఒక మాండలికాన్నో లేదా రచయిత వ్యక్తిగత జీవితాన్నో ఆధారం చేసికొని వచ్చిన కథా సాహిత్యమే.

పై చెప్పబడిన కథలన్నీ దాదాపు రూపపరంగా చూసినట్లయితే ఆయా మాండలికాల్లోనూ, వస్తుపరంగా చూసినట్లయితే రచయితలు తమ వ్యక్తిగత జీవితంలోని సంఘటనలనే కథల రూపంలో మలచబడిన కథా సాహిత్యమే.

మాండలికం అనేది ఒక ప్రాంత ప్రజల జీవద్భాష. ఇది నిజమైన ప్రజా భాష. తెలుగు మాండలికాలను పరిరక్షించుకోవడం అనేది ఒక విధంగా తెలుగు భాషను పరిరక్షించుకోవడమే.

అనువాదంతో ప్రారంభమైన తెలుగు సాహిత్యంలో ప్రాచీనకాలంనుండి అనేక మాండలిక పదాలను తెలుగు కవులు ప్రయోగిస్తూ వచ్చారు. తెలుగు ప్రజల పలుకుబళ్ళను, జన వ్యవహారంలో ఉన్న కొన్న మాండలిక పదాలను మహాభారత రచనలో వాడి మొట్టమొదటి అభివృద్ధికాముడయ్యాడు తిక్కన. ద్విపదలోనూ, దేశ ఛందస్సులోనూ రచనలు చేసిన కవులు ఆయా ప్రాంతాల్లో వ్యవహారంలో ఉన్న తెలుగు మాండలికాలను తమ రచనల్లో విరివిగా ప్రయోగించారు. తెలుగు మాటలను వేదాలతో సమానంగా చూడమని చెప్పాడు పాల్కురికి. అన్నమయ్య తన కీర్తనల్లో ఎన్నో మాండలిక పదాలను, అచ్చమైన తెలుగు పదాలను వాడాడు. మరీ ముఖ్యంగా జానపద గేయాల్లో.

ఆనాడు సంస్కృత భాషపై ఉన్న మోజు, ఈనాడు ఆంగ్లభాషపై ఉన్న మోజు తెలుగు భాషకి తీరని అన్యాయాన్ని చేసింది. నిజమైన తెలుగు భాషను కాపాడుకోవడానికి మనకు మిగిలివున్న ఏకైక మార్గం మాండలిక భాష పరిరక్షణే. తెలుగు పద సంపద సుసంపన్నం కావడానికి దోహదం చేసేది మాండలిక రచనలే.

గ్రాంధిక భాషపై వ్యావహారిక భాషావాదం విజయాన్ని సాధిస్తే, వ్యావహారిక భాషావాదం అమలులోకొచ్చిన కారణాన అనేక సాహిత్య ప్రక్రియల్లో క్రమంగా మాండలిక భాషా ప్రయోగం జరిగి తెలుగు భాష పరిపుష్టం అయింది. ముఖ్యంగా గ్రామీణ నేపథ్యంలో రాయబడిన లేదా అట్టడుగు వర్గాల జీవితాల్ని చిత్రించిన కథల్లో మాండలిక రచనలు విరివిగా అన్ని ప్రాంతాలనుండి వచ్చాయి. మొదట మాండలిక కథలకి పెద్దగా ఆదరణ లభించక పోయినప్పటికీ క్రమంగా మాండలిక కథలకి ఆదరణ పెరగడమే కాక

ఇతర సాహిత్య ప్రక్రియల్లో కూడా మాండలిక భాష ప్రవేశించి మాండలిక రచన పరిధి విస్తృతమైంది. కొందరు మాండలిక రచనలు సరిగ్గా అర్థంకావు అనే భావనతో ఈ విధమైన రచనలపట్ల నిరాసక్తత చూపేవారు ఉన్నారు. మాండలిక రచనల పట్ల ఆసక్తి లేనివారికి సైతం ఆసక్తి కలిగేలా, ఆకట్టుకునే విధంగా మాండలికంలో రచనలు చేసిన నామిని వంటి రచయితలెందరో మాండలిక కథా గౌరవాన్ని పెంచారు. ఈ మాండలిక కథా రచయితల్లో కొందరు పాక్షికంగా సంభాషణల్లో మాండలిక భాషా ప్రయోగం చేస్తే నామినిలాంటి మరికొందరు పూర్తి స్థాయిలో కథనంతటిని మాండలికంలో రాశారు.

ఇవాళ సంతోషించదగ్గ మార్పు ఏమిటంటే ఆయా మాండలికాల్లో ఉన్న మాధుర్యాన్ని గుర్తించి విలువనివ్వడం, ఒకప్పుడు ప్రామాణికంలో మాట్లాడితేనే, రచనలు చేస్తేనే విలువ. ఇవాళ ఆ పరిస్థితులు క్రమంగా మారుతున్నాయి.

ఈ మాండలికం అనేది ప్రాంతాల వారీగా విభజన చేసినపుడు ప్రధానంగా నాలుగు బేధాలే అయినా అందులో కూడా ఎన్నో బేధాలున్నాయి. ఏ జిల్లాకున్న మాండలిక బేధాలు ఆ జిల్లాకున్నాయి. బ్రాహ్మణ మాండలికం, అట్టడుగు వర్గాల మాండలికం, అగ్రవర్ణాల మాండలికం, కులవృత్తుల మాండలికం, చుదువుకున్నవారి మాండలికం, చదువుకోనివారి మాండలికం, గ్రామీణ మాండలికం ఈ విధంగా ఎన్నో బేధాలున్నాయి.

మాండలిక భాషల పరిరక్షణలో తెలుగు కథా సాహిత్యం చేసిన సేవ మరే సాహిత్య ప్రక్రియ చేయలేదు. కథలెప్పుడూ ఉంటాయి. కథలకెప్పుడూ ఆదరణ ఉంటుంది. అయితే ఇప్పుడు విస్తృతంగా మాండలిక కథా రచన జరుగుతుంది. కనుక ప్రస్తుతం మాండలిక కథాయుగం నడుస్తుందని చెప్పవచ్చు. తెలంగాణా మాండలికంలో సురవరం ప్రతాపరెడ్డి, వట్టికోట ఆళ్వారుస్వామి, దాశరథి రంగాచార్య, జి. సురమౌళి, ఇరివెంటి కృష్ణమూర్తి, పి. యశోదారెడ్డి, అల్లం రాజయ్య, బి.ఎస్. రాములు, బోయ జంగయ్య, కాలువ మల్లయ్య, జాతశ్రీ, గొరుసు జగదీశ్వరరెడ్డి, కయితకాల పోశెట్టి, పెద్దింటి అశోక్ కుమార్, సాహు, దేవరాజు మహరాజు, జింబో, జాజుల గౌరి, అల్లం వంశీ మొదలగు కథకులెందరో మంచి రచనలు చేశారు. తెలంగాణా మాండలికాన్ని తమ కథలద్వారా భద్రం చేశారు.

రాయలసీమ మాండలికంలో కరుణ కుమార, మధురాంతకం రాజారాం, పులికంటి కృష్ణారెడ్డి, పి. రామకృష్ణారెడ్డి, మధురాంతకం మహేంద్ర, నామిని సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, నాగప్పగారి సుందరరాజు, సింగమనేని నారాయణ, ఆర్.ఎమ్. ఉమామహేశ్వరరావు, సుంకోజి దేవేంద్రాచారి, గోపిని కరుణాకర్, చిలుకూరి దేవపుత్ర, వి.ఆర్. రాసాని, ఇనయతుల్లా, పినాకపాణి, గుత్తి చంద్రశేఖర రెడ్డి, మొదలగు కథకులెందరో రాయలసీమ మాండలికంలో కథలు రచించారు. పూర్తిగా మాండలిక భాషలో కాకపోయినా నెల్లూరుజిల్లా మాండలిక పదాలను విరివిగా వాడిన రచయిత కరుణ కుమార, మధురాంతకం రాజారాం, పులికంటి కృష్ణారెడ్డి, నామిని, గోపిని కరుణాకర్, మొదలగు కథకులు చక్కని చిత్తూరు మాండలికం ప్రయోగించారు. పి. రామకృష్ణారెడ్డి, పెన్నేటి కథలు, సం.వె. రమేష్ ప్రళయ కావేరి కతలు, నెల్లూరుజిల్లా మాండలికంలో రాయబడినవి. ఇనయతుల్లా కథల్లో కర్నూలు మాండలికం కనిపిస్తుంది.

కళింగాంధ్ర మాండలికంలో గురజాడ, రావిశాస్త్రి, కాళీపట్నం రామారావు, కె.ఎన్.వై పతంజలి, చాసో, అట్టాడ అప్పల్నాయుడు, బమ్మిడి జగదీశ్వరరావు, గంటేడ గౌరునాయుడు మొదలగు వారు చక్కటి మాండలికంలో కథా రచన చేశారు. వీరిలో కూడా రావిశాస్త్రి, కాళీపట్నం, పతంజలి రచనల్లో విశాఖ మాండలికం కనిపిస్తుంది. అట్టాడ అప్పల్నాయుడు, బమ్మిడి జగదీశ్వరరావు, గంటేడ గౌరునాయుడు, భూషణం మొదలగువారు శ్రీకాకుళం

మాండలికం, గురజాడ, చాసో మొదలగు వారు విజయనగరం మాండలికంలోను రచనలు చేశారు.

గోదావరి మాండలికంలో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, భమడిపాటి కామేశ్వరరావు, మొక్కపాటి నరసింహ శాస్త్రి, ముళ్ళపూడి వెంకట రమణ పోరంకి దక్షిణామూర్తి, బి.వి.ఎల్. రామారావు, వంశీ మొదలగు కథకులు మంచి కథలు రాశారు.

పోరంకి దక్షిణామూర్తిగారు, ఒక్క గోదావరి మాండలికాన్నే కాక ఇతర మాండలికాలను కూడా తన కథల్లో రాశారు. ఏడు పాయల దొరసాని, తోడు, చలిపాటు మొదలగు కథలను తెలంగాణా మాండలికంలోనూ, నీడ మొదలగు కథలను విశాఖ మాండలికంలోను రచించారు.

కృష్ణా మాండలికంలో మల్లాది రామకృష్ణ శాస్త్రి, గుంటూరు మాండలికంలో మా గోఖలే అనేక కథలు రచించారు. శంకరమంచి సత్యం గుంటూరు శిష్ట మాండలికంలో అమరావతి కథలు రచించారు. నక్కా విజయరాజు భట్టిప్రోలు కథలు, మావూరి కథలు, కలేకూరి ప్రసాద్ మల్లెతీత మొదలగు కథలు గుంటూరు మాండలికంలో రాయబడిన కథలు.

మాండలిక కథాసాహిత్యం పుణ్యమా అని మన తెలుగు కథల్లో అన్ని ప్రాంతాలవారివి, వృత్తుల వారివి, అన్ని అంతస్థుల వారివి, ఎన్నో తరహాల పదజాలాలున్నాయి. అవన్నీ మన తెలుగు భాషని సుసంపన్నం చేస్తాయి. మనకు తెలియని తెలుగు పదాలనెన్నింటినో మనం తెలుసు కుంటున్నాం. తెలుగు పదకోశానికి అందని, అందులో నిక్షిప్తం కాబడని ఎన్నో తెలుగు మాటలు, పదాలను మాండలిక రచనల పుణ్యమా అని మనం తెలుసు కుంటున్నాం.

ఉదా : ఎనుములు, బర్రెలు, గేదెలు, సొమ్ములు, లిబ్బి, గనిమ, యాసండం, కయ్యాగాలవ, కయ్య, చేను, పొలం, మడిచెక్క, చెలక, పైసలు, దుడ్లు, రూకలు, డబ్బులు, మద్దిస్తం, పంచాది, మత్తేపు, గోజారు, సలీసు, పరస, పశువుల సంత, జరంత, రొవంత, కొంచెం, యారాలు, యాదికి రావడం, లగెత్తు, ఉరకడం, దౌడు, పారొచ్చెయడం మొదలగు ఎన్నో పదాలను అన్ని ప్రాంతాల వాళ్లు తెలుసుకోగలుగుతున్నారు. వీటిని గమనించినప్పుడు కొన్ని పదాలు సర్వత్రా అన్ని ప్రాంతాల్లోను వాడుకలో ఉన్నట్లు తెలుస్తుంది. ఉదా : బువ్వ, కూడు, మూకుడు, కోక, రైక, పొంత, చట్టి, మొదలైనవి.

తెలుగు భాషలోని పద సంపద మరుగున పడిపోదు, కనుమరుగవదు అనే ధైర్యాన్నిస్తుంది మాండలిక కథా సాహిత్యం. కొందరు మాండలిక కథా రచయితలు మూల్లాలోకి వెళ్ళి ఆయా మాండలిక పదాలనెన్నిటినో తోడితెచ్చి కథల్లో ప్రయోగిస్తున్నారు. ఆవిధంగా మాండలిక కథా రచయితలు సాహిత్యపరంగా కాదు, భాషాపరంగా కూడా గొప్ప సేవ చేస్తున్నారని చెప్పొచ్చు. కథ చివర్లో కొన్ని ముఖ్యమైన మాండలిక పదాలకు అర్థాలను తెలియచేసి నట్లయితే పాఠకులకు కథను అర్థం చేసుకోవడంలో మరింత సౌలభ్యం ఏర్పడుతుంది.

రంగనాయకమ్మ నవలల్లో స్త్రీ పాత్రలు

డా॥ చిలకా అనిత, కెఆర్కె ప్రభుత్వ డిగ్రీ కళాశాల – అద్దంకి.

రంగనాయకమ్మ సుప్రసిద్ధ మార్క్సిస్టు రచయిత్రి, విమర్శకురాలు. ఈమె రచనల్లో రామాయణాన్ని మార్క్సిస్టు దృక్పథంతో విమర్శిస్తూ రాసిన "రామాయణ విషవృక్షం", ప్రస్తుత కుటుంబవ్యవస్థలోని అసమానత్వాలని ఎండగడుతూ రాసిన "జానకీ విముక్తి", "కళ్ళు తెరిచిన సీత", "నీడతో యుద్ధం", "వాళ్లిద్దరూ అంతేనా?", "చుట్టాలు" వంటి నవలలూ, 5 నవలికలూ, 50కి పైగా కథలూ సంపుటాలుగా వెలువడ్డాయి."కాపిటల్ పరిచయం", "పిల్లలకోసం ఆర్థికశాస్త్రం", "తత్వశాస్త్రం–చిన్న పరిచయం", "చైనాలో ఏం జరుగుతోంది?", "సోవియెట్ రష్యాలో ఏం జరిగింది?", "కమ్యూనిస్ట్ పార్టీ మానిఫెస్టో", వంటి మార్క్సిస్టు సిద్ధాంత గ్రంధాలను తెలుగు పాఠకులకు సులభశైలిలో అందిస్తూ ప్రశంసనీయమైన కృషి చేస్తున్నారు. వైవిధ్యంగల తెలుగు రచయిత్రులలో రంగనాయకమ్మ అగ్రగణ్యులు. తెలుగు భాష నుంచి మార్క్సిజం దాకా, సినిమా విమర్శల నుంచి నవలల దాకా రచల్లో బహుముఖ ప్రజ్ఞ ఆమె సొంతం. ఆమె భావాల్లోని స్పష్టత, అద్భుతమైన భావ వ్యక్తీకరణ, అంతర్లీనంగా వినిపించే ఆవేశం, హాస్య చతురత, చురకత్తిలాంటి వ్యంగ్యం పాఠకులను ఆశ్చర్యపరుస్తాయి.

సమకాలీన తెలుగు సాహితీ ప్రపంచంలో రంగనాయకమ్మ ఓ ఫైర్‌బ్రాండ్. ఎంతటి అప్రతికూలత లెదురైనా, తాను నమ్మిన విలువల, సిద్ధాంతాల విషయంలో రవ్వంత రాజీ పడకుండా, ఎనిమిది పదుల వయసులోనూ (1939 సెప్టెంబర్ 21న జన్మించారు), అవిశ్రాంతంగా రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తూనే వున్నారు. ఆమెను రాజీలేని మనిషిగా ఎంతగా ఇష్టపడే వారు ఉన్నారో, అంతగానూ వ్యతిరేకించేవారూ ఉన్నారు. ఏ కమ్యూనిస్టు పార్టీ ముట్టుకోని, మార్క్స్ మూలరచన 'పెట్టుబడి'ని తేలికైన పద్ధతిలో పరిచయం చేశారు. రచనల లక్ష్యం, రచయితల – పాఠకుల మధ్య అనుబంధం, తరాలతోపాటే వస్తున్న మార్పులు వంటి అంశాలపై రంగనాయకమ్మ వెలిబుచ్చుతున్న భావాలు ఆలోచనల సమాహారం.

'అసమానత్వం నుంచి అసమానత్వం లోకి' ఈమె వ్రాసిన విమర్శనాత్మక రచనలలో ఒకటి. ఆధునిక తెలుగు సాహిత్యంలో తీవ్ర సంచలనం కలిగించిన యండమూరి వీరేంద్రనాథ్ నవల 'తులసిదళం' ఎంత ప్రసస్థమైనదో రంగనాయకమ్మ కూలిన గోడలు కూడా అంతే ప్రసస్థమైనది. భారతీయ సంస్కృతికి, సంప్రదాయాలకు, నాగరికత పురోగతికి మూలమైనది ఉమ్మడి కుటుంబ వ్యవస్థ. నాగరికత విస్తరణకు పూర్వమే మనదేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉందని వివిధ గ్రంథాలలో పొందుపరచబడి ఉంది. కుటుంబం అనగా ఒకే గృహంలో నివసించే కొంత మంది మానవుల సమూహం."కుటుంబం"లో ఉండే కొన్ని ముఖ్యలక్షణాలు – రక్త సంబంధము, సహచరత్వము, ఒకే నివాసం.

కథా, నవలా, నాటకాలూ – వంటి రచనలే ఏ పాఠకులకైనా అనువుగా ఉంటాయి. ఈ రకం రచనల్లో కథ పొడగునా పాత్రలూ, వాళ్ళ సంభాషణలూ, వాళ్ళ ప్రవర్తనలూ, వాళ్ళ సమస్యలూ, వుంటాయి. వాటిని చదువుతోంటే, తోటి మనుషుల్ని చూస్తున్నట్టు వుంటుంది. పాఠకులకు కూడా అటువంటి అనుభవాలూ, సమస్యలూ వుంటే, సమాజం అర్థం అవుతుంది. రంగనాయకమ్మ స్త్రీ జాతి వ్యక్తిత్వంతో నిలవ గలిగినపుడే పురోగమిస్తుందని తమ నవలల్లో ప్రబోధించారు. స్త్రీకి కావలసినదీ, స్త్రీ కోరేదీ తన వ్యక్తిత్వాన్ని కాపాడుకొనే అవకాశం. స్త్రీ స్వతంత్ర బుద్ధితో అంతర్గత భావదాస్యం నుండి విముక్తి పొందినపుడే ఆమెకు నిజమైన స్వేచ్ఛ లభిస్తుంది.రంగనాయకమ్మ, ఆదర్శ స్త్రీ పాత్రలను సృష్టించారు. ఆ పాత్రలవలె ఆత్మ గౌరవాలతోనే

నడచుకోమని స్త్రీ జాతిని ప్రబోధించారు.రంగనాయకమ్మ నవలల్లోని ఆదర్శ పాత్రలు స్వతంత్రమైన ఆలోచనలు, స్థిరమైన నిర్ణయాలు, ఉదారమైన మనసు, ఉన్నతమైన ప్రవర్తన, శ్రీ సహజమైన ఆర్ద్రభావము, కృపాణమువంటి కుశాగ్రబుద్ధి కలిగి ఉంటాయి.

పూర్వకాలంలో తనను తాను భర్తకు అనుకూలంగా మలచుకో వలసి వచ్చేది. ఆధునిక యువతి తనలాగే తన భర్త కూడ కొంత వరకూ సర్దుకోవాలని వాంఛిస్తోంది. అన్ని సందర్భాలలోనూ, భర్త అడుగు జాడలలోనే నడవకలేక పోతోంది. అధికారం చేయటానికి అలవాటు పడ్డ పురుషుడు మాత్రం భార్య కనుకూలంగా తనను తాను కొంచెమైనా సర్దుకోవటానికి ఇష్టపడటం లేదు.విద్యావంతురాలయిన ఆధునిక యువతి తరతరాల బానిసత్వాన్ని అంగీకరించ లేకపోతోంది. పురుషునిలో అహంకారం అలాగే ఉంది. సంప్రదాయాల పట్ల సామాజిక దృక్పథంలో చెప్పుకోదగినంత మార్పు లేదు. ఈ కారణాలతో ఆధునిక యువతికి తన వ్యక్తిత్వాన్ని నిలుపుకోవడం సమస్యగా తయారయింది. స్త్రీ కోరుకునేది పురుషులచేత స్నేహ గౌరవాలతో చూడబడే స్వాతంత్ర్యము, తమ ఆలోచనలను తాను నిర్ణయించుకొనే స్వాతంత్ర్యం, విధిలేకనో, అలవాటుగానో కాక, హృదయంతో ప్రేమించగలిగే స్వాతంత్ర్యం, తమ అభిరుచులను తాము అభివృద్ధి స్వాతంత్ర్యం, ఒక్క మాటలో చెప్పాలంటే మరొకరి నీడగా కాక తానొక – వ్యక్తిగా నిలవగలిగే స్వాతంత్ర్యం. స్వేచ్ఛను ప్రబోధిస్తూ చలంగారు, గోపీచంద్ గారు, రంగ నాయకమ్మగారు, కొడవటిగంటి కుటుంబరావుగారు మొదలగువారు రచనలు చేసారు. సాంఘిక పరిణామాన్ని వీరు తమ సాహిత్యం ద్వారా కలిగించాలని చూశారు. స్త్రీలు ప్రతిఘటించేది పురుషులను కాదు. పురుషుల ఆధిపత్యానికి అస్కారమిచ్చే సామాజికావారాలను, స్వేచ్ఛను వాంఛించే అభిప్రాయం ఒకటి ఉంది. అది నిజంకాదు. స్వేచ్ఛగా ఆలోచించగలిగిన వ్యక్తులే నైతిక విలువలను గ్రహించగలరు ఆచరణలో చూపించ గలరు. స్వేచ్ఛే నీతికి మూలం.

స్త్రీలు ప్రతిఘటించేది పురుషులనుకాదు. పురుషుల ఆధిపత్యానికి అస్కారమిచ్చే సామాజికావారాలను, స్వేచ్ఛను వాంఛించే తీలు నెడి పోతారనే అభిప్రాయం ఒకటి ఉంది. అది నిజంకాదు. స్వేచ్ఛగా ఆలోచించ గలిగిన వ్యక్తులే నైతిక విలువలను గ్రహించగలరు ఆచరణలో చూపించ గలరు. స్వేచ్ఛే నీతికి మూలం.

మానవ జీవితాన్ని అన్ని కోణాల నుంచి సమగ్రంగా పరిశీలించి జీవితంపై ఒక దృక్పథం కలగజేసేది నవల. మనోరంజకత, అతి విచిత్రత, వాస్తవికత అనే త్రికోణాలను గోచరించేటట్లు భావింపజేయగల అద్భుతశక్తి నవలకి ఉంది. నవలని పలువురు పలు రకాలుగా నిర్వచించారు. Lord David Cecil "A novel is a work of art in so far it introduces us into a living world we live in, but with an individuality of its own" నవల ఒక మానవ జగత్తును సృష్టించి మనలను దానిలో కలుపు కుంటుందని అన్నారు. నవల ఒక కళాత్మక నిర్మాణం. మనకు పరిమితమైన సజీవ జగత్తుకు అది మనల్ని ప్రత్యేకంగా చూపెడుతుంది. Katherine Lever తన పుస్తకం "The reader and the Novel" లో "A novel is a form of written prose narrative of considerable length involving the reader in an imagined real world which is new because it has been created by the author" అని నిర్వచించారు. అయితే "When we are reading a novel, we don't fall in love with the characters appearance. We fall in love with their words, their thoughts and their hearts. We fall in love with their souls" అనేది నా మాట.

రంగనాయకమ్మ నవలల మీద చాలా మంది పరిశోధన గావించారు. అయితే రంగనాయకమ్మ నవలల్లోని

పాత్రల గురించి, నేటి సమాజంలోని వాటి ఆవశ్యకత గురించి, ఆయా నవలల్లో ఆయా పాత్రలకు ఇచ్చిన ప్రాముఖ్యత గురించి పెక్కుగా ప్రస్తావనకు రాలేదు. పాత్ర చిత్రణ నవలకు ఆత్మవంటిది. నవల సజీవంగా, నవరసభరిత సంపన్నముగా మనకు సాక్షాత్కరించాలంటే పాత్ర విషయంలో చాలా శ్రద్ధ వహించి ఉండాలి. పాత్రల ద్వారా రచయిత స్వభావ స్వరూపము, సమాజం పట్ల నడవడి మనకు అర్థం అవుతుంది. ''ఒక వ్యక్తి జీవితంలో సుఖదుఃఖాలెలా సంభావ్యమౌతున్నాయో ఆయా పరిస్థితులలో ఆ వ్యక్తి యొక్క ప్రవర్తన ఎలాగుంటుందో చిత్రీకరించడమే పాత్ర చిత్రణ'' అని 'నవల – పాత్ర చిత్రణ' అనే వ్యాసంలో ఆర్. ఎస్. సుదర్శనం గారు అన్నారు.

రంగనాయకమ్మ నవలల్లో ముక్యంగా స్త్రీల సమస్యలకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడింది. రంగనాయకమ్మ నవలల్లో ఎక్కువ శాతం విప్లవాత్మక సందేశం కనిపిస్తుంది. స్త్రీల అభ్యుదయాన్ని కోరుతూ రచనలు చేసారు. స్త్రీలకొక నీతి, పురుషులకొక నీతి ఎందుకుండాలి అని రంగనాయకమ్మ రాసిన ప్రతి స్త్రీ పాత్ర ప్రశ్నిస్తుంది. స్త్రీ ఎదుర్కొంటున్న ఒడిదుడుకుల చిత్రణ మన కళ్ళకు కనిపిస్తుంది. స్త్రీకి సాంఘిక భద్రతను, న్యాయాన్నీ నేటి మన సమాజం చేకూర్చలేకపోతున్నాయని, స్త్రీ ఏ విధంగాను అభివృద్ధి పొందడం లేదని, పెక్కు మోసాలకు బలి అవుతుందని రంగనాయకమ్మ ఆవేదన. అయితే ఇదంతా ఓ ఇరవై ముప్పై సంవత్సరాల క్రితం మాట. గడిచిన ముప్పై సంవత్సరాల కాలం చూస్తే స్త్రీ అభివృద్ధి బాటలో సరవేగంగా సాగుతూ ముందుకెళ్తుందనే చెప్పాలి. ఇక స్త్రీలకు జరుగుతున్న మోసాల గురించింటూరా అది ఎన్నటికీ మారని, మార్పు చెంచదని, మార్పుకు నోచుకోని విషయం.

రంగనాయకమ్మ తన లౌకిక జీవితంలో తనను ముక్యంగా కలచి వేసిన సంఘటనలను ఇతివృతంగా తీసుకుని నవలా రచన చేసారు. కథా విధానంలోనే పాత్రల ద్వారా తాను చెప్పాలనుకున్నది చెప్పారు. నవలల్లోని ప్రధాన పాత్రలు వెలిబుచ్చే అభిప్రాయాలు రచయిత అభిప్రాయాలే. ఇతివృతంలోని సంఘటనల మీద రచయిత చేసే వాక్యాలను బట్టి కూడా రచయిత వ్యక్తిత్వం ప్రస్ఫుటమౌతుంది. ప్రతి నవల్లోనూ రంగనాయకమ్మ చేర్చించిన స్త్రీ సమస్యల్ని, దానికనుగునంగా రంగనాయకమ్మ చేసిన బయల్పరచిన అభిప్రాయాల్ని కూలంకషంగా పరిశీలిస్తే రంగనాయకమ్మకు స్త్రీల పట్ల ఉన్న వ్యక్తిత్వం తేటతెల్లమౌతుంది. ఎందుకంటె తన ప్రతి నవల గురించి తానే విమర్శిస్తూ ఆయా నవలల్లో ముందుమాటలో ఆత్మ విమర్శా చేసుకున్నారు. Katherine Lever తన పుస్తకం "The reader and the Novel" లో ''To qualify as a novel, fiction must in some sense be new if it originates in a direct vision of reality. It is new if he saw it for himself, it is true if we accept it as a real world." ఒక రచన నవలగా పరిగణన పొందాలంటే రచన కొత్తదనాన్ని కలిగి ఉండాలి. వాస్తవికతా దృష్టిలో వెలువడినప్పుడే నవల కొత్తదనాన్ని పొందుతుంది. దాన్ని అనుభవించి, అనుభూతి చెందినప్పుడే అది కొత్తది అవుతుంది. వాస్తవ ప్రపంచముగా మన ఆమోదాన్ని పొందినపుడే అది వాస్తవికతను సంతరించు కుంటుంది అని నవలలోని రచయితలో ఉండవల్సిన వాస్తవికత ప్రాముఖ్యతని గురించి వక్కాణించారు. అందుకే బాలగంగాధర్ తిలక్ ''నీవు చెప్పేదేదో నీదై ఉండాలి. నీలోంచి రావాలి'' అని అన్నారు. రంగనాయకమ్మ అలానే ఉన్నారు.

నవలా జీవితానికి సంపూర్ణతను చేకూర్చడానికి రచయిత అనేక పాత్రల్ని సృష్టిస్తారు. రంగనాయకమ్మ కూడా అలా సృష్టించి తన నవలల్లో స్త్రీ పాత్రలకి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. కొన్ని పాత్రల్లో స్త్రీ ఎలా ఉండాలో చెపితే, కొన్ని పాత్రల్లో ఎలా ఉండకూడదో చెప్పారు. రంగనాయకమ్మ బలిపీఠం,కూలిన గోడలు, పేకమేడలు, కల ఎందుకు?, ఇదేం న్యాయం!, స్త్రీ, స్వీట్ హోమ్, జానకి విముక్తి, అంధకారంలో, కృష్ణవేణి, రచయిత్రి, చదువుకున్న

కమల వంటి ఎన్నో నవలల్లో స్త్రీ పాత్రలు మనల్ని ఆర్చర్య పరుస్తాయి, ఆలోచింపజేస్తాయి. ఆ నవలల్లో నాయికల రంగనాయకమ్మ గారు ఎలా మలిచారో చూద్దాం.

లలిత :

స్వతంత్రమైన ఆలోచనలు బలమైన వ్యక్తిత్వం సాలిగిన స్త్రీ ఎన్ని సమస్యలనైనా నిలదొక్కుకుని ఎలా జీవించాలో, ఎలా జీవించగలుగుతుందో 'అంధకారం' అనే నవల్లో లలిత పాత్ర ద్వారా నిరూపించారు రంగనాయకమ్మ. లలిత స్వతంత్రం కలిగిన స్త్రీ. వివాహ విషయంలో, ఉద్యోగ విషయంలో స్వయంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకుంది. ఎప్పుడూ ప్రశాంతంగా, నిర్విచారంగా ఉంటుంది. మొదటినుండి ఈ పాత్ర స్థిరమైన నిర్ణయాలు తీసుకోవడంలో వెనుకాడలేదు. ఆత్మా గౌరవం కలిగిన స్త్రీగా చిత్రీకరించబడింది. లలితలాగా ధీర చిత్తంతో ప్రవర్తించినప్పుడే స్త్రీలకి వారి జీవితానికి కాంతి లభిస్తుందని రంగనాయకమ్మ ప్రబోధించారు.

పద్మ :

'అంధకారంలో' అనే నవలలోని పాత్ర పద్మ. ఉన్నత వ్యక్తిత్వం గల పాత్ర. ఆదర్శమైన స్త్రీ ఎలా ఉండాలో పద్మ పాత్ర ద్వారా నిరూపించారు రంగనాయకమ్మ. ఎమ్. ఏ చదివిన తరువాత ప్రదర్శకురాలిగా (డెమోన్స్ట్రేటర్) చేస్తూ కృష్ణారావును పెళ్లి చేసుకుంది. మొదటి పిల్లడు పుట్టిన తరువాత పిలాడిని పనిమనుషుల పెంపకం మీద వదలడం ఇష్టం లేక ఉద్యోగం మానేసింది. తరువాత ఎన్ని మంచి అవకాశాలు వచ్చినా వదులుకుని చిన్నపిల్లల స్కూల్ ప్రారంభించింది. క్రమంగా అది పేద పిల్లల స్కూల్ అయ్యింది. సంపాదనకన్నా సంఘసేవ మీద ఆసక్తి మళ్లింది. ఈ ఉద్యోగంలో ఆమె చాలా తృప్తిగా కాలం గడుపుతుంది. ఎన్ని కష్టాలు వచ్చినా ఎదుర్కొని పాఠశాలను నిలుపుకుంది. దేనికీ వెనకాడలేదు.

తార :

'బలిపీఠం' అనే నవల్లో కథానాయకుడు భాస్కర్ కి ప్రేయసి తార. భాస్కర్ హృదయాన్ని విశేషణంగా ఆకర్షించిన రూపం తారది. సినిమాహాల్లో భాస్కర్కు కనిపించిన సౌందర్య మూర్తిగా పాఠకులకు తొలుత పరిచయం అవుతుంది తార. అడుగడుగునా అత్యంత శ్రద్ధతో తార పాత్రని మలిచారు రంగనాయకమ్మ. బర్మాలో యుద్ధ సమయంలో పసిపిల్లగా ఉన్నప్పుడు భరించలేని బాధలను అనుభవించింది తార. స్వదేశానికి తిరిగివచ్చి స్థిరపడిన ఆమె జీవితంలో అశనిపాతంలా ప్రియుని వియోగం కలిగింది. సంస్కారి అయిన భర్తతో సుఖంగా ఉన్న ఆమె జీవితం కకావికలం అయ్యింది. తార ఒక స్నేహ పిపాసి. తను ఒక ప్రేమ మూర్తి. అలా రంగనాయకమ్మ నవలల్లో మరుపురాని స్త్రీ పాత్రల్లో తార పాత్ర ఒకటి.

అమల :

'బలిపీఠం' అనే నవలలోని నాయిక అరుణకు పిన్న కూతురు అమల. చదువూ, సంస్కారం ఉన్న ఉన్నత వ్యక్తిత్వం కలిగిన స్త్రీ. అమలలా ఎలాంటి అప్రతికూల పరిస్థితుల్లోనైనా ఎదుర్కొని అన్నింటా సర్దుకుపోగలిగిన వాళ్ళే వర్ణానంతర, మతాంతర వివాహాలు చేసుకుంటే సుఖపడగలరని ఈ పాత్ర ద్వారా రంగనాయకమ్మ చక్కగా నిరూపించారు. అమల తన సామర్థ్యంతో, సహృదయంతో ఇంట్లో అందర్నీ ఆకర్షిస్తుంది. కులభావాలు, బంధుత్వాలు,అందచందాలు, తిండి పద్ధతులు అన్నీ పెనుభూతాల్లా జడిపిస్తే అమల వాటన్నిటినీ అవలీలగా అర్థంచేసుకుని వాటితో ఒకరకంగా ఆడుకుందనే చెప్పాలి. కులాభిమానంతో పండులాంటి సంసారాన్ని అరుణ చేజేతులా నాశనం చేసుకుని కూలద్రోసుకుంటే, వివేకంతో సర్వమానవ సౌభ్రాతృత్వంతో తన జీవితాన్ని పండువెన్నెల గావించుకుంది అమల. కులాంతర వివాహం చేసుకున్న ప్రతిఒక్కరికీ అమల పాత్ర చక్కటి వెలుగు బాటని చూపిస్తుంది. బలిపీఠంలో అరుణ పాత్రకూ అమల పాత్రకూ ఎంతో వైవిద్యాన్ని చూపించారు రంగనాయకమ్మ.

అరుణ :

ప్రపంచంలో ఏ వ్యక్తీ పూర్తిగా చెడ్డవాడు కానట్లే ఏ వ్యక్తీ పూర్తిగా మంచివాడు కాలేడు. 'బలిపీఠం' నవలా నాయిక అరుణ మంచిచెడ్డలు మూర్తీభవించిన స్త్రీ. ఈమెలో కులభావం ఫలితంగా వచ్చిన సుపీరియార్టీ కాంప్లెక్స్ ఉన్నది. మన దేశంలో బ్రాహ్మణులది అగ్రకులంగాను, పంచములది ఒకనాటి సమాజపు ఇనుపపాదాల కిందపడి నలిగి పోయిన వర్ణంగానూ పరిగణించేవారు. చట్టం దృష్టిలో అందరూ సమానులే. కానీ హృదయాంతరాళంలో వర్ణవిభేదం వికటాట్టహాసం చేస్తూనే ఉంది. ఈ వికటాట్ట హాసాలకు బలి అయిన దీనురాలే అరుణ. శాస్త్రి దంపతుల చెప్పుడు మాటల ఫలితంగానే ఆమె జీవితంలో దెబ్బతిన్నదని అనుకోలేము. నిజానికీ నవల కథ ప్రకారం శాస్త్రి దంపతులకన్నా సన్నిహితులు పలువురు ఉన్నారు. వాళ్ళ సలహాలు పనికి రాలేదు. తనలోని సుపీరియారిటీ కాంప్లెక్స్ మూలంగా శాస్త్రి దంపతుల వలన సరి అయిన పోషణ లభిస్తుందని ఆమెకు తెలుసు. వాళ్ళ మాటల వలన తానూ చెడిపోయానని అనుకోవడం, తార ఉదంతం వలన అపోహలే కారణంగా భర్త మీద మనసు విరిగి పోయిందనుకోవడం, ఇవన్నీ సమర్థించుకునేందుకు అరుణ చెప్పుకునే సాకులు కోకొల్లలు. అరుణ అచేతనంలోని భావాలకు అది రేష్టలైజేషన్ మాత్రమే. కులహీనుడు తన భర్త అయ్యాడని, తన సంప్రదాయం తగలబడిపోతుందని ఆమె అటు మటించిపోయింది. తన ఆత్మ న్యూనతకు తగిన కాంపెన్సెషన్ దొరక్క కోరి మృత్యువును వరించింది.

మోహిని :

'కళ ఎందుకు?' నవలా నాయిక మోహిని కళా తపస్వి. సంగీత నాట్యముల రెండింటా ఆరితేరిన దిట్ట. చదువు, సంస్కారంతో పాటు అకుంఠితదీక్ష, సునిశితమగు ధీ శక్తీ ఈమెలో నెలకొన్నాయి. కళ, కళ కోసంకాదు. కళ జీవితం కోసం అన్న విషయాన్ని పూర్తిగా నమ్మి తన లక్ష్య సాధనకు శాయశక్తులా పాటుపడిన కళాభిమాని. తన కళా జీవితానికి వైవాహిక జీవితం అడ్డువస్తుందని భావించి తానేకాక తన అక్క పద్మిని కూడా వివాహం చేసుకోరాదని దృఢంగా నిర్ణయం తీసుకుంది. ఈనవల్లో రెండు తరాల ఇతివృత్తాన్ని చిత్రించి నాటి స్త్రీకి నేటి స్త్రీకి తేడాను చూపించారు రంగనాయకమ్మ. అయితే పైతరంలోని కాళాబాల లాగ ఈ తరంలో మోహిని తన కళను ఇతరుల సంకుచితాభిప్రాయాలకు బలిపెట్టలేక పోయింది. అవసరమైతే వైవాహిక జీవితాన్నందాన్ని వదులుకోవడానికి సిద్దపడింది కానీ, ఆత్మాభిమానాన్ని, కళాభిమానాన్ని వదులుకోలేకపోయింది. ఈ ఆత్మాభిమానమూ, ఈ ఆత్మవిశ్వాసమూ స్త్రీ జాతి విముక్తికి సాధనాలుగా చూపుతున్నారు రంగనాయకమ్మ.

విజయ :

భార్య భర్త కంటే అధికురాలైనప్పుడు ఆ భార్యాభర్తల మధ్య పరస్పర అనురాగాలున్నప్పుడు, ఆ భర్త ఎదుర్కొవలసి వచ్చే సంఘర్షణలను చిత్రించారు రంగనాయకమ్మ 'రచయిత్రి ' అనే నవల్లో. పదిమందీ నడిచే మార్గంలో గుడ్డిగా సాగిపోయే వ్యక్తి కాదు విజయ. వివేకంతో తన మార్గం తాను నిర్ణయించుకుంటుంది. అవసరమైతే కొత్త బాట వేసుకుంటుంది. వైవాహిక జీవితాల్లో భర్త అన్ని విధాలా భార్య కంటే ఎక్కువగా ఉండాలనుకోవడం, తరతరాలుగా వస్తోన్న సామాజిక దృక్పథం. తనకంటే భర్త తక్కువ వాడవడం భార్యలే సహించలేరు. ఇది ఒక రకంగా స్త్రీలు – పురుషులు – సమాజం – అందరు కలసి స్త్రీల అల్పత్వాన్ని నిర్ధారించడం. భార్యా భర్తల మధ్య ఉండవలసింది అన్యోన్యానురాగాల? లేక అధికారాల? అన్న ప్రశ్న రేకెత్తిస్తుంది విజయా పాత్ర. స్త్రీలు విద్యావంతులు కాకపోవడమే దీనికి కారణం అని చూపారు రంగ నాయకమ్మ. గొప్పగా చదువుకున్నా ఎంతో వివేకంతో చక్కని సంయమన దృక్పథం ప్రదర్శించేలా రాసారు. ముక్కుసూటిగా

వెళ్లే విజయకు పరిస్థితులకు తగ్గట్టు నడుచుకోవడమూ తెలుసనీ చూపించారు.

విమల :

ఆలోచనల్లోనూ, ఆచరణలోనూ పూర్తగా అభ్యుదయ పంథాలో నడిచిన పాత్రగా విమలను సృష్టించారు రంగనాయకమ్మ 'స్వీట్ హోమ్' అనే నవల్లో. అభ్యుదయ బాటలో నడిచే విమలకూ, అటు సనాతన ఆచారాలు పూర్తిగా నమ్మలేక, ఇటు ఇష్టంలేని భర్తతో విడిపోవడమూ సాధ్యం కాక బలవంతగా నెట్టుకొస్తున్న తన పరిస్థితి ఎవ్వరికీ రాకూడదని ఎంతో తపన పడుతుంది. ఏ ఆదర్శ భావాలు వద్దు. ఆలుమగల బ్రతుకులు రామాయణంలోలాగా, భారతంలోలాగా ఉండకూడదు. భార్యాభర్తలు కలసిమెలసి ఆడుతూ పాడుతూ సంసారాలు చేస్తే ఆ ఇల్లే సర్గం. ఆడదాని కష్టసుఖాలన్నీ మగవాడి మంచితనంతో ఉన్నాయి. కట్టుకున్న దాని భార్య. తనుకూడా మనిషే అన్న గౌరవంతో ఎవడు చుస్తాడో వాడే సాటి మనిషి. ఈ విషయాన్ని నిరూపించడానికి విమల బుచ్చిబాబుల ఆదర్శ దాంపత్యాన్ని స్పష్టిస్తు స్వీట్ హోమ్ 1,2 భాగాలు రాసారు రంగనాయకమ్మ.

కమల :

'చదువుకున్న కమల' నవల్లో కమల వ్యక్తి వికాసానికి విద్య తోడ్పదడుతుంది. భావి భారత పౌరులైన పిల్లలను తీర్చిదిద్దే తల్లి విద్యావంతురాలైనప్పుడు పిల్లలు గొప్ప వ్యక్తులు కాగలరు. పిల్లల మీద తొలి ప్రభావం తల్లిదై ఉంటుంది. అందువల్ల పిల్లలకు విద్య నేర్పడంలో తల్లి ప్రధమురాలే కాదు ప్రధానురాలు అవడం మూలంగా ఆమె తప్పక విద్యావంతురాలు కావాల్సిందే. 'చదువుకున్న అమ్మాయి' నవల్లో కమల, చదువు నేర్పిన సంస్కారంతో తన బిడ్డలను ఆదర్శవంతంగా తయారు చేయాలనుకుంటుంది. కానీ అడుగడుగునా అత్తమామల వళ్ళ ఏర్పడ్డ కష్టాలను ఎలా అధిగమించింది అనేది నవలలో చాలా ఆసక్తిగా మనకూ చదువుతున్ననంత సేపు ఉత్తేజకరంగా ఉంటుంది.

ఇలా చెప్పుకుంటూపోతే స్త్రీ నవల్లో పద్మజ, పార్వతి, అంధకారం నవల్లో రాజామణి ఇంకా ఎన్నో ఎన్నెనో రంగనాయకమ్మ చేతుల్లో మలిచిన స్త్రీ పాత్రలు కనిపిస్తాయి నవలల్లో. ప్రతి నవల్లోనూ స్త్రీ వ్యక్తిత్వాన్ని తెలుపుతూనే స్త్రీని ఒక వ్యక్తిగా రూపొందించే ఏకైక సామాజిక వ్యవస్థ కుటుంభం అని ప్రతినవల్లో రంగనాయకమ్మ చెప్పకనే చెప్పారు. కుటుంబాలే సమాజ నిర్మాణానికి ఆధారాలు. రంగనాయకమ్మ నవలల్లో ఎక్కువగా కుటుంబ వ్యవస్థలో స్త్రీ పాత్ర గురించి ప్రస్తావించబడింది. మనుగడకై సాగిన సంఘర్షణ, అన్వేషణకు దారి తీసి మనిషిలో ఆత్మ జ్ఞానం మంకురించింది. ఆ ఆత్మ జ్ఞాన ప్రేరణ మాత్రమే, జీవించే ప్రాణి కోటి నుండి మానవుణ్ణి ప్రత్యేకించింది. ప్రధానుణ్ణి చేసింది. కుటుంబ జీవితాల్లో ఆనందం, ప్రధానంగా ఆ కుటుంబీకుల సంయుక్త శక్తిపై ఆధారపడి ఉంటుంది. స్వార్థ రాహిత్యం, భాద్యతలను గుర్తించి ప్రవర్తించడం, నిబ్బరంగా ఆలోచించడం వంటి లక్షణాలన్నీ కుటుంబాల్లోని వ్యక్తులందరూ అలవర్చుకోవాలి. ఈ విషయాలన్ని ఆయా స్త్రీ పాత్రల ద్వారా రంగనాయకమ్మ సభ్య సమాజానికి తెలియజేస్తారు.

అయితే వ్యక్తుల మనోభావాలు మారినంత త్వరగా సమాజంలోని అలవాట్లు మారవు. ఆ కారణం చేత ఈనాటికీ వితంతు వివాహాలనూ, వర్ణానంతర వివాహాలనూ ఆమోదించలేని స్థితిలో ఉంది సమాజం. అందుచేత విచక్షణా జ్ఞానం ఉన్న విద్యావంతులు సమాజానికి తలవంచి ఆ మూఢాచారాలనే గొప్పగా చేసి ఒప్పుకోవడం కాక, ఎదిరించి శ్రేయోదాయకమైన సంస్కరణలను సంఘంలో ప్రవేశ పెట్టాలి. కొన్నాళ్ళకు అదే సంఘంలో ఆచరమవుతుంది. అందరూ అంగీకరిస్తారు. ఎందుకంటె సామాన్య జనం ఎప్పుడూ అలవాటుకు బానిసలు. ఆ అలవాటుకు భిన్నంగా ఆలోచించే సాహసం వారికుండదు. ఇలా ఆలోచించగల

వివేకవంతులను వారు గౌరవించరు. ఆ సాహసికులు ఎదురు దెబ్బలకు తట్టుకుని తన మార్గంలోని గొప్పతనాన్ని స్పష్టం చెయ్యాలి. అప్పుడందరూ ఆ మార్గాన్నే అనుసరిస్తారు. కొన్ని రోజులకు అదీ అలవాటు అవుతుంది. అలాంటి సాహసికుల కోవలోకి చెందిన వారే రంగనాయకమ్మ.

వ్యక్తి సుఖం కోసమే సాంఘిక నియమాలు ఏర్పడ్డాయనీ, నియమాలు కాలానుగుణంగా మారతాయని, నియమాలకు బానిసై వ్యక్తిత్వాన్ని చంపుకోరాదనీ రంగనాయకమ్మ నవలలోని ప్రతి స్త్రీ గొంతెత్తి చెప్తుంది. అలా చెప్పిస్తుంది రంగనాయకమ్మ. "మతాలు, కులాలు అనాగరిక మానవుణ్ణి అసమానత్వం నుండి విముక్తి చెయ్యడానికి మాత్రమే. నిజమైన మానవత్వం ఒకటే ప్రతి వ్యక్తికీ ఆరాధనీయమైన మతమని మనిషి తెలుసుకోగలిగెంత వివేకవంతుడయ్యాడని, ఈ నాటి మనిషి, మనిషిలా బ్రతకాలన్న ప్రయోజనం నెరవేరుతున్నప్పుడు మరే మతానికీ ఆస్కారం ఉండదు." రంగనాయకమ్మ ప్రతి నవల్లోనూ ఈ అంశం స్పష్టం అవుతుంది.

Reference :

1. Katherine Lever's Book "The reader and the Novel."
2. Lord Edward Christian David Gascoyne-Cecil, "Lord David Cecil, 83, Historian and Writer", New York Times, Jan. 4, 1986
3. రంగనాయకమ్మ, 'బలిపీఠం', 1975

"సినిమాలు, సీరియళ్ళలో బాలల సమస్యల చిత్రణ"

షేక్ షానాజ్ బేగం, తెలుగు అధ్యాపకురాలు, టి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కందుకూరు, SPSR నెల్లూరు జిల్లా.

మానవ జీవన క్రమ పరిణామ వికాస దశలు శైశవ, బాల్య కౌమార యవ్వన వార్ధక్య దశలు. వీటిలో అన్నింటికంటే ఆహ్లాదకరమైన ఆనందమైనది బాల్యదశ. 5 సంవత్సరాలు మొదలు కొని 13 సంవత్సరాల వరకు కల దశను బాల్యదశ అంటారు. ఈ వయస్సు పిల్లలు పువ్వు విరిసినా హరివిల్లు వచ్చినా, గరిక పచ్చ మైదానాలలో, వాన కురిసినా, ఎండపడినా అన్ని తమవేనంటూ ఆటపాటలతో తల్లిదండ్రుల ఆలనాపాలనలో పాలు త్రాగుతూ పలకా బలపాలు పట్టుకుని ప్రకృతి పాఠాలతో పాటు పాఠశాలలో పాఠాలను నేర్చుకుంటూ తమ తమ అల్లరి చేష్టలతో పెద్దల ముద్దు మురిపాలను అందుకోవాల్సిన వారు బాలలు.

అయితే ఇటువంటి బాల్యం కొందరికి వరమైతే మరికొందరి పాలిట శాపంగా మారుతుంది. నిరక్ష్యరాస్యత పేదరికం, ఆర్థిక పరిస్థితులు, కరువు కాటకాల కారణంగా లక్షలాది పిల్లలు చిన్న వయస్సులోనే కార్మికులుగా మారుతున్నారు. పాలు తాగాల్సిన వారి బాల్యం పాల కవర్ల వేటలో చేజారిపోతుంది. అక్షరాలు దిద్దాల్సిన బాల్యం చిత్తు కాగితాలలో చిక్కుబడిపోతుంది. ప్రపంచంలో ఏ దేశంలో లేనంత బాలకార్మికులు మన దేశంలోనే ఉన్నారని ఐ.ఓ.ఎల్. ఓ సర్వేలో తెలిపింది.

ధనవంతుల పిల్లలను గురించి కాని పేదల, కార్మికుల సమస్యలనన్నింటిని బాలల జీవితాలను మనసుకు హత్తుకునేలా చిత్రీకరించడంలో మాధ్యమాలు తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నాయి. సమాజంలో ధనికులైనా, పేదలైనా, విభిన్న సమస్యలతో సతమతమౌతున్నారు. వీరిలో ఎక్కువ శాతం పేదలు, కర్మాగారాలకు, కారాగారాలకు చేరుకుని దొంగలు, దోపిడీ దారులుగా, ఫ్యాక్షనిష్టులుగా, వ్యభిచారులుగా ఎలా మారుతున్నారో బాలలు పడే బాధలు వాటి పరిష్కార మార్గాలను చూపించే ప్రయత్నాలు ఎక్కువగా చూపిస్తున్నవి మాధ్యమాలు అని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

పూర్వం బాలలకంటూ ప్రత్యేక సాహిత్యం ఉండేదికాదు. పూర్వం ఉమ్మడి కుటుంబవ్యవస్థ ఉండేది. ఈ వ్యవస్థలో బాలల భవిష్యత్తులను తీర్చిదిద్దే విజ్ఞాన భాండాగారాలు అమ్మమ్మలు, తాతయ్యలు, ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో ఆటుపోట్లు, కష్టనష్టాలు, సుఖదుఃఖాలు ఒకరితో ఒకరు పంచుకుంటూ సర్దుబాటు తత్వాన్ని, మానసిక ధైర్యాన్ని అలవరుచుకునేవారు. మంచి విలువలను పెంపొందించడం కోసం రామాయణ, భారత, భాగవత, పంచతంత్ర, పురాణ గ్రంధాలను ఉత్తమ సాహిత్య చరిత్రలను, కథలను బోధించి విలువలు కల్గిన వ్యక్తులుగా తీర్చిదిద్దుతూ వచ్చారు నాటి తరంవారు.

ముద్రణా మాధ్యమం వచ్చిన తర్వాత బాలలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో కందుకూరి, గురజాడ, జాషువా, శ్రీశ్రీ లాంటి వారు తమ రచనల్లో బాల సాహిత్యాన్ని స్పృశిస్తూ వచ్చారు. బాలలకు ప్రత్యేక సాహిత్యం కావాలని గుర్తించిన కొందరు బాలలకు సాహిత్యం అవసరమని భావించారు. ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి బాలల పత్రికల అవసరాన్ని గుర్తించిన కవులు, రచయితలు పిల్లల కోసం ప్రత్యేకంగా కొన్ని పత్రికలను నడిపారు. 1940 నుండి నేటివరకు బాల, బాలకేసరి, బాలమిత్ర, చందమామ, బొమ్మరిల్లు, బుజ్జాయి, చిన్నారిలోకం లాంటి పత్రికలు దాదాపుగా 95 పత్రికల్లో బాలసాహిత్యం వెలువడింది. ఆ కాలంలో పుస్తకాలను పిల్లలు ఎంతో ఆసక్తిగా చదివేవారు. ఒక పుస్తకం దొరికితే దాన్ని పూర్తిగా చదివేవరకు నిద్రపోయేవారు కాదు. ఇలా వర్ణనం చేయడంవలన బాలలు సృజనాత్మకతను

పెంపొందించుకోవడమే కాకుండా చిన్న కవితలు, కథలు అలవోకగా రాయగల సామర్థ్యం అలవడేది.

సినిమా :

సినిమా అంటే పిల్లలకు చాలా యిష్టం. ఈ రంగంలో పౌరాణిక, ఇతిహాస, చారిత్రక, సాంఘీక ఇతివృత్తాలు జోడించినప్పటికిని వాటిలో కూడ బాలల సమస్యలను చిత్రీకరించారు నాటి దర్శకులు. అంతేకాకుండా బాలల కోసం తెరకెక్కించిన సినిమాలు తక్కువ శాతం ఉన్నాయనే చెప్పుకోవాలి. సినిమాల్లో బాలల సమస్యలను ఎలా చిత్రించారో పరిశీలిద్దాం.

మహానది సినిమాలో అమాయకమైన పల్లెటూరి కుటుంబం. భార్య చనిపోయిన భర్తకు ఇద్దరు పిల్లలు. అత్తతో కలిసి కలిసి సుఖంగా జీవిస్తుంటాడు. అమాయకుడైన ఆ కథానాయకుని పట్నంవాసి తన వ్యాపారంలో భాగస్వామిని చేసుకుంటానంటూ పట్నం తీసుకువెళతాడు. బ్యాంకు డిపాజిట్లు నాయకుని పేరుమీద తీయించి అతనిని మోసగాడిగా చిత్రీకరించి జైలుకు పంపిస్తాడు. పదేళ్ళ వయస్సుకే పుష్పవతి అయిన కథానాయకుని కుమార్తె తన తండ్రి భాగస్వామి దగ్గరకువెళ్ళి ఉద్యోగం ఇప్పించమని వేడుకుంటుంది. పసివాడు ఒక కుక్క వెంటబడి సర్కసు కుటుంబాలలో సభ్యుడవుతాడు. అమ్మాయిని ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఆ పిల్లపై అఘాయిత్యం చేసి బొంబాయిలో ఆ బాలికను అమ్మేస్తాడు. ఆ బాలికకు పగలు ఏమి జరిగినా రాత్రిళ్ళు కలవరించే అలవాటు ఆ తర్వాత జైలు నుండి విడుదలైన కథానాయకుడు బిడ్డలను వెతుక్కుంటూ ఉండగా సర్కస్ జరిగే చోట కుమారుడు దొరికి అక్క ఫలానా చోటుకు వెళ్ళింది కదా! ఏది అని ప్రశ్నిస్తాడు. ఖంగుతిన్న తండ్రి, ఆ ముసలివాడి దగ్గరకు వెళ్ళి కుమార్తె బాంబేలోని సోనాగంజ్‌లో ఉంటుందని తెలుసుకొని తన 10 సం॥ల వయసున్న కుమార్తె కోసం సోనాగంజ్‌లోని వ్యభిచార గృహంలోనికి వెళ్ళి తన కూతురిని విడిపిస్తాడు. అతని కూతురు నిద్రలో మగవారు చేసే హింసను తట్టుకోలేక కలవరిస్తున్న మాటలు విని తన కుమార్తె జీవితం ఇలా అయినందుకు దుఃఖించి అతనిని చంపి జైలుకు వెళతాడు. నాలుగు సంవత్సరాలు ఆ బిడ్డ వ్యభిచార కూపంలో నలిగిపోయే తీరుతెన్నులు, అలా రక్షించబడిన ఎందరో కన్నె బాలల జీవితాలను మహానది చిత్రంలో అద్భుతంగా చిత్రీకరించాడు దర్శకుడు.

పై కోవకు చెందిన మరో చిత్రం నాయకుడు. ఇందులో బాలిక 10వ తరగతి చదువుకుంటుంది. పగలంతా చదువు రాత్రంతా వ్యభిచారం బాధలు వీటి నుండి బాలికను రక్షించి నాయకుడు వివాహమాడతాడు.

బాలబాలికలు తల్లిదండ్రుల ప్రేమకు నోచుకోలేక దానికి కారణం దేవుళ్ళకు మొక్కు తీర్చకపోవడమే అనే ధృక్పథంతో వచ్చిన మరో చిత్రం దేవుళ్ళు. భార్యాభర్తల ఈర్ష్యా ద్వేషాల మధ్య పిల్లలు నలిగిపోతుంటారు. తల్లిదండ్రులను ఒక్కటి చేయాలని కాణిపాకం, దుర్గగుడి, అయ్యప్ప దేవాలయం, షిర్డీ సాయిబాబా, భద్రాచలము దేవాలయాలకు వెళ్ళి తల్లిదండ్రుల ప్రేమకు నోచుకోని జీవితం వ్యర్థమని ఆత్మహత్యకు పూనుకునే దశకు చేరుకుని అయ్యప్ప దయతో రక్షింపబడి తల్లిదండ్రుల వద్దకు చేరుకుంటారు. చిత్రంలో అక్కాతమ్ముళ్ళ మానసిక వేదన తల్లిదండ్రులను కలపడానికి పిల్లల పాత్ర అమోఘమైనది.

యవ్వనపు జోరులో బిడ్డలను కని చెత్తకుప్పల పాలు చేస్తే ఆ బిడ్డ సమాజంలో ఎలా తయారవుతాడో తెలిపే చిత్రం రౌడీ గారి భార్య. ఏ అమావాస్యలో ఆ బిడ్డ జీవితాన్ని చీకటిపాలు చేసిందో తల్లి, బిడ్డను చెత్తకుప్పలో పడవేస్తుంది. మూడు నాలుగేళ్ళు వచ్చేవరకు నానా రకాల, వీళ్ళు వాళ్ళ పోషనలో కఠోర దారిద్ర్యం అనుభవిస్తూ పనికోసం అన్వేషిలా తిరుగుతుంటే పని ఇచ్చే నాధుడు ఒక్కడూ కానరాడు. ఆ పిల్లవాడు తిరగబడి దొంగలా ఎవరు డబ్బులిచ్చి ఏ పని

వాడుగా తయారవుతాడు. అలా దొంగలను, దోపిడీ దారులను మన సమాజమే తయారుచేస్తుంది.

ఒక తల్లి మిస్ ఇండియా కావాలనుకొని బిడ్డను వదిలేస్తే, మరోతల్లి భర్త చేసే వ్యభిచరుడుగా మారిపోతే తన బిడ్డను తీసుకొని పెంచుకొనే నేపథ్యంలో వచ్చిన మరోచిత్రం మావిడాకులు. కుమార్తెకు తల్లిలేక, కుమారుడికి తండ్రి కరువై వారిద్దరిని కలిపే నేపథ్యంతో వచ్చిన చిత్రం మావిడాకులు.

స్లమ్ డాగ్ మిలీనియర్స్ హిందీలో, ఇంగ్లీషులో విడుదలై ఏడు ఆస్కార్ అవార్డులను పొందిన చిత్రం. ఇది మురికివాడలో చూస్తుంటేనే ఇంత భయంకర పేదరికాన్ని అనుభవించే వాళ్ళు కూడా ఉంటారా అని ఆశ్చర్యం వేస్తుంది. ఒక మురికివాడలో నివసిస్తున్న వివిధ కుటుంబాల పిల్లలు ఒక చోట ఉండగా చెరువుకట్ట విరిగి ఆ మురికివాడలోని పెద్దలందరూ చనిపోతారు. ఒక వ్యక్తి వారిని దగ్గరకు తీసుకొని పిల్లలను కుంటివారిగా, గ్రుడ్డి వారిగా మార్చడం. ఆ పిల్లలసమూహంలో ఒక అన్న తన తమ్ముడిని తీసుకొని ఆ గ్యాంగ్ నుండి పారిపోయి ఒకచోట విడిపోతాడు. ఆ ఇద్దరు పిల్లలు ఒకడు రౌడీగా, ఇంకొకడు గైడ్ గా రకరకాల అవతారాలు ఎత్తి వాటిలో చేరి పనిని చక్కగా నేర్చుకుని కొందరి సహాయంతో కంప్యూటర్ నేర్చుకుని కౌన్‌బనేగా మిలీనియర్ అను కార్యక్రమంలో ఎంపిక చేయబడతాడు. ఒక్కొక్క ప్రశ్న అతని బాల్యంతో ముడిపడి ఉంటుంది. అన్నింటికి సమాధానాలు చకాచకా చెప్పేస్తుంటే నిర్వాహకులు ఇతను చీట్ చేస్తున్నాడని కొట్టిస్తారు. కాదని నిరూపించుకొని మిలీనియర్ అవుతాడు ఆ బాలుడు. ఆ బాలుడు విభిన్న సందర్భాలలో కుంటి వారుగా, అంధులుగా, వ్యభిచారులుగా మారిన తన మిత్రులను కలుసుకుంటాడు. సమాజంలో పిల్లలను అపహరించి డబ్బు సంపాదించే యంత్రాలుగా తయారుచేసే బాలల జీవితాలను స్లమ్ డాగ్ మిలీనియర్స్‌లో కళ్ళకు కట్టినట్లు చూపించారు.

14 సంవత్సరాలలోపు ఉన్న బాలబాలికలు పనిచేయకూడదు. అలా పనిలో పెట్టుకొని ఆ బాలికను హింసిస్తుంటే మీడియా ద్వారా వారిని పట్టించి ఆ బాలికను రక్షించే నేపథ్యంలో వచ్చిన చిత్రం అనసూయ.

ఛత్రపతి వరదలొచ్చి కుటుంబాలు చిన్నాభిన్నంగా మారిపోతే ఒక ముఠా వారు పిల్లలకు పనులిస్తామని చెప్పి స్మగ్లింగ్ చేయిస్తూ వారిని స్మగ్లర్లుగా మార్చి వారి భావిజీవితాన్ని నాశనం చేసే నేపథ్యంలో వచ్చిన కథ.

ఫ్యాక్షనిజం ఫ్యామిలీలో జన్మించి తల్లిదండ్రులపై దాడి జరిగే సమయంలో విపరీత ఆవేశానికి లోనయే బాలుని పాత్రతో ఉన్న చిత్రం "ఆది". ఆ ఆవేశాన్ని చూసిన పిల్లలు తాము కూడా అలాగే ఉండాలేమో అనే విధంగా తమ పిల్లలు ఆ విధంగా మారిపోతారేమో అన్న ఆవేదనను కలిగించే పాత్ర అది.

'అతడు' ఎవరో ఏమిటో తెలియదు. ఎలా పుట్టాడో ఎవరికి పుట్టాడో పెరిగి పెద్దవాడై 10 సం॥ వయస్సులో పనికోసం వెళితే ఎవరూ పనివ్వరు. ఒక రౌడి అతనిని తీసుకొని బ్యాంకు దొంగతనం చేయిస్తాడు. ఆ దొంగల దొంగతనం నుండి బయటపడి జైలు పాలయినప్పుడు పెద్ద స్మగ్లర్ గా మారే ఇతివృత్తమున్న చిత్రం అతడు.

'అంజలి' మానసికంగా మతిస్థిమితం లేని పిల్ల. తల్లికి ఆ పాప చనిపోయిందని చెప్పి తండ్రి దూరంగా పెంచుతుంటాడు. తర్వాత ఆ విషయం తెల్సుకున్న అతని భార్య, బిడ్డలు ఆపాపను ఇంటికి తీసుకువస్తారు. మానసిక పరిపక్వత లేని ఆపాపను అందరూ అసహ్యంగా, ద్వేషంగా చూస్తూ ఉంటారు. కొంతకాలానికి ఆద్వేషమే ఆ పాప పట్ల ప్రేమగా మారుతుంది. చివరికి అంజలి పాప బాగుండాలని భగవంతుని ప్రార్థించే ఇతివృత్తంతో మానసిక పరిపక్వత లేని పిల్లలు ఎలా ఉంటారో అంజలి సినిమా ద్వారా చక్కగా చూపించాడు దర్శకుడు. ఇలా చెప్పుకుంటూ పోతే శౌర్యం, షాపింగ్ మాల్, చంటి, సరిగమలు, సమ్మక్క సారక్క

1940లో ఓ గ్రామం, మున్నా, ద్రోణ, దృశ్యం, మాతృదేవోభవ, షాపింగ్ మాల్ మొదలైనవి.

"ఒసేయ్ రాములమ్మ" సినిమాలో రాములమ్మ చిన్న బాలిక. జమీందారుల వద్ద ఊడిగం చేస్తుంటుంది. అప్పుడే పుష్పవతి అయిన ఆబాలికము ఆ జమీందారు అత్యాచారం చేసి, చెట్లలో చేలలో పడవేస్తాడు. బంధువుల ఆదరణలేక ఆదరించిన వారి చెంత అణుకువగా జీస్తుంది రాములమ్మ. ఈ చిత్రంలో గిరిజన బాలికలపై జరిగిన లైంగిక వేధింపులను చక్కగా చిత్రీకరించాడు దర్శకుడు. సమాజంలో జమీందారి వ్యవస్థలో ఇప్పటికీ బలి అయ్యే బానిస బ్రతుకులు ఎన్నో ఎన్నెన్నో

మరో సినిమా 'పసివాడి ప్రాణం' మూగ, చెవిటి వాడైన బాలుడు తన తల్లిని కొంతమంది చంపేయడం కళ్ళారా చూసాడు. దుండగుల బారినుండి ఆ బాలుడు రక్షించబడి కథానాయకుని చెంతకు చేరి, ఆ దుండగులను గుర్తించి తన మనస్సులోని మాటను బైటకు చెప్పలేక సైగలు చేస్తూ ఉంటే నాయకునికి అర్థం కాక సతమతమౌతాడు. ఆ బాలునికి అనేకమార్లు దాడికి గురికావడం, ఆ తదుపరి బాలుడిని నాయకుడు రక్షించడంతో కథ ముగుస్తుంది. ఆ కథలో అంగవైకల్యం కల బాలల దీనగాధను దర్శకుడు చిత్రీకరింపజేశాడు.

కుడివైపు నుంచి ఎడమ వైపుకు చేతి వ్రాత రాస్తూ ఉపాధ్యాయుల చేతుల్లో తిట్లు తింటూ ఫెయిల్ అవుతూ తల్లిదండ్రుల ఆగ్రహానికి గురి అయ్యి ప్రత్యేక పాఠశాలలో శిక్షణను ఇప్పించాలనుకుంటాడు తండ్రి. తల్లి బ్రతిమలాడినా దూరంగా ఓ ప్రత్యేక పాఠశాలలో చేర్పిస్తాడు. కథానాయకుడైన ఉపాధ్యాయుడు ఆ విద్యార్థి తెలివైన వాడని ప్రతి ఒక్కటి నుంచి ఎడమవైపుకు రాస్తాడని ఆ బాలుని చేరదీసి అతని అభిరుచులను తెలుసుకుని దానికి అనుగుణంగా అతనికి ఒక కొత్త గుర్తింపు లభింపజేసే నేపధ్యంలో వచ్చిన చిత్రం తారే జమీన్ పర్.

టెలివిజన్ :

ఒకప్పుడు విజ్ఞాన వినోద సాధనం నేడు కేవలం వినోదసాధనంగా మారింది. ఒకప్పుడు దూరదర్శన్ కార్యక్రమాలు తప్ప ఇతర టెలివిజన్‌లు లేవు. ఆనాటి దూరదర్శన్ విద్యార్థులకు ఉన్నత విద్యనందించడానికి వార్తలు, బాలల కోసం రామాయణ, భారత, భాగవతాలను ప్రసారం చేసింది. చిన్నగా జెమిని టి.వి. ప్రారంభమైనా ఛానళ్ళు లెక్కకు మిక్కిలి ప్రసారమవుతున్నాయి.

ఇందులో బాలల కోసం ఛోటాభీమ్, మోటు–పతులు, మిక్కిమౌస్ మొ॥ కార్టూన్ షోలు వచ్చాయి. పిల్లలు పఠనాన్ని కొంత నిర్లక్ష్యం చూపి తీరిక దొరికినప్పుడల్లా ఈ కార్యక్రమాలను చూడడం మొదలుపెట్టారు.

టి.వి. లో చిన్నారి పెళ్ళికూతురు అనే సీరియల్ ద్వారా ఆడపిల్లలకు చిన్న వయస్సులోనే వివాహం చేయడం. వారు ఎదిగిన తర్వాత కాదనడం, కొంతమంది పిల్లలు వితంతువులుగా మారడం, పునర్వివాహాలు, బాల్య వివాహాలను రూపుమాపి, అందరూ ఆనందంగా జీవించాలి, గ్రామాభ్యుదయం కోసం కృషి చేయాలి, మూఢ విశ్వాసాలు, పాత ఆచారాలు అంతరించి ఒక కొత్త దృక్పధంతో జీవించాలని, స్త్రీ అనే దృష్టితో ఆనంది పాత్ర ద్వారా కృషి చేయడం ఈ ధారావాహికలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఝాన్సీలక్ష్మీబాయి, రుద్రమదేవి, అంబేద్కర్ లాంటి వారి జీవితచరిత్రలను తెరకెక్కించడం వల్ల బాలలు కొంత స్ఫూర్తిని పొందుతున్నారు.

చిన్నగా సినీగీతాలతో మొదలుపెట్టిన ఛానళ్ళ లోనికి సినిమాలు, సీరియళ్ళు వచ్చాయి. ఈ సీరియళ్ళలోను పిల్లలను

ఉన్నత వ్యక్తిత్వం కలిగి త్యాగమూర్తులుగా కొందరిని చూపిస్తే మరికొందరిని కుళ్ళు, కుతంత్రం, ఈర్ష్య, అసూయలతో చిన్నపిల్లలు రగిలిపోతూ మాట్లాడడం, పెద్దవారు చిన్నవారు అని తేడాలేకుండా ఎదిరించడం, తాము

అడిగినవి ఇవ్వకుంటే చచ్చిపోతామని బెదిరించడం లాంటి సంఘటనలు బాలబాలికలకు మేము ఇలా ఉండాలేమో అనే కొత్త ఆలోచనలను కలిగిస్తున్నాయి ఈ సీరియళ్ళు.

ఇలాంటి వాటిని చూస్తూ కొందరు సాహిత్య పఠనానికి దూరమౌతున్నారు. వైయక్తిక కుటుంబాలలో ఒకరు లేదా ఇద్దరు పిల్లలుండడంతో వారిని అతి గారాబంగా పెంచడం వలన వారు ఇంటా బయటా ఏ ఒక్కరూ ఒక్క మాట అన్నా మేం చచ్చిపోతాం, వెళ్ళిపోతాం అంటూ బెదిరించేవాళ్ళు కొందరుంటే పారిపోయి బాల కార్మికులుగా మారిన వారు మరికొందరున్నారు.

సెల్‌ఫోన్ (చరవాణి) :

మనమందరం ఉపయోగించే సెల్‌ఫోన్ రాక సాంకేతిక యుగంలో ఒక గొప్ప విజయం. దీని వల్ల ఎన్ని లాభాలున్నాయో అన్ని నష్టాలు కూడ ఉన్నాయి. ఇంటర్నెట్ అంతగా అందుబాటులో లేనప్పుడు దుష్ప్రభాలు తక్కువ, ఉపయోగాలు ఎక్కువ. జియో కంపెనీ వారు జియో సేవలను తక్కువ డబ్బులతో పిల్లలకు, పెద్దలకు అందరికీ అందుబాటులోనికి తేవడం వలన అందులో ఇది అది అనే విషయం కాకుండా ఎలాంటి వాటినైనా చూడడం వల్ల బాలలు అత్యధికంగా ఆకర్షితులై, కొనుగోలు చేసి చూడకూడనివి చూసి భాగోద్వేగాలను అదుపులో ఉంచుకోలేక తప్పుదారి పడుతున్న మాట అందరికీ తెల్సిందే. వాట్సాప్, యూ ట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్‌ల వల్ల అనేక విషయాలను తెలుసుకోగలుగుతున్నారు.

ఒక పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న అబ్బాయి తన పాఠశాలలో చదివే బాలికపై అత్యాచారం చేశాడనే వార్త పత్రికల్లో వచ్చింది. అలాగే ఒక ఉపాధ్యాయుడు విద్యార్థిని తిట్టాడనే కోపంతో ఉపాధ్యాయుని గన్‌తో కాల్చివేయడం లాంటి వార్తలు చదువుతుంటే మనం నాగరిక సమాజంలో ఉన్నామా ? మన పిల్లలు పెద్దవారై ఎలా తయారవుతారు అని బెంబేలెత్తాల్సిన పరిస్థితి కొద్ది మందిలో కన్పిస్తుంది.

ఒకప్పుడు పాఠశాలల్లో వ్యాయామ విద్య తప్పనిసరి. పిల్లలు ఆడిపాడి అలసిపోయి త్వరగా నిద్రపోయి త్వరగా లేచేవారు. శారీరకంగా గట్టిపడి రోగనిరోధక శక్తిని కల్గి ఉండేవారు. ఈనాడు పరిస్థితి పూర్తిగా తారుమారైంది. కార్పోరేట్ పాఠశాలల్లో వ్యాయామాలు చేయించడం లేదు. నేటి పిల్లలు త్వరగా రోగగ్రస్తులవుతున్నారు. బాలలు చరవాణి లేకుండా ఉండలేకపోతున్నారు. చిన్న బిడ్డ భోంచేయాలంటే సెల్‌ఫోన్ పెట్టాలి. రంగస్థలం సినిమా విడుదలైన కొత్తలో టి.వి.లో పాత పాటలు వస్తుంటే పిల్లలు ఏడ్వడం, రంగమ్మా మంగమ్మా పాట వస్తుంటే కేరింతలు కొట్టడం వీడియో అన్ని వాట్సాప్ గ్రూపుల్లో తిరిగిన విషయం మనకు తెల్సిందే.

ఇక కరోనా మహమ్మారి వలన అన్ని విద్యాసంస్థలు ఆన్‌లైన్ పాఠాలు మొదలు పెట్టేశారు. పిల్లలందరి చేతుల్లోకి సెల్‌ఫోన్ వచ్చేసింది. పాఠాలు వినడం కంటే ఆటపాటలకు బాలలు బానిసలుగా మారిపోయారు. సెల్‌ఫోన్ చిన్నాపెద్దా లేకుండా అందరి దోస్త్ అయ్యింది. ఇవన్నీ ఎక్కువసేపు చూసి పిల్లలు అతిగా ఆవేశపడడం, నిద్రలేమి, చూపు మందగించడం, పఠనం తగ్గడం లాంటివి జరిగాయి, జరుగుతున్నాయి.

బాలికల సమస్యలు :

సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోవడం ద్వారా నైతేనేమి, ఆలస్య వివాహాలవల్ల నైతేనేమి చరవాణి యొక్క ప్రభావాల వల్ల నైతేనేమి పసికందులు, చిన్నపిల్లలపై అత్యాచారాలు పెరిగిపోయాయి. 6 నెలల పసికందును 28 సం॥ పొరుగింటివాడు అత్యాచారం చేశాడు. 4 సం॥ల పిల్లను అత్యాచారం చేసి కాలువలో పడేసి కడుపుకోతను మిగిల్చాడో దుర్మార్గుడు. ఎక్కువగా టీనేజర్లు, ముసలి వాళ్ళు పసిపిల్లలను ఎంచుకొని, ముద్దు పెట్టుకోవడం, గిల్లడం, గిచ్చడం లాంటి వికృత చేష్టలు చేస్తూ వారిని భయపెడ్తూ అత్యాచారాలు

చేస్తున్నవారి సంఖ్య పెరిగిపోయింది. స్కూలు బస్సు డ్రైవర్లు, ప్రిన్సిపాళ్ళు, ప్రైవేట్, ప్రభుత్వ టీచర్లు, చిన్నపిల్లలను బెదిరించి వారెవరికి చెప్పుకోలేరని అత్యాచారాలు చేస్తున్నారు. ఇటీవలే నాల్గవ తరగతి చదువుతున్న బాలికపై పాఠశాల ప్రిన్సిపాల్, డ్రైవర్ రోజుల తరబడి అత్యాచారం చేస్తుంటే ఆతల్లి పడే వేదన యూట్యూబ్ ఛానల్‌లో చూడవచ్చు. ఏమి తెలియని ఆ పసికంద వాళ్ళను చంపేయాలమ్మ అంటుంటే ఆపాప ఎంతటి శారీరక, మానసిక క్షోభను అనుభవించి ఉంటుందో మనం అర్థం చేసుకొనవచ్చును. ఒకప్పుడు ఆడపిల్ల పుడితే ఏడ్చేవారు. ఆడపిల్ల పుట్టినందుకు ఏడ్వడం లేదు. ఆడపిల్ల పెరిగి పెద్దయ్యే వరకు ఇంటా బయటా రాబందుల్లాంటి మృగాళ్ళ బారినుండి ఎలా సంరక్షించుకోవాలి అని భయపడి.

ముగింపు :

బాలలు ప్రతీచోట ఏదో ఒక విధంగా సమస్యలను ఎదుర్కుంటున్నారు. కొందరి పాలిట బాల్యం వరంగా ఉంటే, మరికొందరి పాలిట శాపంగా మారుతుంది. ఇటువంటి సాంకేతిక అభివృద్ధి చెందింది అనుకుంటున్న సమాజంలో ఉన్నత స్థాయికి వెళ్ళేవారున్నారు. చిన్న వయస్సులోనే బాధ్యతలు నెత్తినపడి బాలకార్మికులుగా మారేవారున్నారు. సామాజిక రుగ్మతలకు గురై దొంగలుగా, దోపిడిదారులుగా తయారవుతున్నారో మనం వివిధ మాధ్యమాల ద్వారా చూశాము. ఇటువంటి పరిస్థితులు రావడానికి కారణం బాలసాహిత్యం చదవకపోవడం.కనుక నేటికాలంలో తల్లిదండ్రులు కష్టపడితే కాని పిల్లలకు మంచి భవిష్యత్తు నివ్వడానికి కష్టపడుతూ బాలలను ఒంటరిగా వదిలేస్తున్నాము. వారేదైనా చెప్తున్నా మనం పట్టించుకోవడం లేదు. తల్లిదండ్రులు, సమాజంలో మార్పు రావాలి. మొబైల్ భూతం పిల్లల భవిష్యత్తును మ్రింగివేస్తుంది. సాధ్యమైనంత వరకు పిల్లలకు వాటిని దూరంగా ఉంచుతూ గ్రంథాలయాలకు తీసుకువెళ్ళి పఠనాన్ని అలవాటు చేస్తే ఇప్పుడు కొందరే ప్రతిభావంతులున్నారు.

ఆధారాలు :

1. పత్రికలు
2. సినిమాలు
3. సీరియళ్ళు
4. అంతర్జాలం

స్త్రీవాదం

డా॥ గుంటుపల్లి గౌరి, లెక్చరర్, ఎస్.కె.బి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మాచర్ల, పల్నాడు జిల్లా.

ఉపోద్ఘాతం :

"రామాయణ, భారత, భాగవతాది గ్రంథాలు, పురాణ సాహిత్యమంతా పాతివ్రత్యానికి, పవిత్రతకు, స్వామిభక్తికి ప్రతీకగా వర్ణించబడింది. మంచి భార్య అయితేనే ఆమెను ఉత్తమ జాతి స్త్రీగా పొగిడేవారు. నల-దమయంతులు, సీతారాములు, సావిత్రీ సత్యవంతుల కథల్లో స్త్రీ భర్త యెడల విధేయతతో ప్రవర్తించాలని, త్యాగం చెయ్యాలని నాటి సాహిత్యం నిర్దేశించింది. నాటి నుంచి దమయంతి, సావిత్రి, సుమతి, అహల్య, ద్రౌపదులను ఆదర్శ మహిళలుగా పొగుడుతున్నారు. పతివ్రతగా మాత్రమే ఆనాటి స్త్రీకి వ్యక్తిత్వముండేంది. అగ్నిలో దూకమంటే దూకింది సీత, భర్తచే అమ్ముడుపోయింది చంద్రమతి. సుమతి భర్తను వేశ్య వద్దకు మోసుకెళ్ళింది గాంధారి భర్త కొరకు గ్రుడ్డిగా జీవించింది. భర్త కామం కోసం శర్మిష్ఠ కన్యగా జీవితాంతం బ్రతికింది. సతిగా సాటి స్త్రీ సహగమనం చేసింది. అసలు స్త్రీకి పతిసేవతప్పఏకోరికా ఉండరాదనేది పవిత్ర ధర్మమైంది. తప్పుచేసింది ఇంద్రుడైనా అతనికన్నా ఎక్కువశిక్షపడింది అహల్యకే. భర్త సమ్మతితో కుంతి ఇతరులకు సంతానం కనడం కూడా స్త్రీకి పతివ్రతాధర్మమే అయినా, కన్యకు పుట్టిన కర్ణుణ్ణి గంగపాలు చేయడం కూడా పవిత్రమేనని పొగిడారు. ధర్మశాస్త్రాల సారస్వతం, పురాణాల సాహిత్యమంతా స్త్రీని పుట్టు బానిసగా బ్రతకాలని స్పష్టీకరించాయి. (స్త్రీ విమోచన 24-25)

ప్రాచీనాంధ్ర కావ్య సాహిత్యమంతా పురాణేతి హాసాలకు అనువాదాలు, అనుకరణ కాబట్టి స్త్రీని చిత్రించే విషయంలో పెద్ద మార్పులు చోటుచేసుకులేదు. ప్రబంధ యుగంలో కవులు రాజుల్ని ఆశ్రయించి వారి అభిరుచులకు అనుగుణంగా కావ్యాల్ని రాసి గండవండేరాలు తొడిగించుకొని ఘనంగా సత్కారాలు పొందారు. ప్రముఖ విమర్శకాగ్రేసరుడు కట్టమంచి రామలింగారెడ్డిగారు సాహిత్యంలో స్త్రీని గూర్చి రాస్తూ "నాయిక వివాహానంతరం ఆమె చెలికత్తెలైనా తమ చెలిని శోభనపు గది తలుపుల చెంత వదులుతారేమో గాని, కవి మాత్రం అరక్షణం కూడా ఆమెను వదలడానికి అంగీకరించడని" చెప్పారు. ఈ యుగంలోని స్త్రీలకు వ్యక్తిత్వం లేదు, స్వేచ్ఛ లేదు అసలు కవులకే స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు లేనపుడు వీరు సృష్టించిన స్త్రీ పాత్రలకు కూడా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉండవు. అయినప్పటికీ ఈ యుగంలో అక్కడక్కడా సజీవ పాత్రలు లేకపోలేదు. అవి పెద్దన వరూధిని, తిమ్మన సత్యభామ, రాయల గోదాదేవి, రామకృష్ణుని నిగమ శర్మ అక్క, పింగళి సూరన, కలభాషిణి, సుగాత్రి పాత్రలు ప్రబంధ సాహిత్యానికి మణిపూసలు. దక్షిణాంధ్ర యుగంలోని కవులు కామ దృక్పథంతో స్త్రీ సౌందర్యాన్ని అతిగా వర్ణించారు. స్త్రీని కేవలం ఒక విలాస వస్తువుగా మాత్రమే పరిగణించారు. "క్షీణ యుగంలో స్త్రీ యొక్క పరిస్థితి మరీ దిగజారి బజారు సాహిత్యం వచ్చింది. వేమన స్త్రీని శీలవతి, గుణవతి, సంస్కారవతి అని పవిత్రభావంతో చూశాడు.

సనాతన దురాచారాల వల్ల మూఢ విశ్వాసాల వల్ల అనాది నుండి అణగద్రొక్కబడుతున్న స్త్రీని జాగృతం చేసి మేలుకొల్పిన ఘనత కందుకూరి వారికి దక్కుతుంది. స్త్రీ అభ్యుదయం కోసం అహర్నిశలూ కృషి చేసిన అసమాన్యమైన వ్యక్తి వీరేశలింగం. వీరు సత్యవతీ చరిత్ర నవలను స్త్రీల కోసం రాసి సుఖ సంసార జీవితానికి స్త్రీ విద్య ఆవశ్యకతను నొక్కి వక్కాణించారు. పునర్వివాహం, స్త్రీ విద్య, బాల్య వివాహాలు మొ॥ విషయాలపై ధ్వజమెత్తి స్త్రీల కోసం కృషి చేశారు. సాహిత్యంలో గురజాడ వారి

స్త్రీకి మహోన్నత స్థానముంది. వీరు సృష్టించిన స్త్రీలందరూ ప్రేమ మూర్తులు, ఆదర్శమూర్తులు, సజీవ మూర్తులు, సౌజన్య మూర్తులు, సచ్చీలులు, సంస్కారవంతులు ఉదా: పూర్ణమ్మ, కన్యక, మధురవాణి, స్త్రీ హృదయపు లోతుల్ని, మానసిక క్షోభను వారి అంతరంగ ఆవేదనను క్షుణ్ణంగా పరిశీలించాడు చలం. స్త్రీ కూడా మనిషే అని, ఆమెకు కూడా రంగు, రుచి, వాసన కావలసి ఉంటుందని గుర్తించాలని అంటూ ''స్త్రీకి శరీరముంది దానికి వ్యాయామాం ఇవ్వాలి. ఆమెకు మెదడు ఉంది దానికి అనుభవం ఇవ్వాలి'' అని చలంగారు అంటారు. నన్నయ నుంచి నేటి వరకు వున్న సాహిత్యాన్ని మనం ఒక్కమారు సింహావలోకనం చేస్తే స్త్రీ ఔన్నత్యాన్ని గూర్చి, స్త్రీ గొప్పతనం గూర్చి, ఆమె బాగోగులను గూర్చి చలంగారిలా పట్టించుకొన్న కవినాథుడే లేడు. స్త్రీని వివిధ కోణాలనుంచీ సునిశితంగా పరిశీలించిన 'స్త్రీ అభ్యుదయ వాది' చలంగారు.

ప్రబంధకవులు లాగా భావకవులు కాల్పనిక జగత్తులో విహరించక పోయినప్పటికీ భావకవులు సృష్టించిన పాత్రలు ఊహా ప్రపంచంలో తేలియాడుతూ వుంటాయే తప్ప ఎంత వెదికినా సామాజిక వాస్తవికతను ప్రతిబింబించేవిగా మాత్రం కనబడవు. కట్టమంచివారు స్త్రీని వాత్సల్య మూర్తిగా, దాక్షిణ్యమయిగా, వివేకవతిగా చిత్రించారు. స్త్రీ అంటే కేవలం భార్య మాత్రమే కాదు. మాతృమూర్తి, సోదరి, కూతురుకూడా అని గుర్తు చేస్తారు. ఉదా: లలిత, అనుమతి, కమల మొ।।వారు. విశ్వనాథవారు కిన్నెరను సౌందర్యరాశిగా, నుకుమారిగా, మహాశీలవతిగా రూపొందించారు. అడవి బాపిరాజుగారి స్త్రీ పాత్రలు కళాజగత్తులో తేలియాడతాయి. వీరి స్త్రీలు కళాపిపాసులు, సర్వ విద్యాపరిపూర్ణులు, ప్రేమ స్వరూపులు, ప్రజ్ఞామూర్తులు. వీరు స్త్రీని దైవమూర్తిగా, ఆరాధ్య దేవతగా భావించారే కాని ఎక్కడా అసభ్యకరంగా, అసహ్యంగా వర్ణించలేదు. ఆయనకు స్త్రీలపై వున్న పవిత్ర భావం అలాంటిది. అభ్యుదయ కవులలో శ్రీశ్రీ, నారాయణబాబు, తిలక్, దాశరధి, పట్టాభి మొ।।గు వారు సమాజంలోని స్త్రీకి సముచిత స్థానం ఇవ్వాలని కోరుకున్నారు. ఆధునిక కాలంలో ప్రధానంగా 1950-80 మధ్య కాలంలో ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ, నాయని కృష్ణకుమారి, శీలాసుభద్రాదేవి, కొలకలూరి స్వరూపరాణి, మొ।।గువారు కవయిత్రుల్లో పేరుగాంచారు.

స్త్రీవాదం - చారిత్రక నేపథ్యం :

1789 ఫ్రెంచి విప్లవం తర్వాత స్వేచ్ఛా, సమానత్వ భావాలు ప్రచారంలోకి వచ్చాయి. ఈ సమాజంలో పురుషులు, స్త్రీలు హక్కుల్ని అనుభవించే విషయంలో చాలా తేడా కనిపించినందువల్ల స్త్రీలు న్యాయం అందరికీ సమానమే హక్కుల్ని అందరూ అనుభవించాలి. పురుషులకున్న హక్కులు, స్త్రీలకు ఎందు కుండకూడదు? అనే ఆలోచనతో స్త్రీలు ప్రశ్నించడం మొదలు పెట్టారు. దీనితో స్త్రీలలో అనూహ్యమైన చైతన్యం కలిగింది. ఆ చైతన్యమే 1792లో మేరి ఓల్స్టనే క్రాఫ్ట్ రాసిన ''దివిండికేషన్ ఆఫ్ రైట్స్'' అనే గ్రంథంలో చోటు చేసుకున్నాయి. ఈ హక్కుల కోసం పారాడిన వ్యక్తి ఒలింపి-డి-గూజె (1748-1793) ఈమె 'మహిళల, మహిళా పౌరుల హక్కుల ప్రకటన' అనే గ్రంథాన్ని రాసారు. ఇండియాకు చెందిన పండిత రమాబాయి (1558-1922) హిందూ ఛాందస భావజాలాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ భారతదేశంలో స్త్రీల హక్కుల గురించి పోరాడిన తొలి తరం స్త్రీలలో ఈమె ఒకరు. ఇండోనేషియాకు చెందిన కార్తిని స్త్రీ విద్య కోసం, ఇరాన్‌లో ఖరాత్ ఉల్ అయూన్' (1815-1851) గృహ నిర్భందాన్ని ధిక్కరించి పరదాను, కుటుంబాన్ని వదిలేసి ముస్లిం ఛాందసుల ఆగ్రహానికి గురయింది. చైనాదేశానికి చెందిన 'ఓయూజిన్' (1875-1907) స్త్రీ విముక్తి పోరాటాల్లోను విప్లవ రాజకీయాల్లోను పాల్గొని అరెస్టయి, ఉరి తీయబడింది. తూర్పు దేశాల్లో పురుషులు కూడా చాలామంది స్త్రీ స్వేచ్ఛ కోసం పోరాడారు. ఈజిప్టు, ఇరాన్‌లలో చాలామంది పురుష

మేధావుల పరదాకి బహు భార్యత్వానికి, స్త్రీల గృహ నిర్భంధానికి వ్యతిరేకంగా పోరాడారు. 1942లో "సైమన్-డి-బోరా" రాసిన The Second Sex అనే గ్రంథం స్త్రీ స్వేచ్ఛకు సంబంధించిన విషయాల్ని, వివాహ కుటుంబ వ్యవస్థలు స్త్రీల అణచివేతకు ఎలా కారణమయ్యాయో ఆ గ్రంథంలో విపులీకరించారు. దీన్ని ఆధారం చేసుకునే స్త్రీవాదం బాగా అభివృద్ధి చెందింది. ఆ తరువాత వచ్చిన చాలా గ్రంథాలు స్త్రీ వాదానికి సిద్ధాంత నిర్దుష్టతను చేకూర్చాయి.

భారతదేశంలో 20వ శతాబ్దాన్ని ఉద్యమాలు యుగమని చెప్పవచ్చు. సాంఘిక, ఆర్థిక, రాజకీయ విషయాలు అనేక మార్పులకు గురి అయ్యాయి. ఆంగ్లేయుల ప్రభావం భారతదేశంలోని ప్రతి అంశంపై పడింది. ఆ ప్రభావంతో భారతదేశంలోని మతాచార సంప్రదాయాలపై స్త్రీలు ఎదురు తిరిగారు. స్త్రీలపై వున్న అణచివేతను, లింగ వివక్షతను వ్యతిరేకించడం జరిగింది. బాల్య వివాహాలు, సతీ సహగమనం మొ॥ వాటిని తీవ్రంగా నిరసించారు. స్త్రీ విద్య ఆవశ్యకతను గూర్చి విస్తృత ప్రచారం చేశారు. ఆ తరువాత స్త్రీలు దేశ జనాభాలో సగభాగమైన స్త్రీల ప్రాతినిథ్యాన్ని గుర్తించడం జరిగింది.

స్త్రీ కుటుంబ పరిధిని దాటి సామాజిక జీవితంలో ప్రవేశించినప్పటికీ వ్యాపార వస్తువుగా మిగిలింది తప్ప వ్యక్తిత్వాన్ని పెంచుకోలేక పోయింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు, పాశ్చాత్య దేశాలలో అప్పటికే స్థిరపడిన ఫెమినిజం ఇవన్నీ తీవ్ర ప్రభావాన్ని చూపించకపోయినప్పటికీ స్త్రీల సమస్యలపై ఏకాభిప్రాయం గల స్త్రీలు తాత్కాలిక ఉద్యమాలు నిర్వహించడం ప్రారంభించారు. ధరల పెరుగుదలకు, వరకట్నానికి, రూప్ కన్వర్ సతీసహగమనానికి మహిళా ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. భోపాల్ మహిళా ఉద్యమం, స్త్రీలపై అత్యాచారాల్ని వ్యతిరేకించే ఉద్యమం ఎ.పి. సారా వ్యతిరేకోద్యమం మొదలగు ఉద్యమాల ద్వారా స్త్రీలు సంచలనం సృష్టించారు.

రామ్మోహన్‌రాయ్, వీరేశలింగం, జ్యోతిరావు పూలే వంటి సంఘ సంస్కర్తలు స్త్రీల జనోద్ధరణ కోసం నడుము బిగించారు. సమాజాన్ని విశ్లేషిస్తూ వివిధ సెక్షన్స్‌లో స్త్రీల అణచివేతను సాహిత్యంలో ప్రతిబింబించిన శరత్, ప్రేం చంద్, శ్రీపాద, గురజాడ మొదలుకొని చలం, గోపిచంద్, రావిశాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావు, రంగనాయకమ్మ, అల్లం రాజయ్య, బి.ఎస్. రాములు మొ॥గు వారు స్త్రీల సమస్యలపై ఎంతగానో స్పందించి రచనలు చేశారు. రంగనాయకమ్మ, ఓల్గా, జయప్రభ, కొండేపూడి నిర్మల, విమల మొదలైనవారు 1980 నుంచి విప్లవ పోరాటాలలో పాల్గొని ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్ళారు. అనేకమంది రచయితలతో పాటు స్త్రీలు కూడా ముందుకొచ్చారు. కట్టుబాట్లను, మూఢ విశ్వాసాలను, సాంప్రదాయాలను స్త్రీలు ప్రశ్నించారు. పురుష స్వామ్యాన్ని నిలదీశారు. లైంగిక వివక్షత, కుటుంబ హింస, పెళ్ళి, పిల్లల పెంపకం విషయంలో స్త్రీకి హక్కు లేకపోవడం, వివాహ వ్యవస్థలో ప్రేమకు బదులు నిర్భంధం, ఆధిపత్యం - వంటి అనేక అనుభవాలను, తీవ్ర భావావేశంతో కవిత స్త్రీ అణచివేతకు సంబంధించిన పార్శ్వాలన్నీ కావ్య వస్తువులుగా తెలుగు సాహిత్యంలో రూపుదిద్దుకున్నాయి. తెలుగు సాహిత్యం కొత్త పుంతలు తొక్కింది. వీరి రచనల్లో స్త్రీల ఆర్తి, ఆవేదన, కష్టాలు, కన్నీళ్ళు, సంఘర్షణ, తిరుగుబాటు పెల్లుబికాయి. ఈ భావాల బలమైన చిత్రీకరణే స్త్రీవాద సాహిత్యంగా పరిణమించింది. స్త్రీ వాద కథలు రాసిన వారిలో ప్రముఖంగా చెప్పుకోదగిన స్త్రీ వాద రచయిత్రులు ఓల్గా, సత్యవతి, అబ్బూరి ఛాయాదేవి, కొండేపూడి నిర్మల, కుప్పిలి పద్మ, ముదిగంటి సుజాతరెడ్డి మొదలగువారు.

స్త్రీవాదం – నిర్వచనం :

'ఫెమినిజం' అనే మాటకు తెలుగులో వ్యవహార నామం స్త్రీవాదం. స్త్రీవాదానికి 150 ఏళ్ళ చరిత్ర ఉంది. పారిశ్రామిక విప్లవం వల్ల పెట్టుబడిదారి ఆర్థిక వ్యవస్థ రూపుదిద్దుకుంటూ అందుకు అనుగుణంగా ఉదార ప్రజాస్వామిక రాజకీయ భావాలు అభివృద్ధి చెందుతున్న చారిత్రక క్రమంలో అణచివేతకు గురవుతున్న వర్గంగా స్త్రీలను గుర్తించడం జరిగింది. మానవ సమాజంలో సగభాగంగా వున్న స్త్రీలు పురుషుల కంటే తక్కువ సాంఘిక స్థితిలో వుండటాన్ని ప్రశిస్తూ వాళ్ళ అభ్యుదయాన్ని, విముక్తినీ వాంఛిస్తూ వచ్చిన స్త్రీవాద భావన పందొమ్మిదవ శతాబ్ది ఉత్తరార్ధానికి ఉద్యమ రూపాన్ని తీసుకొని విస్తరించింది. బ్రిటిషు వలస పాలన కారణంగా స్త్రీవాదం మధ్యతరగతి వారి భావజాల వ్యవస్థను యథాశక్తిగా ప్రభావితం చేయడం ద్వారా భారతదేశంలోకి ప్రవేశించింది. స్త్రీవాదం 1975 నుండి ప్రారంభమై కొనసాగుతూ అంతర్జాతీయ మహిళా దశాబ్దిలో ఒక బలమైన ధోరణిగా వెళ్ళానుకొని, తెలుగు సాహిత్య సాంస్కృతిక రంగాలను గొప్ప మార్పుకు లోనుచేసింది "స్త్రీవాద ధోరణలు – సమకాలీన సాహిత్యం".

1) ఫెమినిస్టు స్టడీ సర్కిల్ : సమాజంలోనూ, కుటుంబంలోనూ, పనిలోనూ స్త్రీలు గురౌతున్న అణచివేత, దోపిడికి సంబంధించిన అవగాహన కలిగివుండి, ఈ పరిస్థితిని మార్చడానికి స్త్రీలు, పురుషులు చేపట్టే చైతన్య వంతమైన కార్యక్రమం.

2) వసంతా కన్నాభిరాన్ : స్త్రీలు తమ సెక్స్ వల్ల వివక్షతతో చూడబడుతున్నారని స్త్రీలుగా వాళ్ళకున్న ప్రత్యేక అవసరాలు తిరస్కరించబడుతున్నాయనీ, తీరడం లేదనీ, ఆ ప్రత్యేక అవసరాలు తీరాలంటే సాంఘిక, రాజకీయ, ఆర్థిక విధానాలలో మౌలిక మార్పులు రావాలని కోరుకొనేది స్త్రీ వాదం.

3) ఆచార్య కాత్యాయినీ విద్మహే : "స్త్రీ పురుషుల మధ్య అనమానతలున్నాయని వాటి కారణంగా కుటుంబంలోనూ, సమాజం లోనూ స్త్రీలు అణచివేతకు, పీడనకు గురి అవుతున్నారని తెలిపి, ఆవిధమైన స్త్రీల జీవితాలను అనుభవాలను వస్తువుగా చేసి రాస్తే అది స్త్రీవాద కవిత్వం".

4) ఓల్గా : స్త్రీవాదం కొన్ని విషయాలను ముందుకు తెచ్చి చర్చకు పెట్టింది. పితృస్వామ్యం, జండర్, అణచివేత, ఇంటి చాకిరి స్వభావం మొదలైన ఎన్నో విషయాల గురించి క్రొత్త ఆలోచనలు రేపింది. సమాజంలో స్త్రీ పురుషులు ఎలా నిర్వచింపబడతారనే దానిమీద ఆధారపడిన సమాజంలో రకరకాల విషయాలు రూపొందుతాయని, మిగిలిన విషయాలన్నింటికి నిర్దిష్టమైన స్వరూప, స్వభావాల నిచ్చేంత ప్రధానమైన విధానం జండర్ విధానమని స్త్రీ వాదం చెబుతుంది".

ముగింపు :

స్త్రీని దేవతగా, ఆరాధ్యమూర్తిగా ఆరాధిస్తూ నిత్య జీవితంలో ఆమెకు ఇవ్వవలసిన స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు కాని, సముచితమైన స్థానం కాని, గౌరవం కాని ఇవ్వలేక పోతున్నారు. స్త్రీ అందచందాల్ని, ఒంపుసొంపుల్ని, సోయగాల్ని, హొయల్ని, వ్యాపారాభివృద్ధి నిమిత్తం తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకోవడం మానాలి. క్లబ్బుల్లో, సినిమాల్లో, వాల్ పోస్టర్లలో, పత్రికల్లో, టి.విల్లో పుస్తకాల్లో విచక్షణారహితంగా స్త్రీని నగ్నంగా చిత్రీకరించండ మానుకోవాలి. స్త్రీలు ఇలాంటి వాటిని నిరసిస్తూ తమ వంతు సహకారాన్ని అందించాలి. ఏనాడైతే ఇవన్నీ ఆచరణలో సాధ్యమౌతుందో అప్పుడే నమాజం బాగుపడుతుంది. ఉపన్యాసాల్లోనే కాదు ప్రతి మనిషీ ఆలోచనా విధానంలో, మానసిక మైఖరిలో మార్పు రావాలి. స్త్రీ అంటే కేవలం భార్య మాత్రమే కాదు, మాతృమూర్తి,

సోదరి, కూతురు అని కూడా గుర్తుంచుకోవాలి. తరాలు మారటం కాదు అంతరాల్లో కూడా మార్పులు వచ్చినపుడే సమాజంలో నిజమైన మార్పును చూడగలం. నేడు సమాజంలోని స్త్రీ కన్నా సాహిత్యంలోని స్త్రీ అన్ని రంగాల్లో ముందుకు పోతుంది. దీనికి కారణం సాహిత్యంలో స్త్రీ గురించి అభ్యుదయాన్ని ప్రబోధించినవారు నిజ జీవితంలో ఆచరణలో పెట్టలేక పోవడమే.

విప్లవ కవుల్లో ప్రఖ్యాతుడైన శివసాగర్ "ఆకాశంలో సగభాగం స్త్రీలు" అనే 'మారో' కవితామయ వాక్యాన్ని తీసుకొని పారాటంలో స్త్రీ పురుషులిద్దరూ ఉద్యమించాలని చెపుతూ

"ఆకాశంలో సగం నీవు సగం నేను
మనిద్దిరం కలిసి ఉద్యమిస్తే ఉప్పెన
విప్లవిస్తే విజయం" అని అన్నారు.

గురజాడ గారు "ప్రేమ నిలిపిన ప్రేమ నిలుచును" అన్నారు.

ఎ.బి.కె. ప్రసాద్‌గారు "ఈ జీవితానికి కావలసిన ప్రధాన విషయము ఆవేశమూ కాదు, ఆబాకాదుగాని అవగాహన, సదావగాహన" అన్నారు.

కాబట్టి ఆవేశం లేకుండా సదవగాహనతో ప్రేమ కలిగి, అందరూ కలిసి ఉప్పెనగా ఉద్యమిస్తే చైతన్యంతో పాటు విజయం తథ్యం.

ఆధార గ్రంథాలు:

1) తెలుగు సాహిత్య చరిత్ర – డా॥ ద్వానాశాస్త్రి.

2) తెలుగు సాహిత్య చరిత్ర – ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న.

ఆముక్తమాల్యద-వర్ణనా వైశిష్ట్యం

డా. నల్లపనేని విజయలక్ష్మి, తెలుగు ఆధ్యాపకురాలు, యార్లగడ్డ అన్నపూర్ణాంబ ప్రభుత్వ మహిళా కళాశాల, చీరాల
సెల్ : 9701667350

'ప్రబంధ' పదం తొలిదశలో కావ్యం, కృతి శబ్దాలకు సమానార్థకంగా వాడబడింది. నన్నయ 'సత్యవాక్ప్రబంధ శత సహస్ర శ్లోక' అని వాడడం, నన్నెచోడుడు 'భంగిగ విస్తరించెదఁ బ్రబంధము సద్రస బంధురంబుగన్' అని వాడడం గమనించినపుడు ప్రబంధం, కావ్యం సమానార్థకాలని తెలుస్తుంది. అయితే కృష్ణదేవరాయల కాలంలో వెలువడిన కావ్యాలను 'ప్రబంధము' అనే పేరుతో ప్రత్యేకంగా గుర్తించిన ఆధునికులు ప్రబంధ లక్షణాలను కూడా వివరించారు. భాషాంతరీకరణం కాకుండా స్వతంత్ర రచన అయి ఉండటం, కథైక్యత, అష్టాదశ వర్ణనలు, శృంగార రస ప్రధానంగా ఉండటం మొదలైన లక్షణాలు కలిగినదే ప్రబంధమన్నారు.

సాహితీ నమరాంగణ సార్వభౌముడైన కృష్ణదేవరాయలు రచించిన ప్రబంధం 'ఆముక్తమాల్యద'. ఈ గ్రంథం వైష్ణవమత ప్రచారం ప్రధాన లక్ష్యంగా రచింపబడినప్పటికీ, వర్ణనా బాహుళ్యానికి ప్రసిద్ధిని పొందింది. ఈ గ్రంథంలో ఉన్నంత వర్ణనా వైవిధ్యం మరే ఇతర గ్రంథంలో కనిపించదు. మిగిలిన అన్ని ప్రబంధాల కంటె ఆముక్తమాల్యదలో ప్రకృతి వర్ణనలు అధికం. అందులోనూ ఇది ఋతు వర్ణనా ప్రధానమైన ప్రబంధం. కాళిదాసు సైతం ఇంత సాకల్యంగా ఋతు వర్ణనలు చేయలేదు.

కావ్యానికి/ప్రబంధానికి సొగసైన పేరు పెట్టటం 'ఆముక్తమాల్యద' తోనే ప్రారంభమైంది. గోదాదేవికి గల మరో పేరు ఆముక్తమాల్యద. 'దివ్య సూరి చరిత్ర', 'గురు పరంపర ప్రభావం', 'ప్రసన్నామృతమ్' మొదలైన వైష్ణవ మత గ్రంథాల ఆధారంగా రాయలు 'ఆముక్తమాల్యద'ను రచించాడు. విష్ణుపురాణంలోని ఖాండిక్య కేశిధ్వజ వృత్తాంతం, వరాహపురాణంలోని చండాల, బ్రహ్మరాక్షసుల కథ కూడా ఈ ప్రబంధంలో చోటు చేసుకున్నాయి.

మొత్తం కావ్యంలోని 872 పద్యాల్లో 500 పద్యాలను ముఖ్యమైన ఐదు కథలకు (విష్ణుచిత్తుడి కథ, ఖాండిక్య కేశిధ్వజ వృత్తాంతం, యామునాచార్య వృత్తాంతం, గోదాదేవి వృత్తాంతం, చండాల, బ్రహ్మరాక్షసుల కథ) రాయలు కేటాయించాడు. మిగిలిన 372 పద్యాల్లో పీఠికలోని 49 పద్యాలను పక్కన పెడితే మిగిలినవన్నీ వర్ణనలే. విల్లిబుత్తూరు వర్ణన 27 పద్యాలలో, మధురాపుర వర్ణన 38 పద్యాలలో చేసిన రాయలు ఋతు వర్ణనలకు అక్షరాలా నూట తొంభై అయిదు పద్యాలను కేటాయించాడు. అష్టాదశ వర్ణనలు అన్నీ చేసి తీరాలని ఆయన అనుకోలేదు. సముద్ర వర్ణన, పర్వత వర్ణన తదితరాలను విడిచిపెట్టాడు.

వర్ణన ఏదైనా రాజకవి రాయలు ప్రత్యేకత అందులో కనిపించటం విశేషం. రాయలు ఆనాటి జన జీవన విధానాన్ని తన వర్ణనల్లో నిక్షిప్తం చేశాడు. ఆయన లోక పరిశీలనా శక్తికి, ప్రౌఢ కవిగా ఆయన స్థాయికి ఆయా వర్ణనలు నిదర్శనాలు. ఎక్కువగా స్వభావోక్తి, ఉత్ప్రేక్షలను వాడిన రాయలు అద్భుతమైన భావ చిత్రాలను మన కళ్లముందు నిలుపుతాడు.

జన జీవన చిత్రణ:

రాయలు శ్రీ విల్లిబుత్తూరు పుర వర్ణనలో భాగంగా అరవ ఇల్లాండ్రు స్నానం చేయడానికి ముందు పసుపు రాసుకునే అలవాటును తెలుపుతూ చక్కని భావచిత్రాన్ని సృష్టించాడు.

ద్రవిడ కుటుంబిను ల్పసుపు రాచిన రత్నపుఁ దాప క్రింద నం

బువు దెరవాఱఁగా నిదురవోయి గరుత్తతి పచ్చఁ బాఱినన్
భవన సరో మరాళములు భర్మమయచ్ఛద గుచ్ఛ విస్ఫుర
దివిజ ధునీ మరాళవితతి భ్రమఁ బూన్చుఁ బురి
వ్రఘ్మించుచున్ (1-64)

అరవ ఇల్లాండ్రు జలకమాడడానికి ముందు బంగారు మెట్టు మీద పసుపు కొమ్ము అరుగదీయగా ఆ నీరు మెట్టు క్రిందికి పొర్లి ఆ క్రింద నిద్రిస్తున్న హంసల రెక్కల మీద పడిందట. పసుపు పచ్చగా మారిన ఆ హంసలు ఎగురుతుంటే ఆకాశగంగ నుండి వచ్చిన బంగారుహంసలేమో అనే భ్రమ పౌరులకు కలిగిందట.

అరుణోదయ వేళ బ్రాహ్మణులు కాలువకు వెళ్లి స్నానం చేసి బట్టలు పిండుకోవడం, రక్షకభటులు జాగ్రత్తగా విధి నిర్వహణలో నిమగ్నం కావడం తదితర అంశాలను వివరించిన మరో చక్కని భావచిత్రమిది.

తలఁ బక్షచ్ఛట గ్రుచ్చి బాతువులు కేదారంపుఁ గుల్యాంతర స్థలి నిద్రింపఁగఁ జూచి యారెకు లుష స్స్నాతప్రయాతద్విజా వలి పిండీకృత శాటిక ల్సవి దదావాసంబుఁ జేర్పంగ రే వుల డిగ్గ న్వెసఁ బాఱువానిఁ గని నవ్వు న్యాలిగోప్యోష్ణముల్ (1-65)

నిద్రించే సమయంలో తలను రెక్కల క్రిందికి ముడుచుకోవడం బాతుల సహజ స్వభావం. అలా నిద్రిస్తున్న బాతులను చూసి ద్విజులు స్నానం చేసి పిండిన బట్టలను మరిచిపోయారేమోనని ఆరెకులు వాటిని వారికి చేర్చడం కోసం రేవులోకి దిగారు. ఆ సందడికి అవి లేచి పరిగెత్తి పోయాయి. ఆరెకుల ఆమాయకత్వాన్ని చూసి పైరు కాపరి వెలదులు నవ్వారు.

లోకంలో దొంగతనం జరగగానే పోగొట్టుకున్నవారు ప్రభువు వద్ద పిర్యాదు చేయడం, దొంగను వధించి, చోరీ సొమ్మును బాధితులకు అప్పగించటానికి ప్రభువు బయలుదేరడం, ఆ విషయం తెలుసుకొన్న దొంగ దండనను తప్పించుకోవడానికి దొంగిలించిన సొమ్మును తెచ్చి ఎక్కడి నుండి తీశాడో అక్కడే పడవేయడం, కనబడకుండా వెళ్లిపోవడం సాధారణంగా జరుగుతాయి. పరోక్షంగా ఆ విషయాన్ని సూచిస్తూ రాయలు సృజించిన భావచిత్రమిది.

తన తోయం బినరశ్మ లెత్త, నిల వాత్యా రేణుమూర్తి స్మహేం
ద్రునకుఁ జెప్పఁగ, మ్రుచ్చుఁ బట్ట దివమందు న్విల్ఫుటింపం, భయం
బునఁ దద్రశ్మిసహస్రము న్వెస డిగెం బో డాఁగి వే గ్రుమ్మరిం
ప, ననం ధారలు దోఁచె మించు వెలిగింప న్మబ్బుల న్వెల్లిపై (4-83)

భూమి యొక్క అమూల్యమైన వస్తువు జలం. దానిని సూర్య కిరణాలు దొంగిలించాయి. అప్పుడు భూమి సుడిగాలికి లేచిన ధూళి రూపంలో ఆకాశానికి వెళ్లి దేవేంద్రునికి మొర పెట్టుకుంది. ఇంద్రుడు దొంగలను సంహరించి భూమికి నీటిని తెచ్చి ఇవ్వడం కోసం ధనస్సు ధరించి కదిలాడు. ఆ సంగతి తెలుసుకొన్న కిరణాలు తమ ప్రాణాలు కాపాడుకోవడం కోసం ఆయనకు కనబడకుండా మబ్బుల్లో దాక్కొని దొంగిలించిన జలాన్ని ధారలు ధారలుగా క్రుమ్మరించాయి. జలాశయాలు నిండిపోయాయి.

స్త్రీలు తమ నగలకు పట్టిన మురికిని వదిలించడం కోసం కుంకుడుకాయ రసంలో కడగడం సర్వసాధారణ విషయం. శరత్కాల మేఘాలను వినూత్నంగా వర్ణించే క్రమంలో ఆ విషయాన్ని రాయలు చిత్రించడాన్ని గమనించవచ్చు.

గగనలక్ష్మి నిజోరు నక్షత్రమాలి
కలు వియన్నది జలములఁ గడుగఁ బిసుక
నెఱయు కుంకుడుఁబండులనుఱువు లనఁగఁ
బలపలనిపాండురాంబుదపంక్తు లమరె (4-157)

శరత్కాలంలో నక్షత్రాలు బాగా మెరుస్తూ ఉండడం, అక్కడక్కడా తెల్లని మబ్బులు ఉండడం సాధారణం. ఆకాశలక్ష్మి తన ఇరవై ఏడు ముత్యాలు గల నక్షత్రమాలికను కడగడానికి ఆకాశగంగలో కుంకుడుకాయలను పిసకగా వాటి నుఱుగు ఆకాశమందంతటా దగ్గర దగ్గరగా గాలికి వ్యాపిస్తున్నట్లుగా మబ్బులు ఉన్నాయట. కురవని పలచని మబ్బులను సరికొత్తగా వర్ణించాడు కవి.

ఆ రోజుల్లో కంచుటద్దాలను ఎక్కువగా వాడేవారు. వాటిని ప్రతిరోజు సన్నని బూడిదతో తోమి మురికి తొలగించేవారు. ఆ అంశాన్ని తీసుకొని సరస్సులో సంచరిస్తున్న హంసలను రాయలు ఎంతో సొగసుగా వర్ణించాడు.

కలయఁగ వారి దేవతలు గాంచుసరోవరదంభ దర్పణం
బులపయి దట్టపుంజిలుము వోవఁగఁ దా మలకంచు గీయఁగా
బలె నలువంకలం గలయఁ బాయక తేలుచుఁ బద్మరేణువు
ల్లెలఁకులఁ బాసి పోఁ జెలఁగి గ్రేంకృతు లిచ్చె మరాళమాలికల్ (4-180)

సరస్సులు జల దేవతలు ముఖం చూసుకొనే కంచుటద్దాలట. వాటిపై వర్షాకాలంలో దట్టంగా చిలుము పేరుకొంది. హంసలు ఆ చిలుమును తోముతున్నాయేమో అన్నట్టుగా సరస్సులో అటూ ఇటూ కలయ తిరుగుతున్నాయి. అవి ఆ విధంగా తోమడం వల్ల చిలుము వదిలి తేలుతున్నదేమో అన్నట్టుగా వాటి కదలికల వల్ల రేగిన పద్మరేణువులు నీటి మీద తేలుతున్నాయి. హంసల క్రేంకారాలు అవి కంచుటద్దాలను చక్కగా తోమడం వల్ల ఏర్పడిన కీచు శబ్దాల వలె ఉన్నాయి.

విష్ణుచిత్తుడు అతిథులకు చేసే భోజన ఏర్పాట్లను వివరించే క్రమంలో రాయలు ఆయా కాలాలకు తగినట్టుగా ఆనాటి ప్రజలు తీసుకొనే ఆహార పదార్థాలను వర్ణించాడు. వర్షాకాలంలో ముసురు పట్టి వాన కురిసే రోజుల్లో కళ్లలోకి పొగ చొరబడి మండకుండా ఉండడం కోసం కొబ్బరిబోండాలు పొయ్యిలో వేసి వంట చేసే పద్ధతిని తెలిపాడు. వరి అన్నం, పప్పు, నాలుగయిదు తాలింపు కూరలు, వడియాలు, వరుగులు, పెరుగు, నేతి ధారలతో వర్షాకాలంలో విష్ణుచిత్తుడు అతిథులకు భోజనం పెట్టేవాడు. వేసవికాలంలో అతిథులకు ముందుగా చందనం ఆందించి, తరువాత చిరు వెచ్చగా ఉన్న అన్నం, తియ్యని చారులూ, మజ్జిగ పులుసులూ, పల్చని జావలూ, చెరకురసమూ, కొబ్బరినీళ్లూ, రసాలూ, ఫలాలూ, చల్లటి నీళ్లూ, మామిడి పిందెల ఊరగాయలూ, పల్చని మజ్జిగా వడ్డించేవాడు. శీతాకాలంలో వేడి అన్నం, మిరియపు పొడులూ, వేడి వేడి కూరలూ, ఆవపిండితో గుచ్చెత్తిన పచ్చళ్లూ, పాయసాన్నాలూ, ఊరగాయలూ, చెయ్యి చురుక్కనే వెచ్చటి నెయ్యీ, కాచిన చిక్కటి పాలతో అతిథులకు బోజనం పెట్టేవాడు. (1-80,81,82)

వర్షఋతు వర్ణనలో భాగంగా రెడ్ల జీవన విధానాన్ని, వారి ఆహారాన్ని కూడా రాయలు వర్ణించాడు.

గురుగుం జెంచలిఁ దుమ్మి లేఁదగిరిసాకుం దింత్రిణీపల్లవో
త్కరముం గూడఁ బొరంటి నూనియలతోఁ, గట్టావికుట్టారుగో
గిరము ల్మెక్కి, తమిం బసుల్పొలము వోఁ గ్రేపు ల్మెయిన్నాక, మే
కెరువుం గుంపటి మంచ మెక్కిరి ప్రభుత్వైకాప్తి రెడ్లజ్జడిన్ (4-134)

పాడిపంటలు గల రైతులు రెడ్లు. వర్షాకాలంలో వారు వేడి ఆరిక బియ్యపు అన్నంలో గురుగాకు, చెంచలాకు, తుమ్మియాకు, లేత తంటెపాకు అనే ఆకులతో చింతచిగురు చేర్చి సమృద్ధిగా నూనె పోసి వండిన కూరను తృప్తిగా

భుజిస్తారు. మేక ఎరువుతో రాజేసిన కుంపటిని మంచం కింద పెట్టుకొని వెచ్చగా పడుకుంటారు. పశువుల్ని మేత కోసం సేవకులు పొలం తోలుకెళితే, దూడలు వానలో తడవకుండా ఉండడం కోసం వాటిని మంచాల వద్దకే పిలుచుకొంటారు. అవి వారి దేహాన్ని నాకుతూ ఉంటాయి.

రాజుల విలాసవంతమైన జీవితాన్ని కూడా రాయలు వర్ణించాడు. రాకుమారులు కాస్త పొద్దెక్కిన తరువాత నిద్ర లేస్తారు. పరిమళభరితమైన పూలతో చేసిన గంధరాజమనే పరిమళద్రవ్యంతో శరీరాలకు నలుగు పెట్టించుకుంటారు. తరువాత వేడినీటి స్నానం చేసి కాంతి గల దోవతులు ధరిస్తారు. మణిహారాలు, మొగలిరేకులు ధరించి, జాము పొద్దెక్కిన తరువాత కొలువు తీరుతారు. రాజసపు వరి అన్నం, కౌజు, అడవిపందుల మాంసంతో, తాజా నెయ్యితో భుజిస్తారు. అధికమైన కస్తూరితో కూడిన తాంబూల సేవనం వల్ల వారి పెదాలు నల్లబడి ఉన్నాయి. అగరు చెక్కలతోడి కుంపటి మండుతుండగా, అంతఃపుర స్త్రీలతో ఆనందంగా ఉన్నారు.

ఈ వర్ణనల వల్ల భిన్న తరగతులకు చెందిన ప్రజల జీవనవిధానం, ఆహారపు అలవాట్లు తెలుసుకోవచ్చు.

వర్షాకాలంలో స్త్రీలు వంట చేయడానికి పడే పాట్లను రాయలు స్వభావోక్తిలో వర్ణించాడు. ఎన్నో ఇళ్లు తిరిగితే గాని కొంచెం నిప్పు దొరకదు. ఆ నిప్పురవ్వ మీద ఇంటి కప్పులోని గడ్డిని పెట్టి విసిరితే గాని అది రాజుకోదు. ఇంటి వాసాలు విరిచి పొయ్యిలో పెడితే గాని అది రగుల్కోదు. ఒకటే పొగ. ఇంత కష్టపడి వండిన అన్నం తొలి పంక్తి వారికే సరిపోతుంది. మళ్లీ వంట ప్రయత్నం తప్పదు. నేతిలో తడిపిన బట్టలను పొయ్యిలో వేసి మంటను రగుల్కొల్పడం, రాత్రి వరకు ఇతరులకే వండడం సరిపోతుంది. తమ ఆకలి కూడా చూసుకోకుండా వారు రోజంతా కష్టపడుతూనే ఉంటారు. (4-127)

ఋణ విముక్తి పొందినవాడు నలుగురిలో తల ఎత్తుకొని తిరిగే తీరును శరత్కాలపు మేఘాలతో ముడిపెట్టి ఎంత సొగసుగా వర్ణించాడో క్రింది పద్యంలో చూడవచ్చు.

అప్పు ల్వారిధి చేతఁ బుచ్చికొని, కార్యంబైన, మున్గొన్నయ
య్యప్పు ల్దొ చనియు న్సవృద్ధికముగా నవ్వార్ధికే తీర్పఁగా
నప్పణ్యాతివిశుద్ధజీవులు నిజాచ్ఛాంగంబులం దోఁచు న
ట్లొప్పారె న్శశిబింబగర్భితములై ద్యోచారిశుభ్రాభ్రముల్
(4-158)

సముద్రుని నుండి నీటిని ఋణంగా తీసుకొన్న మేఘాలు దేశాంతరం వెళ్లినా తమ పనులు పూర్తి కాగానే తిరిగి తీసుకొన్న దాని కంటె ఎక్కువగా (వడ్డీతో సహా) ఆ నీటి ఋణం తీర్చాయిట. అప్పు తీర్చుకోవడం వల్ల విశుద్ధాత్ములై, చంద్రబింబాన్ని లోపల ఉంచుకొన్నట్లుగా తెల్ల మబ్బులు ఆకాశంలో విహరిస్తున్నాయిట.

ఋణం తీరకపోతే ఆత్మ శుద్ధం కాదు కనుక ప్రకాశించదు. అలాగే నీలి మబ్బుల్లో చంద్రుడు అగపడడు. నల్లమబ్బు తెల్లబడడమే ఋణ విముక్తి. ఋణభారం తీరడం వల్ల కలిగిన ఆత్మవిశ్వాసం, దాని వల్ల కలిగే ప్రకాశం ఇక్కడ సూచితం.

ప్రకృతి పరిశీలన:

రాయలకు గల సూక్ష్మ పరిశీలనాశక్తి ఆయన వర్ణనల్లో వ్యక్తమౌతుంది. వేసవికాలంలోని వెన్నెలకు, శరత్కాలపు వెన్నెలకు గల తేడాను అట్టుతో పోలుస్తూ చక్కగా వర్ణించాడు.

ఎసఁగు కట్టావి క్రియ నావి రెగయ బగటి
యెండ యుడుకాఱకుండ భూమండలమునఁ
బొలిచె మాపటఁ బండువెన్నెల చకోర
పోతవితతికిఁ జాఁపట్టు వోసినట్టు (2-60)

రాత్రి పూట భూమి మీద వెన్నెల పరచుకొని ఉన్న సమయంలోనూ ఎండ వేడి తగ్గకపోవడం చేత భూమి నుండి ఆవిరి లేస్తూనే ఉందని, అది చూడడానికి కాలుతున్న పెనం మీద అట్లపిండి పోయగా పైకి లేస్తున్న ఆవిరిలా ఉందని రాయలు వర్ణించాడు. ఇక్కడ భూమిని కాలుతున్న పెనంగా, వెన్నెలను అట్లపిండితో వేసిన చాపట్టు (పలుచని అట్టు) గా వర్ణించాడు.

పరుషాతపతప్తంబగు
ధరణీపాత్రమునఁ బడుట దళమయ్యెఁ జుమీ
పరిపక్వంబై, యనఁగా
శరదిందుజోత్స్నా రేల సాంద్రతఁ గాసెన్ (4-176)

తీవ్రమైన ఎండ వల్ల బాగా కాలిన పెనం మీద అట్ల పిండి వేస్తే, అది పక్వమై చిక్కబడిన విధంగా శరత్కాలపు వెన్నెల చిక్కగా కాసిందట.

సమానమైన ఉపమానాలను తీసుకొని గ్రీష్మకాలంలోని పలుచని వెన్నెలను, శరత్కాలంలోని దట్టమైన వెన్నెలను ఆయన వర్ణించిన విధానం అపూర్వం.

ఎండాకాలం రాగానే పాటల వృక్షాలు పూస్తాయి. ఎండమావులు అగపడతాయి. బూరుగుపండ్లు పగులుతాయి. ఆ మార్పులను చక్కని స్వభావోక్తిలో వర్ణించాడు రాయలు.

పాటలవసుంధ రారుహ భాగదేయ
మాతతమరీచికాంబువర్షాగమంబు
ధరణిఁ బొడసూపె నంత నిదాఘసమయ
మదటుతో శాల్మలీఫల విదళనంబు (2-45)

వసంత ఋతువులో సంపెంగలు బాగా పూస్తాయి. వర్షాకాలంలో అవి పూయవు. మొగలి పూలు పూస్తాయి. ఆయా విషయాలను చక్కగా గమనించి తన ఋతు వర్ణనల్లో ఉపయోగించుకున్నాడు రాయలు.

వేసవిలో సుడిగాలి తిరగడాన్ని (సురగాలి దవదగ్ధ తరుపర్ణతతి రేఁపఁ/బావురా లని డేగపదుపు దూరె - 2-46) ఎంత అందంగా వర్ణించాడో, మేఘాలు చెట్ల ఆకులను మేసే చిటపట శబ్దాలను (వర్షపు చినుకుల తాకిడికి చెట్ల ఆకులు రంధ్రాలు పడిపోవడం - 4-115) అంతే అందంగా వర్ణించాడు.

వసంత ఋతువులో పండుటాకులు రాలి వాటి స్థానంలో చిగుళ్లు రావడం సాధారణం. పండుటాకులు రాలే దృశ్యాన్ని మన కళ్ల ముందు నిలపడంలో రాయలు సూక్ష్మదర్శిత్వం వెల్లడవుతున్నది.

మదనస్యందనతా స్వవృత్తిఁ దెలిపెం బాటీర భూభృద్వల
న్మృదువాతం బతిపక్వ పాదప లతా వృంతావళీ మూల రం
ధ్రదళ త్పంకజకర్ణి కాగణ హరిద్రాభంగ భా భాసుర
చ్ఛదన చ్ఛద్మవివర్తి కాంచన కన చ్చక్రచ్ఛటాచీత్కృతిన్
(5-108)

మలయమారుతం మన్మథుడి రథమట. దాని తాకిడికి ఎత్తయిన చెట్ల నుండి, తీగల నుండి పండుటాకులు ఊడి గిరగిరా తిరుగుతూ నేల రాలుతున్నాయి. పసుపు రంగులో ఉన్న అవి గుండ్రంగా తిరుగుతూ రాలుతుంటే రథానికి గల బంగారు చక్రాల్లా ఉన్నాయి. అచ్చంగా ఒక చలన దృశ్యాన్ని మన ముందుంచాడు రాయలు.

నీళ్లు లేని మడుగుల్లో చేపలను తినే కొంగలను, వర్షాకాలంలో కసవుతో, పుల్లలతో గూళ్లు కట్టుకునే కాకులను, కప్పల గాన కచేరీలను, ఆరుద్ర పురుగుల సమూహాలను - ఇలా సమస్త ప్రకృతిని చక్కని భావ చిత్రాలతో మన ముందుంచాడు రాయలు.

ఈ వర్ణనల సాయంతో రసజ్ఞతకు, ప్రకృతి అందాలకు, భోగభాగ్యాలకు నెలవైన రాయల రాజ్యంలో విహరించవచ్చు. అటు సమాజ పరంగానూ, ఇటు ప్రకృతి పరంగానూ రాయల కాలం నాటి పరిస్థితులను తెలుసుకోవచ్చు. ప్రౌఢకవిగా రాయలు ప్రత్యేకతను, లోకజ్ఞతను, పరిశీలనాశక్తిని గమనించవచ్చు.

ఆధార గ్రంథాలు:

1. ఆముక్తమాల్యదాసంజీవని - వేదము వేంకటరాయ శాస్త్రి, వేదము వేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్,మదరాసు, 1927
2. ప్రబంధములలో ప్రకృతి వర్ణనలు - డాక్టర్ అంతటి నరసింహం, చారీ అండ్ కంపెనీ, సికిందరాబాదు, 1979
3. ఆముక్తమాల్యద పరిచయం - మల్లాది హనుమంతరావు, సి.పి.బ్రౌన్ అకాడమీ, హైదరాబాదు, 2009
4. రాయ రత్నమంజూష - గార రంగనాథం, బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్, గుంటూరు, 2022

ఆనందమే అందం - హాస్యం

పరుచూరి విజయలక్ష్మి, ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ. ప్ర), గుంటూరు.

ఆంగ్ల భాష ప్రభావంతో మన తెలుగులో అడుగు పెట్టిన అనేక రచనా ప్రక్రియలలో కథ ఒక విశిష్ట ప్రక్రియగా స్థానం పొందింది. తెలుగు సాహిత్యంలో మహాభారత రచనతో కవిత్రయం వారు కథలను ప్రారంభించారు. అలాగే భాగవతంలో కూడా అనేక కథలు ఉన్నాయి. కానీ వాటిని కథా కావ్యాలు అనలేము. ఎందుకంటే అవి ఇతిహాస, పురాణాలకు, సంబంధించినవి. తరువాత కాశీ మజిలీ కథలు, తాతాచారికథలు, కాంభోజ రాజ కథలు, మొదలగునవి మౌఖికంగా ప్రచారంలో ఉన్నాయి. కానీ ఆంగ్ల సాహిత్య ప్రభావంతో కథా ప్రక్రియ బాగా ప్రచారంలోకి వచ్చింది.

గురజాడ "దిద్దుబాటు" కథతో ప్రారంభమైన తెలుగు కథ నానాటికీ ఇంతింతై వటుడింతై అన్నట్లుగా అనేక మార్పులు చేర్పులకు లోనవుతూ సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ, సామాజిక ఉద్యమాలను తనలో సంలీనం చేసుకుంటూ నిత్య నూతన ప్రక్రియగా వెలుగొందుతుంది.

శృంగారకథలు, ఉద్యమ కథలు, సామాజిక కథలు, హాస్య కథలు, పిల్లలకథలు అంటూ అనేకమైన అంశాలతో కథా రచన సాగుతూ ఉంది. ఇన్ని రకాలైన కథా రచనలో హాస్య కథలకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది.

"శృంగార హాస్య కరుణా రౌద్ర వీర భయానకాః
భీభత్సాద్భుత శాంతశ్చ నవ నాట్యే రసాః".

అని భరతుడు నాట్య శాస్త్రంలో తొమ్మిది రసాలను పేర్కొన్నాడు. వీటిలో శృంగారము రసరాజము గా గౌరవం పొందింది. దాని తరువాతి స్థానం ఆక్రమించినది హాస్య రసము. కావ్య రచనలోనే కాకుండా నిత్య జీవితంలోనూ హాస్యానికి చాలా ప్రాముఖ్యత ఉంది. "నవ్వు నాలుగువిధాల చేటు". అనేది ఒకప్పటి మాట. "నవ్వు నలభై విధాలా మేలు" అనేది ఇప్పటి మాట. దీన్ని గమనిస్తే హాస్యం ఎంత గొప్పదో తెలుస్తుంది. కథా రచన మొదలైన కాలం నుంచి తెలుగు సాహిత్యంలో హాస్య రచనలు చేసినవారు కొద్దిమందే ఉన్నారు. మొక్కపాటి వారు, చిలకమర్తివారు, మునిమాణిక్యం వారు, మొదలైన కొద్దిమంది హాస్య రచనలు మన సాహిత్యంలో నిత్య నూతనగా వెలుగొందుతున్నాయి. అయితే ఆధునిక సాహిత్యంలో హాస్య రచనలు చాలా తక్కువగానే ఉన్నాయి. హాస్యం రాయడం, మెప్పించడం చాలా కష్టం. అంతే కాకుండా హాస్యరచనలు వలన అంతగా పేరు ప్రతిష్టలు రావు అనే అపోహ ఉండటం కూడా ఒక కారణమని చెప్పవచ్చు.

ఈ కాలంలో హాస్య రచనలు చేస్తున్న అతికొద్ది మంది రచయితలలో పొత్తూరి విజయలక్ష్మి గారిది ప్రత్యేకస్థానం అని చెప్పవచ్చు. పొత్తూరి విజయలక్ష్మిగారు గుంటూరు జిల్లా యాజలి గ్రామంలో 1953 న శ్రీ వల్లూరి వెంకట కృష్ణమూర్తి, సత్యవాణి దంపతులకు జన్మించారు. విజయలక్ష్మి గారి బాల్యమంతా యాజలి గ్రామంలో ఉమ్మడికుటుంబంలో గడిచింది వారి బాల్యంగురించి మనకు ఆవిడ కథల ద్వారా తెలుస్తుంది. "బొమ్మలపెళ్ళి" కథలో "ప్రతేడు బొమ్మలపెళ్ళి చేస్తే మంచి మొగుడు వస్తాడు అని మమ్ములను బొమ్మలపెళ్ళి చేయమనేవాళ్ళు మా పెద్దవాళ్లు. మేమూ చేసేవాళ్ళం మరి ఆదేమిటోగాని చిన్నతనంలో ఏ మంచిపని చేయించినా మంచి మొగుడు రావాలనే చేయించే వాళ్ళు. బాగా చదువు రావాలని గాని, పెద్ద ఉద్యోగాలు చేసి ఊళ్ళేలాలని గాని ఒక నోము గాని , వ్రతం గాని చేయిస్తే ఒట్టు. ఏమిటో అలా గడిచి పోయింది. మా బాల్యం."అని

చెప్పుకున్నారు. విజయలక్ష్మి గారు యాజలి గ్రామంలో ఉన్నంత వరకే చేదుకున్నారు. ప్రపంచమనే విద్యాలయంలో జీవితమనే ఉపాధ్యాయుడి దగ్గర అనుభవాలనే పాఠాలు నేర్చుకున్నాను అని ఆవిడే స్వయంగా తెలియజేశారు.

వీరు సుమారు 19 నవలలు రచించారు. ఇప్పటివరకు పొత్తూరి విజయలక్ష్మిగారి హాస్యకథలు, మా ఇంటిరామాయణం, చంద్రహారం, సన్మానం, ఆనందమే అందం, పూర్వి, జీవన జ్యోతి, అనే పేర్లతో 7 సంపుటాలుగా 145 కథలను రచించారు. ఈ రచనలన్నింటిలోనూ హాస్యమే ప్రధానంగా కనిపిస్తుంది. కానీ కుటుంబపరమైన కథలు, దేశభక్తి కథలు ప్రేరణాత్మక కథలు, విజయాత్మక కథలు కూడా అనేకం రాశారు. వారి ప్రతి కథలోనూ మనకు కొత్తదనం, జీవిత సత్యాలే కాక సమాజంలో నిత్యం జరిగే అనేక సంఘటనలు మనకు కళ్ళకు కట్టినట్లుగా ఉంటాయి.

విషయంలోకి వెళ్లబోయేముందు నవరసాల్లో శృంగారం తరువాతి స్థానంలో నిలబడింది హాస్యం. విజయలక్ష్మి గారి కథల్లోని హాస్యాన్ని గురించి మృణాళిని గారు "విజయలక్ష్మి గారిలో నిఖార్సైన హ్యూమర్ ఉంది. ఆమె కలంలో చక్కని చమత్కారం ఉంది. ఆమె రచనలో ఎక్కువగా ఉన్నది సంభాషణా గత హాస్యం. విజయలక్ష్మి గారిది స్వచ్ఛమైన హాస్యం. కొన్ని కథల్లో అధిక్షేపక దృష్టి చక్కగా ఆవిష్కృతమైనది. అలాంటి కథలు చాలా బాగున్నాయి. ఆధునిక జీవితంలోని ఎన్నో విషయాలను ఆమె సునిశితంగా విశ్లేషించారు. నిజానికి ఆమె కథల్లోని వస్తువులు అసాధారణమైనవి కావు. కానీ నిత్యం మనం చూసేవాటిని, నిత్యం అనుభవించే ఇబ్బందులను కాస్తంత సెన్సాఫ్ హ్యూమర్ తో చూడగలిగితే జీవితాన్ని భరించడం సులువు అవుతుందని ఈ కథలు చెబుతాయి"అని అభిప్రాయపడ్డారు. అదే విధంగా పోరంకి దక్షిణామూర్తిగారు, శ్రీ రమణ గారు, సలీం గారు, యుద్ధనపూడి సులోచనగారు, ఇలాంటి ప్రముఖులెందరో విజయలక్ష్మి గారి హాస్యాన్ని అభినందించడం జరిగినది.

అసలు పొత్తూరి విజయలక్ష్మి గారికి హాస్యం అంటే ప్రాణం. జీవితాంతం మనిషి ఉన్నదాంతో హాయిగా జీవించాలనేది వారి సిద్ధాంతం. "సందడి సందడిగా జీవితం జరిగిపోయింది. నవ్వుతూనే బతికేశాం. అందుకే హాస్యం నా జీవితంలో భాగం అయిపోయింది. మాకు కష్టాలు లేవా అంటే ఉన్నాయి. సమస్యలు రావా అంటే వస్తాయి. వాటిదోవన అవి వస్తాయి. పోతాయి. అంటే అసలామాటకొస్తే ఎవరి జీవితము పూలపాన్పు కాదు. అన్నీ ఉన్నా ఏడ్చేవాళ్ళు ఉన్నారు. ఏమీ లేకపోయినా నవ్వుతూ బ్రతికే వాళ్ళు ఉన్నారు కాసేపు మనసారా నవ్వుకొని హాయిగా ఉందాం అనుకునేవారు ఎందరో ఉన్నారు. వారికోసమే రాశాను. రాస్తున్నాను. ఇకముందుకూడా రాస్తాను అంటారు విజయలక్ష్మిగారు. ఆవిడ చెప్పినట్లుగానే ఈనాటికీ హాస్యాన్ని పండిస్తూనే ఉన్నారు.

పొత్తూరి విజయలక్ష్మి గారు రచించిన "ఆనందమే అందం" కథా సంపుటిలోని హాస్యకథలను ఒకసారి తడిమి ఆనందిద్దాం.ఈ సంపుటిలో అ.భ.సం, కొత్త కథ, రావోయి చందమామ మావి0తగాధ వినుమా, మా ఆవిడకు పతిదొరికాడు, అవంతిక ఆవకాయ పెట్టింది, కథ వెనుక కథ, మంగళం మంగళం, అచ్చు తిప్పలు, పచ్చడన్నం, నిద్రానుభవాలు, నామకరణం అనే 11 హాస్యకథలున్నాయి.

"అ.భ.సం." కథ పేరే హాస్య ప్రదంగా ఉంది. "అపర భస్మాసురల సంఘం". ఆనందరావు రియల్ ఎస్టేట్ కంపెనీలో ఏజెంటుగా పనిచేస్తున్నాడు. మొదటిసారిగా భజగోవిందాన్ని కలిశాడు. భజగోవిందానికి తమ సైటు గొప్పదనం గురించి చెప్పాడు. నా స్నేహితుడు రాగానే అందరం కలిసి వెళదాం అన్నాడు భజగోవిందం. కొంత

సేపటికి సీతారామ రావు వచ్చాడు. వారికొక సంస్థ ఉంది. దానిపేరు అపర భస్మాసురులు సంఘం. ముద్దుగా అ.భ.సం. అని పిలుస్తారు. అ.భ.సం. పెట్టి సంవత్సరం అవుతున్న సందర్భంగా ఉత్తమోత్తమ భస్మాసుర, ఉత్తమ భస్మాసుర, మామూలు భస్మాసుర అని మూడు అవార్డులు ఇవ్వదలిచారు. వారికి చాలా ఉత్తరాలు వచ్చాయి . మొదటి ఉత్తరంలో ఒకతనికి పిత్రార్జితంగా వచ్చిన యాభై లక్షలు నష్టపోయి చివరకు యాభై రూపాయిలు మిగిలాయి. రెండవ అతని ఇంటిపైకి చెట్టుకొమ్మలు వచ్చాయని కొట్టించాడు. అలా ప్రభుత్వ చెట్లు నరకడం నేరమని అతని ఇంటిలో ఉన్న కలప మొత్తాన్ని పోలీసులు ఎత్తుకుపోయారు. మీకు, వీరప్పన్ కు ఏమైనా సంబంధం ఉందా అంటూ హింసించడం మొదలు పెట్టారు. ఈ విధంగా అతను అంతా నష్టపోయాడు. ఇక మూడవ అతను కొడుకుని అమెరికా పంపాడు. ఆక్కడ చదువు సంధ్యలు అబ్బలేదు కానీ అక్కడి అలవాట్లు మాత్రం బాగా అబ్బాయి. ఇక్కడ అవి తీర్చడం కోసం అప్పుల పాలయ్యారు. వీరిలో ఎవరికి మొదరి బహుమతి ఇద్దాం అని అడిగెలోపలే ఆనందరావు పారిపోతుంటాడు. అపార భస్మాసురులు సంఘం అనే పేరే హాస్యాన్ని కలిగిస్తుంది.

కొత్త కథ లో ఒక సినిమా కథ కోసం సమావేశమైన నిర్మాత దర్శకుడు, మాటల రచయిత,లకు కథా రచయిత కథ చెప్పడం. పిచ్చి మలుపులతో ఉన్న కథను ఓకే చేసి దానికి 'చూడక చస్తారా' అనే పేరు పెట్టడం.

ఎప్పుడో ఊరొ దిలి వెళ్ళిపోయిన భర్త కోసం రోజు వంట చేసి ఎదురు చూసే రాజ్యలక్ష్మి, సావిత్రే తన భార్య అనుకోని అదే బ్రమలో బతికే రామనాధం ల కథే "రావోయి చందమామ మా వింత గాధ వినుమా" కథ.

ఆనందరావు, రమ భార్యా భర్తలు వాళ్ళ ఇంటిలో పనివాడు రమాపతి. అతనికి మొత్తం పేరు ఇష్టం ఉండదని పతి అని పిలవడం మొదలుపెట్టారు. కానీ ఆపేరుతోనే సమస్య వచ్చింది. రమాపతి గారు రావాలి అని పిలిస్తే స్టేజమీదకు పతి వెళతాడు. అదిచూసి అందరూ ఆనంద రావును ఎగతాళి చేస్తారు. కోపంతో ఆనందరావ్ పతిని వెళ్ళగొడతాడు. ఆ రోజు నుండి రమ పనిచేసుకోలేక పతి పతి అని కలవరిస్తూ ఉంటుంది. ఎలాగోలా రమాపతి ఇంటికి తిరిగి వస్తాడు. రమ ఆనందాన్ని చూసిన ఆనందరావు మా ఆవిడకు పతిదొరికాడు అని సంతోష పడతాడు. కథ పేరే ఇక్కడ మనకు నవ్వు తెప్పిస్తుంది.

సినిమా కథల కష్టాలను చెబుతూ కడుపుబ్బా నవ్వించే కథ "అవంతిక ఆవకాయ పెట్టింది." పత్రికలకు కథలు పంపించి ఆచ్చయినాక పారితోషికం కోసం ఆఫీసు చుట్టూ తిరిగి అలిసిన రచయిత కథే "కథవెనుక కథ"

పై ఆఫీసర్ల పిచ్చి నిర్ణయాలతో ఉద్యోగస్తులు ఎలాంటి పాట్లు పడతారో తెలిపే కథ "మంగళం మంగళం"

రచయితలు తమ పుస్తకాలు తామే అచ్చు వేసుకొని అమ్ముకోవడం చేతకాక వాటిని ఎం చేయాలో తెలియక అందరికీ పంచుతూ పడే పాట్లు "అచ్చుతిప్పలు"కథ.

పెళ్ళిళ్ళల్లో బఫే భోజనాల గురించి చెబుతూ ఆలోచన ఉంటే ఎక్కడైనా విజయం సాధించవచ్చు అని నవ్విస్తూనే వ్యాపార రహస్యాలను బోధించే కథ "పచ్చడన్నం"

అతిగా నిద్రపోయే భాగస్వాముల వల్ల పడే కష్టాలు దానివల్ల వచ్చే విపరీతాలు వివరించే కథ "నిద్రానుభవాలు".

ఇక ఈ ఆనందమే అందం కథ సంపుటిలో చివరి కథ "నామకరణం" . వెంకటేశ్వరరావు, సుబ్బలక్ష్మిదంపతులు సాఫ్ట్ వేర్ ఉద్యోగులు. భర్త 6 నెలలు అమెరికాలో ఉంటే 6 నెలలు ఇండియాలో ఉంటాడు. సుబ్బలక్ష్మి కూడా ఇండియాకి సింగపూరుకి తిరుగుతూ ఉంటుంది. ఈ తిరుగుళ్ళ మధ్య 35 ఏళ్ళు దాటిన తరువాత వాళ్ళకు కూతురు పుట్టింది. ఆ పాపకు ఎవరికి లేని అపురూపమైన

పేరు పెట్టాలని వాళ్ళ తాపత్రయం. అందుకే సుబ్బలక్ష్మి గర్భం దాల్చిన దగ్గరనుండి నామకరణం రోజు వరకు వెతుకుతూనే ఉన్నారు కానీ ఏ పేరు నిశ్చయం కాలేదు. ఎవరెన్ని పేరులుచెప్పినా నచ్చడం లేదు. ఇంతలో కందిపప్పు నుండి ఫోన్ వస్తుంది. అందరూ ఈ కందిపప్పు ఎవరని ఆశ్చర్యపోతుంటే తన స్నేహితురాలని చెబుతుంది సుబ్బలక్ష్మి. ఆవిడ అసలుపేరు కనకమహాలక్ష్మి స్కూల్ లో కనకం అని మార్చుకుంది . ఆవిడకు పప్పుదినకరరావుతో పెళ్ళయి అమెరికా వెళ్ళినాక కనకాదినకర్ పప్పు కాస్తా కండిపప్పుగా మారిపోయింది. ఆమె పేర్లు పెట్టడంలో దిట్ట. వాళ్ళ స్నేహితురాలి పాపకు 'ఉ' అనే అక్షరంతో పేరుపెట్టాలి అంటే "ఉద్ధరిణి" అనిపెట్టింది అని గొప్పగా చెబుతుంది సుబ్బలక్ష్మి.

కందిపప్పు రాగానే కాఫీ ఇచ్చి పిల్ల అమ్మమ్మ నీ కొడుకు పేరు ఏమిటమ్మ? అంటే 'కుంక' అనిచెబుతుంది. అదేం పేరమ్మ అంటే నాకు అనిల కుంబ్లే అంటే ప్రాణం, దినకర్ కి కపిల్ దేవ్ అంటే ఇష్టం ఇద్దరిపేర్లు కలిపి 'కుంక' అని పెట్టాం అని చెబుతుంది. పిచ్చి పలు రకాలు వెర్రి వెయ్యి రకాలు అంటారు. ఇది చదివితే ఆ మాట నిజమేనేమో అనిపిస్తుంది. ఈ పేర్ల పిచ్చి మన చుట్టుపక్కల కూడా కనిపిస్తూనే ఉంటుంది. చివరకు కందిపప్పు సుబ్బలక్ష్మి కూతురుకు 'మధుమేహ' అనిపెడుతుంది. పెద్దలందరు అదేమిటి జబ్బు పేరు పెట్టారు అని వాపోతుంటే, ఆ.. మొత్తం పేరు ఎవరు పిలుస్తారు మధు,, లేక మేహ్ అని పిలుస్తారు అని ఒకరికొకరు ధైరం చెప్పుకుంటారు.

ఇప్పుడు మనం చాలా చోట్ల ఈ పేర్ల తిప్పలు చూస్తూనే ఉన్నాము . ఎవ్వరికీ లేనిపపేరు ఉండాలని 'శ్మశాన' అని పేరుపెట్టారని విన్నపుడు ఈ కథ సహజంగా సమాజంలో చూసిన దానిని హాస్య యుక్తంగా రాసిన విజయలక్ష్మి గారి పరిశీలనా శక్తి అమోఘం.

"ఆనందమే అందం" సంపుటిలో ఏ కథ చదివినా కొత్త పెళ్ళికూతురు పూలు కడుతున్నట్లు పోకిరిపిల్ల గవ్వలు చిలకరించినట్టు, తొలకరి జల్లులో తడిసిన పాలపిట్ట రెక్కలు విదిల్చినట్టు అనిపిస్తుంది" అని ముందుమాట రాసిన శ్రీ రమణ గారి మాటలు అతిశయోక్తికాదు.

ఆధార గ్రంధాలు :

ఆనందమే అందం కథల సంపుటి.

అన్నమాచార్య సంకీర్తనల్లో మానవహక్కుల పరిశీలన

డా॥ డి. ధాత్రికుమారి, సహాయాచార్యులు, ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ.ప్ర), గుంటూరు.

ఉపోద్ఘాతం :

ఈ సృష్టిలో మానవజన్మ సర్వోత్తమమైనది. మానవునికి పుట్టుకతోనే సహజంగా బాధ్యతలతో పాటే హక్కులు కూడ ఏర్పడ్డాయి. వాటిలో ప్రధానంగా పేర్కొనదగ్గవి జీవించే హక్కు, స్వేచ్ఛా హక్కు, స్పందనా హక్కు, ఇతరుల చేత ఏ విధమైన బాధ పొందకుండా ఉండే హక్కు, ఆత్మరక్షణా హక్కు మొదలైనవి. ఈ హక్కులే గాకుండా సూక్ష్మంగా ఆలోచిస్తే మరికొన్ని హక్కులు కూడా గోచరిస్తాయి. కవులు, రచయితలు వారి కవితల్లో పొందుపరచో, గేయాల ద్వారానూ, వాటిని కథల్లో నిక్షిప్తం చేసోఈ హక్కుల గురించి బాధ్యతల గురించి ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. 1948 డిసెంబరు 10వ తేదీని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల దినోత్సవంగా ప్రకటన చేసిన నాటి నుంచి ఎక్కడ చూసినా మానవ హక్కుల ప్రస్తావనే. ఇవేమీ లేని ప్రాచీన కావ్యాలలో సైతం ఈ హక్కుల ప్రస్తావన కలదు. ఇతిహాసాలైన భారత, రామాయణాలలో మానవ హక్కులు దృశ్యాదృశ్యంగా గోచరిస్తాయి. అయితే అవి హక్కుల రూపంలో కాకుండా ధర్మం, న్యాయం, పాడి, ఆచార వ్యవహారాలు, అభ్యుదయ భావాలు, మ సమాజ భావాలు మొదలైనవాటి రూపంలో ఉండేవి. సందర్భోచితంగా ఆయా హక్కుల ప్రస్తావన ప్రత్యక్షంగానో, పరోక్షంగానో చోటు చేసుకునేది. వివిధ రూపాలలో సాక్షాత్కరిస్తున్న మానవ హక్కులను గురించి తమ రచనలలో పేర్కొన్న వారిలో మొదటివారిగా శివకవులనుపేర్కొనవచ్చు. ఆ తర్వాత పద కవులను ప్రధానంగా పేర్కొనవచ్చు. వాగ్గేయకారులైన పద కవులు భక్తి వస్తుకంగా కవిత్వాన్ని వెలువరించారు. తమ పదాల ద్వారా భక్తిని ప్రచారం చేశారు. భక్తితో పాటు వీరి కృతులలో సందర్భోచితంగా కొన్ని మానవ హక్కుల ప్రస్తావనను కూడ మనం గమనించవచ్చు. అటువంటి పదకవులలో ప్రఖ్యాతి గాంచినవారు పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యులు.

అన్నమాచార్య సంకీర్తనల్లో మానవ హక్కులు:

పదకవితా పితామహుడు, సంకీర్తనాచార్య బిరుదాంకితులైన అన్నమాచార్యులు సంస్కృతాంధ్రాలలో అపార వైదుష్యం కలవారు. అన్నమయ్య కడపజిల్లా రాజంపేట మండలంలోని తాళ్లపాక గ్రామంలో నారాయణ సూరి, లక్కమాంబలకు స్వామి అనుగ్రహంతో క్రీ.శ. 1408 విరోధినామ సంవత్సరం, వైశాఖమాసం పూర్ణిమ తిథి, విశాఖ నక్షత్రంలో విష్ణునందకాంశతో జన్మించారు. అన్నమయ్య 32 వేల శృంగార, అధ్యాత్మసంకీర్తనలను రచించారు. వీటిలో దాదాపు ఈనాడు 13,725 వేల సంకీర్తనలు లభిస్తున్నాయి. వీటితో పాటు 12 శతకాలు, శృంగారమంజరి, వేంకటేశ్వర శతకం, ద్విపద రామాయణం, సంస్కృతంలో వేంకటాచలమాహాత్మ్యం, సంకీర్తన లక్షణ గ్రంథం రచించినట్లు చిన్నన్న రచించిన అన్నమాచార్య చరిత్ర ఆధారంగా తెలుస్తోంది.

శ్రీ వేంకటేశ్వరస్వామి అంతరంగిక భక్తుడైన అన్నమయ్య సంకీర్తనలలో జీవించే, స్వేచ్ఛా పరిరక్షణ, సమానత్వపు, ఏకాంతపు, మత స్వాతంత్ర్యపు, జీవుల, స్త్రీల హక్కుల ప్రస్తావనలు కనిపిస్తాయి. వారి సంకీర్తనల్లో చోటు చేసుకున్న మానవ హక్కులను గురించి రేఖామాత్రంగా తెలియజేయడమే ఈ పత్ర ప్రధానోద్దేశం.

జీవించే హక్కులు :

వెఱతు వెఱతు నిండు వేడుక పడనిట్టి
కుఱుచ బుద్ధుల నెట్టు చాలుదునయ్య ॥పల్లవి॥
తల్లిఁజంపెదువాడు తలఁప దుష్టుఁడు గాక
యెల్లవారలకెల్ల (కన్న?)నెక్కుడట

కల్లరియనుచు లోకము రోయుపనియిది
చెల్లఁబో నేనేమి సేయుదునయ్య ॥వెఱ॥
దంటనై యాతని దాసాను దాసియైఁగ
నొంటినుండెద నేమి నొల్లనోయయ్య ॥వెఱ॥

(తాళ్ళపాక అన్నమాచార్యుల ఆధ్యాత్మిక సంకీర్తనలు సంపుటి.1 సంకీర్తన .235)

తల్లినిగాని, తండ్రినిగాని, తనయుణ్ణిగాని, తోబుట్టువునుగాని ఎవరినైనా చంపడం మంచిదికాదని, అయితే దురదృష్టవశాత్తు అలా చంపిన వారు కూడ గొప్పవారుగా చెలామణి అయిపోతున్నారని అన్నమయ్య పై సంకీర్తనలో తెలియజేశారు. ఏ కారణం చేతనైనా ఎవరినీ చంపడం తగదని పై కీర్తనలో స్పష్టం చేశారు. అలా చంపే హక్కు ఎవరికీ లేదని, అలాచేస్తే అది ఇతరుల జీవించే హక్కును కాలరాసినట్లే అవుతుందని అన్నమయ్య ధ్వని పూర్వకంగా ప్రస్తావించారు.

స్వేచ్ఛా పరిరక్షణ హక్కు :

ఒకనాడు సాళువ నరసింహరాయల కోరిక మేరకు అతని ఆస్థానంలో ఉన్న తాళ్ళపాక అన్నమాచార్యులు విష్ణుదేవుని కీర్తిస్తూ ఆలంకారికమైన, శృంగార భరితమైన "ఏ మొకొ చిగురుటధరమున" (2-82) అనే మధుర గేయాన్ని ఆలపించారు. ఆ గేయాన్ని విన్న సాళువ నరసింహరాయలు తనని కూడ నాయకునిగా చేసి పాట పాడమని ఆదేశించాడు". "హరిని కొనియాడే తన జిహ్వ అన్యుల కొనియాడనేరద"ని రాజు ఆదేశాన్ని సున్నితంగా తిరస్కరించారు అన్నమయ్య. దీనితో వట్టరాని అహంకారంతో రాజు అన్నమాచార్యునికి సంకెళ్లు వేసి బంధించాడు. ఆరోజుల్లోనే తన స్వేచ్ఛా పరిరక్షణ హక్కును కాపాడుకునేందుకు ప్రయత్నం చేశాడు అన్నమయ్య. ఇక్కడ అన్నమయ్య స్వేచ్ఛగా జీవించే హక్కుకు నరసింహరాయలు భంగపరచాడు. రాజైనా సరే పరుల స్వేచ్ఛకు భంగం కలిగించరాదని ఈ సన్నివేశం బోధపరుస్తుంది.

సమానత్వపు హక్కు :

అన్నమయ్య తన కాలంనాటికే సమాజంలో నెలకొని ఉన్న హెచ్చుతగ్గులను నిరసిస్తూ, ధనిక, పేద భేదాలు లేని సమ సమాజాన్ని కాంక్షించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సమానమనే భావనని వెలిబుచ్చారు. సర్వ సమత్వాన్ని ఆవిష్కరించే ఒక అద్భుత సంకీర్తనను రచించాడు.

తందనాన అహి తందనాన పురె
తందనాన భళా తందనాన ॥పల్లవి॥
బ్రహ్మ మొకటె పరబ్రహ్మ మొకటె పర
బ్రహ్మ మొకటే పరబ్రహ్మమొకటే ॥తంద॥
కందువగు హీనాధికము లిందు లేవు
అందరికి శ్రీహరే అంతరాత్మ
ఇందులో జంతు కులమంతా నొకటే
అందరికి శ్రీహరే అంతరాత్మ ॥తంద॥
వొనర నిరుతదరును వొక్కటే అవియు ॥తంద॥
తందనానఅహి తందనాన పురె ॥పల్లవి॥

(తాళ్ళ.అన్నమా.ఆధ్యా. సంకీ. సం.2, సంకీ .385)

అన్నమయ్య తన సంకీర్తనల ద్వారా ఆనాడే సమసమాజ స్థాపనకు నడుము బిగించారు. సంఘంలో పుట్టుక చేత మానవులలో కొందరు అధికులు, మరికొందరు అధములనే భేదాలు ఉండటాన్ని అన్నమయ్య వ్యతిరేకించారు. వృత్తుల ఆధారంగా ఏర్పడిన కులాల స్థానంలో క్రమంగా పుట్టుక ఆధారంగా కులాన్ని నిర్ణయించే దుష్ట సంప్రదాయం సమాజంలో నెలకొన్నది. ఇలా మార్పుచెంది మన సమాజాన్ని పట్టి పీడిస్తున్న కులమత తారతమ్యాలను అన్నమయ్య ఆనాడే నిరసించాడు. కుల, మత భేదాలతో ఈర్ష్యాసూయలు పెంచుకోవడం సమాజ శ్రేయస్సుకు కూడ హానికరమన్నారు.

ఏ కులజుడేమి యెవ్వడైననేమి
ఆకడ నాతడేహరి నెఱిగినవాడు
ఎక్కువ కులజుఁడైననేమి హీనకులజుఁడైన

నిక్క మెరిగిన మహానిత్యుడే ఘనుఁడు
శ్రీకాంతునామము జిహ్వ దగిలితే జాలు
యే కులజుఁడైనానుహీనమేమి
అతుమ సకల వ్యాపకమని తలపోసిన పిమ్మట
జాతియుం గులాభిమానము జర్చింపనె రాదు
విజాతులన్నియు వృధా వృధా
అజామిళాదుల కదియే జాతి
జాతి భేదములు శరీర గుణములు
జాతి శరీరము తోడనె చెడు
అతుమ పరిశుద్ధ జెప్పడును
అది నిర్దోషి బనాది (తాళ్ళపాక అన్నమాచార్యుల ఆధ్యాత్మిక సంకీర్తనలు సంపుటి 1, సంకీర్తనలు 292, 318, 373)

ఈ సృష్టిలో అందరూ సమానమేనని సంఘంలో పేద ధనిక భేదాలు, వర్ణ, వర్గ వైషమ్యాలు మధ్యలో మనం సృష్టించుకున్నవే నన్నారు. కొంతమంది తాము అధికులమని భావిస్తూ, మరి కొందరిని అధములుగా చూస్తూ వారి సమానత్వపు హక్కులను కాలరాయడాన్ని గురించి అన్నమయ్య 15 వ శతాబ్దం లోనే తీవ్రంగా వ్యతిరేకించారు.

అన్నమయ్య కంటే ముందే వైష్ణవాచార్యులలో ప్రధాన గణ్యుడైన శ్రీమద్రామానుజాచార్యులు భక్తినే గాక సామూహిక నీతిని కూడ నిలబెట్టేందుకు ప్రయత్నించారు. అనేక సంస్కరణలు ప్రవేశపెట్టారు. క్రీ.శ. 11వ శతాబ్దంలోనే హరిజనులను బ్రాహ్మణులతో సమానంగా పరిగణించి వారికి ఆలయ ప్రవేశం కల్పించారు. పంచమరులం వారికి తిరుకులత్తారులు లక్ష్మీదేవి సంబంధీకులు అని పేరు పెట్టి వారికి దేవాలయ ప్రవేశం కల్పించారు. రామానుజుల వారి నర్వజన సమానత్వం నేటికీ ఆదర్శవంతంగా, ఆచరణీయంగా ఉంది.

ఏకాంతపు హక్కు :

వాలి సుగ్రీవుని అన్న. ఇతను తన తమ్ముని ఓడించి అతని భార్య రుమను తన సొంతం చేసుకున్నాడు. అది అధర్మమనీ భావించిన రాముడు వాలిని చంపి సుగ్రీవుని సింహాసనం అధిష్టింపజేసి భార్య రుమను సుగ్రీవునికి అప్పగించాడు. ఆ విషయాన్నే అన్నమయ్య

'తోడనె సుగ్రీవుని
కొలువ బెట్టి యాతని కొమ్మ నిప్పించి' – అనే కీర్తనలో తెలియజేశారు.

భార్యతో కలసి కాపురం చేసుకొనే హక్కు ప్రతివారికి ఉంది. అయితే వాలి సుగ్రీవుని హక్కుకు భంగం కలిగేవిధంగా ప్రవర్తించాడు. సుగ్రీవుడికి భార్య అయిన రుమను తన దానిగా చేసుకున్నాడు. సుగ్రీవుడు రాజ్యం నుంచి ఇంటి నుంచి వెళ్లగొట్టబడి ఋష్యమూక పర్వతం మీద తలదాచుకున్నాడు. ధర్మ రక్షకులైన రాముడు వాలి అధర్మాన్ని సహించలేక పోయాడు. అతన్ని శిక్షించి సుగ్రీవుని హక్కును పునరుద్ధరించాడు. ఈ విషయాన్నే అన్నమయ్య తన కీర్తనలో విశదంగా తెలియజేశారు.

ఉపాసనా హక్కు (మత స్వాతంత్ర్యపు హక్కు) :

"ఏకం సద్విప్రా బహుదా వదంతి" అనేది వేదసూక్తి. అంతటా ఒకటిగానే వున్న సత్పదార్థాన్ని విప్రులు అనేక విధాలుగా వచిస్తున్నారని ఈ సూక్తి సారాంశం. దీన్నిబట్టి ప్రతివారు తమ అభిరుచికి తగిన విధంగా భగవంతుణ్ణి ఉపాసించుకోవచ్చని అంతరార్థం. అయితే కాలక్రమేణా జనులలో స్వార్థం హెచ్చింది. కొంతమంది తామే అధికులమని తాను చెప్పేదే గొప్పని, తక్కిన వాళ్లంతా దాన్నే పాటించాలని భావించారు. ఫలితంగా అనేక మతాలు పుట్టుకొచ్చాయి. పర్యవసానంగా శైవులు, వైష్ణవులు, కాపాలికులు, శాక్తేయులు మొదలైన మతాలు వారు విజృంభించి తమ మతమే గొప్పదని తక్కిన మతాలన్నీ తక్కువని తలపోసి ప్రచారం చేశారు. దీనివల్ల ప్రజల

ఉపాసనా లేదా మత స్వాతంత్ర్యపు హక్కుకు భంగం ఏర్పడింది.

తన కాలంలో శైవులు, వైష్ణవులు విజృంభించి కొట్లాడు కోవడాన్ని తిక్కన సోమయాజి చూడలేకపోయారు. ఈ శైవ వైష్ణవ స్పర్ధకు ముగింపు తీసుకువచ్చి అందరి ఉపాసనా హక్కును పరిరక్షించాలనుకొన్నాడు. పర్యవసానంగా హరిహరనాథ తత్త్వాన్ని ప్రతిపాదించారు. శివుడూ, విష్ణువూ ఒక్కరేనని చాటారు. తని భారత విరాటపర్వ పీఠికలో

శ్రీ యనగౌరినాఁబరగుచెల్వకుజిత్తముపల్లవింప భ
ద్రాయిలమూర్తి యై హరిహరంబగు రూపము దాల్చి
"విష్ణురూ
పాయ నమశ్శివాయ" యనిపల్కెడు భక్త జనంబు
వైదిక ధ్యాయితకిచ్చ మెచ్చు పరతత్త్వముఁగొల్చెద నిష్ట
సిద్ధికిన్
(ఆంధ్ర. విరాట. ప్రథమ. పద్యం 1)

ఈ అంశాలన్నింటిని దృష్టిలో పెట్టుకొని అన్నమయ్య కూడ వేంకటేశ్వరుణ్ణి పరబ్రహ్మ స్వరూపునిగాను, అన్ని మతాలకు మూల రూపమని అభివర్ణించారు.

ఎంత మాత్రమున నెవ్వరు దలఁచిన అంతమాత్రమే నీవు
అంతరాంతరము లెంచి చూడఁ బిండంతే నిప్పటి యన్నట్లు
॥పల్లవి॥

కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుఁడని
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మం బనుచు
తలఁతురు మిము శైవులు తగిన భక్తులను శివుఁడనుచు
అలరి పొగడుదురు కాపాలికులు ఆది భైరవుఁడనుచు
॥ఎంత॥

నీ వలసఁగొరతే లేదు మరి నీరుకొలఁది తామెరవు
ఆవల భాగీరథి దరిబావులు ఆజలమే వూరినయట్లు
శ్రీ వేంకటపతి నీవైతే మముఁ జేకొనివున్న దైవమని
యీవల నే నీశరణనియెదను యిదియే పరతత్వము
నాకు ॥ఎంత॥

(తాళ్ళ. అన్నమా. ఆధ్యా. సంకీ. సం. 2 సంకీ . 393)

ఎవరు ఏ విధంగా దేవుని ఉపాసించినా అందరికి ఉపాశ్యుడుగా హరే నిలుస్తాడని అభివ్యక్తం చేసి, జనులందరి ఉపాసనా హక్కును పరోక్షంగా కాపాడే ప్రయత్నం చేశాడు.

వచన సంకీర్తనలకు ఆద్యుడైన కృష్ణమాచార్యులు తన వచనాల్లో ఆరాధనా హక్కుకు ప్రాధాన్యం ఇచ్చారు. 12వ శతాబ్దికి చెందిన కృష్ణమాచార్యులు "సింహగిరి నరహరి వచనాలు" అనే పేరుతో వేలకొలది వచనాలను వెలయించారు. వాటిలో భగవద్భక్తి లేనివాడు బ్రాహ్మణు డైనప్పటికి అతని కంటే భగవద్భక్తి గల అంత్యజుడే అధికుడని స్పష్టం చేశారు. అంత్యజులకు కూడ ఆరాధన లేదా ఉపాసన హక్కు ఉందన్నాడు. అయితే అగ్రవర్ణాలవారు తామే గొప్పవారమని విర్రవీగకుండా అంత్య కులాలవారి ఆరాధనా హక్కులను అంగీకరించటమే సమంజసమని కృష్ణమాచార్యుల వచనం ధ్వనింపజేస్తుంది.

జీవుల హక్కులు :

మనుషుల లాగానే జీవించే హక్కు ఈ సృష్టిలోని ప్రతి ప్రాణికి ఉంది. హక్కుల పరంగా దీనిని మత విశ్వాసాలకు సంబంధించిన హక్కులో భాగంగా చెప్పవచ్చు. జీవులను బలి ఇచ్చే ఆచారం అనాది నుంచి మన సమాజంలో నెలకొని ఉంది. బలి శబ్దానికి ఆహారమని అర్థం. శక్తికి సంబంధించిన దేవతలకు, రుద్ర దేవతలకు జంతు బలులు ఇవ్వడం నేటికీ కనిపిస్తుంది. ఆధునికకాలం కంటే ప్రాచీన కాలంలో పూర్వం జంతు బలులు ఎక్కువగా ఉండేవని ప్రాచీన చరిత్రను బట్టి తెలుస్తోంది. దీనిని దృష్టిలో పెట్టుకునే అన్నమయ్య అలాంటి బలులు, ఆహుతులు ఏవీ అవసరం లేదని, స్వామిని నమ్మి ఉంటేనే చాలు అని తెలియజేస్తూ ఆ బలుల జాబితాను ఈ కింది కీర్తనలో అన్నమయ్య పొందుపరచాడు.

మొక్కరో మీరు మోసపోక
ఊరకే వీవారమని ఉన్న జాలు
సిడిదల లియ్యవద్దు జీవాల జంపవద్దు
బడిబడి పగ్గాల చొరవద్దు..

దురదృష్ట వశాత్తు మన సమాజంలో జీవ జంతువులనే ఆహారంగా దేవతలకిచ్చే పద్ధతి ఏర్పడింది. దీన్ని మహనీయులందరూ తీవ్రంగా నిరసించారు. అన్నమయ్య జీవ జంతువులను భగవంతుల కోసం బలి ఇవ్వడాన్ని తీవ్రంగా గర్హించారు.

స్త్రీల హక్కులు :

తతిగాని యీపాటు దైవమా విచారించవే
కతలాయఁ జెప్పనేఁడు కలికాలమహిమ ॥పల్లవి॥
అంగలాచే(ర్చే) కామినుల యంగ భంగపు దోఁపు
లింగితాన మింట సూర్యుఁ డెట్టు చూచెనో
పొంగు నానాజాతిచేత భువనమెట్లానెనో
కంగిలోక మిట్లాయఁ గలికాల మహిమ ॥తతి॥
అరుదు గోహత్యలుసేయగ దూడ లంగలావ (ర్వ?)
సరి ధర్మదేవతెట్టు సమ్మతించెనో
పరధన చూఱకెట్టు పట్టాయనో లక్ష్మి
కరుణ యెందుఁ గెనో కలికాలమహిమ ॥తతి॥

(తాళ్ళ. అన్నమా. ఆధ్యా. సంకీ. సం. 4, సంకీ. 428)

అనే పై కీర్తనలో అన్నమయ్య స్త్రీలకు జరిగిన మానభంగాల గురించి, గోహత్యల గురించి, పరధనాపహరణ గురించి ప్రస్తావించారు. ఆ దృష్టిలో ఆలోచిస్తే స్త్రీలకు శీలవతులుగా, హుందాగా జీవించే హక్కు ఉందని, గోవులు మొదలైన జంతు జాలానికి కూడ జీవించే హక్కు ఉండాలని భావించినట్లు విశదమవుతుంది.

నాటి నుంచి నేటి దాకా కుటుంబంలో, సమాజంలో స్త్రీ, పురుష విభేదాలతో స్త్రీని బానిసగా చేసి హింస పెడుతూనే ఉన్నారు. పురుషులమనే అహంకారంతో స్త్రీలను అణగదొక్కుతూ క్రూరంగా ప్రవర్తిస్తుంటారు. అలాంటి విభేదాలు చూపకూడదని స్త్రీలు, పురుషులు ఇద్దరూ మనుష్యులేనని, ఇద్దరూ సమానమేనని అన్నమయ్య సమధర్మాన్ని బోధించాడు.

పొలతులు జీవులే పురుషులు జీవులే
తలఁప భావభేదములే కాని
బలిమి స్వతంత్రముఁ బరతంత్ర మొకరికి
యెలమి నిందులో జెల్లే హీనాధికములే ॥మేలు॥

(తాళ్ళ. అన్నమా. ఆధ్యా. సంకీ. సం. 2 సంకీ. 78)

ముగింపు :

వాగ్గేయకారులైన అన్నమాచార్యులు సంకీర్తనలతో శ్రీవేంకటేశ్వరుని సేవించి తరించారు. తన సంకీర్తనలలో విశిష్ట అద్వైత భావాలను వెలువరించి సామాన్య ప్రజలకు చేరువ అయ్యారు. ఎన్నో కట్టుబాట్లు, ఆచార సంప్రదాయాలు ఉన్న సమాజంలో జీవిస్తూ కూడ ఎంతో ధైర్యంగా మానవ హక్కులను గురించి ప్రస్తావించిన ఉద్యమకారుడు, సంఘసంస్కర్త అన్నమాచార్యులు. అభ్యుదయ భావాలతో సంకీర్తనలను సృజించి తన తర్వాతి కవులకు దిశా నిర్దేశం చేసిన పదకవితా పితామహుడు అన్నమాచార్యులు చిరస్మరణీయులు.

ఉపయుక్త గ్రంథాలు:

1. తాళ్ళపాక పద సాహిత్యము, 1, 2, 3, 4 సంపుటాలు అన్నమాచార్య ప్రాజెక్టు, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, ద్వితీయ ముద్రణ, 1998.
2. తెలుగు సాహిత్యంలో మానవ హక్కులు – ఆచార్య చిట్రాజు గోవిందరాజు, డి. ధాత్రికుమారి. తిరుపతి, నవంబరు, 2016.
3. సాహితీ నవనీతం – డా. చిట్రాజు గోవిందరాజు, జ్యోత్స్న ప్రచురణలు, తిరుపతి. మే, 2006.
4. తెలుగు కవిత్వంలో మానవ హక్కులు–ఒక పరిశీలన, పరిశోధనా గ్రంథం – డా. డి. ధాత్రికుమారి, తిరుపతి, డిసెంబరు, 2018.
5. ఆంధ్రమహాభారతము – విరాటపర్వము, తిరుమల తిరుపతి దేవస్థానములు, తృతీయ ముద్రణ, 2011.

అస్తిత్వవాద నవలలు – అధీరనాయకులు

డా.టి. జాన్‌కిరణ్‌బాబు, అకడమిక్ ఆఫీసర్, కళాశాలవిద్య కమీషనరువారి కార్యాలయం, విజయవాడ,
ఆంధ్రప్రదేశ్. సెల్ : 9440382140, 9182324062

సంప్రదాయ సాహిత్యసిద్ధాంతాల ప్రకారం కావ్యంలో ప్రధానపాత్రలు నాయికానాయకులు. కథంతా వీరిద్దరి చుట్టూనే తిరుగుతూ ఉంటుంది. తక్కిన పాత్రలు సైతం ప్రధానపాత్రల కార్యసాధనకే తోడ్పడడం గమనార్హం. మన ప్రాచీన సాహిత్యంలో నాయికాప్రాధాన్యత గల కావ్యాలకంటే నాయకప్రధాన కావ్యాలే అధికం. వీటిలో నాయకుడి ప్రేమ ఫలించడమో, శత్రుసేనను సంహరించి విజయోత్సాహంతో రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడమో ప్రధాన లక్ష్యమౌతూ ఉంటుంది. అందువల్ల ప్రాచీన ఆలంకారిక శాస్త్రాలు నాయకుడికి 'ధీరత' అనే లక్షణాన్ని తప్పనిసరి చేశాయి. అలంకారశాస్త్రంలో పేర్కొన్న నాయకులు నాలుగు రకాలు. ధీరోదాత్తుడు, ధీరోద్ధతుడు, ధీరలలితుడు, ధీరశాంతుడు.

ఆధునికకాలంలో వచ్చిన రచనల్లో ఆంగ్లప్రభావంతో ఈ నాయకుణ్ణి హీరో అన్నారు. ఆధునిక నవలల్లో వచ్చిన ఈ హీరో కూడా ఓటమెరుగనివాడే. అష్టకష్టాలుపడైనా సరే లక్ష్యాన్నిచేరడమే నాయకుడి అంతిమలక్ష్యంగా కనిపిస్తుంది. అయితే స్వాతంత్ర్యానంతరం సంప్రదాయ విశ్వాసాల మీద పట్టు సడలడం, ఆదర్శాలు తల్లక్రిందులు కావడం, ముందుతరంవారికి దూరపు కొండలుగా, గమ్యస్థానంగా వుండిన ఆదర్శ శిఖరాలు నాటి తరంవారికి చేరువకావడం, అవి ఆశించినంత నునుపుగా సుఖ ప్రదంగా, శాంతిదాయకంగా అనుభవంలో లేకపోవడంతో పరిణతి స్థాయి పెరిగిన నాటి సమాజం విశాల విశ్వం యొక్క అంచులదాకా పరికించడం అలవరచుకుంది.... "ఏది గమ్యస్థానమని ఒకప్పుడు తోచిందో, అది చివరకు ఒక మజిలీగా తృప్తినివ్వలేక పోవటమే నేటి అవిశ్వాసానికీ, జీవితాన్నిగూర్చిన పునరాలోచనకూ అన్వేషణకూ కారణ మైందని తోస్తుంది." (మూర్తిరాజు: 1975:423)

ఈ నేపథ్యంలో ఆచరణకు అతీతమైన ప్రబోధాలు, ప్రచారాల కంటే పరిశీలనము, జిజ్ఞాస లేక యథార్థాన్ని అన్వేషించడం ప్రారంభమైంది. ఈ అన్వేషణంలో 'వ్యవస్థాధర్మంకంటే వ్యక్తిధర్మమే ప్రధానం' అని చెప్పే ఆధునిక అస్తిత్వవాద సిద్ధాంతం జీవితంపై సరికొత్త ఆశలను రేకెత్తించింది. 'కర్క్‌గార్డ్ ఈ వాదానికి మూలపురుషుడు. "వ్యక్తివైశిష్ట్యాన్ని గుర్తించి, మానవుల్లో ఒక్కొక్కవ్యక్తికీ అనిర్వచనీయమైన వ్యక్తిత్వం ఉన్నదనీ, దాని అభివ్యక్తి భిన్నంగా ఉండకతప్పదనీ, తద్ద్వారా వ్యక్తి జీవితమూ, ప్రవర్తనా వ్యవస్థను వ్యతిరేకించినప్పుడు, వ్యక్తిధర్మాన్నే ఉత్కృష్టమైన విలువగా అంగీకరించి, వ్యక్తినే సమర్థించడం అస్థిత్వవాదదృక్పథం యొక్క సారాంశం." (సాహిత్య నేపథ్యం:112-113)

ఆధునిక సమాజంలోనూ, సాహిత్యంలోనూ విప్లవాత్మకమైన మార్పులకు కారణమైన ఈవాదం ఎందరో రచయితల అన్వేషణకు ఆధారభూతమైంది. ఆత్మాభిమానంతో స్వధర్మాన్ననుసరించి వ్యవస్థాధర్మానికి విరుద్ధంగా వ్యవహరించాలనుకునేవారికీ ప్రోత్సాహాన్నిచ్చింది. కేవలం యాంత్రికమైన ధోరణిలో ఆలోచనారహితంగా, మూగగా, సామాజికశక్తులకు లోబడి బ్రతకటం కంటే వ్యక్తి స్వధర్మాన్నిచేపట్టి ఆచరణద్వారా అనుభూతి ద్వారా గమ్యం చేరడం మేలని చాటే ఈ దృక్పథం చాపకింద నీరులా వ్యాపించింది. మారుతున్న నాటి సమాజంలో వ్యవస్థాధర్మం అనిశ్చితంగా అనేక ముఖాల దిగ్భ్రమ కల్పిస్తున్నప్పుడు ఆ పరిస్థితి చిత్రిస్తూ 'శ్రేయాన్ స్వధర్మా విగుణ ' అని చెబుతూ, వ్యక్తిగతమైన అన్వేషణకు ప్రాధాన్యం యిస్తూ వ్యక్తివికాసానికీ, తద్వారా సమాజపురోగతికీ తప్పక దోహద పడాలనే తపనతో అస్తిత్వవాదానికి ఆకర్షితులైన నవలా రచయితలు పాత్రల

ఎంపికలోనూ, సన్నివేశ పరికల్పనలోనూ, హృదయంత రాళాల్లో నిబిడీకృతమై వున్న సంఘర్షణను ఎటువంటి అరమరికలు లేకుండా యథాతథంగా చిత్రించుటలో విలక్షణమైన పంథాకు ఎంచుకున్నారు (మూర్తిరాజు: 1975:425)

ఏ ప్రశ్నలూ సమాధానాలూ లేకుండా సమాజాన్ని లేక సమాజజీవితంలో ఒక భాగాన్ని యథాతథంగా చిత్రించడం, సమాజాన్ని గూర్చి వేసే ప్రశ్నలన్నింటికీ వ్యక్తి ద్వారా సమాధానాలు అన్వేషిస్తూపోవడం, చివరకు దాన్ని ఆత్మగతమైన అన్వేషణంగా తేల్చడం, అంటే వేసిన ప్రశ్నలకు సమాధానం వ్యక్తికీ, సమాజానికీ గల సంబంధాన్ని ఎవరికి వారు నిర్వచించుకోవడంలోనే ఉందన్న నిర్ణయానికి రావడం. . . ఈ తరహా నవలల్లో కనిపిస్తుంది.

ఆధునిక సమాజంలో సంప్రదాయబద్ధమైన వ్యవస్థాధర్మాన్ని వ్యతిరేకించే ఇటువంటి సిద్ధాంతాల ఆవిష్కరణకు గల కారణం వైజ్ఞానిక విప్లవం, పారిశ్రామిక విప్లవం వ్యాప్తిచెందడమే. ''వైజ్ఞానికయుగంలో, హేతువాదం, స్వయంవివేచన ప్రాముఖ్యంవహించడంవల్ల ఒక వ్యక్తి మనస్సుకూ మరియొక వ్యక్తి మనస్సుకూ సంబంధం ఉన్నా సమైక్యంలేదు. ఆధునిక సమాజంలో మనుష్యుల సంబంధాలు పారిశ్రామిక విప్లవంవల్లా, వాణిజ్యవిస్తృతివల్లా మరీ క్లిష్టమైన సంకీర్ణంకావటంతో, జీవనవిధానంలో వైవిధ్యంతోపాటు దృక్పథభిన్నత్వమూ నిరవధికంగా పెరిగింది. ఈ పరిస్థితిలో జీవితాన్ని గురించి ఎవరి విశ్వాసాలు విలువలూ వారివి అవుతున్నాయి. వాటికి తగినట్లే హేతువులు, వివేచనా, కర్తవ్యమూ ఉంటున్నాయి. ఇప్పుడు జీవితాన్నిగూర్చి, సామాజిక దృక్పథానికీ ఏక స్వరూపం అంటూలేకుండా పోతున్నది. ఉన్నంతమాత్రంలో దానికీ వ్యక్తిదృక్పథానికీ సమైక్యం ఏర్పడ్డం అసాధ్యం అవుతున్నది. పైకి ఏర్పడినట్లు కనిపించినా ఆచరణా అనుభవమూ వేరుగానే ఉంటాయి.'' (సాహిత్యనేపథ్యం: 113-114)

ఇటువంటి సంక్లిష్టమైనజీవనంలో నుండి పుట్టుకొచ్చిన సంఘర్షణాత్మక జీవుడే ఆధీరనాయకుడు ఇటువంటి సంక్లిష్టమైనజీవనంలో నుండి పుట్టుకొచ్చిన సంఘర్షణాత్మక జీవుడే ఆధీరనాయకుడు. సాత్రే అస్తిత్వ వాద దర్శనం ఈ అధీరనాయకుడి వ్యక్తిత్వాన్ని అర్థంచేసుకోవడానికి దోహదపడుతుంది. సాత్రే ప్రకారం అస్తిత్వంలో మూడు పొరలుంటాయి. తనలో తను, తనకెతాను, ఇతరులకోసం తాను. 'తనలో తాను' అస్థిత్వంలో ఏకత్వం ఉంటుంది. 'తనకెతాను' లో ద్వైతం ఉంటుంది. అంటే తనను వేరుగా ఒక వస్తువుగా చూడటం. ఇక్కడ తనను గూర్చిన ఆలోచనకు, ఊహకు, కల్పనకు అవకాశం ఉన్నది. ఇక్కడ ఆత్మజ్ఞానానికీ, ఆత్మవంచనకు కూడా అవకాశం ఉన్నది. 'ఇతరులకోసం తను'లో ఇతరుల దృష్టిలో తనను గూర్చిన అభిప్రాయం ఏమైఉన్నదో దానిని ఊహించడం వల్ల దాని ప్రభావం వల్ల, ప్రవర్తనను అలా రూపొందించుకోవడం జరుగుతుంది. ఇటువంటపుడు స్వేచ్ఛపోయి వ్యక్తికి జడత్వం, బానిసత్వం, పరప్రత్యయనేయబుద్ధివల్ల వినాశం, శైథిల్యం సంభవిస్తాయి. "దృక్పథాలు, సిద్ధాంతాలు, వాదాలు అనేవి సమాజంలో ఉద్ధృత ప్రచారంలో ఉన్నప్పుడు అవి వ్యక్తికి జీవితాన్ని దిద్దుకోడానికి సహాయకారులుగాకాక వ్యక్తిని ఆకర్షించే, పట్టిపీడించే మోహినీపిశాచాలుగా తయారైన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ సిద్ధాంతాలూ వాదాలూ ఇటు సంప్రదాయంనుంచి వచ్చినవైనా, అటు సంస్కారంనుంచి వచ్చినవైనా వ్యక్తికీ, వ్యక్తి సుఖానికీ, ధర్మానికీ వీటితో సమన్వయం కుదరకపోవడం జరుగుతున్నది. అలాంటి పరిస్థితిని వ్యక్తం చెయ్యడంలోనే అధీరుడైన నాయకుడు సాహిత్యంలో సాక్షాత్కరిస్తున్నాడు." (సమాజము:సాహిత్యము:116)

తెలుగు నవలల్లో ఇట్టి అధీరనాయకుణ్ణి సృష్టించిన మొట్టమొదటి రచయిత విశ్వనాథ సత్యనారాయణగారు. చెలియలికట్ట నవలలోని రంగారావు పాత్ర తెలుగు సాహిత్యంలో మొదటి అధీరనాయకుడు. రావిశాస్త్రి,

బుచ్చిబాబు, గోపీచంద్ రాసిన మనోవిశ్లేషణాత్మక నవలల్లో కూడా అధీరనాయకులున్నారు. అల్పజీవి – సుబ్బయ్య, చివరకు మిగిలేది – దయానిధి, అసమర్థుని జీవయాత్ర – సీతారామయ్యలు కూడా ఈ కోవకే చెందుతారు. ఈ నాయకులు ఆత్మన్యూనతాభావం లేదా న్యూరాసిస్ వంటి మానసిక రుగ్మతలతో బాధపడుతుంటారు. సిగ్మండ్ ఫ్రాయిడ్, యూంగ్, ఆడ్లర్‌ల ప్రభావంతో ప్రతిఫలించిన మనోవిశ్లేషణాత్మకత సిద్ధాంతాల ఆధారంగా ఇట్టి మనోవ్యాకులంతో సృష్టింపబడిన నాయకులకు ప్రముఖ విమర్శకులు ఆర్. ఎస్. సుదర్శనంగారు 'అధీరనాయకుడు' అని పేరుపెట్టారు. నవలారచనలో ఇదొక కొత్త సృష్టి. ఒక్కొక్క పాత్ర యొక్క అధీరత వెనుక ఒక్కొక్కవిధమైన నేపథ్యం ఉంటుంది. ఆ నేపథ్యం గ్రాహ్యమైతే తప్ప ఆ పాత్రను సహృదయతతో అర్థంచేసుకోలేం.

చెలియలికట్ట–రంగారావు:

విశ్వనాథ వారి చెలియలికట్ట నవలలో రంగారావు తన వదినెగారైన రత్నావళిని లేవదీసుకుని వెళ్ళిపోతాడు. అతనిలో మొదట్లో కనిపించే సాహసం, కొత్తభావాలతాలూకు చైతన్యం తర్వాత కనిపించదు. అది కేవలం యౌవనోద్వేగం తాలూకు ఆభాసమే తప్ప వ్యక్తి లక్షణంకాదని తర్వాత రుజువౌతుంది. ప్రేమనుగూర్చి, వ్యక్తిస్వేచ్ఛనుగూర్చి అతడు అరువుతెచ్చుకున్న కొత్త ఊహలకు అతని వ్యక్తిత్వంలోగాని, బుద్ధినైశిత్యంలోగాని ఆధారమూ ఆలంబనాలేవు. అందుకే సాహసం చేసిన తర్వాత కర్తవ్యంతెలీని మూఢునిలా ప్రవర్తిస్తాడు. రంగారావులోని అధీరలక్షణం – మొట్టమొదట అతడు చేసిన సాహసం ఒక తాత్కాలిక ప్రేరణమీద జరిగింది. కొన్ని నూతన సిద్ధాంతాలు, పుస్తకాల్లో చదువుకున్నవి ఆ ప్రేరణకు కారణమయ్యాయి. తర్వాత ఆ సిద్ధాంతాల లోటుపాట్లనుగూర్చి అతడు పట్టించుకోలేదు. జీవితానికి తలొగ్గాడు. ఇలానే బాహ్యప్రేరణకు ఒక్కదెబ్బతో లొంగిపోయి, దాన్ని ఏవిధంగానూ స్వధర్మంతో సమన్వయం చేసుకునే వెరపులేక, అర్థశూన్యమైన నైమిత్తిక జీవితం వెళ్ళబుచ్చడమే రంగారావు అధీరలక్షణం. సంప్రదాయాలనుండి వెలియై, స్వచ్ఛందంగా జీవించలేక ఎటువంటి వికాసమూ లేకుండా బ్రతుకుని స్తబ్దం చేసుకున్న అధీరుడు రంగారావు. సిద్ధాంతాలతో పోరాటం నుంచీ విరమించుకున్న వ్యక్తి.

అసమర్థనిజీవయాత్ర–సీతారామయ్య:

అసమర్థనిజీవయాత్ర నిజంగా ఒక హేతువాది జీవయాత్ర. హేతువాద దృక్పథం ఒకవ్యక్తి జీవితంలో కేవలం బౌద్ధిక దృక్పథంగానే ఉంటే అది కత్తెరబోనులా పరిణమించే పరిస్థితి రావడానికి వీల్లేదు. అనుభవంలో దాని లోటుపాట్లు గుర్తువచ్చిన మరుక్షణంలో వ్యక్తి దాన్ని మార్చుకోవచ్చు. ఆలోచనాపరుడు, జిజ్ఞాసువు సాధారణ పరిస్థితుల్లో అలానే చేస్తాడు. కాని ఆ దృక్పథం వ్యక్తిచేతనలోనే ఒక విషబీజంగా పరిణమించినట్లైతే ఎలా ప్రాణాంతక మౌతుందో నిరూపిస్తుందీ నవల. హేతువాదదృక్పథానికీ చనిపోయిన తండ్రిమీద తనకుగల అభిమానానికీ అవినాభావసంబంధం ఏర్పడి ఉండటం, ఆ రెండింటి కలయిక తన వ్యక్తిత్వం మీద మోపినభారాన్ని వదిలించుకోలేకపోవటం, సీతారామారావు అసమర్థతకు మూలం. అదే అతని విషాదాంతగాథ వెనుక దానివున్న మనస్తత్వ రహస్యం. తండ్రినుంచి సంక్రమించిన వారసత్వం బరువుతో జీవిత పరిస్థితుల్ని ఎదుర్కొనే వెరవులేక, తనకు కావలసిందేమిటో తనకే తెలీక మనోవైకల్యానికిలోనై అధీరుడుగా అస్తమించిన విషాదచరిత్ర సీతారామయ్యది. హేతువాద సిద్ధాంతాలకూ, స్వోత్కర్షతో నిండిన ఊహలకూ అనుగుణంగా జీవితం ఉండాలనే తాపత్రయం, అలా లేదనే నిస్పృహ సీతారామయ్యలోని అధీరత లక్షణం.

అల్పజీవి– సుబ్బయ్య:

తల్లి చిన్ననాడేపోవడం, సవతితల్లి సరిగా చూడక పోవడంతో ఒంటరి బ్రతుకుతో పోరాడుతూ తండ్రిని

ఎప్పుడూ అంటిపెట్టుకుని తిరిగే సుబ్బయ్య, బాల్యంలో తండ్రితో కలిసి వెళుతుండగా ఒకరాత్రి చీకటిలో ముగ్గురు మనుష్యులు మీదపడి తండ్రినికొట్టడం, సుబ్బయ్యను రాళ్ళగుట్టమీదకు విసిరేయడం వంటివి అతని మానసుపై గాఢంగా ముద్రవేసిన సంఘటనలు. ఒంటరి బ్రతుకైపోయిన సుబ్బయ్యజీవితం, సవతితల్లిప్రేమకు నోచుకోకపోవడం వంటివి అతని జీవితాన్ని స్తబ్దం చేస్తాయి సుబ్బయ్య అల్పసంతోషాల్ని, భార్యపట్లభయం వంటి వాటిని కూడా ఇదే నిర్ణయిస్తుంది. సుబ్బయ్య ప్రవర్తనలో ఆత్మరక్షకమైన ప్రధానలక్షణం ఎవరికీ ఎదురుచెప్పలేకపోవడం. ఎవరికైనా దాసోహమనడం. సుబ్బయ్య జీవనోత్సాహం వీధిని పోయేవాళ్ళని గురించి అతడు ఊహించుకునే ఊహల్లో మాత్రమే వ్యక్తమౌతుంది. రోజూ ఉదయం, సాయంత్రం చాలాసేపు అతడు వీధినిపోయే 'ఎర్రచీరెమనిషి', 'మునీశ్వర్లవారు', 'లేడిపిల్లలు' తనలో అణచివేయబడివున్న కోరికలకు ప్రతిబింబాలు. భయంతో జీవించే ఎన్జీవో సుబ్బయ్యని గవరయ్య అనే కాంట్రాక్టరు తన మనుష్యులచేత బలవంతంగా రప్పించి బెదిరించి ప్రామిశరీనోటుమీద సంతకం చేయిస్తాడు. బెదిరంచే సన్నివేశంలో సుబ్బయ్య భయం తారాస్థాయినందుకుని కొన్ని క్షణాలు తాను చచ్చిపోతున్నానని మృత్యువే వచ్చినంత అనుభూతికి లోనౌతాడు. ఇంటికివచ్చిన తర్వాత భార్యతో నిజం చెప్పలేక, అబద్ధంచెబుతూ గాఢమైన జాగృతిని పొందుతాడు. ఈ సంఘటన సుబ్బయ్య తన అస్తిత్వపు సత్యాన్ని ఎదుర్కొని గుర్తిండానికి సూచన. తన జీవితాన్ని సిద్ధాంతాలకూ, ఊహలకూ అతీతంగా అందుబాటులో ఉండేది దర్శించగలుగుతాడు ఈ అధీరుడు. ఏదో ఒక దృక్పథం, లక్ష్యం లేక విశ్వాసం తన వ్యక్తిత్వంలో రూపొందడం ద్వారా విజయాన్ని సాధించే ధీరనాయకుని విజయానికి భిన్నమైన విజయం ఈ అధీర నాయకునిది. పరిస్థితులు అతని సంకల్పరాహిత్యం కారణంగా అతనికి ప్రసాదించిన విజయం సుబ్బయ్యది.

చివరకుమిగిలేది–దయానిధి: కథానాయకుడు దయానిధి భావనాశీలి, సౌందర్యపిపాసి. కానీ ఏ స్త్రీనీ ప్రేమించలేడు. స్త్రీ అంటే చెప్పరాని కుతూహలం. వివాహయోగ్యతగల ఏ అమ్మాయిని చూచినా అపేక్ష. కానీ ఆమెను భార్యగా ఊహించుకోవడానికి మాత్రం మనస్సులో పెద్ద అవరోధం. చివరకు అతని మనసును ఆకట్టుకున్న యువతి కోమలి ఒక చరిత్రహీన. ఆమె తల్లిది పడుపువృత్తి. కోమలికి చదువూ సంస్కారమూలేవు. ప్రయత్నించి దయానిధిని ఆకర్షించే చమత్కారమూ అనుభవమూ లేవు. అయినప్పటికీ ఆమెచుట్టూ తిరుగుతాడు. అవకాశం వచ్చినా ఆమెను అనుభవించలేడు. కారణం తనకు కావలసింది ఏమిటో తెలీకపోవడమే అతని సమస్య. తల్లిమూర్తితో దయానిధి లైంగికప్రవృత్తితో ముడిపడివుండటం మూలాన అతను శారీరకంగా స్త్రీనిపొందడానికి అశక్తుడు. ఈ అశక్తతని కప్పిపుచ్చుకోడానికి అతను చేసే చేష్టలఫలితమే కనిపించిన అమ్మాయిలతో చనువుగా, స్నేహంగా ఉంటూ ఇతరుల మనసుల్లో అపోహల్ని కలిగించడం మానసికశాస్త్ర సిద్ధాంతాల దృష్ట్యా 'న్యూరాసిస్' వ్యాధితో బాధపడేవారి లక్షణంగా ఆర్.ఎస్. సుదర్శనంగారు పేర్కొన్నారు. స్త్రీతో శారీరకసంబంధం ఏర్పడే అవకాశంవచ్చినప్పుడల్లా దయానిధిలో కలిగే ఉద్విగ్నత, భయం, గందరగోళం దయానిధిని అశక్తుణ్ణి చేస్తుంది. పునస్సంధానానికి ముహూర్తంపెడితే, అంతకుపూర్వం రాజకీయాలతో ఏమాత్రం సంబంధం లేనివాడు రాజకీయసభలో ఉపన్యసించి అరెస్టు కావడం,భార్యను వదిలిపెట్టి ఒంటరిగా ఉంటూ మిత్రుడి చెల్లెలైన శ్యామలను మానసికవ్యాధి చికిత్సకోసం తన యింట్లో ఉంచుకోవడం వంటివన్నీ యింగితజ్ఞానంతో ఉండేవ్యక్తి చేసేపని కాదు. (సమాజమ: సాహిత్యము:135) స్త్రీలపట్ల అధీరుడు అయిన దయానిధికి వాళ్ళంటే ఆకర్షణ – అపకర్షణ రెండూ ఉన్నాయి. దయానిధి జీవితంలో కాల్పనికవాద ప్రేమసూత్రాలు

అన్వయించవు. సంప్రదాయ వివాహమూ ఫలించదు. దేశభక్తి, మానవసేవ వంటి ఆదర్శాలూ అర్థరహితమే అవుతాయి. దయానిధికి చివరకుమిగిలింది ఏకాకి జీవితం. తన ఏకాంతాన్ని ఎవ్వరూ భగ్నంచేయలేరు. తనలోతను సమాధానపడకతప్పదు అనే స్పృహ ఒక్కటే. . . సంప్రదాయానికీ, సమాజానికీ, సిద్ధాంతాలకూ అతీతమైన అస్పృశ్యమైన సత్యాన్ని మానవత్వంలో చివరకు అధీరత యొక్క పర్యవసానం.

అధీరనాయకుడి లక్షణాలు:

స్తబ్ధత, కర్తృత్వవిహీనత, సంకల్పరాహిత్యం అధీరతా లక్షణాలు. ఉదా:– ఇవి రంగారావు – వివాహవ్యవస్థకు, సీతారామయ్య – హేతువాదానికీ, సుబ్బయ్య – ఔద్ధత్యానికీ, దయానిధి – వివాహవ్యవస్థకూ ఎదురుతిరగడం మూలంగా సంభవించినవే.

ఈ పాత్రల వ్యక్తిత్వం, తిరుగుబాటు కొత్తసిద్ధాంతాలను నిరూపించే ధీరతగా కాక 'అధీరత' ద్వారానే ప్రకటితమైంది.

వీళ్ళలో జీవలక్షణమైన ప్రతిఘటన ఏకోశానా కనిపించదు. అందువల్లే వీరి అధీరతకు మానవత్వం దృష్ట్యా విలువలేదు. ఎందుకంటే వీరి ద్వారా మానవ చరిత్రకానీ, సమాజంకానీ ఆశించేదేమీ ఉండదు.

ఈ అధీరనాయకులు యాంత్రికంగా నైమిత్తికజీవితం గడుపుతూ ఉంటారు.

కొత్త ఆలోచనలు చేసి, కొత్తపుంతలు త్రొక్కి కర్తృత్వం వహించే శక్తియుక్తులు మృగ్యం

అధీరనాయకునిలో మనం ఏవగించుకోవలసిన గుణాలేమీ కనిపించవు. నిజానికి జాలివడి సానుభూతిపొందవలసిన పాత్రలివి.

"పురుషపాత్రల్లో అధీరతగుణం ఒకవిధంగా చూస్తే మారుతున్న సామాజిక పరిస్థితులో మారిన విలువలమధ్య క్షీణించిన మతతాత్త్విక విశ్వాసాలలో తనదైన లక్ష్యం ధర్మం రూపొందించుకోలేని వ్యక్తిత్వాన్ని నిర్ణయిస్తూ ఉంటుంది." (సమాజము:సాహిత్యము: 110)

ఆధారగ్రంథాలు :

1. ఆంధ్రకేసరి ప్రకాశం (శతజయంతుత్సవ సంచిక 1974): స్వతంత్ర ఆర్ట్స్ ప్రింటర్స్, విజయవాడ– 520004
2. సమాజము– సాహిత్యము (1972): ఆర్.ఎస్. సుదర్శనం, చిత్తూరుజిల్లా రచయితల సహకార ప్రచురణ సంఘం, చిత్తూరు.
3. సాహిత్యంలో దృక్పథాలు (1982 ద్వి.ము): ఆర్.ఎస్. సుదర్శనం, సువిశేషాపురం, రాజమండ్రి– 533104
4. సాహిత్య నేపథ్యం (1989 ద్వి.ము): ఆర్. ఎస్. సుదర్శనం, మదనపల్లి, చిత్తూరు – 517325

శ్రీ గుర్రం జాషువా ఖండకావ్యాలు – భారతీయత

డా॥ పైడిపాటి ఉమానాథ శర్మ, ప్రొఫెసర్, కె.ఎల్.విశ్వవిద్యాలయం, 31-6-12, ఏ.ఎస్.ఆర్. వీధి, మారుతీ నగర్, విజయవాడ-4. సెల్ : 9491109984

"ధర్మమునకు పిరికితనమెన్నడును లేదు
సత్యవాక్యమునకు చావులేదు
వెఱవనేలనీకు విశ్వనాథుని మ్రోల
సృష్టికర్త తాను, సృష్టినీవు"

– అంటూ భారతీయ సంప్రదాయ ఆత్మను అక్షరాలలో పలికించిన సంప్రదాయ అభిమాని, సంస్కరణశీలి, మానవతావాది అయిన నవయుగకవి చక్రవర్తి శ్రీ గుర్రం జాషువ. కోకిల కూజితం వంటి రసానంద ఝరిని తన కవితా కిసలయముల ద్వారా తెలుగు పాఠకలోకానికి అందించిన కవికోకిల ఇతడు. అప్పుడే పుట్టిన "శిశువు" నుండి కట్టకడన అందరూ చేరే "స్మశానం" వరకు సమస్తము వీరి కవితా వధూటికలే. సాలీడు, గిజిగాడు, గబ్బిలం, గోవు వంటి తిర్యక్జంతువులూ, వీరి కవితా వస్తువులే. దేశమాత దాస్య శృంఖలాలను విడిపించటానికి తమ జీవితాలను ధారపోసిన గాంధి, నెహ్రూ, నేతాజి, పటేలు వంటి మానవ జాతి (జాతీయ) నాయకులు, అలాగే తమ స్ఫూర్తిదాయకమైన సిద్ధాంతాలతో, సందేశాలతో సమతా, మమతలను ప్రబోధించి భారతీయులను చైతన్యవంతం గావించిన బుద్ధుడు, వివేకానందుడు వంటి కారణజన్ములు కూడా వీరి అక్షరాలలో అందంగా ఇమిడిపోయారు. భరతమాత, ఆమె సేవలో పునీతులైన భరతవీరులు శివాజి, రాయలు, వీరచానమ్మ వంటి మహావీరులు వీరి కవితకు వస్తువులే. ప్రాచీనాంధ్ర కవులైన తిక్కన, భట్టుమూర్తిలు, వీరేశలింగం, చెళ్ళపెళ్ళ వంటి ఆధునిక సంప్రదాయ కవుల కవితావైభవాన్ని వీరి కలం అందంగా ప్రస్తుతించింది. ఇలా ఒకటననేమి, ఈ జగాన చర్మ చక్షువు, మనోచక్షువులకు గోచరమయ్యే సమస్త అంశాలపై వీరు కవితలల్లటం వీరి సునిశిత పరిశీలనాదృష్టికి నిలువెత్తు నిదర్శనం. 1895, సెప్టెంబరు 28న, వినుకొండలో, గుర్రం వీరయ్య, లింగమ్మ దంపతులకు జన్మించి, సంస్కృతాంధ్రభాషలలో పాండిత్యాన్ని సంపాదించి, ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి, మద్రాసు ఆకాశవాణిలో కార్యక్రమ ప్రయోక్తగా, ప్రపంచ యుద్ధ ప్రచారకునిగా... ఇలా వివిధ ఉద్యోగాలను సమర్థవంతంగా నిర్వహించారు. 30కు పైగా కావ్యాలు, శతాధిక ఖండకవితలు శ్రీ జాషువా గారి వ్యక్తిత్వాన్ని, స్వభావాన్ని, భావావేశాన్ని మనకు స్పష్టపరుస్తాయి. విశ్వనరుడిగా, పద్మభూషణుడిగా, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతగా, కవిచక్రవర్తిగా వెలుగొందిన శ్రీ గుర్రం జాషువా గారి కావ్యరాశిలో, ఆయా సందర్భాలలో వారు ప్రవచించిన భారత సంప్రదాయ, సంస్కృతి విశేషాల ఔన్నత్యాన్ని పరిశీలించుటయే ఈ పరిశోధనా పత్ర ప్రధాన ఉద్దేశ్యము.

సత్యము : భారతీయ సంస్కృతిలో అత్యంత ప్రధానమైనది సత్యవాక్పాలనం. దీని ప్రాధాన్యాన్ని సత్యహరిశ్చంద్రుడి కథ ద్వారా మనకు పురాణాలు విశదం గావించాయి. **"సత్యంవద, సత్యన్నాస్తి పరోధర్మః, సత్యమూలాని సర్వాణి, సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్, అసతోమా సద్గమయ"**(1) వంటి అనేక ఉపనిషద్ వాక్యాలు సత్య ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నాయి. మూడు సింహాల క్రింద ముండకోపనిషత్తులోని "సత్యమేవ జయతే" అని మనం రాసుకున్న వాక్యమే భారతీయ సంస్కృతిలో సత్యానికి మనమిచ్చే ప్రాధాన్యం వెల్లడిస్తుంది. ఈ సత్యాన్ని జీర్ణించుకున్న మహాకవి కనుకనే శ్రీ గుర్రం జాషువ తన కావ్యాలలో అనేక చోట్ల దీని ప్రాధాన్యాన్ని ఉగ్గడించారు. పిరదౌశి కావ్యంలో గజని మహమ్మదు పారశీక

కవికి తన జీవితచరిత్ర వ్రాస్తే, ఒక్కొక్క పద్యానికి ఒక్కొక్క బంగారునాణెం బహుమానంగా ఇస్తానని అల్లా తోడుగా పల్కి మాట తప్పాడు. కుంగిపోయిన జాషువా సుల్తానుకు ఒక ఉత్తరం వ్రాస్తూ ఎవరు నిజమైన నరుడో, ఎలాంటి వారి జీవితం ధన్యమో తెలుపుతున్నాడు.

"నీచే పూజితుండైనచో అల్లాకున్ సుఖమే? సత్యవాక్యంబెవండుల్లంఘింపడో వాడెపో నరుడు ధన్యుండిద్ధరామండలిన్" అంటాడు కవి. కాబట్టి శ్రీరాముని వలె ప్రతివ్యక్తీ సత్యవాక్కుని కలిగి వుండాలి. అలాంటి వాడే అసలైన నరుడు. వారి జీవితమే ధన్యము.

త్రాసులో వెయ్యి అశ్వమేధ యాగాలు చేసిన ఫలాన్ని ఒక ప్రక్క, ఒక్క సత్యం ఒక ప్రక్క వేసి తూస్తే ముల్లు సత్యం వైపే మొగ్గు చూపుతుంది. అంటూ శకుంతల సత్య ప్రాధాన్యాన్ని ఇలా ప్రకటిస్తుంది.

"సుతజల పూరితంబులగు నూతులు నూటికంటె సూనృత వ్రత యొక బావి మేలు, మఱి బావులు నూఱిటికంటె నొక్క స త్క్రతువదిమేలు, తత్క్రతుశతంబుంబకంటెనొక్క సుతుండు మేలు త
త్సుతశతంబునకంటె నొక్క సూనృతవాక్యము మేలుచూడగన్"

కానీ ఆనాటి నుండి ఈనాటి వఱకు అధిక శాతం మనుష్యులు స్వార్థపూరితులై అసత్య భాషణమే ఆలంబనగా జీవితాలు సాగిస్తున్నారు. జాషువా గారికి ఇది చాలా బాధ కలిగించింది. మానవ జాతి "పలుకులు తేనెలు, చూపులు శిలీముఖములంతరాత్మ చెడ్డది బిడ్డా!" అంటాడు. పిల్లకోతి – తల్లికోతి సంభాషణా రూపేణా మనిషి దేవుడి పేరుమీద కూడా అబద్ధాలాడుతున్నాడంటూ వాపోయాడు కవి.

"మృగములమగు మనలోగల
సుగుణంబులలోన గొన్ని శూన్యమతనిలో
మృగములబద్ధములాడవు
భగవంతునిపేర నతడబద్ధములాడున్"

జాషువా కవిత్వంలో ఇలా అనేక సందర్భాలలో సత్యనిష్ఠ యొక్క గొప్పదనాన్ని మనకు తెలియచేశాడు.

ధర్మ ప్రాధాన్యం :

భారతీయ సంస్కృతిలో ధర్మమంటే రాముడు. రాముడంటే ధర్మం. "రామో విగ్రహవాన్ ధర్మః". భారతీయ సంస్కృతిలో ధర్మమంటే వేద ప్రతిపాదితమైన ధర్మమే. దీనిలో మళ్ళీ ఆపద్ధర్మాలూ, విపద్ధర్మాలూ వుంటాయి.

ధారణాద్ధర్మ మిత్యాహుః ధర్మోధారయతిప్రజాః
ప్రభావార్థాయభూతానాం ధర్మప్రవచనం కృతం"

ధరించునది గావున ధర్మము అని పెద్దల మాట. ధర్మమే ప్రజలను నిలిపి వుంచుతుంది. జీవుల ఉత్పత్తి, జీవనము కొరకు ధర్మప్రవచనం చేయబడింది. దీనికిగల విశేష ప్రాధాన్యం తెలిసిన జాషువా తన కవిత్వంలో అనేక చోట్ల ప్రస్తావిస్తాడు. మఱిది వదిన పట్ల ఎలా వుంటే ధర్మమో ఒకచోట ఇలా పేర్కొంటాడు కవి. ద్రౌపదీ వస్త్రాపహరణం సందర్భంలో –

అంటగరానియగ్ని కెనయైనది ద్రౌపది; యట్టి సాధ్విప
య్యంట మొగాన బూని, యక్కటా! యశ్రులురాల యేడ్చినన్
దుంటరివై సహోదరులతో సభలోన బరాభవించినా
వంట! మఱిందివై వదినకా మొనగానితనంబు చూపుటల్"
"ధర్మ ఏవ హతోహంతి ధర్మో రక్షతిరక్షితః
తస్మాద్ధర్మో నహంతవ్యోమానో ధర్మో హతావధీత్"

ధర్మాన్ని బాధిస్తే అది తిరిగి మననే బాధిస్తుంది. రక్షిస్తే మనలను రక్షిస్తుంది. కాబట్టి ధర్మ నాశనం చేయకూడదు. జీవితకాలం చాలా చిన్నది. కాబట్టి ధర్మ నిర్వహణకై త్వరపడు అని మానవాళిని హెచ్చరిస్తాడు జాషువా.

"నమ్మకములేని నీ జీవనమునకవధి
గుందెగడియారమున దాగియుండునేమొ!
లెక్క ముగిసిననాట చాలించుకొనును
త్వరపడుము మూర్ఖ! ధర్మనిర్వహణకు"

ధర్మాన్ని కూడబెట్టడానికి వేగిరం ప్రయత్నం చేయమని ప్రబోధించాడు జాషువ. అలాగే కవిని కవిగా, ఉత్తమ కవిత్వాన్ని ఉత్తమంగా ఆమోదించకుండా కేవలం కులం కారణంగా ఆపాతమధురమైన సుధాకవితాస్రవంతిని అడ్డుకోవడం ధర్మమా? అని ప్రశ్నిస్తాడు జాషువ.

"చక్కని కవితకు కులమే
యెక్కువ తక్కువలు నిర్ణయించినచో, నిం
కెక్కడి ధర్మము తల్లీ?
దిక్కుంజర వేదికా ప్రతిష్ఠితగాత్రీ?"

శాంతి – ప్రాధాన్యం : భారతీయ సంస్కృతిలో శాంతికి విశేష ప్రాధాన్యం ఉంది. ఆదిదైవిక, ఆదిభౌతిక, ఆది ఆధ్యాత్మికమనే మూడు తాపములు శాంతిగా వుండాలనే సమున్నత ఆశయంతో మన సంస్కృతి ప్రతీ ఋక్కు చివరా 3 సార్లు **ఓం! శాంతిశ్శాంతిశాంతిః** అని ప్రతీకాత్మకంగా పలుకుతారు. "శాంతి సూక్తము" అనే పేరుతో ఒక సూక్తాన్ని చెప్తూ **శాంతిరేవ శాంతిః** అని చెప్పిన ఏకైక దేశం భారతదేశం. అందువలననే జాషువా తన కవిత్వంలో చాలాచోట్ల శాంతి ప్రాధాన్యాన్ని బలంగా వినిపించాడు. వ్యర్థమైన కక్షలు కార్పణ్యాలతో జీవితాలను నాశనం చేసుకుంటున్న నీ పుత్రులకు శాంతిసందేశాన్ని ఇవ్వమ్మా! అంటూ భరతమాతను వేడుకున్నాడు జాషువా.

"మనుజత్వంబున హింసయున్ ప్రబల ధర్మంబున్ ప్రతిష్ఠించు బు
ద్ధుని గాంధిన్‌గని పెంచినట్టి ఘన హిందూశాంతి సందేశమం
దన! బ్రహ్మాండవిదాహదోహలుల యున్మాదాగ్ని చల్లార్చు సా
ధనమేదో భవదీయ పుత్రకులకందంజేయుమార్యావనీ!"

అలాగే బుద్ధుడిని గురించి ప్రశంసిస్తూ – "యెక్కడదీ యకారణ ప్రేమ! జోహారు నీ నయన వీథుల తాండవమాడు శాంతికిన్" – అని, క్రీస్తు గురించి కీర్తిస్తూ "ఒక చెంపగొట్ట వేఱొక చెంప జూపించి పరమశాంతిని స్పష్టపరచునాడు" – అని క్రీస్తుయొక్క పరమశాంతిస్వరూపాన్ని మనకు స్పష్టపరుస్తాడు. మరొకచోట శాంతిని గురించి చెప్తూ –

"విసుగుకొనలేదు సృష్టికి విశ్వభర్త
పాలపాపల జన్మల మూలకమున
దెలుపుచున్నాడు శాంతి సందేశములను
విశ్వమా! ధర్మమును కూడబెట్టుమిపుడు"అంటాడు.

మాతృభక్తి – మాతృ దేశభక్తి – విశేషములు :

మానవజన్మమెత్తిన ప్రతివారూ మాతృమూర్తిని, మాతృదేశాన్ని తప్పకుండా గౌరవించాలి, పూజించాలి. భారతీయ సంస్కృతిలో ఈ రెంటికీ విశేష ప్రాధాన్యం వుంది. శ్రీమద్రామాయణం "జననీజన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అని చెప్పింది. ఆదిశంకరులు **"కుపుత్రోజాయేత క్వచిదపి కుమాతా నభవతి"** (5) చెడ్డ పుత్రుడు పుడతాడేమో కానీ లోకంలో చెడ్డ తల్లి మాత్రం పుట్టదు. భారతీయ శాస్త్రాలు కూడా **"న గాయత్రీ పరమ్మంత్రం న మాతుః పరదైవతం"** అని తల్లిని మించిన దైవం లేదనే చెప్పింది. జాషువా గారికి తల్లి లింగమాంబ గారంటే చాలా ఇష్టం. ఆయన బయటకు వెళ్తే మళ్ళీ తిరిగి ఇంటికి వచ్చేదాకా చేతికర్ర సాయంతో అటు, ఇటు తిరుగుతూ ఎదురుచూస్తూనే వుండేది ఆమె. రక్తం ధారపోసినా నీ ఋణం తీరదమ్మా అంటూ పసివానిలా రోదిస్తాడు కవి.

"అబ్బువది యేండ్లు నాదగు శిరోగ్రమునెక్కిన దల్లి కంటికిన్ జిరుతనుకాకపోనిది, విచిత్రము నేనిలుదాటిపోయినన్ మరలినదాక నా వెనుక మాయమ జీవము మూడుకాళ్ళతో దిరుగుచునుండు; నీ ఋణము దీరదు రక్తము ధారపోసినన్"

శ్రీనాథుడు గుణనిధి కథలో, నిజం తెలుసుకున్న తండ్రి కొడుకుని గెంటివేశాడు. చేతిలో చిల్లిగవ్వ లేదు. ఆకలిగా వుంది. అప్పుడు తల్లి తన ఆకలిని గమనించి ప్రేమతో ఆహారము పెట్టిన సంగతులన్నీ గుర్తుకువచ్చాయి. తల్లి అంటే ప్రాణంతో సమానమంటూ బాధపడతాడు.

"అరుణ గభస్తిబింబముదయాద్రిపయిం బొడతేరగిన్నెలో
బెరుగునువంటకంబువడపిందెయలుంగుడువంగపెట్టుని
ర్భరకరుణాధురీణయగు ప్రాణము ప్రాణము తల్లియున్నదే?
హరహర! యెవ్వరింక గడుపారగబెట్టుదురీప్సితాన్నముల్"

అని వర్ణిస్తాడు. జాషువా గారు తల్లి చనిపోయిన తర్వాత స్మశానంలో కార్యక్రమాలు అయిపోయిన తర్వాత తల్లి గురించి తల్చుకుని పసివానివలె శోకిస్తాడు. అమ్మా! నీవొసంగిన పాలపుష్టి కారణంగానే నా నాలుకపై కవిత్వం కదలాడింది. వెయ్యి జన్మలకైనా తమ్ముడితో కలసి నీ గర్భానే పుట్టాలని వుంది. తరుగనేదేలేని స్వచ్ఛమైన పుత్ర ప్రేమ నీది అని దుఃఖిస్తాడు.

"తరుగింతేనియులేని నీ మహిత పుత్ర ప్రేమ, యే తల్లికిన్
బురమాయించి త్యజించిపోయితివి మమ్మున్? నీ శరీరంబుతో!
మరణాంతంబున జన్మమే కలిగినన్ మాతల్లి! నీ కడ్పునన్
మరలన్ బుట్టెద వేయిజన్మములకుందమ్ముండువెంటాడగన్"

విచిత్రమేమంటే తల్లులు ఎలా వుండకూడదో కూడా చెప్పాడు జాషువా. కొంతమంది తల్లులు తమ నిరంతర పని ఒత్తిడి నుండి బయటపడటానికి పిల్లలకు ఆహారం పెట్టడానికో, నిద్రబుచ్చడానికో బూచాడు పేరుతో పిల్లలకు భయం నేర్పద్దంటాడు. అలాంటివి పైశాచిక వాత్సల్యాలు. అవి జాతికి తీరని వజ్రఘాతాల లాంటివని హెచ్చరిస్తాడు. వివేకానందుడు కూడా "Fear is death" అంటాడు. నిష్కల్మషమైన లేలేత పసిహృదయాల్లో చదువుల విషయమై వక్ర భావాలు నాటి (చదువురాకపోతే ఇక జీవితమే వ్యర్థం) పట్టభద్రులను చేస్తే పెద్ద పదవులు రావచ్చేమోకానీ మంచి గుణం మాత్రం రాదంటాడు జాషువా.

"ఆదిగురువులైన యంబయు నయ్యయు
మృదువులైనసుతుల యెడదలందు
వక్రగుణముజిల్కి పట్టభద్రులజేయ
గొప్ప పదవిదక్క గుణమురాదు"

యే దేశమేగినా యెందు కాలిడినా పొగడరా నీ తల్లి భూమిభారతిని అంటాడు రాయప్రోలు. ఈ దేశ వనరులతో విజ్ఞానాన్ని ఆర్జించి, విదేశాలకు వెళ్ళే ఈనాటి తరంకాదు జాషువాది. **"విశ్వవిద్యాలయంబులు బిందుచున్న తరళ విజ్ఞాన మధుర దుగ్ధంబుత్రావి బలిసి వచ్చిన ఉన్నత పట్టభద్రా! క్షితిని ప్రేమించుటభ్యసించితివే నీవు?** (పుట-140) దేశమాతను ప్రేమించటం నేర్చుకోని చదువుకూడా ఒక చదువేనా? అనేది జాషువా గారి ఉద్దేశ్యము.

ఈ భూమి పుట్టకముందే నువ్వు పుట్టావు. అన్ని పురాణాలు చదివావు. సకల సంపదలూ కలిగిన దానివి నువ్వు అంటూ పవిత్రమైన భరతమాతకు సప్రశ్రయంగా అంజలి ఘటిస్తాడు కవి.

ఉర్విబుట్టకముందె నీవుంటివేమో
సకలశాస్త్ర పురాణములచ్చదివినావు
గొనబు సిరిగలభాగ్యశాలినివి నీవు
భారతంబామణీ! నమస్కారమమ్మ!

సంసారం - దేవుడు :

భారతీయ సంస్కృతిలోని చతుర్విధ ఆశ్రమాలలో గృహస్థాశ్రమానికి విశేష ప్రాధాన్యం వుంది. సమాజంలోని ప్రజలందరూ సుఖంగా, ఆనందంగా వుండటానికి ఉపయోగపడే ఆశ్రమము ఇది. అలా అని దానిలో కూరుకుపోకూడదు అంటూ హెచ్చరించినది. "సంసారం సాగరం దుఃఖం తస్మాత్ జాగ్రత, జాగ్రత" - అంటూ దీనిలో నిండా మునిగితే ఎదురయ్యే కష్టాల గురించి భారతీయ సంస్కృతి సమాజాన్ని హెచ్చరిస్తూనే ఉంది. రాయలంతటి వాడే సంసార ప్రళయ గర్జనకు ఆగలేక తలక్రిందులై పోయాడు. ఇక సామాన్యుడెంత అంటాడు జాషువ. "సంసారసాగరం" అనే పేరుతో "సంకటకదంబ! సంసార సాగరంబ" అనే మకుటంతో నవరత్నాల లాంటి 9 తేటగీతులు వ్రాశారు కవి. చిమ్మచీకటిలో అయినా

దిక్కుతోస్తుందేమో కానీ సంసార తిమిరంలో మాత్రం కళ్ళు పొడుచుకుని చూసినా బయట పడడానికి మార్గం కనబడదంటాడు కవి.

"సాంద్రనీలాంబుధరపరిచ్ఛిన్నమైన
కృష్ణపక్షనిశీథియందేని, దిక్కు
దోచెడింకాని, నీయందు దోచదకట!
సంకటకదంబ! సంసారసాగరంబ"

అలాగే దేవుడిని కూడా శ్రీ జాషువా తన ఖండకవితలలో అద్భుతంగా వర్ణిస్తాడు. మహాభాగవతంలో గజేంద్రమోక్ష ఘట్టంలో తనను పట్టి పీడిస్తున్న మొసలి బాధ తాళలేక "రావే ఈశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మికా!" అంటూ గజేంద్రుడు ఎన్నిరకాలుగా వేడుకున్నా ఫలితం కనపడలేదు. అసలు దేవుడు వున్నాడా? అని ఏనుగుకు అనుమానం వచ్చింది.

కలడందురు దీనుల యెడ
కలడందురు పరమయోగిగణములపాలం
కలడందురన్ని దిశెలను
కలడు కలడనువాడు కలడో? లేడో?

ఇక్కడ జాషువాకు కూడా అదే సందేహమొచ్చింది. సాటి మనిషిని మనిషిగా చూడకుండా అహంకారంతో కష్టాలపాలు జేసినవారు మాత్రం హాయిగా బ్రతుకుతున్నారు. నీతి, నియమం, శీలం, వినయం, ధర్మం అంటూ గుణవంతునిగా వుండాలని అనుకున్నవారు కష్టాలు పడుతున్నారు. కానీ గుణవంతుడికీ, గుణహీనుడికీ ఇద్దరికీ మరణం తప్పడంలేదే? అని సందేహం వెలిబుచ్చాడు.

"పక్షపాతంబు లేదు దైవమునకంద్రు
ఖలుడు సుఖియించు, గుణశాలి కష్టపడును
కడకు నిద్దరిదెస నొక్కటంటనరయ
మృత్యుదేవతనేల నిర్మించినావు?

లోకంలో పాపము, పుణ్యము అనే రెండు పదాలు తరచుగా వినిపిస్తుంటాయి. **"ఏది పుణ్యము, పాపమెయ్యది? మహాత్మ!"** అని చమత్కారంగా భగవంతుడిని ప్రశ్నిస్తాడు. **"పరోపకారాయ పుణ్యాయ, పాపాయ పరపీడనం"** అని ఆ రెంటికీ మన ఆర్షధర్మం నిర్వచనమిచ్చింది. పుణ్యకార్యాలు చేస్తే స్వర్గానికి, పాప కార్యాలు చేస్తే నరకానికీ పోతారనేది మన నమ్మకం. కానీ అక్కడకు పోయివచ్చినవాడెవడు ఇప్పటివరకు కనిపించలేదు అంటాడు కవి.

స్వర్గనరకంబులున్న వచ్చటికి నరులు
బుణ్యపాపంబులే కొంచు పోవునంచు
పల్కుదురు; గాని కనివచ్చువాడు లేడు
ఈ రహస్యంబు రూపింపవేలనాథా?

అని ప్రశ్నిస్తాడు.

మతం – కులం :

వైదిక ధర్మం, మహాభారతాది గ్రంథాలు మొదలు ప్రబంధాలు, ఆధునిక రచనలవరకు మనుషులంతా సమానమే అని అరుంధతి, ధర్మవ్యాధుడు, మాలదాసరి మొదలగు అనేక కథల ద్వారా చెప్పే ప్రయత్నం చేసినా కొందరు స్వార్థపరులైన మూర్ఖుల పుణ్యమా అని అవి కంటితుడుపు చర్యలే అయినాయి గాని ఆచరణలో ప్రయోజనం లేకుండా పోయాయి. అసలు వేదధర్మాన్ని పాటిస్తూ జీవనాన్ని సాగించే ప్రజల సమూహాన్ని వైదికమతం అని పిలిచారు. కాలక్రమంలో అదే "హిందూ" అనే పేరుతో (జీవనవిధానమైన) మతనామంగా స్థిరపడింది. ఆ మతంలో పై నాల్గు వర్ణాలకు పేర్లుపెట్టిన పెద్దమనుష్యులు అన్ని రంగాలలో సమాజం అట్టడుగున వున్న అరుంధతీయులు, చర్మకారులకు మాత్రం సంఖ్య ఇచ్చింది. అందుకనే భారతీయ వ్యవస్థ మమ్ములను అవర్ణులను చేసిందంటూ బాధపడతాడు శ్రీ బోయి భీమన్న. వారికి సాంఘిక గౌరవం లేదు సమానత లేదు. కనీసం సానుభూతి లేదు. వారు కనబడితే హిందూ సమాజం చీదరించుకుంది అని ఆవేదన చెందాడు జాషువా. **"కసరి బుసకొట్టు అతని గాలిసోక, నాల్గుపడగల హైందవ నాగరాజు"** అని వ్యధ చెందాడు. అదే సమయానికి వారు కోల్పోయిన సాంఘిక గౌరవాన్ని,

కాలే కడుపుకు కాసింత ఆహారాన్ని అందజేసిన క్రైస్తవ మతం పట్ల ఆ రెండు కులాలలోని అధిక శాతం ప్రజ ఆకర్షితు లయ్యారు. మతం మార్చుకున్నారు. మతం అయితే మారింది కానీ వారిలో వారి కులాధిపత్యం మాత్రం పోలేదు. కులం మతాన్ని పక్కకు పెట్టేసింది.

"దేవుడొకడు, మాకు దేవళంబులు రెండు
దేశమొకటి మాకు తెగలు రెండు
మాటవరుసకొక్కమతమందుమే కానీ
కులసమస్యవద్ద కుమ్ములుమ్ము"

వారి మధ్యగల అనైక్యతను తెలియజేసి ఐక్యత అవసరాన్ని తెలియచెప్పాడు. **"సోదరులము మనమందరము, ఈ దేహము నీటిబుడగ, యెల్లరమొకటే; లేదు కలుంబంతరమని – వేదగ్రంథములు చదివి పృథుకంఠములన్"** అంటాడు జాషువ. కానీ ఇది అమలులో మాత్రం శూన్యము. కుల సమస్య ఎంతగా జటిలమైపోయిందంటే **"మాలబోధకుడెన్నడో మాదిగింట గుడిచినాడని, యమ్మాలగూడెమునకు నెడముగా వుంచి దాహంబు నీయరనుచు గుసగుసలు గల్గు, నిది తేల్చుకొనుట లెస్స"** అని ప్రబోధించాడు కవి. ఆ రోజున సమాజంలో అస్పృశ్యత ఎంత ఘోరంగా వున్నదంటే అలాంటి సమాజంలో బ్రతకడంకన్నా స్మశానమే మేలు అని వారు అనుకునే పరిస్థితి వచ్చింది. స్మశానంలో బలవంతులు, బలహీనులు అనే భేదం వుండదు. అస్పృశ్యత అసలే వుండదు. అంతా అభేదభావమే. ధర్మపాలనమే అంటాడు జాషువ.

"ఇట అస్పృశ్యత సంచరించుటకుతావే లేదు; విశ్వంభరా నటనంబున్ గబళించి గర్భమున విన్యస్తంబు గావించి, యు త్కటపుం బెబ్బులితోడమేక నొకప్రక్కనజేర్చి జేకొట్టియూ రటగల్పించునభేదభావమును, ధర్మంబిందుగారాడెడిన్"

ఆధార గ్రంథాలు :

1. శ్రీ గుర్రం జాషువ – పిరదౌసి మహాకావ్యం
2. శ్రీ గుర్రం జాషువ – గబ్బిలం – మహాకావ్యం
3. శ్రీ గుర్రం జాషువ – ఖండకావ్యాలు
4. కవిత్రయ మహాభారతం

స్త్రీ – గోవు :

ఆర్ష సంస్కృతి స్త్రీలు దేవతలతో సమానమని చెప్పింది. మనుధర్మం "యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః" అని వక్కాణించింది. శ్రీ జాషువా గారికి కూడా వారంటే ఎంతో గౌరవం. స్త్రీలు కష్టచరితులు, త్యాగ మూర్తులు, విధిచేత, వక్రబుద్ధిగల నరులచేత కూడా వంచితులే అంటాడు కవి.

"అబలయన్న బిరుదమంటించి కాంతల
స్వీయశక్తులదిమి చిదిమినారు
సబల యన్న బిరుదు సాధించి హక్కులు
గడనచేసి కొమ్ము కష్టచరిత"

– అని సందేశమిచ్చాడు కవి. అలాగే భారతీయ ధర్మం సకల దేవతా స్వరూపంగా భావించే "గోమాత" అంటే కూడా జాషువా గారికి ఆరాధనా భావనే. లలితా సహస్రనామం "గోమాతా గుహజన్మభూః" అని లలితాత్రిపురసుందరీ స్వరూపంగా గోమాతను పేర్కొంటుంది. అలాంటి గోవు ఒసగిన పరమ పవిత్రమైన పాలు త్రాగి అది ముసలిదై పోగానే చంపేయటం దర్మమా అని ప్రశ్నిస్తాడు జాషువా.

"వెలగలయట్టి నీ రుధిరబిందువులెన్ని వ్యయించి పాలుగా జిలికెదవోకదా? మొదవు చేడియ! నీ బలమెల్ల యిమ్మనుష్యులకిడి, వృద్ధురాలవయి స్రుక్కిననీకు గటారిపోటులా ఫలితము? భారతీయుని కృపా పరతంత్రత గొడ్డువోయెనే?"

అహింస, పశ్చాత్తాపము, కృతజ్ఞత, వినయం, ప్రేమ, త్యాగము వంటి భారతీయ సంస్కృతి, సంప్రదాయంలో మనుషులకుండవలసిన అనేక అంశాలపై శ్రీ గుర్రం జాషువ తన నిశ్చితాభిప్రాయాలను వెల్లడించారు. అందువలననే రాజులవలే రాతివిగ్రహాలకు పరిమితమవకుండా ప్రజల నాలుకలపై నిత్యం జీవిస్తున్నాడు జాషువా మహాకవి.

ఆధునిక కవిత్వం – వివిధ ఉద్యమాలు

డా. బి. సరస్వతి, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతలపూడి, ఏలూరు జిల్లా.
చరవాణి : 9492884820

ఉపోద్ఘాతం :

పాశ్చాత్య నాగరికత వలన, ఆంగ్ల సాహిత్య ప్రభావం వలన, ఆధునిక విజ్ఞాన శాస్త్ర పరిచయం వలన సమాజంలో ఆధునిక దృష్టి వృద్ధి పొందింది. ఆ కారణం చేతనే పాత సంప్రదాయాలను, విశ్వాసాలను, ఆచారాలను నిరసిస్తూ ఆధునిక ఆలోచనలు ఆరంభమయ్యాయి. ఈ నేపథ్యంలో వచ్చిందే ఆధునిక కవిత్వం. జాతీయ పునరుజ్జీవనం రోడ్డు రైలు మార్గాల నిర్మాణం, సంఘసంస్కరణ ఉద్యమం కారణాలుగా ఆంధ్రదేశంలో వీరేశలింగం సాంఘిక సాహిత్య రంగాల్లో ఆధునికతను ప్రారంభించాడు. ఆ కాలంలో వచ్చిన పత్రికలు, ముద్రణాయంత్రాలు కవుల దృష్టిని ఆధునికత వైపు మరల్చాయి. వీరేశలింగం అడుగుజాడల్లో గురజాడ భాష, భావం, ఇతివృత్తం, చంధస్సు విషయాల్లో ఆధునిక దృక్పథాన్ని ప్రదర్శిస్తూ రచనలు చేశాడు. ఆ తరువాత శ్రీశ్రీ ఆధునికతకు పరిపూర్ణత్వం కల్పించారు. ఈ కాలంలోనే పాశ్చాత్య దేశాల్లో వచ్చిన కాల్పనిక వాదం, మానవతావాదం వంటి సిద్ధాంతాల ప్రభావం తోడవడంతో తెలుగు కవులు ఆధునికత వైపు ఆకర్షితులయ్యారు. తద్వారా ఆధునిక కవిత్వం ఆవిర్భవించింది.

ఒకనాడు తిరుపతి వెంకట కవుల కాలంలో ప్రయోజనాన్ని ఎలా సాధించారో నేడు కూడా తెలుగు మీద అభిమానాన్ని పునరుజ్జీవింపచేయడానికి అవధాన కవిత నడుంకట్టి ముందుకు సాగుతుంది. అది సాహిత్యక్రీడగా మాత్రమే కాక ఉద్యమ వాహికగా గుర్తింప బడింది. క్రీ.శ. 1910 నుండి 1950 వరకు తెలుగు సాహిత్యాన్ని ఉ ద్రూతలూగించిన ఉద్యమం కాల్పానిక కవితోద్యమం దీనినే భావ కవితోద్యమం అని అంటారు. భావ కవిత్వం పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో పుట్టింది. దానిని రొమాంటిక్ పొయెట్రి అని కొందరు అంటారు. ఆత్మీయం ఆత్మాశ్రయం, ఆత్మనాశనం, అవ్యక్త వేదనా మధురం అయినా కవితాభివ్యక్తి భావ కవిత్వం విశ్వనాథ సత్యనారాయణ గారన్నట్లు కవి యొక్క ఒక అవిస్పష్ట భావాంకురము, ఒక అంతర్ని గూడత్వము, ఒక చిన్ని కావ్యంలోఊడబడటం "లిరికల్ పొయెట్రి" అని ఈ లక్షణం రాయప్రోలుతో మొదలై కృష్ణ శాస్త్రి తో శిఖరాన్నందుకున్నది. భావ కవిత్వంలో ప్రధానంగా అయిదు శాఖలను విమర్శలు గుర్తించారు. అవి (1) ప్రణయ కవిత్వం (Love Poetry), (2) దేశభక్తి కవిత్వం (Patraiatic Poetry), (3) ప్రకృతి కవిత్వం (Natural Poetry), (4) భక్తి కవిత్వం (Mystic Poetry) (5) స్మృతి కవిత్వం (Elegics).

ప్రణయ కవిత్వంలో తెలుగు భావకవులు మూడు నాలుగు ప్రయోగాలు చూశారు. రాయప్రోలు సుబ్బారావు గారు అనుమతిన ప్రేమతత్వాన్ని ప్రతిపాదించి ఒక నవ్యతను, భవ్యతను ప్రణయాన్ని కలిగించారు. "తృణకంకణం ఆ సిద్ధాంతానికి పతాకం, కృష్ణశాస్త్రిగారు కాల్పనిక కృష్ణపక్షం, ఆత్మనాయకమైన ప్రణయాన్వేషణకు ఆదర్శరూపం. విశ్వనాథ వారి కుల పాలికే ప్రణయం ప్రణయాన్వేషణకు ఆదర్శరూపం. విశ్వనాథవారి కులపాలికే ప్రణయం ప్రణయతత్వానికి మరొక భారతీయ తాత్విక ముఖం. నాయని సుబ్బారావు, నండూరి సుబ్బారావుల ముగ్ధ ప్రణయశాఖ మధుర మార్గాన్ని ఆశ్రయించిన ప్రణాయాన్ని ప్రసన్నం చేసింది. వర్డ్స్‌వర్త్, కీట్స్ మొదలైన కాల్పనిక కవుల కవిత్వోద్యమాయ ప్రేరణగా తెలుగు కవులు భావ కవులు కాల్పనికోథ్యమాన్ని ప్రవర్తింపచేసినా వారి సిద్ధాంతాలను సాహిత్య లోకంలో స్థాపించి భారతీయతను తెలుగు వారి అస్థిత్వ వ్యక్తిత్వతను లోకానికి చాటారు.

ప్రాచీన వైభవాన్ని భావించి కాల్పానికావేశాన్ని ప్రదర్శించేది దేశభక్తి కవిత్వం. రాయప్రోలు దీనికి ఆచార్యుడు. ప్రకృతి కవిత్వానికి దువ్వూరి రామారెడ్డి, కవికొండల, అడవి బాపిరాజు, నండూరి సుబ్బారావు మొదలైన వారు పోషకులయ్యారు. భక్తి కవిత్వానికి వేంకట పార్వతీశ్వర కవులను ముందుగా పేర్కొనాలి. రవీంద్ర కవీంద్రుని ప్రభావంతో వెలువడిన కవితాశాఖ ఇది. స్మృతి కవిత్వం కాల్పానిక ఉద్వేగం లేకపోతే వెలువడదు. నాయని సుబ్బారావు గారి మాతృ గీతాలు దీనికి నిదర్శనం.

తెలుగు సాహిత్యంలో కవిత్వోద్యమాలు

1. అభ్యుదయ కవిత్వోద్యమం : 1935లో శ్రీశ్రీ గారి మహాప్రస్థానం ఒక నవ్యోద్యమాన్ని ఆరంభించింది. ప్రపంచ యుద్ధాల సంక్షోభం, పెంచి విప్లవ చైతన్యం సోవియట్ రష్యాలో కమ్యునిష్టు విప్లవం ప్రపంచ కార్మికోద్యమ చైతన్యం, కారల్‌మార్క్స్, ఎంజెల్స్ గతితార్కిక భౌతిక వాదం, ఇవన్ని కలిసి సమసమాజ నిర్మాణ ధ్యేయంలో కార్మిక విప్లవాన్ని సమర్థిస్తూ పాలక పీడన వర్గాలకు వ్యతిరేకంగా సాగే చైతన్యాన్ని తెలుగు సాహిత్యంలో మోసుకుని వచ్చేరి. అభ్యుదయ కవిత్వోద్యమం. ఈ ఉద్యమం తెలుగులో వేరు అనడానికి ముందుగా సంప్రదాయ భావ నిరసనం, ఛందస్సుల నిరసనం, గ్రాంధిక భాషా వ్యక్తి నిరసనం, సంప్రదాయ కవితా ప్రక్రియల నిరసనం ఇలా విప్లవం మొదలైంది. ఆ ఉద్యమంలోనే భావకవిత్వం పై తిరుగుబాటు మొదలైంది. శిష్టా ఉమామహేశ్వరం, శ్రీరంగం శ్రీనివాసరావు, శ్రీరంగం నారాయణబాబు, పట్టాభి, ముద్దుకృష్ణ, పురిపండ అప్పలస్వామి అభ్యుదయోద్యమాన్ని ఆరంభించారు. 1935లో జరిగిన భారతదేశ అభ్యుదయ రచయితల సంఘం ప్రేరణతో శ్రీశ్రీ అభ్యుదయ శంఖాన్ని పూరించాడు. మహాప్రస్థానం అభ్యుదయ కవిత్వోద్యమానికి మార్గం చూపించింది. అభ్యుదయ కవిత్వంలో వర్గ సంఘర్షణ, కార్మిక కళ్యాణం, పీడిత జనవాణి నివేదనం, విప్లవ ప్రభోధం, వీరగాధా కథనం సమసమాజ నిర్మాణం మొదలైన లక్ష్యాలు కనపడతాయి. ఆ లక్ష్యాలు సాధించడానకి గేయాన్ని బలమైన సాధనంగా వాడుకున్నారు. అభ్యుదయ వాదులు, తెలంగాణ విముక్తి పోరాటంలో దాశరధి గాంధీ ఇజాన్ని అభ్యుదయ వాదాన్ని కలిపివాడాడు. పద్యాన్ని ఆ ఉద్యమ శంఖంగా పూరించాడు.

అభ్యుదయ కవులు వచన కవితను అభ్యుదయ రూపంగా తీసుకుని ప్రయోగించారు. అయితే అభ్యుదయ కవిత్వోద్యమంతో మార్క్సిస్ట్ భావజాలాన్ని అనుసరించక కలిగే ఏవైనా అభ్యుదయమే అన్నట్టు రచనలు సాగించారు. 1955 తర్వాత కమ్యునిస్ట్ ఉద్యమం ఆంధ్రలో కొంత వెనుకంజ వేయడంతో అభ్యుదయ కవిత్వోదమంలో కొంత స్తబ్ధత ఏర్పడింది. ఈ స్థబ్ధతను సహించక యాంగ్రీయంగ్ మెన్‌లా తిరగబడి సమాజాన్ని కవిత్వంలో ఆపరేట్ చేస్తామని ఆవేశంతో మూడేళ్ళు తెలుగు సాహిత్య రంగంలో చైతన్యాన్ని సృష్టించింది.

2. దిగంబర కవిత్వోద్యమం

దిగంబర కవిత్వోద్యమం 1965-68 మధ్య నగ్నముని, నిఖిలేశ్వర్, చెరబండ రాజు, మహేస్వప్న, జ్వాలాముఖి, భైరవయ్యలు కలిసి ఈ ఉద్యమాన్ని నడిపారు. అమెరికాలోని బీట్నిక్స్, ఇంగ్లాండ్ లోని యాంగ్రియంగ్‌మెన్, బెంగాలలోని ఆకలితరం కవుల స్ఫూర్తి వీనికి ఉంది. తీవ్రమైన పదజాలం, అశ్లీలమైన అభివ్యక్తీకరణ వీరి కవితలలో ఉన్నా, సమాజ రుగ్మతలపై వారి నిగ్రహాన్ని కలిసి ప్రదర్శించుకోవడానికి, కవితా రూపాలను అలా మలచుకున్నారు. వారు మూడు కవితా సంపుటాలు వెలువరించారు. విమర్శకులకు ప్రతి విమర్శకులకు సాగటం కష్టమని, విప్లవ ధ్యేయమే తమ ధ్యేయం కావున విప్లవ కవిత్వోద్యమంలో విలీనమయ్యాడు.

3. నవ్య సంప్రదాయోద్యమం :

1935-75 సంవత్సరాల మధ్య తెలుగు సాహిత్య చరిత్రలో నవ్య సాంప్రదాయ యుగమని పిలుస్తారు. ఇది

భావ కవితాయుగం మీద తిరుగుబాటుగా, అభ్యుదయ కవిత్వోద్యమానికి ప్రత్యర్థిగా తెలుగు సాహిత్య క్షేత్రంలో వికసించింది. భారతీయ స్వాతంత్రోద్యమ చైతన్యం ప్రాతిపదికగా భారతీయ సాంస్కృతిక మూలాలు ప్రపంచ దేశాలను సాహిత్యాలను ప్రభావితం చేయగలమన్న అవగాహనతో, ఆత్మ విశ్వాసంతో భారతీయాత్మను పరిరక్షించుకునే సాహితీ దర్శనాలను, ప్రయోగాలను ప్రోత్సహించి సాహిత్యోద్యమం నవ్య సాంప్రదాయోద్యమం. భారతీయ పురాణేతిహాసాలను మక్కికి మక్కి అనువాదం చేయడం నవ్య సంప్రదాయం కాదు. పాశ్చాత్య సాహిత్య గ్రంథాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, వాటికంటే అన్ని విధాలా ఉత్తమమైన భారతీయ సాంప్రదాయాలను వెలికి తీసి వ్యాఖ్యానించే పద్ధతి నవ్య కావ్య సంప్రదాయం పాశ్చాత్యుల విషాదాంత రూపకాలు నిర్మించుకుంటూనే కాళిదాసు, భవభూతి మొదలైన వారి నాటకాలలోని ఉత్తమ ఉదాత్త నాటక శిల్పాలను ప్రాధన్యం కలిగించిన ఒక నూతన ప్రయోగం చేయడం నవ్య సంప్రదాయం చారిత్రక కావ్యం, చారిత్రక నవల తెలుగులో ఆధునిక రస సిద్ధాంతాలు, కావ్య శిల్ప విమర్శ, మహా కావ్యదర్శనం, ఇవన్నీ 20వ శతాబ్ధానికి అనుగుణంగా ఆదర్శ రూపాన్ని అందించే పద్ధతిలో నవ్య సంప్రదాయ ప్రయోక్తులు ప్రయోగిస్తారు. శివ భారతం, రాణా ప్రతాప్ చరిత్ర రామాయణ కల్పవృక్షం, వేయిపడగలు, నారాయణ భట్టు వంటి చారిత్రక నవలలు, నాటకాలు, కథా కావ్యాలు నవ్య సాంప్రదాయమానికి ప్రయోగాలు జాతీయత, భారతీయత, విశ్వజనీ నత సూత్రాలపై ఆధారపడిన ఆధునిక సాహిత్య, చైతన్యానికి అందించేది నవ్య సాంప్రదాయం.

4. విప్లవ కవిత్వోద్యమం :

సాయుధ విప్లవ చైతన్యంలో సమసమాజాన్ని నిర్మించాలన్న మార్క్సిస్ట్, లెనినిస్ట్, మావో భావజాలంతో నక్సల్స్ ఉద్యమాన్ని సమర్థిస్తూ రాజకీయమైన నిబద్ధతతో రచనలు సాగించే చైతన్యం విప్లవ కవితా చైతన్యం. కవిత్వ ప్రజలలో చైతన్యం కలిగించడానికి ఉపకరణం అని ఈ ఉద్యమం నమ్ముకుంది. జానపద బాణీలతో రాసే పాటలకు, పీడిత జనబాధలకు నక్సల్స్ వీరుల గాథలకు ఉద్యమ బాధలకు ప్రాధాన్యతనిస్తుంది. మార్క్సిస్ట్ దృక్పథంలో సాహిత్య చరిత్రను పరిశీలించే ఉద్యమం కూడా విప్లవ కవిత్వంలో భాగమే.

5. స్త్రీ వాదం :

స్త్రీ వాద ధోరణి దళిత స్పృహ, ఫెమినిస్ట్ ఉద్యమాన్ని తెలుగులో స్త్రీ వాద ఉద్యమంటారు. స్త్రీ ల సమస్యలను కేవలం వారి సమస్యలుగానే చూడకుండా వాటి మౌళిక రాజకీయ తత్వాన్ని విశ్లేషణాత్మకంగా ప్రశ్నించి విశ్లేషించడం ఈ వాద స్వభావం, పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీ లు పొందే పతనాన్ని పురుషాధికతనూ నిర్మాణాత్మకంగా భావజాల పరంగా చారిత్రక నేపథ్యంలో గుర్తించడం,సెక్సుకూ, జెండర్‌కూ మధ్య బేధాలను తెలియజెప్పడం, లైంగికత్వం యొక్క రాజకీయ స్వభావాన్ని బట్టబయలు చేయడం, కుటుంబాన్ని ఒక ప్రైవేటు యూనిట్‌గా పరిగణించడం, సంతానోత్పత్తిలో కూడా ప్రజాతంత్ర విధానం పాటిస్తూ పునరుత్పత్తి ప్రజాస్వామ్యం కావాలని కోరటం స్త్రీవాద ధోరణి లక్ష్యాలు.

ఈ ఆలోచనలు ప్రతిపలించే కవితలు, ఇతర సాహిత్య ప్రక్రియల స్త్రీ వాద ఉద్యమ సాహిత్యంగా పిలువబడుతాయి.

6. దళిత వాదం :

దళితులు సమాజంలో పొందుతున్న అన్యాయాలను అరాచకాలను తెలిపి, రాజ్యంగపరంగా వారికి రావల్సిన రక్షణలు, సౌకర్యాలను గురించి సాహిత్యం ద్వారా తెలపడం, పాబల్య సంస్కృతిని ప్రశ్నించడం, ఆధిపత్యవర్గాల నాయకత్వాన్ని ప్రతిఘటించడం, ఆదర్శాలను, ఆదర్శీకరణలను తిరస్కరించడం, దళిత కవిత ఉద్యమం లక్షణాలు. ఆధునిక తెలుగు సాహిత్యంలో దళిత స్పృహ ఇక నూతన తరంగాన్ని సృష్టిస్తుంది.

ముగింపు :

సాహిత్యం సజీవ స్రవంతిలాంటిది. వివిధ భావ ధారలతో తన జీవన ధారను అవిచ్ఛనంగా ముందుకు సాగటమే జీవితం అని సాహిత్యం ద్వారా తెలుసుకోవచ్చు. తెలుగు సాహిత్యంలో ఆధునిక ప్రక్రియలో ఇటీవల కాలంలో అనేక ఉద్యమాలు, వాదాలు, ధోరణులు ప్రవేశించాయి. ఇటీవల కాలంలో మైనార్టీవాదం, ప్రాంతీయ వాదాలు కూడా చోటుచేసుకున్నాయి. సాహిత్యం సమాజంలో అంతర్భాగమే. కావున సమాజంలో జరుగుతున్న వివిధ రకాల పరిణామాలను అవగాహన చేసుకుని కవులు, కళాకారులు తమ కలాలను, గళాలను విప్పుతారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, అరాచకాలను వారి వారి కళల ద్వారా బహిర్గతం చేస్తారు. అందుకే శ్రీశ్రీ గారు "కాలం కడుపుతో ఉండి కవిని కంటుంది" అనే వాస్తవాన్ని మర్చిపోకూడదు.

ఆధార గ్రంథాలు :

1. ఆచార్య సత్యనారాయణ. ఎస్వీ "ఆధునిక సాహిత్యంలో ప్రక్రియలు, ధోరణులు" – తెలుగు అకాడమి ప్రచురణ, హైదరాబాద్ – 2005
2. రామకోటి శాస్త్రి, కేతవరపు – "ఆధునిక తెలుగు సామాజిక కవిత్వ ఉద్యమాలు" – జిజ్ఞాస ప్రచురణ, వరంగల్లు –2002
3. రమణారెడ్డి కె.వి. – ఆధునిక సాహిత్య చరిత్ర" విరసం ప్రచురణ – 1992
4. ఆచార్య సత్యనారాయణ ఎస్వీ. – తెలుగులో ఉద్యమ గీతాలు" ఆరసం ప్రచురణ – 1992.

అజంతా 'స్వప్నలిపి' – సహప్రముఖీనత

డా॥ పి. విజయకుమార్, వైస్‌ప్రిన్సిపాల్ & తెలుగుశాఖాధ్యక్షులు, శ్రీ మహాయోగి లక్ష్మమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎమ్మిగనూరు.

'కవీనాం కవిః' అని అభ్యుదయకవులలో అనదగిన కవి అజంతా. పెనుమర్తి విశ్వనాథశాస్త్రి తన కలంపేరు 'అజంతా' అని పెట్టుకోవడంలోనే విలక్షణమైన ఊహాశిల్పం వ్యక్తమవుతుంది. అజంతా అసలుపేరు పెనుమర్తి విశ్వనాథశాస్త్రి. పశ్చిమగోదావరి జిలాల కేసనపల్రు గ్రామంలో 2-5-1929లో జన్మించారు. హైదరాబాద్, చెన్నైలలో ఆయా పత్రికలలో పనిచేసారు. 'ఆంధ్రప్రభ'లో చీఫ్ సబ్‌ఎడిటర్‌గా పనిచేశారు. అజంతా కవిత్వ సరిహద్దుల తీరు విభిన్నంగా దర్శనమిస్తుంది. రాజీపడని వ్యక్తిత్వంతో కవిత్వాన్ని తపస్సుగా భావించి అజంతా కలం కదిలించాడు. రాసిన కవిత్వం రాసిలో తక్కువైనా వాసిలో పెను సంచలనాలనే సృష్టించింది. 1997లో అజంతా 'స్వప్నలిపి'కి కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు వరించింది. ప్రతి కవిత వస్తుపరంగా, శిల్పపరంగా ప్రతిధ్వనుల్ని సృష్టించింది. అందుకే తెలుగు కవితాప్రస్థానంలో అజంతా స్థానం ప్రత్యేకం, నవీనకాలంలో కవిత్వంలో డిలాన్‌థామస్ ప్రయోగించిన పదచిత్రాల సృజనలోను ఆంగ్ల వాక్యనిర్మాణ విన్యాసంలోను, మృత్యువును దర్శించిన వైనాలు ఆధునికసాహితీ ప్రపంచంలో అత్యున్నతస్థానాన్ని సాధించిపెట్టాయి. అజంతా కూడా డిలాన్‌థామస్ నుండి ఎన్నో నేర్చుకున్నట్లుగా కన్పిస్తాడు. అందుకే అజంతా 'ఆంధ్రాడిలాన్'గా కీర్తించబడ్డారు. భాషని పూర్తిగా పిండుకోవటంలోనే వినూత్నమైన విశిష్ట కవిత్వాన్ని డిలాన్ థామస్ సృష్టించగలిగాడు. డిలాన్ థామస్ కవితా రహస్యాన్ని అజంతా స్వంతం చేసుకొని జీర్ణించుకున్నాడు.

"అన్నింటికి కారకుడు మనిషి కనుక ప్రతి మనిషిలో నన్ను చూసుకోవడం నాకెంతో ఇష్టం. మనిషి ఎక్కడ ఉన్నా ఒకడే. పృథ్వీతలంపై మనిషి అడుగులచప్పుడు వినపడిన తొలిక్షణం నుంచి, మనిషి అంతరాత్మ ఒక్కటే. నేను ప్రతి మనిషిలో వుంటాను. ప్రతి మనిషి స్వప్నంలో వుంటాను. స్వప్నసౌందర్యంలో వుంటాను. బాధలో, దుఃఖంలో మండుతున్న గాయాలలో వుంటాను. ఎడారిలో, మనిషి ఆక్రందనలో ఉంటాను. అథఃపతితుడైన మనిషిని ఆప్యాయంగా లేవనెత్తుతున్న కారుణ్యహస్తాలలో వుంటాను. అక్షరాలకు సంకెళ్లు లేవు, భూగోళంపై సరిహద్దులు లేవు. మనిషి ఆత్మప్రకంపన ఒక్కటే. అతడు మాట్లాడేభాషకు ఆయువుపట్టు. ప్రతి అక్షరం ఒక మనిషి. ప్రతిమనిషి ఒక అక్షరం. మనిషి ముఖకవళికలవలెనే, మనిషి అవయవ నిర్మాణం వలెనే అక్షరాలకు కూడా ఒక ఆకారం, ఒక భంగిమ, భావానుగుణ్యమైన ఒక కదలిక, ఒక లయ, ఒక విన్యాసం, రంగు, రుచి వుంటాయని నేను విశ్వసిస్తాను. స్వప్నలిపి రహస్యం ఇదే అంటారు అజంతా." దైనందిన జీవనబీభత్సంతో తను చేస్తున్న విచిత్ర విన్యాసాలనే కొత్తఛందస్సులుగా కవిత్వసృజన చేశారు అజంతా.

శ్రీశ్రీ, 1972లో నగ్నముని 'తూర్పుగాలి' సంకలనానికి స్వాగతవచనం చేస్తూ "శ్లిష్టా, పఠాభి – వాళ్ళిద్దరిలాగే, కొన్ని విషయాలలో ఇద్దరికన్నా మిన్నగా వచనగీతం మీద పరిపూర్ణమైన అథారిటితో కవిత్వం చెప్పిన వాడు అజంతా" అన్నాడు. నగ్నముని, అజంతా ప్రభావంతో 'ఉదయించని ఉదయాలు' రచించారు. ఆ ప్రభావానికి ఎంతోమంది కలం కదిలించారు. దూరదృష్టి కలిగిన కవి, తన కవిత్వ ప్రభావంతో తరాల్ని ప్రభావితం చేయగలడు. బలమైన వాక్కుతో ప్రతిధ్వనుల్ని సృష్టించగలడు. ఎంతైనా అక్షరాన్ని అతిజాగ్రత్తగా చెక్కడంతో అజంతా అందెవేసిన చెయ్యి.

నిర్జీవమైన పదాలను కూడా నజీవ సౌందర్యచిత్రాలుగా రూపొందించడం కవి విలక్షణ ప్రతిభపై ఆధారపడి ఉంది. భావం ఎంత విశిష్టమైనదైనా భాషలో కొత్త పదాలు చూపలేకపోయినప్పుడు కవిత నేల మీద మాత్రమే ఉంటుంది. ఆకాశమంత ఎత్తు ఎగరలేదు. కవే ఎగరలేనప్పుడు పాఠకులను ఏ ఎత్తులకు తీసుకెళ్ళగలడు? ఈ రహస్యం డిలాన్ థామస్‌కి తెలుసు; అజంతాకి తెలుసు. అజంతా దృష్టి ప్రధానంగా భావం మీద కంటే, శిల్పం మీదే ఎక్కువ దృష్టి కేంద్రీకరించినట్లు కన్పిస్తుంది. ఉలితో శిల్పాన్ని చెక్కే శిల్పికి ఉండేంతటి ఏకాగ్రత శిల్పదృష్టిని పరిశీలిస్తే శ్రీశ్రీ, తిలక్‌ల తర్వాత అజంతానే ప్రముఖంగా కన్పిస్తాడు. రాసిన ప్రతి అక్షరంలో మహాశక్తిని నిక్షిప్తం చేసి, అక్షరశతఘ్నులు పేల్చి సమకాలీన కవుల్నిసైతం ప్రభావితం చేసిన ప్రఖ్యాతకవి అజంతా.

స్వప్నసహవాసి :

కవిత్వం ఒక స్వప్నక్రియ. జన్మతః స్వప్న విద్య అలవరచుకున్న కవి అజంతా. స్వప్నసహవాసి అజంతా కవిత్వాన్ని 'స్వప్నలిపి'గా భావించాడు. 'కవిత్వం ఒక ఆల్కెమి' అన్నాడు తిలక్. అజంతా తాను రాస్తున్న కవిత్వం ఇంకా లిట్మస్ టెస్ట్ దాటలేదంటాడు. అజంతా తాను శోధన నాళికలలో జీవిస్తున్నాను. అర్ధసత్యాలతో జీవిస్తున్నాను. భిన్న, విభిన్న రసాయన చ్ఛాయలలో జీవిస్తున్నాను. భ్రమ, విభ్రమాలలో బ్రతుకుతున్నాను. పరిస్థితులను గమనిస్తుంటే ఒకవైపు భయంకరమైన వాస్తవం కాలావధులకు అతీతంగా కలలపై పరిభ్రమిస్తున్న నైరూప్య ప్రపంచం మరొకవైపు; నా అన్వేషణ ఇక్కడే ప్రారంభమైందంటాడు అజంతా. "మనిషి సహజంగానే స్వాప్నికుడు. మనిషిలో అంతర్భూతమై వున్న స్వప్నశక్తిని, స్వప్నశక్తి సార్వభౌమాధికారాన్ని వినిర్గతం చేయడం ద్వారా ఆశిస్తున్న కొత్త ప్రపంచాన్ని ఆవిష్కృతం చేయగలగానన్నదే అజంతా తన కవిత్వపంథాగా చెప్పుకున్నాడు. కవిత్వమే జీవితంగా జీవించాడు, అందుకోసమే కవిత్వం రాసాడు. "అక్షరం తర్వాత మరో అక్షరం. చీకటి అవయవాలపై తెల్లని అక్షరాలు. ఒక అక్షరాన్ని చుట్టుకొని ఎన్నో అక్షరాలు. వాక్యం తరువాత మరోవాక్యం. అంతా ఒక 'చిత్కళ'. చిత్రవిచిత్ర వాక్యసముదాయం. నేను అక్కడే వుంటాను. అక్షరం విచ్చుకుని స్వప్నధూళిలో ఆవిర్భవించిన కొత్త అక్షరంలో నేను వుంటాను". ఇదే 'స్వప్నలిపి'గా పేర్కొన్నాడు. వర్తమాన జీవితం అగమ్యం, అస్పష్టం, అగోచరం, అర్ధరహితంగా ఉందంటారు. అజేయంగా వున్నదల్లా స్వప్నశక్తి సార్వభౌమాధికారం ఒక్కటే. అది అప్రతిహతం అంటారు.

కవి అన్నవాడు ప్రపంచాన్ని చూడాలే తప్ప, తానై ప్రపంచానికి కనపడకూడదు అన్నది అజంతా భావన. అందుకే కవిత్వం ఒక రహస్యక్రీడగా, మర్మక్రీడ భావించాడు. చీకట్లో ఉన్నవాడే జీవనరేఖపై అఖండ దీపాన్ని స్పష్టంగా చూడగలడని అజంతా నమ్మకం.

"నా నివాసం ఎక్కడో శూన్యంలో చీకటి పాషాణాలపై
స్వప్నశృంఖలాలలో కావచ్చుగాక
కాని, శూన్యంలో చీకటి ప్రజ్వలనం నేను చూశాను.
చీకటి ప్రజ్వలనంలో నిర్జీవప్రతిమ ఖడ్గనాట్యం చూశాను
నేను సజీవంగానే ఉన్నానా?
అశ్రుదగ్ధమైన నీడలలో నా ప్రతిధ్వని మళ్లీ ఎప్పుడు వినగలనో మరి"

చీకట్లో ఉన్న మనిషి జనన మరణ రహస్యాన్ని ఎలా ఆవిష్కృతం చేయగలడో అజంతా 'చీకటి చిత్రశాల' కవిత ద్వారా ఆవిష్కరించాడు. మృత్యువు సంభవించడం హఠాత్ సంఘటన కాదు. అది ఒక పరిణామం అన్న భావాన్ని స్పష్టం చేశాడు. 'మనిషి' ఉన్నాడు కాబట్టి మరణం అనేది ఒకటుంది అంటాడు. "భయ, విభ్రమాల మధ్య విషాదవాక్యం వలె సాగె జీవితంలో మృత్యువు ఒక్కటే నిజం అన్నది ఒక హెచ్చరిక కాదా అంటాడు. మృత్యువు శారీరకం కాదు. క్షణక్షణ జీవితం, క్షణక్షణ మృత్యువు, నేను ఇంకా

సజీవంగానే ఉన్నానన్న విషయం నిర్ధారించు కోవడానికి నా మృత్యువును నేనే అనేకసార్లు నడివీధిలో చూశానంటారు. చూడక తప్పదంటారు. మృత్యువు కూడా జీవితమేనంటారు. మనం ప్రస్తుతం జీవిస్తున్నది మృత్యుచ్ఛాయలలోనే కదా. ఆశ, నిరాశ వేరు వేరు కావు, జనన, మరణాలు వేరు వేరు కావు, మరణ రహస్యం ఇప్పుడు రహస్యం కానేకాదంటారు. శిరస్సు తెగిన దీపస్తంభం మృత్యువు" అన్న వాక్యాన్ని కిరీటంగా ధరిస్తానంటాడు.

మనిషి సమాధి పక్కనే మనిషి పుట్టుక. అంతా ఒకే వృత్తం. అంతా ఒకే లిపి అంటారు. వాస్తవం చేదు విషం కాబట్టి గరళకంఠుడైన కవి ఒక్కడే ఉద్భవిస్తాడంటారు. కవిత్వం సహస్రముఖి. కవిత్వం ఒక ఎడతెగని ప్రవాహం అనుకుంటే ప్రవాహజలం ఎక్కడైనా, ఎప్పుడైనా ఒకటే. హృదయాన్ని చీల్చుకుని వచ్చే అక్షరాలకు రసాయన దోషం అంటదంటారు. కాలానుగుణ్యమైన భాష ఆర్కిటెక్చర్ కవిత్వానికి అత్యంత ప్రాధాన్యం అని నా కవిత్వానికి కూడా ప్రాణవాయువులవే అంటాడు. ముక్త కవిత్వానికి గౌరవప్రదమైన స్థానం కల్పించాలన్నదే తన లక్ష్యం అంటారు. అజంతా రాసిన పద్యాలు బహుశా నలభై పైగానే ఉండొచ్చు. ఇవన్నీ 1948 నుండి 1992 మధ్య కాలంలో రాసినవే. రాసిన పద్యాలన్నీ స్మృతిపీఠం ముందు కూర్చుని రాసినవే. రాసి సమాజలోకం మీద ఆరవేయడం వరకే నాపని అంటారు. 'పెర్ప్లెక్షన్' నా లక్ష్యం అంటాడు. దీన్నే 'క్రిస్టిలైజేషన్' అని కూడా అనవచ్చు. అది ఎంతవరకు నెరవేర్చగలిగానో శేషజీవితంలో సాధ్యమవుతుందో లేదో అనే నిరంతర ధ్యానంతోనే పద్యాలు రాసారు.

నిరాశావాదం :

అజంతా కవిత్వంలో నిరాశామయ మానసికావస్థ స్పష్టంగా గోచరిస్తోంది. "ఉరిత్రాళ్ళు నా ఊహలు / సంకెళ్ళు నా మాటలు / నాపై రువ్విన రాళ్ళు నా అక్షరాలు" అంటాడు. పై వాక్యాలను పరిశీలిస్తే ఎంతటి నిరాశానిస్పృహలు, బాధాతప్త హృదయంతో ఆవేదనతో కవిత్వసృజన చేస్తున్నాడో తెలుస్తుంది. ఊహకందని భావాలు తారసపడతాయి. అజంతా కవిత్వంలో ఏ కవికైనా ఊహలు, ఆనందం, బాధనో కల్గించొచ్చు కాని ఏకంగా ఉరిత్రాళ్ళను ఊహలుగా కలిగిన వ్యక్తి మనసు ఎలా ఉంటుందో ఊహకందని విషయం, ఆ మాటలను సంకెళ్ళుగా భావించడం, తనపై రువ్వినరాళ్ళను అక్షరాలుగా భావించడంలో కవి అవ్యక్తవేదనామయ స్వరూపానికి అక్షర రూపంగా భావించవచ్చు. పైగా రూపం లేదు, "నా రూపం నా గీతం" అంటూ గీత స్వరూపాన్ని స్పష్టం చేశాడు. అజంతా అధివాస్తవికత నీటిమీద తెప్పలా పైకి తేలుతూనే ఉంటుంది.

"నాకు నిలయం లేదు
నాకు విలయం లేదు
అశాంతిని ఆక్రమిస్తాను
అడవిలో వెన్నెలను దుస్తులుగా ధరిస్తాను
అర్ధరాత్రి బీభత్సం మేలుకొనేటప్పుడు
శూన్యం మీద శూన్యంగా కూర్చుని
రాలుతున్న నక్షత్రాల మీద నా గీతం రచిస్తాను
ఆకాశం కనబడని చోట
చీకటి ఉరికంబంలా నిలబడిన చోట
నిశ్శబ్దం మీద నిశ్శబ్దంగా కూర్చుని
రాలుతున్న నక్షత్రాల మీద నా గీతం రచిస్తాను"

అంటారు. 'నాపై రువ్విన రాళ్ళు నా అక్షరాలు' అనే కవితలో. ప్రతి ఆలోచనలో, భావనలో, తలపులో తారాస్థాయి విషాదాన్ని ప్రతిభావంతంగా ప్రకటించాడు.

సంక్షుభిత మానవ సమాజంలో తారసపడే సంక్లిష్ట మనస్తత్వాలు, రాజకీయ చదరంగంలో క్రుంగికుశించి పోతున్న మానవీయవిలువలు, సమాజంలో రకరకాలుగా సంచలనమవుతున్న మృత్యుబీభత్సం మొదలైన భావాలు పదునైన పదాలతో అజంతా కవిత్వం సాక్షాత్కరిస్తుంది. తొలినాళ్ళలో రాసిన కవిత్వానికి పరిణామక్రమంలో

ప్రభవిల్లిన కవిత్వానికి ఎంతో వైవిధ్యముంది. 'కవి' తన కవిత్వంలో తాను దొరుకుతాడు. కవిత్వంలో తన జీవితం ప్రతిఫలిస్తుంటుంది. అంతర్ముఖీనుడైన అజంతా తన కవిత్వంలో మానవ హృదయ సంక్షోభం అంతా కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు.

సమాజంలో ఎన్నో విపరీత విపత్కర పరిస్థితులను చవిచూసిన అజంతా తన కవిత్వంలో మానవతావాద దృక్పథాన్ని కొన్ని కవితల్లో ఆవిష్కరించారు. "ఆశలేదు, ఆస్కారంలేదు / ఫలానా రోడ్డు గమ్యం చేరుస్తుందనే సూచన ఎక్కడా లేదు / జీవితం ఎప్పుడూ ఇలా కన్నీళ్ళ ప్రవాహంగానే సాగుతుందనుకుంటాను / రోడ్డు పొడుగునా చెట్లు కూలుతున్న దృశ్యాలనే చూపుతుందనుకుంటాను / లేకుంటే ఎంతో అందమైన సాయంత్రం కదా ఇలా అపస్వరాలు వినపడడం జరగదు / రోడ్ల మీద ధూళి, దారిద్ర్యం సమస్తం మిత్రుడు వెంకట్రావు ముఖం మీదనే పరవళ్ళు తొక్కడం జరగదు అంటూ నిరుద్యోగి వెంకట్రావు జీవితంలో చెట్లుకూలుతున్న దృశ్యాల గురించి హృదయ విదారకంగా కవితాచిత్రణ చేస్తాడు. నిరుద్యోగి వెంకట్రావును గురించి చదువుతుంటే తిలక్ 'అమృతం కురిసిన సంకలనంలో 'సి.ఐ.డి. రిపోర్ట్' కవితలో 'గుమాస్తా సుబ్బారావు పాత్ర కళ్ళముందు సాక్షాత్కరిస్తుంది. అంతరాంతర జ్యోతిస్సీమల్ని బహిర్గతం చేసే కవిత్వ విధానం అజంతాది. సామాన్యుని వేదనను ఆవేదనగా నివేదించడంలో అజంతాది అందెవేసిన చెయ్యి.

"తలక్రిందులైన స్వప్నం మీద శల్యాకారంగా కూర్చున్న కుర్రవాడు / ఆపాదమస్తకం సూదులతో ముస్తాబై ఉన్నవాడు / అతని ముఖం నిండా స్ఫోటకం మచ్చలు / కళ్లలో శిలావిగ్రహాల వీక్షణలు / అతని చుట్టూ పరాజయభారంతో క్రుంగుతున్న వృక్షాలు అంటూ నిరుద్యోగి వెంకట్రావుని వర్ణిస్తూ మనముందు నిలబెడతాడు.

వెంకట్రావు ప్రస్తుతం ఆకాశం క్రిందనే నివాసం ఉంటున్నాడని, నగరం నడివీధిలో తన జీవితాన్ని ఆవిష్కరిస్తుంటే అకారణంగానే సూర్యుడు ఖిన్నుడౌతాడని, చెట్లమీద ఆకుసైతం అల్లల్లాడదని, టెలిఫోన్ తీగలలో వార్తాప్రసారం సాగదంటాడు. నగరం గుండెలలో నిరుద్యోగి వెంకట్రావు సాలీడులా అల్లుకుంటూ ఉంటే ప్రభుత్వ భవనాలలో ఎవరికీ ఒక క్షణంపాటు ఊపిరి ఆడదని, కలం, కాగితం పట్టుకున్న అధికారి తనంత తానే రాజీనామా పత్రం మీద సంతకం పెడతాడని, ప్రభుత్వ భవనాల మీద జెండా సిగ్గుతో తలవాల్చుకోవచ్చంటాడు. తన ఆకలిని రాళ్ళలో రప్పలలో దాచుకుంటూ ఉంటే రాజకీయవేత్తలు వాటిని వేలంపాటలో కొనుక్కుంటారంటాడు. ఇంతటి దయానకమైన పరిస్థితులను హృదయవిదారకంగా వర్ణించాడు. విషాదం రంగు ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి, కవులు, చిత్రకారులు, వెంకట్రావు కన్నీళ్ళపై పరిశోధనలు చేస్తారు అని వ్యంగ్యంగా పలికి, అతని పాదధూళిలో చీకటి పుట్టుపూర్వోత్తరాలు వెతుకుతారంటాడు.

జీవితంలో 'నిరుద్యోగిత్వం' అనేది ఎంత భయంకర అవస్థో కవిత్వం ద్వారా దృశ్యీకరించాడు. "బాధ అనే దీపం పట్టుకుని / సర్వనాశనం అనే తాళంచెవిని పట్టుకుని / వెంకట్రావు జీవితం అనే చీకటి నరకకూపంలో ఎన్నో భయంకరమైన ఆశ్చర్యాలు చూడొచ్చు" అంటాడు. జీవితం మీద నమ్మకం ఉన్నవాడు వెంటనే అక్కడే ఊరిపోసుకొని చావడం సంభవం కావచ్చు అంటాడు. అంటే సమాజంలో నిరుద్యోగవ్యవస్థ వల్ల వెంకట్రావులాంటి ఎందరో వ్యక్తులు ఎంతటి దుర్భర పరిస్థితులు చవిచూస్తున్నారో వ్యక్తమవుతుంది. అయితే "నిరుద్యోగి వెంకట్రావు ఎన్నటికీ చావడు / అందుకే అందమైన సాయంత్రంవేళ నగరం అంతటా అపస్వరాలు / వెంకట్రావు నడుస్తున్నంత మేరా చెట్లు కూలుతున్న దృశ్యాలు" అన్న ముగింపు ప్రతిపాఠకుణ్ణి కదిలిస్తుంది.

అజంతా రచనలు తిరిగి మరో విధంగా తాత్పర్యార్థాన్ని చెప్పడానికి వీలయ్యేవి కావు. ఆధునికులు మంచి కవిత్వానికి

ఇదొక లక్షణం అంటారు. వ్యక్తి చైతన్యం ఆధునిక నాగరికతలో సాంప్రదాయిక సమాజంలో లాగా అందరితోటి, ప్రకృతితోటి, అన్నింటితోటి సమస్థితిలో ఉండదు. ఈ ఆధునిక స్థితిలో ఒంటరిగా భావించే వ్యక్తి దారిలేనిచోట దారిని వెతకడం ప్రారంభిస్తాడు. గాలిలేని చోట ఊపిరి కోసం తపన పడుతుంటాడు. ఇలాంటి స్థితిగతుల్ని పునఃప్రవచించిన మార్గం అజంతాది. అంతర్ముఖత్వం ద్వారా దీన్ని సాధించారు. ఆధునిక కవిత్వంతో ఇది కాలుష్యయుగం అని ప్రకటించాడు అజంతా. ముప్పైఏళ్ళ క్రితం ఒకసారి సాహిత్యంలో సాహిత్యేతర విషయాలు కలిసిపోయాయని నొచ్చుకున్నాడు. కవిత్వంలో సిద్ధాంతాలు, విశ్వాసాలు ఉండకూడదన్నాడు. అనుకరణం కూడా కాలుష్యానికి దోహదకారంటాడు. మనస్సులో పుట్టిన కదలికలూ, మాటలూ మాత్రమే కవితాసంపద అయిన పరిస్థితిలో అనివార్యంగా ఏర్పడే కవితాసిద్ధాంతమిదేనంటాడు. అజంతా రాసిన వచన పద్యాల్లో ప్రధానంగా కనిపించే అంశం 'మృత్యువు' భాషాపరంగా, భావాలపరంగా, మనుష్యులపరంగా మృత్యువుతో పాటు చివరకు తన సొంతచావు ఇలా అనేక రకాలు మృత్యువుకి సంబంధించిన అంశాలు అజంతా కవిత్వంలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

ఎవడో హఠాత్తుగా ఘోరప్రమాదంలో చిక్కుకుంటాడనుకో, చుట్టూ పోగైన జనం ఒక్క దఫా నా ముఖంవైపు చూస్తారు. ఇదేం విచిత్రం వీడు, వాడు ఒకే పోలిక అని ఆశ్చర్యపోతారంటాడు. అందాకా ఎందుకు, రోడ్డు మీద నా మృతకళేబరాలని నేనే లక్షసార్లు చూశానంటాడు. నమ్ముతావో నమ్మవో గాని తమ్ముడూ నిజం చెప్తున్నాను అని "ఈ నగరంలో అడుగుపెట్టిన రోజున పట్టపగలు నక్షత్రాలు చూశాను అంటాడు అజంతా. ఈ మృత్యువు ప్రపంచం అంతటా వ్యాపించి వున్నది. ఆధునిక నాగరికతలో వ్యాప్తమై వున్న ఈ మృత్యు లక్షణం భాషకి కూడా వర్తిస్తుందంటాడు.

"నేను మాట్లాడే భాషవేరు
మృత్యువాంఛ ప్రజ్వరిల్లుతున్న వేళ మనిషి అంతరాంతరాలలో
రహస్యద్వారాలు నోరు తెరుస్తున్న హోరు
నేను రాసే కవిత్వం వేరు
శిరస్సు బ్రద్దలై ప్రవహిస్తున్న సెలయేరు"గా అభివర్ణించుకున్నాడు. అక్షరహింస కవిత్వం కాదంటాడు. "అక్షరహర్మ్యాలతో ప్రచ్ఛన్న రాక్షసులకు దూరంగా రోడ్ల మీద నడుస్తూనే నేను కవిత్వం వ్రాస్తున్నానంటాడు. రోడ్లు నా ప్రాణం. నేను అన్వేషిస్తున్న రహస్య జగత్తు రక్తనాళాలు రోడ్లు అని, రోడ్లు నా రహస్య సంకేతాలంటాడు. రోడ్ల భుజస్కంధాలపై స్వేదబిందువులలో నీ ప్రతిబింబం ఒకసారి చూసుకోమంటాడు. "రోడ్లు నా జీవనా వ్యాకరణం/ నడుస్తున్న ప్రతిమనిషి నన్ను ప్రతిబింబిస్తున్న వాడే / ఒకే భాష, ఒకే ఘోష, ఒకే ఆకారం / ఒకే ఆత్మకథ అంటాడు.

రోడ్లు నా సర్వస్వం, రోడ్లు నా ఇతివృత్తం, రోడ్లు నా ఛందస్సు, రోడ్లు నా నిఘంటువు, నా అక్షర ప్రపంచం అదే అంటాడు. "నా చుట్టూరా మనుష్యులు / మనుష్యులను కబళిస్తున్న మనుష్యులు / సుఖదుఃఖాల మధ్య నిర్లిప్తంగా నడుస్తున్న మనుష్యులు / అరచేతులలో ఎడారులను మోసుకొని వస్తున్న మనుష్యులు / శిక్షా వాక్యాలవలె నిలబడిన భవనాలలో మనిషి భవిష్యత్తును / ఉరితీస్తున్న మనుష్యులు కన్నీళ్ల వలె మెరుస్తున్న మనుష్యులు / రగులుతున్న గాయం నుంచి నెత్తురు చుక్కలవలె రాలుతున్న మనుష్యులు / అంతా నన్ను చీల్చుకుని వస్తున్నవాళ్లే / నా కన్నుల వెనుక రహస్య జలపాతాలను ఛేదించుకొని / వస్తున్నవాళ్ళే" అంటాడు. అన్నింటికి కారణం మనుషులే అని, కన్నీళ్లకు కారణం మనుషులే అంటాడు. మానవ హృదయాల అంతశ్చైతన్యాన్ని, భావచిత్రాలలో పట్టుకోగలిగిన ప్రతిభావంతుడు అజంతా.

"నేనెవరో తెలుసా / నాపై విషాదమేఘాలు రువ్వుతున్న వారెవరో తెలుసా / నన్ను వాగ్బంధనం చేస్తున్న వారెవరో

తెలుసా / నన్ను రహోబిలంలో పడద్రోస్తున్న వారెవరో తెలుసా / నా మస్థిష్కాన్ని కాటువేస్తున్న వారెవరో తెలుసా / జీవన సౌరభాన్ని నడివీధిలో వేలం వేస్తున్న వారెవరో తెలుసా / మేఘచ్ఛిన్నమైన ఆకాశం క్రింద రోడ్ల పొడవునా / శిథిల వృక్షాలకు నమస్కారం చేస్తున్న పరివ్రాజకుడా / విధ్వంసక యంత్రాలను ఆలింగనం చేసుకుంటున్న సాహసికుడా / నీ చేతులను నీవే ఉరిత్రాళ్లుగా మార్చుకుంటున్న వాడా / నీవు మరెవరో కాదు నేనే / నన్ను వెంటాడుతున్న దారుణ మారణజ్వాలా హస్తాలను హతమార్చగలనా నేను / మనిషి నిర్మిస్తున్న రాక్షస నగరంలో అతడే కాదు నేను కూడా ఒక ఖైదీనే / న్యాయపీఠాల మధ్య విషభాండంలో మనిషి పాదాలక్రింద పాపభూయిష్ఠమైన భస్మరాసులలో / నేను కూడా ఉన్నాను? అంటాడు 'రోడ్లకు నమస్కారం' కవితలో. ఇలా రోడ్లను ఇతివృత్తంగా చేసుకొని చీకటి హాలాహలాన్ని ఆస్వాదిస్తున్న వీధిమహర్షిని కావ్యనాయకుడిగా చేసుకొని వచన పద్యాలు రాశాడు. "భయవిభ్రమాల మధ్య విషాద వాక్యం వలె సాగే జీవితంలో / మృత్యువు ఒక్కటే నిజం" అని పేర్కొని, శిరస్సు తెగిన దీపస్తంభం మృత్యువంటాడు. "జీవన" సంగ్రామంలో క్షణం ఆలస్యంగా అడుగుపెట్టిన నేను / చెట్ల ఆకులలో బీభత్సం చూశాను" అంటాడు. మనిషి ఆ ఆలోచనలపై చీకటి అంగరక్షకుల పాషాణ హస్తాలు చూశానంటాడు. నిషిద్ధాక్షరాల మధ్య నరబలి చూశానంటాడు. ఎర్రని గాయాలపై సూర్యకిరణాల చిత్రలిపి చూశానంటాడు. బాధను ముఖచిత్రంగా చేసుకొని రాస్తేనే నా అక్షరాలకు నిషా అంటాడు 'అగ్నిస్పర్శ' కవితలో. "నిగూఢమైన ఒక శబ్దం వెనుక అగాధం లోలోతులలో అజంతా తన పద్యాలు ఈది, ఎక్కడో ఒక ఒడ్డుకు చేరుకున్నప్పుడు అక్షరం నిండా అన్నీ అద్భుతాలే అంటాడు 'అంతా ఒకే శబ్దం' కవితలో. మృత్యువు ఒక హెచ్చరిక మాత్రమే అని ఆకురాలుతున్న శబ్దం ఒక ఆహ్వానం మాత్రమే అని మరణానంతరం కూడా మనిషి మాట్లాడుతూనే ఉంటాడంటాడు. "శరీరాన్ని జయించిన ఒక జీవితం అట్టడుగున / శబ్దపేటిలో ఒక అస్థిక వికసిస్తున్న శబ్దం నేనే/ అంతా ఒక చిత్కళ అని అంతా ఒకే శబ్దం, ఒకే కదలిక, ఒకే ప్రవహ్లిక అంటాడు.

ఆశలు లేవు, అసూయలు లేవు, నిరాశలు లేవు, నిట్టూర్పులు లేవు, ద్వేషాలు లేవు, దురాగతాలు లేవు, కష్టాలు లేవు, కన్నీళ్ళు లేవు, అంతటా ఒకే ఒక నిశ్శబ్దం, ఒకే ఒక హృదయ స్పందన అంటాడు. "గుడిసెలో వెన్నెట్లో కార్మికులు కన్నీళ్లు ఆరబెట్టుకున్నారు. కటకటాల మధ్య శూన్యంలో ఖైదీలు ఆకాశయానం చేస్తున్నారు. పేవ్‌మెంట్ మీద భిక్షకులు వాల్‌పోస్టర్లు కప్పుకున్నారు. ఎక్కడా ఎవరూ లేరు అంతా ఇళ్ళు చేరుకున్నారు అంటారు 'సుషుప్తి' కవితలో. సుషుప్తి బాధలకు పరిష్కారం కాదు. కాని బాధల్ని మరిపించే సుషుప్తి ఎంత గొప్పది అనే భావన స్ఫురిస్తుంది. ఈ రాత్రి ఆలోచనల తోడేళ్ళు ఎవర్నీ వెంటాడవు. ఇప్పుడు జీవితమనే పెద్దపులి ఎవర్నీ భయపెట్టదు. ఎక్కడా ఎవరూ లేరు, అంతా నిద్రపోతూ చీకటి శరణాలయంలో అంతా తలదాచుకున్నారంటాడు.

చైనా భారతదేశంపై యుద్ధానికి దిగినప్పుడు అజంతా మార్క్సిస్టు పంథాను ఆక్షేపించారు. "చైనా అధినేత మావో / కనుబొమ్మల కొమ్మలపై ఘృతేళికలు మరీ మరీ ఎరుపు / ఎర్రదనం రాజకీయ విద్రోహానికి గుర్తు" ఎర్రజండా మిత్ర భేదానికి గుర్తు" అంటాడు అజంతా.

మానవతావాదం :

అజంతా 'పరిత్యాగి పరివేదన' కవితలో మాత్రమే మధ్యతరగతి మనిషి సొంత బాధని ఎంతో ఆర్తితో జాలిగా వ్యక్తం చేస్తాడు. "తమ్ముడు కులాసాగా ఉన్నావా / పోనీ నీవైనా పుస్తకాల పూజ చేస్తున్నావా? అమ్మనీ, నాన్ననీ హింస

పెట్టకుండా / వాళ్లు కన్నీరై ప్రవహించకుండా / పోనీ నీవైనా కుటుంబానికి పేరు తెస్తున్నావా అని అడుగుతాడు. ఇంతలోనే ఎన్నో ఉగాదులు వచ్చి వెళ్ళాయో, ఇప్పటికి అడుగడుగునా ఎన్ని గండాలు గడిచాయో చెప్పలేనంటాడు. "ఎప్పుడు ఏ క్షణం ఆకాశం నా మీద విరుచుకుపడుతుందో / ఎప్పుడు ఏ రోజు ఎలక్ట్రిక్ స్తంభం నా మెడకు చుట్టుకుంటుందో / ప్రస్తుతానికి మాత్రం ఈ చిన్నసైజు నరకంలో కులాసాగానే ఉన్నాను" అంటాడు. "నీకు ఎంతో దూరంగా ఎక్కడో సమానాంతరరేఖపై నిలబడిన నేను / నన్ను నేనే పోల్చుకోలేక నాకు నేనే సహస్ర యోజనాల దూరంలో "ఉన్నానంటాడు. అద్దంలో తన ముఖంను చూడటానికే భయమంటాడు. తన సంతకంలో అక్షరాలు చూస్తేనే చెప్పలేనంత భయం అంటాడు. "నా చూపుడువేలు నిత్యం భయాలవైపే ఉంటుందనడంలో తన మానసిక స్థితి; ఆందోళన వ్యక్తమవుతుంది. రోడ్డుమీద నా మృతకళేబరాలను నేనే లక్షసార్లు చూశానంటాడు. ఎటుచూసినా పద్మవ్యూహమే అని, చూస్తూ చూస్తుండగానే మనిషిని మటుమాయం చేసే మనుషులున్నారని, అంతా ఒక మ హామాయా ప్రపంచం కళ్ళముందు గోచరిస్తుం దంటాడు. జీవితం నిండా శూన్యమే ఆవరించిందంటాడు.

తమ్ముడూ పదేళ్ళయినా వయసు లేనివాళ్ళలో ఒక రోజు సాయంత్రం అమ్మ నాన్నని కన్నీళ్ళు పెట్టించాను. క్రమ్ముకువస్తున్న చీకట్లలో కన్నీళ్లు రాల్చుతూ నువ్వే మా కష్టాలకు వంతెనన్నారు. వాళ్ళ ఆశని మొక్కగా ఉన్నప్పుడే త్రుంచేశాను. వాళ్ళనుఅక్షరాలాకన్నీరుగా మార్చేశానంటాడు. "ఇంద్రధనుస్సుల సౌందర్యాన్ని ఆరాధిస్తూనే / అసత్యాల అరణ్యంలో చిక్కుకుపోయాను / గగన కుసుమ సౌరభం క్రింద స్పృహతప్పి పడిపోయాను".

ఇలా బాధను జాజ్వల్యమానంగా వెలిగొందుతూ తన కథ సహస్రాక్షరాల దూరం సాగుతుందంటారు. ఏనాటికైనా మంచిరోజులు రాకపోతాయా అనే ఆశ తనలో కనిపిస్తుంది. తన తమ్ముడిని ఈ ఆశనే తల్లిదండ్రులకు చూపించి చల్లని హస్తాలతో తనను దీవించమంటాడు. ఇవి కేవలం అజంతా వ్యక్తిగతమైన కన్నీటి మాటలు కావు. నిరంతర ఆత్మహననంలోంచి ఉద్భవించిన పదునైన భావాలుగా భావించాలి. ఇలా మన అంతరంగాలను తనలో సృష్టించుకొని అక్షర సృజనచేసిన కవి అజంతా. అజంతా కవిత్వం నిండా మనిషి భయాల్ని వెంటాడుతున్న కలలు; దృశ్యం తరువాత దృశ్యంగా మారిపోతుండడాన్ని గమనించవచ్చు. వాస్తవ ప్రపంచాన్ని గాక కాలావధులకు అతీతంగా కలలపై పరిభ్రమిస్తున్న నైరూప్య ప్రపంచాన్ని అవిష్కరించటమే కవిత్వం చేయాల్సిన పని" అంటాడు అజంతా.

జీవన వ్యూహంలో మహాసర్పం వలె ప్రవేశించిన ప్రచండమైన ఆలోచన వెనుక అన్నీ ప్రశ్నలే అని కదా" అని సమాజం ప్రశ్నిస్తుందన్నట్లుగా ప్రశ్నించుకొని తానే మహాసర్పాలు మాట్లాడవు, మహావృక్షాలు మాట్లాడవు అంటాడు. "స్వప్నావధులకు అతీతంగా ఊర్ధ్వరేఖపై ఒకే ఒక ఉజ్జ్వలనేత్రం నిశ్చలం, నిశ్చలం అంటాడు 'అనామిక కవితలో. ఇప్పుడిక ద్రవిస్తున్న గడియారాలతో నిమిత్తం లేదని జీవన సంఘర్షణలో ఉజ్జ్వలమైన క్షణం ఒక్కటే అంటాడు. 'నగ్నాక్షరం కూడా ఒక ఆయుధమేనంటాడు. "నిజం గ్రహిస్తున్నాను; వాస్తవం వెనుక అధివాస్తవంలో మనిషి ముఖం మీద స్వప్నలిపి చూస్తున్నాను" అంటాడు. స్వప్నశక్తి విజృంభణలో సంకెళ్ళు తెగుతున్న చప్పుడు వింటున్నానంటాడు. చీకటి నిబర్హణం తర్వాతనే కదా కొత్త సృష్టి కొత్త ప్రపంచం" అంటూ 'స్వప్నలిపి' కవితలో భాష్యం చెప్తాడు. మృత్యువు అంటే మరో జీవన ద్వారం తెరచుకోవడమేనా అని ప్రశ్నిస్తాడు. అక్షరాలకు రెండు జీవితాలు లేవంటాడు. అప్పుడే పుట్టిన ఒక శిశువు శరీరంలో

ప్రవేశిస్తేనే తప్ప లేదా ఒక వీధిమనిషి శరీరాన్ని ఆశ్రయిస్తేనే తప్ప అక్షరాలకు మరో జీవితం లేదంటాడు. ఇలా సుదీర్ఘంగా సాగుతున్న కవితాప్రస్థానంలో ఒకవైపు అగ్ని; మరోవైపు జలపాతం దర్శనమిస్తాయి. ఒక అశాంతిలోంచి వచ్చిన శంఖారావం అజంతా కవిత్వం. అజంతా కవిత్వాన్ని పరిశీలిస్తే ఋజుస్వభావిగా కన్పిస్తారు. తెల్లని చీకటిలో నల్లని మెరుపు అజంతా. వీధి మానిసిని కావ్యనాయకుణ్ణి చేసుకుని, అతనికి నేనున్నానని, అభయహస్తమిచ్చిన స్నేహశీలి, అభ్యుదయ కవి అజంతా. ఇలా ఎన్నో భావాలు అజంతా కవిత్వంలో సహస్రముఖీనంగా వేర్వేరు కోణాల్లో వ్యక్తం చేయబడ్డాయి. అందుకే సహస్రముఖీన స్నేహశీలి అజంతా.

ఉపయుక్తగ్రంథసూచి :

1. అజంతాలిపి – డాక్టర్ సుమనశ్రీ.
2. ఆధునికాంధ్ర కవితా సమీక్ష – డా॥ కె.వి.ఆర్. నరసింహ.
3. ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయము – ప్రయోగము – సి. నారాయణరెడ్డి.
4. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు – సం.కె.కె. రంగనాథాచార్యులు.
5. తెలుగు కవితావికాసం – కడియాల రామమోహన రాయ్.

దళితవాద సాహిత్యధోరణులు-పరిశీలన

డా॥ టి. వెంకటస్వామి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రచురణల శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం-517426.
చరవాణి: 9492631323

'దళిత' అంటే ఛేదించబడిన, ఖండించబడిన, చీల్చబడిన, గాయం చేయబడిన, దెబ్బతగిలిన-వంటి అర్థాల్ని నిఘంటువులు పేర్కొన్నాయి. దళితవాదాన్ని అర్థం చేసుకోవాలంటే దీనదళిత జీవిత సంఘర్షణను అధ్యయనం చేయాలి. సభ్యప్రపంచంలో నిత్య పీడితులై పీడనకు, తాడనకు, అవమానానికి గురయ్యి అణగద్రొక్కబడిన వారు 'అస్పృశ్యులు', 'దళితులని' చెప్పవచ్చు. ఎవరు దళితులన్న విషయంపై చాలా చర్చలు జరిగాయి. కేవలం అస్పృశ్యులు మాత్రమే దళితులు కారని, ఎస్.సి., ఎస్.టి., బి.సి., మైనార్టీలతో పాటుగ స్త్రీలు కూడా దళితులనేనని వాదించారు, చర్చించారు. చివరగా "దళితులంటే ఏదో ఒక కులానికి సంబంధించిన వారు మాత్రమే కాదు. సామాజిక బహిష్కృతులు, దోపిడికి గురవుతున్న వారందరూ దళితులే. దళితులంటే ఒక కులంకాదు ఒక వర్గం. సామాజిక అంతరాల్ని సామాజిక స్థితిగతుల్ని ప్రతిబింబిస్తూ గుర్తింపు కోసం, ప్రగతికోసం అన్వేషించటమే దళిత సాహిత్య లక్షణం" అన్నమాటలు ఎక్కువమంది అంగీకరించారు.

వర్ణవ్యవస్థలోని కాఠిన్యతయే దళితవాదానికిదారి తీసింది. పంచములుగా ముద్రవేసి. ఊరికి దూరంగా నెట్టి కనీసం మానవతా స్పర్శలేకుండ దయనీయ జీవనానికి గురిచేసిన వర్ణవ్యవస్థపై, దాని కొమ్ము కాసే సాంఘిక సిద్ధాంతాలపై తిరుగుబాటుగా వచ్చిందే 'దళిత కవిత్వం'. అయితే ఏది దళిత సాహిత్యం అన్నప్పుడు తమ బాధను, తమ ఆవేదనలను, యుగయుగాలుగా వివక్షతను అనుభవించిన తమ గుండెకోతను దళితులే చెప్పుకోవాలని, అప్పుడే దానికి పూర్తి న్యాయం జరుగుతుందని దళితులపై సానుభూతితో దళితేతరులు రాసింది. కేవలం సంఘ సంస్కరణ దృష్టిని తెలియజేస్తుంది తప్ప, ఆ రచన వెనుక ఆర్తితో కూడిన సహజత్వం ఉండదని వాదించారు. 'దళితేతరులపై దళితులు రాసింది కూడ దళితకవిత్వమే కదా!' అని వితండవాదులు వాదిస్తారు. దానికి దళితకవిత్యోద్యమం ఇలా సమాధానం చెప్పింది.

"ఇప్పటి వరకు మా దుఃఖాన్ని మా వేదిక మీదనుంచి మాకే వినిపిస్తున్నారు. మేం చప్పట్లు కొడుతున్నాం. మేం అన్నాం మేమూ మా గురించే చెప్పుకోవాలని, మాకూ ఒక వేదిక కావాలని. వాళ్ళు వద్దన్నారు. అందుకే మా వేదికను మేమే నిర్మించుకున్నాం" (ప్రముఖ మరాఠీ కవి భుజంగి మిశ్రా) అందువల్ల దళితేతరులు దళితుల గురించి వ్రాసిందాని కంటే, దళితులు దళితుల కోసం రాయటమే దళిత కవిత్వపు లక్షణంగా ఉద్యమ సభ్యులు భావించినట్లు తెలుస్తుంది. వర్ణవ్యవస్థకు వ్యతిరేకంగా, సాంఘిక అసమానతలకు వ్యతిరేకంగా బౌద్ధం, జైనం, చార్వాకం, వీరశైవం, భక్తి ఉద్యమ కవులు, వీరబ్రహ్మం సిద్ధప్పవంటి తాత్త్విక కవులు చేసిన పోరాటాలు పేర్కొనదగినవి. ఆధునిక కాలంలో జ్యోతిబాఫూలే, అస్పృశ్యతకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేయటమే కాకుండ వాళ్లకోసం ప్రత్యేక పాఠశాలల్ని నడిపాడు. ఫూలే భార్య 'సావిత్రీభాయి' కూడ ఆ ఉద్యమంలో భర్తతోపాటు సేవలందించింది. ఫూలేను గురువుగా చెప్పుకున్న 'అంబేద్కర్ దళిత జ్యోతి'గా దళితుల ఆలోచనాధోరణిని ప్రభావితం చేశాడు. ఆ వెలుగులోనే మహారాష్ట్రలో 'దళిత పాంథర్స్' - ఆవిర్భవించారు. గాంధీజీ పెట్టిన 'హరిజన' శబ్దాన్ని తిరస్కరించారు. దళితులంటే కేవలం ఎస్.సి. ఎస్.టి.లు మాత్రమే కాదని, బి.సి, మైనార్టీలు స్త్రీలు కూడ దళితులేనని, కుల భావనకు వ్యతిరేకంగా, దళిత రాజ్య స్థాపనకు పిలుపునిచ్చారు. ఈ 'దళిత పాంథర్స్' - ఉద్యమం దేశవ్యాప్తంగా దళిత సాహిత్యం

మీద, దళిత మేధావుల మీద ప్రభావాన్ని చూపింది. అయితే 1970 దశకంలో ఆంధ్ర సాహిత్యంలో వెలువడుతున్న విప్లవ సాహిత్యపు 'వర్గపోరాటం' మందు 'వర్ణనమస్య'' కాంతిహీనంగా కనిపించింది. 80వ దశకంలో అంబేద్కర్ శతజయంతి రావటం, ఆ సందర్భంగా అంబేద్కర్ రచనలు ప్రసంగాలు అందరికీ అందుబాటులోకి రావటం, కారంచేడు, నీరుకొండవంటి చోట్ల దళితులపై జరిగిన అమానుష, అత్యాచార కాండలు వంటివి తెలుగు నాట దళిత ఉద్యమానికి ప్రేరణలయ్యాయి. ఆచార్య కొండపల్లి సుదర్శనరాజు సంపాదకత్వంలో తొలి తెలుగు దళిత కవితా సంకలనం వెలువడింది. తరువాత జయధీర్ తిరుమలరావు సంపాదకత్వంలో 'దళితగీతాలు', త్రిపురనేని శ్రీనివాస్, జి.లక్ష్మీనరసయ్య – వీళ్ళ సంపాదకీయంలో వచ్చిన 'పదునెక్కినపాట', మద్దూరి నగేష్ బాబు సంపాదకీయంలో 'విడి ఆకాశం', 'కాస్త సిగ్గుపడదాం'– వంటి అనేక సంకలనాలు దళిత సాహిత్య ఉద్యమానికి ఊపిరులూదాయి.

అయితే ప్రాచీన కాలం నుండే ఈ వర్ణవ్యవస్థకు వ్యతిరేకంగా వచ్చిన సాహిత్యం లేకపోలేదు. మల్లికార్జున పండితుని శివతత్త్వసారంలో, పాల్కురికి సోమన 'పండితారాధ్య చరిత్ర'లో అన్నమయ్య సంకీర్తనల్లో, రాయలు ఆముక్తమాల్యదలో, వేమన పద్యాలలో, పోతులూరి శ్రీ వీరబ్రహ్మంగారి తత్త్వాలలో కులరహిత భావన కనిపిస్తుంది. ఆధునిక కాలంలో 1909లో ఒక అజ్ఞాతకవి భారతిలో రచించిన 'మాలవాండ్రపాట' – అనే గేయం మొదటి అస్పృశ్యతానిరసన రచన. ఆ తరువాత గురజాడ రచించిన 'లవణరాజు కల' గేయంలో 'మలినదేహుల మాలలనుచు మలిన చిత్తులకధిక కులముల నెలవొసంగిన వర్ణ ధర్మమధర్మ ధర్మంబె'–అని "మంచి చెడ్డలు మనుజులందున / యెంచిచూడగా రెండే కులములు/ మంచి యన్నది మాలయైతే/ మాల నేనగుదున్" – అని చెప్పటం ఎంతో సంచలనాత్మకం. 1915లో మంగిపూడి వేంకటశర్మ 'నిరుద్ధ భారతం' అనే పద్యకావ్యం, అస్పృశ్యతా నిరసన దృష్ట్యా వచ్చిన తొలికావ్యం. "మాలలను పంచముల టంచు మాదిగలని/శ్వపచులని చెప్పగారాని వారటంచు/ మరియు జండాలురని తోడిమానవులను / దరిమి వేయుట సాంఘిక ధర్మమగునె" – వంటి పద్యాలలో తన ఆవేదనను వ్యక్తం చేశాడు.

జాతీయోద్యమంలో గాంధీజీ ప్రవేశించటంతో సాంఘిక సంస్కరణలో 'అస్పృశ్యతా నిరసన' ఒక ముఖ్య భాగమైంది. పంచములకు 'హరిజను'లన్న నామకరణం చేశాడు. ఈ శబ్దాన్ని అంబేద్కర్ వంటి వాళ్లు తిరస్కరించారు. గాంధీ ప్రభావంతో అస్పృశ్యతా నిరసనకు ఎందరో కవులు గళమెత్తారు. తల్లాప్రెగడ సూర్యనారాయణ శాస్త్రి 'హేలావతి', వేంకట పార్వతీశ్వర కవుల 'మాతృమందిరం', గరిమెళ్ళ 'పంచముడు', కొండపల్లి జగన్నాథరావు 'మేల్కొలుపు గీతాలు', ఉన్నవ 'మాలపల్లి', 'హరిజననాటకం', బోయి భీమన్న 'వడిపోతున్న అడ్డగోడలు', 'పాలేరు', జాతారంగస్వామి 'అంటరాని వారెవరు', కుసుమధర్మన్న 'హరిజన శతకం', 'మాకొద్దీ నల్ల దొరతనం', పురిపండా 'గుడిలో దైవమా', జాషువా 'గబ్బిలం' మొ॥వి స్వాతంత్ర్యానికి ముందు వచ్చిన రచనలు. 1930 దశకం నుండి దళితులు తమ సమస్యలపై గొంతెత్తి రచనలు చేయటం కనిపిస్తుంది. దళితులు పంచమ, హరిజనపదాలను తిరస్కరించి, 'అది ఆంధ్రులుగా' తమను పిలుచుకున్న కాలం ఇదే. అది ఆంధ్రోద్యమ ప్రభావం కూడ ఇందుకు దోహదం చేసింది. 'వర్గపోరాటంతో, సమసమాజ స్థాపనం' – అన్న భావనతో విప్లవ కవిత్వోద్యమం, మార్క్సిజం నేపథ్యంతో ఈ సమస్యను ఆలోచించింది. సమసమాజంతో అన్ని సమస్యలు తీరుతాయని చెప్పి చేసిన ప్రచారం, దళిత సమస్యకు సరయిన పరిష్కారాన్ని చూపలేకపోయింది.

స్వాతంత్ర్యం లభించేవరకు వచ్చిన దళిత సాహిత్య దృష్టి సంస్కరణ మార్గం, ఆ తరువాత అభ్యుదయ వాదంతో సాగింది. ఆ తరువాత వచ్చిన అరసం, విరసం వంటి ఉద్యమాల నేతృత్వంలో చైతన్య శీలమైంది. కారంచేడు

సంఘటన జరిగిన సందర్భంలో, దేశవ్యాప్తంగా జరిగిన వివిధ పరిణామాలు దళిత చైతన్యాన్ని ఉద్యమశీలం చేశాయి. దళిత కవిత్వంలో కనిపించే లక్షణాలు – వైవిధ్యం ఈ విధంగా ఉన్నాయి. అవి – 1.అస్తిత్వ ఆత్మగౌరవ పోరాట నేపథ్యాలలో వచ్చినవి, 2. పురాణ ప్రతీకల్ని పునర్ వ్యాఖ్యానించటం, 3.దళిత జీవన మూల్యాల్ని, సంస్కృతిని ప్రతిబింబించటం, 4. దళిత సంఘీభావ కవిత్వం 5. దళిత ప్రేమగాథలు, 6.మాదిగ 'దండోరా' చైతన్యం ఈ లక్షణాల్ని కలిగిన కవితా ఖండికలు, సంకలనాలు బహుళంగా వచ్చాయి. 'ఒక జననం వాయిదా' అనే కవితలో సతీష్ చందర్–

"ఒత్తయిన ఉంగరాల జుత్తు చూసుకున్నప్పుడు/ కత్తులు కత్తెర్లు నిరాకరించిన/ మా ముత్తాత శిరోజాలు ముదులు ముదులుగా గుర్తుకొచ్చి / కరకుదువ్వెనతో సాపు చేస్తాను/ ..... / నాజూకైన నవ్వును నడుంకి బిగిస్తున్నప్పుడు/ నా చరిత్రను నాచేతనే తుడిపించటానికి / నావెనకెవరో చీపురు కదుతున్నట్లే భ్రమించి / నా చుట్టూనేనే రంధ్రాన్వేషణ చేసుకుంటాను" – అని అంటు అస్తిత్వ ఆత్మగౌరవ పోరాటం వ్యక్తీకరించబడటం గమనించాలి. పంచమవేదం' – కూడ అటువంటిదే. 'దళితాయనం' – అనే ఖండికలో ఎండ్లూరి సుధాకర్, రాముడే స్వయంగా శంబూకుణ్ణి పట్టాభిషక్తుణ్ణి చేసినట్లు వ్యాఖ్యానిస్తాడు.

"వజ్రాలు తాపడం చేసిన బంగారు గిన్నెలో మట్టి కాళ్లు / సీతాదేవి శ్రద్ధతో అర్ఘ్యమిస్తోంది/ రాముడు కాళ్లు కడిగి నెత్తిమీద నీళ్లు చల్లుకొని/ సింహాసనందాకా నడిపించాడు/...../ శంబూకుడు సింహాసనం మీద నుంచి/ నల్ల సూర్యుడై నవ్వుతుంటే/ వర్తమాన వాల్మీకి తన దళితాయనంలో మొదటి వాక్యం ఇలా రాశాడు. "దళితయుగం శంబూకుని రక్తస్వప్నం" – ఇంకా వినోదిని, 'ఒంటినిట్టాడి గుడిసె', 'వేముల ఎల్లయ్య', 'బద్దులు తిరుక్కుంటూ', ఎండ్లూరి సుధాకర్ 'నీలిక', బన్న ఐలయ్య, 'నిప్పుకణిక', బిర్రీడి మోషే 'హరిజనాభ్యుదయం' అనే కావ్యంలో 'చీకటి కేక', 'వెలుగువాక' అనే రెండు భాగాలు, కె.సి. జాన్ 'ధర్మచక్రం', నంబూరి దుర్వాసమహర్షి 'నిరుపేద', 'లోకాలోకనం', బిర్రీడి ప్రసన్న 'మధుమాసం', బొడ్డు ప్రకాశం 'కివేణలు', బోయి భీమన్న 'గుడిసెలు కాలిపోతున్నై', 'అంబేద్కరిజం', 'అంబేద్కర్ సుప్రభాతం', 'శంఖారావం', 'పిల్లిశతకం', 'కుక్క మొరుగుతుంది', 'పంచమస్వరం', అత్తోటరత్నకవి 'హరిజనాభ్యుదయము', చోడగిరి చంద్రరావు 'చంద్రరావు గీతాలు', ఎం.పి.జాన్ 'క్షమాపణ', 'కన్నీటి గాథ', 'శివసాగర్ 'నెలవంక', బొజ్జా తారకం 'నడిపుట్టిన గొంతుక', రావూరి ఏకాంబరం 'అంబేద్కర్ సమరసింహ', కత్తి పద్మారావు 'విముక్తి గీతం', 'దేశం డైరీ', 'జైలుగంటలు', 'రక్తక్షేత్రం', 'నల్లకలువ', 'నీలికేక', 'ముళ్లకిరీటం', 'కట్టెలమోపు' గద్దర్ రాసిన కొన్ని పాటలు, మద్దూరి నగేష్‌బాబు, 'వెలివాడ', 'రచ్చబండ', 'మీరేవుట్లు', 'నరలోక ప్రార్థన', 'పుట్ట', 'లోయ', 'గోదావరి', 'విడిఆకాశం', 'కాస్త సిగ్గుపడదాం', 'నిశాని', 'ఊరువాడ', ఎండ్లూరి సుధాకర్ 'వర్తమానం', 'కొత్త గబ్బిలం', 'నల్ల ద్రాక్షపందిరి' సతీష్ చందర్ 'పంచమవేదం' వంటి గ్రంథాలు దళిత సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. ఇంకా పైడితెరెష్ బాబు, జూలూరి గౌరీశంకర్, కోయి కోటేశ్వరరావు, గోరటి వెంకన్న, గూటం స్వామి, పగడాల నాగేందర్, మొ॥న వారు ఎంతోమంది దళిత జీవనంలోని అన్ని కోణాలను స్పృశిస్తూ రచనలు చేస్తున్నారు.

లింగ వివక్ష స్త్రీలందరి ఉమ్మడి సమస్యకాగా, దళిత స్త్రీని లింగ–కుల వివక్షలు రెండూ వేధిస్తున్నాయనే విషయాన్ని 'దళిత స్త్రీ' 'వినోదిని', వంటివారు దళితస్త్రీ దృక్కోణం నుండి స్త్రీవాద కవిత్వం రాశారు. చల్లపల్లి స్వరూపరాణి 'మంకెనపూవు!' అనే కవితలో – "నే ముళ్లకంపలో చిక్కుకుని అల్లాడుతున్న పాలపిట్టను/ ఎటుకదిలినా ముళ్ళన్నీ గుచ్చుకునేది నాకే/తరాల నుండీ నా చుట్టూ పేర్చిన బానిస సంకెళ్లు/...../అసలు

నా జీవితాన్ని నేనుగా జీవించిందెవుడు / ఇంట్లో పురుషాహంకారం/ ఒక చెంప ఛెళ్ళుమనిపిస్తే వీధిలో కులాధిపత్యం / రెండో చెంప పగలగొడుతుంది" – అని ఆవేదనను వ్యక్తం చేసింది. లింగ వివక్ష కులవివక్ష – ఇవి రెండు ఎలా దళిత స్త్రీని దయనీయంగా మార్చివేశాయో వివరించింది. ఇంకా జి.విజయలక్ష్మి 'పనిపిల్ల' కూడ ఆకలి, దారిద్ర్యాన్ని ఎదుర్కొనే దళిత స్త్రీల దీనగాథల్ని అక్షరాలతో రూపుకట్టించారు. దళిత కవులు కొందరు కావ్యభాషను తిరస్కరించి తాము పుట్టి పెరిగిన వాతావరణంలో నుంచి, తమ స్థానీయతలో నుంచి పలకటం మొదలు పెట్టారు. సతీష్ చందర్ 'పంచమవేదం'లో–

"భాషా అప్రవీణులారా ఉలిక్కి పడకండి / పదాలు లేచిపోతున్నాయి/ వర్ణక్రమాలు వాడలకు వలసపోతున్నాయి/ పదాలకిప్పుడు నలుగు పెట్టాలి/ నూలుపోగులు లేకుండ నగ్నపరచాలి"– అంటూ సంప్రదాయ పాండిత్యాన్ని తిరస్కరించటం గమనించవచ్చు. ఎస్.సి. రిజర్వేషన్లు ఎ,బి,సి,డి వర్గాలుగా వర్గీకరించాలన్న డిమాండ్‌ను తెచ్చి "ఎం.ఆర్.పి.ఎస్." ప్రారంభమయ్యాక, మాదిగలు తమ జీవనాన్ని తామే శక్తి వంతంగా ఆవిష్కరించటం మొదలు పెట్టారు. కొలకలూరి ఇనాక్, ఎండ్లూరి సుధాకర్, నాగప్పగారి సుందర్‌రాజు, గుండెడప్పు కనకయ్య, కృపాకర్ వంటి మాదిగ కవులు కవిత్వంతోను, వచన రచనలతోను ''ఎం.ఆర్.పి.ఎస్.''కు అండగా నిలిచారు. మాదిక కవిత్వంలో "డప్పు", "చిర్రా", "చెప్పులు" గొప్ప ప్రతీకలుగా చిత్రీకరించబడ్డాయి. దళిత కవిత్వంతో దీర్ఘకావ్యాలు రావటం కూడ ఒక పరిణామమే. 'బన్న ఐలయ్య' – నిప్పుకణిక, మద్దూరి నగేష్ బాబు 'రచ్చబండ', 'ఊరువాడ', సతీష్ చందర్ 'నాన్నసైకిల్', ఎండ్లూరి సుధాకర్ – 'కొత్త గబ్బిలం', ఎజ్రా – 'దుడ్డుకర్ర' మొ॥న దళిత దీర్ఘ కవితలలో వచ్చిన కావ్యాలు. వీటికి జాషువా 'గబ్బిలం', 'అనాథ' లాంటి కావ్య ఖండికలే ప్రేరణ.

స్వాతంత్ర్యానికి పూర్వం వచ్చిన రూపకాలలో బోయి భీమన్నకు ముందు వచ్చిన రూపకాలలో దళితాంశం రేఖా మాత్రంగానే కనిపిస్తుంది. దళితాభ్యుదయాన్ని ఉద్దేశించి వచ్చిన రూపకాల్లో బోయి భీమన్న 'పడిపోతున్న అడ్డుగోడలు', 'పాలేరు', ఉన్నవ 'హరిజనాభ్యుదయం' స్వాతంత్ర్యానికి ముందు వెలువడటమే కాక తరువాత కాలంలో వచ్చిన వాటికి మార్గదర్శకత్వం వహించాయి. స్వాతంత్ర్యానంతరం వచ్చిన వాటిలో, మాగంటి పార్థసారథి వ్రాసిన 'హరిజనోద్ధరణము', పసుమర్తి యజ్ఞనారాయణ 'గ్రామసేవ', దర్గా భాస్కరయ్య – 'దేవాలయ ప్రవేశం', పినిశెట్టి శ్రీరామమూర్తి – 'కులం లేనిపిల్ల', కె.చిరంజీవి – 'నీలిదీపాలు', బోయిభీమన్న – 'కూలిరాజు', పౌరాణిక ఇతివృత్తాలతో ఒక కొత్త దృష్టిని ప్రసరింపజేస్తూ 'ఆదికవి వాల్మీకి, 'వ్యాసుడు', 'ధర్మవ్యాదుడు', 'రాగవాసిష్టం' మొ॥న రూపకాలు, రావి వెంకటాచలం – 'మాటతప్పకు', పరుచూరి వెంకటేశ్వరరావు 'సమాధికడుతున్నాం చందాలివ్వండి' విరియాల లక్ష్మీపతి – 'పంచమవేదం', గొల్లపూడి మారుతీరావు – 'వానవెలిసిన రాత్రి', వల్లంపట్ల నాగేశ్వరరావు – 'రాతిబొమ్మ', కొలకలూరి ఇనాక్ 'దిక్కులేనోడు', 'నిర్భయం', కె.ఎస్. ప్రకాశరావు 'కులం' మోదుకూరి జాన్సన్ 'నిచ్చెన మెట్లు', పిల్లి జయవీర్, 'విష సంస్కృతి', మొ॥వి దళితాభ్యుదయాన్ని కాంక్షిస్తూ దళిత జీవన సమస్యల్ని చిత్రించి చర్చించిన నాటకాలు.

దళిత నవలా సాహిత్యం వేంకట పార్వతీశ్వర కవులు 'మాతృమందిరం' ఉన్నవ 'మాలపల్లి' ఎన్.జి. రంగా 'హరిజన నాయకుడు' దళిత నవలా వికాసానికి పటిష్టమైన పునాదులు వేశాయి. విశ్వనాథ 'బద్దన్నసేనాని', దళితులు నాయక లక్షణాల్ని వీరత్వాన్ని కార్యదీక్షను వివరించింది. ఇల్లిందల రంగనాయకులు మల్లికలో కుల వివక్షపై విమర్శ, డా॥ అంతటి నరసింహం 'ఆదర్శం'తో దళిత సంస్కరణ అభిలాషను వ్యక్తం చేయటం, నెమలికంటి జగన్నాథం 'అంటరాని జంట'లో వర్ణాంతర వివాహాల్ని ప్రోత్సహించటం

కనిపిస్తుంది. వర్ణాంతర వివాహాల్లో ఉండే కష్టనష్టాల్ని చర్చిస్తూ సర్దుకుపోకపోతే వచ్చే నష్టాన్ని చెపుతూ వర్ణరహిత వ్యవస్థను ఆకాంక్షిస్తూ వచ్చిన ముప్పాళ్ళ రంగనాయకమ్మ. 'బలిపీఠం', తెన్నేటి హేమలత – 'మిసెస్ కోకిల', ప్రధానంగా చెప్పుకోతగ్గవి. డా॥ కేశవరెడ్డి – 'ఐస్ క్రెడిబుల్ గాడెస్', 'శ్మశానం దున్నేరు', 'మూగవాని పిల్లనగ్రోవి', 'అతడు అడవిని జయించాడు', 'చివరి గుడిసె' మొ॥న నవలల్లో దళితుల్లో భిన్న వర్గాలవారు ఎదుర్కొంటున్న సమస్యల్ని చర్చించారు. అస్పృశ్యతా నిర్మూలనం అగ్రవర్ణాల బాధ్యతగా గుర్తించాలని, 'తకధింతకధిం తోలుబొమ్మ' నవలలో కప్పగంతుల మల్లికార్జునరావుగారు చెప్పారు. కె.రామలక్ష్మి 'తపోభంగం', 'కోటిగాడు', అక్కినేని కుటుంబరావు 'సౌరాష్ట్రం', చిలుకూరి దేవపుత్ర 'అద్దంలో చందమామ', 'పంచమం', స్పార్టకస్ (జి. మోహనరావ్) – ఖాకీ బతుకులు, వంటి నవలలు దళితుల వివిధ సమస్యలపై వచ్చిన నవలలు. దళిత స్త్రీవాద నవలల్లో 'ఆకాశంలో సగం' – నవలలో అగ్రవర్ణాల పెత్తనం కేంద్రంగ నలిగిపోతున్న దళితుల్ని సమీకరించి గ్రామాల్లో మహిళా చైతన్యాన్ని తీసుకురావాలని ఓల్గా ఆకాంక్షించారు. సముచితస్థానం సౌకర్యాల కోసం క్రైస్తవ మతంలోకి వలసపోయే దళితులవైనాన్ని చిత్రించే నవల కె.కె.మీన్ – ఖాకీ బతుకులు. సన్నపు వెంకటరామిరెడ్డి – 'కాడి', నవల దాదాపు ఒక అర్ధశతాబ్ది కాలపు గ్రామీణ జీవనంలోని దళితుల సంఘర్షణ చిత్రించింది. విరసం సభ్యుడైన కళ్యాణరావు వ్రాసిన 'అంటరాని వసంతం' నవల, కోస్తా ప్రాంత దళిత జీవనాన్ని చిత్రించిన అపూర్వమైన నవల. పినాకపాణి – 'నివ్వులవాగు', పోల్కంపల్లి శాంతాదేవి 'ప్రేమపిచ్చి' ఎన్.ఆర్.నంది 'నైమిశారణ్యం' వరప్రసాదరావు 'అసురగణం', కాలువ మల్లయ్య 'బ్రతుకు పుస్తకం', బోయ జంగయ్య 'జాతర', అరుణ 'ఎల్లి' మొ॥వి దళితాభ్యుదయాన్ని కోరుతూ వచ్చాయి.

ఇక దళిత కథకు వస్తే 1925లో శ్రీపాద వ్రాసిన 'వల్లంరాజు' తొలి దళిత కథగా చెప్పవచ్చు. స్వాతంత్రోద్యమంలోను, సంస్కరణ ఉద్యమంలోను భాగంగా దళితాభ్యుదయాన్ని కాంక్షిస్తూ కథలు వచ్చాయి. శ్రీపాద 'సాగర సంగమం' కూడ అటువంటిదే. బందా కనక లింగేశ్వరరావు. – 'గుక్కెడు నీళ్లు' మొ॥వి వచ్చాయి. చలం, వేలూరి, శివశంకర్ శాస్త్రి వంటి వాళ్లు స్వాతంత్ర్యానికి ముందు తమ రచనలలో దళితాభ్యుదయాన్ని కాంక్షించారు. ఆ తరువాత వచ్చిన వాటిలో అడివి బాపిరాజు, 'నరసన్న పాపాయి', గోపీచంద్ 'చెప్పులు కుట్టేవాడు', చెప్పుకోదగినవి. దళితకథాసాహిత్యంలో ప్రముఖంగా పేర్కొనదగినవారు కొలకలూరి ఇనాక్. వందకు పైగా రాసిన వీరి కథల్లో ఎక్కువగా దళిత జీవన సమస్యల్ని చిత్రించేవే. 'ఊరబావి', 'ఆకలి', 'తలలేనోడు', 'పిండీకృతశాటి', 'పశ్చాద్భూమి' – వంటి కథలు కేవలం దళితుల సమస్యలేకాక చాకలి, మంగలి, పాకీ వృత్తులకు చెందిన దళితుల జీవన సమస్యల్ని చిత్రించటం కనిపిస్తుంది. 'శిలువ వేసిన మనుషులు' – అటువంటి కథే. చిత్తూరి కోటేశ్వరరావు 'మార్పుకు మార్గం' దళితుల పట్ల భూస్వాముల అవకాశవాదం తెలియచెప్పే కథ. మధురాంతకం రాజారాంగారి "అజ్ఞాతవాసం' దళిత జీవనంలోని సాంఘిక ఆర్థిక దృక్కోణాల్ని అర్థంగా చిత్రించిన కథ. బి.ఎస్. రాములు, సింగమనేని నారాయణ కథలు ఈ కోవలోకి చెందినవే. బోయ జంగయ్య రచించిన గొర్రెలు చీమలు – హెచ్చరిక మొ॥న కథాసంపుటాలు, దళితుల ఉన్నతిని కాంక్షించేవే. దళితాభ్యుదయాన్ని కాంక్షించే వాళ్ళలో కాళీపట్నం రామారావు, అనిశెట్టి సుబ్బారావు, కలువకొలను సదానంద, చిలుకూరి దేవపుత్ర, బండి నారాయణస్వామి, శాంతి నారాయణ, కాలువ మల్లయ్య, పినాకపాణి, కోట దేవరాజు మొ॥న వాళ్లు పేర్కొనదగిన వాళ్లు.

దళితకథా సాహిత్య విషయానికి వస్తే, ఎక్కువగా సంకలనాలల్లో, సంపుటాల్లో కొన్ని ఉండిపోగా, మిగిలినవి

పత్రికలకే పరిమితమైన కథలు. తొలితరం దళిత కథా రచయితలు దాదాపు దళితేతరులే. మలితరం రచయితల్లో కొంతమంది దళితులున్నారు. వర్తమాన దళిత కథా రచయితలలో ఎక్కువగా దళితులే ఉండటం విశేషం. డా॥ భార్గవీరావు 'ఇంకానా ఇకపైచెల్లదు' – అనే పేరుతో సమకాలీన దళిత కథల్ని సంకలనంగా తీసుకవచ్చారు. డా॥ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, కె. లక్ష్మీనారాయణ 'దళితకథలు' ప్రారంభం నుండి ఇప్పటి వరకు వచ్చిన కథల్ని సంకలనం చేశారు. ఇతివృత్తాన్ని బట్టి, కథనాన్ని బట్టి, వ్యక్తీకరణను బట్టి, కథ ఇచ్చే సందేశాన్ని బట్టి వీటిని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. దళితుల స్థితిగతుల్ని వివరిస్తూ సాంఘిక– మత వివక్షతల్ని చూపటంలోని అమానుషాల్ని వివరించేవి ఒక వర్గం, అంటే సంస్కరణ దృష్టితో వచ్చినవని అర్థం. దళిత ప్రగతికి నిరోధకాలుగా నిలిచిన నమ్మకాలను, వ్యక్తులను, వ్యవస్థను ప్రతిఘటించాలని చెప్పే కథలు మరో వర్గానికి చెందుతాయి. ఈ వర్గంలో చేరిన కొన్ని కథలు అవసరమైతే హింసామార్గాన్ని కూడ అనుసరించాలని ప్రబోధిస్తాయి. ఇలా దళిత సాహిత్యం తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నంచేసింది. చేస్తోంది అని చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు

1. కృష్ణయ్య బి. 2011. "అంబేద్కర్ అనంతర దళిత ఉద్యమాలు, సాహిత్యం: సవాళ్ళు", వరంగల్: కాకతీయ విశ్వవిద్యాలయం.
2. చిన్నారావు యాగాటి. 2008. అనువాదం: ప్రభాకర్ మందార, "ఆంధ్రప్రదేశ్ దళిత ఉద్యమ చరిత్ర". హైదరాబాద్: హైదరాబాద్ బుక్ ట్రస్ట్.
3. మంజులత ఆవుల (సం.) 2005. "ఆధునిక సాహిత్యంలో పక్రియలు–ధోరణులు", హైదరాబాద్: తెలుగు అకాడెమి.
4. శిఖామణి. 2012. "దళిత సాహిత్యోద్యమం". హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

ధిక్కార స్వరం 'దిగంబర కవిత్వం'

భమిడిపాటి గౌరీ శంకర్, తెలుగు విభాగాధిపతి, గాయత్రి కాలేజి ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్, మునసబుపేట, శ్రీకాకుళం జిల్లా, చరవాణి : 9492858395

'ఆకలి, కామం, కలలూ, కన్నీళ్ళూ
మనిషిలోని మర్మజ్ఞానమంతా ఒక్కటే
దేశమేదైతేనేం? మట్టంతా ఒక్కటే
చనుబాలు తీపంతా ఒక్కటే'

1960 దశాబ్ది ఆరంభం నాటికి తెలుగు కవితారంగంలో ఓ స్తబ్ధత పేరుకుపోయింది. ఇందుకు అనేకానేక సామాజిక, రాజకీయ, ఆర్థిక కారణాలను చెబుతారు. 1950ల నాటికే 'అరసం' వైభవం మసకబారింది. 'కుందుర్తి' చేసిన ప్రయత్నం, ఏర్పరచిన 'ఫ్రీవర్స్ ఫ్రంట్' వచన కవిత్వానికి గొప్ప ప్రారంభమయింది. ఇది కేవలం కవిత్వపు పంథా మార్పునకు చేసిన ప్రయత్నం. 'కవిత్వ స్వభావానికి' పునర్వికాశం తీసుకురాలేదు. అభ్యుదయ కవులు 'సినిమా' ప్రపంచంలో తమ అస్తిత్వానికి 'చిరునామా'ను చూసుకున్నారు. సంప్రదాయవాదులు తమ మార్గం తాము 'రచనలు' చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో 'సమాజం'లో సమూలమైన మార్పును ఆశిస్తూ రంగ ప్రవేశం చేసింది 'దిగంబర కవిత్వం' నగ్నముని (హృషీకేశవరావు), చేరబండరాజు (బద్దం భాస్కరరెడ్డి), జ్వాలాముఖి(రాఘవాచారి), భైరవయ్య(మనమోహన్ సహాయ్), నిఖిలేశ్వర్(యాదవరెడ్డి), మహాస్వప్న(కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు) వీరు సంవత్సరాల పేర్లను కూడా నగ్ననామ, నిఖిలేశ్వర నామ, జ్వాలాముఖి నామ ఇలా అందరి పేర్లుమీద ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్క కవితా సంకలనం ఆవిష్కరించాలనుకున్నారు. కాని మూడు మాత్రమే ఆవిష్కరించారు.

'దిగంబర కవిత్వ' ఆరంభానికి కొంత పాశ్చాత్య కవితా ఉద్యమ ప్రభావం ఉంది. అమెరికాకు చెందిన బీట్నిక్స్ కవులు, బ్రిటన్ యాంగ్రీయంగ్ మెన్ ఉద్యమం వంటి వాటి పాటలు, తన కాలంతో పాటే ఎంతో ముందు రోజుల్ని ఊహించగలిగిన మహా ప్రతిభాశాలి. ప్రపంచ ప్రఖ్యాత రచయిత జార్జి ఆర్వెల్ వంటి వారి 'నీడ' వీరిపైన ఉంది. రష్యాలో 'ఎతుహెంకో' అనుయాయులు. యూరప్‌లోని హంగేరిలోని గాయపడిన యువకులు, హాలెండ్‌లోని ప్రోవో ఉద్యమకారులతో పాటు 1958లో కలకత్తాలోని ఆ కవితరం కవులు ఆరంభించిన ఉద్యమాలు దిగంబర కవులకు ప్రేరణగా నిలిచాయంటారు సాహితీ విమర్శకులు. ఇవి కాక నాటి భారతదేశ పరిస్థితులు వీరిని ప్రేరేపించాయి. అవినీతి, దరిద్రం, దిశానిర్దేశం చేయలేని రాజకీయ నాయకత్వం, స్వాతంత్ర్యం సిద్ధించినా తీరని వ్యధలు, ఆకలిచావులు, ప్రతిభకు దక్కని స్థానం, వ్యక్తి ఆరాధన, ఆశ్రిత పక్షపాతం, ఉపాధిలేమి, భవిష్యత్‌పై భరోసా నివ్వని 'సామాజిక వ్యవస్థ' వంటి కారణాలతో 'దిగంబర కవిత్వం' ఉవ్వెత్తున లేచిన 'అల'ల వలే తెలుగు సాహిత్య రంగాన క్రొత్త ఆలోచనలకు ఊపిరి పోసింది. దిగంబర కవులు తమ కవిత్వంలోనే కాదు, తమ కవితా సంపుటాలు ఆవిష్కరణలో కూడా నూతన పంథాను అనుసరించారు. సంప్రదాయ ఆవిష్కరణలకు స్వస్తి చెప్పి, అర్ధరాత్రి వేళ పెద్దగా పేరు తెలియని సామాన్యులతో పుస్తకాల్ని ఆవిష్కరింపజేసారు. తొలి సంపుటిని 1965 మేలో హైదరాబాద్‌లో నాంపల్లి పాండు అనే రిక్షావాలాతో, రెండవ సంపుటిని 1966 డిసెంబర్‌లో విజయవాడలో జంగాల చిట్టి అనే వ్యక్తితో, మూడవ పుస్తకాన్ని 1968లో విశాఖనగరంలో యశోద అనే భిక్షకురాలితో ఆవిష్కరణ

చేయించారు. సామాన్యులు, అతి సామాన్యులు 'దిగంబర కవితా సంపుటాలకు' ఆవిష్కర్తలు. ఈ కార్యక్రమాలు ఆ రోజుల్లో సంచలనాలు సృష్టించాయి. "కీర్తికి షార్ట్‌కట్ మార్గాలని' ఈ ధోరణిని వ్యాఖ్యానించినవారు లేకపోలేదు. వారాలు, నెలలు, సంవత్సరాలకు తమదైన నూత్న శైలిలో క్రొత్త పేర్లను ప్రకటించి దిగంబర కవుల కవిత్వం నాటి కవితాబిమానులకు 'ఈ కవిత్వం పైన' 'ప్రేమాభిమాన ఆసక్తు'లను పెంచాయి.

దిగంబర కవులు ఏం ఆశించారు అనే ప్రశ్న సహజం. వారికి కావలసింది సంప్రదాయ విలువల సమర్ధన కాదు, విధ్వంసం. దిగంబర కవులలో కూడా మార్క్సిస్టులు, వ్యక్తి స్వేచ్ఛా వాదులున్నారు. 'దిగంబర కవిత్వం'లో ఈ 'స్వేచ్ఛ' కనిపిస్తుంది. శ్రీశ్రీ వంటివారు సహితం 'దిగంబర కవిత్వం' మౌళిక తాత్వికత ఏమిటో అంచనా వేయలేక పోయారు. (కొన్ని కవితలను ఆయన ఆంగ్లంలో అనువదించారు.) **'దిగంబర కవులలో రాజకీయ చైతన్యం కంటే కవితా చైతన్యమే'** ఎక్కువ అని శ్రీశ్రీ, 'సమాజం మీద కక్ష కట్టిన వాళ్ళు దిగంబరులు. ముఖ్యంగా మధ్యతరగతి మీద వీరు కత్తి దూసారు. వీళ్ళు చేసేది అభ్యుదయ కవిత్వం కాదు. జాగృతి కోసం ధ్వంస రచన చేస్తారు' అంటారు ఆరుద్ర. కొ.కు మాత్రం దిగంబర కవిత్వం పట్ల సదాభిప్రాయాన్ని వెలిబుచ్చారు. **'దిగంబర కవులు ఆధునిక కవిత్వంలో ఒక కొత్త దారి చూపారు. ఇది నిజమైన విప్లవ తిరుగుబాటు. ఈ కవిత్వం ఈనాడు ప్రజలకు అవసరం'' అంటారాయన.** ఎవరేమీ అనుకున్న తమకంటూ ఓ ప్రత్యేకమైన కవితా విధానముందని. స్పష్టమైన కవిత్వపు అజెండా తమకుందని వారు చెప్పుకున్నారు. తన మొదటి కవితా సంపుటిలో తాము ఎన్నుకొన్న మార్గ సిద్ధాంతమును స్పష్టంగా ప్రకటించారు. "మానసిక దిగంబరత్వం కోసం నిత్యాస చేతన ఆత్మస్ఫూర్తితో జీవించడమే మా ఆశయం. శ్వాసించే ప్రతి వ్యక్తితో సారూప్యం చెంది వ్యక్తి అస్తిత్వ పరిరక్షణ కోసం, అంతరంగంలో అణగి పడిఉన్న ఆరాటాన్ని ఆ సంతోషాన్ని విసుగును అక్షరాల్లో వ్యక్తీకరించి నూతన విశ్వాసాన్ని ఆశను కలిగించాలని మా తత్పరణ..' అన్నారు దిగంబర కవులు'. వీరిది అతి తీవ్రమైన ఆవేశ వైఖరి. సమాజంలో ఆదర్శవంతమైన మార్పుల సాధన కోసం కవిత్వమనేది వీరి ఆశయం. దిగంబర కవిత్వ ప్రయోజనాల గురించి భైరవయ్య రచించిన 'దిగంబర కవిత'లో

మనిషిలో అట్టడుగున బురద గుంట్లో
పడిఉన్న మనిషిని లేవదియ్యడం
ఎముకల లోతుల్లో ధ్వనించే
స్వచ్ఛమైన గీతాల్ని ప్రతి ధ్వనించడం
కళ్ళ వెనుక దాగి ఉన్న
సిసలైన కన్నీళ్ళని ప్రసరించడం..."

అని చెప్పుకొచ్చారు. మానసిక ఏకాకి తత్వం కూడా సహజమే. కాని ఇదే అస్తిత్వం కాదు. పరిసరాలు, బాంధవ్యాలు వదిలి క్షణం పై క్షణం బరువుగా పడి యీడుస్తూ పోవడం కాకుండా చైతన్యవంతమైన **ఆత్మ సంతృప్తి**తో సాగే జీవితం నిజమైన అస్తిత్వం అని తన రెండో సంపుటిలో వీరు ప్రకటించుకున్నారు. ఇదీ తమ తాత్విక దృక్పథమని కూడా వివరిస్తారు.

"నవరత్నఖచిత సువర్ణ కిరీటం కోసం
నిలువు దోపిడీల కోసం
నెత్తి మీద జుత్తు కోసం
అమ్ముడు పోయేవాడు కాదు నా దేవుడు" అని భైరవయ్య వ్యతిరేక ధోరణిలో దేవుడ్ని ఎలా 'తయారు చేసారో' చెప్తూ మత మౌఢ్యాన్ని నిరసిస్తారు. దిగంబర కవిత్వంలో మానవతావాదం కూడా ఉంది.

"పుడమితల్లి చల్లని గుండెను
పాయలుగా చీల్చుకుని
కాల్వలై ఎవరిదో, ఏతరం కన్నీరో
గలగలా సుళ్ళు తిరిగి మెల్లమెల్లగా పారుతుంది
ఆకాశం వెక్కి వెక్కి ఏడుస్తోంది"

– చెరబండరాజు

"సంకుచిత తత్వాన్ని మనమంతా
సాంప్రదాయ బద్ధం చేసేసుకున్నాం
కాబట్టే మనకింకా అర్థం కానిది
సర్వమానవ కళ్యాణం" – జ్వాలాముఖి

ఇటువంటి మానవతావాద కవిత్వంలో జాలి, దిగులు, కోపం, కసి, ఆవేదన వంటి వాటిని సఎమ్మేళన పరచి ఆలోచింపజేసింది దిగంబర కవిత్వం. బానిసగా జీవిస్తున్న మనిషి, మనిషి మీద నమ్మకం సడలటం వంటివి ఈ కవిత్వంలో కనిపిస్తుంది. ఇక్కడ ప్రధానంగా చెప్పుకోవలసింది చెరబండరాజు 'వందేమాతరం' ఖండిక. ఎంత ఆవేశమో అంతటి సంచలనం కలిగించినది. భరతమాత దౌర్భాగ్య, నికృష్ట స్థితి వాడిగా– వేడిగా స్పష్టంగా వివరిస్తుందీ కవిత.

"–––––––––––––––––

దుండగులతో పక్కమీద కులకుతున్న శీలం నీది
అంతర్జాతీయ విపణిలో అంగాంగం తాకట్టు పెట్టిన యవ్వనం నీది
సంపన్నుల చేతుల్లో మైమరచి నిద్రిస్తున్న యవ్వనం నీది
ఊసినా, దుమ్మెత్తి పోసినా చలనం లేని మైకం నీది...
.....నోటికందని సస్యశ్యామల సీమవమ్మా.."

అనే వాక్యాల వెనుక వేదనా పూరిత వ్యాఖ్యానం ఏడు దశాబ్దాల స్వాతంత్ర్యం సిద్ధి వెనుక 'అభివృద్ధి'ని నిష్కర్షగా 'చిత్రం' మలచిన 'అక్షరాలు' కనిపిస్తాయి. అలాగని దిగంబర కవులకు దేశం మీద గౌరవం లేదని కాదు.

వచనకవిత్వంలో ప్రయోగాలు, క్రొత్త భావాల ఆవిష్కరణ, అభివ్యక్తీకరణను 'వీరు' ఆవిష్కరించుకున్నారు. సరకొత్త ఉపమానాలు, ప్రతీకలు ఈ కవిత్వంలో గోచరమవుతుంది. పాఠకుడి మెదడులోని చాంధసపు పాత భావాల బూజును దులిపే ప్రయత్నం చేస్తుంది. కొన్ని ఉదాహరణలు–

"పడ్డీలా పెరుగుతున్న ఆకలి, ఆకాశం విస్తట్లో అన్నం ముద్ద"
"మహారణ్యం బురదగుంటలో కాళ్ళు విరిగిపడ్డ ఈగ– మనిషి"
"కట్నాల కొగిలింతలో/ యువతరం తిలాంబరాలు"
"జడలు కట్టిన శిరోజాల కొసలుపట్టుకు/ వేళ్ళాడుతున్న పేలు– నాయకులు"

తెలుగు కవిత్వ ఉద్యమాల్లో బయటకొచ్చిన ఓ అలజడి అల దిగంబర కవిత్వం. ఎగిసినంత వేగంగా విరిగిపోయింది. అయినా తన అస్తిత్వ చిరునామాను గర్వంగా నేటికి నిలిపింది. ఏం ఆశించిందీ కవిత్వం.. ఏ ఆశయంలో ఉద్భవించింది?

- **మంచికోసం, ఆదర్శవంతమైన సమాజ నిర్మాణం**
- **కుళ్ళు వ్యవస్థ (సమాజం) నాశనం కావాలి**
- **ప్రజలలో ఉన్న నిర్హేతుక విశ్వాసాల పట్ల నిరసన**
- **మానవులు అందరిలోనూ నిలబడి తాను జీవించడం నిజమైన అస్తిత్వం**
- **ప్రాచీన సాహిత్యం, పూర్వపు విలువల పట్ల తిరస్కృతి, నిరసన**

పై అంశాలు పట్ల 'సంప్రదాయ కవిత్వపువాదులు'కు ఏవగింపు కలగవచ్చు. వారు 'వ్యూహాత్మక మౌనం'తో ఈ కవితా విధానిన్ని నిరసించవచ్చు. కాని.. సమాజంలోని

వాస్తవాలను చెర్నాకోలాతో ఎవరో ఒకరు నాయకులకు, ప్రజలకు చెప్పాలి. నేటికి కూడా మాధ్యమాలు(మీడియా), ప్రజలు ఓ 'అంగడి సరుకులు'గా మిగిలాయనే వారున్నారు. కాదు.. ఇది తప్పు అనే వారున్నారు. కాని.. దిగంబర కవిత్వానికి ఈ శషభిషలు లేవు. 'ఉన్నదానిని ఉన్నట్టుగా' నగ్నంగా విప్పి చెప్పటమే సాహిత్యం చేయవలసిన పని అని వారు 107107విశ్వసించారు. 'సాక్షి' వ్యాసాల్లో పానుగంటి వారి తీవ్రతనే వచన కవిత్వంలో 'దిగంబర కవులు' ప్రదర్శించారనే కవితా విమర్శకుల వాదనను కొట్టి పారేయలేం..!

"అడుగు అడుగులో నహారా ఎడారి

ప్రపంచంలో ప్రతి ఒక్కడి శిరస్సు మీద ఒకొక్క హిమాలయం

నీ ఆశయం నూర్యుణ్ణి మాత్రం పిడికిల్లోంచి జార విడువకు

ప్రాణాన్ని వణం పెట్టయినా, ఈ జగతికి మానవతా భిక్ష పెట్టు" – చెరబండరాజు

ఆధార గ్రంథాలు:

1. తెలుగులో కవిత్వోద్యమాలు – తెలుగు అకాడమీ ప్రచురణ –2003
2. సాహితీ సుధ– బండ్ల పబ్లికేషన్స్ –2018
3. వికీపీడియా కథనాలు.

తెలుగు సాహిత్య ప్రస్థానం నన్నయ నుండి నేటివరకు

డా॥ కపిల భారతి, తెలుగు సహాయాచార్యులు, పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల (అటానమస్), వడ్డేపల్లి, హనుమకొండ-506370. చరవాణి: 9490082507

భాషా సాహిత్యములు ఒక ప్రవాహం లాంటివి.

ప్రవాహానికి పాతనీరు పోయి కొత్తనీరు వచ్చి చేరునట్లు భాషకు, సాహిత్యానికి కూడా ఎప్పటికప్పుడు కొత్తదనం వచ్చి చేరుతూనే ఉంటుంది. ఏ భాషా సాహిత్యమైన ఆ యా ప్రాంతాల సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై ఆధారపడి ప్రభవిస్తూ ఉంటుంది. అందుకు తెలుగు భాషా కూడా అతీతమైనదేమి కాదు. తెలుగు భాషా సాహిత్యం కూడా ఎప్పటికప్పుడు ఆయా సామాజిక పరిస్థితులను బట్టి తన రూపురేఖలను మార్చుకుంటూనే ఉంది. ఈ విషయం మనకు నన్నయ నాటి నుండి నేటి వరకు గల సాహిత్యమును పరిశీలిస్తే అవగతమౌతుంది.

11వ శతాబ్ధిలో నన్నయ భారతాంధ్రీకరణతో తెలుగు సాహిత్య గ్రంథీస్థీరీకరణ ప్రారంభమైనది. రాజరాజ నరేంద్రుని కోరిక మేర నన్నయ భారత ఆంధ్రీకరణకు పూనుకున్నాడు. భారత రచన మణిప్రవాహ శైలిలో జరిగింది. 11 నుండి 16వ శతాబ్ధి వరకు భాతర దేశంలో తెలుగు దేశంలో కూడా రాజులు రాజ్యపరిపాలన కొనసాగిన కారణంగా ఏ ఏ రాజులు పరిపాలించినప్పుడు ఆయా రాజుల మనోభీష్టాల మేరకు సాహిత్యం పరిఢవిల్లింది. నన్నయ్య భారతాన్ని 3 1/2 పర్వాలు రాసి అసంపూర్తిగా వదిలినప్పుడు తిరిగి ప్రారంభించడానికి 200 వందల సంవత్సరాలు పట్టింది. ఈ మధ్యకాలంలో పాల్కురికి సోమన శైవ సాహిత్యంతో ఒక ఉప్పెనలాగా దేశీయ సాహిత్యమైన ద్విపదలు, రగడలు, గద్యాలు వంటి వాటితో పాటు ఇతి వృత్తంలో కూడా బసవపురాణం లాంటి స్వతంత్ర వీర శైవ పురాణమును రచించి సమకాలీనమైన భక్తుల కథలు తెలిపి నాటి ప్రజలలో గల భక్తిని చాటి చెప్పాడు. సోమన తరువాత యథావాక్కుల అన్నమయ్య సర్వేశ్వర శతకము వ్రాసెను. వృషాధిపశతకం తర్వాత శతకం ఇది. అంటే శతక రచనకు కొనసాగింపు ఇది. సోమన వేసిన విత్తనములా అన్నట్లు స్వతంత్రత, దేశీయంగా వ్యవహారంలో గల కథలను కావ్యాలలో చెప్పడం వంటిది ప్రారంభమైనది. రంగనాథ రామాయణంలో రామాయణ కథ భాగాలలో లేని ఆ వాల్మీక అంశాలు చెప్పి ద్విపదకు పట్టం కట్టిన మరొక కవి గోనా బుద్ధారెడ్డి గౌరన తన నవనాథ చరిత్రను హరిశ్చంద్ర నలోపాఖ్యానమును ద్విపదలోనే రచించెను. తిక్కన మహాభారత రచన పూను వరకు 'ద్విపద' నే రాజ్యమేలిందని చెప్పవచు అందుకే తిక్కన

"పలుకుల పొందులేక రసభంగము సేయుచు బ్రాత పడ్డ మా
టల దమనేర్పు చూపి యొకటన్ హృదయం బలరింపలేక యే
పొలమును..... దుర్విటులట్ల చూడగాన్"

అని నిర్వచనోత్తర రామాయణంలో వాపోయాడు. అంటే ఆధునిక కాలంలో 'భావకవిత్వంతో' విసిగిన కవులు అభ్యుదయ కవిత్వం వైపు ఎలా మరలినారో అట్లే ఆనాటి ప్రజలను భారతం వైపు మరల్చినాడు తిక్కన. అందుకు నాటి మత పరిస్థితులు కూడా దోహదం చేశాయి కనుక 'హరిహరనాథ తత్వమును ప్రతిపాదించి హరిహరనాథునికి భారతాంకితం చేసి కవికి సమాజాన్ని ఉద్ధరించే బాధ్యత కూడా ఉంటుందని భవిష్యత్తు తరాలకు ఒక సందేశం ఇవ్వకనే ఇచ్చాడు తిక్కన. తిక్కన తరువాత మూల ఘటిక కేతన దశకుమార చరిత్రమనే తొలి కావ్యము రచించెను. అంటే నాటి ప్రజల దృష్టి కథలవైపు చూసిందని తెలుస్తుంది. మారన మార్కెండేయపురాణం మంచన కేయూర బాహు చరిత్ర వంటి కావ్యాలతోపాటు వచ్చిన మరొక తొలి వచనం కృష్ణమాచార్యుని సింహగిరి నరహరి వచనములు.

ఎర్రన భారతాంధ్రీకరణ పూర్తి చేసిన తరువాత హరివంశము నృసింహ పురాణం వంటివి వ్రాశాడు.

ఎర్రన కాలం తరువాత మనకు ఉత్తర భాతరదేశం నుండి సుల్తానుల దండయాత్రలు ప్రారంభమైనాయి. తత్ కారణంగా రాజకీయ అలజడి ప్రారంభమైనది. ఇది సాహిత్యంలో కూడా ప్రతిబింబించినది చిన్న చిన్న రాజ్యాలు ఏర్పడి కవులను పోషించుట అధికమైనది. క్రమంగా పండితులు కవులు పెరిగి చాలా రచనలు వచ్చాయి. అందులోకొందరు రావిపాటి త్రివురాంతకుడు, గణపనారాధ్యుడు, దోనయామాత్యుడు, చిమ్మపూడి అమరేమేశ్వరుడు, శరభాంకుడు, పెద్దయామాత్యుడు, శ్రీగిరి కవి, కొరవి సత్యనారన, వెన్నెలకంటి జన్న మంత్రి, పశు పతి నాగనాథకవి ఇలా ఎందరో వీరి కాలం నాటి తరువాత కవులు ప్రఖ్యాత కవి సార్వభౌముడు శ్రీనాథుడు మరియు తెలుగుల పుణ్యపేటి పోతన. ఇందు శ్రీనాథుని క్రీడాభిరామము నాటి సాంఘిక వ్యవస్థ తెలిపే కావ్యం. అంటే సామాజికాంశాలు కావ్యాలలో ప్రతిబింబించడమే కాదు వాటి తెలిపే కావ్యాలే రావడానికి నాంది పలికిన కావ్యమని నా అభిప్రాయం.

15వ శతాబ్ధిలో శ్రీకృష్ణదేవరాయల పాలనలో తెలుగు భాషకు స్వర్ణయుగం అంటారు. అందుకు కారణం మొదటిది రాజకీయ సుస్థిరత అయితే రెండవది దేవరాయల సాహిత్యాభిమానం. అష్టదిగ్గజ కవులతో భువన విజయ మండపంలో కొలువు దీరిన కవి, రాజా చక్రవర్తి రాయలు.

క్రమంగా దక్షిణ భారతదేశంలో రాజకీయ అస్థిరత చోటు చేసుకుంది. దక్షిణాంధ్రయుగంలో వచ్చిన తెలుగు సాహిత్యం అటు ప్రాచీన కవిత్వానికి ఇటు ఆధునిక కవిత్వానికి వంతెనగా ఉంది. ప్రాచీనతను పోగొట్టు కోకుండా ఆధునికతను ఆహ్వానించడంలో ఒక సంధికాల సందిగ్ధతను ఎదుర్కొని చివరకు ఆదునికత వైపే మొగ్గు చూపింది.

రాయల కాలం తరువాత క్రమంగా మనకు విదేశీ దాడులు కేరళ రాష్ట్రం వైపునుండి ప్రారంభమైనాయి. పోర్చుగీసు, డచ్చివారు, బ్రిటిష్ వారి రాకలతో భాషలో, భావంలో, ఆలోచనలో ఆహార్యంలో మార్పులు చోటు చేసుకోవడం ప్రారంభమైనది. భాషలో విదేశీ భాష పదాల వాడుకతో పాటు వారి సాహిత్య పఠనంతో మన భాషపై తక్కువ చూపు బ్రిటీష్ వారు ఉద్యోగ వ్యవస్థ ప్రారంభించి నప్పటినుండి చదువుల కోసం విదేశీయానం వస్త్రధారణలో విదేశీయుల అనుసరణ మొగ్గతొడగడం ప్రారంభమైనది. ఫలితంగా మన సాహిత్యంలో కూడా పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన వివిధ విప్లవాల ప్రభావంతో ముఖ్యంగా మార్క్సిజం, కమ్యూనిజం రచయితల ఆలోచనలను ప్రభావితం చేశాయి.

ఫలితంగా ఆధునిక కవిత్వం ఆవిర్భవించింది. అంటే దీన్ని ఆంగ్లవిద్య ప్రవేశానికి ముందు ప్రాచీన సాహిత్యం తరువాత దాన్ని ఆధునిక కవిత్వమని చెప్పుకోవచ్చు. ఇందుకు రాజకీయ కారణాలు కూడా తోడు అయ్యాయి. వివిధ ఉద్యమాలు, కళాశాలల స్థాపన, విదేశీ విద్య ప్రభావం, ముద్రణా రంగం రాక... ఇలా ఎన్నో కారణాల ఫలితంగా భావకవిత్వం, అభ్యుదయ, దిగంబర, విప్లవ కవితా ఉద్యమాలతో కవిత్వం పూర్తిగా ప్రజాస్వామ్యయుతమై ప్రజల కోసం ప్రజలే రాసుకునేదిగా రూపాంతరం చెందింది. కావ్యా ప్రక్రియ నుండి ఖండ కావ్య ప్రక్రియ, వచన రచనలు కథ, కథానిక నవల నాటకం నాటిక ఏకాంకిక ప్రహసనం ..... ఇలా మార్పులు చెందుతూ నేటి రుబాయిలు, గజళ్ళు, హైకులు, వచనకవితలు, రెక్కలు, నానీలు కథలు కథానికలు వంటివి తమదైన రీతిలో సాహితీ సౌరభాలను వెదజల్లు తున్నాయి.

ఉపయుక్త గ్రంధ సూచి:

1. తెలుగు సాహిత్య చరిత్ర – ద్వా.నా.శాస్త్రి.
2. తెలుగు సాహిత్య చరిత్ర – ముదిగంటి సుజాతా రెడ్డి.

ఇతి బాధల్లో కలసి నడిచే స్నేహం

డా. మెండా దేవానంద్ కుమార్, తెలుగు శాఖాధిపతి, డా. లక్కిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
మైలవరం – 521230, సెల్‌నెం: 9440781819

పరిచయం:

ఆధునిక తెలుగు కథ సాహిత్యంలో కారా మాష్టరుగా కీర్తి గడించిన కాళీపట్నం రామారావు 9 నవంబరు 1924లో పొందూరు నందు జన్మించారు. వృత్తిరీత్య ఉపాధ్యాయుడు, ప్రవృత్తిరీత్య కథకుడు. తన కథల ద్వార తాను జన్మించిన శ్రీకాకుళం జిల్లాకు ఎంతో పేరు ప్రాఖ్యాతులు సంపాదించి పెట్టారు. సామాన్య జ్ఞానం గల పాఠకులు సైతం రచనలో లీనమయ్యే విధంగా రచనలు చేసారు. "1966 లో వీరు రాసిన యజ్ఞం పాఠకులను విశేషంగా ఆకట్టుకుంది. దోపిడి స్వరూప స్వభావాలను నగ్నంగా సహజంగా శాస్త్రీయంగా చిత్రించారు. దీనికి 1995లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది"1 వీరు రచించిన మరో అద్భుతకథ స్నేహం. ఇందులో రచయిత విభిన్న వ్యక్తుల స్వార్థ మనస్తత్వాలను నిర్భయంగా ఎండగట్టిన తీరును పరిశీలించడం ఈ వ్యాస ముఖ్యోద్దేశం.

కథ ప్రక్రియ :

పాట, కథ అతి ప్రాచీనమైన కళలు. "మానవుడు ఎప్పుడైతే చెట్టు దిగి తన భావనాశక్తిని, ఇతరులతో పంచుకోవడం మొదలుపెట్టాడో అప్పటి నుంచి కథ మొదలైంది" కథ ఎన్ని పాత్రలతోనైనా, ఎన్ని సన్నివేశాలతో నైనా ఉండవచ్చు. తెలుగు కథ ఎప్పుడు పుట్టిందీ అని ఒక్క మాట అడిగారంటే 'అనగనగా ఒక రాజు... ఆ రాజుకు ఏడుగురు కొడుకులు... అను కథ పుట్టినప్పుడే' అంటారు విమర్శకులు. ఇంట్లో తాత, అవ్వలు, సాయంకాలాలు తమ పనులు అయిన తర్వాత ఒక చోట చేరి కబుర్లు చెప్పుకునే సమయాల్లో ఈ కథలు ప్రారంభ మయ్యాయి, మనకు ఇతిహాస, పురాణాల్లో కన్పించే అఖ్యానాలు, ఉపాఖ్యానాలే నేటి పరిభాషలో కథలు.

స్నేహం కథ పాత్రలు :

అ) డాక్టరు గోపాలరావు (కథ నాయకుడు)

ఆ) పద్మవతి (డాక్టరు గారి భార్య)

ఇ) నరసింహులు (కాంపౌండర్)

ఈ) రాజారావు (డాక్టరు ఈనాటి స్నేహితుడు)

ఉ) మీనాక్షిదేవి (పేషెంట్)

ఊ) శివరామయ్య (డాక్టరు బాల్య స్నేహితుడు)

ఋ) పార్వతీశం (శివయ్య బావ)

ౠ) పనిపిల్ల (డాక్టరు ఇంట్లో పనిపిల్ల)

ఎ) సత్తవతి (డాక్టరు పొరిగింటావిడి)

ఏ) యస్వీరావు (పి.ఎ.)

కథ సంగ్రహం :

"ఫెళ ఫెళ ఫెళప్.... ఫెళప్... ఫెళప్ మంటూ ఫడీల్ మందో ఉరుము" ఎక్కడో మా ఘనమైన పిడుగు పడ్డది అన్నాడు కాంపౌండర్ నరసింహులు. దీన్ని బలపరుస్తూ అది పిడుగే నన్నాడు డాక్టరుగారి కొత్త స్నేహితుడు రాజారావు. బయట కుండపోత వాన లోన ఒక్కటే ఉక్కపోత. డాక్టరు గోపాలరావు పరధ్యానంలో ఉండి ఇవేవి పట్టనట్టు ఎటో శూన్యంలోచూస్తు ఉండిపోయాడు. డాక్టరు గారు వార్డు ఎలక్షన్‌ల్లో నిలబడి ఓపి నిర్లక్ష్యం చేయడంతో పేషెంట్లను పోగొట్టుకున్నాడు. పాత పేషెంట్లు వచ్చి చూపించుకొని వర్షంలో తడుచుకుంటూ వెళ్ళారే కాని కొత్తవారు రాకపోవడంతో డాక్టర్లో చిరాకు మలేరియా రోగి టెంపరేచర్లా అదేపనిగా పెరిగిపోతుంది.

మూర్ఛొస్తే మూర్ఛరోగులు ఎలా మెలికలు తిరిగి పోతారో గోపాలరావులోని మందు మనిషి అలా కిరకిరా

సులసులా చుట్టుకోలడం ఆరంభించిది. మూడు రోజులుగా మొండిగా కురుస్తున్న వర్షం మీద పట్టరాని కోపం వచ్చింది. రాజారావు సోది కబుర్లుతో కాలక్షేపం చేస్తున్నదేగానీ ముష్టి ముప్పై రూపాయలు సర్థలేదనే కోపం, ఇటువంటి పరిస్థితుల్లో మీనాక్షిదేవికి ఎప్పాయింట్‌మెంట్ ఇచ్చిన తన అవివేకం మీద, "చివరకు తనకు ఎంతో ప్రాణప్రధమైన సిగరెట్టు ఒట్టిపోవడం చూసి తన బతుకు మీద పట్టరాని కోపం పుట్టి శరీరాన్ని కుతకుత ఉడికించేస్తోంది" వాచీలో ఏడుకి రెండు నిమిషాలు తక్కువగా ఉంది. కొన ప్రాణంలో ఉన్న రోగిని బతికించడానికి బాధపడే వైద్యుడిలా టేబుల్ మీద ఓరగా కూర్చుని ఆలోచిస్తూన్న డాక్టరు. ఇంతలో ఇద్దరు కొత్తవాళ్ళు గుమ్మం ఎక్కుతున్నారు. నలభైయ్దేళ్ళ కాయశరీరం మూడొంతులు తెల్లపడ్డ మీసాలతో ఉన్న వ్యక్తి, అతనితో పాటు ఓ కుర్రాణ్ని గదిలోకి ప్రవేశపెట్టాడు. నా పేరు శివరామయ్య మాది బొబ్బిలి అంటూ డాక్టరు గారితో పరిచయం చేసుకున్నాడు. ఓరి ఓరి ఓరి..... అంటూ శివరామయ్యను డాక్టరు కౌగిలించుకున్నంత పని చేసాడు. తరువాత ఎక్కడున్నావు? యేం చేస్తున్నావు? ఎప్పుడొచ్చావు? ప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరైపోతూ కూర్చీలో కూర్చో బెట్టుకున్నాడు. మనస్సున ఆవరించిన నిస్సావత్తు నిదానంగా వదిలిపోయింది. తరువాత వాళ్ళిద్దరూ బాల్యచరిత్రలు తవ్వుకోవడం ఆరంభించారు. శివరామయ్య హైస్కూల్లో చదువుతుండగానే పెళ్ళయ్యిందట. తరువాత భీమునిపట్నం జిల్లాబోర్డులో మేస్టరుగా చేరడం డాక్టరు గారికి గుర్తుంది. ఆ తరువాత ఓ పాతిక సంవత్సరాలు చుట్టుపక్కల గ్రామాలు తిరిగి రావులపాడేరు హైస్కూల్లో నిలదొక్కుకున్నాడు శివరామయ్యకు ఎనిమిది మంది సంతానం. సంసారభారం క్వాలిఫికేషన్సు ఇంప్రూమెంట్‌కి ప్రతిబంధకం కాగా మొన్ననే ఏడాది క్రితం తెలుగు బిఈడీ అనిపించుకున్నాడు. డాక్టరుగారు మధ్యలో కలిపించుకుని ఇంకా చూస్తావెండుంకు కోయించెయ్ అన్నారు. "కోయించేయడానికి మానేడానికి మన మెవరం వాళ్ళే బలవంతన వాన్‌లో పడేసుకుపోయి కోసిపారేస్తున్నారు"5 అని శివరామయ్య అనగానే అందరు ఫకాల్మన్నారు.

1980ల్లో ఎమర్జన్సీ పరిస్థితులు, బలవంతపు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, బహుమతుల కోసం మధ్యతరగతి ప్రజల ఆరాటాన్ని ఎంతో చక్కగా రచయిత ఆవిష్కరించారు. డాక్టరు గారు అన్నట్టు నువ్వు మీ మేనమామ కూతుర్నే కదూ చేసుకున్నావు కదూ అన్నాడు శివయ్య. అబ్బే లేదే ఆవిడే నన్ను పెళ్ళాడింది అని డాక్టరు చతురులాడాడు. మీ మామ కులాసానా? అన్నాడు శివనరామయ్య అల్లుడికి మామలోకువ అన్న చందంగా అంతా కూతురు పేరన పెట్టి నీకు చదువు చెప్పించాను పో పొమ్మన్నాడు ముష్టి రాస్కెల్ అంటూ కసంతా వెళ్ళగక్కేడు డాక్టరు గోపాలరావు.

పరస్పర సంభాషణల తర్వాత శివరాయయ్యకు కొంత ధైర్యం వచ్చింది. ముఫ్ఫైయేళ్లు నిండక ముందే నటచక్రవర్తి బిరుదు సాధించావు. తరువాత నాటక ఎకాడమీ సభ్యునిగా, ఒక టెర్మ్ యెమ్మెల్సీ చేశావు, ప్రస్తుతం పట్టణ కౌన్సిలర్‌వి అని శివరామయ్య తనను ప్రశంసిస్తుంటే డాక్టరుకి అంత వినసొంపుగా లేదు. ఇక లాభం లేదనుకుని అసలు విషయంలోకి శివరామయ్య వచ్చాడు. తన పెద్దకొడుకు చదువు ఉద్యోగ ప్రయత్నం, ఇంటర్వ్యూ కోసం వచ్చిన సంగతి, రికమండేషన్ అవసరమని, అందులోను డబ్బు లేందే అసలు పని జరగదని తెలిసి మూడువందలు తెచ్చానాని చెప్పాడు శివరామయ్య. తనను ఎక్కడ డబ్బు సర్థమని అడుగుతాడోనని డాక్టరు గుండె ఝల్లుమంది. అతని ఇబ్బందిని గమనించిన శివరామయ్య మడతలు విప్పిన మూడువందలు డాక్టరు చేతిలో పెట్టి తన కొడిక్కి ఉద్యోగ బిక్ష పెట్టమని శివరామయ్య ప్రాధేయపడ్డాడు. డబ్బు తీసుకునే పార్టీ పి.ఆర్.ఓ. కానీ అతను మనతో మాట్లాడ్డట, అతని పి.ఎ. యస్పీ రావును పట్టురుంటే పని అవుతుందని శివరామయ్య చెప్పాడు. డాక్టరు, రాజారావు వాళ్ళిద్దరూ దేనికోసం కుమ్ములాడుకుంటున్నారో కాని తన

కొడుకు భవిష్యత్తుతో చెలగాటలాడే గండుపిల్లల్లా కనపడ్డారు శివరామయ్యకు.

శివరామయ్య ఆలోచనలు పరిపరి విధాలుగా పోవడాన్ని గుర్తించిన రాజారావు మంచికో చెడ్డకో ఓ దేవుణ్ణి నమ్ముకున్నట్టు మీ స్నేహితుణ్ణి నమ్ముకొని అతని మీద భారం వేశారు. అదృష్టం కలసివస్తే మీ వాడికి ఉద్యోగం వచ్చితీరుతుంది. ఒకవేళ రాకపోతే ప్రయత్నలోపం అనుకోవద్దు అంటూ హితబోధ చేశాక శివరామయ్య కాస్తా తేలికపడ్డాడు. శివరామయ్య ఇచ్చిన డబ్బులో ఓ యాభై అప్పు ఇవ్వమని రాజారావు అడిగాడు. డాక్టరుకి ఎక్కడలేని కోపం వచ్చింది. కానీ రాజారావు మీ స్నేహితుని దగ్గర డబ్బు తీసుకోకపోతే ఏ వంటవాడికో లేదా ఏ డ్రైవర్‌కో ఇచ్చేవాడు. మీ ప్రాణస్నేహతుని డబ్బు మీరు తింటే అర్థం ఉంది కానీ ముక్కుమొఖం తెలియనివాడు తింటే ఏలాగండీ? చెప్పండి డాక్టరు గారు అన్నాడు రాజారావు. డాక్టరు గారికి తత్వం బోధపడి జేబులో నుండి ఏభై రాజారావుకి ఇచ్చాడు.

పనిపిల్ల కాఫీ కప్పు డాక్టరు గారికి అందిస్తూ తమరి కోసం ఎవరో వచ్చారని చెప్పింది. పేరు కనుక్కోమని పిల్లను కిందకు పంపాడు. ఐదు నిమిషాల్లో పేరు కనుక్కొని పైకి వచ్చింది. ఎవరో శివరామయ్య గోరట బాబు అంది. కిందికి దిగిన డాక్టరును చూసి శివరామయ్య పెద్ద గొంతుతో నీ కోసం ఇది రెండోసారి రావడం అనడంతో డాక్టరుకి లోన దడదడ లాడింది. కృతజ్ఞుణ్ణిరా గోపాలం నువ్వు చేసిన పనికి నేనూ నా కొడుకు జీవితాంతం మరచిపోలేం అన్నాడు శివయ్య. ఏం మీ వాడు సెలక్టు కాలేదా? అన్నాడు డాక్టరు ఎందుకు కాదూ, నువ్వు పట్టుకోవడం కాకపోవడమూనా? శివరామయ్య ఆ మాట అనేసరికి డాక్టరు థేంక్ గాడ్ కూర్చో అంటూ తనూ ఓ కుర్చీలో కూలబడ్డాడు డాక్టరు.

బ్రతుకులో భయమంత పాపిష్టిది ఇంకొకటి లేదు. అన్నీ తెలిసిన వాణ్ణి కూడా అది పరమ మూఢుణ్ని చేస్తుంది. సీటు చిక్కనీయదు, ఉద్యోగం దక్కనీయదు. "నిన్న నా పాలిట దేవుళ్లా నువ్వే అడగకపోతే నేను వెళ్ళి ఆ వంటవాడి పాదలమీద పడి వుందును. వాడు అందిన కాడికి చేత బట్టుకొని ఎన్ని తిప్పలు పెట్టేవాడో ఆ భగవంతుడి కెరుక"6 శివయ్య అని చేతులు జోడించాడు. రాజారావు ఈ మనిషిని ఎంత చక్కగా అంచనా వేసేడో అనుకున్నాడు డాక్టరు. నా వల్ల రాత్రాంత నిద్ర చెడినట్టు ఉంది. ఒక పేద స్నేహితుడి కోసం శ్రమపడ్డాననుకో అన్నాడు శివరామయ్య. కాని డాక్టరు అదేమి మాట అనలేదు,ఇంటికొచ్చిన బాల్య స్నేహితుణ్ణి భోజనం చేయమని అడుగుతాడని భావించిన శివరామయ్యకు నిరాశే మిగిలింది.

ఈ లోకంలో ఒకరి కొకరు ఏదో అవుతారన్నది ఒట్టి కల్ల. తండ్రి కొడుక్కొతడన్నది ఒట్టిది. చుట్టపక్కాలు, స్నేహితులు అంతా ఒట్టిది. మనిషి మనిషితో తిరుగుతున్నాడంటే అవసరం. అవసరం బట్టే అన్ని తిరుగుళ్ళు అంటాడు డాక్టరు. రాజారావు తన అవసరం కొద్ది తనతో ప్రేమగా ఉంటాడు, అలాగే తన బాల్య స్నేహితుడు శివరామయ్యకి జనం సింపతి లాగేయడం తెలుసు. పాతికేళ్ళు నావైపు కన్నెత్తిచూడలేదు. వాడికి అవసరం రాగానే వచ్చిపడ్డాడు. వాడిలో రోగరి గ్రహించేకే శివరామయ్యాంటే అసహ్యం కలిగింది.

మొదట్లో నిజంగానే సహాయం చేద్దామనుకున్నాడు డాక్టరు. కుదరకపోతేవాడుకున్న దబ్బిచ్చేదా మనుకున్నాడు. కానీ శివరామయ్య వెళ్ళిపోతూ పోతూ మూడు వందలు కాదు, ముప్ఫయి వందలైన లంచమిస్తానన్నాడు. ఓరే రోగ్ యీ నాటికి నువ్వు రోగ్‌వి, అయితే మనం ఎప్పటినుంచో రోగులకు రోగులమై ఉన్నాము. లోకంలో స్నేహమే లేదంటే బ్రతుక్కి అర్థమే లేకుండా పోతుంది. స్నేహం అవసరం ఉన్నప్పుడే కాదు, అవసరం లేకున్నా యోగక్షేమాలు తెలుసుకునే పలకరింపులే మానవాళికి పన్నీటి జల్లులు.

ముగింపు :

మనుషుల్లో విభిన్న వ్యక్తులున్నట్లే తెలుగు కథకుల్లో కాళీపట్నం రామారావు గారిది ప్రత్యేక వ్యక్తిత్వం. మధ్యతరగతి కుటుంబంలో పుట్టి పెరగడం వల్ల వీరి కథ ఇతివృత్తాంతం నగటు మనిషి ఆలోచనల చూట్టు తిరుగుతాయి. మనిషి ఆనందాన్ని పొగొట్టుకుని డబ్బు కోసం చేసే చెడ్డ పనులను తప్పు పట్టారు. చెడు వ్యసనాలు విడిచిపెట్టి ఉన్నదానితో సంతృప్తి చెందటం మానవుడు అలవాటు చేసుకోవలనీ రచయిత వినయపూర్వకంగా విజ్ఞప్తి చేస్తూన్నారు.

పాదసూచికలు :

1) కాళీపట్నం రామారావు వికీపీడియా : పుట – 1
2) తెలుగు ప్రక్రియ వైవిధ్యం : పుట – 57
3) కాళీపట్నం రామారావు రచనలు : పుట– 267
4) కాళీపట్నం రామారావు రచనలు : పుట– 267
5) కాళీపట్నం రామారావు రచనలు : పుట– 269
6) కాళీపట్నం రామారావు రచనలు : పుట– 276

ఆధార గ్రంధాలు :

1) తెలుగులో ప్రక్రియా వైవిధ్యం డా. సత్యవాది 2012 తెలుగు అకాడమి, హైదరాబాద్
2) కాళీపట్నం రామారావు రచనలు వివిన మూర్తి(సం) 1999 కళాజ్యోతి ప్రొసెస్ లిమిటెడ్ హైదరాబాద్.

రాట్కవి బ్రహ్మపత్రము – విభిన్నధోరణి

డా॥ సి. నర్సింహులు, సహాయ ఆచార్యులు, యం.వి.యస్. ప్రభుత్వ ఆర్ట్స్& సైన్స్ కళాశాల (స్వయం),
మహబూబునగరు. 509001. చరవాణి – 9440577319.

జటప్రోలు సంస్థానంలో మొదట ఉపాధ్యాయుడుగా చేరి తన కవితా వైభవముతో జటప్రోలు ప్రభువైన రాజా సురభి వెంకటలక్ష్మారావు బహద్దర్ గారి అభిమానమునకు పాత్రుడై, రాసురాట్కవిగా, రాట్కవిగా ప్రఖ్యాతి చెందిన రామసుబ్బారాయుడు సంస్థానాస్థానకవిగా సుమారు ఇరవైఐదు సంవత్సరాలు సేవలందించారు. తన ఎనభై సంవత్సరాల వయస్సులో కూడ కవితా సృష్టి చేసిన మహానుభావుడు రామసుబ్బారాయుడు. అట్టి కవి జీవితంలో కలికితురాయి అతని "ప్రసన్న భారతము", ఆయన కీర్తి కిరీటంలో నిలువదగిన రత్నం. జటప్రోలు సంస్థాన ప్రభువులకు సాహిత్య పోషణ భాగ్యాన్ని కలిగించిన వాడు. శతాధిక రచనలు చేసి, యితర కవులచే చేయించి సాహిత్య పోషణలో జటప్రోలు సంస్థానానికి ప్రత్యేక ఖ్యాతిని తెచ్చిపెట్టిన వాడు ఈ వాజపేయాజుల రామసుబ్బారాయకవి.

కవి తన కల్పనా చాతుర్యంతో హాస్యవ్యంగ గర్భితమైన రచనలు చేయడం పింగళి సూరనకు దక్కితే ఆధునిక కాలంలో వీరేశలింగం తర్వాత చెప్పదగిన గొప్ప కాల్పనిక కవి. పింగళి కళా పూర్ణోదయం వీరేశ లింగం సరస్వతీ నారద విలాపం పక్కిలో ఈయన విభిన్న ధోరణిలో బ్రహ్మపత్రోపాఖ్యానము రచించాడు. "బ్రహ్మపత్రం" అనగా పొగాకు. గురజాడ తన కన్యాశుల్క నాటకంలో పొగాకు గొప్పతనాన్ని గిరీశం చేత చెప్పించాడు. అది...

కం॥ ఖగపతి యమృతము తేగన్
భుగభుగమని పొంగి చుక్క భూమిని వ్రాలెన్
పొగచెట్టయి జన్మించెను
పొగతాగని వాడు దున్నపోతై పుట్టున్

కన్యాశుల్క నాటకానికే తలమానికమైనదీపద్యం. కాగా రామసుబ్బారాయకవి పొగాకును కథావస్తువుగా స్వీకరించి ఒక కావ్యాన్ని రాయడం విశేషంగా చెప్పవచ్చు.

ఈ బ్రహ్మ పత్రోపాఖ్యానము విభిన్న ధోరణిలో రచింపబడిన కథాకావ్యం. యిందలి కథాంశ మేమనగా, ఒకనాడు సరస్వతి, పార్వతి, లక్ష్మీ మువ్వురు కలిసి ఉద్యాన వనంలో పుష్పఫలములతో కూడిన వృక్షాలను చూస్తూ తిరుగుతున్నారు. అప్పుడు పార్వతికి బిల్వవృక్షం కనిపించగా, భక్తితో దాని చుట్టు ప్రదక్షిన చేసి మ్రొక్కి బిల్వపత్రాన్ని తన శిరసున ధరించింది. అదేసమయంలో లక్ష్మీదేవికి తులసీ చెట్టు కనిపించగా, ఆమె దాని చుట్టు ప్రదక్షిణ చేసి ముమ్మారు మ్రొక్కి తులసీ దళాన్ని శిరసున దాల్చింది.

సరస్వతి వారిని ఆ పత్రాల గొప్పదనము చెప్పుడని కోరగా పార్వతి శివునికి ఇష్టమైనది బిల్వపత్రం అని, లక్ష్మీ విష్ణువునకు ఇష్టమైనది తులసీపత్రం అని చెప్పారు. అప్పుడు సరస్వతి కొంచెం మదనపడి బ్రహ్మకు ఇష్టమైన పత్రం ఒకటి వుండవలెనని ప్రపంచంలో ఆ పత్రానికి అత్యంత ఆదరణ ఉండవలెనని బ్రహ్మను కోరగా, అతడు ఒక వృక్షాన్ని సృష్టించి దాని పత్రాలకు అత్యంత విలువ వుంటుందని దేవ, దానవ, ముని గణములేగాక, మానవులు కూడా ఇస్తారని పలికి సరస్వతిని శాంతింపజేసి ఆ వృక్షానికి 'బ్రహ్మపత్రమ'ని పేరు పెట్టెను. ఈ సందర్భంగా బ్రహ్మ సరస్వతిని ఊరడించినప్పుడు రాసురాట్కవి రాసిన పద్యం...

తే॥ చాలునొక బ్రహ్మదళము నీవాలు జడను
దాని ధరియించి రమకు భవాని కొక్క
మారు చూపితివా చూడు మందగమన
యణగు వారల గర్వంబు క్షణములోన.

సరస్వతి అలక పారజాతాపహరణంలో సత్యభామ అలకను పోలియున్నది. బ్రహ్మ సరస్వతిని అనునయించిన

తీరు. కవి కల్పనా చాతుర్యానికి ప్రతీక. ఆ పద్యం గమనించండి.

మ॥ చిరకాలంబు తపంబు సల్పి జగముల్
సృష్టించునవ్వేళసు
స్థిర మూలంబు సువర్ణ సుందరదళ శ్రీ రాజితంబున్ నిరం
తర సంస్తుత్య సువాసనాయుతముజేత ప్రీతి సంధాయకం
బరుజా వృక్షము సృష్టి జేసితిని నేనాదిన్ విశాలేక్షణా.

ఓ సరస్వతి చాలాకాలము తపస్సు చేసి ప్రపంచాన్ని సృష్టించు సమయంలో అందమైన బంగారు పత్రాలు గలిగి శుభప్రదమై నిరంతర సువాసన భరితమై చాల అరుదైన నొక వృక్షాన్ని చాల ఇష్టముతో సృష్టించితిని, అదే 'బ్రహ్మపత్రము' అని బ్రహ్మ చెప్పెను. ఇక్కడ 'అరుదైన' అనడంతో దీనికి మందారం, పారిజాతం, కల్పవృక్షం, హరిచందనం, బిల్వవృక్షం, తులసి ఇవేవి సాటిరావని వ్యంగ్యముగా, హాస్య గర్భితము చెప్పాడు కవి.

ఒకనాడు పరమశివుడు శిరోవేదన భరిచలేక మూల్గుతు బ్రహ్మ దగ్గరికి వచ్చాడు. తల చాల భారమైనదని, కింద పడ్తుందేమోనన్నట్లున్నదని, ముక్కువాసన చూడడం లేదని, నాలుకకురుచి తెలువడం లేదని ఆహారం, నిద్ర మరిచానని ఎన్నో మందులు వాడానని చివరకు పాలసముద్రంలో పుట్టిన విషాన్ని త్రాగిన పడిశం తగ్గలేదు. ఏదైన ఉపాయం చెప్పి కాపాడమన్నాడు. ఇక్కడ కవి చెప్పిన పద్యమిది.

తే॥ పాలకడలిని బుట్టిన హాలహలము
యఖిలమును ద్రావితిగాని యక్కటకట
పడిసెమిసుమంత యేనియు నడగదయ్యె
నేమి సేయుదునోయన్న ! యింక నేను.

అప్పుడు బ్రహ్మ పడిశం రావడానికి కారణాలు ఈ విధంగా చెప్పాడు.

ఉ॥ ఉన్నది మంచుకొండ తలనున్న మహాత్ముడు శీతరశ్మి నీ
యన్నుల మిన్న జాహ్నవియు మున్నచనే
వసియించుగాదె. నీ
వెన్నగనేల కారణము లీపడిసెంబున కింకవేఱె త
ప్పెన్నగ నేల నాయడ నహీన విభూషణ! ఓ దిగంబరా!

బ్రహ్మ శివుని పడిశానికి అనలైన కారణాలు వెల్లడించాడు. నివాసం మంచుకొండ, తలపైన వున్నవాడు చంద్రుడు. జటాజూటంలో గంగా, ఇవన్నీ శీతం కలిగించేవే అని కారణాలు చెప్పి నివారణోపాయాన్ని గూడ చెప్పాడు. బ్రహ్మ శివుని మారెడు పండులోని గుజ్జును ఎండబెట్టుకొని తెమ్ము బ్రహ్మదళములు మూడింటిని ఎండబెట్టి నిప్పుసెగ కాచి పొడుంచేసి ముమ్మారు వడగట్టి కమ్మని నెయ్యితో కలిపి నూరి మారెడు బుర్ర యందుంచి బిరడా బిగించి యిస్తాను. దీనిని "నశ్యం" అంటారు. దీనిని పీల్చినచో ఎన్ని మందులకు తగ్గని పడిశం కూడా తగ్గుతుంది. దీనిని వైద్యశాస్త్రాలెన్నో చదివి తయారు చేశాను. ఎవరు చూచిన తస్కరిస్తారని చెప్పి యిచ్చెను. ఈ విధంగా శివునికి వున్న రొంప తక్కువైంది.

మరికొంత కాలానికి శ్రీ మహావిష్ణువు దగ్గుతూ ఆయాసపడుతూ బ్రహ్మవద్దకు వచ్చాడు. బాధ భరించలేక దగ్గుతూ తన బాధ చెప్పలేక పోయాడు. బ్రహ్మ విషయం గ్రహించి తన బంగారుపెట్టెలో సువాసనలు వెదజల్లె బ్రహ్మపత్రాన్ని తీసి పొడుగాటి చుట్ట చుట్టి విష్ణువు చేత తాగించాడు. విష్ణువు గుక్కెడు పొగ పీల్చగా అతని కఫము బైటపడింది. విష్ణువు చెప్పలేని స్థితిని బ్రహ్మ గ్రహించిన విధమును కవి విభిన్నంగా వర్ణించాడు.

సీ॥ ఆదిని భారావతారాన ముదయించు
బిమ్మట జనియించు పిల్లికూత
లావెక్క సారమే యారవంబులు పుట్టు
దరువాత సింహనాదములు వెలయు
నంత నుద్భవమందు నాభీల పాంచ జ
న్యధ్వనుల్ భూనభోంతరము నిండ

నటుమీద బ్రభవించు జటుల కల్పాంత దు
ర్దాంత జీమూత గర్జా రవంబు

తే॥ అక్కటక్కట! మేమందునయ్య కాస
రోగ సంజాత మత్కంఠ భాగ చిత్ర
చిత్ర భీకర శబ్ద విశేష గరిమ
గర్భ శత్రులకైన నీ గాసి వలదు.

విష్ణువు దగ్గినపుడు వచ్చు ధ్వనిని కవి పిల్లికూతలు, సింహనాదాలు, శంఖ శబ్దాలు, మేఘ గర్జనలతో పోల్చాడు. ఈ ధ్వనులను గమనించి బ్రహ్మ ఇట్లనెను. ఓ విష్ణు నీ కంఠము నుండి రకరకాలుగా వచ్చు శబ్దము, యా బాధ నీ శత్రువులకు కూడా రావలదు.

ఇక్కడ సృష్టి, స్థితి, లయకారులు ఇన్ని కష్టాలు పడ్డారంటే యెవరు నమ్మరు. వీరు పడ్డ కష్టాలు గమనిస్తే, ఇందులో హాస్యం అద్భుతంగా పండించాడు కవి. ఇదే విధంగా ఇంద్రుని రోగానికి తాంబులంలో బ్రహ్మపత్రాన్ని చేర్చి తినమనడం. ఋషులు తపస్సు చేసి బ్రహ్మద్వార బ్రహ్మపత్రాన్ని పొందడం అది భూలోకానికి రావడం సర్వజనామోదం పొందడం జరిగింది. ఇది పారిజాతా పహరణంలో పారిజాతా వృక్షాన్ని మించి దీని ఉపయోగాలు విలక్షణత, సౌరభం గురించి విభిన్నంగా వర్ణించడం జరిగింది. ఉదాహరణకు...

సౌరభంలో దీనిని మించిన పుష్పంగాని, పత్రంగాని లేదన్న పద్యం...

తే॥ కుంద చందన మందార కుటజ కుముద
వకుళ చంపక మల్లికా పారిజాత
కంజముఖ పుష్పములు ధూమ కళిక తోడ
సాటి రావెంత మాత్రము సౌరభమ్ము.

భగవంతుని సృష్టిలో ఉపయోగపడని వస్తువేదియు లేదు. విషముసైతము ఉపయోగకరమైన వస్తువే. మనిషి బ్రతుకడానికి తను తినె ఆహారము కూడ మోతాదుమించి తింటే 'అజీర్ణం' వంటి వ్యాధులు రాక తప్పవు. విషయ పరిజ్ఞానంతో సృష్టిలో వుండు వస్తువులను ఉపయోగించుకొని సుఖజీవనము చేయడమే మనిషి పుట్టుకకు సార్థకము. పొగాకు వాడడం వలన దుష్పలితాలు వున్న ఈ కాలంలో గూడ దీని వాడకం తగ్గలేదు. కవి వ్యంగ్యంగ రాసినా, బ్రహ్మంగారి కాల జ్ఞానంవలె దూరదృష్టితో రాసినాడని పిస్తుంది. ఈ పొగాకును మానవులు ఎన్ని రకాలుగా ఉ పయోగిస్తారో కవి ఈ విధంగా చెప్పాడు.

సీ॥ కొందరీ దళముల గోర్కెనశ్యము జేసి
ప్రీతియై నిచ్చలు బీల్చుచుండ్రు
కొందఱీ దళముల గొనబు చుట్టల జుట్టి
కమ్మగా నిత్యంబు గాల్చుచుండ్రు
కొందఱీ దళముల గోరి తాంబూలంబు
నను గూర్చి యేవేళ నములుచుండ్రు
కొందఱీ దళముల కుంగలంబును సరి
గా గూర్చి యనయంబు గాల్చుచుండ్రు

తే॥ మొత్తమునకేదొ కొందరు మూఢమతులు
భాగ్యహీనుల,బతుకు ప్రజలు తక్క
సర్వజనులీ దళంబుల సంతతంబు
వాడు చుందురు సౌఖ్యమవ్వారి గాగ.

ఇక పాశ్చాత్యులు పొగాకు వాడడంలో మన కన్నా ముందున్నారు. పొగాకును కాగితంలో చుట్టి (సిగరెట్టు) కాలుస్తూ, అపారమైన సౌఖ్యాన్ని పొందుతూ బ్రహ్మానందంగా దాన్ని భావిస్తున్నారని కవి ఈ విధంగా తెలిపాడు.

ఉ॥ యూరపు ఖండవాసులగు నుత్తము బుద్దులు
కొందరిప్పుడీ
సారదళంబులన్ మిగుల చక్కగ గాగితమందు
గూర్చియ
వ్వారిగ గాల్చి సౌఖ్యము నపారముగా గనుచున్న వారలే
తీరుననైన నేమి సుగతింగన బ్రహ్మదళాసురక్తులై

ఈ పద్యంలో "ఏ తీరుగ నైన నేమి సుగతింగన" అను వాక్యంలో "సుగతింగన" అంటె మోక్షము పొందుటకని

అర్థము. ఇక్కడ బ్రహ్మానందము పొందుటకని అర్థం చేసుకోవాలి. "సుగతింగన" అను పదానికి కవి విభిన్న ధోరణితో చెప్పిన నర్మగర్భిత అర్థం "చావు" అని. పొగాకు వాడడం వలన కలిగే దుష్పరిణా మాలను కూడా చెప్పాడు. యిక "ఏతీరునైన" అను పదము పొగాకును ఎన్ని పద్దతులలో వాడినప్పటికి దాని యర్థం పరమార్థం కూడ బ్రహ్మానందము పొందుట కొరకే అని స్పష్టమవుతుంది. నేటి మానవులు నిషిద్ద ప్రదేశాలలో పొగతాగుతున్నారంటే దాని గొప్పదనం తెలిసికోవచ్చు. కొందరు పొగను పీల్చుతు జల్సారా యుళ్ళు అధికంగా మురిసిపోతుంటారు. ఈ పొగాకును సామాన్య మానవులేగాక మునులు, రాజులు, చక్రవర్తులు సహితం ఉపయోగించి ఆనందం పొందు తున్నారంటే దీని వైశిష్ట్యం చెప్పనలవిగాదు. "పొగాకు" పై కల్పిత కథను హాస్య నర్మ గర్భితంగా రాసి, రామసుబ్బా రాయుడు గొప్పకవిగా పేరు సంపాదించు కొన్నాడు.

ఆధార గ్రంథాలు :

1. స్నేహలతా కవితా సంఘం – రాసురాట్కవి.
2. రాసురాట్కవి జీవిత చరిత్ర – పేరేశ్వర నారసింహకవులు.
3. బ్రహ్మపత్రోపాఖ్యానము – రాట్కవి. (రామసుబ్బారాయుడు)
4. చంద్రికాపరిణయ పీఠిక – కేశవపంతుల నరసింహాశాస్త్రి
5. కన్యాశుల్కము – గురజాడ అప్పారావు.

సీమ కథలు – విద్యావిధానం

కె. గీత, పరిశోధక విద్యార్థి, తెలుగు & అనువాద అధ్యయనశాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

సమాజానికి దర్పణం సాహిత్యం. సమాజంలోని ప్రతి చిన్న విషయాన్ని రికార్డ్ చేసి, చైతన్యపరిచే ఆధునిక సాహిత్య ప్రక్రియలలో అత్యంత విస్తృతమైన ప్రక్రియ కథ. ఈ కథ రాయలసీమలో కొంత ఆలస్యంగా మొదలైనా, విభిన్న వస్తురూపాలతో ముందుకు సాగుతున్నది. కె. సభా, మధురాంతకం రాజారాం లాంటి తొలితరం కథా రచయితల నుండి నేటి వరకూ రాయలసీమ కథను సుసంపన్నం చేసిన ఎంతో మంది కథా రచయితలు ఈ ప్రాంతంలో వున్నారు. వారిలో సింగమనేని, చిలుకూరి దేవపుత్ర, శాంతి నారాయణ, చల్లపల్లి స్వరూపారాణి, టి. రాఘవేంద్రరావు వంటి వారిని ప్రస్తుతం స్మరించుకోవాలి. 1991–2000 ప్రాంతంలో వచ్చిన కొన్ని కథలు రాయలసీమ విద్యా విధానాన్ని నమోదు చేసిన తీరుని పరిశీలించటం ఈ పత్రోద్దేశం.

విద్యాదదాతి వినయం, విద్యలేని వాడు వింత పశువు. విద్య అజ్ఞానాంధకారాల్ని తొలగించి, మానవుడిని పశుత్వం నుండి పరమేశ్వరత్వం వైపుకి నడిపిస్తుందన్న ఎన్నో విషయాలను సాహిత్య విద్యార్థులుగా మనం చదువుకున్నాం. విద్యనందించటం ప్రభుత్వ బాధ్యత. ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్య దాకా నాణ్యమైన విద్యాబోధన ద్వారా యువతలోని సామార్థ్యాలను, నైపుణ్యాలను పెంచాల్సిన విద్యా బోధన ద్వారా యువతలోని సామర్థ్యాలను, నైపుణ్యాలను పెంచాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే. అటువంటి ప్రభుత్వం విద్యను ప్రైవేట్‌పరం చేయటం వలన సామాన్యుడికి నాణ్యమైన విద్య అందని ద్రాక్షే అవుతుంది. విద్య ప్రైవేట్‌పరం కావటం వలన విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని చెప్పవచ్చు. ప్రైవేట్ విద్యాసంస్థల ప్రచారం మధ్యతరగతి వారి ఆర్థిక వ్యవస్థని దెబ్బతీస్తుంది. సామాన్యుడు సైతం తమ పిల్లలకు ప్రైవేట్ విద్య నందించటానికి ఎన్నో అప్పులు చేయాల్సిన పరిస్థితు లేర్పడుతున్నాయి. అప్పులు చేసైనా తమ పిల్లల భవిష్యత్ చక్కదిద్దుకోవాలనుకుంటున్న ఎందరో తల్లిదండ్రుల ఆశలు ఫలించట్లేదు. అందుకు కారణం చదివిన చదువులకి తగిన ఉద్యోగాలు రాకపోవటం, ఇతర చిన్న చిన్న ఉద్యోగాల్లో స్థిరపడటం లేదా నిరుద్యోగులుగా మిగలటం.

ఇది ఇలా ఉండగా ఒకవైపు విద్య బాగా వేగంగా వ్యాపార రంగమైంది. ఆంగ్లభాష వ్యామోహంతో ప్రైవేట్ విద్యా సంస్థలు పెరిగిపోయాయి. ఉన్నత విద్య అంటే ఇంజనీరింగ్, మెడిసన్ అన్న భావనతో మధ్యతరగతి కుటుంబం చితికిపోతుంది. ఎంత చదివినా ప్రభుత్వ ఉద్యోగం రాకపోవటంతో యువతలో భవిష్యత్ పట్ల భయం, నైరాశ్యం ఏర్పడ్డాయి. మన విద్యా వ్యవస్థలోని ఎన్నో లోపాలను, యువత ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలను రాయలసీమ కథ నమోదు చేసింది.

పరీక్షిత్తు:

రచయిత 'సింగమనేని నారాయణ'. ఇది 1991లో వచ్చిన కథానిక. ఇందులో గ్రామీణ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల్ని పరీక్షలో కాఫి కొట్టించమని దౌర్జన్యం చేసి, ఒక రకంగా ఉపాధ్యాయులు చిత్తశుద్ధికి పరీక్ష పెట్టడం కనిపిస్తుంది. ఇలాంటిది నేడు ఏ విద్యా సంస్థ దగ్గర చూసిన కనిపించే పరిస్థితే అయినా విద్యావ్యవస్థలో కాపి అనేది సహజ విషయంగా మారిపోయే ప్రమాదదశకు పరీక్ష వ్యవస్థ చేరుకుంటున్న స్థితి ఇక్కడ కనిపిస్తుంది. ఈ దుర్మార్గాన్ని వ్యతిరేకించి, గ్రామీణ తల్లిదండ్రుల ఒత్తిడులకు, దౌర్జన్యాలకు తలవంచకుండా పోలీసులను రప్పించి దౌర్జన్యపరుల్ని తరిమివేయించి పరీక్షలు సక్రమంగా నిర్వహించిన హెడ్మాస్టర్లను గ్రామీణులు

ఒంటరిగా చూసి చావగొట్టి కంపచెట్లలో పడవేయటం ఈ కథలోని ప్రధానాంశం.

ఇది రచయిత రికార్డు చేసిన వాస్తవ సంఘటనగా తోస్తుంది. ఈ కథ ద్వారా పరీక్షలు నక్రమంగా నిర్వహించడం ఒక మహాయజ్ఞంగా మారిపోవడమన్నది గమనించాల్సిన విషయం. పిల్లల భవిష్యత్ కోసం నిజాయితీగా పరీక్షలు రాయించాల్సిన తల్లిదండ్రుల్లో ఈ విధమైన దౌర్జన్యం రావటానికి కారణం వెతకాల్సిన అవసరం ఈ కథ సూచిస్తుంది. ఇక్కడ మార్కులు, ర్యాంకులు ఉంటే చాలు విద్యార్థి వైయుక్తికంగా, సామాజికంగా ఎదగాల్సిన అవసరం లేదు అని ప్రైవేట్ విద్యాసంస్థలు చేస్తున్న ప్రచారం వల్లనే ఇటువంటి పరిస్థితులు ఏర్పాడుతున్నాయనే విషయం స్పష్టంగా తెలుస్తుంది. విద్యార్థికి విద్య ఎంత అవసరమో, పరీక్ష కూడా అంతే అవసరం. కానీ ఆ పరీక్ష మార్కుల కోసమే అయినప్పుడు, ఇంతకంటే దుర్భర పరిస్థితులు రాబోయే రోజుల్లో సమాజం ఎదుర్కొంటుందన్న అభిప్రాయాన్ని ఈ కథ ద్వారా రచయిత వ్యక్తీకరిస్తున్నాడు.

రచయిత 'సింగమనేని నారాయణ'. ఇది. 1993లో వచ్చిన కథ. ఈ కథానికలో అసమానతలతో కూడిన భారతీయ విద్యావిధానం ప్రతిఫలిస్తుంది. విద్యార్థుల్లో అసమానతా భావాన్ని, పాఠశాలలో ధనికులు, పేదలు అందరూ ఒకటే అని చెప్పడానికి పాఠశాలల్లో యూనిఫాం ప్రవేశపెట్టింది. మనదేశంలో యూనిఫాం కుట్టుకోవడానికి కూడా స్తోమత లేని కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. అలా యూనిఫాం కుట్టివ్వలేక, యూనిఫాం లేదని ఉపాధ్యాయులు కొడుకును స్కూలు నుంచి కొట్టి తరిమేస్తే తల్లిదండ్రులు పడ్డ వేదనని చిత్రించిన కథయిది.

వేషం:

ప్రైవేట్ వ్యక్తులకు బంగారు బాతుగా తయారవుతున్న నేటి కాన్వెంట్ చదువులకు ఈ కథలో ఆ తల్లి వేసిన ప్రశ్న ఒక సవాల్. "మేమేదో తిండికి గతిలేని వాళ్లం. ఏదో నాలుగు ముక్కలు చదువుకుంటాడని బడికి పంపిస్తే మీరు కోరిన బట్టలు మేము యాడ తెస్తుమయ్య? అవునయ్య నాకు తెలీక అడుగుతున్నాను మీరు చదువులు చెప్పేది పిల్లవాడికే గదయ్యా డ్రస్సుకు కాదుగదా" (నారాయణ. సింగమనేని., – వేషం – సింగమనేని కథలు – పుట:361) అనటం సమాజాన్ని ఆలోచింపజేస్తుంది.

పాఠశాలలో యూనిఫాం అనేది సమానత్వానికి సూచనే అయినా ఎన్నో కుటుంబాలు యూనిఫాం కూడా కుట్టించలేని దయనీయ స్థితిలో ఉన్నాయన్న విషయాన్ని రచయిత చిత్రించాడు. తమ బిడ్డలకు చదువు చెప్పించాలన్న కొండంత ఆశతో ఈ రోజు ఎన్నో కుటుంబాలు విద్యార్థుల భవిష్యత్ కోసం అప్పుల్లో మునిగిపోవడటం మన కళ్ళ ముందున్న విషయం. కాన్వెంట్ చదువుల్లో యూనిఫాం కూడా సామాన్యుడు కొనలేని దశలో నుండి కుటుంబాలను ఆవేదనకు గురి చేస్తున్న విషయాలను రచయిత ఆ కుటుంబాల పక్షం వహించి ఆవేదన వ్యక్తం చేయటం ఈ కథ ద్వారా తెలుస్తుంది.

విలోమం:

రచయిత 'చిలుకూరి దేవపుత్ర'. కులాంతర, వర్ణాంతర వివాహం చేసుకున్న దంపతుల వృత్తాంతం ఈ కథానికలో ప్రధానాంశం. తండ్రి తన కొడుకు చదువుకోవడం కోసం తాను ఓసి అయిన, తన భార్య యస్.సి. అయినా తన కొడుకుని మాత్రం పాఠశాల రికార్డుల్లో యస్.సి. గానే రాయించాడు. దానితో పాఠశాల వారు తన కొడుకుకి ఉచిత బట్టలు, పుస్తకాలు ఇచ్చారు. ఆ విషయం అడగటానికి తల్లి పాఠశాలకు వెళ్ళినప్పుడు తన భర్త చేసిన నిర్వాకం తెలుస్తుంది. దానితో ఆమె చాలా ఆందోళన చెందుతుంది.

"ఈ బట్టలూ, పుస్తకాలు లేని పిల్లవాడికి ఇవ్వండి, పొరపాట్న మా వాడికి ఇచ్చారు" అన్నాను. "మేము పొరపాటు పడలేదమ్మా! – మీ పిల్లవాడు ఎస్సీ కాబట్టి వాడికోటాకు వచ్చిన పుస్తకాలూ, బట్టలూ ఇచ్చాము"

(దేవపుత్ర. చిలుకూరి., విలోమం – ఆరుగ్లాసులు – పుట:109) అంది హెడ్మిస్ట్రెస్. వాడు 'ఎస్సీ' అని ఎవరు చెప్పారు. వాళ్ళనాన్నే రాయించారు అప్లికేషన్‌లో ఎస్సీ అని అందామె. ఈమెకు విషయామంత అర్థమయింది.

ఓ.సి. అవడం వల్ల ఉద్యోగం త్వరగా రాకపోవడం వల్ల ఒక తండ్రి తన కొడుకు తనలా ఇబ్బందులు పడకూడదని యస్.సి. అని భార్య కులాన్ని రాయిస్తాడు. అలా రాయించడం వల్ల ఉచితంగా పుస్తకాలు, బట్టలు, రిజ్వరేషన్‌లు ఇంకా ప్రభుత్వ ఉద్యోగాలు త్వరగా వచ్చే అవకాశం ఉందని తన కొడుకు అడ్మిషన్ అప్లికేషన్‌లో యస్.సి. అని రాయించడం వెనుక ఉద్దేశం.

ఈ కథలో ముఖ్యంగా రెండు కులాల మధ్య విద్యావకాశాలు ఎలా ఉన్నాయో చెప్పడం. తండ్రి ఓ.సి. అయి పడిన కష్టాలు తమ పిల్లలు పడకూడదు అని తన భార్య యస్.సి. కనుక తన కులం రాయిస్తే విద్య, ఉద్యోగావ కాశాలు పొందవచ్చన్నది భర్త ఉద్దేశం. కొడుకుకి తండ్రి కులం రాయించడం మన సంప్రదాయం. కాని ఈ కథలో తల్లి కులం రాయించడం వెనుక ఓ.సీ.ల్లో కూడా వెనుకబడిన వారున్నారని తెలియజేయటం. కింది కులాల్లోని వెనుకబాటు తనాన్ని పొగొట్టటానికి ప్రభుత్వం కల్పించే అవకాశాలు తెలియజేయటం రచయిత సూచిస్తున్నట్టుగా కనిపిస్తుంది.

బలిపశువులు :

రచయిత 'శాంతి నారాయణ'. ఇది 2000లో వచ్చిన కథానిక. ఇంటర్ మీడియట్ స్పాట్ వాల్యుయేషన్‌లో జరిగిన తప్పు వలన ఒక యువకుడి జీవితం ఏ విధంగా బలైందో ఈ కథానిక సూచిస్తుంది.

సతీష్ అనే యువకుడు ఎంసెట్‌లో పదో ర్యాంకు సాధించాడు. ఆ విషయం గురువులకు, తల్లిదండ్రులకు, బంధువులకు స్నేహితులకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది. "ఈ పేపర్ కరెక్షన్ చూస్తూ ఉంటే పిల్లలు, ర్యాంకుల మాట అటుంచి అనలు పానయ్యే అదృష్టానికి కూడా నోచుకుంటారో లేదోననిపిస్తూ ఉంది" (శాంతి నారాయణ – బలిపశువులు – తెలుగు కథ (2000) – పుట:193) అన్నాడు ఒకాతను. ఒకరోజు ఇంటర్ పరీక్ష ఫలితాలు వచ్చాయి. ఆ యువకుడి నెంబరు న్యూస్ పేపర్లో కనిపించక పోయే సరిక అందరూ ఆందోళనలో పడ్డారు. ఆ యువకుడి తల్లిదండ్రుల బాధను చూడలేక, అవమానం భరించలేక నిద్రమాత్రలు వేసుకొని జీవితాన్ని చాలించుకున్నాడు ఆ యువకుడు.

తమ కంటి వెలుగైన కొడుకు అర్ధాంతరంగా జీవితాన్ని చాలించి తమకు అన్యాయం చేసాడు. ఎంతో గొప్పగా చదివే తన కొడుకు ఫైయిల్ అవ్వడం ఏమిటి?ఎక్కడో అన్యాయం జరిగిందని గుర్తిస్తాడు. తమకు జరిగిన ఈ అన్యాయం గురించి ఎవరికి చెప్పలేక తానే కుంగిపోతాడు తండ్రి. స్పాట్ వాల్యుయేషన్ పేపర్ కరెక్షన్ చేసే వారికి ఒత్తిడులు ఎక్కువై ఎలాపడితే అలా కరెక్షన్ చేయడం వల్ల ఈ అనార్థాలు జరుగుతున్నాయనటం వాస్తవ విషయం.

సతీష్ తండ్రి "ర్యాంకు వస్తుందనుకున్న తన కొడుకు ఎందుకు ఫేలయ్యాడు? వాడు నిజంగా పరీక్షలు సరిగా రాయలేకపోయాడా? తన కొడుకు ఫెల్ కావడానికి కారకులు ఎవరు? లెక్చరర్ల చేత రోజుకు యాభై అరవై పేపర్లు కరెక్షన్ చేయించడం డైరెక్టర్ విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం కాదా? అటువంటి అధికారుల దుర్మార్గాలను గమనించకపోవడం ప్రభుత్వ వైఫల్యం కాదా? వీళ్ళందరూ తన కొడుకు మరణానికి కారకులు కారా?" (శాంతి నారాయణ – బలిపశువులు – తెలుగు కథ (2000) పు.194) ఇలా ఇంకా ఎన్నో ప్రశ్నలకు సమాధానం కోరుకున్నాడు. ఈ ప్రశ్నలకు సమాజంగాని, ప్రభుత్వంగాని సమాధానం ఇవ్వవని తెలుసు.

తన కొడుకు మరణానికి కారకులైన వారెవరో తేల్చుకోవాలనుకున్నాడతను. కానీ ఎవరు శిక్షార్హులని తేల్చకపోతే అధికారుల నిర్లక్ష్యానికి అవధులుంటాయా? వాళ్ల

నిర్లక్ష్యం అలాగే కొనసాగితే ఎన్ని ఉజ్వల జీవితాలు ఆరిపోతాయి? అని ఆవేదన చెందాడు.

ఒక సంవత్సరమంతా కష్టపడి చదివి భవిష్యత్ పై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఎందరో విద్యార్థులకు సతీష్ నిదర్శనం. అలాగే కొడుకు భవిష్యత్‌ని తమలో చూసుకుంటున్న ఎంతో మంది తల్లిదండ్రుల ఆవేదనని ఈ కథ చిత్రించింది. ఎన్ని పేపర్లు దిద్దితే అంత డబ్బు వస్తుందన్న ఆశ ఒక వైపైతే, మరోవైపు తనకున్న వ్యక్తిగత సమస్యలతో ఉద్వేగాలకులోనై పేపర్ వ్యాల్యూషన్ చేసి ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్‌ని కాలరాస్తున్న ఉపాధ్యాయుల తీరుని కూడ రచయిత చిత్రించాడు. ఇది భావి భారత పౌరుల భవిష్యత్‌కి ఒక పెనుముప్పని రచయిత ఆవేదన వ్యక్తం చేస్తాడు.

చదువు:

రచయిత 'చల్లపల్లి స్వరూపరాణి'. ఇది '2000'లో వచ్చిన కథ. ఈ కథలో 'మణి' ఒక పాలేరు కూతురు. ఈమెకు అక్షర జ్ఞానం లేదు. చిన్నతనంలోనే భర్త చనిపోవడంతో తాను, తన కూతురితో కలిసి తన తల్లిదండ్రుల దగ్గరకు వచ్చేస్తుంది. ఆ ఊరిలోని దొర ఆమెను ఎలక్షన్‌లో నిలబెడతాను అన్నాడు. అప్పుడు మణి "అదేంటి దొరా! నాకా అచ్చరం ముక్కరాదు, నేనెట్టా పెసిరెంటునవుతాను...?" (స్వరూపరాణి, చల్లపల్లి – చదువు – తెలుగుకథ (2000) –పుట:107) సర్పంచ్‌ని చేస్తాడు. పేరుకు సర్పంచ్ మణి, కానీ పైతనం అంతా ఆ దొరదే. ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ వేలి ముద్ర వేసేది. దొర సర్పంచ్ అధికారాల్ని దుర్వినియోగం చేస్తూ ఎన్నో రకాలుగా డబ్బు సంపాదించి ధనవంతుడవుతాడు. కానీ ప్రజల డబ్బంతా సర్పంచ్ తిన్నట్లు ప్రభుత్వం నమ్మి మణిని పోలీసులు అరెస్ట్ చేస్తారు. మణి అవినీతి చేసిందని అందరూ నమ్ముతారు. కానీ దాని వెనుక దాగి వున్న అసలు దోషి దొర అని ఎవరికి తెలియదు.

ఆడవాళ్లకి అధికారంతోపాటు చదువు కూడా అవసరం. కనీసం తమ సంతకం కూడా చేయలేని స్త్రీలు ఎందరో ఉన్నారు. చదవడం, రాయడం నేర్చుకోవాలని వయోజన విద్య, రాత్రి పాఠశాల పెట్టడం వంటి కార్యక్రమాలు జరుగుతున్న కానీ ప్రజలలో ఎలాంటి మార్పురాలేదు. ప్రజలు మారి అన్యాయం చేస్తున్న ఈ దొరల్లాంటి ఎంతో మంది అవినీతిపరులకు బుద్ధి చెప్పే వరకు ఈ దేశం మారదు.

చదువులేని ఒక స్త్రీ ప్రెసిడెంట్, నకిలి ప్రెసిడెంట్ అయిన ఒక పురుషుని చేతిలో ఏ విధంగా దోపిడీ చేయబడుతున్నదో తెలియజేప్పే కథ చదువు. స్త్రీలకు, అన్ని కులాలకు అధికారం దక్కాలన్న ఎన్నో ఆశయాలతో రాజ్యాంగం కల్పించిన ఇటువంటి అవకాశాలను కొంతమంది దొరల్లాంటి వారు ఆ అవకాశాలను వారికి దక్కకుండా అధికార దోపిడీ చేయటం చరిత్రలో ఉంది.

నిరక్షరాస్యులయిన స్త్రీలు, వెనుకబడిన కిందిబడిన కింది కులాలవారి అమాయకత్వాన్ని అవకాశవాదంగా చేసుకొని అధికార దోపిడీ చేస్తున్న దొరలు, ఇతర పెద్దలు అధికార దాహానికి బలవుతున్న ఎంతోమంది అమాయకుల జీవితాలను సూచనప్రాయం చేసి చిత్రించిన చల్లపల్లి స్వరూపరాణి కథే చదువు.

"నాకేమి తెలవదుసారు.... నాకు చదువురాదు.... మా దొర ఎక్కడ ఏలు ముద్రలు ఎయ్యమంటే అక్కడ ఏలుముద్రక ఏశాను సారూ...! అని ఆమె ఎంత చెప్పిన వినలేదు. దొరగడ్డి తినమంటే తింటావా.... చదువూ సంద్యాలేని నీ మొహానికి పదవులు కావల్సి వచ్చినాయా....." (స్వరూపరాణి. చల్లపల్లి., – చదువు – తెలుగు కథ (2000) –పుట.108) అని యిష్టమెచ్చినట్టు తిట్టారు.

ముగింపు:

విద్యా వ్యవస్థ నానాటికి దిగజారిపోతున్నది. నాణ్యమైన విద్య ప్రతి ఒక్కరికి అందించాల్సిన ప్రభుత్వం విద్యను

ప్రైవేట్‌పరం చేసి చేతులెత్తెయటం సమాజానికి ప్రమాదం. ప్రైవేట్ విద్యా విధానం సామాన్య కుటుంబాలను, మధ్యతరగతి కుటుంబాలలో వున్న విద్యాతృష్ణని వ్యాపారంగా మలచుకుంటుంది. తద్వారా పేదవాడు విద్యకోసం మరింత పేదవాడిగా తయారవుతున్నాడు. భవిష్యత్ ఎలా ఉంటుందో తెలియని చదువులు చదువుతున్న ఎంతోమంది యువకులు నిరుద్యోగులవుతున్నారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్ కోసం అప్పులు చేస్తూనే, అవసరమైతే పరీక్షలు కాపీ కొట్టిస్తూ దోషులుగా మారుతున్నారు. మమ్మీ డాడీ అనిపించుకోవాలనే ఆశతో తల్లి భాషకు ద్రోహం చేస్తున్నారు.

ఆంగ్ల విద్యనే ఉన్నత విద్యగా భావించి ప్రైవేట్ విద్యాసంస్థల వ్యాపారుల చేతిలో కీలుబొమ్మలవుతున్నారు ప్రజలు. సంస్కారం లేని పాశ్చాత్య సంస్కృతికి మొగ్గుచూపుతూ మన సంస్కృతీ సంప్రదాయాలకు నీళ్ళు వదిలేస్తున్నారు. రాజ్యాంగం కల్పించిన అధికారాన్ని చేజిక్కించుకుంటున్నామనే భ్రమతో నిరక్షరాస్యులైన అమాయకులు దొరల అధికార దాహానికి బలవుతున్నారు. చదువుకున్న అమాయకులు ఫ్యాక్షన్ గొడవల్లో పడి నలిగిపోతున్నారు. ప్రభుత్వం త్వరపడి విద్యని ప్రైవేట్ యంత్రాంగం నుండి పూర్తిగా చేజిక్కించుకొని యువతలోని శక్తి సామర్థ్యాలన్ని, నైపుణ్యాల్ని పెంచితేగానీ భారతదేశ ప్రగతి ముందుకు సాగదని, యవతకు బంగారు భవిత సాధ్యం కాదని రచయితల అంతరంగం.

ఉపయుక్త గ్రంథ సూచి:

1. నారాయణ. సింగమనేని., – సింగమనేని కథలు – శ్రీవేదగిరి కమ్యూనికేషన్స్, హైదరాబాదు – 2012.
2. దేవపుత్ర. చిలుకూరి., – ఆరుగ్లాసులు – ప్రియదర్శిని ప్రచురణలు, హైదరాబాదు – 2016.
3. గోపి. ఎన్.–తెలుగు కథ 2000 – పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ – 2001.
4. నవీన్. వాసిరెడ్డి., – పాతికేళ్లకథ (1990–2014) – మనసు పౌండేషన్, హైదరాబాద్, జనవరి – 2016.

ప్రాచీన సాహిత్యం చదవాలా? ఎందుకు?

డా॥ పి.ఎ. సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ కళాశాల (అటానమస్), రాజమహేంద్రవరం,
సెల్ : 9492566950

మధ్యయుగంలోని భాష, భావజాలం ఇప్పుడు పాతబడిపోయి, పాడుపడిపోయి పనికి రాకుండా పోతుంది. దాని భావజాలమయితే ప్రజాస్వామయుగంలో రాజ్యాంగ విలువల వెలుగులో అపరాధిలా తలదించుకుంటుంది.

దాని భాష కాలాంతరంలో పరాయిదైపోతుంది. మచ్చిక చేసుకోవాలంటే దాన్ని పరాయి భాష అధ్యయనంలో ప్రత్యేకంగా అధ్యయనం చేయాల్సిఉంటుంది.

మూల భాషనుంచి వేరు వేరు భాషలు పుట్టడానికి ప్రాదేశికపరమైన దూరమేకాదు, భూతానికి, వర్తమానానికి మధ్య నిడివి కూడా కారణం అవుతుంది. అంటే ఒక భాష నుండి వేరువేరు భాషలు పుట్టడానికి సీమాసమయాలు రెండూ కారణమవుతాయన్నమాట.

ఒక భాషకాలాంతరంలో ఆ భాష కాకుండా పోతుంది. భాష పరిణామశీలం కలిగినది. నదిలో పాతనీరు కొట్టుకుపోయి కొత్తనీరు వచ్చినట్టుగా అదే నది కాని నీరు దానిది కాదు, అదే భాష కానీ పదజాలం నిర్మాణం దానిది కాదు. అంటే అదే నది కానీ ఆ నది కాదు. అదే భాష కానీ ఆ భాష కాదు.

పాత కాలపు భాషను వారసత్వంగా గల ప్రజలకు, కాలం గడిచినకొద్దీ దానితో పరిచయం తగ్గిపోయి, చివరకి అది వాళ్ళకు అపరిచితం అయిపోయింది. ఈ ప్రాచీన భాషకు దాని సాంస్కృతిక వారసులకు మధ్య సమకాలీన అడ్డు తెర అవుతుంది.

పాత కాలపు భాషాసాహిత్యాలు ఆధునికులకు పరాయి భాషాసాహిత్యాలవుతున్నాయి. నూత్న జనానికి నూత్న జీవజీవాలు కావాలి. అరిగిపోయిన కాలం చెల్లిన భాషా, భావ, సామాగ్రిని నూత్న కాలపు భోగిమంటల్లో పారేయాల్సిందే!

పరిణామాన్ని సింహావలోకనం చేయడానికి చరిత్రగా దాన్ని మూలనపెట్టి భద్రపరచాల్సిఉంటుంది. కాని దాన్ని సాంస్కృతిక వైభవ చిహ్నంగా నెత్తికెక్కించుకోవడం, అంటే ప్రగతిశీలపథం నుంచి పక్కకు తప్పుకున్నట్టే పైగా తిరోగమించినట్టు కూడా !

రచనను పొరలుగావింగడించి చూస్తే భాష, భావ జాలం, రచనా చట్రాలు, ఊహలు, భావాలు శైలి, శిల్పాలు, పాత్ర నేపథ్యం, సన్నివేశ చిత్రణలు వగైరా కనిపిస్తాయి.

కావ్య ప్రపంచానికి కవే ప్రజాపతి కాబట్టి కావ్యంలో కవి ఆడింది ఆట, పాడింది పాట అవుతుంది. కావ్య నిమ్నోన్నతాలను నిర్ధారణ ఎంత వస్తుగతమో అంత వ్యక్తిగతం. మరీ మాటాడితే పూర్తి వైయక్తికం. కావ్య ఉన్నతి దాని సమకాలీన ప్రాబల్య శక్తుల నిర్ణయానికి లోబడి ఉంటుంది.

అంటే భాష, సాహిత్యం దాని వస్తువు, అభివ్యక్తి వాటి కాలపు సమాజ స్వభావానికి అనుకూలంగా మారిపోతాయన్న మాట. ఒక నాటిభాషా సాహిత్యాలు, వాటి ప్రాధమ్యాలు ఆనాటి సమాజాన్ని ప్రతిబింబిస్తాయి.

ఎడ్లబండి నుండి విమానం దాకా, నియంతృత్వ వవస్థ నుంచి ప్రజాస్వామ్య వవస్థదాకా, ఆటవికతనుంచి ఆధునికత దాకా సమాజ రూపురేఖలు, భావజాలం, సిద్ధాంతాలు మారుతూవస్తున్నాయి.

నాటి తాతగోచీ నేటి మనుమడికి మప్పదు. ఫాంటు, సూటు బూటు ఇవాళటి ఆహార్యం. పాత ఆహార పద్ధతి, నేటికి నిషిద్ధం. పాడిన పాటే పాడే పాతకాలపు పాచి పళ్ళ దాసరి అనుకరణలు, పరాధీనతలు, అప్సరసల చక్రవర్తుల ఊడిగాల పోకడలు ఇప్పుడు నిషేధం.

వస్తువు దానికి తగిన భాషను వెతుక్కుంటుంది. అభివ్యక్తి దానికి సరివడే వస్తువైశాల్యాన్ని పొదివి పట్టుకుంటుంది. వస్తువు, అభివ్యక్తి తమ ఈడూ జోడుల్ని ఆవాహన చేసుకుంటాయి.

అంటే సమాజ స్వభావం దాని వస్తువును నిర్ణయిస్తే, వస్తువు దాని అభివ్యక్తిని నిర్ణయిస్తుంది. నది ఉదృతి,నది ఆకృతిని మలచినట్టుగా అన్నమాట.

కాలాంతరంలో ఒక ప్రాదేశిక సమాజపు భౌతిక రూపురేఖలతో పాటు, దాని మౌలిక స్వభావం కూడా మారి తీరుతుంది. స్వభావం మారితే స్వరూపమూ మారుతుంది.

ప్రాంతాన్నిబట్టి, ప్రదేశాన్ని బట్టి, సన్నివేశాన్ని బట్టి ఉ డుపులు మారినంత సహజంగా సమాజ స్వభావ స్వరూపాలు మారతాయి. బలవంతులు బలహీనుల మధ్య అసమానతలు, పీడకుడు, పీడితుల మధ్య తేడాలు రోజురోజుకీ తగ్గుముఖం పట్టడమే ఇవాళ ప్రగతి. మత్స్యన్యాయం ఒకప్పటి ఆటవికత స్వభావం అయితే, హక్కులు, బాధ్యతల సమతూకం ఇప్పటి ఆధునికత స్వభావం.

అంటే ఒక ప్రదేశంలోనే ఒకప్పటి సమాజం వేరు, ఇప్పటి సమాజం వేరన్నమాట, ఒక సమాజం దాని స్వభావాన్ని మార్చుకుంటే అది మరొకటి అవుతుంది.

సమాజ స్వభావం దాని వస్త్వభివ్యక్తులు ఒకే గూటికి చెంది ఉంటాయి.

ఆధునిక సమాజాల్లో ముగ్ధ, ముసలి మొగుణ్ణి కట్టుకుంటే విడ్డూరం, వైపరీత్యం. పాతతిత్తిని కొత్త ద్రాక్షరసం పెకల్చివేస్తుంది.

కొత్త వస్తువుకు పాత అభివ్యక్తి బొత్తిగా పనికిరాదు. కుంటి ఎద్దును మంచి ఎద్దుతో కాడికడితే సమతూకం, సామరస్యం దెబ్బతింటాయి.

అదేవిధంగా పాత వస్తువుకు కొత్త అభివ్యక్తి అసలే పొసగదు. ముసలి హీరోకి మేకప్ వేసినట్టు ఉంటుంది.

కొంతమంది ఇరవైలలో అరవైల వాళ్ళు పాత వస్తువుకు పాత అభివ్యక్తితో జమలీ వేసి కొత్త వేదిక మీద పానకంలో పుడకల్లా కనపడతారు.

పాతకాలపు బానిస సంస్కారం నిబిడీకృతంగా ఉన్న సమాజాల్లో వాళ్ళు ఆదరణ పొందుతారు.

అయినా పంచెకట్టుపైన కోటు వేసుకునే వాళ్ళ ఎబ్బెట్టు విదూషకత్వం ఎగతాళి చేయబడుతుంది.

చాదస్తానికి ఆధునికత మరణశయ్యే మరి. అంటే సంప్రదాయ సమాజపు వస్తువు ఆధునిక సమాజానికి, దాని అభివ్యక్తికి, పనికి మాలినవి అవుతాయన్నమాట.

అలాగే ఆధునిక సమాజపు వస్తువు సంప్రదాయ సమాజానికి మింగుడు పడక రాళ్ళతో కొట్టబడుతుంది. సిలువేయబడుతుంది. విషం తాగి చావాలనిపిస్తుంది.

పాత కాలపు ఉడుపులు నేటి కాలపు వ్యక్తి వల్ల ఉ పేక్షించబడతాయి. సంప్రదాయ సమాజానికి ఆధునిక వస్తువు అతిక్రమణలా అనిపిస్తుంది.

వస్తుపరంగానయినా, అభివ్యక్తిపరంగానయినా సంప్రదాయ ఆధునికతల మధ్య పరస్పర వికర్షణ వాటి మౌలిక స్వభావం. కాలాంతరంలో ఒక ప్రాదేశిక నియతిలోని సమాజం దాని స్వభావాన్ని అదే మార్చుకుంటుంది. స్వభావం స్వరూపాన్ని నిర్దేశిస్తుంది. ఇక్కడి స్వభావం అంటే సాహిత్యపరంగా వస్తువు, స్వరూపమంటే దాని అభివ్యక్తి.

అంటే మారే కాలాన్ననుసరించి సమాజ స్వభావం దానితో పాటు దాని భౌతికస్వరూపం కూడా మారుతుంది. అదే సాహిత్యంలో వస్తుపరంగా, అభివ్యక్తి పరంగా ప్రతిఫలిస్తుంది.

అంటే ఒకజాతి మార్చుకున్న తన వేషభాషలు దాని స్వరూపాన్ని నిర్దేశించినట్టుగా, దాని భావజాలం దానిగతినీ, ప్రగతిని నిర్ధారిస్తుంది. అదే ఆ జాతి సాహిత్యంలో ప్రతిఫలిస్తుంది.

ఇంతకీ, వస్తువుకీ, అభివ్యక్తికీ ఈడూ జోడూ కుదరాలని, ఈడు జోడుకు గీటురాయి సమకాలీనతేనని, ఓల్డు గోల్డు కాదని, పాత, రోతని, అడుగడుగునా మార్పే మైలు రాయిగా, మజిలీగా అవిచ్ఛన్నంగా కొనసాగుతుందనీ, పాత, కొత్తకు పునాది కాదని కాబోదనీ, పాత కొత్తకు పూర్వ పక్షం మాత్రమేనని, పాత, కొత్తకు పనికి రాదని, వస్తు, అభివ్యక్తి, భాషాపరిణామాలకు పరస్పర విరుద్ధ శక్తుల సంఘర్షణేనని తెలుస్తుంది. పరస్పర విరుద్ధ శక్తుల మధ్య పరస్పర ప్రభావం ఉండదని ఉండబోదని పోరాటం మాత్రమే ఉంటుందని నొక్కివక్కాణించడం ఆవశ్యం.

ప్రభావం కనిపించింది అంటే అదిచర్విత చర్వణం అన్నమాట. ఒకగూటి పిట్టలన్నమాట.

పాత కాలపు సాహిత్యం పాత కాలపు సమాజాన్ని దాని స్వభావాన్ని దాన్ని ప్రతిబింబించిన దాని సాహిత్య వస్తువును, అభివ్యక్తిని, పరిణామ దృక్కోణంలో చూడటానికి మాత్రమే పనికి వస్తుందని, పాత వస్తువు కొత్త అభివ్యక్తితో కొత్తవస్తువుకు పాత అభివ్యక్తితో జోడీ అసంబద్ధం అసహ్యం అని ఘంటాపథంగా చెప్పవచ్చు.

ఆధార గ్రంధాలు:

1. ఒక వస్తువు భిన్న సందర్భాలు – డా॥ పి.ఎ. సత్యనారాయణ
2. ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం – ఆచార్య కొలకలూరి ఇవాక్
3. ఆధునికాంధ్రకవిత్వము సంప్రదాయములు – ప్రయోగములు – డా॥సి.నారాయణరెడ్డి

'వందేళ్ల కథకు వందనాలు' కథలు – శిల్ప వైవిధ్యం

ముళ్ళా పెంచల ప్రసాద్, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.
చరవాణి: 9493913181

కథ ఎప్పుడు పుట్టింది? ఎలా ప్రాచుర్యాన్ని పొందింది? అని ప్రశ్నించుకుంటే సమాధానం కొంత అస్పష్టంగా వినిపిస్తుంది. ఎందుకంటే తెలుగు సాహిత్యంలో కథా ప్రక్రియ నిన్న మొన్న రూపుదిద్దుకున్నది కాదు. దానికి కొన్ని వేల సంవత్సరాల చరిత్ర ఉంది. మానవుని పుట్టుకతోపాటే కథా ప్రక్రియ ఆవిర్భవించి ఉంటుందని అనేక మంది కథా విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. కథ ఆవిర్భావాన్ని గురించి పేర్కొంటూ ముదిగంటి సుజాత రెడ్డి తన 'సంస్కృత సాహిత్య చరిత్ర' గ్రంథంలో 'మానవుని మస్తిష్కంలో కథ ఉద్భవం ఎప్పుడు జరిగిందో చెప్పడం కష్టం. మానవుని భాష ఎంత ప్రాచీనమైనదో కథ కూడా అంతే ప్రాచీనమైనదని పేర్కొంటుంది. మానవుడు మాటలు నేర్చిన నాటి నుంచే తన తోటి వారికి, తనకంటే చిన్నవారికి తన అనుభూతులను, అనుభవాలను, తాను చూసిన వింతలను, అద్భుత సంఘటనలను వివరించి చెప్పడం ప్రారంభించి ఉంటాడు. బహుశా అదే 'కథ' ప్రక్రియకు నాంది పలికి ఉంటుంది' అని అంటారు.

కథకు, మానవ జీవితానికి అవినాభావ సంబంధం ఉంది. కాబట్టే మానవుని నిజ జీవితంలో తరచుగా కథా ప్రస్తావన వినిపిస్తుంటుంది. ఎవరైనా వ్యక్తి మనకు ఎదురువడి ఏదో కొత్త విషయాన్ని చెప్పడానికి ప్రయత్నిస్తున్నా డనుకోండి. వెంటనే మనం 'ఏంటి కథ' అని ప్రశ్నిస్తాం. అలాగే చెప్పాల్సిన విషయాన్ని చెప్పకుండా ఏదేదో మాట్లాడుతుంటే 'దొంకతిరుగుడు లేకుండా కథేంటో చెప్పు' అంటాం. ఎదుటి వ్యక్తి మనపై లేనిపోని అపోహలను కల్పించి చెబుతున్న సందర్భంలో 'వాడన్నీ కథలు చెబుతున్నాడు. నమ్మొద్దు' అంటాం. ఇలా మానవుని జీవితంలో వివిధ సందర్భాలలో కథ గురించిన ప్రస్తావనను చూడొచ్చు. వీటన్నింటి సారాంశాన్ని పరిశీలించినప్పుడు కల్పించి చెప్పేదే కథ అన్న విషయం స్పష్టమౌతుంది.

అయితే నేడు సాహిత్య ప్రక్రియగా విరాజిల్లుతున్న కథకు, తొలినాళ్ళ నుండి మానవ జీవితంలో అంతర్భాగంగా కొనసాగుతూ వస్తున్న కథకు కొన్ని సామ్యాలు ఉన్నప్పటికీ రెండూ దేనికవే ప్రత్యేకమైనవిగా దర్శనమిస్తాయి. ఆధునిక సాహిత్యంలో విస్తృత ప్రాచుర్యం పొందిన నేటి కథ లేదా కథానిక ప్రక్రియ ఆంగ్లభాషా ప్రభావంతో తెలుగులోకి వచ్చి స్థిరపడింది. ఆంగ్లంలో 'షార్ట్ స్టోరీ' అనే పదానికి సమానార్థకంగా తెలుగులో 'కథ లేదా కథానిక' అనే పదాన్ని నేడు మనం వాడుతున్నాం. సృజనాత్మకమైన వచన సాహిత్య ప్రక్రియల్లో కథానిక ప్రక్రియ క్లిష్టమైనదంటారు ప్రఖ్యాత రచయిత హెచ్.ఇ.బేట్స్. అయితే ఈ కథానిక ప్రక్రియ నానాటికి కొత్త పుంతలు తొక్కుతుంది. సామాజిక చైతన్యాన్ని, ప్రాంతీయ మూలాలను, మానవుని జీవన వాస్తవికతల్ని అనేక పార్శ్వాలుగా ఆవిష్కరిస్తూ, వస్తుపరంగానే కాకుండా, రూప పరంగా కూడా నానాటికీ ముందుకు సాగిపోతుందీ ప్రక్రియ. ఎంతో మంది కథకులు సామాజిక సమస్యలను ఊతంగా చేసుకొని కథలు రాసి పాఠకుల అభిమానాన్ని, ఆదరణను పొందారు, ఇంకా పొందుతున్నారు కూడాను.

ఇంతటి విశేష ప్రజాదరణ పొందిన కథా ప్రక్రియకు వస్తు, రూపాలు రెండు కళ్ళని చెప్పవచ్చు. రచయిత ఏం చెబుతున్నాడన్నది వస్తువైతే, ఎలా చెబుతున్నాడన్నది రూపం లేదా శిల్పం. ఉత్తమ కథకు వస్తువూ, శిల్పం రెండూ అభిలషణీయమైనవే. అయితే శిల్పం ఖచ్చితంగా ఇలానే ఉంటుందని నిర్ణయించలేము. ఇట్టి శిల్ప విశిష్టతను గురించి పేర్కొంటూ పోరంకి దక్షిణామూర్తి తన కథానికా స్వరూప స్వభావాలు గ్రంథంలో "కథానికా శిల్పమనేది వస్తువుతో

ముడిపడి ఉన్నదే కానీ ప్రత్యేకమై అస్థిత్వమున్నది కాదు. ఒకే వస్తువును నలుగురు రచయితలు నాలుగు విధాలుగా దర్శించవచ్చు. ఇలా దర్శించడంలోని భిన్నత్వాల వల్ల వస్తు, శిల్ప విచక్షణ భావమేర్పడుతుంది" అంటాడు. దీనిని బట్టీ కథానికా శిల్పమంటే దర్శన వైశిష్ట్యమేనన్న విషయం స్పష్టమౌతుంది. ఈ దర్శన వైశిష్ట్యాన్నే రచనా శిల్పం అని కూడా పిలువవచ్చు. కథానికా శిల్ప వర్గీకరణలో భాగంగా పోరంకి దక్షిణామూర్తి రచనా శిల్పాన్ని వస్తువిన్యాస శిల్పం, పాత్రచిత్రణ శిల్పం, సంఘటనఘటనా శిల్పం, సంఘర్ష ణోత్పాదన శిల్పం, సన్నివేశకల్పనా శిల్పం, కథనశిల్పం, వర్ణనాశిల్పం, శీర్షికాశిల్పాలుగా విభజించారు. వందేళ్ల కథకు వందనాలు కథా సంకలనంలోని కథల్లో ఇట్టి శిల్ప విశేషాలను ఒకసారి గమనిద్దాం.

వస్తువిన్యాస శిల్పం:

కథకుడు తానెన్నుకున్న కథా వస్తువును ప్రణాళికా బద్ధంగా రూపొందించుకొని, కథకు నిర్మాణ సౌష్టవాన్ని, భావ సౌందర్యాన్ని ఏర్పరచుకొనే తీరును వస్తువిన్యాస శిల్పంగా పేర్కొనవచ్చు. ఇది కథలో ఎత్తుగడ మొదలుకొని వర్ణనలు, నడక, విషమ పరిస్థితి, ముగింపుల వరకు మూలభావాన్ని అంతర్లీనంగా గుర్తుచేస్తుంటుంది. ఉదాహరణకు

కాలువ మల్లయ్య రాసిన 'అమ్మ మీది సొమ్ములు' కథలో రాఘవా, సరోజాలు తమ తల్లి ఒంటిపైగల బంగారు ఆభరణాలకోసం కథ ప్రారంభం నుండి ప్రయత్నాలు చేయడం ప్రారంభిస్తారు. సరోజ అయితే తల్లి ఆరోగ్యం సరిగా లేదని తెలుసుకొని చూడటానికి వస్తూ పండ్లు కొని తెచ్చి, వాటిని తినిపిస్తూ "అమ్మా! నువ్వు త్వరలోనే చనిపోవడం ఖాయం. ఏం బతికినా కొన్ని రోజులో... మహా అయితే నెలలో...! మంచంలో పడున్న నీ మీద సొమ్ము లుండేంజేస్తాయి...? అవెలాగూ నాకే యిస్తావు కదా...! నువ్వు చనిపోయింతర్వాత అన్నయ్య, వదినలు సొమ్ములు నాకివ్వడానికి కిరికిరి చేస్తారేమో...! అందుకోసం ఇప్పుడే నాకిచ్చెయ్యి" అంటుంది. ఇలా కథ ఆద్యంతమూ తల్లి ఒంటిపైనున్న సొమ్ముల చుట్టూ ఆసక్తిగా నడుస్తోంది. ఇంతలో తల్లి చనిపోవడం, రాఘవ తల్లి ఒంటిపైనున్న సొమ్ములను సరోజకు ఇవ్వడానికి ఇష్టపడకపోవడంతో కథ పరాకాష్టనందుకుంటుంది. చివరకు రాఘవా సరోజలు ఆ బంగారు నగలకోసం తమ మధ్యగల రక్తసంబంధాలను తెంచుకునెందుకు సైతం సిద్ధపడుతారు. అటువంటి సందర్భంలో తల్లి ఒంటిపైనున్నవి నకిలీ నగలని తెలియడంతో కథ మలుపు తిరుగుతుంది. చివరకు మేనమామ చంద్రయ్య వచ్చి చెప్పిన సమాధానంతో రాఘవా సరోజలు సిగ్గుపడుతాడు. ఇలా కథ ముగుస్తోంది. మొత్తంగా పరిశీలించినప్పుడు కథ ఆద్యంతమూ మూల భావం చుట్టూ ఆసక్తిగా నడుస్తోంది. దీనినే వస్తువిన్యాస శిల్పమంటాము. ఈ వస్తువిన్యాస శిల్పంలో భాగంగానే ఎత్తుగడ, నడక, మలుపు, కంఠస్వరం, ముగింపు వంటి మరికొన్ని శిల్ప విశేషాలు కూడా కనిపిస్తాయి.

పాత్ర చిత్రణ శిల్పం :

కథా ప్రక్రియలో కథా వస్తువు తరువాత ప్రధాన భూమికను పోషించేవి పాత్రలు. కాబట్టే వల్లంపాటి వెంకటసుబ్బయ్య తన 'కథాశిల్పం'లో పాత్రలను గురించి ప్రస్తావిస్తూ 'కథా వస్తువును భరించేవారు, కథాంశాన్ని సూచించేవారు పాత్రలు' అంటారు. ఈ పాత్రచిత్రణను ఒక్కొక్క కథకుడు ఒక్కొక్క రీతిలో చిత్రిస్తుంటాడు. కథకుడు పాత్రల మానసిక, వైయుక్తిక మూర్తిమత్వ భేదాలను ఆవిష్కరించే తీరునే 'పాత్రచిత్రణ శిల్పం' అని పేర్కొనవచ్చు. పాత్రచిత్రణమనేది వ్యక్తుల సాధారణ అభివ్యక్తీకరణలకు భిన్నంగా ఉంటూ పాఠకుడ్ని ఆలోచింపజేసేదిగా ఉండాలి. అలా రూపుదిద్దుకున్న పాత్రలు సాహితీ లోకంలో చిరస్మరణీయమౌతాయి. ఉదాహరణకు గురజాడ అప్పారావు 'కమలిని', పురాణం సుబ్రహ్మణ్యశర్మ 'నీలి', బుచ్చిబాబు

'కుముదం', కాళీపట్నం రామారావు 'సీతారాముడు' వంటి పాత్రలు ఈ కోవకు చెందినవిగా చెప్పవచ్చు.

దేవులపల్లి కృష్ణశాస్త్రి రాసిన అవ్వ తిరునాళ్ళలో తప్పిపోయింది కథలో సుబ్బమ్మవ్వ పాత్ర సహజసిద్ధంగా, చదివిన ప్రతీ పాఠకునికి దగ్గరగా చూసిన పాత్రగా తోస్తుంది. మన ఇంట్లో వయస్సు మీద పడ్డ ముసలివాళ్ళు ఉంటే, వారి ప్రవర్తన ఎలా ఉంటుందో మనకు తెలుసు. వారి ప్రవర్తన వల్ల ఇంటిళ్ళపాది ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు మనం చూస్తూనే ఉంటాం. అలానే ఈ కథలో సుబ్బమ్మవ్వ పాత్ర కూడా సహజ సిద్ధంగా కనిపిస్తుంది. పాఠకుని మనస్సును ఆకట్టుకుంటుంది. ఇలా పాత్రలను మలిచే తీరునే 'పాత్రచిత్రణ శిల్పం' అని అంటారు.

సంఘటనఘటనా శిల్పం :

కథకు ఆకర్షిక కేంద్రాలు సంఘటనలు' అంటాడు పోరంకి దక్షిణామూర్తి. వీటిని సహజంగా, సమర్థవంతంగా, ప్రభావవంతంగా నిర్వహించడంలో రచయిత చూపే చొరవనే సంఘటన ఘటనా శిల్పమని పేర్కొంటారు.

రావిశాస్త్రి రాసిన 'వర్షం' కథలో కలకత్తా వెళ్ళడానికి బయల్దేరిన పురుషోత్తం ఉరుములు మెరుపులతో కూడిన వర్షంలో చిక్కుకొని ఒక టీ దుకాణంలో తల దాచుకోవడం ఒక సంఘటన. ఈ సంఘటన చుట్టూ కథ హృద్యంగా నడుస్తోంది. చివరకు తాను వెళ్ళాల్సిన రైల్వే స్టేషన్ నుండే బొగ్గుల మూట నెత్తిన పెట్టుకొని పోతురాజు అనే చిన్న పిల్లవాడు ఆ జోరు వర్షంలో పరిగెత్తుకుంటూ టీ కొట్టులోకి రావడంతో కథ వేగాన్ని అందుకుంటుంది. పోతురాజు ధైర్యాన్ని, తెగువను చూసి పురుషోత్తంలో చలనం కలుగుతుంది. ఆ ఉరుములు మెరుపులతో కూడిన వర్షంలోనే తడుస్తూ రైల్వేస్టేషన్ వైపు అడుగులు వేయడం ప్రారంభించడంతో కథ ముగుస్తుంది. ఇలా కథలో కొన్ని సంఘటనలను చిత్రించి ఆ సంఘటనల ఆధారంగా కథకుడు కథను ముందుకు నడిపించడాన్ని సంఘటన ఘటనా శిల్పం అంటాము.

సంఘర్షణోత్పాదన శిల్పం :

కథలో చిత్రించబడిన సంఘటనలు పాత్రల మనసులో సంఘర్షణ ఉత్పాదించి, తద్వారా కథా గమనానికి తోడ్పడినట్లైతే, అట్టి రచనా విశేషాన్ని సంఘర్షణోత్పాదన శిల్పం అంటారు. భాస్కరభట్ల కృష్ణారావు రాసిన 'ఇజ్జత్' కథలో రంగారావు భూమిని తాతల తండ్రుల కాలం నుండి సాగుచేసే రైతు మల్లయ్య. రంగారావు తన చెల్లెలి పెళ్ళి కోసం ఆ సాగు భూమిని అమ్మాలనుకున్నప్పుడు మల్లయ్య అందుకు ఒప్పుకోడు. రంగారావు వాళ్ళ ఊరి కరణం రామచంద్రయ్యతో మాట్లాడి మల్లయ్యను పిలింపించి ఒప్పించేందుకు ప్రయత్నిస్తాడు. మల్లయ్య అందుకు ససేమిరా ఒప్పుకోకపోవడంతో ఊరి ప్రజలందరి ముందూ మల్లయ్య వీపుపై బండరాయిని పెట్టి అవమానపరుస్తాడు కరణం రామచంద్రయ్య. ఇది కథలో ప్రధానమైన సంఘటన. ఈ సంఘటన ఉత్పాదించిన పర్యావసానమే కథ చివరకు మానసికంగా కృంగిపోయిన మల్లయ్య ఆత్మహత్య చేసుకోవడం. ఇలా కథలోని ఒక సంఘటన మానసిక సంఘర్షణను ఉత్పాదించి తద్వారా కథను ముందుకు నడపడంలో తోడ్పడితే అట్టి శిల్ప విశేషాన్ని సంఘర్షణో త్పాదన శిల్పం అంటాము.

సన్నివేశకల్పనా శిల్పం :

కథా వస్తువుకు అనుగుణంగా కథకుడు నేపథ్యాన్ని, పరిసరాలను, వాతావరణ పరిస్థితులను రూపొందించుకొని క్రమంగా ఒక్కొక్క సన్నివేశాన్ని తగ్గట్టుగా పాత్రలను ప్రవేశపెడుతూ కథను ముందుకు నడిపిస్తాడు. ఇలా కథను సహజసిద్ధంగా నడిపించడంలో రచయిత చూపే ప్రతిభను 'సన్నివేశకల్పనా శిల్పం' అంటారు.

ఉదాహరణకు పాలగుమ్మి పద్మరాజు రాసిన 'పడవ ప్రయాణం' కథలో 'పొద్దుకుంకిన తరువాత లోకమంతా

దిగులుగా ఉంది. పడవ మెల్లగా నీటిమీద జారుతోంది. నీరు పడవ ప్రక్కన కలకలమంటూ రాసుకుంటోంది. కనుచూపుమేరలో జీవన సంచలనం లేని ప్రపంచకం నిశ్శబ్దంగా జుంమ్మంటోంది. ఆ ధ్వని చెవులకు వినపడక దేహాన్నంతటినీ తాకుతుంది. మనస్సు లోలోపల అది నిండుగా కంపిస్తున్నట్టు ఉంటుంది. దూరంగా చెట్లు సాగుతాయి. దగ్గరగా ఉన్న చెట్లు తలలు విరబోసుకున్న పెద్ద దెయ్యాలాగా జీబురుమంటూ వెనక్కి నడుస్తాయి. పడవ కదలదు. కాలవగట్టుకదులుతుంది. పడవలోపల ఏవేవే బస్తాలున్నాయి. ధాన్యం, బెల్లం, పప్పు, చింతపండు వగైరా బస్తాలవి' అంటూ కథకుడు కథాంశానికి తగ్గట్టుగా పరిసరాలను, వాతావరణాన్ని రూపొందించుకొని, క్రమంగా కథావస్తు ప్రస్తావనను చేస్తాడు. ఇలా ఒక సన్నివేశాన్ని కల్పించుకొని తద్వారా కథ గమనాన్ని ముందుకు నడిపించడాన్ని సన్నివేశ కల్పనా శిల్పంగా పేర్కొంటారు కథా విమర్శకులు.

వర్ణనా శిల్పం :

కథకథనంలో వర్ణనలు కూడా ప్రధాన భూమికను పోషిస్తాయి. సందర్భోచితంగా వర్ణనలు చేయడం కూడా కథకు వన్నె తెస్తాయి. పురాణం సుబ్రహ్మణ్య శర్మ రాసిన 'నీలి' కథ ప్రారంభంలో 'ఒక మహారణ్యం తగులబడి పోతున్నది. జంతువులు చెల్లాచెదురుగా పరుగులు పెడుతున్నాయి. బండరాళ్ళు సైతం పెటేలు పెటేలుమని విచ్చుపోతూ ఎగిరి పడుతున్నాయి' అంటూ కథకుడు వర్ణన చేస్తాడు. ఈ వర్ణన చదివినప్పుడు తరువాత ఏం జరుగబోతుందో అనే ఆసక్తి పాఠకుని మనసులో కలిగి కథనూ పూర్తిగా చదివించడానికి తోడ్పాటునిస్తుంది. దీనిని బట్టీ సందర్భానుసారంగా చేసే వర్ణనలు సైతం కథాగమనాన్ని నిర్దేశిస్తాయని, కథ ఉన్నతికి తోడ్పడుతాయని చెప్పవచ్చు.

కథన శిల్పం :

'కథాదృక్పథ నిర్దేశంలో, భాషాశైలిలో, వర్ణనా విధానంలో, సంవిధాన పద్ధతిలో భాసించే నైపుణ్యాన్ని 'కథన శిల్పం'గా పరిగణిస్తారని పోరంకి దక్షిణామూర్తి పేర్కొంటాడు. ఇందులో కథకుడు తాను రాసిన కథకు తానే సాక్షీభూతుడై సంపూర్ణ సర్వజ్ఞత్వం ప్రదర్శించడం ఒక పద్ధతైతే. కథలో రచయితే ఒక పాత్రగా ప్రవర్తిస్తూ కథను ముందుకు నడిపించడం మరో పద్ధతి. వీటినే 'ప్రథమ పురుష, ఉత్తమ పురుష' కథనాలని పేర్కొంటారు. ఈ రెండు పద్ధతులు కథన శిల్పంలో ప్రధాన భూమికను పోషిస్తుంటాయి.

ప్రథమ పురుష కథనంలో కథకుడు పాత్రల మనస్సులోని ఆలోచనలను ఊహించి చెప్పగలడు. కథను అదృశ్యంగా పర్యవేక్షిస్తూ ముందుకు నడుపుతాడు. ఉదాహరణకు గురజాడ అప్పారావు రాసిన 'దిద్దుబాటు' కథానికలో 'తలుపు! తలుపు!!' అంటూ కథ ప్రారంభమౌతుంది. ఇవి గోపాల్రావు పాత్ర తన ఇంటి ముందు తలుపు తడుతున్న సందర్భంలో కథా సన్నివేశంలో కథకుడు ఉండి విన్న మాటలు. ఆ తరువాత 'తలుపు తెరవబడలేదు', గది గడియారం టింగుమని గంట కొట్టింది. ఇవి ఆ సన్నివేశంలో కథకుని పరిశీలన దృష్టి. 'ఎంత ఆలస్యం చేస్తిని? బుద్ధి గడ్డి తిన్నది. రేపటి నుండి జాగ్రతగా ఉంటాను'. అన్న మాటలు పాత్ర మనసులో మెదిలిన ఆలోచనలు. వీటిని కథకుడు కథలో ఊహించి రాస్తాడు. అంటే ప్రథమ పురుష కథనంలో కథకుడి ఆలోచనలకు, ఊహలకు సంపూర్ణ సర్వజ్ఞత్వం ఉంటుందని తెలుస్తోంది. వీటన్నింటి సారాంశాన్ని పరిశీలించినప్పుడు ప్రథమ పురుష కథనంలో కథకుడు అదృశ్య శక్తిలా ఉంటూ కథను గమనిస్తూ, నడిపిస్తాడన్న విషయం స్పష్టమౌతుంది.

అదేవిధంగా ఉత్తమ పురుష కథనంలో కథకుడే కథలో ఒక పాత్రగా ప్రవర్తిస్తూ 'నేను' అనే ఉత్తమ పురుష ప్రత్యయాన్ని తరచూ కథలో ప్రయోగిస్తూ కథను ముందుకు నడిపిస్తాడు. ఉదాహరణకు–

మునిపల్లె రాజు రాసిన 'బిచ్చగాళ్ళ జెండా' కథలో 'నేను రెండవ ప్రపంచ సంగ్రామంలో వైమానికోద్యోగిగా,

చావుబ్రతుకుల మధ్య ఆకాశంలో జరిగిన విమాన పోరాటంలో గాయపడ్డాను'అని ప్రారంభించడం. 'నేను క్లబ్ నుండి తిరిగి వచ్చే సరికి బిచ్చగాళ్ళ జెండా చుట్టూ పోలీసులు, మేజిస్ట్రేటులూ కనిపించారు' అని కథను ముగించడం చూడొచ్చు. ఇలా కథకుడు కథలో తానే స్వయంగా పాత్రగా ఉండి కథను నడిపే పద్ధతిని ఉత్తమ పురుష కథనం అంటారు. ఈ రెండు కథనపద్ధతులు కథా శిల్పంలో ద్యోతకమౌతాయి.

శీర్షికా శిల్పం :

సుందరమైన విగ్రహానికి నొసటి తిలకంలాగే చక్కటి కథకు మరింత చక్కదనం చేకూర్చేది 'పేరు లేదా శీర్షిక' అంటాడు పోరంకి దక్షిణామూర్తి. ఇలా కథకు శీర్షికను నిర్ణయించడంలో కథకుడు చూపే చొరవకు సంభందించినది శీర్షికా శిల్పం.

పురుషునికి స్త్రీ తోడు ఎంత అవసరమో, స్త్రీకి కూడా పురుషుని తోడు అంతే అవసరం అని తెయజేయడమే ఓల్గా రాసిన 'తోడు' కథలోని సారాంశం. కాబట్టే ఆమె తన కథకు 'తోడు' అనే శీర్షికను నిర్ణయించింది. అలాగే మధ్యతరగతి ఉద్యోగి అయిన కోనేటిరావు జీవితం నర్వకాల సర్వావస్థలలోను ఎటువంటి మార్పును చవిచూడలేదని, యాంత్రికంగా సాగిపోతుందని వివరిస్తూ శ్రీశ్రీ రాసిన కథ 'కోనేటిజన్మ'. ఇది కోనేటిరావు జీవన స్థితిగతులను చిత్రించిన కథ కాబట్టి రచయిత ఈ కథకు 'కోనేటిజన్మ' అన్న పేరును నిర్ణయించాడు. అదేవిధంగా తరాలు మారుతున్న కొద్దీ స్త్రీల జీవన స్థితిగతుల్లో సంభవించిన మార్పులను చిత్రించడమే ప్రధాన ఇతివృత్తంగా చిత్రించిన కథ 'తరాలు – అంతరాలు'. కాబట్టే రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి తన కథకు 'తరాలు – అంతరాలు' అన్న శీర్షికను సూచించింది. ఇలా వందేళ్ళ కథకు వందనాలు' కథా సంకలనంలోని కథల్లో కథకులు సందర్భోచితంగా కథలోని మూలభావాన్నిగానీ, ఏదేనీ ప్రతీకనుగానీ, సంఘటనను గానీ, కార్యాకారణ సంబంధమున్న మరేదైనా అంశాన్ని గానీ కథకు శీర్షికగా సూచించడం మనం ఇక్కడ గమనించవచ్చు. ఇవి శీర్షికా శిల్పాన్ని ఉద్ఘాటిస్తాయి.

ముగింపు :

ఈ విధంగా 'వందేళ్ల కథకు వందనాలు' కథా సంకలనంలోని కథల్లో అనేక మంది కథకుడు వారివారి ఆలోచలనలకు, దృక్పథాలకు అనుగుణంగా శిల్ప సౌందర్యాన్ని పోషించారు. కొందరు కథన శిల్పాన్ని ఆచరిస్తే మరికొందరు సంఘటణోత్పాదన శిల్పాన్ని, మరికొందరు సన్నివేశకల్పనా శిల్పాన్ని, ఇంకొందరు సమగ్రంగా అన్ని శిల్ప విశేషాలతో కూడిన కథలను చిత్రించి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

ఆధార గ్రంథాలు

1. కథానిక స్వరూపస్వభావాలు : పోరంకి దక్షిణామూర్తి.
2. కథాశిల్పం : వల్లంపాటి వెంకట సుబ్బయ్య.
3. సంస్కృత సాహిత్య చరిత్ర : ముదిగంటి సుజాతా రెడ్డి, ముదిగంటి గోపాల్‌రెడ్డి.
4. వందేళ్ల కథకు వందనాలు (సంకలనం) : గొల్లపూడి మారుతిరావు.
5. తెలుగు కథానిక : పోలాప్రగడ సత్యనారాయణ మూర్తి.

దక్షిణాంధ్ర యుగంలోని వర్ణ వ్యవస్థ

Mr. Y. Shivakumar, Ph.D. Research student, Department of Telugu, University of Hyderabad, Hydrerabad- 500046, TS. India. Mobile : 9963240519

పరిచయం:

శ్రీకృష్ణదేవరాయల యుగం, తెలుగు సాహిత్యానికి 'స్వర్ణయుగం'గా ప్రసిద్ధికెక్కింది. శ్రీకృష్ణదేవరాయలు, అచ్యుతదేవరాయలు దక్షిణదేశ పరిపాలన కోసం, తెలుగు నాయక రాజులను మధుర, తంజావూరులలో తమ సామంతులుగా నియమించుకొన్నారు. నాయకరాజుల ఆదరణ కోసం తెలుగు సైనికులు, కవి పండితులు తెలుగు ప్రాంతం నుండి దక్షిణ దేశానికి తరలివెళ్ళారు. క్రీ.శ.1565 లో జరిగిన తళ్ళికోట యుద్ధంలో విజయనగర సామ్రాజ్యం మహ్మదీయుల వశమైంది. అందువల్ల తెలుగు ప్రాంతంలోని కవులకు, గాయకులకు, శిల్పులకు రాజాదరణ తగ్గిపోయింది. కాబట్టి, తెలుగుప్రాంతంలోని కవులు, పండితులు, శిల్పులు మొదలైనవారు మధుర, తంజావూరుల్లోని రాజులను ఆశ్రయించారు.

సాహిత్యపోషణలో, రాజ నిర్వహణలో నాయక రాజులు విజయనగర రాజులను ఆదర్శంగా తీసుకొని, తెలుగు కవి పండితులను, తెలుగు భాషా సాహిత్యాలను పోషించారు. కాబట్టి, 17, 18 శతాబ్దాలలో తెలుగు సాహిత్యం తెలుగుదేశం సరిహద్దులను దాటి దక్షిణ దేశం, ముఖ్యంగా తంజావూరు, మధుర, చెంజి, పుదుక్కోట, మైసూరు మొదలైన కేంద్రాలలో విలసిల్లింది. తెలుగు సాహిత్య చరిత్రకారులు 'దక్షిణాంధ్ర యుగం' అని ప్రత్యేకించి, ఆంధ్ర వ్యాయ పరిణామంలో ఆ కాలపు ప్రాధాన్యతను గుర్తించారు. ఆ కాలం ప్రక్రియ వైవిధ్యంలోనూ, రచనా స్వరూపంలోనూ, భాష, శైలులలోనూ, సాహిత్య ప్రయోగాలలోనూ ఎంతో ప్రత్యేకతను ప్రదర్శించింది. ఇలా ఎన్నో విశిష్టలతో వెలువడిన ఈ యుగంలోని వర్ణ వ్యవస్థ గురించి కూడా ప్రత్యేకంగా చెప్పుకోవాలి.

1. వర్ణ వ్యవస్థ

సమాజంలో బ్రాహ్మణులకు గౌరవ స్థానముండేది. బ్రాహ్మణులలో కూడా అనేక ఆర్థిక పరమైన అంతరాలుండేవి.

వీరి తర్వాత సమాజంలో ద్వితీయ స్థానంలో వైశ్యులుండేవారు. వీళ్ళు దేశి వ్యాపారాన్ని చేసేవారు. వైశ్యులకు ప్రత్యేకమైన స్థావరాలు, సంఘాలుండేవి. ఈ సంఘానికి శెట్టి అధ్యక్షుడిగా ఉండి, స్థానిక మండపాలలో సమావేశాలు నిర్వహించేవారు. ప్రతి సంఘానికి కొన్ని ప్రత్యేకమైన లాంఛనాలుండేవి. వీళ్ళలో కొందరు ప్రభుత్వానికి చెల్లించే సుంకాలను వసూలు చేసేవారు. వీళ్ళు పూర్వ కాలం నుండే అరబ్బీ, ఇరానీ, బర్మా, కంబోడియా, ఇండోనేషియా, శ్రీలంక మొదలైన దేశాలతో వర్తక వ్యాపారాలు చేస్తుండేవారు. వీళ్ళు ఎక్కువగా ముత్యాలు, రత్నాలు, పగడాలు, వెండి మొదలైన వస్తువులతో వ్యాపారం చేసేవారు. వీళ్ళలో కొందరు వడ్డీ వ్యాపారం చేస్తూ, అధిక వడ్డీలను తీసుకుంటూ అపారమైన లాభాలను పొందుతుండేవారు. వైశ్య కులంలో ఏవైనా సమస్యలు వస్తే, వాళ్ళలో వాళ్ళు పరిష్కరించుకునేవారు. వీళ్ళు చేసిన నేరాలు రాజుల విచారణలోకి వచ్చేవి కావు. వీరు చేసే వ్యాపారాలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండటానికి రాజులకు, ఉన్నతోద్యోగులకు బహుమతులు, లంచాలిచ్చేవారు. లాభం లేకుండా చిన్న పని కూడా చేసేవారు కాదు. లంచాలివ్వడం, తీసుకోవడం రాజ్యంలో ఒక సాంప్రదాయంగా మారి పోయింది. దీనిని బట్టి సమాజంలో ఉన్నతమైన వర్గాలవారు రాజులకు, పరిపాలనకు చాలా దగ్గరగా ఉండేవారని తెలుస్తుంది. ఉన్నత వర్గాల మధ్య నిరంతరం పరస్పరమైన పోటీ ఉన్నప్పటికి, వీళ్ళలో వీళ్ళకు సహాయ సహకారాలుండేవి.

మూడవ వర్గంలో శూద్రులుండేవాళ్ళు. వీళ్ళలో కూడా అనేక ఉపకులాలుండేవి. ఒక్కొక్క కులానికి ఒక్కొక్క రకమైన కట్టుబాట్లుండేవి. వీళ్ళకు విద్యాధికారం ఉండేది కాదు. తమ కులానికి చెందిన వాళ్ళను మాత్రమే వివాహం చేసుకోవాలి. సహపంక్తి భోజనాలు చేయడం నిషిద్ధం. ప్రతి కులానికి కులపెద్ద ఉంటారు. ఇతనిని రాజు లేదా ఉన్నతోద్యోగులు నియమిస్తారు. కులానికి సంబంధించిన పన్నులుండేవి. కులపెద్దలు పన్నులను వసూలు చేసేవారు. శూద్రుల్లో ఎక్కువమంది కౌలు వ్యవసాయదారులు, కూలీలే ఉండే వాళ్ళు. రాజ్యానికి వచ్చే ఆదాయం చాలా వరకు వ్యవసాయంపైనే ఆధారపడి ఉండేది. రాయల కాలంలో 12 రకాల కులాలు ఉన్నట్లు పేర్కొన్నారు. వాళ్లలో 1. కరణం 2. రెడ్డి 3. తలారి 4. చాకలి 5. మాదిగ 6. మంగలి 7. వడ్ల 8. కంసాలి 9. పురోహితులు 10. నీరడి (అంటే చెరువులో పంటలకు నీటిని పెట్టేవారు) 11. కుమ్మరి 12. కమ్మరి. నాయక రాజుల కాలం నాటికి ఈ కులాలలోని కొందరు సంపన్నవర్గాలలో చేరారు. మరికొందరు తక్కువ కులాలకే పరిమితమయ్యారు. పురోహితులు ఆయగాండ్లలో చేరారు. రెడ్లు, కమ్మ, వెలమలు తర్వాత కాలంలో సైనికులుగా, అమర నాయకులుగా, పన్ను వసూలు చేసే గుత్తేదారులుగా నియమించబడ్డారు. తర్వాత కాలంలో మరికొన్ని ఉప కులాలేర్పడినట్లు ముద్దుపళని రాసిన రాధికా సాంత్వనం ద్వారా తెలుస్తుంది.

సీ. ధర బెస్త నేస్తంబు, తొరసాలె పద్దులు
వెలయాలికూరిమి విటులమాయ
మగసాలె నిజమును జగలోభీయావియ
గలుబొమ్మలిగింతగి కాకితెలుపు
కోమటిసత్యంబు గొల్లనిరసికత
కాముకజనులజ్ఞ ఖలుని కరుణ
చోరస్వదేశంబు జూదరిధర్మంబు
తగవరిమోమోట మాలసునిరతి

(రాధికా సాంత్వనం. 4- 79)

గొల్ల, కురుమలు గొర్రెలను, పశువులను కాసేవారు. పద్మశాలీలు బట్టలు నేసేవారు. కమ్మరి కులానికి చెందిన వాళ్ళు ఆయుధాలను, వ్యవసాయ పనిముట్లను తయారు చేసేవారు. కుమ్మరి కులానికి చెందిన వాళ్ళు కుండలు తయారు చేసేవారు. క్షురక పనిని మంగలి వాళ్ళు చేసేవాళ్ళు.

ఈ కాలంలో ఏ వర్గాల వారు, ఆయా వర్గాలకు, ఆయా కులాలకు చెందిన స్త్రీలతోనే సంబంధాలు పెట్టుకునే వాళ్ళు. శూద్ర జాతికి చెందిన వాళ్ళు, కేవలం శూద్ర కులానికి చెందిన వాళ్ళతోనే జీవించాలి. కులం కట్టుబాట్లు బలంగా ఉండేవి.

మ. చరియింపంగదొడంగి రందు బరహా సశ్రేష్ముడై జ్యేష్ఠ డా
పెరిమెం బట్టి కథ ల్వచింపుచు దనుం బిల్పించు బిల్వంగ ని
ద్ధర బెంపొందె దృతీయ దోహటపువింతల్ చూపుచుంగుక్కల
మారుగెం జేరే జాతుర్థ డంత్యకుల భామ పేరు సార్థంబుగ

(సత్యభామా సాంత్వనం. 4-21)

ఐదో కులంగా అస్పృశ్యులు చెప్పబడ్డారు. వీళ్ళను సమాజంలో భాగం చేసేవారు కాదు. వీళ్ళకు సమాజంలో గౌరవముండేది కాదు. వీరి నివాసాలు గ్రామాలకు బయటుండేవి. వీళ్ళు తప్పులు చేస్తే శిక్షలు చాలా కఠినంగా ఉండేవి. వీళ్ళ చేత ఉన్నత వర్గాల వారు వెట్టి చాకిరి చేయించుకునేవారు. వీరికి ప్రశ్నించే హక్కు ఉండేది కాదు. ఇతర కులాల బావుల దగ్గర నుండి అనుమతి లేకుండా నీళ్ళను తీసుకోకూడదు. దేవాలయంలోకి ప్రవేశం నిషిద్ధం. వీళ్ళలో మాల, మాదిగ అనే రెండు శాఖలు ఏర్పడ్డాయి. ఈ కులాల మధ్య వివాహం నిషిద్ధం. ఎవరి కుల సభలు వాళ్ళకే. వీళ్ళు ఉన్నత పదవులకు అనర్హులు. వీళ్ళలో చాలా మంది అడవులలో తిరుగుతూ, బందిపోటు దొంగలుగా చలామణి అయ్యేవారు. యాత్రికులను, భక్తులను పీడించి

వారి దగ్గరుండే సొమ్ములను దోచుకునేవారు. మాదిగ కులానికి చెందిన వారు చెప్పులను కుట్టడం, తాళ్ళను పేనడం వంటి వృత్తి పనులు చేసేవారు.

విజయనగర సామ్రాజ్యంలో 'క్షత్రియులనే' పదం కనిపించదు. వీళ్ళు సాధించిన విజయాలను బట్టే 'క్షత్రియులని' గౌరవించడం జరుగుతుంది. విజయనగర రాజులు కులం రీత్యా శూద్రకులానికి చెందినవారు. కర్మకాండలను చేయడం వలన, బ్రాహ్మణులకు భూములను, గ్రామాలను దేవాలయాలను నిర్మించడం వలన క్షత్రియులుగా గుర్తింపబడ్డారు. వీళ్ళు జయించిన రాజ్యాలలో వీళ్ళ కుటుంబీకులకు, లేదా వీళ్ళకు సంబంధించిన బంధువులనే చాలా వరకు రాజ ప్రతినిధులుగా, సామంత రాజులుగా నియమించేవారు.

ముగింపు:

దక్షిణాంధ్ర యుగంలోని 16,17 శతాబ్దాల మధ్య కాలంలో ఉన్నటువంటి సాంఘిక, ఆర్థిక, సామాజిక, సారస్వత అంశాలను తెలుసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడతాయి. సమాజంలోని ప్రజల జీవన విధానాన్ని గురించి శివకవుల తర్వాత, మళ్ళీ నాయక రాజుల కాలంలో వెలువడిన రచనలలోనే ఎక్కువ వివరాలు తెలుస్తున్నాయి. దక్షిణాంధ్ర యుగంలోని సాంఘిక పరిస్థితుల పరిస్థితులను గురించి చేస్తున్న అధ్యయనంలోని కొన్ని ప్రధాన విషయాలను ఈ పత్రంలో చర్చించడం జరిగింది. ఇటువంటి అధ్యయనాలు ఇంక వివరణాత్మకంగా, విమర్శ నాత్మకంగా జరపవలసిన అవసరాన్ని ఈ పత్రం ద్వారా సాహిత్య అధ్యయన శిలురకు, పరిశోధకులకు జ్ఞప్తికి తీసుకురావడం జరుగుతున్నది.

ఉపయుక్త గ్రంథసూచి:

1. ఆరుద్ర. 2004. సమగ్రాంధ్ర సాహిత్యం (2వ సంపుటం). హైదరాబాదు: తెలుగు అకాడమి ప్రచురణ.
2. ఆరుద్ర. 2015. ముద్దుపళని, రాధికా సాంత్వనం. హైదరాబాదు: ఎమెస్కో బుక్స్.
3. కుసుమాబాయి, కె. 2001. నాయక రాజుల చరిత్ర– కళా సంస్కృతి. హైదరాబాదు: కావ్యశ్రీ గ్రాఫిక్స్.
4. కృష్ణారావు, వై. 1986. తెలుగు సాహిత్య చరిత్ర. హైదరాబాదు: తెలుగు అకాడమి.
5. జయ రాములు, బి. 1992. సాంత్వన కావ్యాలు – శృంగార నాయికలు. హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన ఎం.ఫిల్. పరిశోధన వ్యాసం.
6. నాగయ్య, జి. 2009. తెలుగు సాహిత్య సమీక్ష. తిరుపతి: నవ్య పరిశోధక ప్రచురణ.
7. తెలుగు అకాడమి. 2005. తెలుగు–తెలుగు నిఘంటువు. హైదరాబాదు: తెలుగు అకాడమి ప్రచురణ.
8. ప్రతాపరెడ్డి, సురవరం. 2015. ఆంధ్రుల సాంఘిక చరిత్ర. విజయవాడ: పల్లవి పబ్లికేషన్స్
9. రామారావు, ఎస్వి. 2012. తెలుగు సాహిత్య చరిత్ర. హైదరాబాదు: పసిడి ప్రచురణలు.
10. వెంకటరావు, నిడదవోలు. 1978. దక్షిణ దేశీయాంధ్ర వ్యాయం. మద్రాసు: మద్రాసు విశ్వ విద్యాలయం.
11. వేంకటావధాని, దివాకర్ల. 2009. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర. హైదరాబాదు. ఆంధ్ర సాహిత్య పరిషత్తు.
12. వెంకటరమణయ్య, నేలటూరు. 1980. దాక్షిణాత్యాంధ్ర సాహిత్యం. మదరాసు: వేదము వేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్.
13. శ్రీరామమూర్తి, కొర్లపాటి. 1996. తెలుగు సాహిత్య చరిత్ర. విశాఖ పట్టణం: రమణ శ్రీ ప్రచురణ.
14. సత్యనారాయణ, కంభంపాటి. 2008. ఆంధ్రుల సంస్కృతి– చరిత్ర2. హైదరాబాదు: హైదరాబాదుబుక్ ట్రస్ట్.(అనుపమ ప్రింటర్స్).

శ్రీకాళహస్తి మాహాత్మ్యం - పాత్రల వైశిష్ట్యం

డా॥ఎం.లక్ష్మయ్య, తెలుగు అధ్యాపకులు, సి.ఎస్.ఎస్.ఆర్ & ఎస్.ఆర్.ఆర్.ఎం. డిగ్రీ & పి.జి కళాశాల, కమలాపురం, కడప జిల్లా. సెల్: 9492495437

ధూర్జటి సింగమ, నారాయణ దంపతులకు చిత్తూరు జిల్లాలోని శ్రీకాళహస్తిలో జన్మించినట్లు తెలుస్తుంది. ఇతడు 1480 నుండి 1545 వరకు జీవించి ఉండవచ్చునని కొందరి అభిప్రాయం. ధూర్జటి పుట్టుకతో వైష్ణవుడు. తర్వాత కాలంలో గొప్ప శైవ భక్తుడైనాడని ఈ రచన ద్వారా వెళ్ళడౌతుంది. శ్రీకృష్ణ దేవరాయల దగ్గర ఉన్న అష్టదిగ్గజ కవులలో ధూర్జటి ఒకడు. ఆయన రాసిన శ్రీకాళహస్తీశ్వర శతకం, శ్రీకాళహస్తి మాహాత్మ్యం ప్రధాన కావ్యాలుగా వెలిశాయి. శ్రీకాళహస్తి మాహాత్మ్యంలోని పాత్రల వైశిష్ట్యతను తెలియజేయడమే ఆ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

భారతదేశంలోని పంచభూత లింగాలలో ఒకటిగా ప్రసిద్ధి పొందిన, వాయులింగం రూపంలో వెలసిన పరమేశ్వరుని క్షేత్రం శ్రీకాళహస్తి. దీనిని దక్షిణ కైలాసంగా కూడా పిలుస్తారు. శ్రీకాళహస్తికి దగ్గరలోనే యాదవ రాజైన వీరనరసింహరాయల రాజధాని నారాయణవరం ఉంది. రాజు గొప్ప శివభక్తుడు. అతని భక్తిని పరీక్షించడానికి శివుడు జంగమ రూపంలో ఆ నగరానికి వస్తాడు. రాజు సంస్థానంలో వనిచేసే ఒక శివభక్తురాలు జంగమమునికి ఎదురుపడుతుంది. ఆమేకు అతనిపై భక్తిభావం ఏర్పడి తన ఇంటికి రమ్మని ఆహ్వానిస్తుంది. రతిక్రీడకు సమ్మతిస్తే వస్తానని మాయాజంగముడైన శివుడు చెబుతాడు. అప్పుడు ఆమే సమ్మతిస్తుంది. శివుడామె ఇంటికి వెళ్ళి పూజలు స్వీకరించి, విలాసమైన క్రీడలతో ఆనందాన్ని పొందుతాడు.

శివభక్తురాలు రాజుకు భోజనాన్ని ఏర్పాటు చేయడం సంస్థానంలో ఆమె పని. జంగమముని పూజలోపడి తన రాజ ధర్మాన్ని మరచిపోయింది. భోజన సమయానికి రాజుకు భోజనం వడ్డించడానికి ఆ దాసి రాలేదు. రాజుకు కోపం వచ్చింది. ఆమె కోసం భటులను పంపుతాడు. వారామెను రాజు దగ్గరకు తీసుకొస్తారు. అప్పుడు యాదవ రాజు అమెకు గుండు చేయిస్తాడు. ఆమె బాధతో ఇంటికి వెళ్తుంది. తనకు జరిగిన పరభవాన్ని తన ఇంటిలో ఉన్న శివభక్తునికి తెలియజేస్తుంది. అతని అనుగ్రహంతో ఆమెకు మరళా జుట్టు వస్తుంది. మరుసటి రోజు ఆమె రాజాస్థానంకు వెళ్ళి రాజుకు నమస్కరిస్తుంది. రాజు ఆశ్చర్యపోతాడు. నిన్న గుండు గీయించాను కదా? ఈ రోజు అప్పుడే జుట్టు ఎలా వచ్చింది. మంగళివాడు ఏమైనా మోసం చేశాడా అని ప్రశ్నిస్తాడు. అప్పుడు ఆమె తన ఇంటికొక గొప్ప శివభక్తుడు వచ్చాడని అతని అనుగ్రహంతో తన శిరోజాలు యధాతథంగా వచ్చాయని చెబుతుంది. ఆ మాటను విన్న రాజు తన మంత్రి పరివారంతో ఆమె ఇంటికి వెళుతాడు. జంగమమునిని చూసి నమస్కరిస్తాడు. స్వామి మీరెక్కడి నుండి వచ్చారు. ఈమెపై ఎందుకు మీరు ఇంత ప్రమానురాగాలు చూపించారు. తాను మీకు చేయవలసిన సేవ ఏదైనా ఉందా? అని రాజు ఆ మునిని అడుగుతాడు. అప్పుడు మాయా జంగముడు శ్రీకాళహస్తి గొప్ప క్షేత్రమని కొందరు ఋషులు చెప్పగా దానిని చూడటానికి వచ్చానని, అక్కడ దేవాలయం కానరాలేదు.

నీవు గొప్ప శివభక్తుడవు శ్రీకాళహస్తీశ్వరునికి ఈ క్షేత్రాన ఆలయాన్ని నిర్మించడమే నీ పనని చెబుతాడు. యాదవరాజు స్వామి మీ కోరికను తప్పకుండా నెరవేరుస్తాను. ఈ క్షేత్రమహిమను తెలియజేయమని ప్రార్థిస్తాడు.

వసిష్ఠుడు ఈ వనంలో మహేశ్వరుని గురించి తపస్సు చేస్తాడు. దేవదేవుడామునికి ప్రత్యక్షమై వరమును కోరుకోమని చెబుతాడు. తనకు బ్రహ్మ విద్యను ప్రసాదించమని, ఈ స్థలంలో ప్రజలు నిన్ను కొన్ని యుగాలుగా పూజించేటట్లు

అనుగ్రహించమని కోరుతాడు. పరమేశ్వరుడట్లే అనుగ్రహిస్తాడు. అతని కోరిక ప్రకారం శివుడు అక్కడే నివసించసాగాడు. పరమేశ్వరుడు ఇక్కడే ఉండడం వల్ల పార్వతీ దేవి కైలాసం వదిలి పరమశివుని దగ్గరకు వస్తుంది. అక్కడనే జ్ఞానప్రసూనాంబగా ప్రసిద్ధిపొందుతుంది. శివపార్వతులిద్దరూ అక్కడే ఉండటం వల్ల ఆ ప్రాంతం దక్షిణ కైలాసంగా ప్రసిద్ధి పొందిందని చెప్పవచ్చు.

కృతయుగంలో శ్రీ అనే సాలెపురుగు తన పూర్వజన్మ సుకృతం వల్ల శివునిపై భక్తిని పెంచుకుంది. స్వామిని పూజ చేయడానికి సామర్థ్యములేని కీటకము కాబట్టి తన నుండి వెలువడే తంతువులతో శివుని దేవాలయ గోపురాలను నిర్మించేది. అదే ఆ దేవదేవుని సేవ అని తృప్తిపొందుతోంది. గాలికి తెగిన తంతువులకు పదేపదే అల్లుతూ ఉంది. దాని భక్తిని పరీక్షించడానికి పరమశివుడు దీవంతో దాని తంతువులను కాల్చివేస్తాడు. ఎంతో కాలంగా నిర్మిస్తున్న గుడి,గోపురాలు కాలిపోవడంతో బాధతో సాలెపురుగు ఆ మంటలోకి దూకుతుంది. దాని భక్తికి, ధైర్యసాహసాలకు మెచ్చి శివుడు ప్రత్యక్షమై దానికి కైవల్యాన్ని పొందేటట్లు వరాన్ని ప్రసాదిస్తాడు.

త్రేతాయుగం చివరలో కాళమనే ఒక సర్పం పాతాళ లోకం నుండి ప్రతిరోజు ఒక మాణిక్యమును తెచ్చి అక్కడి శంకరునికి సమర్పించేది. అంతలో ద్వాపర యుగం ప్రారంభమవుతుంది. పూర్వ జన్మ కర్మ ఫలం వల్ల హస్తి అనే ఏనుగు అక్కడికి వచ్చి సువర్ణముఖి నదిలో స్నానం చేసి తొండముతో నీటిని తెచ్చి శ్రీకాళహస్తీశ్వరునికి అభిషేకం చేసి అక్కడ ఉన్న మణులను తీసేసి పువ్వులతో పూజ చేసేది. ఉదయం సర్పం వచ్చేటప్పటికి మణి కిందపడి ఉంటుంది. దాని స్థానంలో పువ్వులు ఉండటం చూసి కోపంతో వాటిని తీసేసి మణులతో శివున్ని పూజించి వెళ్ళిపోయేది. పాము వెళ్ళిన తర్వాత ఏనుగు వచ్చి పూలు కిందపడి ఉండటం చూసి రాళ్ళతో దేవుని పూజించటమా? ఎంత పాపం అని పరితపించి, ఆ మణులను తోసేసి పూలతో లింగార్చన చేసి వెళ్ళిపోతుంది.తర్వాత సర్పము చూసి పూలను తొలగించి మణులతో పూజించి వెళ్ళిపోయింది. శివరాత్రి రోజున ఏనుగు రాత్రంతా జాగారణ చేసి మరుసటి రోజు తెల్లవారుజామునే శివార్చన చేసింది. ఎవరో తాను చేసిన పూజను తొలగించి మణులతో పూజించి పోతున్నారు. కాబట్టి ఆ విరోధి ఎవరో చూడాలని అక్కడే ఉంటుంది. కొద్ది సేపటికి సర్పము అక్కడకు వచ్చి పూలను తొలగిస్తుండగా గజము దానిని తొక్కడానికి ప్రయత్నిస్తుంది.పాము ఏనుగు పైకి దూకి దాని నాసారంద్రం ద్వారా కుంబస్థలంలోకి చొచ్చుకుపోతుంది. దాని బాధను భరించలేని ఏనుగు పక్కనే ఉన్న కొండను ఢీకొంటుంది. దాని కుంబస్థలం పగిలిపోతుంది. పాము కూడా చనిపోతుంది. తర్వాత అవి రెండు మానవ రూపము దరిస్తాయి. అప్పుడు శివుడు ప్రత్యక్షమై వాటిని అనుగ్రహించి, శాశ్వతంగా సుఖంగా ఉండేటట్లు వరం ఇస్తాడు.

మాయా జంగముడు తర్వాత ఆటవికుడైన తిన్నని గురించి తెల్పుతాడు. తిన్నడు పొత్తపి నాడులోని ఉడుమూరు గ్రామంలో నాథనాథుడు, తండె లకు జన్మిస్తాడు. ఒక రోజు తిన్నడు తన సహచరులతో వేటకు వెళ్తాడు. బాగా అలసిపోయి ఒక వకుళ వృక్షపు నీడలో నిద్రిస్తాడు. అప్పుడు అతనికి స్వప్నంలో పరమేశ్వరుడు కనిపించి సువర్ణముఖీ నదీ తీరాన ఒక వటవృక్షం ఉంది. ఆ వృక్షంలో పార్వతి పతి ఉన్నాడు అతనిని సేవించమంటాడు.

వెంటనే తిన్నడు అదిరిపడి లేచి నలువైపులా చూస్తాడు. ఎవ్వరూ కనిపించరు. అప్పుడొక పంది అతని దగ్గరగా వెలుతుంది.

తిన్నడు దానిని తరుముతూ వెలుతాడు. అది సువర్ణముఖీనదీ తీరాన వటవృక్షం మూలము చేరి మాయమవుతుంది. తిన్నడు ఆ చెట్టు మూలం దగ్గరకు వెళ్ళి చూస్తాడు. అక్కడ ఒక శివ లింగం కన్పిస్తుంది.ఆ దేవుని దయనీయ స్థితికి పరితపించి ఈ స్థలం విడిడి తన ఊరికి

వస్తే అక్కడ అన్ని సౌకర్యాలు కల్పిస్తానని చెబుతాడు. కానీ ఆ శివలింగం కొంచమైనను కదలదు. " నీవు రాకపోతే తాను ఇక్కడే ఉంటాననీ చెబుతాడు. మిత్రులు ఇంటికి పోదాం రమ్మని తిన్నన్ని పిలుస్తారు. కానీ అతడు శివలింగం వస్తే నేను వస్తానంటాడు. శివలింగం కదలకపోవడంతో అతడు అక్కడే ఉంటాడు. శివునిపై భక్తితో తిన్నడు ఒక పందిని చంపి దానిని ముక్కలుగా చేసి స్వామికి సమర్పించి దానిని తినాలని ప్రార్థిస్తాడు. దానిని తినకపోతే తన ప్రాణాలను తీసుకుంటాననీ కోరుతాడు. తిన్నని భక్తికి మెచ్చి పరమేశ్వరుడు అక్కడి ఆహారాన్ని ఆరగిస్తాడు. ఈ విధంగా ప్రతి రోజు శివలింగంను ఆరాదిస్తుంటాడు.

ఒక రోజు తిన్నడు పెట్టిన మాంసాన్ని శివుడు తినలేదు. ప్రతిరోజు తన నివేదనను స్వీకరించే ఇలవేల్పు ఎందుకు తినలేదో కారణమేమని పరిశీలించి చూస్తాడు. శివుని కంటినుండి నీరు కారుతుంటుంది. దానిని గమనించిన తిన్నడు అన్ని రకాల చికిత్సలను చేస్తాడు. కాని కంటినుండి అలాగే నీరి కారుతోంది. చివరకు తన కన్ను తీసి శివుని కన్ను స్థానంలో అతికిస్తాడు. అది మునిపటి కంటే ఎక్కువగా ప్రకాశిస్తుంది. కాని రెండవ కన్ను నుండి రక్తం కారుతోంది. దానిని గమనించిన తిన్నడు. తన రెండవ కన్నును కూడా తీసి శివలింగానికి అతికిస్తాడు. ఈవిధంగా రెండుకన్నులను శివునికి ఇవ్వడం వలన అతనిని కన్నప్ప అని ప్రజలు పిలిచేవారు.

తర్వాత జంగమమూర్తి నత్కీరుని వృత్తాంతాన్ని చెబుతాడు. పాండ్యరాజు మదురానగరాన్ని రాజధానిగా చేసుకుని పరిపాలించేవాడు. అతడు కవితా ప్రియుడు. అతని ఆస్థానంలో నత్కీరుడు కవిగా ఉంటాడు. ఒకసారి ఆ ప్రాంతంలో పెద్ద కరువు సంభవిస్తుంది. ఊరిలో ఉన్న ఒక శివ బ్రాహ్మనుడు ఊరు వదిలిపోవడానికి సిద్దపడుతాడు. అతని పై ప్రేమతో పరమేశ్వరుడు శృంగార రసంతో కూడిన ఒక పద్యాన్ని రాసి దానిని రాజు సభలో చదవమంటాడు. ఆ శివ భక్తుడు రాజు సభలో చదువుతాడు. ఆ పద్యంలో వర్ణన లేదని నత్కీరుడు ఆక్షేపిస్తాడు. ఇది పరమేశ్వరుడు రాసిన పద్యం ఇందులో తప్పులకు కారకుడు ఆయనే. అని విచారంతో శివుని దగ్గరకు వచ్చి తనకు జరిగిన అవమానాన్ని తెలియజేస్తాడు.తన పద్యం తప్పని చెప్పిన నత్కీరునిపై కోపంతో శివుడు పాండ్యరాజు సభకు వెళ్ళి తాను చెప్పిన దానికే తప్పంటావా అని నత్కీరున్ని కుష్ఠివ్యాధి పీడితుడగునట్లు శపిస్తాడు.

నత్కీరుడు తన తప్పు తెలుసుకుని పశ్చాత్తాప్తుడై శివుని కాళ్ళపై పడి తనకు శాపం నుండి బయటపడే మార్గాన్ని తెల్పమని వేడుకుంటాడు. అప్పుడు పరమేశ్వరుడు శాంతించి కైలాసాన్ని దర్శించిన తర్వాత శాపవిముక్తి కల్గుతుందని చెబుతాడు. శాపవిముక్తుడు కావడానికి కైలాసానికి ప్రయాణం ప్రారంబిస్తాడు. మార్గం మద్యలో అనేక పుణ్యక్షేత్రాలను దర్శిస్తాడు. కాశీలో విశ్వనాథున్ని, విశాలాక్షీదేవిని, కాలభైరవున్ని,విఘ్నేశ్వరుల ఆలయాలను కూడా సందర్శించి వారి అనుగ్రహాన్ని పొందుతాడు. ఎక్కువ దూరం ప్రయానించడం వల్ల కాళ్ళలో శక్తి తగ్గిపోయింది. అక్కడే ఒక సరోవరం దగ్గర పెద్ద మర్రి చెట్టు ఉంటుంది. దాని నీడలో కొద్ది సేపు విశ్రాంతి తీసుకుంటాడు. ఆ చెట్టు నుండి రాలిన ఆకులు నేలపై పడినవి పక్షులుగాను, నీటిలో పడినవి చేపలుగాను మారుతున్నాయి.ఆ వింతను చూసిన నత్కీరుడు ఆశ్చర్యపోతాడు. అంతలోనే ఒక భూతం వచ్చి నత్కీరున్ని పట్టుకుని తన గుహలోనికి ఈడ్చుకెలుతుంది. గుహలోకేసి ద్వారం దగ్గర పెద్ద బండ రాయిని అడ్డంగా పెట్టి బయటకు వస్తుంది.

గుహలో అప్పటికే కొందరు జనులు ఉంటారు. తిన్నడు భూతం గురించి వారిని అడుగుతాడు. వారు తొంభై తొమ్మిది మందని నీతో వందమంది అయ్యామని, వందమంది అయ్యాక వందమందిని ఒకే సారి ఆహారంగా స్వీకరిస్తుందని చెబుతారు. అప్పుడు నత్కీరుడు సుబ్రహ్మణ్య స్వామిని

ప్రార్థిస్తాడు. ఆ దేవుడు ప్రత్యక్షమై భూతాన్ని చంపి, గుహద్వారానికి అడ్డంగా ఉన్న రాయిని తొలగిస్తాడు. ఇక్కడకు రావడానికి కారణం ఏమని స్వామి నత్కీరున్ని అడుగుతాడు. అప్పుడు నత్కీరుడు తన వృత్తాంతాన్ని తెల్పి, తాను కైలాసానికి వెళ్లడానికి సాధ్యం కాలేదని, నీవే రక్షించాలని ప్రార్థిస్తాడు. పరమేశ్వరుడు కైలాసగిరి అన్నాడు గాని ఉత్తర కైలాసగిరి అని చెప్పలేదుకదా! కాబట్టి నీవు పక్కనే ఉన్న నదిలో స్నానం చేసి దక్షిణ కైలాసగిరిని దర్శిస్తే కుష్ఠురోగం పోతుందని తెలియజేస్తాడు. వేంటనే నత్కీరుడు సువర్ణముఖీ నదిలో స్నానమాచరించి దక్షిణ కైలాసగిరిలో వెలసిన శ్రీ కాళహస్తీశ్వరున్ని దర్శిస్తాడు. తర్వాత అతని కుష్ఠురోగం మాయమౌతుంది. అప్పుడు నత్కీరుడు వంద పద్యాలతో శ్రీకాళహస్తీశ్వరున్ని అనేక విధాలుగా స్తుతిస్తాడు. శివుడు ప్రత్యక్షమై వరం కోరుకోమంటాడు. తనకు సంసార దు:ఖము లేకుండా చేయాలని ప్రార్థిస్తాడు. పరమేశ్వరుడు అతని కోరకను నెరవేరుస్తాడు.

ఈ విధంగా మాయాజంగమ మూర్తి యాదవరాజు వీర నరసింహమేదనీశ్వరునికి శ్రీకాళహస్తి మాహాత్మ్యమును తెలియజేస్తాడు. ఆ దేవునికి ఆలయాన్ని నిర్మించమని మరొకసారి హెచ్చరించి అంతరార్థమౌతాడు. ఇంతవరకు తనకీ విషయాలు చెప్పినది సాక్షాత్తు ఆ పరమేశ్వరుడే అని యాదవరాజు తెలుసుకుంటాడు. తనకు జన్మ సార్థకమైందని ఆనందిస్తాడు. తన సహ ధర్మచారిణితో కలసి వెంటనే శ్రీకాళహస్తికి వెళ్ళి, సువర్ణ ముఖీ నదిలో స్నానం చేసి శ్రీకాళహస్తీశ్వరున్ని పూజిస్తాడు. తర్వాత ఆ దేవునికి ఆలయాన్ని నిర్మిస్తాడు. ఈ విధంగా ప్రతి పాత్ర భక్తితో ముక్తిని పొందాయని భావించవచ్చు

ఆధారగ్రంధాలు:

1. శ్రీకాళహస్తి మాహాత్మ్యం – ధూర్జటి
2. శ్రీకాళహస్తి మాహాత్మ్యం – విద్వాన్ ఎస్. అశ్వత్థప్ప
3. శ్రీకాళహస్తి మాహాత్మ్యం (వచనానువాదం) – డా. జక్కంపూడి మునిరత్నం
4. శ్రీకాళహస్తి మాహాత్మ్యం – శ్రీ బులుసు వేంకట రమణయ్య

ధూర్జటి మాధురీ మహిమ – శ్రీకాళహస్తీశ్వర శతకం

డా॥ అడపా కేదారి, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పామర్రు. కృష్ణాజిల్లా

పరిచయం:

సహస్ర వసంత వికసితమైన, విలసితమైన ఆంధ్ర సాహితీ నందనోద్యాన వనంలో శ్రీకృష్ణదేవరాయల యుగం (క్రీ.శ.1500–1600) వసంతఋతు సదృశమైంది. ఆంధ్రదేశ రాజకీయ చరిత్రలోనే కాదు తెలుగు సాహితీ చరిత్రలో కూడా రాయలయుగం 'స్వర్ణయుగం' (Golden Age) రాయలు 'ఆంధ్రభోజుడు' 'సాహితీ సమరాంగణ సార్వభౌముడు' (ఆముక్త మాల్యద 1–4–4) కవితా స్త్రీ లోలుడు (మను చరిత్ర 1–45) 'కవితా ప్రౌఢిమ్య (Golden Age) ఫణీశుడు' (పారిజాతాపహరణం, 1:4) రాయలు కవిరాజు. రాజకవి. 'ఆముక్తమాల్యద' అనే ప్రౌఢ ప్రబంధకర్త. రాయల సాహితీ సభా భవనం పేరు భువన విజయం. భువన భారాన్ని అష్టదిగ్గజాలు వహించినట్లే. తన సాహితీ సభాభవనం భువన విజయం పేరు సార్థకమయ్యేటట్లు ఆ భవన ఎనిమిది దిక్కులకు ప్రాతినిధ్యంగా ఎనిమిది సింహపీఠికలను అమర్చి, విద్యా వినోదాలు నిర్వహించే వాడని ప్రతీతి. కృష్ణరాయలు కడప మండలంలో కమలాపురం తాలూకాలోని తిప్పలూరు అనే గ్రామాన్ని సర్వాగ్రహారంగా 'అష్టదిగ్గజ కవీశ్వరులకు' దానం చేసినట్లు క్రీ.శ. 1527 సంవత్సరం ఆగష్టు నెల 26వ తేది నాటి తిప్పవారు శాసనంలో ఉంది. (A.R. No:228 of 1937-38) విశ్వనాథ స్థానాపతి 'రాయవాచకం' లోనూ; కుమార ధూర్జటి 'కృష్ణరాయవిజయం' లోనూ; ధూర్జటి లింగరాజు 'పెదకాళహస్తి మహాత్మ్యం' లోనూ; కొండవీటి దండకవిలె' లోనూ అష్టదిగ్గజ కవుల ప్రశంస ఉంది. రాయల అష్టదిగ్గజ కవులలో ధూర్జటి 'ఒకడు'.

ధూర్జటి కాలం:

ధూర్జటి కృష్ణదేవరాయల అష్టదిగ్గజ కవులలో ఒకడని చెప్పుకున్నాం. శ్రీకృష్ణదేవరాయల కాలంలోనే విజయదశమి నాడు (12–09–1520) భువన విజయాన్ని కళ్ళారా చూచి, మనసారా వివరించిన జామింగోస్ పేయిస్ అది శ్రీకృష్ణదేవరాయల గజపతితో యుద్ధం చేసి తిరిగి వచ్చి, విజయ చిహ్నంగా కట్టించినట్లు గ్రంధస్థం చేశాడు. (కొర్లపాటి శ్రీరామమూర్తి : సాహిత్య సందర : పు. 247) కాబట్టి భువన విజయ భవన విజయంలో ఒక అష్టదిగ్గజకవి అయి ఉంటాడు. అష్టదిగ్గజ కవి కావాలంటే కవితా ప్రౌఢిమతో పాటు, ఎంతో కొంత ప్రౌఢవయో పరిపాకం ఉండి తీరాలి. 1520 నాటికి కనీసం 35–40 సం॥ల మధ్య వయసు ధూర్జటికి ఉండి ఉంటుందనుకుంటే ధూర్జటి జననకాలం బహుశ 1480–85 మధ్య అయివుంటుందని ఊహించ వచ్చు. కృష్ణదేవరాయలు 1529–30 మధ్య మరణించాడు. రాయలు మరణించిన తర్వాత ధూర్జటి మరి 20–25 సం॥కాలం జీవించినట్లు 'శ్రీకాళహస్తీశ్వర శతకం' లోని అనేక పద్యాలవలన ఊహించవచ్చు. అందువల్ల ధూర్జటి చరమకాలం 1545–1550 మధ్య కావచ్చు. దీన్ని బట్టి ధూర్జటి జీవితకాలం క్రీ.శ. 1480/85 – 1555/60.

'కొండవీటి దండకవిలె' పేర్కొన్న అష్టదిగ్గజకవుల పేర్ల పట్టికలో ధూర్జటి పేరు ఉంది. రాయల ఆస్థానంలో ఉన్నా ధూర్జటి తన స్వతంత్ర వ్యక్తిత్వాన్ని వీడిన వాడు కాదు. అల్లసాని పెద్దన, నందితిమ్మనల లాగా తన కావ్యం శ్రీకాళహస్తి మహాత్మ్యాన్ని కృష్ణరాయలకు అంకితం చేయలేదు. కృష్ణరాయలు వైష్ణవుడు. ధూర్జటి శైవుడు. అయినా తన మతాన్ని మార్చుకోలేదు. ధూర్జటిలోని ఈ స్వేచ్ఛా ప్రవృత్తితో పాటు అతని కవితా మాధుర్యం కూడా రాయలను ఆకర్షించి ఉంటాయి. అల్లసాని పెద్దన కవితలోని "శిరీషకుసుమ పేశల సుధామయోక్తు"లు గుర్తించిన రాయలు: ధూర్జటి కవితలోని 'మాధురీ మహిమ' ను వేనోళ్ళ కొనియాడాడు.

"స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కుల కేల కల్గెనో
యతులిత మాధురీ మహిమ .....

అని ఒకనాడు రాయలు సభలో సమస్యగా ఇచ్చాడట

"..... హా! తెలిసెన్ భువనైక మోహనో
ద్ధత సుకుమార వార వనితాజనతా ఘనతా పహారి సం
తత మధురాధ రోదిత సుధారస ధారలం గ్రోలుటం జుమీ"

అని దానిని తెనాలి రామకృష్ణుడు పూరించినట్లు చిరంతనమైన జనశ్రుతి ఉంది. ఇది యదార్థమో, కథార్థమో తెలియాదు. ఈ సమస్య పురాణాన్ని పుక్కింటి పురాణమని త్రోసివేయకుండా పై సమస్య భాగాన్ని కుమారధూర్జటి గ్రంధస్థం చేసాడు.

శ్రీకాళహస్తీశ్వర శతకం:

సాహిత్యానికుండే సామాన్య లక్షణాలు (General Features) కలిగివుండి. ఇతర గ్రంధాలతో వేరుపడే ప్రత్యేకలక్షణాలు (Special Features) కలది సాహిత్య ప్రక్రియ, పురాణం, ఇతిహాసం, కావ్యం, ప్రబంధం, యక్షగానం, ఉదాహరణం, నాటకం, నవల, కథానిక మొదలైనవి సాహిత్య ప్రక్రియలు 'శతకం' కూడా ఇలాంటి ఒక సాహిత్య ప్రక్రియ. ఒక ప్రత్యేక సాహితీ శాఖ.

'శత' శబ్దానికి 'కిమ్' ప్రత్యయం చేరి 'శతకం' అనే రూపమేర్పడింది. నూరు పద్యాలు గల ఒకానొక కావ్య భేదం ఇది.

స్వరూపాన్ని బట్టి కావ్యాలు (a) పద్యకావ్యాలు (b) గద్యకావ్యాలు (c) చంపూ కావ్యాలు అని మూడురకాలు. కేవలం పద్యాలతో కూడుకొన్నవి పద్యకావ్యాలు. కేవలం వచనంతో కూడుకున్నవి వచన కావ్యాలు. పద్య, గద్య మిశ్రితాలైనవి చంపూ కావ్యాలు. పద్య కావ్యాలు తిరిగి నిబద్ధ కావ్యాలు, అనిబద్ధ కావ్యాలు అని రెండు రకాలు. ఆశ్వాసాది విభజన కలిగి, అష్టాదశ వర్ణనలతో కూడిన మహా కావ్యమే నిబద్ధ కావ్యం. ఆశ్వాస విభజన లేనివి అనిబద్ధ కావ్యాలు. వీటికే 'ఉపకావ్యాలు' లేక 'క్షుద్రకావ్యాలు' అని పేరు. ఇక్కడ 'క్షుద్ర' శబ్దం పరిమాణ సంబంధే కాని, స్వభావ సంబంధి కాదు. క్షుద్ర కావ్యం అంటే చిన్న కావ్యం. అల్పపరిమాణం కలది. ఉపకావ్య భేదాలతో సంఖ్యా మూలకాలలో శతకం ఒకటి. ముక్తకం (సంపూర్ణార్థం గల ఒక స్వతంత్ర పద్యం), యుగ్మకం (క్రియా సమాప్తికై పరస్పర సంబంధం కలిగిన పద్యాల జంట), విశేషం (ఏక క్రియాతం గల మూడు పద్యాల సముదాయం), కలాపం (నాలుగు పద్యాల సమూహం), కులకం (ఐదు పద్యాల సముదాయం); పంచరత్నావళి (ఐదుపద్యాల సముదాయం). కరకవాటం (ఆరుపద్యాల సముదాయం),; అష్టకం (ఎనిమిది పద్యాల సముదాయం),; రత్నావళి (తొమ్మిది పద్యాల సముదాయం) ; ద్వాదశమంజరి (పన్నెండు పద్యాలు) విశ్వవళి (పద్నాలుగు పద్యాలు); పంచదశి (పదిహేను పద్యాలు); శిశికళ (పదహారు పద్యాలు); వింశతి (ఇరవై పద్యాలు); తారావళి (ఇరవై ఏడు పద్యాలు); శతకం (నూరు పద్యాలు) మొదలైనవి పద్య సంఖ్యామూలకాలైన ఉప కావ్యాలు. మిగిలిన ఏ ఉపకావ్య విభాగానికి లేని ప్రచుర ప్రచార ప్రశస్తులు తెలుగులో శతకానికి లభించాయి.

శబ్దశక్తి ఎంతో విచిత్రమైనది. కొన్ని కొన్ని పదాలలో దీని విశిష్టత కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. 'ధూర్జటి' అనే పేరు అలాంటిదే. ("ధూ ర్భారభూతా జటి ర్యస్య సం: ధూర్జటి:" – అమరకోశం: శ్లో. 33). ధూర్జటి అంటే పరమేశ్వరుడు. బరువైన జటల సమూహంతో భాసిల్లే దేవుడు గనుక ధూర్జటి అనే పేరు పరమేశ్వరుని పట్ల సార్థకమైంది.

1. రచనా మాధుర్యం:

పరమ శైవోత్తంసుడైన ధూర్జటి కవితా రచన విభూతి వలే పవిత్రం; వీడ్యం (తాంబూలం) లా మధురమూ అయినది ఆయన కవితలో తీయతేనియలు ఊరుతుంటాయి.

"అంతా మిథ్యతలంచి చూచిన నరుండట్లేటెఱింగిన్ సదా

కాంతల్పుత్రులు నర్థమున్ తనువు నిక్కంబంచు మోహోర్ణవ

భ్రాంతింజెంది చరించుగాని పరమార్థంబైన నీయందుదా

జింతాకంతయు జింత నిల్పుదుగదా శ్రీకాళహస్తీశ్వరా!"

అనంత వేదాంత తత్వాన్ని చిన్న చిన్న మాటలతో, ఒక్క పద్యంలో చెప్పగలగటం ధూర్జటికే చెల్లింది. 'అంతా మిథ్య' అనే ఎత్తుగడ 'చింతాకంతయు' అనే తెలుగు నుడికారం పద్యానికి ఎనలేని శోభను కలిగిస్తున్నాయి.

2. భాషా మాధుర్యం:

ప్రతి భాషకూ ఒక జీవశక్తి ఉంటుంది. మహాకవి అయినవాడు దాని పసిగట్టి, ఒడుపుగా పట్టుకుంటాడు. అలాంటి మహాకవి ధూర్జటి. ఆయన కవిత మాధురీ మహిమోపేతమై దీపించటానికి మూల పదార్థమైనది అతని భాషే!

సమాస విన్యాసం:

ధూర్జటి సంస్కృత సమాసాలలోని లాలిత్యం అత్యంత మనోజ్ఞ. నిరంకుశ, నిర్గళ, నిస్సీమధారాధోరణి కలిగి అది ఉరుకులు పెడుతుంటుంది. చిరు కెరటాల తూగుటయ్యలలో ఆనందంగా ఊగులాడునట్లు ఈతని కవితామృతవాహినీ శబ్ద తరంగాల మీద తూగియాడుతుంటుంది. ఉదా:

1) శ్రీ విద్యుత్కలితాజవంజవ మహాజీమూత పాపంబుధారా వేగము, 2) దివిజక్ష్మారుహ ధేనురత్న ఘనభూతి ప్రస్ఫురద్రత్న సానువు, 3) అంభోజాక్షీ చతురంతయాన తురగీ భూషాదుల, 4) సువర్ణముఖరీతీర ప్రదేశాభ్రకానన మధ్యోపల వేదికాగ్రము, 5) కీట ఫణీంద్రపోత మదవేదండోగ్ర హింసావిచారి, 6) దుష్కాల ప్రమాణ క్రియా లీలాజాలక చిత్రగుప్తముఖ వల్మీకోగ్ర జిహ్వోద్భుత వ్యాళవ్యాళవిరోధి మృత్యుముఖ దంష్ట్రాహార్య వజ్రంబు, 7) సత్యభాషణ సముద్యద్రత్న రుద్రాక్షరాజి సమేతుల్, 8) విలాసినీజన సువస్త్ర వ్రాత భూషాకలాప తనూజాదికము, 9) పటవ, ద్రజ్జుభుజంగన, ద్రజతవిభ్రాంతి స్ఫురచ్ఛక్తివ, ద్ఘటవ, చ్ఛంద్రశిలా జపాకుసుమ రుక్సాంగత్యవత్.

3) శైలీ మాధుర్యం:

కవి యొక్క కవితా తత్వాన్ని పట్టి యిచ్చేది అతని శైలియే (style). మహాకవికి తనదైన ఒక ప్రత్యేక శైలి ఉంటుంది. ధూర్జటి శైలికి అన్వయక్లిష్టత లేకపోవటం ప్రధాన లక్షణం. చిన్న చిన్న విడి పదాలు, అలతి అలతి వాక్యాల సంయోజనం వ్యవహారాశ్రిత పలుకుబడి ధూర్జటి శైలి మాధురికి జీవలక్షణాలు

సంతోషించితి జాలుజాలు రతిరాజద్వార సౌఖ్యంబులన్
శాంతి బొందితి జాలుజాలు జాలు బహురాజద్వార సౌఖ్యంబులన్,
శాంతిం బొందెద జూపు బ్రహ్మపద రాజద్వార సౌఖ్యంబు ని
శ్చింతం న్సాంతుడనౌదు నీకరుణచే శ్రీకాళహస్తీశ్వరా!
రోసిందేటిది రోతలేటిదివి! మనోరోగస్థుడై దేహితా,
బూసిందేటిది పూతలేటివి మదాపూతంబు లీదేహముల్,
మూసిందేటిది మూతలేటివి సదామూఢత్వమే కానితా
జేసిందేటిది చేతలేటివి వృథా శ్రీకాళహస్తీశ్వరా!
వేధందిట్టగరాదుగాని భువిలో విద్వాంసులం జేయనే
లాధీచాతురిజేసి చేసిన గులామాబాటనేపోక క్షు
ద్బాధాదుల్ కలిగింపనేల యదికృత్యంబైన దుర్మార్గులన్
ఛీ ! ధాత్రీశుల జేయనేటి కకటా శ్రీకాళహస్తీశ్వరా!

మహాకవి ధూర్జటి కవితాశైలి సాక్షాత్తు 'సు వర్ణముఖరి' యే

4. స్వభావ మాధురి:

"భసితోద్ధూళన ధూసరాంగుడు, జటాభారోత్త మాంగుడు, తపోవ్యసనుడు, సాధిత పంచవర్ణ రసనుడు,

వైరాగ్యవంతుడు, నితాంత సుఖస్వాంతుడు, సత్యభూషణుడు, సముద్యద్రత్న రుద్రాక్ష రాజసమేతుడు" – ఇదీ కాళ హస్తీశ్వరుని సాన్నిధ్యమున కావ్యరచన సాగించిన నాటి ధూర్జటి ఆకృతి.

శతకంలో రాజ తిరస్కారం పదేపదే చేసిన ధూర్జటే, 'ఉత్తముడైన రాజును శ్రీకాళహస్తీశ్వరునితో సమముగా జూతు' (ప.98) ననటంలో అతని హృదయ విస్తృతి, స్వభావ మాధురి సముజ్జ్వలంగా భాసిస్తుంది. మరో పద్యంలో "ఒక పుణ్యాత్ముండు నిన్నాత్మ గొల్చి దినంబున్ మొఱవెట్టగా" గృప దలంపవని యిష్ట దైవమునకు తన స్వభావమును గురించి విన్నవించటంలో ఈ కవికున్న ఆత్మ విశ్వాసం వ్యక్తమవుతున్నది. స్వతంత్రతాపూర్వకమైన నిర్భీతి, వశ్చాత్తాప, వైరాగ్యాభిముఖ్యం, కాళహస్తీశ్వర చరణకమలములందలి ప్రపత్తి, పరమ శాంతత – ఈ గుణగణాల సమపాళంగా సమ్మేళనము నొందిన పదమల మధుర స్వభావం ధూర్జటిది. అతని కవితలో ఈ లక్షణాలు అడుగడుగునా ద్యోతకమవుతాయి.

'సాహిత్య శ్రీవరుడై'న ధూర్జటి మహాకవి సమగ్ర స్వభావ మాధుర్యానికి ఈ క్రింది పద్యం సదమల నిదర్శనం.

"దినముం జిత్తములో సువర్ణముఖరీ తీర ప్రదేశామ్ర కా

నన మధ్యోపల వేదికాగ్రమున నానందంబునం బంకజా

సన నిష్ట న్నిను జూడగన్న నదివో సూఖ్యంబు; లక్ష్మీ విలా

సిని మాయానటనల్ సుఖంబు లగునే శ్రీ కాళహస్తీశ్వరా"

సువర్ణముఖరీ లహరీ శీతల శిలాతలమే ధూర్జటి ప్రతిదినం సదాశివుని ధ్యానించే పవిత్ర స్థలం, ఆ పవిత్ర స్థలంలో పద్మాసనస్థుడై, హృదయాలంలో పరమేశ్వరుణ్ణి ప్రతిష్టించుకొని, అంతర్ముఖుడై ఆద్వితీయ శాంభవతేజంతో వెలుగొందినవాడు ధూర్జటి. అట్టిది అతని స్వభావ మాధుర్యం.

5. అర్చనా మాధురి:

ధూర్జటి అర్చనామాధుర్యం అతని మాటలతోనే ఈ క్రిందిది.

''జలకంబుల్ రనముల్, వ్రనూనములు వాచాబంధముల్, వాద్యముల్

కల శబ్దధ్యను, లంచితాంబర మలంకారంబు, దీప్తుల్మె ఱుం

గులు, నైవేద్యము మాధురీ మహిమగా గొల్తున్ నినుం భక్తి రం

జల దివ్యార్చన గూర్చి, నేర్చిన క్రియన్ శ్రీకాళ హస్తీశ్వరా!"

కవిత్వాన్నే 'దివ్యార్చన' గా మలచుకొన్న ధూర్జటి అర్చన మాధుర్యం ఇది.

6. సందేశ మాధురి:

ఆత్మవంచన లేని అంతశ్శుద్ధితో ధూర్జటి శ్రీకాళ హస్తీశ్వర శతకాన్ని రచించాడు. దీనివల్ల తవేతీ, రక్ష దానితో సద్య: పరనిర్వృతితో పాటు సచ్చిదానంత పరమానుభూతీ అనే ఉన్నత ప్రయోజనాలు సమకూడుతున్నాయి. అందువల్లే ఇది కాంత సమ్మితంగానే గాక, ముక్తికాంత సమ్మితంగా కూడా గోచరిస్తుంది.

"పవి పుష్పంబగు, నగ్ని మంచగు, నకూపారంబు భూమీ స్థలం

బవు శత్రు డతిమిత్రుడౌ, విషము దివ్యాహారమౌ నెన్నగా,

నవనీ మండలి లోపలన్ శివశవే త్యాభాషణోల్లాసికిన్

శివ! నీ నామము సర్వవశ్యకరమౌ శ్రీకాళహస్తీశ్వరా!" (ప.45)

'మధు' శబ్దానికి ఈశ్వరుడు అనే అర్థం కూడా ఉంది. (Monier Williams Sanskrit - English Dictionary. New edition - 1951- P.779). మధువు యొక్క మహిమను మధురంగా ప్రవచించటం చేత ధూర్జటి మహాకవి సాహిత్యం సర్వతోముఖమైన మాధురీ మహిమకు నిలయమై ఒప్పుతున్నది.

'తీయ తేనియ' రుచుల – మాధురీ మహిమతో – తెలుగు కవితా ప్రియులకు ధూర్జటి అందించిన కవితామృత ఝషకం శ్రీకాళహస్తీశ్వర శతకం.

ఆధార గ్రంధాలు:

1) ఆరుద్ర **:** సమగ్ర ఆంధ్రసాహిత్యం : సం: 7 యం. శేషాచలం అండ్ కంపెనీ, మద్రాసు, ప్ర.ము. 1965
2) ఆచార్య శ్రీరామమూర్తి, కొర్లపాటి **:** తెలుగు సాహిత్య చరిత్ర : తృతీయ భాగం : రమణశ్రీ ప్రచురణ. విశాఖపట్టణం : 1994.
3) డాక్టర్ నాగయ్య జి. **:** తెలుగు సాహిత్య సమీక్ష : రెండవ సంపుటం : నవ్య పరిశోధక ప్రచురణ, తిరుపతి. ద్వి.ము. 1996.

తెలుగువీరుల శౌర్యపరాక్రమాలకు ప్రతీక 'ఓరుగల్లు - వీరగల్లు'

తంగి ఓగేశ్వరరావు, తెలుగు అధ్యాపకులు, వి.వి.గిరి ప్రభుత్వ కళాశాల, దుంపగడప. సెల్ : 9959753832

తెలుగు సాహిత్యం అత్యంత ప్రాచీన ప్రక్రియ. తెలుగు సాహిత్యం పద్య ప్రక్రియతోనే ప్రారంభమైంది. ఆధునిక కాలంలో కూడా ఎందరో తెలుగు కవులు పద్యకావ్యాలు, శతకాలు, దండకాలు రాస్తునే ఉన్నారు. కాని ప్రస్తుత కాలంలో ఇతర సాహిత్య ప్రక్రియలతో పోలిస్తే పద్యానికి ఆదరణ తగ్గిందని భావించవచ్చు. దీనికి కారణం భాషా శైలిలోనూ, భావవ్యక్తికరణలోనూ వచ్చిన నూతనత్వమే. ఆధునిక కాలంలో గ్రాంథిక భాష వెనుకబడి వ్యావహారిక భాష రచనా భాషగా పాఠకలోకంలో స్థిరపడింది. సరళంగా, సూటిగా, సులభంగా చదువుకోవడానికి వీలున్న రచనలనే ప్రస్తుతం పాఠకులు ఆదరిస్తున్నారు. కాని 'పద్యంలో సుదీర్ఘ సంస్కృత సమాసాలుండాలి. అర్థలంకారమో, శబ్దాలంకారమో ఏదో ఒకటి ఉండాలి. ప్రతి పద్యంలోనూ చమత్కృతిమత్కృతిత్వం ఉండాలి' అని కొందరు కవులు పద్యాన్ని సామాన్య జనానికి దూరం చేశారు. పద్య సహజ సౌందర్యం, ప్రాథమిక ప్రయోజనం దెబ్బతిన్నాయి.

కాని 1990వ దశాంకం నుండి పద్యకవిత్వంలో ఒక నూతన ఒరవడి మొదలైంది. వస్తువులోనూ, భాషలోనూ తెలుగు పద్యం నూతన శోభను సంతరించుకుంది. గతంతో పోలిస్తే వస్తువైవిధ్యం పుష్కలంగా కనిపిస్తుంది. పురాణ ఇతిహాసాల నుండి కాక చారిత్రక, సాంఘికాంశాలను ఇతివృత్తాలుగా తీసుకొని చాలా మంది కవులు పద్యకావ్యాలను రచించారు. పద్యంలో వాడే భాష కూడా మారుతూ వచ్చింది. ప్రౌఢ గ్రాంథికం నుండి సరళ గ్రాంథికం, వ్యావహారికం, జానపద భాష - ఇలా పద్య కవితలోని భాష మారుతూ ఉండడం గమనర్హం.

భారతం శ్రీమన్నారాయణగారి 'పాంచాలి', గాడేపల్లి సీతారామమూర్తిగారి 'అశ్వాత్థామ' మొదలైన పౌరాణిక కథలలో కొత్త పోకడలు, యార్లగడ్డ వెంకట సుబ్బారావుగారి 'కాకతీయ తరంగిణి', డా.మల్లెల గురవయ్యగారి 'సీతారామ రాజీయము' మొదలైన చారిత్రక కావ్యాలు, మన్నవ భాస్కరనాయుడుగారి సామాజిక ఇతివృత్తంతో కూడిన 'స్వేద సూర్యోదయ' కావ్యం, జోస్యం విద్యాసాగర్ గారు వ్యావహారిక భాషలో రాసిన 'అమ్మ', గొట్టిముక్కల సుబ్రహ్మణ్య శర్మ గారు జానపద భాషలో రాసిన 'మల్లీ ఓ మల్లీ', బేతవోలు రామబ్రహ్మంగారి వర్ణనాత్మక రచన 'క్రొత్త గోదావరి', అటువంటిదే అయిన నీలంరాజు నరసింహారావు గారి 'నా పల్లెటూరు', వీటి అన్నిటి మధ్య దుగ్గిరాల రామారావు గారు అనువదించిన ప్రౌఢ అలంకార గ్రంథం 'రసమంజరి' ఇలా అనేక కవులు రాసిన వస్తు వైవిధ్యం గల అనేక కావ్యాలు ఈ మధ్య కాలంలో వెలువడి పద్య సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. మొత్తం మీద ఒకే మూసలో వెలువడుతూ ఉండిన పద్య కవిత తన శృంఖలాలను తెంచుకొని స్వైర విహారం మొదలు పెట్టిందని చెప్పవచ్చు. పై రచయితల కోవకు చెందిన మరో రచయిత శ్రీ కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళెగారు.

కరణం బాసుబ్రహ్మణ్యం పిళ్ళెగారు ఫిబ్రవరి 1, 1936 న చిత్తూరు జిల్లా తలుపులపల్లెలో జన్మించారు. ఇతని తల్లిదండ్రులు కృష్ణమ్మ, కుమారస్వామి పిళ్ళె. ఉన్నత పాఠశాల విద్య మదనపల్లి, పలమనేరుల్లోనూ, పి.యూ.సి. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి, భాషా ప్రవీణ ఆంధ్రవిశ్వవిద్యాలయం నుండి పొందారు. చిత్తూరు జిల్లాలోని అనేక ఉన్నత పాఠశాలలో తెలుగు పండితులుగా పనిచేసి 1994లో కలిచెర్ల ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ చేశారు. పదవీవిరమణ అనంతరం మదనపల్లెలో స్థిరపడ్డారు. అచేతన స్థితిలో ఉన్న మదనపల్లె రచయితల సంఘంలో తిరిగి చైతన్యం నింపారు. పద్యకవిగా తన రచనా వ్యాసంగాన్ని ప్రారంభించిన కరణంవారు తరువాత కాలంలో

తెలుగు సాహిత్యంలో నవల, కథ, వ్యాసం, నాటకం మొదలైన అన్ని ప్రక్రియలలోనూ రచనలు చేశారు.

కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళెగారు 'విషాద మాధవి', 'చరిత్రకెక్కని మారణహోమం','ఒక రాఘవరెడ్డి కథ', 'ఓరుగల్లు – వీరగల్లు' అనే నాలుగు పద్యకావ్యాలను రచించారు. వీటిలో మొదటి రెండు కావ్యాలలో ఇతివృత్తం పౌరాణికం కాగా, మూడవ కావ్యం సాంఘిక ఇతివృత్తం ఆధారంగా నిర్మించారు. ఇక చివరి కావ్యం 'ఓరుగల్లు – వీరగల్లు'. ఇది చారిత్ర ఇతి వృత్తం ఆధారంగా నిర్మించబడింది.

ఓరుగల్లు – వీరగల్లు :

చారిత్రక నేపథ్యం: కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళెగారు రాసిన ఏకైక చారిత్రాత్మక పద్య కావ్యం 'ఓరుగల్లు – వీరగల్లు'. ఇందులో యాదవ కాకతీయుల యుద్ధం మాత్రమే యథార్థ చరిత్ర. తక్కినదంతా కల్పితమే. మన పూర్వీకులు దేశ, రాజ, సమాజ రక్షణ కోసం అసమాన ధైర్య సాహసాలు చూపి, ప్రాణాలు వదిలిన వీరులకు సంకేతంగా ఒక బండపై ఆ వీరుని రూపం చెక్కి, ప్రతిష్ఠించేవారు. ఆ శిల్పమూర్తికి వీరగల్లు అని పేరు. ఇవి ఎక్కువుగా తెలంగాణా, రాయలసీమ ప్రాంతాలలో కనిపిస్తాయి.

"మన తెలుగుసీమ చరిత్రలో ఎందరో రాజులున్నారు. చాళుక్యులు, కాకతీయులు, రెడ్డి, వెలమ, పద్మనాయక ప్రభువులు, విజయనగర, నాయకరాజులు ఎందరో ఉన్నారు. వీరి పేర్లు సామాన్య ప్రజలలో చాలా మంది వినే ఉండరు. ఎప్పుడో విశ్వనాథవారు మాధవవర్మ కథ వ్రాశారు. అదీ ఒక ఖండికలాగా. అలాంటి ఎందరో తెలుగురాజుల పేర్లు ప్రజల్లోకి రావాలి" అనేది బాలసుబ్రహ్మణ్యం పిళ్ళెగారి అభిప్రాయం. దీనికి ప్రతిరూపమే 'ఓరుగల్లు – వీరగల్లు' పద్యకావ్యం.

ఇతివృత్తం : యాదవుల రాజధాని నగరం దేవగిరి వర్ణనతో ఈ పద్యకావ్యం ప్రారంభమవుతుంది. ఈ యాదవ రాజ్యానికి రాజు మహాదేవుడు. ఉత్తరాది ప్రాంత పాలకులు ఈ యాదవ రాజ్యాన్ని ఆక్రమించడానికి ప్రయత్నిస్తారు. కాని యాదవ సైన్య పరాక్రమానికి లొంగి, వెనుదిరిగిపోతారు. అటువంటి యాదవ రాజ్య పాలకుడైన మహాదేవుడు తమ రాజ్యానికి దక్షిణంగా ఉన్న తెలుగు రాజ్యమైన కాకతీయ రాజ్యాన్ని ఆక్రమించుకోవాలని అనుకుంటాడు. కాని తెలుగువీరుల బల పరాక్రమాలకు భయపడి ఆ సాహసం చేయలేకపోతాడు. ఆ సమయంలో కాకతీయ రాజ్యాన్ని గణపతి దేవుని కుమార్తె రుద్రమదేవి పరిపాలిస్తుంది. తన అసమర్థతను కుప్పిపుచ్చుకోవడానికి మహాదేవరాజు **"వినుడీ కయ్యము నెయ్యమున్ సమబలాఢ్య వ్యక్తులం జెల్లుగాక నరేంద్రుల్ వనితా విరోధమును వీకన్ జేకొనన్ శౌర్యమే"** అని వ్యర్థ ప్రగాల్భాలు పలుకుతాడు.

'కాకతీయ రాజ్యాన్ని ఒక ఆడది పాలిస్తుంది. ఆ కాకతీయ వంశంలో రాజ్యాన్ని పాలించగలిగిన సమర్థులైన మగవారు లేరా? కాకతీయ సైన్యంలో వీరులకు ఒక ఆడదాని పాలనను అంగీకరించడానికి సిగ్గు లేదా? అని మహాదేవుడు తెలుగువీరులను నానారకాలుగా నిందిస్తాడు. కాని ఆ యాదవరాజుపైకి ఈవిధంగా బీరాలు పలికినా, అతనికి **"కాకతీశ్వరిని రుద్రమ నాత్మదలచినంతనే వేపథువున్, వివర్ణతయు, వెక్కసపాటును, ఘర్మవారియున్ దోప గుండె ఝల్లుమను. తూలును మాటయు, పాయు ధైర్యమున్".**

యాదవరాజు మహాదేవుని మాటలను నమ్మి, కొందరు కాకతీయ సామంతులు 'గణపతిదేవుడు సమర్థుడు. అతనిని ఎదిరించలేకపోయాం. కాని ఇప్పుడు అతని కుమార్తె రుద్రమదేవి కాకతీయ రాజ్యాన్ని పాలిస్తుంది. ఒక ఆడదానిని ఓడించి రాజ్యాన్ని ఆక్రమించడం కష్టం కాదు' అని భావిస్తారు. యాదవరాజు అండతో కాకతీయుల రాజధాని నగరం ఓరుగల్లును ముట్టడిస్తారు. అప్పుడు కాకతీయ రాణి

రుద్రమాంబ తనకు ఆప్తులు,మీత్రులైన వారితో కలసి శత్రుసైన్యాలను ఎదుర్కొంటుంది. ఈ పోరాటంలో కాకతీయ సైన్య పరాక్రమానికి, రుద్రమాంబ సాహసానికి యాదవ సైన్యం ఖకావికలమై వెన్నుచూపుతుంది. యాదవరాజు మహాదేవుడు రుద్రమాంబకు బందీగా చిక్కుతాడు.

బందీగా చిక్కిన మహాదేవరాజును కాకతీయ సైన్యం రుద్రమదేవి ముందు నిలబెడతారు. 'నీకు ఎటువంటి ప్రాణహాని తలపెట్టను. అవిధేయులైన మా సామంతుల మాటలు విని, కొంచెం కూడా ఆలోచించకుండా మంద బుద్ధితో మాపై దాడి చేశావు. నీవు గొప్ప పరాక్రమవంతుడైన రాజువు. నీది సిరి సంపదలతో తులతూగే రాజ్యం. అటువంటి నీకు పొరుగు రాజ్యాలని ఆక్రమించాలన్న ద్రోహబుద్ధి మంచిది కాదు. నా తండ్రి గణపతి దేవుని దిగ్విజయ యాత్రలను గురించి తెలిసి కూడా మా రాజ్యంపై దండెత్తడానికి నీకు ధైర్యం ఎలా వచ్చింది? వాటిని మరచి పోయావా?' అని రుద్రమాంబ, మహాదేవుడిని గద్దిస్తుంది. ఇంకా

చ. **"అతివయొ, బాలుడో, గత వయస్కుడొ, యేలిక యెవ్వరైన నే**
మి? తెలిసి కొమ్ము, పౌరుషము మిన్నులు మట్టిన తెల్గుజాతి కా
కతి రణవారు జాతి, కడికండలు చీల్చెడి జాతి దానియు
ద్ధతి గడపంగ నోపుదువె రిత్త ప్రగల్భము లాడి గెల్తువే?"

అని తెలుగుజాతి పరాక్రమాన్ని వివరిస్తుంది. యుద్ధంలో మరణించిన సైనికుల కుటుంబాలకు కోటి, యుద్ధానికైన వ్యయానికి కోటి మొత్తం రెండు కోట్ల విలువగల కానుకలను చెల్లించమని యాదవరాజును రుద్రమాంబ ఆదేశిస్తుంది. వెంటనే యాదవరాజ్య మంత్రులు దేవగిరి నుండి రెండు కోట్లు విలువగల కానుకలు తెచ్చి రుద్రమాంబకు చెల్లిస్తారు. రుద్రమాంబ మహాదేవరాజుకు ప్రాణభిక్ష ప్రసాదిస్తుంది.

రుద్రమదేవి దయతో ప్రాణాలు దక్కించుకున్న ఆ యాదవరాజు అవమాన భారంతో దేవగిరికి వెళ్తాడు. 'ఏ రాజ్యాన్ని ఎవరు పాలిస్తే నాకెందుకు! ఆ కాకతీయ రాణి రుద్రమాంబను తూలనాడడం ఏల? ఆ క్షుద్ర వీధ్రోహులైన సామంత తెలుగు దొరలు నన్ను సహాయంగా రుద్రమాంబతో యుద్ధానికి రమ్మని కోరటమేల? సాధ్యాసాధ్యాలు ఆలోచించకుండా యుద్ధానికి వెళ్ళడం ఏల? చేతులార నేనే ఈ చేటును తెచ్చుకున్నాను' అని మహాదేవరాజు చింతిస్తాడు. రాణివాసం వారికి గానీ, మంత్రులకు గానీ, ప్రజలకు గానీ తన ముఖం చూపించకుండా కాలం గడుపుతాడు.

ఈ విధంగా అవమాన భారంతో కాలం వెళ్ళదీస్తున్న యాదవరాజును 'గెలుపోటములు సహజం. కొందరు మూర్ఖులైన తెలుగు దొరల మాటలు విని సరైన వ్యూహం లేకుండా వెళ్ళడం వలనే ఓడిపోయాం. నీవు ఢిల్లీ, గుజరాత్, విదర్భ ప్రాంతాలను జయించిన ప్రతాపవంతుడవు. ఇప్పుడు ఈ చిన్న పరాజయానికే చింతించడం తగదు. మనం మంచి సమయం చూసి, సరైన సన్నాహాలతో యుద్ధానికి పోతే విజయం తప్పకుండా వరిస్తుంది' అని అతని మంత్రులు ఓదార్చుతారు. కాని రుద్రమాంబ చేతిలో పొందిన అవమానపుటగ్నిలో దహించుకుపోతున్న యాదవ రాజుకు ఆ మంత్రుల మాటలు ఏమాత్రం సాంత్వన కలిగించవు.

దేవగిరి నగరంలోని యువకులు విలాస జీవులు. జీవనోపాధి మార్గాలు చాలా ఉండటంతో పనిపాటు లేక **"అచ్చుబోసిన యాబోతులనగవారు, తిరుగుదరు బాధ్యతలు మాని పురము నందు."** యాదవరాజు కాకతీయుల చేతిలో ఓడినప్పటి నుండి దేవగిరి యువకులందరూ విషాదంలో మునిగిపోతారు. నగరమంతా కళావిహీనంగా మారిపోతుంది. కాకతీయులను, వారి రాణి రుద్రమదేవిని ఏమి చేయలేక **"ఓరుగల్లుకు ప్రతిరూప మొకటి చేసి, కొదరి కసిదీర దానిని**

గ్రొచ్చి కూర్చి మట్టగింతము జనులు సమ్మతిని జూడ, నదియె నేటికి కర్తవ్యం" అని దేవగిరి యువకులు నిర్ణయించుకుంటారు. ఈ విధంగా తమకు జరిగిన అవమానం నుండి కొంత ఉపశమనం పొందవచ్చునని అనుకొంటారు.

నిర్ణయించిందే తడవుగా దేవగిరి యువకులు ఒక మూరెడెత్తు మట్టికోటను నిర్మిస్తారు. ఓరుగల్లు కోటలోని మైలసంత, మడిసంత, వేయిస్తంభాల గుడి, సానివీధి, విపణివీధి, రాచవీధి, రాజభవనము మొదలైన వాటికి చిహ్నంగా ఆ మట్టికోటలో కొన్ని గుర్తులు ఉంచుతారు.

సీ. **"ఇదె యొరుగలు కోట, యిదిగ్రొచ్చి యీ యగ**
డ్తను బూడ్చివైతము తరలి రండు;
ఇదె కంపకోట, యియ్యెడ నిప్పుబెట్టి కా
ల్చెదము బూడిదగాగ కదిలిరండు;
ఇదె సాని వీధి, యింటింటను దూరి తొ
య్యలుల బట్టుదముగా కరుగు దెండు;
ఇదె వీటి విపణి, సంపదల కాణాచి ని
శ్శంక కొల్లలు గొట్ట సాగిరండు;

రండనుచు నపహాస్య సంభ్రమము దోప
చెలగి కేరింతలిడుచు దుశ్చేష్టితముల
కృతక కాకతిపురమున కేకలిడిరి
రేపకడ వత్తమని యేగిరేపుమీర"

అని ఆ దేవగిరి యువకులు మిక్కిలి ఆనందంతో కేరింతలు కొడతారు. రేపు ఉదయం వచ్చి ఆ మట్టి కోటను నాశనం చేయాలని నిర్ణయించుకుంటారు.

దేవగిరికి వెలుపల చిన్నపాక నిర్మించుకొని బాచన అనే వ్యక్తి నివసించేవాడు. అతడు జీవనోపాధి నిమిత్తం ఓరుగల్లు నుండి దేవగిరికి వచ్చిన తెలుగువాడు. సైనికులకు అవసరమైన విల్లంబులు చేయడం అతని పని. దేవగిరి యువకులు ఓరుగల్లు ప్రతిమ చేశారనీ, దానిని రేపు నాశనం చేస్తారనీ బాచనకు తెలుస్తుంది. అతనిలో మాతృభూమిపై గౌరవవాభిమానాలు పెల్లుబుకుతాయి. **"యీ తెల్గువా డొక్కడుద్దాము స్ఫూర్తి జరింపగా రిపుల దోర్దోష్టంబులుం జెల్లునే"** అని ఆ దేవగిరి యువకులకు తెలుగు వీరుల సామార్థ్యాన్ని చూపించాలని నిర్ణయించుకుంటాడు. వారితో పోరాటానికి అవసరమైన బాణాలు, తైలము, కప్పురము, దూది, ద్రావకం, గుగ్గిలం, లక్క సమకూర్చుకుంటాడు. బాణాల మొనలకు వాటిని అమర్చి, రెండు బలమైన ధనుస్సులను సిద్ధం చేసుకుంటాడు. ఈ విధంగా దేవగిరి యువకులతో పోరాటానికి బాచన సిద్ధమవుతాడు.

తర్వాత రోజు సూర్యోదయ సమయానికి దేవగిరి యువకులు ఓరుగల్లు ప్రతిమ వద్ద గుముకూడుతారు. దానిని నాశనం చేయడానికి సిద్ధపడతారు. అంతలో బాచన అక్కడికి వచ్చి 'మీ ప్రయత్నము మానండి. మిమ్మల్ని చిన్నాభిన్నం చేయడానికి ఇక్కడ ఒక తెలుగువీరుడు ఉన్నాడు. ఓరుగల్లు నిజమైనదైన, ప్రతిమైన మాతృభూమికి అపకీర్తి వస్తే ప్రాణాలొడ్డి కాపాడుకోవడం తెలుగువీరుల కర్తవ్యం. నా ప్రాణం ఉన్నంత వరకు మీరు ఈ ప్రతిమను తాకలేరు' అని దేవగిరి యువకుల్ని హెచ్చరిస్తాడు. బాచన మాటలు విన్న ఆ యువకులు 'ఉడత ఊపులకు మేము భయపడం. పుట్టిన ఊరిలో దిక్కులేక ఇక్కడికి వచ్చావు. ఇక్కడ బాగా బలిసి మాపైనే తిరగబడతావా? మాకు అడ్డు తప్పుకో. లేకపోతే నిన్ను కూడా ఈ ప్రతిమతో పాటు తగలబెడతాం' అని బాచనతో అంటారు. దీనితో బాచన తన వద్ద ఉన్న అగ్నిబాణాలని వారిపై ప్రయోగిస్తాడు. దేవగిరి యువకులు ఈ అగ్నిబాణాల దాటికి చెల్లాచెదురైపోతారు. ఈ మంటలు నగరమంతటా వ్యాపిస్తాయి. ఆ మంటల్ని చూసి రాజభటులు అక్కడికి వస్తారు.

దేవగిరి యువకుల ద్వారా జరిగిన విషయం తెలుసుకున్న రాజభటులు 'ఏరా! తిన్నది అరగడం లేదా? మా ఊరి అన్నం తిని, మా ఊరి నీళ్ళు త్రాగి, మాకే ద్రోహం చేస్తావా? విల్లంబులు చేయడంలో మంచి నైపుణ్యం

గలవాడవని నిన్ను చేరదీస్తే ఇలా చేయవచ్చా?' అని బాచనను నిలదీస్తారు. వారి మాటలకు బాచన

తే. **"నా పురంబును జెరుప మీ రోపినపుడు**
మీ పురంబును జరుప నే నోపనేమి?
ఒక్కరుడనైన నేమి? నా యూపిరున్న
దాక పోరాడి చచ్చెదగాక యిచట"

అని సమాధానం చెబుతాడు. రాజభటులపై అగ్నిబాణాలు ప్రయోగిస్తాడు. దేవగిరి నగరం మొత్తం ఆకావికల మవుతుంది.

బాచనను నిలువరించడానికి దేవగిరి సైనికులు వ్యూహరచన చేస్తారు. వందల బాణాలు ఒకేసారి బాచనపై ప్రయోగిస్తారు. ఈ బాణాలు తగిలి బాచన నేలకొరుగుతాడు. ఈ విధంగా బాచన తెలుగు నేల, తెలుగు జాతి గౌరవ ప్రతిష్ఠలు పరదేశంలో నిలిపే ప్రయత్నంలో మరణిస్తాడు.

వేగుల ద్వారా రుద్రమదేవికి బాచన పరాక్రమం, దేశభక్తి తెలుస్తుంది. 'బాచన మన సైనికుడు కాదు. ఏనాడు మనపై ఆధారపడలేదు. కాని మాతృభూమిపై ప్రేమతో తన ప్రాణాలు అర్పించాడు. దేశభక్తులలో అతనికి సరితూగేవారు లేరు' అని రుద్రమాంబ తన కొలువులో అతని త్యాగాన్ని కొనియాడుతుంది. బాచన త్యాగం ఓరుగల్లు ఉన్నంతవరకు చిరస్థాయిగా ఉండేలా అతని పేర ఒక వీరగల్లును ఓరుగల్లు కోటలో ప్రతిష్ఠిస్తుంది.

తే. **"తెలుగు తేజంబునకు వింత దీప్తి గూర్చి**
తనువు రాల్చిన బాచన ఘన చరిత్ర
తలచుకొందురు తరతరంబులకు నిట్లు
వీర బాచన పేరదీ వీరగల్లు"

ఈ వీరగల్లు వరంగల్లు కోటలోపల పడమటి ప్రవేశ ద్వారం కుడివైపున వెలసి నేటికీ పూజలందుకొంటుంది.

ఓరగల్లు – వీరగల్లు పద్యకావ్యం – తెలుగువారి శౌర్య పరాక్రమాలు :

బాలసుబ్రహ్మణ్యం పిళ్ళెగారు ఈ కావ్యంలో రుద్రమ దేవిని గొప్ప రాజనీతిజ్ఞురాలిగా, తెలుగుజాతి కీర్తి కిరీటంగా, తెలుగువారి శౌర్య పరాక్రమాలకు ప్రతీకగా చిత్రించారు.

సీ. **"ముక్కంటి కనుమంట ముట్టి యోర్వగవచ్చు**
కాకతి తేజంబు తాకరాదు;
స్పర్ధమై యేచి గ్రావంబు డీకొనవచ్చు
చని యొరుగులుకోట చెనగరాదు;
కరువలి నుఱవొండు కడలి దాటగవచ్చు
తెలుగు వాహిని దాట దివురరాదు;
కడువిచ్చి కన్నుల నడిప్రొద్దు గనవచ్చు
చేరి రుద్రమను వీక్షింపరాదు;
శాత్రవాధృష్యమును మిత్ర సమభిగమ్య
మదియె పరిపంథి రాజన్య హృదయ కంట
కాయమాన వైభవము విఖ్యాత యశము
వరలు నా యొరుగలు తెల్గు పురవరంబు"

అని రచయిత రుద్రమాంబ శౌర్య పరాక్రమాలను ప్రశంసించారు.

మహదేవరాజు బంధీగా చిక్కిన తరువాత కాకతీయ కొలువులో రుద్రమదేవి **"మఱచితె నీ పితామహుడు మా జనకుండును సౌహృదాప్తిమై వరలుచు దుర్నిరీక్ష్యులయి భారతమేలిన పూర్వ వృత్తముల్"** అని మహదేవునితో అన్న మాటలు ఐక్యమత్యం, స్నేహం ద్వారా యాదవ, కాకతీయ రాజ్యాలు రెండూ లబ్ధిపొందిన విషయాన్ని దృఢపరుస్తున్నాయి. తరువాత కాలంలో ఈ ఐక్యమత్యం లోపించడం వల్లనే దక్షిణభారతం ఢిల్లీ సుల్తానుల వశమైనట్లు రుద్రమదేవి మాటల వలన స్పష్టమవుతుంది.

దేవగిరిలో తెలుగుజాతి గౌరవాన్ని కాపాడే ప్రయత్నంలో అసువులు బాసిన బాచన వీరగల్లును ఓరుగల్లులో ప్రతిష్ఠిస్తుంది రుద్రమదేవి. అతని త్యాగాన్ని చిరస్మరణీయం చేస్తుంది. ఇలా వీరారాధన, తెలుగుజాతి పట్ల అభిమానం అణువణువునా నింపుకున్న వ్యక్తిగా రచయిత రుద్రమదేవి పాత్రను చిత్రించారు.

ఈ కావ్యంలో రచయిత రుద్రమదేవికి ఒక విశేషణం వేశారు. **"ఆంధ్ర సామ్రాజ్య పూజ్య సింహాసనాధిరూఢ"**[1] అని. ఇది చదవగానే **"కాశికానగర హాటక పీఠ శిఖాధిరూఢ"** అనే శ్రీనాథుని సమాసం మనస్సులో మెదులుతుంది. మెదలడం కవి ఉద్దేశమే. మెదిలితేనే రుద్రమదేవి పార్వతీదేవిగా స్ఫురిస్తుంది. **"దేవగణోపాశ్రిత దుర్గనా వెలసె దీవ్యన్మూర్తి రుద్రాంబయున్"** అనే వర్ణన దీన్ని దృఢ పరుస్తుంది.

రుద్రమదేవి ఆడపిల్ల. అయితేనేమి తండ్రిగారు మగపిల్లాడిలా తీర్చిదిద్దారు. ఆమె శౌర్యపరాక్రమాలకు కాణాచి. ఆమె కొలువు తీరే విధానాన్ని చెప్పే సమయంలో **"పురుష వేషాన కొలువుండె బిరుదు మగవ"** అన్నారు రచయిత.

క. "ఒక కంట సౌమ్యమును వే
రొక కంటను రౌద్రభావ మొక్కట నెలవె
ప్రకట శరత్ గ్రీష్మర్తు
త్సుకతను కాకతి యశస్వి శోభిల్లె సభన్"

అంతర్బహిశ్చ తత్సర్వం అన్నట్టు పౌరుషం రూపుగొన్న రుద్రమ్మను కాకతి యశస్విని అనడం కన్నా యశస్వి అనడమే ఔచిత్యంగా భావించి రచయిత ఇలా ప్రయోగించారు.

ఈ విధంగా పరాక్రమం, వివేకం, జాతి పట్ల గౌరవం మెండుగా కలిగిన స్త్రీమూర్తిగా బాలసుబ్రహ్మణ్యం పిళ్ళెగారు రుద్రమదేవి పాత్రను చిత్రించారు.

బ్రతుకు తెరువుకు కాకతీయ రాజ్యం నుండి దేవగిరికి వచ్చిన కమ్మరి బాచన. ఈటెలు, కత్తులు, విల్లంబులు చేయడం ఇతని ప్రధాన వృత్తి. ఉదర పోషణార్థం దేవగిరికి వచ్చినా, తెలుగు నేలపై ప్రేమ, గౌరవం మనస్సు నిండా నింపుకున్న వ్యక్తిగా బాలసుబ్రహ్మణ్యం పిళ్ళెగారు ఈ కావ్యంలో బాచన పాత్రను తీర్చిదిద్దారు.

మ. "నిలువెల్లం దెలుగుందనంబు కదు సందీప్తంబుగా, నాత్మలో
తలపెల్లన్ నిజ కాకతీయ మహిమోత్సాహంబుగా, గోష్ఠులన్
పలుకెల్లన్ వర రుద్రమాంబ ప్రతిభాప్రస్తోన పూర్ణంబుగా
చెలగున్ బాచన యోరుగల్లు నగర శ్రీకిన్ ప్రతీకాత్ముడై"

అని రచయిత తెలుగువారి శౌర్య పరాక్రమాలకు ప్రతీకగా బాచన పాత్రను నిర్మించారు. అంతర్బహిశ్చ తత్సర్వం అన్నట్టు పౌరుషం రూపుగొన్న రుద్రమ్మను కాకతి యశస్విని అనడం కన్నా యశస్వి అనడమే ఔచిత్యంగా భావించి రచయిత ఇలా ప్రయోగించారు.

ఈ విధంగా పరాక్రమం, వివేకం, జాతి పట్ల గౌరవం మెండుగా కలిగిన స్త్రీమూర్తిగా బాలసుబ్రహ్మణ్యం పిళ్ళెగారు రుద్రమదేవి పాత్రను చిత్రించారు.

బ్రతుకు తెరువుకు కాకతీయ రాజ్యం నుండి దేవగిరికి వచ్చిన కమ్మరి బాచన. ఈటెలు, కత్తులు, విల్లంబులు చేయడం ఇతని ప్రధాన వృత్తి. ఉదర పోషణార్థం దేవగిరికి వచ్చినా, తెలుగు నేలపై ప్రేమ, గౌరవం మనస్సు నిండా నింపుకున్న వ్యక్తిగా బాలసుబ్రహ్మణ్యం పిళ్ళెగారు ఈ కావ్యంలో బాచన పాత్రను తీర్చిదిద్దారు.

మ. "నిలువెల్లం దెలుగుందనంబు కదు సందీప్తంబుగా, నాత్మలో
తలపెల్లన్ నిజ కాకతీయ మహిమోత్సాహంబుగా, గోష్ఠులన్
పలుకెల్లన్ వర రుద్రమాంబ ప్రతిభాప్రస్తోన పూర్ణంబుగా
చెలగున్ బాచన యోరుగల్లు నగర శ్రీకిన్ ప్రతీకాత్ముడై"

అని రచయిత తెలుగువారి శౌర్య పరాక్రమాలకు ప్రతీకగా బాచన పాత్రను నిర్మించారు.

దేవగిరి యువకులు ఓరుగల్లు ప్రతిమను నిర్మించి, దానిని నాశనం చేస్తున్నారని తెలిసి వారి ప్రయత్నాన్ని

నిర్వీర్యం చేయడానికి సిద్ధమవుతాడు బాచన. **"ఇది కృతకంబొ, నిక్కమొ మరేమయినన్ సరె యోరుగల్లగా మదిగొని దీనికిప్పు డవమానము చేయుట చూచి సైతునే"** అని బాచన దేవగిరి యువకులపై దాడి చేస్తాడు. వారిని కకావికలం చేస్తాడు. చివరికి దేవగిరి సైనికులు మూకుమ్మడిగా అతనిపై బాణ ప్రయోగం చేయడంతో మరణిస్తాడు.

తే. "ఓరుగల్లు ప్రతిష్ఠకు నొప్పమి గని
ఓరుగలు మానిసి సహించి యుండడనుచు
చాటె నీ వీరబాచన జగమునందు
దేశభక్తికి నితనితో దీటెవండు!"

ఈ విధంగా మాతృ భూమి గౌరవం కాపాడటానికి తన ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యాగం చేసిన వ్యక్తిగా, దేశభక్తునిగా రచయిత బాచన పాత్రను రూపొందించారు.

"ఒక తెలంగాణా వీరుడి కథను ఒక రాయలసీమ కవివీరుడు కావ్యంగా మలచడం ఇప్పుడున్న వాతావరణంలో ఇబ్బడిముబ్బడిగా అభినంద్యం. ఓరుగల్లు వీరుడు దేవగిరిలో ఒంటరి పోరాటం సాగించి ప్రాణత్యాగం చేసిన అద్భుత కథ. బాచనపేర నిలిచిన వీరగల్లు. ఒక పుష్కరం క్రిందట అనుకుంటాను అమలాపురం వాస్తవ్యులు కావ్యశ్రీ నారాయణరావుగారు కోనసీమ కుర్రవాడికీ తెలంగాణా కుర్రదానికీ మూడుముళ్ళ వేయించిన కథతో ఒక కమనీయ కావ్యం ప్రచురించారు. ఇలాంటి ఇతివృత్తంతో మరిన్ని రచనలు రావాలి. వస్తే, ఉభయ ప్రాంతాలవారికీ అపోహలు తొలగి సంస్కృతి పరమైన సమైకత పరిధవిల్లుతుంది. తెలుగువాణి బలపడుతుంది. అదనున కురిసిన వానజల్లు ఈ వీరగల్లు" అని బేతవోలు రామబ్రహ్మంగారు ఈ కావ్యాన్ని ప్రశంసించారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. కరణం బాలసుబ్రహ్మణ్యం– ఓరుగల్లు – వీరగల్లు, అమర్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, మదనపల్లె, సెప్టంబర్ 2010
2. వావిళ్ల రామస్వామిశాస్త్రి అండ్ సన్స్ – శ్రీనాథమహాకవి ప్రణీత కాశీఖండము, వావిళ్ల ప్రెస్, మద్రాసు, 1917

"బోయి భీమన్న రాభీలు – పరిశీలన"

మానవతా కవి రుద్రపాక జితేంద్రకుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, పి.బి.సిద్ధార్థ కళాశాల (స్వ.ప్ర), విజయవాడ.
చరవాణి : 7993818667.

పరిచయం: –

అమృతతుల్యమైన భాష మన తెలుగుభాష. అనంతమైన మన తెలుగుభాషా సాహిత్యంలో అనేక సాహిత్య ప్రక్రియలు కనిపిస్తాయి. సమాజంలో మార్పులను సాహిత్యం ఎప్పటికప్పుడు తనలో నిక్షిప్తం చేసుకుంటుంది. ఒక్కోసారి సమాజంలో సంభవించే పెనుమార్పులు చక్కని సాహిత్య సృష్టికి కారణమౌతాయి. ఈ విధంగా సామాజికమార్పును స్పష్టంచేస్తూ వచ్చినటువంటి సాహితీవాదములు అనేకము పరిశీలనలో కానవస్తాయి. మన తెలుగుసాహిత్యంలో పద్యకవిగా, గేయకవిగా, వచనకవిగా, నాటకకర్తగా అద్భుత సాహిత్యప్రతిభను కనపరించినటువంటి బోయిభీమన్న 1911నసెప్టెంబరు 19న తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురు ప్రాంతాన పుల్లయ్య,నాగమ్మ దంపతులకు జన్మించారు. 1935లో బి.ఏ పరీక్షలో ఉత్తీర్ణులైనారు. 1937లో బి.ఇ.డి పూర్తి చేశారు. వృత్తిరిత్యా ఉపాధ్యాయులు వీరు. భీమన్న సుమారు 70 పుస్తకాలు వ్రాశారు. పద్య,గేయ, వచన, రచనలతో పాటు నాటకాలను కూడా వ్రాశారు. వీరు వ్రాసిన 'జయజయ అంబేద్కర' దళితసోదరులకు జాతీయగేయమై నేటికీ ఊరూరా మారుమ్రోగుతున్నది. కళాప్రపూర్ణ, పద్మశ్రీ, పద్మభూషణ్, కేంద్రసాహిత్య అకాడెమీ అవార్డు అనేక పురస్కారములను పొందినారు.

భీమన్న రాభీలు – పరిశీలన :

నేను వ్రాసే ప్రేమ గేయాలకు నేను పెట్టుకున్న పేరు రాభీలు. నా గేయాల కోసం నేను సృష్టించుకున్న క్రొత్త పదం రాభీ. స్త్రీ సహజమైన రామము, పురుష సహజమైన భీమము ఈ రెండు ప్రకృతి యొక్క ప్రధాన వృత్తులు. ప్రకృతిని పూర్ణముగ అనుభవించేవే ఈ గేయాలు. కనుక ఈ గేయాలకు రాభీలనే పేరు పెట్టానని స్వయముగ బోయి భీమన్న గారు తెలియజేశారు. బోయిభీమన్న గారి గేయ కవితా సంకలనంలో సుమారుగ 350 కవితలు ఉన్నాయి. ఈ కవితా సంకలనాన్ని 1971వ సంవత్సరములో మొదటిసారిగ చర్ల గణపతిశాస్త్రి గారి లలితా ప్రెస్సులో ముద్రించగా, శ్రీ మేకా రంగయ్య అప్పారావుగారు గారికి ఈ గ్రంథాన్ని అంకితమిచ్చారు. ఈ గేయాలలో ప్రణయ భావన, ప్రకృతి వర్ణన, మాతృభూమి వర్ణన, దేశభక్తి భావన ఇలాఅనేక అంశాలు మనకు కనిపిస్తాయి.

బోయిభీమన్న రాభీలు – పరిశీలన :

'భారత భూ లక్ష్మి' గేయము – బోయిభీమన్న ప్రశ్న :

భారత భూ లక్ష్మి !
ప్రాణ ధర్మ ధనలక్ష్మీ !

అవని కెల్ల అన్నమిడే
అన్నపూర్ణ వమ్మా !
నీ పంచను ఇంతమంది
నిరుపేద లటమ్మా !
ధర్మ మిలకు బోధించే
ధర్మ తల్లివమ్మా !
ఇంత మంది అస్పృశ్యులు
ఎట్లు పుట్టి రమ్మా !

రాముల భీములను గన్న
రాజ మాత వమ్మా !
దేశి విదేశీ దాస్యము
దేనికి ఫల మమ్మా !
ఆత్మేశ్వర మూర్తి వైన
ఆది శక్తి వమ్మా !

స్వార్థ పరుల జట్టు వీడి
జనుల బ్రోవ వమ్మా !

ఈ గేయములో బోయి భీమన్నగారు, మన భరత భూమిని ....అన్నపూర్ణ ....ధర్మతల్లి.. రాజమాత....ఆదిశక్తి ... ఆని సంభోదిస్తూ .... అమ్మా... అన్నపూర్ణ... నీ చెంత ఇంతమంది నిరు పేదలు ఆకలితొ ఎందుకు బాధ పడుతున్నారు? అమ్మా... ధర్మతల్లి.... నీకు ఇంత మంది అస్పృశ్యులు ఎలా జన్మించారు? అమ్మా.... రాజమాత.... శ్రీరామ, భీమసేనులను కన్న నీకు ఇంతటి దాస్యము (బ్రిటీషు పాలన) ఏలనమ్మా? అమ్మా.... ఆదిశక్తి.... స్వార్థపరులను దునిమి ప్రజలను కాపాడవెందుకు? అంటూ ప్రశ్నిస్తూ సమాజాన్ని అలోచింపచేస్తారు.

'ఎవరు తండ్రీ' గేయము – బోయిభీమన్న ప్రశంస :

ఎవరు తండ్రీ ?
ఎవరు తండ్రీ ?
దేశ దాస్యము తుడిచి జాతికి
తేజమొసగినదెవరు తండ్రీ ?
మనిషి మనిషికి మధ్య లేచిన
మట్టి గోడలు కూల్చి వైచి
ఐకమత్యపు కోట గట్టిన
లోక బాంధవుడెవరు తండ్రీ ?
పతిత జనముల,పేద జగముల
గతులు మార్చిన దెవరు తండ్రీ
జగతికంతకు శాంతి, సత్యం
ప్రగతి చూపినదెవరు తండ్రీ ?
అందమనగా అమృతమేనని
అమృతమనగా త్యాగమేనని
మానవునికి కిరీట మొసగి
మాధవుని జేసిన మహాత్ముడు ?

ఈ గేయములో బోయి భీమన్నగారు ....దేశ దాస్యాన్ని త్రుంచి భరతజాతి విముక్తికి కారణమైనదెవరు? భారతీయుల మధ్య గల కుల, మత సంకుచిత భావాలను రూపుమాపి ఐకమత్యపు కోటను నిర్మించినదెవరు? పీడితులుగ, పేదవారుగ వున్న జనులకు ప్రగతి, శాంతి, సత్యం చూపినదెవరు? త్యాగభావనతొ మానవుడె మహాత్ముడన్న సత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పినదెవరు? అంటూ గాంధీమహాత్ముని వర్ణించిన తీరు అత్యద్భుతము కదా !

'ఏది హిందూ ' గేయము – బోయిభీమన్న సందేశము :

ఏది హిందూ ? ఏది ముస్లిం ?
ఏది క్రైస్తవం ?
ఎల్ల మతముల సారమొకటే
హృదయమే మతము !
కృష్ణుడో, క్రైస్తో ,మహమ్మదొ
గీతయో,బైబిలొ,ఖురానో
ప్రేమనే బోధించ లేదా ?
ద్వేషమును నిరసించె కాదా !
తూర్పు పడమర భేదమేలా ?
తోట కెల్ల వసంతుడొకడే !
కరములెవరెటు మోడ్చి పిలిచిన
ఖంగు మను గుడి గంట ఒకటే !

ఈ గేయములో బోయి భీమన్నగారు.... ఏ మతమైనా అన్ని మతముల సారము ఒకటే అని హృదయ భావనె ముఖ్యమని, ఏ దేవుడైనా, ఏ మత గ్రంథమైనా ద్వేషమును వదలి ప్రేమించమన్నదని, మనమేరీతిన మ్రొక్కిన పలికే దైవము ఒక్కరేనని...మానవాళికి చక్కని సందేశమిస్తారు.

'మాటే సౌహార్దం' గేయము – బోయిభీమన్న భావన :

మాటే సౌహార్దం !
మనసే సౌందర్యం !
మాట మనసూ ఉంటే
మధురం జీవితం !

మాటే రాకుంటే
మైత్రి చాలా దూరం !
మనసే లేకుంటే
మనుగడయే భారం !
మనిషిని మనిషిని కలిపే
మనస్సే ఉషస్సు –
మనసును మనసును కలిపే
మాటే శ్రేయస్సు !
మాట చెలిమి కలిగి
మనసు కలిమి వెలిగి
మనిషి మెలిగినంత –
మధువే జగమంత !

ఈ గేయములో బోయి భీమన్నగారు.... మాట మనసులను, మనుషులను కలుపుతుందని మంచి మాటలు స్నేహ బంధానికి కారణమౌతాయని, మంచిమాటలతో మనసుల కల్మషం తొలగి ఈ జగతి స్వర్గసీమ అవుతుందని మాట యొక్క వైశిష్ట్యాన్ని అద్భుతముగా తెలియజేశారు.

ముగింపు :

బోయిభీమన్నగారు తమ రాభీల ద్వారా ఎన్నో సందేశాత్మకమైన అంశాలను మానవాళికి తెలియజేసే ప్రయత్నము చేశారు. విశాల భావనలు వారి రాభీలలో మనకు కనిపిస్తాయి. నిగూఢమైన అధ్యాత్మిక భౌతిక విషయాలను అతితేలికగా ఈ రాభీలలో తెలియజేసినతీరు, బోయిభీమన్న గారి పాండిత్యము మనల్ని ఖచ్చితముగ అశ్చర్యమనకు గురి చేయటము సర్వ సాధారణమనుట గమనింపదగిన అంశము.

ఆధార గ్రంథములు :

- బోయిభీమన్న సమగ్ర సాహిత్యం – గేయకావ్యం – భాగం– 1
- తెలుగు సాహిత్య చరిత్ర – డా. ద్వానా. శాస్త్రి
- తెలుగు సాహిత్య విమర్శ – సిద్ధాంతములు – వి.సిమ్మన్న.

తెరచాటు – సాంఘిక నాటకం

డా. జూరెడ్డి నిర్మల, తెలుగు అధ్యాపకురాలు, సెయింట్ జోసఫ్ మహిళా కళాశాల, విశాఖపట్నం–4.
చరవాణి–7095072353.

ఉపోద్ఘాతం :

సమాజంలో సమస్యలకు పరిష్కారాలను చూపుతూ మానవతా విలువలను ప్రతిఫలిస్తూ, సంఘ జీవితాన్ని నిర్దేశిస్తూ ప్రదర్శింపబడే నాటకము సాంఘిక నాటకము. నాటకము దృశ్య కావ్యము. పామరులను విశేషంగా ఆకట్టుకునే ప్రక్రియ.సమాజంలోని అన్ని వర్గాల వారిని ఆకర్షిస్తుంది. సాంఘిక నాటకాల్లోని ఇతివృత్తం కల్పిత మైనప్పటికి వర్తమాన సమకాలీన అంశాల్లో ఒకటై ఉంటుంది. కావున ప్రేక్షకులను ఆలోచింప చేస్తుంది. 19 వ శతాబ్దంలో ఎంతో మంది సంఘ సంస్కర్తలు ఉద్యమాలు చేసి సమాజంలో ఉన్న అనేక దురాచారాలను రూపుమాప డానికి ప్రయత్నించారు. వాటిలో బాల్యవివాహాలు, నిర్బంధ వైధవ్యం, సతీసహగమనం, స్త్రీ విద్య ముఖ్యమైనవి. ముక్కు పచ్చలారని అమాయక బాలికల దుస్థితి చూసి హృదయం ద్రవించి కొందరు కవులు తమ సాహిత్యం ద్వారా బాల్యవివాహాలు నిరోధించమని ప్రబోధించారు. అలాంటి వారిలో జాషువా ఒకరు.

"తెరచాటు" నాటకం బాల్యవివాహాల నేపథ్యంలో ఇతివృత్తం అల్లబడినా దీనిలో బాల వితంతువుల సమస్యలు, పడుచు పెళ్ళాలు ముసలి భర్తలతో పడే కష్టాలు , సనాతన ఛాందస భావాలు గుర్రం జాషువా చర్చించాడు. ప్రజామిత్ర మండలి సంపాదకులైన గూడువల్లి రామబ్రహ్మం ఏర్పాటు చేసిన సాంఘిక నాటకాల పోటీకి " తెరచాటు " నాటకం రాసినట్లు జాషువా చెప్పుకున్నాడు. ఈ నాటకం 1935లో రాయబడి 1946లో ముద్రించబడింది. ఈ నాటకం నాలుగు అంకాలతో కూడిన విషాదాంత నాటకం. జాషువా రాసిన ఏకైక సాంఘిక నాటకం ఇది. సంఘసంస్కరణే ధ్యేయంగా ఈ నాటకం రాసినట్లు స్పష్టమవుతుంది . స్త్రీ పురుష భేదం లేకుండా అందరూ సమానమని జాషువా ఈ నాటకం ద్వారా తెలియజేశాడు.

ఈ నాటకంలో జాషువా అనేక సాంఘికాంశాలను స్పృశించాడు. తన కాలం నాటి సమాజంలో ఉన్న స్త్రీల సమస్యలన్నింటిని "తెరచాటు" నాటకంలో ప్రతిబింబ చేశాడు. ఆ సమస్యల వల్ల ఉత్పన్నమయ్యే కష్టాలు, వాటిని అధిగమించలేక స్త్రీలు పడే ఆవేదన వివరించాడు. బాలవితంతువు మాతృత్వాన్ని పొందిన వైనం. తత్ఫలితంగా తెరచాటున జరిగే దుస్సంఘటనలు తెర తీసి చూపించాడు. జాషువా ఆనాటి సమాజంలోని వ్యక్తులకు దర్పణం పట్టే పాత్రలను సమాజానికి తెరచాటు నాటకంలో చక్కగా ప్రదర్శించారు. సమాజ రుగ్మతలను సునిశితంగా విమర్శించాడు.

బాల్యవివాహాల వల్ల స్త్రీ విద్యారంగానికి దూరమై. సమాజంలో అనేక కట్టుబాట్లకు గురైంది. శారీరకంగాను, మానసికంగాను ఎదగని వయస్సులో వివాహం చేసుకొని పిల్లల్ని కని రోగాల రొంపిలో కూరుకు పోయింది. భర్త చనిపోయినప్పుడు సతీసహగమనం చేయడమో లేక ఇతరులు చేసే అవమానాన్ని భరిస్తూ జీవితాంతం వైధవ్యాన్ని అనుభవిస్తూ జీవచ్ఛవంలా కాలం గడపగమో తప్పనిసరి . ముక్కు పచ్చలారని బాలికల దుస్థితిని చూసి జాలిపడిన జాషువా వేదన వర్ణనాతీతం. తెరచాటు నాటకంలో రాజ్యలక్ష్మి, కళ్యాణి పాత్రల ద్వారా బాల్య వివాహాలు, తత్ఫలితంగా వచ్చే అనర్థాలను గూర్చి జాషువా వర్ణించాడు.

పాత్రలు :

బ్రహ్మశాస్త్రి, బుచ్చిరామయ్య దంపతుల కుమారుడు ప్రమోదుడు. కుమారై కళ్యాణి. బ్రహ్మశాస్త్రి కోడలు శ్యామల.

మరోదంపతులు కామశాస్త్రి, రాజ్యలక్ష్మి. భావకవి కిషోరుడు, డాక్టరు గిరి, సనాతనుడైన రామచయనులు. ఈ నాటకంలోని పాత్రలు.

కళ్యాణి :

బ్రహ్మశాస్త్రి బుచ్చిరామయ్య దంపతుల కుమారై కళ్యాణి. ఆనాటి సమాజంలోని బాలవితంతువులకు ప్రతినిధి. వాటి కష్ట నష్టాలకు వాటి వల్ల వచ్చే అనర్థాలకు ఈమె ప్రతీక. చిన్నతనంలోనే భర్తను పొగొట్టుకుంటుంది. పూలు పెట్టుకోవడం, రంగు బట్టలు వేసుకోవడం లాంటి చిన్న చిన్న కోరికలకు కూడ దూరమైనందుకు బాధ పడుతుంది. ఒక పసి హృదయం పగిలి పోవడానికి ఇంత కన్నా దారుణం ఏమి కావాలి. సమాజానికి నేనొక ముచ్చి బొమ్మను, వంటింటి యంత్రాన్ని అని కళ్యాణి బాధ పడటంలో బాల వితంతువుల హృదయ వేదన స్పష్టంగా వ్యక్తమవుతుంది.

కళ్యాణి సామాజిక దుర న్యాయ ఫలితంగా ఎదలోని కోర్కెలు పురి విప్పే వయస్సులో భర్తను కోల్పోతుంది. కిశోర కుమారు మాటలు ప్రభావానికి లోనై కాలు జారుతుంది, తత్ఫలితంగా ఆమె తెరచాటున పుట్టిన కొడుకుని చేజేతుల దూరం చేసుకొని జీవచ్ఛవం కావాల్సి వచ్చింది. కిశోర్ కుమారుడు ఎంతటి భావకవి, బుద్ధిమంతుడు అయినా కళ్యాణి మాతృత్వానికి కారకుడై, తప్పుకోవడంలో పురుషులకుగల స్త్రీ వ్యామోహం, అవకాశవాదతత్వం కనిపిస్తాయి. బాల వితంతువుల పట్ల సమాజదృష్టిని, యువకుల ప్రవర్తనను చక్కగా చిత్రీకరించారు.

మనది పురుష ప్రధానమైన సమాజం. కాబట్టి ధర్మాలు, పాపాలు పురుషుల కనుగుణంగా రచింపబడ్డాయి. సనాతులు ఈ ధర్మాలను తు.చ.తప్పకుండా పాటించాలను కోవడం వల్లే స్త్రీల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు హరించబడ్డాయి. సనాతుల స్వార్థం మూలంగానే బాల్య వివాహాలు, వితంతువుల సంఖ్య పెరిగింది. దుర్భరమైన కట్టుబాట్లు మధ్య స్త్రీలు శారీరకంగానూ, మానసికంగానూ నలిగిపోతున్నారు. సృష్టి ధర్మాలకు లోబడి బలహీనులై అక్రమ మార్గాల ననుసరించి పతనమై పోతున్నారు. తెరచాటు నాటకంలో నాయిక కళ్యాణి సనాతుల స్వార్థపరత్వానికి బలైంది.

బాలవితంతువైన కళ్యాణి యుక్త వయస్సు. కాబట్టి కోరికలు అణుచుకోలేక కవియైన కిశోరుడితో స్నేహం చేస్తుంది. కళ్యాణి హృదయరాణిగా చేసుకున్న కిశోరుడు కష్టకాలంలో ఆమెకు అండగా ఉండకుండా సమాజపు తర్క సత్వానికి బలి చేయడం సనాతుల స్వార్థ ఫలితమే.

బుచ్చిరావమ్మ :

ఈమె కల్యాణి తల్లి. తన మూడేళ్ళ కూతురికి పెళ్ళి చేసి అచ్చట ముచ్చట తీర్చుకోవాలనే మూర్ఖురాలు. అజ్ఞానంతో డెబ్భై ఏళ్ళ వయస్సున్న అన్నకు తన కూతుర్ని కట్టబెట్టి ఐదేండ్లు వచ్చేసరికి బాలవితంతువుల జాబితాలో చేర్చింది. తరతరాల నుండివస్తున్నఆచార సాంప్రదాయాలను అడ్డం పెట్టుకొని అజ్ఞానంతో భార్య మరణించిన డెబ్భై ఏళ్ళ వయస్సున్న తన అన్నకే కూతురినివ్వాలని భర్తతో పోరు పెట్టుకొని పసిదానిచ్చి వివాహం చేసి. ఆమె జీవితాన్ని బలి తీసుకుంది. సాంప్రదాయాన్ని, ఆచారాన్ని పాటించే విషయంలో రాజీపడకుండా కఠినత్వాన్ని ప్రదర్శించిన బుచ్చిరావమ్మ జీవితంలో సాధించినదేమీ లేదు.

కామశాస్త్రి – రాజ్యలక్ష్మి :

ముసలి భర్తలు పడుచు భార్యలతో పడే కష్టాలకు ప్రతీకగా ఈ నాటకంలో రాజ్యలక్ష్మి కామశాస్త్రి దంపతులు చిత్రించబడ్డారు. రాజ్యలక్ష్మి కామశాస్త్రికి మూడవ భార్య. భార్య కూడ ప్రాణమున్న వ్యక్తేననీ, ఆమెకు కొన్ని యిష్టాయిష్టాలుంటాయనే భావన శాస్త్రికి లేదు. పక్షిని

పంజరంలో బంధించినట్లుగా రుక్మిణినీ గదిలో పెట్టి తాళం వేసి తన అనుమానపు నైజాన్ని ప్రకటించుకున్నాడు. "పూర్వం పతివ్రతలంతా ముసలి భర్తలతో కాపురం చేయలేదూ! నీ నొసటనే పొద్దు పొడిచిందనుకున్నావా!" చవన మహర్షి వేయేళ్లు తపస్సు చేసి 12 సంవత్సరాల సుకన్యను వివాహం చేసుకున్నాడట. పరమ ఇల్లాలైన ఆమె తన భర్త అడుగులకు మడుగులెత్తి శుశ్రూష చేసి ఆయన అనుగ్రహం పొందింది. అలాంటి పాతివ్రత్యాన్ని బోధించే కథలు చదవమని పడుచు భార్యకు హితోపదేశం చేసిన కామశాస్త్రి వ్యక్తిత్వాన్ని బట్టి ఆనాటి సమాజంలో జరుగుతున్న సనాతన సాంప్రదాయాల తీరు వ్యక్తమవుతుంది. ముసలి భర్త వయో భారంతో పాటు శారీరక బాధలు అనుభవిస్తూ, పడుచు భార్యకు కాపలా కాయాల్సి వచ్చేది. సహధర్మచారిణి వల్ల స్వర్గ లోకం కలుగుతుందని నమ్మిన తనకు ఆమె తనకు ఈ లోకంలోనే నరకం చూసిస్తుందని కామశాస్త్రి బాధ పడ్డాడు. కామశాస్త్రి పెళ్ళి మీద చేసుకొని తన్ను తాను ఉద్ధరించుకొని సమాజాన్ని ఉద్ధరిస్తానని అనుకున్నాడు కాని అతని వివాహాల వల్ల స్త్రీలు ఎన్ని హింసలకు గురవుతున్నారో, పురుషులు ఎంత మానసిక క్షోభ అనుభవిస్లున్నారో కామశాస్త్రి కాని ఆనాటి సమాజం కాని ఆలోచించ లేక పోయింది. స్వార్థపరుడైన కామశాస్త్రి తన 9 సం॥ల కూతురుకు విశాహం చేయాలనే తలంపుతో అనేక ప్రయత్నాలు చేశాడు. బ్రహ్మశాస్త్రి కోడలు శ్యామల మరణావస్థలో ఉన్నదని తెలిసి వెళ్ళి సానుభూతి ప్రకటిస్తూనే ఆమె చనిపోతే తన కూతుర్ని ఆ ఇంటికి కోడలుగా చేయడానికి ప్రయత్నాలు మొదలు పెట్టి ఆమె కోలుకుందని తెలిసి నిరాశ చెందాడు. పడుచు భార్యతో సుఖపడ లేకపోయిన కామశాస్త్రి మళ్ళీ తన కుమార్తెకు అలాంటి వివాహమే చేస్తాడు. గిట్టనివాళ్ళు 'శారద చట్టం' కింద అర్జీ పెట్టినందువల్ల న్యాయస్థానం చుట్టూ తిరగ వలసి వచ్చింది. రాజ్యలక్ష్మి తాను వయోవృద్ధుడైన భర్తతో సుఖపడ లేదు కాబట్టి ఈ వివాహాన్ని ఆపాలని ప్రయత్నించినా ఫలితం లేకపోవడం వల్ల పురుషాధిక్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు.

వృద్ధుడైన భర్తతో వేగలేక, ఎదిరించలేక అవస్థ పడే దయనీయ పాత్రగా రాజ్యలక్ష్మి కనబడుతుంది. భార్య కూడ ప్రాణమున్న వ్యక్తేనని, ఆమె కూడా ఇష్టాయిష్టాలుంటాయనే భావన లేని కామశాస్త్రి భార్య రాజ్యలక్ష్మి. కామశాస్త్రిదో తన వివాహ సౌఖ్యం విషయంలో తగువు పెట్టుకున్నా పక్కదారిలో ప్రయాణించే ఆలోచన లేని ఉత్తమ ఇల్లాలు, నిర్భాగ్యురాలు. భర్త కామశాస్త్రి పతివ్రతల కథలు చదవమని హితోపదేశం చేస్తే ఆ కథలే ఆడవాళ్ళ కొంపదీశాయని నిరసన వ్యక్తం చేసింది.నన్ను పూజించుకో రాదూ అంటే నిన్నవమానపరచిన చేతులుపుచ్చిపోతాయంటుంది కసిగా. భార్యకు కావలసిన తిండి, బట్ట వీధిలో ఎవరికిలేనన్ని నగలు ప్రధానము కాదని, తానొక స్త్రీననే విషయాన్ని గుర్తు చేస్తూ, నా వొళ్ళే నాకు బరువు. ఈ సొమ్ములు నాకు యింకా బరువు చేటు అంటుంది. అతను సమకూర్చే నగలు కాక అతని ఆదరణ, ఆప్యాయత కావాలనుకుంటుంది. అది లభించనందువల్లనే ఆమెలో అసంతృప్తి బయలు దేరింది. అందుకే మా ఉసురుపోసుకోవడానికి కాకపోతే నీ ఈడుకు పెళ్ళేమిటి? అని ప్రశ్నించింది. భార్యను కొట్టైనా లొంగదీసుకోవాలనే కామశాస్త్రిని తాను బావిలో దూకుతానని బెదిరుస్తుంది రాజ్యలక్ష్మి.

ప్రమోదుడు :

బ్రహ్మశాస్త్రి, బుచ్చిరావమ్మ దంపతుల కుమారుడు ప్రమోదుడు. ఇతని భార్య శ్యామల. ఇతడొక సంఘసంస్కర్త. ఇతడు తన తండ్రితో మాట్లాడిన మాటలలో తన సంస్కరణాభిలాష, మానవులందరూ సమానమే అన్న వాదం స్పష్టమవుతుంది. తండ్రిని కూడా ధైర్యంగా ఎదిరించే తత్వం ఇతనిది. "మాల వెధవలు మాలవెధవ లంటావే వాళ్లు మనుష్యులు కారూ! వాళ్ళది చదువు కాదనా ? నీదే చదువు,

నీవేనా మనిషివి ? ఒక పక్క సోదర మానవుణ్ణి ఏడిపించడం మరోవంక పూజలూ పురస్కారాలూనా? ఇంతలో ఉన్నది మా విజ్ఞానం" అని అనడమే కాక సంఘాన్ని విమర్శిస్తూ, 'ధర్మమో ధర్మమో అని అఘోరిస్తారు . ధర్మదేవతకు నాలుగు కాళ్లని శాస్త్రాలతో రాశారే. ఆ పోలిక మహాకుదిరింది. పశు ధర్మం కాబట్టి'. ఈ విధంగా, ధర్మం అని వల్లెవేయడం సంఘంలో పెద్దలు చేసే అఘాయిత్యాలను విమర్శించెను .తన చెల్లెలు కళ్యాణికి జరిగిన అన్యాయం గూర్చి తండ్రితో పోట్లాడి అతనితో తెగతెంపులు చేసుకోవడానికి కూడా సిద్ధపడిన క్రియాశీలి. కందుకూరి వారిని ఆదర్శంగా తీసుకొని ఆ బాటలో పయనిస్తున్న సహృదయుడు.

ఈవిధంగా ఆనాటి సమాజంలోని వ్యక్తులకు దర్పణం పట్టే పాత్రల ద్వారా జాషువా తెరచాటు నాటకంలో అనేక సాంఘిక రుగ్మతలు, సమస్యలను చిత్రించి సమాజంలో వీటిని పారద్రోల వలసిన ఆవశ్యకతను చర్చించాడు .

ఆధార గ్రంథాలు :

1. తెరచాటు నాటకం – జాషువా
2. తెలుగు సాంఘిక నాటకం – పి. వెంకట రమణ, ఉస్మానియా విశ్వవిద్యాలయం సిద్ధాత గ్రంథం.

సమసమాజ స్థాపనకు ఆలంబన అభ్యుదయ కవిత్వం

దేవరపల్లి రామయ్య, ఆంధ్రోపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం మన్యం జిల్లా.
చరవాణి: 9440398975

స్వాతత్ర్యం,
సమభావం,
సౌభ్రాత్రం
సౌహార్ధం
పునాదులై ఇళ్లు లేచి
జనావళికి శుభం పూచి
శాంతి, శాంతి, శాంతి, శాంతి,
జగమంతా జయిస్తుంది. –శ్రీశ్రీ

ఉపోద్ఘాతం :

ఈ వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో ప్రాచీన సాహిత్యం అంతా ఊహల చుట్టూ తిరిగింది. రాజులు, రాజ్యాలు, యుద్ధాలు, స్త్రీ అంగాంగ వర్ణన, దేవతల స్తుతి మొదలైన వర్ణనలు చేస్తూ సమాజాన్ని, సామాన్య మానవున్ని చిన్నచూపు చూసింది. తెలుగులో ఆధునిక సాహిత్యం 20వ శతాబ్దం నుండి ప్రారంభమైంది. ఈ యుగంలో వచ్చిన సాహిత్యం అంతా దాదాపు సమాజానికి, సామాన్యులకు, సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ వెలువడింది. ఆధునిక సాహిత్యంలో సమాజం, సామాజిక అస్తిత్వం, సామాజిక స్పృహ, సామాజిక చైతన్యం ప్రస్ఫుటంగా వ్యక్తమవుతుంది. వ్యక్తికంటే కుటుంబం గొప్పదని, కుటుంబం కంటే సమాజం గొప్పదనే వినూత్న సామాజిక స్పృహతో ఆధనిక సాహిత్యం ప్రారంభమైంది. ఆధునిక సాహిత్యాన్ని ఆ పాశ్చాత్య భాషా సంస్కృతులు, సంఘసంస్కరణ, వ్యవహారిక భాషా ఉద్యమాలు చాలా ప్రభావితం చేసాయి.

ఆధునిక అనేపదం కాలవాచిగా 1857 నుండి వాడుతున్నారు. కాని ఆధునిక కాలంలో కూడా సాంప్రదాయ సాహిత్యం వచ్చింది. కాబట్టి ఆధునిక భావాలు కల సాహిత్యమే ఆధునిక సాహిత్యంగా చెప్పవచ్చు. ఖండకావ్య ప్రక్రియ. ఆత్మాశ్రయరీతి, వస్తునవ్యత, భావనవ్యత, శైలీనవ్యత అనేవి ఈ ఆధునిక కవిత్వ లక్షణాలని సి. డా॥ నారాయణరెడ్డి వివరించాడు. ఆధునిక సాహిత్యాన్ని నవ్య సాహిత్యం, అభినవ సాహిత్యం అని కూడా పిలిచినా 'ఆధునిక' అన్న పదమే స్థిరపడింది, సమకాలీన సామాజిక పరిస్థితులను అనుసరించి, కాలానుగుణంగా మారుతూ ఆధునిక సాహిత్యం ముందుకు సాగుతుంది, భావకవిత్వం, అభ్యుదయ, దిగంబర, విప్లవ, దళిత, స్త్రీ, మైనారిటీవాద ఉద్యమాలు, నవల, నాటకం, కథ, నానీ, హైకూ వంటి ప్రక్రియలు ఆధునిక సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నాయి. వెయ్యేళ్ల సాహిత్య చరిత్రలో వచ్చిన మార్పులకంటే ఈ వందేళ్లలో వచ్చినమార్పు స్పష్టంగా అర్థమవుతుంది.

అభ్యుదయ కవిత్వం–నిర్వచనం:

పీడింపబడేవాళ్ళు, పీడించే వాళ్లు ఉన్న ఈ వర్గ సమాజం ఉండాలని ఎవరు కోరుకోరు. రానున్న విధానంలో సాధారణ మానవుడే మకుటధారి. పురోగమిస్తున్న లోకాన్ని ప్రతిఘటించే వారు ఎప్పుడు అభ్యుదయవాదులు కాజాలరు. ఈ ధనిక సమాజంల పోవాలి అనుకోవడమే అభ్యుదయం. ఇది మనసులో పెట్టుకుని రాసేది అభ్యుదయ రచనఅని దేవులపల్లి కృష్ణశాస్త్రి అంటారు. ఇది ముమ్మాటికీ నిజం. ఇలాంటి తరుణంలో అభ్యుదయ కవులు వ్యవస్థ సంస్థాగత నిర్మాణానికి అనుగుణంగా ప్రజలను చైతన్యం చేయాల్సి అవసరం ఉందని పేర్కొన్నారు.

భావకవిత్వం ఉదృతంగా వెల్లువలా సమాజాన్ని ముంచెతుతున్న రోజుల్లో ఈ కవిత్వోద్యమం ఆరంభమైంది. మృదుభావాభివ్యక్తి స్థానంలో కఠిన దూషణ పదజాలంతో సమాజాన్ని మార్చే యత్నంలో అభ్యుదయ కవిత్వం రావటం వింతే అయినా, భావకవిత్వం పట్ల క్రమంగా ఏర్పడిన

విముఖత, సమాజంతో సంబంధం లేకుండా ఊహల్లో విహరించలేని గుణం వాస్తవికతకు ప్రాణం పోయాలనే తపన, జాతీయ రాజకీయ సామాజిక స్థితిగతులు, అంతర్జాతీయ రాజకీయ సాంఘిక నాగరిక వైజ్ఞానిక కవిత్వోద్యమాల ప్రభావాలు అన్నీ కలసి మానవ జీవితం పట్ల స్పష్టమైన అవగాహన కలిగించడానికి దోహదమయ్యాయి. ఈ నేపథ్యంలో భావకవిత్వానికంటే భిన్నంగా కవిత్వం వెలువడడం ఆరంభమైంది. వాటిలో అభ్యుదయ కవిత్వాన్ని మొదటి వరుసలో చెప్పుకోవచ్చు.

అభ్యుదక కవిత్వం-మార్క్సిజం:

అంతర్జాతీయంగా మార్క్సిష్టులు సాధిస్తున్న ప్రగతి, సామాజిక పునాదులను కదుపుతున్న రీతి, సాహిత్యం ద్వారా ప్రభావితం చేస్తున్న క్రమం, తమ సమకాలీన సమాజానికి అవసరమేనని గుర్తించి దానిని తమ కవిత్వానికి ప్రాణంగా చేసుకొని పీడిత జనోద్ధరణ, ఆర్థిక సమానత, విశ్వమానవ సమానత లక్ష్యం వైపు సాగారు అభ్యుదయ కవులు.

మార్క్సిష్టుల తాత్త్విక నేపథ్యంతో ఏర్పడ్డ అభ్యుదయ కవిత్వం కర్మఫలాన్ని, దైవాన్ని, పట్టించుకోక భౌతికతకు ప్రాధాన్యమిచ్చి, అస్తిత్వావశ్యకతను చాటింది. ఈ కవులు వర్గ సంఘర్షణను, శ్రామిక వర్గ ప్రాముఖ్యాన్ని ఆర్థిక సమానత అవసరాన్ని కవిత్వం ద్వారా ఆవిష్కరించారు.

అభ్యుదయ కవిత్వం-ఆలంబన:

ఆధునిక కాలంలో వచ్చిన ఉద్యమాలన్నింటి కంటే సమాజాన్ని అమితంగా ప్రభావితం చేసింది అభ్యుదయ సాహిత్యం. అభ్యుదయం అనే పదానికి శుభం, మంగళం అనే నిఘంటిక అర్థాలు ఉన్నప్పటికీ ఆంగ్లంలోని ప్రోగ్రెస్ అనేపదానికి సమానార్థకంగా వాడుతున్నారు.

"నేడే, ఈనాడే
జగమంతా బలవితర్థి
నరజాతికి పరివర్తన
నవజీవన శుభసమయం, అభ్యుదయం"

అని శ్రీశ్రీ అభ్యుదయ పదానికి ఇచ్చిన నిర్వచనం. దీనిని బట్టి ప్రగతి, మార్పు అనే అర్థంలో శ్రీశ్రీ అభ్యుదయం అనే పదం వాడినట్లు తెలుస్తుంది. దేనిలో మార్పురావాలి? ప్రగతి ఎక్కడ జరగాలి అని ప్రశ్నిస్తే వాటికి సమాధానంగా సమాజం అని చెప్పవచ్చు. దీనిని బట్టి అభ్యుదయ సాహిత్య ఆకాంక్ష సమసమాజమని స్పష్టమవుతుంది. తెలుగు సాహిత్యంలో సమసమాజ నిర్మాణం కోసం మొదటగా పాటుపడింది అభ్యుదయ సాహిత్యం. సామాన్యుల్ని వస్తువుగా తీసుకుని, సామాన్యుల్ని పట్టించుకోకపోతే సాహిత్యం వ్యర్థం అని అభ్యుదయ సాహిత్యం తేల్చి చెప్పింది. జాతిని జాగృతం చేసి ప్రజల కష్టాల్ని పట్టించుకుని సమసమాజ నిర్మాణానికి పూనుకుంది. వర్తమాన సమస్యల్ని కవితా వస్తువులుగా తీసుకొని, సమర్థవంతంగా, చైతన్యవంతంగా వ్యక్తీకరించి ప్రగతిశీలకమైన మార్పును అభ్యుదయ కవులు కోరుకున్నారు. అభ్యుదయ సాహిత్యంలో మొదటగా వచ్చింది కవితలు మాత్రమే. తర్వాత నవల, నాటకం, కథానిక మొదలైన ప్రక్రియలలో అభ్యుదయ సాహిత్యం విరబూసింది. సమసమాజ స్థాపన గురించి వచ్చిన అభ్యుదయ సాహిత్యం గ్రహిస్తే ఈ పరిశోధనా పత్రం విస్తృతి పెరుగుతుంది. కాబట్టి కేవలం అభ్యుదయ కవితలకి పరిమితం చేస్తాను.

సమసమాజం, నవసమాజం స్థాపించాలంటే బూర్జువా వ్యవస్థ నశించాలని అభ్యుదయ కవులు ఆకాంక్షించారు. దోపిడీ వర్గాలను హెచ్చరించి, కార్మిక, శ్రామిక వర్గాలను ఏకం కమ్మని కవితల ద్వారా పిలుపునిచ్చారు. సమసమాజమనే మరో ప్రపంచం పిలుస్తోందని, కదం తొక్కుతూ పదం పాడుతూ కదలమని అభ్యుదయ కవులు ప్రభోదించారు. శ్రీశ్రీ మహా ప్రస్థానంలో-

"ఏదేశ చరిత్ర చూసినా
ఏమున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం"

అని అసమసమాజాన్ని నిరసించాడు. గతమంతా అసమానతలతో కూడి ఉందని, దానిని చెరిపేయాలని భావించాడు. అంతేకాకుండా ప్రస్తుత సమాజంలో శ్రామికశక్తి దోపిడీ అవుతుందని అభ్యుదయ కవులు వివరించారు. పెట్టబడి దారి సమాజాన్ని వ్యతిరేకించారు. అవంత్స సోమసుందర్ 'వజ్రాయుధం'లో పెట్టబడి దారి విధాన నిరసన కనబడుతుంది.

"ప్రతి నిత్యం ఫ్యాక్టరీ
కూలి యెముకలెన్నో
సున్నగా చిదుకగొట్టి
రక్తంతో రంగరించి
ధన స్వామి పాదమ్ముల
పారాణానికి పూస్తున్నది"

సమసమాజ స్థాపన జరగాలంటే వర్గ సంఘర్షణ తప్పదని అభ్యుదయ కవులు భావించారు. సమాజంలో నాటుకుపోయిన ఆకలి, దారిద్ర్యం మొదలైన భయంకర వ్యాధులకు సమాజ వ్యవస్థే కారణమని అభ్యుదయ కవులు గ్రహించారు. అందువల్లే సాంఘిక వ్యవస్థ సమూలమైన మార్పులు రావాలన్నారు. వర్గభేదాలతో కుళ్లిన నాటి సమాజం స్థానే సరికొత్త సమాజం నిర్మిత మవ్వాలని కోరుకున్నారు.

"వృత్తజగతి సమాధిపై సమధర్మం ప్రభవించును
నిద్దుర చీకటి వెలుపల వేకువ మెళుకువ పుట్టును"

సమాజంలో ఆకలి కేకలు ఆగిపోయి, అసమానతలు అంతరించిపోయి, కుఠిల నియమాలు కళ్లిపోతాయని అభ్యుదయ కవులు ఆశించారు. సమసమాజ స్థాపన వల్ల అందరూ సమానంగా ప్రతిఫలం అనుభవిస్తారని అంటే శ్రమకు, కళకు సమానంగా ఫలితం లభిస్తుందని భావించారు. హేతువాద, భౌతికవాద దృక్పథాలను తెలుగుసాహిత్యంలో ప్రవేశపెట్టిన అభ్యుదయ కవులు కులదురహంకారంపై ఆగ్రహాన్ని, మతోన్మాదంపై నిరసననూ ప్రకటించి తద్వారా సమసమాజ నిర్మాణ ఆకాంక్షని తెలియచేశారు. దళితులకు అందరితో సమానమైన అవకాశాలు ఇచ్చినప్పుడే అది సాధ్యమని అభ్యుదయ కవులు ప్రకటించారు.

"ఆగిన మీ గుండెలలో అగ్నిజ్వాలలున్నవిలే
మూసిన మీ కన్నులలో మూగబాధలున్నవిలే
ఆకలిమంటలలో అలమటించే బిడ్డలూ
మానం కప్పుకునే మార్గం తెలియని తల్లులూ
కన్నీరు కార్చితే కరిగి రగిలి కలిసిపోయి
ఆగిన మీ గుండెలలో అగ్నిజ్వాలలున్నవిలే "

సమాజానికి దూరంగా బ్రతుకుతూ, కనీస అవసరాలు కూడా తీర్చుకోకుండా చితుకుతూ, నశించిపోతున్న విధానం మన కళ్లకు కట్టినట్లు ఈ కవితలో వై. విజయకుమార్ చిత్రించాడు. దీనిలో దళిత జీవిత వాస్తవికతను చిత్రించి దళితుల ఆక్రందనకు అక్షరరూపమిచ్చాడు. అణచివేతకు, దోపిడీకి గురవుతున్న దళితుల ధర్మాగ్రహాన్ని ఏటుకూరి ప్రసాద్ వినిపించాడు.

"ఆకలి మంటలు అంతం కోసం
సాగుకు భూములు సొంతం కోసం
ఊరువాడా పోరాటం
ఇది హరిజనులందరి పోరాటం"

ఈ కవితలో ఆనాటి సమకాలీన సామాజిక జీవితం కనబడుతుంది. పోరాటం ద్వారానే సమసమాజ నిర్మాణం జరుగుతుందని స్పష్టమౌతుంది. ఈ కోణంలోనే ప్రతీ ఒక్కరూ ప్రయత్నం చేయాలని, అలాంటప్పుడే అనుకున్న లక్ష్యం నెరవేరుతుందని హితబోధ చేశారు రచయిత.

అభ్యుదయ కవులు కుల, మతతత్వాలను, ధనస్వామ్య వ్యవస్థను తీవ్రంగా ఖండించడం వారి ప్రధాన లక్షణం. శ్రీశ్రీ గారి కవిత్వంలో ఈ రకమైన ఖండన అడుగడుగునా ప్రతిబింబిస్తుంది.

"ఒక వ్యక్తిని మరొక వ్యక్తి
ఒక జాతిని వేరొక జాతి

పీడించే సాంఘిక ధర్మం
ఇంకానా? ఇకపై సాగదు"

అని అనమాజ వ్యవస్థను, దౌర్జన్యాలను శ్రీశ్రీ తూర్పారపట్టడం ఈ కవితలో అంతర్గతంగా కనిపిస్తుంది. సమాజంలో ఉన్న కుళ్లు తొలగితేగాని ఆశించిన సమాసం నిర్మించలేవిమంటారు శ్రీశ్రీ.

అలాగే "ముసలి నక్కకు రాచరికంబు దక్కునే" అనే జమిందారీ పీడిత వర్గాన్ని దాశరథి దిక్కరిస్తాడు. ఈయన కవిత్వంలో పీడితవర్గ ప్రజల ఆవేదనతో పాటు, వారు సమాజంలో ఎలా నిలదొక్కుకోవాలో తెలియజేయడం దర్శనమిస్తుంది.

ఇదే తరహాలో మరో అభ్యుదయ కవి పురిపుండా అప్పలస్వామి సమాజంలో మార్పు వచ్చినప్పుడే అభివృద్ధి సాధ్యమని పేర్కొంటాడు.

"తొలినాటి సంద్రాలు తుహినగిరి శిఖరాలు
ఇంకిపోతున్నాయిలే, కుంగిపోతున్నాయిలే
నల్లమందే కాని కల్లిప్పనంటావు
రాతిగుళ్లకే కాని రాను పొమ్మంటావు
సుడిగాలి రేగిందిలే, పిడిగావులించిదిలే"

అంటూ సమాజ భావనను సమకాలీన వ్యవస్థకు అనుగుణంగా స్వీకరించి వివరిస్తాడు.

సామాజిక స్పృహలేని కవిత్వం వృదా అంటారు అభ్యుదయ కవులు. కవిత్వం ద్వారా సమాజాన్ని చైతన్యం చేయాలంటారు. కవిత్వం అందరికీ అర్థం కావాలంటారు. ఈ కోవలో కుందుర్తి ఆంజనేయులుని చెప్పుకోవచ్చు. ఈయన వెలువరించిన కవిత్వంలో చాలావరకు చైతన్యంతోపాటు, వ్యవస్థను ఆలోచింపచేసే దృక్పథం, కవితా ప్రయోజనం కనిపిస్తుంది. ఈయన రాసిన "నాలోని నాదాలు"లో కవితా పంక్తులే దీనికి నిదర్శనం.

"ప్రయోజనం తండ్రిగా
పరమ సౌందర్యం తల్లిగా
పలికే ప్రతిపలుకు రసానంద కల్పవల్లిగా
నా దారి నాది"

అని కవితాతత్వాన్ని, కవితా ప్రయోజనాన్ని వెల్లడించడంలో ఎలాంటి వ్యవస్థను కవి కోరుకుంటున్నారో పరోక్షంగా అర్థమవుతుంది.

ఇలా అభ్యుదయ కవులు సమసమాజం కోసం చైతన్య కవిత్వం రాశారు. కానీ ఇప్పటికీ ప్రజలలో మార్పు ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. అందుకే అజంతా ఆధునిక మానవుని నిస్సహాయతను, మానసిక ఏకాంతాన్ని "చెట్లు కూలుతున్న దృశ్యంలో" అనే కవితా శీర్షికలో ఆలోచన రేకెత్తించారు.

"ఆశలేదు ఆస్కారం లేదు
పలానా రోజు శాపం
ఆఖరౌతుందనే హామీలేదు
జీవితం ఎప్పుడూ ఇలా కన్నీళ్లు
ప్రవాహంగానే సాగుతుందనుకుంటాను
రోడ్డు పొడుగునా చెట్లు కూలుతున్న
దృశ్యాలను చూపుతుందనుకుంటాను"

అని తన ఆవేదన వ్యక్తం చేయడంలో వ్యవస్థ వాస్తవిక దృక్కోణం దర్శనమిస్తుంది. అభ్యుదయం అంటేనే సామాజిక శ్రేయస్సు. అది దేని ద్వారా సాధించడం అన్నది సామాజిక అవసరాలను ఆధారం చేసుకుని ఉంటుంది. దానికి అనుగుణంగా మార్గం మారుతుంది. కాని ధ్యేయం ఒక్కటే. అది సాంఘిక సంక్షేమం. అభ్యుదయ కవులందరూ ఇదే ధ్యేయంతో కవిత్వం వెలువరించడంలో సమసమాజ స్థాపన లక్ష్యం కొంత నెరవేరిందనే చెప్పాలి.

ఇలా అభ్యుదయ కవిత్వం సమసమాజ స్థాపనకు ప్రతీక్షణం పాటుపడింది. తర్వాత వచ్చిన దిగంబర, విప్లవ, స్త్రీ, మైనార్టీ కవిత్వాలకు మార్గదర్శకమైంది. సమసమాజం ఎలా ఉండాలో చాటిచెప్పింది. అందుకే "ఆధునికాంధ్ర సాహిత్యంలో అభ్యుదయ కవిత్వయుగం స్వర్ణయుగం. సామాన్యుని కష్టాలను గురించి ఇంతగా పట్టించుకున్న సాహిత్యోద్యమం ఇంతకు ముందు లేదు" అని మెచ్చుకున్న కడిమాల రామమోహన్ రాయ్ మాటలు అక్షర సత్యాలు.

అలాగే 'అభ్యుదయ రచన సమకాలికమైన జీవిత పరిస్థితులకు రాజకీయ వాతావరణానికి ఆర్థిక సమస్యలకు సమాజ సంఘర్షణలకు నైతిక సందర్భాలకు వైజ్ఞానిక విశేషాలు, విశేషాలకు అనుగుణంగా అనుకూలంగా తగినట్టే అవసరమైన మార్పులతో విలసిల్లాలని' పివి.రాజమన్నారు అనడం ఆహ్వానించదగిన విషయం.

ఆధార గ్రంథాలు:

1. తెలుగులో అభ్యుదయసాహిత్యం – ఆచార్య ఎస్.వి. సత్యనారాయణ
2. తెలుగులో కవిత్వోద్యమాలు – తెలుగు అకాడమీ
3. తెలుగు కవితా వికాసం – కడిమాల రామమోహన్ రాయ్
4. తెలుగులో సాహిత్య విమర్శ సిద్ధాంతాలు – ఆచార్య సిమ్మన్న
5. తెలుగు సాహిత్య ప్రక్రియలు–ధోరణులు– ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు
6. సాహిత్య వాక్షణం– డా॥కొలకలూరి మధుజ్యోతి

దళిత సాహిత్య – నేపథ్యం – ఆవిర్భావ వికాశాలు – ప్రసార సాధనాల పాత్ర

డా॥ యస్. శారద, పరశోధక విద్యార్థి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, ఎస్.పి. మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి. సెల్ నెం: 93926 35819

సాహిత్యం ప్రవహించే జీవనది లాంటిది అంటారు. అనేక మార్పులను చేర్పులను ఆహ్వానిస్తూ నిరంతరం జీవనదిలా సాగిపోతూ వుంటుంది. ఇలాంటి మార్పులలో ఒకటిగా ఈ ఇరవై ఒకటో శతాబ్దంలో కనిపించినటువంటి ముఖ్యమైన వాదం దళితవాదం. పాత విలువల స్థానంలో కొత్త విలువల్ని ప్రతిష్టించే, పాత భావజాల స్థానంలో కొత్త భావజాలాన్ని నిర్మించుకొనే దిశగా కొనసాగుతుంది. ఆ చైతన్యమే సమాజంలో మార్పును కోరుతూ ఒక నూతన చైతన్యం నెలకొంటుంది. ఈ దళిత ఉద్యమమే నేడు దళిత సాహిత్యానికి నేపథ్యం అయింది.

ఇంకా విపులంగా చెప్పాలంటే సాంఘిక దోపిడీకి అణిచివేతకూ గురవుతున్నవారు, నీచ వృత్తులుగా భావించబడుతున్నారు. శారీరక శ్రమపై ఆధారపడి సమాజ సంపదను పెంచుతున్నవారు, అస్పృశ్యులుగా పరిగణింప బడుతున్నవారు. దళితులు, దళితుల ఆర్తిని, ఆవేశాన్ని, నిరాశను, నిస్పృహను, నిట్టూర్పును ఆగ్రహాన్ని, సంవేదనలను, యధార్త జీవిత దృశ్యాలను ప్రతిబింబించేది దళిత సాహిత్యం. దళిత జీవిత వాస్తవికత ఎప్పటిదో అప్పటి నుంచే వారి భావ ప్రకటన కూడా వుంది.

ఆది భారతీయులుల సాహిత్యమూలాలను వేదికి, వెలగులోకి తేవాల్సిన బాధ్యత దళిత రచయితల, చరిత్ర కారుల, సామాజిక శాస్త్రవేత్తలపై వుంది. ఆధునికాంధ్ర కవిత్వంలో దళిత కవిత్వం ఒక శతాబ్దకాలంగా వెలవడుతుంది. జాతీయోద్యమకాలంలో హరిజనోభ్యుదయ కవిత్వం వెలువడినది తొలిదశ కాగా, వాపపక్ష ఉద్యమాలలో పీడిత వర్గ కవిత్వంగా వికసించటం రెండోదశ, నేడు దళిత ఉద్యమాల స్ఫూర్తితో ఒక ప్రధానమైన సాహితీ స్రవంతిగా దూసుకురావడం వర్తమాన దశ.

దళిత పదం–నిర్వచనం – అభివృద్ధి :

దళిత సాహితీవేత్తలు దళిత శబ్దం ప్రత్యేకించి ఒకే కులానికి పరిమితమైంది కాదు అంటున్నారు. దళిత శబ్దం ఒక సంపూర్ణ ఉద్యమ చైతన్యాన్ని అంతటినీ వ్యకీకరించేదని అంటున్నారు. దళిత లేదా దళితులు అనగా మతం, కుల ప్రాతిపదికంగా శతాబ్దాల పాటు రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అణచివేతలకు గురై ప్రధాన జీవస్రవంతికి దూరమై తద్వారా స్వేచ్ఛ, గుర్తింపులను కోల్పోయిన సామాజిక విభాగానికి చెందిన వారందరికీ దళితపదం వర్తిస్తుంది.

దళితులంటే ఎవరు? :

దళితులంటే ఎస్సీ, ఎస్టీ, బిసి, ఉమెన్, మైనారిటీస్ మాత్రమే గాక అణచివేయబడుతున్న అన్ని కులాలు ఈ జాబితాలోకి వస్తారు. ఇట్లా ఈ నేపద్యం నుంచి చూసినప్పుడు దళిత అంటే మాల, మాదిగలే కాకుండా అన్ని పీడిత కులాలకు వర్తిస్తుందనేది చెప్పక తప్పదు. అనగా ''దళిత'' పదం ఒక సంఘటిత శక్తికి ప్రతిబింబం. బిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించటంకోసం ఏర్పరచుకున్న పదం దళిత పదం, కాబట్టి దళిత శబ్దానికి విస్తృతార్థాన్నివ్వ వలసిన అవసరం వుంది.

దళిత పదం నేడు కొన్ని కులాల ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పదంగా వాడుకలో వుంది. 'దళనము' అంటే 'దళము' అంటే అధిక్యము పరిణామము సేవ అని దళితము అంటే ఖంపించబడినది చేదించబడినది, చీల్చబడినది, వికసించబడినది, విరిసినది, అర్థీకృతము, సగముగా చేయబడినది. నిక్షిప్తము, ఇటునటు చిమ్మబడినది అని సూర్యరామాంధ్ర నిఘంటువులో చెప్పబడ్డాయి. దీన్ని బట్టి దళనము నించి పుట్టిన పదమే దళితులు.

దళిత పదాన్ని కేవలం ఎన్.సి.లకే పరిమితం చేయాలని గవర్నమెంటువారు నిశ్చయించారు. ఎస్.టి.లు కూడా ఇందులోకిరారు.

నిర్దిష్టమైన కుల పోరాటాలకు పునాదులేస్తూ మాదిగ సాహిత్య ఉద్యమం తెలుగు సాహిత్య చరిత్రలో 1995 నుండి కొత్త ఉద్యమరూపాన్ని తీసుకొచ్చింది. ఈ నేపధ్యంలో దళిత సాహిత్య వేధికలు, పరిషత్ కళా సంఘాలు, దళిత రీసెర్చ్ సంటరులు, దళిత లైబ్రరీలు, మూలానే జన చైతన్య వేధికలు, దళిత విద్యార్ది సంఘాలు ఎన్నెన్నో జిల్లాల వారిగా, మండలాల వారీగా వెలిసాయి. దాన్లో భాగంగానే గుండె డప్పు, మాదిగ చైతన్యం చందాల చాటింపు, మాదిక్కేక, మేమిట్లుండం, ఎదురు చూపులు కడుపు మీద కొట్టకండ్రి అంటారని వసంతం, మల్లె మొగ్గల గొడుగు, వీణవంక, మాదిగోడు రంపెకోత, కక్క, ఎర్కోషి మొదలగు పుస్తకాలు దళిత సాహిత్యానికి ఊపునిచ్చాయి.

దళిత సాహిత్యం :

దళిత సాహిత్యమంటే "కింది కులాల రాజ్యాధికారం భావనకు కళాత్మకమైన మేధో అనుభూతి పరమైన వ్యక్తీకరణే దళిత సాహిత్యం". బహుజన భారతి ఆశల్నే అవసరాన్ని అద్దం పడుతుందీ సాహిత్యం". (జి.లక్ష్మయ్య 1991-1).

''దళితులు తమ ఆవేదనను తమ ఆర్తిని, యుగయుగాలుగా అనుభవించిన వివక్షతల్ని తామే స్వానుభవంతో ఆ అనుభవాలను అక్షరీకరించు కోవటం దళిత సాహిత్యం" అంటున్నారు (ఎండ్లూరి సుధాకర్-1994 - 2001).

ఏ సాహిత్యానికైనా గత చరిత్ర అవసరం. గతంలో నుంచి ఒక కొత్త కోణం పుడుతుంది. గతాన్ని వర్తమానాన్ని పెనవేసుకొని భవిష్యత్తువైపు చూస్తున్న సాహిత్యం దళిత సాహిత్యం. కాబట్టి దళిత సాహిత్యానికి ఒక కొత్త నిర్వచనం ఇవ్వాల్సి ఉంటుంది.

"ఎవరి అనుభవాల్ని వారే రాయాలి' అనే వాదన గురించి దళితులు తమ అనుభవాన్ని తామే రాసుకోవాలని లక్ష్మీనరసయ్య వాధించారు. ఆయన బ్రాహ్మణులకు అగ్రకులాలకు దళిత కవిత్వం రాసే హక్కు లేదంటారు".

"మూడు సహస్రాబ్దాలు జైల్లో బతికి పంచములని పిలవబడ్డ షెడ్యూల్డు కులాలకు చెందిన వాళ్ళే దళితులు. వాళ్ళు హిందువుగా, బౌద్ద, క్రైస్తవ, మహ్మదీయ, సిక్కు మతాలకు చెందిన దళితులే. వీళ్ళదే దళిత సాహిత్యం"[4] (కొలకలూరి ఇనాక్-1996-154).

"దళిత వాస్తవకతను, వారి భావజాలాన్ని పండించే వారు ఎవరినైనా సరే వారు వ్రాసింది దళిత సాహిత్యం" అని చెప్పడమే సమంజసం ఎవరు వ్రాసినా దళిత సమస్య దళిత సమస్యే అవుతుంది.

దళిత సాహిత్యం స్వభావం:

1. వాస్తవక భావజాలంతోనే సాహిత్య నృజన చేస్తూ ఉంటుంది.
2. దళితుల సామాజిక భావజాలానికి, చైతన్యానికి స్పూర్తినిస్తుంది.
3. మానవతావాదమే తన ఇతివృత్తం కాబట్టి మానవతావాదాన్ని వ్యతిరేకించే వాటి మీద పోరాటం చేస్తుంది.
4. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతత్వం, సామాజిక న్యాయం నుంచి విలువలు ప్రతిపాదికనా నిర్వహించబడే సమాజం పట్ల దళిత సాహిత్యం.
5. సమాజంలో సంస్కరణ భావాలను, బావ జాలాన్ని రెకెత్తించేందుకు సాహిత్యం ఒక సాధనంగా ఉపయోగపడాలని భావిస్తుంది.

దళిత సాహిత్యం లక్ష్యం:

అధిక అసమానతల్ని మరి బావజాలాన్ని ప్రశ్నించటం, ఎదుర్కోవడం తమను అణచివేస్తున్న అగ్రకులాల సాంస్కృతిక రాజకీయ ఆధిపత్యాన్ని సవాలు చేయటం సాహిత్యంలో ఉన్న ఉన్నత వర్గాల దృక్పధాన్ని సవాలు చేయటం వంటివి ఎన్నో ఉన్నాయి. ఇవన్ని దళిత సాహిత్యం లక్ష్యాన్ని నిర్దేశిస్తాయి. మొత్తంగా చెప్పాలంటే సాంఘిక ప్రజాస్వామిక

సమాజ నిర్మాణం చేయడమే దళిత సాహిత్య లక్ష్యంగా చెప్పవచ్చు.

దళిత సాహిత్యం ప్రక్రియలు:

ఇప్పటి వరకు వచ్చిన దళిత సాహిత్యంలో కవిత్వం, కథ, నవల, నాటకం ఆత్మకథ భాష విమర్శ మొదలగు ప్రక్రియల్లో నూతన వైవిధ్యం, నూతన భావజాలం కనబడుతుంది. అన్నింటికంటే ఎక్కువగా కవితాప్రక్రియలో చాలా ఎక్కువ తిరుగుబాటు కవితల్లో పుస్తకాలు వచ్చి దళిత చైతన్యానికి ఊపునిచ్చాయి. దళిత భావజాలాన్ని తట్టి లేపాయి. కథలు ఇప్పుడిప్పుడే పండుతున్నాయి. నవలలు మాత్రం మొగ్గ దశలోనే ఉన్నాయి. కవిత్వం తప్ప మిగతా అన్ని ప్రక్రియల్లో దళజత సాహిత్యం రావాల్సి ఉంది.

1958 లో బొంబాయిలో తొలిసారి దళిత రచయితల మహాసభ జరిగింది. దళితులు తమ గురించి, ఇతర దళితుల గురించి రాసింది దళిత సాహిత్యంగా గుర్తించాలని యూనివర్శిటీ సాహిత్య సంస్థలు ఈ సాహిత్యానికి తగిన గుర్తింపునివ్వాలని ఈ మహాసభ తీర్మానించింది. [5]

భారతీయ భాషల్లో ముందు ముందు వెల్లువలా రాబోతున్న దళిత సాహిత్యానికి మరాఠీ, గుజరాతీ, సాహిత్యాలు ఎంతో ప్రేరణ నిచ్చాయి. కన్నడ, హిందీ భాషల్లో కూడా గణనీయమైన దళిత సాహిత్యం వెలుగులోకి వచ్చింది.

దళిత పాంథర్స్ తరువాత వచ్చిన సాహిత్యమంతా అంభేద్కరిజాన్ని ఆయుధంగా చేసుకొని భారతీయ సాహిత్యంలో ఒక ప్రత్యామ్నాయ సంస్కృతిని, భాషని, పలుకుబడిని సృష్టించింది. 1985 తర్వాత తెలుగు సాహిత్య పీఠాలను కుదిపివేసిన తెలుగు దళిత కవిత్వానికి ఇదంతా నేపధ్యంగా చెప్పుకోవచ్చు.

తెలుగు దళిత సాహిత్యం పుట్టుపూర్వోత్తరాలు:

డా.బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనా విధానమే తెలుగు దళిత సాహిత్యానికి ఊపిరి తెలుగు దళిత సాహిత్యంలో సామాజిక నేపధ్యం గురించి ఆచార్య కొలకలూరి ఇనాక "అంబేద్కర్ ఆలోచనా విధానమే పునాది" అంటున్నారు. అస్పృశ్యుల విషయంలో పూనాఒడంబడిక చేసుకొని గాంధీ ప్రాణాన్ని కాపాడి దేశంలో అల్లకల్లోలం జరగకుండా చూసి అస్పృశ్యులకు రిజర్వేషన్లు కల్పించమని చెప్తున్నాడు. 1980లలో దేశ వ్యాప్తంగా పెల్లుబికిన బహుజన ఉద్యమాలు ఈ సాహిత్యానికి గొప్ప స్ఫూర్తినిచ్చాయి. [6] తర్వాత 1985 లో కారంచేడులో మాదగ ప్రజలపై కమ్మ కులస్తులు జరిపిన దాడి పర్యవసానంగా ఆంధ్రప్రదేశ్ దళితులంతా లేవదీసిన ఆందోళనోద్యమాలు ఈ నేపద్యంలో కత్తి పద్మారావు, బొజ్జాతారకంల నాయకత్వంలో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ దాని పోరాటాలు చూడరు, నీరుకొండ, పిప్పరంలో జరిగిన సంఘటనల మీద ఆంధ్రులు నలుమూలలు దళితుల్లో కలిగిన కోపపు అగ్ని మంటలు తెలుగు దళిత సాహిత్యానికి సత్వర ప్రభావాలని చెప్పుకోవాలి. రాయలసీమలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మంలాంటి వారు మత సాహిత్యం ద్వారా నిమ్న వర్గాల వారిని, వృత్తికారులను సాంస్కృతికంగా చైతన్య పరిచారు.

ఇలా ముందుకు వస్తున్న దళిత సాహిత్యం, కవిత్వాలలో, గేయంలో, కథలో, నవలలో, నాటికల్లో రాణిస్తుంది. అయితే నేడు కవిత్వంలో, గేయంలో, కథల్లో, వచ్చినంత సాహిత్య ప్రక్రియ నవలల్లో, నాటికల్లో నత్తనడక నడుస్తుందనడంలో సందేహం లేదు. అయితే దళిత సాహిత్యం చెప్పుకోదగ్గ పరిణామం చెందుతూ పదునెక్కుతూ వివిధ రకాలైన భావాల్లో చైతన్యం జరుగుతూనే ఉంది. విభిన్న ప్రక్రియల్లో విస్తృతంగా దళిత సాహిత్యం వస్తుంది.

ప్రసార సాధనాలు: గొప్ప హిందూ సంస్కృతిని కలిగి పేదలకోసం పేద సంస్కృతి కోసం, పేదల కష్ట సుఖాలకోసం అన్నట్లు ప్రవర్తించే ప్రసారసాధనాలు తమకు అవసరమున్నంత మేరకు దళితుల పనులను దళిత సంస్కృతిని వాడుకొని దళితుల అభివృద్ధి విషయంలో మాత్రం మోహమాటపడతాయి. ప్రసార సాధనాల్లోనూ కులవివక్ష ఉంది. ప్రసార సాధనాల్లోనూ దళితులు పనిచేస్తున్నప్పటికి దళితేతరులు సంఖ్య ఎక్కువ కాబట్టి, మీడియా వారిదే కాబట్టి అనుకున్నంత మేరకు

సహకరించవు. ఒక వేళ దళితులకు సహకరిస్తే సంబందిత వ్యక్తులను యాజయాన్యం పనిలో నుండి తీసివేస్తారు.

కమ్యూనికేషన్ అభివృద్ధి చెందినకొద్దీ దళితుల్లో చైతన్యం పెరిగి, ప్రసార సాధనాలు నేడు ప్రజల్లో కీలక పాత్ర వహించటం జరుగుతుంది.

ముగింపు:

దళిత సాహిత్యం పుట్టు పుర్వోత్తరాలు గురించి, దళిత సాహిత్యం నిర్వచనాలకు, చారిత్రక నేవధ్యం, సామిత్యం–వస్తువు, దళిత సాహిత్య స్వభావం, లక్ష్యాలు, సాహిత్యం భాష సాహిత్యం ప్రక్రియలు, తెలుగులో దళిత సాహిత్యం మొదలైన అంశాలు కొంత తరచి చూడటం జరిగింది.

దళితులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారనే చెప్పవచ్చు. దళిత జాతికి చెందిన బాల యోగి స్వయం కృషితో కష్టపడి విద్యాభ్యాసం చేయడమేకాక రాజకీయ రంగంలో ఉన్న పదవి నధిరోహించటం దళితులకి గర్వకారణమే అయితే ఆయన అకాల మరణ వార్త దళితులందరికీ విషాధమే.

లాలూ ప్రసాద్ యాదవ్ రాజకీయ జీవితం ఎలా ఉన్న పాట్నా విశ్వవిద్యాలయంలో చదివేటప్పుడే వెనుకబడిన వర్గాల్లోను, దళితులను చైతన్యం తీసుకురావాలని ఎన్నో ఉద్యమాలు, ఆందోళనలు చేసి చిన్నతనం నుంచి, పేదల పాలిట పెన్నిధిగా, దళితుల పోరాట కర్తగా ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు.

సలహాలు:

1. దళిత సాహిత్య ఆవిర్భావ వికాసాలు–ఆరాట పోరాటాలు అన్నీ ప్రింట్ మరియు ఎలక్రానిక్ మీడియాలలో ప్రచారం జరగాలి.
2. ప్రతి ప్రసార సాధనం ద్వారా దళిత సంక్షేమ కార్యక్రమాలు, చట్టాలు మరింత విరివిగా ప్రసారం జరిగావి.
3. దళిత రచయితలు దళిత సమస్యలను రెగ్యులర్‌గా మీడియా అందించాలి.

ఆధార గ్రంథాలు:

1. డా॥బి.ఆర్. అంబేడ్కర్: "అంటబడనివాడు, అంబేడ్కర్ అనుభవాలు", హైదరాబాద్ బుక్ ట్రస్టు.
2. గూడ అంజయ్య: "దళిత కథలు" ప్రజాశక్తి బుక్ హౌస్, చిక్కడపల్లి, హైదరాబాద్.
3. వి.ఆర్. నారనోని: కులవ్యవస్థ పరిణామ క్రమం సామాజిక–రాజీకయ ఉద్యమాల చరిత్ర" నవోదయ బుక్‌హౌస్, ఆర్య సమాజ్ భవన్ ఎదుట, కాచిగూడ చౌరస్తా, హైదరాబాద్.

పాదసూచికలు :

1. డా॥ కనకయ్య – దళిత సమస్యలు – పుట. 52.
2. డా॥ కనకయ్య – దళిత సమస్యలు – పుట. 55.
3. డా॥ కనకయ్య – దళిత సమస్యలు – పుట. 56.
4. డా॥ కనకయ్య – దళిత సమస్యలు – పుట. 57.
5. Arijan Dangale Dalit Literature, Past, present and future. Poisoned Bread, Page No.242.
6. డా॥ కనకయ్య – దళిత సమస్యలు – పుట. 63.

అస్త్ర విద్యలు నాడు – నేడు

డా॥సముద్రాల శ్రీస్మిల, సహాయ ఆచార్యులు, తెలుగుశాఖ, ప్రభుత్వ కళాశాల (A) , రాజమండ్రి.
Cell : 7075091195

నన్నయ ఆదికవి – వాగనుశాసనుడు శబ్దశాసనుడు అనే బిరుదులు ఉన్నాయి. 11వ శతాబ్దానికి చెందిన నన్నయ మహాభారతాన్ని అనుసృజన చేసారు. నన్నయ చేసిన అనుసృజనలో ఆది, సభా పర్వాలు పూర్తిగా, అరణ్యపర్వం మధ్యభాగం వరకు కన్పిస్తుంది. రాజరాజనరేంద్రుని కులబ్రాహ్మణుడు అయినా, అతని ఆస్థానకవి అయినా అటు సంస్కృత కవులను కూడా మెప్పించి " శ్రీ వాణీ... " అనే పద్యంతో తన కావ్యం మొదలు పెట్టాడు.

ఆంధ్ర మాహాభారతంలో ఆదిపర్వము షష్టాశ్వాసంలో 27వ పద్యం అర్జునుడు తన అస్త్రవిద్యాకౌశలత్వాన్ని ప్రదర్శించడం కనిపిస్తుంది. గురువైన ద్రోణాచార్యుని ఎదుట, అతని అనుమతితో ప్రజలు ఆశ్చర్యచకితులను చేస్తూ తన అస్త్రవిద్యలను ప్రదర్శించాడు అర్జునుడు. అవి వరుసగా

1. ఆగ్నేయాస్త్రం – అగ్ని
2. వరుణాస్త్రం – నీరు
3. వాయువ్యాస్త్రం – గాలి
4. మేఘాస్త్రం – మేఘ సమూహం
5. భౌమాస్త్రం – భూమి
6. శైలాస్త్రం – పర్వతం
7. అదృశ్యాస్త్రం – కనుమరుగు

ఈ ఏడు అస్త్రవిద్యలతో అర్జునుడు ముల్లోకాలు కీర్తించేలా తన విద్య ప్రదర్శించి కీర్తిపొందుతాడు.

1. ఆగ్నేయాస్త్రం :

ఈ అస్త్రంతో అర్జునుడు అతిభయంకరమైన అగ్నిని పుట్టిస్తాడు. శత్రువు ప్రయోగించే వాటిని పూర్తిగా శకలాలు కూడా మిగలకుండా కాల్చి బూడిద చేయగలిగినది. సమూల నాశనం చేయడం ఈ అస్త్రం యొక్క అంతిమ లక్ష్యం. ప్రస్తుతం మన సైనిక దళాలు ఆగ్నేయాస్త్రం పేరున యుద్ధం చేస్తున్నారు. క్షిపణి ప్రయోగిస్తున్నారు. భూభాగం పై దురాక్రమణలు జరగకుండా నుదూర లక్ష్యాలు ఛేదించేందుకు కూడా ఖండాంతర క్షిపణిగా కూడా ఆగ్నేయాస్త్రం పనిచేస్తుంది. ఆగ్నేయాస్త్రంలో ఐదు శ్రేణులున్నాయు.

ఉదా :– అగ్ని – 1
అగ్ని – 2
అగ్ని – 3
అగ్ని – 4, 5
అగ్ని – 6 యిది ఖండాంతర క్షిపణి

2. వారుణాస్త్రం :

ఈ అస్త్రంతో శత్రువు వారించలేని, నివారించలేని నీటిని పుట్టించగల ప్రధానమైన ఉద్దేశం.

ప్రస్తుత కాలంలో వారుణాస్త్రం నీటిని పుట్టించడం వంటి ప్రక్రియ కాదుగానీ నీటిలోకి ప్రవేశించగలదు. నౌకాదళం వారు శత్రుదేశాలకి చెందిన సబ్మెరైన్స్‌ని ధ్వంసం చేసేవిధంగా సముద్రగర్భంలో ఉంటూ సముద్ర మార్గంలో సరిహద్దులు దాటి దొంగదెబ్బ తీసే వాటిని ముక్కలుగా చేయగల ఛేదించగల క్షిపణి వారుణాస్త్రం.

ఉదా: హర్పెడో

3. వాయువ్యాస్త్రం :

ఈ అస్త్రంతో విపరీతమైన,పెద్దమొత్తంలో గాలిని పుట్టించొచ్చు. రామాయణంలో కూడా "వాయువ్యాస్త్ర ప్రయోగే వినియోగ:" అని వాయువ్యాస్త్రం వశపడాలని

కోరుకునేవారని తెలుస్తుంది. అంటే భారతేతిహాసాలైన భారతం రామాయణాల్లో ఈ అస్త్రం సుపరిచితం.

ప్రస్తుత కాలంలో భూ ఉపరితలంనుండి తిరిగి గాలిలోకి, వాయు భాగం నుండి వాయువులోనికి ఎగరగల క్షిపణులు మన దేశంలో ఉన్నాయి.

ఉదా: అస్త్ర MK 1

అస్త్ర MK 2

అస్త్ర MK 3

క్యూ.ఆర్.శ్యామ్ – యిది ఉపరితలం నుండి గాలిలోకి ఎగరగల క్షిపణి.

ఆకాశ్ – భూమి నుండి గాలిలోకి ప్రయోగించే క్షిపణి.

4. భౌమాస్త్రం :

ఈ అస్త్రం ద్వారా అర్జునుడు భూమి ఉపరితలు నుండి భూమి యొక్క అంతర్భాగంలోకి ప్రవేశించేలా చేయగల అస్త్రం. యిది భూమిని ఛేదించుకుంటూ భూమి లోపలికి చేర్చగలదు.

ప్రస్తుతం మనకు ఉపరితలం నుండి ఉపరితలానికి చేరే క్షిపణులు ఉన్నాయి గానీ భూమి అంతర్భాగంలోకి చేర్చగలిగిన క్షిపణులు కన్పించవు.

ఉదా: పృధ్వి – భూమి నుండి భూమికి

బరాక్ – 8

5. మేఘాస్త్రం :

ఈ అస్త్రం ద్వారా అప్పటికప్పుడు భూమి మీద ప్రజల ఎదుట మేఘాలను, మేఘ సమూహాన్ని పుట్టించగలడు అర్జునుడు.

ప్రస్తుతం భూమి ఉపరితలంపై మానవ సంచార ప్రాంతంలో మేఘాలను పుట్టించగల క్షిపణులుకనబడవు. కానీ వాతావరణం యొక్క పొరలలో ఎక్సోస్ఫియర్, ధర్మోస్ఫియర్‌లలో ప్రయోగం సంచారం కన్పిస్తుంది.

6. శైలాస్త్రం :

ఈ అస్త్రంలో పర్వతరూపం పొందుతాడు అర్జునుడు. రక్తము, మాంసము కలిగిన శరీరం ధరించిన మానవ రూపం నుండి ధృఢమైన శిలా రూపం పొందడం అసాధ్యం అయినా, భారతంలో అర్జునుడు ప్రయోగించిన శైలాస్త్రంతో సుసాధ్యం అయ్యింది.

7. అదృశ్యాస్త్రం :

భౌతికంగా కనిపించే అర్జునుడుని అగపడకుండా, కనబడకుండా ఉండేలా చేయగలదు ఈ అస్త్రం. అంటే ఈ అస్త్రం ద్వారా అర్జునుడు ఉన్న చోటునుండి మాయం కాగలడు, కనుమరుగు కాగలడు.

ఇవే కాకుండా ఇంకా భారతంలో పాశుపతాస్త్రం, ఐంద్రాస్త్రం, ఐషికాస్త్రం, యమాస్త్రం, అసురాస్త్రం, గరుడాస్త్రం వంటివి ఎన్నో భారతంలోని ఆదిపర్వంలో షష్టాశ్వాసంలో 27వ పద్యంలో అస్త్రాలను ఈ వ్యాసంలో నేటికి అన్వయించి వివరించడం గమనార్హం.

అస్త్ర విద్యలు భారతంలో అర్జునుడు ప్రదర్శించాడు. నేడు అస్త్రాలతో యుద్ధం చేసి దేశాన్ని సంరక్షిస్తున్నారు. అస్త్ర విద్యలు భావన ఒకటే కానీ, వస్తు రూపం వేరు, ప్రయోగం వేరు. ఆధునికతను సంతరించుకున్న భారతదేశానికి అస్త్ర విద్యలు ఎంతైనా అవసరం.

ఆధారాలు :

1. శ్రీ మదాంధ్ర మహాభారతం – 2, ఆదిపర్వం.
2. అగ్నేయాస్త్రం – ఆంధ్ర భూమి; న్యూస్ పేపర్ పోర్టల్.
3. వారుణాస్త్రం– తెలుగు న్యూస్; సంజయ్ కాసుల; 2020.

నన్నయ సూక్తులు

డా॥ దొప్పలపూడి సుజాత, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ కళాశాల (ఎ), రాజమహేంద్రవరం.

ఉపోద్ఘాతం :

వ్యాస భారతాన్ని నన్నయ, తిక్కన, ఎర్రనలు తెలుగులోకి అనువాదం చేసారు. నన్నయ తెలుగులో ఆదికవి. ఆదికావ్యం ఆంధ్రమహాభారతం. క్రీ.శ 11వ శతాబ్దానికి చెందిన రాజ రాజ నరేంద్రుడు తన కుల బ్రాహ్మణుడైన, ఆస్థాన కవియైన నన్నయను పిలిచి సంస్కృత భారతాన్ని రచించమని కోరాడు. ఆయన కోరిక మేరకు నన్నయ భారతంలోని 18 పర్వాలలో ఆది, సభా, అరణ్య పర్వంలో సగభాగాన్ని అనువదించారు.

నన్నయ తన రచనలో 3 రీతులు ఉన్నాయని చెప్పారు.

అవి 1) ప్రసన్న కథాకలితార్థయుక్తి

2) అక్షరరమ్యత

3) నానారుచిరార్థ సూక్తినిధి.

నన్నయ రచనలో సూక్తులు :

సూక్తి అంటే మంచి మాట. నీతులనే సూక్తులుగా వ్యవహరిస్తాం. నన్నయ తన రచన నానారుచిరార్థ సూక్తులకు నిధి వంటిది అన్నాడు. అంటే అనేక అభిరుచులు కలిగించే అర్థాలతో కూడిన సూక్తులు నన్నయ రచనలో ఉంటాయని ఆ మాటకు అర్థం. నన్నయ అభిప్రాయంలో సూక్తి అంటే కేవలం సూక్తే కాదు అర్థ సూక్తులని అర్థం. ఒక కథ పరమార్థాన్ని, ఒక పాత్ర అంతరార్థాన్ని ఒక పద్యం లేదా ఒక వాక్యం ద్వారా వివరిస్తాడు. సూక్తి అంటే చమత్కారమైన కూర్పు. అది పదం, పదబంధం, సమాసం, అలంకారం, నానుడి, సామెత మొదలైన వాటిద్వారా కూడా సాధ్యమేననేది నన్నయ రచనను బట్టి తెలుస్తుంది. కాబట్టి అలంకారిక రచన లోకోక్తులు, నీతులు, సామెతలు పదబంధాలన్నీ సూక్తినిధిలోనివే.నన్నయ సూక్తులు లౌకికంగా ఆధ్యాత్మికంగా రాజనీతిపరంగా, ధర్మ ప్రబోధంగా కనిపిస్తాయి.

కిందముడు అనే ముని శాపం వల్ల పాండు మహారాజు చనిపోతాడు. తన రెండవ భార్య మాద్రిదేవి సతీసహగమనం చేస్తుంది. పాండవులు పసిబిడ్డలు. రాజ్యం పరిపాలించడానికి వంశంలో అర్హులైనవారు కనిపించడం లేదు. ఈ పరిస్థితులన్నీ ఒక ఎత్తైన కుంతీదేవి విలపించేతీరు చూస్తే హృదయ విదారకంగా ఉంది. ఈ పరిస్థితులన్నీ తలచుకొని సత్యవతి దేవి భోరున విలపిస్తుంది. అప్పుడు వ్యాస మహర్షివచ్చి సత్యవతిదేవితో రహస్యంగా ఇలా చెప్పాడు.

"మతి (దలపగ సంసారం

బతి చంచల మెండ మావులట్టులు సంపత్

ప్రతతులతి క్షణికంబులు

గతకాలముమేలే వచ్చు కాలము కంటెన్"

అని చెప్పాడు. "గతకాలము మేలు వచ్చు కాలము కంటెన్" అన్న వాక్యంలో "రాబోయే కాలము కంటే గడచిన కాలమే మేలు" అని సామాన్యంగా చెప్పినట్లు ఉంటుంది. కానీ వ్యాస భగవానుని మాటలలో అంతరార్థం దాగి ఉంది. అమ్మా! ఒకడు చనిపోతేనే ఇంతగా విలపిస్తున్నావు. భవిష్యత్తులో నీ కుటుంబంలో అన్నదమ్ముల మధ్య భయంకరమైన పోరు జరుగుతుంది. రాజ్యంకోసం. ఆ యుద్ధంలో నీ వంశ అంకురం కూడా లేనిస్థితి కలుగ బోతుంది. అది మహాశోకం. దానిని వర్ణించడం ఎవరితరం కాదు. కురుక్షేత్రం పీనుగుల దిబ్బగా మారిపోతుంది. దహన సంస్కారాలు చేయడం కూడా కష్టమైన పరిస్థితులు వస్తాయి. కాబట్టి రాబోయే కాలం కంటే గడిటిపోయిన కాలమే ఎప్పటికైనా మేలు అని హిత బోధ చేస్తారు. ఆయన మాటల్లో

ఎంతో అంతరార్థం, జరుగ బోయే కథ నన్నయ చెప్పించాడు. ఇది నన్నయ రచనా ఔన్నత్యం. ఈ సూక్తి నేటికీ లోకోక్తిగా మిగిలి పోయింది. ప్రాచుర్యంలో ఉంది.

శకుంతలోపాఖ్యానంలో కూడ దుష్యంత మహారాజు వేటలో భాగంగా కణ్వ మహర్షి ఆశ్రమానికి వెళ్ళాడు. అక్కడ శకుంతలను చూశాడు. ఆమెని గాంధర్వ వివాహం చేసుకుంటాడు. తన రాజ్య పరిపాలనలో భాగంగా తన అంత:పురానికి వెళతాడు. కణ్వ మహర్షి దూరదృష్టితో జరిగిందంతా గమనిస్తాడు. శకుంతలను, తన కుమారుడైన భరతుణ్ణి కొందరు నమ్మకస్తులైన శిష్యులనిచ్చి రాజాశ్రమానికి పంపాడు. భటులు శకుంతల రాకని రాజుకి తెలియజేస్తారు. దుష్యంత మహారాజు లోకాపవాదుకి భయపడి శకుంతల ఎవరో తెలియదు అంటాడు. అప్పుడు శకుంతల రాజుకి ఈ నీతిని తెలియజేస్తుంది.

" నుత జల పూరితంబులగు బావులు నూరింటి కంటె సూ
నృత వత ఒక బావి మేలు మరి బావులు నూరింటికంటె ఒక్క
సత్ క్రతువది మేలు సత్ క్రతు శతంబుకంటె ఒక్క
సుతుండు మేలు సత్ సుత శతంబు కంటె సూనృతం
గక్యంమేలు చూడగన్ "

అని అంటుంది. ఎన్నో యజ్ఞాలు యాగాలు చేస్తే వచ్చే పుణ్య ఫలం ఒక్క యదార్థమైన మాట వల్ల కలుగుతుందని హితువు పలుకుతుంది. ఈ విధంగా నన్నయ తన రచనలో అనేకమైన సూక్తులను లోకహితంగా తెలియజేసారు.

శకుంతలోపాఖ్యానంలోనే శకుంతల అయ్యా మీరు కణ్వమహర్షి ఆశ్రమానికి వచ్చారు. నా వృత్తాంతం అడిగి తెలుసుకొని నన్ను గాంధార వివాహం చేసుకున్నారు అని గుర్తుచేస్తుంది. రాజు గుర్తించక "యేనట నీ వెట సుతుడెట" అంటారు. అంటే అమ్మా నేనేంటి, నీవేంటి, కొడుకేంటి. నేను రాజుని నీవు ఒక సాధారణ స్త్రీవి. నేనెక్కడ ? నీవెక్కడ? నేను ఒక సామాన్య స్త్రీని వివాహం చేసుకోవడం ఏంటి? ఏమి మాట్లాడుతున్నావు ? అనే సందర్భంలో ఈ సూక్తి చెప్పబడింది.

ముగింపు :

ఈ విధంగా నన్నయ తన రచనలో అనేకమైన సూక్తులను, నీతి వాక్యాలను సందర్భోచితంగా లోకానికి అందించారు.

పోతన భాగవతం - వైశిష్ట్యం

డాక్టర్ బి.చక్రవర్తి, కర్నాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, ముక్త గంగోత్రి, మైసూరు -570 006,
చరవాణి: 96664 54688

పోతన పేరు వినగానే భాగవతం స్ఫురిస్తుంది. భాగవతం అనగానే భక్తితత్త్వం గుర్తుకొస్తుంది. భారతీయ ఆధ్యాత్మిక చింతనకు సంకేతంగా, పరతత్త్వానికి ప్రతీకగా, భక్తి భావనకు ఆలంబనగా నిలుస్తుంది భాగవతం. అటువంటి మహత్తరమైన భాగవత గ్రంథాన్ని పరమోదాత్తంగా ఆంధ్రీకరించడం తన పురాకృత పుణ్యంగా భావించిన భాగవతోత్తముడు పోతన తేటతేట తెనుగు పదాల తేనెసొనలలో భాగవత భక్తితత్త్వామృతాన్ని రంగరించి తెలుగు వారందరికీ పంచి పునీతుల్ని చేసిన ఉత్తమకవి పోతన.

పోతన కౌండిన్య గోత్రుడు, ఆపస్తంబ సూత్రుడు. లక్కమాంబ, కేసనల పుత్రుడు. అన్న తిప్పన. వీరు శైవమతస్థులు. సదాచార సంస్కార కుటుంబ వాతావరణంలో పెరిగిన పోతన సద్గుణ సద్వినయ సంపన్నుడిగా ఎదిగాడు. ఇతను గురుముఖంగా చదువుకున్నది చాలా తక్కువ. గురుకులవాసం చేసి శాస్త్రాలు చదువుకోకపోయినా తారకమంత్ర మహిమచేత, 'విబుధజనుల వలన విన్నంత కన్నంతనే స్వయం కృషితో, సరస్వతీదేవి కరుణాకటాక్షంతో సకల విద్యాపారీణుడేకాక భక్తి కవితాధురీణుడైనాడు. సహజ పాండిత్యాన్ని అలవర్చుకున్నాడు. అందుకే పోతనను సహజకవి అంటారు.

పోతన సహజకవి పోతనగా, భక్తికవి పోతనగా, బమ్మెర పోతనగా, పోతనామాత్యునిగా, పోతన్నగా, పోతరాజుగా అనేక పేర్లతో పిలువబడ్డాడు.

పోతన బాల్య రచన "ఏమి కథ యొనర్చి యిలలోన సత్కీర్తి దనరవచ్చు" అని పోతనగారు ఆలోచిస్తున్న సమయంలో అతని గురువైన ఇవటూరి సోమనారాధ్యుడు అతనితో "వీరభద్ర విజయము వినవేడ్కయయ్యెనది తెలుగున రచియింపుమని" కోరెను. అప్పటికి పోతన చిన్నవాడు, పెక్కు సంస్కృతులతో పరిచుతుడు కాడు. "నా ప్రసాద మహిమచే నెంతయైన గవిత చెప్పగలవు" అని "నీకు వీరభద్ర ప్రసాదంబగలదు" అని గురువు సోమనారాధ్యుడు అభయమిచ్చాడు. గురువు ఆదేశానుసారం పోతన వీరభద్ర విజయాన్ని రచించాడు. "కేశయామాత్య పుత్ర పోతన నామధేయ ప్రణీతంబైన వీరభద్ర విజయము" అని ఆశ్వాశాంత గద్య. దీని ఆధారంగా వీరభద్ర విజయము పోతన రచన అని స్పష్టమవుతున్నది.

'వీరభద్ర విజయము' నాలుగు ఆశ్వాసాల కావ్యం. పార్వతీ పరమేశ్వరులు వెండికొండపై కొలువై ఉండగా దేవతలు, ఋషులు వచ్చి కొలుస్తూ ఉంటారు. వారిలో దక్షుడు కూడా ఉంటాడు. మామగా తనపట్ల ప్రత్యేకమైన గౌరవం చూపడంలేదని దక్షుడు పరమశివునిపై ఆగ్రహించి జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకోవాలని భావించి వెళ్ళిపోయి యజ్ఞాన్ని నిర్వహించాలనుకుంటాడు. ఆ యజ్ఞానికి శివుని తప్ప అందరినీ ఆహ్వానిస్తాడు. నారదుని ద్వారా తెలుసుకున్న పార్వతి తన పతిని పిలకపోవడానికి గల కారణం తెలుసుకోవడానికి తండ్రి దగ్గరకు వెళుతుంది. దక్షుడు ఆమెను తూలనాడడమే గాక శివుణ్ణి కూడా నిందిస్తాడు. శివనింద విన్న పాపానికి ప్రాయశ్చిత్తంగా పార్వతి యజ్ఞ వాటికలోనే దేహత్యాగం చేస్తుంది. ఇది తెలుసుకున్న శివుడు వైవస్వతమన్వతర ప్రారంభం నాడు దక్షాధ్వర ధ్వంసం చేస్తానని శాపమిస్తాడు. తనువు చాలించిన పార్వతి హిమవంతుని కూతురుగా జన్మిస్తుంది. యవ్వనం రాగానే శివున్ని భర్తగా పొందగోరుతుంది. ఇది గమనించిన హిమవంతుడు పార్వతిని పరమేశ్వరునికి సపర్యలు చేయడం కోసం నియోగిస్తాడు.

తారకాసురుడనే రాక్షసుడు దేవతలను బాధిస్తూ ఉంటాడు. శివపార్వతులకు జన్మించే కుమారుని వలన తారకాసురుని సంహారం జరుగుతుందని బ్రహ్మ చెబుతాడు. పార్వతి రోజూ సపర్యలు చేస్తున్న శివునిపై దేవతలు మన్మథుని ఉసిగొల్పుతారు. తపోభంగం చేసిన మన్మథుణ్ణి శివుడు తన మూడోకంటితో భస్మం చేస్తాడు. దీనితో హిమవంతుడు పార్వతిని తనతో తీసుకుపోతాడు. అప్పుడు శివుడు మారువేషంలో వచ్చి పార్వతితో శివునికై తపస్సు చేయమని చెబుతాడు. పార్వతి ఆ విధంగా చేస్తుంది. శివుడు బ్రహ్మచారి వేషంలో వచ్చి పార్వతిని కలుసుకుంటాడు. శివపార్వతుల వివాహం జరుగుతుంది.

ఈలోగా వైవస్వత మన్వంతరంలో దక్షుడు మళ్ళీ యజ్ఞాన్ని తలపెడతాడు. తిరిగి అదే అపచారాన్ని పునరావృత్తం చేస్తాడు. యజ్ఞానికి శివుని తప్ప అందరినీ పిలుస్తాడు. ఈ దురాగతాన్ని, దక్షుని దురహంకారాన్ని తెలిసి సహించలేని శివపార్వతులు అగ్రహోదగ్రులవుతారు. వారి కోపాగ్ని నుండి వీరభద్రుడు, భద్రకాళి జన్మిస్తారు. వీరభద్రుడు ప్రమథ గణాలతో కలిసి దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేస్తాడు. యాగపురుషుడైన విష్ణువు చక్రాన్ని ఖండించి మిగతా దేవతలను గాయపరుస్తాడు. అవయవాలను ఛేదిస్తాడు. వీరభద్రుడు విజయంతో అందరినీ తోడ్కొని కైలాసానికి తిరిగి వస్తాడు. శివుడు దక్షుణ్ణి క్షమించి మిగతా వారందరినీ కరుణించి వారి రూపాలనిచ్చి పంపివేస్తాడు. ఇది 'వీరభద్ర విజయము'లోని ప్రధాన ఇతివృత్తం.

సతి పార్వతిగా జన్మించి శివునికి సపర్యలు చేయడం ప్రథమాశ్వాసంగా, శివుడు బ్రహ్మచారి రూపంలో రావడం ద్వితీయాశ్వాసంగా, పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం తృతీయాశ్వాసంగా, దక్షుని క్రతువు, వీరభద్రుని అవతరణ, విజయం చతుర్థాశ్వాసంగా రచించాడు పోతన.

భోగినీ దండకం రచించిన పోతన రాచకొండను పాలించిన సర్వజ్ఞ సింగభూపాలుకి అంకితమిచ్చాడు. రాజైన సర్వజ్ఞ సింగభూపాలునికి, ఒక వేశ్యాంగనకు మధ్య చిగురించిన ప్రణయం ఇందులోని ప్రధానాంశం.

సర్వజ్ఞ సింగభూపాలుని గోపాలదేవోత్సవ క్రీడలో భోగిని అనే ఒక వేశ్యయువతి చూచి వలచింది. అతనినే తలచుకొని వ్యథచెందింది. అది తమ కులాచార విరుద్ధమని వేశ్యమాత కుమార్తెను మందలించి హితోపదేశం చేసింది. కానీ భోగిని తల్లిమాటలను లెక్కచేయక తెగించి ఎలాగో నాయకుణ్ణి కలుసుకొని అతని పాదాలపై పడి తనను ఏలుకోమని అభ్యర్థించింది. రాజు ఆమెను అనుగ్రహించి ఏనుగుపై ఊరేగించి ప్రియురాలిగా స్వీకరిస్తాడు. భోగినీ సర్వజ్ఞ సింగభూపాలుర వలవు ఇతివృత్తంగా గలది భోగినీదండకము.

నారాయణ శతకము తాళపత్ర ప్రతులలో శతకాంత గద్యకాని, కవిని గూర్చిన పద్యం కానిలేదు. దీనితో ఇది పోతన రచన కాదని కొందరు సంశయించారు. కొన్ని రాత ప్రతులలో ఇదిశ్రీ పరమేశ్వర కరుణా కలిత కవిత విచిత్ర కేసన మంత్రి పుత్ర సహజపాండిత్య పోతనామాత్య ప్రణీతంబైన నారాయణ శతకంబు" అనే గద్యభాగం శతకాంతంలో ఉంది. ఈ గద్యను పోతనయే వ్రాసియుండెనని నారాయణ శతకమును ముద్రించిన వంగూరి సుబ్బారావు గారు నిర్ణయించారు.

'నారాయణా అనే మకుటంతో నూటమూడు పద్యాలు గల శతకమిది", 'నారాయణ శతకము' బహుళవ్యాప్తి పొందింది. నారాయణ శతకము నాడు దేశమునందు ప్రబలముగా వ్యాప్తమైయుండిన వైష్ణవమతాభిమానము ఈ కృతికి ప్రేరణము నొసగినది కృష్ణభక్తికి భాగవత తత్వమునకు ఆత్మ హృదయములో బీజము నాటినది నారాయణ శతకమే.

"భాగవతానాం చరితమ్ భాగవతమ్" భాగవతుల చరిత్ర భాగవతం అని దీని అర్థం. ఇక్కడ భాగవతులు అంటే విష్ణుభక్తులు. భక్తి, జ్ఞాన, వైరాగ్యాల చేత మోక్షమార్గాన్ని సుగమం చేయగలిగిన గొప్ప గ్రంథం భాగవతం. భాగవతం

భక్తి రస ప్రధానమైన కావ్యం.

భాగవతాన్ని సంస్కృతంలో వ్యాసమహర్షి రాశాడు. తెలుగులో పోతనగారు రాశారు. భాగవతం మొత్తం 12 స్కంధాలు 1,2,3,4,7,8,9,10 స్కంధాలను పోతన, 5వ స్కంధం బొప్పరాజు గంగయ, 6వ స్కంధం ఏర్చూరి సింగన, 11, 12 స్కంధాలను వెలిగందలినారయలు రాశారు.

పోతన వ్యక్తిత్వం :

పోతనగారి రచనల ఆధారంగా అతని గుణశీలాలను, స్వభావాన్ని తెలుసుకోవచ్చు. పోతనగారి వ్యక్తిత్వాన్ని గూర్చి తెలుసుకోవడానికి ఆయన రచించిన రచనలలో అనేక పద్యాలు మనకు కనిపిస్తాయి. కావ్యాన్ని నరాంకితం చేయడం పోతన గారికి ఏమాత్రం ఇష్టంలేదు.

ఉ॥ ఇమ్మనుజేశ్వరాధ ములకిచ్చి వురంబులు వాహనంబులున్
సొమ్ములు కొన్ని పుచ్చుకొని సొక్కి శరీరము వాసి కాలుచే
సమ్మెట వ్రేటులం బడక సమ్మతి శ్రీహరి కిచ్చి చెప్పె నీ
బమ్మెర పోతరాజొకడు భాగవతంబు జగద్ధితంబుగన్.

విశ్వశ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని రచించిన భాగవతాన్ని భగవంతునికి తప్ప చిల్లర మల్లర రాజులకు అంకితమివ్వటానికి నా మనస్సు అంగీకరించలేదు. రాజులిచ్చే అగ్రహారాలు, వస్తువాహనాలు, హారాలు తీసుకొని ఆ మైకంలో నేను మైమరచి ఈ లోకంలో సుఖం అనుభవించినా ఆ లోకంలోకి అడుగుపెట్టిన తర్వాత గతంలో చేసిన తప్పులకు యమధర్మరాజు చేతిలో సమ్మెట దెబ్బలు తప్పవు. అందుకే నేను ఈ భాగవత మహాగ్రంథాన్ని భగవంతుడైన శ్రీహరికే సమర్పించుటకు నిశ్చయించటానికి అని పలకడంలో పోతన గారి వ్యక్తిత్వం ప్రస్ఫుటమవుతున్నది.

కావ్యాన్ని నరాంకితం చేయడం అంటే సరస్వతీదేవిని అమ్ముకోవడమేనని పోతనగారి భావన. సరస్వతీదేవి 'తనను రాజులపాటు చేయవద్దని ఏడ్చినట్టు ఆ ఏడుపుతో కరిగిపోయిన పోతనగారు ఆమెను ఓదార్చుతూ నరాంకితం చేయనని వాగ్దానం చేసిన సందర్భంలో చెప్పిన పద్యంగా కింది పద్యం ప్రచారంలో ఉంది.

ఉ॥ "కాటుక కంటి నీరు చనుకట్టు పయింబడ నేల నేడ్చెదో
కైటభదైత్యమర్దనుని గాదిలి కోడల! యో మదంబ! యో
హాటక గర్భరాణి! నిన్ను నాకటికిం గొనిపోయి యల్లక
ర్ణాట కిరాట కీచకుల కమమ ద్రిశుద్ధిగ నమ్ము భారతీ"

పోతన అనగానే తెలుగుజాతికి గుర్తుకు వచ్చేది భాగవతం. పోతన ఇంకా ఇతర రచనలు చేసినా భాగవతం మాత్రమే బాగా ప్రసిద్ధిగాంచింది. అందుకు కారణం ఒకటి భక్తి అయితే, రెండవది పోతన కవితాశక్తి, కేవలం భక్తిమాత్రమే అయితే అటువంటి గ్రంథాలు ఎన్నో వచ్చాయి. కానీ అందించిన కవితాశక్తి ఆ భక్తికి తోడై యావజ్జాతి హృదయాల్ని ఆనందసాగరంలో ముంచెత్తి భాగవతానికి అంతటిశక్తి కలిగించింది. పోతన కవితాశక్తిని సమగ్రంగా విశ్లేషించే సందర్భమిది కాదు. కాబట్టి స్థాలీపులాక న్యాయంగా తెలియజేసే ప్రయత్నం చేస్తాను.

పోతన భాగవతం పీఠికలో తాను ఎలా రచిస్తున్నానో చెప్పుకున్నాడు.

క॥ "పలికెడిది భాగవతమట!
పలికించెడి వారు రామభద్రుండట! నే
బలికిన భవహర మగునట!
పలికెద వేఱొండు గాథ పలుకగ నేలా?"

ఇది ప్రాసకోసం చెప్పిన మాటలు కావు. భాగవత రచన సామాన్యుల చిత్తం కాదు. అందుకు ఎంతో సంస్కారం కావాలి. ఈ దేశంలోవున్న ఎన్నో రకాల చిత్తవృత్తుల్ని నొప్పించకుండా ఒప్పించే శక్తికావాలి. అందుకే అది సాధారణ మానవుడికి అసాధ్యం. మరి ఎవరికి సాధ్యం అన్నప్పుడు ఈ సృష్టిని నడిపించే శ్రీరామచంద్రుడికే సాధ్యం అన్న విషయాన్ని

భావన చేసి పోతన్న పై వాక్యాలను చెప్పుకున్నాడు.

తే॥ "భాగవతము దెలిసి పలుకుట చిత్రంబు!
శూలికైన దమ్మి చూలికైన!
విబుధజనుల వలన విన్నంత కన్నంత
దెలియ వచ్చినంత దేటపఱతు"

భాగవతం హాయిగా సాగిపోయే సెలయేరు కాదు. కేవలం కృష్ణలీలా విలసితమో, విష్ణుభక్తుల కథాగానమో కాదు. ఇది ఎన్నెన్నో విప్పలేని వేదాంత గ్రంథాలున్న మహాగ్రంథం. ఆ ముడులు విప్పటం ఎవరికి సాధ్యం. అంటే అంతటి రహస్యాన్ని ఛేదించే శక్తి కేవలం ఆ రామభద్రుడికే ఉందట. సాక్షాత్తు ఆ శివునికి, బ్రహ్మకు కూడా సాధ్యం కాదట మరి. అందుకే పోతన ఆ విషయాన్ని ముందే తెలియజేసి శ్రీరామచంద్రుడిపై భారం వేశాడు. తరువాత ఎంతో వినయశీలంతో 'విబుధ జనుల వలన విన్నంత కన్నంత తెలియ వచ్చినంత తేటపఱతు'నని ఈ బాహ్యలోకానికి చెప్పుకున్నాడు.

కం॥ "కొందఱకు దెనుగు గుణమగు
గొందఱకును సంస్కృతంబు గుణమగు; రెండుం
గొందఱికి గుణములగు నే
నందఱ మెప్పింతు గృతుల నయ్యెయెడలన్"

ఇవి పోతన తన కవితని గురించి ఎంతో ఆత్మ విశ్వాసంతో చెప్పుకున్న మాటలు. అంతకు ముందే తిక్కనకు 'ఉభయ కవి మిత్రుడు' అనే బిరుదముంది. అంటే సంస్కృతాంధ్ర భాషలలో మంచి నేరు కలవారని చెప్పుకోవటం. ఎందుకంటే ఆనాడు సంస్కృతం పండితులకు, జానుతెనుగు సామాన్య జనులకు ప్రియమైంది. అందుకే నన్నయాదులు సంస్కృతం పండితులకు, జానుతెనుగు సామాన్య జనులకు ప్రియమైంది. అందుకే నన్నయాదులు సంస్కృతం మెండుగా, సోమనాదాదులు జానుతెనుగు మెండుగా రాయగా ఈ రెంటిని సందర్భానుసారంగా వాడి తిక్కనాదులు జనప్రియంగా అప్పటికే చేసిన పరిశ్రమ నిలిచింది. కాబట్టి ఈ వ్యత్యాసం అప్పటికే ఉంది. అందువల్లనే పోతన ఆ రెండు గుణాలను ప్రస్తావించాడు. ఇద్దరిని మెప్పించే కవితాశక్తి నాకు ఉందని వినయంగానే చెప్పుకున్నాడు ఈ సహజపండితుడు.

ఉపయుక్తగ్రంథాలు

1. తెలుగు సాహిత్య సమీక్ష, 1985 – నాగయ్య,జి., నవ్యపరిశోధక ప్రచురణ, తిరుపతి
2. తెలుగు సాహిత్య చరిత్ర, 1998 – శాస్త్రి, ద్వానా, ప్రతిభ పబ్లికేషన్స్, హైదరాబాద్
3. తెలుగు సాహిత్య చరిత్ర, 2021 – సిమ్మన్న, వెలమల, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ.
4. తెలుగు సాహిత్య చరిత్ర, 1996 – కొర్లపాటి, శ్రీరామమూర్తి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్
5. సమగ్రాంధ్ర సాహిత్యం, 2013 – ఆరుద్ర, తెలుగు అకాడమి, హైదరాబాద్
6. ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయాలు – ప్రయోగాలు, 2015 – నారాయణరెడ్డి, సి., విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
7. విప్లవ వాదం, 2012 – రామమోహన్‌రాయ్, కడియాల, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్

పాతికేళ్ల తెలుగు కథ (1990-2014) - కుటుంబ జీవన చిత్రణ

తలారి హరిశ్ కుమార్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం,
ఫోన్ నెం: 9505363118

ఒక సంస్థ మనుగడలోనో, ఒక మనిషి జీవితంలోనో పాతికేళ్లు ఎక్కువ కాలమే కావచ్చు. కానీ చరిత్ర గమనంలో ఒక సమాజానికి అది స్వల్పకాలమే. అయితే, ఈ స్వల్పకాలం భారతదేశ చరిత్రలో మరీ ముఖ్యంగా తెలుగు సమాజ చరిత్రలో అతి ముఖ్యమైనది. 1990లలో దేశంలో ప్రారంభమయిన నూతన ఆర్థిక విధానాలు అతి త్వరలోనే గ్లోబలైజేషన్ ప్రక్రియలో భాగమై మనల్ని తీవ్రంగా ప్రభావితం చేశాయి. పాతికేళ్ల తెలుగు 'కథ' (1990 – 2014) అందుకు ప్రయోగవేదికే అయింది. సమాజాన్ని ఆలోచనాపథం వైపు నడిపిన కమ్యూనిస్టు ఉద్యమాలు తాత్కాలికంగానే ప్రయోజనాన్ని చూపాయి. వివిధ అస్తిత్వవాద ఉద్యమాలు అనేక కోణాల నుండి కొత్త ప్రశ్నలు లేవనెత్తాయి. అందులో భాగంగానే నిర్లక్ష్యానికి, వివక్షకు గురయిన ప్రాంతాలలో మొదలయిన కుటుంబ సమస్యలు, ఆనాటి జీవన స్థితిగతులు కథ తనలో ఇమిడించుకుంది.

ఈ పాతికేళ్ల కథ (1990 – 2014) ఒక రచయిత రచనా సర్వస్వం కాదు. ఒక ఉమ్మడి సంస్థ (కథా సాహితి) పాతికేళ్ల ప్రస్థాన సర్వస్వం. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సంపాదకత్వంలో 1990 నుండి ప్రతియేటా ప్రచురిస్తున్న 25 వార్షిక కథాసంకలనాల సర్వస్వంమిది. వారు ప్రతి సంవత్సరం వివిధ పత్రికల్లో, ఇతర మాధ్యమాల్లో తొలిసారి వెలువడిన వందలాది కథల నుండి వారికి నచ్చిన, వారు ఉత్తమమని భావించిన కథలతో ప్రచురించిన వార్షిక సంకలనాలు ఇవి. వీటిలో 159 మంది రచయితలు రాసిన 339 కథలున్నాయి. ఈ కథలన్నీ ఒకే సంకలనంగా తీసుకురావటం ద్వారా పాతికేళ్ల తెలుగు సామాజిక, సాంస్కృతిక జీవితం పాఠకులకు కథారూపంలో అందుతుందని వారు తలపెట్టిన మహా యజ్ఞమే ఈ కథ వార్షిక సంకలనాలు.

'కథ' (1990 – 2014)- కుటుంబ జీవన చిత్రణ:

మనిషి జీవితం బాల్యం, కౌమారం, యవ్వనం, వార్ధక్యం దశలను అనుభవించాల్సి ఉంటుంది. సామాన్యంగా వ్యక్తి, బాల్యంలో తల్లిదండ్రుల కనుసన్నల్లో జీవిస్తాడు. ఏది కావాలన్న వారే తీసుకొచ్చి ఇస్తారు. యవ్వనంలో తానే స్వయంగా తనకు కావాలసిన వాటిని పొందేందుకు ప్రయత్నిస్తాడు. కొంత స్థిరత్వం సాధించాక వివాహ వ్యవస్థలోకి అడుగుపెడతాడు. తన పిల్లల పెంపకం దశలో జీవితాన్ని కొనసాగిస్తుంటాడు. ఆడ పిల్లల విషయంలో తల్లిదండ్రులు ఇంకాస్త జాగ్రత్తగా వ్యవహరిస్తూ ఉంటారు. యుక్తవయసులో పిల్లలు పెడత్రోవలో వెళ్ళకుండా గమనిస్తుంటారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటారు. ఇటువంటి యుక్తవయసు ప్రేమకు సంబంధించిన వస్తువు పాతికేళ్ల తెలుగు కథలో చాలా చోట్ల కనిపిస్తుంది.

ఈ మొత్తం వాతావరణం సాహిత్యంలోకి, ముఖ్యంగా కథల్లోకి తర్జుమా అయింది. సంసారిక జీవితానికి సంబంధించిన రాజకీయాలు, ఆర్థిక విషయాలు, సామాజిక వాతావరణం సాహిత్యం మీద వేయగలిగిన ముద్ర ఎంత బలమైనదో, ఈ కాలంలో వెలువడిన కథలు చదివితే అర్థమవుతుంది.

బిడ్డలు గల్ల తల్లి, జీవని కథల్లోని వాతావరణం కన్నతల్లి మమకారం, అంగవైకల్యం గల పిల్లలపట్ల పెద్దల దృక్పథం మారాలనీ, ప్రేమించే శక్తిలేని మనుషులే మానసిక వైకల్యం గలవాళ్లనీ – జీవని కథ నిరూపిస్తుంది. ఊహావైభవానికీ, నికృష్ట వాస్తవానికీ మధ్య వ్యత్యాసం బయటపడ్డప్పుడు, దారిద్ర్యం ఎంత బలవత్తర శక్తి తెలిసినప్పుడు వెలిసిపోయిన కౌమారపు కలలరంగులు వాల్ పోస్టర్ కథలో కన్పిస్తాయి. మనిషి తన జీవితంలో కుటుంబాన్ని, ఆ వ్యవస్థనీ తిట్టుకుంటూనే దాన్ని కాపాడే

ప్రయత్నంలో అలిసిపోయి ఎదురు తిరిగిన తాయమ్మలూ (తాయమ్మ కథ) ఉన్నారు. ఎదురు తిరగలేక అలసట నుండి బయటపడేందుకు మందులు మింగీ, మింగీ సున్నముద్దలా (సింబాలిక్) అయిపోయిన అనూరాధలూ (సూపర్ మామ్ సిండ్రోమ్ కథ) ఉన్నారు.

వి. ప్రతిమ అక్క – ఈగ, పాపినేని శివశంకర్ – మనుషులు వొదులవుతారు, రంగనాయకమ్మ – వాళ్లమ్మ కథలు మగవాడి దురహంకారాన్ని మూడు కోణాల్నుండి చెప్పిన కథలు. 'మగవాడికి ఎంత మందయినా భార్యలుండొచ్చు, అనే సంస్కృతి ఈ మధ్యకాలంలో వ్యాపిస్తున్న విషయాన్ని అక్క – ఈగ కథ వివరిస్తుంది. స్నేహం, అది దాటి మరింకేదో సంబంధం లేదూ ఆకర్షణ వీటికి మధ్య గల సన్నని రేఖని నిర్వచించే ప్రయత్నం చేసిన కథ మురళీ వాళ్లమ్మ. తను ఏ దుర్మార్గాన్ని వ్యతిరేకించిందో, తన కొడుకు అదే దుర్మార్గపు దారి పడుతున్నాడన్న భావనతో తల్లి నిలదీస్తుంది. కార్పొరేట్ అయిపోతున్న ఆర్థిక సంబంధాల నేపథ్యంలో పోగొట్టుకుంటున్న ప్రేమ, కొత్తగా వెతుక్కుంటున్న ఆకర్షణలు అర్థం కాకపోవటాన్ని వివరించిన ఈ కథకు ముగింపు నిలదీయటమే!

"తను పుట్టినోడి కిందల్లా కొంగుపరిచి సంపాదించు తుందంటూ ఈసడించిన మరిదే డబ్బు సంపాదించుకుని గ్రామంలోకి రాగానే ఎంతో గౌరవంగా చూడాడమే కాక తన భార్యనీ కువైట్ పంపడానికీ, ఎవరి దగ్గరైనా పడుకోమని నచ్చజెప్పటానికీ ప్రయత్నిస్తే ఆశ్చర్యపోయే కువైట్ సావిత్రమ్మలూ (చక్రవేణు – కువైట్ సావిత్రమ్మ) – నానారకాలుగా హింసించి ముక్కలు చేసి, కళ్లకి కళలు ముసుగేసి తననెదగనీయని బాల్యాన్ని తలుచుకుని మార్గాన్ని అన్వేషించుకునే జట్కావాలాలు (జగన్నాథశర్మ – పేగు కాలిన వాసన) – 'డబ్బునే ముఖ్యంగా కోరుకునే వాళ్లు మనుషుల్ని ప్రేమించలేరుకదూ?' అంటూ అమాయకంగా అడిగే ఎదుగుతున్న పసిమనసులూ (శివశంకర్ – ఇప్పుడూ ఇక్కడా). 'పుట్టుడు అందరొక్క తీర్గనే పుడ్తారట, బతుకుడు సానామంది తమకోసమే బతుకుతరట, అంటూ తండ్రికి వివరించి తాను ప్రజల మనిషినై అనుక్షణం తన జ్ఞాపకాల్తోనే బతకమని క్రూరవ్యవస్థకు బలైపోయిన నిరంజన్ రెడ్డి, కొడుకు కోసం ఎదురుచూసే బుచ్చిరెడ్లూ (గోపి – ఒక తండ్రి) – లాంటి ఈ కథల్లో పాత్రలు మనకు కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న బాధలను తెలుపుతాయి.

సంసారిక జీవితంలో మరో ముఖ్యమైన అంశం సంతానం. ఆడపిల్లలకు పెళ్ళైన దగ్గర నుండి పిల్లులు ఎప్పుడు పుడతారోమని లోకమంతా ఎదురు చూస్తుంది. సంతాన ప్రాప్తిరస్తూ లాంటి దీవెనలు కూడా ఇస్తుంటారు. సంతానం కలిగితేనే ఆడజన్మకు సార్థకం చేకూరుతుందన్న ఆపారమైన విశ్వాసంతో ఉంటారు. ఒకవేళ సంతానం కలగకుంటే వారిని నూటిపోటి మాటలతో అడిపోసుకుంటారు లోకం అనే తీరు హృదయవిదారకం. సంతానం కోసం రకరకాల వ్రతాలు, నోములు, ఉపవాసాలు చెయ్యటం వంటివి కూడా ఉంటాయి. కోడలు గర్భవతి కాగానే నాటి నుండి ప్రసవించే వరకు రకరకాల ఆచారాలుంటాయి. ఏ బిడ్డ పుట్టిన సరే అనుకునే కుటుంబాలు ఉన్నాయి. కేవలం మగబిడ్డ మాత్రమే కావాలనుకునే అనుకునే కుటుంబాలు కూడా ఉన్నాయి.

పసిబిడ్డల్ని అమ్ముకోవడం ఇక్కడ అతి సాధారణమైన విషయమైపోయింది. ముఖ్యంగా లంబాడీ తండాల్లో దుర్భర దారిద్ర్యం, ఆడది ఎందుకూ పనికిరాదని మన సామాజిక వ్యవస్థలో రూపుకట్టిన ఒక దుర్మార్గభావం ఇంకా కొనసాగుతూండడం ఈ పైశాచిక చర్యకు ప్రధాన కారణాలు. దీనికి తోడు ఈ దుర్మార్గాన్ని ఆపాల్సిన రాజకీయ, అధికార యంత్రాంగమే ఈ చర్యలను ప్రోత్సహించడంతో ఇదొక వ్యాపారస్థాయికి ఎదిగిపోయింది. సాక్షాత్తు ఒక పెద్ద పోలీసాఫీసరుగారి భార్యే ఈ విషయంలో నిందితురాలిగా వార్తల్లో కెక్కిన రాష్ట్రం ఇది. ఇప్పపూలు కధంతా తండాల దారిద్ర్యం మీదే నడుస్తోంది. తెలుగు నేలపై స్త్రీవాదం విస్తరిస్తున్న కొద్ధి సాహిత్యానికి అనేక కొత్త కోణాలు వచ్చి చేరుతున్నాయి. మగబిడ్డలు లేనందువల్ల వంశవృక్షంలో చోటు దొరకని వైనాన్ని విప్పిచెప్పే వరకు ఆలోచనా స్థాయిలోనైనా ఇదొక సమస్యగా అనిపించదు అనే విషయం ఈ అంటుకొమ్మ కథలో కనిపిస్తుంది. భార్యాభర్తల

సంబంధంలో మగవాడి వికృత స్వభావాన్ని, కనపడని మైక్రో ఓవెన్ మంటని సెగలోగిలి ఉత్తమ పురుషలో సున్నితంగా వ్యాఖ్యానిస్తే, గాంధీయంలోని డొల్లతనాన్ని గాంధీగిరి కథ అపహాస్యం చేస్తుంది.

సప్తవర్ణ సమ్మిశితం, చివరి యిల్లు. ఈ రెండు కథలూ ఒకేసారి చదివితే ఆసక్తికరంగా ఉంటుంది. ఈ అత్యాధునిక, సామాజిక దశలో ప్రతి ఇల్లూ ఒక ద్వీపమే. రెక్కలొచ్చిన పిల్లలు ఎగిరిపోతే ప్రతి యింట్లో ఇద్దరు ముసలివాళ్లు మాత్రం మిగులుతారు. వారిలో ఒకరు మరణిస్తే, రెండవ వారి స్థితి నరకప్రాయం. ఒక కథలో భర్త మరణించగా భార్య ఒంటరిగా ఉంటుంది. మరో కథలో భార్య మరణించిన భర్త ఒంటరిగా మిగులుతాడు. దుర్భరమైన ఆ ఒంటరి జీవితాలను, వారి ఆలనాపాలనా చూసే పనివాళ్ల కోణం నుండి చెప్పిన కథలివి. రచయితలిద్దరూ అనుభవమున్నవాళ్లు కావడంతో ఈ రెండు కథలూ బాగా పండాయి. ఈ కథలు చదివే పాఠకుడు తానే ఆ ఇళ్లల్లో నడయాడుతూ ఆ ప్రత్యక్ష నరకాన్ని తానే అనుభవిస్తున్నట్లు బాధపడతాడు. ఇలా ఒకే వస్తువుని భిన్న కోణాల్నించి దర్శించిన రెండు కథలు ఒకే సంకలనంలో ఉండడం, యాదృచ్ఛికమనిపించినా మన సమాజం ఉన్న స్థితికి దర్పణం. ఇవి తమ బాధను ప్రపంచానికి పంచిన కథలు. స్త్రీల అస్తిత్వవేదనకి, స్త్రీ పురుష సంబంధాలకి రచయితలిస్తున్న ప్రాధాన్యాన్ని రయిక ముడి ఎరగని బతుకు, హుస్సేన్ మై ఫాదర్, మహిత, ఉన్నంతలో, దమయంతి కూతురు, వారధి లాంటి కథలు ఋజువు చేస్తున్నాయి. శీలం, నైతికత్వం, భావసారూప్యం, సహచర్య రాహిత్యం మొదలైన విషయాల్ని సున్నితంగా చర్చిస్తున్నాయి.

ముగింపు

ఆయా కుటుంబ జీవితాలను వాస్తవికంగా, చారిత్రకంగా చిత్రించడమే రచయిత కర్తవ్యం. ఈ తత్వాన్ని ఒంటపట్టించుకున్న రచయితలు వాస్తవికతా దృష్టితో, తమదైన శైలుల్లో కథానికలు సృష్టించి గొప్ప సాహిత్యాన్ని అందించే ప్రయత్నం చేశారు. అలాగే సమాజ వ్యవస్థలో కేవలం పిల్లల కోసం మాత్రమే కాకుండా భర్త వద్ద పొందలేని సుఖాన్ని ఇతరుల వద్ద పొందడం కోసం అక్రమ సంబంధాలు పెట్టుకునే సమస్యలు కూడా ఉన్నాయి. కొందరు డబ్బు సంపాదించడం కోసం వేశ్యలుగా మారిన స్థితిగతులు కూడా కనిపిస్తుంటాయి. దాంపత్య జీవితంలో చాలా నిజాయితీగా ఉంటున్న భార్య, భర్తలు వారి ఆర్థిక భారాలు, కష్టసుఖాలు కలిసి పంచుకునేవారు కూడా ఉన్నారు. వచ్చే ఆదాయం కంటే కూడా ఎక్కువ ఖర్చు పెట్టే జంటలు లేదా స్త్రీ, పురుషులు కూడా ఉన్నారు. ఉమ్మడి కుటుంబంలో బ్రతకడం ఇష్టం లేక వేరు కాపురం పెట్టే స్థితిగతులు కూడా ఉన్నాయి. ఇంకా రకరకాల సమస్యలు కుటుంబ జీవితంలో కనిపిస్తుంటాయి. వీటన్నిటిని ఏదో ఒక కోణంలో కథా వస్తువుగా చేసుకుని రచయితలు చాలా కథానికలు రాశారు. ఈ పాతికేళ్ళ తెలుగు కథ సంకలనాలలో అటువంటి కథలు అనేకం ఉన్నాయి.

ఉపయుక్త గ్రంథ సూచి:

1. పాతికేళ్ళ కథ (1990-2014), సం. నవీన్, వాసిరెడ్డి, శివశంకర్, పాపినేని., మనసు ఫౌండేషన్, బెంగుళూరు. 2016.
2. దక్షిణమూర్తి, పోరంకి. కథానిక స్వరూప స్వభావాలు, హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2009.
3. నారాయణ, సింగమనేని. తెలుగు కథకులు కథన రీతులు, హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2001.
4. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి, కథా శిల్పం, హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2008.
5. మల్లయ్య, కాలువ నూటపదేళ్ళ తెలుగు కథ విభిన్న ధోరణులు, హైదరాబాద్: తెలుగు అకాడమీ, 2012.

శ్రీవేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనసంస్థ ప్రచురిత 'హితోపదేశ' గ్రంథ విశిష్టత

వడ్లమూడి యోగీశ్వర రావ్య, పరిశోధక విద్యార్థి, ప్రాచ్యపరిశోధనసంస్థ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి

ఆంధ్రసాహిత్యంలో అధునాతన యుగంలో ఎన్నో గ్రంథాలు ముద్రణ భాగ్యానికి నోచుకోకుండా ఆంధ్ర, ఆంధ్రేతర ప్రాంతంలో ఉన్న వివిధ పుస్తక భాండాగారాలో ఇప్పటికీ మూలుగుతూ అనేక అముద్రిత గ్రంథాలు ఉన్నాయని చెప్పవచ్చు. అయితే అముద్రిత గ్రంథాలు మనకు రెండు రూపాల్లో దర్శనమిస్తాయి.

1. తాళపత్ర ప్రతులు, 2. కాగితపు రాతప్రతులు. తాళపత్ర ప్రతులు తరతరాలుగా ఒక జాతికి వారసత్వంగా సంక్రమించే సంపద వంటివి. కాగితపు రాతప్రతులు ఆ తాళపత్ర ప్రతుల మాతృకలకు పుత్రికలు. అలాగని కాగితపు ప్రతులన్నీ చూసిరాసినవేనని చెప్పలేము. కొన్ని మూల గ్రంథాలు మౌళికంగా కాగితంపైనే రాయబడి ఉంటాయి.

ఒక మూలతాళపత్రప్రతి మరొక తాళపత్రప్రతికి పుత్రిక కావచ్చు. ఈ పద్ధతి కాగితం వాడుకలోనికి రాకముందు వరకు జరుగుతుండేది. ఎప్పుడైతే కాగితం రాతక ప్రధాన ఉపకరణమైనదో ఆనాటి నుండే శిథిలమై, పొట్టులా రాలిపోతున్న తాళపత్రప్రతులను ఉద్ధరించే క్రమంలో మాతృకైనటు వంటి తాళపత్రాలను చూసి కాగితంపైకి ఎత్తిరాయడం ప్రారంభమైంది. దీనినే Transcription of Manuscripts అంటారు.

ఇలా అనేకానేక తాళపత్రప్రతులు సి.పి.బ్రౌన్ గారి కాలంలో కాగితాలపై ఎత్తిరాయబడ్డవి. ఈ బృహత్కార్యానికి ప్రధానకారుడు, ప్రేరకుడైన బ్రౌన్‌దొర. తెలుగు భాషపై అభిమానం పెంచుకొని, ఆ భాషోద్ధరణకై తన జీవిత సర్వస్వాన్ని త్యాగం చేసిన ఒక పాశ్చాత్య పండితుడు కావడం ఆశ్చర్యకరమైన అంశమేకాదు; తెలుగుజాతి సర్వదా కృతజ్ఞత చూపవలసిన విషయం.

ఈ విషయాలన్నీ ఎందుకు చెప్పుకుంటున్నామంటే 13వ శతాబ్దికి ముందువాడైన నారాయణ పండితుడు సంస్కృతంలో నీతికథాకావ్యంగా రాసిన 'హితోపదేశం' అనే మహాగ్రంథాన్ని సి.పి.బ్రౌన్ తన పర్యవేక్షణలో బెల్లంకొండ రాఘవాచార్యులచే తెలుగుటీకా తాత్పర్యంతో కాగితంలోకి తెనిగింపజేసి పుణ్యం కట్టుకున్నాడు. ఇండో యూరోపియన్ భాషా సంప్రదాయాలను తెలుగులో చొప్పించి పాశ్చాత్య పద్ధతిలో గ్రంథ నిర్మాణానికి సి.పి.బ్రౌన్ చేసిన కృషికి హితోపదేశం ఒక ఉదాహరణ. దీన్ని క్రీ.శ। 1852లో మద్రాసులో తన పర్యవేక్షణలో బెల్లంకొండ రాఘవాచార్యులచే వ్రతివదార్థ, తాత్పర్యాలను ఆనాటి తెలుగు వ్యావహారికభాషలో రాయించడం విశేషం. అందులోను బ్రౌన్ స్వహస్తలిపితో ఈ పుస్తకం ముద్రణకు యోగ్యమని ఆయన స్వయంగా రాయడం జరిగింది.

"The Hitopadesa in Sanskrit with a commontary explaining every word in Telugu (హితోపదేశము సటీకా) Written under the directions of C.P. Brown, Madras 1852. The text is that of Proffessor Johnson printed in 1847. But in some places it has been amended and the interpretation also has been Corrected."

"This Telugu Commentary deserves publication. This volume is the sole existing one. It is the original volume in the learned authar's own handwriting." C.P.Brown April. 1855.

ఈ టీక 1852, డిసెంబర్ 11 తేది నుండి 1853, జూలై 2 తేది మధ్యకాలంలో రాసినట్లు తెలుస్తుంది. ఈ రాతప్రతి టీకాకారుని స్వహస్తలిఖితమని, బ్రౌన్ ఆదేశాను

సారం రచించినట్లు పేర్కొనబడింది. ఈ గ్రంథానికి ఈ రాతప్రతి ఒక్కటే ఉన్నట్లు ముఖపత్రంలో ఆంగ్లభాషలో రాయబడి ఉండటం విశేషం. ఈ గ్రంథం చివర టీకాకర్త స్వయంగా ''ఇది మహారాజశ్రీ శ్రీ సి.పి.బ్రౌన్ వారి శెలవుప్రకారం బెల్లంకొండ రాఘవాచార్యులు హితోపదేశమునకు 1852 సంవత్సరంలో డిసెంబరు నెల తారీఖు 11 ఆరభించి 1853 జూలై 2వ తారీఖు వరకు సంపూర్ణం చెసెను''. అని రాసి ఉండటం గమనింపదగింది.

ఈ హితోపదేశ గ్రంథ ముందుమాటలో ''ఈ ఆంధ్రటీక క్రీ.శ। 1847 లో జాన్సన్ పరిష్కరించిన ప్రతిని ఆధారం చేసుకొని రాయడం జరిగింది, అక్కడక్కడ వ్యాఖ్యానకారుడు కొన్ని మార్పులు చేశాడు'' అని ఆచార్య వేమూరి వేంకటరమణారెడ్డి గారు తెలిపారు.

శ్రీవేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనసంస్థ మ్యానుస్క్రిప్ట్ గ్రంథాలయంలో Stock No. 7976 సంఖ్యతో ఉన్న ఈ కాగితపు రాతప్రతికి ఒక వైశిష్ట్యం ఉంది. రెండవప్రపంచ యుద్ధం జరుగుతున్న కాలంలో ముందుజాగ్రత్త చర్యగా మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలోని తాళపత్ర, కాగితపు రాతప్రతులన్నీ తిరుపతి ఓరియంటల్ కాలేజీ లైబ్రరీలో భద్రపరచడం జరిగింది. అప్పుడే శ్రీవేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనసంస్థ ఏర్పడింది (జూలై, 1939). యుద్ధానంతరం తిరిగి రాతప్రతులన్నీ మద్రాస్‌కు తరలించడం జరిగింది. ఆ తరలింపులో పొరపాటున సి.పి.బ్రౌన్ 'హితోపదేశ' కాగితపు రాతప్రతి ఓ.ఆర్.ఐ. గ్రంథాలయంలోని ముద్రిత పుస్తకాలలో కలిసిపోయి ఇక్కడే ఉండిపోయింది. ఇది కాలక్రమేణ గ్రంథాలయం స్వీకరింపబడి 7976 అనే స్టాక్ నెంబర్‌తో దేవస్థానం సేకరణ (T.T.D.Collection) లోకి వచ్చింది. చాలాకాలం సి.పి.బ్రౌన్ రాయించిన హితోపదేశం తెలుగుటీక సంస్కృత గ్రంథాలలో ఉండిపోయింది.

ఈ సంస్థ కాగితపు రాతప్రతులు వివరణాత్మక సూచిక (Descriptive Catalogue) తయారు చేయడానికి 1985లో డా।। కె.జె.కృష్ణమూర్తి, డా।। ముదివేడు ప్రభాకరరావు రాతప్రతుల్ని సమీకరణ చేస్తున్న సందర్భంలో వారికి సహాయంగా తోడ్పడుతున్న శ్రీ టి. అనంత నారాయణ గారి చేతికి హఠాత్తగా ఈ ప్రతి రావడం, గుర్తించడం జరిగింది. అప్పుడే ఈ రాతప్రతి వైశిష్ట్యం తెలుసుకోవడం జరిగింది.

హితోపదేశం ముద్రిత గ్రంథ పీఠికలో ఈ ప్రతి గురించి ముదివేడు ప్రభాకరరావు గారు ''ఈ ప్రతి దాదాపు 55 సంవత్సరాలు (1930–1985) పరిశోధకుల కన్నుగప్పి అజ్ఞాతంగా ఉండిపోవడంవల్ల శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ తెలుగు అధ్యాయనశాఖలో సి.పి.బ్రౌన్ రీసర్చ్ ప్రాజెక్టును నిర్వహించిన ఆచార్య జి.ఎన్.రెడ్డి, రీసర్చ్ ఆఫీసర్‌గా పనిచేసిన బంగోరె ప్రభుతులకు దీని ఆచూకి తెలుసుకునే అవకాశం లేకపోయింది. పైగా బ్రౌన్ కాలేజిలో దాదాపు 30మంది పండితులు పనిచేసినట్లు పరిశోధనాపరమేశ్వర శ్రీ నిడుదవోలు వేంకటరావు గారు ' బ్రౌన్ పండిత మండలి ' అనే వ్యాసంలో పేర్కొన్నారు. కానీ, బెల్లంకొండ రాఘవాచార్యుల పేరు ఆ పట్టికలో లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగించిందని అందుచేత ఈ గ్రంథం యొక్క ఉనికిగాని, ఈ వ్యాఖ్యాత ఆచూకి గాని తెలుసుకొనే అవకాశం 1985 వరకు ఎవరికి కలుగలేదు. ఈ గ్రంథంలో తప్ప బెల్లంకొండ రాఘవాచార్యుల ప్రస్తావన బ్రౌన్ సాగిత్యంలో గాని, యితరత్ర ఎక్కడా కనబడడం లేదు. ఈయన సర్కారు ప్రాంతానికి చెందిన వైష్ణవ సంస్కృత పండితుడని మాత్రం చెప్పవచ్చు.'' అని తెలిపారు.

హితోపదేశం – గొప్ప నీతికథాకావ్యం :

మానవుని మస్తిష్కంలో 'కథ' ఉద్భవం ఎప్పుడు జరిగిందో చెప్పడం కష్టం. మానవుని భాష ఎంత ప్రాచీనమో, కథ కూడా అంత ప్రాచీనమైనదని చెప్పవచ్చు. ప్రాచీనభారతదేశం కళలకే కాదు, కథలకు కూడా పుట్టినిల్లు. పరాక్రమ, సాహస, అద్భుత అనుభవాలతో కూడిన కథలు,

సముద్ర యాత్రలతో కథలు, విజ్ఞాన నీతి ధర్మబోధక కథలు, శృంగార కథలు ఇంకా ఎన్నో కథలు ఇక్కడే మొలకెత్తాయి. ఈ కథలు అతి ప్రాచీనకాలంలోనే దేశాంతరాలు వరకు వ్యాపించి ఆయా దేశాల రంగు, వాసలను పూసుకొని అక్కడే స్థిరపడ్డవి. ఒక విధంగా ప్రపంచ కథలన్నిటికి భారతీయ కథలే మూలమంటే అతిశయోక్తి కాదు.

కథాసాహిత్యాన్నంతటిని ప్రధానంగా నాలగు విభాలుగా చేసుకుంటే 1. అలంకారిక శైలిలో వచ్చిన గద్య కథాకావ్యాలు – కాదంబరి, దశకుమార చరిత్ర మొ॥, 2. సాహస కథలు (కాల్పనిక కథలు) – బృహత్కథ, శుకసప్తతి, విక్రమార్కుని కథలు మొ॥, 3. రాజనీతి, వ్యవహార జ్ఞానాన్ని బోధంచే కథలు – పంచతంత్రాది కథలు, 4. ధర్మబోధనకై మత సంబంధమైన నేపథ్యంలో పుట్టిన కథల – బౌద్ధ, జైన కథలు.

ప్రస్తుత హితోపదేశ గ్రంథం పై వర్గంలో మూడవ విభాగానికి చెందింది. సంస్కృత కథాసాహిత్యంలోని గొప్పతనమేమిటంటే సమాజంలో వ్యక్తులు చేసే కుట్రలను, కుతంత్రాలను, కల్పిత నాయధేయాలతో కథలను అల్లి చెప్పడమే కాకుండా, ఆయా వ్యక్తుల స్వభావాలను, రూపురేఖలను భావించి వారికనుగుణమైన జంతువులపై, పశువులపై, పక్షులపై ఆరోపించి అవి మానవునివలె ప్రవర్తిస్తూ మాట్లాడే పద్ధతిలో కథ నడపడం, దోషులను బహిరంగంగా విమర్శించక సున్నితంగా వారి ప్రవర్తనలో పరివర్తన, మార్పు వచ్చే విధంగా చెప్పడం కథానిర్మాణంలోనే గొప్ప ప్రయోగం!. అందుకే సంస్కృత కథాసాహిత్యం వట్టి కథలు కావు అవి నైతిక విలువల్ని నిర్దేశిస్తూ సామాజిక దుర్నీతిని విమర్శించే కథలు.

సంస్కృతంలో ఉన్న నీతి కథాసంపుటాలను చూస్తే 1. విష్ణుశర్మ రాసిన పంచతంత్రం, 2. నారాయణ పండితుడు రాసిన హితోపదేశం, 3. వసుభాగుడు రాసిన తంత్రోపాఖ్యానమ్–తమిళ భాషానవాదం, 4. దుర్గసింహుడు రాసిన పంచతంత్రమ్ – కన్నడ భాషానువాదం. విష్ణుశర్మ పంచతంత్రం (దాక్షిణాత్య పాఠం) మూలం చేసుకొని ద్రావిడ భాషల్లోకి అనువదించబడింది. తెలుగులో దూబగుంటి నారాయణకవి, భానుకవి, వెంకటనాథకవి మొదలైనవారు పద్య, వచన రూపంలో అనువదించారు.

హితోపదేశం:

హితోపదేశం పంచతంత్రం యొక్క రూపాంతరాలలో ఒకటి. పంచతంత్రంలోని కథలన్నీ దీనిలో చోటు చేసుకున్నవి. విష్ణుశర్మ పంచతంత్రాన్ని అనుసరిస్తూ చాలాకాలం తరువాత పుట్టిన గ్రంథం నారాయణ పండితుని హితోపదేశం. ఇదే విషయాన్ని "పంచతంత్రా త్తథాన్యస్మాద్ గ్రంథాదాకృష్య లిఖితే" అని రచయిత పంచతంత్రాన్ని అనుసరించి రచించినట్లుగా చెప్పుకున్న అనేక విధాలుగా, అనేక చోట్ల రచయిత స్వతంత్రించే హితోపదేశాన్ని రాశాడని చెప్పవచ్చు. ముదిగంటి సుజాతరెడ్డి సంస్కృత సాహిత్య చరిత్ర గ్రంథంలో "పంచతంత్రంలో కన్న కవి ఎక్కువ కథలను కూర్చాడు. ఎక్కువ కథలే కాక ఎక్కువ ఉపదేశాత్మకత కూడా ఈ కథల్లో కన్పిస్తుంది. దీన్ని బట్టి హితోపదేశం అన్న పేరు ఈ పుస్తకానికి తగిట్లుగా వున్నది. ఒకొకసారి రచయిత దృష్టి కథాకథన నిర్వహణం కన్న ఉపదేశ బోధన మీదే ఎక్కువ. అయినా కథాకథనంలో ఎక్కడా లోపం జరగలేదు." అని చెప్పారు. హితోపదేశం పుట్టిన తరువాత పంచతంత్రాన్నే పక్కనపెట్టి సంస్కృత సాహిత్య విద్యార్థులకు పఠనీయ గ్రంథంగా బహుళ ప్రాచుర్యాన్ని సంపాదించిందని విమర్శకుల అభిప్రాయం.

విదేశ పండితులు చేసిన హితోపదేశ ప్రచురణలను పరిశీలిస్తే 1. డా॥ చార్లెస్ విల్కిన్స్ – 1804, 2. సర్ విలియమ్ జోన్స్ – 1810, 3. విల్‌హెల్మ్ వాన్ ష్లెగెల్ – 1829, 4. సి. లాసెన్ – 1835, 5. ఫ్రాన్సిస్ జాన్సన్ – 1848 (1), 1864 (2), 6. పీటర్ పీటర్‌సన్ – 1887

సి.పి.బ్రౌన్ హితోపదేశ రాతప్రతి 1848 లో వచ్చిన

ఫ్రాన్సిస్ జాన్సన్ ముద్రణదే అది. ఈ ముద్రణ పూర్వ పరిష్కరణల కంటే నిర్దుష్టంగా, నిర్దిష్టంగా ఉందని ముద్రిత హితోపదేశ గ్రంథ పీఠిక ద్వారా తెలుస్తుంది.

పై పాశ్చాత్య పండితులు హితోపదేశం విశిష్టత గురించి అభినందనీయ వ్యాఖ్యలు చేస్తూ అతిప్రాచీనమైన దాక్షిణాత్య పంచతంత్రాన్ని అనుసరిస్తూ బయలుదేరిన అనేక నీతిబోధక కథా సంగ్రహ కావ్యాలలో హితోపదేశం చాలా ప్రధానమైనది. దీన్ని రచించిన నారాయణ పండితుడు వంగ (బెంగాల్) దేశీయుడు. ఈ రచన క్రీ.శ॥ 1000 – 1300 సంవత్సరాల మధ్య జరిగి ఉండవచ్చునని పరిశోధకులు భావించారు. నారాయణ పండితుడు కాలం గురించి సరిగ్గా ఆధారాలు లభించలేదు. సంస్కృత సాహితి చరిత్ర గ్రంథంలో "నారాయణ పండితుడు బెంగాల్ పాలించిన ధవళ చంద్రుని ఆస్థానకవి... హితోపదేశ హస్తలిఖిత ప్రతి క్రీ.శ॥ 14వ శతాబ్దం నాటిది దొరకడం చేత దీని రచన అంతకు పూర్వమే జరిగిందని చెప్పవచ్చును" అని ముదిగంటి సుజాతరెడ్డి తెలిపారు.

హితోపదేశం పంచతంత్రం వలె లోకప్రసిద్ధమైన నీతికావ్యమని, ఇది పంచతంత్రం అనుసరిస్తూ పుట్టిందని చెప్తూ మల్లాది సూర్యనారాయణ " దీని ననుసరించి ధవళ చంద్రరాజు నాదరముగాంచిన నారాయణ పండితుడు హితోపదేశము రచించినట్లు తెలియుచున్నది. రచన భేదించును గాని విషయ భేదములేదు" అని సంస్కృత వాఙ్మయ చరిత్ర – ద్వితీయ సంపుటంలో సంక్షిప్తంగా తెలియజేశారు.

గ్రంథ పరిష్కరణ :

హితోపదేశంలోని నాలుగు భాగాలను శ్రీవేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనసంస్థ పరిశోధక బృందం ఈ విధంగా విభజించుకొని శుద్ధ ప్రతిని తయారుచేశారు.

1. మిత్రలాభం – టి. అనంత నారాయణ
   టి.యస్.ఆర్. నారాయణన్
2. సుహృద్భేదము – వి. వేంకటరమణారెడ్డి
   ఇ. చంద్రమౌళి
3. విగ్రహము – సి. గోవిందరాజు
   సి.వి.యస్. సురబహ్మణ్య శర్మ
4. సంధి – ఎం. ప్రభాకర రావు
   ఎం. మునిరత్నం

ఈ అష్ట పరిష్కర్తల కృషిఫలితంగా శుద్ధప్రతి తయారైంది. దీనిని ప్రాచ్యపరిశోధనసంస్థే 2006 లో ముద్రించి, ప్రచురించింది.

హితోపదేశ గ్రంథంలోని కథాక్రమం ఇలా ఉంది.

I. **మిత్రలాభం :**

1. వృద్ధవ్యాఘ్రపథిక కథ
2. మృగజంబుక కథ
3. వృద్ధమార్జాల కథ
4. చూడాకర్ణ కథ
5. లీలావతీ చందానదాస కథ
6. జంబుకవ్యాధ కథ
7. లావణ్యవతీ వణిక్పుత్ర కథ
8. హస్తిసృగాల కథ

II. **సుహృద్భేదము :-**

1. వానరకీల కథ
2. రజకగర్దభ కథ
3. మహావిక్రముడనే సింహము కథ
3. కుట్టినీమర్కట కథ
5. నా పితపరివ్రాజక కథ
6. బంధకీదండనాయక కథ
7. కాక కనకసూత్ర కథ
8. సింహ శశక కథ
9. సింహ సంజీవక కథ
10. టిట్టిభసముద్ర కథ

III. **విగ్రహము :-**

1. ఖగవానర కథ 2. రజకగర్దభ కథ
3. శశకగజయూథ కథ 4. హంసకాక కథ
5. కాకవర్తక కథ 6. రథకారబంధకీ కథ
7. సృగాల, శుక, కాక కథ
8. శూద్రక వీరవర కథ 9. గృధ్రనాపిత కథ

IV. **సంధి :**

1. హంసకూర్మ కథ 2. మత్స్యత్రయ కథ
3. వణిక్పుత్రకీ కథ 4. బకనకుల కథ
5. మునిమూషిక కథ 6. బకకర్కటక కథ
7. భగ్నభాణ్డద్విజ కథ 8. సున్దోపసున్ద కథ
9. బ్రాహ్మణధూర్తరతయ కథ
10. కాక, వ్యాఘ్రు, జంబుక కథ
11. సర్పమణ్డూక కథ 12. మాధక నకుల కథ

శ్రీవేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనసంస్థ మ్యానుస్క్రిప్ట్ గ్రంథాలయంలో Stock No. 7976 సంఖ్యతో ఉన్న సి.పి.బ్రౌన్ కాగితపు రాతప్రతి పరిష్కరణ చేశాక. గ్రంథ పీఠికలో "డా॥ జార్జ్ అర్తోలా ప్రకారం దక్షిణ భారతదేశంలో నారాయణ పండితుని హితోపదేశ తాళపత్ర ప్రతులు 17 వరకు లభ్యమౌతున్నాయి. వాటిలో శ్రీవేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనసంస్థ గ్రంథాలయంలో 2649 సంఖ్య గల కాగితపు ప్రతి సమగ్రంగా దేవనాగరి లిపిలో లభిస్తూ ఉందని" ముదివేడు ప్రభాకర రావు తెలియజేశారు.

పంచతంత్రం - హితోపదేశం - సరూప్య భేదాలు :

పంచతంత్రం	-	హితోపదేశం
1. మిత్రభేదం		1. మిత్రలాభం
2. మిత్రప్రాప్తికం (మిత్రలాభం)	-	2. సహృద్భేదం
3. కాకోలూకీయం	-	3. విగ్రహం
4. లబ్ధప్రణాశం	-	4. సంధి
5. అపరీక్షిత కారకం		

పంచతంత్రంలోని భాగాల పేర్లు, క్రమం కూడా మారింది. పంచతంత్రంలోని కొన్ని కథలను విడిచివేసి కొన్ని కొత్త కథలు హితోపదేశంలో చేర్చడం జరిగింది. శ్లోకాలు కూడా ఎక్కువగా ఉన్నాయి. కామందక నీతిశాస్త్రం నుండి చాలా శ్లోకాలు చేర్చబడ్డాయి. పంచతంత్రం లాగా హితోపదేశం కూడా అతి సులభమైనశైలిలో రాయబడింది.

పంచతంత్రం - హితోపదేశం - మార్పులు :

1. పంచతంత్రంలోని మూడవ భాగమైన కాకోలూకీం యొక్క రేఖామాత్ర ప్రభావం, హితోపదేశంలోని మూడవ భాగమైన విగ్రహం కథానిర్మాణాన్ని ప్రభావితం చేసింది.
2. పంచతంత్రంలోని కాకోలూకీయం అనుబంధంగా హితోపదేశంలో నాలుగో భాగం సంధి సంపూర్ణంగా కొత్తకల్పన.
3. లబ్ధప్రణాశం పూర్తిగా హరింపబడింది.
4. అపరీక్షిత కారకానికి బదులుగా విగ్రహం, సంధి భాగాల నిర్మాణం జరిగింది.
5. పంచతంత్రంలో మొదటి భాగమైన మిత్రభేదంలోని కథలు కొన్ని హితోపదేశం నాలుగో భాగమైన సంధికి మార్చబడింది.
6. పంచతంత్రంలోని మూడవ భాగమైన కాకోలూకీయంలోని కథలు కొన్ని హితోపదేశం మూడు, నాలుగు భాగాలైన విగ్రహ, సంధులలో సమానంగా పంచబడినాయి.
7. పంచతంత్రంలోని మిత్రభేదం, మిత్రలాభం, కాకోలూకీయంలోని ఎన్నో కథలు తొలగించబడ్డాయి. తొలగించబడిన కథల స్థానంలో కొత్తకథలు చేర్చబడ్డాయి.

ఆధారగ్రంథాలు :

1. హితోపదేశం (ORI, SVU) - నారాయణ పండితుడు
2. సంస్కృత సాహిత్య చరిత్ర - ముదిగంటి సుజాతరెడ్డి
3. సంస్కృత వాఙ్మయ చరిత్ర - మల్లాది సూర్యనారాయణ శాస్త్రి

జిల్లేళ్ళ బాలాజీ "నా బాల్యం కతలు" రూప వైవిధ్యం

డా॥ జంపాల అనూరాధ, ఎం.ఏ., ఎం.ఫిల్., పి.హెచ్.డి., సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ఎస్.ఆర్. & బి.జి.ఎన్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, ఖమ్మం. తెలంగాణ

సంగ్రహం

ఆధునిక తెలుగు సాహిత్యంలో వివిధ ప్రక్రియల్లో వస్తుపరంగా అనేక ధోరణులు వచ్చాయి. రూపపరంగా చూస్తే మాత్రం ఈ విధమైన వైవిధ్యం తక్కువే. ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే తెలుగు సాహిత్యంలో కవిత్వపరంగా ఉన్న రూపపరిణామ వైవిధ్యం, మిగిలిన సాహిత్య ప్రక్రియల్లో చాలా అరుదుగా కన్పిస్తుంది.

ఆధునిక తెలుగు కథలో రూపపరంగా వచ్చిన మార్పుల్లో ప్రధానంగా చెప్పదగింది"చైతన్య స్రవంతి పద్ధతి". కథానిక, గల్పిక, మినీకథ, కాలందాటని కథ, కార్డు కథ వంటివన్నీ కథకి రూప పరిణామాలు కావా? అనే ప్రశ్న ఇక్కడ చాలా మందికి స్ఫురించవచ్చు. ఇవి పత్రికల నిశ్చితరూపాలు. కథలో మాత్రమే కలిగే సాంద్రమైన ఇంద్రియానుభూతి ఈ పరిమిత రూపాలలో సాధ్యం కాదు. ఒక మెరుపు, చమత్కారం వంటి వాటి మీద ఆధారపడి నడిచే ఈ చిట్టిపొట్టి కథలన్నీ పరిణామ సంకేతాలే గాని నిర్దిష్టరూప పరిణామాలుగా భావించటం కష్టం.

ఇక వస్తుపరంగా కథానిక విశిష్టమైన రూపాల్ని సంతరించుకుంది. హేతువాద, విప్లవ, స్త్రీవాద, దళితవాద, ముస్లింవాద కథలెన్నో తెలుగుకథని వస్తుపరంగా సుసంపన్నం చేశాయి.

భాషాపరంగా తెలుగుకథ కాలానుగతంగా గ్రాంథిక, మిశ్రగ్రాంథిక, వ్యావహారిక, మాండలిక రూపాల్ని అందుకోవటమే కాక స్థల, కుల మాండలిక స్థాయికి చేరింది.

తెలుగులో వందలాది కథలు వ్రాసినవారు, కవిగా, నవలాకారునిగా ప్రసిద్ధి నొందినవారూ, అనువాదకునిగా కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు విజేత అయిన శ్రీ జిల్లేళ్ళ బాలాజీ గారి "నా బాల్యం కతలు" ఇతివృత్తపరంగా, మాండలికపరంగా, రూపవిశిష్టతని సంతరించుకున్న కథలు. వీటి విశ్లేషణ ద్వారా ఈ కథాప్రక్రియని తెలుగు కథా రూపపరిణామ క్రమంలో ఒక ఉపప్రక్రియగా ప్రతిపాదించే ఉద్దేశంతో ఈ వ్యాసంలో నా బాల్యం కతల్ని విశ్లేషించడం జరిగింది.

ఉపోద్ఘాతం :

ప్రాచీన కవిత్వంలో కథ అంతర్లీనంగా సాగేది. కథ, కవిత్వం విడి రూపాలుగా మారాక, ఖండకావ్యం, కథానిక పరిణామ క్రమంలో వెలువడి స్వతంత్ర రూపాలుగా నిలిచాయి. నిజానికి ఈ రెండింటి లక్ష్యమూ సాంద్రతగల ప్రభావం పాఠకుని పై చూపటమే. ఈ ఏకైక లక్ష్యమే రూపపరిణామానికి మూలం.

సాహిత్యంలో రూప పరిణామం అనేది వస్తువుతో సంబంధం లేకుండా జరగదు. కథావస్తువుని ఆవిష్కరించే సమయాన వస్తువుకీ ఆవిష్కరణకీ ఉన్న సంబంధం రూప నిర్ణయం చేస్తుంది. సమాజపు వివిధ దశలలో వచ్చిన మార్పులకి ఈ సాహిత్యరూపాలు సంకేతాలుగా నిలుస్తాయి.

1910లో తెలుగులో కథానిక పుట్టాక రెండు దశాబ్దాల పాటు అది అభ్యుదయ ధోరణిలోనే సాగినప్పటికీ రూపంలో పరిణామ దశకు చేరలేదు. 1930 ప్రాంతంలో దేశీయంగా ఆర్థిక పరిస్థితులు కుంటుపడ్డాక మధ్యతరగతి ప్రజల జీవనం అతలాకుతలం అయ్యింది. ఈ గడ్డురోజుల నుండి కథానిక రూపంలో కొత్తపరిణామాలు రావటం మొదలైంది. వస్తువు, శైలి, భాష మూడింటిలో గొప్పవైన మార్పులు రావటం మొదలైంది. చింతాదీక్షితులు, విశ్వనాథ, వేలూరి

శివరామశాస్త్రి , మల్లాది రామకృష్ణశాస్త్రి, బుర్రా సుబ్రహ్మణ్యం, కొడవటిగంటి, చలం, శ్రీపాద, కరుణకుమార, చాసో,బుచ్చిబాబు, పాలగుమ్మి పద్మరాజు, మా గోఖలే వంటి సుప్రసిద్ధ కథకులు ఎందరో 1960 ల వరకూ తెలుగు కథానిక రూపంలో గొప్ప పరిణామానికి పునాదిగా నిలిచారు. వీరంతా సంస్కరణోద్యమంలో భాగంగా వివిధరీతుల్లో స్పందిస్తూ కథలు రాశారు. వివిధ రకాల కథన పద్ధతుల్ని ఎన్నుకున్నారు.

శ్రీపాద వారు సర్వసాక్షి కథన పద్ధతినీ, చలం – ఆత్మానుభూతి ప్రకటనా పద్ధతినీ, కొ.కు.– శాస్త్రీయ దృక్పథాన్నీ, కరుణకుమార– ప్రాంతీయ సౌందర్యాన్నీ, మాగోఖలే – వర్గ మాండలిక శైలినీ, ఇంకా అనేకమంది కథకులు అనేక విధాలుగా కథానికారూపపరిణామానికి మార్గం వేశారు.

1960 తర్వాత కథానిక భాషాపరంగా పరిణామానికి లోనయ్యింది. మాండలిక భాషలో పాత్రల సంభాషణలే కాక మొత్తం కథనే మాండలికంలో చెప్పే మార్పు సాధ్యమైంది. నామిని వంటి కథకులు ఈ విషయంలో విభిన్నమైన శైలిని సాధించారు.

అత్యాధునిక కథలో వస్తురూపంగా భాషారూపంగా విలక్షణంగా ఉన్న జల్లేళ్ళ బాలాజీ గారి "నా బాల్యం కతలు" విశ్లేషించడం ద్వారా వాటిని కథానిక రూపప్రక్రియలో ఉపప్రక్రియగా ప్రతిపాదించటం ఈ వ్యాల లక్ష్యం.

విషయ చర్చ :

ఒక ప్రాంతానికి పరిమితమైన కథలుగా విశేషపాఠకాదరణ పొందిన కథలు–నామిని – మిట్టూరోడి కథలు, అమరనారాబసవరాజు– "చిటుక్కు పటుక్కు చెనిక్కాయలు", నంద్యాల నారాయణరెడ్డి – "ఇరుల దొడ్డి బతుకులు" మొదలైనవి. వీటన్నిటిలో ఆయా ప్రాంత మాండలికం సువాసనలు వెదజల్లడం వల్ల అవి మరింత గుబాళించాయి. ప్రాంతీయ మాండలికం వాడటం వల్ల కథానిక విస్తృతి పరిమితమవుతుందనీ, అందువల్ల రచన అందరికీ అర్థమయ్యే భాషలో ఉండాలి అనే వాదాలన్నిటినీ ఈ కథలు ఒక్కపెట్టున తుడిచి పారేశాయి. పాఠక హృదయాల్లో ఒక కొత్త రూపంతో స్థిరస్థానం పొందాయి. కథానికా ప్రస్థానంలో తెలుగు సాహితీపరంగా కొత్తరూపాన్ని ఆవిష్కరించాయి.

వీటి నుండి స్ఫూర్తి పొందిన బాలాజీ తన బాల్య స్మృతుల్ని చిత్తూరు జిల్లా మాండలికాన్ని వాడుతూ విలక్షణ కథన పద్ధతిలో రాసిన పదిహేను కథల సంపుటి – "నా బాల్యం కతలు". "కరోనా" విలయంతో పత్రికలన్నీ మూతబడిన వేళ "సంచిక" వెబ్ మ్యాగజైన్‌లో ఇవి ఆదివారం స్పెషల్‌గా ప్రచురించారు. 2021లో ఈ బాల్యం కతల్ని రచయిత స్వయంగా "పగడాలు – పారిజాతాలు" పేరుతో సంకలనంగా ప్రచురించారు.

ఈ కథలన్నీ రచయిత బాల్యపు అనుభవాల స్మృతులు. ఈ జ్ఞాపకాల్ని రచయిత ఎంత సాంద్రంగా కథల్లో పరిచారంటే, పాఠకులు తమ బాల్య జ్ఞాపకాల్లోకి జారిపోక తప్పనంతగా. ఈ సంపుటిలోని ప్రతికథలోనూ సజీవ పాత్రలూ, సజీవమైన భాష ఉండటం వల్ల ప్రతి సంఘటనలోనూ పాఠకుడు తనను వెతుక్కుంటాడు.

ట్యూషన్‌లో హమీద్ మాస్టార్ని బురిడీ కొట్టించి, శుక్రవారం ఆయన జరిపే హిందూదేవతాపూజ ప్రసాదాన్ని కూడా వదులుకుని మన పిల్లకాయలు, వాగులో చేపలు పట్టేందుకు వెళ్ళిపోతారు. చివరికి మేష్టారికి దొరికిపోయి దెబ్బలు తిన్నవైనం హాస్యరసస్ఫోరకంగా ఉన్నట్లే ఉన్నా కూడా ఈ కథలో ఒక సామాజిక వ్యవస్థను రచయిత రికార్డు చేసేశారు. ముస్లిం మాస్టారు శుక్రవారం రోజు సమాజు చేసుకోవాలి. కానీ ట్యూషన్ పిల్లలు హిందువులు కనక ఆయన వాళ్ళచేతే దేవుని పూజ చేయించి, కొబ్బరికాయ కొట్టించి, ప్రసాదాలు పెట్టిస్తారు. ఒక నలభై ఏళ్ళక్రితం తెలుగునాట ఉన్న సామరస్య దృష్టిని ఈ కథ నమోదు చేసింది.

గ్రామీణ ప్రాంతాల్లో గతకాలంలో అనువంశిక వైద్యులుగా మంగలివారు వుండటం సర్వసాధారణం. ఎముకలు విరిగితే కట్లు కట్టడం, నాటు పద్ధతిలో వ్రణాలకి శస్త్ర చికిత్స చేయడం వంటివి వారే చేసేవారు. ఈ సంపుటిలోని కథ – " క్రిష్ణమూర్తి డాకట్టు కరుణ" లో కూడా చిన్నవాడైన "బాలా" వాళ్ళ మేనత్త ఇలాంటి వైద్యురాలే. కాకపోతే ఆమె స్త్రీలకీ పిల్లలకీ మాత్రం వైద్యం చేసేది. ఇక కథలో డాక్టర్ కృష్ణమూర్తి మంచి వైద్యుడు. మానవీయమూర్తి. డబ్బులేనివారికి మందులు ఇచ్చి ఖాతారాసుకుని, వారిచ్చినప్పుడే తీసుకునే మంచి డాక్టరు. రోగి ఖర్చులకి డబ్బులేకపోతే ఎదురు డబ్బు ఇచ్చేంత మంచి మనసున్నవాడు.

తిరుత్తణి ప్రాంతంలో జరిగే దౌపతమ్మ తిరణాలని వివరించే కథ– "ముత్తెమంత ముద్దు" తిరణాలలో జరిగే ప్రతివిషయం కథలో బొమ్మకట్టినట్లు రచయిత చెప్పిన తీరు అనన్యసామాన్యం. కథ హాస్యరసం ప్రధానంగా అనిపించినా కథాలక్ష్యం మాత్రం తిరుణాల విషయాల్ని నమోదు చేయటమే.

మానవ సంబంధాల్లో ఉండే మానవీనయ కోణాన్ని ఆవిష్కరించే కథ– "రెడ్డిగుంట సుట్టూ ఒగరవుండు" అతి చిన్న విషయాల్లో దాగుండే మానవతని, పిల్లల కోణం నుంచి ప్రతిబింబించే కథయిది. బాబు వాళ్ళ నాన్న జీపు డ్రైవర్. ఊళ్ళో పిల్లలందరికీ జీపెక్కాలని ఆశ.కానీ తీరని ఆశ. స్నేహశీలత వల్ల బాబుని కొట్టొద్దు అని పిల్లలంతా ఒకనాడు బాబు వాళ్ళ నాన్న కాళ్ళకి అడ్డం పడి బ్రతిమలాడతారు. వారి స్వచ్ఛమైన మనసుల్ని చూసి బాబు వాళ్ళ నాన్నలో కూడా మానవత్వం పుష్పిస్తుంది. పిల్లలంతా జీపులో ఊరిచుట్టూ ఓ రౌండు కొట్టేస్తారు. ఈ కథలోని కథనం అద్భుతం.

పల్లెటూళ్ళలో నాటు వైద్యపు రహస్యాల్ని హాస్యంతో మేళవించి చెప్పే కథ – "మా అత్త వైదిగ రగస్యం" స్త్రీ వైద్యులు గ్రామంలో చేసే వైద్యం– వాటి చిట్కాలని వెల్లడించే కథయిది.

ఆటల్లో మునిగిపోయి, పెద్దలు చెప్పిన పని మర్చిపోయి వాళ్ళని అబద్ధాలతో నమ్మించాలని చూసి, అమాయకంగా దొరికిపోయే పిల్లల కథ– "గుడ్డొచ్చె తోకపాయే.. ధాం ధాం ధాం ".

కుల వృత్తుల విషయంలో ఆయా విద్యలు నేర్వటంలో పిల్లలు ఎలా స్పందిస్తారో తెలిపే కథ– "జ్యోతి సామి ఆశీర్వాదం" జ్యోతి సామి ఆశ్రమంలో తాత ఒక్కడే మేళం వాయించాల్సి వస్తుంది. ఆయన నాదస్వరం వాయిస్తే డోలు కొట్టేందుకు ఎవరూలేరు. మనవడి మెడలో డోలు వేసి, కుడి ఎడమ సేతులతో ఎలా వాయించాలో తాత ఒక్కసారి చెప్పగానే మనవడు అందుకుని వాయించేస్తాడు. తాత పొంగిపోతాడు. జోతిసామి కూడా మనవడి చదువుని పరీక్షించి ఆశీర్వదిస్తాడు.

సినిమాహాల్లో సోడా బాలిల్‌పేలిపోయి పిల్లాడి కుడి చెంపలో ఓ పెంకు ముక్క దిగిపోయి రక్తం కారుతుంటే, హాల్లోని జనం ఆ పిల్లాడికి చేసిన సేవను వివరించే కథ – "దుర్గా కొటాయిలో రత్తపాతం ". ఆపరేషన్ చేసి గాజుపెంకు తీసేశాక పలకరించటానికి వచ్చిన ఇడ్లీలమ్ముకునే ఆచారవ్వ చూపిన వాత్సల్యం మనుషుల మధ్య బంధుత్వాలకీ, కులాలకీ మతాలకీ అతీతంగా ఉండాల్సింది ఏమిటో వివరించిన కథయిది.

గ్రామీణ మొక్కుబడుల ఆచారాల్ని పిల్లలు భాషలో భావంలో వివరించే కథ "మొక్కుతో తిప్పలు ". ఒక మొక్కుబడి వారం రోజులపాటు ఒక విద్యార్థిని లెక్కల మాస్టారి మొట్టికాయల నుండి ఎలా కాపాడిందో నవ్వించేలా చెప్పిన కథయిది.

సైదా అయ్యోరు, ప్రైవేటు పిల్లకాయలకి చదువుతో బాటు ఈత కూడా నేర్పించిన వైనం వివరించిన కథ – " చేంతాడుతో ఈత – ఎదురు దబ్బతో వాత" గతంలో టీచర్లు తమ విద్యార్థుల మూర్తిమత్వానికి ఎలా కారణం అయ్యేవారో పరోక్షంగా వివరిస్తుందీ కథ.

సంకలనం లోని పదిహేను కథలూ విలక్షణమైనవే. ఒక్కో కథలో ఒక్కో విషయం హాస్యస్ఫోరకంగా చెప్పటం వల్ల పాఠకుడు ఏకబిగిన చదివేస్తాడు. నిజానికి ఈ కథలన్నీ ఒక ప్రాంతపు, ఒక కాలపు సామాజిక అంశాన్ని రికార్డు చేసిన కథలే. కథల్లో అవసరాన్ని బట్టి రచయిత కులాల పేర్లని నిజాయితీగా వాడారు. కథలన్నీ అంతర్లీనంగా మనిషికి అవసరమైన ఆలోచనారీతిని, సమాజంలో మనిషి మనుగడకి అవసరమైన సమిష్టి ఆలోచననీ వివరించేవే.

గతానికీ వర్తమానానికీ మధ్య జరిగే ధృవీకరణే సజీవ సంప్రదాయ ప్రగతి. ప్రగతి నెంత సాధించినా సంప్రదాయం జాతి జీవ లక్షణాన్ని కోల్పోదు. కోల్పోరాదు. ఇవి ప్రఖ్యాత రచయిత టి.ఎస్.ఇలియట్ మాటలు. వీటిని మనం సాహిత్యానికి కూడా అన్వయించుకోవచ్చు.

బాలాజీ తన కథల్లోని ప్రతివస్తువునీ తన బాల్యం నుండి అంటే గతం నుంచే ఎంచుకున్నారు. వాటిని వర్తమానంలో సజీవభాషతో పునర్నిర్మించి చూపారు. అందుకే ప్రతికథా సజీవదృశ్యంగా ఉంటుంది.

డా॥ దేవరాజు మహారాజు కథ– కాల్పనికోద్యమం అనే తన వ్యాసంలో "కథలోని కాల్పనికత వాస్తవానికి అతి దగ్గరగా ఉన్నప్పుడు ఒక మంచి కథ అవుతుంది." అంటారు. జిల్లేళ్ళ బాలాజీ కథలన్నీ కాల్పనికత రంగులద్దిన వాస్తవ సజీవ దృశ్యాలు, ప్రతికథా రచయిత బాల్యపు ఘటనే. అందుచేత ఈ కథలు వాస్తవ దృశ్యమాలికలా ప్రకాశించాయి.

ముగింపు :

ఇటీవల కథల్లో విలక్షణంగా భాసించిన కథలు ఇవి. కథానికలో రూపానికి సంబంధించిన అంశాలు నాలుగు. అవి– కథ, కథనం, నేపధ్యం, శైలి. ఈ నాలుగు అంశాల్లో రచయిత విలక్షణత చూపగలిగితే ఆ కథ రూపవైవిధ్యంతో ఉంది అని చెప్పవచ్చు. జిల్లేళ్ళ బాలాజీ " నా బాల్యం కతలు" పై నాల్గు అంశాల్లోనూ విలక్షణమైనవే.

కథ విషయంలో .. ఇవన్నీ రచయిత బాల్య జ్ఞాపకాలు. అందువల్ల వీటిలో కల్పన అతికొద్ది మాత్రమే ఉండి, వాస్తవికత అధికం. అందువల్ల కథగా ఇవి జరిగిన విషయాలే. కథనం విషయంలో ఇవన్నీ ఉత్తమ పురుషలో చెప్పిన కథలు. చాలా కథల్లో కొనమెరుపు ఉంది. సంభాషణలు పాత్రోచితంగా ఉన్నాయి. అందువల్ల ఆ కథలన్నీ కథనపరంగా విలక్షణమైనవే. నేపధ్యం కూడా ఈ కథల్లో ఆంధ్ర–తమిళనాడు సరహద్దు ప్రాంతాల తెలుగు కుటుంబ నేపధ్యం. అదీగాక దాదాపు యాభైయేళ్ళ క్రిందట ఆర్థిక సామాజిక రంగాల్లో వెనుకబడిన వర్గపు ప్రజల జీవనశైలి. కుటుంబ బాంధవ్యాలు, ఆచార్యవ్యవహారాలు, మానవ సంబంధాలు ఇలా.. ఎన్నో విషయాల్ని మళ్ళీ మన కళ్ళ ముందు కదిలించిన సజీవ నేపధ్యం ఈ కథలకి ఉంది. శైలిపరంగా పూర్తి మాండలికలంలో సాగిన కథలివి. అయినా పాఠకుడిని ఎక్కడా ఇబ్బంది పెట్టని భాషా శైలి బాలాజీ గారిది.

ఇన్నిరకాల వైవిధ్యాలతో కూడిన ఈ కథలు రూపపరంగా చాలా విశిష్టమైనవి. ప్రాంతీయ ముద్రని దాటి తెలుగువారందరినీ అలరించగల గొప్పనేర్పుతో రచించిన కథలివి.

నిజానికి వస్తువు ఆకారరహితమే. అలాంటి ఆకారం లేని వస్తువు తగిన రూపాన్ని సంతరించుకోగలిగితే అది కళ అవుతుంది. ఈ "బాల్యం కతలు " అలాంటి కళాసృష్టే.

బాల్యపు స్మృతుల్ని కథలుగా మలచటంలో విలక్షణతని పాటించినందువల్ల వస్తువవరంగా, కథనవరంగా, భాషాపరంగా వైవిధ్యం చూపినందు వల్ల ఈ కథలు కథానికలో మరొక రూపపరిణామంగా భావించవచ్చు. లేదా కథానిక ప్రక్రియలో బాల్యకథలు అనే ఉపప్రక్రియాంశంగా పరిగణించవచ్చు. తెలుగులో వచ్చిన బాల్యపు అనుభూతుల కథల్ని ఒకచోట చేర్చి సమగ్రంగా విశ్లేషించగలిగితే ''బాల్యపుకథలు'' అనే వర్గీకరణకు ఒక సమగ్రత ఏర్పడుతుంది.

ఉపయుక్తం:

1. పగడాలు .. పారిజాతాలూ.. (నా బాల్య స్మృతులు – 1) రచయిత – జిల్లేళ్ళ బాలాజీ పార్వతీ విశ్వం ప్రచురణలు – తిరుపతి, సెప్టెంబర్ –2021
2. రజత రంజని, (ఒక శతాబ్ది సాహిత్యదర్పణం), ప్రచురణ– రంజని రజతోత్సవ సంఘం, ఎ.జి.ఆఫీసు – హైదరాబాదు, 1988

మనిషి కోసం వెతికే "తవ్వకం"

డా॥ సుంకర గోపాలయ్య, తెలుగు శాఖాధిపతి, డి.ఆర్.జి.ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తాడేపల్లిగూడెం. 9492638547

"ప్రపంచమొక పద్మవ్యూహం, కవిత్వమొక తీరని దాహం" కవిత్వం పట్ల ప్రేమ ఉన్నవారికి గొప్ప వాక్యం ఇది. కవిత్వం ఏం చేస్తుంది ? ఆత్మల్ని శుద్ధి చేస్తుంది. మనల్ని వ్యక్తీకరిస్తుంది. దృశ్యమానం చేస్తుంది. కవిత్వం ఆ కాలపు చరిత్రను వ్యాఖ్యానిస్తుంది. చరిత్రని రికార్డు చేస్తుంది. వ్యక్తీకరణ మనిషికి దొరికిన గొప్ప అవకాశం. కవి కలల్ని కంటాడు. కలల్ని వాక్యంగా రాస్తాడు. నిజాల్ని రాస్తాడు. నిజాయితీ కలిగిన వ్యక్తులకు కవిత్వమొక ఆయుధం. కవిత్వం మార్పును కోరుకుంటుంది. మనిషి యొక్క కళాత్మక వ్యక్తీకరణ కవిత్వం. ఈ వ్యక్తీకరణ ఆయా తాత్విక భూమికపై ఆధారపడుతుంది. కవి తన కాలాన్ని చూపుతాడు. అప్పటి సంతోషాన్ని, దుఃఖాన్ని, సమూహ చింతనని, ఏకాంత ధ్యానాన్ని మనముందుంచుతాడు.

కవిత నా మతం, మతం లేనివాడి మతం అంటారు సచ్చిదానంద. ఆధునిక తెలుగు కవిత్వంలో శిఖామణి మకుటాయమైన కవి. నూతనమైన అభివ్యక్తి, శిల్ప నైపుణ్యంలో వారు దిట్ట. మనకు తెలిసిన ఉదాహరణల నుండి ఉపమా, రూపకాలను తీసుకుని విస్మయానికి గురిచేసేలా కవితా రచన చేయగలరు. శిఖామణి ఆగష్టు 2009 'తవ్వకం' అనే కవితా సంపుటి వెలువరించారు. ఈ కవితా సంపుటిలో కూడా శిఖామణి కలం సహజమైన వస్తు విస్తరణను, తాత్వికతను ప్రదర్శించింది. 'తవ్వకం' అనే కవితా సంపుటిని చదవడం ద్వారా పాఠకులకు స్పష్టమైన మానసిక తృప్తి కలుగుతుంది. సహృదయ వైశాల్యం పెరుగుతుంది. ఇందులో ఆత్మను శుద్ధి చేసే 'కవిత్వం' ఉంది. అనుభూతి ఉంది. సామాజిక సంఘర్షణ ఉంది. శిఖామణి మత, కుల, ప్రాంత జాతిబేధాలు లేని మనిషి ఎవ్వటికైనా కనబడకపోతాడా అని దిగులు పడతారని డా॥ వడలి మందేశ్వరరావు గారు అంటారు. ఇందులో "ఊరేళ్ళాలి" అనే కవిత ప్రభుత్వ డిగ్రీ కళాశాల: కందుకూరు మరియు కె.ఆర్.కె. ప్రభుత్వ డిగ్రీ కళాశాల : అద్దంకి - ప్రత్యేక సంచిక

మనిషిని శత్రువుగా చూడని ఒక ఊరికి వెళ్ళాలి
మనిషి శకలాలుగా ఖండాలుగా విడగొట్టబడని వూరికి
మనిషి బయటకు అనేక రూపాలుగా గాక
లోపలికి మహా మనీషిగా విస్తరించే ఒక వూరికి
బహుశా ఒక్క సెలవుళ్ళోనే కాదు
ఎప్పటికైనా వెళ్ళాలని ఉంది

శిఖామణి అనమానతలు లేని లోకాన్ని ఆకాంక్షిస్తున్నాడు. పూర్తిగా మానవత్వం నిండిన లోకాన్ని ఆశిస్తున్నారు. ఈ పుస్తకం శీర్షికగా ఉన్న "తవ్వకం" కవితలో తనను ఎవరు ఎలా చూశారో, చూస్తున్నారో చెబుతూ కన్నవాళ్ళు, భార్య, పిల్లలు, స్నేహితులు, మిత్రులు, శత్రువులు ఎవరికి వారు వాళ్ళకు తెలిసిన వాడి గురించే తప్ప, నన్ను తెలిసినవాడి గురించి ఎవరూ మాట్లాడ్డం లేదు అని వాపోతారు. చివరిలో

"ఇక అప్పట్నుండీ
తవ్వకం లో లోపలికి
ఎప్పటికైనా
మనిషి తగలకపోతాడా !"

ఈ వాక్యాలు 'శిఖామణి' ఆత్మను పట్టిస్తాయి. ఇలాంటి వాక్యాలు మనల్ని శుభ్రపరుస్తాయి. మలినాల్ని తొలగిస్తాయి.

ఇవాళ మనిషి సరుకైపోయాడు. జీవితం మార్కెట్ అయింది. కొనడమో, అమ్మడమో అనివార్యంగా మార్చుకున్న ప్రపంచం ఇది. ఈ నేపథ్యంలో శిఖామణి రాసిన "బట్టలూ... బంగారమూ..." కవిత మనల్ని నిజాయితీగా నిలదీస్తుంది. మనం ఎలా ఉన్నామో ప్రశ్నిస్తుంది. ఆ తరం ఎలా బతికిందో ఈ తరం ఎలా బతుకుతుందో ఒక స్పష్టమైన గీత ద్వారా చూపుతారు.

పోనీ కొన్నామే అనుకో / ఇన్ని బయటివి కొనడానికి / ఎన్ని లోపలికి అమ్ముకున్నామో ఆలోచించావా? అంటూ ఆలోచనలో పడేస్తాడు కవి. వస్తు ప్రేమతో దేహాన్ని ఉత్సవ విగ్రహాన్ని చేయడాన్ని గుర్తు చేస్తారు.

బట్టలూ...బంగారమూ... భూమీ
సమస్త సంపన్న వస్తుసంచయంతో
ఈ దేహాన్ని అలంకరించి
ఉత్సవ విగ్రహాన్ని చేసి ఊరేగిస్తున్నావు సరే
నిత్యమూ నీతో విసిగిపోయి
నీ లోలోపలే కుమిలిపోతున్న
ఈ కురూపిని
వేటితో అలంకరిస్తావు ?
దేనితో అందగిస్తావు ?

శిఖామణి కవిత్వానికి వ్యాఖ్యానాలు అవసరం లేదు. చాలా చిన్న పదాల అల్లికలతో వాక్యం లోపలకు వెళుతుంది. స్పష్టత ఉంటుంది. అపరిచయీకరణ తక్కువ. మూర్త భావనలు మనల్ని వేలు పట్టుకు నడిపిస్తాయి. భాషాబలం, భావనా బలం, భావ బలం ఈ మూడు శక్తులు శిఖామణి కవిత్వానికి పుష్కలంగా ఉన్నాయి.

ఈ కవితా సంపుటిలో పదచిత్రాలు, భావచిత్రాలు, అభివ్యక్తి పుష్కలంగా ఉన్నాయి. కానీ అంతటితో ఇది గొప్ప పుస్తకం అని కాదు.. అంతకు మించి తాత్వికంగా వివేచించాల్సిన కర్తవ్యాన్ని కవి జ్ఞప్తికి తెస్తారు.

మనుషులు గొప్పా, పేదలుగా, సవర్ణ అవర్ణులుగా, ప్రాంతాలవారీ విభజనగా, మతాల మధ్య కట్టడాల ఇనుప తెరలుగా, అగాధాలుగా విడిపోవడం గురించి, నైతికంగా పడిపోవడం గురించి, మానవత లేకుండా చెడిపోవడం గురించి ఈ "తవ్వకం" కవితా సంపుటిలో తీవ్ర వేదన కనిపిస్తుంది. '(ప్రేమ దీపం' వెలిగించుకోవాల్సిన అవసరాన్ని మనకు కవి గుర్తు చేస్తాడు.

జీవితం జీవించడానికే అనే కవితలో
"మనం గతించాక మన మరణవార్త నలుగురికి
తెలియడం విశేషం గాదు
మనం జీవించినట్టూ, జీవించినన్నాళ్ళూ కలలు కన్నట్టూ
ప్రకృతిని పరిసరాలనీ జీవింపచేసినట్లు
సమస్త మానవ ప్రపంచాన్ని
గొప్ప తమకంతో ప్రేమించినట్టు తెలియాలి"

అందుకు "జీవించడం" ఒక్కటే మార్గమని, జీవితం ముమ్మాటికీ జీవించడానికే అని, ఎన్ని కష్టాలు కన్నీళ్ళూ ఉన్నా అద్భుతంగా బతకాలని ఈ వాక్యాలు తెలియజేస్తాయి.

'పంచదార చిలక' అనే కవితలో తాను చూసిన పసిపిల్ల చేష్ట గురించి చక్కగా చెబుతూ... ముగింపులో ఆ పిల్ల గదిలోని బొమ్మల్ని మోసుకొచ్చి, హాల్లో గుట్ట పోసి, ఏ బొమ్మకా బొమ్మను విడదీసి, మళ్ళీ అతికిస్తూ ఉంది అని చెబుతూ...

అప్పుడప్పుడు మనం కూడా మనల్ని
ఒక్కసారి విప్పదీసుకుని
మళ్ళీ మళ్ళీ నిర్మించుకుంటే ఎంత పరిపూర్ణత !

ఇలాంటి వాక్యాలు ఈ పుస్తకంలో చాలా కనిపిస్తాయి. మనల్ని మనలోకి... లోలోపలికి పట్టి చూపిస్తాయి. మనం ఎలా నిర్మాణం కావాలో...అప్పుడప్పుడు మనల్ని మనం సరిచేసుకోవాల్సిన అవసరాన్ని తెలుపుతాయి.

అప్పటిదాకా ఉన్న మనుషులు ఉన్నట్టుండి లోకాన్ని ఖాళీ చేసి వెళ్ళిపోతారు. దగ్గర వాళ్ళు కన్నీటి పర్యంతం అవుతారు. ఆప్తులు బాధపడతారు. కానీ కవులు పద్యాలు రాస్తారు. వారి స్మృతుల్ని గుర్తు చేస్తారు. వారు లేని ఖాళీలను జ్ఞాపకం చేస్తారు. తవ్వకంలో ఇలాంటి 'స్మృతి కవితలు' ఆరు ఉన్నాయి.

బిస్మిల్లాఖాన్ స్మృతిలో 'స్వరమాంత్రికుడు', ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మి స్మృతిలో 'పాటల పాలవెల్లి', భానుమతి స్మృతిలో

'బంగారు సంపెంగ' వీటితోపాటు కవి వ్యక్తిగత జీవితంలోని మిత్రుడు, ఓ చిన్న పాప గురించి కవితలు ఉన్నాయి. బిస్మిల్లా ఖాన్ స్మృతిలో రాసిన కవిత గొప్ప కవిత.

నీవు పుట్టకముందు
కాశీలో ఒకే ఒక నది ప్రవహించేది
అది ఇపుడు రెండయింది
ఒకటి శివగంగ
రెండు నీ స్వరగంగ

ఎంత గొప్ప వాక్యాలో చూడొచ్చు. సన్నాయి రాగాన్ని శ్వాస సానరాయి మీద అరగదీసిన సమ్మోహనుడిగా బిస్మిల్లాఖాన్‌ని కొనియాడారు. కాశీ విశ్వేశ్వరుడిని, కాశీ బిస్మేశ్వరుడుగా చేసిన ఘనత బిస్మిల్లా ఖాన్‌ది అంటారు. గంగానది ఇక ఎవరి పాట విని నిద్రపోతుందో అని కవి జాలిపడతాడు.

సాదా సీదా వాక్యంలా అనిపిస్తాయి. కానీ అందులో వెలుగు కనిపిస్తుంది. ఆ వెలుగు వెంట దారి పట్టుకుని మనం హాయిగా నడవగలం. కవి హృదయంతో ఆల్కెమీ సులభంగా జరిగిపోతుంది.

ఇందులో పనిమంతుడు, చనిపోవనివాడు, మానవ మహేతిహాసం, మట్టిని కలగంటున్నాను లాంటి గొప్ప కవితలు ఉన్నాయి.

మనుషుల భావనలను, అనుభవాలను, తాత్వికతను వ్యక్తీకరించడానికి లేదా ప్రకటించడానికి కవిత్వం ఒక శక్తివంతమైన మాధ్యమం. 'తవ్వకం' అనే ఈ కవితా సంపుటిలో ఈ విషయాన్ని మనం గమనించవచ్చు. మానవ సంవేదనలకి ఒక్క చక్కని రూపసారం ఇందులో కనిపిస్తుంది.

కవిత్వానికి ఏ పరికరాలు వాడాలో, కవిత్వ నిర్మాణం ఎలా ఉండాలో "తవ్వకం" చదివితే ఇట్టే తెలిసిపోతుంది. కవి నీ భుజం మీద చెయ్యేసి మాట్లాడుతున్నట్టు, బాధ్యతగా హెచ్చరిస్తున్నట్టు ఇందులో వాక్యాలు ఉంటాయి.

కవులేం జేసారు
వెల్లువెత్తిన పోరాటాలకు
పోటెత్తిన పిడికిళ్ళనిచ్చారు
తమకు తాము కరిగి
అక్షరాలను దీపాల్లా ముట్టించారు
పాటలను యుద్ధనౌకలను చేసి లంగరులెత్తారు !
(కవులేం జేసారు, పుట – 68)

'తవ్వకం' సంపుటిలో కూడా కవి అదే జేశాడు. కారు చీకటిలో దీపధారి అవుతున్నాడు.

నానీలు – చేనేత జీవన చిత్రణ

డా. రాపోలు శ్రీనివాస్, తారా ప్రభుత్వ కళాశాల(స్వ.ప్ర.), సంగారెడ్డి, తెలంగాణ.

తెలుగు సాహిత్యంలో 19వ శతాబ్దం ఎన్నో కొత్త సాహిత్య ప్రక్రియలను తీసుకువచ్చింది. వచన కవితా వికాసం మొదలైంది. వాడుక భాషోద్యమం ఊపందుకుంది. సాహిత్య చరిత్రలో కొత్తయుగం ఆరంభమైంది. గురజాడ అప్పారావు కన్యాశుల్కం నాటకం రాసి సంఘసంస్కరణతో పాటు భాషాసంస్కరణ కూడా సాధించే ప్రయత్నం చేశాడు. వాడుకభాషలో కూడా గొప్పరచనలు చేయవచ్చునని ఆచరణాత్మకంగా నిరూపించాడు. తన మిత్రుడు గిడుగు రామ్మూర్తిపంతులు చేపట్టిన వాడుకభాషోద్యమానికి చేయూత నిచ్చాడు. పద్య, గేయ, కావ్యభాషగా పండితులపరమైన తెలుగుభాష కొత్తరూపం సంతరించుకుంది. కొత్త కవితా రూపాలెన్నో తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించాయి. కథ, కథానిక, నవల, నాటిక, నాటకం, మినీకథ, గేయం, పాట, గజల్, రుబాయి ఇలా అనేక రూపాలతో వచన కవిత్వం పటిష్టమవుతుంది. అంతేకాక దీర్ఘకవితలు కూడా పొట్టివయి మినీకవితలుగా మారాయి. మినీ కవిత్వం క్రమంగా ఉద్యమంగా పుంజుకుంది.

ఆరుద్ర మినీకవిత్వం గూర్చి మాట్లాడుతూ 'తరువాత కాలంలో ఈ కవిత్వం పద్దెనిమిది వాక్యాలు కావచ్చు, పద్దెనిమిది పదాలు కావచ్చు' అన్నాడు. వస్తుపరంగా, రూపపరంగా మారిన వచన కవిత్వం నానీలకు మార్గదర్శమై వందల మంది నానీ కవులకు కరదీపిక అయింది.

1997లో ఒక కొత్త వెలుగును విరజిమ్ముతూ దూసుకొచ్చాయి నానీలు. 'నానీల నాన్న', నానీల రూపశిల్పి డా. ఎన్. గోపి. 'నానీ' లు అంటే నావీ, నీవీ వెరసి మనవి అని అర్థం. నానీ అంటే మన ఇళ్ళల్లో చిన్నపిల్లలను ప్రేమగా పిలిచే పేరు. తెలుగు సాహితీరంగంలో ఈ నానీలు కూడా ముద్దుగా కనిపించే చిన్నారుల వంటివే. నానీలు నాలుగు పాదాల చిట్టి పద్యాలు. ఇవి మరీ చిన్నవి కావు. 20 అక్షరాలకు తగ్గకుండా, 25 అక్షరాలకు మించకుండా ఉంటాయి.నిర్మాణం దృష్ట్యా నానీలలో ఒక పద్ధతి ఉంటుంది. నానీలలో నాలుగు పాదాలు, రెండు భావాంశాలుంటాయి. మొదటి రెండు పాదాలో ఒక భావాంశం, చివరి రెండు పాదాల్లో మరో భావాంశం ఉంటాయి. మొదటి దానికి రెండోది సమర్థకంగా ఉంటుంది.

ఉదా. "కుండ ముక్కలైందా
కుమిలి పోకు
మట్టి మరో రూపం కోసం
సిద్ధమౌతుంది".

ఒక జీవిత సత్యాన్ని, ఒక అనుభవాన్ని, లోక పరిశీలనను నానీలు కళ్ళకు కట్టినట్లు చూపిస్తాయి. సూక్ష్మంలో మోక్షాన్నిస్తాయి. అల్పాక్షరాలలో అనల్పార్థాన్ని ప్రతిబింబిస్తాయి.

చేనేత వృత్తి

మనిషి జీవించడానికి కూడు, గూడు ఎంత ముఖ్యమో బట్ట కూడా అంతే ముఖ్యం. పేదోడి నుంచి మొదలుకుని ధనవంతుడి వరకు ఈ మూడింటి చుట్టే జీవితాలు తిరుగుతుంటాయి. సమాజంలో మహిళలను గౌరవప్రదంగా ఉంచే చీరెలు, పురుషులను సగర్వంగా నిలబడేలా చేసే దుస్తులకు ఎంతో పేరు ప్రఖ్యాతులున్నాయి. భారతదేశ వారసత్వ సంపద చేనేత. దేశ స్వాతంత్ర్య పోరాటంలో మగ్గాన్ని చూస్తే బ్రిటిషోళ్లు ఎకె 47తుపాకిని చూసినట్లు భయపడ్డారని, అలాంటి మగ్గాన్ని నమ్ముకున్న బతుకులు మాత్రం ఇప్పుడు ఆగం అయ్యాయి. చేనేత కార్మికుల బతుకులు చిరిగిన ఇస్త్రీ చొక్కాలా తయారయ్యాయి. కులవృత్తి తిండి పెట్టకపోవడంతో చేనేత కార్మికులు వలసలు పోతున్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు

వెచ్చిస్తున్నామని చెబుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మాటలు నీటి మూటలయ్యాయి. రంగు రంగుల అంచులతో, సన్నని జలతారుతో పని చేస్తున్నామని సంబరపడిపోతూ, తాము తయారు చేసిన వస్త్రాలకు వచ్చిన ప్రశంసే లక్షలాది రూపాయలుగా భావిస్తున్నారు. వృత్తిలో పోటీ పడి పనిచేస్తున్న చేనేత కార్మికులు చాలీచాలని కూలీడబ్బులతో చితికి పోతున్నారు.

చిక్కును విప్పే పట్టపగలు మా ఉత్పత్తులు
ఓపిక లేదా ఇంద్రధనుస్సు! ఎగ్జిబిషన్ హాలులో
కండెను నేతగాండ్లు మా మగ్గం
మ్యూజియంలో

తెంపిపారేశావు గదరా 'సరి' చేస్తున్నారా! (సజ్జా
(డా. ఎన్. గోపి) (నడిమెట్ల ఎల్లప్ప) వెంకటేశ్వర్లు)

ఇంటిల్లిపాది రేయింబవళ్లు కష్టపడి పనిచేస్తే వారానికి రూ.500 ఆదాయం వస్తుంది. చేనేత పరిశ్రమ ద్వారా జీవనభృతి కష్టమవుతుండడంతో కొంతమంది పరిశ్రమలు విడిచిపెట్టి గ్రామాల్లో నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. చేనేత కార్మికులది ఒక్కో రకమైన వెతల కథ! చేనేత వృత్తిపై ఆధారపడిన వారంతా ఇతర వృత్తులకు వెళ్లలేక అదే వృత్తిలో అవస్థల జీవితం నెట్టుకొస్తున్నారు. ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన చేనేత కార్మికులు నేడు అష్టకష్టాలెదుర్కొంటున్నారు. ఒకవైపు పెరిగిన ముడి సరుకుల ధరలు, మరోవైపు శ్రమకు తగ్గ ఫలితం లేని కూలి, ఇంకోవైపు అమలు కాని సర్కార్ అరకొర పథకాలు, వెరసి చేనేతన్నలను నట్టేట ముంచుతున్నాయి. ఒక్కో జిల్లాలో ఒక్కో రకమైన శ్రమ దోపిడీతో చేనేత కార్మికులు బతుకు బండిని లాగలేకపోతున్నారు.

నేసిన బట్టలకే కాదు నింగి మగ్గం ఆసులో పోచంపల్లి చీర
రంగులు ఉండేవి కండె సూరీడు ఎంత బాగుందో
జీవితానికి కూడ తూర్పు పడమరలకు మరి
రంగులు వుంటాయి తిరుగుతూ దానిని నేసినవాడు?
(తుమ్మా రాజానేత) (సిహెచ్ వి (డా. బండారు
బృందావనరావు) సుజాతాశేఖర్)

సిరిసిల్ల చేనేత కార్మికులు:

బట్టలను తయారు చేసే కార్మికులలో సిరిసిల్లకు విశిష్ట స్థానం ఉంది. దేశంలోనే ఇక్కడి చేనేత కళది ప్రత్యేక స్థానం. ఆంగ్లేయుల వస్త్ర వ్యాపారం మన కళాకారుల నైపుణ్యం ముందు నిలువలేకపోయింది. చివరకు ఇక్కడి నేతన్నల ముంజేతి వేళ్లను నరికివేసిన దారుణాలు ఇప్పటికీ నెమరు వేసుకుంటాం. తరాలను దాటుకుంటూ వచ్చిన అప్పటి చేనేత ఉత్పత్తి ఇప్పటికీ ఒడిదుడుకుల మధ్య సాగుతోంది. సిరిసిల్ల నేతన్నలు బాగా నేస్తారనే చరిత్ర మాత్రమే మిగిలింది. ఆకలి చావులు, ఆత్మహత్యలతో అట్టుడికిన ఈ ప్రాంతం మౌనసాక్షిగా రోదిస్తోంది. ప్రస్తుతం సిరిసిల్లలో చేనేత సహకార సంఘాల్లో 85 ఏళ్ల వయసున్న పండుటాకులు ఇప్పటికీ పని చేస్తుండడం వారి దయనీయ దుస్థితికి అద్దం పడుతోంది. సిరిసిల్ల ఉరిసిల్లగా మారింది. సిరిసిల్ల చేనేత కార్మికుల జీవితాలను చిత్రిస్తూ ఎన్నో నానీలు వచ్చాయి.

శ్రీశాల, సిరిశాల నాడు రోజుకో శవయాత్ర సిరిసిల్ల
ఆకలిచావులు చూస్తారా బాబు! చేనేతకు ముఖచిత్రం
ఆత్మహత్యలు అయితే రండి ఇవ్వాళ్ల
సిరిసిల్ల నేడు. సిరిసిల్లకు. ఆకలి చావుల
కరపత్రం.
(సబ్బని లక్ష్మీ (డా. పత్తిపాక (డా. పత్తిపాక
నారాయణ) మోహన్) మోహన్)

శతాబ్దాల క్రితమే మనదేశంలో అగ్గిపెట్టెలో పట్టే చీరను నేశారని పుస్తకాల్లో చదువుకున్నాం. దాన్ని నిజం చేస్తూ సిరిసిల్ల నేతన్నలు 1993లో అగ్గిపెట్టెలో ఇమిడే చీర, శాలువా నుంచి కుట్టులేని చొక్కాలాంటి అనేక అద్భుతాలను సృష్టించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం దూసుకెళ్తున్న ఈ కాలంలో అన్ని రంగాల్లోనూ విప్లవాత్మక మార్పులు

వచ్చాయనడంలో సందేహం లేదు. వస్త్ర పరిశ్రమ చేతిమగ్గాల నుంచి మరమగ్గాల దిశగా ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో నల్ల పరంధాములు చేనేత కళను ఎల్లలు దాటించారు. 1993లో అగ్గిపెట్టెలో ఇమిడే చీరను నేసి ఏకంగా గిన్నిస్ బుక్ రికార్డును సొంతం చేసుకున్నారు. 1997 అట్లాంటలో నిర్వహించిన ఒలంపిక్స్‌లో 120 మీటర్ల జాతీయ పతాకాన్ని నేసి చేనేతకు అరుదైన గౌరవాన్ని తీసు కొచ్చారు. ఎలాంటి కుట్టూ లేకుండా మగ్గంపై చొక్కాను నేసిన పరంధాములు అనేక అద్భుతాలను సృష్టిస్తూ అరుదైన చేనేత కళాకారుడిగా తన ప్రస్థానాన్ని కొనసాగించారు. 1997 అట్లాంటాలో నిర్వహించిన ఒలంపిక్స్‌లో 120 మీటర్ల జాతీయ పతాకాన్ని నేసి చేనేతకు అరుదైన గౌరవాన్ని తీసుకొచ్చారు. ఇంతటి పేరు, నైపుణ్యమున్న పరంధాములు ప్రతిభను కీర్తిస్తూ వచ్చిన నానీలు.

అగ్గిపెట్టెలో
చీర పోయగం
పరంధాములూ
నీకు శాశ్వతం.
(మాడిశెట్టి గోపాల్)

అంత చీరతో
అగ్గిపెట్టె నింపావు
నీ పొట్టే
నింపుకోలేక పోయావు.
(చిమ్మపూడి శ్రీరామమూర్తి)

అగ్గిపెట్టెలో చీర
ఎంతద్భుతం
అన్నా!
పరంధాములు
ఏం చేతులే నీయి.
(అన్నవరం దేవేందర్)

జాతీయోద్య మంలో చేనేత కీలకపాత్ర పోషించింది. ఉద్యమంలో భాగంగా జాతీయ నేతలు విదేశీ వస్తు బహిష్కరణకు పిలుపు ఇచ్చారు. 1905, ఆగస్టు 7న కోల్‌కత్తాలో విదేశీ వస్త్రాలను దగ్ధం చేశారు. ఆ తరువాత చేనేత చిహ్నం రాట్నాన్ని జాతీయోద్యమ జెండాలో చేర్చారు. తకిలి అనే కదురు ద్వారా దూదితో నూలు వడకడాన్ని ఒక ఉద్యమంగా చేపట్టారు. మహాత్మా గాంధీ చరఖాతో నూలు వడుకుతుండేవారు. అలా చేనేత వృత్తి చిహ్నం జాతీయోద్యమానికి ప్రతీకగా నిలిచింది. విదేశీ వస్త్రాలను దగ్ధంచేసి జాతీయోధ్యమానికి ఊపు తెచ్చిన ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా జరపాలని చేనేత కార్మికులు కోరుతూ వచ్చారు. జాతీయోద్యమంలో చేనేత పాత్రను వివరిస్తూ ఎన్నో నానీలు వచ్చాయి.

రాట్నం
వట్టి పనిముట్టు
కాదుసుమా!
అది జాతిని నడిపిన
ధర్మచక్రం.
(డా. పత్తిపాక మోహన్)

మూడురంగుల జెండా నూలు వడకడం
ఆ..! ఏమెగుర్తంది.
నేసిన బతుకే
రాలిపోయింది.
(డా. పత్తిపాక మోహన్)

నిన్న జాతీయతా స్ఫూర్తి
మిల్లుబట్టే
నేటి తరం ఆసక్తి.
(డా. పత్తిపాక మోహన్)

చేనేత కార్మికులను వృత్తిభద్రత లేకపోవడం ఆత్మహత్యలకు కారణాలుగా చెప్పొచ్చు. ప్రస్తుతం పాలిస్టర్ మరమగ్గాలపైన పనిచేస్తున్న కార్మికులకు రోజుకు రూ.250 వరకు వస్తాయి. 1990 నుండి ఇప్పటివరకు సుమారు 1200 మంది కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇందులో ఎంతో మంది కుటుంబ పెద్దదిక్కును కోల్పోయి రోడ్డున పడ్డారు. పనిలేక కుటుంబ పోషణ భారమై ఒకే కుటుంబంలో తండ్రీకొడుకులు ఉసురు తీసుకున్న ఘటనలూ ఉన్నాయి. ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వాలు ఉపశమన చర్యలు తప్ప సమస్యను సమూలంగా పరిష్కరించే ప్రయత్నాలు చేయకపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. చేనేత కార్మికుల ఆత్మహత్య చిత్రించిన నానీలు.

మా నేతజీవితాలకు
ఊపిరిపోసేవి
ఊపిరితీసేవి
పోగులే.
(ఆడెపు లక్ష్మణ్)

అన్నీ
మారుతున్నయ్
ఒక్క చేనేతల
ఆత్మహత్యలు తప్ప
(పున్నమి)

వాడిపోతున్న
జరీపువ్వు
ఇప్పుడు మగ్గంగుంట
ఒక సమాధి.
(జిందం అశోక్)

అన్నం పెట్టే రైతన్న, వస్త్రం నేసే నేతన్న కన్నీరు కార్చడం దేశానికి సుభిక్షం కాదు. రైతన్న నేతన్న ఈ దేశానికి కవల పిల్లలంటారు. రైతన్న కాయకష్టంతో, నేతన్న శరీర కష్టంతో చెమటతో ఒళ్ళంతా తడిసినా ఏనాడు కడుపు నిండింది లేదు. తృప్తిగా చేయి కడిగింది లేదు. పత్తిని పండించేవాడు పాడెమీద

ఊరేగుతున్నాడు. పత్తిని వస్త్రంగా నేసినవాడూ మగ్గం గిలకకు ఉరేసుకుంటున్నాడు' అంటాడు ఓ కవి.

కడుపుకి తిండి చేనేత, రైతుల చేనేత
దేహానికి గుడ్డ పానం తీసుకునుడు ఆత్మహత్య లెందుకు?
జాతికి నేత్రాల్లా దేశం బట్టనేసి
రైతు నేతన్నలు సిగ్గుపడాలె. పరువు నిలిపినందుకా!
(ఎస్. ఆర్. పృథ్వి) (డా. కాలువ మల్లయ్య) (పలస వెంకటేశ్వర్లు.)

ప్రాచీనకాలం నుంచి ఘన చరిత్ర కలిగిన చేనేత పరిశ్రమను నమ్ముకుని, తరతరాలుగా కులవృత్తిని స్వీకరించిన చేనేత కార్మికులు ప్రస్తుతమున్న ఆర్థిక పరిస్థితులతో వలసలే శరణ్యంగా భావిస్తున్నారు. చేనేత కార్మికులు వరంగా భావించిన జనతా వస్త్రాలు పథకం కూడా సక్రమంగా అమలు కాకపోవడంతో ఈ పరిశ్రమ మరింత కుంటుపడింది. ఈ పరిశ్రమను నమ్ముకుని జీవిస్తున్న కార్మికులు ప్రస్తుతం ఉపాధి లేక ముంబాయి, భీవండి, గుజరాత్, హైదరాబాద్, రాజమండ్రి, విశాఖపట్నం, భువనేశ్వర్ వంటి పట్టణాలకు వలసలు పోతున్నారు. ఈ వలసల పేర్కొనే నానీలు.

వలసలు కొడుకు ముంబాయి మిల్లులు
ఆకలిచావులు అయ్య భీవండి చేనేతల నడ్డివిరిస్తే
తెగినపోగులు తెగిన పోగులు అండగా నిలిచిందండీ
నేతన్నల బతుకులు కన్నీటి అలుగులు. భీవండీ.
(దాస్యం లక్ష్మయ్య) (డా. పత్తిపాక మోహన్) (అంబల్ల జనార్ధన్)

మగ్గాలపై నేత నేసే కార్మికులు 50 ఏళ్ల లోపే వృద్ధాప్యాన్ని సంతరించుకొని కనిపిస్తున్నారు. 30 ఏళ్లకే అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. వరిబీజం, రక్తహీనత, శ్వాసకోశ వ్యాధులు వంటి అనా రోగ్య పరిస్థితులు వెంటాడుతున్నాయి. ఆ తరువాత వైద్యశాలల చుట్టూ తిరగాల్సిందే. బతికినంత కాలం ఏదో ఒక జబ్బుతో కాలం వెళ్లదీయాల్సిందే. ప్రస్తుతం వయస్సులో పెద్దరకాలు చేసే కార్మికులు కష్టమైనా ఓర్చి పిల్లలను ఉన్నత చదువులవైపు పంపేందుకు ఆసక్తి చూపుతున్నారు. చేనేత కుటుంబాల్లో చదువుకున్న యువకులెవరూ ఈ వృత్తిలోకి రావడం లేదు. వృత్తిలో ఉన్నవాళ్లే కష్టాలు అనుభవించలేక, కుటుంబం గడవక ఇతర వృత్తుల వైపు బతుకు పోరులో పరుగు తీస్తున్నారు. ఇతర వృత్తులకు కూడా వెళ్లలేని వృద్ధులు, మహిళలు మాత్రం చేనేత వృత్తిలోనే జీవనం నెట్టుకొస్తున్నారు.

ఒక జీవిత సత్యాన్ని, ఒక అనుభవాన్ని, లోక పరిశీలనను నానీలు కళ్ళకు కట్టినట్లు చూపిస్తాయి. సూక్ష్మంలో మోక్షాన్నిస్తాయి. అల్పాక్షరాలలో అనల్పార్థాన్ని ప్రతిబింబిస్తాయి. నేతన్న కష్టాలు, కడగండ్లను ఈ నానీలు అలతి అలతి మాటలతో కంటికి కట్టినట్లు చూపిస్తున్నాయి. కొండను అద్దమందు చూపినట్లు చేనేత బతుకు చిత్రాల నెన్నింటినో నానీలు చిత్రించాయి.

ఆధార గ్రంథాలు:

1. నానీలు – డా. ఎన్. గోపి
2. గోపి నానీలు – డా. ఎన్. గోపి
3. నానీల దశాబ్ది – డా. ఎస్. రఘు
4. నానీలు నాలుగు వ్యాసాలు
5. నానీలు – సంవీక్షణం
6. నల్లగొండ నానీలు – పున్న అంజయ్య

పేరెన్నిక గన్న పేరులేని పేరంటాలు నిగమశర్మ యక్క

డా॥ (శ్రీమతి) ఎ. ఈశ్వరమ్మ, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఆంధ్రవిశ్వవిద్యాలయం, విశాఖపట్నం.
సెల్ : 9701305156

సాహితీ సమరాంగణ సార్వభౌముడు శ్రీకృష్ణ దేవరాయలవారి ఆస్థాన పండితుల్లో విలక్షణ లక్షణ శోభితుడు తెనాలి రామకృష్ణ కవి. ఈయన అపూర్వ సృష్టియే 'నిగమశర్మయన్న ఈమె పేరేమో రామలింగడని తెలుపలేదు. 'జగమెరిగిన బ్రాహ్మణుడికి జంధ్యమేల' యన్నట్లు యావదాంధ్ర సాహితీ జగత్తుకు సుపరిచితురాలైన ఆడపడుచులు పేరులేకున్న నేమి? అయిననూ పేరులో ఏమున్నది పెన్నిధి. నిగమశర్మవంటి పెద్ద పేరు ఏమి మిగిల్చినది గనుక.

ఈమె తండ్రి సభాపతి సకల శాస్త్ర పారంగతుడు పీటికాపుర సంస్థానమున పేరెల్లకంగా వైదికాచార్యుడు. అగర శ్రీమంతుడు రాజాధిరాజుల మ్రొక్కులు గొన్నవాడు. పాడిపంటలు, వడ్డీ వ్యాపారము, గ్రామకార్యములు నీరవలసిన ధర్మాధికారము, రాజాలయమునకు రాకపోకలు మొ?ని ఈయన విధులు. గృహమున ముప్రొద్దు భగవదారాధన, శిష్యుల వేదపరసము అతిధుల సమారాధన, దాసదాసీ జనముతో, సిరిసంపదలతో, కీర్తి ప్రఖ్యాతులతో తులతూగు కళకళలాడే నిండైన యిల్లది.

తల్లి యతుల నిష్ట గల నిండైన ముత్తైదువ. అత్తగారవసాన కాలమున ఇచ్చిన హరి సుదర్శనుఉబేరును అమూల్య వవిత్రాభరణముగా నెంచి వండుగ వేళలబెట్టుకొని, తీసి దాచుచు తర తరములనుండి కూడబెట్టగా వచ్చిన మూలవిత్తము రహస్యమును బైట పడనీయక భద్రముగా కాపాడుచు నిండు సంతానవతిగా ధర్మార్థములు రెంటిని సమానముగా సంసారమందు నిర్వహింపగలిగిన పెద్ద యిల్లాలు, ఉత్తమురాలు.

ఇట్టి తల్లిదండ్రుల కడుపున పుట్టి పెరిగిన పెద్దకూతురు నిగమశర్మయన్న, వంశాభిమానము, ధర్మార్థము జాగ్రత్త తెలివితేటలు, పలుకుల నయగారము, శీలనైర్మల్యము. వనిపాటల యందలి దిట్టతనము, తీవ్రమైన ప్రయోజనదృష్టి, కలుపుగోలుతనము ఈమె సహజ లక్షణాలు వ్రాత చదువుల సమాచారము తెలియరాదు. !! వ్యవహార జ్ఞానము వుష్కలముగా కలదు. అత్తవారిల్లు పుట్టినింటికైదామడల దూరము, ఈ కుటుంబముతో నియ్యమందిన యా కుటుంబ పెద్దతనమెట్టిదో మనము కొంత యూహింపగలము. తమ కంటే గొప్పవారికే ఆడబిడ్డనిచ్చుటకు యిష్టపడతారు. భర్త మర్యాదస్తుడు బహుసంతాన పతి,

తన యింట తాను మర్యాదగా సంసారము చేసుకొనుచున్న ఆమెకు పుట్టినింటి నుండి ఒక రోజు పిడుగులాంటి వార్త వచ్చి హృదయాన్ని కలచి వేసింది. తీవ్ర ఆందోళన చెందింది. తమ్ముడు నిగమశర్మ వచ్చి పోకిరియైపోయినాడు ఆస్తి యెల్ల ఇంచుమించుగా నాశనం చేశాడు. ఆచార వ్యవహారములు అడుగంచినది. మా మర్యాదలు చదువు సంతలు నశింప వచ్చినది. అభక్ష్య లక్షణము నపేయ పానము, అప్పులు, ఆదము, మోసము, దొంగతనము మొ..గు వ్యసనములకు లొంగిపోయాడు. తులసి వనంలో గంజాయి మొక్కలా పెరిగాడు. కంచెంత కాపురము, తల్లిదండ్రులు వృద్ధులు, చిన్న విచారించు వారు లేరు.

తాను ఇంటి పెద్దకూతురు నిగముడు తానెత్తి ముద్దాడి, పెంచి, పెద్దచేసిన తమ్ముడు వానికి బుద్ధి చెన్న కోపడు తెగలననుకున్నది. తమ్ములపై వాశల్యంతో, పుట్టినించి పై మమకారంతో భర్తను, బిడ్డలను వెంటబెట్టుకొని పుట్టింటికి బయలుదేరి వచ్చినది.

ఇంటిలో అన్నియూ అన్ని త్రోవలై అస్తవ్యస్థముగా నున్నవి. సరిదిద్దే ప్రయత్నము చేయువాడు లేరు. ఎవరు ఏ పనికి పూనుకోవడం లేదు. పరిస్థితి అయోమయంగా ఉంది. ఇంటిలో కళాకాంతులు లేవు, అశాంతి ఆవహించి ఉంది. తల్లిదండ్రులు చెరి యొక మూల ప్రాణవశిష్టులై దుఃఖంలో ములగి నుడివడి – యున్నారు. పెరుమాళ్ళయింట్లో బూజనిండినది. పాత్రలు పాచి పట్టినది. పెద్దయిల్లు కాచి మధ్యాహ్నమునకు వచ్చలతిథులు పలుకరించువారు లేక వేరే ఇళ్ళు వెదకబోవుచున్నారు. చిన్న పిల్లలు వేళకు అన్నము, నీరు, విచారించువారు లేక, ఆలనా పాలనా చూసేవారు లేక దీనంగా వున్నారు. పాడియావులు బందెలదొడ్లకో, బైటి తెరువులకో పాలైనవి పనివారు మొగము జూపుట అరుదైనది. జీతబత్తెములు అరయువారు లేరు పుస్తక భాండాగారములో తాళ పత్ర గ్రంథము కొన్ని దీపారాధన యందలి నిర్లక్షముచే కాబోలు నిప్పుపాలైనవి. కొన్ని చెల్లాచెదురుగా నున్నవి. కొన్ని యెరువు తీసుకొని పోయినవారు, నిగమశర్మ పుణ్యాన మాకేదక్కెనని తామే ఉంచుకున్నవారు శిష్యుల పాట ప్రవచనములు అగిపోయినవి వేలు చెట్లు మొదలైనవన్నీ చేయి వేసినవారి సొత్తులైనవి. మొత్తం పరిస్థితులన్నీ దిగ్భ్రాంతి కరిగించేదిగా ఉన్నాయి. పాఠకులకే హృదయం పిండేసి పరిస్థితి ఆ యింటికి దాపురించింది. ఆ యింటి ఆడు బిడ్డ ఎంత తల్లడిల్లి వుంటుంది.

ఇన్ని అనర్థములకు మూలకారణం నిగమశర్మ కడివెడు పాలల్లో విషబిందువు అనాయాసంగా వంశపారంపర్యంగా వచ్చిన కీర్తి ప్రఖ్యాతుల్ని అందిపుచ్చుకోలేని దౌర్భాగ్యుడు. 'వినాశకాలే విపరీత బుద్ధి' అన్నట్లు జన్మనిచ్చి విద్యాబుద్ధులు గరపి గంపెడాశలు పెట్టుకున్న వృద్ధ తల్లిదండ్రుల పట్ల కనికరం లేదు. చిన్న తమ్ముల పట్ల వాత్సల్యం లేదు. భార్య పట్ల బాధ్యతలేదు. చుక్కానిగా వుండవలసిన వాడు, సకల దుర్గుణ శోభితుడై విచ్చల విడితనానికి పూనుకున్నాడు.

ఇంతటి దుర్భర సన్నివేశమున ఆ యింట కాలుపట్టిన ఆ మగనాలు తానును ఏడ్చువారి కలిసి కన్నీరు గార్చుచూ కూర్చుండలేదు. తన కర్తవ్యమేమిటో గుర్తించింది. అది సుసాధ్యం కాదని తెలుసు, అసాధ్యం మాత్రం కాదని నిర్ణయించుకుంది. థిరచిత్తురాలు, తాను ధైర్యంతో నిలబడి యిరుపది చేతుల పనిచేసి యిరుపది కార్యతో తిరుగుతున్న ఈ ఇంటికి ముక్తిలేదని గ్రహించింది. సమయస్ఫూర్తి గల ఆడుబిడ్డ వచ్చిన వెంటనే సవరించు ప్రయత్నము చేయలేదు. ఆరంభ శూరత్వం ప్రదర్శించలేదు. ఆత్రపు దోషమామె యెరుగును. ఆ యింటి పెద్ద కూతురే అయినప్పటికినీ, పరిస్థితులను సునిశితంగా పరిశీలింపక తొందరపడరాదు. లోతైన నా బలమైన ప్రయత్నం చెయ్యాలి. ప్రయత్నంలో వైఫల్యం చవి చూడవలసిన పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోను దాపురించకూడదు. కావున మౌనముతో కొన్ని దినములు గడిపినది. కళ్ళెపుతాల్లన్ని బిగువుగా చేతుల పట్టుకొనవలెను. ఇంత పెద్ద సంసారము చెడినది. చక్క బెట్టవలయునన్న వెంటనే తన మాటలెవరు విందురు. నేర్పుగా వ్యవహరించాలి. కావుననే వారినీ, వీరినీ కసరి తిట్టక, దుఃఖాన్ని, కోపాన్ని దిగమింగుకొని సహనంతో నిరీక్షిస్తుంది. ఉపదేశములు, ఉపన్యాసముల జోలికి పోలేదు.

మొట్ట మొదట మూలస్తంభముల వంటి ముసలి తల్లిదండ్రులను దేర్ప వయునని తలచినది. 'తీండ్రగుల వచనరచనా చమత్కారంబులు' ప్రయోగించి వారి చింత కొంత తొలగించినది. మాటే కదా అనుకుంటాము. మాట ప్రాణం పోస్తుంది. స్వస్థత చేకూరుస్తుంది. అమృత బిందువులా పనిచేస్తుంది. కొందరి వాక్కుకు ఆ శక్తి ఉంటుంది. 'ఆ చల్లని తల్లి' వాక్ చమత్కృతికా శక్తి ఉంది. తల్లిదండ్రుల మొగములు తెలివి కలిగించినది.. వారికి వలయు ఉపచారములన్నీ తానే చేసింది. భగవదారాధనకు కావలసిన ఏర్పాట్లు చేసి, జరిపించినది. తొంగి చూచి పోటోపు అతిథులను దయచేయుడని పిలిచి ఆదరించినది. తల్లిని రహస్యముగా అడిగి, తమ్ముని చేతికి చిక్కని

మూలధనమున్న చోటు తెలిసికొని మరింత భద్ర పరచినది. నయభయములచేతను, కలుపుగోలు మాటల చేతను, పిల్లలను, పనివారిని అధీనంలోకి తెచ్చుకున్నది. పసువుల కొట్టము చక్కబెట్టి, పాడి వెలయించినది. భర్తను పిలిచి పుస్తక భాండాగారమున కూర్చుండబెట్టి, వారి దుమ్ము దులిపించి, కట్టించింది. యెరువు పోయిన చోటులు తెలిసిరాని ఆ పుస్తకములు తిరిగి తెప్పించినది. శిష్యులు మరల వచ్చి చదువు నంతలు జరువుతానునట్లు ప్రోత్సహించింది. పైరు పంటలు, రైతులపాలుగానీక తన కొడుకులను అప్పుడప్పుడు పంపించి పరిస్థితిని అదువుచేసింది. యజమానులున్నారనిపించింది. మెరుపుతీగవలె అన్నిటా తానై పోరాడి యిల్లు వెలిగించింది. పూర్వపు ప్రకాశాన్ని చాలావరకు తెచ్చింది.

ఇట్లన్నిటను ఆమె జాణతనము సాగినది గాని, తన మరదలిని చూచినపుడేమి చేయవలయునో తోచలేదు, అపాత్ర దానమువలె నిగమశర్మకు భార్య అయినది. వయస్సు చిన్నది, అరుదైన చక్కదనము. కాపురమునకు వచ్చిన నాటి నుండియు మగని మొగమైనను చక్కగా చూచినదో లేదో! ఆమె జీవితము అడవిగాచిన వెన్నెల. తన వారు, నా వారను వారు లేరు. అత్తమామల మనసెరిగి ప్రవర్తించు ధర్మము, కర్మము గల యిల్లాలు. ఆ వేదనా మూర్తిని చూచి హృదయం ద్రవించి సానుభూతి మాటలతో ఊరడించినది. ఇట్టి సహృదయులైన వదినలెందరికుందురు ?

ఇట్లెన్నాళ్లుగడిచెనో చుక్క తెగి పడినట్లు ఒక్కనాడు నిగమశర్మ వచ్చివాలినాడు. అప్పుల వారి వలె, ఆకలి తలదాచుకొనుట సాధ్యము కాదుకదా! ఎన్ని పూటలనుండి వస్తుండెనో ! మధ్యాహ్న భోజన పంక్తికి తండ్రి ముఖము కనబడునని భయము. కనుక మెల్లగ తల్లిని పీడించి చల్లి వంటకము తిని చప్పున తప్పించుక పోదమని వచ్చినాడు. వచ్చిన వెంటనే అక్క ముఖము కనిపించినది. తప్పించుకు పోవు అవకాశము లేదు. ఆ ప్రేమమయి చిరునవ్వు నంకెలలు త్రెంచుకొని పోవుట సాధ్యవడలేదు. నమస్కరించినాడు. తల ఎత్తలేకుండెను.

నమస్కరించిన తమ్ముని కాగలించ బోయి మలిన మైన శరీరాన్ని తాకుటకు మనసురాక మిన్న కున్నది. మనసున గాని, మేనిలో గాని, యింతయు మైల కెన్నడును చోటీయని ఆమెకు అతని స్థితి జుగుప్త కలిగించింది. మనసులో వెగటెల్ల అణచుకొని "సీమంతపుఉ బెండ్లికొడుకువుగ" మ్మని హేతు గర్భితముగ ఆశీర్వదించినది. మొదటి చురకకు గుమ్మడివారుల దొంగవలె దీవెనలో భావము కనుగొన్నాడు. ఇది ఎక్కడి గొడవని ఉపన్యాసములు, ఉపదేశములనుండి తప్పించుకొని పోవలయునని ప్రయత్నించినాడు. ఆమె వేలును చూపకయే హస్తమునే కాదు, మేనెల్ల దిగ మ్రింగగల జాణ. ఆత్రపడి వాని కసహ్యమైన భావమును సూచించి పొరబడితినని ఎరిగినది. వాత్సల్య పూరిత మధురోక్తులతో నిలువరించాలనుకున్నది. "నీ చిన్న మేనల్లుని జూచితివా ? ఇంద" అని సమయస్ఫూర్తితో తన కడగొట్టు కొడుకును చంకకిచ్చినది. వాని ముఖాన కానవచ్చు ఆకలిని పసిగట్టి దీనిని కట్టివేయు బ్రహ్మాస్త్రమిదిరాయని "మీ బావ బంతినారగింతువు గాక, శాఖ పాకంబులు నిముషంబులోనం గావింతు"నని ప్రయోగించినది. మరదలికి కను సన్న చేసి అతడి కాళ్ళు కడిగించినది. ఇక అతడికి ఇన్ని బంగారు త్రాళ్ళ నుండి తప్పించుకొనుట యెట్లు ? తలంటుస్నానము, నూతనవస్త్రధారణము, వెండ్రుకల తడియార్పు, పూల ముడుపు, గంధపు మైపూత, మొదలగు అన్ని ఉపచారములకును మేనాగ్గినాడు. అపురూపముగ మగనికి సేవలు చేయగల్గిన ఇల్లాలు ధన్యురాలననుకున్నది. ఆమె ఆశలు చిగురించినవి.

ఇంతలో పంట పూర్తి చేసి, దేవతలకు బోనాలు పెట్టినది. తల్లిదండ్రులకు కనుసైగచేసి మౌన మంత్రము వేసింది. తన బిడ్డలతో బాటు వారి పంక్తిలో తమ్మునికి చేయార తానే తృప్తిగా పలు రకముల వంటకములు వడ్డించినది. అతడు భుజించిన పిదప, ఎంత చెడినను

వైదికుల యింటి బిడ్డడు కదా, వార్చి యింటి తిన్నెపై కూర్చున్నాడు. భార్య వచ్చి తాంబూలము చుట్టి యిచ్చు చున్నది. అతనికిప్పుడు పదునాల్గు లోకములును చల్లగా, సుఖముగా, నిండు కడుపుతో గానవచ్చు చున్నది. చీవాట్లను, తిట్లను చిరునవ్వుతో స్వీకరింపగల ఉదార హృదయముతో ఉన్నాడు.

అక్క భోజనము ముగించుకొని వచ్చి నెమ్మదిగ అరుగు దగ్గర నిలచి చిట్టడవిగా వున్న వాని తలను చూచి, సీ! యేమిరా యిది! అని ప్రేమ ప్రస్తావనజేసి జుట్టుముడి విడిచి విదలించి తల శుభ్రపరచి ముడి వేసినది. వాత్సల్యముతో ఆలనా, పాలనా చూసి, సముచిత రీతిలో మందలించ వలెనని ఆమె ఆలోచన. అదనెరిగి మరదలు తాంబూలము అందించగా దాసి తెచ్చిన వీరపై కుడి ప్రక్కకు ఓరగిల్లి కూర్చున్నది. ఎడమప్రక్క బిడ్డడు పాలు ద్రావుచున్నాడు. ఈ దీవిని భావించి కవి "పద్మకర్ణికఉ గొలువున పద్మవోలె" నున్నదని కవి పోల్చినాడు. ఆస్తి అంతయు కరిగిపోయిన ఆ యింటిలో మరదలిచే వదినకు పసిమి పసిడి వీవెనతో విసరించు చున్నాడు. వజ్రాల వీవనతో విసరినను ఆ దివ్యమూర్తికి తక్కువయే కదా !

చెప్పవలసిన మాటలు చెప్పుటకింత కంటె మంచి సమయమేది, చాలా తెలివిగా అసలు విషయానికొస్తుంది. "ఏమి నాయనా ! ఎన్నాళ్ళాయెరా మాయూరికి నీవు వచ్చి? ప్రారంభించి యఖండముగా జరుగుచున్న వేదపాఠమునకు విఘ్నమగునని వెరచితివి గదా !" అని తిన్నగా వ్యంగ్య ధోరణిలో దాడికుపక్రమించినది. మదిలో కోపాగ్ని ఎంత అణచి పెట్టుకున్నా తన్ను కాస్తుంది. సాలగ్రామాల గనిలో గులకరాయివలె సముద్రము వంటి ఆ తండ్రి కడుపున ఇట్టి వాడ వెట్లురా పుట్టితివి ? అని ఒక్క మాటుగా కసరి పల్కినది. బ్రహ్మనుండి తమ వరకు మచ్చ వేరెరుగని బ్రాహ్మణ వంశమే ! తల్లిదండ్రులు, ముసలి వారు. తమ్ములు కసుగందులు, నీవింటికి పెద్దకొడుకువు. వారి గతి ఏమి? చేసికొన్న యిల్లాలి దిక్కేమి ? వచ్చి పోవు విద్వాంసుల మన్నించు మాట యేమి ? ఇంటి మర్యాదల కేమి త్రోవ ? నీ ఒక్కని చెడు నడవడిచే యింటి వారందరి శీలము పిల్లి శీలమని, చదువులు చిలుక చదువులని తోడి వారెల్ల నవ్వుచున్నారే ! ఏల యిటు బేలవైతివి ? అన్నా యేల నీకి గుణము ? అని కోపాతిశయంతో పలికినది.

కాని యిది తప్పు దారి. పాపము చేయువారు తిట్లచే నెప్పుడును తమ నడత మానరు. మీదు మిక్కిలి తిరగబడుదురు. వెనుక గురు జనము శిక్షించినపుడు వారి కిదే మర్యాద జరిగినది. ఆమె వచ్చిన పని వానిని దారికి తెచ్చుట కాని, తన కడుపు కసిదీర నాలుగు తిట్లు తిట్టి మరలి పోవుటకు గాదు. అది ఉదాసీనులు, అజ్ఞానులు చేయుపని, హితకాంక్షులు చేయునది కాదు. ఆమెకావిషయం బహుబాగుగా తెలియును. అలుక దిగమింగుకొన్నది, స్వరము మార్చినది, సామరస్యము వెలిబుచ్చినది. "భారతమునకు నివలె నీవే యీ యింటికి ఆధారము. నీవు లేనిది కథ నడువదు." అని అతని పౌరుషమున కన్వయించి పురికొల్పినది. "నీవు యజ్ఞము చేయగా వేదికను నే నలంకరించి సుమంగళి పూజలందుదునని గంపెడాశతో వేయి మందితో చెప్పుకొన్నానే! నా ఆశలు త్రెంచితివే అని సౌభ్రాత్రత్వమును చూపి కన్నీరు పెట్టుకొనబోయినది. కామవికారము బలమై యుండెనేని, రూప, గుణ, కుల, శీలములు గల్గు బ్రాహ్మణకన్యలను వేయి మందినైనను పెండ్లాడరాదా! బ్రాహ్మణ గృహస్థునికి బహుపత్నీ వ్రతము తప్పని ఎవరు చెప్పగలరు ? ఈ పాడు వారకాంతల వ్యవహారము నీ కెందుకు ? వారి దోపిళ్ళకు ఎంతటి వారైనను తట్టుకొనజాలరే ! ఇంక బావన సంసారులము మన గతియేమి? అని తీవ్రమైన వ్యావహారిక దృష్టితో వాదించినది. 'వ్రతం చెడ్డా ఫలం దక్కాలని' కాబోలు ఆమె ఆలోచన.

ఇంకనూ ఈ విధంగా అంటుంది. "అదియుబోనీ చేతినున్న డబ్బు మాత్రము తెలివితో వెచ్చించి యూర కుంటివా ? అట్టియుండిన నాకింత దుఃఖముండదే!

ముక్కారుంబండు నఖండ సేతు వ్యక్తములో కాశ్మీర ఖండంపుఉ గేదారముల్ తెగనమ్మితివే! నీకేమి భార్య లేదా? బిడ్డలు పుట్టరా ! వెన్నంటి పుట్టిన తమ్ములు లేదా ! ఇట్లు కుల ధ్వంసంబు చేయుదురా యెవరైన" అని తన వారి తప్పులను క్షమించి సరిపుచ్చుకోగల స్త్రీ హృదయ మార్దవమును వెలువరచి అధర్మము చేసినను అవివేకముగా చేయరాదను సామాన్య న్యాయమును చాటి చెప్పినది. వేశ్యాజనుల వంకర టింకరలన్నియు వాని గుండెకు గుచ్చుకొనునట్లు చెప్పినది. కడకు వాని చేతిలో చేయి వేసి "చేయి మీఉదుగా నడచిన పూర్ణకాముడవే ! నా తమ్ముడవే నీకి బికారితనమేల? వలదు. నాయనా ! ఇంకనైన వదలు తండ్రి" అని దీన దీనముగా వేడుకొన్నది. "నీకు గావలసినా హరి కాస్తుభమైన దెచ్చెదనని ధీర ధీరముగా ప్రతిజ్ఞ చేసినది. తమ్ముని ఎలాగైన దారికి తేవలెనన్న తపనతో పరి పరి విధాల చెప్పింది.

'ఆరిపోబెయే దీపం దేదీప్యమానంగా వెలిగినట్లు' అక్క సద్బుద్ధి మాటలాదరించి నిగమ శర్మ నాల్గునాళ్ళింటిలో వివేకము తెచ్చుకున్న వానివలె ఉన్నాడు. ఆమె ఉ పదేశములన్నీ బూడిదలో పోసిన పన్నీరైనవి. అవేవీ అతని మనస్సుకెక్కలేదు. చెవిటి వాని ముందు శంఖం ఊదినట్లయ్యింది. అదృష్టం అందలం ఎక్కిస్తానంటే బుద్ధి బురదగుంటలోకి పోతానందట. ఒక నాటి రాత్రి చేతికి దొరికిన యించి సొమ్మునెల్ల మూటగట్టుకొని పారిపోయాడు. అక్కకు కాళ్ళక్రింద భూమి కంపించినట్లయ్యింది. యింట అందరూ ఏడ్డారు. వారితో పాటు అక్కా ఏడ్చింది. "చెట్టంత తమ్ముడు శాశ్వతంగా చెడిపోయినందుకు ఏడ్చింది." కాని రామలింగకవికి 'ఒళ్ళంతా వెటకారమే కదా!

ఆమె ఏడుపుకు కారణం తమ్ముడు చెడెనేయని కాదట, ఇల్లు మునిగెనేయని కాదట, తన ప్రయత్నం వ్యర్థమాయనే యనియూ గాదట, క్రొత్తగా చేయించుకున్న ముక్కెర పోయెనేయని విపరీతంగా ఏడ్చిందట. రాళ్లపల్లి వారన్నట్లు పరిహాసము పవిత్ర వస్తువునుగూడ గమనింపదేమో!

నిగమశర్మయొక్క పాత్ర ప్రాణం పోసుకుని, రూపుదాల్చి వస్తే, నంది తిమ్మన గారు రాలదన్నగా మిగిలిన పళ్ళు ఊడగొట్టక మానునా! అనువారు లేకపోలేదు. "కడవంత కూష్మాండము కత్తిపీటకు లోకువయే కదా?

ఆధార గ్రంధాలు

1. పాండురంగ మహత్మ్యము – తెనాలి రామకృష్ణుడు

ముస్లిం మైనార్టీల కథలు సాంస్కృతిక అంశాల పరిశీలన

మహ్మద్ నౌరీన్, తెలుగు అధ్యాపకురాలు, TSWRDC (W) ఆదిలాబాద్ మరియు పరిశోధక విద్యార్థిని,
ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్. సెల్ : 9110385329, 9030112510

పరిచయం :

భారత్‌లో ముస్లింల జనాభా 17.2 కోట్లు. ఇది స్పెయిన్, ఇటలీ, బ్రిటన్‌ల మొత్తం జనాభాతో సమానం. ప్రపంచంలో అత్యధిక ముస్లింలు జీవించే దేశాల్లో భారత్‌ది మూడోస్థానం. భారత్‌కు చెందిన ముస్లింలలో కనిపించే వైవిధ్యం మరే దేశంలోని ముస్లింలలోనూ కనిపించదు.

గత 1400 ఏళ్ళలో భారతీయ ముస్లింలు దేశంలోని అన్ని రంగాల్లోనూ ఉమ్మడి చరిత్రలో భాగమై జీవించారు. ప్రపంచంలోని ముస్లింలంతా ఒకటే అని ఇస్లాం భావిస్తుంది. అంటే దీనిని పాటించే వాళ్ళంతా ఒకటే అని అర్థం. కానీ భారతీయ ముస్లింలు వేర్వేరు శాఖలుగా చీలిపోవడాన్ని చూస్తే అది ఇస్లాం మౌళిక సూత్రాలకే భిన్నంగా కనిపిస్తుంది. భారత్‌లో ముస్లింలు, సున్నీలు, షియాలు, బోహ్రాలు, అహ్మదియా ఇంకా మరెన్నో శాఖలుగా చీలిపోయారు. ముస్లిం మత గురువులు ఈ విషయాన్ని అస్సలు ఒప్పుకోరు కానీ, వాస్తవం ఏంటంటే, భారత్‌లో ముస్లింలు కూడా హిందువుల్లాగే, సామాజిక కులాలుగా చీలిపోయి ఉన్నారు. అగ్ర కులాల్ని అష్రఫ్ అని, మధ్య కులాల్ని అజ్లాఫ్ అని పిలువగా, అట్టడుగున ఉన్న వారి అల్జార్ అని పిలుస్తారు. వీరిలో కులాల వారీగా విభిన్నమైన సంస్కృతి కలిగి ఉంటారు.

ఈ క్రింది ముస్లిం సాంస్కృతిక అంశాల ఆధారంగా ముస్లిం సాంస్కృతిక నేపథ్య కథలను పరిశీలిద్దాం.

1. భాష, సాహిత్యం
2. ముస్లిం ఆచారాలు, సాంప్రదాయాలు
3. పండుగలు, పర్వాలు
4. వివాహ పద్ధతులు
5. మత విశ్వాసాలు
6. విధులు

ముస్లిం భాష, సాహిత్యం :

ముస్లింల సాంస్కృతిక అంశాలలో వారి భాష ఒకటిగా చెప్పవచ్చు. ప్రారంభ దశలో ఇస్లామీయ భాషా సాహిత్యాలు మహమ్మద్ ప్రవక్త యొక్క మక్కా, మదీనాలలో గల తెగల మాతృభాషయుయిన అరబ్బీ భాష వుండేది. తదనుగుణంగానే ధార్మిక సాహిత్యాలుగా ఖురాన్, హదీసులు, నీరత్ (పీరా), ఫిఖమ్, అరబ్బీ భాషలోనే వుండేవి. ఉమయ్యద్ ఖలీఫాల కాలంలో మత రహిత సాహిత్యాలు ఊపిరి పోసుకొన్నవి. వెయిన్నోక్కదారులు అలీఫ్‌లైలా కథలు ఈ కోవకు చెందినవే.

అబ్బానీయ ఖలీఫాల పరిపాలనా కాలంలో పర్షియన్ (పారళీ, పారశీకం) భాష ముస్లిం సంస్కృతి యొక్క ప్రధానమైన భాషగా విరాజిల్లింది. పర్షియన్ సాహిత్యం ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది అని చెప్పవచ్చు. రూమి (మౌలానా రూమ్) యొక్క ప్రఖ్యాత కవితాకోశం 'విహంగాల సభ' ఎంతో ప్రఖ్యాతిగాంచింది. దక్షిణాసియాలో ప్రముఖంగా ఉర్దూ, హిందీ, బెంగాలీ, ఇతర భారతీయ భాషలలో ఇస్లామీయ సాహిత్యాలు అభివృద్ధి చెందినవి. సూఫీ సాహిత్యాలు ప్రముఖ పాత్రను పోషించాయి, పోషిస్తూనే ఉన్నాయి.

1980 తరువాత వచ్చిన ఆధునిక ముస్లిం భావజాలాన్ని పుచ్చుకొని ముస్లింల సమస్యల్ని మతం కోణం నుండి కాకుండా సాంస్కృతిక, సాంఘిక, రాజకీయ, ఆర్థిక భాషా కోణాల నుండి ఏ ఒక్క నాటకంగాని, నాటికగానీ రాలేదు. ఈ ముస్లిం దృక్పథం కవిత్వంలో, కథో వచ్చినంత

ఉధృతంగా మిగిలిన ప్రక్రియలలో లేదనే చెప్పాలి.

మొదట్నుంచి తెలుగు ముస్లిం కవులు మెజారిటీ సాంస్కృతిక విలువలనే అనుసరిస్తూ వచ్చారు. మెజారటీ భాషనే వ్యక్తీకరణ సాధనంగా స్వీకరించారు. అంటే తమది కాని భాషా వ్యవస్థలో, కళాసాహిత్య రూపాలలో ఒదిగి వచ్చారు. ఈ సర్దుబాటే ముస్లిం కవులలో సంఘర్షణకి దారి తీసింది.

ముస్లిం సాహితీకారులు ఉపయోగించిన వాడుక భాషా పదాలు, ప్రతీకలు, పద చిత్రాలు, ఉర్దూ భాష నెగిటివిటోంచే వచ్చాయి. పాజిటివ్ అంశాలను నెగిటివ్ క్యాపబిలిటీలో వ్యక్తీకరించే రూప విధానంలో పరాకాష్టకు చేరుకున్న సందర్భాలు కూడా ఈ సాహిత్యంలో కనిపిస్తాయి. ముస్లిం సాహితీకారులు మొదట్లోనే తమ భావ వ్యక్తీకరణకు భాష సరిపోవడం లేదన్న విషయాన్ని గుర్తించారు. భాషలో కృత్రిమత్వాన్ని నిరాకరించి వ్యతిరేకిస్తున్న ఒక దశలో సాహిత్య భాషకీ, సాధారణ భాషకీ అంతరం వుండకూడదని భావించారు. ఫలితంగా కొత్త భాషా వ్యవస్థని ఏర్పరుచుకునే ప్రయత్నం వాళ్ళలో మొదలయింది.

అనాదిగా మానవుడు తన సుఖదు:ఖాలని వ్యక్తం చేయడానికి అనేక ప్రయత్నాలు చేస్తూ వచ్చాడు. ఈ అభివ్యక్తీకరణ ప్రయత్నానికి భాష ప్రధాన సాధనం. నిజానికి నిర్ణీత సాంస్కృతిక లేకుండా చేయడం అన్నది దుస్సాధ్యం. అదే సాహిత్యం మారినప్పుడు భాషలో మార్పు రావడానికి గల కారణం. అందువల్లే సాధారణంగా వ్యక్తికీ వ్యక్తికీ మధ్య కొంచెం భేదం వున్నట్లే అతని భాషలోనూ, అభివ్యక్తిలోనూ కొంత వైశిష్ట్యం వుండనే వుంటుంది.

ఒక సాహిత్యకారుడు తాను ఏ సాంస్కృతిక సామాజిక సందర్భం నుంచి వచ్చాడో ఆ నిర్ణీత సామాజిక, సాంస్కృతిక నేపధ్య ప్రభావం సాహిత్యంలో తప్పకుండా ఉంటుంది. ఈ దశలో ముస్లిం సాహిత్యంలోకి నూతన పదజాలం పుంఖానుపుంఖాలుగా రావడానికి వీలైంది. దళిత సాహిత్యకారులు తమ వృత్తులకు, సంస్కృతికి సంబంధించిన పదజాలాన్ని సాహిత్యంలో ఉపయోగించినట్లే, ముస్లిం సాహితీకారులు తమతమ సంప్రదాయాలకు, సంస్కృతికి సంబంధించిన అనేక ఉర్దూ, అరబ్బీ పదాలను ప్రయోగించారు. అక్కడక్కడ పారశీలక మాటలూ లేకపోలేదు. ఇంకా నఖాబ్, షరియత్, ఫరిస్తా, ముర్ధారీ, మఖ్రూ, ఇఫ్తార్, మెజిజా, మజ్మా, మోమిక, ఫాస్లా వంటి అనేక పారభాషిక పదాలు ఇస్లాం సంస్కృతిని పరిచయం చేస్తాయి. జన్నత్, బోజఖ్ లాంటి సామాన్య పదాలకు స్వర్గనరకాలనే తెలుగు పదాలను ప్రయోగించకపోవడం గమనార్హం. ముస్లిం రచయితలు ఇస్లాం మత సాంస్కృతిక ప్రతీకలనే గ్రహించి తమ వాదానికి, తమ సాహిత్యానికి అనుకూలంగా ప్రయోగించడం విశేషం.

ముస్లింల జీవితానుభవాలే ముస్లిం సాహిత్యానికి ముడిసరుకు. వారి సాహిత్య సృజనకు కావలసిన ముడిసరుకంతా వాళ్ళ దైనందిన జీవితాల నుండి ఏరుకుంటున్నారు. అలంకారాది లక్షణ గ్రంధాల నుండి కాక, జీవితం నేర్పిన అనుభవాల పాఠాల నుండి ముస్లిం రచయితలు భాషను సమకూర్చుకుని ముస్లిం సాహిత్యానికి జీవాన్నిస్తున్నారు.

ముస్లింల ఆచారాలు, సాంప్రదాయాలు :

తెలుగు సాహిత్యాన్ని అనుసరిస్తూ సాహిత్యములో అన్ని ప్రక్రియల్లో ముస్లిం రచయితలు తమ రచనలు వ్రాసి ముస్లిం జీవితమును ప్రపంచానికి తెలియజేప్పారు అని చెప్పవచ్చు. కథల్లో ముస్లిం జీవితం, వాతావరణం, భాష, సంస్కృతి, ఆచార వ్యవహారాల్ని భవిష్యత్ రచయితలకు, మొత్తంగా సాహిత్యానికి కొత్త వెలుగును అందించాయి. ముస్లిం ఆచారాలు, సాంప్రదాయాలను తెలుపు కథలను పరిశీలిద్దాం.

ఇతివృత్తం :

పర్దా కథను ఎస్.వి.హమీద్ అలీ వ్రాశారు. ఈ కథలో మాతృభాష తెలుగయినా పాత హిందీ పాటలంటే చెవి

కోసుకుంటారు శర్మగారు. ఒకే స్కూలులో శర్మ గారు సోషల్ సబ్జెక్టూ, యూసుఫ్ గారు ఉర్దూ సబ్జెక్టూ బోధిస్తారు. ముస్లిం సాంస్కృతిని తెలుసుకోవాలని శర్మ గారికి ఆత్రుతగా ఉంటుంది. అందుకే యూసుఫ్ శర్మ గారికి తెలుగులో ఉన్న ఖురాన్‌ను తీసుకొని వచ్చి ఇస్తారు. శర్మ గారు, యూసుఫ్‌ల మధ్య స్నేహం పెరిగింది. యూసుఫ్ ఇంటికి శర్మ గారు వెళ్ళినప్పుడు యూసుఫ్ ఇళ్ళు ముస్లిం సంస్కృతిని దర్శనమిచ్చే విధముగా ఉన్నది. యూసుఫ్ భార్యకు రెండు 'ఛాయ్' తీసుకొని రమ్మని లోపలున్న భార్యకి వినపడేలా గట్టిగా చెప్పి శర్మగారికి ఎదురుగా సోఫాలో కూర్చున్నారు. భార్య టీ కప్పు సాసర్లూ కర్టెన్ లోపల నుంచే భార్య దగ్గి పిలువగా యూసుఫ్ తీసుకొని వచ్చి శర్మ గారికి ఇస్తాడు. ఆ టీ తాగిన వెంటనే శర్మ గారికి ఆ రుచి, సువసనా ఒక్కసారిగా విదేశాల్లో ఉన్న తన అక్క చేతి టీని జ్ఞప్తికి తెచ్చారు. శర్మ గారికి యూసుఫ్ గారిల్లూ, ఆ వాతావరణం చూసిన తర్వాత ఆయనలో చాలా ఆలోచనలు రేకెత్తాయి. ఇస్లాంలో ఎంతో క్రమశిక్షణ కలిగిన జీవితం ఉందనిపించింది. శర్మ గారికి ముస్లిం సంస్కృతిపై గౌరవం ఇంకా పెరిగింది.

ఎత్తుగడ :

పర్దా కథ 'పరదేమే రహనేదో పరదా న ఉఠావ్' (344) చాలా పాత హిందీ పాట అత్యాధునిక హిందీ ఛానల్లో వినిపిస్తోంది అనే ఎత్తుగడతో కథ మొదలైంది.

పాత్ర చిత్రీకరణ :

పర్దా కథలో శర్మ గారు, యూసుఫ్ పాత్రను ఎస్.వి. హమీద్ అలీ చాలా బాగా చిత్రీకరించారు. శర్మ గారు యూసుఫ్ ఇంటిని సందర్శించినప్పుడు అక్కడి వాతావరణం చూసిన తర్వాత ఆయనలో చాలా ఆలోచనలు రేకెత్తాయి. యూసుఫ్, శర్మల మధ్య స్నేహ బంధము చాలా అద్భుతముగా చిత్రించారు రచయిత గారు.

సన్నివేశ చిత్రణ :

పర్దా కథలో యూసుఫ్ తన భార్యకు టీ తీసుకురమ్మని అన్నప్పుడు తను టీ తీసుకొని వచ్చి కర్టెన్ వెనుక నుండే భర్త చేతికి అందించిన తీరు శర్మ గారికి ముస్లిం సంస్కృతిపై, ముస్లింల క్రమశిక్షణ, వాతావరణంపై ఆశ్చర్యాన్ని, ముస్లింలపై, ఇస్లామిక్ పద్ధతులపై గౌరవం పెరిగింది.

ముస్లిం పండుగలు, పర్వాలు :

ముస్లిం పండుగలలో రంజాన్, బక్రీద్ ప్రధానమైనవి మరియు విశిష్టమైనవి. ఈ పండుగల యొక్క విశిష్టతను తెలుపుటకు ముస్లిం కథకులు అద్భుతమైన కథలను వ్రాశారు.

ఇతివృత్తం :

బారహమతుల్లా గారు వ్రాసిన కథ 'చాంద్‌కి ఈద్' (39) (బహెన్ కథ సంపుటి). ఈ కథలో రంజాన్ పండుగ ప్రాముఖ్యతను, ఈ పండుగ వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం ఏ విధముగా కలుగుతుందో వర్ణించారు.

ఎత్తుగడ :

'చాంద్‌కి ఈద్' అనే కథ "రంజాన్ కా చాంద్ కోసం కోట్లాది ముస్లిములు ఆకాశాన్ని తరచి తరచి చూస్తున్నారు" అనే ఎత్తుగడతో మొదలైంది.

పాత్ర చిత్రణ :

'చాంద్‌కి ఈద్' కథలో "హుస్సేన్ సాహెబ్" మసీదు వెళ్ళే మనిషి కాదు. నమాజు చదివే అలవాటు లేదు. ముస్లిం మతంలో పుట్టినందున ముస్లిం అయ్యాడు. కానీ అతని కొడుకు అమీర్ మాత్రం అల్లా విశ్వాసి. పిల్లల్తో, తల్లిదండ్రులు సన్నిహితంగా, ఆత్మీయంగా, నిత్యం కొంత సమయమున్నా గడపకపోతే వాళ్ళు మానసిక రోగులుగా తయారవుతారని ఎవరో వైద్యుడు రాస్తే చదివాడు. రెండవది, పిల్లలకు తల్లిదండ్రులు ఇవ్వగలిగే మంచి బహుమానం ఏమంటే మంచి అనుభూతి కలిగించే వాతావరణంతో వాళ్ళను అనుసంధానం చేయడం అని హుస్సేన్ సాహెబ్ అభిప్రాయం. అందుకు రంజాన్ పండుగ మంచి అవకాశం. ఎందుకంటే అదో మహా అద్భుతం. నెలరోజుల ఉత్సవం.

రంజాన్ మాసంలో ఆకాశం నుంచి ఖురాను గ్రంథం భూమ్మీదికి దిగింది. అది ఇన్‌సాని కితాబ్ కాదు, ఆస్‌మాని కితాబ్ (దైవ గ్రంథం). ఖురాన్ భూమ్మీద అవతరించిన సంబరమే ఈ "ఈద్ పండుగ" ఎంతో మితంగా తింటూ మరెంతో అపరిమితంగా అల్లా చింతన చేయడం రంజాన్. పగలంతా కనీసం ఉమ్మి కూడా మింగరాదు. సంపాదించిన ఆస్తుల్నించి, ఆదాయల్నుంచి కొంతన్నా దానధర్మాలు చేయడం, రంజాన్ హలీంలు తిని, షీర్‌ఖుర్మా తాగి, ఈద్ ముబారక్ చెప్పుకోవడం రంజాన్ కాదు. సరియైన జ్ఞానం ప్రేమతో కలిపి ఇచ్చుకుంటూ పోతే పిల్లలు నిజమైన మనుషులుగా, మహాశక్తిమంతులుగా తయారవుతారని అతని నమ్మకం.

సన్నివేశ చిత్రణ :

హుస్సేన్ సాహెబ్ తన కొడుకు తల తన వైపు తిప్పి అన్నాడు. "అది సరేగానీ, నీకో చిన్న కథ చెబుతాను. విను "చాంద్, సూరజ్‌ల పుట్టుక గురించి మా అమ్మ ఆగమ్మ – అదే, మీ దాది అమ్మా చిన్నప్పుడు ఒక కథ చెబుతుండేది. సూర్యచంద్రులు స్వయానా అన్నదమ్ములంట. ఎవరో పిలిస్తే ఏదో దావత్‌కు పోయినారంట. సూర్యుడు మెత్తటి మాంసం ముక్కలు తను తిని, మిగిలిపోయిన బొక్కలు జేబులో వేసుకొని అమ్మకోసం తెచ్చినాడంట. చంద్రుడేమో బొక్కలు తను తిని మెత్తటి ముక్కలు మూటగట్టుకుని అమ్మకోసం తెచ్చినాడంట. అందుకే సూరజ్‌ను మలమలమాడుతూ ఎప్పటికీ ఎండల్లో చస్తూ జనం చేత తిట్లు తింటూ బతుకు అని వాళ్ళమ్మ తిట్టిందట. చాంద్‌నేమో చల్లచల్లగా వెన్నెల్లో విహరిస్తూ అద్భుతంగా వెలిగిపోతూ బతుకు బేటా అని దీవించిందంట – అనే నీతి కథను చాలా అద్భుతంగా చెప్పాడు తన కొడుక్కి హుస్సేన్ సాహెబ్.

ముస్లింల వివాహ పద్ధతులు :

ముస్లిం వివాహాన్ని నిఖా అంటారు. వివాహం అనేది ఒక పవిత్రమైన బంధం అని ఇస్లాం నమ్ముతుంది. అయితే మహమ్మదీయ ధర్మశాస్త్రం ప్రకారం వివాహం అనేది ఒక చట్టబద్దమైన ఒప్పందం. వధూవరుల్లో ఒక ప్రతిపాదన చేయగా రెండవ వారు ఆమోదిస్తారు. "నేను నిన్ను వివాహం చేసుకుంటాను", "నేను అంగీకరిస్తున్నాను (ఖుబూల్ హై)" అనడంతో వివాహం జరిగినట్లే దీనినే నిఖా అంటారు.

వివాహం అయినప్పటి నుండి భార్య భర్తపట్ల విశ్వాసంతో ప్రవర్తించాలి. విడాకులు ఇచ్చిన తరువాత లేదా భర్త మరణాంనంతరం ఆమె ఇద్దతో గడువును పాటించాలి. భర్త సముచితమైన ఆజ్ఞలను పాటించాలి. భర్త వెన్నంటే వుండాలి. భర్త వదిలేసిన (లేదా) భర్తను కోల్పోయిన స్త్రీని మరొకరికిచ్చి పెళ్ళి చేయాలి.

షేక్ సత్యాగ్ని గారు ముస్లిం స్త్రీలపై నిఖా పేరుతో జరిగే అన్యాయాలను ప్రశ్నిస్తూ ఖులా, హలాలా వంటి అద్భుత కథలను వ్రాశారు.

ముస్లిం మత విశ్వాసాలు :

మతదృష్టి – ప్రపంచ ప్రసిద్ధ మతాలలో ముస్లిం మతం ఒకటి. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మతాలకు పేర్లు వాటికి సంబంధించిన వ్యక్తుల పేర్లతో, మతస్థాపకులైన ప్రవక్తల పేర్లతో, జాతుల పేర్లతో వ్యవహార యోగ్యమయ్యాయి.

మహమ్మద్ ప్రవక్త ద్వారా వ్యాప్తి చెందిన మతం మాత్రం మహమ్మదీయ మతమని ప్రసిద్ధి చెందలేదు. ఆ విధంగా పిలవటానికి ప్రవక్త విముఖత చూపినారు. ఆ దేవుని ఆదేశానుసారం ప్రచారం పొందిన మతం కాబట్టి ఇస్లాం మతంగా పిలువబడింది.

ఇస్లాం అనే పదం అరబ్బీ భాషాపదం. ఈ పదానికి శరణం, శాంతి అని రెండర్థాలు. దేవునికి విధేయులై అతని ఆజ్ఞలను శిరసావహించటం ఇస్లాం మత మూలార్థం. మైత్రీ, శాంతి, నిష్కల్మషం ఇస్లాం మతానికి మూలధర్మాలు. ఇస్లాం మతంలో మానవుడు తనకు తాను దైవానికి అంకితమైపోవాలి. తనకున్న సర్వస్వాతంత్ర్యాధికారాలను త్యజించి భగవంతునికి విధేయుడై వుండాలి.

విశ్వాసాలు :

ఇస్లాం మతంలో ఐదు విశ్వాసాలున్నాయి. 'లాఇలాహ ఇల్లల్లా' భగవంతుడు ఒక్కడేనని, అతడే అల్లా అని, అతడు తప్ప వేరే ఆరాధ్యదైవం లేదని ఇస్లాం మతం వక్కాణిస్తుంది. ఇదే ఇస్లాం మత మూల సూత్రం.

మహమ్మద్ ప్రవక్తకు పూర్వం వచ్చిన ప్రవక్తలందరినీ విశ్వసించడం రెండో విశ్వాసం. వీరు అబ్రహాం (ఇబ్రాహీం), యోసెన్ (మూసా), జీజుస్ (ఈసా) మొదలైన ప్రవక్తలెందరో ఉన్నారు. మానవాళిని సన్మార్గంలో నడిపించడానికి భగవంతుడు ప్రవక్తల ద్వారా అందించిన ధర్మ గ్రంథాలను విశ్వసించడం ఇస్లాం మతంలోని మూడో విశ్వాసం. మానవులకు కన్పించకుండా భగవంతుని ఆజ్ఞలను పాటించే దేవదూతలున్నారు. అలాంటి దేవదూతలందు విశ్వాసం ఉంచడం ఇస్లాంలోని నాలుగో విశ్వాసం. ఈ చరాచర ప్రపంచంలో చేసిన కర్మలకు భగవంతుడి సముఖంలో ఒక రోజు ఫలితాన్ని అనుభవించక తప్పదు. అదే తీర్పు జరిగే తుది దినం మానవుడు ఆచరించిన పాప పుణ్యాలపై స్వర్గనరకాల ప్రాప్తి ఆధారపడి వుంటుందని విశ్వసించడం ఐదో విశ్వాసం.

ముస్లింల విధులు :

'లా ఇలా: ఇల్లలా: మహమ్మదుర్ రుసూలల్లా' – అల్లా తప్ప వేరే ఆరాధ్య దేవుడు లేడు. ముహమ్మద్ ప్రవక్తగా పంపబడ్డారు అని విశ్వసించి జపించాలి. ఈ వాక్యం ఒక్క పూర్వభాగం దేవుని ఏకత్వాన్ని నిరూపించి ఉత్తరభాగం ప్రవక్త మహమ్మదు గారి పదవిని నిర్ధారిస్తుంది.

ముస్లింల ఆచరణ విధానాలలో నమాజు ముఖ్యమైంది. భగవంతుని ప్రీత్యర్థం కనీసం రోజుకు ఐదు పర్యాయాలు నమాజు చేయాలి. నమాజు చేయడానికి వస్త్రాల పరిశుభ్రతతోపాటు దేహ పరిశుభ్రత, పరిసరాల పరిశుబ్రధత అవసరం. ముస్లిం మతంలో ఉపవాసమాచరిండం విధిగా నిర్ణయించబడింది. పవిత్ర ఖురాను ఆవిష్కృతమైన రంజాన్ మాసమంతా ఉపవానం ఆచరించాలని ముస్లింలకు ఆదేశించబడింది. అరబ్బీ భాషలో ఉపవాసాన్ని 'హీం' అంటారు. ఐరక ఉండటం అని దాని అర్థం. సహనం, స్థిరత్వం అనేది పర్యాయపదాలు. రంజాన్ శబ్దం 'రమ్జ్' అనే ధాతువు నుంచి ఉత్పన్నమైంది. రమ్జ్ అంటే కాట, తపించు అని అర్థం. సాధకులు శరీరాన్ని శుష్కిపజేయటం వల్ల పొట్టను మాడ్చటం వల్ల ఈ మాసానికి రంజాన్ రంజాన్ అనే పేరు సార్థకమైంది. రంజాన్ నెలరోజులు ముస్లింలు విధిగా ఉపవసిస్తారు.

జకాత్ అంటే విధిగా దానం చేయటం ముస్లింలు అనుకున్న నికరాదాయం నుంచి నూటికి రెండున్న వంతున జకాల్ అనే దానాన్ని విధిగా చేయాలి. తిండి, బట్టల్లేని నిరుపేదలకు సాయపడటం, అనాధలకు వితంతువులకు, శక్తిహీనులకు తోడ్పడటం మొదలైన సద్గుణాలు దీనవల్ల అలవడుతాయి.

ముస్లింలకు పవిత్ర పుణ్యక్షేత్రం అరేబియా దేశంలోని మక్కా నగరం. మక్కా నగరంలోని కాబా మసీదు దర్శనం ముస్లింల పవిత్ర కర్తవ్యంగా విధించబడింది. సంపూర్ణ ఆరోగ్య ఐశ్వర్యాలున్న ముస్లింలు వారి జీవిత కాలంలో ఒక్క పర్యాయం మక్కాను దర్శించటం విధిగా నిర్ణయించబడింది. స్త్రీ, పురుషులు మాత్రకర్హులే. ముస్లింల కాలమానం ప్రకారం "జిల్ – హజ్" మాసం 8వ రోజు మక్కాలో ఈ ఉత్సవం ప్రారంభమై 12వ రోజుతో ముగుస్తుంది.

ముగింపు :

ముస్లిం రచయితలు రచించిన కథల్లో వస్తువులు. వీటిలో కరుణ రసమే తప్ప ఎక్కడా ఆగ్రహం, ఆవేశాలు వుండవు. దయనీయమైన యదార్థ చిత్రణ, ఆ వర్గాలలో హీనత్వం కథలన్నిటా పరచుకొని వుంటుంది.

ఆధార గ్రంథాలు :

1. వత్ ముస్లిం కథలు – స్కైబాబ – 2018, హైదరాబాద్
2. బహెన్ కథలు – బారహమతుల్లా – 2014, హైదరాబాద్
3. దర్గామిట్ట కథలు – మహమ్మద్ ఖదీర్‌బాబు – 1999, హైదరాబాద్.
4. సత్యాగ్ని కథలు – షేక్ హుసేన్ సత్యాగ్ని – 2015, హైదరాబాద్.
5. జుమ్మ – వేంపల్లి షరీఫ్ – 2011, హైదరాబాద్.

చారిత్రక నవల – 'కన్నగి'– ఇతివృత్త పరిశీలన

డా॥ కుమ్మెత లక్ష్మీనారాయణరెడ్డి, తెలుగుశాఖ, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, నెల్లూరు,
చరవాణి: 9959710078.

పరిచయం:

తమిళంలో వెలువబడిన మొట్టమొదటి మహాకావ్యం "శిలప్పాదిగారం". ఈ కావ్యాన్ని మహాకవి 'ఇళంగోవడిగళ్' అనే రాజకవి రచించాడు. 'శిలప్పాదిగారం'లో 1652 పద్యాలున్నాయి. ఈ కావ్యం క్రీ.శ. 2వ శతాబ్దినాటి సంఘ జీవనాన్ని ప్రతిబింబిస్తుంది. 'శిలప్పాదిగారం'లో కావ్యనాయిక 'కన్నగి'. కన్నగి భర్త కోవలన్ వ్యాపారి. వేశ్యాలోలుడై అంతా పోగొట్టకొని ఇంటికి వస్తాడు. కన్నీళ్లతో కన్నగి భక్తకు స్వాగతం పలుకుతుంది. చెడిపోయి ఆస్తి పోగొట్టకొని స్వంత గ్రామంలో తలెత్తుకొని తిరగలేకపోతాడు. మధురా నగరానికి వెళ్లి, తన భార్య కాలి అందెలు అమ్మగా వచ్చిన డబ్బుతో వ్యాపారం చేసి ధనవంతుడు కావాలని భావిస్తాడు. తన భార్య కాలి అందెను అమ్మబోయి, మధురానగరంలో ఒక అగసాలె (కంసాలి) మోసానికి గురై రాజ సైనికుల శిరచ్ఛేదనతో కన్ను మూస్తాడు. భర్తను కోల్పోయిన 'కన్నగి' ఉగ్రరూపిణి అయి శపించగా నగరం అగ్ని కీలలకు ఆహుతి అవుతుంది. రాజు, అగసాలె (కంసాలి), ద్రోహులందరూ చనిపోతారు. 'కన్నగి' వేదనను తట్టుకోలేక చేరదేశంలో ఒక అడవిలోని కొండపై నుంచి దూకి మరణిస్తుంది. ఇది హృదయ విదారకమైన ఓ పతివ్రతకథ. ఇలా కన్నగి చోళదేశంలో జన్మించి, పాండ్య దేశంలో ప్రాతివ్రత్యాన్ని వెలయించి, చేర (కేరళ) దేశంలో మరణించింది.

ఇతివృత్తం:

శిలప్పాదిగారం కథ ఆధారంగానే పాలాది లక్ష్మీకాంతం శ్రేష్ఠి తెలుగులో "కన్నగి" అనే చారిత్రక నవల రచించాడు. ఈ నవలలో "మనైక్కన్" వైశ్యకుటుంబమున జన్మించిన నౌకావ్యాపారి. విదేశీ వ్యాపారాల్లో లబ్ధ ప్రతిష్ముడు. పరిపాలనలో రాజుకు సహాయపడేవాడు. రాజుతో తమ సమస్యలు, దేశ సమస్యలు చర్చించేవాడు. ఆయన సభా భవనంలోకి ఒక మహా పురుషుడు ప్రవేశించాడు. ఒకచేత కమండలం, మరొక చేత మంత్ర దండాన్ని ధరించాడు. అతడు సిద్ధపురుషుడు. త్రికాల జ్ఞాని. సంతానం లేని ఆండాళ్, మనైక్కర్ దంపతులకు సంతానం కలుగుతుందని జగన్మాత మణిమేఖలాదేవి అనుగ్రహించిన దివ్యశక్తితో గ్రహించిన విషయాన్ని చెప్పి, భక్తి శ్రద్ధలతో అగ్ని దేవుడిని ఆరాధించమని చెప్పి అక్కడి నుండి వెళ్ళిపోతాడు.

ఆనాడు చోళ సామ్రాజ్యం కరికాలచోళుని ఏలుబడిలో ఉంది. రాజు తన శౌర్యపరాక్రమాలను, రాజకీయ విజ్ఞానాన్ని ప్రదర్శించి చోళ సామ్రాజ్యాన్ని విస్తరింపచేశాడు. ఆ రాజ్యానికి రాజధాని "కావేరీ పట్టణం". అది ప్రసిద్ధి చెందిన నౌకా కేంద్రం. విదేశీ వర్తకులను ఆ కేంద్రం బాగా ఆకర్షిస్తూ ఉంది. ఇలా కరికాల చోళుడు నౌకా కేంద్రాన్ని బాగా అభివృద్ధి పరచాడు. ఆ పట్టణంలోని పట్టణపాక్కంలో ఒక విశాల భవనంలో 'మనైక్కన్' నివసిస్తూ ఉండేవాడు. పట్టణ మధ్యభాగంలో "భూత చతుకం" అనే గ్రామ దేవత ఆలయం కలదు. ఆ మహాశక్తి ప్రతిరోజూ అర్ధరాత్రి పట్టణంలో తిరుగుతూ చోరులను, వ్యభిచారులను, రాజద్రోహులను, చెడు నడవడిగల వారిని శిక్షిస్తూ ఉండేది.

ఈ క్రమంలోనే 'ఆండాళు' దేవికి నెలదప్పి నవమాసాలు నిండాయి. కొంత కాలానికి ఆమె ఒక బిడ్డను కన్నది. ఆ బిడ్డకు 'కన్నగి' అని మనైక్కన్ దంపతులు నామకరణం చేశారు. ఐదవ సంవత్సరంలో 'కన్నగి'కి అక్షరాభ్యాసం చేయించారు. 'కన్నగి' గురువు వద్ద విద్యనభ్యసించడం ప్రారంభించింది. తిరుక్కురళ్ గ్రంథాన్ని బాగా చదివింది. పవిత్ర భారత జనని విశిష్టతకు

ప్రధానకారణం పతివ్రతలే అని గురువులు ఆమెకు బోధించారు. ఇలా కొన్ని సంవత్సరాలు గడించాయి. 'కన్నగి' యవ్వనవతి అయింది.

ఒకనాడు వణిక్సమాజ సమావేశం జరిగింది. అక్కడ "మనైక్కన్",ను "మసత్తువన్' సంప్రదించి తమ కుమార్తె 'కన్నగి'ని తన కుమారుడు కోవలన్ కిచ్చి వివాహం చేయమని కోరగా అతడు అంగీకరిస్తాడు. 'మసత్తువన్' ఆ వాడలో గల పెద్ద ధనవంతులలో ఒకడు. భారీ నౌకా వ్యాపారాన్ని సాగిస్తున్నాడు. ఇతని కుమారుడే కోవలన్ రూపజిత మన్మధుడు. కోవలన్‌ను వివాహమాడాలన్నదే "కన్నగి" చిరకాల వాంఛ. కోవలన్ కూడా "కన్నగి' నే భార్యగా పొందాలని నిశ్చయించుకున్నాడు. రోహిణి నక్షత్రంలో కూడుకొన్న ఓ శుభదినమున సంప్రదాయాను సారంగా కన్నగి, కోవలన్‌ల వివాహం జరిగింది.

అతిధి అభ్యాగ్యతులను ఆదరిస్తూ కన్నగి ఆదర్శ గృహిణిగా పేరు సంపాదించింది. కోవలన్ తండ్రి బాధ్యతలో పాలు పంచుకుంటూ జీవితాన్ని మధురాతి మధురంగా చేసుకున్నాడు. సంగీత నాట్యాలలో ప్రావీణ్యం సంపాదించాడు. ఆ పట్టణంలో ఏ సంగీత సభ జరిగినా, నాట్య ప్రదర్శన జరిగినా తప్పక వెళ్లే వాడు. ఆ పట్టణంలో మేటి నాట్యగత్తె చిత్రవతి ఇచ్చే నాట్య ప్రదర్శనకు వెళ్లేవాడు. ఆ చిత్రవతి కూతురు మాధవి. ఆమె భరతుని నాట్యశాస్త్రాన్ని ఆపోశన పట్టింది. ఒకనాడు మాధవి తన ఇంట నృత్య ప్రదర్శన ఇవ్వడం ఆరంభించింది. ఆమె నృత్య ప్రదర్శనను చూసిన కోవలన్ ఉన్మత్తుడయ్యాడు. మాధవి కూడా కోవలన్ రూప సౌందర్యాలు దిగ్భ్రమను కలిగించాయి.

ఇంద్రోత్సవ సమయంలో ఒకనాడు కోవలన్ మాధవి చేస్తున్న నాట్యం చూస్తాడు. ప్రదర్శన ముగిసిన తరువాత మాధవి ఇంటికి వెళతాడు. నిరంతరం ఆమె ప్రణయా రాధననే ధ్యేయంగా జీవితం సాగిస్తున్నాడు. 'కన్నగి'ని పూర్తిగా మరచి పోయాడు. ఆరు నెలలైన భర్త ఇంటికి రాకపోవడంతో 'కన్నగి' వ్యధ చెందింది. పైగా ఈ ఆరు నెలల్లో ప్రతిరోజూ భర్త వద్ద నుండి పరిచారకులు రావడం, భర్త ఆనతి తెలియజేయడం, ఆ మేరకు ధన, కనక, వస్తుసామాగ్రిని తీసుకుపోవడం జరుగుతూనే ఉంది.

మాధవి ఇప్పుడు మూడు నెలల గర్భవతి. మాధవి గర్భాధారణ కోవలన్‌కు ఆనందాన్ని కలిగించింది. చిత్రవతి వేదన చెందింది. కోవలన్ నిర్ధనుడు కాగానే మరియొక ధనవంతుణ్ణి ఆకర్షించి కోట్లకు పడగెత్తాలనేది చిత్రవతి కోరిక. కోవలన్ పుట్టబోయే బిడ్డ పేర అతని ఆస్తిలో సగభాగం రాసిఇవ్వాలని నిర్ణయించుకున్నాడు. ఒక శు భముహూర్తాన మాధవి ఒక ఆడ బిడ్డను ప్రసవించింది.

కోవలన్ ఆ బిడ్డకు మణిమేఖల అని నామకరణం చేశాడు. నామకరణ మహోత్సవం ముగిసిన పిదప ఆరవ రోజు ఆ శిశువు ఎదపై ఒక మచ్చ కన్పించింది. అప్పటి నుండి ఆ బిడ్డ రోదిస్తూనే ఉంది. ఆ బిడ్డ ఏడుపు మానడానికి కావేరీ పట్టణంలోని దేవాలయాలన్నీ తిరిగారు. చివరకు 'మణి మేఖలాదేవి' (కులదేవత)ను ప్రార్థించారు. అప్పుడు మణిమేఖలాదేవి "ఈ బిడ్డ నా అంశంతో జన్మించింది. కన్నగి కరస్పర్శతో ఈ బిడ్డ ఎదపై వుట్టిన మచ్చమాయమవుతుంది" అని చెప్పింది.

ఆ శిశువును కోవలన్ ఒక సేవకునికి ఇచ్చి కన్నగి వద్దకు పంపుతాడు. కన్నగి కరస్పర్శతో ఆ బిడ్డ ఎదపై ఉ న్న మచ్చ మాయమైంది. రోదన ఆగిపోయింది. కన్నగి ఎదపై ఆ బిడ్డ హాయిగా నిద్రించింది. మూడు సంవత్సరాలు గడిచాయి. 'కన్నగి' కడ ఉన్న ధనరాసులు కరిగి పోయాయి. కరుడు గట్టిన హృదయాలను సైతం కరిగించే ఆమె వేదన అంతటితో ఆగలేదు. కన్నగి వద్ద ధనం లేక పోవుటకు తోడుగా మాధవి ప్రేమతో పడి వ్యాపారం కూడా పాడైంది.

ప్రస్తుతం మణిమేఖలను ఆరేండ్ల వయస్సు వచ్చింది. ఆ బిడ్డకు కోవలన్ శాస్త్రానుసారంగా అక్షరాభ్యాసం చేయించాడు. కొన్నాళ్లు గడిచాయి. రోజు రోజుకూ కోవలన్

ఆర్థిక వనరులు బిగిసుకుపోతున్నాయి. కోవలన్ వద్ద ధనం లేదు. పేదవాడై పోయాడు. ఒక రోజు అర్ధరాత్రి కోవలన్ గాఢ నిద్రలో 'కన్నగి' నామస్మరణ చేస్తున్నాడు. కన్నగి స్మరణ మాధవికి ఆగ్రహం కల్గించింది.

ఈ కాలంలోనే తిరిగి ఇంద్రోత్సవాలు ప్రారంభం అవుతాయి. కావేరీ పట్టణం శోభాయ మానంగా అలంకరింపబడింది. పట్టణం మధ్యలో నాలుగు దార్లు కలిసే చోట పెద్ద కూడలిలో 'శక్తి మత్తర (గ్రామ దేవత) నెలకొల్పబడింది. మరవ జాతికన్యలు అలంకరించుకొని ఆ దేవతకు బియ్యం, నూగులు, మాంసం, కలిపి తయారు చేసిన పొంగలిని నైవేద్యంగా పెట్టి దీపములలో ధూమం వేసి పూజలు చేశారు. ఒక కల్లు ముంతను కూడా అమ్మవారికి సమర్పించారు. అనంతరం అనేక నాట్య విన్యాసాలతో, కామోద్రేకం కల్గించే ఆట పాటలతో ప్రజలను ఆనందపరచారు. తమ దేశానికి తమ రాజుకు ఐశ్వర్యాన్ని ప్రదర్శించమని, శత్రువుల పీడ లేకుండా చూడమని, కరువు కాటకాలు రాకుండా కాపాడమని, మారి మశూచి మొదలగు వ్యాధులు రాకుండా ప్రజలను రక్షించమని ఆ దేవతను ప్రార్థిస్తూ పాటలు పాడి హారతులు ఇచ్చారు.

కావేరి ముఖద్వారంలో చోళరాజులు ఇంద్రుని ప్రతిమను ప్రతిష్టించారు. కావేరి నది సంగమ స్థానంలో కోవలన్ ఒక తోపులో ఎత్తుగా వేదికను కట్టించి దానిపై పందిరి నిర్మించి రకరకాల పుష్పాలను చల్లించారు. కోవలన్ మాధవిని తీసుకొని ఆ సముద్ర సంగమం చేరుకున్నాడు. రాను రాను మాధవి కోవలన్‌ను చులకనగా చేసి పాటలు పాడుతోంది. తను అంటే అయిష్టత ప్రదర్శిస్తోంది. కాబట్టి ఈమెను వీలైనంత త్వరగా దూరం చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. తరువాత మాధవిని వదలి గబాలున పట్టణం వైపు నడిచాడు. పట్టణం వైపుకు బయలుదేరిన కోవలన్ గతం తలంపుకు వచ్చే కొద్దీ దు:ఖించసాగాడు. ఒక చపల, ఒక వేశ్య చూపిన ప్రేమ నిజమని నమ్మి తనను ప్రాణ సమానంగా భావించి ఆరాదించే ధర్మపత్ని 'కన్నగి'కి తాను చేసిన అన్యాయం గుర్చుకొచ్చి బాధపడుతూ నడుస్తున్నాడు. దూరంగా దీపకాంతులతో ప్రకాశిస్తున్న పరమశివుని ఆలయం కనిపించగా ఆ ఆలయం వైపుకు వెళ్లాడు. ఆ ఆలయంలోని శివలింగాన్ని చూస్తూ నిలబడ్డాడు. క్రమేణా ఆయన చూపు ఆలింగంలో లీనమైంది.

భర్త దూరమైన 'కన్నగి'ని 'దేవాండి' అనే స్త్రీ ఓదార్చింది. "నీ భర్త తప్పక నిన్ను చేరగలడు" అని చెప్పి ఆమె అక్కడి నుండి వెళ్లిపోయింది. దేవాండి వెళ్లిన తరువాత 'కన్నగి' ఆమె ఇచ్చిన దీవెనలను, తాను కన్న కలలను తలచుకుంటూ చింతా క్రాంతురాలై కూర్చొని ఉంది. అర్ధరాత్రి కావొస్తోంది. ఉన్నట్లుండి తలుపులు తట్టిన చప్పుడు అయింది. తలుపు తెరవగానే తన భర్త కోవలన్ కనిపించాడు. కన్నగి మూర్తి భవించిన శోకదేవతలా కనిపించింది. అప్పటి ఆమె రూపం చూసిన కోవలన్ ఎంతగానో దు:ఖించాడు. తన భార్యకు చేసిన అన్యాయానికి పశ్చాత్తాప పడ్డాడు.

తన వారి మధ్య తల ఎత్తుకోలేకపోయాడు. తరువాత కొన్నాళ్లకు ఎవ్వరికీ తెలియకుండా పాండ్య రాజ్యమైన మధురానగరానికి వెళ్లి వ్యాపారం ప్రారంభించాలనుకుంటాడు. తన భార్య 'కన్నగి'తో కలిసి కావేరీ పట్టణం నుంచి బయలుదేరి 'కవుంది' అనే పల్లెకు చేరుకుంటాడు. 'కవుంది' పల్లెలో 'కవుంది'అనే సన్యాసితో కలసి కోవలన్, కన్నగిలు మరుదినం తెల్లవారు జామున మధురానగరానికి పయనమయ్యారు. మధ్య మధ్యలో విశ్రాంతి తీసుకుంటూ కొన్ని రోజులు ప్రయాణం సాగించారు. ఆ విధంగా ఒకరోజు రాత్రి ఒక తోపును చేరుకొని కన్నగి, కోవలన్, కవుందులు విశ్రాంతి తీసుకొనుచుండగా కొంత సేవటికి డవ్వులు వాయించుకుంటూ సందడి చేస్తూ ఆటవికుల గుంపు కాళికాదేవి ఆలయం వద్ద నిలిచింది. ఒక స్త్రీ జుట్టు విరబోసుకొని, వెడల్పయిన కుంకుమ బొట్టు పెట్టుకొని కొమ్ములు తిరిగిన జింకపై కూర్చొని ఉంది. ఆమె వారి

నాయకుని భార్య. ఆమెతో పాటు అనేక మంది మరవ స్త్రీలు వండిన మాంసం కుండలను, సారాయి కుండలను దేవీ విగ్రహం ముందుంచారు. ముందు ముందు తాము చేసే దొంగతనాల్లో, దోపిడీల్లో పరిపూర్ణ ఫలితాన్ని ప్రసాదించమని వేడుకొని మేకను బలిఇచ్చారు. మరికొంత సేపటికి ఆటవికుల గుంపు ఊరి వైపు వెళ్లిపోయింది. తరువాత కోవలన్, కన్నగి, కవుందులు మధురానగరికి చేరుకున్నారు.

మధురానగరం పాండ్యరాజుల రాజధాని. నెడుంజెలియన్ ఆ రాజ్యాన్ని పాలిస్తున్నాడు. మధురానగరాన్ని మూర్తి భవించిన కళా సర్వస్వంగా తీర్చిదిద్దాడు. దొంగబాధ లేకుండా ప్రజలు నిర్భయంగా జీవించేవారు. మధురానగరంలో కోవలన్, కన్నగి, కవుందులు ఒక జైన వసతి గృహానికి చేరుకున్నారు. అక్కడ 'కవుంది'కి పరిచితురాలైన "మాదారి" అనే గొల్ల స్త్రీని కోవలన్ దంపతులకు పరిచయం చేసింది. 'మాదారి' వారిద్దరిని తన ఇంటికి తీసుకెళ్లి అక్కడ ఒక శుభ్రపరచిన గది ఇచ్చింది. అక్కడ 'కన్నగి' వంట చేసి వడ్డించగా కోవలన్ తృప్తిగా భుజించాడు. ఏదైనా వ్యాపారం చేసి డబ్బు సంపాదించి పూర్వవైభవాన్ని పొందాలనుకున్నాడు. తన భార్య 'కన్నగి' కుడికాలి అందియ ఇవ్వగా దాన్ని అమ్మడానికి స్వర్ణకారులున్న పేటకు వెళతాడు. ఆ పేటలో ఒక స్వర్ణకారునికి కాలి అందియను చూపించి వెల నిర్ణయించమని అడుగుతాడు. ఆ స్వర్ణకారుడు అంతకు ముందు రోజు రాణి కొప్పెరుందేవి నగలను బాగు చేయడానికి తీసుకొని ఆ నగలలోని ఒక అందియను తొలగించి దాన్ని ఒక విదేశీ వ్యాపారస్థునికి అమ్మివేశాడు. అతని దొంగతాన్ని గుర్తించిన రాజు నెడుంజెలియన్ తన ఆస్థానానికి పిలిపించి తన రాణి కాలి అందియను తీసుకు రాకపోతే కఠినంగా శిక్షించాల్సి వస్తుందని హెచ్చరించాడు. కోవలన్ చేతిలో ఉన్న అందియను స్వర్ణకారుడు తీసుకొని పరిశీలించాడు. ఈ అందియ రాణి గారి అందియను పోలి ఉందని భావించాడు. దొంగతనాన్ని కోవలన్ మీదకు నెట్టాలనుకున్నాడు. కోవలన్‌ను తన ఇంట్లోనే ఉంచి దొడ్డిదారిలో రాజు గారి అంత:పురం చేరి దొంగ దొరికాడని చెప్పి ఆ అందియను రాజు గారికి ఇస్తాడు. రాజు స్వర్ణకారుని మాటలు నమ్మాడు. తమ నగను దొంగిలించిన వ్యక్తి శిరస్సును ఛేదించమని భటులను ఆజ్ఞాపిస్తాడు. భటులు కోవలన్ ఉన్న చోటికి వచ్చి అతణ్ణి శిరచ్ఛేదన చేస్తారు. కోవలన్ మరణిస్తాడు.

తన భర్త మరణవార్త 'మాదారి' ద్వారా తెలుసున్న 'కన్నగి' అక్కడికి వెళ్లి తన భర్త పాదాల వద్ద కూర్చొని వాటిని తన ఒడిలోకి తీసుకొని బోరున విలపిస్తుంది. 'కన్నగి' దు:ఖం క్రోధంగా మారింది. బిరబిరా రాజసౌధం వైపు నడచింది. రాజసౌధం లోని రాజును ఆధర్మ వర్తనుడని, దొంగ అని నిందించింది. "తన భర్త వ్యాపారం కోసం ఒక అందియను అమ్మడానికి విఫణి వీధికి తీసుకొని వచ్చాడు. కంసాలి చెప్పిన మాటలు నమ్మి ఆ అందియ రాణిదని భావించావు? దాన్ని తన భర్త దొంగలించాడని నిర్ధారించి ఎటువంటి విచారణ లేకుండా ఆయన శిరస్సును ఖండించడానికి కారకుడి వయ్యావు? నీ భార్య మంజీరంలో ఉన్న ఆణిముత్యాలు తెల్లగా ఉంటాయని" అంటూ రాజు వద్ద నున్న మంజీరాన్ని తీసుకొని నేలకు విసిరి కొట్టింది. అందులోంచి ఎర్రటి పద్మరాగాలు బయటపడ్డాయి. క్షణకాలంలోనే సత్యం నిరూపించబడింది. రాజు నిశ్చేష్టుడై పోయాడు. ఆమెకు జరిగిన అన్యాయాన్ని గుర్తిస్తాడు. ఒక నిరపరాదకు మరణ శిక్ష విధించి అతని భార్యకు పసుపు కుంకుమలు లేకుండా చేశానని బాధపడతాడు. తాను చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తంగా సింహాసనం పై నుండి దూకి మరణిస్తాడు. అదే సమయంలో రాణి కూడా రాజు మృతదేహంపై పడి మరణిస్తుంది.

రాజు మరణంతో కన్నగి శాంతించలేదు. తన ఎడమ చన్ను పెరికి మధురానగరం వైపు విసిరి వేసింది. వెంటనే మధురానగరం చుట్టూ పెద్ద మంటలు అలుముకున్నాయి.

ఆ మంటల్లో కోవలన్ మృతికి కారకుడైన స్వర్ణకారుడు, మిగతా అసత్యవాదులు, ద్రోహులందరూ కాలిపోయారు.

ఆ తరువాత 'కన్నగి' మధురానగరం పశ్చిమద్వారం గుండా పయనించి వైగైనదిని దాటుకొని చేర రాజ్యంలోని "నెడువేల్" (సుబ్రహ్మణ్యస్వామి) వెలసిన పర్వతం చేరుకొని అందలి ఒక విశాలమైన వనంలో చేరి రావిచెట్టు కింద విశ్రమించింది. పన్నెండవ రోజు సాయంత్రం కన్నగి ఆ పర్వత శిఖరం ఎక్కి అందుండి దూకి తన శరీరాన్ని విడిచింది. వెంటనే ఆమె శరీరం నుండి ఒక జ్యోతి అనంత ప్రకాశంతో పైకెగిరి పోయింది.

కోవలన్ మరణవార్త విన్న మాధవి జీవితంపై విరక్తి చెంది బౌద్ధసన్యాసినిగా మారిపోయింది. తండ్రి మరణంతో మణిమేఖల జీవితంపై విరక్తి కలిగి విరాగిగా జీవిస్తూ బౌద్ధభిక్షకిగా మారి బౌద్ధ విహారం చేరి కొన్నాళ్లకు ఆచార్య పీఠం అధిష్టించింది.

కొన్ని రోజులకు చేరరాజు 'సెంగట్టువన్' వనవిహారం చేస్తున్న సమయంలో అక్కడి ప్రజలు 'కన్నగి' భృగుపతనాన్ని వివరించారు. కథ విన్న రాజు ఒక మహాపతివ్రత దేహత్యాగం చేసుకొన్న ఈ ప్రాంతం అత్యంత పుణ్య ప్రదేశమని భావించాడు. శిల్పులను పిలిపించి పతివ్రతా శిరోమణి 'కన్నగి' శిలా విగ్రహాన్ని ప్రతిష్టించాడు. తరువాత ఆ విగ్రహానికి గుడి కట్టించాడు. ఇప్పుడు ఆ ఆలయం 'మంగళదేవి ఆలయం'గా పిలవబడుతోంది. ఈ దేవాలయం తమిళనాడు, కేరళ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉంది.

ముగింపు:

నెడుంజెలియన్ మరణానంతరం అతని తమ్ముడు 'వెట్రివేల్ – చెవియన్' పాండ్య సింహాసనాన్ని అధిరోహించి తన అన్న మరణానికి కారణమైన వెయ్యి మంది స్వర్ణకారుల తలలు నరికించాడు. ఆ బలిదానానికి ప్రీతుడై వరుణదేవుడు కుంభవృష్టిని కురిపించి నగరాన్ని, దేశాన్ని శాంతింపచేశాడు.

ఇలా ఈ నవలలో పాలాది లక్ష్మీకాంతం శ్రేష్ఠి ఒక పతివ్రత జీవితాన్ని ఆనాటి సంఘ వ్యవస్థను సంఘంలోని ఆచార వ్యవహారాలను, రాజ్యపాలనా విధానాన్ని కళ్లకు కట్టినట్లు చిత్రించాడు.

ఆధార గ్రంధాలు:

1. కన్నగి (చారిత్రక నవల) – పాలాది లక్ష్మీకాంతం శ్రేష్ఠి
2. శిలప్పాదిగారం – ఇళంగో వడిగళ్

రుబాయి ప్రక్రియ – ఒక పరిశీలన

గుత్తికొండ చంద్రకళ, అసిస్టెంట్ ప్రొఫెసర్, కాకతీయ ప్రభుత్వ కళాశాల, హనుమకొండ

తెలుగు భాష పై ఇతర భాషల ప్రభావం ఉన్నట్టుగానే తెలుగు సాహిత్యం పై ఇతర భాష సాహిత్య ప్రక్రియల ప్రభావం కనిపిస్తుంది.. ముఖ్యంగా ఆంగ్ల సాహిత్యం నుండి నవల, వ్యాసం, జీవిత చరిత్ర వంటి ప్రక్రియలు, అరబ్బీ, పార్సి వంటి భాషల నుండి రూబాయిలు గజళ్ వంటి ప్రక్రియలు తెలుగు సాహిత్యంలోకి వచ్చి చేరాయి. గజల్, రుబాయి రెండు సమాంతర ప్రక్రియలు. ఇవి గేయ కవిత్వ శాఖకు చెందినవి. తెలుగులో రుబాయి ప్రక్రియను పరిచయం చేసిన వాడు దాశరథి క్రృష్ణమాచార్య కాగా వికాసానికి తోడ్పడిన వారిలో సి.నారాయణ రెడ్డి, తిరుమల శ్రీనివాసాచార్య, పెన్నా శివరామకృష్ణ, ఏనుగు నరసింహారెడ్డి వంటి వారిని పేర్కొనవచ్చు. వీరు ఈ రూబాయిలలోని మాధుర్యాన్ని తెలుగువారికి అందించమే కాక తెలుగులో కొత్త ప్రక్రియ స్థిరపడే విధంగా క్రృషిచేసారు.

రుబాయి ప్రక్రియ పారసీ భాష నుంచి తెలుగులోకి దిగుమతి అయిన ప్రక్రియ. దీనికి ఆద్యుడు పర్షియన్ కవి అయిన మహమ్మద్ రూద్కీ. రుబాయిలు తెలుగు వారికి అనువాదాల ద్వారానే పరిచయం అయ్యాయి. విప్రలంబశృంగారం, స్త్రీ ఆరాధన, మార్మికత ఉన్నందువల్ల రుబాయి కవిత్వం తెలుగు కవితా ప్రేమికులను బాగా ఆకర్షించింది. రుబాయి,గజల్ ఈ రెండు ప్రక్రియలు ప్రేయసిపరంగా సాగే రచనలు. అయితే తెలుగు కవులు సామాజిక శ్రేయస్సుకు, మానవాభ్యుదయానికి రుబాయి ప్రక్రియను స్వీకరించి నిర్వహించటం గమనార్హం. ఈ పత్రంలో రుబాయిలలోని సామాజిక,, రాజకీయ, మానవతావాద అంశాలను పరిశీలించటం ముఖ్య ఉద్దేశ్యం.

రుబాయి లక్షణాలు

నాలుగు అనే అర్థం కలిగిన 'అర్బా' అనే అరబ్బీ పదం నుంచి రుబాయి అనే పదం ఏర్పడింది. రుబాయి అంటే రసవంతమైనది అని అర్థం అంటే 'రసం', 'సారం' అనే అర్థాలు ఉన్నాయి.రుబాయి అనేది ఒక పారసీ ఛందస్సు పేరు. అదే కవితా ప్రక్రియకు పేరుగా మారింది. రుబాయి అచ్చమైన పారసీ కవితా ప్రక్రియ. దీనిని హిందీలో కొందరు 'చౌపది' అని కూడావ్యవహరిస్తుంటారు. దీనిలో నాలుగు పాదాలు ఉంటాయి. ఒకటి, రెండు, నాలుగు పాదాలకు రదీఫ్, కాఫీయా నియమం ఉంటుంది. మూడో పాదానికి ఈ నియమాలేవి ఉండవు. మూడవ పాదంలోనూ రదీఫ్, కాఫియాలు పాటింపబడిన రుబాయిలను పూర్వం 'రుబాయి తరాణాలు' అని అనేవారు.

రుబాయి గేయ కవిత్వ శాఖకు చెందింది. ఈ కవిత నాలుగు పాదాల్లో ఉంటుంది. అన్ని పాదాలకు మాత్రలు సమానం. ఒకటి, రెండు, నాలుగు పాదాలకు అంత్యప్రాస విధిగా ఉంటుంది. దీనిని రదీఫ్ అంటారు.రదీఫ్ కన్నా ముందున్న పదాల్లోని అచ్చును లేదా హల్లును కాఫియా అంటారు. కొంతమంది కవులు 'తఖల్లుస్' (నామముద్ర)ను అంటే కలం పేరును ప్రయోగిస్తారు.ఇది తప్పని సరి కాదు. మూడవ పాదం స్వేచ్ఛగా ఉంటుంది. ఏ పాదానికి ఆ పాదం పూర్తి అర్థంతో స్వతంత్రంగా ఉంటుంది. ఒక పాదంలోని అర్థం మరో పాదంలోకి వ్యాపించకూడదు.మాత్ర ఛందస్సు లోని ఏ గతిలోనైనా రుబాయిని రాయవచ్చు. మొత్తం రుబాయిలోని భావానికి సంబంధించిన అంతః సూత్రం, అభివ్యక్తి విధానం ఆ రుబాయిని రాసిన కవి శక్తి మీద ఆధారపడి ఉంటుంది. ప్రతిపాదం సాధ్యమైనంత చిన్నగా సంక్షిప్తంగా ఉంటుంది. మూడవ పాదం అంత్యానుప్రాసం లేకుండా స్వేచ్ఛగా ఉండి నాలుగో పాదంలోని అభివ్యక్తిని శక్తిమంతం చేస్తుంది.రుబాయి రచన ఎంత సులభమో, మంచి రుబాయి నిర్మాణం అంత కష్టం. రుబాయిలో ప్రధానంగా ఒకే ఒక్క భావం ఉంటుంది. ఈ భావప్రసారణం

నాలుగు రేకులుగా విచ్చుకుంటుంది. మొదటి పాదంలో భావం మొగ్గ తొడుగుతుంది. రెండవ పాదంలో కొంచెం విచ్చుకుంటుంది. మూడవ పాదంలో వినూత్న ప్రాసతో ఉబికి వస్తుంది. హృదయాన్ని సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తుతుంది. సంగీతంలో ఆరోహణ స్వరములా తరగెత్తుతుంది. నాలుగవ పాదం రుబాయిలోని అతి ప్రధాన భాగం. ఇందులో మూడు పాదాల సారం ఇమిడి ఉంటుంది. మొదటి పాదం లో అంకురించిన భావం సమగ్రంగా గుబాలించేది ఈ ముగింపులోనే. కవి ప్రతిభ చమత్కృతి ప్రౌఢిమ ప్రస్ఫుటమవుతాయి. నాలుగు పాదాలలో రదీఫ్, కాఫీయాలను పాటిస్తూ ఒకే భావాన్ని చమత్కార పూర్వకంగా వ్యక్తపరచడం కవులకు అగ్ని పరీక్ష. 'రుబాయి రచన ఒక బిందువులో సింధువును ఇమిడ్చినంత పని. ఒక రుబాయిని రచించడం అంటే కవికున్న ప్రౌఢిమ అంటే కుదింపుకు రుబాయి ఒక నికశోపలం' అని అంటారు ఇరివింటి కృష్ణమూర్తి. రుబాయిలోని తొలి రెండు పాదాల మధ్య భావైక్యం ఉండాలన్న నియమమేమీ లేదు. రుబాయిలోని తొలి రెండు పాదాలు వేరువేరు అంశాలను సూచించేవి అయి ఉండవచ్చు. ఈ రెండు వేరు వేరు అంశాల ప్రస్తావనను సార్థకం చేసేవి మరి రెండు పాదాలు. తొలి రెండు పాదాలకు నాలుగో పాదానికి సంబంధాన్ని కూర్చేది, నిర్ధారించేది మూడవ పాదం. కనుక రుబాయి నిర్మాణ సౌష్టవానికి కీలకమైనది మూడవ పాదము. అందుకే రదీఫ్,కాఫియాలు మూడవ పాదానికి మినహాయించబడినట్లు తెలుస్తోంది. చివరి పాదంలోని చమత్కారం అనే దివ్వెకు ప్రమిద లాంటిది మూడవ పాదం. ఇది ఉరుము ముందు వచ్చే మెరుపులాంటిది. రుబాయిలోని నాలుగు పాదాలు సంపూర్ణ స్వతంత్ర వాక్యాలై ఉండాలి. మూడవ పాదం స్వతంత్ర వాక్యమై ఉంటూనే ఒకటి, రెండు, నాలుగు పాదాల మధ్య పూలవంతెనలా ఉండాలి. నాలుగవ పాదంలోని చమత్కృతికి మూలమై ఉండాలి. రుబాయి అనే భవనానికి పునాది లాంటిది మూడవ పాదం. రుబాయి రచనలో కవి ప్రదర్శించే నిర్మాణ నిపుణతకు గీటురాయి ఈ మూడవ పాదమే.

ప్రఖ్యాత కవి ఉమర్ ఖయ్యాం పార్శీలో, హైదరాబాద్ కవి అమ్జద్ హైదరాబాదీ ఉర్దూలో రుబాయిలు రాశారు. తెలుగులో రుబాయిలను రాసిన తొలి కవి దాశరధి కృష్ణమాచార్య. 1975లో రాసిన 'ఆలోచనా లోచనాలు' కవితా సంపుటిలో 'నేనంటాను' శీర్షికతో కొన్ని రుబాయిలను రాశారు. దాశరధి తర్వాత రుబాయిలను ప్రచురించిన వారు డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్య గారు. ఆ తర్వాత అధిక సంఖ్యలో రుబాయిలు రాసిన వారు ఏనుగు నరసింహారెడ్డి గారు.

కొన్ని రుబాయిల పరిశీలన :

ఆరిపోని దివ్వె నీవు వెలిగించాలి
వాడబోని తోట నీవు మొలిపించాలి
జాతి కొరకు నీ తనువు ను అర్పించేసి
చావును నీ బ్రతుకు నుండి తొలగించాలి

దాశరథి పై రుబాయిలో జాతీయతా వాదాన్ని, జన్మ సార్థక్యాన్ని, చచ్చే బ్రతుకులోంచి పుట్టుకు వచ్చే అమరత్వాన్ని ఉపదేశించారు. ఏ సమయంలోనైనా ఆరిపోని మానవత్వం అనే జ్యోతిని నీవు వెలిగించాలి. ఏ పరిస్థితుల్లోనూ వాడబోని సువ్యవస్థితమైన ఒక మంచి సంఘ జీవితమనే తోటను నీవు మొలిపించాలి. జాతి కొరకు నీవు నీ తనువును అర్పిస్తే, మరణించినా నీవు అమర జీవిగానే ఉంటావు. మృతిలో కూడా అమరత్వాన్ని సాధిస్తావు అని జాతీయతాభావ గొప్పతనాన్ని తెలియజేస్తాడు.

నవ భాష్పదారలలో నవ్వు కాగలవు
ముల్లతీగలలోన పువ్వు కాగలవు
యత్నించి చూడమని అంటాను నేను
రాళ్ల రాశులలోన నువ్వు రవ్వ కాగలవు

– అని దాశరథి,

ప్రయత్నిస్తే మానవుడు సాధించలేనిది ఏదీ లేదు. చీకటి ఎన్నాళ్లో ఉండదు. వేదన నుంచి విపత్కర పరిస్థితుల నుంచి బయటవడి వేలిమి రత్నంగా మారగలవు అనే భరోసానిస్తాడు.

మనిషిని గాయపరచకు మళ్ళీ కలవలేం
నీతిని పాతరేయకు మళ్ళీ కలవలేం
ప్రేమించడంలో మునిగిపో ద్వేషించలేవ్
కరుణను జారవిడువకు మళ్ళీ కలవలేం

– అని

ఏనుగు నరసింహారెడ్డి గారు మనిషి మంచితనంతో నీతి, నిజాయితీతో కరుణ, జాలితో జీవించగలగాలని ఎదుటి వ్యక్తిని ప్రేమించడమే మనిషి గొప్పతనం అని ప్రేమ నిండిన హృదయం ద్వేషించలేదని ఎదుటి వ్యక్తిని గాయపరచొద్దని తెలియజేస్తారు.

పులి నుండి మేకనొకడు విడిపించాడు
నెనరు బూని ఇంటిదాకా నడిపించాడు
అతడు కరుణామయుడని అనుకొనె మేక
కత్తి తీసి మేక మెడను ఖండించాడు

ఈ రుబాయిలో కసాయినే నమ్మిన మేకలాంటి అమాయకులైన సంఘజీవుల మనః ప్రవృత్తి కనిపిస్తుంది. దుర్మార్గుడైన కసాయివాడు తన స్వార్థం కోసమే మేకను పులి నోటి నుండి తప్పిస్తాడు. అంతేకానీ దాన్ని ఉద్ధరించడానికి కాదు. అలా రక్షించి ఇంటికి తీసుకుపోయి పొట్ట నిండా మేపడం కూడా అది బాగా కండ పట్టిన తర్వాత దాన్ని కోసుకు తినటానికే. ఇలాంటి కసాయిల పట్ల మేకలాంటి అమాయకులైన సామాజికులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక దాశరథి రాసిన ఈ రుబాయిలో కనిపిస్తుంది.

పైన ఎప్పుడు అన్యాయమే రాజ్యమేలుతూ ఉంటది
కనిపించని కుట్రలతో ప్రభుత్వం నడుస్తూ ఉంటది
పెద్దోళ్లను కాదు అతి సామాన్యులకు మొక్కాలి
ఉన్నతులను వారిలోనే డొల్లతనము ఉంటది
పది మొనలు ఉన్న కత్తిలాంటిది చట్టం
అమాయకులపైనే దిగేది చట్టం
పెద్దలు ఎట్లయినా తప్పించుకుంటరు
చిన్నోళ్లను సతాయించేది చట్టం

– అని ఏనుగు నరసింహారెడ్డి గారు ప్రస్తుత సమాజంలోని ప్రజాస్వామిక వ్యవస్థలో డబ్బు, అధికారం కలిగిన వారు తప్పించుకుంటూ అమాయకులు మాత్రం బలి అయిపోతున్న పరిపాలన పద్ధతులను, రాజకీయ వ్యవస్థను కళ్ళముందు ఉంచారు.

కులం అన్నది విషవృక్షమే పెకిలించుట ఎలా
మతం అన్నది అడ్డుగోడే పడగొట్టుట ఎలా
ఎన్ని తీర్ల నీతులైన ఎడాపెడా చెప్పొచ్చు
ఆచరణ మహా కష్టం నిలదీయుట ఎలా

ఈ రుబాయిలో కుల మతాలు మనుషుల మధ్య అడ్డుగోడలుగా నిలుస్తున్నాయని, మనిషి మనిషిగా మసులుకోవాలని అలా ఆచరణ కష్టమే అయినా కుల మతాలకతీతంగా మెలగాలని నీతులు చెప్పటం కాదని ఆచరణే ముఖ్యమని ఏనుగు నరసింహారెడ్డి వివరించారు.

ఒక ఉప్పెన ఉరికిందంటే తప్పదు ఉత్పాతం
ఒక ఊపిరి రగిలిందంటే తప్పదు ఉద్ఘాతం
తనువు ఆడకత్తెరలో తడబడుతూ ఉన్నా
ఒక ఉద్యమ మురిమిందంటే తప్పదు పోరాటం

– అని

సి.నా.రే పురుడు పోసుకున్న ఉప్పెన నుండే ఉపద్రవం మొదలవుతుంది. రగిలిపోయిన ఊపిరి నుండే తీవ్ర నష్టం జరుగుతుంది. నినదిస్తున్న గొంతును కుత్తుకలోనే నొక్కేస్తే అది ఉద్యమంగా మారి పోరాటానికి దారితీస్తుంది అని

హెచ్చరించాడు.

బాల్యం దోసిట్లోంచి జారిపోతుంది
యవ్వనం ఒడి నుండి పారిపోతుంది
కాలాన్ని నిలుప కసరత్తులెన్ని చేయి
చిలుక ఈ చెట్టు నుండి ఎగిరిపోతుంది

ఏనుగు నరసింహారెడ్డి కాలాన్ని ఎపుడూ ఆపలేమని, మనిషి జీవితంలో అన్ని దశలు మారుతూనే ఉంటాయని చివరికి మరణంతో ఈ లోకాన్ని వీడటం తప్పదు అని ఉన్నంత కాలమే పద్ధతిగా బతకాలని ఒక ఆధ్యాత్మిక, తాత్విక చింతనను రేకెత్తిస్తాడు.

ముగింపు :

రుబాయిలు తత్వాలను, నీతులను, జ్ఞానాన్ని చెప్పడానికి చాలా అనువైన ప్రక్రియ. తెలుగు కవులు ఒక అడుగు ముందుకు వేసి సామాజిక, రాజకీయ, సాంస్కృతిక విషయాలను చెప్పి రుబాయిని మరింత వెలిగించారు. నిత్యం రకరకాల సమస్యలతో రగిలిపోయే సమాజానికి రుబాయి ఎల్లవేళలా అవసరమే. రుబాయిలు ఆనందాన్ని, ఉపదేశాన్నిస్తాయి. కావ్య ప్రయోజనం ఉపదేశమే అయితే దానికి రుబాయి ప్రక్రియ సరిగ్గా సరిపోతుంది.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య చరిత్ర. – ద్వారా శాస్త్రి
2. తెలంగాణ దుబాయిలు – ఏనుగు నరసింహారెడ్డి
3. ఆలోచనాలోచనాలు – దాశరథి

దళిత స్త్రీ వాద చైతన్యం

డాక్టర్ డి. కృపారాణ్య, తెలుగు శాఖ, ఆంధ్రా లోయోలా కళాశాల, విజయవాడ–8

భారతీయ సమాజంలో స్త్రీని దేవతగా కొలుస్తూనే మరోవైపు ఆమె పుట్టుకే గిట్టని వ్యతిరేక సమాజంలో మనం ఉన్నాం. సమాజాన్ని నాలుగు ప్రధాన వర్ణాలుగా వర్గీకరించారు ఈ నాలుగు వర్ణాలకు మరో వర్ణం చేరి పంచమ వర్ణం అయింది. మొదటి మూడు వర్ణాల స్త్రీ కనీస హక్కులు లేనప్పుడు, మిగతా వర్ణాల స్త్రీల పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ఊహించుకోవచ్చు.

చారుర్వర్ణాలలో మూడు వర్ణాల స్త్రీల కొన్ని వేల సంవత్సరాల పాటు ఇంటిలోని నిర్బంధంగా ఉండవలసిన పరిస్థితి ఉంటే మిగతా వర్ణాల స్త్రీలకు ఇంట బయట ఉండకపోతే బతకలేని పరిస్థితి ఏర్పడింది. ఒక వర్గానికి చెందిన స్త్రీలకు ఇంటిలోనే ఉండడం రక్షణగా అనిపించిన, ఆదిస్వేచ్ఛను హరించింది. మరోక వర్గానికి చెందిన స్త్రీల ఇంటా బయట తిరగడంలో స్వేచ్ఛ ఉన్న అది మిద్యగా మారింది. తమకు లభించని సామాజిక రక్షణ తమని బలహీనులుగా మార్చడం వల్ల అత్యాచారాలకు, హత్యలకు గురవడం కాకుండా శ్రమ దోపిడీకి గురికావలసి వచ్చింది. మిగత స్త్రీలతో పోల్చి చూసినప్పుడు మనం, ప్రాణ విషయంలో దళిత స్త్రీల వట్ల మరింత వీడన కొనాసాగుతుంది. దళిత స్త్రీలకు పునర్వివాహం పెద్ద అవరోధంగా మారింది.

పితృస్వామ్య నమాజంలో స్త్రీ అణిచివేతకు గురవుతుంది మొట్టమొదటిగా భారతదేశ చరిత్రలో స్త్రీకి జవసత్వాలు కల్పించిన మహనీయులు జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే దళిత స్త్రీల విమూక్తికి విద్య మూల హేతువని అప్పుడే గుర్తించారు. వీరి మార్గంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విద్యను ప్రధాన నినాదం గాను అయుధంగా స్వీకరించి స్త్రీ దాస్య విమూక్తి కోసం మార్గనిర్దేశం చేశారు.

జ్యోతిరావు పూలే తన భార్యను బానిసగా కాకుండా వ్యక్తిత్వం ఉన్న ఉపాధ్యాయురాలుగా నాయకురాలుగా తీర్చిదిద్దాడు. సావిత్రిబాయి పూలే తన భర్త అనే జ్యోతికి నూనెల వ్యవహరించింది. ఆమె సహచర్యం వల్ల మహాత్మా పూలే ఆలోచనలు స్త్రీ వైపు మళ్లాయి స్త్రీ సమానత్వం కోసం అహిర్నిశలు కృసి చేశారు. మహాకవి గుర్రం జాషూవా తన రచనల ద్వారా దళితులను దళిత స్త్రీలను చైతన్యం గావించారు.

స్త్రీవాద కవిత్వానికి పునాదులు వేసింది చైతన్యాన్ని వికాసాన్ని ఉజ్వలం చేసిన రచయిత చలం. చలం రచనలతో ఆంధ్రప్రదేశ్ ఉలిక్కిపడింది. ఎందరో స్త్రీలు పితృస్వామ్య అణిచివేతకు ఇచ్చిన ప్రాధాన్యం కుల భూస్వామ్య అణిచివేతకు ఇవ్వలేకపోయారు.

దళిత స్త్రీవాద తత్వానికి ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి రచనలు ఊర బావి. సర్కారు గడ్డి, సమత, అనేవి, కత్తి పద్మారావు గారి కట్టెల మోపు మొదలైన రచనలు బీజప్రాయం లాంటివి. జి కళ్యాణ్ రావు గారి "అంటరాని వసంతం; నవలలో స్త్రీల పాత్రలన్ని చిత్రించేటప్పుడు దళితుల్లోని పోరాట తత్వాన్ని తెగింపుని ఆత్మ గౌరవాన్ని వీడలేదు.

దళితులలోని స్త్రీలను ఎక్కువగా ఆడపిల్లలను దేవతల పేరట వదిలివేయడం ఆచారం. ఆనాటి నుంచి ఆ అమ్మాయి ఊరందరి సొత్తు. ఎవరు కోరిన కాదన్నటానికి వీలులేని భయంకరమైన వ్యవస్థ, ఎందరో అమ్మాయిలను జీవచ్ఛవాలను చేసిందని కొలకలూరి మధుర జ్యోతి దళిత సంస్కృతిలో వివరించారు. దళిత స్త్రీలపై అత్యాచారం జరిగిన, చంపేసిన కనీసం కేసులు కూడా పెట్టించుకోలేని స్థితిలో దళిత స్త్రీలు ఉన్నారు.

కారంచేడులో జరిగిన మారణ హోమానికి వ్యతిరేకంగా దళిత ఉద్యమం వచ్చిన తర్వాత అంతకు ముందు నుండి రాస్తున్న రచయిత్రులు. కలం మరింత పదును తేలింది గుర్తింపు వచ్చింది. కథ, కవిత, పాట, వ్యాసం, నాటిక, నవల వంటి ఎన్నో ప్రక్రియలు దళిత స్త్రీలు విజయ బావుటాను ఎగురవేశారు. తెలుగు ప్రజల గుండెచప్పుడు, తెలుగు పలుకుబడులు జీవన సవ్వడులు తెలుగు నేల మీదకు ప్రవహించి తీసుకురాగలిగారు. వీరిలో మేధావులు, విద్యావంతులు, కవులు, రచయితలు, ఉద్యమాల కార్యకర్తలు ఉన్నారు.

దళిత స్త్రీలు ఎక్కువమంది కవయిత్రులుగా రచయితలుగా ఎదిగారు. కొంతమంది స్వరూప రాణి అనేక పద్యాలు రాస్తూ స్త్రీలపై జరుగుతున్న అణిచివేతను చాచి వేతనం ఏ విధంగా చెప్పారో చూడవచ్చు.

"చీటికి మాటికింటను చిర్రు బుర్రు
లాడి గోరంత దాని కొండంత జెసి
పెనిమిటి రాచి రంపాన పెట్టి నట్టి
చెలియా సంసార సుఖము మోచేతి దెబ్బ;
నట్టడివి ఒక చెట్టుగా బుట్ట వచ్చు
కన్నెగ జీవితాంతము గడపవచ్చు
మగనిగా కుచీతుని పొంద తగదు
కొరివి తోడను తల గొరిగి కొనిన యట్లు

పై పద్యంలో చక్కని పదాల మేళవింపు గమనించ వచ్చు.

ఆచార్య జయసోలోమి గారి కులాధిపత్య నిరసన గేయం

శత్రు దేశాల మధ్య
సరిహద్దు గీతల
ఈ కులహద్దులేమిటి
మనల్ని కలిపేది ఒక్క కలమే కదా దివిటి
సఖ్యతను నేర్పలేని గుడులెందుకు
ఐక్యతను నేర్పేబడి చాలును మనకు;
అంటూ ఆవేదనను వ్యక్తం చేశారు.

కారం చెడు ఉద్యమంలో చంద్రశ్రీ పాట
"నిజమయ్యే నువ్వు నేను శత్రువులు కాదయ్యా
మాలన్న మాదిగ అన్న వెరన్న ఎక్కడన్నా
వేలి వాడలున్నరు భరతమాత బిడ్డల్లిలు;
అంటూ దళితుల ఐక్యతను చాటి చెప్పింది.
గోగు శ్యామల నల్లపొద్దు పేరుతో దళిత స్త్రీ
జీవితాలను, సాహిత్యాలను కూర్పు చేసింది.

దళిత స్త్రీలలో దాగివున్న తెలుగు భాషా సవ్వడులు, నాటుల్లో, కోతల్లో, కలుపుల్లో, రాళ్లు మోసే పనుల్లో, వీళ్లు పాటలు పాడుతూనే ఉంటారు దైనందిన జీవితంలో పెండ్లి పాటలు, తిరగలి పాటలు, రోకటి పాటలు, ఎన్నో రకాల పాటలు వీరి నోటికి వస్తాయి. వీరి పాటల్లో ఎంతో సాహిత్యం ఉంది. సామాజిక చరిత్ర ఉంది. జీవితంలో ఉండే దు:ఖాన్ని మరచిపోవడానికి వీరు పాటను ఎన్నుకున్నారు.

సమాజం వీరిని నీచంగా చూస్తున్నాం వేధిస్తున్న వీరు పాటనే పాడతారు వీరి పాటే వీరి జీవనానికి ఊపిరి.

ఎన్ని అణిచివేతలున్న ఇబ్బందులు ఎన్నో దోపిడీలు ఉన్న దళిత స్త్రీవాదం చైతన్యం పొందుతుంది.

ఆధార గ్రంథాలు

1. దళిత దర్శనం–కత్తి పద్మారావు
2. తెలుగు సాహిత్య చరిత్ర–కత్తి పద్మారావు
3. మంకెన పువ్వు–దార్ల వెంకటేశ్వరరావు
4. అంతం అంటరాని వసంతం నవల–కళ్యాణ్ రావు
5. ఆధునిక తెలుగు సాహిత్యం దళిత సంస్కృతి– కొలకలూరి మధుర జ్యోతి

రాయలసీమ కన్నీటి కావ్యం 'పెన్నేటిపాట'

డా. కటుకం శారద, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ మరియు సైన్స్ కళాశాల (స్వయం ప్రతిపత్తి), కరీంనగర్, తెలంగాణ. చరవాణి- 9494722793

విద్వాన్ విశ్వం కలం నుండి జాలువారిన రాయలసీమ కన్నీటి కావ్యం పెన్నేటిపాట. ఇతని అసలుపేరు మీసరగండ విశ్వరూపాచారి. ఇతని తల్లిదండ్రులు లక్ష్మమ్మ, రామయ్య. వీరు అక్టోబరు 21, 1915 తేదీన అనంతపురం జిల్లా తరిమెల్ల గ్రామంలో జన్మించారు. ఇతని 72 వ ఏట అనగా అక్టోబరు 20 1987 తేదీన మరణించారు. వీరు సంస్కృతాంగ్ల భాషా సాహిత్యాలను, తర్కశాస్త్రాన్ని అధ్యయనం చేశారు. వీరు కవి, కథకుడు, నవలా రచయిత, అనువాదకుడు, పాత్రికేయుడు. మద్రాసు విశ్వవిద్యాలయం నుండి విద్వాన్ పట్టా పొంది దానినే ఇంటి పేరుగా స్థిరపరుచుకొని తెలుగు సాహిత్యంలో విద్వాన్ విశ్వంగా ప్రసిద్ధులయ్యారు. వీరు మీజాన్, ప్రజాశక్తి, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి వంటి పలు పత్రికలలో పని చేశారు. ఆయా పత్రికలలో అవీ ఇవీ, ఇవ్వాళ, తెలుపు-నలుపు, మాణిక్యవీణ వంటి శీర్షికలను నిర్వహించారు. నవ్య సాహిత్య పరిషత్తు అనే సంస్థను స్థాపించారు. నవ్య సాహిత్యమాల అనే పుస్తక ప్రచురణ సంస్థను నెలకొల్పారు. విరికన్నె, పాపం, రాతలూ గీతలూ, నా హృదయం వంటి లఘు కావ్యాలు, పెన్నేటిపాట, ఒకనాడు అనే కావ్యాలను రచించారు. సంస్కృతం నుండి రఘువంశం, కుమార సంభవం, మేఘ సందేశం, కాదంబరి, శిశుపాలవధ, కిరాతార్జునీయం, దశకుమార చరిత్ర వంటి గ్రంథాలను అనువదించారు. అదేవిధంగా ఆంగ్లం, రష్యన్ భాషల సాహిత్యాన్ని అనువాదం చేశారు.

1917 నాటి రష్యన్ సోషలిష్ట విప్లవం నెలకొల్పిన శ్రామికవర్గ సమసమాజ నిర్మాణం ప్రపంచ వ్యాప్తంగా కవులనూ, కళాకారులనూ ప్రభావితం చేసింది. అదే అభ్యుదయ సాహిత్యం. దీనికి మార్క్సిజం తాత్విక భూమిక. అభ్యుదయం అనే మాటకు మంగళం, శుభం అని నిఘంటుపరంగా అర్థం. ఆధునిక సందర్భంలో ప్రోగ్రెస్ అన్న ఆంగ్ల పదానికి సమానార్థకంగా అభ్యుదయం అనే అర్థాన్ని వాడుతున్నాం. తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యం, శ్రామిక జన పక్షపాతం, వాస్తవికత, పీడితజన పక్షపాతం, సమసమాజ నిర్మాణం అభ్యుదయ కవిత్వ లక్ష్యం. అభ్యుదయ కవి ఐన విద్వాన్ విశ్వం పెన్నేటిపాట అనే కావ్యాన్ని ఈ దృక్పథంతోనే రచించారు.

పెన్నేటిపాట కావ్యం 1956 లో తెలంగాణ రచయితల సంఘం ప్రచురించింది. నార్ల వెంకటేశ్వరరావు గారికి అంకితం చేశారు. ఈ కావ్యానికి రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గారు పీఠిక రాశారు. 1948-1951 మధ్య కాలంలో రాయలసీమ ప్రాంతాన్ని కుదిపేసిన కరువుకు సజీవసాక్ష్యం ఈ కావ్యం. రాయలసీమ కన్నీటి గాధను ఎంతో ఆర్ద్రంగా చిత్రించినది. ఇది ఐదు సర్గల కావ్యం. మొదటి సర్గలో పెన్నానది గత వైభవం, ప్రస్తుత పరిస్థితులు, రెండవ సర్గలో నారప రెడ్డి అనే రైతు జీవిత పరిణామాలు, దయనీయ పరిస్థితులు, మూడవ, నాల్గవ, ఐదవ సర్గలలో నారపరెడ్డి కొడుకు రైతు కూలీగా దుర్భర జీవితం గడిపిన రంగడి జీవిత విశేషాలు వంటివి వర్ణితమైనాయి. ఒకప్పుడు 'రాయలేలిన సీమ రతనాల సీమ' అని పేరు పొందిన ప్రాంతం రాయలసీమ. అందుకే ఆ ప్రాంత గొప్పదనాన్ని పెన్నేటిపాట కావ్యం మొదట్లో కొంత వర్ణిస్తాడు కవి.

'అచట నొకనాడు పండె ముత్యాల చాలు
అట నొకప్పుడు నిండె కావ్యాల జాలు
అచట నొకప్పుడు కురిసె భాష్యాల జల్లు
విరిసెనట నాడు వేయంచు విచ్చుకత్తి' ఐతే ఇదంతా గతించిన గాధ. ఇప్పుడు రాయలసీమ కన్నీటి గాధను వినిపిస్తానని చెపుతూ

'కోటిగొంతుల కిన్నెర మీటు కొనుచు
కోటి గుండెల కంజరి కొట్టుకొనుచు' వినిపిస్తానని చెపుతూ కావ్యాన్ని ప్రారంభించినాడు.

రాయలసీమ ప్రాంతంలో ప్రవహించే ప్రధాననది పెన్నానది. ఆ ప్రాంతపు ప్రకృతి, అక్కడి గ్రామాలు, ప్రజల జీవనసరళి, వట్టిపోయిన పెన్న రూపురేఖలు వంటివి ఈ కావ్యంలో ప్రతిఫలించాయి. రెండవ సర్గలో మోతుబరి రైతు ఐన నారపరెడ్డి ఆనాటి పరిస్థితులు, కరువు వల్ల ఎలా పేదవాడిగా దయనీయమైన స్థితిలో జీవితాన్ని గడిపినాడో ఈ వ్యాసంలో వివరిస్తాను.

పత్తి నరసారెడ్డి కొడుకు నారపరెడ్డి ఆ ఊరి మోతుబరి రైతు. రెడ్డి కులంవాడు. నాలుగు కాండ్లతో సాగుబడి చేయగలిగిన రైతు. ఎందరో రైతులను అవసరాలు, ఆపద సమయాలలో ఆదుకున్న సహృదయుడు. ఆ ఊరి దేవాలయంలో పూజాదికాలకు తగినంత దానం చేసిన ధర్మాత్ముడు. పేదవారికి అడిగినది లేదనకుండా దానం చేసిన మంచి మనస్సు అతనిది. ఎందరో గాయకులు అతని మీద పాటలు కట్టి అతని దాతృత్వాన్ని , గొప్పతనాన్ని ప్రశంసించినారు. కరువు, ఆర్థిక పరిస్థితుల వల్ల అతని సంపద అంతా హరించుకుపోయంది. చేసిన అప్పులు తీర్చడానికి ఉన్న ఆస్థినంతా కరిగించ వలసిన అగత్యం ఏర్పడింది. ఊరిలో ఉన్నతంగా బతికిన భర్త దివాళా తీసిన పరిస్థితిని గమనించిన నారపరెడ్డి భార్య రామమ్మ ఆత్మహత్య చేసుకున్నది. నారపరెడ్డి పసివాడైన కొడుకుతో ఊరి చివర గుడిసెలో అతి దయనీయంగా జీవితం గడిపి తనువు చాలించినాడు. మోతుబరి రైతు కొడుకు రంగడు రైతు కూలీగా మారుతాడు.

నారపరెడ్డి వ్యక్తిత్వం :

పత్తి నారపరెడ్డి ఉన్నత కులానికి చెందిన మోతుబరి రైతు. అల్ప సంతోషి. పేదల పట్ల దయాగుణం, దానగుణం కలవాడు. ఎందరో రైతుల కిస్తీలను కట్టి అవసర సమయాలలో ఆదుకున్నాడు. ఊరి దేవాలయంలో పూజలు జరిపించడానికి సహాయం అందించాడు. తంబళ్ళ సుబ్బమ్మ అతన్ని పరమ భాగవతుడని మెచ్చుకున్నది. అతడు దాసరి ఓబులేసు గరుడ గంబంలో వెండి నాణం వేశాడు. గుడిసె ముందు నీడలో కూర్చొని ఈత చాపలు అల్లుకునే సుంకన్న మంచి గాయకుడు. అతడు నారపరెడ్డి మీద పాటకట్టి ప్రశంసిస్తూ పాడుతాడు.

"సై సై నారపరెడ్డి నీ
పేరే బంగారు కడ్డీరా
పారబోస్తివి ధాన్యమంతా
ఊరడిస్తివి పేదవోళ్లను
కోరమీసం మెలిపెడితే
సీరాముడు నీవేనయ్యా"

అని అతని దాతృత్వాన్ని మెచ్చుకున్నాడు. ఎడ్లబండ్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచి కలెక్టరు మెప్పుపొందినాడని అతని ధైర్యాన్ని ప్రశంసించినాడు.

ఊరిలో సుంకులమ్మ జాతర సమయంలో నారపరెడ్డి వంశ చరిత్రను, వ్యక్తిత్వాన్ని, దానగుణాన్ని బట్టు లచ్చుమయ్య, బండారు బసవయ్య పంచరత్నాలుగా (ఐదు పద్యాలు) అతని ముందు చదువుతారు. దానికి ఎంతో సంతసించిన అతడు ఒక్కొక్కరికి 16 రూపాయలు చొప్పున బహుమానం అందించాడు. ఈ విధంగా 'ఇంద్రుడవీవే చంద్రుడవు నీవే' అని పొగిడిన వారందరికీ తన బోళాతనంతో విరివిగా దానధర్మాలు చేసి గొప్ప పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నాడు. కాని కొంతకాలానికే 'దస్తము సన్నవడం జొచ్చె, కీర్తి సంపద బలిసెన్'. సంపదలు మాత్రం తగ్గుతూ వచ్చినవి.

ఆనాటి పాలనా పరమైన ఆర్థిక అవసరాలు కూడా అతన్ని దెబ్బతీసినవి. సర్కారు సిబ్బంది, జమాబంది, అధికారులకు మర్యాదలు, లంచాలు, వకీలు పిళ్లై, కాంపౌండరు మునుస్వామి ఖర్చులు, మోడలు, భవంతుల

నిర్మాణాలు వంటి అవసరాల నిమిత్తం ధనాన్ని విచ్చలవిడిగా ఖర్చు చేశాడు.

నారపరెడ్డి నాలుగు వివాహాలు చేసుకున్నాడు. అతని మొదటి భార్య కలరా వల్ల చనిపోయింది. రెండవభార్య ప్రమాద వశాత్తు పెదవంకలో కాలు జారి కొట్టుకొనిపోయి చనిపోయింది. మూడవభార్య ఒక బిడ్డను కని, రెండవ కాన్పు కష్టమవడంతో చనిపోయింది. ముసలి వయసులో ఉన్న రామిరెడ్డి పడుచుదైన రామమ్మను పెళ్లి చేసుకున్నాడు. ఆమె రంగన్ని కని అతనితో సంసారాన్ని చేస్తున్నది. ఆనాటి ఆచారాల ప్రకారం నాలుగు పెళ్లిళ్లకు ఎంతో ఖర్చు చేయవలసి వచ్చింది. అంతేకాదు ముగ్గురి భార్యల అంత్యక్రియలు, ఇతర అవసరాలకు సైతం చాలా ఖర్చు అయింది. ఇక ఇద్దరు ఆడపిల్లల పెళ్లిళ్లు ఎనిమిది రోజుల పాటు అంగరంగ వైభవంగా తాహతుకు మించి ఖర్చుచేసి అందరి మెప్పు పొందినాడు. ఆ ఎనిమిది రోజులు 'కాకియును దినె నేతి వంటకాలు', 'అది గది పెద్ద పెండ్లి అనినారు జనాలు'. అది చాలు రెడ్డికిన్. పొగడ్తలకు పొంగిపోవటం, సమాజంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవాలనే ఆతృతే అతన్ని నిండా ముంచేటట్లు చేసింది. ఆ విధంగా నారప రెడ్డి వెనుకా ముందు ఆలోచించకుండా సంపదనంతా ఖర్చు చేసినాడు.

కరువు పరిస్థితులుః

వ్యవసాయదారుడైన నారపరెడ్డి తండ్రి నుంచి పిత్రార్జితంగా వచ్చిన పంటపొలాలను సాగుబడి చేయించుకుంటూ చక్కని పంటలు పండించుకుంటూ మంచి రైతుగా పేరును సంపాదించుకున్నాడు. ఐతే కొద్ది కాలానికి ఊరిలో 'వఱువు సూపెను, వానలు బిగ్గబట్టె'. కరువు పరిస్థితులు, వానలు తగ్గిపోవటం వల్ల పంటలు పంటక, పండిన పంటకు గిట్టుబాటు లేకపోవటం, ధరలు పడిపోవడం వల్ల ఆదాయం తగ్గిపోయింది. దాంతో అప్పులు చేయవలసి వచ్చింది.

చదలంటు వాములు చదునయిపాయె
గాదెల కణజాల గబ్బిలము జేరె
నాగలోకము దాకునట్టి పాతరలో
మగ్గిన గింజలు తగ్గిపోయె'.....
'ఒక్కటే రోజు మూడు రూప్యముల మణుగు
వేరుసెనగ నాలుగణాల వెలకు తగ్గె
ఒక్క రూకకే యిరువది యొక్క సేర్ల
కొర్రలును జొన్నలును అమ్ముకొనగ వలసె'

ఆకాశాన్ని తాకిన గడ్డివాములు లేకుండా పోయినాయి. ధాన్యం నిండిన గాదెలు ఖాళీ అయినాయి. పాతరలో దాచిన గింజధాన్యాలు అయిపోయాయి. ఇనుప పెట్టెల్లో భద్రంగా దాచుకున్న అప్పులు ఇచ్చిన పత్రాలు ఖర్చయ్యాయి. కుండలలో దాచుకున్న బంగారు నిల్వలు నిండుకున్నాయి.

ధరలు పడిపోవడం వల్ల మూడు రూపాయలు ఖరీదు చేసే మణుగు వేరుశనగ నాలుగు అణాలకు అమ్ముడు పోయింది. 21 సేర్ల కొర్రలు, జొన్నలు 1 రూకకే అమ్ముకోవలసిన దుస్థితి ఏర్పడింది. ఈ విధంగా ఇతర ఆదాయ మార్గాలు లేకపోగా ఉన్న ఆదాయం తగ్గిపోయి అప్పులపాలు కావలసి వచ్చింది.

నారపరెడ్డి ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న సమయంలో ఊరిలో ఉన్న పెద్దిరెడ్డి వంటి వారు అతని ఆస్తులను చవకగా కొనడానికి ఎత్తులు వేసినారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ఆస్తులను అమ్ముకోవడానికి సిద్ధమయ్యాడు. అతడు సంపాదించిన పంటపొలాలు, నాలుగు మిద్దెలతో పాటు పశుసంపద కూడా కోల్పోవలసి వచ్చింది. ఊరిచావట్లో జరిగిన పెద్దల తీర్మానంలో బాకీదార్లలకు చెల్లించవలసిన ధనానికిగాను ఈసారి అతని సమస్త ఆస్తులన్నీ కరిగించ వలసి వచ్చింది. ఐనా అతను చేసిన అప్పులు తీరకుండా పోయాయి.

'తాడూ తలుగూ
కాడీ మోడీ

పారా పలుగూ
కాఱూ కంపా
చెట్టూ చేనూ' .....ఇలా అతని సమస్త సంపదలు బాకీదారుల పరం అయ్యాయి.

'ఎఱ్ఱ ఏగానియే గాని ఇవ్వననక
నల్లపూసలతో ఆస్తినెల్లజూపి
కట్టె వడ్డీ మొదల్ కడ బొట్టువరకు
పత్తి నారపరెడ్డి నిబద్ది మనిషి'

నారపరెడ్డి నిజాయితీపరుడు, పౌరుషం కలవాడు. మానమర్యాదలకు విలువ ఇచ్చేవాడు. తన ఆర్థిక పరిస్థితిని అందరి ముందు ఏకరువు పెట్టి బాకీలు తగ్గించమని అడుగవచ్చును, ఎగగొట్టవచ్చును, పారిపోవచ్చును. కాని ఇన్ని మార్గాలు తన ముందు ఉన్నప్పటికీ నిజాయితీపరుడైన నారపరెడ్డి వేటిని అనుసరించలేదు. నిజాయితీకి నిలబడి మొత్తం ఆస్తులన్నింటిని అమ్మి బాకీలు చెల్లించిన పత్తికుల దుగ్ధ పయోధి సుధాకరుడైన నారపరెడ్డి గుండెధైర్యం మెచ్చదగినది. ఆ నిజాయితీ మార్గం అందరికి అనుసరణీయం.

ఊరి చావిడ్లో నారపరెడ్డి ఆస్తులన్నీ బాకీలపరం కావటం తెల్లవారేసరికి ఊరివారందరికీ తెలిసిపోయింది. చివరకు పసులకాసే పిల్లలు కూడ నారపరెడ్డిని 'దివాల రెడ్డి' అని అనటం మొదలుపెట్టారు. ఆ విషయం విన్న అతని భార్య రామమ్మ అవమానం భరించలేక పసిబిడ్డడైన రంగన్ని కూడా వదిలి ఆత్మహత్య చేసుకొని చనిపోయింది. ఊరిలో మోతుబరి నారపరెడ్డి ఆస్తులన్నీ కరిగిపోయి నారప్పగా పేదరికంలో కూరుకు పోయినాడు. చివరకు పూలమ్మిన చోటే కట్టెలమ్మి బ్రతికినట్టు ఊరి చివర గుడిసెలో బతుకును భారంగా గడిపి కన్ను మూసినాడు నారపరెడ్డి అనబడే నారప్ప. ఆర్థిక పరిస్థితులు అతని సామాజిక జీవితం పై ఎంతో ప్రభావం చూపించింది. అది మరోతరం వాడైన రంగన్ని కూలీవానిగా బ్రతికే విధంగా చేసింది.

ఆనాటి వరిపాలన ఆర్థిక విధానాలు, కుటుంబపరమైన ఇబ్బందులు, అప్పటి వివాహ వ్యవస్థ, కీర్తికాంక్ష, ముఖస్తుతికి పొంగిపోయి ఉచితానుచితాలు ఆలోచించకుడా అడిగిన వారికి లేదనకుండా దానం చేయటం, లంచాలకు అలవాటుపడిన అధికారులు, చేతికి అందివచ్చిన మగసంతానం లేకపోవటం, తగిన సలహాలు ఇచ్చే బంధువర్గం కరువవటం, కరువు పరిస్థితులు, పంటలు పండకపోవటం, పండిన పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవటం వంటి ఆర్థిక సమస్యలు నారపరెడ్డి చితికిపోవడానికి కారణాలు అయ్యాయి.

ఇది రైతు కావ్యం. అభ్యుదయ కావ్యం. ఇతివృత్త స్వీకరణ, భాషలోను, ఛందస్సులోను దేశీయత కనిపిస్తుంది. తేటగీతి, ఆటవెలది, సీసం, కందం, ద్విపద వంటి తెలుగు ఛందస్సులను స్వీకరించారు. కొన్నిచోట్ల గేయం, పాటను అందుకున్నారు. తెలుగు పదాలు, చక్కని ఉపమానాలు, ప్రాసలు అలరిస్తాయి. సరళమైన భాషలో అందరికి అర్థమయ్యే విధంగా కావ్యాన్ని రాశారు. విశ్వం గారు గ్రామీణ జీవితం గడిపి ఉండడం వల్ల అనుభవ పూర్వకంగా ఈ కావ్యాన్ని రాయగలిగినారు.

ఆధార గ్రంథాలుః

1. పెన్నేటి కావ్యం – విద్వాన్ విశ్వం
2. తెలుగులో కవిత్వోద్యమాలు–(సం) డా. ఎ. మంజు లత, తెలుగు అకాడమీ, హైదరాబాదు.

యుగాంతంలో స్నేహబంధం

ఎస్ రామస్వామి, తెలుగు ఉపన్యాసకులు డిగ్రీ కళాశాల సిద్దిపేట. సెల్ : 6301845163

నెల్లూరి కేశవస్వామి స్వయంగా చూసి రచించిన గొప్ప రచన యుగాంతం. సామాజిక పరిస్థితుల దృష్టి నేపథ్యంలో రచించిన రచన అయినప్పటికీ స్నేహానికి గొప్ప నిదర్శనంగా నిలిచే కథ ఈ యుగాంతం. ఒకమాటలో చెప్పాలంటే ఆనాటి హైదరాబాద్ రాజ్యంలోని ప్రత్యేక పరిణామాలను సామాజిక చరిత్రకు ఈ కథ ఒక చారిత్రక డాక్యుమెంటులా మన ముందుంది అంటారు. దానితో పాటు ఒక గొప్ప స్నేహానికి నిదర్శనం అయిన గొప్ప డాక్యుమెంటరీ అనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఎందుకు అంటే పరిస్థితులు, పరిసరాలు అనుకూలంగా ఉన్న సమయంలో ఎలాంటి ఒత్తిడి, భయంలేని స్నేహం వికసిస్తుంది. స్నేహం ఇంకా పెరుగుతుంది కాని ఆనాటి హైదరాబాద్ రాజ్యంలో ఉన్న హిందూ, ముస్లిం విభేదాలు తారాస్థాయిలో ఉండటం గమనించవచ్చు. పోలిస్ చర్య ద్వారా పూర్తిగా ముస్లిం హిందూ ఈ పోలీసు చర్య ద్వారా ముస్లింలలో భయం హిందూ – ముస్లిం సంప్రదాయాన్ని రూపు మారింది. అలాంటి పరిస్థితుల్లో కూడా చిన్ననాటి స్నేహితుడు అర్ధరాత్రి సమయంలో కేశవస్వామి ఇంటికి వచ్చిన నమయంలో స్నేహితుడ్ని ఆహ్వానించి ఆశ్రయమిస్తాడు. ఇక్కడ గమనించవలసిన విషయం ఏంటంటే తన స్నేహితుడైన దిలావర్ ఇంట్లో ఉంచుకోవడం వల్ల చుట్టుపక్కల ఉన్న హిందువులు చూస్తారు అని ముస్లింలకు ఆశ్రయం ఇచ్చారు అని నిందిస్తారు. అని తెలిసి కూడా ఆశ్రయం ఇవ్వడం అనేది స్నేహానికి ఇచ్చిన గొప్ప విలువ. అలాగే సైనికులు కూడా ఉన్నారు అని తెలిసి కూడా స్నేహితునికి సహాయం చేయడానికి ఒప్పుకున్నాడు. ఈ విషయం తెలిస్తే సైనికులు ఇతనినే కఠినంగా శిక్షిస్తారు అని తెలిసి కూడా స్నేహానికి ప్రాధాన్యతనిచ్చాడు.

అర్ధరాత్రి సమయంలో ఇంటికి వచ్చిన స్నేహితుని మట్టి బట్టలు చూసి ఏదో ఆపదలో ఉన్నట్లు గ్రహించి అన్నం పెట్టిన తర్వాత విషయం తెలుసుకునే ప్రయత్నం చేశాడు. దీనిద్వారా ఆపద సమయంలో వచ్చినవాడికి అన్నం పెట్టిన తర్వాత విషయం తెలుసుకోవడం అర్థం చేసుకుని స్నేహానికి మంచి ఉదాహరణగా చెప్పవచ్చు.

దిలావర్ కు ఏమయింది అనే విషయం తెలుసుకునే క్రమంలో అతను కేవలం టెక్స్‌టైల్ లో పనిచేసే ఉద్యోగిగా మాత్రమే కేశవస్వామికి తెలుసు. కానీ దిలావర్ తాను ఒక రజాకార్‌నని చెప్పిన మరుక్షణం స్వామి యొక్క గుండె ఆగిపోయినంత పని అయింది. అయినప్పటికీ ఆ కఠోర నిజాన్ని తన హృదయంలో ఇముడ్చుకొని తను ఎప్పటిలాగానే తన ప్రాణ మిత్రునిగా భావించాడు. అదే నెల్లూరి కేశవస్వామి స్థానంలో మరొకరు ఉంటే మాత్రం రజాకార్‌ని భారత సైన్యానికి అప్పగించి ఎంతో మంది హిందువులు అనుభవించిన బాధలకు ప్రాయశ్చిత్తం చేసుకునేవారు. కానీ కేశవ స్వామి అలాంటి ప్రయత్నం చేయకుండా ఒక రాక్షసుడు అని తెలిసినప్పటికీ అతనిని ఒక స్నేహితుని గా ఇంతకు పూర్వం ఎలా ఆదరించాడో అదే ఆదరణ రజాకార్ అని తెలిసాక కూడా చూపించాడు. అంటే వారి స్నేహం ఎలా ఉంటుందో అర్థమవుతుంది.

అంతేకాకుండా పోలీస్ చర్య సమయంలో హైదరాబాద్ రాజ్యంలో ఎవరిని ఎవరు నమ్మడానికి వీలు లేని పరిస్థితులలో ముస్లింలు హైదరాబాదులో ఉన్న హిందువులపై ఎక్కడ దాడి చేస్తారో అన్న భయం తో ఉన్న సమయంలో అర్ధరాత్రి ముస్లిం వేషధారణలో వచ్చిన వ్యక్తి రూపం పరిచయం రూపంగా ఉండి కూడా బాగా తెలిసిన గొంతులా అనిపించినప్పటికీ తలుపులు తీయడానికి సాహసం చేయలేదు. మన కేశవ స్వామి గారు కానీ వచ్చింది దిలావర్

అని తెలియగానే తను ఒక ముస్లిం అయినప్పటికీ వెనక ముందు ఆలోచించి ఆలోచించకుండా ఈ స్నేహితుని నమ్మి తలుపు తీస్తాడు. ఇక్కడ స్నేహం అంటేనే భయాలను పారద్రోలే ఒక నమ్మకం అనే విషయం ఈ సన్నివేశం ద్వారా చూపించారు రచయిత.

దిలావర్ పడుకునే సమయంలో ఒక మాట స్వామికి మూట ఇచ్చి దాచమంటాడు. కానీ స్వామి భయపడి ఏమిటిది అడుగుతాడు. దిలావర్ కొంచెం డబ్బు కొన్ని నదులు ఉన్నాయి అనగానే స్వామి చాలా భయపడి నాకెందుకు అంటాడు. రేపు ఎటు పోయి ఎటు వస్తుందో తెలీదు నన్ను ఏ క్షణాన్నైనా పోలీసులు పట్టుకోవచ్చు నీ దగ్గర సురక్షితంగా ఉంది అనే తృప్తి నాకు ఉంటుంది అంటాడు.

ఈ మాటల ద్వారా దిలావర్ కి తన స్నేహితుడైన స్వామి పైన ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుంది. డబ్బు సంపాదించాలని ఒకవేళ తాను పోలీసులకు పట్టుబడితే ఆ డబ్బు తన స్నేహితుని ఉన్నది అతనికి చెందింది అని ఆనందం ఉంటుంది అని తన మాటల్లో గ్రహించవచ్చు. కానీ స్వామి ఆ డబ్బుని తీసుకోవడానికి సంకోచిస్తాడు. కేవలం తన దిలావర్ కోసం మాత్రమే ఇష్టం లేకుండా తీసుకుంటాడు.

ఇక్కడ గమనించవలసిన మరో విషయం ఏమిటంటే ఆ మూటని విప్పి డబ్బులు లెక్క పెట్టే ప్రయత్నం చేసే దిలావర్ ఆమూట విప్పద్దు. నాకు నీ పై పూర్తి నమ్మకం ఉంది అనే మాటల ద్వారా స్వామి పై దిలావర్ కున్న నమ్మకం తెలుస్తుంది.

దిలావర్ కు తనపై ఉన్న నమ్మకం చూసి ఆ మూటను అలాగే బీరువా లో పెట్టడం జరుగుతుంది. ఇది నమ్మకానికి నిదర్శనం.

దిలావర్ నాకు చిన్ననాటి స్నేహితుడు నా సహపాఠి కాకపోయినా ఒకే బస్తీలో ఉండేవాళ్ళం. ఆటల్లో పరిచయమై మంచి స్నేహంగా మారింది. అది మేము యూనివర్సిటీలో చేరాక ఒకే హాస్టల్‌లో పక్క పక్క గదుల్లో ఉండటం మరీ పెరిగింది. నేను అతని ఇంటికి వెళ్లడం, అతను మా ఇంటికి రావడం జరుగుతుండేది.

అప్పుడే అమ్మతో కూడా పరిచయమైంది. మా ఇంట్లో బాగా చనువు ఏర్పడింది. ఈ విషయాల ద్వారా హిందూ ముస్లిం అనే తేడా లేకుండా వారి మధ్య, కుటుంబాల మధ్య మంచి స్నేహ సంబంధం ఏర్పడింది అని తెలుస్తుంది. ఈ మతసామరస్యానికి కారణం స్నేహబంధం అని గుర్తించాలి.

దిలావర్ కు యూనివర్సిటీలో ఉండగానే వివాహమైంది. ఒక అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఇష్టం లేని దిలావర్ మామయ్య అతడిని ఇంట్లో నుండి వెళ్లగొట్టాడు. అయినా కూడా స్వామి దిలావర్ ఆజం పూర్ లో కాపురం ఉంటున్న ఇంటికి వెళ్ళాడు. తన బాగోగులు అడిగి తెలుసుకునే వాడు. తనతోపాటు వాళ్ళ అమ్మని కూడా దిలావర్ ఇంటికి తీసుకెళ్ళే వాడు. తన భర్త తనను పెంచిన మామయ్య దిలావర్‌ని దూరం పెట్టిన స్వామి మాత్రం తన స్నేహాన్ని వదులుకోలేదు. అలాగే తన కుటుంబం వెళ్లగొట్టిన కూడా స్వామి తన తల్లి ద్వారా పెద్ద దిక్కు చేశాడు. ఇక్కడ దిలావర్‌కు స్వామి యొక్క స్నేహం వలన ఒక కుటుంబం లేని లోటు తీరుతుంది అని గ్రహించాలి.

స్వామి యొక్క హిందూ మిత్రులు మరియు ఆ వాడ పెద్ద మనుషులు స్వామి వారి ఇంటికి ముస్లింల గురించి మాట్లాడుతుంటే ఆ మాటలు విని దిలావర్ బాధపడతాడు అని, వారిని వారిస్తూ పంపిస్తాడు. కేవలం తన స్నేహితుని కోసం ఇరుగు పొరుగు వారిని సైతం, హిందువులను కూడా వారించడం వల్ల స్నేహానికి ఇచ్చిన విలువ అర్థమవుతుంది.

దిలావర్ ఆజంపూర్‌లో నా భార్య ఉండే ఇంటికి, గౌలిగూడ లో మావయ్య ఇంటికి వెళ్లి నా కోసం పోలీసులు ఎవరైనా వచ్చారేమో జాగ్రత్తగా తెలుసుకుని రావాలి, నేను ఇక్కడ ఉన్నానని గానీ నీకు అసలు కనిపించానని గాని ఎంత మాత్రం వాళ్లకు తెలియనివ్వద్దు అనడం వల్ల వీరి

యొక్క స్నేహం మరొకసారి బయటపడుతుంది. ఎలా అంటే తన భార్య తనను విడిచి పెట్టిన విషయం అక్కడికి వెళ్ళిన స్వామికి తెలుస్తుంది. అని తెలుసి కూడా తన వద్దకు వెళ్లి తెలుసుకోవాలి అని చెప్పడం వల్ల అర్థమవుతుంది. భార్యను సగభాగంగా భావించేవారు అలాంటిది ఆ విషయాన్ని స్వామి చెప్పడం వల్ల దిలావర్ తన భార్య కంటే స్వామికి ఎక్కువ స్థానం ఇచ్చాడు అనే విషయం తెలుస్తుంది.

అలాగే ఈ విషయంలో స్వామి చేసిన సాహసం కూడా చాలా గొప్పది. ఎందుకంటే దిలావర్ గురించి పోలీసులు వెతుకుతున్న సమయంలో అతని గురించి తను నివాసం ఉన్న ప్రాంతంలో తన గురించి అడగటం అనేది చాలా సాహసంతో కూడిన పని. అలాంటి పనిని కూడా తన ప్రాణ మిత్రుని గురించి చేయడానికి తెగించాడు అంటే కేవలం స్నేహం కోసమే అని గుర్తించాలి.

గౌలిగూడ లో ఉన్న దిలావర్ మావయ్య దగ్గరికి స్వామి వెళ్లగానే చాలా ప్రేమగా కౌగిలించుకొని స్వామిని దిలావర్ వచ్చాడా అని అడుగుతాడు. ఎందుకంటే దిలావర్ స్వామి ఎంత మంచి మిత్రులో దిలావర్ మావయ్యకు తెలుసు కాబట్టి.

స్వామి నాకు దిలావర్ గురించి తెలియదు అనగానే పోలీసులకు దొరికాడేమో అని చాలా దు:ఖిస్తాడు. అది చూసిన స్వామి దిలావర్ గురించి చెప్పాలి అనుకున్నాడు. కానీ నీ దిలావర్ చేసిన హెచ్చరిక గుర్తుకు వచ్చి ఆగిపోయాడు. ఎందుకంటే దిలావర్ మామయ్య బాధ కంటే దిలావర్ క్షేమం ముఖ్యం అని గుర్తించి దిలావర్ గురించి విషయం ఏమి అతని మామయ్య దగ్గర ప్రస్తావించలేదు. ఈ విషయం ద్వారా మరోసారి స్వామి దిలావర్ క్షేమం గురించి ఎంత ఆలోచిస్తున్నాడో అర్థమవుతుంది.

దిలావర్ చెప్పిన గుడ్డలు స్వామి కొనలేదు. ఎందుకు అని అడిగితే ఎన్నడూ ఖద్దరు, ధోతి, లాల్చీ వేయడం మంచిది కాదు. అలాంటి వారిని రైలు నుంచి దింపి చిత్రహింసలు పెడుతున్నారు అని తెలిసింది అంటాడు.

ఇందులో గ్రహించవలసిన విషయం ఏంటంటే తన ప్రాణ మిత్రునికి ఎలాంటి ఆపదలు రాకుండా స్వామి ముందు జాగ్రత్త వహిస్తున్నాడు అని అర్థమవుతుంది. దిలావర్ స్వామితో మక్కా మసీద్ నమాజ్ చదవడానికి వెళ్తున్నాను. బహుశా ఇదే ఆఖరి సారేమో అంటూ నా రెండు చేతులు తన చేతుల్లోకి తీసుకొని ఒక్క క్షణం నా కళ్ళలోకి నిశితంగా చూసి మరో ప్రశ్నకు ఇవ్వకుండా వెళ్ళిపోయాడు.

ఈ సన్నివేశంలో దిలావర్ పాకిస్థాన్‌కి వెళ్లిపోతున్న విషయం తనకు తెలుసు. అందుకే స్వామిని కలవలేను అని తెలిసి చివరిగా ప్రేమగా తన కళ్ళల్లోకి కళ్ళు పెట్టి ఆప్యాయంగా చూసి వెళ్లిపోయాడు. ఇక్కడ స్నేహితునికి ఇచ్చిన ప్రాముఖ్యత అర్థమవుతుంది.

దిలావర్ పాకిస్తాన్ వెళ్లే ముందు బొంబాయి నుండి చివరిసారిగా ఉత్తరం కేవలం తన ప్రాణ మిత్రుడైన స్వామికి రాశాడు. తనను పెంచిన మావయ్యని కూడా కాదని తన స్నేహితుని కిచ్చిన ప్రాముఖ్యత వల్ల స్నేహబంధం ఇంకా బలపడింది. అలాగే తను ఇచ్చిన డబ్బులు ఇచ్చినా తీసుకోడు. అలాగే తన భార్య తనకు విడాకులు ఇచ్చింది అని తను మంచిది కాదు అనే విషయాన్ని తెలుపుతూ ఆమెకు చిల్లిగవ్వ కూడా ఉండకూడదు అని హెచ్చరిస్తాడు. ఇక ఆ డబ్బు తీసుకునే అర్హత నీకు మాత్రమే ఉంది అని అంటూ నీ స్నేహితుడు ఇచ్చే చివరి కానుకగా స్వీకరించు అంటాడు.

తన స్నేహితుడి మనసు తెలిసిన వాడు కాబట్టి తిరిగి మళ్ళీ తానే నువ్వు ఆ డబ్బు తీసుకో అని తెలుసు అని అంటాడు. అంటే స్వామి యొక్క వ్యక్తిత్వం ఎలాంటిదో తను ఎలా ఆలోచిస్తాడు. అనే విషయం పూర్తిగా దిలావర్‌కు తెలుసు. ఎందుకంటే స్నేహితులకు మాత్రమే వారి గురించి వారి ఆలోచనా విధానం గురించి తెలుస్తుంది. అనే విషయం స్పష్టంగా తెలుస్తుంది.

చివరికి ఈ డబ్బు నగలు అసలు దారులకు అందించే ప్రయత్నం చేయకు. తను ఇచ్చిన నగల మూట వల్ల ఎలాంటి ప్రమాదం గురికావద్దు అని ముందుచూపు తన స్నేహితుడి పై ఉన్న ప్రేమను తెలియజేస్తుంది.

వాస్తవానికి దిలావర్ హుస్సేన్ చాలా క్రూరుడు. అనేక హింసలు, మారణకాండలు చేసిన ఒక కఠినమైన రజాకార్. అయినప్పటికీ గొప్ప మనసు కలిగిన నెల్లూరి కేశవస్వామి ప్రాణభయంతో వచ్చిన చిన్ననాటి స్నేహితుడుని ఆదరించి తనకు ప్రాణ భిక్ష పెట్టి తన దేశం వదిలి వెళ్ళడానికి సహాయం చేశాడు. కేవలం వీరి మధ్య ఉన్న స్నేహబంధం మాత్రమే దిలావర్‌ని రక్షించింది అనే విషయం స్పష్టంగా తెలుస్తుంది. అందుకే స్నేహబంధం అనే పేరు పెట్టడం జరిగింది.

ఆధార గ్రంథాలు :

1. యుగాంతం– కథ
2. తెలుగు సాహిత్య చరిత్ర– ద్వా.నా.శాస్త్రి

అత్యాధునిక ప్రక్రియలు – వీక్షణం

డా. పాండురంగం కాళియప్ప, అతిథి ఉపన్యాసకుడు, తెలుగుశాఖ మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై.

పరిచయం

సాహిత్యం సమాజ జన్యం. సాహిత్యమే కాదు, ఏ కళకైనా మానవ జీవితం పునాది. కళలన్నీ మానవ సామూహిక జీవనం నుండి పుట్టినవే. ఇవన్నీ మానవ శ్రమకు ప్రతిరూపాలు. సమాజంలోని మానవ జీవితం, సంబంధాలు ఆ కాలం నాటి ఉత్పత్తి విధానాల మీద ఆధారపడి ఉంటాయి. శ్రమ నుండి ఏర్పడే ఉత్పత్తి విధానాల నుండే సమాజం ఏర్పడుతుంది. కళకూడా మానవ శ్రమలోంచి పుట్టినదే. సాహిత్య కళ కూడా మానవ శ్రమనుండే పుట్టింది. కాబట్టి మానవ సంబంధాలన్నీ సాహిత్యంలో ప్రతిబింబిస్తాయి.

వెయ్యేళ్ళ తెలుగు సాహిత్య చరిత్రను గమనిస్తే ఎంతో విశిష్టమైన సాహిత్యం వెలుగుచూసింది. అయితే 19వ శతాబ్దం తర్వాత పాశ్చాత్య ప్రభావం, సమాజంలో నెలకొన్న మార్పుల ప్రభావం ఇవి తెలుగు సాహిత్యంలో కూడా మార్పుకు కారణమైంది. ఈ క్రమంలో సంఘసంస్కరణోద్యమం, భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం, దిగంబర కవిత్వం, విప్లవ కవిత్వాలు ఒక ఎత్తైతే దాని తర్వాత వచ్చిన కవితా ధోరణులైన స్త్రీవాదం, దళివాదం, ముస్లింవాదం, బి.సి.వాదం, మినీకవిత్వం, నానీలు, హైకూలు మొదలైన అత్యాధునిక కవితా ప్రక్రియలు సమాజంలో సమూలమైన మార్పులను తీసుకురావడంలో, సామాన్యులను సైతం చైతన్యవంతులను చేశాయనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ క్రమంలో పరిశోధనావ్యాస పరిధిని దృష్టిలో ఉంచుకుని ముస్లింవాద కవిత్వం, మినీకవిత్వం, హైకూలు, నానీ ప్రక్రియల గురించి చర్చించి అందులోని విమర్శను స్పృశించడమే ఈ వ్యాస ముఖ్య ఉద్దేశం.

ముస్లింవాద కవిత్వం

ఆధునిక తెలుగు సాహిత్యంలో అనేక ధోరణులు చోటు చేసుకున్నాయి. అలా వచ్చిన ధోరణులన్ని తెలుగు కవిత్వానికి కొత్తదనాన్ని, నిండుతనాన్ని కలిగించాయి. ఈ విధంగా వచ్చిన కవితా ధోరణి "ముస్లింవాద కవిత్వం". తెలుగు సాహిత్యంలో ముస్లింలు ఎక్కువగానే రచనలు చేశారు. వీరు భారతదేశంలో మైనార్టీలుగా పిలువబడుతున్నారు. ముస్లింలు తెలుగు సాహిత్యానికి చేసిన సేవ ప్రశంశనీయమైనది. అయితే హిందూమత ఛాందస భావాలు కలవారు ముస్లింలను అనేక రకాలైన యాతనలకు గురిచేశారు. ఈ విషయాన్ని ముస్లిం కవులు జీర్ణించుకోలేక పోయారు. ముస్లిం రచయితలు, కవులు, ఎవరూ, ఎప్పుడూ తమ స్వార్థంకోసంగాని, తమ తమ మతప్రచారం కోసంగాని కలం పట్టలేదు. వజీర్ రెహ్మాన్, ఇస్మాయిల్, స్మైల్, దేవీప్రియ, సుగమ్‌బాబు, కౌముది మొదలైన ముస్లిం కవులు కవిత్వంలో ఎక్కడా ముస్లింవాద భావాలు లేవు. వీరు ఆ దృష్టితో కవిత్వం రాయలేదు. మనదేశంలోని అనేక అంశాల్ని తీసుకొని అద్భుతంగా కవిత్వాన్ని రాశారు.

1990 అక్టోబరు, నవంబరు నెలల్లో బాబ్రీమసీదు ఒక గోపురం కూల్చేందుకు విఫలయత్నం జరిగింది. ముస్లింల అస్తిత్వాన్ని ప్రశ్నిస్తూ 1991లో ఖాదర్ రాసిన 'పుట్టుమచ్చ' మొదట ముస్లిం కవిత. అందులో ఖాదర్ భారతదేశంలో ముస్లింలు సాంఘికంగా, మానసికంగా పడే పోరాటాన్ని, వారి జీవితాన్ని చూపాడు. డిసెంబరు 6, 1992లో బాబ్రీ మసీదు విధ్వంసం జరిగింది. ముస్లింల గొంతు హెచ్చింది. మాట్లాడే స్థితిని చూస్తాం. ఒక స్పష్టత, తీవ్రత కనిపిస్తుంది. 'కంజీర' పత్రిక ప్రత్యేక సంచిక 'డిసెంబరు 6' పేరుతో ప్రచురించింది. అందులో ముస్లింల భావోద్వేగాలు కన్పిస్తాయి. 1995లో వచ్చిన 'చిక్కనవుతున్న పాట'లో ఏడుగురు ముస్లిం కవులు రాసిన కవితలున్నాయి. అదే విధంగా 1996లో 10 మంది ముస్లిం కవులు తమదైన

స్వరాన్ని వినిపించారు. ఇంకా బహువచనం, మొగి వంటి సంకలనాలు వచ్చాయి. విరసం ప్రచురించిన జిహాద్ (1997)లో 'ముస్లిం మైనారిటీ కవుల కవిత్వం' మొదటిసారిగా చూడవచ్చు. మార్చి 1998లో స్కైబాబా సంపాదకత్వంలో "జల్‌జలా" అనే ముస్లింవాద కవితా సంకలనం వచ్చింది. ఇది సాధికారకమైన సమగ్ర ముస్లింవాద కవిత్వం. తెలుగు ముస్లింల జీవితం ఇందులో ప్రత్యక్షంగా కన్పిస్తుంది. 'జిహాద్', 'జల్‌జలా' సంకలనాల తరువాత బ్లాక్ వాయిస్(ఇక్బాల్ చంద్) ధూ (కరీముల్లా), ముఖట్(హనీఫ్) మొదలైన కవితా సంకలనాలు వచ్చాయి. 'వలస' అనే కవితా సంపుటిని అఫ్సర్ రాశాడు. ఇందులో ముస్లింవాద కవిత్వం బలంగా ఉంది. తెలుగులో ముస్లిం స్త్రీ గురించి రాసిన మొట్టమొదటి ముస్లిం స్త్రీ షాజహానా ఈమె రాసిన "పర్దా హఠాకే దేఖో" అనే కవిత ముస్లింవాద కవిత్వానికి ఒక ఊపునిచ్చింది. అదే విధంగా రజియా, మహజబీన్, షంషాద్ బేగం మొదలైన కవియిత్రులు ముస్లింవాద కవిత్వంలో స్త్రీవాద అంశాల్ని స్పృశించారు.

ముస్లింవాద కవిత్వం విమర్శ

తెలుగు సాహిత్య విమర్శకుడిగా ఎదిగే క్రమంలో యాకూబ్ ముస్లింవాద కవిత్వంలోని ముస్లింల సాహిత్య వస్తువు, కవిత్వ శిల్పం, ముస్లిం భాష మొదలైన వాటి గురించి బలమైన అభిప్రాయాలను ప్రకటించడం జరిగింది. ముస్లింల సాహిత్య వస్తువు గురించి యాకూబ్, వీరి సాహిత్యాన్ని మొత్తంగా పరిశీలించినపుడు అస్తిత్వ పోరాటమే ప్రధానంగా కన్పిస్తుంది. మనం ముందే చెప్పుకున్నట్లు ఎంతో అననుకూల పరిస్థితుల్లో తమ సాధికారకతను నిలుపు కోవడం కోసం, అస్తిత్వపు పెనుగులాటే ముస్లిం సాహిత్య కారుల ప్రధానాంశంగా చెప్పొచ్చు. ఏకాకులమన్న భావన, అభద్రతా భావాలతో కవిత్వ మెక్కువగా వచ్చింది. ఇంకా ముస్లింలు ముస్లింలుగా మాట్లాడటం కవిత్వంలో ముందుగా జరిగింది. ఆ తర్వాత కథల్లో వచ్చింది. ఆవేదనలు, ఆక్రోశాలు, కష్టాలు, నష్టాలు, దారిద్ర్యాలు, కోల్పోయిన వైభవాలు, స్నేహాలు, మోసాలు, సంస్కృతి ఇవన్నీ కవిత్వ వస్తువులైనాయని యాకూబ్ పేర్కొన్నారు. ముస్లిం కవిత్వ శిల్పం గురించి యాకూబ్ ఈ విధంగా తెలిపారు.

ఇంతకకు ముందున్న కవిత్వంలో వ్యవస్థితమైన భాషని, పదచిత్రాన్ని, ప్రతీకల్ని వాటికి ఆపాదించిన కాల్పనికతని ముస్లిం కవులు ముక్కలు చేశారు.

అందుకుగాను నేటివిటితో కూడిన భాషని, తమదైన అభివ్యక్తుల్ని, తమ వృత్తులకు సంబంధించిన పనితనం నుండి ప్రతీకల్ని, పునర్లిఖించడంలో మిగతా కవితోద్యమాలకంటే ముస్లిం కవితోద్యమ ప్రత్యేకతను సంతరించుకుంది.

తమ తమ సాంప్రదాయాలకు సంస్కృతికి సంబంధించిన ఉర్దూ, అరబ్బీ అక్కడక్కడా పార్శీ పదాలను ఉపయోగించి తమకు తెలియకుండానే సామాజిక పరమైన శిల్పం సాధించారు. ముస్లింల భాష గురించి వివరిస్తూ యాకూబ్ "సాహిత్య సృజన చేస్తున్న కవులు, రచయితల్లో చాలా వరకు అట్టడుగు వర్గాల, మధ్యతరగతి వాళ్ళ సంఖ్యే ఎక్కువగా ఉంది. అందుకే వాళ్ళు "మా కలాలూ తెలుగే, కన్నీళ్ళూ తెలుగే" అనగలిగారు. ఆంధ్ర ముస్లింలలో తెలుగే ఎక్కువగా మాట్లాడతారు, తెలంగాణా ముస్లింలో ఉర్దూ వాడుకలో ఉంది." అని పేర్కొన్నారు. ముస్లింవాద సాహిత్యంలో ప్రవ్రుత్తానికి నాలుగు ధోరణులు కన్పిస్తున్నాయని స్కైబాబా పేర్కొన్నారు. అవి. 1. హిందుత్వం తరపున ముస్లింలపైన జరుగుతున్న దాడుల్ని, వివక్షను, నవితిప్రేమను అణగద్రొక్కే ప్రయత్నాలను, గోబెల్ ప్రచారాలను ఎత్తి చూపడం తీవ్రంగా పరిగణించడం, ఖండించడం, ముస్లిం హక్కుల్ని ఎలుగెత్తడం తద్వారా సొంత అస్తిత్వాన్ని ప్రకటించడం. 2. ఇస్లాంలోనూ సంస్కరణల్ని ప్రతిపాదించడం. 3. ముస్లిం స్త్రీవాదం. 4. ముస్లింలలో బిసీ (ప్రస్తుతం)ల సాహిత్యం.

1990 నుండి ప్రారంభమైన ముస్లింవాద కవిత్వాన్ని మొదటగా పరామర్శించిన విమర్శకుడు చేరానే. తన చేరాతల్లో భాగంగా కొన్ని ముస్లింవాద కవిత్వాలను ఆయన విశ్లేషించారు. 'చిక్కనవుతున్న పాట', 'పదునెక్కిన పాట'లోని కొన్ని ముస్లింవాద కవితలను జి. లక్ష్మీనరసయ్య విశ్లేషించారు. 2000 సంవత్సరము నుండి యాకూబ్ అటు ముస్లింవాద కవిత్వాన్ని, కథలను తనదైన రీతిలో విమర్శిస్తున్నారు. ఆచార్య వెలమల సిమ్మన్న కూడా తన "తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు" అనే గ్రంథంలో ముస్లింవాద కవిత్వ విమర్శ చేశాడు. "తెలుగు సాహిత్య విమర్శ – ఆధునిక ధోరణులు" అన్న తన సిద్ధాంత గ్రంథంలో యాకూబ్ ముస్లింవాద సాహిత్య విమర్శ యొక్క తీరుతెన్నులను చూపించారు.

మినీకవిత్వ విమర్శ

తెలుగు కవితా రంగంలో 1975 నుంచి 'మినీ కవితలు' వచ్చాయి. 1980 నాటికి ఒక బలమైన ఉద్యమంగా మినీకవిత రూపుదాల్చింది. తెలుగు సాహిత్యంలో వచన కవిత వచ్చిన ఐదు దశాబ్దాల తరువాత మినీకవిత తెరపైకి వచ్చింది. దీనిని ఎక్కువగా ప్రచారం చేసి వ్యాప్తి చేసినవారు డా. రావి రంగారావుగారు. ఆ తర్వాతే మినీకవిత గూర్చి అందరూ మాట్లాడడం ప్రారంభించారు. మినీకవితను ఒక ఉద్యమంగా తెచ్చిన ఘనత రంగారావుకే దక్కుతుంది. అంచేతనే విమర్శకులు రాంగారావుగారిని 'మినీకవితా పితామహుడు' అని పేర్కొన్నారు. వచన కవితలోని విస్మృతికి అభివ్యక్తిలోని వాచ్యతకు విసిగిన యువలోకం సంక్షిప్తంగా, బలంగా, వ్యంగ్యంగా, భాషావిష్కారాన్ని సాధించాలన్న తపనలో నుంచి మినీకవిత పుట్టింది. ఒక భావాన్ని బలంగా చెప్పడానికి ఒక క్రొత్త వాహికగా అవతరించడం చేతనే ఇంత ఆదరణ పొందింది.

మినీకవిత్వం మీద తొలిసారిగా రంగారావు గారు 1980 ఏప్రిల్ 'భారతి'లో 'మినీకవిత' అనే పేరుతో ఒక వ్యాసాన్ని రాశారు. 1980 నుండి రంగారావు గారు రాస్తున్న వ్యాసాల్ని "మినీకవిత – శిల్ప సమీక్ష" అనే పేరుతో 1999లో ఒక గ్రంథాన్ని ప్రచురించారు. ఇందులో 13 వ్యాసాలు చోటు చేసుకున్నాయి. 1994లో ''మినీకవిత విద్యావిలువలు'' అనే పేరుతో నాగార్జునా విశ్వవిద్యాలయంలో ఒక ఎం.ఫిల్. వచ్చింది. 2002లో "మినీకవితలో మెనీ భావాలు" పేరుతో మరొక గ్రంథం వచ్చింది. 1998లో రావుగారు పిహెచ్.డి. చేసిన "పిల్లలలో మినీ కవిత్వ రచనా నైపుణ్యాలు" అనే గ్రంథం వచ్చింది. తన మినీ కవితా సిద్ధాంతాన్ని విద్యాబోధన రంగంలో అనువర్తిస్తూ పరిశోధన చేశాడు. 400 మంది స్కూలు పిల్లలతో కవితా రచనా ప్రయోగాలు చేశాడు. ఈ రకపు పరిశోధన ప్రపంచంలో ఎక్కడైనా, ఎవరైనా చేశారేమో నా దృష్టికి రాలేదు. ఇది అపూర్వ పరిశోధన అని ప్రముఖ విమర్శకులు ఆచార్య చేరా పేర్కొన్నారు.

హైకూ కవిత్వం

జపాన్‌లో ప్రారంభమైన ''హైకూ'' ప్రక్రియ క్రమక్రమంగా ప్రపంచంలోని అన్ని భాషలలోకి ప్రవేశించింది. మనదేశంలో హిందీ, గుజరాతీలు హైకూల్ని ఎక్కువగా రాశారు. ఈ "హైకూ" ని తెలుగు సాహిత్యంలో గాలి నాసరరెడ్డి, డా. పెన్నా శివరామకృష్ణ, ఇస్మాయిల్, బి.వి.పి. ప్రసాద్ గార్లు ప్రవేశపెట్టారు. 1990లో గాలి నాసరరెడ్డి 'హైకూ' రచన ప్రారంభించారు. 1991లో ఆంధ్రజ్యోతి దినపత్రికలో "వానాకాలం హైకూలు" అనే పేరుతో ఇస్మాయిల్ రాశారు. మొట్టమొదటిసారిగా పెన్నా శివరామకృష్ణ "రహస్య ద్వారాం" పేరుతో హైకూ సంపుటిని ప్రచురించారు. ఇక అప్పటి నుండి విరివిగా హైకూ సంపుటాలు ముద్రితమయ్యాయి. హైకూల విశ్వవ్యాప్తి కోసం 2002లో అనకాపల్లిలో డా. తలతోటి పృథ్వీరాజ్ "ఇండియన్ హైకూ క్లబ్" స్థాపించారు. ఇది ఒక మంచి ప్రయోగం. వీరి ఆధ్వర్యంలోనే 2003 నుండి "హైకూ

సాహిత్య మాస పత్రిక" కూడా ప్రారంభించబడింది. హైకూల్ని నిశితంగా పరిశీలిస్తే వస్తు వైవిధ్యాన్ని బట్టి ప్రాకృతిక, తాత్త్విక, సామాజిక అంశాలు కనిపిస్తాయి.

హైకూ కవిత్వం విమర్శ

ఇస్మాయిల్‌గారు "దృశ్యాదృశ్యం", ఆకాశదీపాలు, "వెన్నెల రాత్రి వాస" మొదలైన హైకూ సంపుటాలకు పీఠికలు రాశారు. ఈ పీఠికలు ఎంతో మంది సహృదయ పాఠకులను ఆకట్టుకున్నాయి. రావి రంగారావు మినీకవిత, హైకూలకు మధ్య ఉన్న తేడాను వివరణాత్మకంగా విశ్లేషిస్తూ "మినీకవిత ప్రభావం వల్ల హైకూలకు ప్రచారం" అనే మంచి వ్యాసాన్ని రాశారు. నాసరరెడ్డిగారి హైకూల్ని చేరా విశ్లేషిస్తూ రాసిన వ్యాసం హైకూ మీద ఒక అవగాహనకు రావడానికి దోహదపడింది. అద్దేపల్లివారి "తెలుగులో హైకూ" కాత్యాయనీ "హైకూ – తెలుగు సాహిత్యంలో ఒక ప్రయోగం" కె. కోటారావుగారి "ఆధునిక కవితా ప్రక్రియగా హైకూ" ఈ విధంగా హైకూ ప్రక్రియపై విమర్శ, ప్రతి విమర్శ వ్యాసాలు ఎన్నో వచ్చాయి. 1999లో మాకినీడి సూర్య భాస్కర్ మొదటిసారిగా "హైకూ కవిత్వం – అనుశీలన – ఒక అవగాహన" అనే విమర్శ గ్రంథాన్ని రాశారు. ఇందులో 11 వ్యాసాలు చోటు చేసుకున్నాయి. హైకూలపై పాఠకుడు ఒక అవగాహనకు రావడానికి ఈ గ్రంథం బాగా ఉపయోగపడుతుంది. హైకూను అర్థం చేసుకోవడంలో మేధకంటే హృదయం పాత్ర ఎక్కువ. హృదయం మేల్కొన్నప్పుడే హైకూ అర్థం అనుభూతమౌతుంది. అందువల్ల హైకూ సృజనలో సృజనకారుడు ఒక గొప్ప ఊహాశిల్పి తప్పనిసరై ఉండాలి. ఊహాబలం ఎంత పదునుగా ఉంటే పాఠకుడి భావన అంతగా విస్తరిస్తుంది అన్న యాకూబ్ మాటలు అక్షర సత్యాలు. డా. తలతోటి పృథ్వీరాజ్ గారు "హైకూ" మాసపత్రికల్లో హైకూల గురించి అనేక వ్యాసాలు ప్రచురించారు. హైకూ కొన్ని సందర్భాలలో ప్రతి విమర్శకు కూడా గురైంది. ద్వా.నా.శాస్త్రి, చందూ సుబ్బారావు లాంటి వారు హైకూ నియమ నిబంధనలని ఎక్కువ మంది హైకూ కవులు పాటించలేదని తీవ్రంగా విమర్శించారు. ఛందో నియమాలని ముఖ్యంగా అక్షర నియమాలని, పాద నియమాలని పాటించడం లేదని హైకూ కవులపై ప్రధానమైన విమర్శ ఉంది. ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు రాయడం వలన హైకూలలో అసలు హేతుబద్ధత లేదని ప్రముఖ విమర్శకులు చేకూరి రామారావు అభిప్రాయ పడ్డారు.

నానీ కవిత్వం

తెలుగు సాహిత్యంలో కొత్తగా వచ్చిన ప్రక్రియ "నానీలు" ఇది దేశీయ కవితా ప్రక్రియ. నానీలు అంటే గోపీ, గోపీ అంటే నానీలుగా తెలుగుదేశంలో బహుళ ప్రచారంలో ఉంది. పూర్వం గోపిగారిని "వేమన గోపి" గా పిలిచేవారు. ఇప్పుడు నానీల గోపీగా పిలుస్తున్నారు. దానికి కారణం నానీ ప్రక్రియకు ఆద్యులు ఆచార్య గోపీ గారు. నానీలు ఒక విలక్షణమైన కవితా ప్రక్రియ. నానీలు అనే సరిక్రొత్త ప్రక్రియను వచన కవిత్వంలో గోపీ గారు ఆవిష్కరించారు. సూక్ష్మంలో మోక్షంలా నాలుగైదు లైన్లలో అనంత భావాల్ని వ్యక్తం చేసే ప్రయత్నం చేశారు. ఆచార్య గోపీ గారు మొట్టమొదటిసారిగా 'వార్త' దినపత్రికలో 1997 లో నానీలు రాశారు. తరువాత 1998 లో 'నానీలు' అనే పేరుతో ఒక గ్రంథంగా ప్రకటించారు. ఇందులో 365 నానీలు ఉన్నాయి. "గోపీ నానీలు" పేరుతో మరో 365 నానీలు రాశారు. ఆచార్య గోపీ ప్రభావం వలన యస్. రఘు, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, శిరీష, యస్.ఆర్. భల్లమ్, సోమేపల్లి వెంకట సుబ్బయ్య, రసరాజు గురు, ద్వా.నా.శాస్త్రి, అడ్డూరి రమణ మొదలైన ఎందరో నానీలు రాశారు. తెలుగులో నానీలు వెలువడటం, ఒక కవితా ప్రక్రియగా స్థిరపడటం, ఎంతో మంది కవులు ప్రభావితమై గ్రంథాలు ప్రచురించడం చెప్పుకోదగ్గ విషయం.

నానీ కవిత్వం విమర్శ

నానీలపై మొదటిసారిగా "నానీలు – నాలుగు వ్యాసాలు" అనే సంపుటి వచ్చింది. ఇందులో 'దూసుకు వస్తున్న కవితా ప్రక్రియ – నానీ' 'సాహిత్య నానీలు – ద్వా.నా. ప్రయోగం' మినీకవిత, హైకూకు మధ్యే మార్గం – నానీ' 'నానీ.... రన్నింగ్ కామెంటరీ – తులనాత్మక పరిశీలన' అనే వ్యాసాలు నానీలను విశ్లేషిస్తూ రాసిన వ్యాసాలు. యస్.ఆర్.భల్లంగారి సంపాదకత్వంలో "గోపీ నానీల సమాలోచనం" అనే సంకలన గ్రంథం వచ్చింది. ఇందులో 14 సమీక్షా వ్యాసాలు ఉన్నాయి. ఆచార్య వెలమల సిమ్మన్న తన "ఆధునిక సాహిత్య విమర్శ" అన్న గ్రంథంలో నానీ కవిత్వ విమర్శ చేశారు. నానీల చారిత్రక నేపథ్యం, నానీల రూపశిల్ప, నానీలు – నిర్వచనం, వాటి లక్షణాలు, నానీ కవిత్వ నిర్మాణం, వస్తు వైవిధ్యం మొదలగు అంశాలపైన విస్తృతమైన అధ్యయనం చేశారు.

ఉపయుక్త గ్రంథాలు

1. విమర్శా శిల్పం – వల్లంపాటి వెంకటసుబ్బయ్య
2. తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు – వెలమల సిమ్మన్న
3. యాకూబ్ – పాఠక ప్రక్రియ
4. మినీకవిత్వంలో మెనీ భావాలు – రావి రంగారావు
5. ఆధునికత – అత్యాధునికత – అప్పుర్

ఆదివారం ఆంధ్రప్రభ కథలు – ఇతివృత్త వైవిధ్యం

పి.దర్గాబాబు, పరిశోధక విద్యార్థి , తెలుగు అధ్యయన శాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి,
చరవాణి: 80087 30313

ఆధునిక సాహిత్య ప్రక్రియలలో కథా ప్రక్రియ ఒక విశిష్టస్థానం సంపాదించుకున్నది. ఆధునిక కథ నూతన జీవన వాస్తవికతను బహుముఖాలుగా ఆవిష్కరిస్తోంది. ఆధునిక యుగంలో కథ చెప్పని వారు వినని వారు ఉందంటే అతిశయోక్తికాదేమో. మానవునితో ఇంతగా పెనవేసుకున్న ప్రక్రియ మరొకటలేదని చెప్పుకోవచ్చు. నిత్య జీవితంలో జరుగుతున్న యదార్థ సంఘటనలను కొంత కల్పనలో కథలు చెప్పడం జరుగుతుంది. మానవుని జీవితంలో ఎన్నెన్నో కోణాలుంటాయి. వాటిని పరిశీలించి కథగా మలచడంలోనే రచయిత ప్రతిభ వెల్లడవుతుందని చెప్పవచ్చు. వివిధ రచయితలు ఆంధ్రప్రభలో తమ కథలను ప్రచురించారు.

ప్రస్తుతం నేను "ఆదివారం ఆంధ్రప్రభ కథలు – అనుశీలన" (2019 సంవత్సరానికి పరిమితం) అనే అంశం మీద పరిశోధన చేస్తున్నాను. "ఆదివారం ఆంధ్రప్రభ కథలు – ఇతివృత్త వైవిధ్యం" అనే అంశం మీద పరిశోధన పత్రాన్ని సమర్పిస్తున్నాను.

1. మేడ్‌ఫర్ ఈచ్ అదర్

ఈ కథలో రచయిత మనిషి బాహ్యసౌందర్యం కంటే అంత:సౌందర్యం గొప్పదని, బహిరంగంగా కనిపించే ఒడ్డుపొడువు, అలంకరణలు మనిషి యొక్క స్వరూపం తెలియజేస్తాయని అలాగే అంతర్గతంగా ఉన్నటువంటి ప్రేమానుబంధం ఎంతో గొప్పదని చక్కగా తెలిపారు.

సతీష్, రాధికల వివాహం అయి ఒక సంవత్సరం పాటు సజావుగా సాగుతూంది. ఆ తర్వాత రాధిక యొక్క ప్రవర్తనలో అనేక మార్పులు వస్తాయి. మొదట్లో భర్త ఉద్యోగరీత్యా మంచి ఉన్నాడని అందం గురించి అంతగా పట్టించుకోదు. ఓ సారి సతీష్ బయటకు వెళ్ళి సినిమాను చూసి వద్దాం అని రాధికను అడుగుతాడు. రాధిక అందుకు తిరస్కరిస్తుంది. ఆ రోజు రాత్రి గదిలో ఉన్నప్పుడు ఆమెపై చేయి వేయబోగా కోపాన్ని వ్యక్తం చేసి అక్కడ నుండి వెళ్ళిపోతుంది. ఏమైందని సతీష్ తన భార్య అయిన రాధికను అడుగుతాడు. ఈ మధ్య నీవు చాలా తేడాగా ప్రవర్తిస్తున్నావు. ఆరోగ్యం సరిగా లేదా అయితే హాస్పిటల్‌కి వెళదాం రమ్మంటాడు. నాకు బాగానే ఉందని చెబుతుంది. ఓ రోజు రాధికకు తన స్నేహితురాలైన సుమ చెప్పిన విషయం గుర్తుకు వస్తుంది. ఆమెకు తన భర్త అంటే ఇష్టం లేదని విరక్తి అని బాధపడుతుంది. ఒక సారి సతీష్, రాధిక సినిమాకు వెళుతారు. అక్కడ సుమ భర్త కనిపిస్తాడు. అప్పుడు రాధిక అతన్ని చూసి చాలా అందంగా స్టైల్‌గా ఉన్నాడని తన భర్త మాత్రం బట్టతల, పొట్టవేసుకొని చూడటానికి వికారంగా ఉన్నాడని బాధపడుతుంది. కొన్ని రోజుల తర్వాత సతీష్ పేపర్ తిరగవేస్తుంటే అందులో సుమ భర్త వేరే స్త్రీతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని తెలిసి ఆమె ఆత్మహత్యకు పాల్పడుతుంది. ఆ వార్తను చదివిన రాధిక తన మనస్సు మార్చుకుంటుంది. ఆ విషయం తెలుసుకున్న సతీష్ "నాకు మనస్సు ఉంది నా భార్య సీతలా ఉండాలి నేననుకోవడం స్వార్థం కాదు. ఎందుకంటే నేను రాముడు వంటి వాడనని అంటాడు". దీనితో రాధిక పశ్చాతాప్త హృదయంతో భర్తను దగ్గరకు తీసుకొని కన్నీటితో నన్ను క్షమించండి అని అంటుంది. దీంతో సతీష్ రాధికను దగ్గరకు తీసుకొని ఓదార్చుతాడు.

2. విక్రమార్కుడు :

ఈ కథలో రచయిత హాస్యాన్ని గురించి చక్కగా తెలియజేశారు.

కమల, అంకాలేశ్వరప్ప భార్యభర్తలు. ఆ ఊరి జనం ఆయన్ని అంకన్న అని పిలుస్తారు. వీరిది వ్యవసాయ కుటుంబం. తన తాతలు సంపాదించి ఇచ్చిన ఆస్తి అలాగే అంకన్న తండ్రి మరో రెండు ఎకరాలు సంపాదించి చనిపోతాడు. అయితే అంకన్నకు అటు వ్యవసాయం ఇటు చదువు కూడా అబ్బలేదు. ఉన్న పొలాన్ని అంతా కౌలుకి ఇచ్చి బ్రతుకుతుంటారు. అయితే ఆ ఊరిలో ఉన్న ఓ పెద్దాయన మీ తాత కవితలు రాసేవాడని అంటాడు. దీనితో తన పూర్వీకుల పేరు నిలబెట్టాలని కవితలు రాయడం మొదలు పెడతాడు. ఓ డజను తెల్లకాగితాలు తీసుకు వచ్చి బుర్ర గొక్కుంటూ కవితలు అని కొన్ని లైన్లు రాసి దానిని ఓ దస్త్రంగా తయారు చేస్తాడు. మందుగా తన భార్య అయిన కమలమ్మకు కవితలు చూపించి ఎలా ఉన్నాయంటాడు. ఆ కవితలు కొంత చదివేసరికి షాక్ కొట్టినట్లు కిందపడిపోతుంది. కొన్నిరోజులపాటు తలనొప్పితో మంచం పడుతుంది. దీంతో అంకన్న రచ్చ గెలిచి ఇంట గెలవాలనే ఉద్దేశంలో ఊరిలో కనిపించిన ప్రతివారికి చూపించి వినమంటాడు. ఆ ఊరిలో వాళ్ళు అతనిని చూసి ఇంటి తలుపులు వేసుకోవడం, తప్పించుకోవడానికి ప్రయత్నం చేస్తారు. ఆ వీధి చివర ఉన్న పాన్ షాప్ యజమానైన పాపారావు, అంకన్న వస్తున్నాడని తన షాపు మూయి బోతాడు. అప్పుడు ఇష్టం లేకపోతే తన కవితలు వినవద్దని షాపు మాత్రం మూయవద్దంటాడు. అప్పుడే ఆ ఊరిలోకి ఓ వ్యక్తి వచ్చి అటుగా వెళుతుంటాడు. అంకన్న అతని దగ్గరకు వెళ్ళి తన కవితలు వినమంటాడు. తనకు పని ఉందని వెళ్ళాలి అంటే అతని జేబులో ఉన్న పెన్నును అంకన్న తీసుకొని తన జేబులో పెట్టుకొని కవితలు వింటే ఇస్తానని మొండికేస్తాడు. దీనితో నాకెందుకు చెపుతున్నాని తన పెన్ను ఇవ్వాలని వెళ్ళి పోతానంటాడు. అంకన్న తన కవితలు చెబుతు ఉంటే ఆ వ్యక్తికి పిచ్చి పట్టినట్లు ఉంది. నాకు పెన్ను వద్దు ఏమి వద్దని అక్కడి నుండి పారిపోతాడు. అక్కడ అంకన్న ఈ వెర్రిజనాలకు దేవుడెప్పుడు కవిత జ్ఞానాన్ని ప్రసాదిస్తాడని అనుకుంటాడు. దూరంగా ఉన్న పాన్ షాపుయజమాని ప్రజలను ఇబ్బంది పెడుతున్న ఈ కవితలను కాల్చి పడవేస్తే బాగుండును అని మనస్సులో అనుకుంటాడు. అంకన్న మాత్రం నిరాశ చెందకుండా పట్టువదలని విక్రమార్కుని వలె కొనసాగిస్తాడు.

3. స్టేషన్ టు హోటల్ :

ఈ కథ ప్రధానంగా మోసపూరితమైన ఇతివృత్తానికి సంబంధించినది. తెలియని ప్రదేశానికి వస్తే ఆటోడ్రైవర్లు చేసే నిర్వాహం గురించి రచయిత ఈ కథ ద్వారా తెలిపారు.

భీమేంద్ర అతని భార్య తిరుపతిలో జరిగే 104వ సైన్స్ కాంగ్రెస్ సభను చూడటానికి భీమవరం నుండి రైలులో వస్తారు. స్టేషన్ బయట ఆటో వాళ్ళను పిలుస్తాడు. అక్కడ తచ్చాడుతున్న ఓ ఆటో డ్రైవర్ భీమన్న దగ్గరకు వస్తాడు. ఇతని పేరు రంగాచారి. మేము భీమాస్ హోటల్‌కి వెళ్ళాలి ఎంత అంటాడు. రంగాచారి వాళ్ళను ఎగాదిగా చూడడంతో మేము తిరుపతికి చిన్నప్పటి నుండి వస్తున్నామని, వందకంటే ఎక్కువ ఇవ్వమని ఇష్టముంటే రమ్మని లేకపోతే పొమ్మంటాడు. అప్పుడే ఆటో డ్రైవర్ డిజల్ రేట్లు పెరిగిపోయాయని ట్రాఫిక్ వల్ల చుట్టూ తిరిగి రావాలని అంటాడు. సరేనని భీమేంద్ర దంపతులు నూటయాభై ఇస్తానని ఆటో కుదుర్చుకొని బయలుదేరుతారు. ఆటో బస్టాండ్ మీదుగా కొర్లగుంట జంక్షన్ రోడ్డులో అటు పోనిస్తుంటాడు. లీలామహల్ జంక్షన్ వచ్చే సరిగ్గా ట్రాఫిక్ వల్ల కొంత ఆలస్యం అవుతుంది. అక్కడ నుండి కపిల తీర్థం, నంది సర్కిల్, అలిపిరి మెట్లు మార్గంలో ఆటోను నడుపుతుంటాడు. అలిపిరి మెట్లునుచూసి ఆ దంపతులు దండం పెట్టుకోవడం చూసిన డ్రైవర్ వారితో మాటలు కలుపుతాడు. తాను ఎం.బి.ఎ.చదివానని కుటుంబ పోషణ కోరకు ఆటో నడుపుతున్నాని అంటాడు. అందుకు భీమేంద్ర మనస్సు చలించిపోతుంది. తానే గనుక ఓ కంపెనీకి అధిపతి అధిపతినైతే ఇతనికి మేనేజర్ ఉద్యోగం ఇచ్చేవారని అనుకుంటాడు. ఆటో ఎన్టీయార్ సర్కిల్ మీదుగా పోనిస్తుంటే దానిలో హోర్డింగులు చూపిస్తూ ఇక్కడకు సినీతారలు వచ్చి షాపింగ్ కాంప్లెక్స్‌లను ఓపెన్ చేసేవారని గొప్ప హీరోలు ఇక్కడ హోటల్లోనే భోజనం చేసేవారని అంటాడు. ఆటో హోటల్ ముందు వచ్చి ఆగుతుంది. భీమేంద్ర రంగచారికి

రెండు వందల రూపాయలు ఇస్తాడు రంగాచారి. చిల్లర ఇవ్వబోతుండగా వద్దు అని తన బ్యాగులో ఉన్న పూతరేకుల ప్యాకెట్లను ఆటో అతనికి ఇస్తారు. రంగాచారి ధర్మప్రభువులు అని అక్కడ నుండి వెళ్ళిపోతాడు. భీమేంద్ర దంపతులు హోటల్ చేరుకుని స్నానాదులు ముగించుకొని ఆ రోజుకు విశ్రాంతి తీసుకుంటారు. మరుసటి రోజున భీమేంద్ర బ్రష్ చేస్తూ టెర్రప్ పైకి వెళ్ళితే అక్కడకు స్టేషన్ అనౌన్స్ మెంట్స్ వినిపిస్తాయి. స్టేషన్‌కు హోల్‌కు వంద మీటర్లు కూడా ఉండదు. ఎక్కె జనం దిగే జనం కనిపిస్తారు. చివరికి తాము మోసపోయాయని బాధపడతారు.

4. అతడు ఒకదేవుడు :

ఈ కథ ప్రధానంగా మానవ సంబంధాలకు సంబంధించిన ఇతివృత్తం. డబ్బులు ఉన్నవారు పేదవారిని హింసించితే అందుకు దేవుడు శిక్షింపబడతారని, ఫలితం అనుభవించుతారని ఈ కథ ద్వారా తెలిపారు. అది నాలుగు రోడ్లకు కూడలి ప్రాంతం. అక్కడ జనం రద్దీతో ఉంటుంది. దూరంగా కొండపైన శని, సోమ వారాలలో రద్దీ బాగా ఉంటుంది. కొండ కింద భాగంలో దేవాలయానికి సంబంధించిన దుకాణాల్లో నెలకు ఇంతని కట్టి వ్యాపారం చేస్తుంటారు. దేవాలయానికి సంబంధించిన వేలం పాటలో స్థానిక నాయకుడైన సిరిపురం చిన్నారావు అన్ని షాపులను తానే పాడుతాడు. తనకు రాజకీయ అండదండలు పుష్కలంగా అందుతూ ఉంటాయి. దాంతో అతను రెచ్చిపోతూ ఉంటాడు. అక్కడే ఓ బైరాగి తాటాకు బట్టీ పెట్టుకొని తన భార్య పిల్లలను పది సంవత్సరాలుగా పోషించుకుంటు అంటాడు అనే అతని ఈ జీవన ఆధారం.

ఆధార గ్రంథాలు

1. ఆదివారం ఆంధ్రప్రభ కథలు – వివిధ రచయితలు
2. కథానిక స్వరూప స్వభావాలు – పోరంకి దక్షిణామూర్తి
3. కథాశిల్పం – వల్లంపాటి వెంకటసుబ్బయ్య
4. కథన రంగం – వేదగిరి రాంబాబు
5. తెలుగు కథానిక – తెలుగు అకాడెమీ

ఓ యాక్సిడెంట్‌లో కాలు పోగొట్టుకుని గవర్నమెంటు ఇచ్చిన వీల్‌చైర్‌ను తిప్పుకుంటూ ఇంటికి చేరుతాడు.

సిరిపురం చిన్నారావు ఎంత సంపాదించిన ఆశ తీరదు. శివాలయం దగ్గర రాబడి బాగా ఉందని తెలిసి అక్కడ ఉన్న షాపుల యాజమానులను వెళ్ళగొడుతాడు. అయితే బైరాగిని ఎంత ఓదార్చినా అతను మాత్రం వెళ్ళడు. స్థానిక ఎమ్మెల్యే అండతో తన పనివాళ్ళను పంపించి బైరాగి కొట్టు మీదుగా కాలువను త్రవ్విస్తాడు. భక్తులు బైరాగి దగ్గరకు వెళ్ళారు. వస్తే అందులో పడతారు. దీనితో వ్యాపారం దెబ్బతింటుంది. ఎన్నిసార్లు ప్రెసిడింట్‌ని అడిగితే ఏమో నాకేం తెలుసు అంటాడు. అయితే తానే రెండు సిమెంటు దిమ్మెలును తీసుకువచ్చి కాలువకు అడ్డుగా వేస్తాడు. దీనితో వ్యాపారం సజీవుగా సాగుతుంటుంది.

దీన్ని పసిగట్టిన చిన్నారావు సిమెంటు దిమ్మెలను కూడా తీయిస్తాడు. కాళ్ళ మీద పడిన కనికరం చూపడు. కాలం సాగుతూ ఉంటుంది. ఓసారి శివరాత్రి ఉత్సవాల సందర్భంలో ఓ భక్తుడు దేవునికి టెంకాయ కొడుతుంటే అది చిన్నారావు కొడుకైన మాధవ్‌కు తగిలి స్పృహ కోల్పొతాడు. అందరూ చూస్తు ఉంటారేగానీ ఎవరు పట్టించుకోరు. దానితో బైరాగి వెళ్ళి తన వీల్‌చైర్ ద్వారా హాస్పటల్‌కి చేరుస్తాడు. సమయానికి తీసుకురాకపోతే చనిపోయేవారని డాక్టర్ చెపుతాడు. విషయం తెలుసుకున్న సిరిపురం చిన్నారావు తనను క్షమించమంటాడు. డబ్బు ఉందన్న గర్వంతో మిమ్మల్ని బాధపెట్టాను. మీ జీవన దారాన్ని లేకుండా చేశాను. అయినా నా బిడ్డను కాపాడిన దేవుని రూపంలో ఉన్న వ్యక్తి అని ఎన్ని జన్మలెత్తిన నీ ఋణం తీర్చుకోలేను అంటాడు.

నాయుని కృష్ణమూర్తి కథలు – కుటుంబ సంబంధాలు

యం.బీనదయాళం, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి,
చరవాణి: 97011 35023

భారతీయ సమాజంలో కుటుంబ వ్యవస్థకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. కుటుంబం సంస్కృతిలో ఒక భాగం. కుటుంబం లేనిదే సమాజం లేదు. కుటుంబం పౌరులకు మొట్ట మొదటి పాఠశాల. మనది పితృస్వామిక కుటుంబ వ్యవస్థ. కుటుంబానికి తండ్రి పెద్దగా వ్యవహరిస్తాడు. సమాజంలో రెండు రకాలైనా కుటుంబ వ్యవస్థలు ఉన్నాయి. ఒకటి పెద్ద కుటుంబం. రెండవది చిన్న కుటుంబం. పెద్ద కుటుంబంలో రెండు, మూడు తరాల వారు ఉంటారు. నేటి సమాజంలో ఉమ్మడి కుటుంబాలు చాలా అరుదుగా కనిపిస్తున్నాయి. చిన్న కుటుంబంలో నలుగురికి మించకుండా జీవనాన్ని గడుపుతుంటారు. ఇటువంటి కుటుంబ వ్యవస్థలోని సభ్యుల సంబంధ బాంధవ్యాలను, కుటుంబంలో వచ్చే కష్టాలను, భార్యభర్తల మధ్య వచ్చే మన స్పర్ధలను, కుటుంబంలో వ్యవస్థల పట్ల జరిగే వివక్షత మొదలైన కుటుంబ సమస్యలకు సంబంధించిన ఇతివృత్తాలను తీసుకొని రచనలు చేయడం జరుగుతుంది. నాయుని కృష్ణమూర్తి 'ఏక వచనం', 'కుటుంబరావుకు ఏదో అయింది' వంటి కథలను కుటుంబ సంబంధ కథల్ని రచించడం జరిగింది. ఈ కథల్లోని కుటుంబ సంబంధాలను పరిశీలిద్దాం.

'ఏక వచనం' ఈ కథ 2012వ సంవత్సరంలో నవ్యవార పత్రికలో వచ్చింది. ఈ కథలో ముఖ్యమైన పాత్ర చక్రి. ఇతని తండ్రి గురునాథం. చక్రి చిన్నతనంలో ఉన్నప్పుడు ఏమడిగిన తల్లిదండ్రులు తెచ్చి ఇచ్చేవారు. గురనాథం తన భార్యతో చక్రికి మూడు సంవత్సరాలు నిండింది కాబట్టి కిండర్ గార్డెన్ చేర్పించాలి. ఫ్యూచర్ స్కూల్లో విచారిస్తే రెండు లక్షలు డొనేషన్ అడిగారని చెబుతాడు. అందుకు ఆమె వీణ్ణి స్కూల్లో పడేస్తే ఆ పని మనిషి కొడుకుతో ఆడుకోవడమైనా మానేస్తాడు. లోవర్ క్లాస్ బుద్ధులు రావు అంటుంది. చక్రికి తల్లిదండ్రుల మాటలు అర్థం కాకపోయినా పని మనిషి కొడుకు ఆమెతోపాటు ఇంటికి రాడని, వీధిలోకి వెళ్ళకూడదని, పక్కిళ్ళలోకి తొంగి చూడకూడదనేది మాత్రం అర్థమయింది. ఒంటరి జీవితాన్ని భరించలేని చక్రి తను ఉన్న నాలుగో అంతస్తు నుంచి దూకి చనిపోతే ఒంటరితనం సమస్య ఉండదని దూకపోయాడు. అప్పుడు కాలయ్య అడ్డుపడ్డాడు. ఇక్కడ కాలయ్య ఎవరంటే రచయిత కాలాన్ని పాత్రగా చిత్రించాడు. కాలయ్య నేడు చెప్పినట్లు చేస్తే నీవు రోజు సంతోషంగా గడుపుతావని అంటాడు. చక్రి అప్పటి నుంచి కాలయ్య చెప్పినట్లు చేస్తుంటాడు.

చక్రికి తల్లిదండ్రులు చదువులో కూడా స్వేచ్ఛను ఇవ్వరు. చక్రి బి.టెక్ ఆఖరి సంవత్సరంలో ఉన్నప్పుడు తల్లిదండ్రులు గొడవపడి విడాకులు తీసుకొంటారు. తండ్రి చక్రికి ఐదు లక్షలు ఇచ్చి ఈ రోజుల్లో జీవితాలు చాలా విచిత్రంగా ఉంటున్నాయి. నువ్వు నా కొడుకుని సందేహం లేదు. మేమిద్దరం విడిపోతే నువ్వెలా బతుకుతావు, ఏమైపోతావని నేను కంగారుపడాలి. కానీ నాకలాంటి ఫీలింగ్స్ ఏమీ లేవు. ఇన్నేళ్ళు కాపురం చేసిన మీ అమ్మను వదిలేయాలన్న, కని పెంచిన నిన్ను విడిచి పెట్టాలన్నా నాకేమీ అనిపించడంలేదు. ఇంకో మూడు నెలలు నువ్వు ఈ యింట్లోనే ఉండొచ్చు. ఈ లోపల నీ భవిష్యత్తు నువ్వు చూసుకో బెస్ట్ ఆఫ్‌లక్ అన్నాడు. తల్లి బాధపడి కళ్ళనీళ్ళు తుడుచుకొంటూ చక్రీ జాగ్రత్తగా ఉండు, ఎవర్నంటే వాళ్ళని నమ్మకు. నీకు ఏదైనా అవసరమైతే ఫోన్ చేయమని తన విజిటింగ్ కార్డ్ మీద ఫోన్ నెంబరు రాసి ఇచ్చింది. కాలయ్య చక్రి భుజం మీద చేయి వేసి నీకు అర్థం కావడం లేదా మీ

అమ్మానాన్నలకు స్నేహితున్ని, మీ అమ్మానాన్నలను విడిపొమ్మని ప్రోత్సహించింది. నేనే అని చెప్పగా చక్రి పిచ్చి నవ్వు నవ్వుకొంటాడు. చక్రి ఫైనలియర్‌లో కాంపస్ ఇంటర్వ్యూలలో సెలెక్ట్ అయి ఉద్యోగంలో చేరుతాడు. కాలయ్య నీకు ప్రస్తుతం ఏ ఇబ్బంది లేదు. పడక సుఖం కోసం సరాసరి రోజుకు ఐదు వందలు ఖర్చు పెడుతున్నావు. ఆ ఖర్చును తగ్గించుకోవడానికి పెళ్ళి అనే మార్గాన్ని చూపిస్తాడు.

సామాన్య అనే అమ్మాయిని చక్రి వివాహం చేసుకొంటాడు. వీరిద్దరు కొంతకాలం వరకు పిల్లలు వద్దని నిర్ణయించుకొంటారు. రెండేళ్ళ తరువాత సామాన్య పిల్లలుంటే బాగుంటుందని, మీరు ఉద్యోగానికి వెళ్ళి ఏ రాత్రి పదో పన్నెండింటికో ఇంటికి వస్తే అంతవరకూ నేనేం చేయాలి. పిల్లలుంటే నాకు ఒంటరితనం అనే శిక్ష ఉండదని చెబుతుంది. చక్రి నీకు పిల్లలు లేకుండా ఉండడం ఇష్టం లేకపోతే ఇద్దరు విడిపోదాం అని చెప్పి ఇద్దరు విడిపోతారు. ఒంటరి జీవితాన్ని అనుభవిస్తున్న చక్రికి కాలయ్య రకరకాల రుచులు చూపిస్తూ డ్రక్స్‌కు బానిసను చేస్తాడు. కాలయ్య ఒంటరిగా ఉన్న చక్రి ఇంటికి అర్ధరాత్రి వెళ్ళగా చక్రికి ఎన్నడూ లేనిది కాలయ్య మీద హఠాత్తుగా కోపంతో బాధగా నా బ్రతుకు సర్వనాశనం చేసింది, చేస్తున్నది, చేయబోయేది అన్నీ నువ్వే అన్నాడు. అప్పుడు కాలయ్య పిచ్చివాడా ఈ రోజు ఒంటరి తనాన్ని భరించలేక అన్నీ నేను చేశానని నా మీద విరుచుకుపడుతున్నావు. నీ విచక్షణ ఏమయింది. నీలా బ్రతుకులు నాశనం చేసుకొని ఒంటరి జీవితాన్ని అనుభవిస్తున్నవారు ప్రపంచం మొత్తం మీదకోట్ల సంఖ్యలో ఉన్నారు. ఇదంతా ఆధునిక నాగరికతా ప్రభావం. వృద్ధాప్యంలో కుళ్ళి కుళ్ళి చావండి. మీకు కేవలం సుఖం కావాలి. భార్య, భర్త, పిల్లలు, తల్లిదండ్రులు, కుటుంబ వ్యవస్థ అవసరం లేదు. ఎవరికి వారు ఒక ప్రపంచంగా బ్రతకండి. ఇతరులు ఏమైపోతే మీకేం? మీ రాక్షసానందంలో మీరు మునిగి తేలండని చెప్పగా చక్రి కోపంతో రివాల్వర్ తీసుకొని కాలయ్యను కాల్చాడు. కాలయ్య నవ్వుతూ పిచ్చివాడా నువ్వు గురి పెట్టాల్సింది నావైపు కాదు అంటూ కుర్చీలోంచి పైకి లేచాడు.

ఈ 'ఏకవచనం' కథలో తల్లిదండ్రులు పిల్ల వానికి ప్రేమ, ఆప్యాయత, అనురాగాలు, బాధ్యత లేకుండా పెంచడం. పిల్లవాడికి అడిగింది తెచ్చి ఇవ్వడమే ప్రేమ అనుకొంటారు. మూడు సంవత్సరాలు నిండగానే కార్పోరేట్ విద్యా సంస్థలో లక్షలు పెట్టి చదివించాలనుకోవడం. అక్కడ చదువుకుంటే తన ఇంట్లో ఉన్న పని మనిషి పిల్లవాడితో ఆడుకోకుండా ఉంటాడని, వీధిలోకి వెళ్ళకుండా, పక్కిళ్ళలోకి తొంగి చూడకుండా ఉంటాడని, లోవర్ క్లాస్ బుద్ధులు రాకుండా ఉంటుందని తల్లి అనుకొంటుంది. తన తోటి పిల్లలతో, కుటుంబంతో, సమాజంతో కలసి ఆడుకోవలసిన పిల్లవాడిన్ని స్వేచ్ఛను, ఆనందాన్ని హరించి వేసి ఒంటరి వాన్నిగా చేస్తారు. ఒంటరి జీవితాన్ని భరించలేని పిల్లవాడు ఆత్మహత్య చేసుకోవాలనుకొంటాడు. తనకు నచ్చిన చదువు చదువుకోవాలనుకొనే పిల్లవాణ్ణిపై తల్లిదండ్రులు ఒత్తిడి చేసి వారికి నచ్చిన చదువు చదివిస్తారు. పిల్లవాన్ని భవిష్యత్‌ను పట్టించుకోకుండా తల్లిదండ్రులు చిన్నకారణానికే విడిపోతారు. పిల్లవాడు తన తోటివారితో ఆడుకోలేక, నిజమైన స్నేహితులు లేక, జీవనానందం లేక, కుటుంబంతోను, బంధువులతోను, సంబంధ బాంధవ్యాలు లేక, ఒంటరినై తమ జీవితాన్ని అర్ధరహితం చేసుకోవడం, మాదక ద్రవ్యాలకు అలవాటు చేసుకోవడం, ఆత్మహత్యను ఆలోచన చేయడం కనిపిస్తుంది. తల్లిదండ్రుల ప్రభావం పిల్లలపై ఉంటుంది. పిల్లవాడు కూడా వివాహం చేసుకొని చిన్నకారణానికే విడాకులు తీసుకోవడం జరుగుతుంది. కాలయ్య పాత్ర ద్వారా కుటుంబం విచ్ఛిన్నమైపోయే స్థితిని, కుటుంబం యొక్క సంబంధాన్ని చెప్పడం. కుటుంబం విచ్ఛిన్నమైపోయి ఎవరివారు ఏకాకులుగా మిగిలి పోయేస్థితి ఈ కథలో కనిపిస్తుంది. ఈ కథ ద్వారా నేటి సమాజానికి కుటుంబం అంటే ఏకవచనం కాదని, కుటుంబం అంటే

తల్లిదండ్రులు, పిల్లలు, అన్నదమ్ములు, అక్కచెల్లెలు, బంధువులు, స్నేహితులు ఉండే బహువచనం అని రచయిత తెలియజేయడం జరిగింది.

'కుటుంబరావుకు ఏదో అయింది' ఈ కథ 2003 స్వాతి మాసపత్రికలో వచ్చింది. దశాబ్దాల కాలంలో సాంకేతిక విషయాలలో, ఆర్థిక రంగంలో, నగరీకరణలో, స్త్రీ, పురుష సంబంధాల్లో, విలువల్లో వచ్చిన మార్పును ఈ కథ తెలియజేస్తుంది.

ఒక రోజు కుటుంబరావు భోజనం చేసి విశ్రాంతి తీసుకొని ఇక పడుకోవడానికి లేస్తుండగా కళ్ళు తిరిగి పడిపోవడంతో కోమాలోకి వెళ్ళిపోయాడు. నలభై మూడు సంవత్సరాల తరువాత కోమా నుండి తేరుకున్నాడు. తాను అనారోగ్యానికి గురై పదిరోజులైనట్లు భావించేవాడు. నలభై మూడు సంవత్సరాల తరువాత మామూలు స్థాయికి వచ్చిన కుటుంబరావు వార్తా పత్రికలోని తారీఖులను చూసి, పెట్రోలు ధరలు చూసి ఆశ్చర్యపోతాడు. తాను ఉన్న భవనం చుట్టూ ఉన్న నగరాన్ని చూసి ఏదో పెద్ద పట్టణంలో ఉన్నానని భావించుకుంటాడు. చివరకు తాను బతికే ఉన్నానా అని ఆశ్చర్యపోతాడు. కుటుంబరావు ప్రశ్నలకు డాక్టరు వేణు తాను బతికి ఉన్నావని, తానున్న హాస్పిటల్ చౌడేపల్లేనని, ఈ చౌడేపల్లి నేడు విజయనగరంగా రూపు చెందిందని వివరించాడు. అందుకు కుటుంబరావు పక పకా నవ్వి పది రోజులకే ఇంత మారిపోయిందా? అని సందేహిస్తే డాక్టరు కుటుంబరావుతో నీవు కోమాలోకి వెళ్ళి నలభై మూడు సంవత్సరాలైందని, నీవున్న చౌడేపల్లి బెంగుళూరు పట్టణానికి దగ్గరగా ఉండడం వల్ల భూమిరేట్లు పెరిగి మున్సిపాలిటి స్థాయికి చేరిందని, మొదట్లో మద్రాసు ఆసుపత్రిలో ఉన్నారని తరువాత విజయనగరం తీసుకొని వచ్చారని మీ అబ్బాయి పెద్ద డాక్టరని చెప్పాడు.

తన భార్య ఎక్కడని అడిగిన ప్రశ్నకు భార్య చనిపోయిందని తన రెండో అబ్బాయి హైదరాబాదులో ఉన్నాడని, అతని పేరు అభిమన్యు అని, హైదరాబాదులో పెద్ద బిజనెస్ మాగ్నెటని సమాధానమిచ్చాడు. కుటుంబరావు డాక్టర్ వేణు వద్దనున్న సెల్ఫోన్ను చూసి ఇదేమిటని ప్రశ్నించాడు. మీరు కోమాలోకి వెళ్ళేటప్పుడు ల్యాండ్‌లైన్ ఫోన్లే ఉండేవని ఇప్పుడు సెల్ఫోన్లు వచ్చాయని చెప్పాడు. వీటన్నింటినీ మించి కంప్యూటర్లు, ఇంటర్నెట్ సౌకర్యం కూడా ప్రజలకు సాధారణమై పోయిందని సమాధానమిచ్చాడు. డాక్టరు ఇంటర్నెట్ ద్వారా ప్రపంచంలో ఏ విషయాన్నైనా క్షణంలో తెలుసుకోవచ్చని చెప్పాడు. తరువాత డాక్టరు లిప్టులోకి తీసుకెళ్లాడు. లాబోరేటరీ చూశాడు. వెబ్కామ్ గురించి కుటుంబరావు డాక్టరును అడిగి తెలుసుకున్నాడు. కానీ తనను చూడడానికి వ్యాపారం నిమిత్తం, షికారు వల్ల తన వద్దకు రాని కొడుకుల గురించి బాధపడ్డాడు. నాగరికత ఎంతో పెరిగింది కానీ కుటుంబం సంగతేమిటని విచారించాడు. కుటుంబరావు ప్రశ్నకు ఆశ్చర్యపోయిన డాక్టరు పకపకా నవ్వగా కుటుంబరావు కూడా బంధాలు, అనుబంధాలు దూరమయ్యాయని పకపకా నవ్వుతూ ప్రపంచానికి దూరమయ్యాడు.

'కుటుంబరావుకు ఏదో అయింది' కథలో కుటుంబరావు 43 సంవత్సరాలు కోమాలో వుండి మేల్కొంటాడు. నాలుగు దశాబ్దాల కాలంలో సాంకేతిక విషయాలలో, ఆర్థిక రంగంలో, నగరీకరణంలో, స్త్రీ పురుష సంబంధాల్లో, విలువలో వచ్చిన మార్పుకు ఆశ్చర్యపోతాడు. ఉత్పతాదాయవ్యక్తులుగా మారిన తన కుమారులకు తండ్రి ఆరోగ్యం కోసం ఎంత డబ్బయినా ఖర్చుపెట్టే వెసులుబాటు ఉంటుంది గానీ స్వయంగా వచ్చి తండ్రిని చూచి పలకరించే తీరికగానీ, తమతోపాటు అతన్ని తీసుకెళ్లి అతడి బాగోగులు చూసుకునే అవకాశం గానీ వారికుండదు. వ్యక్తుల మధ్య, కుటుంబాలలో సంబంధ బాంధవ్యాలు అనేవి ఏవిధంగా దూరమవుతున్నాయో రచయిత ఈ కథ ద్వారా నేటి సమాజానికి తెలియజేయడం జరిగింది.

ముగింపు :

నాయుని కృష్ణమూర్తి ప్రపంచ వ్యాప్తంగా చోటుచేసుకున్న పరిణామాలు మానవ సంబంధాల్ని, విలువల్ని, సంస్కృతిని ఎంతగా కల్లోల పరుస్తున్నాయో తెలియజేయడం, సంస్కృతి, విలువలు, సంబంధాలు అన్నీ అర్థ రహితమైపోయే స్థితిని, కుటుంబంలోని సంబంధాలు ఏవిధంగా దూరమవుతున్నాయో వంటి కుటుంబ సంబంధాలను సమాజానికి తన కథ ద్వారా తెలియ జేయడం జరిగింది.

ఆధార గ్రంథాలు

1. తెలుగు సామెతలు, జనజీవనం – పాపిరెడ్డి నరసింహారెడ్డి
2. కథానిక స్వరూప స్వభావాలు – పోరంకి దక్షిణామూర్తి
3. కథలు – నాయుని కృష్ణమూర్తి
4. ఏం లేదు – నాయుని కృష్ణమూర్తి

దిగంబర కవిత్వంలో జ్వాలాముఖి - సూర్యస్నానం

డా॥ లోపింటి గిరీష్ కుమార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం. సెల్ : 7013805310

"మంచికోసం, మనిషిలోని నిప్పులాంటి నిజమైన మనిషికోసం కపటంలేని చిరునవ్వులు చిందే సమాజం కోసం, ఆహోరాత్రులు ఆరని అగ్నిలో నడిచిన ఆత్మలలోంచి పలుకుతున్న గొంతుకలం." - దిగంబర కవులు

రచయిత జ్వాలాముఖి నిత్య చైతన్యం, నిప్పులు చిమ్మే ఉపన్యాసం, సంకుచితత్వానికి అతీతమైన సహజ గంభీరం, జీవితమంతా ఉద్వేగంతో సాగింది. దిగంబర కవిగా, విప్లవ కవిగా, కథకుడిగా, నవలాకారుడిగా, విమర్శకుడిగా, అనువాదకుడిగా ప్రసిద్ధుడు. మనుషులపైన అచంచల ప్రేమతో జ్వాలాముఖి జీవించారని చెప్పాలి. మెదక్ జిల్లా ఆకారం గ్రామంలో 1938 ఏప్రిల్ 12 న జన్మించిన ఆయన అసలు పేరు వీరవెల్లి రాఘవాచార్య. తల్లిదండ్రులు నరసింహాచార్యులు, వెంకటలక్ష్మీనర్సమ్మ. హైదరాబాదులోని మల్లేపల్లి, నిజాం కళాశాలలో విద్యాభ్యాస్యాన్ని పూర్తి చేసుకున్న ఆయన నిజాం కళాశాలలో ఎల్.ఎల్.బీ. పూర్తిచేశారు.

ఉపాధ్యాయుడిగా సికింద్రాబాద్, బెంగుళూరు సైనిక పాఠశాలల్లో 12 ఏళ్లు విధులు నిర్వహించాడు. తరువాత హైదరాబాదులోని ఎల్.ఎన్.గుప్తా సైన్స్, కామర్స్ కళాశాలలో24 ఏళ్లు అధ్యాపకుడిగా పనిచేసి 1996లో పదవీ విరమణ చేశాడు. మొదట్లో నాస్తికవాదం, పిదప మానవతా వాదం, అనంతరం మార్క్సిస్టు ఆలోచన విధానం వైపు మొగ్గు చూపాడు. 1958లో 'మనిషి' దీర్ఘకవితకు గుంటూరు రచయితల సంఘంవారు కరుణశ్రీ చేతులమీదుగా ఉత్తమ రచయిత పురస్కారాన్ని అందజేశారు. 1965-70 మధ్య దిగంబర కవుల పేరుతో కవితా సంపుటాలు రాశాడు. ఆర్గనైజేషన్ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ డెమోక్రాటిక్ రైట్స్ (ఓ.పీ.డీ.ఆర్) సంస్థతో ఆయనకు సన్నిహిత సంబంధాలున్నాయి. రెండు సార్లు చైనాకు వెళ్లారు.

1971లో విరసం సభ్యుడిగా ఆంధ్రప్రదేశ్ ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్ట్ కింద నిఖిలేశ్వర్, చెరబండరాజులతో ముషీరాబాద్ జైల్లో యాభై రోజులున్నారు. 1975 ఎమర్జెన్సీ కాలంలో 15 రోజులు జైల్లో ఉన్నారు. ఈయన పై మఖ్దూం మొహియుద్దీన్ ప్రభావం ఉంది. డిసెంబరు 14 2008 న కాలేయ వ్యాధి, గుండెపోటుతో మరణించాడు. 'వేలాడిన మందారంస హైదరా'బాధసలు, 'ఓటమి తిరుగుబాటు' కవితా సంకలనం, 'రాంగేయ రాఘవ' జీవిత చరిత్ర హిందీ నుంచి తెలుగు అనువాదం వంటి రచనలు ఆయనకు ఎంతగానో పేరు తెచ్చాయి. ఝాన్సీ హేతువాద మెమోరియల్ అవార్డు, దాశరథి రంగాచార్య పురస్కారం, హిందీలో వేమూరి ఆంజనేయ శర్మ అవార్డులతో సాహితీలోకం ఆయన్ని గౌరవించింది.

జ్వాలాముఖి దిగంబర కవిత్వంలో సూర్యస్నానం, అవలోకనం, కిలికించితం, ఓటమి తిరుగుబాటు, శస్త్రచికిత్స, వంటి కవితల్ని రాసారు.

సూర్యస్నానం అనే కవితా ఖండికలో నాటి వరకు వచ్చిన సాహిత్యాన్ని గూర్చి చెబుతూ అలాగే మానవత అనేది మరిచి జీవనం సాగించి గడుపుతున్న సమాజాన్ని తట్టి లేపెందుకుగాను అంతవరకు వర్ణించిన పొంగులా మూలల్లో కృశించిపోయిన అందాలను , అలాగే మానవుని ఎదుగుదల పరిణామక్రమాన్ని గురించి తెలుపుతూ నాగరికత అనే పేరు పెట్టుకొని మనం చేస్తున్న మోసాలు మనల్ని మనం చేసుకొంటున్న మోసాన్ని గుర్తు చేస్తూ ఆ వ్యామోహం లో జీవిస్తున్న సమాజానికి బలంగా నొక్కి చెప్పాలి అంటాడు.

పొంగారిన అంగసౌష్టవాలనుండి
అంగారపు హొయలు వెలుగు పై నుండి,
దుశ్శాసనుడై పై వలువను, ఐరాస

నిండుకొలువులో వొలువానుంది.
పొంగుల మూలల్లో
కృంగిన అందాల్ని
హొయల లోయల్లో
శిథిలమైన మానవతని,
నాగరికత నిగనిగల కౌగిలిలో,
మైమరచి మైకం కమ్మిన, నేటి వ్యామోహపు
పతిత జాతికి చరచి చూపాలనుంది:
జాగృతి కై ద్వంసరచన చేయాలనుంది.

అలాగే కాలం మారుతున్నప్పటికీ మారని చరిత్రలు వాటి కథలను ప్రపంచైకి తెలియజేస్తూ అప్పుడెప్పుడో పోయిన రాజుల యొక్క పుచ్చిన గాధలు తెలిపిన చరిత్రకారులును మానవ పరిణామ క్రమం గురించి తెలిపిందేమిటి ఇంకా మనం వేటిని గురించి మాట్లాడుతున్నాం అనే విషయాన్ని తనదైన శైలిలో ప్రశ్నించాడు. కోతి నుండి పుట్టిన మనిషి అచెంచులుగా విజ్ఞానాన్ని కొత్త తరానికి సరి కొత్త ఆలోచలను అందిస్తూ ముందుకు సాగుతుంటే ఆ విజ్ఞానానికి అవరోధాలుగా ఉన్న ఈ కల్పిత కథలు ఇంకా దేనికంటాడు.

అలాగే దేవుడు దేవుడు అని మూడ భక్తిలోకి పోయి నెల విడిచి సాము చేస్తున్న వారందరికి ఆధ్యాత్మికం జీవనం కలిగి ఉన్న సోమరులకు కళ్ళు పీకి చూపాలి అని ఉంది అంటాడు. మతం ముసుగులో మాయలు మంత్రాలు అని మోసం చేసెవారు ఇప్పటికి కొదువులేదు అలాంటి వారిని అప్పుడే జ్వాలాముఖి వ్యతిరేఖించి నిరసించడం మనకు గోచరిస్తుంది.

చచ్చిన రాజులు పుచ్చిన గాధల,
మెచ్చే చచ్చు చరిత్రకారులను
ముక్కుచెవులు కోసి అడగాలనుంది
మానవపరిణామ శాస్త్రం నేర్పిందేమని?
దేవుడు దేవుడంటూ
నేలవిడిచి సాముచేయు
తత్వ దిమ్మరులకు,
ఆధ్యాత్మిక సోమరులకు,
కళ్ళుపీకి చూపాలనుంది

సమాజంలో నిత్యం జరుగుతున్న అరాచకాలు ఆకృత్యాలలో అతి చిన్న వయసులో మరణించిన చిన్నారులను గురించి తెలుపుతూ పుట్టిన అతి తక్కువ సమయంలోనే మరిణించి బ్రతుకు అంటే ఏంటో కూడా స్పృశించని చిన్నారులు భూమాత గర్భంలో అకారణంగా అమానుషంగా వారు మృతులుగా ఉంటె అవేమి కనిపించనట్లు తమకు పట్టనట్లు ఉండి ప్రేయసిలా అంగాంగా సౌందర్యం వారి వక్షోజాల వాపులను గురించి రాసి దాని ద్వారా తాధ్యత్మం పొందిన కవులు లా ఉన్న కాముకలను లాగి తన్ని వారు నిర్లక్ష్యం చేస్తున్న సమాజాన్ని వారికి చూపాలని ఉంది అంటాడు.

పృథ్వీమాత గర్భంలో
నెలలు నిండక
బ్రతుకు పండక
వికృతంగా మరణించిన
జీవుని శైశవ కళేబరాన్ని
కనుపించని ప్రేయసి వక్షోజాల వాపులపై
తాదాత్మ్యం పొందిన కవి కాముకులను,
లాగి తన్ని ఒక్కసారి చూపాలనుంది.

స్వతహాగా తీవ్రంగా స్పందించే గుణకలవాడు . కవి పండితుడిగా ఎదిగిన క్రమంలో దిగంబర కవుల్లో గట్టివాడు. విరసం వ్యవస్థాపక సభ్యుల్లో విశిష్టునిగా పేరు పొందాడు. ఉపాధ్యాయునిగా, కాలేజీలో ఉపన్యాసకుడిగా పనిచేస్తున్న రోజుల్లోనే ఉద్యోగ క్రాంతి అనే పత్రిక వ్యవస్థాపక సభ్యులకు సమకాలికంగా ఉద్యోగుల ఉద్యమాల్లో పాల్గొన్న ఐక్య విప్లవోద్యమాభిలాషి.

''బాల్యానికి రక్షణ, యవ్వనానికి క్రమశిక్షణ, వార్ధక్యానికి పరిరక్షణ కల్పించగల వ్యవస్తే సోషలిస్టు సమాజం" అని విశదీకరించేవాడు. కిటికీలు, తలుపులు, బార్లాగా తెరిచి వుంచిన ఇంట్లోకి చేరిన దుమ్ము, ధూళిని చీపురుతో చిమ్మి ఆరోగ్యాన్ని కాపాడుకున్న క్రమంగా చైనా తియాన్‌మీన్ స్క్వేర్ ఘటనను అభివర్ణించాడు. ఒక నాస్తికుడిగా, మార్క్సిస్ట్ మేధావిగా, ప్రత్యామ్నాయ సంస్కృతిని అభివృద్ధి చేయడానికి గాను, హైదరాబాదు వంటి నగరంలో ''ప్రత్యామ్నాయ సాంస్కృతిక కేంద్రం'' ను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత గురించి పలుమార్లు మిత్రులతో చెప్పుతుండేవారు.

ఆధార గ్రంథాలు

1. దిగంబర కవులు – సాహితి మిత్రులు , విజయవాడ
2. తెలుగు కవితా వికాసం – కడియాల రామ్మోహన్ రాయ్
3. తెలుగులో కవితోద్యమాలు –తెలుగు అకాడమి , హైదరాబాద్.
4. జ్వాలాముఖి వికీపీడియా.

'కళాకేళి' సాహిత్య పత్రిక అవతరణ - వికాసం

డా॥ కిలారి గౌరినాయుడు, అధ్యాపకుడు, సెయింట్ జోసఫ్స్ మహిళా కళాశాల, విశాఖపట్నం.
చరవాణి : 62813 31348

పత్రికలు లే ప్రజాస్వామ్యం రెక్కలు లేని పక్షి లాంటిది. ప్రగతిశీల భావజాలానికి ముఖ్య భూమిక పత్రిక. కళాతాత్విక సాహిత్య సాంస్కృతిక అంశాలు రంగరించుకొని ముందుకొచ్చిన అక్షరాలు ప్రతీ తరంలోను నిర్వర్తించిన పాత్ర సదా చిరస్మరణీయం. అరవయ్యో దశకంలో ఒక వైపు దేశంలోను, మరో వైపు తెలుగు నేల మీద భయంకరమైన సంక్షోభం రాజ్యమేలుతుంది. అప్పుడప్పుడే కొత్తగా తెచ్చుకున్న స్వాతంత్ర్యాన్ని గురించి ప్రజానీకానికి అర్థమవుతుంది. అధికార వికేంద్రీకరణ క్రింద స్థాయి నుండి మొదలవ్వాలనే సత్యాగ్రహ ఉద్యమం గాని, పాలన యావత్తు ప్రజాపక్షం కావాలనే సామ్యవాదం గాని రెండూ విస్తృతమైన ప్రచారోద్యమ సాధనాల కోసం ప్రయత్నిస్తున్న కాలమది.

అప్పటికి దశాబ్దాల ముందే బ్రహ్మ సమాజ ప్రభావం, భక్తి ఉద్యమ జాడలు బలపడుతున్నాయి. సంస్కరణోద్యమాలు దేశమంతటా విస్తరిస్తున్నాయి. గురజాడ అప్పారావు, సామనే ముద్దు నరసింహం, కందుకూరి వీరేశలింగం, రఘుపతి వెంకటరత్నం నాయుడు మొదలగు వారు ఆంధ్రదేశంలో ఆ ఉద్యమాలకి ఆజ్యం పోశారు. అయితే స్వాతంత్ర్యనంతరం సంస్కరణోద్యమాలతో పాటు సమూల మార్పు ఆహ్వానించే విప్లవోద్యమాలు కూడా బయలుదేరాయి. శతాబ్దాలుగా మనుషుల జీవితాలను నిర్దేశించిన ఛాందస భావాల్నుంటు విదుల్చుకొ ప్రతీ దాన్ని ప్రశ్నించడం ప్రారంభమైంది. సాహిత్యంలో కూడా ఈ ధోరణి కనబడింది.

పాశ్చాత్య అభ్యుదయ సిద్ధాంతాలు వెలుగులో అనేక అపురూపమైన విషయాలను తువితీరా అధ్యయనం చేసిన నాటి యువతరం సంప్రదాయక సంకెళ్ళను తెంచుకొ బయటపడింది. అది అక్కడితో ఆగలేదు. ప్రపంచ దేశాలలో నాటి సమకాలీన ఆధుక ఆలోచనాపరుల సిద్ధాంతాల్నుంటిని ఔపోసన పట్టాలు చూసింది. పీడితుల వైపు నిలబడేవారి సంఖ్య పెరిగింది. ముఖ్యంగా తెలుగు సాహిత్యంలో సామ్యవాద దృక్పథం స్పష్టంగా కనబడింది. కవిత్వం, కథ, నవల... అన్ని ప్రక్రియలలోను కొత్త దారులు తొక్కేవారి సంఖ్య కూడా పెరిగింది. ప్రయోగాలు ఆహ్వాంచబడ్డాయి.

ఆ క్రమంలో 'కళాకేళిధర్మ సంగ్రామ కేళి' అని ప్రముఖ కవి కె.వి. రమణారెడ్డి కవితలో ప్రస్తావించిన వాక్యాన్ని స్ఫూర్తిగా తీసుకొన్న ఆవంత్స సోమసుందర్ 1968 ఏప్రిల్‌లో కాకినాడ కేంద్రంగా కళాకేళి ఆధుక సాహిత్య మాసపత్రికను స్థాపించారు. నిజాుకి అప్పటికే 1943లో ఆవంత్స సోమసుందర్, నిడదవోలు శివసుందరేశ్వరరావు, రాంషా, ఆదుర్తి నరసింహామూర్తి, మానుస్సు, శశాంక మొదలగు యువకులు కాకినాడలోనే కళాకేళినికేతన్ అనే సంస్థను స్థాపించారు. 1945 నుంచి తన కార్యక్రమాలను పిఠాపురం కేంద్రంగా విస్తృత పరుచుకున్న ఈ సంస్థ చింతాదీక్షుతులు, పిలకా గణపతి శాస్త్రి, శ్రీరంగం నారాయణబాబు, జమ్మలమడక మాధవరాయశర్మ మొదలగు ఉద్దండులందరికి దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి ఆధ్వర్యంలో సన్మానాలు చేసి సంచలనం సృష్టించింది. 1957 నుంచి పుస్తక ప్రచురణను కూడా ఈ సంస్థ చేపట్టింది.

మానవీయ వికాసాుకి సాహిత్యం ఉత్తమ ప్రేరకం. కాబట్టి సరిగ్గా దశాబ్దం తరువాత 1967లో కల్పనా సాహిత్య పరిషత్తు ప్రారంభోత్సవంలో నాటి సాహితీ మిత్రులు సమాజాుకి ఒక సాహిత్య పత్రిక అవసరం అనే విషయాున్ని ప్రస్తావించారు. అక్కడితో ఆగకుండా దానిని నిర్వర్తించే బాధ్యత సోమసుందర్ తదితరులపై పెట్టారు. పత్రిక శీర్షిక కోసం పెట్టుకున్న దరఖాస్తులో కల్పన, కవిత, కళాకేళి పేర్లను సూచించారు. ఆశ్చర్యమేమిటంటే 'కళాకేళి' అనే శీర్షికకి

మాత్రమే అనుమతి ఇచ్చారు. తెలుగు సాహితీ చరిత్రలో సుస్థిరస్థానం సంపాదించుకున్న కళాకేళి చారిత్రక నేపథ్యమిదే.

'ఆధునిక సాహిత్య దిక్సూచి' అనే నినాదంతో కళాకేళి తన ప్రస్థానాన్ని ప్రారంభింఇంది. మొదట మాస పత్రికగా ప్రారంభింపబడింది. తర్వాత కాలంలో ద్వైమాసపత్రికగా ప్రచురించేవారు. 1970 నుంచి త్రైమాసిక పత్రికగా రూపాంతరం చెందింది. ఈ పత్రికలో రచనలు ఎంతో విశిష్టమైనవి. సోమసుందర్ గారిని గురజాడ అప్పారావు రచించిన ముత్యాలసరాలు, శ్రీశ్రీ మహాప్రస్థానం, దేవులపల్లి కృష్ణశాస్త్రి రాయప్రోలు సుబ్బారావు లాంటి వారి అనేక రచనలు ప్రభావితం చేశాయి. కళాకేళి పత్రిక ముందు వెనుక గొప్ప సాహిత్య వారసత్వం, అనేక ప్రసిద్ధ చెందిన పత్రికలున్నాయి.

అందువలన సోమసుందర్‌కు పత్రికను వ్యవస్థీకృతం చేయటం పెద్ద కష్టమేమీలేదు. మొట్టమొదట సారిగా 1864లో ప్రారంభింపబడిన సుజనరంజని, ఆంధ్రభారతి, జ్వాల, అభ్యుదయ వంటి దాదాపు యాభై పత్రికలు ప్రసిద్ధ కవులు, పండితులు నడిపినవి సోమసుందర్‌కి మార్గదర్శకం చేశాయి. అయితే ముఖ్యమైన విషయమేమిటంటే పూర్వ పత్రికలలో ఆధుక దృక్పథం వెలువరించిన పత్రికలు ఉన్నప్పటికి సోమసుందర్ గుండెచప్పుడు పూర్తిగా ఆధునికతవైపుకే.

ఈ పత్రిక కేవలం ఆధునిక సాహిత్యానికే ప్రాముఖ్యత నిచ్చి వెలువడేది. ఈ విషయాన్ని కళాకేళి పత్రిక అట్ట మీద ముద్రించిన "కళాకేళి ఆధునిక సాహిత్య దిక్సూచి" అనే వాక్యం స్పష్టంగా తెలుపుతుంది. కళాకేళి పత్రిక లక్ష్యాల గురించి ఈ విధంగా తెలియజేశారు.

"వర్తమాన సాహితీ భావ ధారను సమన్వయం చేయడానికి, కేంద్రీకృత స్వరూపాన్ని ప్రదర్శించడానికీ, యువసాహితీ పరులలో సక్రమపథ నిర్దేశం కావించడానికి, నేటి సాహితీ ధోరణులలో సువ్యవస్థ సంఘటింప చేయడానికి కళాకేళి మాసపత్రిక అవతరించి కృషి సల్పుతున్నది" అని సంపాదకుడు సోమసుందర్ అన్నారు.

సోమసుందర్ ఎన్నుకున్న పత్రికలక్ష్యం సమంజసంగానే ఉంది. సాహిత్యంలో కేంద్రీకృత స్వరూపం తీసుకురావటం అంటే సోసు దృష్టిలో సాహిత్య జగత్తు అంతా కూడా అభ్యుదయ భావజాలాన్ని అభివృద్ధి చేయడమే అనే అర్థంలో వాడారు. సోసు ఊహించిన సాహితీ విప్లవం రాలేదు గాని శ్రీశ్రీ సాహిత్యం, సోసు సాహిత్యం, ఆరుద్ర రచనలు, నారాయణ బాబు, నిఖిలేశ్వర్‌లాంటి రచనలు ప్రగతిశీల భావజాలాన్ని పెంపొందించడంలో తోడ్పడ్డాయి.

సోసుగారి ఇంకొక ఆశయం ఏంటంటే యువ సాహితీ పరులలో సక్రమ పథ నిర్దేశం కావించాలనే తలంపు సోసుగారికి ఉంది. కవి కళాకారుడు, స్వేచ్ఛాప్రియుడు అయితే సోసు యువకవులంతా కూడా సక్రమమైన మార్గంలో నడవటం లేదు వాళ్ళందరిని ఏకం చేసి తన మార్గ దర్శకత్వంలో కళాకేళి పత్రికలో రచనలు ప్రచురించి వారందరిని ఏకతాటిపైకి తీసుకురావాలు ప్రయత్నం చేశాడు. అయితే కొంతమంది కవులు మిరియాల రామకృష్ణ, విరియాల లక్ష్మీపతి, చందు సుబ్బారావు, రాంషా, మన్మధరావు, పృథ్వి, బాబురావు, శశికాంత్ శాతకర్ణి లాంటివారు కొంతమంది ఆయన వెంట చివరి వరకు ఉన్నారు. అయితే అంతా కూడా తమ గురువు గారి అడుగు జాడలలో నడిచి ఎక్కువ భాగం సోసు శైలి, జీవనశైలి అనుకరిస్తూ అనేక గ్రంథాలను రాశారు. తరువాత కాలంలో తమ సొంతశైలిలో రచనలు కూడా చేశారు. పూర్వం రామరాజు భూషణుడు రాసిన వసు చరిత్రకు పిల్ల వసుచరిత్రలు పుట్టినట్టు సోసు సాహితీ సంతానం వర్ధిల్లింది. ఈ విధంగా సోసు కవితా చైతన్యాన్ని రగిలించడంలో సఫలీకృతుడయ్యాడు. సోమసుందర్ భావకవిత్వం నుంచి అతి వాస్తవిక కవితా వాదం వరకు వీట్నుంటి సమన్వయం చేసి ఒక సువ్యవస్థకు ఏర్పరచాలనే ప్రయత్నించాడు. సువ్యవస్థ అంటే మార్క్సిస్ట్ దృక్పథంతో కూడిన వ్యవస్థ అనే అర్థంలో వాడారు.

తన సాహితీ పత్రిక కళాకేళి ఆధుక సాహిత్య దిక్సూచిగా, ఆ దిక్సూచిని పట్టుకొని సాహిత్య నావను నడిపే

నాయకుడిగా శ్రీ సోమసుందర్ గోచరిస్తారు. ఆయనలో బలంగా నాటుకుపోయిన అభ్యుదయ భావజాలం కోసం మొట్టమొదట నుంచి తన మరణ దశ వరకు సాహితీ లోకంలో ప్రసిద్ధులైన కవులను, అప్రసిద్ధులైన కవులను రచయితలను ఏకీకృతం చేసి నావను నడిపే నాయకుడు కావాలు దాదాపు ఆరున్నర దశాబ్ధాల పాటు హోరాహోరీగా పోరాడి కొంత సఫలత పొందాడు. ఆయనకి మొట్టమొదట నుంచి శ్రీశ్రీ, ఆరుద్ర, సినారె, శివారెడ్డి లాంటి కవులతో, కవి పండితులతో నిత్యం స్నుహితంగా ఉండేవాడు. ఆయన స్నేహపాత్రత మరువరాది.

కవిగా, విమర్శకునిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు గాంచిన ఆవంత్స సోమసుందర్ సంపాదకత్వంలో కళాకేళి పత్రిక కాకినాడ నుంచి వెలువడేది. ఈ పత్రికలో కవితలకు, వ్యాసాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. వీటితో పాటు కథానికలు, గ్రంథ సమీక్షలు, సంపాదకీయాలు కూడా వెలువడేవి. ఈ పత్రిక కేవలం సాహిత్యానికే అంకితమైంది. ఈ పత్రికలో సాహిత్య అంశాలు తప్ప ఇతరమైన అంశాలకు చోటు లేదు.

ఈ పత్రికలో ప్రధాన శీర్షికలైన గ్రంథావలోకనం శీర్షికలో గ్రంథ సమీక్షలు, గ్రంథ విమర్శలు ప్రచురించబడేవి. స్వీకారం' శీర్షికలో కవితా సంపుటాలు, కవితా సంకలనాలు, సాహిత్య వ్యాసాలు, పత్రికలు, నవలలు, కావ్యాలు, కథల సంపుటాలు వంటి ప్రచురణలకు సంబంధించిన వివరాలు ప్రచురింపబడేవి. 'ఋతుపవనాలు' శీర్షికలో దేశదేశాల కవుల గురించి, వారి ధోరణులను గురించి కవితా సాధనలో వారు సాధించిన విజయాలను గురించి వివరాలు ప్రచురింపబడేవి. 'తొలకరి' శీర్షికలో కొత్తగా కవితా రంగంలో ప్రవేశిస్తున్న రచయితల రచనలు ప్రచురింపబడేవి. పత్రికను గురించి పాఠకుల అభిప్రాయాలు, సూచనలు 'లేఖాళి' శీర్షికలో ప్రచురించబడేవి.

మొదటి లోపలి కవరు పేజీలో 'యువర్ ఎటెన్షన్ ప్లీజ్' శీర్షిక ద్వారా రాబోవు సంచికలోని రచయితల పేర్లు ప్రకటించబడేవి. 'ముఖాముఖి' శీర్షికలో పత్రికా సంపాదకులు పాఠకులకు చేసే విజ్ఞప్తులు, మనవులు, ఆకాంక్షలు, ఆలోచనలు వంటి విషయాలు ప్రచురింపబడేవి.

యువరచయితల సాహిత్య సందేహాలకు సమాధానాల కోసం ప్రశ్నలు–జవాబులు పేరుతో 'ప్ర.జ.' శీర్షికను, కవయిత్రుల కవితలు, వ్యాసాలు ప్రచురణ కోసం "కుంకుమ రేఖలు" అనే శీర్షికను ప్రవేశపెట్టడం జరిగింది. ఈ పత్రికలో ఒక్కోసారి ఆయా సందర్భాలననుసరించి పాఠకులకు పత్రికా శుభాకాంక్షలు కూడా ప్రచురించబడేవి.

పత్రికను ప్రారంభించిన తొలిరోజులలో కవిత్వానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ ప్రచురింపబడేది. తర్వాత కాలంలో వ్యాసాలకు, కథలకు, గ్రంథ సమీక్షలకు కూడా ద్వితీయ ప్రాధాన్యం ఇస్తూ వెలువడేది. ఈ పత్రిక మొత్తం 19 సంచికలను మాత్రమే వెలువరించింది. రెండు సంచికలు లభ్యం కాలేదు.

ఆధార గ్రంథాలు :

1. కళాకేళి పత్రికలు – ఆవంత్స సోమసుందర్
2. ముళ్ళు – పూలు– ఆవంత్స సోమసుందర్
3. కలలూ కన్నీళ్ళు – ఆవంత్స సోమసుందర్

ఆచార్య గుండెడప్పు కనకయ్య కథలు – దళిత నేపథ్యం

కోష్టు గోవిందరావు, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.
చరవాణి : 76808 43505

20వ శతాబ్దం శాస్త్ర సాంకేతిక రంగాలలోనూ, ఆర్థిక, సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక, సాహిత్య రంగాలలోనూ విప్లవాత్మకమైన మార్పులు సృష్టించింది. ముఖ్యంగా తెలుగు సాహిత్యం ప్రాశ్చాత్య ప్రభావాలతో నూతన ఒరవడి సృష్టించిందని చెప్పవచ్చు. నవలా ప్రక్రియ మొదలుకుని నానీలు, హైకూల వరకు, జాతీయోద్యమ కవిత్వం మొదలుకుని మైనారిటీ వాద కవిత్వం వరకు ప్రక్రియా పరంగానూ, ఉద్యమ పరంగానూ తెలుగు సాహిత్యం శ్రావణ మాసపు నూతన వర్షపు నదీ ప్రవాహంలా కొత్తపుంతలతో పులకరించి పోయింది. ఈ శతాబ్దం సామాన్య మానవుని శతాబ్దం, తాడిత పీడిత వర్గాల శతాబ్దం, శ్రామిక కర్షక జీవుల శతాబ్దం, సమాజంలో సామాజిక బహిష్కరణకు, సామాజిక దోపిడీకి గురైన అభాగ్యుల శతాబ్దం. ప్రబంధ కన్యకల వర్ణన నుండి విముక్తి పొంది సామాన్య మానవుని వెతలను వివరించిన శతాబ్దం, రాజభవనాలలో సింహాసనాలతో మదిర మత్తులో ఊగుతున్న కవులు సృష్టికి ప్రతిసృష్టి చేయగల కవులు తమ చుట్టూ జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను గమనించి కలం కదిపిన శతాబ్దం, అటువంటి విప్లవాత్మకమైన మార్పులు గల ఈ శతాబ్దంలో వచ్చిన అతి ముఖ్యమైన ఉద్యమాల్లో దళిత కవిత్వోద్యమం ఎంతో విశిష్టమైనవి. ఈ హిందూ దేశంలో పుట్టుక నుండే బహిష్కరింపబడిన జాతి దళితుడు, అతని జీవనం, అతని గమనం, అతని చర్య అన్నీ ఈ హైందవ సమాజానికి కంఠక భూయిష్టమై, మానవత్వానికి మాయని మచ్చ తెచ్చాయి. ఈ భారతదేశంలో శతాబ్దాల తరబడి ఒక వర్గాన్ని మానసికంగా, శారీరకంగా దుర్భలులను చేసి, వారి శ్రమను సంపదను దోచుకుని, వారిని అవమానాల పాలు చేస్తూ, హత్యలు, అత్యాచారాలు చేస్తూ వికృతానందం పొందిన భారతావని హృదయంలేని శిల, ఇటువంటి భారతవనిలో దుర్భర జీవితం గడుపుతున్న దళితుల యొక్క జీవన రోధనలను తెలియజేస్తూ వారిలో చైతన్యాన్ని రగల్చడమే ప్రధాన భూమికగా దళిత కవితోద్యమం 1980 తరువాత తెలుగులో వెలువడి సంచలనం సృష్టించింది. అంతవరకు గ్రామ ప్రవేశం లేని దళితుడు ఒక్కసారిగా కథానాయకునిగా సాహిత్యంలోకి ప్రవేశించాడు.

స్త్రీవాద సాహిత్యానికి భరతవాక్యం పాడుతూ నాందీ వాక్యంగా తెలుగు సాహిత్యంలోకి దళిత ఉద్యమం ప్రవేశించింది. ఈ దళిత ఉద్యమంలో భాగంగా పురాణ ప్రతీకల నుండి మొదటిగా సాధారణ మానవుని వెతల వరకు దళితుని జీవనాన్ని బాహ్య ప్రపంచానికి తెలియజేసారు కవులు. అటువంటి వాటిలో ఎంతో మంది కవులు తమ తమ అభిప్రాయాలు, అనుభవాలు, కష్టాలు, దళితులపై జరుగుతున్న దాడులు, శ్రమ దోపిడీ, సమాజంలో దళితుల పట్ల ఉన్న చిన్న చూపు వంటి అంశాలను, వారు వివిధ రంగాలలో వెనుకబాటు చెందడానికి గల కారణాలను తెలియజేస్తూ ఆచార్య గుండెడప్పు కనకయ్యగారు తన కథల ద్వారా తెలియజేసారు. కనకయ్య గారు తెలంగాణ ప్రాంతానికి చెందిన దళిత కవి. కవి అనే దానికన్నా దళిత విప్లవకారుడు అనడం సముచితంగా ఉంటుంది. ఈయన 15-12-1969లో నిజామాబాద్ (కరీంనగర్)లో వీణవంక గ్రామంలో జన్మించారు. నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన కనకయ్యగారు చిన్నప్పటి నుండి వివక్షను, అవమానాలను, అన్యాయాలను ఎదుర్కొని చదువును విడిచిపెట్టక, ఉన్నతమైన చదువులు అభ్యసించి ప్రస్తుతం తెలంగాణా విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖలో ఆచార్యులుగా ఉన్నారు. ఈయన స్నాతక విద్యదశలోనే దళిత

కవిత్వం, దళిత కథలు రాస్తూ, దళితుల కోసం పోరాటం చేసిన విప్లవ కవి. ఈయన మేమిట్లుండం కథాసంపుటిని, ఎదురుచూపులు కథా సంకలనాన్ని వెలువరించారు. ఈయన కథలు తన చుట్టూ జరిగిన వివిధ సంఘటనలు ఆధారంగా నిర్మితమైనవి. ఈ కథల్లోని పాత్రలు పాఠకులకు పరిచయస్తుల వలె తోచి, పాఠకులను భ్రమింపజేసి, వారి అభిమానాన్ని దోచుకుంటాయి. కనకయ్య కథలు దళిత జీవితాన్ని చిత్రించడంతో పాటు దళితుల మధ్య గల అంత:కలహాలు, వర్గ సంఘర్షణను తెలియజేస్తూ, దళితులను చైతన్యపరిచి, వారిని అభివృద్ధి వైపు బాటలు వేస్తాయి. కనకయ్య గారు మొత్తం 11 కథలు రాయడం జరిగింది. ఈ కథలు సంఘటనల పరంగానూ, నేపథ్యం పరంగానూ, కథాస్థలం పరంగాను, సమస్య చిత్రణ పరంగానూ ఎంతో వైవిధ్యాన్ని, వైచిత్రిని కలిగి ఉండి, చక్కని ఎత్తుగడలతో దళిత జీవన విధానాన్ని దర్శింపజేస్తాయి.

గుండెడప్పు కనకయ్య కథలను పరిశీలించినట్లయితే మేమిట్లుండం కథా సంపుటిలో 10 కథలు, ఎదురుచూపులు, కథాసంకలనంలో ఒక కథ ఉన్నది. ఈ కథలన్నీ దళిత నేపథ్యం ఆధారంగా దళిత జీవిత చిత్రణతో దళితుల సంస్కృతి సాంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, నాగరికత వంటి విషయాలతో పాటు సమాజంలో దళితుల పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయో, వారు ఏ విధమైన సామాజిక జాడ్యాలను ఎదుర్కొంటున్నారో, సంఘంలో దళితుల పట్ల జరుగుతున్న మోసాలు దాడులు, కుట్రలు, అవమానాలు, అత్యాచారాలు, హత్యలు మొదలైనవన్నీ తెలియజేసారు. ఈ 11 కథల్లో దళితుల యొక్క సంపూర్ణమైన జీవితాన్ని చిత్రించారు.

మేమిట్లుండం అనే కథా సంపుటిలో మొదటి కథ చెప్పిచ్చుకొడతాం అనే కథను గమనించినట్లయితే, ఇది ఆదిమ సమాజం నుండి నేటివరకు జరిగిన మానవ పరిణామం, దళితుల యొక్క ఆవిర్భావం, అంటరానితనం ఏర్పడిన విధానం వంటి అంశాలను తెలియజేసారు. మొదటి మానవుడు ఈ విశ్వంలోకి వచ్చిన తరువాత ఎంతో పరిశోధించి, పరిశీలించి, ప్రకృతిని అవగాహన చేసుకుని, వైద్యంలోనూ, ఆహారంలోనూ, స్థావరంలోనూ ఎంతో పరిశీలించి ఎంతో ఆమోదయోగ్యమైన, ఆచరణ యోగ్యమైన, సురక్షితమైన వైద్యాన్ని, ఆహారాన్ని ఎంపిక చేసుకుని జీవించడం, స్థిర నివాసం ఏర్పరుచుకోవడం, అడవి జంతువులను మచ్చిక చేసుకోవడం ద్వారా సాధించిన ప్రగతిని 30 మంది శత్రువులు మొదటి మనిషిని ఆక్రమించి, కట్టి, బెదిరించి తన సంపదను, నాగరికతను దొంగిలించి, వారికి దూరంగా ఉంచిన ఉదంతం దళిత విప్లవాన్ని తెలియజేస్తుంది. మొదటి మనిషి యొక్క నాగరికతను, అలవాట్లను అనుకరిస్తూ చివరికి ద్రోహులై అతనిపై ఆధిపత్యం చెలాయిస్తూ నీచమైన వృత్తిని అంటగట్టడం అగ్రవర్ణాల వారి మోసకారితనాన్ని తెలియజేస్తుంది. దళిత ఆవిర్భావ చారిత్రక నేపథ్యంగా చెప్పగల ఈ కథ ద్వారా సమస్తమైన దళిత వర్గం వంచనకు గురైన విధానాన్ని ఈ కథ ద్వారా తెలియజేసారు.

అదే విధంగా అక్షరాల బంగారయ్య కథలో దళితులకు విద్య యొక్క అవసరాన్ని మరియు దళితుల ఆర్థిక స్థితిగతులను తెలియజేస్తూ దళితుల్లో విద్యా ఆవశ్యకతను, చైతన్యాన్ని, స్ఫూర్తిని కలుగజేయడంలో ఎంతో శ్రద్ధ వహించారు. అదేవిధంగా కొండాకులు కథలో స్త్రీ సమస్యలను చిత్రిస్తూనే మాదిగల జీవిత విశేషాలు, వారి ఆహారపు అలవాట్లు, విప్లవకారుల పేరుతో మాదిగ యువకుల్ని అరెస్ట్ చేస్తున్న పోలీసుల తీరు తెలియజేసారు. కరుణావతి అనే ఒంటరి మహిళ యొక్క జీవన గాధను, ఆమె చుట్టూ మృగాల రూపంలో పొంచి వున్న ముప్పును, మహిళలపై అడుగడుగునా జరుగుతున్న దాడులు, అత్యాచారాలు వంటి వాటిని తెలియజేస్తూనే, మాదిక పల్లె వాతావరణాన్ని అక్కడ మనుషుల యొక్క రూపురేఖలు, ఆహారపు అలవాట్లు, వారి యొక్క జీవన స్థితిగతులు మొదలైనవి తెలియజేసారు. యక్షగానం మరియు మహావీరులు అను కథల్లో దళితుల యొక్క గ్రామ దేవతలు, కులదేవతలు, వారి పూజా విధానం, పూజాకాలాలు, పూజలోని వివిధ క్రతువులు, వివిధ పద్ధతులు, జంతు బలులు, ఎల్లమ్మ కథలు చెప్పించడం, పట్నం ఊరేగింపు,

పోతురాజు, ఎల్లమ్మ వేషధారణలు, మాదిగలు వారి వివాహాల్లోని తంతులు, పద్ధతులు, నాగరికత, అలవాట్లు, ఊరేగింపులు, బోనాలు, బోనం తయారీ, వివాహంలోని కట్టుబాట్లు, గ్రామీణ పరిస్థితులు, గ్రామీణ వాతావరణం మొదలైన అంశాలను వివరించారు. ఈ రెండు కథలు పూర్తిగా మాదిగల యొక్క ఆచార సాంప్రదాయాలకు, గ్రామదేవత, శక్తి ఆరాధనలకు సంబంధించినవి. ఈ కథల్లో వారి ఆచారాలు, కట్టుబాట్లు, అలవాట్లు, నమ్మకాలు మొదలైన అతి సున్నితమైన అన్ని విషయాలను తెలియజేసారు. మాతంగి దాసు కథలో మాతంగి అనే దళిత అమ్మాయి యొక్క స్థితిగతులు, పేదరికం, కరువుకాటకాలు వంటి అంశాలతో పాటు ఇద్దరు గ్రామపెద్దల కామానికి బలైపోయిన సర్వస్వాన్ని, కుటుంబాన్ని కోల్పోయి న్యాయం కోసం 60 ఏళ్ళుగా న్యాయస్థానం ముంగిట ఎదురు చూస్తున్న నిరుపేద దీనురాలు, దౌర్భాగ్యురాలి కథగా చెప్పవచ్చు. మరో కథ కనకపు గుడిని పరిశీలించినట్లయితే దొర యొక్క సకల రహస్యాలు తెలిసిన కనకం ఏ విధంగా దొర చేతిలో మోసపోయి, ఊరి నుండి బహిష్కరింపబడి, తన మంచితనం, ముందుచూపు, ప్రకృతిపై గల ప్రేమ వంటి వాటి ద్వారా ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకుని వైద్యం చేసుకుంటూ, ఏడాదిలో అడవిని సృష్టించి, ఒక ముని వాటికగా తన ఆశ్రమాన్ని ఏర్పరుచుకున్న విధానం, తన వైద్యం మరియు మంచితనం ప్రకృతి యొక్క మహత్యం మొదలైన అంశాలను తెలియజేస్తూ, అపకారికి కూడా ఉపకారం చెయ్యడం దళితులు మనస్తత్వమని ఈ కథలో నిరూపించారు. అదే విధంగా ఎదురు చూపులు కథా సంకలనంలోని కాపులూరి భద్రయ్య అనే కథలో గ్రామాల్లో కుల వివక్ష అనేది. ఎంతటి తీవ్రరూపంలో ఉందో తెలియజేసారు. మరీ ముఖ్యంగా కాపులూరి భద్రయ్య అనే దళిత ఉపాధ్యాయుడు వర్ణవ్యవస్థను నరనరాన జీర్ణించుకున్న ఆ గ్రామానికి బదిలీ కావడం, వైద్యం, వైద్యుడు, తాగునీరు, రహదారి సౌకర్యం లేని ఆ గ్రామాన్ని అభివృద్ధి పరిచినా సరే ఆ గ్రామంలో అతనికి తలదాచుకోవడానికి చోటు దొరకకపోవడం, దళితులపై దాడులు చేయడం, జరిమానాలు విధించడం, ఊరి బావి వద్దకు దళితులు ప్రవేశం లేకపోవడంవంటి అంశాలను తెలియజేసారు.

ఆచార్య గుండెడప్ప కనకయ్యగారు తన అనుభవాలను, విన్న, కన్న అనేక సంఘటనలను ఆధారంగా చేసుకుని, తన చుట్టూ ఉన్న పరిసరాలే కథాస్థలాలుగా చేసుకుని రాయడం జరిగింది. అందుకు ప్రథమ ఆధారం ఏమిటంటే చాలా కథల్లో రెండు మూడు పాత్రలు అవే పాత్రలు, అవే పేర్లు, అదే వృత్తితో పునరావృత్తం అవడం మనం గమనించవచ్చు. ప్రతీ కథలోనూ దళిత జీవితం, దళిత సమస్యలతో ఒక ఉద్యమ స్ఫూర్తిని గమనించవచ్చు. కనకయ్య కథల్లో చారిత్రక, ఆర్థిక రాజకీయ, సామాజిక నేపథ్యాలను దళిత కోణంలో దర్శించవచ్చు. ఎందుకనగా ప్రతీ కథలోనూ కనకయ్యగారు విశిష్టమైన కోణాలతో, వైవిధ్యభరితమైన కథాగమనంతో, తన కథలకు తానే నేపథ్యాలను కథల్లో ఇమిడ్చిన కథాశిల్పి. చెప్పిచ్చుకొడతాం కథలను గమనించినట్లయితే ఇది దళిత తాత్విక నేపథ్యానికి పునాది వంటిది. ఎందుకంటే సమాజంలో ఏ మార్పు కానీ స్వల్పకాల వ్యవధిలో సిద్ధించదు. అలవాటు స్వల్పకాలంలో ఆచారంగా పరిణితి చెందదు, ఎంతో సమయం, ఎన్నో సందర్భాలు వాటికి సహకరిస్తాయి. అలాగే ఈ సమాజం కులం అనే జాడ్యం ఒక్కసారిగా వచ్చి ప్రజల్లో చేరలేదు. ప్రజల్లోని కొన్ని ఈర్ష్య, అసూయ, ద్వేషం వంటి మానసిక వైకల్యాలు ఒక వర్గాన్ని దీర్ఘ కాలం పాటు ఏమరపాటుకు గురి చేసి శతాబ్దాలు తరబడి వారిపై ఆధిపత్యం చెలాయిస్తూ, వారిని ఆర్థిక, సాంఘిక, రాజకీయ రంగాల్లో దోచుకోవడమే కాకుండా, చివరకు శారీరక హింసకు పాల్పడడం కూడా మనం చెప్పిచ్చుకొడతాం కథ ద్వారా గమనించవచ్చు.

పై కథలో మొదటి మానవుడు ఏ విధమైన దాడులు ఎదుర్కొని, ఎలా వంచనకు గురయ్యాడో, ఏవిధమైన పరిస్థితులు కాలానుగుణంగా దాపురించాయో తెలియ జేసారు. ఆహారం కోసం మొదటి మనిషిపై ఆధారపడి అతని వెంట పడుతూ, వేధించే 30 మంది చివరకు మొదటి

మనిషిని వంచన చేసి, అతని యొక్క గృహం, ఆహారాన్ని దోచుకుని అతన్ని వారికి దూరంగా ఉంచి అతని చేత అన్ని పనులు చేయించుకోవడం జరుగుతుంది. ఈ విధమైన చర్యలు చారిత్రక కాలంలో దళితులు ఏవిధంగా వంచనకు గురయ్యారో తెలియజేసారు. అదే విధంగా కొండాకులు మరియు మాతంగదాసు కథలో దళిత జీవన చిత్రణతో పాటు స్త్రీ లైంగిక సమస్యలు, సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి తెలిపారు. సమాజంలో స్త్రీలు, ఏవిధంగా వంచనకు గురౌతున్నారో తెలియజేస్తూనే దళితుల జీవన స్థితిగతులు, సమాజంలో వారిపై జరుగుతున్న అక్రమాలు, అన్యాయాలను తెలియజేసారు. అదే విధంగా యక్షగానం మరియు మహావీరులు కథల్లో మాదిగలు, దళితుల యొక్క ఆచార వ్యవహారాలు, గ్రామదేవతల పూజావిధానం, వివాహాల్లోని క్రతువులు, సిందోళ్ళతో ఎల్లమ్మ కథలు చెప్పించడం, గ్రామీణుల యొక్క సంబంధబాంధవ్యాలు మొదలగునవి తెలియజేసారు. అదేవిధంగా సమాజంలోని దళితులపై జరుగుతున్న అన్యాయాల వల్ల ఎంతోమంది యువకులు విప్లవం వైపు వెళ్ళడం గమనించవచ్చు. కనకయ్య గారు ఈ విషయాన్ని కూడా తన కథల్లో ప్రస్తావించారు. యక్షగానం, కొండాకులు, కాపులూరి భద్రయ్య కథల్లో నక్సలైట్ ప్రస్తావన కనిపిస్తుంది. అయితే ఇందులో కూడా ఎంతో రాజకీయ కుటిలత్వం దాగి వుంది. సమాజంలో దళితుల పట్ల జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, దోపిడీ వంటి విషయాలు, అంటరానితనం వంటి జాడ్యాలను ఎదుర్కోలేక ఎంతోమంది యువకులు విప్లవంలో చేరిపోవడం గమనించవచ్చు. విప్లవంలో కూడా దళిత వర్గం వారే ఎక్కువగా ఉన్నా, ఉన్నతవర్గం వారు సారధ్యం వహిస్తున్నారనీ, కాల్పుల్లో దళితులు చనిపోతున్నారనీ తెలియజేస్తూ, ప్రభుత్వాలు బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో దళితుల్ని చంపడం, వేధించడం జరుగుతొందని కథల్లో యక్షగానం మరియు కొండాకులు కథల ద్వారా తెలియజేసారు. సమాజంలో అంటరానితనం అనే జాడ్యం ఎంత లోతుగా పాతుకుపోయిందో తెలియజేస్తూనే హిందూ సమాజం, పేదలు, భూమిలేని కూలీలు, దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్న వారు అందరూ దళిత వర్గం వారే అని, వారికి న్యాయస్థానాల్లో న్యాయం సైతం దొరకడం లేదని తెలియజేసారు.

ఆచార్య గుండెడప్పు కనకయ్య కథలు మన నిజజీవితంలో జరిగే వాస్తవిక సంఘటనలే. ఇందులో కనకయ్య ప్రవేశపెట్టిన పాత్రలు, సంఘటనలు అతని యొక్క ఆవేశానికి, విప్లవానికి, ఉద్యమ స్ఫూర్తికి నిదర్శనాలు, "దోషులెవరు" కథలో భారతి అనే బిచ్చగత్తె ద్వారా భారతదేశంలోని ఆర్థిక అసమానతలను తెలియజేసారు. అదే విధంగా కాపులూరి భద్రయ్య కథ ద్వారా గ్రామ సీమల్లో అంటరానితనం అనే జాడ్యం ఏ విధంగా కోరలు చాచి విజృంభిస్తుందో తెలియజేసారు. కనకయ్య కథలు దళిత జీవితాన్ని చారిత్రక, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ తాత్విక నేపథ్యాలను తెలియజేస్తున్నాయి.

ఆధారగ్రంథాలు :

1) తెలుగు సాహిత్య సమీక్ష – జి. నాగయ్య
2) కథాశిల్పం – వల్లంపాటి వెంకట సుబ్బయ్య
3) మేమిట్లుండం – గుండెడప్పు కనకయ్య
4) ఎదురుచూపులు – గుండెడప్పు కనకయ్య
5) తెలుగు కవితోద్యమాలు – తెలుగు అకాడమీ

లఘు కవితా ప్రక్రియ - రెక్కలు

డా॥ కె.చెన్నకేశవ రెడ్డి, ఆంధ్రోపన్యాసకులు, ప్రభుత్వ పురుషుల కళాశాల, కడప-516004

ఆధునికాంధ్ర కవిత్వం పద్య కవితా రూపంలోనూ, గేయ కవితా రూపంలోనూ,వచన కవితా రూపంలోనూ ఎంతో వైవిధ్యాన్ని ప్రదర్శించింది.పద్య కవితా రూపంలో కావ్యాలు, ఖండకావ్యాలు,లఘుకావ్యాలు,ఖండికలు వెలువడ్డాయి. గేయ కవితా రూపంలో గేయ కవితా కథాకావ్యాలు,గేయకవితా ఖండకావ్యాలు, గేయకవితలు కోకొల్లలుగానే వచ్చాయి. పై రెండిటికీ మించి వచన కవితా రూపంలో కథాకావ్యాలు, నాటకాలు, నాటికలు, వచన కవిత్వం, మినీకవిత్వం, హైకూకవిత్వం, నానీకవిత్వం, రెక్కలు కవిత్వం లాంటివి వెలువడ్డాయి.వీటిలో కాల ప్రవాహనికి తట్టుకొని పాఠకుల ఆదరణ పొందిన వాటిలో " రెక్కలు" ప్రక్రియ ఒకటి. రెక్కలు కవితా రూపం కూడా ఆధునిక సమాజానికి అవసరమైన కవిత్వ ప్రక్రియగానే వచ్చింది. హైకూ, రెక్కల్లో ఉన్న ఒక విశిష్టగుణమేమిటంటే చెప్పాల్సిన దాన్ని సూటిగా,సంక్షిప్తంగా చెప్పొచ్చు.భావుకతను తాత్వికతను అందించవచ్చు.

తెలుగు సాహిత్యంలో గజల్, రుబాయత్ వంటి గానయోగ్యమైన ప్రక్రియలు వచ్చినా ,వాటికున్న నియమాల వల్ల అవి అంత ప్రాచుర్యం పొందలేక పోయాయి.మరొక వైపు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వచ్చిన విప్లవాత్మక మార్పుల వల్ల ప్రపంచవ్యాప్తంగా వస్తున్న వివిధ సాహిత్యధోరణులను అవగాహన చేసుకోవడానికి వీలుకల్గింది. ఛందోబద్దమైన పద్యం స్థానాన్ని వచనం ఆక్రమించింది.వచన కవిత్వాన్ని జనం అక్కున చేర్చుకున్నారు.దినదిన ప్రవర్ధమానమై వచన కవిత్వం ఓ మహావృక్షంగా ఎదిగింది. సాహిత్యం సమకాలీన జీవనపరిస్థితుల్ని, వారి సమయాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరాన్ని చాటి చెప్పింది.

వచన కవిత్వాన్ని భుజాన వేసుకొని కుందుర్తి ఆంజనేయులుగారు ఎలాగైతే వచన కవితా యజ్ఞం చేశారో సుగమ్‌బాబు గారు 'రెక్కలు' అనే ఒక లఘు కవిత్వానికి అస్థిత్వాన్ని , గుర్తింపును తీసుకురావడానికి విశేషమైన కృషిచేశారు .మినీకవిత, హైకూ,నానీల తర్వాత ఔత్సాహిక కవులను ఆకర్షించిన మరో లఘుకవితా ప్రక్రియే రెక్కలు కవిత్వం. క్లుప్తత, గాఢత, ఆలోచనాత్మకమైన రసాత్మకత లఘురూప కవిత్వానికి ప్రాణం. ఈ రెక్కలు ప్రక్రియ సృష్టికర్త సుగమ్‌బాబు. ఆధునిక తెలుగు సాహిత్యంలో అభ్యుదయ, విప్లవ, దిగంబర కవులకు ఒక విశిష్ట స్థానమున్నట్లే పైగంబర కవులకు కూడా అటువంటి స్థానమే ఉంది.పైగంబర కవుల్లో సుగమ్‌బాబు గారు ఒకరు. ఈయన అసలు పేరు మహబూబ్ ఖాన్.సుగమ్‌బాబు తర్వాత కాలంలో సాహిత్యాన్ని పాఠకులకు మరింత దగ్గరగా చేర్చాలనుకునే ఉద్దేశ్యంతో " రెక్కలు " ప్రక్రియతో ముందు కొచ్చారు.

రెక్కలు కవిత ఆరు పాదాల్లో ఉంటుంది. మెదట నాలుగు పాదాలురాసి చిన్న గ్యాప్ ఇచ్చి మిగతా రెండు పాదాల్ని రాస్తుంటారు. ఈ గ్యాప్ పాఠకుని ఊహకు పదును పెట్టేదిగా ఉంటుంది.రెక్కలు కవిత రెండు భాగాలుగా ఉంటుంది. పై నాలుగు పాదాలు పక్షిశరీరంగాను, మిగతా రెండు పాదాలు పక్షి రెక్కలుగాను భావిస్తూ దీనికి రెక్కలు అనే పేరు పెట్టారనుకోవచ్చు. ఈ రెండు పంక్తులు రెక్కలై ఎగరనిదై సందేశం పూర్తి కాదు.వీటి గురించి ప్రముఖ విమర్శకుడు డా॥ అద్దేపల్లి రామమోహనరావు వ్యాఖ్యానిస్తూ " పైనాలగు పాదాలు ఒక జీవితానుభవాల్ని గురించి చెబితే, చివరి రెండు పాదాలు ఆ అనుభవంద్వారా కవి చెప్పదలచిన తత్వం గురించి చెబితే, జీవితానుభవం నుంచి ఉపరితలానికి వెళ్ళి ఆలోచిస్తేనే తత్వం విశదమౌతుంది.రెక్కలతో ఆకాశం పైకి ఎగిరితేనే చలనం ఉన్నతమౌతుంది." అన్నారు.స్పష్టమైన లక్ష్యం, లక్షణం రెక్కల్ని ప్రతిభావంతం చేశాయి.రెక్కలు అంటే పైకిఎగరడానికి ఉపకరించేవి అని అర్థం.

సుగమ్‌బాబు గారు తాను సృష్టించుకున్న 'రెక్కలు' అనే కవితా ప్రక్రియకు నియమ నిబంధనలు కానీ,నిర్మాణ రీతిని కాని చెప్పకుండా లక్ష్యం ద్వారానే లక్షణ నిర్దేశం చేయడం విశేషం.రెక్కల కవిత్వ ప్రక్రియ ఆషామాషీ కవిత్వంకాదు. కవితలకు రెక్కలోస్తే అవి విహంగాల్లో ఎగురుతాయి. సాహితీ లోకంలో బతుకుమూలాల్లోంచి జీవనసారాన్ని మధించి రాయాలి. 2003లో రెక్కలు మొదటగా సుగమ్‌బాబు ప్రచురించారు.

సుగమ్ బాబు ' రెక్కలు' ను హిబ్రూ యూనివర్సిటీ, ఇజ్రాయిల్ కు చెందిన ప్రొఫెసర్ డేవిడ్ షుల్మన్ ఏష్టవ ఔఅస్త్రయిగా ఆంగ్లంలోనికి అనువదించారు.దీని వల్ల అంతర్జాతీయ స్థాయిలో రెక్కలు ప్రక్రియకు మంచి గుర్తింపు వచ్చింది. రెక్కలు కవితలు ఎందుకు రాశారో సుగమ్ బాబు గారు ఇలా చెప్పారు" దు:ఖంలోంచే అవును దు:ఖంలోంచే రెక్కలు రాశాను.చుట్టూ వ్యాపించి వున్న దు:ఖాన్ని పోగొట్టాలనే రాశాను.ఏదీ ఊహించి రాయలేదు.చూసే రాశాను.అనుభవించే రాశాను.మనిషి తన పరిధులు తెలుసుకొని జీవించాలని చెప్పాను.'' అని నొక్కి వక్కాణించారు.రెక్కలు కవితా ప్రక్రియలో దాని స్వభావరీత్యా తాత్విక సత్యాలకే ప్రాధాన్యం ఉంటుంది. సుగమ్‌బాబు కవిత్వంలోనూ అలాంటి తాత్విక సత్యాలే ప్రతిఫలిస్తాయి.

సుగమ్ బాబు 'రెక్కలు' సంపుటి 2009లో వచ్చింది.ఈ రెక్కలు సంపుటిలో బాబుగారు జీవిత సత్యాల గూర్చి, సమాజాన్ని గూర్చి, తాత్విక అంశాల గూర్చి ప్రకృతి గూర్చి ఇలా ఎన్నో అంశాల్ని గూర్చి తెలియజేశారు.

"తనలో తలెత్తిన/ ప్రశ్నలే/ సిద్ధార్థుని / బుద్ధుణ్ణి చేశాయి / ప్రశ్నే / ప్రభాతం "

ఇది వినడానికి సాదాసీదా వాక్యంలా అనిపిస్తుంది. దు:ఖానికి కారణం ఏమిటి అనే ప్రశ్న బుద్ధుణ్ణి జ్ఞానం వైపు నడిపించింది. జ్ఞానాన్వేషణకు కావలసింది ప్రశ్నించే తత్వం. ప్రశ్నించాలంటే ఆలోచించాలి.ఈ లోకమంతా మనకొచ్చిన సందేహాలకు సమాధానాల్ని ఆన్వేషించడం వల్ల ఏర్పడిందే జీవితం. బౌద్ధం జ్ఞానాన్వేషణకు సంబంధించిన తత్వం.రెక్కలు ప్రక్రియకు కూడా తాత్వికత దాని ప్రాణం. మానవ జీవన తాత్వికతను అక్షరరూపమే తన రెక్కల కవిత్వం అని చెప్పకనే చెప్పినట్లయింది.

సుగమ్‌బాబుగారు మనిషి గౌరవాన్ని గూర్చి రాసిన కవిత

"తనను తాను / గౌరవించుకోలేని వాణ్ణి / ఎవరు /అవమానించలేరు / నక్షత్రకిరీటం / ఆత్మగౌరవం"

మనిషి తనను తాను గౌరవించుకోగలిగినప్పుడే ఎంతో ప్రశాంతంగా ఉండగలగుతాడు. తాను ఆత్మాభిమానంతో నిలబడగలుగుతాడు.అప్పుడే తనని ఇతరులు కూడా గౌరవిస్తారు.తనను తాను గౌరవించుకోలేని వాణ్ణి ఎవరో అవమానించనవసరం లేదని,ముందుగానే తానే తనను అవమానించుకుంటాడని కవి చక్కని అభివ్యక్తితో వర్ణించాడు.

గ్రామీణ ప్రాంతం నుండి వచ్చిన ఏ కవి అయినా ఎక్కడో ఒకచోటైనా తన ఊరి గురించి తప్పక రాస్తాడు. సుగమ్‌బాబు గారు మరో రెక్కలో తన ఊరు గురించి...

"ఎప్పుడైనా వెళితే / వాటేసుకుని / కంటతడి పెడుతుంది / మా ఊరు / నావీడుపే / దాని ఏడుపు"

పుట్టిన ఊరంటే ప్రతి వ్యక్తికి ఓ మరపురాని జ్ఞాపకమే. అది మమతల పొదరిల్లు కావచ్చు.అరమరికలు లేని మమతానురాగాలు కావచ్చు. కవి నిజంగా కంట తడి పెట్టించిన కవిత ఇది.

సుగమ్‌బాబుగారు పరిపక్వత చెందిన మానవుణ్ణి సీతాకోక చిలుకతో పోలుస్తూ ..

"గొంగళి పురుగు /దశదాటాక / సీతాకోక చిలకదే / చిద్విలాసం / మనిషి మహోర్దశ / మౌనం"

మనిషి అన్ని తెలిసి నట్లుగా మాట్లాడలేడు. ఎగరగలిగే రెక్కలు వచ్చిన సీతాకోక చిలుకలు ఎగరకుండా నిరోధించు కోవడమే జీవితం. ఎగర గలిగి అంటే ఎదైనా చేయ గలిగే

అవకాశం ఉండి కూడా దేన్ని చేయాలో దాన్ని మాత్రమే చేయగలిగే సంయమనం చాలా అవసరం. దీన్ని అద్భుతంగా కవిత్వీకరించాడు కవి.

శ్రీనివాసగౌడ్ , కలిమిశ్రీ సంపాదకత్వంలో 78 మంది కవులతో 2010 లో వచ్చిన సంకలనం " జయపతాక". ఈ సంకలనంలో ఎన్నోజీవిత తత్వాలు కనిపిస్తాయి. ఈ సంకలనం ద్వారా కవులందరూ నిజంగానే జయపతాక ఎగుర వేశారు. ఇందలో తక్కువ మాటల్లో విస్తృత భావాన్ని తెలియజేసే కవితలున్నాయి.

ఈ సంకలనంలో సుగమ్‌బాబు రాసిన అద్భుతమైన కవిత..

"దు:ఖం / అలజడే / అమితానందం / అలజడే / అలజడి ప్రవాహం / జీవితం"

మానవుడు దు:ఖంలో ఆందోళన పొందుతాడు. ఆనందం అమితమైనప్పుడుకూడా ఒక విధమైన ఆందోళన పొందుతాడు.

జీవితంలో వున్నవి ఆనందం, దు:ఖం రెండే. ఈ రెండూ ఒకే రూపంగా భావిస్తే జీవితమే. అలజడి ప్రవాహం అవుతుంది. ప్రవాహంలో అలలు వుంటాయి. 'జడి' వుంటుంది. జడి తడి ని సూచిస్తుంది. రెండూకలిసి 'అలజడి'. అలజడి అంటే ఆందోళన. మొత్తం పదానికి మరో అర్థం వచ్చింది. అలాగే ఆనందం, దు:ఖం రెండూ విడివిడిగా కన్పించినా, రెండూ కలిస్తే ప్రవాహమైంది. ఇది ఈ కవితలో పదప్రయోగాలద్వారా వచ్చిన తాత్వికాంశం.

"ఒక్క రెక్క / దు:ఖం / ఒక్క రెక్క / సుఖం / జీవితం / రెండు రెక్కలు"

ద్యావరి నరేందర్‌రెడ్డి గారు ఇక్కడ జీవితాన్ని రెండు రెక్కలతో ఎగిరే పక్షిలా చెప్పాడు. సుఖమైనా దు:ఖమైనా సమానంగా తీసుకోవాలనే స్ఫూర్తి ఇందులో వుంది.

కైలాస పతిరావు గారు మనిషి గూర్చి మంచి రెక్కలు రాశారు

"సింహాలు / మాంసాహారులు / మేకలు / శాకాహారులు / సర్వభక్షకుడు /మనిషి "

కొన్ని జంతువులు మాంసాన్నే తింటాయి. మరికొన్ని జంతువులు శాకాహారాన్ని తింటాయి. మనిషి మాత్రం ఈ రెండింటినే కాదు అన్నీ తింటాడు. అందుకే మనిషిని సర్వభక్షకుడు అన్నాడు కవి.

శ్రీనివాసగౌడ్‌గారు సత్యాన్ని గూర్చి రాసిన చక్కని కవిత

"సందర్భం / మారొచ్చు / సత్యం /మారదు / ఎప్పటికీ నిలిచి వుంటాడు / సూర్యుడు "

కవి చిన్న కవితలో లోతైన విషయాన్ని ఆవిష్కరించారు. సత్యం ఎప్పటికీ మారదు. ఎప్పటికీ నిలిచే వుంటాడు సూర్యుడు. ఇక్కడ సత్యమే సూర్యుడు.

పద్మకళగారు తాను రచించిన రెక్కలులో విలక్షణతను ప్రదర్శించారు.

"అద్భుత/ ప్రపంచం /ఎక్కడో లేదు/ నీచుట్టూనే / దృష్టి మార్చుకో/ సృష్టి మారదు "

సమస్యల పట్ల మనం చూసే దృష్టి కోణం మార్చు కుంటేనే జీవితం మారుతుందన్నదే రచయిత్రి అభిప్రాయం.

లోకంలో కొన్ని సాధారణాంశాలు కవికి అసాధారణంగా కనిపిస్తాయి. వాటిని వర్ణించడంలో అపూర్వమైన ప్రతిభను ప్రదర్శిస్తాడు కవి. అప్పుడు అవి పాఠకులకు చమత్కారాన్ని, ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగిస్తాయ్యి. అలాంటి విషయాలే పరమేశ్వరరావు తన రెక్కలో లోక సత్యాల్ని జీవన తత్వాన్ని ఇలా తెలియజేశారు.

"కిరణాలు / సోకనిదే / కమలం / వికసించదు / స్పృశిస్తేనే /భావాలు "

సూర్య కిరణాలు సోకితేగాని పద్మం వికసించదు. దూరంగా వుండి ఎంత అనుకూలంతో ఉన్నా అవతలి వ్యక్తిలో ఏ భావాలు వికసించవు. అయితే హృదయంతో స్పృశించి నప్పుడే, భావాల్ని మేల్కోల్పగలం.

కావ్యం యొక్క ఔన్నత్యాన్ని, విశిష్టతను గూర్చి రామకృష్ణరాజు గారి రెక్కలలో

"అకృతి/అశాశ్వతం/కృతి/శాశ్వతం/అజరామరం / కీర్తి"

మనిషి యొక్క ఆకారానికి ప్రతిరూపమైన శరీరం ఎనాటికైనా మట్టిలో కలవాల్సిందే. అది అశాశ్వతం. కానీ మనిషి కవిగా రూపొంది, సృజించిన కృతి అంటే కావ్యం మాత్రం ఈ భూమిపై ఎక్కడో ఒకచోట శాశ్వతత్వాన్ని పదిల పరుచుకుంటుంది. కాల చక్రంలో కవి భౌతికంగా దూరమైన కావ్యాన్ని సృష్టించడం వల్ల కవి కీర్తి అజరామరమైనది.

సుగమ్‌బాబు 'రెక్కలు' సంపుటం వెలువరించిన తర్వాత కాలంలో శ్రీనావాసగౌడ్ "వెలుతురు వలయాలు", పద్మకళ 'దృష్టి' పెద్దూరి వెంకటదాసు,ధూర్జటి,షరిఫ్‌బాయ్ ముగ్గురూ కలిసి "త్రివేణి రెక్కలశతకం" మల్లవరపు చిన్నయ్య 'ఆమని' మోపిదేవి రాధాకృష్ణ 'కాంతికెరటాలు' పి.లక్ష్మీనారాయణ ' తెలంగాణ రెక్కలు' ఇంకా చాలా మంది రెక్కలు కవితా సంపుటాల్ని ప్రచురించారు. రంగనాధ్, కేతవరపు రాజ్యశ్రీ, ద్వావరి నరేంద్రరెడ్డి, రుద్రారం శ్రీనివాసరెడ్డి, కైలాసపతిరావు వంటి 150 మందికి పైగా కవులు రెక్కలు ప్రక్రియలో రచనలుచేస్తున్నారు.దాదాపు ఈ ప్రక్రియప్రారంభమైన దశాబ్ది కాలంలోనే ఆరవైకి పైగా రెక్కల సంపుటాలోచ్చాయి. ప్రక్రియ ఏదైనప్పటికి కవిత్వాన్ని వదలకుంటే పాఠకుల మనసులను తప్పకుండా రంజిపజేస్తుంది. చాలా మంది కవులు 'రెక్కలు' ప్రక్రియలో తాత్విక, ప్రాకృతిక,సామాజిక అంశాల్ని వ్యక్త పరచడం అభినందనీయం.

ఆధారగ్రంథాలు :

1) తెలుగు సాహిత్య ప్రక్రియలు-ధోరణులు- ఆచార్య బూదాటి వేంకటేశ్వరులు
2) ఆధునిక సాహిత్యం-ప్రక్రియలు-ధోరణులు- ఎస్వీ.సత్యనారాయణ (సంపాదకులు)
3) ఆధునికాంధ్ర కవిత్వం-ఆవిర్భావ వికాసాలు- ఆచార్య ఎస్జీడి. చంద్రశేఖర్
4) తెలుగు సాహిత్య చరిత్ర -ఆచార్య వెలమల సిమ్మన్న.

పురాణ వాఙ్మయం – తెలుగు వారి జీవన పథం

డా॥ పి. మాధవి, అకడమిక్ కన్సల్టెంట్, సంస్కృత విభాగము, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.
చరవాణి : 85198 04784

1. ప్రవేశిక

వేదాల్లో నిక్షిప్తమైన జ్ఞానసంపదే పురాణాల్లో కథల రూపంగా వ్యాఖ్యానించబడింది. వైదికయుగం నాటి ధార్మిక, సాంఘిక పరిస్థితులు పురాణాల కాలం నాటికి చాలా మార్పులకు లోనయ్యాయి. పౌరాణిక యుగం నాటికి అనేక విదేశీయ జాతులు భారతదేశాన్ని తమ స్వదేశంగా చేసుకొని స్థిరపడ్డాయి. వారు ఇక్కడి ధార్మిక జీవనాన్ని గ్రహించినారు. వైదిక యుగంలో ప్రాధాన్యం వహించిన అగ్ని ఇంద్ర వరుణాది దేవతలు పురాణాల కాలం నాటికి గౌణమై వారి స్థానాన్ని విష్ణువు, శివుడు, బ్రహ్మ మొదలైన వారు ఆక్రమించారు. ఒకవైపు వేద విజ్ఞానాన్ని దర్శనాలు వ్యాఖ్యానిస్తున్నా పురాణాలు విష్ణు, శివుల ప్రాధాన్యతను వారి లీలలను విశేషంగా స్థాపించాయి. ఆ కారణంగానే విష్ణు, శివ, శాక్త మొదలైన దేవతా సంప్రదాయాలకు చెందిన పురాణాలు అనేకం రూపుదాల్చాయని రూఢిగా చెప్పవచ్చు. అందుచేత అవి మన సంస్కృతికి జీవనాడివంటివని భావించవచ్చు.

2. పురాణాలు – ప్రాచీనత

భారతీయ పురాణాల్లో, వైదికానంతర యుగం నాటి భారతీయుల ఆచార వ్యవహార వివరాలు, విశేషాలు, ధార్మిక, సాంఘిక, రాజకీయ జీవిత విధానాలు, దార్శనిక సిద్ధాంతాలు ప్రతిబింబించాయి. ఒక్కమాటలో చెప్పాలంటే పురాణాలు భారతీయుల ధార్మిక, సాంఘిక, రాజకీయ, దార్శనిక జీవనానికి విజ్ఞాన కోశ గ్రంథాలని ప్రకటించవచ్చు. ప్రాచీన భారతీయ సాహిత్యాన్ని వివేచించి చూస్తే వేదాలు ఎంత ప్రాచీనమైనవో పురాణాలూ అంతే ప్రాచీనమైనవని చెప్పవచ్చు. ఆధ్వర్య సహిత ప్రకారం పురాణ, ఋక్, సామ, ఛంద యజుస్సులు అన్నీ ఒకేసారి ఆవిర్భవించాయి. తడిసిన కట్టె నుంచి పొగ లేచినట్లుగా మహాభారతం నుంచి వేదాలు, ఇతిహాస, పురాణ, ఉపనిషత్, సూత్ర, ఆఖ్యాన వ్యాఖ్యానాలు ఉద్భవించాయని శతపథ బ్రాహ్మణం, బృహదారణ్యకాలు తెలుపుతున్నాయి. పురాణాలను పంచమ వేదాలుగా ఛాందోగ్యోపనిషత్తు పేర్కొన్నది. చతుర్దశ విద్యల్లో పురాణ విద్య విశేషమైనదని యాజ్ఞవల్క్య స్మృతి చెబుతున్నది. బ్రహ్మపురాణాలను స్మరించి తరువాత వేదాలను స్మరించాడని బ్రాహ్మాండపురాణం తెలుపుతున్నది.

మత్స్య, శివ పురాణాల ప్రకారం మొదట ఒకటే పురాణం నాలుగు లక్షల శ్లోకాలతో ఉండేదని దాన్ని వ్యాసుడు 18 భాగాలుగా విభజించి పేర్లు పెట్టాడని తెలుస్తున్నది. వేదాల్లో సంక్షిప్తంగా చెప్పబడిన విషయాలు పురాణాల్లో విపులంగా వ్యాఖ్యానించ బడ్డాయని విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. ఇంచుమించుగా ప్రతి పురాణంలోనూ భక్తి, దానాలు, దక్షిణలు క్షేత్రాలు, క్షేత్ర మహాత్మ్యాలు, వ్రతాలు, పూజా విధానాలు, దేవతా మహత్మ్యాలు, శివ విష్ణు శక్త్యారాధనలు పురాణాల్లో విపులంగా కనిపిస్తాయి.

3. జైన పురాణాలు

హిందువులవలె జైనులు కూడా చతుర్వింశతి పురాణాలు రచించుకున్నారు. అయితే హిందూపురాణ పంచలక్షణాలు వీటిలో కనిపించవు. ఇరవై నాలుగు తీర్థంకరుల గూర్చి వీరు పురాణాలు రాసుకున్నారు. అవి ఆదిపురాణం, అజిత నాథ పురాణం, సంభవ నాథ పురాణం, అభినంద పురాణం, సుమతి నాథ పురాణం, పద్మ ప్రభ పురాణం, సుపార్శ్వ పువరణం, చంద్రప్రభ పురాణం, పుణ్యదండ పురాణం, శీతలనాథ పురాణం, శ్రేయాంశ పురాణం, వాసు పూజ్య పురాణం, విమల నాథ పురాణం,

అనంతజిత పురాణం. ధర్మనాథ పురాణం, శాంతినాథ పురాణం, కుంథునాథ పురాణం, అరనాథ పురాణం, మల్లి నాథ పురాణం, ముని సువ్రత పురాణం, నేమి నేథ పురాణం, పార్శ్వనాథ పురాణం, సమ్మతిపురాణం. తెలుగు వారు అన్ని పురాణాలను సమానంగా పరిగణిస్తున్నా, భక్తికి అధిక ప్రాధాన్యమిస్తున్నారు. అందువల్ల 18 పురాణాల్లో భాగవత పురాణం విశేషఖ్యాతిని పొందిందని గట్టిగా చెప్పవచ్చు.

4. పురాణాల సంఖ్య

పురాణం అంటే పాత కథ. వ్యాసుడు పురాణాలకు కూడా ఒక రూపం తీసుకొచ్చాడు. భారతీయ సాహిత్యంలో అష్టాదశ (18) పురాణాలు ఉన్నాయి. వేదాలు, పురాణాలు సమానస్థాయి కలిగినవని మనకు మార్కండేయ పురాణంవల్ల తెలుస్తున్నది. మద్వయం, భద్వయం, చైవ (బత్రయం), వచతుష్టయం అ.నా.ప.లిం.గ.కూ.స్కాని పురాణాని పృథక్" అని ఉంది. మద్వయం–మత్స్య, మార్కండేయ పురాణాలు. భద్వయం–భాగవత, భవిష్యత్ పురాణాలు, బ్రత్రయం–బ్రహ్మ, బ్రహ్మాండ, బ్రహ్మవైవర్త, వచతుష్టయం–విష్ణు, వరాహ, వామన, వాయు పురాణాలు, అ–అగ్ని పురాణం, నా–నారద పురాణం, ప–పద్మపురాణం, లిం–లింగపురాణం, గ–గరుడపురాణం, కూ–కూర్మ పురాణం, స్కా–స్కాందపురాణం. మొత్తం 18 పురాణాలు. వీటికి 18 ఉప పురాణాలు, మరో 18 ఔప పురాణాలు ఉన్నాయని బృహద్వివేకం అనే గ్రంథం పేర్కొంటున్నది.

ఆది, నరసింహ, శివధర్మ, దుర్వాస, నారదీయ, కపిల, ఔషశన, బ్రహ్మాండ, వరుణ, కాళికా, మహేశ్వర, శాంబ, సౌర, పారాశర, మారీచ పురాణాలు వంటి వాటిని ఉప–పురాణాలని అంటున్నారు. అదే విధంగా అష్టాదశ ఔవపురాణాలుగా సనత్కుమార, బృహత్కుమార, బృహన్నారదీయ, ఆదిత్య, సౌర, నందకేశ్వర, కౌర్మ, భాగవత, వాసిష్ట, భార్గవ, ముద్గల, కల్కి, దేవీమహాభాగవత, బృహద్ధర్మ, పరానంద, వహ్ని, పశుపతి, హరివంశాలను పేర్కొన్నారు సంస్కృత కవీశ్వరులు.

'పురావవం భవతీతి పురాణమ్' ప్రాచీనమైనదే అయినా నిత్యం కొత్తది కావడం పురాణం అని పురాణాన్ని నిర్వహించారు. 'పురాపూర్వస్మిన్ భూతమితి పురాణమ్' – పూర్వం జరిగినది కాబట్టి పురాణం అన్నారు. అమరకోశం ప్రకారం పురాణానికి సర్గ, ప్రతిసర్గ, వంశ, మన్వంతర, వంశానుచరిత అన్న పంచలక్షణాలను పేర్కొన్నారు.

5. పురాణం – లక్షణాలు

పురాణం ఇతిహాసాలు సమకాలంలో వెలువడ్డాయని చెప్పవచ్చు. రామాయణ, భారతాలను ఇతిహాసాలంటారు. ఇతిహాసాలు జీవిత సత్యాన్ని బోధిస్తే, పురాణాలు నీతి, ధర్మం, ఆధ్యాత్మికత తెలియజేస్తాయి. పూర్వకాలములో ఏ కథ ఎలా జరిగిందో దాన్ని ఉన్నదున్నట్టుగా చెప్పే గ్రంథము.... ఇతిహాసము. మహాపురుషుల చరిత్ర ఒకచోట చేర్చగా ఏర్పడే శాశ్వతకాల గ్రంథమే పురాణము ఇతిహాసాలకంటే పురాణాలే ప్రజలను విశేషంగా ఆకర్షిస్తాయని చెప్పవచ్చు. భారతీయ సాహిత్యంలో ఉన్నన్ని పురాణాలు మరే సాహిత్యంలోనూ లేవని చెప్పవచ్చు.

'ఇతి' – ఈ విధముగా, హా + ఆస – జరిగిందిట.

ఏ కథ ఎలా జరిగిందో దాన్ని ఉన్నదున్నట్టుగా చెప్పే గ్రంథము –ఇతిహాసాన్ని పండితులు ఇలా నిర్వహించారు.

ధర్మార్థ కామ మోక్షాణాముపదేశ సమన్వితమ్ ।
పూర్వావృత్త కథాయుక్త మితిహాసం ప్రచక్షతే ॥

ధర్మార్థ కామమోక్షములు అనే చతుర్విధ పురుషార్థములు, ఉపదేశములు, పూర్వవృత్తాంత కథలతో కూడినది ఇతిహాసము... రామాయణ, మహాభారతాలు, ఇతిహాసాలుగా పరిగణింపబడ్డాయి.

శ్రుతులు ఆధారంగా, స్మృతులను మహర్షులు మనకు అందజేశారు. ఈ కోవలోనే సగటు మనిషి వేదసారాన్ని తేలికగా గ్రహించడానికి కథల రూపంలో, వివరణాత్మకంగా, ఒకటి లేదా కొన్ని విశేషాలు సమాహారంగా కలిగి ఉండేవి

పురాణాలు. ఈ పురాణాలకు ఐదు లక్షణాలను పేర్కొన్నారు. అవి ఇలా ఉన్నాయి.

1. సర్గ,

2. ప్రతిసర్గ,

3. వంశం

4. మన్వంతరం,

5. వంశానుచరితం.

1. మొదటిదైన సర్గం అనే దానికి అర్థం సృష్టి అని, ఈ సృష్టి అంతా ఎలా జరిగింది? పంచతన్మాత్రలు, పంచభూతాలు ఎలా ఉద్భవించాయి? అని వివరించుటమే సర్గం.

2. రెండో లక్షణం ప్రతిసర్గం. సర్గానికి వ్యతిరేకం. అంటే సృష్టి ఎలా లయమవుతుంది? ప్రళయాలు ఎన్ని రకాలు? అవి ఎలా ఏర్పడుతాయి? అని వివరించటమే ప్రతిసర్గం.

3. మూడో లక్షణమైన వంశంలో సృష్టి ప్రారంభం నుంచి ఎంతమంది రాజులు, వారి వంశాలు ఆవిర్భవించాయి. వారి వంశాలు వర్ణనతో పాటు ఋషుల వంశాలకు సంబంధించిన విషయ వివరణలు ఈ లక్షణంలో కనిపిస్తాయి.

4. నాలుగో లక్షణం మన్వంతరం. ఇది కాలగణనాన్ని చెబుతుంది. పద్నాలుగు మన్వంతరాల విషయాలు, వాటి అధిపతులు, వారికి సంబంధించిన విషయాలన్నీ దీనిలో వస్తాయి.

5. అయిదో లక్షణమే వంశాను చరితం. దీనిలో సృష్టి మొదలైన దగ్గర నుంచి పాలించిన రాజులు, చక్రవర్తుల, ఋషుల వంశ చరిత్రలు వర్ణితమవుతాయి.

ఇలా అయిదు ప్రధాన లక్షణాలు తొలినాళ్ళ నుంచి అంతా పురాణాలకు ఉంటాయని, ఉండాలని చెబుతూ వస్తున్నారు. కాలక్రమంలో కొంతమంది ఈ అయిదు లక్షణాలను పది లక్షణాలుగా చేసి అలాంటి పది లక్షణాలు పురాణాలకు ఉండాలని చెప్పారు.

సర్గ, విసర్గ, వృత్తి, రక్షణ, అంతరాలు, వంశం, వంశాను చరితం, సంస్థ, హేతువు, అపాశ్రయం....

1) సర్గ అంటే ఇక్కడ కూడా సృష్టి అనే అర్థం.

2) విసర్గ అంటే జీవుల సృష్టి అని అర్థం చెబుతారు.

3) వృత్తి అనే పదానికి మనిషి తన జీవితాన్ని సాగించడానికి ఏ ఏ వస్తువులను వాడుతారో వాటిని గురించిన విషయాల వివరణ.

4) రక్షణ అంటే భగవంతుడు ధర్మ రక్షణకోసం అవతరించే తీరు అని అర్థం

5) అంతరాలు అంటే మన్వంతరాల వివరణ.

6) వంశం అంటే రాజుల, ఋషుల, వంశాల వివరణ.

7) వంశానుచరితం అంటే రాజుల, ఋషుల వంశ క్రమంలో ఉన్న అన్ని తరాల చరిత్ర వివరణ.

8) సంస్థ అంటే ప్రళయానికి సంబంధించిన వివరణ

9) హేతువు అంటే జీవుడి జనన మరణాలకు మధ్యన ఉన్న కర్మ సంబంధమైన విషయం. జీవుడు చేసే కర్మను బట్టే అతడి జీవితమైనా, సృష్టి అయినా అంతమవుతుందని చెప్పి ఆ విషయానికి సంబంధించిన వివరణ ఇవ్వడం.

10) అపాశ్రయం అంటే పరబ్రహ్మం అని అర్థం. ఆ పరబ్రహ్మ శక్తినే అపాశ్రయ శక్తి అని అంటారు. దానికి సంబంధించిన వివరాలు వేదాలను తేలికగా గ్రహించి సామాన్య మానవుడు తన జీవన విధానాన్ని మలచుకోవడానికి ఒక సాధానంలాగా వాడుకోవడం.

మనకు తెలిసీ తెలియకుండానే ఎన్నో పురాణ విశేషాలు మన జీవితాల్లో అంతర్భాగాలై నిబిడీకృతమయ్యాయని చెప్పవచ్చు.

6. ముగింపు

పురాణవాఙ్మయాన్ని "మైథాలజి" అంటారు. వేదాలను అపౌరుషేయాలని, అలాగే పురాణాలను ఆర్షప్రోక్తాలని చెప్పారు. పురాణాలకు భారతీయులకు ముఖ్యంగా తెలుగు వారికి అనినాభావ సంబంధం ఉంది. వాటిని మినహాయించి సాహిత్య విశేషాలను చెప్పలేము. అందువల్ల సూర్యచంద్రులున్నంతవరకు, తెలుగు ప్రజలు ఉన్నంతవరకు పురాణాలు వర్ధిల్లుతూనే ఉంటాయని రూఢిగా చెప్పవచ్చు.

సంప్రదించిన గ్రంథాలు

1. శ్రీమద్భాగవత పురాణ పరిశీలన – డి.నాగసిద్దారెడ్డి
2. తెలుగు సాహిత్యసమీక్ష – మొదటి భాగం – ఆచార్య జి.నాగయ్య
3. సంస్కృత సాహిత్య చరిత్ర – డా॥ ముదిగంటి గోపాల్ రెడ్డి & ముదిగంటి సుజాతారెడ్డి
4. సాహిత్య భావలహరి – ఆచార్య యస్వీ. జోగారావు
5. ప్రాచీన భారతదేశ సంస్కృతి నాగరిత – ఆర్. వెంకటేశ్వరరావు (అనువాదం)
6. ఆంధ్రదేశ చరిత్ర – సంస్కృతి – ఆచార్య పిశుపాటి శ్రీరామశర్మ
7. భారతదేశ చరిత్రలో ముఖ్య ఘట్టాలు – డా॥వి.రామకృష్ణా రెడ్డి

కలం వారధిపై కళాకారులు

డా ఎం.సమత, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వర్ధన్నపేట, వరంగల్
ఎం.టి.జ్యోత్స్న, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ కళాశాల (స్వ.ప్ర), అనంతపురము, చరవాణి: 9440890985.

ప్రతిభ ఉన్నా ప్రచారంలేనిది సమాజం గుర్తించదని గతం, వర్తమానం చూస్తే తెలుస్తోంది. రాజకీయ నాయకులు, సినీ కళాకారులు పూర్తిగా ప్రచారంపైనే ఆధారపడతారు. వీరి గురించి తెలుసుకోవాలనే ఉత్సాహం అందరికి ఉంటుంది. తమ అందం, అభినయంతో సామాన్యులను సమ్మోహితులను చేసే సినీ కళాకారుల గురించి తెలుసు కోవాలనే కోరిక ప్రజల్లో ఉంటుంది. ఈ అంశాన్ని తీసుకొని రావూరి భరద్వాజ పాకుడురాళ్ళు నవలకు శ్రీకారం చుట్టారు. కళాకారుల జీవితాల్లోని ఇంకో కోణాన్ని చూపిస్తూనే, కలం తలచుకుంటే కళాకారుల జీవిత గమనాన్ని, వారి స్థానాన్ని మార్చగలదని ఈ నవల నిరూపిస్తుంది. సినీ కళాకారుల జీవన శైలిని ఆవిష్కరిస్తూనే కలంతో సినీ కళాకారుల తల రాతలు కూడా మార్చవచ్చని ఈ నవల చదివితే తెలుస్తుంది. ఇప్పుడు కలం స్థానంలో ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాలు ఆపని చేస్తున్నాయి.

సినిమా రంగానికి , పత్రికలకు అవినాభావ సంబంధం వుంటుంది. సినిమా చూడడానికి ఇష్టపడనివారు కూడా పత్రికలను చదువుతారు. సినిమా పత్రికలు కాకపోయినా చదివే పత్రికలలో సినిమా వారి బొమ్మలుంటాయి. ప్రారంభం నుండి అంటే 1930 నాటికి పత్రికలలో సినిమా బొమ్మలు వుంటూ వచ్చాయి. రాను రాను ముఖచిత్రాలపై సినీతారలు మెరవటం మొదలు పెట్టారు. పుస్తకం ఆకర్షణీయంగా వుండాలంటే కవర్‌పేజీ బాగుండాలి. ఆ వుద్దేశంతో సినిమా తళుకులను పత్రికలు ఆశ్రయించాయి. సినిమాను ప్రధాన అంశంగా తీసుకొని నవలను రచించటం రావూరి భరద్వాజ చేసిన సాహసం. రంగుల ప్రపంచాన్ని అనాచ్ఛదంగా చూపించి ప్రేక్షకుల కళ్లు తెరిపించారు. ఆయినా సినిమా ఇంకా ఆకర్షిస్తూనే వుంది. ఈ నవలలో మంగమ్మ అనే నటి (నాటకాలలో) సినిమా నటిగా ,అనగా మంజరిగా స్థిరపడి సినిమా రంగాన్ని శాసించే స్థాయికి ఎదుగుతుంది. జీవితంలోని ఆటుపోట్లను ఆమె ఎదుర్కొన్న రీతి భరద్వాజగారు సహజంగా వర్ణించారు. మంజరి సినీ నటిగా స్థిరపడే దశ నుండి పత్రికా విలేకరులు ప్రత్యక్షంగా పరోక్షంగా ఎలా సహకరించారో ఆయా పరిస్థితులను తెలుసుకుందాం.

ప్రజల వినోదార్థం తయారైంది సినిమా. నాటక రంగం సినిమా రాకతో కనుమరుగైంది. సినిమా రంగుల కల. మనిషిలోని బలహీనతలను సొమ్ముగా మార్చుకునే సాధనంగా మారింది. సినిమా నటీనటులకు ప్రేక్షకులకు తెలియని దగ్గరితనం వుంది. నిత్యజీవితంలో సినిమా భాగమైంది. అంతెందుకు టీవీలలో వస్తున్న బిగ్‌బాస్ కార్యక్రమాన్ని కోట్లమంది ఎందుకు చూస్తున్నారు? కారణం ఇతరుల జీవితాలలో తొంగి చూడటం అందరికి ఇష్టం. సినిమా వాళ్లంటే ఆసక్తి. కొన్ని ప్రాంతాలలో పిల్లలను తీసుకొని సరదాగా బయటకు వెళ్లాలంటే దర్శనీయ, పర్యాటక స్థలాలు ఏమీ లేకపోవటం వలన సినిమాలనే చూస్తున్నారు. కాబట్టి సినిమా నుండి జీవితాన్ని విడదీయ లేము.

సినిమా అభిమాన నటీనటులపై అభిమానం హద్దులు దాటుతోంది. నటీనటులపై అభిమానాన్ని రకరకాలుగా ప్రదర్శిస్తున్నారు. తమ అభిమాన నటీనటుల పేరుతో దానధర్మాలు, సంఘ సేవ చేసుకుంటూ ఆ ఫలితాన్ని మొత్తం తమ నటులకాపాదించి గొప్పవారిని చేస్తున్నారు. ఈ మధ్య పెద్ద పెద్ద థియేటర్లు రావడం, ఆన్‌లైన్ సౌకర్యం రావటం ఒక రకంగా మంచిదే అనుకోవాలి. లేకపోతే టికెట్లు కోసం

క్యూలో కొట్టుకొని బట్టలుచింపుకునేవారు. అభిమాన నటుడిని ఒక మాటంటే వాళ్లని మాటలతో, చేతులతో చీల్చిచెండాడుతూ వున్నారు. సోషల్ మీడియా వచ్చిన తర్వాత బెదిరింపులు రకరకాలయ్యాయి. తమ కుటుంబ సభ్యుల గురించి పట్టించుకుంటారో లేదో తెలియదు కాని ఏమీ కాని వారిని తమవారిగా భావించుకోని వారి కోసం ఏమైనా చేయడానికి వెనుకాడరు. ఆడియో ఫంక్షన్లుకొచ్చిన కొంతమంది అభిమానులు చనిపోతున్నారు. సినిమాలలో పారితోషికం తీసుకొని నటించే వారి కోసం తాము కష్టపడి సంపాదించుకున్నంత తగులబెడుతుఆన్నరు. సినిమా అంటే ఒక వ్యామోహం. తరాలు మారినా వ్యామోహం తగ్గలేదు ఇలా సినిమా ప్రేక్షకులకు కళ్లకు కవ్వకొన్న సినీమాయపొరలు తొలగిపోవాలంట అందరూఖచ్చితంగా ఈ నవల చదవవలసిందే.చదివిన తర్వాత ఆలోచిస్తే ఈ నవల వ్రాయటంలోనే ఉద్దేశాన్నిఅందుకున్నవారౌతారు.

రావూరి భరద్వాజ గారు ప్రజలకింత చేరువైన విషయాన్ని తీసుకొని తమ ఆరాధ్యదేవతలైన నటీనటుల జీవితంలోని వాస్తవాలను కళ్లకు కట్టినట్లు సీరియల్ రూపంలో ఇంటింటికి చేర్చి వారిలో కొంతైనా ఆలోచనలలో మార్పు తెచ్చారని భావిస్తున్నాము. అవాస్తవాలతో, అభూత కల్పనలతో సినిమా ప్రేక్షకులను వేరే లోకానికి తీసుకువెళ్లే సినిమాలో అందరాని తారలను చూసి ఆశపడే ప్రేక్షకులకు సినిమా పేరు అంటే కల్పన అని, జీవితం వాస్తవం అని తెలుసుకుంటే ఈ సినీమాయలో పడరు.

కథానాయిక మంజరి హీరోయిన్‌గా ఎదిగే దశలో ఆమె జీవితాన్ని మలుపుతిప్పడంలో భాగస్వాములైన వారు విలేఖరులు. పత్రిక అంటే ఎలా వుండాలి? విలేకరులంటే ఎలా వుండాలి? అని ఆలోచిస్తే ముద్రణా కార్యక్రమం భారతదేశంలో ఎందుకోసం మొదలైనా పత్రికలను సరియైన దారులలో నడిపించి ప్రజలలో జాతీయ భావాలు, స్వాతంత్ర్య కాంక్షను పెంపొందించి దిశా నిర్దేశం చేసి కొందరు సఫలీకృతులయ్యారు. కృష్ణా పత్రిక, ఆంధ్ర పత్రిక, గోల్కొండ వ్రతికలు ఒక లక్ష్యంతో వనిచేసాయి. ప్రజా సంక్షేమంకోసమే పత్రికలను నడిపారు. కందుకూరి వీరేశలింగం గారు వివేకవర్ధిని పత్రికను గొప్పవారి దుర్నీతిని మార్చే ప్రయత్నం కోసం, భాషాభివృద్ధి కోసం, దేశాభివృద్ధి కోసం నడిపారు. అంతేగాకుండా జర్నలిజంలో కొత్త పుంతలు తొక్కారు. పరిశోధన ప్రధాన పత్రికా రచన కూడా చేశారు. పెద్ద మనుషుల ముసుగులో చేసే మోసాలను ఎండగట్టారు. ఎంతో పవిత్రమైన జర్నలిజం రానురాను స్వార్థంగా తయారైంది.

విలేఖరి ఎలా ఉండాలి అంటే నిష్పక్షపాతంగా వ్యవహరించాలి వార్తను తమ సొంత అభిప్రాయాలతో వ్రాయకుండా జరిగింది జరిగినట్లు వార్తలను వ్రాయాలి. ఊహలు, పుకార్లను వ్రాయకూడదు. కాని కొన్ని సినిమా పత్రికలు తమ రాతల ద్వారా కొందరి తారల భవిష్యత్తును ఎలా మార్చివేస్తారో చెప్పడానికి ఈ నవలలో కొన్ని సంఘటనలు కనిపిస్తాయి.

మంజరి మద్రాసుకు చేరుకున్న తర్వాత తారగా ఆమెను పరిచయం చేయడానికి చలపతి పలురకాల ప్రయత్నాలు చేస్తాడు. అందులో భాగంగా పత్రికల వాళ్లతో సమావేశం ఏర్పాటు చేయిస్తాడు. పత్రికలు చేసే మాయాజాలాన్ని మంజరికి చెబుతూ

"అసలు జర్నలిస్టుల సాయం మనక్కావాల్సిందిప్పుడే! పది పత్రికలు కూడబలుక్కొని ఓ మాట మీద నిలబడ్డాయంటే, ఆకాశాన పొయ్యే దేవుడైనా నేల మీదికి దిగి రావాల్సిందే! నువ్వొక దాని వున్నావనీ, సినిమాకు బ్రహ్మాండంగా పనికొస్తావనీ ఇండస్ట్రీలోని వారికి తెలియాలి. పబ్లిక్కూ తెలియాలి. ఈ పని జర్నలిస్టులు చేసిపెడతారు."

పత్రికల వారి గురించి చెప్పిన మాటలను బట్టి పత్రికల ప్రాముఖ్యత 'మనకర్థమవుతూనే వుంది. వాళ్లు అనుకుంటే ఏమైనా చేయగలరని తెలుస్తుంది. ప్రింట్ మీడియాపై ఆధారపడిన కాలంలో ప్రజలను అభూత

కల్పనలతో తప్పుదారించే పట్టించే పత్రికల వలన మంచికన్నా చెడు ఎక్కువ జరిగే అవకాశం వుంది. ఇలాంటి పత్రికల వలన ప్రయోజనం శూన్యం. అనుకున్నట్లు గానే వారి చలపతి ఎత్తు ఫలించింది.

సమావేశ పర్యవసానం 'కొరడా' పత్రిక శర్మ రెండు రకాల వార్తలు వ్రాసుకొస్తాడు. అందులో మొదటి వార్త.

"మన సినిమా ఇంక గుంట పూలు పూయడానికీ, కొత్త పెట్టుబడులు ఈ పరిశ్రమలోకి రాకపోవడానికి కారణం ఏమిటి? ప్రేక్షకులు పాత ముఖాలను చూసి చూసి విసుగెత్తిపోయారు. పాత తారలకు డిస్ట్రిబ్యూటర్ల దగ్గరా, ప్రొడ్యూసర్ల దగ్గరా పలుకుబడి వుండటం వల్ల కొత్తవారు రాలేకపోతున్నారు". సినిమా ఖర్చులో వారే ఎక్కువ తింటున్నారు. "పది పదిహేను సంవత్సరాలుగా వివిధ కేంద్రాలలో, రకరకాల నాటకాలు ప్రదర్శించి, విశేషమైన అనుభవం పొందిన నటీనటులనేక మంది వున్నారు. అటువంటి వారిలో మణిపూస వంటిది 'మంజరి'. ఈమె నటించిన నాటకాలను ఈ వ్యాసకర్త చూసాడు. ఆమె నటనా వైదుప్యానికి ముగ్ధుడయ్యాడు. ఏ రసాన్నయినా కళాభిరుచిరంగా ఒప్పించల నేర్పు మంజరిలో వున్నది. ఆమె కంఠం లోని మాధుర్యం అలాంటిది ఆమెను అనేకమంది ప్రొడ్యూసర్లు సంప్రదించినట్లు, ఆమె త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు వ్రాస్తాడు.

రెండవ వార్త సినిమా పరిశ్రమ ఈనాడు ఉన్నంత విపత్కర పరిస్థితిలో మునుపెన్నడూ లేదనడం అతిశయోక్తి కానేరదు. ప్రభుత్వం ఈ పరిశ్రమ మీద మోయలేనన్ని పన్నులు విధించింది "పరిమితమైన కోటాలతోనే మనం సరిపెట్టుకోవాలి. అలా జరగాలంటే పాత నటీనటులనే ఈ పరిశ్రమ ఆశ్రయించక తప్పదు." విశేషానుభవం వున్న పాత తారలు దర్శకుడు చెప్పినట్లు చేసి ఎక్కువ టేకులు తినరు, ముడి ఫిలి ఖర్చుగాదు కొత్త వారిని తీసుకుంటే వారికి పెట్టుబడి పెట్టడానికి డిస్ట్రిబ్యూటరు, ఇతను సహకారం లేకుండా ప్రొడ్యూసరు ముందుకురారు. ఈ మధ్యనే మంజరి అనే కొత్తముఖం మద్రాసుకు వచ్చిందని విని కొరడా సంపాదకుడు ఆవిడ ఇంటికి వెళ్లాడు. ఆ ముఖాన్ని చూడగానే నీరుకారిపోయాడు. మంజరికి నాటకానుభవం వున్నట్లు ఆమె వెంట వున్న వ్యక్తి చెబుతున్నా ఆపేరు గల నటి ఉన్న దాఖలా లేదు. సినిమాలో చిల్లర వేషాలు వేసే వారంతా సినిమాలలో రాణించగలమనుకోవడం భ్రమ మంజరి రూపురేఖలు గానీ, శరీర సౌష్టవం గాని సినిమాకు పనికిరావు. కర్ణకఠోరమైన ఆ గొంత ఆడరాక్షసి వేషాలకు తప్ప పనికిరాదు అని వ్రాసుకొచ్చాడు.

ఈ రెండు వార్తలలో ఎంతో భిన్నత కనిపిస్తోంది. మొదటి వార్తలో సినిమా తారలు డబ్బంతా తినేస్తున్నట్లు ప్రొడ్యూసర్లను, డిస్ట్రిబ్యూటర్లను రక్షించేవాడి మల్లే వ్రాసి వుంది. రెండు వార్తలలోను సాధారణాంశం తాను మంజరిని చూసినట్లు, వుంది ఒకదానిలో మణిపూస అంటూ, ఆమె గొంతు మాధుర్యమైనది, ఆమె చుట్టూ నిర్మాతలు తిరుగు తున్నారనే వార్త ఇంకొక దానిలో ఆమె ముఖం చూసేటట్లు లేదని, గొంతు కర్ణకఠోరమని సినిమాకు పనికిరాదని వ్రాసుకొచ్చాడు. రెండవ వార్త నిర్మాతలను, డ్రిస్ట్రిబ్యూటర్ల బాధలను కూడా అందరూ పట్టించుకోవాలని వారి తరపున మాట్లాడుతున్నట్లు వారు తన వైపున వుండేటట్లు వ్రాసాడు. మంజరి గురించి పరిశోదించినట్లు వ్రాస్తే చదివే పాఠకులు నిజంగా విలేఖరి శోధించి వ్రాసాడనుకుంటారు. వార్త నిజమనుకుంటారు. ఇక్కడే శర్మ తెలివితేటలు అర్థమవు తున్నాయి. ఇక అసలు విషయానికొస్తే మొదటి వార్త వ్రాయాలంటే 500 డబ్బులు, రెండవ వార్త ప్రచురించాలంటే ఫ్రీ అని చెబుతాడు. ఈ రకమైన బ్లాక్‌మెయిలింగ్ 70 దశకంలోనే కనిపించటం విశేషం.

మంచి జర్నలిజం కోసం కృషి జరుగుతున్న కాలంలో బ్లాక్‌మెయిలింగ్ పత్రికలలో రావడం గమనించదగింది. ఈ బ్లాక్‌మెయిలింగ్ రాను రాను విశ్వరూపం ధరించింది.

సినిమా అంటే భయపెట్టడం, పెద్దల బలహీనతలను ఆసరాగా చేసుకొని వార్తలు వ్రాస్తూ డబ్బు దండుకోవడం మరీ ఎక్కువై పత్రికల స్థాపన, లక్ష్యాన్ని దెబ్బతీస్తున్నాయి.

ఇంకొక సందర్భంలో శర్మ మంజరి సినిమాల ప్రచారం గురించి మాట్లాడుతూ "సినిమాను గురించి పిక్చరుకు నాలుగు పావలాలిచ్చేవారు. కావాలి. కానీ, క్లాస్ జనం అవసరం లేదు. అంటే మామూలు మనుషుల దగ్గరకు నీ పిక్చరు సమాచారం అందాలన్నమాట." ఇందులో రెండు నీతులు చెబుతున్నాడు. ఒకటి పడిపడి సినిమా చూసేది క్లాస్ జనం కాదు ఒక్కొక్కరు ఒకసారి కంటే ఎక్కువ చూడాలంటే ఆ సినిమాకు పబ్లిసిటీ కావాలి. పబ్లిసిటీ ఎలా చేయాలో కూడా తానే వివరిస్తాడు.పబ్లిసిటీ కావాలంటే మామూలు మనుషుల దగ్గరికి వెళ్ళగలిగింది. ఇప్పుడైతే టివిగాని ఒకప్పుడైతే పత్రికలే సాధనం. ప్రేక్షకుల బలహీనతలను ఎలా సొమ్ము చేసుకోవాలో ఆ బలహీనతను ప్రచారానికి ఎలా వాడుకోవాలో కూడా వివరంగా చెబుతాడు.

దేవుడి ముందు పాట వుంటే ఆ సందర్భంలో హోలులో కొంతమందికి వూనకం వచ్చిందని, ఇంకొకడు కొబ్బరికాయ కొడుతున్నాడని పత్రికలలో వార్తలు వ్రాయాలి. పాఠకులను అప్పుడప్పుడు ఇలాంటి వార్తలతో పత్రికలు ఆశ్చర్యపరుస్తుంటాయి. ప్రజలకు నిజానిజాలను ఆ చెప్పాల్సిన బాధ్యత వున్న పత్రికలు బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించటం వలన సమాజానికి ఏ విధంగా మేలు చేయగలుగుతారు అనే ఆలోచన లేకుండా తన స్వార్థానికి వాడుతుంటాడు. ఇంకొక జిమ్మిక్కు 'గ్యాలప్ పోల్ లేనివి వున్నట్లు భ్రమింపచేయటం అంటే పాఠకులకు నిర్ణయాధికారం ఇస్తున్నట్లు నటించటం. ఉత్తమ నటుడు, నటి, మిగతా పాత్రలలో ఏమి నచ్చాయో ఓట్లు వేయమనటం. ఈ పద్ధతి తర్వాత తర్వాత రాజకీయాలలో బాగా ఉపయోగపడుతోంది. తమవైపు బలం లేకున్నా సంఖ్యా బలం తక్కువ వున్నా ఎక్కువ వున్నట్లు నమ్మించి ఇతరులకు డబ్బు ఆశచూపి లాక్కుంటుంటారు. గ్యాలప్ పోల్‌లో మంజరి ఎలా గెలవటం అంటే కొన్ని ముందే రిజిర్వు చేసుకుంటాం అంటే ఉత్తమ నటి మంజరి అని వ్రాసి పెట్టుకోవడం అనిచెబుతాడు.

మూడోది 5000 కాపీలను ముద్రించటం. అందులో 2000 కాపీలను మార్కెట్లోకి రిలీజ్ చేసి మిగతా వాటిని తమ వద్దనే వుంచుకొని అందులో ఉత్తమనటి, గాయకురాలు (వసంత), ఉత్తమ చిత్రం (మంజరి చిత్రం మనమే వ్రాసుకొని మనకు మనం అవార్డులిచ్చుకోవటం అంటాడు. వీటన్నింటికీ పత్రికలే సహాయకారులు.

మంజరికి పతనం ప్రారంభమైనప్పుడు కూడా పత్రికలదే ముఖ్య భాగం మంజరి అంటే గిట్టని వారంతా ఏకమై తమకు అండగా వున్న కొన్ని పత్రికలను ఎన్నుకొని ఆమెను దెబ్బ తీయడానికి సిద్ధం చేసుకుంటారు. సినిమాలోకంలో పెద్దతలలైన మూర్తి, రావులు సంయుక్తంగా పత్రికలను పిలిచి ఒక ప్రకటనను విడుదల చేశారు.మంజరి పేరు లేకుండా ఓ పేరు పొందిన ఆర్టిస్టు అంటూ తిడుతూ ఆమెతో మేము ఇకముందు నటించబోమని ప్రకటిస్తారు. ఈ వార్త పత్రికల వారికి కావాల్సినంత సమాచారం దొరికినట్టుగా భావిస్తారు.

ఒక సమావేశంలో వీరు ముగ్గురు కలిసి కనపడినప్పుడు సినిమా జర్నలిస్టులకు పండగే. అంతర్జాతీయ ఫిలిం ఉత్సవాలకి మంజరి వెళ్లాలను కున్నప్పుడు శర్మ జ్ఞాపకానికి వస్తాడు. శర్మ "తన కలాన్ని కానీకి, అర్థణాకూ అమ్మదలుచుకోలేదన్నాడు. ఏది న్యాయమయితే అదంతా రాస్తాననీ, ఇందులో వ్యక్తిగత అభిమానాలకు చోటీవ్వబోననీ' అన్నాడు అని చలపతి అంటే కానీకి, అర్థణాకూ అతను కలం అమ్మకబోతే రూపాయికి అమ్ముతాడు. లేదా పదికి, కాదూ కూడదంటే వంద రూపాయలకు అమ్ముతాడు.ఒకసారి కిందికి జారడం మొదలయ్యాక దానికిక అంతముండదని అంటుంది మంజరి.అందుకే దిగజారిన తర్వాత

అప్పుడప్పుడు నైతిక విలువలను పాటించాలనుకున్నా సమాజం అవకాశం ఇవ్వదు. మంజరి అనుకున్నట్లుగానే అమెరికా వెళ్ళాలనుకున్న తన కోరికను అందరి సహకారంతో నెరవేర్చుకుంటుంది. మంజరి గురించి కొన్ని పత్రికలు అశ్లీలంగా వ్రాస్తాయి. ఎవరో మానసిక రోగి డబ్బులిస్తే వ్రాసినట్లు మంజరికి తెలుస్తుంది. డబ్బుకాశపడి వార్త వ్రాసినారన్నది నిజం.

మంజరి ఉన్నతస్థితి ప్రారంభం నుండి పత్రికలు ఆమెకు మంచిగానో చెడుగానో ప్రచారం చేస్తూ వచ్చాయి. వెండితెర మీద ఓ వెలుగువెలిగిన కళాకారుల జీవితాల్లో ఎంత చీకటి ఉంటుందో నవల ద్వారా రావూరి భరద్వాజ కళ్లకు కట్టినట్లు చూపారు. ఆ రోజుల్లో పాఠకుల్లో సంచలనం రేపిన ఈ నవల రోజులు మారినా సినీ కళాకారుల జీవితాలకు దర్పణంగా నిలుస్తుందని చెప్తూనే పాత్రికేయుల ప్రభావాన్ని ఈ నవలలో ఆవిష్కరించారు. పాత్రికేయుల నైతిక విషయాలపై పాఠకుల్లో ఓ ప్రశ్నను నిలిపారు. పాఠకులు ఈ నవల చదువుతున్నంత సేపూ సినీ కళాకారుల జీవన శైలితోపాటు పాత్రికేయుల రచనా శైలి గురించి ఆలోచిస్తూంటారు. అదే ఈ నవలలో ఉన్న గొప్పదనం.

ఆధారగ్రంథాలు

1. పాకుడురాళ్ళు–రావూరి భరద్వాజ
2. తెలుగు దినపత్రికలు సాహిత్య సేవ – డా.కె.రామదాస్–నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల ప్రచురణ
3. తెలుగులో వార,మాస పత్రికలు –డా.వేదగిరి రాంబాబు –నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల ప్రచురణ

ఎన్ పూజిత నవలల్లో స్త్రీ చైతన్య పాత్రలు

పి.జ్యోతి, పరిశోధక విద్యార్థిని, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై – 05

ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో బహుళ ప్రజాదరణ పొందిన ప్రక్రియ నవల. 1872 లో సంఘంలోని ఆచార వ్యవహారాలను తెలుపుతూ నరహరి గోపాలకృష్ణమ చెట్టి రచించిన 'శ్రీరంగరాజ చరిత్ర' తో మొదలైన తెలుగు నవల, 1878లో కందుకూరి వీరేశలింగం పంతులు వ్రాసిన 'రాజశేఖర చరిత్ర' తో ఆధునిక నవల లక్షణాలను సంతరించుకున్నది. ఈ నవల తరువాతి కాలంలో నవలలు రాసే వారికి ప్రామాణిక గ్రంథమయింది. సమాజంలోని సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ, సాంఘీక మొదలగు సమకాలీన విభిన్న అంశాలను కథావస్తువులుగా ఎంచుకొని అనేక నవలలు వెలువడినాయి. స్త్రీలు కూడా నవలలు రాయటం ప్రారంభించినారు. 1950లో ఇల్లిందల సరస్వతి దేవి మధ్య తరగతి స్త్రీల సమస్యలను కథావస్తువుగా స్వీకరించి నవలలు రాశారు అయితే స్త్రీ కేవలం కుటుంబంలోనే కాదు సామాజిక జీవన రంగాలలో, రాజకీయాలలోను ఎదుర్కొంటున్న సమస్యలను చిత్రిస్తూ 1956 లో వట్టికొండ విశాలాక్షి 'నిష్కామయోగి' నవలను రాశారు. తరువాత కాలంలో నవల ప్రధానంగా స్త్రీల ప్రక్రియగా కొనసాగింది. ఈ పరిణామక్రమంలోనే రంగనాయకమ్మ, కోడూరి కౌసల్యాదేవి, కె.యస్. రమాదేవి, మాలతీ చందూర్, శ్రీదేవి, యుద్దనపూడి సులోచనా రాణి, మాదిరెడ్డి సులోచనా, కె. రామలక్ష్మీ మొదలగు రచయిత్రులు ఎందరో స్త్రీల జీవితానుభవాలను, ఆరాటాలను ఇతివృత్తంగా ఎంచుకొని ఆధునిక స్త్రీలను చైతన్యవంతులను చేయడానికి నవలను ఒక మాధ్యమంగా ఉపయోగించుకున్నారు. ఈకోవలోనే స్రీలను చైతన్యవంతులను చేయడానికి నవలా రచయిత్రి అయిన ఎన్.పూజిత సుజిత, వసుధ నవలలు రాసినారు. సుజిత నవల అంతర్జాలంలో ధారవాహికగా, వసుధ నవల ఆల్ఇండియా రేడియోలో నాటికగా ప్రసార మయ్యాయి. ఈ నవలలో స్త్రీ పాత్రలను ఏవిధంగా చిత్రించారో పరిశీలిద్దాం....

సుజిత పాత్ర:

ఈ నవలలో ప్రధాన పాత్ర పేరు సుజిత. ఈమె తండ్రి చంద్రయ్య ఊరిలో పెద్ద భూస్వామి. ఇతని భార్య సుశీలమ్మ. సుజిత ఆఇంటి మహాలక్ష్మి మరియు నలుగురు అన్నదమ్ములకు గారాల చెల్లెలు. ఇంటిలో అందరికి సుజిత అంటే చాలా ఇష్టం. ఆమె పుట్టినరోజు నాడు ఆమె చేతుల మీదుగా ఊరిలో అందరికి కానుకలు పంచిపెట్టేవారు. ఈమె పుట్టిన రోజునే ఇంత వైభవంగా చేస్తున్నారు, ఇక పెళ్ళి ఎంతగొప్పగా చేస్తారోనని ఊర్లో వాళ్ళంతా అనుకునే వారు. సుజిత పదోవ తరగతి ప్రధమశ్రేణిలో ఉత్తీర్ణురాలవుతుంది, తన అన్నల వలె తాను కూడా పై చదువులు చదవాలి అని అనుకుంటుంది, కాని అందుకు ఆమె తండ్రి అంగీకరించడు. ఇంటిలో వాళ్ళందరి ద్వారా తండ్రితో మాట్లాడిస్తుంది కాని చంద్రయ్య ఎవ్వరి మాట వినడు. ఆడపిల్లలు పట్టణం వెళ్ళి చదువుకోకూడదు అని పెళ్ళిళ్ళ పెరయ్యకి చెప్పి సంబంధం కుదుర్చుతాడు. సుజితకి ఇష్టం లేకపోయిన తండ్రి మాటకు ఎదురుచెప్పలేక పెళ్ళికి అంగీకరిస్తుంది. పెళ్ళికొడుకు తరుపున వాళ్ళు కట్నకానుకలు ఎక్కువ అడగటంతో చంద్రయ్య వారి గొంతెమ్మ కోర్కెలు తీర్చడానికి ఎక్కువ అప్పులు చేస్తాడు. ఆమె వివాహం ఘనంగా జరిపిస్తాడు. అదే రోజున సుజిత బామ్మా చనిపోవడంతో, ఆమెను వివాహం చేసుకున్న భర్త సుమన్ తరువాత రోజు వచ్చి తీసుకొని వెళ్ళతాను అని చెప్పి వెళ్ళిపోతాడు. ఎన్ని రోజులైనా అతను రాకపోవడంతో , అతను పని చేస్తూన్నాను అని చెప్పిన కంపెనీకి ఫోన్ చేసి కనుక్కొంటే ఆ పేరుతో ఇక్కడ ఎవరూ లేరని చెబుతారు. తాము మోసపోయాము అని సుజిత ఇంటిల్లపాది బాధపడుతారు. కొద్దిరోజుల

తరువాత సుమన్ చనిపోయాడని ఉత్తరం అందుతుంది, ఆ వార్త విన్న ఆమె తండ్రికి పక్షవాతం వచ్చి మంచం పడుతాడు, ఇంటి బాధ్యతలను ఆమె పెద్దన్నయ్య మాత్రమే చూసుకునేవాడు మిగిలిన వారు పట్టించుకోకుండా తలకు మించిన అప్పులు చేసినందుకు తండ్రిని నిందిస్తూ వుండేవారు.

ఒకప్పుడు ఆ ఇంటి అదృష్టదేవతగా భావించిన సుజిత ఆ సంఘటన తరువాత ఆమె ముఖం చూడటానికి అశుభంగా భావించేవారు. తెల్లవారగానే ఆ వెధవ ముఖం వేసుకొని ఇల్లంతా తిరుగకుండా ఇంటిలో ఒక మూల కూర్చొవచ్చు కదా అని వదినలు దూషించేవారు. తన పరిస్థితిని తలచుకొని సుజిత బాధపడుతూవుండేది. ఒకరోజున చిన్న వదిన తమ్ముడు ఇంటికి రావడంతో సుజిత అతనిని తనకు చదువుకోవడానికి పుస్తకాలు కావాలని అడుగుతుంది. కాని అతను సుజితతో అసభ్యంగా ప్రవర్తించడంతో అతని నుంచి తప్పించుకోవడానికి ఆమె కేకలు పెడుతుంది, ఇంటిల్లపాది అక్కడకు చేరడంతో ఏమైందని అడుగుతారు. అక్కడ జరిగిన సంఘటనను చూసిన సుజిత చిన్న వదిన తన తమ్ముడిని కాపాడుకోవాలనే దురుద్దేశంతో, జరిగిన విషయం గురించి చెప్పిన సుజిత మాటను త్రోసిపుచ్చుతుంది, తన తమ్ముడికి ఏమి తెలియదని అంతా సుజితనే కావాలని చేసిందని చెబుతుంది, దానికి తోడుగా మిగిలిన ఇద్దరు వదినలు కూడా అవును మేము చూసాము సుజిత ఇతనితో మాట్లాడటం అని చెబుతారు. అందుకు ఆమెను తన అన్నలు నిలదీయడంతో తాను అతనితో మాట్లాడింది పుస్తకాల కోసమని కాని ఇతను ఇలాంటి వ్యక్తి అని తెలిసివుంటే అసలు మాట్లాడేదానిని కాదని చెబుతుంది, అన్ని అయిపోయాయి ఇక ఇది ఒక్కటి మిగిలింది, అయినా నువ్వు చదువుకొని ఎవరిని ఉద్దరించాలి ఒక మూలన పడి కూర్చొకుండా అని ఆమెనే అందరూ తిట్టి వెళ్ళిపోతారు. తాను చేయని తప్పుకు అందరూ తనని నిందిస్తూ వుంటే ఏమి చేయలేని స్థితిలో తల్లిదండ్రులు వున్నందుకు, ఆ సమయంలో పెద్దన్నయ్య ఇంట్లో లేకుండాపోయాడని తన తరుపున మాట్లాడేవారు ఎవ్వరూ లేరని బాధపడుతుంది.

సుజిత తన తల్లిదండ్రులకు భారం కాకుడదని, ఉత్తరాల ద్వారా పరిచయమైన రాజీని సహాయం అడగడానికి చెన్నైకి వెళ్ళుతుంది, కాని చివరకు రాజీ అమ్మాయి కాదు అబ్బాయని అసలు పేరు రాజా అని తెలుసుకుంటుంది. రాజా, అతని స్నేహితుడు ఆమెను బలత్కారం చేయడానికి ప్రయత్నిస్తారు, వాళ్ళ నుంచి తప్పించుకొని పారిపోతుంటే, వాళ్ళు ఆమెను వెంబడిస్తారు అక్కడ టిఫిన్ అంగడి పెట్టుకున్న ముసలమ్మను తాను దాక్కోవడినికి సహాయం చేయమని అడుగుతుంది. వాళ్ళు అక్కడికి వచ్చి సుజితను గురించి అడుగుతారు అప్పుడు ఆపెద్దావిడ ఇటువైపుగా వెళ్ళిందని వాళ్ళతో అబద్ధం చెబుతుంది, కాని అక్కడ వున్న సుజితను చూసిన వాళ్ళు ఆ ముసలమ్మను కొట్టి సుజితను లాక్కొని వెళ్ళడానికి వస్తుంటే. బయట నుంచి అరుపులు వినిపించడంతో ఇంటిలో నుండి ముసలమ్మ మనువరాలైన లలిత బామ్మాకు ఏమైయిందొనని చేతిలో కారంపొడి తీసుకొని వచ్చి వాళ్ళ కళ్ళలలో కొడుతుంది. ముగ్గురు ఒక్కసారిగా ఎదురు తిరగడంతో వాళ్ళు అక్కడ నుంచి పారిపోతారు. సుజిత తన పరిస్థితిని వాళ్ళకు వివరిస్తుంది, ఆమె మీద జాలిపడిన బామ్మా, ఆమెను వారితో పాటే ఉండమని చెబుతుంది. లలితకు కళ్ళు కనిపించకపోయినా తను ఎలా రాగలిగింది అని అడుగుతుంది సుజిత. తన పుట్టుకతో అంధురాలు కాదని ఒక లారీ ప్రమాదంలో తనకు కళ్ళు కనిపించకుండా పోయాయని బామ్మా చెబుతుంది. నా పనులను నేనే చేసుకోవడం వలన ఈ ఇంటిలో ఏ వస్తువు ఎక్కడ వుంటుందో తనకు తెలుసునని లలిత చెబుతుంది.

సుజిత బామ్మాకు అంగడి పనులలో ఆమెకు సహాయం చేస్తూ వస్తుంది, అక్కడ టిఫెన్ బావుండడంతో జనాలు ఎక్కవగా వస్తారు దానితో అంగడి బాగా అభివృద్ధి

చెందుతుంది, ఆ అంగడిని ఒక హోటల్ లాగా మారుస్తుంది. అక్కడికి కొంతమంది రౌడీ వెధవలు వచ్చి అల్లరి పెడుతుండటంతో ఇన్స్‌పెక్టర్ విజయ్ సహాయంతో వారిని జైల్లో పెట్టిస్తుంది. ఒక ప్రక్కన హోటల్ పనులు చూసుకుంటూ మరొప్రక్క తన చదువును కొనసాగిస్తూ, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేస్తుంది. ఆ హోటల్ త్రిస్టార్ హోటల్ గా మారుస్తుంది. ఒకరోజున బామ్మా సుజితను వివాహం చేసుకోమని అడుగుతుంది, అందుకు సుజిత ఆడపిల్ల మెడలో ఒక్కసారి తాళిపడి తీసేసిన తరువాత వితంతువు అంటారే కాని ఆమె కన్నె కాదా అని ఎవ్వరూ ఆలోచించరని చెప్తుతుంది. 'పిల్లలు అని ప్రతి నిమిషం పరితపించే మా అమ్మ గతి ఏమైంది, నోరెత్తి బిడ్డలకు తీర్పు చెప్పలేక , అటు భర్తను కాపాడుకోలేక ఒక అడకత్తెరలో పోచగా మిగిలిపోయింది. దీనికంతటికి కారణం ఆమెకు ఆత్మస్థైర్యం లేదు, ఒక పునాది లేదు,స్వయం ఉపాధిలేదు, అన్నింటికన్నా ధైర్యం లేదు. అందుకే ప్రతి స్త్రీలో స్పందన కలగాలి తనంటతాను ఆత్మస్థైర్యంతో నిలబడగల గుండె నిబ్బరం కలిగి వుండాలి. ఒకవేళ జీవితం తలక్రిందులైనా తన జీవితాన్ని తనే సరిద్దిదుకోగల ఆత్మవిశ్వాసం కావాలి ...చదువు సంధ్యలతోటి,ఉపాధి కావాలి...అప్పుడే విధివశాత్తు కలిగే కష్టాలను భరించగలిగే శక్తి కలిగి వుంటుంది స్త్రీ. అందుకే మీరు కోరుకొనే తంతు నాజీవితంలో ముగిసిన అధ్యాయం . నాకు ఒక సంకల్పం వుంది మనుషుల ముందు నేనేమిటో తెలిసేలా గుర్తింపు పొందాలి అని చెబుతుంది' (పేజి నెం.59,60).

సుజిత, లలితకు కంటి ఆపరేషన్ చేయించి ఇన్స్‌పెక్టర్ విజయ్‌తో వివాహం చేస్తుంది. ఒకరోజున కారులో వస్తున్న సుజితకు తల్లి కనిపించడంతో, ఆమెను అడిగి కుటుంబ సభ్యుల వివరాలను తెలుసుకుంటుంది అనారోగ్యంతో బాధపడుతున్న తండ్రికి మంచి వైద్యం చేయించి బాగుచేస్తుంది. తన పెద్దన్నయ్యకు తన కంపెనీలో మంచి ఉద్యోగం ఇస్తుంది . ఈ విషయం తెలుసుకున్న ముగ్గురు అన్నలు, వదినలు ఆమె దగ్గరకు రావడంతో వారికి కొంత ధన సహాయం చేసి పంపేస్తుంది. కంపెనీ మీటింగులో తన భర్తను చూసిన ఆమె ఆశ్చర్చపోతుంది, ఇదెలా సాధ్యం అని ఆలోచించుకుంటూ ఇంటికి వెళ్ళెసరికి సుమన్ అక్కడికి వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి చెబుతాడు. తనని పిన్నమ్మ, పినతండ్రి డబ్బు కోసం పెంచుకున్నారని, అదే సమయంలో మీ సంబంధం కుదరడంతో కట్నం ఎక్కువగా అడిగారని, ఆ రోజున బామ్మాకు ఆ విషయం తెలియడంతో పిన్నమ్మ తమ్ముడు బామ్మాను చంపేశాడు అని, తరువాత తనని బాగా కొట్టి వాళ్ళు డబ్బుతో పారిపోయారని, తాను ఇన్ని రోజులు కోమాలో వుండి బయటపడిన తరువాత సుజిత కోసం వెళ్ళితే అక్కడ ఎవ్వరూలేకపోవడంతో తాను ఒక కంపెనీలో చేరి ఉద్యోగం చేస్తున్నాని చెబుతాడు. ఇంటిల్లపాది సుమన్ మాటలు నమ్మిన సుజిత మరొసారి మోసపోవడానికి సిద్ధంగా లేనని , విజయ్ సహాయంతో అతని గురించి ఎంక్వైరి చేయమని చెబుతుంది. సుమన్ చెప్పినవన్ని నిజం అని తెలియడంతో కుటుంబ పెద్దల సమక్షంలో సుజిత , సుమన్ ఒక్కటవుతారు.

వసుధ పాత్ర :

ఈ నవలలో కథానాయిక పేరు వసుధ. ఈమెకు చిన్నప్పుడే తల్లి చనిపోవడంతో అమ్మమ్మ, నాన్నల దగ్గర పెరుగుతుంది. తన మేనమామ కొడుకైన విష్ణు కూడా చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోవడంతో బామ్మ నిర్మలమ్మ దగ్గరే పెరుగుతాడు. వసుధ, విష్ణు చిన్నప్పటి నుంచి కలిసి పెరుగుతారు, వారిద్దరికి ఒకరంటే ఉంటుంది.అక్కడికి అతనితో పాటు కంపెనీ యజమాని కూతురు ప్రియ కూడా తన స్నేహితురాలి తల్లికి ఆరోగ్యం సరిలేనందున ఆమెను చూసిరావడానికి అదే రైలులో ఢిల్లీకి బయలుదేరుతుంది. అయితే విష్ణు, ప్రియ ఒకే కాలేజీలో చుదువుకొనివుంటారు. ఢిల్లీకి వెళ్ళిన తరువాత ప్రియకు విష్ణు అంటే ఇష్టం వుడటం వలన అతనికి దగ్గర కావాలి

అని ప్రయత్నించేది. అనుకోని పరిస్థితుల కారణంగా వారిద్దరూ శారీరకంగా ఒక్కటవుతారు. అప్పుడు విష్ణు 'చిన్నప్పటి నుండి నాతో కలిసి పెరిగి, నాలో ఊపిరైన, నాకు భార్యకాబోతుందని తెలిసిన వసుధ నాతో ఎప్పుడు తప్పుగా ప్రవర్తించలేదు, కాని నువ్వు మనిద్దరం కలిసి వున్న ఈ రెండు రోజులలోనే నన్ను రెచ్చగొట్టి ఈ తప్పు జరగడానికి కారణమయ్యావు' అని ప్రియను తిట్టి అక్కడి నుంచి వెళ్ళిపోతాడు. వసుధ, విష్ణులపెళ్ళి జరుగుతున్న సమయంలో అక్కడికి ప్రియ తన తండ్రి తీసుకొని వస్తుంది. తన కూతురుకి అన్యాయం చేసి మరొక స్త్రీ మెడలో తాళి కట్టడానికి సిద్ధమయ్యాడు అని విష్ణుని నిందిస్తాడు ప్రియ తండ్రి. కాని వసుధ విష్ణు మీద వున్న నమ్మకంతో వాళ్ళు చెప్పె మాటలు నమ్మకుండా విష్ణుని అడుగుతుంది. అతను ఏమి సమాధానం చెప్పకుండా నిట్టూర్చడంతో వాళ్ళు చెప్పింది నిజం అని నమ్మి, తాను పీటల మీద నుంచి లేచి ప్రియను పెళ్ళి కూతురిలా ముస్తాబు చేసి పీటల మీద కూర్చొబెడుతుంది. 'మన భారతదేశంలో స్త్రీకి శీలాన్ని మించింది ఏదీలేదు ముందు తాళికట్టు అని గంభీరంగా విష్ణుతో చెబుతుంది వసుధ, నా తప్పు ఏమీ లేదు వసుధా అని అతను చెప్పినప్పటికి తప్పు ఎవరిదైనా జరిగింది ఏదో జరిగింది. అది సరిచేసుకోవటం మానవ సహజం అని చెబుతుంది. వాళ్ళ బామ్మా ఏమిటీ ఈ అన్యాయం అని ఏడుస్తూ ఉంటుంది అందుకు వసుధ ఆన్యాయం కాదు బామ్మా, నీవు స్త్రీవే వేరే స్త్రీకి అన్యాయం జరిగితే ఊరుకోగలుగుతావా అని చెప్పి విష్ణు, ప్రియల వివాహం జరిపిస్తుంది' (పేజి నెం. 105). వాళ్ళిద్దరూ అక్కడే వుంటే అందరూ బాధపడుతారని విష్ణుని ప్రియతో పాటు వాళ్ళ ఇంటికి పంపుతుంది. ఆమె ను గురించి బాధపడుతున్న నిర్మలమ్మతో 'ఊరుకో బామ్మా! కాలం మనకి బానిస కాదు , మనం కాలానికి బానిసలం. అన్నింటిని మరపించేది కాలపరిమితి అది విధించే నిర్ణానిర్ణయాలకు అనుకూలంగా పోవటమే మానవధర్మం అని వాళ్ళకు ధైర్యం చెబుతుంది' (పేజి నెం. 111).

కొంతకాలం తరువాత వసుధ తండ్రి రాఘవయ్య చనిపోవడంతో విష్ణు, బామ్మా ఇద్దరు కలిసి బలవంతంగా పట్టణం తీసుకొని వెళ్ళతారు. ఇంటిలో ప్రియ కుటుంబ బాధ్యతలు మరియు చిన్నపిల్లాడైనా కొడుకు గౌతమ్‌ను పట్టించుకోకుండా క్లబ్‌లకు, మహిళా మండలి సమావేశాలకు వెళ్ళూతూవుండేది. చెల్లాచెదురుగా వున్న ఆ ఇంటిని ఒక దేవాలయంగా మారుస్తుంది వసుధ, అన్ని పనులు ఆమె చూసుకొనేది. ప్రియ చేయవలసిన పసులన్నింటిని వసుధ చేసేది. అయితే ఆమెకు తృప్తి వుండేది కాదు. తన ధేయ్యం ఇది కాదని స్వతంత్రంగా తన కాళ్ళ మీద తాను నిలబడగలగాలని. ఆనాటి పాతకాలపు స్త్రీ మాదిరిగా బ్రతకకుండ, వీళ్ళకు భారం కాకుడదని అని అనుకోని. ప్రియను తాను చదువుకోవడానికి కావలసిన పుస్తకాలను కొని ఇవ్వమని అడుగుతుంది. అందుకు ఆమె సరేనని చెబుతుంది, అయితే ప్రియకు మాత్రం విష్ణు, వసుధల మీద అనుమానం ఉండేది ఆ విషయం తెలుసుకన్న వసుధ ఇంటి నుంచి వెళ్ళిపోవలని అనుకుంటుంది. కాని అదే సమయంలో ప్రియకు కిడ్నీ పాడైపోవడంతో వసుధ తన కిడ్నీని దానం చేసి ప్రియను కాపాడి, ఇంటి నుంచి వెళ్ళిపోతుంది. అలా వెళ్ళిన ఆమెకు కారు ప్రమాదం జరగడంతో వసుధ చిన్ననాటి స్నేహితురాలైన రేవతి, ఆమె భర్త హరినాధరావు కాపాడుతారు. వసుధ వారి సహాయంతో చదువుకుంటుంది. రేవతి భర్త డాక్టరు కావడంతో వసుధను ప్రోత్సహించి తన శరీరంలో కోల్పోయిన అవయవం గురించి చదవమని చెప్పి యురాలజిస్ట్ డాక్టరిని చేస్తాడు. ఆమె లండన్ వెళ్ళి అక్కడ మంచి యురాలజిస్ట్‌గాపేరు ప్రఖ్యాతులు సంపాదించుకుంటుంది. కాని ఇంటి నుంచి వెళ్ళిపోయిన వసుధ చనిపొయిందని అబద్దపు సమాచారం తెలియడంతో బామ్మా, విష్ణు కృంగిపోతారు. కొంతకాలానికి బామ్మా కాలంచేస్తుంది. విష్ణు, వసుధకు తాను ద్రోహం చేశానని కృంగిపోతుంటాడు,

అతనిని అలా చూసిన ప్రియ వసుధను, విష్ణుని నిందిస్తూ గొడవ చేస్తూవుండేది. విష్ణు పిల్లలు పెరిగి పెద్దవాళ్ళు అవుతారు, ఆ ఇంటిలో తల్లి ప్రేమ, అప్యాయత, అనురాగాలు లేకపోవడంతో వాళ్ళ కూతురు శిల్ప డ్రగ్స్ అలవాటు పడుతుంది. ఒకరోజు డ్రగ్స్ ఎక్కువ తీసుకున్న ఆమె అర్ధరాత్రి సమయంలో రోడ్డు మీద వుండటంతో ఆ దారిలో వెళ్ళుతున్న వసుధ, శిల్పకు సహాయం చేసి ఇంటి దగ్గర వదిలి పెడుతుంది. ప్రియకు మరల కిడ్నీ ఇన్‌ఫెక్షన్ కావడంతో విష్ణు కొడుకు ప్రముఖ యురాలజిస్ట్‌గా పేరు ప్రఖ్యాతులు గాంచిన వసుధ దగ్గరకు వచ్చి అతని తల్లికి ట్రీట్‌మెంట్ చేయమని అడగడంతో వాళ్ళ ఇంటికి వెళుళ్ళతుంది. అక్కడ వసుధకు శిల్ప, గౌతమ్ ఇద్దరూ ప్రియ, విష్ణుల పిల్లలు అని తెలుసుకుంటుంది. శిల్ప ఆ విధంగా మారడానికి కారణం అర్థ చేసుకొని ఆమెను మెల్ల మెల్లగా డ్రగ్స్ నుంచి బయట పడేలా చేస్తుంది. ప్రియను ఆరోగ్యవంతురాలిగా మారుస్తుంది. తన స్నేహితురాలి పిల్లలకు, విష్ణు పిల్లలకి వివాహం చేసి వారి జీవితాలను బాగుచేస్తుంది. తన పరిశోధనను కొనసాగించడానికి మరల లండన్ వెళ్ళిపోతుంది.

స్త్రీ చైతన్య – సాధికారత :

నేటి సమాజంలో అక్షరాస్యత పరంగా పురుషుల కంటే స్త్రీలు ముందంజలో వున్నప్పటికి, ఉన్నత చదువులకు వెళ్లేసరికి స్త్రీల శాతం తగ్గిపోతుంది. కారణం స్త్రీకి వివాహం కావచ్చు లేదా పైచదువుల కోసం దూరంగా పంపడానికి తల్లి దండ్రులకు ఇష్టం లేకుండా ఉండవచ్చు. కొంతమంది స్త్రీలు బాగా చదువుకున్నప్పటికి పెళ్ళైనతరువాత ఇతర కారణాల వలన ఉద్యోగం చేయకుండా ఉండేవాళ్ళు కూడా నేటి సమాజంలో ఉన్నారు. అయితే ప్రతి స్త్రీకి స్వయం ఉపాధి చాలా ముఖ్యం అది వారిని సమాజంలో స్వతంత్రంగా జీవించేలా చేయడమే కాకుండా గౌరవమైన స్థానంలో ఉంచుతుంది. అందువలన స్త్రీలు చదువును ఒక ఆయుధంగా ఉపయోగించి సమాజంలో జరుగుతున్న అంశాల పట్ల అవగాహన కలిగి చైతన్యవంతులు కావాలి అప్పుడే స్త్రీలు సాధికారత వైపు పయనించగలుగుతారు రచయిత్రి తెలియజేశారు.

ముగింపు :

జీవితం మీద ఎన్నో ఆశలు, కోర్కెలతోటి జీవితాన్ని ప్రారంభించాలని అనుకొన్న స్త్రీ జీవితంలో అనుకొని పరిణామాలు ఎదురైనప్పుడు ధైర్యం కోల్పోకుండా, వీధి చేతిలో కీలుబొమ్మకాకుండా తన కృషి, ధృడనిశ్చయంతో జీవితంలో మార్పు తెచ్చుకోవచ్చునని వసుధ పాత్ర ద్వారా తెలియజేస్తే, మన జీవితాలు ఎప్పుడు ఏవిధంగా మలుపు తిరుగుతాయో ఎవరికి తెలియదు అందులోను స్త్రీ జీవితం. కాబట్టి ప్రతి స్త్రీకి స్వయం ఉపాధి అవసరం అప్పుడే జీవితంలో ఎదురయ్యే ఆటుపోటులను ఎదురించి నిలబడగలుగుతారని సుజిత పాత్ర ద్వారా తెలియజేశారు. ప్రతి స్త్రీకి చదువు, స్వయం ఉపాధి రెండూ ముఖ్యమని రచయిత్రి నవలల్లో తెలియజేశారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. అరవయ్యేళ్ళ తెలుగు నవలా సాహిత్యం – ఆచార్య కాత్యాయనీవిద్మహే
2. తెలుగు నవలా వికాసం – మొదలి నాగభూషణశర్మ
3. సుజిత నవల – ఎన్. పూజిత
4. వసుధ నవల – ఎన్. పూజిత

నండూరి హృదయాంతరంగంలో "ఎంకి" సోయగం

డా॥ వి. శివనాగార్జున రెడ్డి, సాహిత్య పరిశోధకుడు, పులివెందుల. మొబైల్ : 9912870069

పరిచయం

తెలుగు సాహిత్యంలో నిత్య పరిణామశీలిగా సమాజానికి అనుకూలంగా ఎన్నో సరిక్రొత్త కవితా ప్రక్రియలు వచ్చాయి. ప్రధానంగా ఆంగ్ల సాహిత్యంలోని ''రొమాంటిక్ పోయట్రీ'' కవిత్వ ప్రేరణతో ఆంధ్ర సాహిత్యంలో భావకవిత్వం వచ్చింది. నవీన కవులు ఎందరో ఊహాప్రేయసులను సృష్టించుకొని, తమ అంతరంగంలోని ఆవేదనను, ఆనందాన్ని, సంతాపాన్ని, సంతోషాన్ని, కేరింతలను, కలవరింతలను, ప్రేమ, విరహాలను, ప్రణయ గాథలను అక్షర రూపంలో భావోద్వేగ పూరితంగా అభివ్యక్తం చేసారు. ఊర్వశి, హృదయేశ్వరి, శశికళ, వత్సల, కిన్నెరసాని వీరంతా ఊహా ప్రేయసులే. అందులో "యెంకి"ని ఊహా ప్రేయసిగా భావించి, తరించి, తన్మయత్వం చెందిన కవి నండూరి వెంకటసుబ్బారావు. యెంకి ప్రేరణతో వెలువడిన రసరమ్య ఆపాతమధుర గీతాలే నండూరి వారి "యెంకి పాటలు". యెంకి నాయుడు బావలను ఆలంబనంగా చేసుకొని తమ ప్రణయానుభూతులనే ప్రకటించారు నండూరి వారు.

నండూరి వారు పశ్చిమగోదావరి జిల్లాలోని వసంత వాడలో చిన్న బాపన్న దంపతులకు 1875లో జన్మించాడు. చిన్నప్పటి నుంచీ పాటలంటే చాలా ఇష్టపడేవారు. మద్రాసు క్రైస్తవ కళాశాలలో చదువుతున్న రోజులలో ఒకసారి ఆయన ట్రాంబండిలో ఇంటికి వెళుతుండగా "గుండె గొంతుకలోన కొట్లాడుతాది" అనే పల్లవి రూపుదిద్దుకొన్నదట. అల అల్లిన పాటలే మిత్రుల ప్రోత్సాహంతో క్రమంగా "ఎంకి పాటలు"గా రూపుదిద్దుకొన్నాయి. ఎంకి పాటలు తొలి ముద్రణ 1925లో 35 పాటలతో వెలువడింది. మలిముద్రణలో 43 పాటలు చోటు చేసుకున్నాయి. ఈ పాటలు అచ్చు కాగానే పెద్ద సంచలనం చెలరేగింది. ఒక వర్గం సమర్థించగా, మరొక వర్గం వ్యతిరేకించారు.

ఎంకి పాటల ప్రస్థానం

తొలి రోజుల్లో కొంత గాలి దుమారం చెలరేగిన క్రమంగా అది సమసిపోయి ఈ పాటలకు శోభాయమానంగా సాహిత్యంలో సముచితమైన గౌరవం లభించింది. దీనికి కారణం ఏ భావాన్ని అయినా చూపులతో మాట్లాడి, ఊపిరితో తెనిగించిన ప్రతిభగల వ్యక్తి సుబ్బారావు గారు. ఈ పాటలను సుందర, సుమదురంగా తీర్చిదిద్దడమే. 'యెంకి' ఒక పల్లె పదుచు, ప్రకృతి సహజ సుందరమైన జానపద సౌందర్యానికి ప్రతీక. ధర్మబద్ధమైన ప్రణయాన్ని మాత్రమే అంగీకరించే నాయిక.

"కన్నుగిలికిస్తాది నన్ను బులిపిస్తాది
దగ్గరగా కూకుంటె అగ్గిసూస్తాది"
నాకేసి సూస్తాది నవ్వు నవ్విస్తాది"

పై విధంగా ఎంకి భావాలను, మదిలోని చిలిపి తనమును వర్ణిస్తారు నండూరివారు.

"జాములాతిరి యేళ చేనిలో ఉండగా మెల్లగా వస్తుంది,
చల్లగా వస్తుంది
మందొ మాకొయెట్టి మరిగించి నాదీ పల్లకుందామంటే
పాణమాగదు"

ఇలాంటి వాక్యాలో భావాలు పరిశీలిస్తే నాయిక పట్ల నాయకునికున్న వివశత్వం, ప్రేమ, ప్రణయశీలం ద్యోతక మౌతున్నాయి.

ఎంకి, నాయుడు బావలు ఒకరినొకరు ఒక్క క్షణం కూడా చూసుకోకుండా, కలుసుకోకుండా ఉండలేరు. నాయుడు బావ ఏతామెత్తుతూ ఉంటే ఎదురుగా కూర్చొని ఎంకి కాలాన్ని మరిచిపోతుంది. వారి సరదాల చూపులలో

లోకం కాలం రెండూ మర్చిపోతారు. కానీ కాలం తన ప్రయాణం ఆపదు. ఎప్పటికి లాగే రోజులు మారుతూ ఉంటాయి. వారి సరదాలు మాత్రం సాగుతూనే ఉంటాయి.

"యెంకి వంటిపిల్లలేదోయి... లేదోయి
యెంకి నా వంకింక రాదోయి... రాదోయి
మెళ్లో పూసల పేరు తల్లో పూవుల సేరు
కళ్లెత్తితే సాలు కనకాభిషేకాలు
రాసోరింటికైన రంగు తెచ్చే పిల్ల
నా సొమ్ము – నా గుండె నమిలి మింగిన పిల్ల"

పై మాటల్లో ఎంకి నిసర్గ సౌందర్యం మన కళ్ళముందు కనపడుతుంది. యెంకి కేవలం ముగ్ధ కాదు. ఆమె వ్యక్తిత్వానికి రెండు పదునైన అంచులున్నాయి. ఒక మారు ఆమె వికసిస్తుంది విరిలా, ఒక్కొక్కసారి గుప్పుమంటుంది ఆవిరిలా, ఇదే యెంకి యొక్క సహజ స్వభావంలోని అల్లరి, చిలిపితనం.

"పచ్చని సేలోకి పండు యెన్నెల్లోన
నీలి సీరాగట్టి నీటుగొస్తా వుంటె
వయ్యార మొలికించు నా ఎంకి
వనలచ్చి మనిపించు నా ఎంకి
మేతా మెత్తేకాడ యెదురూగా కూకుండి
మల్లీ యెప్పాటల్లె తెల్లారబోతుంటే
సెందురుణ్ణీ తిట్టు నా యెంకి
సూర్యుడిని తిట్టు నా యెంకి

పై విధంగా చెప్పడంలో ఎంకి ఎంత సౌందర్య రాశియో అంత సరసరి, అంత గడుసరితనాన్ని కల్గి వుందని నండూరి వర్ణించాడు. నాయుడుబావ ఎంకి మధ్య ఎంత పరస్పరానురాగం ఉన్నప్పటికి ఇద్దరూ ఎవరికి వారే వ్యక్తిత్వాలున్నవారే. కాబట్టి అప్పుడప్పుడు అలకలు, భేదాభిప్రాయాలు ఉంటాయి.

"రావొద్దె నా పక్క రావొద్దె యెంకి
ఆపొద్దె మన పొత్తులు పోయెనింకీ"

అంటూ మనసులో నాయుడు బావ విరహ వేదన పొందుతాడు.

"నన్నిడిసి పెట్టెల్లినాదే నా రాజు
మొన్న తిరిగొస్తనన్నాడే"

అని విరహంతో కోపంతో అలిగి వెళ్లిపోయిన బావకోసం నిరీక్షించింది ఎంకి.

"ఈ రేయి నన్నొల్లానేరవా? రాజా
ఎన్నెలలా సొగసంతా యేటిపాలేనటరా"

అంటూ విరహతాపంతో గతస్మృతులు గుర్తుకు తెచ్చుకొని విప్రలబ్దలా విరిపోతుంది ఎంకి అంటూ వర్ణన చేసారు నండూరి వారు.

ఎంకి నాయుడు బావల ప్రేమ ఆపాతమధురమైంది. వారి ప్రణయం ధర్మబద్ధమైంది. ఈ భావాలను నండూరివారు "గోవు మాలచ్చిమికి కోటిదండాలు" అన్న పాటలో అందంగా, రమణీయంగా, సహజ సుందరంగా తెలియజేసాడు.

"గోవు మాలచ్చిమికి కోటి దండాలు
మనిషికైనా లేని మంచి పోకిళ్లు
ఎంకితో కూకుండి యింత సెపుతుంటే
తనతోటి మనిసల్లె తలతిప్పుతాదే
ఎంకి సరసాలాడ జంకుతా వుంటే
సూసి సూడక కన్ను మూసి తెరిసేదీ"

గోవు ధర్మానికి ప్రతినిధి. ఆ గోవు అంగీకారాన్ని అందుకున్న యెంకి, నాయుడు బావల ప్రేమ ధర్మబద్ధమైనదే. అదేకాకుండా తను చూస్తే ఎంకి సిగ్గుపడుతుందేమోననే భావంతో ఆవు అలా కన్ను మూసి తెరుస్తున్నదనే భావనలో యెంతో సొగసు ఉంది. "సూసిసూడక కన్ను మూసి తెరిసేది" అనే మాటల్లో నండూరి వారి సునిశిత పరిశీలనా శక్తి, సమయోచిత ఔచిత్యస్ఫూర్తి మనకు అవగతమౌతోంది.

ఎంకి నాయుడు బావల ప్రేమకు హద్దులులేవు. వారి ప్రేమలో నిత్య పరిమళం గుబాలించేది. వీరి వివాహా

నంతరం క్రొత్త దంపతులు అలా సికార్లు, విహారయాత్రలు, తీర్థయాత్రల ప్రస్తావన కూడా నండూరి వారు సహజ సిద్ధంగా ఉండేలా వర్ణన చేసాడు.

"ఆవుల్ని దూడల్ని అత్తోరి కాడుంచి
మూటముల్లే గట్టి ముసిలోల్లతో సెప్పి
యెంకీ నాతోటి రాయే - మన
యెంకటేశరుణ్ణి యెల్లి సూసొద్దాము"
"ఆడనీ సుక్కాని యాడనే గెడయేసి
పడవెక్కి బద్రాద్రి పోదామా
బద్రాద్రి రాముణ్ణి సూదమా"

పై పంక్తుల్లో విహార, తీర్థ యాత్రల ప్రస్థావన చెప్పడం జరిగింది. అలాగే ఎంకిని ఆమె అందాన్ని వర్ణిస్తూ ప్రకృతి ఆమెకు అద్దం పట్టేలా చెప్పిన తీరు అమోఘం.

"తీగల నడుమనూగె
దీపమై తిలకమై
పీఠమై ఎంకికి
కిరీటమై నెలవంక"

ఇలా అనడంలో నెలవంకే ఆమె అందానికి ఒక దిష్టి చుక్కలా వచ్చి చేరిందనే అద్భుత, ఆహ్లాదకరమైన భావపూరిత వర్ణనలు చేసారు. ఈ దృశ్య చిత్రీకరణ అమోఘం.

ఈ యెంకి నాయుడు బావల వలపుల గంధం యీనాటిది కాదని ఏనాటికి చెరగిపోదని ప్రేమికులు భావిస్తారు. వీరి ప్రేమ ప్రణయ బంధం ఏడేడు జన్మల బంధంగా ఎంతో హృదయంగమంగా వర్ణించాడు నండూరి వారు.

"యెనక జన్మములోన యెవరి మోనంటి
సిగ్గొచ్చి నవ్వింది సిలక నా యెంకి
ముందు మనకే జల్మముందో లేయంటి
తెలతెల్ల బోయింది పిల్ల నా యెంకి
యెన్నాళ్లో మనకోలె ఈ సుకములంటి
కంట నీరెట్టింది జంట నా యెంకి"

వీరిప్రణయ బంధానికి, గాఢమైన ప్రేమకు పై పంక్తులే నిదర్శనం. అలాగే ఎంకి అందాన్ని ఆమె వ్యక్తిత్వాన్ని వర్ణిస్తూ, గంగాదేవితో పోల్చిన సందర్భ వాఖ్యాలు పరిశీలిస్తే...

"కాశీ దేవుని యెదుట
గరవాన నిలిసింది
తల తడుముకుని తానె
తబ్బిబ్బులైనాడు"

ఇక్కడ ఎంకి పరమశివుని ముందు ఠీవిగా నిలిచిందట. ఆమెను చూచి సాక్షాత్తు శివుడు తబ్బిబ్బయి తల తడుముకొన్నాడట. హఠాత్తుగా తన ముందు ప్రత్యక్షమైన ఈమె కొంపదీసి గంగాదేవి కాదు కదా అని శివుడే తల తడుముకోవడం, ఈ సుందర ఆశ్చర్యకర దృశ్య చిత్రీకరణ భావుకతకి రసికులే పొంగిపోరా అనే విధంగా నండూరి వారు ఎంకిని వర్ణించారు.

ఎంకి పాటల్లోని భావచిత్రాలు నండూరి వారి కవితా ధాటిని కవిత్వ ప్రతిభను పట్టి చూపుతాయి. నండూరి తనను తాను ఆత్మాశ్రయంలో మునుగుతూ తానే ఎంకిని వలపించినట్టు వర్ణిస్తాడు. విరహం ప్రణయం అన్నీ తానై విలపిస్తాడు.

"యేటికడుపున దాగి తోట నిదురపోయింది
యెన్నెలంతా మేసి యేరు నెమరేసింది
నా యెనక యెవరోను నడసినట్టుంటాది
గాలికైనా తాను కౌగిలీనన్నాడు..."

ఇలాంటి మధురస నిష్యందమైన భావనలు, ఎంతటి కరుడిగట్టిన సనాతన సంప్రదాయవాదులను సైతం మెప్పించి మనస్సు, హృదయం శిరస్సు కంపింప చేయించగలవు అనడంలో ఎంతమాత్రం సందేహం లేదు. నండూరి భావాలు అలా స్ఫురించాయి.

ఈ యెంకి పాటల్లో నండూరి వారు తన కవితాత్మను నిక్షేపించారు. మధుర మనోజ్ఞ శృంగార భావనలను,

సహృదయుల హృదయాలు కదిలించి పరవశించి పోయేటట్లుగా ఆవిష్కరించారు.

"ఎంకెవ్వరనిలోక
మెపుడైన కదిపితే
వెలుగు నీడల వైపు
వేలు సూపింతు"

ఇలాంటి ఎన్నో మధురమైన పంక్తులు ఎంకి పాటల్లో అనేకం ఉన్నాయి. అందుకే "ఎంకి పాటలు" వన్స్ మోర్ అన్నారు శ్రీశ్రీ. ఒకసారి చదివితే తృప్తితీరదు తనివి తీరా మళ్లీ మళ్లీ చదవాలనిపించే మధురామృత గేయం ఎంకి పాటలు.

"యెంకి పాటల ద్వారా కవితా లోకమున ఒక క్రొత్త ప్రయోగమును, శృంగార నాయికా జగత్తున కొక కలికితురాయిని సమకూర్చిన. నండూవారి ప్రతిభ నాన్యతస్సాధ్యమైనది" అని పలికిన సినారె మాటలు వాస్తవం.

ఉపసంహారం

నండూరి సుబ్బారావు జానపదుల శైలికి, జానపదుల నాయికకీ కావ్యగౌరవం కల్పించి, వినూత్న విశిష్ట ప్రయోగం చేసి "ఎంకి పాటలు" రచించారు. ఇందులో గోదావరి మాండలికంలోనూ, విశాఖ ప్రాంతంలోని తూర్పు యాసలోనూ పాటలు రాసాడు. తెలుగునేలపై పల్లె పరిసరాలను, పైరుపచ్చలను వాగువంకలను ఇందులో చక్కగా చూపెట్టారు. భావకవిత్వంలోని శృంగార నాయికలలో "ఎంకి" విలక్షణమైనది. ఊర్వశి, శశికళ వారికి ఎంకికి పోలిక లేదు. ఎంకి అచ్చమైన తెలుగు పడుచు. అడవి మల్లె వంటిది. ఆమె ఒక ప్రణయ దేవత. ప్రేమమూర్తి. అందుకే "ఎంకి నా ప్రేమ రసానికాశ్రయము. నా శృంగార వాక్కునకు విశ్రామస్థానము. నా వలపులకు నిధానము" అన్న వారి మాటలే ఇందుకు నిదర్శనము. ఈ ఎంకి పాటలు ఆంధ్రావాలా మొత్తం అశేష జనవాహినిలో విశేషమైన ప్రాచుర్యాన్ని సంపాదించుకున్నాయి. నండూరి ఎంకి పాటలనగానే ఆబాల గోపాల ప్రేమికుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి.

సంప్రదింపు గ్రంథాలు

1. ఎంకి పాటలు – నండూరి సుబ్బారావు
2. తెలుగు సాహిత్య చరిత్ర – ద్వా.నా. శాస్త్రి
3. తెలుగు సాహిత్య సమీక్ష – జి. నాగయ్య

రావిశాస్త్రి బుద్బుదం కథ – మానవ జీవన చిత్రణ

డా॥ బత్తల అశోక్ కుమార్, గ్రంథాలయ సహాయకులు, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ విభాగం (CSSEIP), శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.
సెల్ : 94901 94780

1922 జూలై 20న శ్రీకాకుళంలో నారాయణమూర్తి, సీతాలక్ష్మి దంపతులకు రాచకొండ విశ్వనాథశాస్త్రిగారు జన్మించారు. అనంతరం అనకాపల్లి సమీపంలోని తన స్వగ్రామమైన తుమ్మపాలకి మారారు. అతని తండ్రి నారాయణమూర్తిగారు న్యాయవాదిగా పనిచేస్తే, తల్లిగారు సీతాలక్ష్మిగారు సాహిత్యవేత్తగా రాణించారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి తత్వశాస్త్రంలో బి.ఎ.(ఆనర్స్) మరియు 1946లో మద్రాసు లా కాలేజీ నుంచి బి.ఎల్. డిగ్రీని అందుకున్నారు. అనంతరం 1948లో తన తాత శ్రీరామమూర్తి నుంచి న్యాయవాద వృత్తికి సంబంధించిన ప్రాథమిక అంశాలను నేర్చుకుని 1950లో సొంతంగా ప్రాక్టీస్‌ను ప్రారంభించాడు. మొదట్లో కాంగ్రెస్ వాది అయినప్పటికీ, 1960ల్లో మార్క్సిజం ప్రభావంతో ఆయన ప్రభావితమయ్యారు.

1963లో విశాఖ రచయితల సంఘం సమావేశంలో పాల్గొన్నవారు తమ రచనలపై కొంత ఆత్మపరిశీలన చేసుకోవాలని పిలుపునిచ్చారు. 1970లో విరసం (విప్లవ రచయితల సంఘం) ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. శాస్త్రి లాంబ్ మరియు డికెన్స్ రచనలచే ప్రభావితమయ్యారు మరియు గురజాడ అప్పారావు మరియు శ్రీశ్రీ రచనల నుండి ప్రేరణ పొందారు. "స్త్రీ" చిత్రానికి డైలాగ్స్ మరియు స్క్రీన్ ప్లే రాశారు. 1969 మరియు 1971 మధ్య హిందీ చిత్రం "రాజా ఔర్ ర్యాంక్" కోసం కూడా స్క్రీన్‌ప్లే రాశారు.

రాచకొండ విశ్వనాథశాస్త్రి తెలుగుసాహిత్యంలో రా.వి.శాస్త్రిగా సుప్రసిద్ధులయ్యారు. తన రచనల్లోనే కాదు, నిజజీవితంలో కూడా పేదల పక్షాన పోరాటాలు చేసిన ప్రజా నాయకుడుగా ఆయన నిలుస్తారు. అందుకే ఆయన కథల్లో "నాయకుల్నీ, దోపిడీగాళ్లనీ, అమాయకుల్నీ, పిరికివాళ్లనీ అందరినీ బొమ్మ కట్టించేడు. 'ధైర్యం ఉంటేనే మిగతా సద్గుణాలు (నిలబడతాయి.)... పాపుల్లో సాహసులూ ఉంటారు, భయస్తులూ ఉంటారు. కాని– భయానికీ మంచికీ పొందిక లేదు. పిరికివారెవరూకూడా మంచివారు కాజాలరుబీ మంచికి నిలబడలేరు... మంచిగా ఉండాలంటే గుండె నిబ్బరం చాలా ఉండాలి," అని మనస్ఫూర్తిగా నమ్మి రాసేడు.

'డబ్బులో వుండే సౌఖ్యాలూ, లేమిలో వుండు దుఃఖాలూ, ధనం కల్పించే గొప్ప గర్వం మదాంధతా, లేమి కల్పించే నిస్పృహ నైచ్యం దైన్యం' అన్నీ కూడా జీవితంలోంచి బాగా ఎరిగి రాసేడు.

'నిజంగా జరిగింది నిజంగా జరిగిందా? జరిగినది నిజం జరిగినది నిజమేనా?' అని అక్షరాలను ఆచితూచి మరీ రాసేడు.

'దారిద్ర్యం ఎవ్వరికీ... (చివరికి తన) పగవాడిక్కూడా ఉండకూడదని' మరీమరీ తలిచేడు, తలిచి మరీ రాసేడు. "సందర్భానికి తగినట్టుగా ఆయన రచన ఒకచోట సెలయేటి నడకలా ఆహ్లాదం కొలుపుతుంది. మరొకచోట ప్రవాహంలా పరవళ్లు తొక్కుతుంది. ఇంకొకచోట జలపాతంలా ఊపిరి సలపకుండా ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ఉండి ఉండి ఒక్కొకచోట కవిత్వంగా మారి కావ్యస్థాయికి తీసుకెళ్తుంది".

'బందోబస్తుగా చాలా భారీగా ఉన్నాడతను. సీమ పందిలా ఎర్రగానూ, పనసకాయలా గరుగ్గానూ ఉన్నాడు. బాగా సర్వీసు చేసినప్పటికీ చెడిపోకుండా నిలబడ్డ బెంజి లారీలా దిట్టంగానూ ఉన్నాడు'. ('రాజు–మహిషి' నవలలో మందుల భీముడి గురించి)

'ఆమెకు ముప్పయ్యేండ్లుండొచ్చు. ఒకప్పుడామె అందంగా ఉండుంటుంది. పెద్ద కొప్పుని ఒకప్పుడు చక్కగా ముడుచుకుని ఉండుంటుంది. ఆమె కట్టుకున్న నల్లకోక ఒకప్పుడు, అప్పుడెప్పుడో కొత్తదయుంటుంది. చాలారోజుల కిందట చాలాసార్లు భోంచేసి ఆమె ఆరోగ్యంగా ఉండుంటుంది ('మాయ' కథలో ముత్తేలమ్మ వర్ణన). శంకరగిరి గిరిజాశంకరం, అన్‌జానా, జాస్మిన్, కాంతాకాంత, గొల్కొండ రాంప్రసాద్ లాంటి మారుపేర్లతోనూ రాశాడు రావిశాస్త్రి. తన కోపం, తన దుఃఖం, సంతోషం, సరదా, క్యూరియాసిటీ వగైరాలు ఇతరులకు తెలియచెయ్యడానికి కూడా ఆయన రచయిత అవతారం ఎత్తాడు. అయితే, 'తాను రాస్తున్నది ఏ మంచికి హాని కల్గిస్తూందో, ఏ చెడ్డకి ఉపకారం చేస్తూందో అని ఆలోచిం'చి మరీ జాగ్రత్తగా రాసేడు. 'రచయిత (అయిన) ప్రతివాడూ' కూడా అలాగే రాయాలని కోరుకున్నాడు.

ఆరు సారా కథలు, ఆరు సారో కథలు, ఆరు చిత్రాలు, మరో ఆరు చిత్రాలు, రుక్కులు, బాకీ కథలతోపాటు, అల్పజీవి, ఇల్లు, సొమ్ములు పోనాయండి, గోవులొస్తున్నాయి జాగ్రత్త నవలల్ని మళ్లీ మళ్లీ చదువుకొండని వదిలేసి వెళ్లిపోయాడు రావిశాస్త్రి. రత్తాలు–రాంబాబు, రాజు–మహిషి లాంటి అసంపూర్ణ నవలలను పూరించుకునే అవకాశం కూడా ఇచ్చివెళ్లాడు. అర్ధాంతరంగా ముగించినా, వాటిని సంపూర్ణంగా పారాయణం చేయగలిగేలా చేసేది రావిశాస్త్రి చేసిన మాటల మాయాజాలం కాళిదాసులాగా ముచ్చట గొలిపే ప్రతీకల శైలీ విన్యాసం. అసలు ఉపమానాలతోనే కడుపు నింపేస్తాడు. ఒక్కోసారి కథను పక్కనపెట్టి, చదవడం కోసమే చదువుకోగల వినోదం ఇస్తాడు. ఆ తరహా చాలా కొద్దిమందికి లోపమూ, చాలా ఎక్కువమందికి ఆయన అక్షరాల్ని విడిచిపెట్టకుండా చదువుకునే ఆకర్షణాబలమూ!

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ సంపన్నుల రక్షణకు న్యాయస్థానాలు, పోలీసులు, చట్టాలు ఎక్కువగా ఉపయోగించబడుతున్నాయి. చట్టాల్లోని లొసుగులను ఉపయోగించుకుని నల్లకోటు ధరించిన అత్యాశపరులు, ఖాకీల (పోలీసులు) లాఠీలతో న్యాయాన్ని నలిపివేస్తున్నారు" అని రాచకొండ విశ్వనాథ శాస్త్రి రాశారు. , తన రచనల ద్వారా పేదల స్థితిగతులను మెరుగుపరచాలనుకున్న గొప్ప మానవతావాది.

అతను అభివృద్ధి చెందుతున్న న్యాయవాది కావడం వల్ల తన సొంత వంశాన్ని ఆ విధంగా అపహాస్యం చేయకుండా నిరోధించలేదు. ఆయన నవలలు సామాన్యుల సమస్యలను ప్రతిబింబిస్తాయి. న్యాయవాదిగా అతను తన క్లయింట్ల భావాలతో సానుభూతి పొందేవాడు. న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించే గ్రామస్తులపై ఆయన సానుభూతి తెలిపారు. మేత కోసం అడవులకు వెళ్లే గొర్రెపిల్లతో నగరాలకు వెళ్లే గ్రామస్తుల మధ్య అతను సమాంతరంగా చిత్రించాడు.

"కూలీలు మరియు వ్యవసాయదారులు తమ ప్రయోజనాలను కాపాడుకోవాలి, వారు అణచివేతను సహించకూడదు, విఫలమైతే వారు వేధింపులకు గురవుతారు. పాలకులు హిరణ్యకశిప (తన ప్రజలను వేధించిన రాక్షస రాజు) గా మారినప్పుడు, ప్రజలు భగవంతుడు నరసింహుని పాత్రను ధరించాలి. ," అని సామాన్యులకు సలహా ఇచ్చాడు.

అతనికి సూక్ష్మమైన హాస్యం ఉండేది. "శాస్త్రి, ఈ వేడుకను జరుపుకోవడానికి ఈ రోజు మనం పార్టీ చేద్దామా?" అని అతని స్నేహితులు అతనిని అడిగినప్పుడల్లా, అతను ఇలా జవాబిచ్చాడు, "ప్రత్యేకమైన సందర్భం ఎక్కడ అవసరం, మేము రోజూ బార్‌లో కూర్చుంటాము. విచారంగా ఉన్నారు, ఆనందంగా ఉన్నారు, ఒక కేసును కోల్పోయారు లేదా ఒక కేసులో గెలిచారు."

ఆయన రాసిన ఒక చిన్న కథానిక "బుద్బుదం" గురించి ఈ సందర్భంగా చర్చించే ప్రయత్నం చేస్తాను.

ఇది 1968 ప్రాంతంలో రాసింది. "నీట్లో లేచిన బుడగ ఎంతోసేపు ఉంటుందా? ఉండదు. ఏమవుతుంది? బద్ధలైపోతుంది. బద్ధలవడం అంటే ఏమిటి? అంటే నీట్లో కలిసిపోవడమే కదా! అంటే ఏవన్నమాటా? – బుడగ నీట్లోంచి లేచింది. నీట్లోనే కలిసిపోయింది. నీరు నీర్లోనే ఉన్నప్పుడు ఆ నీరు పుట్టడం ఏమిటి? ఆ నీరు రావడం ఏమిటి? అందులో అర్థం లేదుకదా! అంతా అసందర్భమే కదా! ఆ సంగతి మీకు బోధ పడింది కదా. అందుచేత తెలిసిపోండి ఆ నీరు ఏవిధంగా అయితే పుట్టలేదో, చావలేదో ఆవిధంగానే ఆత్మ పదార్థం అనేది పుట్టది – చావదు"..... అని ఈ కథ మొదలవుతుంది. అక్కడ కథ చెప్పే వ్యక్తి ఆహార్యం గురించి, ఆ పరిసరాలను కథకుడు పరిచయం చేస్తున్నాడు. సాయంత్రం వాతావరణాన్ని, సీతారామస్వామి గుళ్ళో పెట్రోమాక్స్‌లైట్ వెలుగు గురించి వాతావరణాన్ని అంతా చక్కగా పరిచయం చేశారు రావిశాస్త్రిగారు.

''బుద్బుదం'' అంటే నీటి బుడుగ. ''జీవితం బుద్బుదప్రాయం" అని పంచతంత్రం కథలో చెప్తాడు చిన్నయసూరి. అందుకే మనిషి ఉన్నంతలోనే మంచి పనులు చేయాలని ప్రాచీన సాహిత్యం సూచిస్తుంది. అలాంటి ఒక అంశాన్ని సామాన్య పేద కుటుంబంతో మమేకం చేస్తూ, అక్కడి పరసరాలను, వాతావరణాన్ని చాలా హృద్యంగా చిత్రించారు "బుద్బుదం" అనే కథలో రావిశాస్త్రిగారు.

ఇందులో ప్రధానంగా కథ మొత్తం శ్యాంబాబు అని పిలువబడే శ్యామలరావు చుట్టూ కథ తిరుగుతుంది. శ్యాంబాబు ఓ పది-పదిహేనేళ్ళ కుర్రాడు. జీవితం అంటే ఏమిటో తెలియని స్థితిలో జీవితం గురించిన ఆశలతో జీవనాన్ని సాగిస్తున్న వ్యక్తి. కథకుడు ఈ పాత్రను గురించి వివరిస్తూ

"మున్సిపాల్టీవారి రికార్డులో శ్యాంబాబు పేరుండదు. "ఒక మగశిశువు" అని మాత్రం వుంటుంది. స్కూల్ రికార్డులో అతని పేరు శ్యామలరావు. వెక్కిరించాలంటే అది చీమలరావుగా పెంకెకుర్రాళ్ళ పెదిమల మీద మారు రూపు చెందుతుంది. వాళ్ళమ్మకి అతడు శ్యాంబాబు! కాకపోతే ఇంకా క్లుప్తంగా శాంబాబు."

ఈ మాటలు శ్యాంబాబు పట్ల అతని తల్లిపడే తపన పాఠకులకు మనసులను తాకేలా రావిశాస్త్రిగారు ఎంతో హృద్యంగా చిత్రించారు ఈ కథలో. "సాధారణంగా చాలామంది బాల్యాన్ని మరచిపోతారు. కొంతమందికి లీలగా గుర్తుంటుంది. మరికొంతమందికి సినిమారీలు తిరిగినట్టుగా ప్రతిచిన్న విషయమూ గుర్తుంటుంది. చిన్నతనంలో తాము తిరిగినచోట్లూ, చూసిన బంధువుల వూళ్ళు, మనుషులు, వాళ్ళ ఆకార విశేషాలు, వాళ్ళు చెప్పిన కథలు, ఆనాడు తిన్న తిండ్లు, వాటి రంగూ, రుచీ, వాసనలతో సహా గుర్తుంటాయి. దీన్నే 'వాసన' అంటారు. ప్రపంచంలోని సుప్రసిద్ధ కవులు, రచయితలు, కళాకారులు, చలనచిత్ర దర్శకులు దిగ్విజయాన్ని సాధించింది ఈ వాసనను ప్రతిబింబిచే. సత్యజిత్‌రాయ్, మృణాల్‌సేన్, విశ్వనాథ్ చిత్రాల్లో కన్పించే గ్రామీణ సంస్కృతి అదే. బాపూ బొమ్మల్లో కన్పించే గోదావరి సొంపులవే. ఈనాడు అప్పని తెలియకుండా అనుభవిస్తున్న సంపదకన్నా అప్పులేని ఆనాటి పేదరికం ఒక అందమైన అనుభవం. ఒకప్పటి మనిషి స్వతంత్రుడు. తన బతుకును తానే లాక్కుంటూ పోయిన ఒంటి సేద్యగాడు. వాడి చుట్టూ మనుషులు, సావాసగాళ్ళూ, సావాసగత్తెలు అందరూ పనులు చేసే వాళ్ళే. ఒకరికొకరు కావాలి" అని అంటారు ఆచార్య హెచ్.ఎన్. బ్రహ్మానంద.

ఇలాంటి పసి బాల్యాన్ని గురించి రావిశాస్త్రిగారు తనదైన కోణంలో విశ్లేషణ చేస్తూ, ఈ బుద్బుదం కథ రాసినట్లుగా మనం భావించవచ్చు. ఇక్కడే కథలో ప్రధాన పాత్ర అయిన శ్యాంబాబు గురించి ప్రస్థావన చేస్తూ ''శ్యాంబాబు అయిదో క్లాసు చదివి ఆరో క్లాసులోకి వెళ్ళలేకపోయాడు. కష్టం కష్టం. చాలా కష్టం. స్కూలుకి వెళ్తే పరాజయాన్ని పదిమందిలో కూర్చొని అనుభవించటం

కష్టం. ఇంటికి వెళ్తే అమ్మ ఆయాసపు నిట్టూర్పులు వినడం ఎంతో కష్టం. అందుచేత ఆ కష్టాల్ని అతను మామిడితోటల నీడల్లోనూ, కొండగుట్టల బండరాళ్ళలోనూ, సముద్రపుటలల నురుగు ముద్దల్లోనూ, తీరాన ఇసుకలో సాయంకాలపు టాటల్లోనూ మర్చిపోవడానికి ప్రయత్నిస్తున్నాడు" అని వివరించాడు. ఆ ఆవేదనలో వుండగా ఒకనాడు సాయం కాలం బీచ్ నుంచి ఇంటికి వస్తున్న తరుణంలో గుళ్ళో పెట్రోమాక్స్‌లైట్ వెలుగులో శాస్త్రిగారు చెప్తున్న పురాణ ప్రవచనాలను వింటాడు. అలా వారం రోజులపాటు ఆ ప్రవచనాలు జరుగుతాయి. ఆరు రోజులు శ్రద్ధగా వెళతాడు. ఏడోరోజు వెళుతుండగా తల్లి ముందురోజే ఏదో చెప్పాలని ప్రయత్నించినా చెప్పలేకపోయిందని, కానీ ఈ రోజు వెళు తూ వుంటే "ఓరే శ్యాంబాబు! నా చిట్టితండ్రీ, ఇవాళైనా వేగిరం ఇంటికొచ్చేరా బాబూ'' అంది. అందుకు సమాధానంగా శ్యాంబాబు "ఇవాళ ఆఖర్రోజమ్మా" అన్నాడు. ఫరవాలేదులేరా! వేగిరం వచ్చేయ్. రోజూ పురాణానికి వెళ్తూనే వున్నావుకదా! భగవంతుడు మెచ్చుతాడు. మరేం భయం లేదు. ఒచ్చేయేడు నిన్ను తప్పక పాసు చేస్తాడు" అంది అమ్మ.

అయితే ఇక్కడ తల్లి మాత్రం తన కొడుకు చదువులో ముందుకు వెళ్ళడానికి దేవున్ని కోరుకోవడానికి పురాణ ప్రవచనానికి వెళుతున్నట్లుగా భావించి ఆ విషయాన్ని కొడుకుతో చెప్పగా, శ్యాంబాబు మాత్రం తన మనసులో మాత్రం తన తల్లి ఆరోగ్యం గురించి, ఆమెకు త్వరగా నయం కావాలని కోరుకోవడానికి వెళుతున్నట్లుగా భావిస్తున్నాడు. అమ్మ త్వరగా రమ్మన్నా ఆఖర్రోజు కావడంతో గంట ఆలస్యం అయింది. రోజూ 8 గంటలకే ఇంటికి వచ్చే శ్యాంబాబు ఆ రోజునే ఆలస్యం అయింది. దీంతో శ్యాంబాబు మనసులో పరిపరివిధాల ఆలోచన చేసుకుంటూ ఇంటిదారి పట్టాడు. "అమ్మ వేగిరం ఇంటికి రమ్మన్న రోజునే ఆలస్యం అయింది. అమ్మ కోప్పడుతుందా! కోప్పడొచ్చు లేకపోతే – విసుక్కోవచ్చు... మూడొంతులు విసుక్కోవచ్చు" ఇలా ఆలోచించుకుంటూ ఇంటిదారి పట్టాడు. ఇల్లు దగ్గరకు వచ్చే సరికి మరింత వేగంగా నడిచాడు. కోప్పడ్డానికి అమ్మకు అవకాశం ఇవ్వకుండా పరిగెట్టికెళ్ళి ఆమె చేతిలో ప్రసాదం పెట్టాలని, అలాగే అన్నకి కూడా కొంత ఇవ్వాలని అనుకుంటాడు. ఇద్దరి కోపాలను ప్రసాదం ఇచ్చి తగ్గించివేయవచ్చు అనుకుంటాడు శ్యాంబాబు. అయితే ఇంటిదగ్గర పరిస్థితి మాత్రం మారిపోయింది.

ఇక్కడే రావిశాస్త్రిగారి ప్రతిభ మనకు కనిపిస్తుంది. అప్పటికే శ్యాంబాబు తల్లి మరణించి వుంటుంది. ఒక పేద వ్యక్తి మరణిస్తే ఎలాంటి వాతావరణం వుంటుందో ఆయన చాలా సహజంగా ఈ కథలో వివరించాడు "ఆ రాత్రి వాళ్ళమ్మ కోప్పడలేదు. ఇంటిముందు వీధిలో చాపమీద ఆమె పడుకొనింది. ఆమె తలవెనుక అన్న కూర్చున్నాడు. పక్కని కూర్చొని అమ్మని కావలించుకొని ఆమె కంఠంలో తల దాచుకొంది సరళ చెల్లి. అన్నకి వెనకాల పెంకుటింటి వసారాలో ఓ హరికెన్ లాంతరు, పేద ముసలవ్వలా, స్తంభానికి చేర్లబడి మినుకు మినుకుమంటోంది. అయిదారుగురు ఆడంగులు, అద్దె వాటాలవారు మర్యాదగా తలలు వంచుకొని ఓ వార కూర్చున్నారు. పంచెకట్టుకుని తువ్వాలు భుజాన వేసుకొన్న పెద్దమనిషొకతను స్తంభాలమీది సన్నదూలం కుడిచేత్తో పట్టుకొని ఎడంచెయ్యి నడుంమీది పెట్టుకొని చిరాగ్గా నిల్చున్నాడు.'' అంటూ కథను కొనసాగిస్తాడు. ఈ సహజత్వమే రావిశాస్త్రిగారిని సజీవుణ్ణి చేసింది. అంతేకాదు ఈ కథలో శ్యాంబాబు తల్లి శవం ఆకారాన్ని వివరిస్తూ, "మురికీ మచ్చల చింపి చాపమీద ఆవిడ వెల్లకిలా పడుకుంది. ఆవిడ ఆ సమయంలో నిర్మలంగా నిద్రపోవడం లేదు. ప్రాణాలు పోయినా ఆవేదనలు మాత్రం మిగిలిపోయినట్లు ఆమె ముఖం ఎంతో విచారంగా వుంది. చందమామ చిలిపి శృంగారంతో చుక్కల గిలిగింతలతో తొలి వెన్నెల పట్టుతెరలతో ఆకాశం నిండా లోకమంతటా భగవంతుడు సృష్టించి గుప్పించిన "దివ్య సౌందర్యం"తో ఆమెకి సంబంధం ఏమీ లేనట్టు ఆమె ముఖం

పక్కకి తిరిగి వుంది. "నా పిల్లలంతా ఏడుస్తున్నారే! వాళ్ళకి నేనన్నం పెట్టలేకపోయానే ఈతరాని పిల్లల్ని లోతునీటిలో వదిలేసి నేనిలా శవాన్నయిపోయేనే! ఉది దారి, వాళ్ళకేది దారి?" అని మూగగా విలపిస్తోన్నట్టుంది ఆమె ముఖం. ఏ క్షణాన్నయినా ధారధారలుగా నెత్తురు ప్రవహించవచ్చు నన్నట్టుగా ఆమె ముఖం ఎంతో దీనంగా (అందుచేతనే కాబోలు) ఎంతో భయంకరంగా ఉంది" అని అనడంలో కథకుడి ఔచిత్యాన్ని పాఠకులు అర్థం చేసుకుంటారు.

తల్లిపడే తపన, ఆర్ధతలను రావిశాస్త్రి అక్షరీకరించాడు. ఆయన పేదల పక్షపాతి అనడానికి ఇది ప్రత్యక్ష సాక్ష్యం. కథ ముగింపులో కథకుడిగా రావిశాస్త్రి చెప్పిన మాటలు ఆయన వాస్తవిక దృష్టిని ఏమాత్రం వదలలేదన్నట్లుగా చెప్తాయి. మనిషి పురాణ ప్రవచనాలను విని, ఈ జీవితం నిజం కాదన్న భ్రమ వుండవచ్చు కానీ, వాస్తవ పరిస్థితుల్లో దాని ప్రభావాన్ని మాత్రం అనుభవించి తీరాల్సిందే అని చెప్తూ "నీటిబుడగ పోయినప్పుడు నీటిబుడగలు ఏడుస్తాయో లేదో భగవంతుడికి తెలియాలి. కానీ, మనిషి పోతే మాత్రం మనుషులేడుస్తారు. శాస్త్రిగారూ చావు నిజం కాదని మీకు బాగా తెలిసి ఉండవచ్చు. కానీ బాధ నిజమని మాత్రం శ్యాంబాబుకి మీకంటే బాగా తెలుసు." అని కథ ముగించాడు. కానీ పాఠకుల ఆలోచన అక్కడి నుండి మరింత లోతుకు మాత్రం తప్పకుండా వెళుతుంది.

"రావి శాస్త్రి యొక్క వృత్తి చట్టం: అణచివేతను కొనసాగించే అదే చట్టాన్ని నిర్మూలించడమే అతని తత్వశాస్త్రం" అని "సెలబ్రిటీస్ ఆల్" పుస్తకంలో ఎ. ప్రసన్న కుమార్ చెప్పిన మాటలు అక్షర సత్యాలు.

ఆధార గ్రంథాలు

1. రాచకొండ విశ్వనాథశాస్త్రి రచనా సాగరం – వివినమూర్తి & ఎం.వి. రాయుడు (సం), మనసు ఫౌండేషన్ ప్రచురణ
2. మంటల ఒడిలో – మహాసముద్రం దేవకి
3. కథాంశం – రాచపాళెం చంద్రశేఖరరెడ్డి
4. కథాశిల్పం – వల్లంపాటి వేంకటసుబ్బయ్య

శ్రీముకుంద శతకము – భక్తితత్త్వం

గుడేటి రమేష్, తెలుగు ఉపన్యాసకులు, శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్, కళాశాల పాలెం.
సెల్ : 9490005435

శ్రీముకుంద శతకమును పరికిబండ్ల వేంకటనరసయ్య గారు ఆధునిక కాలంలో రాశాడు. కవిగారు ఇందులో దైవభక్తిని ప్రతి పద్యంలో ప్రస్తావిస్తూ, మానవ జీవిత వాస్తవిక పరిస్థితులను, మనిషి జీవన్ముక్తికి కారణము దైవభక్తియే నిదర్శనమని కొనియాడారు. భౌతిక శరీర ప్రశస్తిని నడుపుతూ శాశ్వత ముక్తికోసం భగవదర్శన సంప్రాప్తమును గూడ తమ శతకంలో ఆయా పద్యాలలో చూపించడం జరిగింది.

ఈ శతకం దైవభక్తి, మరియు మానవసేవ భాగ్య ప్రభావముగా కలిగి సర్వులకు ఎంతగానో సహాయ పడగలదని కవిగారు విశ్వాసమును వ్యక్తము చేసారు. శ్రీముకుంద శతకం పూర్వ సంప్రదాయం ప్రకారంగానే శ్రీకారంతో ప్రారంభం చేసి మొత్తం 113 పద్యాలతో మంగళం పలికాడు. దీనిని మాతాపితరుల ఋణవిశేష విముక్తికై పరిపరి విధాల పరితపించి ఈ చిన్ని శతకమును వారికే అంకితమొనర్చినారు. ఈ శతకం ప్రస్తుతం రెండు ముద్రణలకు నోచుకున్నది.

కం. శ్రీ లక్ష్మీశ: జగన్నుత
బాలా: యదువంశ తిలక: పంకజనయనా!
సాలగ్రామ స్వరూపా
లీలా లోలాత్మ కృష్ణ లీలముకుందా!

అన్న పద్యంతో ప్రారంభమైనది. శ్రీలక్ష్మీదేవికి భర్తవై ఈ సమస్త జగత్తుచేత నుతింపబడేవాడా! యదువంశానికి తిలకరూపమైనట్టి వాడా! పద్మాలలాంటి కన్నులు కలవాడా! సాలగ్రామ స్వరూపలీలతో కూడినట్టివాడా! నీ లీలతో మమ్ములను లాలించి కరుణించుమయ్యా ఓ శ్రీకృష్ణ! ముకుంద: అని పద్యంలో అన్ని విశేషణాలతో కీర్తించడం జరిగింది. ఈ శతకంలో మొత్తం పద్యాలు కందపద్యం ఛందస్సులోనే సాగుతూ 'ముకుందా' అనే మకుటంతో సంబోధించబడింది.

కం. దేహసుఖమాత్మ సుఖమని
దాహముతో నుంటి నేను! ధర్మమెఱుగసం!
దేహము దొలగించుము మాం
పాహీనను బ్రోవుమంటి! వరద ముకుందా!
(పద్యం–2)

మానవులు ఈ భౌతిక దేహము యొక్క సుఖ దాహముతో ఇమిడించుకుపోయి అదే ఆత్మ సుఖమని భ్రమించిపోతున్నారు. కానీ అసలు దేహ ధర్మమేమిటో ఎరుగకపోవుచుండిరి. మరి ఆత్మ పరమాత్మల మధ్య ఉన్న సందేహాన్ని తొలగించి మమ్ములను కాపాడుమయ్య వరములిచ్చేడి వరముకుందుడా! అని కీర్తించాడు.

కం. పరమాత్మ తత్త్వమెఱుగుచు
పరహితమును గోరునట్లు! భక్తియు గలుగన్!
కరుణించి జ్ఞానమొసగియు
చరితార్థుని నన్ను జేయు! సాక్షి ముకుందా! (ప–4)

పరమాత్మతత్త్వాన్ని తెలుసుకొని పరుల మొక్క హితాన్ని కోరేవిధంగా భక్తిని నింపుతూ/కలిగిస్తూ, కరుణించి సంపూర్ణ జ్ఞానాన్ని ఇచ్చి నన్ను చరితార్థుని చేయమని ఆ ముకుందుని ప్రార్థిస్తూ మొరపెట్టుకున్న తీరు కనిపిస్తుంది. ఎంతటి వారైన చివరకు భగవద్దాసులు కావలసిందేనని కవి భావనను వ్యక్తం చేశారు.

కం. 'అష్టాంగ యోగములునే
కష్టించిన సాధ్యపడవు కర్మమదేమో
దృష్టిని నీపై నిలుపుట
కిష్టమునాకబ్బునట్లు నేలుముకుందా!!' (పద్యం–5)

నాకర్మఫలమేమో కానీ అష్టాంగ యోగాలను నా కష్టార్జితంగా సాధించిన అవి సాధ్యపడవు అన్నాడు కవి. అంటే మనిషి మనస్సు చంచలమైనదని స్థిరత్వం లేనిది అని మనం గ్రహించాలి. మరి వాటిని పొందాలి అంటే సరియైన ఏకాగ్రత నిష్ఠ కావాలి. ఏకాగ్రతను నాకు నీపై పెట్టే విధంగా ప్రసాదించుము. నిన్ను కీర్తించుటకు నాకు అమితమైన ప్రేమయున్నది. కానీ మనస్సును అధిగమించే శక్తి లేదు. నాకు ఆశక్తి అబ్బేటట్లు చూడమని ఆ ముకుందుని కీర్తించాడు కవి. ఇందులో దైవారాధన గురించి ప్రస్థావించాడు. ''కృపతో సాక్షాత్కారంబు జూపు సరసముకుందా'' (పద్యం–7) అన్నాడు. దయతో నీవు నాపై జాలి చూపుమయ్య ఓ సరసముకుందా అన్నాడు.

కం. భగవద్భక్తిని జేయుచు
భగవద్భక్తులను జేరి పరతత్త్వమునన్!
సగుణోపాసన శక్తిని
ఖగవాహన నాకు నిమ్ము జ్ఞానముకుందా!
(పద్యం–14)

నాకు భగవంతుని భజించే ప్రాప్తం కలిగించి భక్తకోటి సముదాయాన్ని చేరి పరతత్త్వ బోధనలు చేసే సగుణోపాసన శక్తి సామార్థ్యాన్ని నాకొసంగుము ఓ పక్షివాహనుడవైన శ్రీకృష్ణ స్వరూపా! ఓ నారాయణ అని తన భక్తితత్త్వ భావనను చాటుకున్న అంశాలు ఈ శతకంలో ప్రతి పద్యంలోనూ కనువిందు కలిగిస్తున్నాయి. నాకు ఉపాసన శక్తిని కూడా ఇవ్వమని కోరుకున్నాడు. మరి నిరంతర దైవ ఉపాసన యోగ్యత కావాలంటే సహనం ఏకాగ్రతలు చాలా అవసరం అని గ్రహించాలి.

కం. ఇంద్రియములను జయించగ
సాంద్రతరంమ్మగు నమోఘ శక్తులు గలుగన్!
ఇంద్రియ జయ విజ్ఞానము
ఇంద్రాదులు మెచ్చునటుల నిమ్ముముకుందా!!
(ప–15)

కం. దశదిశల దిరుగు మనసును
వశపఱచుట చేతగాదు! వాసవనుత,నా!
దశయేమని దెలుపుదు, నీ
వశమగుటయె, కేశవయది! వరదముకుందా!!
(పద్యం–17)

ఇంద్రీయ సుఖములను అధిగమించటం అది ఎవరి తరముకాదు. అది నీవిచ్చే శక్తుల వలలనే సాధ్యమౌతుంది. ఇంద్రీయముల నియంత్రణ అనేది ఇంద్రాదులు మెచ్చుకునేటట్లు ఇంద్రీయములను జయించే విజ్ఞానము నాకు ప్రసాదించుము అని కోరాడు. ఎల్లలు లేని మనస్సు అన్ని దిశల తిరుగుతుంది. దాని వశపరచుట చేత నా మనసు నీ ఆధీనంలో ఉంటుంది. లేదంటే నా దశ ఏమని తెలుపుదు దానికి కారణ భూతుడవు నీవే ఎరుంగుదును, నా మనోజ్ఞానము నీపైన ఉండేటట్లు ఆ విజ్ఞాన భాండాగారాన్ని నాకందించుమని ప్రాధేయపడ్డాడు కవి. ఈ సందర్భ వాక్యాలను బట్టి కవి యొక్క భక్తితత్త్వం మనకు వ్యక్తమౌతుంది.

భక్తియే కాకుండా మానవీయ విలువలను కూడా మనిషి మంట కలుపుతున్న తీరు కూడా ఈ శతకంలో అక్కడక్కడ పొడసూపుతున్నాయి. మచ్చుకొక పద్యం.

కం. మానవునిగ జన్మించియు
మానవ మర్యాదలన్ని మంటగలిపితిన్!
దీన జనావనవేడితి
దీనుని దయజూడు వాసుదేవ ముకుందా!!
(పద్యం–30)

మానవుని ధర్మాలు మానవుడు తెలుసుకునే విధంగా ఉండాలనీ, ఈ జగత్తులో మనిషిగజన్మించి, తన కర్తవ్య బాధ్యతను, మానవీయతను, మట్టిలో కలుపుతున్న జాతి నేటి సమాజంలో తయారైనదని వాపోయాడు. ఆ మానవ మర్యాదలను పాడు చేయకుండా దీనావస్థ స్థితి కారులు నిన్ను వేడుతున్నారు. అలాంటి దీనునిపై నీ దయ చూపుమని

ఆ వాసుదేవ సుతుని భక్తి ప్రపత్తులతో కీర్తించాడు. ఇక్కడ మానవీయ విలువలు కాపాడుకోవాలని కూడా కవి ఉద్బోధించాడు.

కం. పతనముగల జన్మమునకు
గతియేదో బోధపడదు గమ్యమెఱుగునా!
గతియును పతియును నీవని
మతి దలచితి నచ్యుత పరమ హితముముకుందా
(పద్యం-36)

పతనమైయేటి ఈ మావన జన్మకు గతి ఏమిటో ఎవరికి బోధపడదు. దాని గమ్యం ఎక్కడో, ఏమిటో తెలుసునా? మరి ఆ రెండింటికి నీవే దిక్కు అని నా మన: పూర్వకంగా నిన్ను దలచాను పరహితం కోర అచ్యుతా! ఓ ముకుందా! అన్నాడు. అనగా మానవజన్మ శాశ్వతం కాదని అది కొన్ని రోజుల మాయ బుడగ అని అంత్యకాలములో నశిస్తుందని గుర్తు చేశాడు. శాశ్వతమైన జ్ఞాన పిపాసినేయయ్యే విధంగా నాకనుగ్రహం కలిగించుమని భగమంతుని వేడుకొన్నాడు.

కం. మాయా లోకము నమ్మియు
మాయనుబడి మూల్గుచుంటి! మర్మమెఱుగకన్!
మాయయు తొలగగ వచ్చియు
మాయీ యర్ఘ్యంబు గొనుము! మహితముకుందా!
(పద్యం-45)

మాయతో కూడిన ఈ సమాజమును నమ్మి ఆ మాయా మడుగులోన తిరుగాడుతున్నాను. మరి దాని మర్మము/ రహస్యమును తెలుసుకోకపోతున్నాను. నీవు మాయావియై వచ్చి నా మాయలను తొలగించి, నా మాయా అర్ఘ్యాన్ని గైకొనుమని అమితమైన భక్తితో తన ఉదార స్వభావాన్ని దైవం ముందల ప్రస్తావించాడు.

కం. ఏపని యందైనను, నే
నోపికతో నీదు స్మరణ! నొప్పుగజేయన్!
ఆపద్బాంధవ రమ్మిటు
దీపము వెలుగొంద జేతు దివ్యముకుందా!!
(పద్యం-53)

నేను ఏ పని చేసినా కానీ ఓపికతో నీ స్మరణతో ఒక నమ్మకంతో చేస్తాను. ఆపద్బాంధుడవైన ఓ హరీ! ఇటు రమ్ము దీపం వెలిగేటట్లుగా జేతును దివ్యముకుందా అని వేడుకున్నాడు.

కం. నీచ హిరణ్యాక్షుడు ప్రజ
నేచుచు నిలజుట్టి యంబునిధిలోముంచున్!
వేచి వరాహాకృతితో
నా చెనటిని ద్రుంచినట్టి నాథముకుందా!! (ప-64)

కృతయుగంలో నీచ కృత్యాలతో హిరణ్యాక్షుడు ప్రజలను పీడిస్తూ, నేలనంతా చాపగా చుట్టుకొని సముద్రంలో పడవేయగా, నీవు ఆ సందర్భంలో వరాహావతార స్వరూపుడవై అతని ద్రుంచిన మహిమ నీకున్నది అన్నాడు. అంటే ఇక్కడ దుష్ట శిక్షణ శిష్ట సంరక్షణ స్వరూపుడవయ్యా! ఓ ముకుందా! అని వ్యక్తీకరించాడు.

కం. దాగుడు మూతల నాడెడు
భోగవిలాసాల బ్రతుకు! పోకార్చుచునే!
బాగుపడుదారి జూపుము
సాగిలబడి మ్రొక్కుచుండి స్వామిముకుందా!!
(పద్యం-79)

ఈ జీవితం దాగుడుమూతల తీరుగా ఆడెడు భోగవిలాసాలకు నిలయమైన బ్రతుకు ఇది. దానిని ఓర్చుకొని బాగుపడేదారిని చూపించుము. నేను నీకు సాష్టాంగ ప్రణామములర్పింతును స్వామీ! అని ప్రార్థించాడు. దీనిని బట్టి ఇది కలియుగ ధర్మ లక్షణాలను అధిగమించే శక్తి ఈ కాలంలో జీవిస్తున్న మనష్యులకు లేదని అర్థమౌతుంది. అందుకే కవి ఈ మానవ జీవితాన్ని దాగుడుమూతలతో పోల్చాడు. మనస్సును నిగ్రహించే శక్తి సామార్థ్యాలు ఎరుగని మానవుడు మనోనేత్రం ద్వారా ఏకాగ్రత ద్వారా భగద్దర్శన ప్రాప్తం లేదని అర్థమౌతుంది. జనన మరణ సాఫల్య జీవితాన్ని కాస్త సుఖమయంగా సాగించుమని దేవదేవున్ని అర్థించిన తీరు స్పష్టమౌతుంది.

కం. మాయమోహములోబడి
మాయను విడనాడలేక మందుడనైతిన్!
మాయామోహము దొలగగ
మాయాత్మల నిలువు విజిత! మాయముకుందా!!
(పద్యం-85)

కం. సారములేని యపారవి
చారము సంప్రాప్తమయ్యె! సంసారమునన్!
సారాసార విచారపు
ధారాపాతంబు నొసగు! దాతముకుందా!!
(పద్యం-89)

మానవుడు మాయా మోహంలో ఇరుక్కుని మాయను విడువలేక అజ్ఞానియై ఉన్నాడు. ఆ మాయలను రూపుమాపి మా ఆత్మల నిలుపుమయ్య ఓ మాయ ముకుందా! అన్నాడు. ఫలితము లేనటువంటి అపారమైన ఆలోచనలను మనస్సులో పెట్టుకొని సంసారంలో విచారిస్తున్నాడు. ఆ సారాసార విచారాలను ధారావాహికంగా తొలగించుమయ్య ఓ దైవ దాతముకుందా! అంటున్నాడు.

కం. నిరతము నీపదభక్తుల
నిరుపేదలయందు ప్రేమ! నిండుగ గలుగన్!
కరుణించుదేవ! మురహర
పరమాత్మ భక్తవరద! పాహిముకుందా!! (పద్యం-90)

ఎల్లప్పుడు నీ పాద భక్తులైన నిరుపేదలను ప్రేమతో చూడుము. వారిని కరుణించి కాపాడుము మురహరీ, పరమాత్మ స్వరూపా! భక్తులకొరములొసంగే పాహిముకుందా 'లోకులు హరిలేడని పలు,గాకులు ప్రేలెదరు స్వీయ గమ్యముగనకన్..'' (పద్యం-93) అనే పద్యంలో కలియుగంలో విష్ణువు లేడని పలువురు, పలు విధాలుగా పలుకుతున్నారు. అలాంటి వారికి అటంకాలు ఎదురైనప్పుడు దేవుని వేడుకొనుచున్నారు. అప్పుడు సాకులు చెప్పుతారని లోకులను తిరస్కరించాడు కవి.

కం. అర్థము నెఱుగకజేసెడి
ప్రార్థనలిల వ్యర్థములు పరామర్శించన్!
అర్థము నెఱుగుచు జేసెడి
ప్రార్థనలిల సార్థకములు! పరమముకుందా!!
(పద్యం-105)

నీయర్థం తెలుసుకోకుండా ఎన్ని ప్రార్థనలు చేసినా వ్యర్థం. అదే నీ తత్వాన్ని గ్రహించి చేసినచో ఆ ప్రార్థనలకు సార్థకత ఉంటుంది. పుత్రునివలె ననుజూడుము-107, ఏమయ్య యెంతవేడిన -108, ధరకాల చక్రమందున-109, అనే పద్యాలలో చివరకు భక్తి తత్పరతతో మొర పెట్టుకుంటూ సంబంధ బాంధవ్యాలలోని అంతరార్థాన్ని జీవిత చరమాంక ఫలితాన్ని స్పష్టంగా వివరించడం జరిగింది.

కం. ధరపరికిబండ్ల వేంకట
నరసయ్య శ్రీముకుంద నామశతకమున్
(పద్యం-112)

అనే పద్యంలో తన నామధేయాన్ని నివాస స్థలాన్ని ప్రస్థావించిన తీరు శతకాంత పద్యంలో పొడసూపినది. చివరకకు "జోహారు భక్తవత్సల (113)" లో భగవంతునికి భక్తి పూర్వకంగా జోహార్లు అర్పించిన అంశం వ్యక్తమౌగు చున్నది. ఈ శతకంలో మొత్తం పద్యాలు దాదాపుగా మానవ జీవనపరంగా భక్తిపరంగా ఉన్నాయని తెలుస్తుంది.

ఆధార గ్రంథాలు:

1. శ్రీ ముకుంద శతకం - పరికిబండ్ల వెంకటనర్సయ్య (చైతన్య ఆఫ్‌సెట్ ప్రింటర్స్-1978)
2. ఆంధ్ర శతక సాహిత్య వికాసం - డా॥. కె. గోపాలకృష్ణారావు

ఆధునిక తెలుగు సాహిత్యం - మానవతావాదం

డాక్టర్ ఎం.రవీంద్రబాబు, తెలుగు అధ్యాపకులు, మథర్ థెరిస్సా డిగ్రీ కళాశాల, పలమనేరు, చిత్తూరు జిల్లా,
చరవాణి : 94926 61219, 86880 20169

మానవతా వాదాన్ని ఆంగ్లంలో "హ్యుమనిజం" అంటారు. మానవతావాదంలో మౌలికంగా మానవునికి పట్టం కట్టడం జరుగుతుంది. మానవ శ్రేయస్సును, మానవ అభివృద్ధిని నిరంతరం ఆలోచించి, ఆకాంక్షించేదాన్ని మావనతావాదంగా వ్యవహరించబడుతుంది. ఈ వాదం ముఖ్యంగా ఐరోపాదేశాల్లో పుట్టి అది విశ్వవ్యాప్తమయ్యింది. మానవతా వాదం ప్రకారం ఈ సృష్టిలో మానవుడే సర్వోత్కృష్టమైనవాడు. అందుకే మానవుడే మాధవుడు. **"మానవ సేవే మాధవ సేవ"** అనే సూక్తి ఇందులో ప్రాథమిక సూత్రం అవుతుంది. మానవతావాదంలో మనుషుల పట్ల కారుణ్యాన్ని, జాలిని కలిగి ఇతరుల భవిష్యత్తుకు తాను కృషి చేయగల సమర్థుడు అన్న సిద్ధాంతాన్ని ప్రధానంగా ఈ మానవతావాదం కలిగి ఉంటుంది.

గ్రీకు దార్శనికుడైన ప్రోటాగారాస్ ప్రతి అంశానికి ప్రమాణం లేదా కొలబద్ద మానవుడే అని సందేశం ఇచ్చాడు. ఇదే మానవతావాదానికి మూల సూత్రం. భగవంతుని ఉనికిని మానవతావాదం ఏమాత్రం ఒప్పుకోదు. మానవ జాతి మనుగడ, శ్రేయస్సు, అభివృద్ధిని కాంక్షిస్తూ హేతువాద దృక్పథంతో మార్క్సిస్టు దృక్పథంతో వ్రాయబడిన రచనలన్నీ మావనతావాద రచనలుగా పరిగణించబడుతున్నాయి. మానవత్వాన్ని గౌరవించడం దీనిలో ప్రధానం. భగవంతుడు, ఆచారాలు, మూఢనమ్మకాలు, కట్టుబాట్లు ఇవన్నీ మానవహితం కంటే గొప్పవి కావు. మానవత్వాన్ని విస్మరించినపుడు పైన పేర్కొన్న వాటిని విమర్శించాల్సిందే. ఇదే మానవతావాదంలో ప్రధానాంశం.

సాహిత్యంలో అనేక వాదాలు వారివారి అస్థిత్వాన్ని నిలుపుకోవడం కోసం వెలువడ్డాయి. ఇవి సాహిత్యాన్ని కుల, మత, ప్రాంతాల పేరిట చీల్చిచూపే దురవస్థకు చేరుకున్నాం. ఇలా కొనసాగితే కొత్త సమస్యలు సృష్టించడమే అవుతుంది. వ్యక్తిగత ఆనందం, సామాజిక ప్రయోజనం సాహిత్యానికి పరమావధి. వ్యక్తులలో జ్ఞానాన్ని, చైతన్యాన్ని పెంపొందించి, సమాజ సర్వతో ముఖాభివృద్ధికి తోడ్పడడమే సాహిత్య లక్ష్యం కావాలి. వాదాలు ఎన్నో రకాలు ఉన్నప్పటికీ ఆధునిక విజ్ఞాన శాస్త్ర భావాలను ఆశ్రయించి సామాజిక అభ్యుదయానికి తోడ్పడిన వాటిలో హేతువాద భావాలు, మానవతా భావాలదే అద్వితీయమైన స్థానం అనడంలో అతిశయోక్తి లేదు. ప్రాచీన కాలంలో భారతదేశంలో విలసిల్లిన చార్వాక, బౌద్ధ, జైన ఉద్యమాలన్నీ మానవతా విలువలపై నిర్మితమైనవే. ఆనాడు ఇవి ప్రపంచానికి ఆదర్శప్రాయమై నిలిచింది. అటువంటి ఉద్యమాలు విదేశాలకు విస్తరించినా స్వదేశంలోనే అంతరించిపోవడం విషాదకరమైన పరిణామం.

హేతువాద భావాలతో వెలుగులను ప్రసరింప జేసినవాడు వేమన. అంటరాని తనాన్ని, కులమత భేదాలను ప్రశ్నించి ఖండించాడు. సమానత్వాన్ని ప్రతిపాదించాడు. వేమన ఆధునిక సాహిత్యానికి అభ్యుదయ భావాలకు వేగుచుక్కలాంటివాడు.

భారతదేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమంలో భాగంగా రాజారామమోహన్‌రాయ్ తదితరుల రచనలూ, ఉద్యమాలూ మానవతావాదాన్ని ప్రతిబింబించినవే. ఆధునికాంధ్ర కవిత్వంలో ఈ మానవతావాదం అభ్యుదయ కవిత్వంతో ప్రారంభమై దిగంబర, విప్లవ, స్త్రీవాద, దళితవాద, మైనారిటీ వాద కవిత్వాలతో విస్తరించి వ్యాపించింది. గురజాడ, దేవులపల్లి, దాశరథి, బాలగంగాధర తిలక్, పేర్వారం జగన్నాథం, పుట్టపర్తి, జాషువా, సి.నారాయణరెడ్డి, శ్రీశ్రీ, ఖైరాగి, ఆరుద్ర, కుందుర్తి, శేషేంద్ర మొదలైన కవులు మానవతావాదాన్ని స్పృశిస్తూ ఏదో ఒక

రీతిలో మానవత్వాన్ని ప్రతిబింబించే కవిత్వం రాసిన వారే చాలామంది ఉన్నారు.

గురజాడ అప్పారావుగారి కవిత ''మనిషి'' మానవతావాద ధోరణికి స్పష్టమైన నిర్వచనం అని చెప్పవచ్చు. ఆ కవితలో గురజాడ

"మనిషి చేసిన రాయి రప్పకి
మహిమ కలదని సాగిమొక్కుతు
మనుషులంటే రాయిరప్పల కన్న కనిష్ఠం
గాను చూస్తావే బేలా?
దేవుడెకడో దాగెనంటూ
కొండ కోనల వెతుకులాడే వేలా"? అని ప్రశ్నిస్తూ
"కన్ను తెరచిన కనబడదో?
మానవ మాత్రుడి యందు లేదో?
యెరిగి కోరిన కరిగి యీడోయుక్తి?" అని అన్నారు గురజాడ. చూడాలే కానీ మనిషిలో దైవం ఉంది అని చాటి చెప్పే ఈ కవిత మానవతా ధోరణికి దర్పణం పడుతుంది. విశ్వమానవ ప్రేమను చాటారు. సంఘ సంస్కరణ కవిత్వంలో మానవతావాదం ఉంది. అస్పృశ్యతను, వర్ణాదిక్యతను నిరసించడం మానవతావాదమే.

సినారె "మంటలూ – మానవుడు", విశ్వంభర తదితర రచనల్లో మానవతా వాద ధోరణి దర్శనమిస్తుంది.

"ఉదయం నా హృదయం
మానవత్వం నా ఇతివృత్తం" అని సినారె మానవత్వం సాధించేది సంస్కృతి అని, మనస్సే మానవ సంస్కృతికి మూలం అని చాటి చెబుతూ విశ్వంభరలో

"మనస్సుకు తొడుగు మనిషి
మనిషికి ఉడుపు జగతి
ఇదే విశ్వంభర తత్వం
ఇదే అనంత జీవితం తత్వం" అని పేర్కొన్నారు.

"తిలక్" అమృతం కురిసిన రాత్రి అనే వచన కవితా సంపుటి అంతా మానవతా వాదంతోనే నిండి ఉంది. వీరి "ఆర్తగీతం" ఖండికలో మానవతా దృక్పథాన్ని వెల్లడిస్తూ

"నేను చూశాను నిజంగా ఆకలితో అల్లాడి మర్రిచెట్టు
కింద మరణించిన ముసలివాణ్ణి
నేను చూశాను నిజంగా నీరంధ్ర వర్షాన వంతెన కింద
నిండు చూలాలు ప్రసవించి మూర్ఛిల్లిన దృశ్యాన్ని
నేను చూశాను నిజంగా తల్లిలేక తండ్రిలేక తిండిలేక
ఏడుస్తూ ఏడుస్తూ ముంజేతుల కన్నులు
తుడుచుకొంటూ మురికి కాల్వ ప్రక్కనే నిద్రించిన
మూడేళ్ళ పసిబాలుణ్ణి" అని తిలక్ దీనుల హీనాతి హీనస్థితిని హృదయ విదారకంగా వర్ణించారు. ఇలాంటి అమానుష దృశ్యాలను అందిస్తున్నపుడు నాగరికత ఎందుకని వేదన చెంది ఇలా అంటారు.

"ఇది ఏ నాగరికతకు ఫలశ్రుతి?
ఏ విజ్ఞాన ప్రకర్షకు ప్రకృతి?
ఏ బుద్ధదేవుడి జన్మభూమికి గర్వస్మృతి?" అని ప్రశ్నించారు.

"మానవత లేని లోకాన్ని స్తుతించలేను
మానవునిగా శిరసెత్తుక తిరుగలేను
ఈ నాగరికతారణ్యవాసం భరించలేను" అని తిలక్ వారి ఈ 'ఆర్తగీతం'లోనే వాపోయారు.

అదేవిధంగా "నిన్నరాత్రి" ఖండికలో ఇలా అంటారు.

"దేవుని చెక్కిళ్ళమీద దీనంగా జారే కన్నీటిని
దీపకాంతిలో చూసి చటుక్కున లేచి
కౌగిలించి ఊరడించి
కన్నీటిని తుడిచి
వెళ్ళి రమ్మని వీధి చివరిదాకా సాగనంపివచ్చాను" అని దేవుడిని సైతం తన లాంటి మానవుడిగానే భావించి ఓదార్చి పంపిన వైనాన్ని గురించి తెలిపారు.

పేర్వారం జగన్నాథం తన "మహామానవుడు" అనే కవితలో మానవతా వాదాన్ని తన కవితలో ఇలా

చిత్రించాడు.

"మానవతను గుండెకు వేలాడదీసి
అనురాగాన్ని ఒళ్ళంతా పూసుకొని
మనిషి మనుగడ కోసం
మనిషి భవితవ్యం కోసం
అవిశ్రాంతంగా ఆరాటపడే
అడ్రసులేని మానవుణ్ణి
నేడు చిరంజీవిని
నేడు చిరంతన సంజీవిని
నా పేరు మానవుడు

విప్లవం నా అసలు పేరు" అని పలుకుతారు తిలక్. తన పేరే మానవుడు అని ప్రకటించుకోవడమే కాకుండా అసలు పేరు విప్లవమని పేర్కొనడం గమనార్హం. మానవత్వం కోసం విప్లవాన్ని ఆశ్రయించాలన్నది కవి భావనగా తెలుస్తుంది.

శ్రీశ్రీ "మహాప్రస్థానం"లో 'భిక్షవర్షియసి', 'బాటసారి', 'ప్రతిజ్ఞ', 'దేశచరిత్రలు' లాంటి కవితల్లో మానవతావాదం గూడు కట్టింది. శ్రీశ్రీ "దేశచరిత్రలు" అనే ఖండికలో

"ఏ దేశచరిత్ర చూసినా
ఏమున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం" అని చెబుతూ

చీనాలో రిక్షావాల
చెక్ దేశపు గని పని మనిషీ
ఐర్లాండున ఓడ కళాసీ
అణగారిన ఆర్తులందరూ
హాటెన్‌టాట్, జూలూ, నీగ్రో
ఖండాంతర నానా జాతులు
చారిత్రక యథార్థ తత్త్వం

చాటిస్తా రొక గొంతుకతో" అని వివిధ రకాలైన కార్మికుల్ని వివిధ జాతుల ప్రజల్ని చరిత్రలో వారికి జరిగిన అన్యాయాల్ని ప్రశ్నిస్తూ వారి పక్షాన నిలబడి తన మానవతా వాద దృక్పథాన్ని ప్రదర్శించుకొన్నాడు.

మహాప్రస్థానంలోని 'భిక్షువర్షీయసి' అనే ఖండికలో మానవతావాదం గోచరిస్తుంది.

"ముగ్గుబుట్టవంటి తలా,
ముడుతలు తేరిన దేహం,
కాంతిలేని గాజుకళ్ళు,
తనకన్నా శవం నయం"

కుందుర్తి ఆంజనేయులు దేవునికంటే మానవులకే విలువ నిచ్చారు. తన కవిత్వంలో వారు మనుషులపై, మానవ జన్మపై ఎనలేని మక్కువ పెంచుకొన్నారు. ఇదే మానవతావాదం వారు.

"మళ్ళీ నరజన్మ ఎందుకంటే
మనుషులంటే ఇష్టం నాకు
దేవుని కంటే మనిషియిష్టం
దేశం యిష్టం - తెలుగు యిష్టం" అని అన్నారు. వీరు మళ్ళీ జన్మంటూ ఉంటే మనిషిగానే పుట్టాలని ఆకాంక్షించారు.

ఎండ్లూరి సుధాకర్ 'దళితవాద' కవిత్వంలో మానవతావాద దృక్పథంతో

"నేనింకా నిషిద్ధ మానవున్నే
నాది బహిష్కృత శ్వాస
నా మొలకు తాటాకు చుట్టి
నన్ను నలుగురిలో
అసహ్య మానవ జంతువుని చేసిన మనువు
నా నల్లటి నుదిటి మీద బలవంతంగా
నిషిద్ధ ముద్ర వేసినప్పుడే
నాజాతంతా క్రమ క్రమంగా హత్య చేయబడింది"

అని అస్పృశ్యుల పట్ల సానుభూతి ప్రకటించి వారి అభ్యుదయాన్ని కాంక్షించడం మానవతావాదమే అవుతుంది.

సాజహానా అనే ముస్లీం కవయిత్రి 'పర్దాహటాకె దేఖో' అనే కవితలో

"ఊహ తెలియని వయస్సులో
గుమ్మానికి పరదా కడితే
రంగురంగుల కుచ్చులు చూసి మురిసిపోయేదాన్ని
అప్పుడే స్వేచ్ఛకి మొదటి బేడీ అని తెలుసుకోలేని పసిదాన్ని..!
గుమ్మానికి కట్టినట్టే అమ్మ ముఖానికి బురఖా కడితే
స్వప్నంలాంటి జిందగీకి శాపమని అప్పట్లో తెలయని దాన్ని
నా అందం వెనుకున్న రక్తమాంసాల్ని
అరబ్బుషేకు దెక్కళ్ళతో పీల్చేస్తుంటే
నా శరీరం ముద్దకో వాడు వెలకడుతుంటే
స్వేచ్ఛా ..... కనీసం వినటానికి కూడా
నిషేధించబడినదాన్ని
కలలో అనుభూతించడానికి కూడా అర్హత లేనిదాన్ని!"

అని ముస్లీం స్త్రీవాద కవిత్వంలో వారి దయనీయమైన స్థితిగతుల్ని అణచివేతలను పేర్కొనడంలోను మానవతా వాదమే కనిపిస్తుంది. మనిషిని గురించి బాధ అయినా స్త్రీని గురించి బాధ అయినా అది అంతా మానవతావాదమే.

ఈ విధంగా మానవతావాద కవిత్వం తెలుగులో ప్రవర్థిల్లిందని చెప్పవచ్చును. అయితే ఇది అభ్యుదయ, విప్లవ, భావ కవిత ఉద్యమాల మాదిరిగా తెలుగు కవిత్వంలో బలమైన ముద్రతో సాగలేదని పండితాభిప్రాయం. అయినా మానవుని హితాన్ని, మానవత్వాన్ని నిలిపి శిఖరాయమానాన్ని అందిస్తూ ఎలుగెత్తి చాటిన ఈ కవిత్వం అంత తక్కువదేమీ కాదు. మానవుని ఉనికి ఉన్నతవరకు చిరస్థాయిగా ఉంటుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

ఉపయుక్త గ్రంథాలు :

1. శ్రీశ్రీ – మహాప్రస్థానం
2. బాలగంగాధర తిలక్ – అమృతం కురిసిన రాత్రి
3. సినారె – విశ్వంభర
4. తెలుగు సాహిత్య చరిత్ర – ద్వానా శాస్త్రి
5. తెలుగు సాహిత్య చరిత్ర – ఆరుద్ర
6. తెలుగు సాహిత్య సమీక్ష – జి.నాగయ్య

****

రాయలనాటి ప్రబంధ కవులు – ప్రసిద్ధ కావ్యాలు

డా॥ చుక్కా యశోద, తెలుగు శాఖాధిపతి, శాతవాహన కళాశాల, విజయవాడ.

ఉపోద్ఘాతం :

ఆంధ్ర సాహిత్య చరిత్రలో 16వ శతాబ్దాన్ని స్వర్ణయుగమనీ, ప్రబంధ యుగమనీ, శ్రీకృష్ణదేవరాయల యుగమనీ పిలుస్తారు. రాయలు రసజ్ఞుడు, కవి, పండితుడైన రాజు కాబట్టి ఆ కాలంలోని ప్రతిభ ఉన్న కవులు తమ ప్రతిభా పాటవాల్ని రాజు దగ్గర ప్రదర్శించ టానికి అవకాశం కలిగినందువల్ల రాయలనాటి కవులు తమ భావాల్ని నిర్మొహమాటంగా వెల్లడించగలిగారు.

రాయలు అష్టదిగ్గజ కవుల్ని పోషించడమే కాక స్వయంగా కవి. ఆనాడు అన్ని కళలకు నిలయమైంది రాయలయుగం. ఈ యుగంలోనే స్వతంత్ర కావ్యాలు ఎన్నో వచ్చాయి. ప్రబంధ కన్య సర్వాంగ సౌందర్యవంతమైంది. ప్రబంధ మహావృక్షం మధురాతి మధుర ఫలవంతమై సఫలత పొందింది. కాబట్టి శ్రీకృష్ణ దేవరాయల యుగం తెలుగు సాహిత్య చరిత్రలో స్వర్ణయుగంగా నిలిచింది.

ప్రబంధ శయ్యకు మార్గదర్శకుడు శ్రీనాథుడు. అతనికి నన్నయ్య ఆదర్శమూర్తి. నన్నయ్య నుండి నాచన సోమన దానిని అందిపుచ్చుకొని శ్రీనాథునికిచ్చాడు.

రాయల యుగంలో కవులందరూ ఇంచుమించుగా స్వతంత్ర రచన చేశారు. తెలుగు కావ్యాలకు గౌరవం పెరిగింది. రాయల యుగంలో ఏ యుగంలో రానన్ని ప్రబంధాలు వచ్చాయి. అందుచేత ఈ యుగాన్ని "ప్రబంధయుగం" అని అన్నారు. "ప్రబంధం" అంటే ప్రకృష్టమైనబంధం కలిగినదని అర్థం.

శ్రీకృష్ణ దేవరాయలు - ఆముక్తమాల్యద

ఆంధ్ర వాఙ్మయంలో అన్ని యుగాల కంటె రాయల యుగానికి 'స్వర్ణయుగం' అని పేరు రావటానికి కీలకమైన వ్యక్తి శ్రీకృష్ణదేవరాయలు. రాయలు రాసిన ఆముక్తమాల్యద ఆంధ్ర సాహిత్యమున ఒక పూర్ణ సృష్టి. దీనిని మించిన ప్రౌఢ ప్రబంధం మరొకటి లేదు. ఆముక్తమాల్యద ఏడాశ్వాసాల ప్రబంధం. దీనికే 'విష్ణు చిత్తీయము' అనే నామాంతరం కలదు.

ఈ గ్రంథం నారికేళ పాకంతో కూడిన ప్రౌఢ ప్రబంధం. ఆంధ్ర మహావిష్ణువు కలలో కనిపించి 'సంస్కృతం లో నీవు అనేక కావ్యాలు రాశావు. ఆంధ్ర భాషలో కూడా నాకు ప్రీతిని గొల్పు కావ్యాన్ని రాయమని ఆదేశిస్తాడు'. రాయలు ఆమాట ప్రకారం కావ్యరచనకు పూనుకున్నాడు. రాయలు రాసిన ఆముక్తమాల్యద ఆంధ్ర సరస్వతికి కంఠాభరణం. ఇది సాహితీ సమరాంగణ సార్వభౌముని కీర్తి కెరటం. ఆచంద్ర తారార్కం సహృదయుల హృదయాల్లో భద్రంగా ఉండగల మహాప్రబంధం ఆముక్తమాల్యద.

ఆముక్తమాల్యద - కథ

ద్రవిడ దేశంలో వైష్ణవ మతప్రవర్తకులు పన్నిద్దరా ళ్వారులు ఉన్నారు. వీరిలో పెరియాళ్వారు ప్రసిద్ధుడు. అతడే విష్ణుచిత్తుడు. అతని కుమార్తె గోదాదేవి. ఆ గోదాదేవిని విష్ణుచిత్తుడు శ్రీరంగనాథునికిచ్చి వివాహం చేస్తాడు. ఆమె బాల్యంలో తండ్రికట్టిన మాలలను తాను ధరించి, తర్వాత భగవంతునికి ఇచ్చేది. భగవంతునికి ఆమె మీద ప్రేమ కలిగింది. ఇందులోని కథ గోదా రంగనాథుల వివాహం కాబట్టి ఆముక్తమాల్యద అనేదే సరియైన పేరు. నాయిక పేరుతో తెలుగు సాహిత్యంలో వెలసిన తొలి ప్రబంధం ఆముక్తమాల్యద.

రాయల ఆముక్తమాల్యద ఉత్తమ ప్రబంధానికి తగిన వర్ణనలతోనూ, రసపోషణా చాతుర్యంతోనూ, పాత్ర పోషణా నైపుణ్యంతోనూ, ప్రకృతి పరిశీలనతోనూ కూడుకొని ఉంది. రస రమణీయమైన వైష్ణవ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన ఈ గ్రంథం భక్తకోటికి శిరోధార్యం.

రాయల ఆముక్తమాల్యద రచనతో ప్రబంధ మహావృక్షం ఫలించి సఫలతనందింది. అత్యంత అద్భుతంగా మహాప్రబంధాన్ని రాసిన రాజకవి అయిన శ్రీకృష్ణ దేవరాయలు ఆంధ్ర సాహిత్య చరిత్రలో చిరస్మరణీయుడు.

అల్లసాని పెద్దన - మనుచరిత్ర

తెలుగు సాహిత్యంలో ప్రబంధ మండలిలో తొలిపీఠం వేసుకున్న గ్రంథం మనుచరిత్ర. అల్లసాని పెద్దన దీనిని రచించి రాయలకి అంకితమిచ్చాడు. అష్టదిగ్గజ కవుల్లో అగ్రగామిగా, రాయల ఆస్థాన కవిగా కొలువు దీరాడు. పెద్దనకు 'ఆంధ్ర కవితా పితామహుడని' బిరుదు కూడా కలదు.

పెద్దన రాసిన మనుచరిత్రకే ''స్వారోచిషమను సంభవము" అనే పేరు ఉంది. ఈ ప్రబంధంలో స్వరోచిషుని పుట్టుకకు కారణమైన చరిత్ర వర్ణించబడింది. ఈ గ్రంథానికి మూలం 'మార్కండేయ పురాణము'. ఇది ఆరాశ్వాసాల ప్రబంధం.

సంక్షిప్త కథాసారము

సిద్ధుడు ప్రవరుడిచ్చే ఆతిథ్యాన్ని స్వీకరించటం – ప్రవరునితో తీర్థయాత్రా విశేషాలు ముచ్చడించడం – సిద్ధుడు ప్రవరుని పాదాలకు ఓషధీ లేపనం పూయటం – ప్రవరుడు హిమగిరి సుందర దృశ్యాలు తిలకించడం – మంచుకు పాదలేపనం కరిగిపోవటం – దిక్కుతోచక ప్రవరుడు అటూ ఇటూ తిరుగటం మొదలైన విశేషాలు ఈ గ్రంథంలో చెప్పబడ్డాయి.

మొదటి రెండు ఆశ్వాసాల్లో శృంగార రసాభాసంతో కూడే వరూధినీ ప్రవరాఖ్యుల కథ, వరూధినీ మాయా ప్రవరుల శృంగారం, స్వరోచిష వృత్తాంతం వర్ణించబడ్డాయి.

మనుచరిత్ర చక్కని కథా కథన నైపుణ్యంతో, భాషా పాటవంతో, రచనా సౌందర్యంతో, రమణీయమైన అలంకారాలతో, మనోజ్ఞమైన వర్ణనలతో లోకోక్తులు జాతీయాల సొగసులతో అలరారి ఆంధ్ర వాఙ్మయంలో అగ్రస్థానం సంపాదించుకుంది.

నన్నయ, నాచనసోమన, శ్రీనాథుడు మొదలైనవారు ప్రబంధ రచనలు చేసినప్పటికీ పెద్దన మనుచరిత్రవలె పరిపక్వం చెంది, పరాకాష్టకు చేరుకొని పరిపూర్ణతను పొందలేదు. ఆంధ్ర సాహిత్య చరిత్రమున పంచకావ్యములలో ఒకటిగా పరిగణింపబడుటయేగాక, ప్రబంధములన్నిటికీ శిరోభూషణమై అలరారుచున్నది.

నంది తిమ్మన - పారిజాతాపహరణము

పారిజాతాపహరణము అనే 5 ఆశ్వాసాల ప్రబంధాన్ని రాసిన నంది తిమ్మనను, 'ముక్కు తిమ్మన' అని కూడా అంటారు. దీనిని శ్రీకృష్ణ దేవరాయలకు అంకితమిచ్చాడు.

పారిజాతాపహరణ కథ సంస్కృతం నుంచి గ్రహించ బడింది. ప్రథమాశ్వాసంలో శృంగార రసం మిక్కిలి మనోహరంగా పోషించబడింది. సత్యభామ పాత్రను కవి కడు సమర్థవంతంగా వర్ణించాడు. తక్కిన ఆశ్వాసాల్లో చంద్రోదయ, సూర్యోదయ వర్ణనలు, ప్రణయ వన విహార యుద్ధాలు ప్రబంధోచితంగా, కమనీయంగా వర్ణించాడు.

ఈ గ్రంథంలో శృంగారం ప్రధాన రసం. అసూయ ఈర్ష్యాదులచే జనించిన ప్రణయకోపం ఇందులో చక్కగా వర్ణించబడింది. ముక్కు తిమ్మనార్యు ముద్దుతనం, పాత్ర పరిశీలన, భావనా విశేషం, రసౌచిత పద ప్రయోగ చమత్కృతి, సమయస్ఫూర్తి, సాభిప్రాయ విశేషణ ప్రయోగం, నుడికారం మొదలైన విశేషాలు ఈ ప్రబంధంలో చోటు చేసుకున్నాయి.

తిమ్మన పారిజాతాపహరణములో పాత్రల స్వభావం సహజంగా ఉంటాయి. ఈ ప్రబంధంలో ముఖ్యపాత్రలు శ్రీకృష్ణుడు, సత్యభామ.

మాదయగారి మల్లన - రాజశేఖర చరిత్ర

మల్లన రాజశేఖర చరిత్ర ప్రబంధాన్ని రాసి, నాదెండ్ల అప్పయామాత్యునకు అంకితమిచ్చాడు. హేమధన్వుని కుమారుడైన రాజశేఖరుడు, సింధురాజు కుమార్తె అయిన

కాంతిమతిని వివాహమాడటం ఈ ప్రబంధంలోని ఇతివృత్తం. ఇది 516 పద్య గద్యాలతో కూడుకొని ఉన్న ప్రబంధ కావ్యం.

ఈ గ్రంథంలో రాజశేఖరునకు, కాంతిమతికిని కాళికాదేవి ఇచ్చిన చిలుక రాయబారం రమ్యంగా ఉంది. ఈ గ్రంథంలో బహువర్ణనలు చోటు చేసుకున్నాయి.

శృంగార రసవర్ణన విషయంలో కవి చాలా నిగ్రహం పాటించాడు. ఈతని శైలి ప్రసాదగుణ భూయిష్టమై చదవటానికి బాగుంటుంది. పాత్రోచితంగానూ, సహజంగానూ భావాల్ని వర్ణించడంలో మాదయగారి మల్లన కడునేర్పరి. మల్లన వర్ణనలు అత్యంత సహజంగా ఉంటాయి. హేమధన్వుని అవంతిక నగర వర్ణనలో మల్లన ప్రతిభా పాండిత్యాలు బాగా కనిపిస్తాయి. ప్రకృతి వర్ణనలో మల్లన అందెవేసిన చేయి. తెలుగు కావ్యాల్లో మంగళ సూత్రధారణను వర్ణించిన తొలి తెలుగు కవి మాదయగారి మల్లన.

ధూర్జటి - శ్రీకాళహస్తి మహత్మ్యము

"స్తుత మతియైన యాంధ్ర కవి ధూర్జటి పల్కులకేల
కల్గెనోయతులిత మాధురీ మహిమ

అని రాయలచే ప్రశంసలు అందుకున్న కవి ధూర్జటి. ఇతడు శ్రీకాళహస్తి మహాత్మ్యము అనే 4 ఆశ్వాసాల ప్రబంధాన్ని రాసి ఈశ్వరునికి అంకితమిచ్చాడు. ఇది క్షేత్ర మహాత్మ్య ప్రబంధము.

క్షేత్ర మహాత్మ్య ప్రబంధాల్లో సర్వసాధారణంగా వస్వైక్యం ఉండదు. ఏకథ కాకథే విడివిడిగా ఉంటాయి. వీర శృంగారాలు అంగరసాలుగా కాళహస్తిపుర వర్ణన చేయబడింది.

ఏనుగు పాముల పోరాటం, కిరాతార్జున సమరం వంటివి వీరరస పోషక నిదర్శనాలు. జంగం కథ, వాణీ చతుర్ముఖుల కథ, శబర కాంత విహారం శృంగారానికి నిదర్శనం. ధూర్జటి శైలి సమాస భూయిష్టమై లలిత పదకోమలమై, రసానుగుణ పద ప్రయోగాలతో కూడి సహృదయ రంజకంగా ఉంటుంది.

ఇందులోని వర్ణనలు సహజంగా ఉండి కవియొక్క ప్రకృతి పరిశీలనా పాటవాల్ని వెల్లడిస్తాయి. తిన్నని కథలోని ఆటవిక జీవిత వర్ణనం, నత్తీరుని కథలోని దుర్భిక్ష వర్ణనం, స్వర్ణముఖీ నదీ ప్రవాహ వర్ణనం చెప్పుకోదగ్గవి.

అయ్యల రాజు రామభద్రుడు - రామాభ్యుదయము

రామభద్ర కవి రామాభ్యుదయమనే 8 ఆశ్వాసాల ప్రబంధాన్ని రాసి, గొబ్బూరి నరసరాజుకు అంకితమిచ్చాడు. దీనికి మూలం వాల్మీకి రామాయణం. ఇందులోని కథ శ్రీరామునికి సంబంధించినది. వర్ణనలు, అలంకారాలు, శైలీ విన్యాసం, కథాకల్పన చాతుర్యం మొదలైన విషయాలు ఈ ప్రబంధంలో చక్కగా పోషించబడ్డాయి. ఇది వీరరస ప్రధానమైంది. శృంగారాది అంగరసాలు ఇందులో ఉన్నాయి. అయ్యలరాజు రామభద్ర కవి తేట తెలుగు మాటలకు ఈ క్రింది పదాన్ని ఉదాహరణగా తీసుకోవచ్చు.

"తోవ తమ్మివిందు గన్దోయి మించినవాడు
జాళువా మిసిమి పచ్చడము వాడు
.....
పేదసాదల బ్రతికించు పెంపువాడు
పాల మున్నీటిలోన జూపెట్టినవాడు"

తెనాలి రామకృష్ణుడు - పాండురంగ మహాత్మ్యము

రామకృష్ణుడు రచించిన 5 ఆశ్వాసాల ప్రబంధం పాండురంగ మహాత్మ్యము. ఇందులో 1302 పద్య గద్యాలు ఉన్నాయి. ఈ గ్రంథంలో పుండరీకుని కథ, నిగమశర్మోపాఖ్యానం, శ్రీకృష్ణావతార చరిత్ర, శ్రీ రాధాదేవి చరిత్ర, కాకి–హంస, పాము చిలుక, తేనెటీగ యోగం కథ, సుశీల అనే పతివ్రత కథ, ధర్మరాజు తమ్ములతో పాండురంగ క్షేత్రాన్ని దర్శించిన కథ, సుశర్మోపాఖ్యానం, అయత నియతులను మునికుమారుల చరిత్ర మొదలైన తొమ్మిది ముఖ్యమైన కథలున్నాయి.

ఇందులో సుశీల కథ, నిగమశర్మ కథ, అయత నియతుల కథ రసవంతమైనవి. అన్నిటిలోనూ నిగమశర్మోపాఖ్యానం అగ్రస్థానం ఆక్రమించింది. రామకృష్ణుని కీర్తికి మూర్తిగా నిలిచింది. రామకృష్ణ కవి పాండురంగ మహాత్మ్యము కమనీయ కవితా రమణీయతకు నిదర్శనం. అందువల్లనే ఈ గ్రంథం ఆంధ్ర పంచకావ్యాల్లో స్థానం సంపాదించుకుంది.

రామకృష్ణ కవి తన కవితా కౌశలాన్ని అద్భుతంగా ప్రకటించి ఇహపరాలు రెంటిని సాధించగలిగాడు. ఆతని భావనా శక్తి అపూర్వం. పదప్రయోగ నైపుణ్యం అప్రతిమానం ధారాశుద్ధి అమోఘం, పాండిత్యం అఖండం.

రామరాజ భూషణుడు (భట్టుమూర్తి) - వసుచరిత్ర

హిమవన్నగ శ్రేణుల్లో ఎవరెస్టు ఎంత ఉన్నతమో, ప్రబంధాల్లో అంతటి ఉన్నతమైన 'వసుచరిత్ర'ను భట్టుమూర్తి రాసి రామరాజు తమ్ముడైన తిరుమల దేవరాయలకు అంకితమిచ్చాడు. రామరాజ భూషణుడు ఈ కథను నన్నయ రచించిన భారతం నుండి తీసుకున్నాడు. వసుచరిత్ర చక్కని నామౌచిత్యము గల ప్రబంధ రాజము.

8మంది వసువులలో ఒకడగు వసురాజు యొక్క చరిత్ర ఇందులో వర్ణించబడింది. వసుచరిత్రలో వర్ణనల్ని, కల్పనల్ని చేర్చి కమనీయమైన కావ్యంగా తీర్చిదిద్దాడు భట్టుమూర్తి.

శుక్తిమతి, కోలాహలుల కథే వసుచరిత్రలో ఒక అవాంతర గాధ. కవి కొండను నాయకునిగా, నదిని నాయికగా చేశాడు. ఈ గ్రంథంలో ఔచిత్యం చెడకుండా అభాస శృంగార రసం చక్కగా పోషించబడింది. ఇందులో అర్థధ్వని, శ్లేషధ్వని, రసధ్వని మనకు కనిపిస్తాయి. ఆంధ్ర వాఙ్మయానికి అలంకారమని చెప్పదగిన గ్రంథం వసుచరిత్ర.

పింగళి సూరన - కళా పూర్ణోదయము

పింగళి సూరన కీర్తిసౌధమునకు మూలస్తంభమని చెప్పదగిన గ్రంథం 'కళాపూర్ణోదయము'. ఇది స్వతంత్ర గ్రంథం. కల్పిత కథా వస్తువైనా అద్భుత కథా కావ్యం. ఈ ప్రబంధంలోని సంఘటనలు సంభాషణా రూపంలోనూ, నాటకీయ శైలిలోనూ ఉంటాయి. శిల్ప సౌందర్యానికి ప్రతిబింబం ఈ కళాపూర్ణోదయము.

ప్రబంధ కవులలో ఉన్న వర్ణనా శక్తితోపాటు వారిలో లేని కథా కల్పనా శక్తి, భావనా శక్తికి తోడు భాషా శక్తి కూడా సూరనకు ఉంది. అందులకీ మంచి పద్యం ఉదాహరణ.

"చలువగల వెన్నెలల చెలువునకు సౌరభము
గలిగినను సౌరభము చలువ యుదలిర్పం
బొలుపెసగు గప్పురపు పలుకులకు గోమలత..."

కథా సంవిధానం, పాత్ర చిత్రణం, శైలీ నిర్వహణం, రచనా ప్రౌఢిమా మొదలైన విషయాల్లో సూరన మార్గాలు అవలంభించి కొత్తవారికి ఆదర్శుడైనాడు.

ముగింపు

ఆంధ్ర దేశమున రాజకీయ కల్లోలములను రూపుమాపి శాంతి సౌఖ్యములను కలిగించిన మహానుభావుడు శ్రీకృష్ణదేవరాయలు. దేశము సుభిక్షమైంది. ప్రజలు సుఖ సంతోషాలను అనుభవించు చున్నారు. కనుకనే నాటి కవుల నవ నవోన్మేష ప్రతిభలు ఉన్నత పధమున పురోగమించ గల్గినవి కనుక ఈ యుగము ప్రబంధమను నూతన ప్రక్రియకు స్థానము కల్పించినది. సాహితీ సమరాంగణ సార్వభౌముని "ఆంధ్ర భోజుడు" అని కీర్తించినదీ ప్రపంచం.

రాయల భువన విజయ సభా భవనము కళాపోషక కేంద్రమైనది. కావుననే ఈ యుగమున ప్రబంధ రూపముగా స్వతంత్ర కావ్యములు అనేకములు అవతరించి ఆంధ్ర సాహిత్యము పరిపుష్టమైనది.

మహాభారతంలో రాజనీతి

కె. సుజన, (పి. హెచ్.డి తెలుగు), యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్.

సమాజం కాలక్రమేణ అనేక మార్పులతో క్రోత్తదనం సంతరించుకుంటుంది. ప్రజల్లోనూ ప్రజా పరిపాలకుల్లోనూ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. నమకాలీన పరిస్థితులుకు అనుగుణంగా మనం మన అభిప్రాయాలను, అలవాట్లనూ మార్చుకుంటున్నాము . ఎటువంటి మార్పులు వచ్చినప్పటికి ప్రజలను పరిపాలించడంలో రాజు అనుసరించడంలో మెలకువలను, రాజనీతి శాస్త్రాలలోని విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని అమలు పరిస్తే ప్రజారంజకంగా పరిపాలన కొనసాగుతుంది. ఆ రాజనీతి విశేషాలు అతి ప్రాచీన గ్రంథమైన మహాభారతం నుండి కొన్ని విషయాలను తెలుసుకునే ప్రయత్నం చేద్దాం."మనకు లభించిన మహొన్నతమైన ఇతిహాస గ్రంథాలు రామాయణ, మహాభారతాలు. ఇందులో మహాభారతం ఒక ప్రపంచాన్ని తనలో ఇముడ్చుకుందా అనిపిస్తుంది. సృష్టి తత్వం పై తేలియాడుతున్న మానవ మనస్తత్వాలన్నిటినీ పద్దెనిమిది పర్వాల్లో సర్దుకునేటట్లు చేసాడా వ్యాసభగవానుడు అనిపిస్తుంది. సృష్టిలో ఉన్న మనస్తత్వాలన్నీ ఇందులో ఉన్నాయి ఆ మనస్తత్వాలన్నీ దేని కోసం వెతుక్కుంటున్నాయో దేని కోసం మథన పడుతున్నాయో ఎలాంటి స్థితిలో సుఖపడుతున్నాయో ఎలా ఉన్నప్పుడు దుఃఖాల పాలవుతున్నామో జరిగిన కథను జరిగినట్లు చెపుతూ దర్శింపచేస్తాడు వ్యాసుడు. అని మోపిదేవి కృష్ణ స్వామి, భారతం ధర్మాద్వైతం వ్యాస నిదర్శనం, తిక్కన సందర్శనం. లో తెలియజేస్తారు.

పై విషయాలను పరిశీలిస్తే మహాభారతం మానవుని ప్రతి కదలికను వారి ఆలోచనలను తనలో ఇనుమడింప చేసుకుంది. మన ప్రవర్తన సన్మార్గంలోకి తీసుకువెళ్ళి మన కర్తవ్యాన్ని గుర్తుచేస్తుంది. మహా భారతంలోని ప్రతి మాట హృదయాంతరాలలోకి ప్రవేశించి మన లక్ష్యాన్ని ఛేదించేట్లు ప్రోత్సాహాన్ని అందిస్తుంది. అనే విషయాలు స్పష్టమవుతున్నాయి.

మహాభారతం రాజనీతి :

మహాభారతంలోని రాజనీతిని చర్చించేముందు అసలు రాజు అనేవాడు ఎలా పుట్టాడు అనే విషయాన్ని కూడా చర్చించుకోవలసిన అవసరం ఉంది. ఈ విషయం గురించి మహాభారతం శాంతి పర్వంలోనే ధర్మరాజు భీష్ముడుని అడుగుతాడు. రాజు అనే శబ్దం ఎలా పుట్టింది? శూరులు వీరులు, ఆర్యులతో కూడిన భూమినంతటిని రాజు ఒక్కడూ ఎలా రక్షించగలుగుతున్నాడు? లోకులు అతని యెడల ప్రసన్నులై ఉండాలని ఎలా అనుకుంటాడు? వంటి అనేక ప్రశ్నలను అడుగుతాడు దానికి భీష్ముడు చెప్పనారంభించాడు. మొదట రాజ్యము లేదు, రాజు లేడు, దండం లేదు, దండించే వాడు లేడు ప్రజలందరూ ధర్మంతోనే ఒకరినొకరు రక్షించుకునే వారు. కొంతకాలానికి చాలా దుఃఖం పొందారు. వారికి మోహం ఆవేశించింది. మోహవశులైన ఆ మానవులలో సరైన జ్ఞానం పోయింది. దానితో వారిలో ధర్మం నశించింది. జ్ఞానం నశించి మోహ పరవశులయిన నరులు అందరూ లోభానికి వశులయ్యారు. దానితో మానవులు లభించని దానిని పొందడం కోసం ఎగబడ్డారు. దానితో ప్రజలు పొందరాని స్త్రీలను పొందడం, ఇది తప్పు ఇది ఒప్పు అని తెలియకపోవడం. ఇలా సమాజం అంతా అల్లకల్లోలం అయిపోయింది. అప్పుడు వేదం, ధర్మం నశించడంతో దేవతలంతా బ్రహ్మ దగ్గరకు వచ్చి శరణు వేడారు. అప్పుడు బ్రహ్మ తన బుద్ధి నుండి లక్ష అధ్యాయాల శాస్త్రం రచించాడు. ఇందులోనే సర్వరాజ్య పరిపాలనకు సంబంధించిన విషయాలన్ని ప్రస్తావించబడ్డాయి. ఇందులో కొన్నింటిని గమనిస్తే మంత్రుల రక్షణ, రాజదూత, రాజవుత్రుని లక్షణం గూఢచారుల విచారణకు

గూఢచారులను నియమించడం, చెప్పబడ్డాయి. సామ, భేద, దానం, దండం, ఉపేక్ష అనే అయిదు ఉపాయాలు సంపూర్ణంగా చెప్పబడ్డాయి. పౌరుల రక్షణ, రాష్ట్రం అభివృద్ధి పరచడం, ఒక్కొక్క మండలంలో 12 మంది రాజులను నిలపడం డెబ్బది రెండు చికిత్సా విధానాలు, దేశ, జాతి కులాల ధర్మాలు వర్ణించాడు. లక్ష అధ్యాయాల శాస్త్రాన్ని అందించినప్పటికి లోకహితం కోసం ధర్మ స్థాపన కోసం సరస్వతి దేవి ఈ నా బుద్ధిని ప్రభావితం చేసింది అని బ్రహ్మ చెప్తాడు. దండ నీతి ముల్లోకాలలోనూ వ్యాపించింది బ్రహ్మ నుండి శివుడు ప్రజల ఆయువు తగ్గిపోతుందని తెలుసుకుని శివుడు బ్రహ్మచేసిన శాస్త్రాన్ని సంగ్రహంగా వ్రాసాడు. దాని పేరు 'వైశాలాక్షం', దానిని ఇంద్రుడు గ్రహించాడు., పదివేల అధ్యాయాలున్న ఆ మహాశాస్త్రాన్ని ఇంద్రుడు ఐదు వేల అధ్యాయాలలో సంక్షేపించాడు దాని పేరు 'బహుదంతకం', తర్వాత బృహస్పతి ఆ శాస్త్రాన్ని మూడు వేల అధ్యాయాలతో సంక్షపేంచాడు. దాని పేరు బార్హస్పత్యం'. తర్వాత శుక్రాచార్యుడు దానిని వేయి అధ్యాయాలతో సంగ్రహం చేసాడు. ఇలా రాజనీతి పుట్టుకువచ్చింది. విష్ణువు, ఇంద్రుడు, దేవతలు, మహర్షులు ప్రజాపాలకులు, బ్రాహ్మణులు అంతా వేనుని కుమారుడు పృథువుకు రాజ్యాభిషేకం చేసారు. ఇలా రాజు పుట్టుకు వచ్చాడు. నేడు భారతీయ ప్రజాస్వామ్యము రాజ్యమునకు ఆదర్శ ప్రాయులములగు అంశాలు భారతంలో అనేకం కలవు నామ రూపాలు మారినను దేశ కాలములు మారినను. ఆనాటి రాజనీతి విధానం ఈ నాటికి అనేక విధముల అనుసరింపబడుతూనే ఉంది. భారతం శాంతి పర్వంలో

యథా రాజన్ హస్తి పదే పదాని
సంతియంతే సర్వసత్త్వోద్భవాది
సర్వే ధర్మా రాజధర్మేషు యుక్తాః
సర్వేలోకాః రాజ ధర్మే ప్రవిష్టాః

"ఏనుగు యొక్క అడుగు నందు తక్కిన జంతువుల పాదములన్నియును ఇమిడిపోవునట్లు రాజధర్మమునందు సమస్త ధర్మములు ఒదిగి పోవుచున్నది.

ఈ విషయాలు కుటుంబం యొక్క యోగ క్షేమాలు ఇంటి యజమాని ఏ విధంగా చూసుకుంటాడో రాజ్యంలోని ప్రజల కదలికల్ని వాని అవసరాలను తీర్చకలిగేది రాజు ఒక్కడే.అందుకే " భారతం రాజనీతి విశేషాలు పుస్తకంలో సంధ్యావందనం గోదావరిబాయి గారు ఈ విధంగా అంటారు. "ఒక ప్రత్యేక కుటుంబ చరిత్రనాధారంగా గాని ఆ కాలం నందలి సమగ్ర జీవిత విధానమును చిత్రీకరించు చున్నది. ఈ ఇతిహాసము భారత వంశ మహారాజుల చరిత్ర ఇది. ధర్మాధర్మములకు, సత్యాసత్యముకు జరుగు సంఘర్షణయే ఈ ఇతి వృత్తం.

చేదు రుచి తెలిస్తేనే తీపు యొక్క మాధుర్యం అనుభవించగలం తియ్యదనం యొక్క గొప్పదనం తెలుస్తుంది. భారతంలో అధర్మం యొక్క పునాదుల్ని ధర్మం ఏ విధంగా పెకలించి తన స్థిరత్వాన్ని నిలుపుకుందో భారతంలో మనం గమనించవచ్చు.

సంధ్యావందనం గోదావరి బాయి భారతంలో రాజనీతి విశేషాలు లో " ఒక ఉన్నత జాతి ఆత్మాభిమానం గల జాతి వివిధ వ్యక్తిత్వములతో నిండిన జాతి, సజీవ చైతన్యము గల జాతి, ఆ జాతి జీవనము ఆ జాతి రాజకీయ చైతన్యము పలు పోకడలను ఈ భారతములో దర్శింపవచ్చు".

ఈ విషయాలను గమనిస్తే వ్యక్తి గత చైతన్యంతో పాటు సమాజ చైతన్యాన్ని కలిగిస్తుంది భారతం. ప్రధానంగా రాజనీతి మన పరిపాలనా విధానంలోని లోటుపాట్లను పరోక్షంగా తెలియజేస్తూనే రాజు యొక్క సర్వలక్షణాలు నేటి పరిపాలకులు అనుసరిస్తే కలిగే ప్రయోజనాలు ఎలా ఉంటాయో కూడా భారతంలో మనం గమనించవచ్చు.

ధర్మారాజుకు భీష్ముడు చెపుతున్నాడు. ఎవరయినా రాజు యొక్క ధనం వృద్ధి చేస్తే రాజు వానిని సదా రక్షించాలి. రాజు యొక్క ధనాన్ని మంత్రి అపహరిస్తూ ఉండడం సేవకుడూ, మరొకడో చూసి రాజుకు చెపితే అది రాజు రహస్యంగా వినాలి. వెంటనే అతనిని మంత్రినుండి రక్షించాలి. మంత్రి ఇంకా అపహరించే వాళ్ళూ కలిసి ఈ

చెప్పిన వానిని చంపేస్తారు, అలాగే కోశాధికారిని కూడా రక్షించాలి అతనిని రక్షించకపోతే రాజధనం అపహరించే వాళ్లంతా కలిసి కోశాధికారిని బాధిస్తారు. అని చెపుతూ దానికి ఉదాహరణగా కాలకవృక్షీయము అనే కథను చెప్తారు, కాలకవృక్షీయుడు అనే ముని కోసల రాజుతో చెప్పిన కథను తెలియజేస్తాడు. ఆ కథలో కోసల రాజ్యం క్షేమదర్శికి సంక్రమించింది. అప్పుడు క్షేమదర్శి దగ్గరకు కాలకవృక్షీయ ముని వచ్చాడు. అతడు ఒక కాకిని పంజరంలో బంధించి ఒక పని కోసం క్షేమ దర్శియొక్క రాజ్యంలో మాటిమాటికి తిరుగుతున్నాడు. అయ్యా ఈ కాకి విద్యను నేర్చుకోండి నా కాకులు భూత భవిష్యత్ వర్తమానాలు చెపుతాయి. ఇలా చెపుతూ చాలామందితో కలిసి రాష్ట్రం అంతా తిరుగుతూ రాజుద్యోగుల చెడ్డపనులన్నీ ఆ ముని చూస్తాడు. కోసల రాజును చేరి అలంకారాలు ధరించిన మంత్రి ఎదుట కాకి మాటగా నీవు రాజు కోశాగారం దొంగిలించావు వీడు ఎరుగును వీడు ఎరుగును అని కాకి చెప్తుంది. రాజధనం అపహరణ కు గురైన విషయం నిజమని తెలిసి రాజోద్యోగులు తిరస్కరించబడుతారు. వారంతా చీకట్లో నిద్రిస్తున్న అతని కాకిని పంజరంలోనే బాణాలతో పొడిచి చంపుతారు. అది చూసి బ్రాహ్మణుడు రాజుకు కొన్ని రాజనీతి విషయాలు తెలియజేస్తాడు. హితులెవరో, శత్రువులెవరో తెలుసుకోండి నీ భవనంలో ఉండి నీ నుండి దొంగలించే వారిని గురించి అటువంటి వారిని ఉద్దేశించి చెపుతున్నాను. వారు ప్రజల ఐశ్వర్యాన్ని కోరరు. నీ వినాశం చేత నీ తరువాతి రాజ్యం కోరే వాడుంటే నీ ఆంతరంగికుల వల్లనే ఆ వినాశం సిద్ధిస్తుంది. అంటూ చాలా విషయాలను తెలియజేస్తాడు. (సంస్కృత భారతం,శాంతి పర్వం,)

ఈ విషయాలన్నీ రాజు నిరంతరం మెలకువతో ఉంటూ తననూ తన ధనాగారాన్నీ పరిశీలన చూస్తూ ఉండాలి ఎంత నమ్మకస్తుడైనా సరే పూర్తిగా నమ్మకుండా తన బుద్ధి తో రాజ్యాన్ని పరిపాలించాలని, ప్రత్యక్షంగా , పరోక్షంగా రాజ్యంలోని రహస్యాలను తెలుసుకుంటూ రాజ్యాభివృద్ధికి తోడ్పడాలని అర్థమవుతుంది.

రాజనీతికి సంబంధించిన కథలు, రాజనీతి విషయాలు భారతంలో చాలా కనిపిస్తాయి. అనుశాసనిక పర్వంలో శివపార్వతుల సంవాదంలోనూ శివుడు పార్వతికి రాజధర్మాలను తెలియజేస్తాడు, అలాగే ధృతరాష్ట్రుడు అరణ్యాలకు వెళుతూ ధర్మరాజుకు రాజనీతి విషయాలను ఎలా పరిపాలించాలో కొన్ని సూచనలను, తెలియజేస్తాడు. రాజుకు పురోహితుడు కూడా ప్రధానమైన వాడు అని, ప్రజా పాలనకు బ్రాహ్మణుల సూచనలు కూడా విజయాన్ని అందిస్తాయని చెపుతూ ఉదాహరణగా ఐల కశ్యప సంవాదము, ముచకుందోపాఖ్యానము వంటి కథలు వివరిస్తాయి.

ఆధార గ్రంథాలు:

1. రామకృష్ణ మూర్తి, తిప్పాభట్ల, శ్రీనివాసులు, సూరం.(సంపాదకులు), శ్రీ మహాభారతం (సంస్కృతం), శాంతి పర్వము, ఆరవ భాగము, గీత ప్రెస్, గోరఖ్ పూర్, 2019.
2. కృష్ణస్వామి, మోపిదేవి, భారతం ధర్మాద్వైతం, వ్యాస నిదర్శనం, తిక్కన సందర్శనం, (సి.వ్యా) ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ ప్రచురణ (ప్ర.ము), 1981,
3. సంధ్యావందనం గోదావరి బాయి, భారతములో రాజనీతి విశేషాలు, తిరుమల తిరుపతి దేవస్థానం (ప్రచురణ).

నీతిశతకాల్లో మానవీయ విలువలు

డా॥ బి. సునీత, తెలుగు అధ్యాపకురాలు, కాకతీయ ప్రభుత్వ కళాశాల, హన్మకొండ

సాహిత్యం అంటే హితాన్ని కల్గించేది. మేలును చేకూర్చేది. మన పూర్వీకులు ఇతిహాసాల ద్వారా, పురాణాల ద్వారా, కావ్యాలు, ప్రబంధాలు, నాటకాలు మొదలైన సాహితీ ప్రక్రియల ద్వారా సమాజ హితాన్ని కోరుకున్నారు.

తెలుగు సాహిత్య ప్రక్రియలలో ఒకటైన శతక ప్రక్రియ ద్వారా శతక కర్తలు మన మూలాలను, మంచి చెడులను, మానవుల ప్రవర్తనా సరళిని గురించి వివరంగా చిన్న చిన్న వాక్యాలలో శతక పద్యాలలో జీవనసారాన్ని, జీవిత విలువలను అందించారు.

తెలుగు సాహిత్యములో శాఖోపశాఖలుగా వికాసము పొందిన సాహిత్య ప్రక్రియలలో శతకం ఒకటి. సంస్కృత, ప్రాకృత సాహిత్యాలను అనుసరించి తెలుగు శతకం ప్రారంభమై కాలక్రమంగా విశిష్టసాహిత్య ప్రక్రియగా రూపొందింది. తెలుగులో శతక ప్రక్రియ పన్నెండవ శతాబ్దంలో ప్రారంభమయింది. తెలుగు శతక రచన స్వరూపంలోను, స్వభావంలోను ఎంతో మార్పు పొందింది. ఇతర ఏ భారతీయ భాషలోను శతక ప్రక్రియ తెలుగులో వలె బహుముఖ వికాసం పొందలేదు.

"శతేన శతకం ప్రోక్తమ్" అనే నియమం అనుసరించి శతక కర్తలు శత సంఖ్య గల శతకాలు రచిస్తున్నారు. శతకంలోని పద్యాలు ముక్తకాల వంటివి. ఏ పద్యానికి ఆ పద్యమే తప్ప, ఒక పద్యానికి మరొక పద్యానికి అన్వయం ఉండదు. పద్యాలు వేటికవి స్వతంత్రాలు.

శతకాలు భావ ప్రధానాలు. శతక పద్యరచనలో కవులు ఆత్మానుభూతిని వ్యక్తీకరించే అవకాశం ఉంటుంది. వస్తువును బట్టి భక్తి, నీతి, శృంగార, వైరాగ్య, హాస్య, దేశభక్తి, రాజకీయ శతకాలుగా విభజింపవచ్చును.

మానవ జీవన విధానంపై లోకానుభవంతో వ్యాఖ్యానించే శతకాలు నీతి శతకాలు. నీతి శతకాలలో రాజనీతి, గృహనీతి, లోకరీతి ముఖ్య వస్తువుగా ఉంటుంది. సమాజ హితం కోరుతూ రచించిన నీతి శతకాలు సర్వజనామోదంగా ఉంటాయి. సుమతీశతకం, వేమన శతకం, భాస్కర శతకం, కుమారీ శతకం, గువ్వల చన్నశతకం, ఆధునిక వేమనశతకం మొదలైనవి నీతిశతకాలుగా తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధినొందాయి.

"మానవుడు సంఘజీవి" అన్నాడు అరిస్టాటిల్. సమాజంలో నివసించే మానవుడు తోటి మానవులతో సత్సంబంధాలు తప్పనిసరిగా కలిగి ఉండాలి. అలా ఉండాలంటే తాను ముందుగా నైతిక దృక్పథం కలిగి ఉండి అవినీతి, స్వార్థము, అహంకారము, అన్యాయము, అధర్మము మొదలగు చెడు లక్షణాలు దరిచేరనీయకుండ నీతి, నిజాయితి, సత్యం, ధర్మం, న్యాయం మొదలైన సద్గుణాల ద్వారా సమాజంలోని తోటివారితో జీవనాన్ని కొనసాగించాలి.

తెలుగు సాహిత్యములో అనేకమంది శతకకారులు గొప్ప సూక్తులను నీతులను అలతిఅలతి పదాలతో అన్వయక్లేశం లేకుండ సమాజానికి అందించారు. మంచి, నీతి, నిజాయితి ఇలాంటి సద్గుణాలు వ్యక్తులను తొందరగా ఆకర్శించలేవు. చెడు అనేది ఇతరులను తొందరగా వశపర్చుకుంటుంది. మంచిని, నీతిని ఆచరించడం చాలా కష్టంగాతోస్తుంది. ఇలాంటి సందర్భంలోనే 'నిజం ఎప్పుడూ నిష్టూరంగా ఉంటుంది" అనే సామెత కూడ మనకు గుర్తుకు వస్తుంది.

నీతిశతకాలలో ప్రథమ స్థానంలో నిలిచేవి సుమతీ శతకం, వేమన శతకం, భర్తృహరి సుభాషితాలు.

నీతి శతకాలలో శతకకర్తలు జీవితసత్యాలను బోధించారు. మానవులు జీవితంలో ఎవరు ఎవరితో, ఏ సందర్భంలో ఎలా ప్రవర్తించాలి అనే విషయాన్ని స్పష్టంగా

తెలియచేశారు. మన ఉనికిని ఎలా కాపాడుకోవాలి అని తక్కువ పదాలతో ఎక్కువ అవగాహనను నీతి పద్యాల ద్వారా కల్పించారు శతకకారులు.

తెలుగు సాహిత్యంలలోని నీతి శతకాలలో సుమతీ శతకం 'ఇల వేల్పు' వంటిది. సమాజంలోని వ్యక్తుల రీతులు, అభిరుచులు మారినా సుమతీశతకం మాత్రం తరతరాలుగ అందరిని అలరించి నీతిని అందిస్తూనే ఉన్నది.

సుమతీ శతక కర్త బద్దెన అక్కరకు రాని చుట్టాన్ని వదిలేయమన్నాడు. అప్పుచేసి పప్పుకూడు తినవద్దన్నాడు. అమ్మా అని ఆప్యాయంగా పిలవని నోరు నోరే కాదన్నాడు. మనకు అపకారం చేసిన వారికి తిరిగి ఉపకారం చేయడం మానవత్వం అన్నాడు. బంధువులు, స్నేహితులు ఎలా ఉంటారో తెలియచేశాడు

ఎప్పటికెయ్యది ప్రస్తుత
మప్పటికా మాటలాడి యన్యుల మనముల్
నొప్పింపక తానొవ్వక
తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ.

ఈ పద్యంలో బద్దెన సందర్భానికి తగ్గట్టుగా మాట్లాడి ఇతరుల మనసు నొప్పించకుండ తాను బాధపడకుండా ఉండాలంటాడు. ఒకవేళ తన మాటల ద్వారా తాను, ఇతరులు బాధపడేటట్లు ఉంటే ఆ ప్రదేశం నుండి దూరంగా తప్పించుకు వెళ్ళటమే మంచిదంటాడు కవి.

కొడుకు పుట్టినపుడు తండ్రి మిక్కిలి సంతోషిస్తాడు. అయితే నిజమైన సంతోషం ఎప్పుడు కల్గుతుందో ఈ పద్యంలో వివరించారు.

"పుత్రోత్సాహము తండ్రికి
పుత్రుడు జన్మించి నపుడె పుట్టదు జనులా
పుత్రుని గనుగొని పొగడగ
పుత్రోత్సాహము నాడు పొందురసుమతీ'.

ఇందులో తండ్రికి పుత్రుడు పుట్టిన సమయంలో కల్గిన ఆనందం కన్నా ఆ పుత్రుడు పెరిగి పెద్దవాడై సమాజానికి ఉపయోగపడే పనులు చేస్తే ఇతరులు ఆ పనులను చూసి మెచ్చుకొని పొగిడినపుడు తండ్రికి నిజమైన ఆనందము కలుగుతుంది అన్నారు కవి.

కమలములు నీటబాసిన
కమలాప్తుని రశ్మిసోకి కమలిన భంగిన్
తమ తమనెలవులు తప్పిన
తమ మిత్రులు శత్రులౌట తథ్యము సుమతీ.

ఇందులో శతకకర్త మానవుల ప్రవర్తన ద్వారా మిత్రులుగా ఉన్నావారు శత్రువులుగా మారతారని చెబుతూ కమలాలను ఉదహరించారు. నీటిలో ఉన్నపుడు సూర్యకిరణాలు సోకగానే విచ్చుకునే కమలాలు, నీటిలో లేనపుడు సూర్యకిరణాలు సోకితే వాడిపోతాయి. కాబట్టి మానవులు బంధాన్ని నిలుపుకోవడానికి ప్రయత్నించాలి.

ఇలా సుమతీ శతకంలో వివిధరకాలైన నీతులు మనోజ్ఞంగా కూర్చబడ్డాయి. ఈ శతక పద్యాల్లో గంభీరమైన సత్యాన్ని సామాన్యంగా చెప్పడం జరిగింది.

వేమన ప్రజాకవి లోకకవి. వేమన మానవుల మధ్య తిరుగుతూనే జీవిత సత్యాలను నిత్యాన్వేషణ దృష్టితో దర్శించి విమర్శించిన వివేకి. వేమన మానవతావాదిగా ఉన్నతమైన ధర్మాన్ని చెప్పారు.

"చంపదగిన యట్టి శత్రువు తన చేత
జిక్కెనేని కీడు చేయరాదు
పొసగమేలు చేసి పొమ్మనుటే చాలు
విశ్వదాభిరామ వినురవేమ"

ఇందులో మనకు అపకారం చేసిన శత్రువుకు కూడ మనకు తోచిన మేలు చేయమంటాడు. కాని ప్రతీకారం తీర్చుకోవద్దంటాడు.

మానవ స్వభావాన్ని, మానసిక ప్రవృత్తులని జీవన విధానాల్లోని మంచి చెడుల్ని లోతుగా పరీక్షించి తన పద్యాల ద్వారా జీవితంపై అవగాహన కల్పిస్తాడు వేమన.

"ఆత్మశుద్ధిలేని ఆచార మదియేల
భాండశుద్ధి లేని పాకమేల
చిత్తశుద్ధిలేని శివపూజ లేలరా
విశ్వదాభిరామ వినురవేమ"

ఇందులో ఆచారాలను పాటించేవారు ముందుగా ఆత్మనుశుద్ధి చేసుకోవాలంటాడు. ఏ పని చేసినా మనస్ఫూర్తిగా, నిర్మల హృదయంతో చేయాలంటారు వేమన.

అల్పుడెపుడు పల్కు నాడంబరము గాను
సజ్జనుండు పల్కు చల్లగాను
కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా
విశ్వదాభిరామ వినుర వేమ.

ఈ పద్యంలో వేమన గొప్పలు చెప్పుకున్నంత మాత్రాన గొప్పవాళ్ళవుతారా. వినయు ఉండాలి మిడిసిపాటు చేటు అంటూ బంగారాన్ని, కంచును ఉదహరించడం జరిగింది.

వేమన సమాజమనే మేడిపండును పొట్టవిప్పి చూపించాడు. సమాజంలో జరిగే అన్యాయాలకు, దుర్మార్గాలకు కారణాలను అన్వేషించాడు. అప్పు లేని వాడిని అధిక సంపన్నుడిగా మెచ్చుకున్నాడు. ఆశతో ధనమును సంపాదించకూడదన్నాడు. మంచివారితో స్నేహము వలన శాంతము, శాంతము వలన మనోనిశ్చలత కల్గుతుందన్నాడు. స్వానుభూతి, సాదన లేకుండ ముక్తి కోసం వెదకడం వ్యర్థమన్నాడు. మనసు తెలియువాడు మర్మజ్ఞుడు అని స్పష్టం చేశాడు. మనిషి మానవత్వం ద్వారానే దైవాన్ని చేరగలడని, మానవతని మించిన మతం లేదని ఎలుగెత్తి చాటాడు వేమన.

ఏనుగు లక్ష్మణకవి అపూర్వమైన తన అనువాద శిల్ప చాతుర్యంతో భర్తృహరి సుభాషితాలను తెలుగువారికి అందించాడు.

"ఆపదలందు ధైర్యగుణ మంచిత సంపదలందు దాల్మియున్
భూపసభాంతరాళమున ఋష్కుల వాక్చతురత్వమాజి బా
హా పటుశక్తియున్, యశమునందను రక్తియు విద్యయందు వాం
ఛా పరివృద్ధియున్ బ్రకృతి సిద్ధ గుణంబులు సజ్జనాళికిన్".

ఈ పద్యంలో ఆపదలు వచ్చినపుడు కుంగిపోకుండ ధైర్యం కలిగి ఉండాలి. ఐశ్వర్యంలో ఉన్నప్పుడు అహంకారంతో ప్రవర్తించకుండ ఓర్పు కలిగి ఉండాలి సభలు, సమావేశాల్లో వాక్చాతుర్యం కలిగి ఉండాలి. యుద్ధంలో శౌర్యపరాక్రమాలు ప్రదర్శించాలి. కీర్తి పట్ల ఆసక్తి మొదలైనవి స్వభావగుణముగా ఉండాలని లక్ష్మణకవి స్పష్టంచేశారు.

నీతిమార్గంలో ప్రయాణించే వారు సంపదలు వచ్చినప్పటికి, పోయినప్పటికి నిందలు వచ్చినా, పొగడ్తలు వచ్చినా, మరణం ఆసన్నమవుతున్నా తాము నమ్ముకున్న మార్గాన్ని దాటి ఒక్క అడుగు కూడ దాటరు.

విద్యను ఎవరూ దొంగిలించలేరు. పంచేకొద్దీ పెరుగుతూనే ఉంటుంది. కాని తరగదు. ఎల్లప్పుడు సుఖాన్ని ఆనందాన్ని ఇస్తుంది. సంఘంలో హోదాను, గౌరవాన్ని, కీర్తిని ఇస్తుంది. ఇంత గొప్ప విద్య అనే సాధనాన్ని మనం సాధించాలి. ఇటువంటి విద్యను ఎలా పొందాలో కుమారశతక కర్త ఇలా చెప్తాడు.

"పనులెన్ని కలిగియున్నను
దినదినమున విద్యపెంపు ధీయుక్తుడవై
విన గోరుము సత్కథలను
కని విబుధులు సంతసించుగతిని కుమరా"

ఎన్ని పనులున్నప్పటికి ప్రతిరోజు మంచి తెలివి తేటలతో విద్యను పెంచుకోవాలని, సత్కథల ద్వారా జ్ఞానాన్ని పొందాలని కవి తెలియచేశారు.

ఇలా చదివి జ్ఞానాన్ని పెంచుకున్న తర్వాత ఎలా ప్రవర్తించాలో భాస్కర శతక కర్త ఇలా చెప్పారు.

"చదువది ఎంత గల్గిన రసజ్ఞత ఇంచుక చాలకున్న నా
జదువు నిరర్థకంబు గుణ సంయుతులెవ్వరు మెచ్చ రెచ్చటం
బదునుగ మంచికూర నలపాకము చేసిన నైన నందు నిం
పొదవెడు నుప్పు లేక రుచిపుట్టగ నేర్చునటయ్య భాస్కరా !

ఎంత చదువు చదివినా ఎవరితో ఎలా ప్రవర్తించాలో తెలియకపోతే ఆ చదువు వల్ల ప్రయోజనం లేనట్లే. విలువలు అందించే విద్య ద్వారానే మనం సమాజంలో ఉన్నతమైన స్థితిలో ఉండగలుగుతాం.

ముగింపు : తెలుగు సాహిత్యంలో 12వ శతాబ్దంలో ప్రారంభమైన శతక ప్రక్రియకు ఆద్యులు శివకవులు. శతక ప్రక్రియ ప్రారంభమైన నాటి నుండి నేటి వరకు సజీవ స్రవంతి వలె అవిచ్ఛిన్నంగా సాగుతూ వస్తున్నది శతక రచన. తెలుగునాట పండిత పామరులనే తారతమ్యం లేక పిల్లలు, పెద్దలు అనే తేడా లేక బహుళ ప్రచారమునొందినది శతక సాహిత్యము. ముఖ్యంగా సుమతీశతకం, వేమన శతకంలోని పద్యాలు తెలియని తెలుగువారు లేరంటే అతిశయోక్తి కాదు. నీతి శతకాల పద్యాలలో శతకకర్తలు తెలిపిన చాలా విషయాలు మానవ జీవన నైపుణ్యాలను పెంచుకోవడానికి, సత్ప్రవర్తన ఆలవచ్చుకోవడానికి, మానవ సంబంధాలు పదిలపరుచుకోవడానికి, మానవతా విలువలు నిలుపు కోవడానికి దోహదం చేస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య చరిత్ర – డా॥ ద్వా.నా. శాస్త్రి
2. భర్తృహరి సుభాషితము – ఏనుగు లక్ష్మణకవి
3. వేమన పద్యరత్నాకరము – బులుసు వేంకటరమణయ్య
4. భాస్కర శతకము – మారద వెంకయ్య

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం – ముందడుగు, మా భూమి నాటకాల పాత్ర

డా॥ లావూరి విజయ, సహాయ ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఆర్ట్స్ & కామర్స్) నాగర్‌కర్నూల్.
సెల్ : 9505480828

సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కర్‌రావులు రాసిన ముందడుగు (1945), మా భూమి (1946) నాటకాలు రావడానికి అప్పటి హైద్రాబాద్ సంస్థానంలోని రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక విషయాలు కారణ మయ్యాయి.

భూమి మనిషికి ఆహారాన్ని, ఆత్మగౌరవాన్ని ఇస్తుంది. కాని స్వాతంత్ర్యానికంటే ముందు తెలంగాణలో ఆ భూమి కొద్దిమంది చేతుల్లోనే ఉండేది. నిజాంతోపాటు సంస్థానంలో పైగాలు, జాగీర్‌దార్లు, సంస్థానాలు, మక్తాలు, ఇజారాదార్లు, బంజరుదార్లు, ఇనాందార్లు, దేశ్‌ముఖ్‌లు, పటేల్‌లు, అగ్రహారికుల చేతుల్లో ఉండేది. నల్లగొండలో మరీ ఎక్కువగా ఉండేవారు. "ఉదా: విసునూరు దేశ్‌ముఖ్ – 40 వేల ఎకరాలు, సూర్యాపేట దేశ్‌ముఖ్ – 20 వేల ఎకరాలు, మిర్యాలగూడ దేశ్‌ముఖ్ – 10 వేల ఎకరాలు, కల్లూరు దేశ్‌ముఖ్ లక్ష ఎకరాలు, సూర్యాపేట జన్నారెడ్డి ప్రతాపరెడ్డి ఒక లక్షాయాభైవేల ఎకరాలు" భూమిని కలిగి ఉన్నారు.

నిజాం రాష్ట్రం - భూకేంద్రీకరణ:

"హైదరాబాద్ సంస్థానంలో తెలంగాణ ప్రాంతంలో భూకేంద్రీకరణ వివరీతంగా ఉంది. నల్లగొండ, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాలలో ఏడు వందల ఎకరాలకు పైగా భూమి గల భూస్వాముల సంఖ్య 550 అని సాగులో ఉన్న మొత్తం భూమిలో నూరింట 60 నుండి 70 వంతుల వరకు వారి అధీనంలో కలదని 1950–1951 సంవత్సరపు పరిపాలనా నివేదికను బట్టి తెలుస్తోంది" అని పుచ్చలపల్లి సుందరయ్య పేర్కొన్నాడు.

వీటితోపాటు వెట్టిచాకిరీ, అధిక పన్నులు, ఉన్నత స్థాయి ఉద్యోగాలలో 90% పైగా ముస్లీములే ఉండటం, సంస్థానంలోకి అత్యధిక సంఖ్యాక ప్రజల మాతృభాషైనా తెలుగును త్రోసిపుచ్చి ఉర్దూనే రాజభాషగా ప్రజల పై రుద్దడంలాంటి ప్యూడల్ భావాలు ప్రజా పోరాటానికి, ప్రజాసాహిత్యానికి, భాగమైన ముందడుగు, మాభూమి నాటకాలు రావడానికి కారణమయ్యాయి.

ముందడుగు:

ఈ నాటకం రచయితలు సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కర్‌రావు క్రీ॥శ. 1945లో రచించారు. బ్రిటీష్ వారికి వ్యతిరేకమైన ఒక్కమాట కూడ లేకపోయినా ప్రభుత్వం ఈ నాటకాన్ని 10–02–1946న నిషేధించింది. అప్పటికే కొన్ని చోట్ల ప్రదర్శింపబడింది. తెనాలిలో జరిగిన గుంటూరు జిల్లారైతు మహాసభ సందర్భంగా కూడా ప్రదర్శించారు. ఇది ప్రజానాట్యమండలికి, రచయితలకు విశేష ప్రచారం తెచ్చింది. వాస్తవికతావాద, సామ్యవాద సిద్ధాంత దృక్పథాలున్న ఈ నాటకం తర్వాతి రచయితలకు మార్గదర్శకమయింది.

ముందడుగు నాటక ఇతివృత్తం:

నిజాం చీకటి రాజ్యంలో గ్రామాలపై పెత్తనం చేసే భూస్వాములలో ఒకరు చక్రధర్‌రావు. ఇతని దోపిడికి వ్యతిరేకంగా నారాయణరావు పాత్ర ద్వారా ప్రజలను చైతన్యవంతం చేసి తిరుగుబాటు చేయడమే ఈ నాటకంలోని ఇతివృత్తం.

పన్నులు:

భూమినంతా తమ ఆధీనంలో ఉంచుకున్న భూస్వాములు అరకొర భూమి ఉన్న ప్రజలపై విపరీతమైన

పన్నులు వేసేవారు. ఈ జాగీర్‌దార్లు, పైగాలు, సంస్థానాలు సాగిస్తున్నదోపిడి తీవ్రత ఎంతగా ఉన్నదంటే వారిలో 110 మంది ప్రతి ఏటా రైతాంగం నుండి వివిధ రూపాలలో పన్నులు వసూలు చేసేవారు. " అక్రమ నిర్భంధం, వసూళ్ళను నిషేధిస్తూ నైజాం జారీ చేసిన ఫర్మానాలో 82 రకాలయిన అక్రమ నిర్భంధ వసూళ్ళను గూర్చి పేర్కొనబడింది". ఈ నాటకంలో కూడా శిస్తూ వసూలు చేసి, రశీదు ఇవ్వక పోవడం వలన మళ్ళీ శిస్తు అధికంగా కట్టవలసి వస్తుంది. దీనితో పాటు వెట్టిచాకిరీ గురించి పుల్లయ్య పాత్ర ద్వారా ''తాబేదార్లు కూతురు పెండ్లొచ్చిందంటే ఊళ్లో వసూలు చేసిచ్చిన వెయ్యి రూపాయలుగాక, కూరగాయలు దగ్గర నుంచి తెచ్చి కొంపంపేశాము. పుడితే పురుళ్ళకి చస్తే చావులకీ జలగ పీల్చినట్లు పీల్చావు మానెత్తురంతా" (పుట–09) అన్పిస్తాడు.

మతాల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నం:

కాశీం పాత్ర ద్వారా హిందూ – ముస్లీం సమైక్యతను ఈ నాటకంలో ప్రతిపాదించడం జరిగింది. గ్రామాలలో రెండు వర్గాలను విడగొట్టటానికి ప్రయత్నం జరిగితే "నైజాం అతని ఫ్యూడల్ పరిపాలనా నిర్వహకులు కూడా అతని సాయుధ రజాకార్లు హిందువులకు వ్యతిరేకంగా తమను బలపరచవలసిందిగా సామాన్య ముస్లీం ప్రజానీకాన్ని కూడగట్టటానికి ప్రయత్నించారు. కాని కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహిస్తున్న కారణంగా, ముస్లీం రైతాంగం, గ్రామీణ చేతి వృత్తులవారు గ్రామీణ పేదలు పెద్ద సంఖ్యలో తెలంగాణ రైతాంగ యోధులకు అండగా నిలిచారు". 'కలిసిమెలసి నీ హక్కుల కొరకై కదనము సేయుమురా! ఎదురు కానీ నీ శక్తిని చాటగ! నెగురవేయరా జెండా! (పుట–12) అనే పాటతో ఐక్యమత్యాన్ని ఈ నాటకం చాటింది.

రైతు సంఘం - ప్రజలకు అండ:

ఈ నాటకంలో ప్రజలకు ధైర్యాన్నిచ్చింది, అండగా ఉన్నది రైతు సంఘం. రైతు సంఘం జెండా నీడనే మనకు మోక్షం, స్వాతంత్ర్యం ఇస్తుందని నారాయణరావు అంటాడు. ఒక వైపు కార్మిక వర్గం చైతన్యమై ఆర్థిక పోరాటాలతోపాటు రాజకీయ పోరాటాల్లోను ముందడుగు వేస్తుంటే మరోవైపు పీడిత రైతాంగం సంఘాలను ఏర్పర్చుకున్నది. ఆంధ్రరాష్ట్రరైతు సంఘం వంటివి ఏర్పడ్డాయి. వీటిల్లో 'ఆంధ్రరాష్ట్రరైతు సంఘం' కమ్యూనిస్టుల నాయకత్వంలో జమీందార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాహసోపేతమైన పోరాటాలను నిర్వహించింది. ఆంధ్రలో కూడా "రెండవ ప్రపంచ యుద్ధం తరువాత మందసానుండి వెంకటగిరి వరకు రాష్ట్రంలోని అన్ని ఎస్టేటులలో మరోసారి జమీందారి వ్యతిరేక పోరాటాలు జరిగాయి". వీటిల్లో ఈ సంఘం పాత్ర ఉంది.

ఉద్యమంలో స్త్రీల పాత్ర:

స్త్రీల సమానత్వం గురించి మాట్లాడిన ఆంధ్ర మహాసభ దేశ్‌ముఖ్‌ల, జాగీర్దార్ల, గుండాలను ఎదుర్కోవడానికి సుశిక్షితులైన వాలంటీరు దళాలను ఏర్పాటు చేశాయి. వీటిల్లో మహిళలకు కూడా శిక్షణనిచ్చింది. ఈ నాటకంలో ఇదే స్ఫూర్తితో రచయిత విమల పాత్ర ద్వారా 'కొంపలు జప్తు చేసి ఇంటిల్లిపాదీ పిల్లాజల్లా గొల్లున గోలబెడుతుండగా బైటికీడ్పించడం, అదేంపాపమంటే దొంగచాటుగా తలకాయలు పగుల గొట్టించడం. ఇరవై నాలుగు గంటలు తప్పతాగి గంతులు వేయడం. ఇదే దొరల నిత్యకృత్యమని' ఆగ్రహాన్ని వెలిబుచ్చింది. ఆంధ్రమహాసభ ఇచ్చిన స్ఫూర్తియే, ఐలమ్మను చరిత్రలో నిలిపింది. ఆనాటి సమాజపు వాస్తవస్థితిని, చైతన్యాన్ని అందించిన ముందడుగు నాటకం తెలంగాణ సమాజానికే ముందడుగయింది.

మా భూమి:

ఈ నాటకాన్ని సుంకర సత్యనారాయణ – వాసిరెడ్డి భాస్కర్‌రావులు ముందడుగు ఇచ్చిన ఉత్సాహంతో 1946లో రాశారు. చారిత్రాత్మకమైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నేపధ్యంలో రాసిన ఈ నాటకం ఆరు రంగాలు కలిగి ఉంది. 1946లో మొదటిసారి ప్రదర్శించిన ఈ నాటకాన్ని 1948 వచ్చేసరికి 125 నాటకదళాలు ఏర్పడి వేల ప్రదర్శనలిచ్చాయి. ఒక గ్రామంలో జరిగిన సంఘటనతో ప్రారంభించి, ఆ సంఘటనకు కారణభూతమైన మనుషులకు

దానితో అవిభాజ్య సంబంధం ఉన్న వ్యవస్థను చర్చించడం ఈ నాటకంలోని ప్రత్యేకత.

మా భూమి నాటక ఇతివృత్తం:

ఒక గ్రామంలో దేశ్‌ముఖ్ జగన్నాథరెడ్డి, కరణం, రౌడీల, పోలీసుల ఆసరాతో అన్ని రకాలుగా దోపిడీ, అణచివేతను కొనసాగిస్తున్న సందర్భంలో ఆంధ్రమహాసభ ఇచ్చిన స్ఫూర్తితో వీరారెడ్డి ఎదురు తిరిగుతాడు. సబ్బండకులాలు, మతాలవారిని ఏకం చేసి దేశ్‌ముఖ్‌ను తరిమి కొట్టడం ఈ నాటకంలోని ఇతివృత్తం.

"సాయుధ పోరాటానికంటే ముందు నల్లగొండ జిల్లాలో జరిగిన ప్రజాపోరాటంలో 240 గ్రామాలపై పోలీసుల దాడులు జరిగాయి. 8500 మంది అరెస్టు అయ్యారు. 15,390 మంది నైజాం ప్రభుత్వ హింసాకాండకు గురయ్యారు. రూ.12 లక్షల 25 వేల విలువ గల ఆస్తి లూటీ చేయబడింది. 52 మంది వీరులు ప్రాణాలను కోల్పోయారు. నైజాం కిరాతకుల చేతుల్లో 64 మంది స్త్రీలకు – మన తెలుగు సోదరీమణులకు మానభంగం జరిగింది. వీరిలో ఇద్దరు మరణించారు. ఈ మహోజ్జ్వల పోరాటమే మమ్మల్ని ఈ నాటకం రాయడానికి ప్రోత్సాహించిందని (మనవి –పుట–4) రచయితలు తెలియజేశారు.

భూసమస్య:

ఈ పోరాటంలో ప్రధానమైనది భూ సమస్య. సామాన్య ప్రజల కడుపు నిండా తిండి తిందామంటే ప్రజానీకానికి చాలినంత తిండి ఉండదు. దానికి కారణం వారికి కావల్సినంత భూమి లేకపోవడమే. వారి దృష్టిలో భూ సమస్య అతి ముఖ్యమైన సమస్య. దీనితో పాటు స్త్రీల సమస్యలు. వారిని అక్షరాస్యులను చేయడం, రాజకీయ వ్యవహారాలలో పాల్గొనేటట్లు తీర్చిదిద్దడం రచయితల భవిష్యత్ దర్శనానికి ఇవి నిదర్శనం.

వెట్టి చాకిరీ:

భూమి సమస్యతోపాటు వెట్టి చాకిరీ కూడా ప్రధాన సమస్య. వెట్టిచాకిరీ ఆ రోజుల్లో సర్వసాధారణమైనదిగా ఉండేది. "తెలంగాణలో వెట్టిచాకిరీ విధానం సమాజ మంతటా ఆవరించి ఉండేది. ప్రజలలో అన్ని రకాల వర్గాల ప్రజలకు తమ తమ స్థాయిలో అది వర్తించేది". బోయలు, బెస్తలు, రజకులు, భూస్వామి కుటుంబీకులను పల్లకి మేనాలలో మోయడం, కల్లుగీత కార్మికులు ఉచితంగా కల్లు సరఫరా చేయడం, రజకులు బట్టలుతకడం, గొల్లవాళ్లు గొర్లనివ్వడం ఇలా ప్రతి కులం ఉచితంగా సేవచేసే విధానం ఉన్నది. దీనిని మించి "ఈ ప్యూడల్ దొపిడీలలోకెల్లా దారుణమైనది భూస్వాముల ఇండ్లలో బానిసలుగా బాలికలను పంపించే పద్ధతి". ఈ నాటకంలో దొర ఆదేశం మేరకు యల్లమంద యొక్క మందలోని దేవరపోతును మస్తాన్ తీసుకెళ్తాడు.

"నీబానిచోణ్ణిబాబు కాల్‌మొక్తా, దాన్ని వదిలిపెట్టి ఇంకోదాన్ని తీసుకెళ్ళమంటే గూబ అదరేసిండు" (పుట–19) అని యలమంద ఏడ్చిన ఏడుపు, పడిన బాధ తెలంగాణ సమాజానికి సర్వసాధారణమైనట్లుగా రచయిత చిత్రించాడు. తాతల నాటి అప్పుకు దొర ఇంట్లో వెట్టిచాకిరీ చేస్తున్న పాత్ర రాయుడు. రోజుకు 18 గంటలు పని చేసినా" ఏ రోజుకారోజు చీవాట్లూ చెప్పుదెబ్బలూతప్పవ్''. (పుట–49)

విసునూరు గ్రామంలో పుట్టిన బందగీ చారిత్రాత్మకమైన వ్యక్తి. సామాన్య రైతు కుటుంబంలో పుట్టి తన వ్యక్తిగత జీవితంలో ఎదురయ్యే సమస్యతో ప్రారంభించి ఒక్కొక్క సమస్యను పరిష్కరించే ఉత్తమ వ్యక్తిత్వం కలిగిన వాడు బందగీ. బందగీ సామాన్య ప్రజలకు అవసరమైన పనులు చేయడం భూస్వాముల ఆకృత్యాలను నివారించడం చేయడంతో విసునూరు దేశ్‌ముఖ్ బందగీని సొంత అన్నతోనే భూమి తగాదాలో చంపిస్తాడు.

కులాల మధ్య చిచ్చుపెట్టడం:

భూస్వాముల పట్ల ప్రజలలో పెరుగుతున్న అసహనాన్ని నిరసనను ఎదుర్కోవడానికి భూస్వాములు కులాన్ని వాడుకునే తీరును చాలా శక్తివంతంగా తీర్చిదిద్దారు. భూస్వామి కులానికి సంబంధించిన వ్యక్తి సంఘ నాయకుడు. వీరారెడ్డిని పిలిచి కులాభిమానాన్ని రేకెత్తించాలని ప్రయత్నిస్తాడు. "మనలో

చదువుకున్న వాడివి నీవుండగా నాకెందుకీ భారమంతా.... పోనీ" పటేల్‌గిరి తీసుకో నీ ఇష్టం వచ్చినట్లే గ్రామాన్ని నడుపు, నేనేదో చేస్తున్నానని మీరంతా అనుకోవడ మెందుకు?" (పుట-65) భూస్వామి క్రౌర్యమూ, అతడి పన్నాగమూ తెలిసిన నాయకుడు భూస్వామి అభ్యర్థనను త్రోసిపుచ్చుతాడు, కాని ఆనాటి సమాజంలో ఎందరిని తమవైపు మరల్చుకోవడానికి 'కులాన్ని' ఎరగా వాడుకున్నారో. మతానికి సంబంధించిన అంశంలో కూడా ఇలాంటి మనస్తత్వాన్నే ప్రదర్శించారు. పేద కుటుంబాలకు చెందిన సుభాన్, దాదాలు, ముస్లీం రాజ్యాన్ని కాపాడడానికి కృషి చేయాలని అమీన్ అడిగినప్పుడు నవాబ్ అయినా దేశ్‌ముఖ్ అయినా పేదవాళ్ళకి ఏదీలేదని "గోచికి మించిన దరిద్ర మేమిటి" (ముద్రణ - 2015-పు-62) అని ప్రశ్నిస్తారు. అమీన్ అప్పటికి వాళ్ళతో మీకీ షంగం కావాలంటే మందీ వేరేషంగం హుంది. హందులో మీకీ చేర్తె మంచీ హుండాది. (ము-2015-పు-62) అపుడు సుభాన్ "దేనికీ? జాగీర్‌దార్ల నౌకరీ చేయడానికా? ఇప్పటికీ దేశ్‌ముఖులతోనే చచ్చిపోతున్నాం. ఇంకా జాగీర్‌దార్ల కొలువెందుకులెండి? (ము. 2015-పు-63) అంటారు.

సరిగ్గా మా భూమిలో చెప్పినట్లుగానే దొరలు, దేశ్‌ముఖ్‌లు రజాకార్లతో, నిజాంతోకుమ్మక్కై పల్లెల్లోని సామాన్యరైతాంగం మీద హింసాకాండ కొనసాగింది. కానీ కమ్యూనిస్టు పార్టీ చేసిన సాయుధ పోరాటం ద్వారా పారిపోయిన దొరలు, కాంగ్రేస్ టోపి తగిలించుకొని, తిరిగి గడీలలోకి వచ్చి ప్రజలు సాధించుకున్న భూమిని ఇండియన్ మిలటరీ సహాయంతో ఆక్రమించుకున్నారు. భూమి తిరిగి దక్కకుండా పోయినా హక్కు సాధించాలన్న ఆ చైతన్యాన్ని మా భూమి నాటకం రైతులకు కలిగించింది.

ఈ 75 సంll ల కాలంలో ఆ భూస్వామ్య విధాన విషఫలాలను అనుభవిస్తున్నప్పుడు ఆ నాటక కర్తలు చేసిన సూచన ఎంతటి విలువైందో స్పష్టమవుతుంది.

ముగింపు:

ఈ రెండు నాటకాలు తెలంగాణా వ్యాప్తంగా ప్రదర్శింపబడి సాయుధ పోరాటానికి ప్రజల్ని సంసిద్ధులను చేశాయి. పోరాటం మధ్యలో విరమణ పొందినా, ఆ ఫలాలు ప్రజలకు మాత్రం కొంతైనా అందాయి. ఈ ఉద్యమ నాటకాలు తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమ సాహిత్యం రావడానికి, ఉద్యమాలు జరగడానికి, తద్వారా సమాజంలో మార్పురావడానికి కారణమయ్యాయి.

పాద సూచికలు

1. పుచ్చలపల్లి సుందరయ్య - వీర తెలంగాణా విప్లవ పోరాటం - గుణపాఠాలు - పదవ ముద్రణ -2014-పు -13.
2. పుచ్చలపల్లి సుందరయ్య - వీర తెలంగాణా విప్లవ పోరాటం - గుణపాఠాలు - పదవ ముద్రణ -2014-పు -13.
3. పుచ్చలపల్లి సుందరయ్య - వీర తెలంగాణా విప్లవ పోరాటం - గుణపాఠాలు - పదవ ముద్రణ -2014-పు -13.
4. పుచ్చలపల్లి సుందరయ్య - వీర తెలంగాణా విప్లవ పోరాటం - గుణపాఠాలు - పదవ ముద్రణ -2014-పు - 08.
5. ఆచార్య ఎస్.వి. సత్యనారాయణ - తెలుగులో ఉద్యమ గీతాలు - తృ.ము-2019 - పు -376
6. పుచ్చలపల్లి సుందరయ్య - వీర తెలంగాణా విప్లవ పోరాటం - గుణపాఠాలు - ప.ము-2014-పు-11.
7. పుచ్చలపల్లి సుందరయ్య - వీర తెలంగాణా విప్లవ పోరాటం - గుణపాఠాలు - ప.ము-2014-పు-12

తెలుగు సాహిత్యంలో – భావకవిత్వం విశిష్టత

సాకేటి సత్యనారాయణ , సంస్కృత ఉపన్యాసకులు, శ్రీ జి.సి.ఎస్.ఆర్. కళాశాల, రాజాం, విజయనగరం జిల్లా.
సెల్ నెం: 9959926769

భగవాన్ శ్రీశ్రీశ్రీ సత్యసాయిబాబావారి దివ్య ఆశీస్సులతో...

ఉపోద్ఘాతం :

ఇరవయ్యో శతాబ్ది ప్రారంభంలో తొలిసారిగా తెలుగు సాహిత్యంలో ప్రబంధ కవితా ధోరణిపై తిరుగుబాటుగా వచ్చిన కవిత్వం భావ కవిత్వం. భావ కవిత్వం తెలుగుదేశంలో మూడు దశాబ్దాల పాటు "మూడు పువ్వులు ఆరుకాయలు" గా వెలసిల్లినది. భావ కవిత్వాన్ని కాల్పనిక కవిత్వం అని కూడా అంటారు. తెలుగులో కాల్పనిక కవిత్వం భావ కవిత్వం రెండూ పర్యాయపదాలుగా ఉన్నాయి.

భావకవిత్వం చారిత్రక నేపథ్యం :

ఆధునిక కవిత్వానికి ముఖ్యంగా భావ కవిత్వానికి ఆంగ్ల సాహిత్యం పరిచయం వలననే ప్రోద్బలం వచ్చిందని నిస్సందేహంగా ఆనాటి కవులు విమర్శకులు భావించారు. ఆ సంగతిని స్పష్టంగా ప్రకటించారు. ఆంగ్ల సాహిత్య చరిత్రలో సంభవించిన ఒక ప్రముఖ ఉద్యమం కాల్పనికోద్యమం. ఈ ఉద్యమం 18వ శతాబ్దంలో వచ్చింది. అంతకు పూర్వం సాహిత్య లోకాన్ని ఏలిన సంప్రదాయ విధానంపై ఇది తిరుగుబాటు చేసింది. పాశ్చాత్యులు రూసోను కాల్పనిక ఉద్యమ పితగా పేర్కొన్నారు.

ఆంధ్ర సాహిత్య చరిత్రలో పూర్వపు బంధ చిత్ర కవిత్వాలకు వ్యతిరేకంగా మొగ్గ తొడిగిందే నవ్య సాహిత్య ఉద్యమం. దీనికి 19వ శతాబ్ది ఉత్తరార్ధంలో గట్టి పునాది పడింది. ఆ సమయంలో భూస్వామ్య వ్యవస్థకు కాలదోషం పట్టింది. వ్యక్తి చైతన్యవంతుడయ్యాడు. "కళ కళ కోసమే" అనే అభిప్రాయం వెనుకబడింది. మేధావి వర్గం వ్యక్తి చైతన్యాన్ని సమాజ పరం కావించేందుకు నడుము కట్టింది. బోధనాభ్యసన రీతులలో వచ్చిన మార్పుల వల్ల ప్రజల ఆలోచన దృక్పథంలో హేతువాదం చోటు చేసుకుంది. పూర్వ సాంప్రదాయాలు మూఢవిశ్వాసాలు వమ్ముకాజొచ్చాయి.

పాశ్చాత్య వాంఙ్మయ పరిచయం వలన కలిగిన భావ "విప్లవం సత్యం శివం సుందర"మైన ప్రాచ్య సిద్ధాంతంలో పాశ్చాత్య రసవాదాన్ని రంగరించింది. దాంతో ఎన్నో నూతన సాహిత్య ప్రక్రియలు ప్రచారంలోకి వచ్చాయి. అందుకే 19వ శతాబ్దిని రానున్న మహోదయానికి వైతాళిక గీతలు పాడిన ఉషఃకాలంగా పేర్కొన్నారు.

భావకవిత్వం పద వివరణ :

భావపదం, భావగీతం అనే పదాలు మొదటిసారిగా రాయప్రోలు సుబ్బారావు గారి కావ్యాలలో కనిపిస్తాయి. విశ్వనాత సత్యనారాయణ, దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రి గార్ల రచనలలో భావగీతం ప్రయోగించబడింది.

ఈ భావకవిత్వాన్ని మొదట్లో –

రాయప్రోలు సుబ్బారావు గారు – అభినవ కవిత్వం అని, దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు – కాల్పనిక కవిత్వం అని, దువ్వూరి రామిరెడ్డి గారు – గీత కవిత్వం అని, నోరి నరసింహశాస్త్రి గారు – నవ్య కవిత్వమని పేర్కొన్నారు.

తెలుగు సాహిత్యంలో మొదటిసారిగా "భావ కవిత్వం" అనే పదాన్ని గాడిచర్ల హరిసర్వోత్తమ రావు గారు వాడారు. తర్వాత భావ కవిత్వం అనే పదం వాడుకలోకి వచ్చింది.

భావకవిత్వం నిర్వచనాలు :

విశ్వనాథ సత్యనారాయణ : "కవి యొక్క ఒక అవిస్పష్ట వాంఛాంకురము ఒక అంతర్నిగూఢ తాపము ఒక చిన్న కావ్యములో ఊదబడినచో అది భావ కవిత్వం" అని పేర్కొన్నారు.

కవి కొండల వెంకటరావు : భావము యొక్క కవిత స్వభావము భావ కవిత్వం అని తెలిపారు.

ఇంద్రగంటి హనుమత్ శాస్త్రి :

భావ ప్రధాన కవిత్వమే భావ కవిత్వం అని అన్నారు. భాష, భావం, ఛందస్సు అలంకారం శైలి మొదలైన విషయాలలో భావ కవులు అభివృద్ధిలో తమ ప్రత్యేకతను చాటుకున్నారు. కావ్యానికి అవసరమైన వస్తువు భావము రచన అనే మూడు అంశాల్లో భావకవులు ఎక్కువగా భావానికే ప్రాధాన్యం ఇచ్చారు. ప్రకృతిలోని ప్రతి విషయాన్ని వీరు వర్ణనీయ వస్తువుగా తీసుకున్నారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు కృష్ణపక్షంలో ''నేను'' అనే కవిత ఖండికలో ఆత్మాశ్రయత్వాన్ని –

"నేను స్వేచ్ఛ కుమారుడా నేను గగన
పథ విహార విహంగమ పతిని నేను
మోహన వినీల జలధరమూర్తి నేను
ప్రళయ ఝంఝూ ప్రభంజన స్వామి నేను" అని పేర్కొన్నారు.

భావకవిత్వం – విభాగాలు :

మానవ జీవితానికి పరమావధి ప్రేమ భగవంతునిలాగా ప్రేమకు కూడా నాశనం లేదు. సృష్టి ఉన్నంతవరకు ప్రణయం దేదీప్యమానంగా వెలుగుతుంది. ఈ ప్రణయం భావకవుల ఊహలను ఉజ్వలింపజేసింది. ఆ కారణంగా వారి రచనలలో ఊహాసుందరులకు సముచిత స్థానం ఏర్పడింది. భావ కవులు ఊహ సుందరుల్ని తనివి తీర పూజిస్తారు. ఊహా ప్రపంచంలో తేలియాడుతారు. అలా మురిసిపోయిన వాళ్లలో

దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి – ఊర్వశి, విశ్వనాథ సత్యనారాయణ గారి – కిన్నెరసాని, తల్లావజ్జల శివశంకరశాస్త్రి గారి – హృదయేశ్వరి, నాయని సుబ్బారావు గారి – వత్సల, నండూరి సుబ్బారావు గారి – ఎంకి, అడవి బాపిరాజు గారి – శశికళ ఊహా ప్రేయసులు ఉపాసనా దేవతలు.

రాయప్రోలు వారి కావ్యాలలో లలిత, తృణకంకణ, కష్ట కమల, స్నేహలత మొదలైనవి ప్రణయం ప్రధాన వస్తువుగా గల కావ్యాలు. రాయప్రోలు తర్వాత వస్త్వాశ్రయ రీతిలో వచ్చిన ప్రణయ కావ్యాలు – అబ్బూరి రామకృష్ణారావు గారి – మల్లికాంబ, దువ్వూరి రామిరెడ్డి గారి – కడపటి వీడ్కోలు, వెంకట పార్వతీశ్వర కవుల – జలదమాలిక, కాళ్లకూరి గోపాలరావు గారి – స్నానఘట్టం, కొడవటిగంటి వెంకటసుబ్బయ్య గారి– భిక్షువు ప్రసిద్ధమైనవి.

ప్రకృతి భావకవులకు ప్రాణం. భావకవిత్వానికి ప్రకృతికి విడదీయరాని పరస్పర సంబంధం ఉంది. భావకవులు ప్రకృతిలో ఉన్న సూర్యోదయం మబ్బులు, వెన్నెల, చెట్లు, గుట్టలు, తీగలు, పువ్వులు, నదీనదాలు, తుఫాను, వరదలు వచ్చేటప్పుడు ప్రకృతి బీభత్సం ఇలా ప్రకృతిలో ఉన్న ప్రతి దాన్ని చూసి పరవశించి వర్ణించారు.

భగవంతుని సృష్టిలో పరమ అద్భుతమైనది ప్రకృతి. భగవంతుడు ప్రకృతిని సృష్టించాడు కాబట్టి ప్రకృతిని ఆరాధిస్తే పరమాత్మను ఆరాధించినట్లే అని భావకవులు భావించారు. కృష్ణపక్షంలో కృష్ణశాస్త్రి గారు ప్రకృతిలో తాదాత్మ్యం చెందిన తీరు ఈ విధంగా ఉంది...

"ఆకులో ఆకునై – పువ్వులో పువ్వునై
కొమ్మలో కొమ్మనై – నును లేత రెమ్మనై
ఈ యడవి దాగిపోనా ఎటులైన
నిచటనే యాగిపోనా" అని....

లోకంలో ప్రకృతి మొదట ప్రశాంత ప్రకృతి దశ నుంచి బీభత్స ప్రకృతిగా మారి, తిరిగి ప్రశాంతతను పొందుతుంది. విపరీత వర్షాల వలన పొంగి పొర్లుతున్న గోదావరి వరదల్ని దృష్టిలో పెట్టుకుని అడవి బాపిరాజు గారు ప్రకృతి బీభత్సాన్ని .....

ఉప్పొంగి పోయింది గోదావరి
తాను తెప్పున్న ఎగిసింది గోదావరి
కొండల్లో ఉరికింది కోనల్లో నడిచింది

ఆకాశగంగతో హస్తాలు కలిపింది ఉప్పొంగి॥ అని వర్ణించారు.

భారత జాతీయతను ప్రబోధించిన భావకవుల్లో చిలకమర్తి, గురజాడ, రాయప్రోలు, దువ్వూరి, బసవరాజు గార్లు ముఖ్యులు. జాతీయాభిమానంతో చిలకమర్తి గారు –

"భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియగట్టి" అని...

జన్మభూమి గేయంలో రాయప్రోలు గారి జాతీయ భావన ఇలా సాగింది –

"ఏ దేశమేగినా ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కిన ఎవ్వరేమనని
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము" అని....

గురజాడ దేశభక్తి గేయం జాతీయాభిమానంతో పాటు అంతర్జాతీయ భావన కలిగిస్తుంది.

దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
అంటూ ఉద్బోదించిన ఈ గేయంలోని...

దేశమంటే మట్టికాదోయ్
దేశమంటే మనుషులోయ్

అనే రెండు పాదాలు రాని ఆంధ్రుడు ఉండడు. ఈ గేయం ప్రజా హృదయాలను దోచుకుంది.

జాతీయోద్యమానికి కేంద్రబిందువైన గాంధీజీని కీర్తించిన భావకవులలో బసవరాజు అప్పారావు గారు ప్రసిద్ధులు.

"కాల్లాయి గట్టితేనేమి – మా గాంధీ
కోమటై పుట్టితే నేమి" అని...

ముగింపు :-

ఇంకా భావకవులు మానవతావాదం స్తుతి, స్మృతి, బాల గేయాలు వంటి అనేక కవితలను వ్రాశారు. భావకవులు తమ భావాలను ఇష్టానుసారంగా విచ్చలవిడిగా చెప్పారు. ఎంతో స్వేచ్ఛగా విహరించారు. భావకులు తమ చుట్టూ ఒక అద్భుత వాతావరణాన్ని సృష్టించుకున్నారు. ఆ లోకంలోకి తమ ప్రేయసి తప్ప ఇతరులకు చోటు లేకుండా చేశారు. భావకవులు భావకవిత్వం అనే స్వంత రాజ్యాన్ని ఏర్పరచుకొని, ఆ స్వంతరాజ్యం ప్రేమ రాజ్యం ఆ ప్రేమలో మునిగి తేలుతూ ఆనందంలో విహరిస్తూ తెలుగు సాహిత్యంలో భావకవిత్వానికి ఒక విశిష్ట స్థానాన్ని తీసుకువచ్చి, తెలుగు భాషాభిమానుల సాహిత్య హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు.

ఆధార గ్రంథాలు :-

1) సమగ్రాంధ్ర సాహిత్యం – ఆరుద్ర
2) తెలుగు సాహిత్య చరిత్ర – ద్వానా శాస్త్రి
3) తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు – వెలమల సిమ్మన్న

పురాణ వాఙ్మయము – తెలుగు సాహిత్యము

డా॥ హరీష్ కుమార్ శ్రీధర, సహాయాచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోరుట్ల, జగిత్యాల జిల్లా, తెలంగాణ.
సెల్ 9491366356, 8919563503

మిత్ర సమ్మితములైన వేద స్వరూపము 'పురాణము'. భారతదేశంలో సంస్కృత సాహిత్య ప్రక్రియలన్నిటిలో ప్రజలకు అత్యంత సన్నిహితమైన ప్రక్రియ పురాణము. "వేదా: ప్రతిష్ఠితాస్సర్వే పురాణేష్వేన సర్వదా" అని నారదీయ మహాపురాణమును, "వేదా: ప్రతిష్ఠితాస్సర్వే పురాణే నాత్ర సంశయ:" అని స్కాంద పురాణమున, "ఇతిహాస పురాణాభ్యాం వేదం సముపబృంహయేత్" అని మహాభారతము తెలియజెప్పుచున్నవి.

పురాణమనగా ప్రాచీనమని అర్థము. ఋగ్వేద, అథర్వణ వేదాల్లో 'ప్రాచీనకథ'గా వాడబడిఇది. దేవాసురా స్సంయత్తా ఆసన్' – 'ఇట్లు పూర్వము జరిగినదట" అని పూర్వప్రసిద్ధ కథలను తెలుపునది ఇతిహాసము అనియు, "ఇదం వా అగ్రే నైవ కించిదాసీత్" – జగత్ప్రాగవస్థను వ్యక్రమించి చెప్పే వాక్యములు 'పురాణము' అని విద్యారణ్యస్వామి సాయణ వేద భాష్య ఉపోద్ఘాతమున వివరించారు.

పురాణం ఒక సాహిత్య ప్రక్రియగా ప్రాచర్యం పొందుటచే దాని కొరకు లక్షణమేర్పడినది.

సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వన్తరాణిచ
వంశాను చరితం చేతి లక్షణానాంతు పఞ్చకమ్॥

సర్గము, ప్రతిసర్గము, వంశము, మన్వంతరము, వంశానుచరితము అనునవి పురాణమునకు గల అయిదు లక్షణములు. 'వంశాను చరిత' స్థానంలో 'భూమ్యాదే సంస్థాన'న్నట పాఠాంతరము గలదని అమరకోశము. వీటిలో సర్గము అనగా సృష్టి లేదా బ్రహ్మాండోత్పత్తి. ప్రతి సర్గము అనగా కల్పాంతము, జరుగు పునసృష్టి. దీనికే 'విసర్గ'యని మరొకపేరు. జీవరాశులలో ఏర్పడిన వికాస క్రమమును తెలియజేయునది ఇది.

మన్వంతరమున భూమిని ధర్మ బద్ధంగా పరిపాలించుటకై ఉన్న 14 మంది మనువుల ఉత్పత్తి, వారి పాలనా కాల విశేషాలను తెలియజేయును. వంశములందు దేవతల గురించి, దానవుల గురించి, బ్రహ్మర్షి వంశకర్తల గురించి వివరించబడును. వంశాను చరితమున సూర్య, చంద్ర వంశములందు జన్మించి ప్రసిద్ధికెక్కిన మహారాజుల చరిత్ర తెలుపబడును. ఈ అయిదు లక్షణాల సారం ఏమిటంటే పురాణాలు బ్రహ్మాండాది నుండి మానవ సమాజం వరకు గల క్రమ వికాసాన్ని వివరించునది అని.

'పురాణం' అను దానికి 'పురా2పి నవమ్ పురాణమ్' అను నిరుక్తి యొకటి ప్రసిద్ధి గాంచినది. అనగా, పురాణములలో చెప్పబడు విషయములు పురాతనము లయిననూ, నిత్య నూతనములుగా భాసించుచున్నవి. బహుశా ఆధునిక ప్రవచనల కర్తల వాగ్ధాటి, విశ్లేషణల వలన కూడా 'పురాణం' పురాతనమైన విషయాలకు ఆధునిక హంగులనద్దుకొని నిత్య యౌవనియై విలసిల్లుతున్నది.

పైన పేర్కొన్న పంచ లక్షణములు కేవలం ఉపపురాణములకు మాత్రమేనని, మహా పురాణములకు లక్షణములు పది మరియు అంతకంటే ఎక్కువ అని ఒక ప్రచారము జరిగినది. "వృత్తి, రక్ష, సంస్థ, హేతువు, అపాశ్రయము" అని మరొక అయిదు లక్షణాలను భాగవతం ప్రవచించినది. బ్రహ్మ వైవర్తనము, మత్స్య పురాణాదులు దశాదిక లక్షణాలు సర్వపురాణ సామాన్యములని పేర్కొన్నది.

మనిషిలో ఆస్తిక బుద్ధిని పెంచి పోషించగలది పురాణములు. వివిధ అవతార వర్ణనలు, ఋషి దేవ పితృ రూపముల మహిమ, దాన ధర్మాలు, వ్రతాలు, తీర్థాలు వాటి మహిమల్ని వివరించుచున్నది. కల్పనా మధురమైన కథలు,

చరిత్రలు, ఉపాఖ్యానములు చెబుతున్నది. శిల్ప కావ్య సాహిత్య వ్యాకరణ అలంకార శాస్త్రాల్లోని రహస్యాలను నైతిక మత ధార్మిక వ్యవహారాలను గురించి పురాణములు తెలియజేస్తున్నాయి.

అన్ని రకాల సాహిత్య ప్రక్రియలకు పురాణము మాతృక అని నారదీయము.

"పురాణ పురుషాజ్ఞాతం యధేదం జగదద్భుతమ్
తథేదం వాఙ్మయం ఔతం పురాణేభ్యోన సంశయ: "
"య న్న దృష్టం హిం వేదేషు తత్సర్వం లక్ష్యతే స్మృతౌ
ఉభయో ర్య న్న దృష్టం హి త త్పురాణై: ప్రణీయతే".

అందుకే పురాణములను కూడా వేదాల వలెనే ప్రమాణములుగా భావించారు. పురాణ రచన, ప్రవచనము, శ్రవణములు భారతీయ సంస్కృతిలో భాగమైనవి. ఇది వయో వృద్ధులకు ఆధ్యాత్మిక కాలక్షేపముగా కాలక్రమేణా మారుతున్నా ప్రజా వాఙ్మయముగా ప్రసిద్ధినొందినదనుట సరైనది.

పురాణాలు మహాపురాణాలు, ఉప పురాణములని రెండు రకాలు. మహాపురాణాల్లో 1) బ్రహ్మ పురాణము 2) పద్మ పురాణము 3) విష్ణు పురాణము 4) వాయు పురాణము 5) భాగవత పురాణము 6) నారదీయ పురాణము 7) మార్కండేయ పురాణము 8) అగ్ని పురాణము 9) భవిష్య పురాణము 10) బ్రహ్మ వైవర్త పురాణము 11) వరాహ పురాణము 12) లింగ పురాణము 13) స్కాంద పురాణము 14) వామన పురాణము 15) కూర్మ పురాణము 16) మత్స్య పురాణము 17) గరుడ పురాణము 18) బ్రహ్మాండ పురాణము.

"మ ద్వయం భ ద్వయం చైవ బ్ర త్రయం వ చతుష్టయం
అనాప లింగ కూస్కాని పురాణాని పృథక్ పృథక్"

అని పై 18 పురాణాల మొదటి అక్షరాలతో కూర్చిన శ్లోకం. అయితే ఈ 18 మహా పురాణాలలో కొన్ని పురాణములు వాయు పురాణమునకు బదులుగా శివ పురాణమును, భాగవత పురాణమునకు బదులుగా దేవీ భాగవతమును పేర్కొన్నవి. 'సనత్కుమారీయము' మొ॥గా గలవి ఉప పురాణములు, మహా పురాణముల వలెనే ఉప పురాణముల లెక్కయందునూ విభిన్న వాదనలు గలవు.

పురాణ వాఙ్మయము ప్రభావము సంస్కృతము నుండి క్రమేణా దేశిభాషలకు విస్తరించినది. వీటిలో జైన పురాణమొకటి. బౌద్ధమత వ్యాప్తికై బుద్ధుని జాతక కథలనే విధంగా ప్రశస్తిలోకి తెచ్చారో అలాగే జైన మత వ్యాప్తికై పురాణాలను వాహికలుగా చేసుకున్నారు. జైనులు తీర్థంకరుల మహాత్మ్యాలను, జీవిత చరిత్రలను సామాన్య జనులకు అందుబాటులోకి వచ్చునట్లు చేశారు.

కన్నడ ఆదికవిగా ప్రసిద్ధినొందిన పంపకవి జైన ప్రథమ తీర్థంకరుడైన పురుదేవుని చరిత్రను 'ఆది పురాణము' పేరుతో చంపూరచన చేశారు. పొన్నకవి 'శాంతిపురాణం', రన్న కవి 'అజిత పురాణము', జన్న కవి 'అనంత నాథ పురాణము', శేక్కిజ్ఞార్ రచించిన 'పెరియ పురాణము' ప్రసిద్ధి చెందిన రచనలు. జైనులు పురాణ పంచ లక్షణములకు బదులుగా ఉత్సవము లేక కళ్యాణపంచకములని వర్ణించారు.

తెలుగులో ఆంధ్ర మహాభారతము స్వతంత్రాను వాదముతో మహాకావ్యరచన ప్రారంభమైనట్లు సుజన విదితమే. మొదటి పురాణము అనువాదము కాదు స్వతంత్ర పురాణము. దేశి రచన పాల్కుర్కి సోమనాథుడు రచించిన 'బసవ పురాణము' వీరశైవ మత ప్రచారానికై గావించిన రచన ఇది. కన్నడ సాహిత్యంలో బలమైన వ్యాప్తి నొందిన జైన నిర్మాణ ప్రక్రియలు బసవపురాణ రచనపై పడినాయని చెప్పవచ్చు.

బసవని చరిత్రయే బసవ పురాణ ప్రధానేతివృత్తము. సోమనాథుడు తన వస్తువును గురించి,

"ఆతత బసవ పురాతన భక్తి
గీతార్థ సమితియే మాతృక గాగ
బసవ చరితమే వర్ణింతు సత్కృతి యనగ"

అని బసవని భక్తుల యందును, పురాతన గీతాల్లోనూ వ్యాపించియున్న బసవని కథలను పురాణముగా తీర్చిదిద్దెదనని చెప్పుకొన్నాడు.

బసవేశ్వరుడితో పాటుగా అల్లమ ప్రభువు, ముగ్ధ సంగయ్య, మడివాలు మాచయ్య, ముసిడి చౌడయ్య, తెలుగు జొమ్మయ్య, ఏకాంత రామయ్య ఇలా అనేకానేక భక్తుల కథలను కథా సందర్భముగా జొప్పించి చెప్పినాడు. ఇలా తెలుగులో ప్రథమ దేశి పురాణము వీరశైవమత వ్యాప్తికై ఉద్భవించినది.

మహా పురాణ సంప్రదాయమున తెలుగులో వెలసిన పురాణ వాఙ్మయమంతా అనువాద సాహిత్యమేనని చెప్పవచ్చు. కవిత్రయము చే అనువదించబడిన మహాభారతమే పురాణ రచనకు కూడా మార్గదర్శకమైనది అని చెప్పవచ్చు. తెలుగులో కావ్య రచన, పురాణ ప్రక్రియ రెండూ పరస్పరం పోటీ పడ్డాయనవచ్చు. తెలుగు సాహిత్యానికి సంబంధించినంత వరకు క్రీ.శ. 13వ శ॥ నుండి క్రీ.శ. 15వ శ॥ వరకు పురాణాలకు స్వర్ణయుగము.

తెలుగులో పురాణ నిర్మాణ విధానమును గమనిస్తే ప్రధానంగా 4 రకాల శైలులు కనబడుతున్నాయి. 1) కథాకథన శైలి 2) భక్తిరస పోషణ శైలి 3) ఖండానువాద శైలి 4) అనువైద శైలి

మొదటి పద్ధతికి నన్నయ కొంత బాటలు వేయగా మారన మార్కండేయ పురానమున పూర్తిగా పాటించెను. వెన్నెలకంటి సూరన, నందిమల్లయ్య, ఘంట సింగనలు ఈ బాటను నడిచినారు. రెండవ దైవ భక్తి రసపోషణకు పోతన బాగవతమే పరాకాష్ఠ. స్థల తీర్థాభివర్ణనలతో నృసింహా పురాణము రచించిన ఎర్రనది మూడవశైలికాగా శ్రీనాథాదులు అనుసరించారు. క్షీణ యుగమున ప్రారంభమై ఆధునిక యుగము వరకు విస్తరించినది చివరి అనువాద సైలి. తెలుగు సాహిత్యంలో 16వ శ॥కు పూర్వము వెలిసిన రచనలు నమకాలీన సాంఘిక, సాహిత్య, మత ప్రయోజనాలను సాధించుటతో పాటు శాశ్వత సాహిత్య ప్రమాణాలను కూడా సాధించినవి. కాని తదనంతరం ఈ వ్యాప్తి తగ్గినదనే చెప్పవచ్చు.

పురాణ వాఙ్మయమునకు సంబంధించి పాల్కుర్కి సోమన, మారన, పోతన ఈ మువ్వురిని కవిత్రయము వలె చూడవచ్చు. సమకాలీన సమాజ ప్రయోజనాలను ఉద్దశించి విశిష్ఠ కవితా రచనా చేపట్టినారు. సోమన వీరశైవ మత ప్రబోధం కొరకు దేశి పద్ధతిలో రచించెను. మారన అద్వైత సిద్ధికి, జ్ఞాన భిక్షను అభిలషించి మార్కండేయ పురాణము రచించెను. భక్తి, జ్ఞాన మార్గములను సమపాళ్లలో సంగమించి చేసిన రచన భాగవతం. పోతనలో భక్తికి, జ్ఞానానికి సమత్వం లభించినందున సార్వకాలిక ప్రయోజనము నెరవేరి పురాణమునకొక సమగ్ర వ్యక్తిత్వమును సంపాదించి పెట్టినది. తెలుగులో పురాణమంటే 'భాగవతమే' అని రూఢి అయినది.

మారన రచించిన మార్కండేయ పురాణము తెలుగులో అనువదించబడిన మొదటి మహాపురాణము. హరిహరాభేద భక్తియుతుడైన గన్నసేనానికది అంకితము. తిక్కన కాలమున శైవ వైష్ణవములకు సంఘర్షణ ఏర్పడినది. అందుకే అద్వైతమును ప్రచారంలోకి తెచ్చుట ఒక ఉద్దేశ్యము. మార్కండేయ పురాణము బ్రహ్మర్షి నామముపై వెలసిన ఏకైక పురాణము. హరి హరాద్వైత సమర్థనీయము. దీనితో పాటుగా వల్కుర్కి దేశి పురాణమునకు వ్రతిగా ప్రాచీన సంప్రదాయమును పునరుద్ధరించుట, ద్విపదాదులు కాకుండా మార్గ సంప్రదాయోద్ధరణము, పురాణములను సాహిత్యమున ప్రతిష్టించవలెనను ఉద్దేశ్యము. ఈ కారణములచే మారన మార్కండేయ పురాణము రచించినట్లుగా తోచుచున్నది. మారన భావానువాద పద్ధతిని అనుసరించెను. మారన తర్వాత తెలుగులో ఎఱ్ఱాప్రగడ, కమలనాబామాత్యుడు, శ్రీనాథుడు, పోతన ఇలా ఎందరో ఈ మార్గము నాశ్రయించిరి. ప్రథమాంధ్ర దేశి పురాణముగా బసవ పురాణము ఒప్పారినా మారన రచించిన మార్కండేయ

పురాణమే ప్రథమాంధ్ర మహా పురాణముగా వాసికెక్కినది.

అష్టాదశ మహాపురాణములన్నింటిలో భాగవతమునకే తాత్త్వికులు అక్రతాంబూలమిచ్చి గౌరవించారు. భక్త యోగమును భాగవత రూపముగా తెలుగువారి కందించి ఆ కల్పాంత కీర్తిని సంపాదించుకొన్నాడు పోతన.

లలిత స్కంధము, కృష్ణమూలము, శు
కాలాపాభిరామంబు, మం
జులతా శోభితమున్, సువర్ణసు మనస్సుజ్జ్వేయమున్, సుందరో
జ్జ్వల వృత్తంబు, మహా ఫలంబు, విమల వ్యాసాలవాలంబు నై
వెలయున్ భాగవతాఖ్య కల్పతరువుర్విన్ సద్విజ శ్రేయమై

భాగవతము భక్తి ముక్తులను ప్రసాదించే పురాణ కల్పవృక్షము. పోతన రచనకు భక్త ప్రాణము పరమార్థము జ్ఞానము. అనువాదమే అయినా భాగవతమూలం కంటే అనువాదంలో ఎక్కువ పద్యాలున్నాయి. ప్రహ్లాద చరిత్రము, గజేంద్ర మోక్షము, వామనావతార ఘట్టము, శ్రీకృష్ణలీలలు, గోపికా విహారము, రుక్మిణీ కళ్యాణము, నరకాసుర సంహారము ఇలాంటి ఘట్టాలలో పోతన అత్యంత రసప్లావితములైన పద్యాలను రచించారు.

'చదివించిరి నను గురువులు', 'తను హృద్భాషల సఖ్యముల్', 'అందేందూదయముల్",

'కమలాక్షునర్చించు కరములు కరములు', 'సంసార జీమూత సంఘంబు విచ్చునే',

'కలడందురు దీనుల యెడ', 'లావొక్కింతయు లేదు', 'అల వైకుంఠపురంబులో',

'సిరికం జెప్పడు', 'ప్రాణేశ నీ మంజుభాషలు వినలేని', 'పరుజూచున్ వరు జూచు',

'రాకేందు బింబమై రవిబింబమై', వంటి పద్యాలెన్నో ప్రజల నాలుకల మీద ప్రతి నిత్యమూ తర తరాలుగా నిలిచియున్న పద్యరత్నాలే. ఇటువంటి పద్యాలు గల మహాపురాణము మరొకటి లేదనుట అతిశయోక్తి కాదు.

ఆంధ్ర మహాభాగవత పురాణమున 12 స్కంధములు గలవు. ఏకాదశ, ద్వాదశ స్కంధములను వెలిగందల నారయ, పంచమ స్కంధమున గంగన, షష్ఠస్కంధమును సింగవ కవి తెనిగించారని ప్రతీతి. తెలుగులో భాగవతము అద్వితీయం.

అష్టాదశ పురాణాల్లో 13 మాత్రమే అనువదించ బడినవి. స్కాంద, వాయు, అగ్ని, భవిష్య, బ్రహ్మ వైవర్తములు అనువదించబడలేదు. కానీ వాటిలోని కథలు అనువదించ బడ్డాయి. భాగవత, మార్కండేయ పురాణముల తర్వాత ప్రసిద్ధికెక్కినది 'వరాహ పురాణము' అంధ్రీకరించినట్లు చెబుతారు. పిల్లల మఱ్ఱి పినవీర భద్రుడు – నారదీయ మహాపురాణమును, పింగళి సూరన గరుడ పురాణమును, లింగ పురాణమును తెనాలి రచించెనని తెలియుచున్నది.

స్కాంధ పురాణమునందలి వివిధ భాగాలను గోదావరీ, కాశీ ఖండములను శ్రీనాథుడు వర్ణించెను. భీమేశ్వర పురాణమును శ్రీనాథుడు స్వతంత్రముగా రచించెను. కమలనాభామాత్యుడు పద్మ పురాణోత్తర ఖండమును రచించెను. విష్ణుపురాణ అనువాదములలో వెన్నెలకంటి సూరవ రచన ప్రసిద్ధి. నేడు తెలుగులో ప్రాచుర్యములో ఉన్న దేవీ భాగవతము దాసు శ్రీరామకవి గారిది. తిరుపతి వేంకట కవులు కూడా దేవీ భాగవతమును అనువదించిరి. మహా పురాణములకున్నన్ని అనువాదాలు ఉప పురాణాలకు లేవు.

ఆధునికములో చెప్పుకోదగిన పురాణములు రెండు 1) సూత పురాణము – త్రిపురనేని రామస్వామి చౌదరిగారు 2) ఆంధ్ర పురాణము – మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారు. ప్రాచీన పురాణ లక్షణములు లేకున్ననూ నవీన సమాజోద్ధరణకు అనుగుణంగా ఈ రచనలు చేయబడినవి గనుక ఇవి పురాణములు కాని పురాణములైనవి.

ఉపసంహారం:

తెలుగులో మహాపురాణానువాదము పుష్కలంగా సాగినది. ఖండానువాదము మరింత సమృద్ధిగా సాగినది. పురాణములు తెలుగు సాహిత్యములోని క్షేత్ర మహాత్మ్యములకు, కావ్య ప్రబంధాది ప్రక్రియలకు వస్తుదానం చేసి వాఙ్మయ వికాసమునకు తోడ్పడినది అని చెప్పుటలో అతిశయోక్తి లేదు. ప్రవచన కామల బుద్ధి బలంతో పురాణం నవ ప్రభలు వెదజల్లుతున్నదనటం నిర్వివాదం. ఇది ఆధునికుల్లో సద్భక్తినీ, జ్ఞానాన్ని మరింతగా ప్రకాశించేలా చేయాలని కాంక్షిద్దాం.

జైహింద్

References :

1. పురాన వాఙ్మయము – దివాకర్ల వేంకటావధాని
2. కావ్యాలంకార సంగ్రహము – సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి
3. బసవ పురాణము – పాల్కుర్కి సోమన
4. పురాణ వఙ్మయము – దివాకర్ల వేంకటావధని
5. భాగవతము – పోతన
6. భాగవతము – పోతన

ప్రయోగాత్మక నాటకం త్రిజాకీ యమదర్శనం

డాక్టర్ వై. శ్రీలత, తెలుగు ఉపన్యాసకురాలు, ఎస్.ఆర్.ఆర్ & సి.వి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వ), విజయవాడ,
చరవాణి: 9000120456

ఆంగ్ల విద్యా ప్రభావంతో తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించిన విశిష్ట ప్రక్రియల్లో నాటక ప్రక్రియ కూడా ఒకటి. ఆంగ్లవిద్య ప్రవరించిన వెలుగులో కందుకూరి, గురజాడలాంటి మేధావులు సమాజ స్థితిగతుల గురించి ఆలోచించడం మొదలుపెట్టి సంఘ సంస్కరణ దిశగా తమ కలాలను ఝళిపించారు. సామాజిక సమస్యలపై దృష్టి సారించి అప్పటికే వేళ్లూనుకున్న అస్పృశ్యత, పీడన, దుర్వ్యసనాలు, దురాచారాలు, స్త్రీ దుస్థితి మున్నగు సమస్యలను రచనా వస్తువులుగా స్వీకరించి అనేక ప్రక్రియలద్వారా సంఘాన్ని సంస్కరించే ప్రయత్నం చేశారు. వందేళ్ళు పూర్తి చేసుకున్న తెలుగు నాటకరంగం కూడా ఆ క్రమంలోనే సామాజిక సంస్కరణ ధ్యేయంతో తన ప్రస్థానాన్ని ఆరంభించింది. ఇందుకు నిదర్శనాలు అప్పట్లో వచ్చిన నందకరాజ్యం, మనోరమ, కన్యాశుల్కం, వరవిక్రయం వంటి తొలి తెలుగు నాటకాలే. నాటినుండి నేటివరకూ కాలానికనుగుణంగా ఎంతోమంది నాటక కర్తలు తమ తమ నాటకాల్లో, నాటికల్లో సమాజ పరిశీలన చేస్తూ వైవిధ్యం, విశిష్టత గల రచనలు చేస్తూ నాటకరంగ సాహిత్యాన్ని సుసంపన్నం చేయడంలో తమవంతు కృషి చేశారు, చేస్తున్నారు.

తెలుగు నాటకరంగంలో ముఖ్యంగా 1920ల తర్వాత నాటక రచనలో భావవ్యక్తీకరణ మరియు ప్రదర్శనా పద్ధతులలో వైవిధ్యం కనిపిస్తుంది. నాటక రచనలో అనేక ప్రయోగాలు కనిపిస్తాయి. ఈ ప్రయోగాలు, వైవిధ్యం అన్నిరకాల నాటకాల్లో, నాటికల్లో, ఏకాంకికల్లో కనిపిస్తుంది. తెలుగు నాటక రంగం స్వభావసిద్ధ వాదం, ప్రతీకవాదం, వాస్తవిక వాదం, అనిబద్ధ ధోరణి, అభివ్యక్తీకరణ వాదం వంటి కొన్ని పాశ్చాత్య నాటక రీతులను కొంతవరకు తనలో లీనం చేసుకుంది. ఆత్రేయ 'విశ్వశాంతి', 'భయం', ఎన్.ఆర్. నంది 'మరో మొహంజదారో', ఇసుకపల్లి మోహన్‌రావు 'ది గేమ్', యండమూరి 'కుక్క', గొల్లపూడి 'కళ్ళు', దివాకర్ బాబు 'కుందేటి కొమ్ము', అబ్బూరి గోపాలకృష్ణ 'త్రిజాకీ యమదర్శనం', శశిమోహన్ 'ఆర్', గణేశ్ పాత్రో 'అసురసంధ్య', తనికెళ్ళ భరణి 'గోగ్రహణం', కొక్కొరొకో వంటి ప్రయోగాత్మక నాటికలు, నాటకాలు అతికొద్ది మాత్రమే.

తెలుగునాట రంగస్థల వైభవానికి రాచబాటలు వేసిన దార్శనికుడు డా॥ అబ్బూరి గోపాలకృష్ణ. వీరు నాటక కర్తగానే కాక, కవిగా, చిత్రకారుడిగా, నటుడిగా కూడా చిరపరిచితులు. బాల్యంలో చిత్రకళపై అమితాసక్తిని కలిగిన అబ్బూరివారు, తండ్రి అబ్బూరి రామకృష్ణారావు నాటక రంగంలో ఉండడంచేత సహజంగానే ఆ రంగంవైపు మళ్లారు. తెలుగు నాటక రంగంలో ప్రయోగాత్మక నాటకాలు వ్రాసి తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. ఆయన వ్రాసిన తొమ్మిది నాటకాల్లో త్రిజాకీ యమదర్శనం ఒకటి. లయ, ఇంటర్వ్యూ, స్వాతంత్ర్యం వంటివి ఇతర నాటకాలు. ఇవన్నీ కలంలో వేడిని, ప్రదర్శనలో వాడిని కలిగి, బుర్రకు పదును పెట్టే నాటకాలు.

ఆధునిక ప్రదర్శన పద్ధతులో అందెవేసిన చేయి అబ్బూరి వారిది. శ్రీశ్రీ వ్రాసిన ప్రతీకాత్మక రేడియో నాటికల్లో ఒకటైన 'విదూషకుడి ఆత్మహత్య' నాటికను స్టేజి నాటికగా తీర్చిదిద్ది దాన్ని రంగస్థలంపై ఆవిష్కరించిన ప్రయోక్త అబ్బూరివారు. ఈ నాటకాన్ని మొదట ప్రదర్శించినప్పుడు దేవులపల్లి కృష్ణ శాస్త్రి, దాశరథి, మునిమాణ్యిం వంటి కాకలు తీరిన యోధులు తిలకించి మంత్రముగ్ధులయ్యారట. అలా అబ్బూరివారు శ్రీశ్రీ మెప్పు పొందారు.

త్రిజాకీ యమదర్శనం అబ్బూరివారు వ్రాసి, ప్రదర్శించిన గొప్ప ప్రయోగాత్మక నాటకం. అటు ప్రాచీన భారత నాటక రీతులు, ఇటు పాశ్చాత్య నాటక రీతులు రెండూ ఇందులో కనిపించడం విశేషం. తెలుగు నాటక రంగంలో మూస నాటకాలతో స్తబ్ధత నెలకొన్న దశలో వచ్చిన ఈ నాటకం అప్పట్లో ఒక సంచలనం. ఈ నాటకం 'హరిద సరళు' అనే పేరుతో కన్నడ భాషలోకి అనువదించబడింది. కర్నాటకలో సంవత్సరంపాటు ప్రదర్శించబడి 100 ప్రదర్శనలు పూర్తిచేసుకుంది. తెలుగు భాషలో ఈ నాటకం 80 మార్లు ప్రదర్శించబడింది. 1980 దశకంలో ఈ నాటకాన్ని ఆంధ్రప్రదేశ సంగీత నాటక అకాడెమీ ఆధ్వర్యంలో హైదరాబాదు ఫ్రెండ్స్ ఆర్ట్ థియేటర్ బృందంవారు విజయవాడలో హనుమంతరావు గ్రంథాలయంలో జనరంజకంగా ప్రదర్శించారు. ప్రముఖ నటుడు, దర్శకుడు శ్రీ చాట్ల శ్రీరాములు ఈ నాటకానికి దర్శకత్వం వహించారు.

నామౌచిత్యం:

మహాకవి శ్రీశ్రీ ఈ నాటకానికి 'త్రిజాకీ యమ దర్శన'మనే పేరు పెట్టారు. మూడు జాకీలు వచ్చినప్పటికీ అంతకన్నా మంచిముక్కలు వచ్చిన ప్రత్యర్థి చేతిలో ఓడిపోక తప్పదనే వాస్తవాన్ని సూచించడంకోసం ఈ పేరు. అధికారబలం, అర్థబలం, అంగబలం అనే త్రిజాకీలు (మూడు వ్యవస్థలు) సమాజాన్ని శాసించబోయినా, ప్రత్యర్థులైన సామాన్య ప్రజలు చైతన్యవంతులై తిరగబడితే ఏ వ్యవస్థ అయినా పతనం కాక తప్పదనే ప్రబోధాన్ని ఈ నాటకం అందిస్తుంది. పెట్టుబడీదారి వర్గానికి చిహ్నాలైన త్రిజాకీయముల దర్శనమే ఈ నాటకం.

కథా ప్రయోగం:

కథావస్తువు వర్తమాన రాజకీయాలకు సంబంధించింది. కథ మాత్రం గత వైభవాన్ని కోల్పోయిన ఉజ్జయినీ నగరంలో జరుగుతుంది. ఆ నగరాన్ని అన్ని అవలక్షణాలున్న ఒక రాజు పరిపాలిస్తూ ఉంటాడు. అతని చేతిలో బలైన పురోహితుని కథను ఇందులో చూస్తాం. భూస్వామి ధనగుప్తుడు, ధర్మాధికారి ధర్మపాలుడు మరో రెండు ముఖ్యపాత్రలు. పురోహితుని శిష్యుడైన రాహుల్ తన మాటల చాకచక్యంతో రాజు ఆట కట్టించడమే ఇందులోని కథ. ఈ పనిలో రాహుల్‌కి బైరాగి అనే బిచ్చగాడు, మైత్రేయుడనే సారా వ్యాపారి సహకరిస్తారు. ఇక్కడ వర్తమాన కథకు ప్రాచీన నేపథ్యం ఉండడం రచనా పరంగా జరిగిన ప్రయోగం.

రంగ నిర్వహణా ప్రయోగం:

ఆరు రంగాలు గల ఈ నాటకంలో మూడు రంగాలు రాజదర్బారులో, రెండు రంగాలు సత్రం దగ్గర, ఒక రంగం దేవాలయ ప్రాంగణంలో జరుగుతాయి. ఇలా మూడు నేపథ్యాలతో అతి తక్కువ సాధనా సామాగ్రితో భారీ సెట్టింగుల అవసరం లేకుండా, స్వల్ప మార్పులతో నేపథ్యాలను మార్చుతూ ఈ నాటకాన్ని ప్రదర్శించడం మూలాన ఎంతో ఖర్చు తగ్గించడం రంగనిర్వహణా పరంగా జరిగిన ప్రయోగం. ఉదాహరణకు ఒక కర్ర ద్వారాన్ని ఏర్పాటు చేయడంద్వారా సత్రపు నేపథ్యాన్ని తీసుకురావడం, దేవాలయ ధర్మ చిహ్నాన్ని ఏర్పాటు చేసి ఆలయ ప్రాంగణ నేపథ్యాన్ని సృష్టించడం, సాదాసీదాగా ఉండే రాజ సింహాసనాన్ని సమకూర్చడం, రాజదర్బారులోని ఆసనాల అమరికే మళ్లీ సత్రంలో అరుగులుగా, దేవాలయం మండపం మెట్లుగా ఉపయోగపడేలా రంగస్థలాన్ని తక్కువ ప్రదేశంలో, తక్కువ సామాగ్రిని వినియోగించడం వలన నిర్వహణా పరంగా ఇతర నాటకాలకు ఆదర్శంగా నిలిచింది.

ప్రతీకాత్మక పాత్రలతో ప్రయోగం :

నాటకంలో మొత్తం 29 పాత్రలున్నాయి. వీటిలో మూడు నాలుగు పాత్రలకు మాత్రమే పేర్లున్నాయి. పెట్టిన పేర్లన్నిటికీ సార్థకత ఉంది. పాశ్చాత్య నాటక రీతులతో ఒకటైన ప్రతీకవాదం ఈ నాటకంలో కనిపిస్తుంది. నాటకంలో పురోహితుడు ఎప్పుడూ పరుల హితాన్నే కోరుకునే

వాడు కనుక ఆ పేరు. శత్రుమిత్ర భావాలను సమంగా స్వీరించగల మనస్తత్వం సారా వ్యాపారిలో ఉంది కనుక అతని పేరు మైత్రేయుడు. ధనానికి అధిపతి కనుక ధనగుప్తుడు. ధర్మాన్ని పాలించేవాడు కనుక ధర్మపాలుడు. ఇక్కడ ఈ విధమైన పేర్లు పెట్టడంలో ప్రయోగం ద్వారా నాటక కర్త ఆయా పాత్రలకు సంబంధించిన ఒక వ్యంగాన్ని, ఒక వాస్తవాన్ని ఏకకాలంలో మనముందుంచుతారు. ఉదాహరణకు ధర్మాన్ని పాలించే ధర్మపాలుడు ఎప్పుడూ అధర్మం చెబుతుండడం వ్యంగ్యం కాగా, కలియుగంలో ధర్మం ఒంటి కాలిమీద నడుస్తుందనే వాస్తవాన్ని దృశ్యమానం చేయడానికి ధర్మపాలునికి కుంటికాలు పెడతారు. రాహుల్ పాత్రద్వారా బుద్ధుని అహింస సిద్ధాంతం సూచితం. ఇలా ఈ నాటకంలో రాజు అధికారబలానికి, ధనగుప్తుడు అర్థబలానికి, ధర్మపాలుడు అంగపాలుడు ప్రతీకలు.

యక్షగాన ఫణితితో ప్రయోగం:

ఇది పూర్వపద్ధతే. కానీ, ఈ విధానాన్ని ఆధునిక వర్తమాన కథాంశంతో జోడించడం ఒక ప్రయోగంగా చెప్పుకోవాలి. సూత్రధారి అనదగిన విష్ణుశర్మ నాందీ వాచకంతో కథ మొదలవుతుంది. విష్ణుశర్మ ప్రతీ సన్నివేశం చివర వచ్చి, పాత్రలపై, వాటి మనస్తత్వంపై కొన్ని విమర్శలు చేసి భావికథను సూచించి వెళ్తాడు. సూత్రధారుడు వచన కవితలో మాట్లాడటం ఒక ప్రయోగం. అలంకార శాస్త్రం, నాట్య శాస్త్రంపై అవగాహన లేని ఆధునిక తరంవారికి ఈ ప్రయోగాలు కొత్తగా అనిపిస్తాయి. ఇలాంటి ప్రయోగాలు ఆత్రేయగారి 'విశ్వశాంతి' లోనూ, ఏ.ఆర్. నందిగారి 'మరో మొహంజదారో'లోనూ కనిపిస్తాయి.

ముగింపు :

అబ్బూరి గోపాలకృష్ణ గారి నాటకాలలో త్రిజాకీయమదర్శనం ఆంధ్రనాటక రంగస్థలంపై జరిగిన ప్రయోగానికి సూచిక. ఈ నాటకం సామాజిక ప్రయోజనాన్ని కలిగి, ప్రేక్షకులకు, పాఠకులకు భావ విప్లవ సందేశాన్ని అందిస్తుంది. అయితే నాటకంలో చాలా ఎక్కువ పాత్రలు కనిపిస్తాయి. పాత్రల సంఖ్యను కుదించడం వలన ఈ నాటకాన్ని ఆధునిక వీధి నాటకంగా ప్రదర్శించే వెసులుబాటు కలుగుతుందని ఈ నాటక ప్రదర్శనపై సమీక్ష చేసిన శ్రీ పురాణపండ రంగనాథ్ అన్నారు. ఇది వాస్తవం. అప్పుడు ఇలాంటి ప్రయోగాత్మక నాటకాలకు మరింత సార్థకత చేకూరుతుంది.

ఆధార గ్రంథాలు:

1. అక్షర స్ఫటికాలు – పురాణపండ రంగనాథ్, 1982
2. ప్రపంచ రంగస్థలి, డాక్టర్ జంధ్యాల రాధాకృష్ణ, గోపీచంద్ పబ్లికేషన్స్ ప్రచురణ, సూర్యాపేట, 2006
3. వజ్రభారతి, కృష్ణా జిల్లా రచయితల సంఘం ప్రచురణ, 2007
4. సాక్షి వ్యాసాలు డిసెంబర్ 2011, జనవరి, 2012.

ముదిగంటి సుజాతారెడ్డి అలంకార విమర్శ ధోరణి-విశ్లేషణ

శ్రీపతి మారుతి, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం. మొబైల్ : 9154238058

పరిచయం

తెలుగు ఆలంకారిక సాహిత్య విమర్శరంగంలో ఇంతవరకు చాలా కృషి జరిగింది. భరతుడి నుండి జగన్నాథ పండితరాయల వరకు సాహిత్యానికి సంబంధించిన ఎన్నో రకాల వివిధ చర్చలు, సిద్ధాంతాలు వాటి మీద జరిగిన వాదోపవాదాలు, ఆలోచనలు చేశారు. ఈ చర్చలు, అభిప్రాయాలన్నింటిని గ్రంథరూపంలో వెలువరించిన వారిని అలంకారికులని దీన్ని మొత్తంగా కలిపి సాధారణంగా ఆలంకారిక ప్రవృత్తి అని వ్యవహరించడం జరుగు తుంటుంది. ప్రపంచానికి ఒక గొప్ప ధ్వని సిద్ధాంతాన్ని అందించిన ఆనందవర్ధనుడు తన సిద్ధాంత ప్రారంభంలో ***"కావ్యస్యాత్మా ధ్వనిరీతి బుధైర్యస్సమామ్నాత పూర్వః తస్యభావం జగదురపరే భక్తా నుహూస్తదన్యే,/కేచి ద్వాచాం స్థితమవిషయే తత్త్వ మూచుస్త దీయం తేన బ్రూమః సహృదయ మనఃప్రీతయే తత్స్వరూపమ్" (1-1)*** అని చెప్పిన దాన్ని బట్టి, ధ్వనికి సంబంధించిన చర్చలు అంతకముందే సాగుతున్నాయని అర్థం చేసుకోవచ్చు. దాదాపుగా అలంకారికులు తమ పూర్వుల అభిప్రాయాలను ప్రాతిపదికగా చేసుకొని ముందుకు సాగినట్లు అంటే కావ్యవిమర్శ అనేది ఒక రకమైన అనుసరణ మార్గాన్ని పాటించినట్లు అవగతమవుతుంది.

భారతీయ సాహిత్య వివేచనా సంప్రదాయంలో రీతి అనేది ఒక విప్లవాత్మకమైన అంశం. దీనిలో అంతకముందు లేని 'కావ్యాత్మ' అనే ఒక నూతన భావనను వామనుడు బయటకి తీసుకువచ్చాడు. 'కావ్య శోభాకరా నర్థన్ అలంకారాన్ ప్రచక్షతే' అని దండి చెప్పగా, 'సౌందర్య మలంకరః' అని శబ్దం యొక్క విస్తృత పరిధిని మొదటిసారిగా వామనుడు ప్రకటించాడు. కుంతకుడు 'వక్రోక్తి' జీవితంలో ప్రకరణ ప్రబంధ వక్రతలుగా కథ నిర్వహణ విషయాన్ని ఉదహరణ యోక్తంగా వివరించాడు. భవభూతి మహాకవి తన ఉత్తర రామచరితలో తృతీయాం కాంతాన తమసా వాక్యంగా 'అహో సంవిధానకమ్' అని కథా సంవిధానాన్ని గురించి తెలియజేశాడు. ఈ విధంగా సాగిన ఆలంకారిక వివేచన, కావ్యం సాధించవలసిన అంశాలను అంటే కావ్య ప్రయోజనం నిర్ధారించుకుంటూనే ముందుకు సాగింది. భరతుని కాలం నుండే మనం ఈ రకమైన అలంకార ప్రవృత్తిని గమనించవచ్చు కానీ సామాజిక వ్యక్తుల్లో ఎంత వైవిధ్యముందో, సామాజిక కావ్యాల్లో కూడా అంతే వైవిధ్యం ఉంది. ఈ అంశాన్ని ఆలంకారిక వివేచన గుర్తించింది. ఈ వైవిధ్యాన్ని గుర్తిస్తూ, ఆలంకారిక మార్గంలో కాల్పనిక సాహిత్యానికి అన్వయిస్తూ ప్రయోగాలూ చేసిన వారు ముదిగంటి సుజాతారెడ్డిగారు. ఆలంకారిక శాస్త్రంపై సాధికారమైన పట్టుతో మను వసుచరిత్రల తులనాత్మక పరిశీలన, శ్రీనాథుని కవితా సౌందర్యం, బాణుని కాదంబరి పరిశీలన, వేమన నాథసంప్రదాయం పేరుతో రాసిన గ్రంథాలు సుజాతగారి అలంకారిక విమర్శనా కోణాన్ని తెలియపరుస్తున్నాయి. వీటిలోని కొన్ని అంశాలను పరిశీలించడమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

ముదిగంటి సుజాతారెడ్డి-విమర్శ ధోరణి

తెలుగు సాహిత్య ప్రక్రియల్లో బహుముఖ ప్రజ్ఞ కలిగిన విమర్శకులుగా ముదిగంటి సుజాతారెడ్డిగారు సుప్రసిద్ధులు. ప్రాచీన సాహిత్యం మీద మంచి పట్టు ఉన్న విదూషీమణి. సుజాతారెడ్డిగారు ఒకవైపు సృజనాత్మక సాహిత్య సృజన చేస్తూనే, మరోవైపు అంతే నైపుణ్యంతో సాహిత్య చరిత్రలు, నవలా విమర్శ, రసచర్చ వంటి వాటితో మంచి విమర్శకులుగా పేరు పొందారు. తెలుగు సాహిత్యంపై మాత్రమే కాకుండా సంస్కృత, హిందీ, ఆంగ్ల సాహిత్యాలపై

మంచి అవగాహన కలిగిన సాహిత్యకారులు ముదిగంటి సుజాతారెడ్డిగారు. శ్రీనాథుడు–పెద్దన–రామరాజభూషణుడు – వేమన– బాణుడు ఇలా ప్రాచీన సాహిత్యాన్ని ప్రభావితం చేసిన కవులందరి రచనలను ఆలంకార దృష్టితో సమీక్షించిన అనుభవం సుజాతారెడ్డిగారి విమర్శలో దర్శనమిస్తుంది.

మాధుర్యము

చక్కని విడి విడి పదాలతో విలసిల్లు వాక్యమే మాధుర్యమని ప్రతాపరుద్రుడు అనగా అవి పెద్దన, రామరాజభూషణుల రచనల్లో ప్రదర్శించిన తీరును,

ఉ. "అక్కట వాడు నాతగుల మారడిచేసి దయావిహీనుడై
చిక్కక త్రోచి పోయే దరి జేరంగ రాని వియోగసాగరం
బెక్కడ నీదుదాన నిక నీకోరనోములు నోచినట్టినే
నెక్కడ వానికౌగి లది యెక్కడ హావిధి యేమి సేయుదున్" (మ.చ 3–4) అని ప్రవరుడు

తిరస్కరించిన వరూధిని అడవంత తిరిగి తన చెలికత్తెల దరి చేరి, తన మనస్సులో అయ్యో, అతడు నాకు నేనే అతన్ని వలచిన నన్ను తిరస్కరించెను కదా! ఈ విరహ సముద్రాన్ని నేను ఎలా ఇదగలను? తక్కువ నోములు నోచిన నేను ఎక్కడ? అతని కౌగిలి ఎక్కడ? ఓ దైవమా నేనేమి చేయగలను? అని అంటూ వరూధిని విరహావస్థను పెద్దన చెప్పిన తీరులో మాధుర్యగుణము ప్రస్ఫుట మవుతుందని చెబుతూ, శాంత, శృంగార ప్రధానమైన మనుచరిత్రలో ఇలాంటి గుణములు కోకొల్లలుగా ఉన్నట్లు ముదిగంటి సుజాతారెడ్డిగారు తన పరిశోధన గ్రంథంలో భాగంగా విశ్లేషించారు. "శైలకులేంద్రు డిట్లు మదశాలి శు కాలి పికాలి శారికా.." (వ.చ.2–117) శుక్తిమతి కోసం కోలహలుడు మన్మథావస్తలో కోకిల, గోరువంక, నెమలి వంటి పక్షుల ధ్వనులచేత ఎలాంటి ఉపశమనం లేకుండా ఉన్నాడు. శుక్తిమతిని కలవడమే పరిష్కారమని నిర్ణయించు కున్న కోలహలుని స్థితిని రామరాజభూషణుడు వివిధ రకాల పదాల కూర్పుతో పద్యంలో మాధుర్య గుణమును ప్రదర్శించినట్లు ముదిగంటిగారు పేర్కొన్నారు. మను వసుచరిత్రల తులనాత్మక పరిశీలన గ్రంథంలో ఔదార్యం, అర్థవ్యక్తి, సుకుమారము, కాంతి, ఓజస్సు, మొదలైన గుణాలను గురించి కూడా ప్రతిదానికి ఉదాహరణయుక్తంగా ఆమె అందించారు. పెద్దన కవిత్వం కైశికి వృత్తితో కూడి, ప్రసాద మాధుర్య గుణములతో వైదర్భీ రీతిలో, ద్రాక్షాపాకములో నడచినదని, రామరాజభూషణుని కవిత్వం ఆరభటీ వృత్తితో కూడి ఓజఃకాంతి గుణాలతో గౌడిరీతిలో, నారికేళపాకములో నడిచినదనే కావ్యాలంకార సంగ్రహ వ్యాఖ్యలోని సన్నిధానం సూర్యనారాయణశాస్త్రిగారి అభిప్రాయాన్ని ఈ సందర్భంగా సుజాతారెడ్డిగారు ఉటంకించారు.

శ్రీనాథుని స్వకల్పన

శ్రీనాథుడు తెలుగు పద్యానికి తనదైన శైలిలో సరసతను చేకూర్చి పెట్టినవాడు. అందుకే తెలుగులో మొదటిసారిగా శైలీ సౌందర్య అవశ్యకతను గుర్తించింది శ్రీనాథుడే అంటారు రచయిత్రి (శ్రీనాథుని కవితా సౌందర్యం. పుట.80). శ్రీనాథుని కన్న ముందు ఎంతోమంది కవులు వారెవరికి శైలి సౌందర్యం సాధించాలనే స్పృహలేనట్లు కనిపిస్తున్న విషయాన్ని ఆమె ఈ సందర్భంగా తెలియజేశారు. శ్రీనాథుడు తన కావ్యపీఠికలో విశేషమైన భావ సౌందర్య, శైలిగల పద్యాలను అందించినట్లు శ్రీనాథుని కవితా సౌందర్యం గ్రంథంలో ముదిగంటి సుజాతారెడ్డిగారు ఆ భావ సౌందర్యాన్ని కొన్ని పద్యాల్లో విశ్లేషించి చూపారు. నలుడు దమయంతి గురించిన విరహాన్ని హంసతో చెబుతున్న సందర్భంలోని పద్యం శ్రీనాథుని పద్యరచన శైలిని తెలియజేస్తుంది.

విషమో మలయహిమన్డలీ
విషవూత్కర మాయోమయోహితః
బతకాలకలత్రదిగ్భవః
పవనస్త ద్విరహానలై ధసా (నై. చ.2–57)

సంస్కృత నైషధంలో హర్షుడు రాసిన పై పద్యాన్ని శ్రీనాథుడు తెలుగు చేసే క్రమంలో చూపించిన నైపుణ్యం ఆయన శైలి గొప్పతనానికి ఒక తార్కాణంగ నిలిచిందన్నారు సుజాతగారు.

శా. కాలాంతఃపురకామినీ కుచతటీ కస్తూరికాసౌరభ
శ్రీలుంటాకము చందనాచల తట శ్రీఖండ సంవేష్టిత
వ్యాలస్పారవణా కఠోర విషనిశ్వాసాగ్ని పాణింధమం
బేలానాపయి దక్షిణానిలము పక్షీ! సేయు దాక్షిణ్యమున్
(శ్రుం.నై. 2-32)

నైషధచరిత్రలో గల 'కాల కలత్ర దిగ్భవః పవనః' (కాలుని భార్యయైన దక్షిణ దిక్కున పుట్టిన పవనం) అనే భావానికి శ్రీనాథుడు 'కాలాంతఃపురకామినీ కుచతటీ కస్తూరికా సౌరభ శ్రీలుంటాక' (కాలుని అంతఃపుర స్త్రీల వక్ష స్థలం మీద ఉన్న కస్తూరి యొక్క సువాసనలను నిర్ధాక్షిణ్యంగా కొల్లగొట్టిన దక్షిణానిలం) అనే భావం శ్రీనాథుడు తన ప్రతిభచే స్ఫూరింపజేశాడని ముదిగంటిగారు అనుశీలించారు.. కావ్యం స్వతహాగా శబ్దప్రధానం కావటం వల్ల సంస్కృత కావ్యాలని తెలుగులోకి అనువదించే సాహసం మరెవరూ చెయ్యలేకపోయారు. కాని మిగిలిన కవులకి ఇబ్బందిగా నిలిచిన ఈ అడ్డంకిని శ్రీనాథుడు సులభంగా దాటేశాడు. దీనికి శ్రీనాథుని శృంగార నైషధంలోని పై పద్యం వంటి వాటిని ఉదాహరణకు చెప్పుకోవచ్చు. శ్రీనాథుని కవితారీతి శబ్దార్థాలకు సమానమైన ప్రాధాన్యత కలిగివుంటుందని చెబుతూ, ఆయన దృష్టి సమాన సౌందర్యాన్ని సాధించడం మీద ఉంటుందని తెలియజేశారు. అందుకే పెద్దన వంటి కవులు శ్రీనాథుని సరసశైలిని, పదాల కూర్పును గ్రహించడమే కాకుండా భావ భంగిమలను అనుకరించి విజయం సాధించారని రచయిత్రి భావించారు.

అలంకారములు

కావ్య శోభను పెంచేవి అలంకారములు. ఒక రచనలో అలంకారాల ప్రయోగం ద్వారా వాటి శోభను మరింత పెంచడం సాధ్యమవుతుంది. అలంకారాల ప్రయోగంలో అత్యున్నత స్థాయి 'వ్రక్రోక్తి. కవిత్వం స్వభావోక్తి, వ్రక్రోక్తి రెండు రకాలుగా ఉంటుందని భామహుని అభిప్రాయం. అటువంటి అలంకారాలకు ప్రబంధాలు ఒక గని లాంటివి. అలంకారములు కవి భావాన్ని, కావ్య వస్తువును స్పష్టంగా దర్శింపజేసి, సహృదయులకు ఆనందం కలిగిస్తాయి. ఇటువంటి అలంకారాల ప్రభావాన్ని ముదిగంటి సుజాతారెడ్డిగారు ఆమె 'మను వసుచరిత్రల తులనాత్మక పరిశీలన' గ్రంథం ఆధారంగా విశ్లేషించే ప్రయత్నం చేశారు. ఆంధ్రసాహిత్యంలో అలంకారాలను అధికంగా ఉపయోగించినవి మను వసుచరిత్ర ప్రబంధాలే. పెద్దన, రామరాజభూషణులు వీటిని అర్థాలంకారలు, శబ్దాలంకారాలు రూపంలోనే ప్రయోగించారు. మను చరిత్రలో సహజ అలంకార శోభనే అధికంగా కనిపిస్తుంది. పెద్దన భావస్పష్టత, వస్తుసందర్శన, సజీవదృశ్యచిత్రణ మాత్రమే అలంకారాలను ఉపయోగించాడని తెలియజేస్తూ, పెద్దన రామరాజభూషణులు వివిధ సందర్భాల్లో ఉపయోగించిన అలంకారాలను పద్యాలను ఆధారంగా చేసుకొని విశ్లేషించారు.

పెద్దన స్వభావోక్తి, ఉపమ, ఉత్ప్రేక్ష, రూపక అర్థాంతరన్యాస, అతిశయోక్తి అలంకారాలను ఎక్కువగా, స్వభావోక్తి ఉత్ప్రేక్షలను మరింత అధికంగా వాడినట్లు చెప్పవచ్చు. కావ్యంలోని పాత్రల స్వరూపాలను, వాటి చేష్టలను వర్ణించే సమయాల్లో స్వభావోక్తి అలంకారాన్ని ఉపయోగించారు. అలాగే మనుచరిత్రలో వృత్త్యానుప్రాస, ఛేకానుప్రాస, యమకం, అంత్యానుప్రాస, వంటి అలంకారాలను కూడా విరివిగానే వాడారు. మను వసుచరిత్రల్లో అలంకారల గురించి చెబుతూ, వసుచరిత్రలోని ప్రతి పద్యం ఒక అర్థాలంకార వైచిత్రిని గాని, శబ్దలంకార వైచిత్రినిగాని ప్రతిబింబిస్తుందని ముదిగంటిగారు అన్నారు. రామరాజభూషణుడు, పెద్దన ఇరువురు పద్యాల్లో అనేక అలంకారల కూర్పుతో కూడిన

కొన్ని సంసృష్టి అలంకారాల పద్యాలు కూడా కనిపిస్తున్నట్లు పేర్కొన్నారు. ''పెద్దనార్యుడు అలంకారవర్ణన లతిమాత్రముగజూపక తన కవిత్వమున స్వభావ మాధుర్య రసమే కురిపించినాడు. ఇట్లుగాక యలంకార వర్ణన లేక్కువచూపుటయే 'సాహిత్య రస పోషణాధికార' మెక్కువ కలిగియుండుటకు గురుతను నెడల బట్టుమూర్తియే పెద్దనార్యున కంటె నెక్కువవాడనవచ్చును. ఇట్లయినచో "పొందుపరచు నలంకృతుల్ భూషణార్థి!" యని యప్పకవి సప్తవిధకవుల బెర్కునుటలో జెప్పినట్లు బట్టుమూర్తిని మనము 'భూషణార్థి' యనియు జెప్పవచ్చును" (మను వసు చరిత్ర రచనా విమర్శనము. పుట 57) అని అలంకార వర్ణన నైపుణ్యాన్ని పొంది మూర్తికవి 'భూషణుడు' అనే తన పేరును సార్థకం చేసుకున్నట్లు వెన్నేటి రామచంద్రరావుగారన్నారు. కాని అల్లసాని పెద్దన మనుచరిత్రలో స్వభావోక్తి అలంకారాన్ని 67 సార్లు ఉపమ, రూపమాలంకారాలను 50 సార్లు, అతిశయోక్తిని 30సార్లు వాడిన మూర్తికవి భట్టుమూర్తి మాత్రం ఉత్ప్రేక్షను అధికంగా వాడినట్లు సుజాతగారు తెలిపారు.

భూషణుడు-శ్లేష నైపుణ్యం

వసుచరిత్ర శ్లేష ప్రధానమైన కావ్యంగా విమర్శకులు అభివర్ణించగా దీనిపై సాహిత్యంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. వజల చినసీతారామశాస్త్రిగారు తన వసుచరిత్ర విమర్శనములో వసు చరిత్ర శ్లేషకావ్యమా? ధ్వని కావ్యమా? అని చర్చించి వసు చరిత్రను ధ్వని కావ్యంగానే పేర్కొన్నారు. (వసు చరిత్ర విమర్శనము. పుట 84) అస్సలు రెండు అర్థాలను ఇచ్చే పదాలని శ్లేష అంటారు. ఇందులోని కొన్ని భేదాల చేత, ఇవి ప్రకృతశ్లేష, అప్రకృతశ్లేష, ప్రకృతాప్రకృత శ్లేష అనే విధంగా విభజించవచ్చు. పింగళి సూరన తన రాఘవపాండవీయంలో శ్లేషలో అనేక రకాలను తెలియ జేశాడు. రామరాజభూషణుడు రాసిన 'హరిశ్చంద్రన లోపాఖ్యనం' ద్వారానే శ్లేషకు సరితూగు అర్థద్వయ ఘటనా ప్రీతిని అర్థం చేసుకోవచ్చునని రెడ్డిగారన్నారు. చిత్రకవిత్వంనందు భూషణుడు అప్పటికే ప్రసిద్ధిచెందిన పెద్దన ప్రభావంతో ప్రబంధ రచన మొదలుపెట్టినట్లు ముదిగంటిగారు చెప్పారు. కాని పూర్తిగా పెద్దనవలె చిత్ర, బంధ కవిత్వాలపై ఆధారపడకుండా తన స్వప్రతిభచే అలంకారాల్లో గొప్పదైన శ్లేషను ఆయన పద్యాల్లో ఉ పయోగించాడని రచయిత్రి అన్నారు. శ్లేష విషయంలో రామరాజభూషణుడు సంస్కృత కవులైన బాణుడు, సుబంధు, శ్రీహర్షుడు వంటి వారితో సరితూగుతాడని సుజాతగారు భూషణుడిని కొనియాడారు.

నిరలంకార సౌందర్యం

పద్యం అంటేనే అలంకారాలతో నిండిందన్న భ్రమ చాలామందికి ఉంటుంది. ప్రాచీన అలంకారికుడైన విశ్వనాథుడు **"వాక్యం రసాత్మకమ్ కావ్యమ్"** అన్నాడు. అలంకారమే కావ్య శోభ. అందుకే **"కావ్య శోభాకరాన్ ధర్మాన్ అలంకారాన్ ప్రచక్షతే"**(కా. 2-1) అని అన్నాడు . ఇలా అలంకారికులు ఎవ్వరూ అలంకార రహిత శబ్దార్థాలను రమ్యమైన కావ్యంగా పరిగణించినట్లు కనిపించదు. అందుకేనేమో కావ్య శాస్త్రానికి అలంకారశాస్త్రమని పేరు పెట్టినట్లు అనిపిస్తుంది. కాని అలంకారం లేకుండా కూడా కవితా శోభను సాధించవచ్చని నిరూపించినవాడు శ్రీనాథుడు. తెలుగు సాహిత్యంలో అలంకారాలను చాలా తక్కువ సంఖ్యలో ఉపయోగించిన కవులలో శ్రీనాథుడు దుంటాడు. వార్త మాత్రమైన విషయాలను కూడా శ్రీనాథుడు తన శబ్దార్థాల శక్తిచేత రమణీయం చేయగలడని శ్రీనాథుని నిరలంకారశైలి గురించి ముదిగంటి సుజాతారెడ్డిగారి 'శ్రీనాథుని కవితా సౌందర్యం' గ్రంథంలో కొన్ని పద్యాల సహాయంతో విశ్లేషించిన విమర్శ ద్వారా ఈ విషయం అర్థమవుతుంది.

నీ. సిద్ధవాహిని నీట జిరుబంతి పసుపాడి
శ్రీ విశాలాక్షి కైసేయ దేడగే

మొరసె నంతర్గేహమున విస్వనాయక
తాండవారంభ మర్ధలరివంబు...(భీ.ఖం 2- 28)"

పై సీసపద్యంలో సంధ్యాగమంతో విశాలాక్షి స్నానంచేసి అలంకరించుకోవడం ప్రారంభించింది. శివుని తాండవానికి మద్దెలు మోగినవి. పానగోష్టికి భైరవుడు సిద్ధం చేయసాగాడు. కుమారస్వామి వాహనం కొక్కరకో అని కూయసాగింది. ముడుచుకునే పద్మాలను విడిచి తుమ్మెదలు విఘ్నేశ్వరుని చెక్కిళ్ళని చేరాయి వంటి వార్త విషయాలను సైతం శ్రీనాథుడు స్నానానికి బదులు 'చిరుబంతి పసుపాడి' గంగానదిని 'సిద్ధవాహిని' అని వాడుతూ ఎలాంటి అలంకారాలను ఉపయోగించకుండ పాఠకులను ఆకట్టుకున్నాడని సుజాతారెడ్డిగారు పద్య సహాయంతో శ్రీనాథుని నిరలంకారంలో రమణీయార్థాకాన్ని కొంత నిరూపించే ప్రయత్నం చేశారు.

వర్ణన నైపుణ్య రీతి

అష్టాదశ వర్ణనలకు నిలయమైన మనుచరిత్ర, వసుచరిత్రల్లో వర్ణనల గురించి ముదిగంటి సుజాతారెడ్డిగారు భావ, శైలి సంబంధ విషయాలను ఉదాహరణ యుక్తంగా పరిశీలించారు. ముఖ్యంగా వర్ణనలు ఉపయోగించడానికి అనేక రకాల కారణాలు ఉన్నాయి. కథలోని ఒక విషయాన్ని సులభంగా అర్థం చేసుకోవడానికి అలాగే కథలో జరుగబోయే సన్నివేశాన్ని తెలియజేయడానికి వర్ణనలు రచయితకి ఎంతగానో సహకరిస్తాయి. ప్రస్తుతకాలంలో అనేక సినిమాల్లో కూడా వర్ణనను రూపాంతరం చెందించి సంఘటన బట్టి వర్ణనకు బదులుగా అక్కడి వాతావరణాన్ని తయారు చేయడం మనం గమనించవచ్చు. ప్రబంధాల్లో ఉన్న అష్టాదశ వర్ణనలన్నింటిని సుజాతారెడ్డిగారు విశ్లేషించే ప్రయత్నం చేశారు. ఆ విశ్లేషించిన తీరును కుమారోదయ వర్ణనలో పరిశీలించవచ్చు. కుమారోదయాన్ని అలంకారికులు మహాకావ్య వర్ణనలో ఒకదానిగా పేర్కొన్నారు. మనుచరిత్రలో స్వరోచిస జనన వృత్తాంతాన్ని పెద్దన ఐదు పద్యాల్లో (మ.చ.4:5-9) జననం, నామకరణం, బాల్యక్రీడలు,- విద్యాభ్యాసం వంటి వాటిని కుమారోదయంలో చిత్రించే సందర్భాల్లో వర్ణించాడని వివరించారు. **"స్వరుచి స్ఫురణను శశి భా/స్కర పావక తారకా ప్రకాశములెల్లన్/విరళములు సేయ నతనికి/స్వరోచియను నామమిడి రచటి మునులెల్లన్"** (మ.చ. 4-7) స్వరోచికి స్వరుచి స్ఫూరణను ఆధారంగా మునులు అతనికి ఆ పేరు పెట్టారని పెద్దన చెప్పగా, రామరాజభూషణుడు గిరికా వసుపదుల జననం గురించి పదమూడు పద్యాల్లో (వ.చ. 3: 22-34) చెప్పగా, నామకరణం గురించి కింది విధంగా "గిరిరాజతనయ కైవడి/ సిరి రాజిల వెలయు నీ సుశీలయనుచు నా/గిరికన్య కచటి మౌను లు/గిరికా శుభనామ మిడిరల్భిష ఘణితిన్" (వ.చ.3-26) అని వసుచరిత్ర కర్త వర్ణనా నైపుణ్యాన్ని సుజాత రెడ్డిగారు వెల్లడించారు. ఈ విధంగా ముదిగంటి సుజాతా రెడ్డిగారు మను-వసు చరిత్రలలోని అష్టాదశ వర్ణనలన్నింటిని తారతమ్య దృష్టితో పరిశీలించిన ప్రయత్నం 'మను-వసు చరిత్రల తులనాత్మక పరిశీలన' గ్రంథంలో కనిపిస్తుంది. ఇందులో మహాకవులు ఇద్దరు ఔచిత్యాన్ని బట్టి వర్ణపోషణ చేశారన్నారు. ముదిగంటి పరిశీలించిన తదితర సన్నివేశాలు, వర్ణనల సామ్యాన్ని అనుసరించి రామరాజభూషణుడు మనుచరిత్రను అనుసరించి తన వసుచరిత్రలో స్థానం కల్పించినట్లు విమర్శించారు. కాని మనుచరిత్రలోని వర్ణనలు కథానుగుణంగా ఉండంగా, వసుచరిత్రలో వర్ణనలు కొంత విస్తృతిని పొందినట్లు అనిపిస్తుంది. ఈ విధంగా ముదిగంటి సుజాతారెడ్డిగారు ప్రాచీన గ్రంథాలను బహూ కోణాలలో ఒక కావ్యాన్ని విశ్లేషించిన నైపుణ్యాన్ని బట్టి వారి ఆలంకారిక విమర్శనా తత్వమెంటో అవగతమవుతుంది.

ఉపయుక్త గ్రంథ సూచిక

1. రామారావు ఎస్వీ. తెలుగులో సాహిత్య విమర్శ. హైదరాబాద్: పసిడి ప్రచురణలు, 2017.
2. లక్ష్మణ చక్రవర్తి, సి.హెచ్, సంపత్కుమారాచార్య, కోవెల (సంపా). తెలుగు సాహిత్య విమర్శదర్శనం (విజ్ఞాన సర్వస్వం సంపుటం:). హైదరాబాదు: కొమర్రాజు వేంకట లక్షణరావు విజ్ఞాన సర్వస్వ కేంద్రం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2016.
3. సుజాతారెడ్డి ముదిగంటి & ముదిగంటి గోపాలరెడ్డి. బాణుని కాదంబరి పరిశీలనం: హైదారాబాద్ రోహణం ప్రచురణలు, 1980.
4. సుజాతారెడ్డి ముదిగంటి. మనువసుచరిత్రల తులనాత్మక పరిశీలనం. హైదరాబాద్: శ్రీ విజయ ప్రింటర్స్, 1981.
5. సుజాతారెడ్డి ముదిగంటి. వేమన నాథ సంప్రదాయం. హైదరాబాద్: శ్రీశాంతా ఆర్ట్ ప్రింటర్స్, 1993.
6. సుజాతారెడ్డి ముదిగంటి. శ్రీనాథుని కవితా సౌందర్యం. హైదారాబాద్: రోహణం ప్రచురణ. మార్చి 1980

భానుమతి నవలలో సంఘ సంస్కరణ భావాలు

అంకిరెడ్డి సునీల్ కుమార్ రెడ్డి, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం,
హైదరాబాదు. 7382301101

సాంఘిక దురాచారాలుగా నేడు మనం చెప్పుకునే బాల్య వివాహాలు, సతీ సహగమనం, కన్యాశుల్కం, వరకట్నం, అస్పృశ్యత, కులవ్యవస్థ, జోగిని వ్యవస్థ, భ్రూణహత్యలు, స్త్రీ పురుష అసమానతలు, మద్యపానం, వేశ్యాలోలత్వం మొదలైనవన్నీ కూడా సాంఘిక సమస్యలే. వీటి నుండి బయటపడితేగానీ సమాజం అభివృద్ధి పథం వైపు నడవదు. అందుకనే ఆనాటి సంఘ సంస్కర్తలైన రాజా రామమోహన రావు, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, కందుకూరి వీరేశలింగం, గురజాడ లాంటి వాళ్ళు వీటిని రూపు మాపడానికి ఎంతో ప్రయత్నించారు. అందులో భాగంగానే సంస్కరణోద్యమాలను నడిపి తమ రచనల ద్వారా ప్రజలలో చైతన్యాన్ని తీసుకురావడానికి ప్రయత్నించారు. ఇందులో భాగంగానే తెలుగు సాహిత్యంలో అనేక రచనలు సంస్కరణ భావాలతో వచ్చాయి.

తెలుగు నవలా సాహిత్యంలో సంఘ సంస్కరణోద్యమ భావాలు రాజశేఖర చరిత్ర నాటికే మొదలైనాయి అంటే అతిశయోక్తేమీ కాదు. అందుకే రాజశేఖర చరిత్రను తొలి తెలుగు నవలగా అంగీకరించిన అక్కిరాజు రమాపతిరావు "తెలుగునవల నూటికి నూరుపాళ్ళు సంఘ సంస్కరణో ద్దేశంతోనే పుట్టింది" అని అంటారు (రజిత రంజని. పుట. 56). రాజశేఖర చరిత్రకు ముందు వచ్చిన శ్రీ రంగరాజ చరిత్రలో ఇటువంటి భావాలు లేవని కాదు. ఈ నవలలోనూ సమాజంలో కనపడుతున్న లోపాల ప్రస్తావన ఉంది. అయితే ఈ నవలను హిందువుల ఆచారాలను తెలియజేసే వచన ప్రబంధంగా రచయితే చెప్పుకున్నాడు కాబట్టి ఆ తర్వాత వచ్చిన రాజశేఖర చరిత్రకు అగ్ర తాంబూలం ఇవ్వక తప్పదు. ఈ పరంపరలో భాగంగానే చిత్తూరు జిల్లా నుండి యం. వి. పాపన్న గుప్త 'భానుమతి' అనే నవలను 1930లో రాశారు. ఈ నవలలో రచయిత స్త్రీలకు ఎదురవుతున్న సమస్యల దగ్గర నుండి వారి అభ్యున్నతికి తోడ్పడే విషయాల వరకూ, స్వదేశీ ఆచారాల దగ్గర నుండి విదేశీ ఆచారాల వల్ల కలిగే దుష్ప్రభావాల వరకూ సమాజానికి హితకరమైన, హానికరమైన అనేక విషయాలను తెలియజేశాడు.

రచయిత వరిచయం:

మొన్న మొన్నటి వరకూ స్వాతంత్ర్య సమరయోధుడుగానే తెలిసిన యం. వి. పాపన్న గుప్త ఇటీవల ప్రాంతీయ అస్తిత్వ నేపథ్యంలో భాగంగా జరిగిన పరిశోధనల ఫలితంగా నేడు కథకుడుగా, నవలాకారుడుగా, కవిగా, అనువాదకుడుగా వీటన్నింటికి మించి చిత్తూరు జిల్లా నుండి మొదట కథానిక రచన చేపట్టిన వ్యక్తిగా వెలుగులోకి వచ్చారు. ఈయన 12-6-1905న మదనపల్లిలో మొగిలి వంశానికి చెందిన రామలక్ష్మమ్మ కన్నయ్యలకు జన్మించాడు. ఈయన 12వ ఏటనే డాక్టర్ అనిబిసెంట్ గారి ఉపన్యాసాలకు ప్రేరేపితుడై దేశభక్తితో అనిబిసెంట్ గారి వెంబడి హోమ్ రూల్ ఉద్యమంలోనూ మాలవ్యా గారి వెంబడి విదేశీ వస్త్ర బహిష్కరణ ఉద్యమంలోనూ పాల్గొన్నారు. దేశాభిమానంతో ఉద్యోగాన్ని త్యజించి ఖద్దరు ప్రచారంలో భాగస్వాములయ్యారు. క్రమంగా గాంధీగారి అడుగుజాడల్లో నడుస్తూ కాంగ్రెస్ సేవలో దేశమంతా పర్యటించారు. ఇంకా హరిజన గిరిజనులకు టీటీడీ ఆలయాల్లో ప్రవేశార్హతలు కల్పించడం, స్త్రీ విద్యను ప్రోత్సహించడం, బాల్య వివాహాలను చేయరాదని, ఆడపిల్లలు రజస్వల అయినప్పుడు అట్టహాసంగా వేడుకలు చేయరాదని స్త్రీల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. ఇటువంటి సంస్కరణ భావాలు కలవారు కాబట్టే స్త్రీల సమస్యలను సహృదయతతో తెలియజేయగల 'భానుమతి' లాంటి నవలను వీరు రాయగలిగారు.

పాపన్న గుప్త రచనల విషయానికి వస్తే, వీరి కథలు 1927 ప్రాంతంలో 'భారత కథానిధి' అన్న పత్రికలో ప్రచురితమైనాయి. దురదృష్టవశాత్తు వీరి కథలలో ప్రస్తుతం 'శారద', 'హైమావతి', 'సావిత్రి' అనే మూడు కథలు మాత్రమే మనకు లభ్యమవుతున్నాయి. వీరు రాసిన ఏకైక నవల 'భానుమతి'(1930). వీరు 'ఆర్యవైశ్య ఔన్నత్య ప్రబోధనలు' అన్న పద్య రచన కూడా చేశారు. కవిగా, కథకులుగా, నవలాకారులుగా తెలిసిన ఈయన అనువాద కథలు కూడా రాశారని ఎవరికీ తెలీదు. వీరు వెల్లాల మైసూరయ్యతో కలిసి 'పునర్వివాహము' అన్న కథను (ఏప్రిల్ 1928 భారతకథా నిధి), 'కంకాళము (టాగూరుకథ కనువాదము)' (మే 1928 భారతకథా నిధి) అనే కథను రాశారు. ప్రస్తుతం ఈ రెండు కథలు కూడా లభ్యమవు తున్నాయి.

భానుమతి నవల సారాంశం:

మద్రాసు హైకోర్టులో సబ్ జడ్జిగా పనిచేస్తున్న రామశర్మ అనే జమీందారు 'కళావతి' అనే అమ్మాయిని చూసి మోహించి పెళ్లి చేసుకోవాలని అనుకుంటాడు. అప్పటికే రామశర్మకు లీలావతి అనే భార్య ఉంటుంది. పిల్లలు లేని కారణాన్ని చెప్పి ఆమెను రెండవ పెళ్ళికి ఒప్పిస్తాడు. రామశర్మ ఇష్టపడ్డ కళావతి 'వైకుంఠశర్మ' మేనకోడలు. ఈమె తల్లిదండ్రులు చనిపోవడంతో వైకుంఠశర్మే అన్నీ చూసుకుంటూ ఉంటాడు. పైగా కళావతిని ఉంచుకొని ఉంటాడు కూడా. రామ శర్మ ఆస్తికోసం ఈ విషయాన్ని దాచి కొన్ని షరతుల ప్రకారం వివాహానికి ఒప్పుకుంటాడు. రామశర్మ కళావతుల వివాహం గుట్టుగా జరిగిపోతుంది. కొంత కాలానికి కళావతికి ఒక మగ బిడ్డ పుడతాడు. ఇతని పేరు నారాయణశర్మ. ఇదే సమయంలో రామశర్మ మొదటి భార్య లీలావతి కూడా గర్భవతై కవలలను (మగ, ఆడ) కంటుంది. రామశర్మ కళావతి యొక్క సవతి బుద్ధిని గ్రహించి లీలావతికి కూడా తెలీకుండా తన మగ బిడ్డను వైకుంఠశర్మ దగ్గర రహస్యంగా పెంచుతాడు. ఈ విషయాన్ని గ్రహించిన లీలావతి, భర్త మోసం చేశాడని ఆవేదనతో ఆత్మహత్య చేసుకుంటుంది. ఆ తరవాత కళావతి వైకుంఠశర్మ దగ్గర రహస్యంగా పెరుగుతున్న మగబిడ్డను చంపించేస్తుంది. ఈ విషయాన్ని వైకుంఠశర్మ రామశర్మతో చెప్పడు. కారణం రామశర్మ తన బిడ్డకోసం నెలనెలా పంపుతున్న డబ్బుకు ఆశపడి. అలాగే కళావతి, లీలావతికి కలిగిన ఆడబిడ్డను కూడా చంపాలని చూడడంతో రామశర్మ బాధపడి తన మొదటి భార్య లీలావతి కోరిక మేరకు ఆ ఆడబిడ్డను సుబ్బశర్మకు (లీలావతి అన్న) అప్పగించి బర్మాకు వెళ్ళిపోతాడు.

రామశర్మకు కళావతికి పుట్టిన వాడు నారాయణుడు (నిజానికి ఇది కూడా అబద్ధమే నారాయణుడు వైకుంఠశర్మకు కళావతికి పుట్టినవాడు, కళావతి వైకుంఠశర్మకు ఉంపుడుకత్తే. రామశర్మతో పెళ్ళయ్యే నాటికే ఈమె మూడు నెలల గర్భవతి. డబ్బుకోసం రామశర్మని వివాహం చేసుకొని ఉంటుంది). చదువు సంధ్యలు ఒంటపట్టని కారణంగా అక్కడే ఉంటే చెడిపోతాడని నారాయణున్ని బర్మా నుండి మద్రాసుకు పంపించేస్తాడు రామశర్మ.

రామశర్మ బర్మాకు వెళ్ళిన రోజె వైకుంఠశర్మ కూడా ధర్మాపురాన్ని వదలి మద్రాసులో గోవిందప్ప నాయునివీధికి నివాసాన్ని మారుస్తాడు. అతనితోపాటు పెద్దకొడుకు దామోదరుడు, కుమార్తె చంద్రమతి అలాగే వీరితోపాటు భానుమూర్తి, భానుమతి అనే ఇద్దరు పిల్లలు కూడా ఉంటారు. అయితే వీరి నలుగురూ అక్కచెల్లెళ్ళు అన్నదమ్ములుగా రచయిత చెప్తాడు. ఇక్కడ నిజానికి భానుమూర్తి, భానుమతులు వైకుంఠశర్మ పిల్లలుకాదు. ఈ విషయం రచయిత నవల చివరివరకూ చెప్పడు. వైకుంఠ శర్మ మద్రాసులో కూడా నీచమైన పనులను చేస్తూ దురాశాపరుడై ధనాన్ని సంపాదిస్తుంటాడు.

లీలావతి అన్న సుబ్బశర్మకు పిల్లలు లేకపోవడంతో రామశర్మ కూతురు 'ప్రమద'కు అన్నీ తనే అయి విద్యాబుద్ధులు నేర్పిస్తూ ఉంటాడు. వీరి ఇంటి పక్కనే

లక్ష్మణశర్మ అనే గొప్ప న్యాయవాది ఉంటాడు. ఇతని కొడుకు 'వీరశర్మ'. ఇతను కన్యాశుల్క వరశుల్కాలను పారత్రోలుటకు తన జీవితాన్ని ధారపోయాలని నిర్ణయించుకున్న మంచి వ్యక్తిత్వం కలవాడు. వీరి ఇంటి పక్కనే ఒక బ్రాహ్మణ వితంతువు తన కూతురు 'సుందరి'తో ఉండేది.

నారాయణశర్మ తన తండ్రి నెలకు పంపించే వందరూపాయలతోనూ, అక్కడ వచ్చే బాడుగలతో విలాసాలకు అలవాటు పడి నీలకంఠ, దామోదరుడు అనే స్నేహితులతో కలిసి కాలం గడుపుతూ ఉంటాడు. ఇతని స్నేహితులు నారాయణునికంటే దుర్మార్గులు. తాగుబోతు మరియు వేశ్యాలోలుడు అయిన దామోదరుడు వైకుంఠశర్మ కొడుకు. ఇక నీలకంఠం వేశ్యా లంపటుడై ఉన్న ఆస్తినంతటినీ పోగొట్టుకొని నారాయణశర్మని నమ్ముకొని ఉండేవాడు. నీలకంఠం తన అన్న పిల్లలే భానుమూర్తి, భానుమతులు, డబ్బులేని కారణంగా వీరిని చిన్నప్పుడే వైకుంఠశర్మకు అమ్మేసివుంటాడు, అప్పటి నుండి వైకుంఠశర్మే అన్నీ చూసుకునేవాడు. ఈ త్రిమూర్తులకు తోడు దామోదరుని చెల్లెలు కూడా చేరుతుంది.

ఒకరోజు వైకుంఠశర్మ డబ్బుకు ఆశపడి ఒక రహస్య గర్భవతికి వైద్యం చేసి, ఆమె ప్రసవించిన బిడ్డను పాతిపెడుతూ ఉండగా పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్తాడు. తరవాత వైకుంఠశర్మ జైలు నుండి తప్పించుకొని మారువేషంలో బర్మాలోని రామశర్మ కళావతుల దగ్గరకు చేరుతాడు. ఇక్కడి నుండి నవలలో ప్రధాన సంఘటనలు, సన్నివేశాలు చోటు చేసుకుంటాయి. తండ్రి లేకపోవడంతో కుటుంబ బాధ్యత భానుమూర్తిపై పడడం, దామోదరుడు తండ్రి పేర వచ్చే మనియార్డరును కాజేస్తుండడం, ఇదే సమయంలో దామోదరుని చెల్లెలు చంద్రమతి నారాయణునితో లేచిపోవడం జరుగుతాయి. ఆ తర్వాత రామశర్మ ఉత్తరంతో భానుమూర్తి ప్రమదకు ఉపాధ్యాయుడుగా వెళ్ళడం, అక్కడ భానుమూర్తి ప్రమదలు ఒకరినొకరు ఇష్టపడడం, ఇదే సమయంలో వీరశర్మ భానుమతిని ప్రేమించడం జరుగుతుంది. కానీ నారాయణుడు భానుమతిని పెళ్ళి చేసుకోవాలని దామోదరునితో నానా ప్రయత్నాలు చేస్తూ ఉంటాడు. అవి విఫలమవడంతో ఆమెను రహస్యంగా బంధించి పెళ్లి చేసుకోవాలనుకుంటాడు. భానుమతి, చంద్రమతి సహాయంతో తప్పించుకొని కొంతకాలం ఒక ముసలి దంపతుల దగ్గర తలదాచుకొని చివరికి ఒక సన్యాసి సహాయంతో తనవాళ్ళని కలుస్తుంది. ఇక్కడ ఆ సన్యాసి ఎవరో కాదు తన తండ్రే. ఈ విషయాన్ని కూడా రచయిత చివరి వరకూ చెప్పడు.

ఈ సమయంలోనే బర్మాలోని రామశర్మకు వైకుంఠశర్మ కళావతుల అక్రమ సంబంధం తెలిసి అతనిని వెళ్ళగొట్టి మద్రాసుకు వస్తాడు. ఇక్కడ తన దృష్టిలో అన్నా చెల్లెలైన భానుమూర్తి ప్రమదల ప్రేమ గురించి తెలిసి విషయం ఎవ్వరికీ చెప్పలేక బాధపడుతూ ఉంటాడు. ఈ విషయాన్ని గ్రహించిన కళావతి వైకుంఠశర్మతో కలిసి ఎలాగైనా భానుమూర్తిని చంపాలని ప్రయత్నించి పొరపాటున దామోదరున్ని చంపేస్తుంది. ఈ నేరం భానుమూర్తిపై నెట్టబడుతుంది. అలాగే వైకుంఠశర్మను పోలీసులు అరెస్టు చేస్తారు. దీనితో వైకుంఠశర్మ పశ్చాత్తాపం చెంది రామశర్మను పిలిపించుకొని అన్ని విషయాలు వివరంగా చెప్పేయడంతో నవలలోని చిక్కు ప్రశ్నలన్నింటికి సమాధానాలు దొరుకుతాయి. తల్లి ఇంత దుర్మార్గురాలని తెలిసి నారాయణుడు కళావతిని చంపేస్తాడు. ఆ తరవాత అందరూ కలిసి బానుమతి వీరశర్మ, భానుమూర్తి ప్రమదల వివాహాన్ని జరిపిస్తారు.

నవలా విశ్లేషణ:

యం. వి. పాపన్న గుప్త 1930లో రాసిన ఈ నవల నలభై ప్రకరణాలుతో అనేకమైన మలుపులతో కూడుకొని సాగే సాంఘిక నవల. నవలలోని సారాంశాన్ని తక్కువ మాటలలో చెప్పలేని విధంగా రచయిత ఈ నవలను రాశారు.

కారణం నవలలో అనేక విషయాలను మరుగున పెట్టి కథను ముందుకు నడిపించడం. స్త్రీల సమస్యలను ప్రధానంగా తీసుకొని సమాజానికి హితకరమైన, హితకరం కాని అనేక విషయాలను ప్రస్తావిస్తూ, కుటుంబంలోని స్వార్థపరులవల్ల అమాయకులు నిస్సహాయులు పడే బాధలను, బలైపోయే జీవితాలను కళ్ళకు కట్టినట్టు రచయిత ఈ నవలలో చూపించారు.

స్వతహాగా సంఘ సంస్కర్త అయిన యం. వి. పాపన్న గుప్త ఈ నవలలో సాంఘిక దురాచారాలైన అనేక సమస్యలను తెలియజేస్తూ వాటి పట్ల వ్యతిరేకతను, నిరసన భావాన్ని తెలియజేశారు. అవి. 1. బాల్య వివాహ వ్యవస్థను వ్యతిరేకించడం 2. వితంతు పునర్వివాహాభిలాష 3. విదేశీ అలవాట్లపై నిరసన 4. వరశుల్క సమస్య 5. మద్యపాన నిరసన

1.బాల్య వివాహ వ్యవస్థను వ్యతిరేకించడం:

స్త్రీల సమస్యలను ప్రధానంగా చేసుకొని రాసిన ఈ నవలలో వైకుంఠశర్మ తన కూతురైన చంద్రమతికి మూడవ ఏటనే పెళ్లి చేస్తాడు. పాపం దురదృష్టవశాత్తూ పెళ్ళైన నెలరోజులకే ఈమె భర్త చనిపోయి బాల వితంతువుగా ఉంటుంది. ఈ సందర్భంలో రచయిత బాల్య వివాహాల పట్ల ఆవేదనతో "ముక్కు పచ్చలారనియాచిన్నికి పెండ్లి యననేమో యెఱుగని బిడ్డకు వివాహము గావించి వైధవ్యమనుభవింఎ జేసిన యాతలిదండ్రులను దూరవలయునా? లేక యా కాలపు సంఘ సంస్కర్తలను దూరవలయునో తెలియదు. మాటలు కూడా యికనూరాని పిల్లలకు వివాహమనునది జేసివారిని దుఖాబ్ధిని ముంచెడి చెడుగుల నేమి చేసినా పాపములేదు" అని అంటాడు. ఈ మాటలు చూస్తే రచయిత ఆవేదనతో పాటు ముక్కుపచ్చలారని జీవితాలు బాల్య వివాహాల కారణంగా ఎలా పాడైపోతున్నాయో కూడా అర్థమవుతుంది. ఈ నవలలో బాల వితంతువులైన వారు వారి కోర్కెలను అనుచుకోలేక తప్పుదు వ్యసనాలకు లోనై గర్భవతులై అనేక కష్టాలు అనుభవిస్తున్న విధానాన్ని కూడా చూడవచ్చు. ఒక రకంగా నవలలోని ఈ పరిస్థితులను చూస్తే 1930నాటి సమాజ ధోరణులు మనకు అర్థమవుతాయి.

2.వితంతు పునర్వివాహాభిలాష:

బాల్యంలోనే పెళ్ళిచేయడం కారణంగా భర్తలు చనిపోయిన స్త్రీల పరిస్థితి సమాజంలో ఏ విధంగా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కరలేదు. బతికినన్నాళ్ళూ విధవగా తల్లిదండ్రులకు సేవ చేసుకుంటూ తన యవ్వనాన్ని, ఆశలను, కోర్కెలను అణచిపెట్టుకొని ఉండాల్సిందే. అదే మగవాడు మాత్రం భార్య చనిపోయిన వెంటనే ఇంకో పెళ్లి చేసుకోవచ్చు. వాడు ముసలివాడైనా, అంగవైకల్యం కలిగినవాడైనా, కాటికి కాళ్ళుచాచుకున్న వాడైనా సరే ఈ సమాజం తప్పు పట్టదు. అదే ఆడపిల్ల వితంతువైన తరవాత రెండోపెళ్ళి అంటే మాత్రం చాలు శాస్త్రాలు వల్లెవేస్తారు. ఇది ఒక నాటి సమాజ స్థితి. ఇలాంటి పరిస్థితులను రచయిత తప్పు పడుతూ ఈ నవలలో బాల వితంతువుల గురించి పునర్వివాహాల గురించి తెలియజేస్తూ "పురుషులకన్న స్త్రీకెక్కుడు కామమని యెఱుగరా? అట్టియెడ వారికి యవ్వన మంకురించిన తర్వాత నెట్లుండగలరు? గాన నట్టివారికి పునర్వివాహముగావించిననేమి? శాస్త్రసమ్మతముగాదని కొందఱు వాదించెదరు. ఆవిషయమంత పాటింప నక్కఱలేదు. సంఘమౌన్నత్యమునకు రావలెనని యిట్టి వివాహములు గావించిననేని సంఘమభివృద్ధికి రానేఱదు. దురాచారములడుగంటవు" అని అంటారు. ఈ మాటలను పరిశీలిస్తే వితంతు పునర్వివాహ విషయంలో పూర్వ శాస్త్ర పరాయణత్వాన్ని లెక్క చేయాల్సిన అవసరం లేదనే అభ్యుదయ దృక్పథాన్ని మనం చూడవచ్చు. అదే విధంగా దేశంలో రోజురోజుకూ ముత్తైదువుల సంఖ్య కన్నా వితంతువుల సంఖ్య ఎక్కువైపోతూ ఉందని దీనివల్ల సమాజ గౌరవం రోజురోజుకూ క్షీణించి పోతూ ఉందని, దీనిని నివారించే మార్గం లేదా అని ఆవేదనను వ్యక్తం చేస్తూ దేశభక్తులను, దేశ నాయకులను మార్చమని వారిలో

వితంతు పునర్వివాహాల పట్ల అభిమానాన్ని కలుగజేయాలని దేశమాతను ప్రార్థించిన విధానాన్ని ఈ నవలలో చూడవచ్చు.

3.విదేశీ అలవాట్లపై నిరసన:

ఈ నవల రచనాకాలం 1930. అంటే జాతీయోద్యమ కాలం. ప్రజలలో ఎటు చూసినా విదేశీయుల పట్ల ఏహ్యభావం కలిగిన రోజులవి. అందుకే విదేశీయుల పట్ల వారి అలవాట్ల పట్ల ప్రజల్లో ఒకరకమైన నిరసన భావం కనిపిస్తుండేది. ఇలాంటి ఒక సందర్భాన్నే రచయిత నవలలో ప్రస్తావించాడు. అది కాఫీ అలవాటు పట్ల వ్యతిరేకత. ఒకరోజు తెల్లవారుజామున రామశర్మకు అతని సేవకుడు కాఫీ తెచ్చి ఇస్తాడు. ఇదే సమయంలో రామశర్మ భార్య లీలావతిచే కాఫీ అలవాటు అనేది ఎంత చెడ్డదో తెలియజేస్తూ "నాథా! సారాయము త్రాగిన నెంతో కాఫీ ద్రాగిన నంటే" అంటూ సారాయి లాంటి మత్తు పదార్థాలు ఏ విధంగా మనుషులను బానిసలు చేసుకుంటాయో అదే విధంగా కాఫీ, టీ కూడా మనుషులను బానిస చేసుకుంటాయి. అలవాటైన మొదట బాగానే ఉంటుంది గానీ ఆ తర్వాత నెమ్మదిగా జీర్ణశక్తిని నశింపజేస్తుంది అని రెండు పేజీల చర్చను రచయిత ఇక్కడ చేస్తాడు.

4. వరకట్న నిషేధం:

సమాజాన్ని పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్యల్లో ఈ వరకట్న సమస్య ముఖ్యమైనది. భానుమతి నవలా కాలం నాటికే కాక నేటికీ ఈ సమస్య సమాజ పురోభివృద్ధికి ఒక గుదిబండలాగానే ఉంది. ఆస్తి అంతస్తును, చదువు సంధ్యలను బట్టి మగపిల్లల తలిదండ్రులు ఆడపిల్లల తలిదండ్రుల ప్రాణాలను తీస్తున్నవారు సమాజంలో కోకొల్లలు. ఇలాంటి వారిపట్ల రచయిత వ్యతిరేక భావాన్ని వ్యక్తం చేస్తూ, ఇలాంటి ఆచారం అడుగంటాలని వీరశర్మ పాత్ర ద్వారా కోరుకుంటాడు. ఈ నవలలో వీరశర్మ పాత్ర వరశుల్క, కన్యాశుల్క సాంప్రదాయానికి వ్యతిరేకమైనది. ఎదురు కట్నమిచ్చి తనను పెళ్ళిచేసుకోడానికి ఎన్ని సంబంధాలొచ్చినా అతను నిరాకరిచేవాడు. కారణం ఈ దురాచారాన్ని నిర్మూలించడానికి తన జీవితాన్ని ధారపోయాలనుకున్న వ్యక్తి కనుక. అందుకే రచయిత వీరశర్మను ఉద్దేశించి "వీరశర్మా! నీవంటి సుపుత్రుల నెపుడు మన భారతావని నిండగలరోగదా! కన్యావర శుల్కపిశాచముల బారదోలుమంత్రగాండ్లు నీవంటివారే గావలయు. లేకున్న వాటియేదుట మరియెవ్వరి యాటలుగాని సాగిరావు" అని అంటారు. ఈ మాటలను బట్టి చూస్తే రచయిత వరకట్న కన్యాశుల్క విషయాలలో ప్రజలల్లో కొంత చైతన్యం రావాలని తద్వారా ఈ అనాచారం అడుగంటాలని ఆశించినట్లు తెలుస్తుంది.

5. మద్యపాన నిరసన:

సమాజాభివృద్ధికి కన్యాశుల్క, వరకట్న సమస్యలు ఎలాంటి ప్రతిబంధకాలో అలాంటిదే మద్యపాన సమస్య కూడా. పేద ధనిక అనే తేడా లేకుండా ఈ అలవాటుకు లోనై అనేక మంది వారి జీవితాలను, కుటుంబాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. ఇలాంటి ఈ అలవాటుకు బానిసై అందరి చేత ఛీ కొట్టబడిన నారాయణ శర్మ జీవితాన్ని తెలియజేస్తూ ఈ వ్యసనం అడుగంటాలని, అప్పుడే దేశం అభివృద్ధిలోకి వస్తుందని ఒక సందేశాన్ని ఈ నవల ద్వారా రచయిత తెలియజేశాడు. బ్రాహ్మణ వంశంలో పుట్టిన నారాయణ శర్మ తన తండ్రి పెట్టిన పేరును మార్చుకొని (నారాయణ రావు) స్నేహితులతో కలిసి మద్యానికి అలవాటుపడి మాంసాన్ని కూడా తింటూ రోజువారీ అతడు చేసే పనులను రచయిత ఈ నవలలో తెలియజేస్తూ తాగుబోతు లక్షణాలు ఏవిధంగా ఉంటాయో తెలుపుతాడు. ''అతడు బ్రాహ్మణుడయ్యు నహవానదోషమున మధుమాంసములన నవరతము యుపయోగించు చుండెను. రెండు చిన్ననాడు నేర్చిన యింగ్లీషుముక్కలు నోట యుచ్చరించుట యలవరచుకొని గొప్ప పండితునివలె యండరితోడ నాంగ్లముననే మాటలాడదొడగెను.

మద్యపానమునందాశక్తి మెండగు కొలది యాతని త్రాగుడు కంతమేలేకుండెను. ఘంట ఘంటకు ద్రాగమోదలిడెను. కావలసినప్పుడు ..... అతడప్పుడు త్రాగి త్రోవదేలియక దారిలో పడిపోవువాడు. అతనేఱిగినవారు చాలామంది యుండుటచే దయదలచి తమ యింటికిగొనిపోయి తెలివి వచ్చినపిదప సాగనంపేడివారు" అంటూ నారాయణుని మరిన్ని అవస్థలను రచయిత తెలియజేశాడు.

రచయిత ఈ నవలలో తాగుబోతుల చేష్టలను తెలియజేయడంతో పాటు "పరమేశ్వరా! యీనిర్భాగ్యు లుండబట్టిగదా మా దేశమంతకంతకు క్షీనించుచున్నయది నానాటికి వృక్షము పెరగిపోవుచున్నయది. దీని కూకటి వ్రేళ్ళతో బెకలించి వేసినగాని దేశమున్నతస్థితికి రానేరదు. ఓదయామయా! అమెరికా దేశీయులవాలే అస్మద్దేశీయుల హ్యుదయ క్షేత్రమునందు సన్మార్గ సత్కార్యములకా బీజములనాటి యీఘోర కలికాల సురాపిశాచమును బారదోలునటుల జేయుము. లేకున్నా త్వరలోనే లెక్కలేనన్ని సంసారములు కూలిపోవును" అని అంటాడు. ఈ మాటలను చూస్తే రచయితకు మద్యపానం పట్ల ఎంత నిరసన భావన ఉందో తెలియడంతో పాటు మద్యపానం నిషేధం పట్ల ఎంత అభిలాష ఉందో కూడా తెలుస్తూ ఉంది.

పై సమస్యలతో పటు స్త్రీల అసమానతలపై వ్యతిరేకత, శకునాలు, సముద్రయానంపై హిందువులకు గల విశ్వాసాలు, శిశుహత్యలు వద్దని అభిలాష వంటి అనేక అంశాలపట్ల ఉచితానుచితాలను తెలియజేస్తూ వచ్చిన చక్కటి సాఘిక నవల అని ఈ నవలను చెప్పొచ్చు. అలాగే పరోపకారానురక్తి, ఆంగ్ల పాఠశాలల్లో బాలభటులు ప్రస్తావన, స్త్రీల సాహసాలు ఇలా ఎన్నో అంశాలు ఈ నవలలో ప్రస్తావించబడ్డాయి.

ఉపయుక్త గ్రంథాలు:

1. యం.వి. పాపన్న గుప్త. **భానుమతి** (నవల). ప్రొద్దటూరు: భారత కథానిధి మాసపత్రిక ప్రచురణ. 1930.
2. **రజత రంజని**. హైదరాబాదు: రంజని రజతోత్సవ సంఘం. 1988.

తెలుగు నాటికలు – సమకాలీన స్త్రీల స్థితిగతులు

డా॥ వి.కె.టి. మహాలక్ష్మి, తెలుగు ఉపన్యాసకురాలు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, మర్రిపాలెం, విశాఖ జిల్లా.

ఆధునిక సాహిత్యం శాఖోపశాఖలుగా విస్తరించింది. వివిధ సాహిత్య ప్రక్రియల్లో బహుళ ప్రజాదరణ పొందినది నాటకం. "కావ్యేషు నాటకం రమ్యం" అని ఆర్యోక్తి. నాటక లక్షణాలు కలిగి, తక్కువ అంకాలు కలిగినది "నాటిక".

ఆధునిక సాహిత్యానికి సమకాలీన సమాజమే మూలాధారం. సాహిత్యంలో తిరోగమన, పురోగమన ధోరణులు రెండూ ప్రతిఫలిస్తాయి. సమాజ అభివృద్ధిని కాంక్షించేవారు, అభివృద్ధి నిరోధకాలైన అనేకానేక సమస్యలపట్ల స్పందిస్తారు. ఆ సమస్యలకు పరిష్కార మార్గాలను చర్చిస్తారు. జాతి జనులను మేల్కొలుపుతారు.

ఈ సమాజంలో స్త్రీ పురుషుల మధ్య అంతులేని అసమానతలున్నాయి. ఈ వ్యవస్థలో అనాదిగా స్త్రీ అణిచి వేయబడుతుంది. ఈ నేపథ్యంలో స్త్రీల దృష్టికోణం నుంచి రాసిన కొన్ని ప్రసిద్ధ నాటికలద్వారా సమకాలీన స్త్రీల స్థితిగతులను పరిశీలించడం ఈ వ్యాసోద్దేశం.

వల్లూరి శివప్రసాద్ గారి సంపాదకత్వంలో, గంగోత్రి సాయిగారి ఉప సంపాదకత్వంలో "ప్రసిద్ధ తెలుగు నాటికలు" అనేక పుస్తకం వెలువడింది. ఇది జనవరి 2011న ప్రథమ ముద్రణ పొందింది. చాలా వ్యయప్రయాసల కోర్చి రాష్ట్రంలోని గ్రంథాలయాలు తిరిగి, అకుంఠిత దీక్షతో సేకరించిన నాటికలివి. నాటికలతోపాటు, నాటిక కర్తల వివరాలు, వారి ఛాయచిత్రాలు కూడా ఇందులో పొందుపరిచారు.

1900 నుండి 2000 కాలంలో వచ్చిన వేలకొలది నాటికల నుంచి ఏరి కూర్చిన ఈ 58 నాటికల్లో వందేళ్ల తెలుగు వారి సాంఘిక చరిత్ర తెలుసుకోవటానికి అవకాశం మెండుగా ఉంటుందన్న సంపాదకుల అభిప్రాయం పూర్తిగా వాస్తవం.

ఈ పుస్తకంలో ఉన్న 58 నాటికల్లో స్త్రీల జీవితాలను ఇతివృత్తంగా తీసుకున్న నాటికలు ఏడు.

1. శివం – చలం
2. ఏమి మగవాళ్లు – పి.వి.రాజమన్నార్
3. ఆడది – పినిశెట్టి శ్రీరామమూర్తి
4. గిత్తల బేరం – సుంకర సత్యనారాయణ
5. కొడుకు పుట్టాల – గణేష్‌పాత్ర
6 గోగ్రహణం – తనికెళ్ళభరణి
7. మబ్బుల్లో బొమ్మ – డి. విజయభాస్కర్

చలం రచించిన "శివం" నాటిక 1932 లో మొదటి ప్రదర్శన జరిగింది.

"ఈ నాటికలో ఒక బ్రాహ్మణ యువకుడు, ఒక శూద్ర అమ్మాయితో తిరిగి ఆమెను గర్భవతిని చేస్తాడు. తన కూతురికేదో దారి చూపమని ఆ అమ్మాయి తండ్రి ఆ అబ్బాయి కుటుంబాన్ని ప్రాధేయపడతాడు. ఆ యువకుడి తల్లి జరిగిన దాంట్లో తన కొడుకు తప్పేమి లేదన్నట్టు, ఆ అమ్మాయిని తిడుతుంది. ఆ యువకుడి తండ్రి ఆ అమ్మాయిని కోడలిగా చేసుకోవడం పరువు తక్కువగా భావిస్తాడు. బ్రాహ్మణ వంశానికి చెందినవాడు, ఆ గర్భానికి కారకుడు అయిన ఆ యువకుడు ఆ శూద్రదానితో నా పెళ్ళి? అని ఈసడిస్తాడు.

డాక్టరు కోర్స్ చదువుతున్న ఆ యువకుడి చెల్లెలు కూడా ఆ అమ్మాయి పట్ల జాలి చూపదు. ఆ యువకుడి చెల్లెలు స్నేహితుడైన 'శివం' ఆ అభాగ్యురాలి తరఫున వాదిస్తాడు. చివరికి ఆ అమ్మాయికి న్యాయం జరగనేలేదు. ఇది నాటిక ఇతివృత్తం.

పి.వి. రాజమన్నారు రాసిన "ఏమి మగవాళ్ళు" నాటిక 1947 జనవరి 17న మొదటి ప్రదర్శన జరిగింది.

"ఇందులో కనకాంగి ఒక సినీనటి. ఆమె వేశ్య కులంలో పుట్టింది. ముందు కులవృత్తి చేసినా, సంగీత జ్ఞానం, సౌందర్యం, చాకచక్యం కలిగి ఉండటంవల్ల ఫిలిం కంపెనీ వాళ్ళను ఆకర్షించి నటి అయ్యింది. వేణుగోపాల్, కనకాంగిని వివాహం చేసుకుంటాడు. అతడొకరోజు భార్యను తీసుకుని తన పెదనాన్న గారింటికి వస్తాడు. అక్కడ వేణు పెదనాన్న, వయసులో ఉన్న ఆ పెదనాన్న తమ్ముడు కూడా కనకాంగిని ఏదో మిషతో తాకాలని ప్రయత్నిస్తాడు. కనకాంగి ఈ విషయాలను వేణుతో చెబితే, వేణు ఆమెనే తప్పుపడుతాడు. నీవే వాళ్ళిద్దరినీ చెడగొట్టావని కనకాంగిని నిందిస్తాడు. "వెర్రి కుక్కల్లాగ వాళ్లు పైన పడితే నాదా తప్పు" అని ఆమె దుఃఖిస్తుంది. ఆ వివాహ బంధానికి స్వస్తి పలుకుతుంది.

"పినిశెట్టి శ్రీరామమూర్తి" రాసిన "ఆడది" నాటిక 1950లో మొదటి ప్రదర్శన జరిగింది. ఇందులో ఒక భర్త కేవలం తాను మగవాడిననే అహంకారంతో "అంత ఖరీదు పెట్టి చేరెందుకు కొన్నారండీ?" అని భార్య అడిగినందుకు ఆమెను రాత్రంతా సాధించి చివరికి పుట్టింటికి పొమ్మని తరిమేస్తాడు. అమ్మ ఏం తప్పు చేసిందని, కొడుకు తండ్రిని నిలదీస్తాడు. అప్పుడా తండ్రి

"ఎదిరింపులకేం కావాలిరా? నేను మగాణ్ణి; ఇది ఆడది. సృష్టిలో భగవంతుడే పెట్టాడుగా ఈ విచక్షణ కాస్త అణిగి మణిగి వుండనక్కర్లేదూ....." అంటాడు.

భార్య పుట్టింటికెళ్ళాక వంటవాడు కూడా ఆ ఇంట్లో పనిచెయ్యనని చెబితే, అప్పుడు ఆడదిలేని సంసారం నరకమని గుర్తించి, ఆమెను ఇంటికి తిరిగి రమ్మని ప్రాధేయపడటానికి వెళ్తానంటాడు.

"సుంకర సత్యనారాయణ" రాసిన "గిత్తలబేరం" నాటిక 1955 నవంబర్‌లో మొదట ప్రదర్శింపబడింది. "పెళ్లి పేరిట మగపిల్లల్ని సంతలో పశువుల్ని చేసి అమ్మే దుష్ట సాంప్రదాయం మీద వ్యంగ్యాస్త్రమి నాటిక. పశువు ఉన్నవాడి దొడ్లో పుట్టినా, లేనివాడి దొడ్లో పుట్టినా దానికి ఒకటే విలువని, కాని రెండు కాళ్ల జంతువుకి పుట్టిన దొడ్డినిబట్టి విలువ వుంటుందని, ఇందులో పాత్రలచేత పలికిస్తారు రచయిత. పెళ్లి విషయంలో మనిషి యోగ్యతలకన్నా, ఆస్తి పాస్తులకు ప్రాధాన్యతమివ్వటం, కొడుకు చదువుమీద పెట్టిన ఖర్చును వరకట్నం పేరుతో తిరిగి రాబట్టుకోవటం ఇత్యాది విషయాలను రచయిత ఈ నాటికలో చర్చించారు."

"గణేష్‌పాత్రో" రాసిన "కొడుకు పుట్టాల" నాటిక 1970లో మొదట ప్రదర్శింప బడింది. ఇది ఉత్తరాంధ్ర మాండలికంలో రాయబడిన నాటకం.

"కొడుకు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకోవద్దన్న తండ్రి మాటకు కట్టుబడి కొర్లమ్మ ఐదుగురు ఆడపిల్లలకు తల్లౌతుంది. తండ్రి అనారోగ్యాన్ని చూసి తట్టుకోలేక తండ్రికీ భర్తకీ తెలియకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుని ప్రభుత్వమిచ్చే ప్రోత్సాహక ధనాన్ని తండ్రికి మందులు కొనుక్కోమని ఇస్తుంది. కొర్లమ్మ డబ్బుకోసం కాని పనిచేసిందనుకుని భర్త ఆమెను అనుమానించి చంపబోతాడు. తండ్రి కూడా ఆమెను నిందిస్తాడు. చివరికి నిజం తెలుసుకున్న ఆ తండ్రి ఇలా అంటాడు.

"..... ఈ ఆడకూతురికున్న మనసు అడుగో ఆ మగనాకొడుకున్నాదే? నాకు మందులిచ్చి బతికించడానికి ఇది సచ్చిపోడానికి సిద్ధపడిపోనాది! నా మందుల డబ్బుతో పీకమొయ్యా తాగేసి నన్ను మందూ మాకు నేకుంట సచ్చిపోమంతాడు! ఓలమ్మా నీకు మొగపిల్లలు మరొద్దే! ..."

తనికెళ్ల భరణి గారు రాసిన "గోగ్రహణం" నాటిక 1985లో మొదటి ప్రదర్శన జరిగింది.

"ఆవు-పులి" కథ అందరికీ తెలిసిందే ఆ కథను చివరలో మరోమలుపు తిప్పి అక్కడి నుంచి నాటిక ప్రారంభించారు.

"అడవిలో పులికి దొరికిపోయిన ఆవు లేగదూడకు పాలిచ్చి వస్తానని పులి అనుమతి పొంది వచ్చి, లేగదూడకు పాలిచ్చి తిరిగి వెళ్ళబోతుంటే, ఎక్కడికి వెళ్తావంటూ ఆ ఆవు యజమాని ఆ ఆవునుకొట్టి చంపుతాడు. ఆ గోమాతే ఉత్తరజన్మలో స్త్రీగా పుట్టిందని, ఆ పులే మగాడై పుట్టి స్త్రీని అనేక విధాలుగా కాల్చుకుతింటున్నాడని చెప్పి నాటిక మొదలుపెట్టారు భరణి గారు."

"ఆడపిల్ల పుట్టిందంటే ఏడుపు, ఆడపిల్లపై చదువులు చదువుతానంటే ఆంక్షలు, యుక్త వయస్సుకొస్తే ప్రేమ పేరుతో వేదింపులు, ఉద్యోగానికి వెళ్తే పై అధికారి కామంచూపులు, అమ్మాయికి పెళ్ళి చెయ్యబోతే కట్నపు సమస్య, ఎలాగోలా వివాహం చేస్తే, తాళికట్టిన మరుక్షణం నుంచి భర్త వేధింపులు. ఇలా స్త్రీ జీవన పర్యంతం ఎదుర్కొనే సమస్యలు అన్ని కోణాల నుండి చర్చించారు. భర్తనే పులినుండి స్త్రీని రక్షించేవారు ఉండరన్నదని ఈ నాటిక సారాంశం." చివర ముగింపులో

– మీకో దుస్థితికి కారణం ఏమిటో తెలుసా తల్లి మీ అందం, మీ అమాయకత్వం, మీ మంచితనం, మీ సహనం మీ క్షమ, అయినా గోమాత కన్నీటిని చూసి కరిగిపోయే పులులెక్కడున్నాయి తల్లీ! ఇక్కడ బతకాలంటే ఆడది పులై బతకాలి ఆడది అబల కాదు అతి బల. పరాశక్తి. సృష్టికారిణే కాదు లయకారిణి కూడా.

డి. విజయభాస్కర్ రచించిన నాటిక "మబ్బుల్లో బొమ్మ మొదటి ప్రదర్శన 07-1-2000. ఇది ప్రయోగాత్మకమై నాటిక. ఒక సన్నివేశాన్ని మూకాభినయంతో ప్రదర్శించి, ఆ సన్నివేశమేంటో ప్రేక్షకుల చేత చెప్పించిన నాటిక. ప్రేక్షకులనే పాత్రలుగా చేసిన రచన.

"ఈ నాటికలో ఒక సన్నివేశంలో ముగ్గురుంటారు. ఒక యువతి, ఒక యువకుడు, మధ్య వయసుకు చెందిన స్త్రీ, పురుషులు, యువకుడు, యువతిని జుట్టుపట్టి లాగి కింద పడేస్తాడు. అక్కడున్న వ్యక్తి వారిస్తున్నా వినకుండా అక్కడున్న స్త్రీ ప్రోద్బలంతో యువకుడు కిరసనాయిల్ తెచ్చి యువతి మీద పొయ్యబోతాడు. ఈ సన్నివేశాన్ని ఒక్కొక్క ప్రేక్షకుడు ఒక్కో తీరుగా ఊహించుకుంటాడు. ఒకరు దీన్ని వరకట్న సమస్యగా ఊహిస్తారు. మరొకరు తల్లులు వేరైనా ఒకే తండ్రికి పుట్టిన అక్కా తమ్ముళ్ల మధ్య ఆస్తి తగాదాగా ఊహిస్తారు. ఇలా ప్రేక్షకుల ఊహద్వారా సమకాలీన సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను తెరకెక్కించారు రచయిత."

ఈ పైనాటికల్లో కొన్ని కేవలం సమస్యను మాత్రం చిత్రించాయి. కొన్ని పరిష్కార మార్గాలు సూచించాయి. స్త్రీల జీవితాలకి సంబంధించిన పీడనను ఈ నాటికలు స్పృశించాయి. ఒకవైపు ఎందరో సంస్కర్తల కృషి ఫలితంగా స్త్రీల చీకటి బతుకుల్లో అక్షరదీపాలు వెలుగుతున్నా, అది స్త్రీల జీవితాలకు పూర్తి భరోసా ఇవ్వటం లేదు. స్త్రీలు ఉద్యోగాలు చేస్తున్నా పురుషస్వామ్య పరిమితులకు లోబడే ఉండవలసి వస్తుంది. ఈనాటికీ ఆడ, మగ ఇద్దరిలో తప్పెవరు చేసినా, సంఘం చేతబూనిన, తరాజు స్త్రీవైపే మొగ్గు చూపుతుంది.

పుట్టిన ఆడపిల్లని పురిట్లో వదిలించుకునే నీచత్వం, ఆడపిల్లను కట్నం పేరిట ధనం తెచ్చే వనరుగా చూడటం, బలాత్కారాలు, బలవంతపు చావులు, యాసిడ్ దాడులు, తాగివచ్చి భర్తపెట్టే హింస, ఆడపిల్లలున్నా మగపిల్లాడు పుట్టేవరకూ స్త్రీని వేదించడం, ఇలా చెప్పుకుంటూపోతే స్త్రీల జీవితాలలో నేటికీ చెప్పుకోదగ్గ మార్పులేదు. ఇలాంటి నాటికల అవసరం తీరుపోలేదు. వ్యవస్థ భావజాలాల్లో సమూల మార్పులొస్తేనే గాని స్త్రీల జీవితాలలో సమానత్వం రాదు. ఆ సమానత్వ సాధన కోసం, స్త్రీశక్తి సమిష్టిగా కదలాలి.

ఆధార గ్రంథం :

ప్రసిద్ధ తెలుగు నాటికలు (ప్రయోజనాత్మక రచనలు)
ప్రథమ ముద్రణ – జనవరి 2011

స్వీయచరిత్ర – ఒక పరిశీలన

కె.విజయలక్ష్మి, తెలుగు అధ్యాపకురాలు , ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల (స్వ.ప్ర), కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్.
సెల్ : 9441325908.

ఆధునిక యుగంలో ఆంగ్ల విద్యా ప్రభావంతో మనదేశంలో విస్తృతమైన మార్పులు సంభవించాయి. ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల కథ, నవల, వ్యాసం, జీవిత చరిత్ర, విమర్శ మొదలగునవి అనేక సాహిత్య ప్రక్రియలు ప్రవేశించాయి. తెలుగులో వచ్చిన సాహిత్య ప్రక్రియల్లో స్వీయ చరిత్ర ఒకటి.

ఒక వ్యక్తి తన జీవిత చరిత్రను తానే రాస్తే అది "స్వీయచరిత్ర" లేదా "ఆత్మకథ" అని అంటారు. ఆత్మకథనే ఆంగ్లంలో "ఆటో బయోగ్రఫీ" అంటారు. స్వీయ చరిత్ర రచించే వ్యక్తి లోకానికి తన బహిరంగ జీవితంతో పాటు ఆంతరంగిక జీవితాన్ని కూడా తెలియజేయాలి. కావున ఆత్మకథను రాయడం చాలా కష్టతరమని చెప్పవచ్చు.

"స్వీయ చరిత్ర వచన ప్రక్రియగానే ప్రాచుర్యం పొందింది. కొందరు పద్యకృతిగా ఆత్మ చరిత్ర రచించిన వాళ్ళూ లేకపోలేదు. కాని ఆంగ్ల సాహిత్యంలోనూ, తెలుగులోనూ కూడా స్వీయ చరిత్ర అనగానే అది వచన రచనగా ఉండటమే పరిపాటి అని రూఢమై పోయింది" – అక్కిరాజు రమాపతిరావు గారి వివరణ గమనించదగ్గది.

సమాజంలోని విభిన్న రంగాల్లో విశిష్టమైన సేవచేసిన మహానుభావులు ఆనాటి కాలంలో, సంఘంలో వారు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారో, వాటి వలన ఎటువంటి పరిణామాలు సంభవించాయో, వారి స్వీయ జీవితాను భవాలను, జ్ఞాపకాలను, భావితరాలకు అందించడమే స్వీయచరిత్ర. తెలుగు సాహిత్యంలో స్వీయచరిత్రలు చాలా వచ్చాయి. కాని ఆదర్శప్రాయంగా వుండి ఆత్మస్తుతి, పరనింద లేకుండా తమ జీవితంలో జరిగిన సంఘటనలను ఉన్నదున్నట్లుగా వ్రాసి స్వీయ చరిత్రలను భావితరాలకు కొంతమంది మహానుభావులే అందించారు.

స్వీయచరిత్ర వికాసం :

భారతదేశంలో మొట్టమొదటగా స్వీయ చరిత్రను రాసుకున్న వారు 'రాజారాంమోమన్‌రాయ్' గారు. గాంధీ మహాత్ముడు రాసిన "మై ఎక్స్‌పెరిమెంట్ విత్ ట్రూత్" తనలోని లోపాలను కూడా చెప్పుకున్న ఆత్మకథ. మహాత్ముని కథ ఆత్మకథలన్నింటికి ఆచర్య ప్రాయమైనది. అన్ని భారతీయ భాషలలో కూడా ఆత్మకథలున్నాయి.

తెలుగు వారిలో మొట్టమొదటి స్వీయచరిత్రను రాసుకున్నవారు 'వెన్నెలకంటి సుబ్బారావు గారు' వీరు చెన్నై న్యాయస్థానంలో ప్రధాన అనువాద అధికారిగా పనిచేశారు. వీరు ఆంగ్లంలో "లైఫ్ అండ్ జర్నల్ ఆఫ్ వి.సుబ్బారావు" అనే పుస్తకం రాశారు. ఈ పుస్తకం 1873లో ప్రచురింప బడింది. ఇందులో వివరాలన్నీ పూసగుచ్చినట్లు తేదీలతో సహా రాయడం విశేషం. వీరి మరణానంతరం "ఆటో బయోగ్రఫీ ఆఫ్ వెన్నెలకంటి సుబ్బారావు" గా ప్రచురితమైన ఈ గ్రంథం ఆంగ్లభాషలో ముద్రితమైన తొలి ఆత్మకథగా చారిత్రక ప్రఖ్యాతి పొందింది. ఈ ఆత్మకథను తెలుగులోనికి అక్కిరాజు రమాపతిరావు గారు అనువదించారు.

తెలుగులో స్వీయ చరిత్రకు ఆద్యుడు కందుకూరి వీరేశలింగం గారు. వీరి స్వీయచరిత్ర 1903–1915 మధ్య సాగిన రచన. వీరి జీవితవిశేషాలే కాకుండా ఆనాటి దేశస్థితి, విద్యావిధానం, సంఘంలోని దురాచారాలు, మూఢవిశ్వాసాలు మొదలైన వాటినన్నిటినీ బహిర్గతం చేశారు. సమాజాన్ని సంస్కరించాలనే లక్ష్యంతో చేసిన ప్రయత్నాలు, ఎదుర్కొన్న కష్టనష్టాలు, అభియోగాలు, నాటి తెలుగు సాహిత్య స్థితిని తెలియజేసే రచన. తెలుగులో వచ్చిన స్వీయచరిత్రల్లో మొదటిది.

వకీలు, సంఘసంస్కర్త, రాజకీయవాది అయినటువంటి వల్లూరి సూర్యనారాయణరావు గారు 1936లో "సూర్య నారాయణీయము" అనే స్వీయచరిత్ర రాశారు. మానవులు స్వశక్తి మీద ఆధారపడి ధర్మమని, కర్మయోగులుగా వుండి ప్రజాసేవ చేయాలని తన స్వీయ చరిత్రలో ప్రబోధించారు.

కందుకూరి గారి స్వీయచరిత్ర మార్గంలో చిలకమర్తి లక్ష్మీ నరసింహం గారు 1942 లో తన స్వీయ చరిత్ర రాశారు. ఇందులో ఆంధ్రదేశంలో విద్యావ్యాప్తికి, సంఘ సంస్కరణకు, మతోద్ధరణకు, నిమ్న జాతుల సంక్షేమానికి, మహిళాభ్యుదయానికి, సాహిత్యానికి, నాటక రంగానికి వీరు చేసిన సేవ తెలుస్తుంది.. తిలక్ మరణం నుండి స్వాతంత్ర్యం వచ్చే వరకు ఆంధ్రదేశంలోని సామాజిక స్థితి గతులను ప్రతిబింబించే ఒక మంచి "స్వీయచరిత్ర". కందుకూరివారి స్వీయచరిత్రకు సాటియైనది.

స్వాతంత్ర్యానంతరం ఆనాటి స్వాతంత్ర్య సమర యోధులు చాలామంది తమ స్వీయ చరిత్రలను జ్ఞాపకాలను వ్రాసుకున్నారు. అలాంటి వారిలో 'కొండా వెంకటప్పయ్య పంతులు" గారు ఒకరు. శాసన సభ్యుడుగా, ఆంధ్ర మహాసభాధ్యక్షుడుగా, కాంగ్రెసువాదిగా గాంధీ మహాత్ముని గౌరవఆదరాలకు పాత్రుడైన వెంకటప్పయ్య గారి స్వీయ చరిత్ర డెబ్భై సంవత్సరాల ఆంధ్రదేశ చరిత్ర. జాతీయోద్యమానికి గుండెనిచ్చిన ధీరోదాత్తుడు 'టంగుటూరి వీరేశలింగం పంతులుగారు ఇంకొకరు. లక్షలు సంపాదించి ప్రజల కోసం లక్షలు ఖర్చుపెట్టిన త్యాగశీలి పంతులుగారు, వీరు వ్రాసిన 'నా జీవితయాత్ర' అనే ఆత్మకథ యువతరానికి ఆదర్శప్రాయమైన వీరగాథ. 'దరిశి చెంచయ్య' రాసిన "నేను – నాదేశము" అనే స్వీయచరిత్ర నిజముగా దేశ చరిత్ర. ఆనాటి దేశ, రాష్ట్ర ఉద్యమాలు, సాంఘిక, సాంస్కృతిక, ఆర్థిక పరిస్థితులను వ్యక్తుల చైతన్యాన్ని వీరు తమ స్వీయ చరిత్రలో పదిలపరిచారు. దోపిడీ వ్యవస్థ పోతేనే కుల సమస్యకు పరిష్కారం ఉంటుందని వివక్షలు అంతరిస్తాయని గట్టిగా నమ్మినవారు "దరిశి చెంచయ్య" గారు. వీరు నేటి తరానికి అనేక చారిత్రక అంశాలను అందించారు.

రాంబొట్ల జగన్నాధశాస్త్రి గారి "స్వీయచరిత్ర", బలభద్ర కోటయ్య గారి "ఆత్మకథ", రాయసం వెంకటశివుడు గారి "ఆత్మ చరిత్రం", వేటూరి ప్రభాకరశాస్త్రి గారి "ప్రజ్ఞా ప్రభాకరం" స్వీయ చరిత్రలలో ముఖ్యమైనవి. వారు ఎదుర్కొన్న కష్టనష్టాలు, అనుభవాలు చక్కగా వివరించారు. కందుకూరి తర్వాత ఆస్థాయికి తగిన స్వీయచరిత్రగా ఆదరణ పొందినది శ్రీపాద సుబ్రహ్మణ్యం శాస్త్రి గారి "అనుభవాలు–జ్ఞాపకాలు." ఇందులో తెలుగువారి సాహిత్య, సాంస్కృతిక విషయాలను అద్భుతంగా వివరించారు. శైలి ఆహ్లాదకరంగా వుంటుంది. గొట్టిపాటి బ్రహ్మయ్య గారి "నా జీవిత నౌక", కొండా వెంకటప్పయ్యగారి "స్వీయ చరిత్ర"లు ఆంగ్లేయుల కాలం నాటి సమాజ పరిస్థితులు, రాజకీయ ఉధ్యమాలు, ప్రజా చైతన్య తెలియజేస్తాయి. ఆచంట లక్ష్మీపతి గారు వైద్య రంగంలో తన కృషిని, అనుభవాలను వివరిస్తూ "స్వీయ చరిత్ర" రాశారు.

భర్త జ్ఞాపకాలను అనుభవాలను సన్నిహితంగా పరిశీలించి రాసిన స్వీయ చరిత్రలలో మొదటిది అప్పారావు భార్య రాజ్యలక్ష్మమ్మ గారి "అప్పారావు – నేను" అనే స్మృతి గ్రంధం. గుర్రం జాషువాగారు కరుణాత్మకంగా, మన హృదయం ద్రవించేలా తన స్వీయచరిత్రను పద్యరూపంలో "నా కథ" చక్కగా రాశారు. కె. ఎన్. కేసరిగారు రాసిన "నా చిన్ననాటి ముచ్చట్లు" లో పేదరికం నుండి సంపన్న జీవితానికి ఎలా ఎదిగింది, సాంఘిక సేవ ఎలా చేసినది మొదలైన వాటిని వినూత్న పద్ధతిలో తన స్వీయ చరిత్రను వివరించారు.

చలంగారి 'ఆత్మకథ", శ్రీశ్రీ గారి "అనంతం", బోయి భీమన్న గారి "పాలేరు నుంచి పద్మశ్రీ వరకు", బుచ్చిబాబు గారి "నా అంతరంగ కథనం", తెలుగులెంక తుమ్మల సీతారామమూర్తి గారి "నా కథలు" తిరుమల రామచంద్ర

గారి కాళోజీగారి "హంపి నుండి హరప్పాదాకా", కాళోజీ గారి "ఇదీ నా గొడవ", రావి నారాయణరెడ్డి గారి "వీర తెలంగాణ – నా అనుభవాలు", అక్కినేని నాగేశ్వరరావుగారి "నేను నా జీవితం" మొ॥ స్వీయ చరిత్రాత్మక రచనలు. రచనలో ఎవరి ప్రత్యేకత వారిది.

"కల్పన కన్న యదార్థతే ఒక్కొక్కప్పుడు అద్భుతంగా వుంటుంది" అని ఇంగ్లీషులో ఒక సూక్తి వుంది. అటువంటి ప్రత్యక్ష కథలు భావితరాల భవిష్యత్తును తీర్చిదిద్దే వెలుగుబాటలు స్వీయచరిత్రలు. కాని తెలుగులో వెలుబడిన స్వీయ చరిత్రలు తక్కువగానే వున్నాయని చెప్పవచ్చు. దీనికి కారణం మిగిలిన సాహిత్య ప్రక్రియలకు లభించినంత ఆదరణ తెలుగు స్వీయచరిత్రలకు లభించక పోవడమే. మహానుభావులు తమ ఆత్మకథను వ్రాయడం మొదలుపెట్టిన కొద్దిరోజులకు అది పూర్తవకుండానే చనిపోవడం మరొక కారణం. ఇలాంటి వాటి వలన మహనీయుల గొప్ప సాంఘిక చరిత్రను తెలుగుజాతి పోగొట్టుకుంటుంది. ఒక వ్యక్తి జీవితానికి ఒక లక్ష్యమనేది ఎంత ముఖ్యమో తెలిపే గాంధీ గారి "సత్య శోధన", అబ్దుల్ కలాం గారి "వింగ్స్ ఆఫ్ ఫైర్" లాంటి ప్రముఖ వ్యక్తుల స్వీయ చరిత్రలు భావి తరాలకు ఆదర్శనీయాలు. ఇటువంటి మహనీయుల స్వీయ చరిత్రలు నేటి యువతలో స్ఫూర్తిని నింపి వారి మంచి భవిష్యత్తుకు మార్గదర్శకాలు అవుతాయి.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య చరిత్ర– డా॥ ద్వానా శాస్త్రి
2. తెలుగు సాహిత్య చరిత్ర – ఆచార్య వెలమల సిమ్మన్న
3. తెలుగు సాహిత్య ప్రక్రియలు – ధోరణులు – ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు.

శ్రీశ్రీ మహా ప్రస్థానం – అభ్యుదయ దృక్పథం

డా॥ బూర్గుల స్వరూప, తెలుగు సహాయాచార్యులు, యం.వి.యస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహబూబ్‌నగర్.
సెల్: 9000982008

మానవుడే నా సందేశం,మనుష్యుడే నా సంగీతం అని ఎలుగెత్తి చాటిన మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు. వీరు ఏప్రిల్ 30, 1910లో విశాఖపట్నంలో జన్మించారు. 1931లో బిఎ పూర్తి చేసిన శ్రీశ్రీ ఏవియన్ కళాశాలలో డెమోన్‌స్ట్రేటర్‌గా మద్రాసు ఆంధ్రప్రభలో ల్యాబెరెటరీ అసిస్టెంట్‌గా వివిధ ఉద్యోగాలు చేసిన తన స్వంతభావాల కారణంగా దేనిలోనూ ఇమడలేక సినీ రంగంలో స్థిరపడ్డారు.

శ్రీశ్రీకి మంచి పేరు తెచ్చినా కవితా సంపుటి మహా ప్రస్థానం. ఇందులో మొత్తం 40 ఖండికలు ఉన్నాయి. శ్రీశ్రీ గారు ముందు పద్యకవి, భావకవి, ఆ తర్వాత అభ్యుదయ కవి, తర్వాత విప్లవ కవి,స్వీయ చరిత్రను అనంతం అనే శీర్షికలో రచించారు.

మహాప్రస్థానంలోని మొదటి గీతం మహాప్రస్థానం. చివిరిది జగన్నాథుడి రథచక్రాలు. చాలా వరకు తన కవితలను ఒకపూటలో ఒక సిట్టింగ్‌లో పూర్తి చేసే వారు. శ్రీశ్రీకి జగన్నాథుడి రథచక్రాలు కవిత పూర్తి చేయడానికి చాలా కాలం తీసుకున్నది. మహాప్రస్థానాన్ని అర్థం చేసుకోవడానికి చలం యోగ్యతా పత్రం ఒక చక్కని ముందుమాట.

మహాప్రస్థానం అంటే గొప్ప ప్రయాణం. ఈ దోపిడి వ్యవస్థ నుండి సామ్రాజ్యవాద వ్యవస్థకు నవ సమాజ వ్యవస్థకై పయనింప చేయడమే మహాప్రస్థానం. అభ్యుదయ పదంవైపు ప్రస్థానం సాగించాలన్నది శ్రీశ్రీ గారి ప్రబోధం.

మరో ప్రపంచం:
మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది
పదండి ముందుకు
పడండి త్రోసుకు
పోదాం ..పోదాం.. పైపైకి అంటూ కొత్త లోకాంతర యాత్రకు నడిపించారు.

మహాస్థానం రచనా కాలం 1934 నాటికి ప్రపంచంలో ఆదర్శవంతమైన వ్యవస్థలు రెండు ఒకటి ప్రజాస్వామ్యానికి, రెండవది సామ్యావాదానికి అంకితమైనది. మొదటిదానికి అమెరికా, రెండవ దానికి రష్యా నాయకత్వం వహించాయి. శ్రీశ్రీ ఆరంభించిన అభ్యుదయ మార్గం గురజాడ ప్రగతి వారసత్వాన్ని అందుకుంది. మహాప్రస్థానం కవితా సంపుటి తెలుగు సాహిత్యంలో అంతర్జాతీయ, సామ్యావాదానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. మార్పు నవ సమాజ లక్ష్యం, మరో ప్రపంచమై నూతన వ్యవస్థ నిర్మాణానికి దారితీసింది. ఈ మరో ప్రపంచం వ్యక్తిగతమైంది కాదు. సమాజగతమైనది. గురజాడ లిబరలిజం ప్రగతిశీలం నుండి శ్రీశ్రీ మార్క్స్ అభ్యుదయ తత్వానికి ప్రయాణించడానికి 35 సంవత్సరాలు పట్టింది. ఈ మధ్య కాలంలో నవ్య కవిత్వం, భావ కవిత్వం కాల్పనిక ముద్రలతో ప్రముఖమైన పరిణామ ధోరణులుగా వ్యాప్తిలోకి వచ్చాయి. అయితే వీటితోపాటు ఇంచుమించు సమాంతరంగా సాంప్రదాయ కవిత్వం సాగింది. పలు భేదాలతో నవ్య సాంప్రదాయ కవిత్వం సాగుతూనే ఉంది. ఈ వలయాన్ని చేధించుకొని సాహసంలో అతిక్రమించి శ్రీశ్రీ ప్రయోగించిన జయభేరి కవిత్వానికి సంబంధించిన ఉన్నతమైన ప్రమాణాల్ని అనుసరించి పరిశీలిస్తే ఇది మొట్టమొదటి అభ్యుదయగీతంగా నిలుస్తుంది.

నేను సైతం ప్రపంచాగ్నికి
సమిదనొక్కటి ఆహుతిచ్చాను
ప్రపంచ వ్యాప్తమైన విప్లవాగ్నికి

ప్రతివ్యక్తి ఒక సమిధయై ఉజ్వలింప చేయాలని మన కర్తవ్యాన్ని గుర్తు చేస్తున్నారు శ్రీశ్రీ.

సామ్యావాద సమాజాన్ని కోరే అభిప్రాయాలకు అనుగుణంగా విశ్లేషణకు అందే మహాప్రస్థానం శ్రామిక రాజ్యాన్ని స్థాపించేది. శ్రమ జీవిన సౌందార్యాన్ని భావించేది జగమంతా శాంతిని, క్రాంతిని కోరేది.

నాలో కదిలే నవ్య కవిత్వం కార్మిక లోకపు కళ్యాణానికి
శ్రామిక లోకపు సౌభాగ్యానికి సమర్పణంగా
సమర్చనముగా
శ్రమైక జీవన సౌందార్యానికి లేనే లేదని

కష్టజీవులకు కర్మవీరులకు నిత్య మంగళం నిర్దేశిస్తూ సాగింది. అభ్యుదయ శబ్దాన్ని మొదట ప్రయోగించింది శ్రీశ్రీయే. నవ, నవ్య, నవీన శబ్దాలను వాడారు. అభ్యుదయ శబ్దమే తెలుగు సాహిత్యంలో సమ సమాజ సామ్యావాద సిద్ధాంతాన్ని ఆవిష్కరించేందుకు రూఢమైంది. ఆధునిక తెలుగు కవిత్వంలో ముఖ్యమైన అభ్యుదయ పరిణామ శిఖరానికి ప్రాణభూతమైన కేంద్ర బిందువు మార్క్స్ సామ్యావాద సిద్ధాతం. మహాప్రస్థానాన్ని వ్రాసే నాటికి తనకు మార్క్సిజం గురించి తెలియదని మార్క్సిజం తెలుసుకున్నది సాహిత్యం ద్వారానే నని శ్రీశ్రీ ఒక మాట అన్నారు. సమాజంలో ఆకలి, దారిద్ర్యం అజ్ఞానం ప్రబలింది. శ్రీమ శక్తిని వశం చేసుకున్న ధనస్వామ్య వర్గానికి వ్యతిరేకంగా పోరాటం ఆరంభమైంది. వ్యవస్థలో మార్పు ప్రజలకు నవ జీవనాన్ని ప్రసాదిస్తున్నదని శ్రీశ్రీ అభిప్రాయం.

చిరకాలం జరిగిన మోసం బలవంతుల దౌర్జన్యాలు,
ధనవంతుల పన్నాగాలు ఇంకానా... ఇకపై సాగవు.

ఒక వ్యక్తిని మరోక వ్యక్తి, ఒక జాతిని వేరొక జాతి పీడించే సాంఘిక ధర్మం ఇంకనా ఇకపై సాగదు. సమాజంలో ఎక్కువ మంది పీడితులే. పీడించే వారు ఎప్పుడు అల్ప సంఖ్యాకులే. మీరు అన్యాయాలకు, అక్రమాలకు గురయ్యారు. అసమానత్వం పెరిగిపోయింది. దీన్ని సరిచేయాలంటే మనందరం ఏకం కావాలని శ్రీశ్రీ గారి అభిప్రాయం.

వస్తున్నాయి.. వస్తున్నాయి..
వస్తున్నాయ్.. వస్తున్నాయ్...
జగన్నాథ... జగన్నాథ....
జగన్నాథ రథచక్రాలు...జగన్నాథ రథచక్రాలు

అంటూ పతితులు భ్రష్టులు, దీనులు, హీనులు, దరిద్రులు, బాధితులు అందరూ కొత్త స్ఫూర్తితో , మార్పుతో ఆనందించే స్వాతంత్ర్యం, సమభావం, సౌభ్రాతృత్వం వెల్లి విరియాలని జగమంతా శ్రామిక జన శాంతి, కాంతి చేకూరాలని చివరకు ఆ కాంతిలో, ఆ శాంతిలో సామ్యావాద మరో ప్రపంచ వ్యవస్థపై తెలుగు సాహిత్య ప్రపంచంలో అభ్యుదయ కవిత పరిణామ శిఖరంగా శ్రీశ్రీ గారి మహాప్రస్థానం అవిష్కృతమైందని నా అభిప్రాయం.

ఆధార గ్రంథాలు:

1) మహా ప్రస్థానం – శ్రీశ్రీ
2) తెలుగు సాహిత్య చరిత్ర – ద్వానా శాస్త్రి

ఆరుద్రగారి అద్వితీయ రచనలు – అభ్యుదయం

సాకే సాయిసుష్మ, ఎం.ఎ, ఆంగ్లసాహిత్యం, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి
సాహితి మోదుగుల, ఎం.ఎ, ఆంగ్లసాహిత్యం, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి

సుమారు మూడేళ్ళు క్రితం కరోనా సమయంలో ఓ సాయంకాలం మా ఇంటి మెట్ల మీద కూర్చుని చర్చించుకున్న పుస్తకం పేరు 'త్వమేవాహం.' అప్పటికి నాకు తెలిసింది ఆ పుస్తకాన్ని ఎవరో ఆరుద్ర అనే కవి రాసారు అని మాత్రమే. ఒక్కసారి నిలబడి ఆలోచిద్దాం. నిర్మొహమాటంగా మాట్లాడుకుందాం. ఆరుద్ర సాహిత్యరంగ ప్రవేశంచేసి ఎన్నో ఏళ్ళు గడిచాయి. ఆ కాలంలో రాజకీయంగా, సాంఘికంగా – ఎన్నెన్నో ఉద్యమాలు, సిద్ధాంతపరమైన తర్జన భర్జనలు గడిచాయి. వీటి నేపధ్యంలో ఆధునిక – కవిగా ముద్రపడిన ఆరుద్ర సాధించిందేమిటి? ఈ ప్రశ్నకు సమాధానం వెతుక్కోడానికి మన ఎదుటవున్న కవితా సంపుటాలు 'త్వమేవాహం', 'సినీవాలి', 'పైలా పచ్చీసు', 'ఏటికేడాదీ', 'గాయాలు– గేయాలు', 'కొండగాలి తిరిగింది'. వీటిలో చివరి రెండూ పాటల సంపుటాలు.

"తరానికోవందకవులు....తయారవుతారెప్పుడూ వందలోనూ మందలోనూ...మిగలగలిగే దొక్కడు" అంటూ తన మాటల్లోనే అభ్యుదయ కవిత్వోద్యమంలో నిలదొక్కుకుని, ఆ తరంలో మిగలగలిగిందీ, విశ్వరూపందాల్చిందీ ఒక్కడే. ఆ ఒక్కడే "కళాప్రపూర్ణ"డిగా సాహితీప్రియుల మనస్సులో చిరస్థాయిగా నిలిచిన ఆదర్శనీయుడు భాగవతుల సదాశివ శంకరశాస్త్రి(ఆగస్టు 31, 1925 – జూన్ 4, 1998). బహుశా ఈ పేరు ఎవ్వరూ వినకపోయి ఉండవచ్చు. "ఆరుద్ర" అంటే మాత్రం ఇట్టే గుర్తుపట్టేస్తారు. ఆంధ్ర సాహిత్య చరిత్రలో ఒక అపూర్వమైన, అరుదైన సంఘటన ఏదంటే ఆరుద్ర అనే ఒక సామాన్యుడు అసామాన్యుడుగా ఎదిగి, ఒక ఇతిహాసంగా రూపొందడమే. తెలుగు సాహిత్య ప్రపంచానికి ప్రాపంచిక దృష్టితో పాటు భౌతిక దృక్పథాన్ని పరిచయం చేసిన సాహితీ ఉద్యమం అభ్యుదయ సాహిత్యం. అభ్యుదయ సాహిత్యంలో పరిచయం అవసరం లేని సాహితీమూర్తుల్లో ఆరుద్ర ఒకరు. "అంత్యప్రాసలే ఆయన వ్రాలు ముద్ర. మాటలు వండడంలో గడసరి. పాటలు పేర్చడంలో పొడగరి. జీవితం అంత అద్భుతంగా ఉపమించడంలో నేర్పరి. పొయట్రిక్స్ ప్రయోగించడం సరేసరి. అర్జెంట్ రచనల్లో కూడా మరి అర మెరుపైనా తప్పనిసరి." ఇది ఆరుద్ర గురించి ముళ్లపూడి వెంకటరమణ వ్యాఖ్యానం. పాత్రోచిత భాషాప్రయోగం, అంత్యప్రాసలు ఆయన ప్రత్యేకతలు. హాస్యాన్ని ఎలా దట్టించగలరో వ్యంగ్యాన్ని కూడా అంతే బాగా పుట్టించగలరు. తెలుగు సాహిత్యమూ, తెలుగు జీవనము వంటి అంశాలపై మిక్కిలి వ్యాసములు రాసారు.

'సినీవాలి' అని పేరు పెట్టడం దగ్గర్నుంచి, 'తెలివైన కవిత్వం'తో 'విలక్షణ'మైన ప్రతిభను చూపడం వరకు ఆరుద్రగార్ని ప్రత్యేక వ్యక్తిగా నిలబెడ్తాయి. సమగ్రాంధ్ర సాహిత్యంలో ఆరుద్రగారు 'కూరుకుపోయేటట్లు' చేయగల్గిన పరిశోధనాసక్తి, శక్తి ఆయన కవిత్వంలోనే నాకు కనిపించాయి. అనుభూతిని కలిగించే కవిత్వం కాక, ఆలోచింపజేసే కవిత్వాన్ని రాసిన 'వైజ్ఞానిక కవులు' లేక 'తెలివిగల కవులు' అనిపించే మన తెలుగువారిలో మాకు మొదట పఠాభి, తర్వాత ఆరుద్ర గుర్తుకు వస్తారు. శ్రీశ్రీ తర్వాత యువతరంపై ఎక్కువ ముద్ర వేసిన కవి. ఆరుద్ర సాహిత్యచరిత్రకారుడు, సామాజికశాస్త్రవేత్త, అభ్యుదయకవి, పండితుడు, పరిశోధకుడు, నాటకకర్త, విమర్శకుడు. రచయిత చాగంటి సోమయాజులు (చాసో) మార్క్సిస్టు భావాలను నూరిపోశాడని, ఆరుద్ర కవితాధోరణిలో శ్రీశ్రీ ప్రభావం కొంత వరకూ ఉందని సాహితీ విమర్శకులు అంటారు. వివిధ రంగాల్లోనేకాక వివిధ ప్రక్రియల్లో ఆరితేరిన

అరుదైన వ్యక్తి ఆరుద్ర. త్వమేవాహం, సినీవాలి, కూనలమ్మ పదాలు, ఇంటింటి పద్యాలు వంటి అనేక కావ్యాలతో పాటు వెన్నెల-వేసవి, దక్షిణవేదం, జైలుగీతాలు వంటి అనువాద రచనలు, రాదారిబంగళా, శ్రీకృష్ణదేవరాయ, కాటమరాజు కథ వంటి అనేక రూపకాలతో పాటు కొన్ని కథలనూ, నవలలనూ కూడా రచించారు. సమకాలీన జీవనం ఇతివృత్తముగా తీసుకొని, అతిసులభమైన భాషలో వీరు వ్రాసిన 'కూనలమ్మపదాలు' చాలా ప్రాచుర్యం చెందాయి. అది వ్యంగ్య రచన కూడాను. ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా చాలా చక్కగా సాగిన రచన అది. "సరికొత్త తెలుగు కవిత్వం శ్రీశ్రీ ఒర (కత్తి) వడిలో తత్సమతాండవం చేస్తున్న రోజుల్లో – ఇంగ్లీషు క్రియా పదాలకు 'ఇంచుక్కులు' చేర్చి (చెరిషించు వగైరా) వైచిత్రికి వాకిలి తెరచిన వైతాళికుడు ఆరుద్ర. కవి విమర్శకుడైతే ఎంత విశేషమో అంత ప్రమాదం. నగటు ప్రమాణాల దృష్ట్యా- ఆత్మభూషణమో అన్యదూషణమో తొంగిచూస్తుంది గనక. అందుకు అపవాదం ఆరుద్ర." అన్నారు సినారే.

తమ కవిత్వానికి చిరునామా అక్కర్లేని కొద్ది కవుల్లో ఆరుద్ర ఒకరు. 'ఆరుద్ర' అనగానే అనుప్రాస రూపంలోనో అంత్యప్రాస రూపంలోనో 'ముద్ర' అనే పదం దొర్లుతుంటుంది పక్కపక్కనే. అది మామూలే. నిజానికి ఆరుద్ర అంటే ఆధునికత, కొత్తదనానికి గుత్తాదారు. నెత్తి అదిరే ప్రయోగాలకు పెత్తందారు. ఆరుద్ర పరిశోధనా దృష్టికి పరాకాష్ఠ సమగ్ర ఆంధ్రసాహిత్యం. ఇది తెలుగు సాహిత్యాన్ని అధ్యయనం చేసేవారికి ఒక గొప్ప ఉపయుక్త గ్రంథం. ఇలాంటి రచన చేయడం అకాడమీలు, ప్రభుత్వ సంస్థలు వంటి వనరులు గలిగిన సంస్థలు మాత్రమే పూనుకొనగల పని. అటువంటి మహాకార్యాన్ని ఆరుద్ర ఒక్కరే తలకెత్తుకొని విజయవంతంగా పూర్తిచేశారు. ఇది 1965, 1968లలో 13 సంపుటాలుగా వెలువడింది. వెయ్యేళ్ల తెలుగు సాహిత్యానికి వెల కట్టడంలో ఆరుద్ర చేసిన పరిశోధన అపారం. పరిశోధక సహ సఫణులకు శిరోధార్యం.

రాజకీయంగా, సాంఘికంగా జాతి మనుగడకు, సమైక్యతా సమగ్రతలకు ముప్పు వాటిల్లుతున్న సమయాల్లో కవులెందరో తమ గళాలనెత్తి సమతా, మానవతా వాదాల్ని వినిపించారు. సంఘం నీతి నియమాల్ని మర్చిపోయి దుందుడుకు ప్రవర్తనల్తో చెలరేగుతున్న సమయాల్లో వేమన కలం వెన్నెముకై నిల్చింది. గురజాడగళం అడుగు జాడ వేసింది. స్వాతంత్ర్యం మేడిపండై, దారిద్యం రాచపుండై ఆథోజగత్సహోదరుల్ని పట్టి పీడిస్తున్న సమయంలో, స్వార్థం పెరిగి, సామ్రాజ్యవాదాలజోన్మాదులై పోతున్న తరుణంలో ఆధునిక కవులు తమ బలం పెరిగి, మారనోన్మాదులై పెరిగిన తరుణంలో, కవులు తమ కవితా శంఖారావాన్ని వినిపించారు. కవితను విశ్వజనీనం చేశారు. సగటు మానవుడి సంక్షేమాన్ని కోరారు. కలాల్లో శ్రీశ్రీ కొత్త సిరా నింపారు. కొత్త పాళీలు తొడిగారు. ఆలోచనాలోచనాలు విప్పారు. మహా ప్రస్థానాలు చేశారు. త్వమేవాహం అన్నారు. వజ్రయుద్ధాలను పట్టారు.

త్వమేవాహం-1948. ఇందులో ఉన్న ఆరుద్ర ఆద్రమైన హృదయం నన్ను బాగా ఆకట్టుకున్న విషయం. ఇది చదువుతుంటే "కళ పోరాటంలో ఉద్భవించింది" అన్న క్రిస్టోఫర్ కాడ్వెల్ మాట గుర్తొస్తుంది. త్వమేవాహం పచ్చి ఆధునిక కవితల కూర్పు. ఇది ముఖ్యమైన తెలుగు రచనలలో ఒకటి. కళాకేళి వారు త్వమేవాహం ప్రచురించి ఆధునిక సాహిత్యానికి గొప్ప ఉపకారమే చేసారు. 'త్వమేవాహంలో కావ్యాన్ని ప్రవాహంగా ఊహించాను' అన్నాడు ఆరుద్ర. 1943వ సంవత్సరం జూలై పదవ తారీఖు కృష్ణా పత్రికలో 'నాకా సిగ్గు? నా స్త్రీత్వం యెప్పుడో పోయింది' అనే పతాకంతో 'రజాకార్లచే చెరచబడ్డ స్త్రీ కథనం పడ్డాది.' ఒక రైలు పెట్టెలో వలువలు తీసేసి నగ్నంగా నిలబడిన స్త్రీని చూసి 'ఇదేమిటమ్మా? ఆడపిల్లవు! అలా నగ్నంగా వున్నావు. తప్పు కదూ!' అన్న ఒక వ్యక్తికి సమాధానంగా ఆమె చెప్పిన మాటలు "…. నేను ఆడదాన్నా? నైజాం కిరాతకులు నన్ను 6 రోజులిలా నగ్నంగా చెట్టుకు కట్టివేసి అట్టే పెట్టారు. నా

స్త్రీత్వాన్ని ఆనాడే దొంగిలించారు. ఆడతనం ఆనాడే పోయింది." అని ఉంది. ఆ దృశ్యం కళ్ళారా చూసి, ఆమె వాక్కులకు కన్నీరు కార్చిన ఒక ప్రయాణికుడు పంపిన వార్త చదివాక త్వమేవాహం మొదలెట్టా' అన్నారు ఆరుద్ర.

ఆధునిక కవితా ప్రపంచంలో మరపురాని మహాకావ్యమైన త్వమేవాహంలోని ప్రతి శబ్దానికి గల ధ్వన్యర్థం నేను అవగతం చేసుకోడానికి ప్రయత్నించాను. తెలంగాణా నిజాం పాలనలలో జరిగిన రజాకార్ల అకృత్యాలు ఈ రచన నేపథ్యం. మృత్యువు ఒక వ్యక్తితో నువ్వే నేను (త్వమేవాహం) అంటుంది. ఒక చోట రచయిత సమాజంలోని ఘటనలను, దృక్పథాలను ఊహాజనితమైన గడియారంతో పోలుస్తాడు. 1940 దశకంలో తెలంగాణాలో రజాకార్ల ఆకృత్యాలకు బలైపోయిన మహిళల దుస్థితిని, తెలంగాణాలో రజాకార్లు చేస్తున్న ఆకృత్యాలపై గుండెల్లో పుట్టిన తన ఆవేదనను కావ్యరూపంలో మలిచారు. నిరంకుశత్వాన్ని నిర్భయంగా ప్రత్యక్షర శిల్పంగా మలిచారు. ఈ రచన తెలంగాణాలో నిజాం నిరంకుశత్వానికి అద్దం పడుతుంది. రజాకార్ల ఆకృత్యాలపై రచించిన ఈ "త్వమేవాహం" అనే కావ్యం ఎందరో తెలంగాణా వాదులకు స్ఫూర్తినిచ్చింది. తెలంగాణా సాయుధ పోరాటం నేపథ్యంలో వచ్చిన ముఖ్యరచనలలో ఒకటిగా అది నిలిచింది. ఈ కావ్యాన్ని చదివి "నేనిక పద్యాలు రాయకపోయినా ఫరవాలేదు" అని మహాకవి శ్రీశ్రీ అంతటి గొప్ప కవి నుండి ప్రశంసలు అందుకుందంటే ఆ రచన ఎంత ఉన్నతమైందో అర్థం చేసుకోవచ్చు.

త్వమేవాహంలో ఓచోట 'నిద్రపోతున్న చెరువులో రాతి బెడ్డలు విసరెరా–సై' అని రాస్తారు ఆరుద్ర. తెలంగాణా, నిజాం పరిపాలనలో చాలా అధోగతిలో వుండింది. బ్రిటిష్ ఇండియాలో గల కొద్దిపాటి సౌకర్యాలు కూడా ఇక్కడ ప్రజలకు లేవు. వాక్ స్వాతంత్ర్యం బొత్తిగా లేదు. రైతులకు నీటి వనరులు లేవు. నిరక్షరాసత్య రాక్షసి వలె తాండవించేది. ప్రజల మాతృభాషను అణగద్రొక్కి నూటికి 10 మంది మాట్లాడే ఉర్దూ భాషను అధికార భాషచేయడమే గాక, కళాశాలల్లో పాఠశాలల్లో ఉర్దూను బోధనా భాష చేశారు. హైకోర్టులో తీర్పులు ఉర్దూలో వ్రాసేవారు. అయినా కిమ్మనకుండా పడివున్న ప్రజలు నిద్రపోతున్న చెరువు వంటి వారు. అ చెరువులో రాతిబెడ్డలు విసరి – అనగా కవ్వించి తనకు ముప్పుతెచ్చుకున్నాడు నిజాంనవాబు. తన రాష్ట్రంలోని రజాకారు మూకలనూ, అటు పాకిస్తాన్ను, నక్కజిత్తుల బ్రిటిషువారిని నమ్ముకున్నాడు నిజాము ఇరుగు పొరుగు వారి మాటవినలేదు పరోక్షంగా తెలంగాణా ప్రజల జాగృతికి కారణభూతుడైనాడు.

త్వమేవాహంలో 'సెకండ్లు' కాల ప్రవాహంలో చిన్న బిందువులు. అవి అట్టడుగున ఉన్న ప్రజలకు సంకేతాలు. అందుకే సెకండ్లు చేత జానపద ఫక్కీలో నిజాం రాజును గురించి ఆరుద్ర అప్పటి యుద్ధంలో పాట పాడించడంలో ఎంతో ఔచిత్యం ఉంది. త్వమేవాహం అంతా కథ చెడి, కల చెదిరిన ప్రజాస్వామ్యంలో కలి పురుషులు కావలాదారులుగా ఉన్నారు. వీధికొక్క వీరభోగ వసంతరాయలు ఉన్నాడు. రోజుకొక్క కాలజ్ఞానతత్వం పుట్టుకొచ్చింది. పోలీసులతో పైలా పచ్చిసు ఆడించేవారు. పహారా ఉషారు కనిపించదీ కాలంలో. అర్ధరాత్రి ఆడపడుచు నిర్భయంగా నడవాల్సిన గాంధీ పుట్టిన దేశంలో రమీజా షకీలాబీలు, శృతిమించిన ఖాకీ పారాయణాలెన్నో. నిజాం పాలనలో భూస్వామ్యం కాటేసిన గ్రామాయణాలెన్నో. పంచాయితీలు సైతం భూకామందు వైపే. న్యాయం నాలుగు పాదాల ధనస్వామ్యం విశేషం. అధికారం అనువంశిక వలసవాదం అవిశేషం. బహుళజాతి శరపంజరంలో సిగ్గు సదా సశేషం. శ్రమదోపిడీ శిబిరంలో బతుకు బలాత్కారం. ఆకలి బాధలు సరే సరి. అంతా నిర్బంధ కాండ ప్రతిబింబమై నిలిచింది.

ప్రతి సంఘటనను నూతన దృక్పథంతో చూడడం నూతన పద్ధతిలో చెప్పడం ఆరుద్రకు వెన్నతో పెట్టిన విద్య.

అందుకే క్రమంగా ఆరుద్రను సహృదయులైన పాఠకులు అర్థంచేసుకోడానికి ప్రయత్నించారు. అందుకే 'త్వమేవాహం' ఒక మరపురాని మజిలీగా సాహితీ యాత్రలో నిలిచి పోయింది. త్వమేవాహం గురించి మేము రాసిన దాన్ని చదవడమో, దీని గురించి చదివి బాగా ఆకళింపు చేసుకున్న వారు చెప్తే వినటమో కాదు. నిజంగా వినాలన్న తలంపు, తెలుసుకోవాలన్న జిజ్ఞాస ఉంటే కల చెదరిన వాళ్ళను, కథ కుదరని వాళ్ళను, దినవెచ్చం కన్నీళ్ళను, విన్న దుఃఖం వెక్కిళ్ళను, నేటి విచారం తబిసీళ్ళను, రేపటి భయం లేవిళ్ళను, చేరదీసి ఊరడించి నిత్య సత్యం తెలిసిన నిర్మల స్వప్నాల ఆనవాళ్ళు అడగాలి. అప్పుడు కాలిన పల్లె కొంపల్లోంచి, కూలిన కలల చిల్ల పెంకుల్లోంచి, దోపిడీ రాజ్యం నిజాం నిరంకుశత్వ పాలన గురించి గొంతులు ఘోష పెడతాయి. అవి మాకంటే విపులంగా వివరిస్తాయి.

తెలుగు సినిమా పాటల్లో ఆరుద్రది అనితర ముద్ర. సంగీతదర్శకులిచ్చిన బాణీలకు సమయానుకూలంగా, సునాయాసంగా, సరళంగా పాటలు రాయగలిగిన కవుల్లో ఆయన అగ్రేసరులు. ఆయన పాటల్లో సగటు మనిషి ఆవేదన ఉంటుంది. వారి బాధలను పోగోట్టే ఆనందం ఉంటుంది. విప్లవగీతాలైనా... భావాత్మకగీతాలైనా... దేశభక్తిగీతాలైనా.... ప్రణయగీతాలైనా.... విరహగీతాలైనా... విషాదగీతాలైనా... భక్తి గీతాలైనా ఆయన కలం నుంచి అలవోకగా జాలువారుతాయి. బందిపోటుచిత్రంలో ''ఊహలు గుసగుసలాడే", ఆంధ్రకేసరి చిత్రంలో "వేదంలా ఘోషించే గోదావరి", అందాల రాముడు చిత్రంలో "ఎదగడాని కెందుకురా తొందర", గోరంత దీపం చిత్రంలో "రాయినైనా కాకపోతిని" వంటి ఉదాహరణలు కోకొల్లలు.

నవ్య కవిత్వానికి నయాగరా ఆర్ద్రతకు మరో పేరు ఆరుద్ర. ఆయన అన్నట్లుగానే – కవిత కోసమే ఆయన పుట్టాడు, క్రాంతి కోసం కలం పట్టాడు. ఆఖరికి ఆ 'రుద్రభూమికే' చేరుకున్న ఆ మహనీయునికి, జోహార్లు సమర్పిస్తూ.....

రిఫరెన్స్

◆ ఆరుద్ర త్వమేవాహం – రచయిత ఆరుద్ర – మొదటి ముద్రణ 1948 – ముద్రణ కళాకేళి.

తెలంగాణ గిరిజన కథ –సామాజిక విశ్లేషణ

బానోత్ స్వామి, పరిశోధక విద్యార్థి కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ 506009. సెల్: 9603082128

ప్రపంచ దేశాలలో అనేక ఆదిమా జాతుల సంస్కృతులు ఉంటూ ప్రసిద్ధమైన సింధు ఈజిప్ట ఇరాన్ నాగరికతలు అనేవి అంతరించిన భారతీయ సంస్కృతి మాత్రం అవిచ్చినంగా కొనసాగుతోంది. భారతదేశంలో అనేక కులాలు, మతాలు, జాతులు భిన్న ఆచారాలు కలిగి ఉండి సంస్కృతిలో నాగరిక జాతులే కాక వివిధ ఆదిమ తెగల వారు కూడా ఉన్నారు. విభిన్న సంస్కృతులు కలిగిన భారతదేశంలో నాగరికతను తెలిపే కొన్ని ఆనవాళ్లు శాసనాలు, తాళపత్ర గ్రంధాలు, సాహిత్య రచనలు తెలుపుతున్నాయి. తెలుగు సాహిత్యంలో అనేక యుగాలు, అనేక సాహిత్య ప్రక్రియలు ఆవిర్భవిస్తూ తెలుగు సాహిత్యం ప్రస్తుతం ఒక ప్రత్యేకమైన స్థానాన్ని ఏర్పరచుకొని, ప్రబంధాలు, నాటకం, కథ, నవల, కవిత్వం వివిధ కాలాలకు సంబంధించిన అప్పటి రాజకీయ ఆర్థిక, సాంఘిక, సామాజిక అంశాలను చేరుస్తూ సాహిత్య రచన చేయడం జరిగింది.

కాలక్రమేనా అనేక సాహిత్య ప్రక్రియలు వచ్చి నప్పటికీని గిరిజన సాహిత్య సృష్టి ఆశించిన మేర జరగలేదు. దానికి ప్రధాన కారణం అరణ్య జీవితాలకు స్థిరపడిన వారి జీవితాలు అక్షరాస్యతను సాధించలేక పోవడం, ఆటవిక జీవనాన్ని కొనసాగిస్తూ పూర్తిగా నాగరిక సమాజానికి దూరంగా నివసించడం, కేవలం భూమిని ప్రధాన స్రవంతిగా చేసుకుని దానిపై ఆధారపడడం లాంటి ప్రధాన సమస్యలు వారి జీవితాన్ని ఆధునిక సమాజానికి దూరంగా నెట్టి వేశాయి. దానికి మూలంగా 1990 దశకం తర్వాత భూమిని కోల్పోయిన జీవితాలు అటవీ ప్రాంతంలో పారిశ్రామికీకరణ ఏర్పాటు మూలంగా అటవీ ఖనిజ సంపదను, సహజ సంపదను కోల్పోయిన వారి జీవితాలు మరింత లోతుగా వెళ్లిపోయాయి.

తెలుగు సాహిత్యంలో అనేక రచనలు వస్తున్నప్పటికీ గిరిజన సాహిత్యం లో మాత్రం ప్రజలు పాఠకులు ఆశించిన మేర సాహిత్య రచన జరగలేదు దీనికి ప్రత్యేక కారణం నిరక్షరాస్యత వైఖరి, గిరిజనులు మారుమూల ప్రాంతాలలో నివసిస్తున్న గిరి పుత్రులకు ఆధునిక నాగరికత తెలియకపోవడంతో పాటు మారుతున్న ప్రపంచీకరణ ప్రభావితంశాలు వీరి జీవితాలను తొక్కి వేశాయి. తెలుగు సాహిత్యంలో ఎన్నో ప్రక్రియలు ఆవిర్భవించిన వివిధ ప్రక్రియలు అప్పటి కాలాలకు సంబంధించిన ఆర్థిక, రాజకీయ, విప్లవ ఉద్యమాలకు అనుగుణంగా సాహిత్య రచనలు జరిగాయి. గిరిజన సాహిత్యం ఎంతోమంది భూమిని, అడవిని కోల్పోయిన గిరిజనుల జీవితాలను వివిధ కథల్లో చూడవచ్చు. గిరిజన ప్రాంతాల చరిత్ర గురించి మనకు ఎంతో కొంత సమాచారం ప్రాచీన సాహిత్యంలో, ఆధునిక సాహిత్యంలో లభ్యమవుతున్నప్పటికీ గిరిజన ప్రాంతాల సాహిత్యం మాత్రం పూర్తిగా 18వ శతాబ్దం తర్వాత మాత్రమే ఆనవాళ్లుగా కనిపిస్తున్నాయి. తెలుగు సాహిత్యం 11 వ శతాబ్దం నుండి ఆయా కాలాలనాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు ప్రతిబింబిస్తాయి.

తెలుగు సాహిత్యంలో రామాయణం, మహాభారత కావ్యాల్లో శివకవియుగానికి చెందిన బసవపురాణం, పండితారాధ్య చరిత్ర, వంటి కావ్యాల్లో గిరిజనుల చిత్రణ కనిపిస్తుంది. దీనివల్ల గిరిజనుల స్వరూపం, జీవన విధానం, సమాజంలో స్థానం తెలుసుకునే అవకాశం ఉంది. నన్నయ్య, తిక్కన్న, ఎర్రన్న, వ్యాస మహాభారతాన్ని సంస్కృతం నుండి తెలుగులోకి అనువదించారు. ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం ద్వితీయ ఆస్వాసం గరుడో పాఖ్యానంలో నిశాదుల ప్రస్తావన ఉంది. నిమిషాలు అనే మాట గిరిజనులకు సమానార్థకంగా ఉపయోగించారు.

గరుత్మంతుడు తల్లి యొక్క అమృతం కోసం బయలుదేరే సందర్భంలో ఆహారంగా ఏమి తినాలని అడిగితే నిషాచలను అడిగి తినమని సెలవిస్తుంది.

మహాభారతం శాంతి పర్వంలో కావ్వోపాఖ్యానంలో కాపవ్యుడు ఒక బోయవాడు. బోయ ప్రాంత ప్రజలంత కాపు ప్రభువుగా ఉండమని కోరుతాడు. తాను వేట ధర్మాలను ఆచరించి జీవిస్తే వారికి రాజుగా ఉంటానని చెప్పడం గోవులను, జింకలను చంపరాదని ఆటవికులు సన్మార్గములుగాను, ప్రజలను మంచి మార్గంలో, తీర్చిదిద్దే పరిపాలకులుగాను చెప్పవచ్చు. రామాయణాన్ని రచించిన కిరాతుడు వాల్మీకి. వాల్మీకి బోయకాంతను వివాహం చేసుకుంటాడు. రామాయణంలో గుహడు అటవీకుడు. బోయలను చెంచులను పాలించిన గిరిజన రాజు. దండక అరణ్యానికి పోతున్న సీత రామలక్ష్మణులను నది దాటించాడు. రామాయణంలో ఆటవిక స్త్రీ శబరి. రాముని అరణ్యవాస సమయంలో రామలక్ష్మణులకు ఆతిథ్యమిచ్చి అమిత ప్రేమను చూపించిన ప్రేమ మూర్తిగా వర్ణించబడింది. పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రలో శ్రీశైల ఉత్సవాల సందర్భంలో చెంచుల ప్రస్తావన ఉంది. ఉత్సవాలకు వచ్చే

భక్తులు వెదురు చాపలు, బుగ్గ పెండ్లి రోకళ్ళు అమ్ముకునే వ్యాపారస్తులు చెంచులనే ప్రస్తావన ఉంది. బసవపురాణంతో శ్రీకాళహస్తీశ్వర మహాకావ్యంలో బోయవాడైన కన్నప్ప కథ ఉంది. కన్నప్ప బోయవాడు.

బమ్మెర పోతన భాగవతంలో నిషాదుల ప్రస్తావన కనిపిస్తుంది. వీళ్లు కొండకోనల్లో జీవించే వాళ్ళని నల్లగా పొట్టిగా రాగి రంగు వెంట్రుకలతో ఎర్రని కళ్ళతో ఉండేవారని వర్ణించారు. శ్రీనాథుని హరవిలాసం శివరాత్రి మహత్యాల్లోనూ సవరల జీవితం, ఆహారపు అలవాట్లు, వేట, విద్యా విధానం వివరించబడి ఉన్నాయి. ప్రబంధ యుగంలో కూడా ఎరుకల రాజు స్వరోచికిచ్చిన ఆహార పదార్థాలు వేటాడే తీరును గురించి వర్ణించబడింది. అన్నమయ్య బోయ కులస్తులకు శ్రీ వెంకటేశ్వరునిపై భక్తి ఆత్మీయత కలగడానికి శ్రీ వెంకటేశ్వరుని బోయవాడుగా అభివర్ణించిన బోయ నాయకుడు ఎవరిని వదలకుండా కాపాడే వారిని చెంచుల వేషధారణ, వారి గుణాలు గురించి కూడా వర్ణించాడు. అన్నమయ్య సంకీర్తనలలో చెంచు స్త్రీలు ధరించే జమలి, పికలి, దండ, పరేటాకు కాకి పైడిబొట్టు, జింకల వెంట పరిగెత్తడం మొదలగు వేషధారణ, వినోదం వ్యక్తం అవుతుంది. అన్నమయ్య సంకీర్తనలలో చెంచులు, బోయలు ఎరుకల, ప్రస్తావన కనిపిస్తుంది.

ఆధునిక తెలుగు సాహిత్యంలో నవల, కథ, కవిత్వం, నాటకం ప్రధాన ప్రక్రియలుగా వెలుగొందుతున్నాయి. బడుగు బలహీన వర్గాలు, దళితులు, మైనారిటీలు, గిరిజనుల సమస్యను ఇతివృత్తాలుగా చేసుకొని రచయితలు రచనలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో తెలుగు సాహిత్యంలో గిరిజనుల జీవిత చిత్రనకు సంబంధించిన సాహిత్యం వివిధ ప్రక్రియలో గిరిజనుల సమస్యలను చిత్రిస్తున్నది, కానీ గిరిజన సాహిత్యంలో ఆశించినవేరా సాహిత్య ప్రేరణ జరగలేదు. ఇంకా చాలా జరగాల్సిన అవశ్యకత ఉంది.

జనజీవనానికి పెద్దపీట వేసిన ఆధునిక సాహిత్య ప్రక్రియ కథ. గిరిజనుల జీవితాన్ని, సం, జీవిత సమస్యలను ఇతివృత్తాలుగా తీసుకొని కథారచన చేయడం జరిగింది. నిజానికి తెలుగు నేలపై 33 గిరిజన తెగలు ఉన్నాయి. గిరిజన కథలో అంటే ఆధునిక సాహిత్య విభాగపు వర్గీకరణ కనే కాదు. ఒక్కొక్క తెగ విశిష్ట లక్షణాలు, విడివిడిగా ప్రత్యేకంగా తమ జీవన విధానాలు, విశ్వాసాలు, నమ్మకాలు ఉన్నాయి. గిరిజనులు ప్రధాన స్రవంతికి దూరంగా చదువులు, విధానాలు ప్రభుత్వ పథకాలకి ఎడంగా ఉన్నారు. అందుకే అన్ని తెగలు దోపిడీకి గురయ్యే విధానం ఒక్కటే. ఒక్కొక్క పద్ధతి విరసి గిరిజనడి శ్రమ సంపద పరాయిపాలు అవ్వడం నిరంతరమైన కొనసాగింపు.

తెలుగు సాహిత్యంలో గిరిజన కథకుడు చింతా దీక్షితులు అని చెప్పడానికి చరిత్రకారుల అభిప్రాయాలు ఉన్నప్పటికీని గూడూరు రాజేంద్ర రావు గారు చెంచి అనే కథ 1932 భారతి పత్రికలో వెలువబడింది. యానాది కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యను కథగా మలిచారు. గిరిజనులకు సంబంధించిన మొదటి కథ దక్షిణ మండలంలో వెలువడినప్పటికీ ఎక్కువ భాగం ఉత్తర, పూర్వ మండల నుండి గిరిజన సమస్యలు చిత్రించిన కథలు వెలువడినాయి. గూడూరు రాజేందర్రావు చెంచి కథను ఇదే తొలి గిరిజన కథగా పి. గోపాలకృష్ణ నిర్ధారించాడు. నిజానికి తెలుగు సాహిత్యం పై సమాజంపై గిరిజనులు చూపిన ప్రభావం గొప్పది. రాంజీగుండు, కొమరం భీం వంటి గిరిజన నాయకులు చేసిన పోరాటాలు చరిత్ర మలుపు తిప్పాయి. ఆ తర్వాత అనేక ఉద్యమాలు శిష్ట సమాజంలో ఎన్నో మార్పులు తెచ్చాయి. అదిలాబాద్, వరంగల్, నల్లమల్ల, ఇప్పుడు చత్తీస్గడ్ ప్రాంతాలు పోరాటానికి సంకేతం అయ్యాయి. గిరిజన ప్రాంతానికి అతి దగ్గరగా ఉన్న గురజాడ, వీరేశలింగం వంటి ఆధునిక సాహిత్య పితామహులు, సంస్కర్తలు ఈ బతుకుల గురించి ఆలోచించిన దాఖలాలు లేవు. అల్లూరి లాంటి గొప్ప నాయకుడిని కాల్చి చంపితే సమకాలీన సాహిత్యంలో స్పందన కనిపించలేదు.

తెలుగు సాహిత్యం ఏ మూలన చూసిన గిరిజన సాహిత్యం తక్కువ అనే భావన ఉంది. నాగరిక సమాజానికి దూరంగా సాంకేతిక ప్రగతికి నోచుకుని ప్రాచీన సంస్కృతి కి వారసులైన అడవితల్లి బిడ్డలుగా బ్రతికిన గిరిజనుల్లో ఆధునిక నాగరికత చిచ్చు పెట్టింది. విప్లవద్యమాల విస్తరణలో ప్రభుత్వ యంత్రంగానికి, నక్సలైట్లకు మధ్య జరిగిన కుమ్ములాటలో గిరిజనులు బలయ్యారు. ఈ పరిణామాల్ని తెలంగాణ కథాసాహిత్యంలో అల్లం రాజయ్య, సాహు, బోయ జంగయ్య, ఫణికుమార్, దిలావర్, సమ్మెట ఉమాదేవి, పద్దం అనసూయ, కాలువ మల్లయ్య ఆధునిక గిరిజన సాహిత్యం ప్రేరణలో భాగంగా సూర్య ధనంజయ, గారు రమేష్ కార్తీక్ లాంటి కథకులు తమ కథల్లో నిక్షిప్తం చేశారు. ప్రపంచీకరణ పరిణామాలు గిరిజనులకు మరింత ఇబ్బందుల్లో నెట్టివేశాయి. గిరిజన గూడాల్లోకి, తండాలోకి నాగరికత ఎక్కువ అయ్యాక వ్యాపార సంస్కృతి తండాలో ప్రవేశించాయి. గిరిజన బతుకుల్లో అశాశ్వత దొర్లింది. నాగరికులు అడవి బిడ్డల కష్టాన్ని, కష్టార్జితాన్ని, ఆస్తుల్ని, అడవి సంపదను దోచుకోవడంతో గిరిజనుల బతుకులు అస్తవ్యస్తమయ్యాయి. ఈ పరిణామాల్ని తెలంగాణ కథకులు సమకాలీన కథ సాహిత్యంలో ప్రతిపాలింప చేస్తున్నారు. తెలంగాణ గిరిజన కథ చాలా విశాలమైనది. తెలంగాణ సంస్కృతి, భాష, సమాజం ఇక్కడి కథల నిండా ప్రతిపలుస్తాయి. గిరిజన కథలో ఆర్తి, ఆవేదన, ఆశాజనిత భావోద్వేగం వంటి ప్రతిస్పందనలు చోటుచేసుకుంటాయి. గిరిజన కథ కడుపు వెతల కోసం పుట్టిందే కానీ కాలక్షేపం పుట్టింది కాదు.

తెలంగాణ ప్రజల అస్తిత్వం ప్రాంతీయత ఒక పార్శ్వం అయితే రెండో పార్శ్వం భూమి సమస్య. భారత ప్రభుత్వం 1951 లోనే భూసంస్కరణలు చట్టం తేవడంతోనే తెలంగాణ ప్రాంత గిరిజనుల సమస్యలకు పరిష్కారం లభించలేదు. ఇక్కడి భూమి దొరల, భూస్వాముల చేతుల్లో కేంద్రీకృతం ఉన్న కారణంగా రైతులు భూమికోసం పోరాటాలు చేయవలసి వచ్చింది. అప్పటికే భారతదేశంలో నక్సల్ బరి పోరాటాలు 1968 జరుగుతున్నాయి. 1972 నాటికి తెలంగాణలో ఖమ్మం, వరంగల్, కరీంనగర్, అదిలాబాద్ జిల్లాలో గిరిజన రైతుల పోరాటాలు స్ఫూర్తిని పొందాయి. కమ్యూనిస్టు పార్టీ సంఘాలను స్థాపించి రైతులకు అండగా నిలిచింది. తెలంగాణ ప్రాంతంలోని కొద్దిమంది చేతుల్లో ఉన్న భూమి దున్నేవాడిదే భూమి అన్న నినాదం ఉద్యమా పోరాట స్వరూపాన్ని సంతరించుకుంది. దాని తర్వాత 1970– 1980 మధ్యకాలాన్ని విప్లవ ఉద్యమ యుగంగా పేర్కొనవచ్చు.

1973లో కరీంనగర్ జిల్లా నుండి ఉద్యమ సాహితీ సంస్థ వేలువరించిన బాద్ లా కథా సంకలనం ప్రత్యేకంగా రైతుల పోరాట కథలను వివరించింది. ఇందులో రచయితలు అల్లం రాజయ్య రాసిన కథలన్నీ భూమి పోరాటాల చుట్టూ తిరుగుతాయి. ఎదురు తిరిగితే, గోడ, దున్నేవాడిదే భూమి, అడవి మనిషి, సృష్టికర్తలు, మొదలవు కథలు 1970 – 80 మధ్యకాలంలో గిరిజన జీవితాన్ని చూపించినవి. ఎదురు తిరిగితే కథలో 1975లో సామాన్యుల తిరుగుబాటు చిత్రించబడింది.

అల్లం రాజయ్య భూమి కథలో లో మొక్కవోని రైతుల పోరాట ధైర్యాన్ని చిత్రించింది. రైతాంగ పోరాట నిర్మాణంలో ప్రత్యక్షంగా పాల్గొని గిరిజన భాషను నేర్చుకొని వారి జీవితాలను దగ్గరగా చూపించిన శనిగరపు వెంకటేశ్వర్లు సాహూ పేరుతో మంచి కథల రాశారు. పోరాటాల్లో పాల్గొన్న యువకుల కుటుంబ సభ్యులను చేర్చి వారిని ఉద్యమానికి దూరం చేయడంలో భాగంగా పోలీసులు చేసే హత్యా చారాలను నిరసిస్తూ సాహు రాసిన పోలీసుల దాడి వాస్తవ సంఘటనను ఆధారం చేసుకుని రాసిన కథే. గిరిజన జీవితాలను చిత్రిస్తూ వారిపై జరుగుతున్న మోసాలను రక్తపింజర కథలో ప్రపంచీకరణ ప్రభావం వలన 1990 దశకం తర్వాత గిరిజన జీవితాల్లో విపరీతమైన మార్పులు వస్తూ, వారి జీవితాల మీద నాగరికత సాంప్రదాయాన్ని రుద్ది వారి జీవితాలు ప్రపంచీకరణ ప్రవహంలో కొట్టుకు పోయాయి. ఇదే క్రమంలో అడవి సంపదను కొల్లగొట్టి పారిశ్రామికరణ ఉత్పత్తిలో భాగంగా అనేక ప్రాజెక్టులు, పరిశ్రమలు వచ్చి అడివిని పర్యావరణాన్ని విధ్వంసం చేశాయి. అడవి బిడ్డలుగా పొద్దంతా కష్టం చేసి అలసిపోయిన గిరిజన ప్రజలు అడవిలో దొరికే ఇప్ప పూలు ఏరుకొని సారా తయారు చేస్తే ఇష్టంగా తాగేవారు. మిగిలిన సారాను అవసరాల నిమిత్తం అమ్ముకుంటూ ఉండేవారు. ఇదే క్రమాన్ని బోయ జంగయ్య 2003లో ఇప్పపూలు కథలో చిత్రించారు.

ఖమ్మం జిల్లా గిరిజన జీవితాన్ని సిరంశెట్టి కాంతారావు సమిధులు 2011 కథలో చిత్రించారు. అడవి బిడ్డలైన గిరిజనులు ఆకలిని తట్టుకోలేక ఈ యసగడ్డలు తింటారు. చత్తీస్గడ్ నుంచి ఖమ్మం జిల్లాకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వస్తే అన్నలు, పోలీసులు, సల్వజుడుం మధ్య నెలకొన్న శత్రుత్వం వలన వారి జీవితాలు తెగిన గాలిపటం కావడం కనిపిస్తుంది.సమ్మెట ఉమాదేవి గారు రాసిన రేలాపూలు కథ సంపుటి 2017 లో ఒక ప్రత్యేకత ఉంది. ఇందులో కథలన్నీటిలో గిరిజన నేపథ్యంలో కథంశాలను ఎన్నుకొని అచ్చమైన గిరిజన భాషను విన్నట్టుగా మంచి మాండలికంలో సంభాషణలను పలికిస్తూ నడిపించిన తీరు చాలా విలక్షణమైనది. గిరిజన తండాల్లో అనేక సామాజిక స్పృహలు సృష్టించారు. ముఖ్యంగా గిరిజన తండాలో పిల్లల చదువు గురించి, దివిలి కథలో ప్రకృతి అందాలు ఆర్థిక అవసరాలు జీవన సంయేదనలను చిత్రించారు. మత మార్పిడిలో జరిగే సంఘర్షణలను చాలా గొప్పగా చెప్పారు.

రేలపూలు కథ సంపుటిలో 17 కథలలో పూర్తిగా తండా జీవన విధానం ప్రకృతికి వారికి సంబంధం, సమాజానికి ఆటవిక జీవనానికి మధ్య ఉన్న దూరాన్ని గిరిజన అస్థిత పోరాటాన్ని సమాజ మూలాల్లోకి వెళ్లి బతుకువేతల్ని అభ్యుదయ దృక్పథంతో రాశారు.

1986 – 1987 మధ్యకాలంలో తెలంగాణ రాష్ట్రంలో గోదావరి అధిక ప్రవాహంలో అనేక గిరిజన గూడాలు, తండాలు నేలమట్టం అయి అడవి సంపదను, వారి జీవనాన్ని తుడిచిపోయిన అంశాన్ని ఫణి కుమార్ గోదావరి గాధలు అనే కథ సంపుటిలో 12 కథల ద్వారా ఉత్తర తెలంగాణ గిరిజన ఆవాసాలు అయిన గోదావరి పరివాహక

ప్రాంత ఉనికిని విశిష్టతను విలక్షణమైన జీవనాన్ని ఫణి కుమార్ గారు చాలా గొప్పగా వర్ణించారు. ఈ కథలో వేదంలా ప్రవహించే గోదావరి కాదు ఊళ్ళు నాళ్ళు ఏకం చేసి పంట పొలాలను ఇసుకమేటలుగా మార్చి ఎన్నెన్నో ప్రాణాలు పొట్టన పెట్టుకున్న కథలను ఫణి కుమార్ గారు గోదారి గాదల్లో చిత్రించారు.

తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక 2014లో దిలావర్ రాసిన కొండ కోనల్లో కథాసంపుటి లో 12 కథలు గిరిజన జీవితాలు కొండ కోనల్లో పడే అవస్థలు వారి జీవనాస్మరణ సమస్యలను తెలియపరుస్తాయి. తునికి ఆకు తెంపి వారి జీవితాన్ని కొనసాగించే కోయ జాతి వ్యతల గురించి, కారడివి లో వేలుతురు లేకుండా జీవిస్తున్న గిరిజన ఆదివాసి గ్రామాల తండాల చీకటి బతుకుల గురించి తెలియజేశారు. కొండల మధ్య నిండు పున్నమి వెన్నెలలో మత్తెక్కించే అడవి పూల పరిమాణాల్లో గిరిజనుల ఆటపాటలు ఎంత సహజ సుందరంగా ఉంటాయి. ఎక్కడ కృత్తిమతత్వం లేని పరాయితనపు వాసన లేని నిర్మలమైన గిరిజన కళారూపాలు ఎంతో స్వచ్ఛంగా ఉంటాయని కథలో తెలిపారు.

ఆదివాసీ లోకం మొదటి ప్రపంచం. ఆ ప్రపంచానికి పరాయి వాసులైన చివరితనం తెగ మహిళల బతుకు చిత్రాలు ఈ కథలు పద్దం అనసూయ గారు 2019లో చప్పుడు కథ సంపుటి అనే నాలుగు కథల ద్వారా స్త్రీల జీవిత గాధలను దగ్గరగా చూపించారు. సుఖం, శాంతి లేకుండా అభివృద్ధి పేరుతో, ఆధునికత పేరుతో గతం ఎదురు దెబ్బలు వేసిన తీరును, స్త్రీలలో చనిపోయిన తర్వాత 14వ రోజు పుర్భం గురించి చెప్పించడం కోయ సమాజం లో ఇంకా ప్రేమలు ఆత్మీయతలు జాలువారుతు ఉన్నాయని ముసలి కథలో వర్ణించారు.

బంజారా జీవితాలు అద్దం పట్టే విధంగా వారి జీవనాన్ని జీవన విధానాన్ని అచ్చ తెలుగులో కథలు రాసిన ఈ యువకవి రమేశ్ కార్తిక్ నాయక్ ఇతను డావ్లో 2021 బంజారా కథల సంపుటి రాశారు. బంజారా జీవితాల్లో నిత్యం జరిగే సమస్యలను సంఘర్షణలను వారు బంధువుల ఇంటికి వెళ్లినప్పుడు ఏడుస్తూ ఒక గేయ క్రమంలో తెలిపే క్రమాన్ని డావ్లో అంటారు. బంజారా మహిళలు అనిపిస్తారు. ఇది వివాహ తంతు క్రమంలో, బంధువులు చాలా రోజుల తర్వాత ఇంటికి వచ్చిన క్రమంలో, ఏదైనా అనుకొని సమస్య ఎదురు వచ్చినప్పుడు వారు చెప్పే క్రమాన్ని డావ్లో ద్వారా తెలియపరుస్తారు. కానీ ధావ్లో కథలో అచ్చమైన బంజారా జీవితాలు అద్దం పడతాయి. ఆధునికీకరణ క్రమంలో వలస జీవితాలు ఎదుర్కొంటున్న సమస్యలు వారి ఆహారపు అలవాట్లల్లో వచ్చిన మార్పుల గురించి అసాధారణమైన అనుభవాలు అనంతమైన విషాదాలు మనసును కలసి వేసే కథలన్నో ఉన్నాయి. బంజారాల యదార్థ జీవితాలనులో మనం చూడవచ్చు. అన్ని కథలలో బంజారా జీవితాలు అద్దం పడతాయి.

తెలుగు సాహిత్య పరిణామ క్రమం ఒక ప్రత్యేకమైన సిద్ధాంతాన్నికలిగి సాహిత్య సృష్టిని సాధించింది. కానీ గిరిజన జీవితాల్లో జరిగిన పరిణామక్రమాలు, పోరాట స్వరాలు ఎన్నో మూగబోయి వాటి గురించి కథానిక జరగలేదు. ప్రతి సామాజిక అంశం వారి వారి అస్తిత్వాన్ని, ఉనికిని చరిత్రగా రాసుకుని స్థిరమైన స్థానాన్ని ఏర్పరచు కున్నప్పటికీ గిరిజన జీవితాల సాహిత్యమంత గిరిజనేతరులు రాసిన చరిత్రలే. గిరిజన సాహిత్య ప్రేరణ ఇంకా జరగాలని చరిత్రలో మూగబోయిన అస్థితాన్ని శిథిలా వ్యవస్థ కాకుండా గిరిజన సాహిత్యంపై ఇంకా కావాల్సినంత పరిశోధన జరగాలని కాంక్ష.

ఉపయుక్త గ్రంథ సూచి:

1. ఆంధ్రుల జానపద విజ్ఞానం – ఆర్వీఎస్ సుందరం 1983.
2. తెలుగు కావ్యలో గిరిజన సంస్కృతి – బి రామాచార్యులు.
3. కథంశం రాచపాలెం – చంద్రశేఖర్ రెడ్డి.
4. తెలంగాణ కథకులు కథనరీతులు – బిఎస్ రాములు 2011.
5. కాలువ మల్లయ్య కథలు – తెలంగాణ జనజీవనం బన్న ఐలయ్య 2010.
6. భారత దేశంలో బంజారాలు – డాక్టర్ ఎం.గోన నాయక్ 2005.
7. తొమ్మిది పదుల తెలంగాణ కథ – కాలువ మల్లయ్య 2004.
8. తెలంగాణ కథ – కర్ర ఎల్లారెడ్డి 2003.
9. తెలంగాణ కథా పరామర్శ – ప్రొఫెసర్ బన్న ఐలయ్య 2017.
10. గిరిజన సంచార తెగలు – జయదిర్ తిరుమలరావు, జీవన్ 2009.
11. అడవిలో వెన్నెల– దిలావర్ 2014.
12. గోదావరి గాథలు – ఫణి కుమార్.
13. భద్రాచలం మన్యం కథలు – ఏ. విద్యాసాగర్.
14. రేలపూలు – సమ్మెట ఉమాదేవి.
15. డావ్లో – రమేష్ కార్తీక్ నాయక్.
16. గిరిజన కథలు – చింత దీక్షితులు.

తెలుగులో శతక సాహిత్యము

డా॥ పాండుల సాయిలు, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు, కాకతీయ ప్రభుత్వ కళాశాల, హన్మకొండ-506001.
సెల్:9652027481

తెలుగు సాహిత్యంలో ఎన్నో ప్రక్రియలు వచ్చినప్పటికి పద్య ప్రక్రియకు ఉన్న ప్రాధాన్యతనే వేరు. వేమన, సుమతీ, బద్దెన, కుమారా, కుమారీ, నరసింహ, దాశరథీ మొదలైన శతక పద్యాలు నేటికీ ప్రజల నాలుకలపై నాట్యమాడుతున్నాయంటే కారణం, ఆ పద్యాలకున్న ధారాశుద్ధి, ధారణాశక్తి, ఆ శతక కర్తల రచనా పటిమ, శైలి, గొప్పతనాన్ని అర్థం చేసుకోవచ్చు. ఆధునిక కాలంలో కూడా శతకాలు రాసే కవుల సంఖ్య మరీ తక్కువ అని చెప్పలేం. చాలా మంది కవులు నేడు అనేక శతకాలు వ్రాస్తూనే ఉన్నారు.

సత్యాన్ని ప్రవచించడానికి మన దేశంలో అనాదిగా మునులు, మహర్షులు, ఆచార్యులు, గురువులు అవతరించారు. సత్యం, ధర్మం, అహింస, మానవ సహజీవనానికి శాంతి, సామరస్య, సౌభ్రాతృత్వానికి జీవగఱ్ఱలు. ఈ విషయాన్ని కవులు కూడా అనాదిగా అనేక రూపాలలో ప్రకటించి ప్రజలను సన్మార్గంవైపు మరలించే ప్రయత్నం చేసారు. అందువల్లనే మన తెలుగు కవుల వల్ల సాహిత్యంలో కావ్య వాఙ్మయం గొప్పగా అవతరించింది. కావ్యాలలో అయితే నీతి అంతఃసూత్రంగా ఉండి కథాగమనంలో మానవ జీవనాన్ని ప్రబోధిస్తుంది. శతకమనే సాహిత్య ప్రక్రియ అట్లుగాక ప్రత్యేకంగా జ్ఞాన, వైరాగ్య, భక్తి, నీతి, సంపన్నంగా ఆవిర్భవించి, జిజ్ఞాసువులకు మార్గదర్శకంగా నిలిచింది.

వేమ, బద్దెన, శేషప్ప వంటి వారు సమాజంలోని అనంబద్ధమైన ఆచారాలను, అలవాట్లను నిరసించి కాలానుగుణమైన సదాలోచనలను ప్రబోధించారు. ప్రతియుగంలోను కవులు సమాజ సర్వతోముఖాభివృద్ధికి తమవంతు కర్తవ్యంగా కళాత్మకంగా, కవిత్వ, శతక రచనతో ప్రబోధం చేస్తూనే ఉన్నారు. ఈ 20, 21వ శతాబ్దాలలో కూడా ఎందరో కవులు సమాజ సంస్కరణకు పూనుకొని రచనలు చేసినారు.

శతాబ్దాల తరబడి అవిచ్ఛిన్నంగా సాగివస్తున్న ప్రక్రియ శతకం. పాఠకుడిని కవిగా మలిచిన ఘనత శతకానిది. కవి అంతరంగాన్ని అవలీలగా ఆవిష్కరించే శతక ప్రక్రియకు పూర్వ కాలం నుండి నేటి వరకు పాఠకుల ఆదరణ మెండుగానే ఉంది. నాకు తెలిసి పాట, గేయం తర్వాత శతకానికున్న పాఠకులు మరొక ప్రక్రియకు లేరేమో అనిపిస్తుంది. ఆబాల గోపాలాన్ని అలరించే ప్రక్రియ శతక ప్రక్రియ.

సంఘములోని చెడును తొలగించుటకు సాహిత్యం ఒక చక్కటి ఆయుధం. అందులో శతక ప్రక్రియ మంచి సాధనం. గర్వంతో కనులు మూసుకుపోయిన వారి నిరంకుశ ధోరణులను, సంపన్నుల దురహంకారములను, స్వార్థపరుల దుర్మార్గములను, దురాచారములను ఖండించుటకు ఒక చక్కటి ఆయుధం శతకం. శతకాలు ఎన్నో వచ్చాయి. దేని ప్రత్యేకత దానిదే. తెలుగులో శతక ప్రక్రియ చేసిన సేవ ఏ ప్రక్రియ చేయలేదు. పూర్వం పిల్లలు శతక పద్యాలు వందలకొలది ధారణ చేసేవారు. ఇప్పుడు పిల్లలు శతకాలకు దూరమవుతున్నారు. ఎక్కాలకు దూరమవుతున్నారు. పుస్తకాలకూ దూరమే అవుతున్నారు. శతకాలు రాకుంటే నీతిని తెలిపేది ఎట్లా? ఎక్కాలు రాకుంటే చప్పున లెక్కలు వచ్చేది ఎట్లా? పుస్తకాలు చదవకుంటే జ్ఞానం వెలిగేది ఎట్లా? అంటూ అనుక్షణం వేధించే ప్రశ్నలు ఇవి. లోకంలో జరిగే యాసిడ్ దాడులకు, బస్సుల్లో, రోడ్ల మీద జరిగే ఆకృత్యాలకు నిర్భయంగా సమాధానం చెప్పాలంటే నీతిని అంతో ఇంతో నిలపాలి. ఆ పని శతకమే చేస్తుంది.

అనాదిగా సోమన, వేమన, అన్నమయ్య, ఎవరు ఏం చెప్పినా శతకంలోనే చెప్పారు, లోకానికి హితం చెప్పారు.

శతక సాహిత్యము :

తెలుగు సాహిత్యంలో శతకానికి ప్రత్యేక స్థానమున్నది. క్రీ.శ.12వ శతాబ్ధం నుండి నేటి వరకు శతక వాఙ్మయము దిన దిన ప్రవర్ధమానమై పరిపుష్టిని పొందింది. శాఖోప శాఖలుగా విస్తరించి మానవ వికాసానికి ఎంతగానో తోడ్పడింది. ఆధునిక యుగంలో శతక ప్రక్రియ జీవనదిలా కొనసాగుతుంది. మహాకావ్యాలతో సమానంగా, శతకాలు వర్ధిల్లుతున్నాయి. మహాకావ్యాలు వ్రాసిన కవులతో సమానంగా శతక కవులు విశిష్ట స్థానాన్ని అలంకరిస్తున్నారు. ప్రజల జీవితాల్లో, నిత్య వ్యవహారాలలో ఏదో ఒక శతక పద్యం వినిపిస్తూనే ఉంటుంది. శతకమంటే నూరు పద్యాలే అయినా సంస్కృత నియమాన్ననుసరించి 108 వరకు చేర్చినారు. కొన్ని శతకాలలో ఇంతకంటే ఎక్కువ సంఖ్యగలవి కూడా ఉన్నవి. నేటికి అవే అర్థాన్ని కలిగి ఉండడం వలన వీటిని ముక్తకాలు అని కూడా అంటారు.

శతక లక్షణాలు :

1. సంఖ్యానియమము, 2. మకుటం, 3. ఛందో నియమములు, 4. రసనియమములు, 5. ఆత్మాశ్రయ కవితా ధర్మము, 6. ముక్తిక లక్షణం.

1. సంఖ్యా నియమము:

శతకము అనగా వంద అని అర్థము. ఏ శతకములో నైనా వందకు పైగానే పద్యములుండవలెను. సంస్కృత భాషలో త్రిశతులు, పంచశతులు శతకాలుగా వచ్చాయి. వేమన ఈ సంఖ్యా నియమం పాటించలేదు. కొన్ని వేల పద్యాలు వ్రాసారు. కాని తెలుగులో శతక కర్తలందరు నూరు, నూట ఎనమిది, నూట పదహారులుగా వ్రాసారు. ఎందుకనగా, మన తెలుగు రాసులు పన్నెండు, గ్రహాలు తొమ్మిది వీటిని వెచ్చ వేయగా నూటఎనమిది సంఖ్య వస్తుంది. కనుక చాలా మంది తెలుగు కవులు ఈ నమ్మకాన్ని పాటిస్తూ నూట ఎనమిది పద్యాలు ఉండేటట్లుగా తమ శతకాలలో చూసుకున్నారు, వ్రాసినారు.

2. మకుట నియమము:

శతకకర్తలు తమ పద్యాలలో చివరన సంబోధన రూపంలో, తమ పేర్లతోగాని, ప్రసిద్ధమైన పేర్లతోగాని వచ్చేటట్లు వ్రాసారు. అట్లు అన్ని పద్యాల చివర ఒకే పదంగాని, సమాసపదం గాని వచ్చేటట్లు వ్రాస్తే దాన్ని శతక లక్షణం అంటారు. ఈ విధానాన్ని సంస్కృత కవులు, తెలుగు కవులు పాటించారు. ఉదాహరణకు సుమతీ, భాస్కరా, కుమారీ, కుమారా మొదలగు శతకాలు గలవు. కానీ కొందరు కవులు చివరి పాదాన్ని మొత్తం మకుటంగా పాటించి వ్రాసారు. ఉదాహరణ వేమన శతకం, వేమనగారు తాను చెప్పదలుచుకున్న విషయాన్ని మూడు పాదాలలో చెప్పి నాల్గవ పాదాన్ని మకుటంగా "విశ్వదాభిరామ వినరవేమ" అంటూ మూడు వేల పైచిలుకు పద్యాలు వ్రాసారు. మకుటం అనగా కిరీటం అని అర్థం అంటే పద్యానికి మకుటం కిరీటం లాంటిది.

3. చంధోనియమము:

తెలుగు కవులు తమకు యిష్టమైన, నచ్చిన చంధస్సు పద్యాలలో రచనలు చేసారు. కొందరు అనగా భాస్కర శతక కర్త వృత్త పద్యాలలో వ్రాసి పాఠకాదరణ పొందారు. వేమన ఆటవెలది చంధో నియమాన్ని పాటించి దాదాపు మూడు వేల పదాలు వ్రాసినారు. సుమతీ శతకర్త బద్దెన కందపద్యాలలో వ్రాసి ఖ్యాతిని పొందారు. ఆంధ్రనాయక శతక కర్త కాసుల పురుషోత్తమకవి, నారసింహ శతకకర్త ధర్మపురి శేషప్ప కవి సీస పద్యాలలో వ్రాసి పేరు ప్రఖ్యాతులు పొందారు. నేటి ఆధునిక యుగంలో కూడా ఎందరో యువకవులు తమకు నచ్చిన చంధోనియమాన్ని పాటిస్తూ శతకాలు వ్రాస్తున్నారు. ఫలానా చంధస్సులో ఫలానా పద్యాలలో శతకం వ్రాయలనే నియమం ఏమి లేదు. కవులు తమకు నచ్చిన చంధస్సు పద్యాలలో శతకాలు వ్రాయటం శతక లక్షణాలలో ఒకటని చెప్పవచ్చును.

4. రసనియమములు :

తెలుగు సాహిత్యంలో నవరసాల మేలవింపుతో ఎన్నో గ్రంథాలు వెలువడ్డాయి. అయితే నవరసాలు అన్నీ పోసించి రాయాలనే నియమం శతకాలలో లేదు. కాని శతక కవులు తమకు నచ్చిన, నవరసాలలో ఏదో ఒకటి గాని అంతకు మించిగాని రసాలను పోషించి శతక రచనలు చేసారు. ఉదాహరణకు వేమన హాస్య రసాన్ని పోషించి వ్రాసిన పద్యం మచ్చుకు ఒకటి ఈ క్రింద చూద్దాం.

"పాల సాగరమున పవ్వలించిన స్వామి
గొల్ల యిండ్ల పాలు గోరనేల
ఎదుటు వాని సొమ్ము ఎల్ల వారికి తీపి
విశ్వదాభిరామ వినురవేమ"

పై పద్యములో శ్రీకృష్ణ పరమాత్మ గూర్చి హాస్యంగా చెప్పాడు. తనకు పాల సముద్రం ఉన్నా, పెరుగు ఉన్నా వెన్న ఉన్నా గాని గొల్లవారి యిండ్లలో వెన్న ముద్దలు దొంగిలించాడని, ఎంత ఉన్నాగాని ఎదుటి వారి సొమ్ము కొంతైనా దోచుకోవాలనే మనసు ప్రతివానికి ఉంటుందని హాస్యంగా చెప్పాడు వేమన. ఇట్లు శతక కవులు ఏదో ఒక రససాన్ని పోషించి శతక పద్యాలు వ్రాయడం కూడ శతక లక్షణాలలో ఒకటిగా చెప్పవచ్చు.

5. ఆత్మాశ్రయ కవితా ధర్మం :

శతక రచనలన్నీ భావ ప్రధానమైన రచనలే. శతక రచనలు పుంఖాను పుంఖాలుగా వెలువడ్డాయి. వెలువడుతూనే ఉన్నాయి. కనుక శతకాలను మన పూర్వీకులు భావ గీతికలుగా పేర్కొనడం జరిగింది. సాధారణంగా తెలుగు కవులు భక్తి, నీతి, వైరాగ్య వేదాంత వ్యాజస్తుతి మొదలగు విధాల శతకాలు వ్రాయడం జరిగింది. అయితే ఈ శతకాలలో కవులు తమ ఆత్మాను భూతిని వ్యక్తీకరిస్తూ వ్రాసినవి కోకొల్లలు గలవు. శతక కవి తన అనుభూతులను, భక్తి రూపంలోగాని, నీతి రూపంలోగాని, వేదాంత రూపంలో గాని వెలుబుచ్చుతూ రాస్తుంటారు. అలాంటి కోవలో శ్రీకాళహస్తీశ్వర శతకము ఒక వజ్రాలగని వంటిది. ధూర్జతి తన ఆత్మాశ్రయ కవితా ధర్మాన్ని పాటిస్తూ వృత్త పద్యాలలో ఈ శతకాన్ని వ్రాసినారు. ఇట్లు శతక కవులు ఆత్మాశ్రయకవితా ధర్మాన్ని పాటిస్తూ వ్రాయడం కూడా శతక లక్షణాలలో ఒకటిగా మనం చెప్పుకోవచ్చును.

6. ముక్తక లక్షణము:

తెలుగు శతకాలను ముక్తకాలని కూడ అనవచ్చును. ముక్తకమనగా పద్యానికి పద్యానికి సంబంధం లేకుండా ఏ పద్యానికి, ఆ పద్యమే స్వతంత్ర భావాన్ని కల్గియుండటాన్ని ముక్తమంటారు. కనుక తెలుగు శతకాలలో ఏ పద్యానికి ఆపద్యమే స్వతంత్ర భావాల్ని కలిగియుండేటట్లుగా కవులు రచించారు. అనగా ఒక పద్యానికి మరొక పదానికి మధ్య సమన్వయం ఉండదు. కాని కావ్యాలలో ఐతే ఒక పద్యానికి మరొక పద్యానికి మధ్య సమన్వయం ఉంటుంది. కాని శతకాలలో అట్లు ఉండదు. కనుకనే శతకాలను ముక్తకాలు అని చెప్పవచ్చు. కావ్యాలలోనైతే ఏక సూత్రతకు అవకాశం ఉండి, వస్తైక్యము ఉంటుంది శతకాలలో అట్లు ఉండదు.

శతకములు - వర్గీకరణ:

తెలుగు సాహిత్యం శాఖోపశాఖలు విస్తరించి విరాజిల్లుతుంది. అందులో ఒకశాఖ శతక సాహిత్యం శతకాలలో ఉన్న వస్తువును బట్టి భక్తి, నీతి, శృంగార, వైరాగ్య, హాస్య, ప్రబోధ వ్యాజస్తుతి, వేదాంత, ఆదిక్షేప, మొదలగు విధాలుగా శతకాలను వర్గీకరింపవచ్చును.

భక్తి శతకాలు:

చతుర్విధ పురుషార్థాలలో మోక్షం విశిష్టమైనది. మోక్షానికి వారధి భక్తి. భక్తి ద్వారానే భగవంతుని చేరుకోవచ్చని నమ్మి భక్తి శతకాలు వ్రాసినవారు ఉన్నారు. దేవున్ని కీర్తించడం, గుణగనాలను వర్ణించడం, రూపురేఖ కమనీయ వైఖరులను గూర్చి వ్రాయడం, మొదలయినవి భక్తి శతకాలలో ప్రధానంగా కనిపిస్తుంటాయి. ముఖ్యంగా పూర్వం శైవ, వైష్ణవాలు, నేడు క్రీస్తు, సాయి, వేంకటేశ్వర

శతకాలు ప్రధానంగా వెలువడ్డాయి. అందులో మచ్చుకొన్ని శతకాలు, వృషాధిప, సర్వేశ్వర, నారాయణ, ధాశరథి, శ్రీకాళ హస్తీశ్వర, నారసింహ మొదలగు శతకాలు భక్తి శతకాలు. ఈ వ్యాసకర్తనైన నేను కూడా **వాయుపుత్ర శతకము** అనే భక్తి శతకాన్ని వ్రాసాను. అది భక్తి ప్రధాన శతకం.

నీతి శతకాలు:

నీతి అనగా నడిపించునది అని అర్థం. మంచి పథంలో నడిచి నలుగురికి ఆదర్శవంతంగా ఉండాలని చెప్పే శతకాలు నీతి శతకాలు. ఈ శతకాలలో మానవ నడక నీతి, లోకవ్యవహార నీతి, సమాజ హితనీతి, గృహనీతి, రాజనీతి, మొదలగు నీతులను తెలిపేవి నీతి శతకాలు. ఈ శతకాలు తెలుగులో చాలానే వెలువడ్డాయి. వానిలో వేమన, సుమతీ, భాస్కరా, కుమారా, కుమారీ, ఏగులక్షణకవి సుభాషిత త్రిశతి, మొగలగు శతకాలు పేర్కొనదగినవి. ఆధునిక కాలంలో యువ కవులు ఎందరో నీతి శతకాలు వ్రాసారు. ఉదాహరణకు, సత్యవాణి శతకం, వాసరాంబ శతకం మొదలగు శతకాలు చెప్పవచ్చును. ఈ వ్యాస కర్తనైన నేను కూడ సత్యవాణి శతకమును వ్రాసినాను. అది నీతి ప్రధాన శతకం.

హాస్య శతకాలు:

నవరసాలలో ఏదో ఒక రసాన్ని తీసుకొని దాన్ని పోషిస్తూ వ్రాసిన శతకాలు చాలా ఉన్నాయి. అయితే హాస్య ప్రధాన శతకాలు చాలానే వచ్చాయి. వేమన హాస్యాన్ని పోషించిన కొన్ని పద్యాలు మాత్రమే హాస్య ప్రధానమైనవిగా ఉన్నాయి. ఆధునిక యుగంలో పకోడీ శతకం, పిల్లీ శతకం, పొగచుట్ట, చీపురుపుల్ల మొదలగు శతకాలు ముఖ్యమైనవిగా చెప్పవచ్చును.

ఆధిక్షేప శతకాలు:

అవహేళన చేస్తూ, ఎత్తిపొడుస్తూ, మందలింపు చేస్తూ రచించిన శతకాలను ఆధిక్షేప శతకాలు అంటారు. తెలుగులో ఇలాంటి వ్యంగ్య ప్రధానమైన శతకాలు చాలా ఉన్నాయి. కొందరు శతక కర్తలు దూషిస్తూ వ్రాసిన శతకాలు కూడా ఉన్నాయి. చౌడప్ప శతకం, కుక్కుటేశ్వర, సిరిసిరిమువ్వ, శరభాంక, శంభో మొదలగు శతకాలు ఆధిక్షేప శతకాల క్రిందికి వస్తాయి. ఈ శతకాలలో హేళన, ఎత్తిపొడుపు, మందలింపు ముఖ్యంగా మనకు కనపడుతుంది.

శృంగార శతకాలు:

శృంగార రసప్రధానమైన శతకాలు తెలుగులో కొన్ని వచ్చినాయి. రాధాకృష్ణుల శృంగార శతకం, దార్ల సుందరీమణి శతకం, కీరవాణి శతకం, మదన గోపాల శతకం మొదలగు శతకాలు తెలుగులో పేర్కొనవచ్చును.

ఈవిధంగా తెలుగు సాహిత్య చరిత్రలో శతక సాహిత్యం మూడు పువ్వులు ఆరుకాయలుగా విరాజిల్లుతూనే వస్తున్నది. తెలుగు పాఠకుల ఆదరణకు ప్రీతిపాత్రమయిన శతక ప్రక్రియ ఒక అపురూపమైన ప్రక్రియ అనవచ్చును. ఈ ప్రక్రియ 12వ శతాబ్దం నుండి నేటి వరకు అంటే దాదాపుగా 8వందల ఏండ్ల క్రింద ప్రారంభించబడిన ఈ శతక ప్రక్రియ కొన్ని వందల శతకాలను మనకు అందించి వివిధ వస్తువులతో కూడి, వైవిధ్యంగా, విలక్షణంగా, తెలుగు సాహిత్యం అభివృద్ధి చెందుతూ తెలుగు పాఠక మహాశయులకు కల్పవృక్షమై కామధేనువై అమృతాన్ని పంచి పెడుతుందని చెప్పవచ్చును.

ఆధార గ్రంథాలు:

1) తెలుగు అకాడమి సాహిత్య చరిత్ర
2) ఆధునికాంధ్ర సాహిత్యం, సాంప్రదాయము, ప్రయోగములు - డా॥సి.నా.రె.
3) ఆంధ్రశతక సాహిత్య వికాసం - కె.గోపాలకృష్ణారావు
4) తెలుగు సాహిత్య సమీక్ష - జి.నాగయ్య
5) ప్రజాకవి వేమన - ఎన్.గోపి

బి.సి. అస్తిత్వవాద కవిత్వం – 'సమూహం' సంకలనం

డా॥ పెబ్బేటి మల్లికార్జున్, సహాయ ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్, నాగర్‌కర్నూల్
సెల్: 9491881916

ఉపోద్ఘాతం:

ఆధునిక కాలంలో సాహిత్యం ద్వారా జీవితాలను వ్యాఖ్యానించాలనుకున్నప్పుడు ఎవరి జీవితాలను వ్యాఖ్యానించాలి? ఏ తరహా జీవితాలను వ్యాఖ్యానించాలనే ప్రశ్నల పరంపర పుట్టుకొస్తుంది. తెలుగులో మొదట అగ్రవర్ణ సాహిత్యం రాజ్యమేలితే ఆధునిక కాలంలో అస్తిత్వ ఉద్యమాల నేపథ్యంలో అగ్రవర్ణేతర సాహిత్య సృజన ప్రాముఖ్యతను సంతరించుకుంది. అస్తిత్వ ఉద్యమాలు 1960వ దశకం నుండి ప్రారంభమయ్యాయి. ఈ ఉద్యమాల ప్రధాన డిమాండ్ గుర్తింపు. తెలుగు సాహిత్యంలో ఇవి స్త్రీవాదంతో మొదలయ్యాయి. తరువాత దళితవాదం బలంగా ముందుకు వచ్చింది. అంతకు ముందే ఈ దృక్పథంతో జాషువా సాహితీ సృజన చేసినా, ఆ తరువాత ఉద్యమ స్థాయిని అందుకోలేదు. కారంచేడు (1985), చుండూరు (1991) ఊచకోతల తరువాత అంబేద్కర్ భావజాలంతో దళితసాహిత్యం ఉద్యమరూపంలో ముందుకు వచ్చింది.

''అస్తిత్వోద్యమాల నేపథ్యంగా వెలువడిన దళిత కవిత్వంలో ముప్పాతిక భాగం బి.సి.కవులదే. అప్పటిదాకా దళితులంటే ఎస్సీ, ఎస్టీ, బి.సి.లు అనే విశాల భావన ఉండడం చేత దళితుల సమస్య అంటే అణగారిన వర్గాలందరిదీ అనే ప్రాతిపదిక మీద సాహిత్య సృజన జరిగింది. అణచివేతకు గురైన ప్రతీ ఒక్కరు దళితులేనన్న బాబాసాహెబ్ తాత్విక చింతనను అందిపుచ్చుకుని విశాల భావజాలంతో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీల ఉమ్మడి కవిత్వంగా 1995లో 'చిక్కనవుతున్నపాట', 1996లో 'పదునెక్కినపాట' కవితా సంకలనాలు వెలువడ్డాయి. ఈ సంకలనాల్లో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీలు ఉమ్మడిగానే అగ్రవర్ణభావజాలంపై తమ కలాలను దూశారు. ఆ తరువాత దళితుల సాహిత్యం దళితులే రాసుకోవాలనే ఒక సంకుచిత భావన మొదలై బి.సి. సాహిత్యం, దళిత సాహిత్యం వేరుపడ్డాయి.

ఈ నేపథ్యంలో బి.సి కవులు తమలోని సేవాకులాలు, చెమట కులాలు, వ్యవసాయ కులాలైన బి.సి.ల సమస్యల గురించి రాయటం మొదలుపెట్టారు. 2001లో వెనకబడిన కులాల కవిత్వంగా జూలూరు గౌరీశంకర్‌గారు ప్రధాన సంపాదకులుగా "వెంటాడే కలాలు – వెనకబడిన కులాలు" అనే కవితా సంకలనం వచ్చింది. పెబ్బేటి మల్లికార్జున్, బడేసాబ్, జయప్రకాష్‌లు సంపాదకులుగా 'బి.సి. కవితా సంకలనం' తీసుకరావడం జరిగింది. డా॥ చింతం ప్రవీణ్ కుమార్‌గారు సంపాదకులుగా 2016లో 'సమూహం' అనే బి.సి. అస్తిత్వవాద కవిత్వ సంకలనంను తీసుకరావడం జరిగింది. ఈ ప్రయాణంలో బి.సి అస్తిత్వ సాహిత్య సృజన బాగానే జరిగింది.

కవితా విశ్లేషణ:

ఈ వ్యాసంలో 'సమూహం' కవితా సంకలనం గురించి చర్చించుకుందాము. ఇందులోని 41 కవితల్ని 38 మంది కవులు రచించారు. బి.సి. అస్తిత్వ సాహిత్యానికి దారులు వేసిన ''వెంటాడే కలాలు – వెనకబడిన కులాలు'' సంకలనంలోని 23 మంది కవులకు ఇది అంకితం ఇవ్వబడింది. 'సమూహం' కవులు 'అంబేద్కర్ –పూలే' ఆలోచన దృక్పథం వెంట ప్రయాణం చేశారు. కులవృత్తులు ధ్వంసం కావడానికి ప్రపంచీకరణ ప్రధానకారణంగా చూపెట్టారు. బ్రాహ్మణీయ భావజాలంగాని, మిషనరీలుగాని తమకు చదువును నేర్పలేదని, అన్నం మరియు ఆత్మ గౌరవాన్ని అడుగుతూ రాజ్యాధికారం వైపు శరవేగంగా

అడుగులెయ్యాలని బోధ చేశారు.

ఏరుకొండ నర్సింహులు 'చీకటి సూర్యులు' కవితలో పంటలు పండించడంలో, యుద్ధాలు చేయడంలో ముందుండిన వాళ్లు మ్లేచ్ఛులుగా, నీచులుగా, నికృష్టులుగా, చండాలురుగా, శూద్రులుగా పిలువబడిన వాళ్లమని, ప్రస్తుతం ప్రజల చరిత్రను నిర్మించి 'నూతన ప్రజాస్వామ్య వ్యవస్థకు /నాంది పలుకబోతున్నాం' అని హెచ్చరిస్తాడు.

'బానిసకొకబానిస' కవితలో చిర్రా రాజేష్ ఖన్నా

జాతీయ జనతా విప్లవాల కోసం
చచ్చిందెవరు చంపిందెవరు
చచ్చి చరిత్రకెక్కిన వాళ్ళలో
నా వాళ్ళెందరు...?

అని తరతరాలుగా జరిగిన అన్యాయపు లెక్కల్లో న్యాయమైన లెక్క చెప్పమని నిలదీశాడు.

కొండ్రు బ్రహ్మం 'మేమే పాలించుకుంటాం' కవితలో ఉత్పత్తి కులాల శ్రమను గూర్చి

'మురికి బట్టలను
మల్లెగజేసే ముతక జీవులం'
'ధనవంతుల భవంతులకు
తవ్విన పునాదులం'
'ఆధిపత్య కులాలక సేవచేసే
అంగడి సరకులం మేం'

వీటి నుండి విముక్తిని పొందుతూ 'ఇక మేము పూలే – అంబేద్కర్ బాటలో నడుస్తం / మమ్మల్ని మేమే పాలించుకుంటాం' అనే చైతన్యవంతమైన ఆశాభావాన్ని వ్యక్తపర్చాడు.

సొన్నాయిల కృష్ణవేణి 'అన్నిమారినయ్ గనీ మా బతుకులే / ఎప్పటి శిప్ప ఎనుగుల్నే అన్నట్టున్నయ్ / సూస్కుంటుంటే మారయిగనీ / మార్చె ప్రయత్నం జెయ్యమని /నా కొడుక్కన్న జెప్పాలె' అనే కృతనిశ్చయాన్ని ప్రకటించింది.

కొలిపాక శ్రీనివాస్ 'సముద్రం మనది కావాలి' అనే కవితలో 'సముద్ర ఆహారాన్ని ప్రపంచానికందిస్తున్న మత్స్యకారుల గురించి రాశాడు. కడలి కెరటాలపై ప్రాణాలను పణంగా పెట్టి అనంత జలాల్లో రోజుల తరబడి మృత్యుకెరటాలతో, తుఫాన్‌లతో, తిమింగలాలతో, తిమిరంతో సమరం చేస్తూ సంసార సాగరం ఈదడానికి సాగరంతో నిత్యం పోరాటం చేస్తూ విజయ తీరాలకు చేరాలంటే 'సముద్రం తలాపుకుంటే సరిపోదు / సముద్రం మనదవ్వాలి' అంటాడు.

బండి శ్రీనివాస్ యాదవ్ 'యాదవవేదన' కవితలో యాదవులు గొర్లను చెట్లల్లో, పుట్టల్లో, చెలకల్లో, గట్లల్లో, అడవుల్లో, నదుల్లో, వాగుల్లో, వంకల్లో, లోయల్లో గొర్లమందతో ప్రయాణం చేస్తూ వాననక, ఎండనక, చలనక, పాములతో, క్రూర జంతువులతో, ఉరుములతో, మెరుపులతో తిమిరంతో దోస్తానం చేస్తూ , బుద్దగోచితో గొర్లను

'సరిహద్దు సైనికులోలె గొర్లకు పహారా
రిబోక్ షూలపై మోజులేదు, ఖరీదైన కార్లయావలేదు
పాతటైర్ల చెప్పులే రీబోక్ షూలు, కాలినడకే
ఖరీదైనకారు' గా

భావించి, ఈ దేశానికి బలమైన ఆహారాన్ని అందిస్తున్న రైతుగా కొనియాడతాడు.

వజ్జీర్ ప్రదీప్ 'శివాజీ కత్తిఎత్తి' కవితతో బ్రాహ్మణ పండితుల నుండి శివాజీకి కలిగిన అవమానం, ఉత్పత్తి కులాలు బ్రాహ్మణ, క్షత్రియులకు చాకిరి చేసి, భావదాస్యంలో అదే ధర్మమనుకొని బ్రతికిన చరిత్రను కవిత్వీకరించాడు. కాని ప్రస్తుతం 'షేష్వాల కాలంకాదు – బహుజనకాలం' అని బహుజన రాజ్యాధికారాన్ని ఆక్షాంక్షించాడు.

మట్టిని కుండగా మార్చేక్రమంలో కుమ్మరి కళాకారులు ఎంతనైపుణ్యాన్ని కనబరుస్తారో సముద్రాల కుమారస్వామి తన మట్టి చక్రం కవితలో కుమ్మరివారి బ్రతుకు గురించి,

కుండలు తయారు చేసే విధానం గురించి, వాళ్ల కులవృత్తి భాషలో చాలా కళాత్మకంగా వర్ణించాడు.

మట్టి మర్మము జూచి, మట్టిపెల్లలదెచ్చి
బొడిగ రాళ్ళేరి మట్టి సన్నగదంచి
సన్నని ఇసుకను చాలినంతగ పోసి
మట్టికుప్పను చేసి నీళ్ళతో తడిపి
కలగలసి పోయేలా తొక్కితొక్కి
మట్టి చక్రముపై మట్టిముద్దను చేర్చి
కుండలు, కూజాలు, పేర్పులు, అటికెలు జేసి
మన మట్టికింతందమూ ఎక్కడి నుండొచ్చెనోయి
ఆది శిల్పివయా ఓ శాలివాహనా!

బి.సి. కులాలు వ్యవసాయాన్ని ప్రధానంగా చేసుకొని కూడా బ్రతుకుతున్నారు. బొజ్జలు నిమురుకుంటూ, మీసాలు తిప్పుకుంటూ బ్రతికేపరాన్న జీవులు కాదు. చెట్టును, చేమను, మట్టిని నమ్ముకొని తమ చెమట చుక్కలతో ఈ నేలని సారవంతం చేశారు. బి.సి.ల వ్యవసాయ శ్రమ గూర్చి వెంకటకిషన్ గారు 'బాపు నేను నీ జీవన కొనసాగింపుని' కవితలో రైతుల గూర్చి

'బొచ్చెమీది ఎంటుకలు మొత్తము
ఊడిపోవాంగ తట్టపారవట్టి మోసికట్టి
మానవ శ్రమకి మించిన మహోద్భుతము లేదని
లోకానికి చూపినోడా

నువ్వో చెమటకులానికి అచ్చంగా నిలువుటద్దం బాపూ!

అని చెప్పాడు.

అంబడి భాగ్యగారు 'దొరోడా! నువ్వు దొరసాని దగ్గరే ఉండుబిడ్డా / బహుజన మహిళ బందూకవుతున్నది జాగ్రత్త' అని హెచ్చరించింది. అగ్రవర్ణాల వారు నిమ్నకులాల స్త్రీలకు ఇబ్బంది పెట్టే పరిస్థితులను వివరించి, ఇప్పుడు సావిత్రిబాయిపూలే, చాకలి ఐలమ్మలం అవుతున్నామని దృడ సంకల్పంతో చెప్పింది. జంగం హైమావతి గారు 'మాది ఎన్కబడ్డ కులంకాదు / ఎనకబడేసిన కులం' అంటూ గ్లోబలైజేషన్ తెచ్చిన మార్పులు తమ జీవితాలకు ఎటువంటి ముప్పును తెచ్చాయో తెలిపింది. జయవీర్ కోటగిరిగారు వృత్తుల గురించి.

'కుల వృత్తులు లేవు కుర్చీలు లేవు
సూదరోళ్లమనే కులనామమొక్కటే మిగిలి ఉంది"

అని చెప్తూనే

'ఇవ్వాళ బహుజనులకు వారసత్వమంటే / కులాలు కాదు / వర్గాలు కాదు / కులాల మూలాలు ఊడబీకే / సంఘజ్ఞానం' కావాలంటాడు.

అడపరాజు 'మేల్కోవాలె' కవితలో
'రావాలందరు
రణమో రాజ్యమో తేల్చుకునేందుకు
అగ్రభావజాలమనే అమానుషాన్ని అంతమొందించేందుకు
బి.సి.లంటె
ఉసిరికాయ మాటలుకాదు
ప్రశ్నించే పిడికిళ్ళతోటలు
ఉద్యమ జల ఊటలు'

అని అభివర్ణిస్తాడు. బి.సి.ల యొక్క కర్తవ్యాన్ని స్పష్టంగా, సూటిగా చెప్పాడు.

ఇంకా "కొలమానాలే కులమైనదాన్ని / నేనెట్లయిత బి.సి.ని' అని రేనా ఈశ్వరయ్య దొమ్మరితనం ఎట్లా తనకు అపాదించబడిందో స్త్రీ స్వరంతో చెప్పాడు. రాజ్యాధికారాన్ని పొందడానికి యుద్ధంకదా చేయాల్సిందని, "సిజేరియన్ చేసైనా బిడ్డను బయటకు తీయాల్సిందే" అని నిర్ధారించాడు. అనంతోజు మోహనకృష్ణ బంగారు పనిలో ఉండే బాధలను చెప్తూ "కంసళ్ళో .... అవుసళ్ళో / కదిలిరండు ... దండుగా / మనహక్కులను సాధించుకుందాం" అని నినదిస్తాడు.

'కులకళేబరం' కవితలో సొన్నాయిల నరేష్‌కుమార్ అగ్రకుల భావజాలం ఇంకా పోలేదని చెప్తాడు.

శర్మా.....

పక్కపక్కనే ఉన్నా మనిద్దరి మధ్య

తరతరాల తారతమ్యపు దూరం

కాగితాల రాతల్లో మనం సమానమే

కానీ....

ఇంకా మనూరి టీ కొట్లో గ్లాసుల్లా మనం దూరంగానే ఉన్నాం.

ముగింపు:

అభివృద్ధి చెందుతున్న సమాజం అవాస్తవాలను వ్యతిరేకించి, వాస్తవాలవైపు హేతుబద్ధతవైపు అడుగు లెయ్యాలి. అధిక జనాభా ఉన్నవారు పాలన చేయాలి. కానీ ఇక్కడ అత్యల్ప జనాభా ఉన్న వర్గాలు అవాస్తవాలను బోధిస్తూ, ప్రజాస్వామ్యపు విలువలను విస్మరించి, డబ్బుతో అధికారంలోకి వస్తున్నారు. ఉత్పత్తికులాలు భారతీయ సమాజం యొక్క అవసరాలను తీరుస్తూకూడా అవమానాలకు గురవుతున్నారు. తెలుగు రాష్ట్రాలలో ఇప్పటి వరకు ఒక్క బి.సి.ని కూడా ముఖ్యమంత్రిని కాకుండా చేసిన పరిస్థితి ఆర్థిక, సామాజిక, విద్యా, ఉద్యోగ, వ్యాపారం... ఇలా అన్ని రంగాలలో బి.సి.లను వెనక్కి నెట్టివేయబడటం వలన బి.సి.వాద కవులు తమ తాత్విక మూలాల్లోంచి సమాజాన్ని అర్థం చేసుకొని సాహితి సృజన ద్వారా, సభల ద్వారా చైతన్యవంతుల్ని చేస్తున్నారు. ఈ 'సమూహం'లో కవులు తమ సమస్యల్ని, తమకు జరుగుతున్న అన్యాయాల్ని చూపెడుతూనే వీటికి పరిష్కార మార్గం రాజ్యాధికారం అనే విషయాన్ని అంతర్గతంగా కొందరూ, సూటిగా కొందరూ చెప్పారు. ఈ స్ఫూర్తిని మిగతా కవులు, భవిష్యత్తు కవులు అందుకోవాలి.

తెలుగు సాహిత్యంలో ద్విపద కావ్యాలు

వంగాల సంపత్ రెడ్డి

ఉపోద్ఘాతం :

తెలుగు సాహిత్యంలో ఇతిహాసం, పురాణం, కావ్యం, ప్రబంధం, పద కవిత్వం , యక్షగానం, శతకం, నవల, కథ, కథానిక, మినీ కవిత, వచన కవిత, గజల్, రుబాయీలు మొదలైన సాహితీ ప్రక్రియలను చూడవచ్చు. ఈ సాహితీ ప్రక్రియలల్లో తెలుగు సాహిత్యంలో కావ్యానికి ప్రత్యేక స్థానం ఉంది. క్షేత్ర మాహాత్మ్య కావ్యాలు, కథాకావ్యాలు, వీర కావ్యాలు, విలాస కావ్యాలు, ద్విపద కావ్యాలు అని కావ్యాలను స్థూలంగా విభజించుకుంటే, ఆ కావ్యాలలో ద్విపద కావ్యాలకు ప్రత్యేకత ఉంది. సామాజిక చైతన్యం, సామాజిక స్పృహాను కలిగించటమే కావ్య ప్రయోజనం అయితే సామాజిక చైతన్యం కలిగించటంలో ద్విపద కావ్యాల స్థానం ఉన్నతమైనది. తెలుగుకే ప్రత్యేకమైన దేశీ ఛందస్సుకు చెందిన ద్విపదను మొట్టమొదట తెలంగాణ కవులు ఆదరించి ఆచరించి వ్యాప్తి కల్గించారు.

ద్విపద కావ్యాలు:

ద్విపద తెలుగు సాహిత్యంలో ఒక ధిక్కారం. ప్రజల గొంతులో నిరంతరం వెలువడే ఒక ఛందస్సు కావ్యంలోకి చొచ్చుకు వచ్చి తెలుగు సాహిత్యం ప్రజలపరం కావాడానికి తోడ్పడింది. తెలుగు సాహిత్యానికి స్థానిక ప్రజా జీవితాన్ని, ప్రజల భాషనూ, ఆచారాలను, అలవాట్లను అందించింది. తెలుగు సాహిత్యానికి నూతనత్వంను అందించింది. ప్రజలకు దూరంగా ఉన్న సాహిత్యాన్ని ప్రజల ముందుకు తీసుకువచ్చింది. ఒక విధంగా చెప్పాలంటే ద్విపద తెలుగు సాహిత్యంలో ఒక తిరుగుబాటు, ఒక విప్లవం. ఆ విప్లవాన్ని ఆ తిరుగుబాటుని ముందుకు తీసుకెళ్ళిన వాడు పాల్కురికి సోమనాథుడు.

నిజానికి పాడడానికి వీలైన ఛందస్సు గలిగినదే ద్విపద. ద్విపదలో రెండు పాదాలుంటాయి. ద్విపద ఒక్కొక్క పాదంలో మూడు ఇంద్రగణములు, ఒక సూర్యగణం ఉంటాయి. ప్రతి పాదంలోని మూడవ గణము మొదటి అక్షరం మీద 'యతి' చెల్లుతుంది.. ప్రాస నియమం ఉంటుంది. ప్రాస నియమం లేని ద్విపదను మంజరి ద్విపద అంటారు. ఈ ద్విపద నుంచే మంజరి, తరువోజ, మధ్వాక్కర మొదలైన దేశీ ఛందస్సులు ఏర్పడ్డాయి.

ఎక్కువ కావ్యాలు పద్య కావ్యాలుగానో చంపూ కావ్యాలుగానో ఉంటాయి. కానీ ద్విపద కావ్యాలలో మాత్రం మొదటి నుంచీ చివరి వరకు ద్విపదలే ఉంటాయి. ఎక్కడా వచనం ఉండదు. ఇది గేయ రచనలా, పాటలా సాగుతుంది. పాడుకోవటానికి వీలుగా ఉంటుంది. అందుకనే ద్విపద కావ్యాలను పండితులు, పామరులు ఆదరించారు. కొన్ని ద్విపదలు సరళంగా, పాదాలు దేనికవే అర్థం సంపూర్ణమై ఉంటాయి. తాళ్లపాక చిన్నన్నప్రకారం ద్విపదలో ఒక పాదంలోని చివరి పదం, రెండవ పాదంలోకి చొచ్చుకొని పోరాదు.

మొదటి ద్విపద కవి గోన బుద్దారెడ్డి అని విమర్శకుల అభిప్రాయం. గోన బుద్దారెడ్డి "రంగనాథ రామాయణం" వ్రాసి ద్విపద ప్రక్రియను తెలుగు సాహిత్యానికి అందించాడు. గోన బుద్దారెడ్డి ప్రత్యేకత ఏమిటంటే ద్విపదలో ఏ పాదానికి ఆ పాదం స్వతంత్రంగా ఉండేటట్లు వ్రాయడం.

అయితే ద్విపదకు గొప్ప కావ్య గౌరవ స్థాయిని చేకూర్చింది మాత్రం పాల్కురికి సోమనాథుడు. ద్విపదను పండితుల దగ్గరకు చేర్చాడు. అప్పటివరకు గ్రామీణ జీవితంలో ప్రచారంలో ఉన్న ద్విపదను కావ్యంలోకి నడిపించాడు. ద్విపదలో కూడా కావ్య ప్రౌఢత్వం ఎలా

ఉంటుందో చూపించిన వాడు సోమనాథుడు. సోమనాథుని తర్వాత శివకవులేగాక ఇతర కవులు కూడా ద్విపద కావ్యాలను రచించారు. సోమనాథుని తర్వాత ద్విపదకు గౌరవాన్ని తెచ్చినవాడు గౌరన.

"ద్విపద వ్యాయము" లో జి నాగయ్యగారు దాదాపుగా తెలుగులో 245 ద్విపద కావ్యాలున్నాయని అన్నాడు.

ద్విపద కావ్య వికాసంను నాలుగు దశలుగా జి నాగయ్య వర్గీకరించారు. అవి

1. మొదటి దశ – 1160 – 1500 కాలంలో రచించబడిన కావ్యాలు
2. రెండవ దశ – 1500 –1600 మధ్యకాలంలో వెలువడిన కావ్యాలు
3. మూడవ దశ – దక్షిణాంధ్ర యుగం అంటే 1600 – 1860 మధ్య కాలంలో వచ్చిన కావ్యాలు
4. నాల్గవ దశ –1860 తరువాత వెలువడిన కావ్యాలు

మొదటి దశలో వెలువడిన మొదటి ద్విపద కావ్యం రంగనాథ రామాయణం. దీనిని వ్రాసింది గోన బుద్దారెడ్డి. తెలుగులో మొదటి ద్విపద కావ్యం రంగనాథ రామాయణం, మొదటి కవి గోన బుద్దారెడ్డి. తెలుగులో వచ్చిన మొదటి రామయణం కూడా ఇదే. ద్విపదను కావ్య స్థాయికి తీసుకెళ్ళి వీరశైవ మత ప్రచారం చేసిన వాడు పాల్కురికి సోమనాథుడు. పాల్కురికి సోమనాథుడు బసవ పురాణం, పండితారాధ్య చరిత్ర లను ద్విపదలో వ్రాసాడు. ఈ కావ్యాలకు తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానం ఉంది. బసవ పురాణం తొలి సాంఘీక పురాణం. దీనిలో శివ భక్తుల కథలు ఉన్నాయి. పండితారాధ్య చరిత్ర మలికార్జున పండితుడి జీవిత చరిత్ర. ఇదే దశలో మడికి సింగన కూడా ద్విపదలోనే భాగవతంలోని దశమ స్కందం ను వ్రాసాడు. గణపనారాధ్యుడు స్వర శాస్త్రాన్ని కూడా ద్విపదలోనే వ్రాసాడు. పల్నాటి వీరచరిత్ర ని శ్రీనాథుడు ద్విపదలోనే వ్రాసాడు. ద్విపదలో వెలువడిన మొదటి చారిత్రక కావ్యం ఇది. నాదెండ్ల ఉమాపతి "మాయాచిదానంద మంజరి", కొలని గణపతిదేవుడి "మనోబోధ", పిడపర్తి "బసవన్న దీక్షాబోధ", పోశెట్టి లింగన "నవచోళ చరిత్ర" అనే ద్విపద కావ్య రచనలు చేసారు. కాసె సర్వప్ప కూడా ఈ కాలంలో ద్విపద రచనలు చేసాడు. హరిశ్చంద్ర నలోపాఖ్యానం, నవనాథ చరిత్ర వ్రాసిన గౌరన ద్విపద కావ్యాలకు గౌరవం తెచ్చాడు.

రెండవ దశలో వెలువడిన ద్విపద కావ్యాలను ఎక్కువగా తాళ్ళపాక కవులు వ్రాసారు. తాళ్ళపాక అన్నమయ్య ద్విపద రామాయణం వ్రాసినట్టు అన్నమయ్య జీవిత చరిత్రను సమగ్రంగా ద్విపదలో రాసిన అతని మనుమడు చిన్నన్న, "ప్రవిమల ద్విపద ప్రబంధ రూపమున నవముగా" రామాయణాన్ని అన్నమయ్య రాశాడని చెప్పాడు. కానీ ఈ రామాయణం లభ్యం కాలేదు. తొలి తెలుగు కవయిత్రి తాళ్ళపాక తిమ్మక్క రాసిన "సుభద్రా కళ్యాణం" కూడా ద్విపద కావ్యం కూడా ఈ కాలం లోనిదే. అన్నమయ్య కుమారుడు పెద తిరుమలయ్య కూడా ద్విపద కావ్య రచనలు చేసాడు. పెద తిరుమలయ్య కుమారుడు తాళ్ళపాక చిన్నన్న ద్విపద సాహిత్యానికి పుష్టిని చేకూర్చాడని విమర్శకుల అభిప్రాయం. "చిన్నన్న ద్విపద కెఱుగును" అనే నానుడి ఇతని పేరు మీదుగానే వచ్చింది. సోమనాథుడు ద్విపదను శైవ ప్రచారానికి వాడుకోగా చిన్నన్న వైష్ణవ మత ప్రచారానికి వాడుకున్నాడు. తాను వ్రాసిన అష్ట మహిషి కళ్యాణం, పరమయోగి విలాసం, ఉషా కళ్యాణం, అన్నమాచార్య చరిత్ర మొదలగు కావ్యాలు వైష్ణవాన్ని ప్రాతిపదికగా చేసుకుని చిన్నన్న రచించాడు. ఇదే కాలంలో నాదెండ్ల గోపమంత్రి,, చదలవాడ మల్లన, ఘట్టు ప్రభువు, భద్రకవి లింగన, దోనూరు కోనేరు నాథుడు మొదలగు వారు ద్విపద రచనలు చేసారు,

మూడవ దశలో అనగా దక్షిణాంధ్ర యుగంలో ద్విపదకి కావ్య గౌరవం పెరిగింది. దేశీ కవితకు మంచి ఆదరణ లభించడం, రాజులకు ద్విపద మీద ఆసక్తి,

అభిమానం ఉండటం వాళ్ళ ఈ కాలంలో ఉత్తమ ద్విపద కావ్యాలు వెలువడ్డాయి. ఈ కాలంలో వెలువడిన మొదటి ద్విపద కావ్యం చొక్కనాథ చరిత్ర . దీని రచయిత తిరువెంగళ కవి. తంజవూరుని పరిపాలించి, అపర శ్రీ కృష్ణదేవరయలుగా పేరు గాంచిన రఘునాథ నాయకుడు కూడా అచ్యుతాభ్యుదాయం, నలచరిత్ర అనే ద్విపద కావ్యాలు వ్రాసాడు. రఘునాథ నాయకుడి కుమారుడు విజయరాఘవ నాయకుడు కూడా రఘునాథాభ్యుదయం అనే ద్విపద కావ్యం వ్రాసాడు. మహారాష్ట్ర ను పాలించిన రెండవ ఏకోజి కూడా ద్విపదలో సంగ్రహంగా రామాయణం వ్రాసాడు. మరింగంటి సింగారాచార్యుని "ధనాభిరామం", కుచుమంచి తిమ్మకవి "సారంగధర చరిత్ర", తరిగొండ వెంగమాంబ "వాశిష్ఠ రామాయణం" – అన్నీ కూడా ఈ కాలంలో వెలువడిన ద్విపద కావ్యాలే.

నాల్గవ దశలో సత్యాద్రౌపదీ సంవాదం, మాతృపూజ అనే ద్విపద కావ్యాలను కందుకూరి వీరేశలింగం వ్రాసాడు. వావికొలను సుబ్బారావు భగవద్గీతను ద్విపదలో ఈ కాలంలోనే వ్రాసాడు. వేంకట పార్వతీశ్వర కవులు "రత్నహారం", పల్లెపూర్ణ ప్రజ్ఞాచార్యులు "మేఘదూతం", పుట్టపర్తి నారాయణాచార్యులు "పండరీ భాగవతం" లు కూడా ఈ కాలంలో వెలువడిన ద్విపద కావ్యాలే.

ద్విపద కావ్యాలు తెలుగు సాహిత్యాన్ని సంపద్వంతం చేశాయి. సాహిత్యాన్ని ప్రజల పరం చేశాయి. ద్విపద కావ్యాలు తెలుగు సాహిత్యానికి నూతనత్వంను చేకూర్చాయి. తెలుగు సాహిత్యంలో ద్విపద కావ్యాలది ఎల్లప్పుడూ ప్రత్యేక స్థానమే.

ఆధారాలు

1. తెలుగు సాహిత్య చరిత్ర – ద్వానా శాస్త్రి
2. సమగ్రాంధ్ర సాహిత్యం – ఆరుద్ర
3. శ్రీనాథయుగ సాహిత్యం – ప్రక్రియా వైవిధ్యం – డా రాంభట్ల వేంకటరాయశర్మ.

భావకవిత్వం – ఎంకి పాటలు

డా॥ సూరపరాజు వసంత కుమారి, తెలుగు అధ్యాపకురాలు, యస్.జి.యస్. ఆర్ట్స్ కళాశాల,
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

ఇరవయ్యో శతాబ్ది ప్రారంభంలో తొలిసారిగా "తెలుగు సాహిత్యం" లో ప్రబంధ కవితా ధోరణిపై తిరుగుబాటుగా వచ్చిన కవిత్వం "భావ కవిత్వం". ఆధునిక తెలుగు కవితా ధోరణుల్లో "భావకవిత్వం" ఒకటి. భావకవిత్వ ఉద్యమం తెలుగుదేశంలో మూడు దశాబ్దాల పాటు (1910–1940) సాగింది. భావ కవిత్వాన్ని "కాల్పనిక కవిత్వం" అని కూడా అంటారు. భావమే ప్రధానంగా సాగే కవిత్వమే భావ కవిత్వం. స్వేచ్ఛా ప్రియత్వం, ఆత్మాశ్రయత్వం, మానవ ప్రాధాన్యం, ఖండ కావ్యత్వం, ఆరాధనాతత్వం, మానవతావాదం, సంక్షిప్తత ఇవన్నీ కూడా భావకవిత్వ లక్షణాలు. ప్రణయ కవిత్వం, ప్రకృతి కవిత్వం, ఆధ్యాత్మిక కవిత్వం, దేశభక్తి కవిత్వం, సంఘ సంస్కరణ కవిత్వం, మానవతావాద కవిత్వం, స్తుతి కవిత్వం, స్మృతి కవిత్వం, బాలగేయ కవిత్వం ఇవన్నీ భావకవిత్వం యొక్క విభాగాలు.

తెలుగులో రాయప్రోలు, గురజాడ, అబ్బూరి, కృష్ణశాస్త్రి, విశ్వనాథ, నాయని, నండూరి భావ కవిత్వాన్ని సృష్టించారు. భావకవులు ఎందరో వున్నా వారిలో ప్రముఖంగా పేర్కొనదగినవారు అడవి బాపిరాజు, వెంకట పార్వతీశ్వర కవులు, వేదుల సత్యనారాయణశాస్త్రి, బసవరాజు అప్పారావు, దువ్వూరి రామిరెడ్డి, కొడాలి ఆంజనేయులు, కవికొండల వెంకటరావు, తుమ్మల సీతారామమూర్తి చౌదరి, చింతాదీక్షితులు, దీపాల పిచ్చయ్యశాస్త్రి, పురిపండా అప్పలస్వామి, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, బొడ్డు బాపిరాజు, శ్రీరంగం నారాయణ బాబు, దేవరకొండ బాలగంగాధరతిలక్, బాలాంత్రపు రజనీకాంతరావు, శ్రీమతి తల్లా ప్రగడ విశ్వసుందరమ్మ, శ్రీమతి చావలి బంగారమ్మ, శ్రీమతి బసవరాజు రాజ్య లక్ష్మమ్మ, శ్రీమతి పుట్టపర్తి కనకమ్మ మొదలైనవారు.

భావకవిత్వంలో ప్రణయ కవిత్వాన్ని వ్రాసిన ప్రముఖ భావకవుల్లో దేవులపల్లి కృష్ణశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, తల్లా వజ్జల శివశంకరశాస్త్రి, నాయని సుబ్బారావు, నండూరి సుబ్బారావు, అడవి బాపిరాజు ముఖ్యులు. భావకవిత్వంలో వీరందరు వారివారికిష్టమైన ఊహాసుందరులను సృష్టించి కవిత్వం వ్రాశారు. కృష్ణశాస్త్రి "ఊర్వశిని", విశ్వనాథ "కిన్నెరసానిని", శివశంకరశాస్త్రి "హృదయేశ్వరిని", నాయని "వత్సలను", నండూరి "ఎంకిని", బాపిరాజు "శశికళను" వారి ఊహాప్రేయసులుగా భావించి తమ భావకవిత్వాన్ని వ్రాశారు.

అందులో నండూరి సుబ్బారావుగారు వ్రాసిన ఎంకిపాటలు భావకవిత్వంలో ఎంతో ప్రముఖమైనవి. 1925లో ఎంకి పాటలు మొదటిసారి ప్రచురించబడ్డాయి. ఈ భావకవిత్వాన్ని నండూరి వారు వ్రాసి ఇప్పటికి సుమారు వందసంవత్సరాలు కావస్తూవుంది. వందసంవత్సరాల తర్వాత కూడా ఆ కవిత్వంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించే విధంగా ఈ ఎంకిపాటలు అత్యంత అద్భుతంగా రచింప బడ్డాయి. వంద సంవత్సరాల క్రితం రచింపబడ్డ ఈ ఎంకి పాటలకు పారుపల్లి రామకృష్ణయ్య మొదట బాణీలు కట్టారు. ప్రథమంగా నండూరి వారి నోటివెంట ఈ పాటలను ప్రజలు విన్నారు. తర్వాత ఆ పాటలు ప్రజలందరి నాలుకలపై నాట్యం చేసి ఎంతో ప్రాచుర్యాన్ని పొందాయి. మంగళంపల్లి బాలమురళీక్రిష్ణ లాంటి ప్రముఖ సంప్రదాయ శాస్త్రీయ సంగీత విద్వాంసులు కూడా ఎంకిపాటలు పాడారు. బసవరాజు అప్పారావు, కళాభాస్కర్, బాపు ఈ పాటలకు చిత్రాలు గీసారు. నేడు ఎంకి పాటలకు బాణీలు కూర్చి అంతర్జాలంలో యూట్యూబ్ ద్వారా అందరూ వీక్షించి రసానుభూతిని పొందేలా ప్రముఖ సంగీత డైరక్టర్ ఆర్.పి.

పట్నాయక్ చేశారు.

వందసంవత్సరాల తర్వాత కూడా నండూరి ఎంకి పాటలు చెక్కు చెదరకుండా వుండడం, ప్రజల నోట ఆ పాటలు వినపడడం, వాని గురించి చర్చించడం ఇవన్నీ కూడా అలనాడు గుఱ్ఱం జాషువా తెలిపిన క్రింద మాటలను స్ఫురింపచేస్తాయి.

రాజు మరణించెనొక తార రాలిపోయె
కవియు మరణించెనొక తార గగనమెక్కె
రాజు జీవించు రాతి విగ్రహములందు
సుకవి జీవించు ప్రజల నాలుకలయందు

అలతి అలతి పదాలతో అనంతమైన భావాన్ని అత్యంత అందంగా రచించిన ఎంకి పాటలు సంఖ్య పరంగా 42. జానపద సుందరిగా తెలుగు సాహితీ సౌధంలో అడుగుపెట్టి సాహితీప్రియులు మనుసులను దోచిన పవిత్ర ప్రణయ దేవత నండూరి వారి ఎంకి.

గుండె గొంతుకలోన కొట్లాడుతాదీ
కూకుండ నీదురా కూసింతసేపు!
నాకాసి సూస్తాది నవ్వు నవ్విస్తాది,
యెల్లి మాట్లాడిస్తే యిసిరికొడతాదీ!
(పాటపేరు: ముద్దుల నా యెంకి)

ఒకరోజు నండూరి సుబ్బారావు ట్రాంబండిలో ఇంటికి వస్తుండగా గొంతుకలో ఒక సన్నని రాగం బయలుదేరింది. క్రమంగా గుండె గొంతుకలోన కొట్లాడుతాదీ అనే పల్లవి రూపుదిద్దుకుని ఇంటికి చేరే సమయానికి ఎంకిపాటల్లో మొదటిపాట రచన పూర్తయింది. ఇలా ఎంకిపాటల సృష్టి ప్రారంభమైంది.

మెల్లంగ వస్తాది నా యెంకీ!
సల్లంగ వస్తాది నా యెంకీ!
పచ్చన్ని సేలోకి పండు యెన్నెల్లోన
నీలి సీరాగట్టి నీటు గొస్తావుంటె
వొయ్యార మొలికించు నా యెంకీ!
వొనలచ్చి మనిపించు నా యెంకీ!
(పాటపేరు: వొనలచ్చిమి)

పచ్చని చేలు, పండువెన్నెల, ప్రకృతి అందాలు, నీలిరంగు చీరకట్టుకొని సలక్షణంగా లక్ష్మీదేవిలా కనిపించే వయ్యారాలు చిందిస్తూ వచ్చే ఎంకి అందాలు నండూరి పై పాటలో తెలిపాడు.

యెంకి వొంటి పిల్ల లేదోయి లేదోయి!
యెంకి నా వొంకింక రాదోయి రాదోయి!

మెళ్ళో పూసలపేరు,
తల్లో పూవులసేరు,
కళ్లెత్తితే సాలు
కనకాబిసేకాలు!

సెక్కిట సిన్నీమచ్చ,
సెపితే సాలదులచ్చ!
వొక్క నవ్వే యేలు
వొజ్జిర వొయిడూరాలు!
(పాటపేరు: నమిలి మింగిన నా యెంకి)

తెలుగువారి ఆడపడచు ఎంకి, స్వచ్ఛమైన జానపదపిల్ల ఎంకి. కల్లాకపటం తెలియని పల్లెటూరి అమ్మాయి ఎంకి. ఎందరో కావ్యనాయికల మధ్య తనకంటూ ఒక ప్రత్యేక స్థానంలో పుష్పించిన అడవిమల్లె ఎంకి. అందుకే తెలుగు సాహిత్యంలోనే ఎంకివంటి పిల్లలేదు, ఇక ఉండబోదు అని చెపుతూ, ఆమె మెడలో వేసుకొన్న పూసలదండ, తలలో పెట్టుకొన్న సేరు పూవులతో ఆమె ఎంత అందంగా వుందంటే కళ్ళుఎత్తి చూస్తే చాలు బంగారు అభిషేకం చేసినంత అమూల్యంగా వుందని, బుగ్గమీద వున్న ఆ చిన్న మచ్చ ఎంతో అద్భుతంగా వుందని, ఆమె అందం గురించి చెప్పడానికి లక్ష మాటలైనా చాలవని, ఆమె ఒక్క నవ్వుకు వజ్రవైడూర్యాలు కూడా సాటిరావని, ఆమె హంసలాగా, తీర్చిదిద్దిన బొమ్మలా, అందాల బరిణిలా, ఆకాశంలోని నక్షత్రంలా ఎంతో అందంగా వుందని నండూరి వర్ణించాడు.

ఎంకి వూగెను కొమ్మ వుయ్యాలా! చంద్ర
వంక వూగెను బొమ్మ వుయ్యాలా!

దీపమై, తిలకమై

పీఠమై – ఎంకికి – కి
రీటమై. నెలవంక! (పాటపేరు: ఉయ్యాల)

ఎంకి, నాయుడు బావలకీ ప్రకృతే నేస్తం. పల్లె ప్రణయ స్థలం. ఎంకి కొమ్మకు వూయల కట్టి దానిపై వెన్నెల్లో ఊగుతూ వుంది. క్రింద యేరు, ఆ యేటి నీళ్ళల్లో చంద్రవంక ప్రతిబింబం. ఎంకి వూయల ఊగుతూవుంటే ఆ చంద్రవంక ఎంకికి తిలకంగా, పీఠంగా, కిరీటంగా అమరుతూ అత్యంత అందంగా కనిపిస్తూవుందన్న భావుకతను ఈ పాటలో నండూరి వ్యక్తీకరించాడు.

"యెంతసే వున్నాను యిడిసి పెట్టాలేవు
తగువోళ్ళలో మనకి తలవొంపు" లంటాది!
యెన్నాని సెప్పేది యెంకి ముచ్చట్లు
యేటి సెప్పేది నా యెంకి ముచ్చట్లు?
యెన కెనక సూత్తానె యొల్లుతా వుంటాది
(పాటపేరు: యెంకి ముచ్చట్లు)

నాయకీ నాయకుల ప్రేమ గాఢత ఎంతో తెలిపే ఈ పాటలో ఎంతసేపు ఎంకి తన బావతో వున్నా ఆయనకు తనివి తీరకుండా ఆమె తిరిగి వెళ్ళడానికి అనుమతించకపోతే తమతోటివాళ్ళలో తలవంచుకునే పరిస్థితి వస్తుంది అని సుతిమెత్తగా ప్రియుడిని వొప్పించి, అతనిని వదిలి వెళ్ళడం తనకూ ఇష్టంలేక తిరిగి తిరిగి చూస్తూ వెళుతూ వున్న ఎంకి గురించి అద్భుతంగా యెంకి ముచ్చట్లు అనే పాటలో అద్భుతంగా నండూరి వివరించాడు.

యెం కొక్క దేవతై
యెలిసె నంటారు –
యింటింట పెడతారు
యెంకి నీ పేరు!
సాటేలా! నీకు మాటేలా? సిన్నతనమేలా? సిగ్గేలా?
(పాటపేరు: సాటేలా?)

అనే పాటలో నాయుడు బావ ఎంకితో మనది పవిత్రమైన ప్రేమ. నీకు ఎలాంటి చిన్నతనము లేదు. ఏవిధమైన మాటలు రావు. నిజమైన ప్రేమకు మంచితనానికి నీవు ప్రతిరూపమని అందరూ పొగడటమే కాదు, వాళ్ళ పిల్లలకు కూడా నీ పేరే పెట్టుకొంటారని చెపుతాడు.

నీ తోటె వుంటాను నాయుడు బావా!
నీ మాటె యింటాను నాయుడు బావా!
నీ నీడలోనే మేడ కడతా నాయుడు బావా!
(పాటపేరు: సతైకాలపు యెంకి)

ఎంకి నాయుడు బావలు ప్రేయసీ ప్రియులు. ఏమీ ఆశించకుండా ప్రేమను మాత్రమే కోరుకునే ఎంకి స్వచ్ఛమైన మనసు, ప్రియురాలికి ఏమి కావాలన్నా ఇవ్వాలనే ప్రేమతో కూడిన తపన కలిగిన ప్రియుడి భావాలు ఈ పాటలో మనకు దర్శనమిస్తాయి.

ఆవుల్ని దూడల్ని అత్తోరి కాడుంచి
మూటముల్లే గట్టీ ముసిలోల్లతో సెప్పి
యెంకీ నాతోటి రాయే – మన
యెంకటేశరుణ్ణి యెల్లి సూసొద్దాము
(పాటపేరు: యెంకితో తిరుపతి)
పడవెక్కి బద్రాద్రి పోదామా
బద్రాద్రి రాముణ్ణి సూదామా
గోదారి గంగలో కొంగు కొంగూగట్టి
కరువు తీరా బుటక లేదామా!
(పాటపేరు: యెంకితో బద్రాద్రి)

వివాహానంతరం కొత్త దంపతులు చేసే యాత్రల ప్రస్థావన పైపాటల్లో వర్ణింపబడినది. విహారయాత్ర, స్వామి అనుగ్రహం, పనుల నుండి విశ్రాంతి, దంపతుల మధ్య మరింత సాన్నిహిత్యం పెరిగే విధంగా ఎంకి నాయుడు బావలు తిరుపతిలో వేంకటేశ్వరస్వామిని బద్రాద్రిలోని శ్రీరాముడిని దర్శించుకొని, ఆనందంగా జీవనయానం సాగించే మధురమైన విషయాలను, నండూరి ఈ పాటలో రచించాడు.

ప్రకృతి, ప్రణయమే కాదు సరసమూ మరియు విరహము, అల్లరి, జానపదాల అందాలు, జానపదుల స్వచ్ఛత, వివాహబంధపు దివ్య అనుభూతులు, ఇలా ఎన్నో భావాలు, అద్భుతమైన తేట తెలుగు పదాలతో, తెలుగు ఏస, తెలుగు నుడి, తెలుగు నాదం, తెలుగు రుచి తెలుసుకునేలా రచింపబడ్డాయి. భావకవిత్వంలో విశిష్ట స్థానాన్ని పొందిన ఎంకిపాటలు నాటికీ నేటికీ పాఠకులకు ఎంతో రసానుభూతిని అందిస్తూ వున్నాయి.

ప్రొఫెసర్ తుమ్మపూడి భారతి గారు రాసిన 'ఫ్రీజర్ కథలు'లోని సామాజికత

సాహితి మోదుగుల, ఎం.ఏ ఆంగ్ల సాహిత్యం, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

ఎప్పుడూ పుస్తకాలతో సాహచర్యం చేసే నాకు ఆచార్య, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయపు మాజీ వైస్ చాన్స్‌లర్ కొలకలూరి ఇనాక్ గారి రచనలు చదవడం మూలంగా దళిత సాహిత్యంపై మక్కువ ఏర్పడింది. మాది గుంటూరు. మా గుంటూరులో ఉన్న అన్నమయ్య గ్రంథాలయానికి తరచూ వెళ్లడం అలవాటు. అలా ఓ రోజు "The History of Telugu Dalit Literature'' అనే పుస్తకం నన్నాకర్షించింది. రచయిత దగ్గర తుమ్మపూడి భారతి అని ఉంది. బాగా పరిచయం ఉన్న పేరులా అనిపించింది. వెంటనే బ్లర్బ్(రచయిత పరిచయం) చదివాను. ఆశ్చర్యం! రోజూ తరగతి గదిలో నా ఎదురుగా నుంచుని పాఠం చెప్పే మనిషి. వారు పాఠంగా ఇష్టపడి నేర్చుకున్న దాన్ని థీసిస్ చేసి ప్రచురించిన పుస్తకం అది. ఆంగ్లంలో దళితసాహిత్య చరిత్రపై వచ్చిన మొదటి పుస్తకం అది. తీసి రాసేది థీసిస్ అంటారు. థీసిస్ అంటే ఓ సిద్ధాంతాన్ని సిద్ధం చేయడం. ఆ పని వారు సక్రమంగా చేసి ముందు తరాలకి ఓ ఉదాహరణగా నిలిచి, సమాజానికి అందించిన పుస్తకం అది. ఆ పుస్తకం చదివాక (కొంత) వీరు ఇంకేమి రాసారో అని వెతకడం మొదలుపెట్టాను. కొన్నిరోజుల తరువాత భారతిగారు రాసిన "ఫ్రీజర్ కథలు" పుస్తకాన్ని వారు స్వయంగా ఇచ్చారు. పుస్తకం చేతికి వచ్చినా, చదవాలన్న ఆశ ఉన్నా పరీక్షల మూలంగా చదవలేకపోయాను. దాదాపు నెలన్నర తరువాత ఓ రోజు కిటికీ వైపు చూస్తుంటే తళుక్కున మెరిసింది. తల పైకెత్తి చూస్తే నా కోసం ఎదురు చూస్తున్న పుస్తకం. చదవడం మొదలుపెట్టాను. నెలన్నరగా వేచి చూస్తున్న పుస్తకాన్ని చదవడానికి సరిగ్గా రోజు కూడా పట్టలేదు. చదివిన దాన్ని ఆకళింపు చేసుకోవడానికి మాత్రం చాలా సమయమే పట్టింది. ప్రతి కథలో కథావస్తువు అంత బరువుగా ఉంది మరి.

"అప్పట్లో కథ ఎక్కడో ఆకాశంలో ఉండేది. కనిపించని దేవుళ్ళ ద్వారా మనలో విలువలు పెంచడానికి కథలు రాసేవారు. కల్పితం ప్రధానంగా ఉండేది. ఆ తరువాత రాజుల చుట్టూ కథలల్లే వారు." అని మా నాన్న చెప్పిన గుర్తు. క్రమంగా కథ నేల మీదకు దిగింది. "తొలికాలపు సంస్కృతి సాహిత్య శాస్త్రవేత్తలు కథనాత్మకమయిన ఏ రచననైనా, పద్యంలో రాసినా, వచనంలో రాసినా కథగానే పరిగణించారు." అని కథ: సాహిత్య శాస్త్రం అనే వ్యాసంలో డా.పోరంకి దక్షిణమూర్తి రాశారు. కావ్యాలంకార కర్త అయిన భామహుడు కథను స్పష్టంగా పేర్కొన్నారు. కథలోని పదాల ప్రయోగ రీతిలో 'రసానుగుణత' ఉండాలన్నారు. దాన్నొక ప్రత్యేక లక్షణంగా పరిగణించారు. అలంకారశైలి, వస్తువులో కొత్తదనం, ఉదాత్తత ఉండాలన్నారు బాణుడు. కాదంబరి కర్త అయిన బాణభట్టు ప్రత్యక్షంగా చెప్పిన ఈ అంశాలు గమనించదగ్గవి. కథకు ఎన్నో సంవత్సరాల చరిత్ర ఉంది. ఇంతక ముందు కథలన్నీ గ్రాంధిక భాషలోనే సాగేవి. వ్యవహార భాషోద్యమం ద్వారా గిడుగు రాంమూర్తి పంతులుగారు, గురజాడ అప్పారావుగారు కథలు మామూలు భాషలో ఉండాలని విశేషంగా కృషి చేసారు. ఆయనని ఆయన దిద్దుబాటు చేసుకుని 'దిద్దుబాటు' కథానికని వ్యావహారిక భాషలోకి రాసారు. కథ భాషరీత్యా సంపూర్ణ ఆధునికత ఆయన చేతుల్లోనే సంతరించుకుంది. మల్లాది రామకృష్ణ శాస్త్రిగారి 'డూమూవూలు', విశ్వనాథ సత్యనారాయణ గారి 'చామర గ్రాహిణి' వంటి కథలు ఈ సందర్భంగా జ్ఞాపకానికి వస్తాయి. అందరికీ అందని గొప్ప కథలూ ఉంటాయి. చలం గారి 'ఓ పూవు పూసింది', బుచ్చిబాబు గారి – 'చైతన్య స్రవంతి' అందుకు తార్కాణాలు. కాసారం లోతెక్కువై ఊపిరాడనివ్వని కథలు గోపీచంద్ వైతే – కాసారం తీరు తెన్నుల్ని తెలియజెప్పడానికి పూసిన

కమలాలు – మధురాంతకం రాజారాం కథలు. మధ్యతరగతి మందహాసానికి మారుపేరు ఇచ్ఛాపురం జగన్నాథం కథలైతే, స్థానిక నేపథ్యాన్ని సుగంధభరితంగా పట్టిచ్చే కథలు పొట్లపల్లి రామారావువి. కథ చమత్కారాలు, వినోదం ద్వారా హృదయరంజకంగా ఉండాలి. మన చుట్టూ సమాజంలోని సంఘటనలు తీసుకుని, పాత్రలను వస్తువులుగా తెచ్చుకుని కథ చెపితే బాగుంటుంది. నవల, నవలిక, పెద్ద కథ, చిన్న కథ, కథానిక, గల్పిక, అన్నీ కథ నిడివిని బట్టీ చెప్పే విధానాన్ని బట్టి నిర్ణయించబడ్డ పేర్లే. అన్నిటిలోనూ కథే ప్రాణం. కథే జీవితం. తమ గతాన్ని వివేచనతో అనుశీలనము చేసికొనగలిగినవారు తమ అనుభవసారాన్ని పరులకు పంచే యత్నం చేస్తారు. విన్నవారికి అది కథలా తోస్తుంది. జీవితంలో గడచిపోయిన ప్రతిక్షణమూ గాథగా మారిపోతుంది. అంటే ప్రతి కథలోనూ ఒక జీవితముందన్న మాట.

సంఘటనల సమాహారమే జీవితం. ఒక్కొక్క సంఘటన ఒక్కొక్క అనుభవాన్ని కలుగజేస్తుంది. అది సుఖం కావచ్చు దుఃఖం కావచ్చు. ఆయా అనుభవాలను బట్టి మానవుడు తన ప్రవర్తనా సరళిని మార్చుకుంటూ ఉంటాడు లేదా మలచుకుంటూ ఉంటాడు. మానవుడు తన అనుభవాన్నుండే సృష్టి సమస్తాన్నీ అర్థం చేసుకోవాలంటే సాధ్యమయ్యే విషయం కాదు. అందుకు ఒక జీవితం చాలదు. ఈ కారణంగానే – 'తెలివైన వారు పరుల అనుభవాల నుండి నేర్చుకొంటారు' అన్న సామెత పుట్టింది. పరుల అనుభవాన్ని ఎటువంటి బిడియమూ, సంకోచమూ లేకుండా సంపూర్ణమైన వివేచనతో స్వంతం చేసికొని మన వ్యక్తిత్వాన్ని వికసింపజేసు కొందుకు తోడ్పడే ఉపకరణం పేరే కథాసాహిత్యం. భారతిగారు రాసిన కథలన్నిటిలోను తరువాత ఏమి జరుగుతుందో చదవాలన్న ఉత్కంఠ, కరుణ రసం, సంభ్రమాశ్చర్యాలలో ముంచేత్తే ముగింపూ, క్లుప్తత, స్పష్టత, ఏకాంశం, చెప్పాలనుకున్న విషయం నుండి దోవ తప్పకపోవడం వంటివి ముఖ్య కథా లక్షణాలు లక్షణంగా కనిపిస్తాయి. మనుషుల జీవితాల్లో సంభవించే చాలా సమస్యలు వాళ్ళ స్వయంకృతాపరాధాలే. వాటిని ఓ సామాన్య పాఠకుడు కూడా అర్థం చేసుకోగలిగినంత సరళంగా చెప్పారు. కొన్ని కథల్లో పాత్రలు ప్రాణంతో నడచివస్తాయి. స్వతంత్రంగా వ్యవహరిస్తాయి. పాఠకుడు పాత్రల సమాజంలోకి వెళ్లిపోతాడు. పాత్రలతో కలసి నవ్వుతాడు, ఏడుస్తాడు. పోరాడుతాడు, ఓదారుస్తాడు, వెరశి జీవిస్తాడు. కథ చదవడం పూర్తికాగానే అప్పటిదాకా తనతో మాట్లాడిన వారేమయి పోయారా! అని వెతుక్కుంటాడు. తియ్యని ఆ అనుభవాల్ని పొందేందుకు మరల మరల సంసిద్ధుడవుతాడు. కథ చివరి పేజీ నుండి మొదటి పేజీకి వచ్చేస్తాడు. కథలోని పాత్రలు రచయిత సృజన అన్న స్పృహ పాఠకుడికి ఉండదు. అలాంటి రచన భగవంతుడి సృష్టితో సమానం. 'ఫ్రీజర్'లో ఉన్న వెంకట్రావ్ చలపతి ఊహాలోకంలో అంటున్న మాటలు చాలా సేపు బాధతో గుండె మొద్దుబారేట్లు చేస్తుంది. పిల్లల్ని విదేశాలకు పంపి వారి భవితే తమ భవిష్యత్తు అనుకుని స్వగ్రామంలో జీవచ్ఛవాల్లా పడి ఉండే తల్లిదండ్రుల మనోవేదన తెలుపుతుందీ కథ. చదువుతున్నంత సేపు 'మానవ బంధాలన్నీ ఆర్థిక సంబంధాలే' అన్న కార్ల మర్క్స్ మాట గుర్తొస్తూనే ఉంటుంది. కొన్నిసార్లు తలిదండ్రులే తెలిసి తెలిసి ఆడపిల్లకు ఊహ తెలియకుండానే పెళ్లి అనే ఊబిలో పడేస్తారు. వైవాహిక జీవితం బాగుంటే సరి. లేకపోతే శారీరకంగా, మానసికంగా చాలా కష్టపడవలసి ఉంటుంది. 'నిర్ణయం' కథలో 'శాంత' నేటి పురుషాహంకార ప్రవర్తనకి, ఆడదానికి జన్మనిచ్చిన తరువాత సొంత కుటుంబంలోనే హింసలకు గురయ్యే ఎందరో శాంతల జీవితాలని ప్రతిబింబిస్తుంది. సమాజం అంటే పురుషుడే అని, నాగరికులమని చెప్పుకునే నీటి చదువు'కొన్న' పురుషుడు వల్లించే దెయ్యపు సూక్తులు ఆడదాని మనసులో ఎంతటి శూలాల్లా దిగబడతాయో అనే దానికి అద్దం పడుతుందీ కథ. ఆడజన్మనెత్తి వయసొచ్చాక కలలు కనేది తనను మనువాడి మారాణిలా చూసుకునేది ఆ మారాజు గురించే. అతనే సరిగ్గా లేకపోతే మనసు ఎంత వేదన అనుభవిస్తుందో కుటుంబ పరిస్థితులు ఎంత దిగజారుతాయో అని, వైవాహిక జీవితం అంత సులభంగా ఏమీ ఉండదని 'అపురూపజన్మ' కథ చదివితే తెలుస్తుంది. వేరొక ఇంటికి గొడ్డు చాకిరీ

చేయడానికి కొన్ని సంవత్సరాలు ఒక ఇంట్లో పుట్టి పెరిగినట్లు ఉండే మగువ దీన స్థితి తెలుస్తుంది.

భర్త ఆధారణలేక, నిస్సహాయత మూలంగా బాధ కోపం మిళితమై జీవితాలు నిస్సారంగా ఎలా మూగబోతాయో చెప్పే కథ 'రాగసంధ్య.' కథ చిన్నదే కానీ, కట్టుకున్నోడి స్వార్థం కోరలు చస్తే, నీతితో కేవలం అవసరాలకి సంపాదించాల్సిన డబ్బుని అదే జీవితంగా భావిస్తే, సంపాదించే ఆడదాన్ని కేవలం డబ్బు కోసమే పెండ్లాడితే, బతుకు ఎట్లా భారమవుతుందో చెప్పే కథ. ఇట్లాంటి ఎందరో రాగసంధ్యలున్నారు లోకంలో. మనిషిని 'అంతర్మధనం' చాలా కుంగదీస్తుంది. చెప్పలేక, చెప్తే ఏమవుతుందో అనే అనుమానం, చెప్పినా ఏం జరుగుతుందిలే అన్న అసహనం చాలా మంది బ్రతల్లో ఉంది. అదే జీవితానికి అన్వయించుకున్న మాట పచ్చి నిజం. కూర్చుని మాట్లాడితే సరిపోతుందని తెలియక కాదు. సరైన మాటలు దొరక్క. సరి చేసుకునే తీరిక లేక. చెప్పగలిగిన చనువు, చెప్తే అర్థం చేసుకోగల బుద్ధి ఉంటే సంసారం ఎంత సాఫీగా సాగుతుందో చెప్పే కథ. వలస రాజ్యాల కాలంనాటి ఎన్నో భవనాలకు, ఎన్నో దేవాలయాలకు, చల్లని వాతావరణానికి, కళాశాలలకు, పరిశోధనా సంస్థలకు నెలవు, ఆపిల్ తోటలకు ప్రసిద్ధి, ఆంగ్లేయుల వేసవి విడిది, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర రాజధాని , ముఖ్యంగా భారత్ – పాకిస్థాన్ మధ్య ఒప్పందం కుదిరిన ప్రదేశం సిమ్లా. సిమ్లాలోని సముద్రం ఒడ్డున కూర్చుండగా ఎవరో కూడా తెలియని సునీల్ సుబ్బారావును పలకరించాడు. సుబ్బారావు వ్యధనంతా విని సునీల్ ఇచ్చిన సలహా సుబ్బారావు జీవితాన్ని ఎలా మార్చింది అన్నది విషయం. 'మళ్ళీ సిమ్లా వెళ్ళాలి' కథ చదివాక 'పలకరించి చూడు ఓ కోయిల పరిమళించే పాట గొంతుక విప్పొచ్చు. పలకరించి చూడు ఓ హృదయం మోస్తున్న వ్యధను కరిగించుకుని తేలికపడొచ్చు.' అని మా డిగ్రీ కాలేజీలోని ఆంగ్ల సాహిత్య ఆచార్యులు డా. విజయ్ కోగంటి రాసిన కవితా పంక్తులు గుర్తొచ్చాయి.

'వ్యాలెంటైన్స్ డే.' ప్రేమికుల రోజు. కానీ ఆరోజు టీవీలో వచ్చిన ఓ ప్రోగ్రాం ఎంతో నిరాశ, నిస్పృహలతో నిండిపోయిన సుదర్శన్ రెడ్డి గతి తప్పిన మనసుని సరైన దోవలో నడిపించిన రోజు. వయసులో ఉన్నప్పుడు ఎలా ఉండాలో తెలిపే కథ. కుటుంబ పెద్ద తన బాధ్యతను గాలికొదిలేస్తే ఆ కుటుంబం ఎలా చిన్నాభిన్నం అవుతుందో తెలిపే కథ. పొరుగువారిని కనీసం కన్నెత్తయిన చూడని గజిబిజి జీవితపు ఉరుకుల, పరుగుల ప్రపంచంలో తన ఊరి వారితో తన అనుబంధం ఎంత అమూల్యమో, స్వచ్ఛమైన గాలిని పీల్చే స్వచ్ఛమైన మనుషులు ఎంత అవసరమో కేవలం వ్యాపార దృక్పథంతో ఆలోచించే శ్రీధరమూర్తికి తెలియజేసే కథ 'బెన్ని.' అతనితో పాటు మనకి కూడా. డబ్బు, స్థాయి, హోదా లేకపోయినా విషయావగాహన అనేది మనిషిని ఎలా ఉన్నతుడిగా నిలబెడుతుందో మనందరికీ కనువిప్పు కలిగించే కథ. చాలా మామూలుగా జీవిత సత్యాలను ఒక మామూలు మనిషి చేత చెప్పించడం చాలా బాగుంది. ఓ ఉన్నత ఉద్యోగి తన ఆలోచనలు కార్యరూపం దాల్చేలా చేసే ముందు దానిని ఇతరులతో చర్చించి సలహాలను లెక్కజేసి నిర్ణయం తీసుకోవడం ఎంత ముఖ్యమో చెప్పే కథ 'పునరాలోచన.' అలా చేయకపోతే వ్యవస్థలో ఎన్ని అవకతవకలు జరుగుతాయో బాగా తెలియవస్తుంది. ముఖ్యంగా చదువుల గురించి, పిల్లల గురించి నిర్ణయాలు తీసుకోవడంలో ఓ క్షణం ఆలస్యం అయినా ఓ తరం ఆలస్యమవుతుంది అన్న సంగతి స్పష్టంగా చెప్పిన కథ. ఈ విషయం ఈ పంతులమ్మ కంటే ఇంకెవరికి బాగా తెలుసూ! విదేశీ వస్తువులకు, పరిశ్రమలకు ఎక్కువ ప్రాముఖ్యతనిస్తే కొంత కాలానికి దేశ పరిస్థితి ఎలా దిగజారుతుందో చెప్పే కథ 'వలసత్వోనమః.' ఈ కథలో కదిలిపోయే కాలంలో స్వదేశం పట్ల ప్రేమున్నా ఆధునిక ఆలోచనలున్న ఉన్న తండ్రీ కనబడతాడు. ఎంత లేదనుకున్నా అందరికీ చిన్నప్పటి చిన్న చిన్న జ్ఞాపకాలు ఉండే ఉంటాయి. వాటి నుండి మనం ఎంతో కొంత నేర్చుకునే ఉంటాం. అటువంటి కథే 'ఎందుచేపలు.' ఈ కథ చదివాక మనం నోస్టాల్జియాలోకి వెళ్ళక మానం. పిల్లలపై అతి ప్రేమ చూపించడం, గారాబం చేయడం వల్ల కొన్నిసార్లు వాళ్ళ ప్రాణాలే కోల్పోవలసి వస్తుంది అని స్పష్టం

చేసే కథే 'వైఫల్యం.' అలాగే పిల్లలు చదువుకుంటున్నప్పుడు వాళ్ళకి తరగతి పాఠాలతో పాటు జీవిత పాఠాలూ అబ్బేలా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని ఖచ్చితంగా చెప్పే కథ. బాట వేయాల్సిన వాడే దారి తప్పితే రాష్ట్ర రాజకీయ పరిస్థితి, దాన్ని బాగుపర్చాల్సిన యువత ఎముకలు కుళ్ళిన వయసు మళ్ళిన వారీగా ఉంటే ఆ రాష్ట్ర స్థితి చెప్పే కథ 'ఇంతకీ సింగపూర్ అంటే?.' పెద్ద వాళ్ళకి సమయం ఉండి పిల్లలను జాగ్రత్తగా గమనిస్తే అమాయకంగా, వాళ్ళంత నిష్కల్మషంగా ప్రేమించే వారు ఉండరని చెప్పే కథ 'బాల్యం శివం సుందరం.'

నిర్ణయం కథలో ''ఇంకా ఇక్కడే ఉండి తన ఆత్మాభిమానం పూర్తిగా కోల్పోవాలా? దానివల్ల ఫలితం ఏంటి?" అపురూప జన్మ కథలో "ఏంటి నీ ఉద్దేశం. నువ్వేదో తెగ కష్టపడుతున్నట్లు? తిని ఇంట్లో పనులు చేసుకోవడం కూడా కష్టంగా ఉన్నట్లుందే", రాగసంధ్యా కథలో "రచయిత్రిగా ఎన్నో పాత్రలను అర్థంచేసుకున్న నేను నిజ జీవితంలో మనుషులను అర్థం చేసుకోలేకపోయాను.", అంతర్మథనం కథలో "శరీరానికి హాయిగా ఉన్నా మనసులో మాత్రం తాను చెప్పిన అబద్దం ముల్లులా గుచ్చుకుంటుంది." బెన్నీ కథలో "నేను ఆదాయాన్ని బట్టీ ఖర్చు చేయాలను కుంటాను. కానీ, ఖర్చు కోసం ఆదాయాన్ని పెంచు కోవాలనుకోను." వంటి వాక్యాలు భారతిగారి కథా రచనా నైపుణ్యం గురించి చెప్పడానికి సాక్ష్యాలు. ఆ వాక్యాలు మళ్ళీ మళ్ళీ ఆ కథలు చదివేలా ప్రేరేపిస్తాయి.

భారతి గారి క్యాబిన్లో ఎప్పుడూ టామరిండ్ చాకోలెట్స్ ఉంటాయి. వారి దగ్గరికి వెళ్లిన ప్రతిసారి వాటిని తెచ్చు కోవడం (ఇవ్వడం మర్చిపోతే అడిగి మరీ) అలవాటు నాకు. అవి ఓ రకమైన తీపి, పులుపు, ఒగరు, కారం, ఉప్పుప్పగా వినూత్నంగా ఉంటాయి. అచ్చం ఇట్లనే భారతిగారు కూడా భిన్న అభిప్రాయాలను కలిగి ఉంటారు. అవి వారి కథల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. సమాజంలోని చలనానికి రచయిత ఎలా స్పందిస్తాడో అదే కోణంలో తరువాతి తరం చూస్తుంది. ఈ కథలన్నిటిలోనూ ఆడదే కథా వస్తువు. కంపు దేహాలను ఇంపు చేసే అత్తరు సీసాలు, అమ్ముకునే వస్తువులన్నీ మగవారివే కదా. ఆడదాన్ని అర్ధనగ్నంగా టీవీ తెర మీద ఆరేయకపోతే ఎవరూ కొనరేమో. ఇలా అందాల ఆడబొమ్మ అని అంగట్లో సరుకును చేయడం మూలంగానేమో ఆడది చులకనైపోయి బజారులో పడతిని రోత కూతలు కూయడం, కట్నం కోసం కాటికాపటం, కడుపున పుట్టిన ఆడబిడల్ని చెత్తకుప్పల పాల్జేయడం జరుగుతుంది. భారతిగారు సమస్య ప్రాముఖ్యతని ఏ కథలోను తగ్గించలేదు. సమస్యను పాఠకుడికి అర్థమయ్యే స్థాయికి దింపి రాయడంలో వారి ప్రతిభ కనబడుతుంది. ఇలా రాసిన అన్ని కథల్లోనూ ఏదో ఒక మానవీయ కోణాన్ని నిక్షిప్తం చేయడం అందరు రచయితలకు సాధ్యం అయ్యే పని కాదు. పై కథల్లో ఎక్కడా రచయిత కనపడరు. నీతి వాక్యాలుండవు. ఎక్కడికక్కడ పాఠకుడి హృదయానికి చిల్లులు పడిపోతూ వుంటాయి. ఇలాంటి కథలకు మరణముండదు. వాటిని సృజించిన కథకులు సైతం అజరామరులే. ఎంతో తపస్సు చేస్తే తప్ప అలా కథ రాయడం కుదరదు. అలాంటి కథలే చదువరులను వేటాడుతాయి. ఓ పట్టాన వదలవు. ఈ కథలు ఎప్పుడు జ్ఞాపకమొచ్చినా మనసు మ్లానవుతుంది. ఇది కథకులుగా భారతి గారి విజయం.

రిఫెరెన్సు

1. ఫ్రీజర్ కథలు – తుమ్మపూడి భారతి – ప్రచురణ 2018 – ముద్రణ సోనా గ్రాఫిక్స్
2. కథకు శతమానం(కథానిక సాహిత్య వ్యాసాలు)– సంపాదకుడు జి. గిరిజామనోహర బాబు మొదటి ముద్రణ 2012– ముద్రణ దీప్తి ప్రింటర్స్ – అన్నమయ్య గ్రంధాలయం – అకౌంట్ నెంబర్ 18260.

తెలంగాణ వీరోచిత కథ 'గొల్లరామవ్వ'

వి. రాజేశ్వరి, జూనియర్ లెక్చరర్, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజి, జహీరాబాద్. 94911 24711

పి.వి.నరసింహారావు సాహిత్య పిపాసకుడు, రచయిత, అంతకుమించి బహుభాషావేత్త. పదిహేడు భాషలలో అనర్గళంగా మాట్లాడగలవ్యక్తి. అంతేకాదు కొన్ని భాషలల్లో సాహిత్యాన్ని సృష్టించాడు.

మాతృ భాషలను మరిచి ఇతర భాషలను నేర్చు కుంటున్నవారికి, పి.వి. ఠీవిగా కనిపిస్తాడు. ఒక భాషను నేర్చుకోవాలంటే మాతృభాషను మర్చిపోవాలనుకునే వర్తమాన కాలానికి ఆయనను ఉదహరించవచ్చు. ఆసక్తి, అంకితభావం ఉన్నవారు ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చు. ఇది మనకు నేర్పిన వ్యక్తి పి.వి. తన ప్రేమను తన మాతృమూర్తిపై ఎంతగా చూపించాడో తన ప్రేమను తన మాతృభాషపై అంతే చూపించాడు.

ఆయన ఒక నాణెం వంటివాడు. నాణెంకు ఒకవైపు బొరుసు మరోవైపు బొమ్మ ఉన్నట్టు ఆయన ఒకవైపు అపార రాజకీయ ప్రాజ్ఞుడు. మరోవైపు సాహిత్యకారుడు.

విశ్వనాథ సత్యనారాయణ రాసిన 'వేయిపడగలు' నవలను 'సహస్రఫణ్' పేరుతో హిందీలోకి అనువదించారు. దీనిని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం వచ్చింది.

'పన్ లక్షత్ కోన్ ఘతో' అనే మారాఠీ రచనను 'అబల జీవితం' గా తెలుగులో అనువాదం చేసారు. 'ఇన్‌సైడర్' ఆయన రచించిన ఆత్మకథ. ఇది తెలుగులో 'లోపలిమనిషి' గా అనువాదం అయ్యింది.

స్త్రీవాదరచయిత్రి జయప్రభ కవిత్వాన్ని ఆంగ్లంలోకి అనువాదం చేసాడు. అనేక సాహిత్య వ్యాసాలు రాసాడు.

ఆనాటి తెలంగాణప్రాంత స్థితిగతులను తెలియజేసే రచన 'గొల్ల రామవ్వ'. ఇది కథ. విజయకలంపేరుతో 1949 15 ఆగస్టున కాకతీయ పత్రికలో ముద్రించబడింది. ఈ కథ 'గొల్లరామవ్వ' అనే వృద్ధురాలు ప్రదర్శించిన తీరు అసాధారణ ప్రతిభను తెలంగాణ మాండలికంలో పి.వి. నరసింహారావు రచించాడు. తెలంగాణ కథా రచయితలకు తీసిపోని విధంగా వర్ణనలతో... చక్కని సన్నివేశాలతో కథను రక్తికట్టించాడు. ఒక మనిషిలో వచ్చే వివిధ హావభావాలను (Variations) రామవ్వ పాత్రలో చూపిస్తాడు.

కథా రచయితగా తన కథా కథన పద్ధతిని సంపూర్ణంగా పోషించాడు. పి.వి. కథలోకి వెళ్తే...

గొల్ల రామవ్వకథ నైజాం కాలం నాటి స్థితి గతులను వివరిస్తుంది. ఖాసీం రజ్వీ ఆధ్వర్యంలో నడుస్తున్న 'రాజాకార్లు' హైదరాబాద్ రాష్ట్రంలోని గ్రామాలలో విరుచుకుపడి వారికి ఎదురుతిరిగిన కమ్యూనిస్టు కార్యకర్తలను, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను, పౌరులను హింసించేవారు ప్రాణాలు తీసేవారు.

పటేళ్లు, పట్వారీలు, దేశముఖ్‌లు, దొరలు నిజాం ప్రభుత్వానికి విధేయులుగా ఉండి... ప్రజల జీవితాలతో చెలగాటాలు ఆడేవారు....

కులాల పరంగా, వృత్తుల ఆధారంగా వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేసేవారిని, అలాగే వారికి వ్యతిరేకంగా, లేదా వారిని ఎదురించిన వారిని ప్రభుత్వ వ్యతిరేకులుగా భావించి... ప్రభుత్వం దృష్టిలో పౌరులని నిషేధిత వ్యక్తులుగా ప్రకటించేవారు. రజాకార్లు ఉ ద్యమకారులను గుర్తించి దాడులు చేసేవారు. ఎదురు తిరిగితే ఏమాత్రం ఆలోచించకుండా చంపేవారు.

పౌరులు ఒకవైపు రజాకార్లను, మరోవైపు పోలీసులను ఎదుర్కోవాల్సి వచ్చేది... ఏడవ నిజాం మీరు ఉస్మాన్ అలీఖాన్ మతాహంకారాన్ని, అతని 'మత' పిచ్చిని ఎదుర్కొని హైదరాబాద్ రాష్ట్రంలో స్వేచ్ఛా, స్వాతంత్ర్యాన్ని నిర్మించడానికి అన్ని వర్గాల ప్రజలు పోరాటం చేసేవారు.

ప్రజలను చైతన్యం చేస్తూ ప్రజారాజ్యాన్ని నిర్మించాలన్న కార్యకర్తల సంకల్పం ఎంత బలంగా ఉందో, వారిని అనచడానికి రజాకార్లు, పోలీసులు అంతే స్థాయిలో పనిచేస్తున్నారు. గ్రామ గ్రామాన్ని జల్లెడపడుతూ కార్యకర్తలను తుపాకీ గుళ్లకు బలిచేస్తున్నారు. కార్యకర్తలు వారిని ఎదుర్కొంటూ వీరమరణం చెందుతున్నారు.

మాతృభూమి స్వేచ్ఛకోసం పోరాటం చేస్తున్న ఒక కార్యకర్తకు ఆశ్రయం ఇచ్చి పోలీసులనుంచి అతన్ని రక్షించిన ఒక వృద్ధురాలి వీరోచిత ప్రదర్శననే 'గొల్ల రామవ్వకథ'.

రామవ్వ గొల్లకులస్తురాలు. అందుకే 'గొల్ల రామవ్వ' ను కథకు శీర్షికగా ఎంచుకున్నారు రచయిత. అవ్వ ఉండేది పూరి గుడిసె అయినా అది కొంచెం ఇల్లులా ఉంటుంది. దానికి ఒక 'కిటికీ'లా ఉండే చిన్న తలుపుల ద్వారం ఉంటుంది. అలాగే ఇంట్లోకి వెళ్ళడానికి రావడానికి రెండు తలుపుల ద్వారం ఉంటుంది.

ఇంతకుముందు చెప్పినట్టు రజాకార్లు, పోలీసులు ఒకవైపు. కార్యకర్తలు ఒకవైపు మొత్తం యుద్ధవాతావరణంలో తెలంగాణా పల్లెలు మునిగి ఉన్నాయి.

అలాంటి ఒక గ్రామంలో 'గొల్ల రామవ్వ' తన మనుమరాలు ముల్వవ్వతో కలిసి ఉంటుంది.

మనుమరాలు పదిహేను సంవత్సరాల యువతి రామవ్వకు భయం. ఏ రజాకారో, పోలీసో వచ్చి మల్లవ్వను చూస్తే పాడు చేస్తాడేమోననీ, ప్రాణం తీస్తారేమోనని కూడా ఉంటుంది... భయం గుప్పెట్లో రామవ్వ... మనుమరాలు మల్లవ్వను తలదాచుకుని నిద్రిస్తుంటుంది... బయట తుపాకుల శబ్దం...కాంగ్రెస్ కార్యకర్తలకోసం, పౌరుల కోసం గాలింపు జరుగుతుంది... ప్రతి ఇంటిని కూడా గాలిస్తుంటారు పోలీసులు... సరిగ్గా దాదాపు మధ్యరాత్రి రామవ్వగుడిసె కిటికీలోంచి అతికష్టంగా ఒక వ్యక్తి గుడిసెలోకి వచ్చి కూర్చుంటాడు.

'రామవ్వకు అర్థం అయ్యింది ఎవరో గుడిసెలోకి వచ్చారని'.... అప్పుడు ఆమె చీకటిలోనే లోపలి తలుపు గొళ్లెం తీస్తూ ఎవర్రా అంటుంది.

ఆమెకు భయం ప్రారంభమైంది. ఇంకేముంది తనకు చావు తప్పదు – 'తానల్లారుముద్దుగా పెంచి, పెండ్లి చేసిన తన మనుమరాలికి మానభంగం తప్పదు'... అనుకుంటుంది. వచ్చినవాళ్లకు... ఇంట్లో మాత్రం పడుచు పిల్లలు లేరా? అంత పెద్ద కరణం కూతురిని బలత్కారం చేసి ఎత్తుకుపోయినపుడు ఎవరు ఏం చేయగలిగారు? ఎవరడ్డం వచ్చారు? ఇప్పుడు తనకుమాత్రం ఎవరు దిక్కవుతారు?...అనుకుంటూ బలహీనురాలవుతుంది రామవ్వ.

కిటికీలోవటినుంచి వచ్చినతుడు ఇంట్లోకి అడుగులేస్తాడు. రామవ్వకు ఏదో జరగబోతుందన్న వ్యాకులత కలిగింది. ఆ నిశ్శబ్దం నుంచి 'చప్పుడు చేయకు నేను దొంగను కాను, రజాకారున్ని కాను, పోలీసును కాను. మిమ్మల్నేమీ అనను. లొల్లి మాత్రం చేయకండి....' అనే మాటలు వినబడతాయి. కానీ! ఆ మాటలు రామవ్వకు నమ్మకాన్ని కలిగించవు. పైగా ఆమె ఇలా అనుకుంటుంది. 'అబ్బా! ఏమిటి టక్కరీ నమ్మించి గొంతుకోయడానికి చూస్తున్నట్టున్నాడు' తీయని మాటలతోనే సంతోష పెట్టి పాపం మల్లిని అనుకుంటుంది.

ఇద్దరు ఆడవాళ్లే ఇంట్లో ఉండటం వల్లే– ఆమెలో మరింత బలహీనమైన ఆలోచనలు కలుగుతాయి. ఆమెలో ఆలోచనలు రావడానికి తనకళ్ళముందు ఎంతమంది ఆడపిల్లల మానప్రాణాలు ఆ రజాకార్ల, పోలీసుల చేతిలో పోయాయి. వాటి స్ఫురణలు...తన మనమరాలు మల్లవ్వకు జరిగేలా ఉన్నాయన్నది ఆమె మస్తిష్కంలో వెలుగడానికి కారణం... అంటే 'గతం వర్తమాన ప్రమాదానికి సంకేతంగా' ఆమె భావిస్తుంది.

కాలప్రవాహంలో జరిగిన ఆ దమనకాండలు ఆమెను

భయం వైపు నెట్టుతున్నాయి. అంతేకాదు, ఆమె ఆ సమయంలో ఎవరినీ నమ్మేలా కూడా ఉండదు. చీకటిలోనే ఆ వ్యక్తి రెండు కాళ్ళు దొరికించుకొని " నీ బాంచెన్! చెప్పులు యెత్తి నా తలకాయైనా తీసుకో, పోరిని మాత్రం ముట్కోకు. అది నీ చెల్లెలనుకో...నీ కాళ్లు మొక్కుత" అనే మాటలు కూడా అనేస్తుంది...

ఇంట్లోకి ప్రవేసించినవాడు రజాకారు కాదు, పోలీసు కాదు, 'లేదవ్వా! నమ్మవేం చెప్పుతుంటే! నేను దుష్టున్నిగాను, నేను మీ అందరి వంటి తెలుగోణ్ణే!' రామవ్వలో ధైర్యం నిండింది. ఎందుకంటే ఆగంతకుడు మాట్లాడింది అచ్చ తెలుగు భాష కనుక. భయంలేదు. రజాకార్లు, తురకలు, పోలీసులు, తలారులు ఇలా తెలుగు మాట్లాడరు... భాషతో పోల్చుకొని ..... ఆత్మవిశ్వాసాన్ని నింపుకుంది. చావు, మానభంగం తప్పినవి అనుకుంది.

కూర్చున్న ముసలవ్వ ఇంతకు ముందే అతని కాళ్లు పట్టుకుంది. కనుక ఆమె తన చేతులతో అతని శరీరాన్ని స్పృశించింది. శరీరం నిండా మురికి పల్లెర్ల గడ్డిపోచలు గాయాలు రక్తముద్దలు, రేగిముండ్లు ఉన్నాయి. క్షణాల ముందు భయంగా వణికిపోయిన రామవ్వ... అతన్ని పోల్చుకోగానే తనకు కావలసినవాడిలాగే ఇదేం గతిరా నీకు? గిట్లెందుకయినవు కొడుక? అని ప్రశ్నిస్తుంది....

వచ్చినవాన్ని పోల్చుకోకపోవడానికి కారణం చీకటి ఒకటైతే రెండవది, రజాకార్లు, పోలీసులు గాలింపు... అతనెవరో తెలిసాక అతన్ని మంచివాడిగా భావించడం రామవ్వలో ఉన్న మానవత్వాన్ని తెలియజేస్తుంది.... బహుశా అప్పుడే ఆమె అనుకుంటుంది అతన్ని కాపాడాలని. అతను కాంగ్రెస్ పార్టీ కార్యకర్త. కేవలం నిక్కరులో ఉన్నాడు శరీరంపై అంగీలేదు. పోలిసులనుంచి, రజాకార్ల నుంచి తప్పించుకుని రామవ్వ గుడిసెలోకి వచ్చాడు.

కొద్దిసేపు తల దాచనివ్వు అవ్వా! తర్వాత నాదారిన నేను పోతాలే? అంటాడతను. కానీ పరిస్థితినంతా అర్థం చేసుకున్నామె అతని దీనతను చూసి ఆ! మా పోతా మా పోతా, ఒకటే పోకడ ! చక్కంగ స్వర్గమే పోతా. మంచి బుద్ధిమంతుడైషా! హు! పోతాడట యాడికో! అంటూ వ్యంగ్యంగా మాట్లాడుతుంది. అతడిని రక్షించాలన్న ప్రయత్నంతోనే ఆ మాటలు అన్నది రామవ్వ. అతనికి నోట మాటరాలేదు. పైగా భయం పోయింది. రక్షణలో ఉన్నట్టుగానే అతడు భావించాడు.

మల్లవ్వను దీపం ముట్టించమనగానే అతడు వద్దంటాడు. ఎందుకంటే వెలుతురుకు ఇంట్లో ఉన్నవారు కనిపిస్తారు. కనుక వద్దంటాడు. కాని రామవ్వ అతనికి ధైర్యం చెబుతుంది.. 'మల్లవ్వ' దీపం వెలిగిస్తుంది. ఆ దీపం వెలుతురులో ఆ కార్యకర్త ఆకృతిని చూసిన 'రామవ్వ' రాజోలిగె ఉన్నవు కొడుకా! నీకెందు కొచ్చెరా ఈ కట్టం? .... అనుకుంటూ గొంగట్ల పడుకోమంటుంది. మల్లవ్వ అతని శరీరంపై ఉన్న ముల్లును తీసేయమంటుంది. ఆ పదిహేను సంవత్సరాల మల్లవ్వ పెళ్లైనయువతి... సహజంగానే పరాయి వ్యక్తి గనుక వెనకాముందాడుతుంది.

నీ సిగ్గు అగ్గిలబడ! వాని పానం దీత్తవాయేం సిగ్గనుకుంట? ఊ! చెయ్యి చెప్పిన పని! పాపం పీనుగోలె పడున్నడ గాదె! వాన్ని జూత్తె జాలి పుడుతలేదె నీకు దొమ్మర ముండా? ఆ! గట్ల ! నొప్పిచ్చకు పాపం!...

సొంత మనుమరాలిని దూషిస్తూ అతనిపై ఎంత ప్రేమను చూపిస్తుందో రామవ్వ ఒకరకంగా అతని విషయంలో అభిమానం చూపిస్తు అతనికి సహాయం చేయడానికి సిగ్గుపడుతున్న మనుమరాలు మల్లవ్వను కఠినంగా దూషించింది. నిజానికి మల్లవ్వ అతని ప్రాణం తీస్తుందా! లేదు కాని అతనికి సహాయం చేయాలన్న రామవ్వ తపన వ్యక్తం అవుతుంది... కోపంగా మాట్లాడటం, హాస్యాన్ని ఒలికించడం గొల్ల రామవ్వ మూర్తిమత్వాన్ని దృశ్యమానం చేస్తుంది. ఆ యువకుడి శరీరాన్ని వేడినీళ్లతో శుభ్రం చేసి, అతనికి తినడానికి గటుక పెట్టింది. తల్లిలా అతని శరీరాన్ని

నిమురుతున్నప్పుడు అతని జేబులో తపాకి కనిపిస్తుంది... ఎందుక్కొడుకో! మమ్ముల గట్ల చంపుదామనుకున్నావా యేంది? అంటుంది రామవ్వ... లేదవ్వా మిమ్మల్ని చంపేవాళ్లను, చంపే అందుకని అంటాడు. మూడు రోజులక్రితం గ్రామంలో నలుగురు నిర్దోషులను పోలీసులు చంపినందుకు ప్రతీకారంగా ఇద్దరు పోలీసులను చంపాడు ఆ కార్యకర్త. ఆ మాటలు విన్న రామవ్వలో తెలియని ఆనందోత్సాహం, విజయోత్సాహం కల్గింది.

కళ్ల ముందు జరుగుతున్న అకృత్యాలకు చరమగీతం పాడాలన్న నీలాంటి యువ కార్యకర్తలు కావాలన్న ఆశ ఆమెలో చేరి ఉంటుంది. అతన్ని చూస్తూ... ఆమె ఇద్దర్నా?...కాని ఇంకిద్దరు మిగిలిన్రు కొడుకా! సగం పనే చేసినవు... అంటుంది. ఆ మాటలో వ్యంగం ఉంది. కసి ఉంది. ఆ మాటలకు ఆశ్చర్యపోతూ ఆ కార్యకర్త తక్కినవాళ్లను కూడా చూచుకొస్తాలే అవ్వా! అనేశాడు.

కానీ రామవ్వ వారిస్తుంది. పోలీసోళ్ళతో వైరం ఎందుకు?...పేదోళ్లు కొట్లాడితేమైతది? అంటుంది... అలా మాటల్లోనే అమె తల్లిప్రేమను చూపించింది... తల నిమురుతూ ధీర్ఘాలోచనలోకి వెళ్లింది.

అబ్బ! ఏం పోరడు! ఇసోంటోల్లెంత మంది చావాలో ఇంక! అనుకుంటూ కండ్లల్ల వత్తులు పెట్టుకుని కూర్చుంది.

గ్రామం అంతా గాఢ నిద్రలో ఉంది... ఆ కార్యకర్త మల్లవ్వ దగ్గరే పడుకున్నాడు. బయట పోలీసుల చేతికి ఎవరో చిక్కారు. అతన్ని వారు చితక్కొడుతున్నరు. అరుపులు, కేకలు వినిపిస్తున్నాయి. రామవ్వకు కంగారు మొదలయ్యింది. ఆ కార్యకర్త లేచి కూర్చున్నాడు. తుపాకీ తీసుకుని తూటాలు నింపుకున్నడు. కార్యసిద్ధుడైనాడు. రామవ్వ చేయిపట్టుకుని వారిచింది.

నా వల్ల మీకు ప్రమాదం... సోదా చేస్తారు. నేను వెల్తాను అంటాడు. బూట్ల చప్పుడు వినిపిస్తుంది. గుడిసె ముందు నిల్చున్నారు పోలీసులు.

ఆ కార్య కర్త తలుపులు తీయబోయాడు. వెంటనే రామవ్వ అతన్ని వెనకకి నెట్టింది. తుపాకి తీసుకుంది. దీపాన్ని ఆర్పేసింది. క్షణాల్లో రామవ్వ తెలివికి బీజం పడింది. ఆ కార్యకర్తను గొల్లోల్ల పిల్లవానిలా వేషం మార్చింది.. అతని నిక్కరు తీసి దాచింది. అచ్చం ఎర్ర గొల్లోని లాగే ఉన్నవు అని మురిసిపోయింది.

బయట నుంచి రామీ! ఓ గొల్ల రామీ ! తల్పూకీ కోల్.. అనే మాటలు. వెంటనే అతన్ని మంచంమీద పడుకోమంది. ఆ మంచం మీద మల్లవ్వ కూడా ఉంది. అపుడే నిద్రనుంచి లేచినట్టుగా 'ఎవర్రా పెద్ద దొంగనాత్తి రొచ్చి తలుపు కొడ్తాన్రు? దొంగముండ కొడుకులున్నట్లున్నరు! మీ ఇల్లు పాడుబడ! పెద్దగా అరుస్తూనే ఉంది.... నన్నేం దోచుకుంటర్రా ? ముసలి ముండ దగ్గరేముంటది? అంటూ అరుస్తూనే మనుమరాలు మల్లవ్వను కార్యకర్త దగ్గర పడుకోమంటుంది. ఇక్కడ రామవ్వ తన చతురతను ఉపయోగించింది. పైన చెయ్యేసి పడుకో ఎవ్వరికి అనుమానం రాదు అంటుంది. మల్లవ్వ చెప్పినట్లు చేసింది. రామవ్వ అరుపులు ఎక్కువ చేసింది. "ఈ పోర్ని నా నెత్తిన పడేశిన్రు! దెబ్బగొడితె రద్దీ! కొట్టకుంటె బుద్ది రాదు. ఎక్కడి పీడ తెచ్చిపెడితివిరా నా పానానికి! యాడున్నవో కొడుకా! నా కొడకా!" ముసలి ముండను అంటూ బయటవాళ్ళకు వినబడేలా పెద్దపెద్ద రాగం దీసుకుంటూ ఏడువసాగింది...

అరుపులు బయటకు వినిపిస్తున్నయి. వారిలో కొందరు ముసల్ది నాటకం ఆడుతుందని, మరికొందరు జాలిపడటం చేసారు. గొల్ల రామవ్వ మాత్రం నీటిలో లీనం అయ్యింది. బయట పోలీసులు 'తోడ్ దేవోరే దర్వాజా' అంటుండగానే రామవ్వ తలుపు తీసింది....

పోలీసులు ఒకరి మీద ఒకరు తోసుకుంటూ గుడిసెలోకి ప్రవేశించారు. రామవ్వ పెద్ద కేకలు వేస్తూ అరిచింది. "చంపితిర్రా నీ దొడలు బడ ముసల్దాన్ని పానం తీత్తిర్రా! అంటూ ఏడుస్తూనే ఉంది"..... ఏం జరుగుతుందో

వచ్చిన పోలీసులకు మాత్రం అర్థం కాలేదు. ఈడనేనున్న గురుగులంటన్నయి. తల్లె ముంతలున్నయి. పోరియెడల గంటె వుర్రెలున్నయి. పోరగానికి రెండు దండ కడియాలున్నయి. ఇంకేగావాల్నో తీసుకోండి. చంపాలంటే చంపుండి....

పోరన్ని చంపండి. పోరి ముండ యనక ముందు దాన్ని గూడ తుపాకి నెయ్యండి. ఇద్దర్నోసారి చంపుండి. 'అంటుండగానే మల్లవ్వ కండ్లు తుడుచుకుంటా మంచం దిగింది.' 'కార్యకర్త ఆవలిస్తూ మంచం మీదనే కూర్చున్నాడు.' 'అక్కడేం జరుగుతుందో పోలీసులకు ఏమీ అర్థం కాలేదు.' ఒకరి ముఖాలు ఒకరు చూస్తు కూర్చున్నారు.

రామవ్వ మాత్రం తను చేయాల్సిన పని చేస్తూనే ఉంది... అలాగే ఏడుస్తూ అరుస్తూనే ఉంది. అంతలో పోలీసు కార్యకర్తవైపు చూస్తూ వాడు వాడెవడు చెప్పు కాంగ్రెసోడా యేం?

రామవ్వ మాత్రం గట్టిగా అరుస్తూనే ఉంది. ఆ అరుపుల నుండి వాడెవ్వాడా? ఎవ్వడు పడితె వాడు మా పక్కల్ల పండుకోవడానికి మేమేం బోగమోళ్ళ మనుకున్నావా? నిన్నెవ్వడన్న గట్లనే అడుగుతే ఎట్లుంటది?

మాటల్తోని మానం దీనుడెందుకు? పానం తియ్యరాదుండి?... అంటూ నోటికొచ్చిన మాటలు అంటునే ఉంది రామవ్వ....

బైటోడు గొల్లరామి గుడిసెలకొచ్చి ఎట్ల తప్పించు కుంటాడు? పానంతో పట్టుకొచ్చి అప్పచెప్పనయ్య గొల్లరామెసోంటిదో ఊరోళ్ళ నడుగండి.....

ఆమె మాటలకు బిత్తరపోయిన పోలీసులకు ఏం జేయాల్నో తోచలేదు. కొద్దిసేపు ఆలోచించి 'అచ్చ నేను పంచనామ చేసుకొని వస్తా' అంటూ పోలీసు జమదారు ఇతరులు వెళ్తారు.

ఆమె ప్రదర్శించినతీరు, ఆ సాహసం దానికి మించిన తెలివి, అంతా కలగలసి ఓ కార్యకర్త ప్రాణాన్ని కాపాడింది .... గొల్ల రామవ్వ బాధ్యతతో చేసిన పనిలా కనిపిస్తుంది. ఆ కార్యకర్త రామవ్వ చతురతను చూసి " అవ్వా నీవు సామాన్యురాలు కావు. సాక్షాత్ భారత మాతవే' అన్నాడు. రామవ్వ నవ్వుతూ కొంటె పోరడా! నాకే పేర్లు పెడుతున్నవా... నా పేరు గొల్ల రామవ్వ అంతే.... ఇగనువ్వెల్లు... మల్లిని అత్తారింటికి తోల్కపోత... పొద్దెక్కుతుంది.... అంటుంది. ఆమె భావన అర్థం చేసుకున్న కార్యకర్త వెళ్లిపోతాడు.

రాత్రంతా నిద్ర లేకుండా ఆ కార్యకర్తకు సేవజేస్తూ ... భయం గుప్పెట్లో సాహసంగా 'రామవ్వ తెలివితేటలు ప్రదర్శించడం చాలా గొప్ప విషయం. ఆమె ఆ సమయంలో ప్రదర్శించింది అసాధారణ ప్రతిభనే...

తెలంగాణ సాహిత్యంలో కథాప్రక్రియ విలక్షణమైంది. వందలాదిమంది రచయితలు కతలు, కథానికలు రాస్తూ తెలంగాణప్రాంత 'అస్తిత్వాన్ని' ప్రపంచానికి చాటి చెప్పారు. ఫ్యూడల్వ్యవస్థలో ప్రజలు పడుతున్న బాధలకు, అవస్థలకు దృశ్యమానం చేసారు. ఆనాడు సమాజంలో వెట్టిచాకిరీ, బానిసత్వం ప్రజలకు నరకకూపంలా ఉండేవి.

నిజాం ప్రభుత్వానికి, రజాకార్ వ్యవస్థలకు ఎదురు నిలబడ్డ కమ్యూనిస్టులు, కాంగ్రెస్ కార్యకర్తలు వీరోచితంగా పోరాటాలు చేసారు. పి.వి. రచయితగా తాను తీర్చిన 'గొల్లరామవ్వ' కథ వాస్తవికమైన 'వీరోచిత' మహిళా ప్రదర్శనకు 'మచ్చుతునక'.

ఆధార గ్రంథాలు:

1. తెలంగాణ కథలు – విశాలాంధ్ర ప్రచురణలు, హైదరాబాద్
2. తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర – తెలుగు అకాడమి, హైదరాబాద్
3. అస్తిత్వ – ప్రాతినిధ్య తెలంగాణ కథలు – తెలంగాణ సాహిత్య అకాడమి, హైదరాబాద్

రాళ్ళపల్లివారి "తారాదేవి" ఖండకావ్యం- ఒక పరిశీలన

కె. సంగాలు, పరిశోధక విద్యార్థి , తెలుగు మరియు తులనాత్మక సాహిత్యశాఖ, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం. సెల్ నెం: 91606 51415

ఒక రంగంలో కృషిచేయడం చాలా కష్టం. అలాంటిది రెండు సాగరాల వంటి సాహిత్య, సంగీతాలలో నిరుపమాన మైన కృషిచేసిన బహుముఖీనత కలిగిన వ్యక్తిత్వం, సంస్కృత, ప్రాకృత, కన్నడ భాషలలో అసాధారణ పాండిత్యం రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మవారి సొంతం. రాళ్ళపల్లివారు ఒక విమర్శకుడిగా, గ్రంథ పరిష్కర్తగా, అన్నమాచార్యుల కీర్తనలు స్వరపరిచిన సంగీత విద్వాంసునిగా తెలుగు కళారంగస్థలం మీద వారి పాత్ర ప్రత్యేకమైనది, విలక్షణమైంది.

రాళ్ళపల్లి జీవతరేఖలు :

"రాళ్ళపల్లిలోన రాళ్ళెన్నో పుట్టెను
రాల్లలోన వజ్రాలు పుట్టె
వజ్రాలలోన వలపెట్లు పుట్టెరా
కీర్తినీయ చరిత! కృష్ణశర్మ"

అంటూ చిలుకూరు నారాయణరావుగారు శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి గురించి ఉద్దేశించిన సందేశమిది.

"ఆధునిక యుగంలో జీవిస్తూ, ఆధునిక జీవన విధానానికి, ఆధునిక సాహితీ రీతులకు ఇష్టపడక పోవడమంటే ఆధునిక యుగంలో జీవించే హక్కుని కోల్పోవడం. ఏ యుగంలో సాహితీ స్రష్టలు ఆ యుగ ధర్మాన్ని అనుసరించకపోతే ఆ యుగంలో జీవించడానికి తగరు" అని తుమ్మపూడి నంజీవ్‌దేవ్ మాటలు అనంత కృష్ణశర్మగారికి వర్తిస్తాయి.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు 1893 జనవరి 23వ తేదిన అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గం తాలూకా, కంబదూరు మండల కేంద్రానికి 15 కి.మీ. దూరంలోని రాళ్ళపల్లి గ్రామంలో ఉదయించారు. వీరి తండ్రి కర్నమడకల కృష్ణమాచార్యులు. తల్లి అలివేలుమంగమ్మ. వీరు కర్నూలు జిల్లాలోని కర్నమడకల గ్రామానికి తమిళనాడు నుండి వలస వచ్చారు. వీరి తల్లి అలివేలుమంగమ్మగారిది రాళ్ళపల్లి గ్రామం. అలివేలుమంగమ్మకు చిన్నవయసులోనే తండ్రి లేనందువల్ల కర్నమడకల కృష్ణమాచార్యులు అలివేలుమంగమ్మను వివాహం చేసుకొని, ఇక్కడే స్థిరపడ్డారు. ఈ విధంగా రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారికి అటు తండ్రినుంచి, ఇటు తల్లి నుండి దాదాపు 2700 ఎకరాల భూమి సంక్రమించింది. అయితే కరువులకు ప్రసిద్ధిగాంచిన అనంతపురం జిల్లాలో ఎన్నివేల ఎకరాలు ఉన్నప్పటికీ, ఫలితం లేదు. చినుకు చుక్కలకు మొఖంవాచి ఆకాశం వైపు ఆశగా చూసే పొలాలకు అనంతపురం ప్రసిద్ధి.

రాళ్ళపల్లి వారి కుటుంబ నేపథ్యం:

కర్నమడకల కృష్ణమాచార్యులది చాలా పెద్ద సంసారం. వీరికి 15 మంది సంతానం. అందులో ఏడుమంది బాల్యంలోనే కాలధర్మం చెందారు. వీరిలో 6 మంది కొడుకులు, ఇద్దరు కూతుర్లు మాత్రం మిగిలారు. వీరిలో కర్నమడకల గోపాలకృష్ణమాచార్యులు మంచి జ్యోతిష్య శాస్త్రవేత్త. రెండవ వారు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ. రామాచార్యులు, కృష్ణమాచార్యులు, యాదగిరమ్మ, సుభద్రమ్మ వంటి వారున్నారు.

రాళ్ళపల్లివారి సాహిత్యసేవ :

అనంతకృష్ణశర్మగారు 13 సం॥ల వయసు దాకా తన తండ్రిగారి వద్ద సంస్కృతాంధ్ర భాషల్ని అభ్యసించారు. గ్రామంలో సరైన వసతులు లేకపోవడంతో మైసూరుకు విద్యార్జనకు పంపారు. అక్కడ అనేక భాషల్లో విద్యాభ్యాసం

చేసి, పాండిత్యాన్ని పొందారు. ఇతర భాషల నుంచి తెలుగులోకి అనువాదం చేయడం, వివిధ భాషల్లోని రచనల్లో విమర్శనాత్మకంగా పరిశీలించి, వ్యాఖ్యానించడం ద్వారా ఆయన కీర్తి ఇనుమడించింది. రాళ్ళపల్లివారు తారాదేవి, మీరాబాయి (ఖండకావ్యాలు), లీలాదేవి (అనువాద నవల), భార్గవీ పంచ వింశతీ (28 పద్యాలు), వేమన, సారస్వతోపన్యాసములు, సారస్వతలోకము, నాటకోపన్యాసములు (విమర్శగ్రంథాలు), శ్రీమహదాంధ్రమహాభాగవతం, శ్రీకృష్ణభూపాలీయం, తాళ్ళపాక సంకీర్తనలు (పరిష్కరణ గ్రంథాలు), శాలివాహన గాథసప్తశతి సారము, నృత్త రత్నావళి, సుందరపాండ్య విరచిత ఆర్యా (అనువాదాలు) గ్రంథాలను రాశారు.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ "తారాదేవి" ఖండకావ్యం:

రాళ్ళపల్లివారు 18 సం॥ల వయసులో ఉన్నప్పుడు 1911లో తారాదేవి ఖండకావ్యం రచించారు. ఇది కాకినాడ నుండి వెలువడుతున్న సరస్వతి మాసపత్రికలో ప్రచురణ పొందింది. తారాదేవి ఖండకావ్యం ప్రధానంగా చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు రాసిన ''రాజస్థాన్ కథావళి''ని అనుసరించి ఈ తారాదేవి ఖండకావ్యం రాశారు.

తారాదేవి ఖండకావ్యం వీరరస ప్రధానంగా 175 పద్య, గద్యాలలో చంపూరీతిలో రాశారు. ఇందులో కేవలం మూడు పాత్రలు ఉన్నాయి. హరసింగ్ (నాయకుడు), తార (నాయిక), భద్రసింగ్ (నాయిక తండ్రి), సాధారణంగా ఏ కావ్యమైనా సరే శ్రీకారంతో ప్రారంభించడం సాంప్రదాయం. అయితే ఈ ఖండకావ్యం వేట వర్ణనతో ప్రారంభమైంది.

"తారాదేవి" ఖండకావ్యం ఇతివృత్తం :

మేవాడ్ రాజకుమారుడు హరసింగ్ వేటకు వెళతాడు. అడవిలో అడవిపంది ఒకటి అతని నుండి అతని సైనికుల నుండి తప్పించుకొని పారిపోతుంది. ఆ అడవి పంది వెళ్ళి, ఒక జొన్న చేనులో దూరినదానిని హరసింగ్ సైనికులు ఎవరు కూడా దానిని వెంబడించినా చంపలేక, ఏమీ చేయలేకపోయారు. దీనిని రాజు చాలా అవమానంగా భావించి అక్కడనే ఉండిపోయారు. అంతలోనే జొన్నచేనుకు కాపలా వస్తున్న యుక్తవయస్సులో ఉన్న పల్లెపడుచు అయిన తార జొన్నదంట్లుతో కొట్టి అడవి పందిని మూర్ఛవచ్చేలా చేస్తుంది. ఆమె ధైర్యసాహసాలకు హరసింగ్ ఆశ్చర్యపడి, ఆమె వివరాలు సేకరించి భద్రసింగ్ అనే క్షత్రియకుమార్తెగా తెలుసుకొని, ఆమెను ప్రేమించి, ఎలాగైన వివాహం చేసుకోవాలనే కుతూహలంతో హరసింగ్ ఉద్యుక్తుడు కావడం ఇందులోని ప్రధాన ఇతివృత్తం.

విశ్లేషణ :

అనంతకృష్ణశర్మగారు భాష పరంగా ఈ కథని సరళ గ్రాంథికంలోనే ముందుకు సాగించారు. కథాకథనం, సంభాషణ ఆకట్టుకునేలా ఆవిష్కరించడం ఆయన ప్రత్యేకత. ఇందులో కావ్యప్రారంభంలో పద్యాన్ని చూస్తే భాషా సౌందర్యం ఏపాటిదో అర్థమవుతుంది.

''అదియదె! నూకరంబు గనులెల్లదె! వెల్పడెనీనికుంజనుల
ది దెపరునెత్తె! యింతటనె యిక్కడ నెక్కడనో యడంగెరా!
యది బెదరింపరా! కటు తరార్పటులన్ మరిలేని పారెరా!
యిదె! పురికొల్పు దుక్కల వరె! విడుతూ! తడవేల? బాణముల్"

(తారాదేవి పుట-1, పద్యం-1)

అనే పద్యంలో ఆశ్చర్యాన్ని వ్యక్తంచేసే దృష్టితో ప్రారంభించారు. ఇలా మొత్తం పద్యాలే కాకుండా అక్కడక్కడా వచనంలో కథాకథనంతటిని వచనంలో కూడా చెప్పారు.

కథ ప్రారంభంలోనే రాజు తన సైన్యాన్ని తీసుకొని అడవిపందిని వేటాడటానికి వచ్చేటప్పుడు అక్కడికి ఒక పడుచు పిల్ల వస్తుంది. ఆ సమయంలో రాజుగారికి ఆ

బాలికకు జరిగిన సంభాషణ ఈ పద్యం నిదర్శనం.

"బాలా! యెక సూకర మీ
చేలన్ పడిదూరె మాకు జిక్కక దానిన్
తోలుట కటజన మాగుఱ్ఱాలకు
దెరవున్నె? తెలుపరాదు తెలిసినన్"

(తారాదేవి పుట-3, పద్యం-19)

ఓ బాలికా! ఈ చేనులో అడవిపంది దూరింది. మాకు ఇక్కడ దారులు తెలియడం లేదు. నీకు తెలిస్తే చెప్పు అని రాజు ఆ బాలికతో సంభాషిస్తున్న సందర్భమిది. దీనికి ప్రతి స్పందనగా తారాదేవి ఇచ్చిన సమాధానం

"అనపుడు నా నెలంత యపుడాతని వల్లన జూచి
"గట్టముల్
జవనగువే! మనుష్యులకె చాల శ్రమం బటు
పోతమన్న! గా
వున సెలవైన నేనె యటు బోయి వరాహమా నిట్టు
ద్రిప్పెదన్
గనుగొనుడింక దామిచట గష్టములందగ నేల!
యింతగాన్"

(తారాదేవి పుట-3, పద్యం-20)

పై పద్యంలో తారాదేవి రాజుగారి సైనికుల్ని చూసి గుర్రాలు, మీ సైనికులు ఆ ప్రదేశానికి వెళ్ళాలంటే చాలా కష్టంతో కూడిన పని. కాబట్టి మీరు అనుమతిస్తే, నేనే అక్కడికి పోయి ఆ పందిని ఇక్కడు మళ్లిస్తాను, మీరు చూస్తూ ఉండండి, నేను ఆ పందిని ఎంత ఇబ్బందులకు గురిచేస్తానో అని తారాదేవి రాజుతో చెబుతుంది.

ఈ ఖండకావ్యం ప్రధానంగా వీరరసం ప్రధానంగా నడిచింది. ఇందులో ముఖ్యంగా పంది వేగంగా జొన్న చేనులోకి వెళ్ళడం, రాజుదగ్గర ఉన్న సైనికులు ఎవరు కూడా జొన్నచేనులోకి వెళ్ళడానికి సాహసం చేయలేకపోవడం, తారాదేవి జొన్నచేనులోకి వెళ్ళి, ఆ పందిని బయటకు పంపడం, సైనికులు ఆ పందిని చంపడం వంటి అంశాలు ఈ ఖండకావ్యంలో చాలా ఉత్సాహ భరితంగా వర్ణించ బడ్డాయి. ఇవన్నీ కూడా రాళ్ళపల్లి వారు గ్రామీణనేపథ్యాన్ని చవిచూసినవారు అయి వుండటం, కళ్యాణదుర్గం ప్రాంతంలో అడవిపందులు పంటలలోకి రావడం నిత్యకృత్యం. కాబట్టి ఈ సంఘటనను రాజస్థాన్‌లోని కథకు ముడిపెట్టి అద్భుతంగా ఖండకావ్యంగా మలచిన తీరును మనం గమనించవచ్చు.

ఈ ఖండకావ్యంలో ముఖ్యంగా స్త్రీల ధైర్యసాహసాలను గురించి చెప్పినట్లుగా మనం భావించవచ్చు. స్త్రీలు అన్ని రంగాల్లో కూడా తమదైన స్థాయిలో రాణిస్తున్నారు. వారిలో నిగూఢంగా ఉన్న ధైర్యాన్ని తేటతెల్లం చేస్తూ, వారిని ఒక ధైర్యవంతులుగా నిలిపే విధంగా ఈ తారాదేవి ఖండకావ్యంలో నాయికను తీర్చిదిద్దారు రాళ్ళపల్లివారు. ఇలాంటి కావ్యాలు వల్ల స్త్రీలలో ధైర్యసాహసాలు పెరుగుతాయి అన్నది మనం గమనించవచ్చు.

ఆధార గ్రంథాలు

1. తారాదేవి ఖండకావ్యం – రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ
2. రాయలసీమముఖచిత్రం (వ్యాసాలు) – భూమన్
3. అనంతరాగం – ఘట్టమరాజు అశ్వర్థనారాయణ, ఆర్వీఎస్ సుందరం, శివలెంక శ్రీరామచంద్రమూర్తి
4. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ సంగీత సాహిత్యాల సేవ – డా॥ అంకే శ్రీనివాస్
5. రాళ్ళపల్లివారి రచనలు – సమగ్ర పరిశీలన – బి. ఉమేష్ (కేంద్రీయ విశ్వవిద్యాలయం, తెలుగుశాఖ, పిహెచ్.డి. పరిశోధన గ్రంథం)

తెలుగు సాహిత్య ప్రక్రియా పారిజాతం –దండకం

యం. ప్రతీక్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం,
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, చరవాణి: 9100388510

తెలుగు సాహితీ క్షేత్రాన్ని తన హలమనే కలంతో సేద్యం చేసి భారతమనే తొలిపంట పండించిన తెలుగువారి నోముల పంట నన్నయ్యభట్టు. నన్నయ్య భారతంలో పురుడుపోసుకుని వెయ్యేళ్ళ తెలుగు సాహిత్య శిఖరానికి సజీవ సాక్ష్యమైన ప్రక్రియా పారిజాతం దండకం.

– దండ అనగా మాల, పూలమాల అనే సాధారణ అర్థములు కలవు. ఈ సాధారణ అర్థమును కొంత విచారణ చేయగా అనేకపూలతో అందంగా అల్లి భగవంతుని కంఠసీమను అలంకరింపబడిన పూమాల వలె, అక్షర గణములతో కూర్చబడి సాహితీ కళామతల్లి కంఠమలరిన ప్రక్రియ దండకం.

-- 'దండ ' అనే శబ్ధానికి "ము" వర్ణకం చేరగా దండము అవుతుంది. దండము అనగా నమస్కారము, కర్ర అనే అర్థములు కలవు. దీనికి స్వార్థమున 'క' అనే ప్రత్యయం చేరగా దండకము అయినది అని దండక సాహిత్యంపై విస్తృతమైన పరిశోధన చేసిన డా॥ శ్రీ గొల్లకోట సూర్యభాస్కరరావు గారు తమ పరిశోధన సిద్ధాంత వ్యాస గ్రంథంలో వివరించారు.

– వీటి ఆధారంగా పేరుకు దగ్గ ప్రాచీన ప్రక్రియగా దండకాన్ని చెప్పుకోవచ్చు.

– దండక ప్రక్రియ లక్షణాలు మొదట పింగళ ఛందస్సులోనూ, సంస్కృత అగ్ని పురాణంలోనూ ఉన్నాయని పరిశోధకులు తెలియజేశారు. సంస్కృత వాఙ్మయంలో మొదటి దండకం భవభూతి రాసిన మాలతీ మాధవంలో ఉంది. శ్యామలా దండకం కాళిదాస మహాకవి రచించినట్లు విమర్శకుల అభిప్రాయం. వీటి ఆధారంగా తెలుగు లాక్షణికులు తెలుగు దండక ప్రక్రియకు లక్షణాలను నిర్ణయించారు. తెలుగులో మొదట కవిజనాశ్రయ కర్త దండక లక్షణాలను చెప్పారు. ఇతని తరువాత విన్నకోట పెద్దన, అనంతామాత్యుడు, అప్పకవి మొదలైన లాక్షణికులు చెప్పిన దండక లక్షణాల ఆధారంగా దండక భేదముల స్వరూపం ఈ క్రింది విధంగా చెప్పుకోవచ్చు.

1. **ననహత** దండకం
2. **సనహత** దండకం
3. **ననత** దండకం
4. **ననయ** దండకం
5. **నత** దండకం
6. **సత** దండక
7. **రగణ** దండకం
8. **తగణ** దండకం
9. **నగణ** దండకం
10. **సగణ** దండకం
11. **హగణ** దండకం
12. **నసహత** దండకం

పైన చెప్పిన ఏదో ఒక భేదంతో దండక రచన చేయవచ్చు. అయితే దండకం చివర గురువు ఖచ్చితంగా ఉండాలి. కారణం సంస్కృతం నుండి తెలుగులోకి తెచ్చుకున్న వృత్తాలు 150కి మించిలేవని పరిశోధకులు తేల్చిన విషయం. ఈ 150 వృత్తాలన్నీ గురువు అంతంగానే ఉండడం విశేషం. దండకాన్ని లాక్షణికులు ఒక వృత్త భేదంగానే చెప్పారు. తెలుగు సాహిత్యంలోనికి సంస్కృత ప్రభావంతో చేరిన ఏకగణ నిబద్ధమైన ఒక ఛందో విశేషం దండకం.

-- సాధారణంగా 26 అక్షరాలు కలిగిన వృత్తాలనే లాక్షణికులు చెప్పారు. కానీ 26 అక్షరాలకు మించిన వృత్తాలు కూడా ఉన్నాయి. వీటిని ఉద్దర మాలా వృత్తాలుగా పేర్కొన్నారు. ఉద్ధరము అనగా బరువైనది, నిండిపోయినది అనే అర్థములు కలవు. తెలుగు ఛందములలో లయగ్రాహి, లయ విభాతి, లయహారి వంటివి ఉద్ధర మాలావృత్తములే. దండకములను కూడా లాక్షణికులు ఉద్ధరమాలా వృత్త

భేదముగానే చెప్పారు. అయితే దండకములను ఒక వృత్తభేదంగా చెప్పటం వలన ఇందులో కూడా 4 పాదములే ఉండాలి. కానీ దండకములను నాలుగు పాదములతో గానీ, ఏకపాదంగా గానీ రాయవచ్చని లాక్షణికులు తమ లక్షణ గ్రంధాలలో చెప్పారు. తెలుగులో ఎక్కువగా ఉన్నవి ఏకపాద దండకాలే. అయితే తెలుగు సాహిత్యంలో నంది తిమ్మన పారిజాతాపహరణం, మాదయ గారి మల్లన రాజశేఖర చరిత్రలలో ద్విపాద దండకములు – శ్రీనాధుని శృంగార నైషధము, తెనాలి రామకృష్ణుని పాండురంగ మహాత్మ్యములలో నాలుగు పాదముల దండకములు కలవని పరిశోధకుల ద్వారా తెలుస్తున్నది. వీటి ఆధారంగా తెలుగు దండకాలకు పాదం నియమం లేదని అర్థమవుతుంది.

-- విన్నకోట పెద్దన దండకాన్ని **'అనియత పాదమని'**, అనంతామాత్యుడు **'అనియతాక్షరమని'** చెప్పారు. అయితే దండకము అన్ని పాదములలో సమాన గణ సంఖ్య ఉండాలి. ఎందుకనగా దీనిని లాక్షణికులు ఒక వృత్త భేదంగా గుర్తించటమే కారణం. తెలుగులో యతిప్రాసలు లేని పద్యములు కనపడవు. అయితే దండకములకు యతి నియమము గానీ, ప్రాస నియమము గానీ ఉన్నట్లు కనిపించవు. అందువలననే దండకములను పద్యముగా కాక గణబద్దమగు వచనముగా గుర్తించటం సమంజమని పరిశోధకుల భావన. దండకములకు గణ సంబంధం ఉండటం వల్లనే ఛందశ్శాస్త్రమున వీటి ప్రస్తావన ఏర్పడింది. దండకములకు గతి నియమం చాలా అవసరం అందుకే ప్రముఖ విమర్శకులైన రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మగారు "వట్టి గతి చేతనే తెలుగువారి హృదయాలను ఇంత గొప్పగా చూరగొన్న ఛందస్సును నేనెరుగను" అని చెప్పారు. అందుకే దండకాన్ని పద్యానికి వచనానికి గల సాహితీ సేతువుగా చెప్పుకోవచ్చు.

-- తెలుగులో దండక రచన 2 మార్గాలలో జరిగింది.

1) కావ్యాంతర్గతం 2) స్వతంత్రం

1. కావ్యాంతర్గం:

తెలుగు సాహిత్యంలో మొదటి దండకం నన్నయ భారతం అరణ్యపర్వం ప్రధమాశ్వాసంలోని కిరాతార్జునీయ ఘట్టంలో అర్జునుడు పరమేశ్వరుని స్తోత్రము చేయు సందర్భంలో భారత కావ్యాంతర్గతంగా వున్న 'త' గణ ప్రధాన దండకమే తొలి దండకం.

"శ్రీ కంఠలోకేశ లోకోద్భవస్థాన సంహార కారీ
మురారి ప్రియా చంద్రధారీ మహేంద్రాది బృందార
కానంద సందోహ సంధాయి పుణ్య స్వరూపా...
త్రిలోకైక నాధా నమస్తే నమస్తే నమ:

నన్నయ భట్టు భారత కావ్యం శ్రీకారంతో ప్రారంభించి నట్లుగానే దండక రచనను కూడా శ్రీకారంతోనే ప్రారంభించి, నమో వాకములతో ముగించారు. ఇలా దండకాన్ని శ్రీకారంతో ప్రారంభించి నమో వాకములతో ముగించాలనే నియమం ఏ లక్షణ కర్తకూడా పేర్కొనలేదు. కానీ ఇది నన్నయ ఏర్పాటు చేసుకున్న ఒక రచనా విశేషంగా చెప్పుకోవచ్చు. కారణం దండకం అనేది భగవంతుని స్తుతించే ఒక స్తోత్ర పూర్వక ప్రక్రియ దీనిని నమో వాకములతో ముగించటం కూడా ఔచిత్యవంతమని నన్నయ భావించి ఉండవచ్చు. తరవాత నన్నయ, మారన, ఎర్రన, శ్రీనాధుడు, కొఱవి గోపరాజు, నందిమల్లయ – ఘంట సింగన, నంది తిమ్మన, తెనాలి రామకృష్ణుడు, పింగళి సూరన, మాదయ కవి మొదలైన వారెందరో తమ కావ్యాలలో దండక రచన చేశారు.

2. స్వతంత్ర రచన:

తెలుగు సాహిత్యంలో కనిపిస్తున్నంతవరకు తొలి లభ్య స్వతంత్ర దండకం పోతన రాసిన భోగినీ దండకం. అయితే పోతన కన్నా ముందు స్వతంత్ర కృతిగా పండితారాద్యుడు "మౌని దండకం" అనే పేరుతో ఒక దండకం రాసినట్లు పాల్కురికి సోమన పండితారాధ్య చరిత్ర పర్వత ప్రకరణంలోని ఈ క్రింది పద్యం వలన తెలుస్తున్నది. కానీ నేడు ఈ

దండకం అలభ్యం.

"మలయ రాజీవంబు మౌనిదండంబు
సుత్తి మూలమగు మహా స్తోత్ర సూత్రముల
శతకంబు శివతత్త్వ సారంబు, దీప"

నన్నయ భారతంతో ప్రారంభమైన తెలుగు దండకం శ్రీకారంతో ప్రారంభమయి –నమస్తే నమస్తే నమ: అనే నమో వాకములతో ముగుస్తుందని ఇది వరకే చెప్పుకున్నాం. కానీ నన్నయ తరువాత భారత రచన కొనసాగించిన తిక్కన ఎర్రనలు తమ భారత రచనలో దండక రచన చేయలేదు. తిక్కన శిష్యుడైన మారన తన మార్కండేయ పురాణంలో రాక్షసులను సంహరించిన నారాయణీ అమ్మవారిని దేవతలు స్తుతించే సందర్భంలో ఒక దండకం రాశారు. ఎర్రన భారతంలో దండక రచన చేయనప్పటికీ తమ నృసింహ పురాణంలో హిరణ్యకశిపుని సంహరించిన నరసింహ స్వామిని స్తుతించే సందర్భంలో దేవతలు, మునులు చేత ఒక దండకం చెప్పించారు. అయితే ఈ దండకంలో నన్నయ వలె నమస్తే నమస్తే నమ: అనే మూడు నమో వాకములతో కాక నమస్తే నమస్తే నస్తే నమ: అని 4 నమో వాకములను ఎర్రన ప్రయోగించడం విశేషం.

-- మన తొలి దండకంలో అర్జునుడి పరంగా ఏకవ్యక్తిగా కొనసాగిన దండకం, మారన ఎర్రనల కాలానికి బృంద స్తోత్ర రూపాన్ని సంతరించుకుంది.

-- ఇలా కావ్యాంతర్గముగా, స్వతంత్రంగా దండక రచన తెలుగులో జరిగింది. అయితే దండక రచనను గ్రంధార్గతంగానే కొంత మార్పులు చేర్పులు చేసిన ఘనత శ్రీనాథునికి దక్కుతుంది. శ్రీనాథుడు మొత్తం 5 దండకాలు రచించాడు. శృంగార నైషధంలో భీమక మహారాజు దమయంతి స్వయంవరంలో స్వయంవరానికి వచ్చిన రాజులను దమయంతికి పరిచయం చేయటానికి శారదాదేవియే తగినదని, శారదా దేవిని స్తుతించు సందర్భంలో ఒకటి, హర విలాసంలో క్షీర సాగర మధన ఘట్టంలో విఘ్ను నివారణ కొరకు ఒక వినాయక దండకం, హర విలాసంలోనే లింగోద్భవ సమయంలో మరియొక దండకం, కాశీ ఖండంలో దక్షయజ్ఞం సమయంలో సతీదేవి చేత ఒక దండకం, శివుడు వివిధ లింగముల మహత్వమును పార్వతికి తెలియజేసే సందర్భంలో ఒక దండకం మొత్తం కలిపి శ్రీనాథుడు 5 దండకాల గ్రంధాతర్గతంగా రచించాడు. తెలుగు సాహిత్యంలో ఇన్ని దండకాలు రాసిన కవి మరొకరు లేరు. శృంగార నైషధంలో ఒకటి హరవిలాసంతో రెండు దండకాలు నమో వాకములతో ముగించినా, కాశీ ఖండంలోని దండకాలను నమో వాకములతో ముగించలేదు. అంతే గాక స్తోత్ర పూర్వక స్తుతి రచన అయిన దండకాన్ని కథా కథనానికి ఉపయోగించుకున్న కవి శ్రీనాథుడు.

-- శ్రీనాథుని తరువాత దండక రచనా రీతిని మార్చినది పోతన. ఇతను భక్తిబాటలో నడిచిన దండకాన్ని శృంగార బాటలో నడిపించాడు. దీని ప్రతిఫలమే భోగినీ దండకం. పోతన ప్రతికృతిలో కూడా దండక రచన చేయడం విశేషం. భాగవతం తృతీయ స్కందంలో ఒకటి, దశమ స్కందంలో రెండు, వీరభద్ర విజయంలో ఒకటి చొప్పున దండకములు రచించారు.

-- తాళ్ళపాక పెద తిరుమలయ్య "శృంగారదండకం" పేరుతో ఒక దండకం రాశారు. ఇది పేరుకి శృంగార దండకమే గానీ భక్తి భావ తత్పరతయే ఈ దండకం ప్రత్యేకత. తాళ్ళపాక చిన తిరుమలయ్య 'అష్ట భాషా దండకం' పేరుతో ఒక దండకం రాశారు.

-- కొఱవి గోపరాజు వీరందరి కన్నా ఒక అడుగు ముందుకేసి తన సింహాసన ద్వాత్రింశికలో "నిరోష్ఠ్య దండకం' ఒకటి రాశారు.

- ప్రబంధ యుగంలో దండక రచన చేసిన తొలి కవి నంది తిమ్మన. ఈయన పారిజాతాపహరణంలో ఒక దండకం రాశారు. ఇది ద్విపాద దండకం అని ఇంతకుముందే చెప్పుకున్నాం. ఇది కాక స్వతంత్ర కృతిగా **'త్రిస్థలీదండకం'**

రాశారని అప్పకవీయం వలన తెలుస్తున్నదే గానీ ఈ దండకం నేడు అలభ్యం.

-- దగ్గుపల్లి దుగ్గన నాచికేతో పాఖ్యానం, పింగళి సూరన కళాపూర్ణోదయం, ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర మహత్మ్యం, భైరవకవి శ్రీరంగ మహాత్మ్యం, నందిమల్లయ – ఘంట సింగనల వరాహపురాణం, ప్రభోధ చంద్రోదయం, మాడయకవి మైరావణ చరిత్ర, తెనాలి రామకృష్ణుని ఉద్భటారాధ్యచరిత్ర, పాండురంగ మహాత్మ్యము, ఘటికాచల మహాత్మ్యము, నంకుసాల నృసింహకవి కవి కర్ణ రసాయనము, బైచరాజు వేంకటనాధుని పంచతంత్రం, రామరాజు రంగప్ప రాజు సాంభోపాఖ్యానం మొ॥ కృతులన్నింటిలో గ్రంధాంతర్గతంగా దండకాలు ఉన్నాయి.

-- ఇవిగాక రఘునాథ నాయకుని వాల్మీకి చరిత్ర, అప్పకవి శశిరేఖా పరిణయం, గణపవరపు వేంకటకవి ప్రబంధరాజు వేంకటేశ్వర విజయ విలాసంలలో దండకములు కలవు.

-- తెలుగు సాహిత్యంలో కొన్ని ప్రముఖ దండకాలు

1. భోగినీ దండకం – బమ్మెరపోతన
2. శృంగార దండకం – తాళ్ళపాక పెద తిరుమలాచార్యులు
3. అష్టభాషాదండకం – తాళ్ళపాక చిన తిరుమలాచార్యులు
4. కృష్ణ దండకం – టేకుమళ్ళ రంగశాయి
5. రాజగోపాలదండకం – కావటూరి రాఘవయ్య
6. రామ దండకం – కంచెర్ల గోపన్న
7. విద్యావతీ దండకం – గణపవరపు వేంకటకవి
8. కృష్ణ దండకం – కూచిమంచి తిమ్మకవి
9. త్రిపురారి దండకం – నెల్లూరి వీరరాఘవయ్య
10. శ్రీరామదండకం – ఆడిదం సూరకవి
11. చంద్రాననా దండకం – నుదురుపాటి సాంబకవి
12. బృహన్నాయికా దండకం – నుదురుపాటి వెంకన్న

-- తెలుగు సాహిత్య ప్రక్రియల్లో ఇంతటి వైవిధ్యం గల ప్రక్రియ మరొకటి లేదని చెప్పడం ఎటువంటి అతిశయోక్తి కాకపోవచ్చు. ఇతిహాసం, పురాణం, కావ్యం, ప్రబంధం, యక్షగానం మొదలైన ప్రక్రియల్లో అంత:ప్రక్రియగా ఉండటమే కాకుండా స్వతంత్రప్రక్రియగా వెలిసింది దండకం. తొలి రోజుల్లో స్తోత్ర పూర్వక భక్తి రసానికి ఆలవాలమై తరువాత శృంగార పుంతలు తొక్కి ఆధునిక కాలం వచ్చేసరికి హాస్యరస స్పోరకమైన దండకాలు రచించబడ్డాయి.

-- ఆధునిక కాలంలో కలుగోడు ఆశ్వత్థ నారాయణ 'దండక రామాయణం' అనే పేరుతో రామకథను దండక రూపంలో రచించారు. ఎవరు రచించారో తెలియదు కానీ అంజనేయ దండకం విస్తృత ప్రచారం పొందింది.

-- నూతిలో జల ఎప్పుడూ ఉండాలంటే నూతిలో మరో నూతిని (పిల్లబావి) తీయించమంటారు పెద్దలు. బహుశా నన్నయ కూడా ఇలాంటి ఆలోచనే చేసినట్లున్నారు. తెలుగు సాహితీ చెలమ వేల సంవత్సరాలు వర్ధిల్లి నిలిచేటట్లు ఇతిహాసమనే ప్రక్రియలో దండకమనే మరో ప్రక్రియను చేర్చినట్లున్నారు. ఇలా నన్నయచే ప్రారంభమై ఇప్పటికీ సజీవంగా నిలిచిన ప్రాచీన తెలుగు సాహిత్య ప్రక్రియా పారిజాతం – దండకం.

ఆధార గ్రంధాలు:

1. తెలుగులో దండక సాహిత్యము –రచయిత : డా॥ శ్రీ సూర్య భాస్కరరావు, గొల్లకోట
2. సమగ్ర ఆంధ్ర సాహిత్యం –3వ సంపుటి – గ్రంధకర్త :ఆరుద్ర, ప్రచురణ: తెలుగు అకాడమి
3. తెలుగు ఛంద: పదకోశము, ప్రచురణ: తెలుగు అకాడమి
4. ఆంధ్ర మహాభారతం – అరణ్య పర్వం మొదటి భాగం. కృతికర్త: నన్నయభట్టు, ప్రచురణ : తిరుమల తిరుపతి దేవస్థానములు.

ఆధునిక వచన కవిత్వ ప్రకియ – నానీలు విశిష్టత

నిదానకవి. నీరజ, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఖైరతాబాద్, హైదరబాద్.
సెల్: 9908948649

ఆధునిక వచనకవిత ప్రక్రియల్లో విశిష్టమైన ప్రక్రియ నానీలు. వర్తమాన సమాజంలో విస్తృత ప్రజాదారణ పొందిన ప్రక్రియగా ఈ నానీలను పేర్కొనవచ్చు. అల్పాక్షరాలలో అనల్పార్థ రచనగా వీటిని నిర్వచించవచ్చు. ఆచార్య ఎన్. గోపి ఈ నానీల సృష్టికర్త. 1998లో ఆచార్య ఎన్. గోపి నానీల పుస్తకం వెలువడింది. నానీల లక్షణాలకు వస్తే 20 నుండి 25 అక్షరాలను కలిగి ఉండి, నాలుగు పాదాల్లో సాగే రచనగా దీన్ని పేర్కొనవచ్చు. నానీలు అంటే "నావీ నీవీ వెరసి మనవి అని అర్థం" అని నానీల మౌళిక స్వరూప స్వభావాన్ని ఎన్. గోపి నానీల పీఠికలో వివరించారు. ఈ నానీల్లో కవి చెప్పదల్చుకున్న విషయాన్ని 20 నుండి 25 అక్షరాల్లో సూటిగా, క్లుప్తంగా, పాఠకుల హృదయాలను హత్తుకునేటట్లుగా చెప్పడమే ప్రధానాంశంగా ఉంటుంది. నానీలు రూపం దృష్ట్యా చిట్టి కవితలు కావడం వల్ల మొదటి సారి కలం పట్టిన యువకవుల దగ్గర నుంచి లబ్ధ ప్రతిష్ములైన సాహితీవేత్తల దాకా అందరు ఈ నానీలను వ్రాయడం జరిగింది.

సమకాలీన సమాజంలో కనబడే అనేక అంశాలపై నానీల సంపుటాలు వచ్చాయి. 1998 నుండి ఇప్పటి వరకు దాదాపు 24 సంవత్సరాల్లో సుమారు 500 వరకు నానీల సంపుటాలు వెలువడ్డాయని చెప్పవచ్చు. సమకాలీన సమాజ పరిణామాలను వివరించడానికి ఆధునిక కవులకు ఈ నానీలు ఒక శక్తివంతమైన మాధ్యమంగా ఉపయోగపడ్డాయి. నానీలు రూపం దృష్ట్యా చిన్న కవితలే అయినప్పటికి అవి చూపే ప్రభావం మాత్రం గొప్పది అని చెప్పవచ్చు. నానీలను వ్రాయడం కవికి సులభం. గుర్తు పెట్టుకోవడం పాఠకులకు సులభం కావడం వల్ల ఈ నానీల ప్రకియ ఇంత విస్తృతంగా వ్యాప్తి చెందినదని చెప్పవచ్చు.

కొన్ని ప్రసిద్ధ నానీల సంపుటాలు :

గోపి నానీలు, రాచపాళ్యెం – సీమనానీలు, అంబల్ల జనార్థన్ – బొంబాయి నానీలు, చింతకింది శ్రీనివాస్ రావు – కళంగనానీలు, చిల్లర భవానీ దేవి – భవానీ నానీలు, హర్షవర్ధన్ – అమెరికా నానీలు మొదలైనవి.

నానీల సంపుటాలు వర్గీకరణ :

దాదాపు 500 దాకా వెలువడిన నానీల సంపుటాల్లో విస్తృతమైన వస్తు వైవిధ్యం కన్పిస్తుంది. నానీలను అనేక రకాలుగా వర్గీకరించవచ్చు. వస్తువు రీత్యా స్థూలంగా 8 రకాలుగా వర్గీకరించవచ్చు. అవి (1) ట్రావెలోగ్ నానీలు (2) కవయిత్రుల నానీలు (3) రైతుల నానీలు (4) రాజకీయాల నానీలు (5) ఆరోగ్య నానీలు (6) కులాలపై వచ్చిన నానీలు (7) ప్రేమ నానీలు (8) కరోన నానీలు మొదలైనవి.

1) ట్రావెలోగ్ నానీలు : పూర్వం విదేశాలకు వెళ్ళిన వారు అక్కడి వింతలు, విశేషాలను, అనుభవాలను వివరిస్తూ యాత్ర చరిత్రలు వ్రాసేవారు. కానీ ఈ నానీల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ట్రావెలోగ్స్‌ను అందరు నానీల రూపంలో వెలువరిస్తున్నారు అని చెప్పడం అతిశయోక్తి కాదు. ఆ కోవలో వచ్చినవే సబ్బాని లక్ష్మినారాయణ – వండర్ ల్యాండ్ అమెరికా నానీలు, హర్షవర్ధన్ – అమెరికా నానీలు, రాపోలు–సీతారామ రాజు – దక్షిణాఫ్రికా నానీలు మొదలైనవి. పాతకాలంలో అతి కొద్ది మంది మాత్రమే అమెరికా వెళ్ళేవారు. అందుకే అప్పుడు మనవాళ్ళకు అమెరికా అనగానే భూతల స్వర్గం అనే అభిప్రాయం ఉండేది. కానీ ప్రస్తుతం ఇంటి కొకరు చొప్పున అమెరికా వెళ్తున్నారు. అమెరికా యొక్క మంచి చెడ్డలు అందరికి

తెలుసు. ఈ పరిస్థితిలో అమెరికా గురించి పాఠకులను ఆకట్టుకునేలా వ్రాయడం కత్తిమీద సామే. హర్షవర్ధన్ వ్రాసిన అమెరికా నానీలు అమెరికా యొక్క అసలు స్వరూపాన్ని, స్వభావాన్ని వివరిస్తూ ఆసక్తిగా సాగుతాయి.

ఉదా: నాలుగే నాలుగు మాటల్లో / అమెరికా / మాలు, సేలు / హైరు, ఫైరు / అంటూ మొత్తం అమెరికా సారాన్ని ఒక చిన్న నానీలో అద్భుతంగా వర్ణించాడు కవి. సంపన్న దేశం / దేనికీ లోటులేదు / మాట్లాడేందుకు / మనుషులు తప్ప / అంటూ అమెరికాలో అన్ని ఉన్నా మాట్లాడేందుకు మనిషి దొరకడు, టైము దొరకదు, అంటూ ధనిక దేశంలో వ్యక్తుల మధ్య మృగ్యమవుతున్న మానవ సంబంధాల తీరును హృద్యంగా వివరిస్తాడు కవి.

ఈ విధగా ట్రావెలోగ్ నానీలు, ఆ, యా దేశాల స్వరూప స్వభావాలను సంస్కృతిని, జీవన విధానాన్ని మనకళ్ళముందు ఉంచుతాయని చెప్పవచ్చు.

2) కవయిత్రుల నానీలు : ఆకాశంలో సగం అంటూ ఆధునిక కాలంలో అన్ని రంగాల్లో దూసుకుపోతుంది మహిళా లోకం. అదే విధంగా సాహిత్యంలో కూడా కవయిత్రులు, రచయిత్రుల సంఖ్య నానాటికి పెరుగుతుంది. ఈ నానీల సాహిత్యంలో కూడా కవయిత్రులది అగ్రస్థానం అని చెప్పవచ్చు. సమాజంలో స్త్రీలు కుటుంబపరంగా, ఉద్యోగపరంగా, ఆరోగ్యపరంగా, అస్థిత్వపరంగా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఎందరో కవయిత్రులు స్త్రీ జీవితంలోని భిన్న పార్శ్వాలను కవిత్వీకరించి నానీల సంపుటాలను వెలువరించారు. ఈ నానీల సంపుటి వెలువరించిన మొదటి కవయిత్రిగా చిల్లర భవానీ దేవి – భవానీ నానీలను పేర్కొనవచ్చు.

వివాహమా / ఎంత పని చేశావు / నన్ను పుట్టింటికి / అతిథిని చేశావు / అంటూ ఒక చిన్న నానీతో పెళ్ళి తర్వాత స్త్రీ పుట్టింటికి పరాయిగా మారిన వైనాన్ని హృదయానికి హత్తుకునేటట్టు వివరించారు కవయిత్రి. మొక్క చెట్టయినా / మూలం తల్లి వేరే / పిల్లలు పెద్దయ్యాక / మాత్రం తల్లి వేరే /కుటుంబానికి తల్లి మూలం. పిల్లలే సర్వస్వంగా బ్రతుకుతుంది తల్లి, వారిని కంటికి రెప్పలా కాపాడుతుంది. పిల్లలు మాత్రం పెరిగి పెద్దయ్యి ప్రయోజకులైనప్పటికి తల్లిని నిర్లక్ష్యం చేస్తున్నారు అంటూ వర్తమాన సమాజంలో పిల్లల చేతిలో నిర్లక్ష్యానికి గురి అవుతున్న వృద్ధమాతల పరిస్థితిని చినుకులు సంపుటిలో నెల్లుట్ల రమాదేవి ఆర్ద్రంగా వివరిస్తారు. ఈ విధంగా ఎందరో కవయిత్రులు స్త్రీల జీవితాలను వస్తువుగా తీసుకుని నానీలను రచించారు.

ఎన్. అరుణ–గుప్పెడు గింజలు, శారద అశోక్‌వర్ధన్–శారద బాణీలు, యశశ్రీ రంగనాయకి – సూరీడు చెప్పులు, కొవూరి పుష్పదేవి–పుష్పరాగాలు, డా.వై కృష్ణకుమారి – అక్షర స్వరాలు, నాంపల్లి సుజాత–నెమలీకలు, పోగుల విజయశ్రీ – పూలగుత్తులు మొదలైనవి కవయిత్రులు రచించిన మరికొన్ని నానీల సంపుటాలు.

3) రైతు నానీలు : దేశానికి అన్నం పెట్టే అన్నదాత రైతు. కానీ ప్రస్తుత సమాజంలో రైతుకే అన్నం దొరకని దుస్థితి. కల్తీ విత్తనాలు, కల్తీ ఎరువులు, ఎండిన చెరువులు, మోడువారిన జీవితాలు ఇది నేటి రైతు పరిస్థితి. రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను వివరించేవే రైతు నానీలు. అనేక మంది కవులు, కవియిత్రులు, రైతుల గురించి నానీలు వ్రాయడం జరిగింది. వారిలో రజిత కొండసాని, సి. శేఖర్, నాగిశెట్టి – గడ్డి చేమంతులు, కూకట్ల తిరుపతి – పల్లె నానీలు మొదలైన వారిని పేర్కొనవచ్చు.

రైతు / దేశానికి వెన్నెముకే / అందుకేనేమో / నడ్డి విరిచేసారు / అంటూ ఆధునిక కాలంలో రైతుల దుస్థితి గురించి రజిత కొండసాని చిన్న నానీలో రైతు జీవితాన్నంతా చిత్రం కట్టించారు.

దళారుల పెత్తనానికి / బానిస / అప్పుల ఊబిలోనే / జీవితమంతా / అంటూ దళారుల చేతుల్లో మోసపోతున్న రైతు జీవితాలను గురించి రైతు నానీల్లో శేఖర్ ఆర్ద్రంగా వివరిస్తాడు.

4) రాజకీయాల నానీలు : ఆధునిక సమాజంలో అత్యంత ప్రాఫిట్ ఉన్న బిజినెస్ అంటే అది రాజకీయమే. రాజకీయాల్లో వారసత్వం అంటే అదో పెద్ద జాక్‌పాట్ లాంటిది. నేటి రాజకీయ నేతలకు ప్రజలను దోచుకోవడమే పని. ఇలాంటి కుహానా రాజకీయ నాయకుల గురించి, రాజకీయాల గురించి అనేక మంది కవులు నానీలు వ్రాయడం జరిగింది. ఒక రకంగా చెప్పాలంటే నానీలు వ్రాసిన అందరు రాజకీయాల గురించి స్పందించిన వారే అని చెప్పవచ్చు. దేనికైనా / దేనితో నైనా / లింకు పెట్టడం / నాయకుల కళ / పోయే భూములు / పేదలవి / ఒనగూడే అభివృద్ధి / పెద్దలది / అంటూ నేటి రాజకీయ నాయకులు ఊసరవెల్లి వైఖరిని గిన్నెల ప్రమోద్ కుమార్ రాజకీయ నానీల్లో ఎత్తి చూపుతాడు.

ఈ విధమైన నానీలు వ్రాసిన వారిలో డా॥ తలతోటి పృథ్వీరాజ్ – నలుదిక్కుల నానీలు, కోట్ల వెంకటేశ్వర రెడ్డి – రానీలు, ఎస్. రఘు – జీవన లిపి నానీలను పేర్కొనవచ్చు.

5) ఆరోగ్య నానీలు : ఆధునిక సమాజంలో మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే నిత్యం నడక తప్పదు. ఈ నడక వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అందుకే ఇప్పుడు ఏ పార్క్‌లో చూసిన మార్నింగ్, ఈవినింగ్ వాకర్స్‌తో కిటకిటలాడుతున్నాయి. ఆధునిక కాలంలో నడక ప్రాధాన్యతను, నడక వల్ల మనిషికి కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరిస్తూ నల్లా నరసింహా మూర్తి గారు 5 నానీల సంపుటాలను వెలువరించారు. అవి (1) నడక నానీలు (2) నడక నడిస్తే (3) నడక నడిచే వేళ (4) నడక ఆరోగ్యం (5) నడక నా తల్లి మొదలైనవి.

పూల కుండీనే కాదు / చెత్త కుండీనీ / ప్రేమించు / నిన్ను శుభ్రంగా వుంచేదదే / అంటూ స్వచ్ఛ భారత్ సారాన్ని ఒక్క నానీలో చెప్పాడు మరో కవి. ఈ విధంగా ఆరోగ్య స్పృహతో అనేకమంది కవులు నానీలను వ్రాశారని చెప్పవచ్చు.

6) కులాలపై వచ్చిన నానీలు : సమాజంలో ఎన్నో కులాలు ఉన్నాయి. ప్రతి కులానికి కుల చరిత్ర, సంస్కృతి, ఆచార వ్యవహారాలు, వృత్తులు, కట్టుబాట్లు, భాష మొదలైనవి ప్రత్యేకంగా ఉంటాయి. తమ కులానికి సంబంధించిన సమస్త విషయాలను నానీల్లో నిక్షిప్తం చేసినవారు ఎందరో కవులు, కవయిత్రులు మనకు కన్పిస్తారు. ఇందులో డా॥ సూర్యాధనుంజయ్ – బంజార నానీలను ప్రధానంగా పేర్కొనవచ్చు. బంజారాల కుల సంస్కృతిని, భాష, మొదలైన అన్ని అంశాలను ఈ నానీలు వివరిస్తాయి. ఇదే కోవలో చేనేత నానీలను పేర్కొనవచ్చు.

7) ప్రేమ నానీలు : ప్రేమ విశ్వజనీనమైన భాష. స్పందించే హృదయమున్న ప్రతి కవి ప్రేమ గురించి వ్రాస్తాడనడంలో సందేహం లేదు. ప్రేమ గురించిన నానీలు అత్యధిక సంఖ్యలో వెలువడ్డాయిని చెప్పవచ్చు. వెన్నెల సత్యం – ప్రేమ నానీల సంపుటిని వెలువరించాడు.

8) కరోన నానీలు : గత మూడు సంవత్సరాలుగా ప్రపంచాన్ని వణికించించిన మహమ్మారి కరోనా. కరోనా కాలంలో మనిషి తీసుకున్న జాగ్రత్తలను, మనుష్యుల మధ్య నెలకొన్న భయానక వాతావరణాన్ని, కరోనా సోకి కళ్ళముందే పిట్టల్లా రాలిపోతున్న ఆత్మీయులను చూసి కన్నీరు కార్చిన సందర్భాన్ని, కరోనా కాలంలో మనుష్యులు ఎదుర్కొన్న అనేక సమస్యలను వివరిస్తూ అనేక మంది కవులు కరోనా నానీలు, పేరిట నానీలను రచించారు. వారిలో చలపాక ప్రకాష్, కయ్యూర్ బాల సుబ్రమణ్యం లు పేర్కొనదగిన వారు.

1) నమస్కారం / ఇప్పుడు అనివార్యం / కర చాలనం / శకుని కుతంత్రం

2) కరోనా / గీత దాటుతుంది / గృహ నిర్బంధమే / ఇప్పుడు రక్ష / అంటూ కరోనాలో పాటించవలసిన పద్ధతులను చిన్న నానీలో చిత్రం కట్టించాడు కవి కయ్యూరు బాలి సుబ్రమణ్యం

ముగింపు :

తెలుగు సాహిత్యంలో నానీలు అనే ఈ ప్రక్రియ ఒక బిందువుగా ప్రారంభమై సునామిలా మారి తెలుగు సాహిత్య ప్రపంచాన్ని ముంచేసినదని చెప్పవచ్చు. 20 నుండి 25 అక్షరాల కలిగిన నానీలు తెలుగు పాఠకులపై చెరగని ముద్ర వేశాయని చెప్పవచ్చు. ముఖ్యంగా యువకవులకు నానీల రచన ఒక అభ్యాసంగా ఉపయోగపడుతుందనడంలో సందేహం లేదు. ఈ నానీలు దినదిన ప్రవర్ధమానమై మరిన్ని సాహితీ పరిమళాలను వెదజల్లుతాయనడంలో అతిశయోక్తి లేదు.

ఆధార గ్రంథాలు:

1) గోపి నానీలు – ఆచార్య ఎన్. గోపి – చైతన్య రచనలు
2) అమెరికా నానీలు – హర్షవర్ధన్ – రేయ పబ్లికేషన్స్
3) చినుకులు – నెల్లుట్ల రమాదేవి – అపురూప పబ్లికేషన్స్
4) చలపాక నానీలు – చలపాక ప్రకాష్ – చలపాక పబ్లికేషన్స్
5) వండర్ ల్యాండ్ అమెరికా నానీలు – సబ్బని లక్ష్మీనారాయణ – శరత్ సాహితి కళాస్రవంతి ప్రచురణలు

కథాసాహితి కథల సంకలనాలు – కులవివక్ష కథాంశాల పరిశీలన (2008 నుండి 2019 వరకు)

లెంక సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రోఫెసర్, తెలుగు, ప్రభుత్వ డ్రిగీ కళాశాల, నర్సంపేట,
వరంగల్ రూరల్ జిల్లా, తెలంగాణ – 506 132. సెల్ నెం. 9989732382

కథా సాహితి కథావార్షిక సంకలనాల ప్రచురణ సంస్థ. ఈ కథా వార్షిక సంకలనాలు రావడానికి ప్రధాన కారకులు చేకూరి రామారావు, హరాపురుషోత్తమరావు మరియు హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ ముఖ్య భూమికను పోషించెను. ప్రజాసాహితి పత్రికలో "నిన్నటికథ" అను పేరుతో పాతకథలను వాసిరెడ్డి నవీన్ ప్రచురించేవారు. హెచ్‌బిటి ట్రస్టు సభ్యులు పరుచూరి సుబ్బయ్య పాతికేళ్ల మంచి కథకు సంకలనం తీసుకురావాలని సభ్యులకు సూచించిరి. అప్పటి హెచ్‌బిటి సంస్థ చైర్మన్ సి.కె నారాయణ రెడ్డి పరుచూరి సుబ్బయ్య అభిప్రాయాన్ని బలపరిచి ఆ పనిని హరికి అప్పగించాలని భావించారు. కాని హరి పాతికేళ్ల మంచి కథల సంకలనం తీసుకురావటానికి వాసిరెడ్డి నవీన్ పేరును సూచించిరి. దానికి కారణం వాసిరెడ్డి నవీన్‌కు అప్పటికి కథలపై అవగాహన కలదు. ప్రజాసాహితి నుండి బయట కొచ్చిన నవీన్ గారికి, పాతికేళ్ళ మంచి కథల సంకలనాలన్ని తెచ్చే బాధ్యతను అప్పగించగా "తెలుగు కథ 1960–85" తయారైనది. వాసిరెడ్డి నవీన్‌గారు ప్రతి సంవత్సరం మంచి కథలను తేవాలనే తన కోరికను పాపినేని శివశంకర్‌కు చెప్పి అతనిని సంపాదకులుగా తనతో పాటు కొనసాగమని కోరిరి. శివశంకర్ అంగీకరించగా "కథ 90" 1991 డిసెంబర్ 28న హైదరాబాద్‌లో ద్వారకా హోటల్‌లో కె.శివారెడ్డి, అధ్యక్షతన జరిగిన సభలో చేకూరి రామరావు చేతులు మిదగా ఆవిష్కృతమైంది. ఇప్పటి వరకు 31 కథల సంకనాలు వెలువడినవి. కథా 189 మంది రచయితలు, 425 కథలు గలవు.

ఆధునికాంధ్ర వచన సాహిత్య ప్రక్రియలలో ఒకటైన కథానికి ప్రక్రియ నవలా ప్రక్రియ తరువాత పాఠక సమాజాన్ని బాగా ఆకట్టుకుంది. మానవుడు మాట్లాడడం నేర్చుకొని, ఆలోచించడానికి అలవాటు పడిన తరువాత స్వతహగా మనసులో కలిగిన, ఇతరులు చెప్పిన విచిత్ర విషయాలను, తరతరాలుగా రూపం మర్చుకుంటు వచ్చిన విశేషాలను కథలుగా చెపుకుంటూ వచ్చాడు. కాబట్టి కథ ప్రాచీన కాలంలోనే ఆవిర్భవించిందని చెప్పవచ్చును.

ద్వా.నా. శాస్త్రి కథా విశేషాల గురించి చెబుతూ కథ "కథ్" అనే ధాతువు నుండి పుట్టింది. దీనికి సంభాషించుట చెప్పుట అనే అర్థాలున్నాయి. అగ్ని పురాణంలో కథానికా ప్రస్తావన ఉందనీ, సంస్కృతంలో ఇతివృత్తభేదాన్ని బట్టి కథా, ఆఖ్యాయికా, ఖండ కథా, పరికథా అనే భేదాలున్నాయని చెబుతారు. ఈనాడు తెలుగులో "కథ, కథానిక" అనే పదాలు సమానార్థకంగా వాడుచున్నారు. ఇవి ఆంగ్లంలో "షార్ట్‌స్టోరీ" అనే ప్రక్రియకు పర్యాయపదాలుగా వాడుచున్నారు[1]. బ్రౌన్ నిఘంటువు ప్రకారం కథ అనగా "ఇంచుక సత్యమైన కల్పిత ప్రబంధం అని అర్థం.

పోరంకి దక్షిణామూర్తి "జీవితంలోని ఒకానోక మహత్తర సత్యాన్ని అద్భుత శిల్ప నైపుణ్యంతో కళ్ళకు కట్టినట్లు చూపించి హృదయాన్ని ఒక మహత్తరమైన అనుభూతితో నింపి పదేపదే చదవలనిపింపజేసేది కథ" అని పేర్కొనిరి.

కుల పునాదులు:

కులం అనేది సమాజంలో ఏ వ్యక్తికైనా తెలికగా గుర్తించడానికి ఆర్యులు రూపొందించిన ఒక వ్యవస్థ. తమలో తాము వివాహము చేసుకుంటూ, ఒక విధమైన జీవన సరళిని కొనసాగిస్తూ వచ్చిన సామాజిక వర్గాలకు కులాలని పేరు. వృత్తి, ఆచారాలు, సామాజిక స్థాయి వంటి

అనేకాంశాలు కులాల్లో పరంపరా గతంగా కొనసాగుతున్నాయి. ఆధునిక భారతదేశంలో కులవ్యవస్థ జాతి అని పిలవబడే సహజ సామాజిక సమూహాల మీద, వర్ణం అని పిలవబడే నాలుగు సైద్ధాంతిక వర్గీకరణ కృతిమ విధానం మీద ఆధాపడి ఉంది.

ప్రపంచంలో ప్రతి దేశంలో జాతులు, మతాలున్నాయి కాని కులాలు లేవు. అన్ని దేశాలలో వృత్తులను బట్టి ఆర్థిక తారతమ్యాలను బట్టి వర్గాలున్నాయి కాని కులాలు లేవు కులాల కంటే అవన్నీ కొంత విశాలమైనవి కావడంతో సమాజానికి తక్కువ ప్రమాదం గలదు. కులాల విషయం దీనికి భిన్నము జాతి, మతం, వర్గం కంటే కులం సంకుచితమైనది. "కులం భారతదేశ జాతి జీవనంలో అంతర్భాగంగా కలిసిపోయింది. మానసిక రుగ్మతగా మిగిలిపోయింది. కులం ముద్రలేని మనిషి భారతదేశంలో లేడని చెప్పవచ్చు. కులాలన్ని ప్రత్యేక జీవన విధానం ఏర్పర్చుకున్నవి. ఈ దేశంలో సామాజిక వ్యవస్థ కులం పునాదుల మీద నిలబడివుందని తెలుస్తుంది.

కులం పుట్టక గూర్చి చరిత్రకారుడు ప్రొఫెసర్ రాప్సన్ కులవ్యవస్థ ప్రారంభానికి ఆర్యుల, ఆదివాసుల తెలుపు, నలుపు దేహచ్ఛాయలోని తేడాకారణంగా ఉంది. ఆదిలో సమాజం ఆర్యులు, అనార్యులనే రెండు విభాగాలుగా విభజించబడిందని చెప్పిరి.

వి.ఎ. స్మిత్ ఆచార పరిశుద్ధత, ప్రత్యేకించి ఆహార వివాహ విషయంలో పాటింపుకు విలక్షణ నియమాలచే ఆంతరంగికంగా ఒకటి చేయబడిన కుటుంబాల సముదాయం కులమని నిర్వచించవచ్చు"[2].

పరిశోధానాంశంలో కుల వివక్షను వివరించే కథలు కథాసాహితి కథల సంకలనాలలో 12 కథాంశాలున్నవి. అగ్రహారం (వివిన మూర్తి), తప్పిపోయిన కుమారై (వినోదిని), థూ (పి.వి. సునీల్ కుమార్) చివరి చర్మ కారుడూలేడు (జాన్‌సన్ చోరగుడి) నేనుతోలు మల్లయ్య కొడుకుని (యమ్. ఎస్.కృష్ణ జ్యోతి), అంటరాని బతుకమ్మ (పి. చిన్నయ్య) కుర్రుపోట్లు పుణ్యతిథి (చింతకింది శ్రీనివాసరావు) మొదలైన కథా రచయితల కథలు.

థూ! ఈ కథారచయిత పి.వి. సునీల్ కుమార్, పశ్చిమ గోదావరి చింతలపూడిలో జన్మించారు. ఐ.జి. స్థాయి, ఐ.పి.యస్ అధికారి. ఈ కథాంశము ఆదివారం విశాలంధ్ర పత్రికలో జూన్ 15, 2014లో ప్రచురించబడినది. ఈ కథాంశము కథ 2014లో చోటుదక్కించుకున్నది. రచయిత సామాజికాంశాలను క్షుణంగా అధ్యయనం చేసి కుల వివక్షకు చెందిన ఈ కథను రాశారు. ఉన్నత వర్గాలు అణగారిన వర్గాలను అణగద్రొక్కినపుడు, అణగారిన వర్గాల సామాజిక న్యాయపోరాటం ఈ కథలో గలదు. ఇది వ్యంగ్య కథనం. జోసఫ్ కొడుకు సల్మాన్ రాజు జ్ఞానం, అందముంది, చదువులో ఫస్ట్ మంచి కబడ్డీ ఆటగాడు. మంచిపాటగాడు, మగసింహం గొంతు, వంకీలు జుట్టు. సల్మాన్‌రాజు అందచందాలను చూసి భూకామాంధుల పిల్ల ఇష్టపడింది. రాజు ఆ పిల్లను ఇష్టపడ్డారు. కామాంధులకిది గిట్టలేదు. కమ్మ వారి అమ్మాయి, రెడ్డి వారి పాపకావల్సి వచ్చిందా అని అనుకొని వాళ్ళ ప్రేమకథకు ముగింపు పలకాలనుకున్నారు. తెగ నరకాలని కత్తులకు పదును పెట్టారు. ఒక రోజు కాలేజీ నుండి వస్తుండగా "మాల నాకొడుకా .... ఆకమ్మ వారి పిల్లతో ఏంట్రా పరాచికాలు" అని అనగా రాజు ఇద్దరికీ ఇష్టమై మాట్లాడుకుంటే నీదేంబోయిందిరా నాకొడకా అన్నడు. రాత్రి దండెత్తి గుడిసెలకు నిప్పెట్టి అమ్మల మానాల మీద తన్నారు. ఎంటబడి ఎగబడి నరికి గోనెసంచెల్లో కుక్కి పంటకాలవల్లో పడేశారు. చందమామలాంటి రాజు ముఖం మీద కాళ్ళతో తన్ని, కత్తులతో ముఖాన్ని, అంగాన్ని కోశారు. తరతరలుగా దళిత జాతికి జరిగే మర్యాదలిటువంటివే. ఒక కుంటోడు అప్పుడే సల్మాన్‌రాజు తండ్రి జోసఫ్‌ను తరిమికాలి మీద కోట్టాడు. కుంటిజోసఫ్ అయ్యాడు. నోట్లో తడి ఆరింది. ఈ జబ్బును జెరోస్టోమియా అంటారు. జోసఫ్ కథ ఊరు

పెద్దబసివిరెడ్డి నాయుడు వివరంగా చెబుతాడు.

బిసివిరెడ్డి తండ్రి రెడ్డి కులస్థుడు, తల్లిగారు కమ్మవారి ఆడపడుచు. బసివిరెడ్డి అబద్ధమాడాడంటే కనకదుర్గమ్మ ముక్కుపుడక అంటుకున్నట్టే. అంటే అన్ని అబద్దాలే. నాలుగు వర్ణాలు వేదోక్తంగా చెప్పిన పనులు చేస్తున్నవని చెబుతాడు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రెడ్లు జాతీయపార్టీలో చేరి దేశ సేవ చేశారు. పెద్ద పెద్ద కాంట్రాక్టులు వాళ్ళవే. ఈ జలయజ్ఞనంలో అణగారిన వర్గాలకు స్థానం లేదని సామాజికవేత్తల ఆరోపణ. "జలయజ్ఞం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్టాత్మకమైన కార్యక్రమం. ఇందులో గల 31 మంది కాంట్రాక్టర్లను పరిశీలిస్తే 23 మంది రెడ్డి, 5 కమ్మ, 3 వెలమ కులస్థులు. గాయత్రి కన్‌స్ట్రక్షన్స్, జి.వి.ఆర్ కంపెనీ మొదలైనవి రెడ్డి కులనికి, ప్రొగెసివ్ కన్‌స్ట్రక్షన్, ట్రాన్స్‌ఫ్టోర్స్, మధుకాన్ కంపెనీలు కమ్మా సామాజిక వర్గానివి. 1,30,000 కోట్ల జలయజ్ఞం కాంట్రాక్టుల్లో యస్.సి., యస్.టి మరియు బి.సి మైనార్టీలకు స్థానంలేదు"[3].

కమ్మవారు తెలుగువాడి ఆత్మ గౌరవం పేరు కమ్మా పార్టీపెట్టి దేశసేవ చెయ్యడం మొదలెట్టారు. కాంగ్రెస్, తెలుగుదేశం, బిజెపి ఏ పార్టీలో అయిన ఈ రెండు కులాలే ఉంటాయి. ఆ పార్టీలను నమ్ముకున్న మాల, మాదిగలకు అన్యాయం చెయ్యలేదు. వాళ్ళకు గేదెలు, పందులు, ఆటో లిచ్చారు. మేడా, కారు, ఏసి వుంటే సుఖమా? వాళ్ళ పిల్లలకు పిల్లలకు రిజర్వేషన్లు. కులం అంటే కుటుంబాన్ని సాగదీయడం. ముందు రెడ్డి, కమ్మ పిల్లలకు పెట్టి మిగిలింది బయటోళ్ళకు పెట్టాలి. బట్టలు కట్టకుండా గోచీ పెట్టు కున్నోళ్ళు, చద్దికుడు తప్ప వేరేది తెలినోళ్ళు టిఫిన్లు మరిగారు. ఎంత కుక్క దర్జా, హోటల్లో రెండు గ్లాసులేంటి? అని ఎదురుపశ్న.

జోసప్పుగాడి కొడుకుపేరు రాజు ఏ దేశానికి రాజు. 20 ఏళ్ళ క్రితం గొడవ ఎర్రగా, బుర్రగా బలిసిన గొడ్డాలా వుంటాడు. ఈడు భూస్వామిగారి అమ్మాయి వెంటపడ్డాడు. తణుకుటౌన్‌ఓ కాలేజీలో చదువుకొని బస్సులోవస్తుండగా "ఏరా నువ్వు చేస్తున్నది పొరపాటు పనికదా అని కోపంలో ఏరా మాలనాకొడకా అన్న మాట వాడారు. నీకు ఇది కులంతిట్టు లాగుందా? రెడ్డిని రెడ్డి అంటారు. కమ్మాయను చౌదరిగారంటారు. రాజు ఆడికి తోడుగా మాలమాదిగల పిల్లలు ఇంగితం లేకుండా చిన్నతరం, పెద్దతరం లేకుండా చెయ్యి చేసుకున్నారు. ధర్మాన్ని నిలబెట్టటానికి కడ జాతికుక్కలకు బెత్తం దెబ్బలు రుచి చూపించగా కాస్తా మోతాదెక్కువైంది. కత్తులు తీసి పది మంది నిరికేశారు. వాళ్ళ శవాలు చూసి కుటుంబాలు బాధపడతాయి కాబట్టి భద్రంగా మూటలుకట్టి కాలువలో పడేశాము. కేసులు పెట్టారు. శిక్షలు పడ్డాయి. పండగా, పబ్బాలని, పెరోలు మీద వచ్చేస్తున్నారు. కమ్మ ముఖ్యమంత్రి ఉంటే కమ్మవారు జిడ్డి రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటే రెడ్డి వారు జిడ్డి. మాల మాదిగ ఓట్లుతో ముఖ్యమంత్రైనంత మాత్రాన వాళ్ళ కులపోళ్ళను జడ్జీలుగా వెయ్యాలని ఎక్కడాలేదు. బసివిరెడ్డి నాయుడు పాత్ర ద్వారా వ్యంగ్యంగా కొత చమత్కారం, హాస్యము జోడించి కథారచయిత దళితులకు ఉన్నత కులాలు చేసిన అన్యాయాలను చక్కగా వివరించారు. కథాకథనంలో అద్భుతమైన తీరును ప్రదర్శించారు. ఈ సంఘటన చుండూరు హత్యాకాండను తలపిస్తుంది.

చుండూరు దుర్ఘటన ఆగష్టు 6 1991లో జరిగింది. ఈ మారణకాండ దేశాన్నంతటిని కలిచి వేసింది. 75 సంవత్సరాల స్వాతంత్ర్యం తరువాత దేశంలో బలహీనవర్గాల పరిస్థితి ఏమిటన్న ప్రశ్నను లేవదీసింది. "మనదేశంలో బలహీనవర్గాల మీద జరుగుతున్న అత్యాచారాలు మానదేశ పాలకులవలంబించిన ప్రగతి పథంతో ముడిపడి ఉన్నాయి. తరతరాల సామాజిక సంబంధాలో ఎటువంటి మార్పు లేకుండా, దేశాన్ని కేవలం సాంకేతికంగా అభివృద్ధి చేసే విధానాన్ని అవలంబించిన కారణంగా సాంప్రదాయకంగా పెత్తనం చేస్తున్న భూస్వామ్య వర్గాల పెత్తనం చెక్కుచెదరక

పోవడం మేకాక వాళ్ళ అస్తులు విపరీతంగా పెరిగాయి. వ్యాపారాలు, ఉద్యోగాలు గూడా వాళ్ళవే అయ్యాయి. రాజకీయ అధికారము వాళ్ళదే అయింది. దీనితో వాళ్ళ అహంకారము కూడా విపరితంగా పెరిగిపోయి పేదవర్గాల మీద దాడులు చేయడానికి వాళ్ళ ఓట్ల కోసం కల్పించిన సంక్షేమ పథకాలను సహితం నిరసించడానికి దారితీసింది. ఇది నానారకాల అల్లర్లకు, దాడులకు ఆందోనకు గురిచేస్తుంది అని కె. బాలగోపాల్ పేర్కొన్నారు"[4].

బలహీన వర్గాల మీద దాడులు, అత్యాచారాలు జరగకుండా ఉండాలంటే దేశము కేవలం సాంకేతికంగా అభివృద్ధి చెందితే చాలదు. సామాజిక సంబంధాలలో మార్పులు రావాలి సమాజంలో బలహీన వర్గాలపై ఉన్నత వర్గాల పెత్తనం పూర్తిగా తొలగిపోవాలి. ఈ రెండు అంశాలు బలహీన వర్గాలపై దాడులను ఆపగలవు.

దళితుల ఊచకోత అమానుషము. అమానవీయ చర్య. చరిత్రలో ఇటు వంటి సంఘటన పునరావృతం కాకుడదు. దళితుల శవాలను గోనేసంచుల్లో కట్టి కాలువల్లో వెయ్యగా అయితంపూడి లాకులకి అడ్డం పడ్డాయి. చుండూరు మారణకండకు అందరూ స్పందించారు. "గోనే సంచులు విప్పమన్నావుగా/చూడు తలలెవరివో/మొలలెవరివో/ ఈ చేతులకి తండ్రెవరు తండ్రీ/కాళ్ళకు తల్లెవరు తల్లి/ ఈ శవాలకు దిక్కెవరునాయానా! ఎవరి కుంకుమ దిబ్బరా ఇది" నాయింటి పేరు చుండూరులో సీతారాం శోకించారు. ఇక్కడ జరిగిన హత్యాకాండ మానవ జాతిని కంట తడిపెట్టేటట్లు చేసింది.

ఇక్కడ గమనించ దగ్గ వేరొక విషయం కేసులో నిందుతులుగా ఉన్నవారు కేసును విచారిస్తున్న జడ్జిని బదిలీ చెయ్యమని ఉన్నత న్యాయస్థానాన్ని కోరడం అది సఫలం కావడం జరిగింది. చుండూరు కేసును విచారిస్తున్న జడ్జి డా॥ ప్రభాకర్‌రావు కులం రీత్యా దళితుడు. దళిత కులస్తుడైన న్యాయమూర్తి కేసును విచారిస్తే తమకు సరైన న్యాయం జరగదని ముద్దాయిలు భావించడం ఆయనను బదిలీ చేయ్యకపోతే తమ తరుపున వాదించడానికి లాయర్లు దొరకరని బెదిరించారు. జడ్జి బదిలీ కావడం లజ్జాకరం అంటే న్యాయవ్యవస్థను రాజకీయాలు, ఉన్నత వర్గాలు ప్రభావితం చేస్తున్న విషయం స్పష్టమౌతుంది. ఈ విధంగా కులవివక్షను నెదుర్కొన్న దళితులపై జరిగే దాడులు, అమానుష చర్యలు ఈ కథలో రచయిత చక్కగా వివరించారు.

అంటరాని బతుకమ్మ:

ఈ కథా రచయిత పి. చిన్నయ్య. ఈ కథాంశము 2015 అక్టోబర్ 18 ఆదివారం ఆంధ్రజ్యోతిలో అచ్చయింది. కథ 2015లో చోటుదక్కించుకున్నది. నరేష్ భార్య పద్మ, నరేష్ ఉద్యమ సానుభూతిపరుడు. పద్మ తండ్రికి, నరేష్‌కు దూరపు బంధుత్వముంది. ఉద్యమవసారాల రీత్యా నరేష్ ఊరికి వచ్చిపోతుండంతో వారి ప్రేమ పెళ్ళిగా మారింది. పద్మ మొండితనం గలది. ఊర్లో జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో బాగా పాటలు పాడేది. తెలంగాణా పార్టీలకు ఆమె గోంతు అవసరమైంది. పద్మ ప్రస్తుతం తన ఊర్లో గ్రామీణ బ్యాంకులో బ్యాంక్ మిత్రగా పనిచేస్తుంది. సద్దుల బతుకమ్మ రోజు బతుకమ్మను ఆడటానికి వెళ్తే అందరూ తనను అవమానించారు. తెలంగాణా ఉద్యమంలో అన్ని కులపోల్లు ఒకే దగ్గర చేరి గౌరమ్మను చేసి, బోనాలు పెట్టి బతుకమ్మను ఆడారు. సద్దుల బతుకమ్మ రోజున వచ్చిన తేడా ఏమిటి? "డబ్బులిచ్చి బతుకమ్మల్నాడిచ్చి బోనాలెత్తిన పార్టీలను జాగృతోళ్లను నడగు" అని నరేష్ అన్నాడు. ఆ "నాయకురాలికి విదేశాల్లో బతుకమ్మ లనాడటానికే సరిపోయింది. మన వాడలోకొచ్చే తీరుకెక్కడదని, వాళ్ళకు కావల్సిన తెలంగాణా వాళ్ళ కొచ్చిందని దుర్గయ్య చెప్పాడు". బతుకమ్మలను పేర్చడం, ఆడడం తన ఇంటిలోనే అందరూ నేర్చుకున్నారు. సద్దుల బతుకమ్మ రోజు బతకమ్మను

కొమటోళ్ళు, కాపోళ్ళు, ఓ అడ్డ దగ్గర ఆడటానికి సిద్ధంకాగా అక్కడకు పద్మ తన బతుకమ్మను తీసుకెళ్ళింది. "మీ వాళ్ళ దగ్గరకు పోయి ఆడుకో అని సరిత వాళ్ళ అత్త అన్నది." అన్ని కులపోళ్లు కలిసి ఆడేటట్లు చేయ్యలేరా అని పద్మ అనగా "మొండివాదన చెయ్యకు తెలంగాణ వచ్చినంత సులభంగాదు దీనిని మార్చడం అని నరేష్ చెప్పాడు".

నరేష్‌కు ఉద్యమకాలంలో జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది. ఒక పల్లెలో డాక్టర్ ప్రజలకు వైద్యం చేసేవాడు. అతని భార్య సద్దుల రోజున కురుమ, గొళ్లోళ్లతో కలిసి బతుకమ్మను ఆడింది. దసరా పండుగ తరువాత రోజు డాక్టర్ దళితుడని తెలిసి అతని ఇంటిని, హాస్పటల్‌నీ ధ్వంసం చేశారు. ఊరునుండి వెళ్ళగోట్టారు. తెలంగాణ వచ్చిన సంబరంలో మాలమాదిగలు గ్రామ పంచాయితీ దగ్గర కోచ్చి బతుకమ్మను ఆడటానికి ప్రయత్నించగా పై కులపోళ్ళు బాగాతిట్టి మీరోచ్చి ఇక్కడ ఆడితే మా బతుకమ్మ మైలుపడుతుందని అన్నారు. పై కులపోళ్లు భూములు దళితులకు కౌలుకియ్యొద్దని వారిని కూలివనుల్లో పెట్టుకోకూడదని తీర్మానించారు. "వాళ్ళ బతుకమ్మని బంగారంతో చేస్తారా మనం చేసినట్ల పూలతోనే చేస్తారు". మనది అంటరాని బతుకమ్మఎట్లొది. వాళ్లది బంగారు బతుకమ్మ ఎట్లొంతుంది? అని పద్మ ఆలోచించింది.

ఈ కథ ద్వారా ఇప్పటకీ తెలంగాణాలో కులవివక్ష కొనసాగుతున్నదని అర్థమౌతుంది. సామాజిక తెలంగాణా ఇప్పటికీ దళితులకు చేరువకాలేదని, సబ్బండ వర్ణాలు ఒకే చోట కలసి ఆడుకొనే బతుకమ్మ కొరకు ఇంకెంత సమయం పడుతుందో తెలియండం లేదు. కథారచయిత "వాళ్ళకు గావల్సి తెలంగాణ వాళ్ళకొచ్చె" అని చెప్పారు అంటే తెలంగాణా ఉద్యమ ఫలాలు అన్ని వర్గాల వారికి సమానంగా అందడంలేదని, రాజకీయ అభివృద్ధి ఫలాలను కొన్ని వర్గాలవారే అనుభవిస్తున్నారని భావించవచ్చు.

ఇదే విషయాన్ని బండి నారాయణస్వామి "ప్రాంతీయ అస్తిత్వ పోరాటం ఏ ప్రాంతంలో జరిగినా ఆపోరాటాన్ని ఉత్పత్తి కులాలతో పాటు ఆధిపత్య కులాలు కూడా కలిసి పనిచేస్తుంటాయి. రాజకీయాల్లో ఉన్నట్లే ఉద్యమంలో కూడా ఆధిపత్య కులాలే ముందు భాగంలో ఉంటాయి. వారికి ఉన్న వనరులు కూడా అటువంటివి ఉద్యమం విజయవంత మైనపుడు దాని ఫలాలు కూడా ముందు భాగంలో ఉన్న ఆధిపత్య కులాల చేతుల్లోకేపోతాయి. ఇది అనివార్యంగా జరిగే క్రమము. అస్తిత్వ ఉద్యమాల్లో ఉత్పత్తి కులాలకు రాజ్యస్పృహ ఉండడం సహజమే! కాని ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమం తరువాతనే వారి రాజ్యాధికారపోరాటం ఆచరణలోకి రావడానికి అవకాశముంటుంది".

తెలంగాణా ఉద్యమ పొరాటంలో అన్ని కులాల వారు పాల్గొన్నారు. అందులో ఉత్పత్తి కులాలున్నాయి, ఉద్యమాన్ని ముందుండి నడిపించిన ఆధిపత్య కులాలు కూడా ఉన్నాయి. తెలంగాణా సాధనంలో అన్ని కులాల శ్రమదాగి ఉన్నది. తెలంగాణా సాధించిన తరువాత దాని పూర్తి ఫలితాన్ని కొందరే అనుభవిసున్నట్లు తెలుస్తుంది. పద్మ అన్నట్లు ఏ కులపోళైన తమ బతుకమ్మను పువ్వులతోనే చేస్తారు. కాని బంగారంతో బతుకమ్మను చెయ్యరు. ఈ కథలో కులవివక్షను ఎదుర్కొన్నది దళిత మహిళైన పద్మ తెలంగాణా ఉద్యమ సమయంలో ఏర్పాటైన సాంస్కృతిక కార్యక్రమాల్లో అన్ని కులాలతో కలిసి బతకమ్మను ఆడిన పద్మ ప్రస్తుతం తెలంగాణ వచ్చిన తరువాత మిగితా అన్ని కులాలతో కలిసి బతుకమ్మను ఆడకుండా కులవివక్షను ఎదుర్కొవడం ఎంత వరకు న్యాయమన్నది ఒక ప్రశ్నగా మిగులుతుంది. దళిత మహిళ పద్మ గొంతుకు ఆనాటి తెలంగాణ ఉద్యమ సాంస్కృతిక కార్యక్రమాల్లో గుర్తింపు లభించింది. ఇప్పుడు కూడా వర్తమాన తెలంగాణలో దళితులకు గుర్తింపు, గౌరవము కలగాలని కుల వివక్ష తొలగాలని ఆకాంక్షిస్తూ కథా రచయిత పి. చిన్నయ్య ఈ కథను రాశారు.

ఆధార గ్రంథాలు:

1. ద్వానా శాస్త్రి, "తెలుగు సాహిత్య చరిత్ర", ప్రతిభ పబ్లికేషన్, హైదరాబాద్.
2. కత్తి పద్మారావు, "కులం పునాదులు", నెల్లూరు జిల్లా హేతువాద సంఘం ప్రచురణ.
3. ప్రొఫెసర్. యస్. సింహాద్రి, "కులం నీడలో అభివృద్ధి రాజకీయలు", భూమి బుక్‌ట్రస్ట్, హైదరాబాద్.
4. కె. బాలగోపాల్, "దళిత", పర్‌స్పెక్టివ్స్ సామాజిక శాస్త్రం/సాహిత్యం, అంబర్‌పేట, హైదరాబాద్.
5. డా. యస్వీ సత్యనారాయణ, "దళిత వాద వివాదాలు" నవచేతన పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
6. బండి నారాయణస్వామి, "రాయలసీమ సమాజం–సాహిత్యం", పర్‌స్పెక్టివ్స్ సామాజిక శాస్త్రం/ సాహిత్యం, అంబర్ పేట, హైదరాబాద్.

రావిశాస్త్రి కథలు – శిల్పం – భాష

డా॥ యస్.సి. సంజీవరెడ్డి, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జమ్మలమడుగు – కడప జిల్లా.
సెల్. 9290447642

సారాంశం:

నేపథ్యంలోని ముఖ్యమైన అంశం భాష, కథలోని మొత్తం వాస్తవికథలో భాష ప్రధానమైన అంశం. భావాన్ని వ్యక్తం చేసే మాధ్యమం భాష, కథలో ఇద్దరు తమ భావాలను చెప్పుకుంటారు పాత్రలు పరస్పరం చెప్పుకోవచ్చు లేదా తమలో తాము చెప్పుకోవచ్చు రెండవ రకం భావ ప్రకటన రచయితది. రచయిత పరోక్షంగా తన భావాలను చెప్పు కుంటాడు.

'భాష' నేపథ్యంలో ఒక భావం వ్యక్తం కావడం కథా సాహిత్యంలో గురజాడ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రులతోనే ప్రారంభమైంది. గురజాడ విజయనగరం భాష వాడారు. శ్రీపాద ఉపయోగించిన భాష అతడు చిత్రించిన గోదావరి జిల్లా వెలనాటి బ్రాహ్మణులను సజీవంగా చిత్రించగలిగింది. పాత్రలు సాధరణీకరం చేయబడడం చేత అవి మాట్లాడే భాష నుడికారం దాదాపుగా లేని పత్రికా భాషకు దగ్గరగా ఉండేది. ఈ రోమాంటిక్ జీవిత చిత్రణ నుంచి జీవిత వాస్తవికత వైపు తెలుగు కథ మళ్ళిన తర్వాతనే మరొకసారి నేపథ్య చిత్రణ, అందుకు తగన భాష ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈ పరిణామం 1960లో రావిశాస్త్రితో ప్రారంభమయింది. అని వల్లంపాటి వెంకటసుబ్బయ్య గారి అభిప్రాయం. అందుకే తెలుగు కథా సాహిత్యంలో రొమాంటిక్ జీవిత చిత్రణ నుంచి కథను జీవిత వాస్తవికత వైపు మళ్ళించిన గౌరవం కళింగాంధ్రకే దక్కుతుంది.

రావిశాస్త్రి కథాశిల్పం : భాష

రావిశాస్త్రి తన కథలలో ఎక్కువగా విశాఖపట్నం ప్రాంతమాండలికాన్నే ఉపయోగించుకున్నాను. ముఖ్యంగా రావిశాస్త్రి సారాకథలలో విశాఖపట్నం మాండలికాన్నే ప్రయోగించాడు. సారాకేసులలో ఇరుక్కున్న వాళ్లంతా కూడా ఆ ప్రాంత అట్టడుగు వర్గాల వారే. 'మాయ' కథలో ముత్యాలమ్మ పాత్రద్వారా "కోరుటకు శానాసూట్లోద్చాను" అంటూ "శానాసూట్లు కోర్టుకొచ్చి పెద్ద పెద్ద ప్లీడర్లనే యెట్టి ఆళ్ళకి దోసిళ్ళతో ఫీజిలిచ్చేను. కానా రోజులు పోనాయి. ఇప్పుడిది వరకటి ముత్తేలమ్మని కాను శానా సితికిపోయినాను యాపారం దెబ్బతినేసింది, ఓ కొట్టుకి పదికోట్లు లెగిసి పోనాయి అంటూ అతిపేదవారు దయనీయ పరిస్థితిలో ఉన్నప్పుడు మాట్లాడుకొనే వాడుక భాషను స్పష్టంగా వినిపించాడు.

'న్యాయం" కథలో మేజిస్ట్రేటు గారికి ఓ ఆడముద్దాయికి జరిగిన సంభాషణలో

మేజిస్ట్రేట్ : మద్రాసు ప్రొహిబిషన్ ఆక్ట్ సెక్షన్ 4(1) ఎ ప్రకారం నీవు నేరం చేసేవని పోలీసు వారు నీమీద కేసు పెట్టారు. నేరం చేసేవా? ఆ ముద్దాయి సమాధానంగా తలూపింది.

మేజిస్ట్రేట్ : తలూపడంకాదు నోటితో సమాధానం చెప్పాలి

ఆడముద్దాయి : కేసుకొప్పేసు కుంటానండి

మేజిస్ట్రేట్ : అంటే నేరం చేసేనంటావా?

ఆడముద్దాయి : కేసు కొప్పేసుకుంటానండి

మేజిస్ట్రేట్ : నేరం చేసేవా?

ఆడముద్దాయి : కేసు కొప్పేసుకుంటాను బాబుగారూ"

అంటూ సాగిన ఈ సంభాషను పరిశీలిస్తే రచయిత పాత్రో చిత భాషను ఉపయోగించుకున్న తీరు తెలుస్తుంది. ఈ విధంగా రావిశాస్త్రి తనసారా కథలన్నింటికి కూడా

విశాఖపట్నం మాండలికాన్నే ఉపయోగించుకున్నాడు.

'పిపీలికం', 'పాతదే కథ' మొదలైన కథలలో భాషను ఉపయోగించుకోవడంలో ప్రత్యేకమైన పద్ధతులను అనుసరించాడు. మౌఖిక సంప్రదాయంలో కథను ప్రారంభించిన రచయిత పిపీలికం కథను "పూర్వం కృతయుగంలో ఒకానొక ప్రజాపతి రాజ్యం చేసే కాలంలో గౌతమీ" నదికి ఉత్తరంగా శ్యామమనం అనే అడవిలో ఓ పెద్ద మఱ్ఱిచెట్టు ఉండేదిట. ఆ మఱ్ఱి చెట్టు క్రింద దాని మానుని అనుకొని ఓ పెద్ద పుట్ట ఉండేదట, అందులో నివసించే ఒకానొక చీమకి ఉన్నట్టుండి తానెవరో తెలుసుకోవాలనే జిజ్ఞాస కలిగిందట. అంటూ కథను ప్రారంభించాడు. వాఖ్యం చివర ఉండేదిట, కలిగిందట, ఆలోచించనారంభించిందట, అంటూ వదాలను ప్రయోగించి కథ డైరెక్టుగా రచయిత చెప్పినట్లు లేకుండా ఎవరో చెప్పినది తాను విని చెప్పినట్లుగా కథను నడిపాడు. కథలో ఇటువంటి భాషను ఉపయోగించటం అనేది సమాజంలో దోపిడీ జరుగుతున్నది అనే విషయం తన ఒక్కనికే కాకుండా సమాజంలో అందరికీ తెలుసునని చెప్పినట్టుగా భావించవచ్చు. ఈ విధంగా కథలో భాషను ఉపయోగించటం శిల్పంలో నేర్పుగా భావిస్తాము.

రచయిత భాష:

రావిశాస్త్రిది విశాఖపట్నం ప్రాంతం. ఉద్యోగరీత్యా ఆంధ్రలో కొన్ని ప్రాంతాలలో సంచరించినా చివరికి లాయరు వృత్తిలో విశాఖపట్నంలోనే స్థిరపడ్డారు. అందుకే కళింగాంధ్రరచయితలు వాడే విశాఖపట్నం మాండలికానే తన కథలలో ఎక్కువగా ఉపయోగించుకున్నాడు. ఉత్తమ పురుష కథనంలో నడచిన 'కష్టార్జితం' కథలోని ఈ వ్యాఖ్యానం విశాటపట్నం మాండలికాన్ని స్పష్టంగా చూపిస్తుంది.

"అప్పటికి ఆర్నెల్లక్రితం తన ఏభయ్యయిదో యేట ఆ ముసలాయన గవర్నమెంటు సర్వీసునుండి రిటైరయ్యేట్ట. అతనికి అరవయేళ్ళుంటాయి. కులద్వేషాన్ని పురస్కరించుకొని తాశీల్దారీతో అతనికి సరిపుచ్చేసీరట, లేకపోతే అతను డిప్యూటీ కలెక్టరుగా రిటైరవ్వలసిందట. పనిచేస్తునన్నాళ్లూ కష్టపడి చెమటోడ్చి పనిచేసేట్ట.

ఉత్తమ పురుష కథనంలో వచ్చిన 'విలువలు' కథలో స్పష్టమైన ప్రామాణిక భాషను కూడా ఉపయోగించుకున్నాడు.

"ఈ కమర్షియల్ సివిలైజేషన్లో నాకరిఘడియ సుఖమిచ్చేందుకు ఆ స్త్రీ విలువ రూపాయిన్నర. మా కాంట్రాక్టుకి నిర్ణయించుకోని కన్‌సిడరేషన్ ఒక రూపాయీ ఎనిమిదిణాలు, వ్యక్తిని బట్టీ, సమయాన్ని బట్టి, స్టేటస్‌ని బట్టీ, పర్సు బట్టీ విలువ హెచ్చవచ్చు. లేక తగ్గావచ్చు.

రావిశాస్త్రి తనకథలో అలంకారాలకు ఎక్కువ ప్రాధాన్యాన్నిచ్చాడు. ముఖ్యంగా ఉపమాలంకారాలపై మక్కువ ఎక్కువ. ఆయన ఉపమాలంకారాలను భద్రిరాజు క్రిష్ణమూర్తి గారు 'రావిశాస్త్రి రచనలో సిమిలీ' అని ఇరవై పేజీలకు పైగా వ్యాసాన్ని వ్రాశారు. ఈ వ్యాసం ఒక బుక్కులకు మాత్రమే పరిమితం. మిగిలిన కథలకు, కథలూ నవలల్లోని సిమిలీని గురించి కూడా వ్రాస్తే ఒక సిద్ధాంత గ్రంధం అవుతుంది.

రావిశాస్త్రి ఉపమానాలను ప్రకృతిని మనిషిలో, మనిషిని ప్రకృతితో, మూర్తాన్ని అమూర్తంతో, ఒక క్రియను మరో క్రియతో, ఒక అనుభవాన్ని మరో అనుభవంతో పోల్చుతూ ఇలా ఈ భౌతిక ప్రపంచంలో మానవ సమాజంలో ఎన్ని రకాల ఉపమానాలు సాధించవచ్చునో అన్ని రకాలను ఆయన సాధించారు. కేవలం అలంకారం కోసం మాత్రమే ఉపమానాలు వాడడు. ఒక సన్నివేశాన్ని, ఒక సంఘటనను, ఒక పాత్ర స్వభావాన్ని, స్వరూపాన్ని, ఒక భావాన్ని, ఒక ఆ లోచనను మరింత స్పష్టం చేయడానికి ఉపమానాలను వాడుకున్నాడు.

రావిశాస్త్రి తన కథలలో భాషను ఉపయోగించటంలో ఆరోగ్యకరమైన దృక్పథాన్నే ప్రదర్శించాడు. తన కథలను

వాస్తవిక దృక్పథంలో వర్ణించడానికి పాత్రలకు అనుకూలమైన భాషను ఉపయోగించుకొని ఆయా పాత్రలకు తగినట్లుగా పాత్రోచితమైన భాషను కూడా ఉపయోగించుకున్నారు.

'అగ్గిపుల్ల' కథలో సముద్రాలను చూసిన శేషగిరిని గురించి చెప్తూ "పెద్దసైజు కోడిపెట్టని చూసి ఏంచెయ్యాలో తెలియని పిల్లిలా అయిపోయాడు' అంటాడు.

"సముద్రమంతా పీనుగల పెంటతో నిండిపోయి కదిలే యుద్ధభూమిలా ఉంది. హోలాహలంగా ఉంది".

"ఒడ్డును వరుసగా నిల్చున్న సరువుడు చెట్లు స్నానానికి వచ్చిన ఋషుల్లా నిల్చున్నాయి. అన్ని కష్టాలు చూసిన తాతగారి సాత్రునయనాల్లా సముద్రం తళతళలాడుతోంది".

"సెలవులకి ఇంటికొచ్చిన కుర్రవాళ్ళా చంద్రుడు కలకల్లాడుతున్నాడు"

"ముసలాడి కోపంలా విరుచుకు పడ్డ కెరటాలు ఆడదాని శోకంలా అణగారి పోతున్నాయి"

'న్యాయం' కథలో రాత్రంతా వ్యభిచారం చేసి అలసిపోయిన ఓ ఆడముద్దాయిని గురించి చెప్తూ రచయిత మూడో తరగతి రైలుపెట్టెలో ఓ మూలనపడి వాడిపోయిన పువ్వుల దండలా ఉందామె" అని వర్ణిస్తాడు. సూర్యుడు సెలవురోజున స్నూడెంటు కుర్రాళ్లా లోకంమీద పడటం, బొడికొండలు బ్యాంకుల నిండా డబ్బు దాచుకున్న షావుకార్లలా నిశ్చితంగా నిద్రపోవడం వంటి ఉపమానాలను రావిశాస్త్రి మాత్రమే వాడగలడు.

ప్రపంచ రాజకీయాలను ఉపమానాలలో చేర్చడం కూడా రావిశాస్త్రి కథలలో ఉంది.

"దక్షిణమెరికాలో అమెరికా రాయభారి మాట వంటిది. ఇన్స్‌పెక్టరుగారి మాట"

"ముసోలినీగాడు అబిసీనియాని తినేసినట్టు పులి మిమ్మల్ని తినేసింది".

జాతీయ రాజకీయాలను కూడా తన కథలలో ఉపమానాలుగా స్వీకరించాడు.

"నేనాయన్ని ఆ రోజుల్లో కాంగ్రేసు వాళ్ళు ఇంగ్లీషు వాళ్ళని చూసినట్లుగా చూడ్డం ప్రారంభించేను".

"నల్లవాళ్ళని తెల్లవాడొకంతట వదలనట్టు దారిద్ర్యాన్ని ఈగలొదలవు"

రావిశాస్త్రి ఉపమానాలను కొన్ని విభాగాలలోకి కుదించడం కష్టమైన పని. ఆయన ఉపమానాలను గురించి ప్రత్యేకంగా అధ్యయనం చేస్తేనే గాని వాటిని వర్గీకరించడం సాధ్యంకాదు. రావిశాస్త్రికి శిల్పంపైన అలంకారాల పైన ఉండే మోజు మోతాదుకు మించిందని విమర్శకులు చెప్పేమాటల్లో కొంతవరకు నిజంలేకపోలేదు. "'కానీ ఆయన కథాకథనంలో శిల్పంలో ప్రవేశపెట్టిన నవ్యరీతులు, ఉపయోగించిన ఉపమానాలలోని వైవిధ్యం, విస్తృతి, మానవ జీవితంలోని సంక్లిష్టతని, గాఢతని లోతులను వాస్తవాలను మరింత స్పష్టంచేయడానికే ఉపకరించాయన్న విషయాన్ని విమర్శకులు ఒప్పుకోక తీరదు" అన్న రంగనాథాచార్యుల గారి అభిప్రాయాన్ని ఇక్కడ గమనించవచ్చు.

ఆధార గ్రంధాలు :

1. కథాశిల్పం – మల్లంపాటి వెంకటసుబ్బయ్య – పుట – 31
2. భారతీయ సాహిత్య నిర్మాతలు – పుట – 3

స్త్రీవాద కవిత్వం – పరిశీలన

నూనావతు పార్వతి, తెలుగు అధ్యాపకురాలు, తెలుగు శాఖాధిపతి , తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, సంగారెడ్డి, బుధేర. చరవాణి: 9550110873

ఆది నుండి వేదకాలం వరకు మహిళలకే అగ్రస్థానం ఇచ్చిన ఈ సమాజంలో రానురాను మహిళల స్థానం దిగజారుతూ వచ్చి క్రమంగా పురుషాహంకారం పెరిగి పితృస్వామ్య వ్యవస్థ ఆధిపత్యంలోకి వచ్చింది. మన సామజిక సాహిత్య చరిత్రను పరిశీలిస్తే ఈ ఆరోపణలు ఎంతవరకు సత్యమో స్పష్టమవుతుంది. పురుషులే మొదటినుంచి స్త్రీలను మానసికంగా, ఆర్థికంగా, సామాజికంగా, మతరాజకీయ పరంగా, విడిగా ఉంచి వర్గవిభజనకు మార్గదర్శకులయ్యారు. స్త్రీలు అబలలనిచెప్పి వారిని అణచివేసి ఈ రంగాలన్నింటిలో తమ ఆధిక్యతను నిలబెట్టుకున్నారు. సమాజంలో సగభాగమైన స్త్రీని, సమాజానికి మూలమైన స్త్రీ జాతిని వదిలేసి పురుషప్రపంచంగానే చూడటం ప్రారంభించారు. అలా ఋగ్వేదకాలం నుండి మహిళలను అబలలని చులకన చేస్తునే క్రమంగా ఇంటికి పరిమితం చేసారు. మన హిందు పురాణాలు, ధర్మశాస్త్రాలు కూడా స్త్రీలను అణచివేసే విధంగా సిద్ధాంతాలను, ధర్మసూత్రాలను తయారుచేశాయి. మను ధర్మశాస్త్రములో స్త్రీలకు విధించిన ధర్మాలన్ని అన్యాయమైనదే. పురుషుని కోసం స్త్రీగాని, స్త్రీకోసం పురుషుడు కాదని బైబిల్ చెప్పింది. స్త్రీలకు సంరక్షకులు, అధికారులు పురుషులే అని మహమ్మద్ ప్రవక్త తిర్మానించారు. అరిస్టాటిల్ నుండి హెగెల్ వరకు ఆడవాళ్ళు అల్పులు అనే భావనే చెప్త వచ్చారు. అసలు పురుషుడు స్త్రీని అణచివేయడానికి వాడుకున్న ప్రధాన ఆయుధం స్త్రీ శరీరం. ఇంట్లో భార్యనుంచి వీధిలో పరాయి స్త్రీ వరకు తన గుప్పిట్లో ఉంచుకోవడానికి ప్రయత్నిస్తాడు. పితృస్వామ్య సమాజం స్త్రీని శరీరం పేరుతో కట్టడి చేసింది. చలంగారు అన్నట్టు స్త్రీలను అణచివేయడం వల్ల మనదేశం ఎంతోమంది కళాకారులను, విద్యావేత్తలను పోగొట్టుకుంది. స్త్రీ పురుషుల అసమానత మనదేశంలోనే కాదు ప్రపంచమంతటా ఉంది.

తోలితెలుగు కవయిత్రిగా పేరుపొందిన తాళ్ళపాక తిమ్మక్క, మొల్ల మొదలైన వారి కవిత్వం భక్తి ప్రధాన కవిత్వం. తర్వాత కాలంలో వచ్చిన కవయిత్రులు మధురవాణి, రంగాజమ్మ రామభద్రాంబ, తరిగొండ వెంగమాంబ, గంగాదేవి మొదలైనవారు పురుషదృక్పథంతోనే కవిత్వం రాశారు. భావకవితాయుగంలో కవయిత్రులయిన తల్లాప్రగడ విశ్వసుందరమ్మ, చావలి బంగారమ్మ, బసవరాజు రాజ్య లక్ష్మమ్మ వంటివారు పురుష ప్రాభవంలోంచే కవిత్వం రాశారు. ఆధునిక కాలంలో వచ్చిన కవయిత్రులు ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ, నాయని కృష్ణకుమారి, జ్యోతిర్మయి, దుర్గం తారాబాయి, శీలాసుభద్రాదేవి, కొలకలూరి స్వరూపరాణి వంటి కవయిత్రులు మేల్కొని స్త్రీ జాతిని మేల్కొల్పడానికి రచనలు చేశారు.

1980 తర్వాత స్త్రీవాద రచనల్లో విప్లవాత్మకమైన మార్పు వచ్చింది. కందుకూరి వీరేశలింగం పంతులుగారు, గురజాడ అప్పారావుగారు వీళ్లిద్దరు స్త్రీ జనోద్ధరణకోసం, స్త్రీ చైతన్యం కోసం పోరాటం చేసిన వాళ్ళు. వీరి తర్వాత వీళ్ళ ప్రయత్నాలను అందుకున్న వాళ్ళు ఎవ్వరు లేరని చెప్పవచ్చు. కొంతవరకు భావకవిత్వం ప్రయత్నించింది.

తెలుగు సాహిత్యంలో లైంగికత్వం, కుటుంబం, పితృస్వామ్యం, భాష, జెండర్ వంటి అంశాలు స్త్రీవాదం చర్చలోకి వచ్చాయి. లైంగిక వివక్షకి మూలం పితృస్వామ్య సామజిక వ్యవస్థ. సమాజపరంగా, కుటుంబపరంగా ఎదుర్కొనేటువంటి సమస్యలను స్త్రీలు ఏవిధంగా ఎదుర్కొంటున్నారో స్త్రీవాదం చెప్తుంది. స్త్రీ పురుషుల అసమానత మన దేశంలోనే కాదు ప్రపంచమంతటా ఉంది. ఎన్నో సంవత్సరాల పోరాట ఫలితంగా స్త్రీలు ఓటు హక్కును సాధించగలిగారు. విశ్వవిద్యాలయాల్లో ఉన్నత

చదువులు చదవడం, ఉద్యోగం చేయడం, వ్యాపారరంగాల్లో రాణించడం, విడాకుల హక్కు పొందడం వంటి వాటిని సాధించగలిగారు.

ప్రాచీనకవులు స్త్రీ సౌందర్యాన్ని వర్ణిస్తే, కొందరు ఆధునిక కవులు స్త్రీ అవయవాలను వర్ణిస్తే తప్పులేదు కానీ నేటి స్త్రీవాద కవయిత్రులు స్త్రీల సౌందర్యాల వెనుక దాగిన రోగాలను, బాధలను కవితా రూపంలో వెల్లడి చెయ్యగానే అశ్లీలత అంటూ అసహ్యించుకుంటున్నారు. వాస్తవం చేదుగా ఉంటుంది. అందుకే స్త్రీవాద కవిత్వం విమర్శలకు గురవుతున్నది. సాహిత్యంలో స్త్రీని ఎంత అసభ్యకరంగా చిత్రించారో జయప్రభ చెప్పిన తర్వాతనే సామాన్యులకు అర్థమయ్యింది. ఇంతవరకు వచ్చిన సాహిత్యాన్ని, కవిత్వాన్ని స్త్రీ దృష్టితో పరిశీలిస్తే సమాజం స్త్రీకి ఇచ్చిన విలువ ఏంటో అర్థమవుతుంది. అనాదిగా పితృస్వామ్య సమాజం స్త్రీని శరీరం పేరుతో ఏవిధంగా కట్టడి చేసిందో ఈ భావాల్నే జయప్రభ 'పైటని తగలెయ్యాలి' అనే కవితలో వ్యక్తం చేసారు. "నేను నడిచే శవాన్ని కాకుండా ఉండాలంటే ముందుగా పైటని తగలెయ్యాలి" అని అంటారు. పురుషాధిక్య ప్రపంచం ఏది నిషిద్ధం అని చెప్పిందో దాని మీద పనికట్టుకుని కవిత్వం రాశారు కవయిత్రులు. హింసాసంస్కృతి పెరిగిన ఈ సమాజంలో మొదట దోపిడికి గురయ్యేది స్త్రీల శరీరాలే.

'చావటానికి మా దగ్గరికి రాకండి
బతకడానికి నానా చావు చస్తున్నవాళ్ళం' అంటుంది.

అధికారయంత్రంగం, అసమర్థతకు, పోలీసులరాక్షసత్వానికి, పురుషవ్యవస్థ పైశాచికత్వానికి మధ్య నలిగిపోతున్న వేశ్యల విషాదాన్ని ఈ కవితలు బలంగా ప్రతిబింబించాయి.

విమల రాసిన 'సౌందర్యాత్మక హింస' కవిత్వంలో సౌందర్యం పేరిట దేహానికి వేసుకుంటున్న సంకెళ్లను సూటిగా నిరసిస్తారు కవయిత్రి.

కొండెపుడి నిర్మల రాసిన 'తెల్లరికట్టకివతల' కవిత్వంలో స్త్రీ పురుషుల మధ్య లైంగిక సంబంధమైన విషయాలను చెప్తుంది.

ఎంత అమానుషమైందీ వంట గది!
మన రక్తం పీల్చేసి, మన ఆశల్ని, కలల్ని కాజేసి
కొద్దికొద్దిగా జీవితాంతం పీక్కుతింటున్న
రాకాసి గద్ద ఈ వంటిల్లు

స్త్రీని వంటిటి కుందేలుగా చేసి ఆడిస్తున్నారన్న సంగతి ఈ కవిత ద్వారా తెలియజేశారు విమలగారు. ఒక ఆదర్శ గృహిణి ఎలా మెలగాలో చెప్తుంది. కొండెపుడి నిర్మల రాసిన 'లేబర్ రూం' కవితలో

''అయ్యో!
పాలింకి పోవడానికున్నట్టు
మనసింకి పోవడానికి
మాత్రులుంటే ఎంత బావుండు"

అని అన్న వాక్యాలు ఒక్కసారిగా పురుషాహంకారాన్ని చెళ్లుమనిపించాయి.

సమాజంలో స్త్రీలు ఎంత అనాదరణకు గురువుతున్నారో సావిత్రి రాసిన బందిపోట్లు కవితలో చూడవచ్చు.

పాఠం ఒప్పజెప్పకపోతే 'పెళ్ళి' చేస్తానని పంతులు గారన్నప్పుడే భయమేసింది.

సమాజంలో జరిగే సంఘటనల ఆధారంగా పురుషాధిక్యతను విమర్శిస్తు ఈ కవిత వ్యంగ్యంగా ఉంది సూటిగా మనసునుహత్తుకుంటుంది. వాణి రంగారావు రాసిన 'తివాచీ' కవితలో సంప్రదాయానుగుణంగా మధ్యతరగతి జీవితాన్ని గడిపే స్త్రీని 'తివాచీ' గా వర్ణించి చెప్పారు. ఓల్గా రాసిన 'ప్రతి స్త్రీ ఒక నిర్మల కావాలి' కవితలో సమాజంలో స్త్రీ ఎంతగా అణగద్రొక్కబడుతుందో వివరించారు. జయప్రభ, ఘంటసాల నిర్మల, ఓల్గా వారి కవితల్లో పురుష సమాజంపట్ల కసి కనిపిస్తుంది.

ఇంకా రావులపల్లి సునీత, పాటిబండ్ల రజని, శివలెంక రాజేశ్వరీదేవి, విమల, హైమావతి మొదలైన కవయిత్రులు స్త్రీవాద కవితలు రాస్తు స్త్రీ సమస్యల్ని, స్త్రీ బాధల్ని

శక్తివంతంగా చెప్పారు. పురుషాధిక్యతను నిరసించారు. స్త్రీలు స్వేచ్ఛకోసం ఎంతలా పరితపిస్తున్నారో చెప్పారు. ఈ విధంగా చెప్పుకొంటూపోతే స్త్రీవాద సాహిత్యంలో వచ్చిన ప్రతి కవితా స్త్రీని బానిస సంకెళ్లనుంచి విముక్తి చేయాలనే ఆలోచనతో వచ్చినవే.

1993లో వచ్చిన 'నీలిమేఘాలు' అద్భుతమైన కవితా సంకలనం. వసంత కన్నాభిరాన్, ఓల్గా, కొండెపుడి నిర్మల, జయప్రభ, శివలెంక రాజేశ్వరీదేవి, కె. గీత, విమల, రజియాబేగం, ఘంటశాల నిర్మల, పాటిబండ్ల రజని, రేవతీదేవి, ఊర్మిళ, సావిత్రి, అబ్బూరి ఛాయాదేవి, ఏలూరి పార్వతి, అంజన, ఎస్. జయ, వాణి రంగారావు, కె. వరలక్ష్మి, రావులపల్లి కోటేశ్వరమ్మ, సుధ, శిలాలోలిత, జయప్రభ, శాంతిప్రియ, కుప్పిలి పద్మ, రత్నమాల, వకుళాభరణం లత వంటి వారు రాసిన కవితలు ఆలోచనాత్మకంగా ఉన్నాయి. 1990లో ప్రముఖ స్త్రీవాద రచయిత్రి కొండెపుడి నిర్మల రాసిన 'సందిగ్ధ సంధ్య', నడిచేగాయాలు, 2001లో రెంటాల కల్పన రాసిన నేను కనిపించేపదం, ఘంటసాల నిర్మల రాసిన 'నిర్వచనం' అనే కవితా సంకలనాలు కూడా ఆలోచనాత్మకమైనవి.

"ఆకాశంలో సగం నీవు సగం నేను
మనిద్దరం కలిసి ఉద్యమిస్తే ఉప్పెన
విప్లవిస్తే విజయం"

అని శివసాగర్ అన్న మాటలు అందర్నీ ఆలోచింపజేస్తుంది.

రాయప్రోలు సుబ్బారావు రాసిన దీర్ఘకవిత 'స్నేహలతా దేవి' వరకట్న దురాచారం గురించి వివరించారు. చెరబండ రాజు, గద్దర్, వరవరరావు వంటి విప్లవ కవులు కూడా స్త్రీ విముక్తి కొరకు తోడ్పాటునందించినవారే. త్రిపురనేని శ్రీనివాస్, చేరా వంటి పత్రికా రచయితలు కూడా స్త్రీవాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తోడ్పాటును అందించినవారు.

రేవతీదేవి రాసిన 'శిలాలోలిత' అనే కవితకి 1983లో ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు వచ్చింది

ఇంటి పనిలో ఎంత పునీతం అవుదామనుకున్నా జీవితం ఎందుకో ఎప్పుడూ కాటు వాసన వేస్తూనే ఉంటుంది – ఓల్గా

నేను పతివ్రతామ తల్లిని కాను
ప్రబంధ కన్యను కాను
పంచదార చిలుకను కాను
ఫ్యాషన్ బొమ్మను కాను
పసిపాపను కాను

పాంచాలిదేవి నిర్మల వారసురాలిని అని ఓల్గా తన కవిత్వంలో అన్నారు.

కే. గీత అనే రచయిత్రి 'ద్రవభాష' అనే కవితలో నాలోనేనే ద్రవమయి, మళ్ళి గట్టిపడి ముద్దనయ్యానని చెప్పుకున్నారు.

కె. రామలక్ష్మి అనే రచయిత్రి 'అవ్యక్త వేదనానురాగం' కవితలో నాదేహాన్ని ఒక ఒద్యశీలగా మార్చుకొని అనంత వాయువుల్లోకి అవ్యక్త వేదనారాగాన్ని అనంత వాయువుల్లోకి పయనిస్తాను అని అన్నారు.

చల్లపల్లి స్వరూపరాణి రాసిన 'పెట్టుబడి దారి పెనిమిటి' అనే కవితలో పెట్టుబడి దారి పెనిమిటిని సర్పులో నానాబెట్టి పైనుంచి కిందికి జాడిద్దాం.

శ్రీమతి (ఎస్. రజియాబేగం) రాసిన 'నేనొక నిషిద్ధ జీవిని' అనే కవితలో

నేనొక స్త్రీని
నేనొక నిషిద్ధ జీవిని
మొన్న నానవ్వు నిషిద్ధం
నిన్న నా చదువు నిషిద్ధం
నేడు నా బ్రతుకే నిశ్శిద్ధం

మొక్కపాటి సుమతి రాసిన 'మిత్ర వైరుధ్యం' కవిత భర్తను దుష్ట శత్రువుగా వర్ణించింది. వర్గ శత్రువు నా శ్రమను దోచుకుంటాడు. ఈ దుష్ట శత్రువు నా బ్రతుకునే దోచుకుంటాడు.

అబ్బూరి ఛాయాదేవి 'విన్నావా' కవితలో నువ్వు ఆడదానివి గీత దాటకూడనిదానివి మచ్చుపడితే మాయనిదానివి అని స్త్రీ యొక్క అంక్షల్ని చూపించారు.

అసలు స్త్రీవాద సాహిత్యం స్త్రీ చైతన్యం గురించి చెప్పాలంటే ముందుగా చలం గురించి చెప్పాలి. చలం తన రఓచనల్లో స్త్రీ స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను కాంక్షించారు.

స్త్రీకి శరీరం ఉంది – దానికి వ్యాయామం ఇవ్వాలి.

స్త్రీకి మెదడు ఉంది – దానికి విజ్ఞానం ఇవ్వాలి.

స్త్రీకి హృదయం ఉంది – దానికి అనుభవాన్ని ఇవ్వాలని అన్నారు చలం.

మగవారు ఇళ్లలో బంధించే స్త్రీలు రక్షితలు కారు తమను తాము స్వయంగా కాపాడుకోగల స్త్రీలే అసలైన రక్షితలు అని స్త్రీకి పురుషాధీనత పనికిరాదని స్వశక్తి పైన విశ్వాసం ఉండాలని బోధించిన స్త్రీ నేటి స్త్రీ ఉద్యమకారిణి కాదు.

18వ శతాబ్దం చివరి భాగంలో బండారు అచ్చమాంబ 'అబలా సచ్చరిత్ర రత్నమాల' అనే గ్రంథంలో స్త్రీలకు చేసిన ఉపదేశమిది.

ఈ విధంగా మనకున్న అతికొద్దిమంది రచయిత్రులు పితృస్వామ్య సమాజం నుండి బయటకు వచ్చి తమ చుట్టు ఉన్న సమాజంలో జరుగుతున్న పురుషాధిక్యతకు బలైపోతున్న స్త్రీల పట్ల స్పందించి రాయడం జరిగింది. ఈ రోజుల్లో ఒక రచయిత్రి పురుషాధిక్యతను విమర్శించిందంటే "ఆమె విదేశీ భావాలు కలదని లేదా ఉన్నత కుటుంబానికి చెందిన స్త్రీ" అనే అభిప్రాయం చాలా మందిలో ఉంది. స్త్రీవాదులే పురుషద్వేషంతో స్త్రీ పురుష వర్గ భేదాలను వర్గ పోరాటాన్ని సృష్టిస్తున్నారని డా. ముదిగంటి సుజాత రెడ్డి ఫెమినిస్టులపైన ఆరోపణలు చేశారు.

స్త్రీ పురుషుల మధ్య వ్యత్యాసం ఉన్నంతకాలం, ఆర్థిక, రాజకీయ, సాంఘిక రంగాల్లో వ్యత్యాసం ఉన్నంతకాలం స్త్రీవాదం ఉంటుంది. స్త్రీవాద రచనల్లో ఎక్కువ పట్టణ, నగర స్త్రీ జీవిత సమస్యలే చిత్రితమయ్యాయని ఒక అపోహ కూడా ఉంది. పురుషాహంకారానికి గురవుతున్న, ఆర్థిక దోపిడికి గురవుతున్న, చదువుకు దూరంగా ఉంటున్న అసంఖ్యాక గ్రామీణ పేద స్త్రీల జీవిత సమస్యలు కూడా స్త్రీవాద కవితల్లో చిత్రితమైతే స్త్రీవాదానికి ఒక సమగ్రత ఏర్పడుతుంది.

తెలుగు సాహిత్యంలో స్త్రీ కవయిత్రులు స్వతంత్ర్యంగా తమ అనుభవాలను చెప్పడానికి ప్రయత్నిస్తున్నారు. సానుభూతితో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. అంతేకాని స్త్రీ జీవితాన్ని అణచివేసినట్లు ఆమె సాహిత్యాన్ని కూడా అణచివేసే ప్రయత్నం చేయవద్దు.

మూల గ్రంథాలు:

1. తెలుగు సాహిత్యంలో స్త్రీవాదం – డా. బాణాల భుజంగరెడ్డి
2. స్త్రీవాద వివాదాలు – డా. ఎస్వీ సత్యనారాయణ
3. అంతర్జాల వ్యాసాలు

తెలుగులో స్త్రీల కథా సాహిత్య ధోరణులు

డా॥ ముదాడి శ్యామల, పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), వడ్డేపల్లి, హన్మకొండ జిల్లా.
సెల్ : 9491820945

ఆంధ్ర దేశంలో సంస్కరణోద్యమం స్త్రీలు విద్యావంతులు కావటానికి, సంఘాలు పెట్టుకోవడానికి, తోటి స్త్రీలను విద్యార్జనకు ప్రోత్సహించడానికి కారణమైంది. అలా తయారయిన మొదటితరం స్త్రీలలో బండారు అచ్చమాంబ ఒకరు. ఆమె తొలి తెలుగు కథారచయిత్రి కూడా కావటం విశేషం. అచ్చమాంబ రాసిన మొట్టమొదటి కథలు 'ప్రేమ పరీక్షణము' (జులై, 1898), 'ఎఱుపు సొమ్ము పరువుచేటు' (సెప్టెంబరు, 1898) రాయసం వెంకటశివుడు సంపాదకత్వంలో వెలువడిన తెలుగు జనానా పత్రికలో అచ్చయ్యాయి. కాని ఆ పత్రికలు అందుబాటులో లేనందున అదే పత్రికలో 1901 మే నెలలో అచ్చయిన 'గుణవతియగు స్త్రీ' కథను మొట్టమొదటి కథగా పరిగణిస్తున్నారు. [1] బండారు అచ్చమాంబకు కొనసాగింపుగా మండపాక జోహానమ్మ 1902 జూన్ 1వ తేదీన కథారచన ప్రారంభించి ' రెండు సంచులను గూర్చిన కథ 'రాసింది. విన్నకోట లక్ష్మీ జోగమ్మ 1 జులై, 1902లో 'అవివేకపు వెంకమ్మ' కథతో కథారచనకు శ్రీకారం చుట్టింది. పులుగుర్త లక్ష్మీనరసమాంబ 1902లో కథారచన ప్రారంభించి "సత్కథావల్లరి" పేరుతో స్త్రీలకోసం నీతి బోధకమైన పురాణ కథలను రచించింది. మొసలికంటి రామాబాయమ్మ కూడా అదే తేదీన రచన ప్రారంభించి 'నీలాటి రేవులో యిద్దరు స్త్రీల సంభాషణ', 'నగలు', 'విమల' వంటి కథలను రాసింది.

వడ్లమన్నాటి సుందరమ్మ 'సతీమణీ' కథతో, శ్రీధర సీతాదేవమ్మ 'లోభివాని' కథతో, గంటి జోగమాంబ 'సుగుణవతి-దుర్గుణవతి'కథతో, గుండాల లచ్చమ్మ 'సతీహితోపదేశము' కథతో 1903లో కథారచనకు శ్రీకారం చుట్టారు. బాలాంత్రపు శేషమ్మ 'ధైర్య స్థైర్యములు' కథ, ఉన్నవ లక్ష్మీబాయమ్మ 'స్త్రీ విద్యను గురించిన కథ' 1904 నాటివి. ఇదే సంవత్సరం చౌ.శాంతాబాయి, సప్నివీసు లక్ష్మీ నర్సుబాయి చెరో కథను రాశారు. 1904 వరకు '14' మంది స్త్రీలు '25' కథలు రాశారు[2].

1904తర్వాత నుండి 1926వరకు మనకు రచయిత్రుల కథలు లభించడం లేదు. 1926 నుండి విరివిగా వచ్చాయి. దీనిక్కారణం వత్రికారంగం విస్తరించటం. గృహలక్ష్మి పత్రిక స్త్రీల రచనలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇయ్యటం.

కనుపర్తి వరలక్ష్మమ్మ 1926 నవంబర్‌లో రాసిన 'రెండుకోర్కెలు కథ' ఆనాటి సమాజంలోని కుటుంబ వ్యవస్థలో ముఖ్యంగా భర్త సాన్నిధ్యంలోనే స్త్రీకి రక్షణకలదన్న భావజాలాన్ని తెలియజేస్తుంది. 1926-28లో రాసిన 'మీ పాదముల సాక్షిగా' అనే కథ స్త్రీలు మూర్ఖత్వాన్ని విడనాడి చైతన్యవంతులు కావడానికి మహిళాసంఘాలు ఉపకరిస్తాయని చెబుతుంది.బసవరాజు వెంకటరాజ్యలక్ష్మి 1931లో 'ఎవరిదదృష్టం?'అనే కథలో జాతీయోద్యమంలో స్త్రీల క్రియాశీలక పాత్రను చిత్రించింది. తొలి దళిత కథారచయిత్రి గొట్టుముక్కుల మంగాయమ్మ 1935 మార్చిలో 'అయ్యోపాపం' అన్న కథతో మొదలుపెట్టి చాలా కథల్లో అస్పృశ్యత సమస్య నివారణ జరగాలనే ఆవేదనను, అగ్రకులాల వైఖరిపట్ల నిరసనను తెలిపింది. 1939లో నందగిరి ఇందిరాదేవి, సాధన సమితిని స్థాపించి రొమాంటిసిజం లక్షణాలు గల కథలు రాసింది. తొలితరం తెలంగాణా కథకురాలు. 1941లో 'పందెం' అనే కథను రాసింది. జానపద మాండలికాల్లో కథలు రాసిన వారిలో డా॥ పాకాల యశోదా రెడ్డి ఒకరు. మొదటికథ 1940-మాతృభారతిలో అచ్చయింది. ఎక్కువగా 1950-60ల మధ్య కథలు రాసింది. తెలంగాణ పల్లెపట్టులో, వాడుకలో ఉన్న

చక్కటి నుడికారాన్ని కథల్లో నింపి 'గంగిరేగి చెట్టు', 'మాఊరి ముచ్చట్లు', 'మొమ్మైక్యత', 'ఎంకన్న', 'మ్యానరికం', వంటి కథలను రాసింది. శిష్టేతర జానపద పదాలను, వాక్య విన్యాసాలను పుణికి పుచ్చుకొని రచనలో వైవిధ్యం చూపించింది. తెలంగాణా పల్లె జీవితాన్ని, సంస్కృతిని ప్రతిబింబించే విధంగా వీరి కథలుంటాయి.

స్త్రీవాద కథా ఆవిర్భావానికి ఒక అనుకూల వాతావరణాన్ని ఏర్పరిచిన కళ్యాణ సుందరీ జగన్నాథ్ 1941లో అచ్చయిన 'ఒక చిన్నకథ' తో కథా సాహిత్యరచనకు శ్రీకారం చుట్టింది. కొంతకాలం విరామం తీసుకొని 1954లో అచ్చయిన 'మాడంత మబ్బు' తో కథారచనను కొనసాగించింది. ఈవిడ రాసిన 'అలరాస పుట్టిళ్ళు' ప్రసిద్ధి చెందిన కథ. ఈవిడ కథల్లో గ్రామీణ వాతావరణం, సంస్కృతి సంప్రదాయాల పేరిట మూఢ నమ్మకాలు, అజ్ఞానం – వాటి ప్రతిఫలనాలు కనిపిస్తాయి. తురగా జానకీరాణి ఎర్ర గులాబీలు, నవ్వనిపువ్వు వంటి కథా సంపుటాలను వెలువరించింది. 1955లో రాసిన 'నాజీవితం నాకిచ్చెయ్యి' అన్న కథ పాతికేళ్ళు భర్తహింసను భరిస్తూ మౌనంగా జీవించి, చివరకు కూతురి ప్రోద్బలంతో విడాకులు తీసుకున్న స్త్రీ తానెంత విలువైన జీవితాన్ని కోల్పోయింది తలచుకొని ఆక్రోశించడాన్ని చిత్రించింది. మనోవిశ్లేషణ, మనుష్యుల మనసు గొడవలున్న 'యాత్ర' వంటి కథలను ముఖ్యంగా స్త్రీలనుద్దేశించి చాలా కథలు రాసింది. '10' కమర్షియల్ సెక్స్ వర్కర్ల కథలు రాసింది. వాటిలో నీతి, అవినీతి ప్రస్తావన లేకుండా వాస్తవాన్ని మాత్రమే తెలియజేసింది. అబ్బూరి ఛాయాదేవి 'బహిష్టు', 'మూడునాళ్ళ ముచ్చట', 'ఉపగ్రహం', 'శ్రీమతి ఉద్యోగిని, 'గడ్డునెల' వంటి కథల ద్వారా కుటుంబంలో స్త్రీ రెండవ స్థాయి పౌరురాలిగా ఎలా అసంతృప్తిగా జీవిస్తుందో చూపించింది. పునరుత్పత్తి విషయాలను, లైంగిక ధర్మాలను కథాసాహిత్య వస్తువుగా ప్రవేశపెట్టి 'శరీర స్పృహ'ను కలిగించింది. ఆడపిల్ల అత్యాచారానికి గురైనంత మాత్రాన ఆత్మహత్య చేసుకోవడం కాదు, దాన్ని దుర్ఘటనగా భావించి మామూలు జీవితం కొనసాగించాలనీ, సహృదయుడైన వ్యక్తి తోడు దొరికితే జీవితంలోనికి అతన్ని ఆహ్వానించాలని సూచిస్తూ 1965లో 'ప్రయాణం' అనే కథను రాసింది. స్టార్ హోస్పటళ్ళ ప్రచార ఆర్భాటాన్ని, వ్యాపారతత్వాన్ని అమాయకుల బలహీనతల మీద ఆడుకునే దుర్మార్గాన్ని దోపిడీని నిరసిస్తూ 'ఆఖరికి అయిదు నక్షత్రాలు' అనే కథను, అట్టహాసమైన ఆడంబరాలతో జరిగే పెళ్ళిళ్ళను నిరసిస్తూ 'అదొక సంస్కృతి' అనే కథను రాసింది. 1974లో రాసిన 'బోన్‌సాయ్ బ్రతుకు' కథలో ఆడవాళ్ళ జీవితం ఎన్ని కత్తిరింపులకు, కుదింపులకు లోనవుతుందో చూపింది.

రంగనాయకమ్మ పెళ్ళి విషయంలో స్త్రీలు పెంచుకోవలసిన చైతన్యాన్ని గురించిన అవగాహనతో 1970లో 'అనితర సాధ్యుడు' అనే కథను రాసింది. భార్యాభర్తలు వంటింటికోసం, చిల్లరపనుల కోసం కాక ప్రేమకోసం బతకాలన్న జీవిత సత్యాన్ని చెబుతూ 1971 లో ' పెళ్ళానికి – ప్రేమ లేఖ' అనే కథను రాసింది. 'అమ్మ' అనే కథలో పెంపకంలో ప్రధాన పాత్ర తల్లిది కనుక ఆమె ఆడపిల్లలను ఎలా తయారుచేస్తుందో తెలియజేస్తుంది రచయిత్రి. సమాజమార్పు భార్యాభర్తల మధ్య ఎలాంటి అడ్డుగోడలను నిర్మిస్తుందో చర్చకు పెడుతూ 'మురళీ వాళ్ళమ్మ' అనే కథను రాసింది. 1996లో రాసిన 'అమ్మకు ఆదివారం లేదా?' అనే కథలో సమకాలీన అంశాల పట్ల స్పందించి స్త్రీల చైతన్యాన్ని తెలియజేసింది. తెలంగాణా కథకుల్లో పేరు తెచ్చుకున్న వారిలో ఇల్లిందల సరస్వతి దేవి ఒకరు. స్వర్ణకమలాలు, తులసీదళాలు వంటి కథా సంపుటాలను వెలువరించింది. మల్లాది సుబ్బమ్మ 1962లో 'మంట కలిసిన మానవత్వం' కథతో కథారచనకు శ్రీకారం చుట్టింది. పురుషుల దౌష్ట్యం మీద స్త్రీల నిస్సహాయత గురించి 'మాతృత్వానికి మరోముడి' వంటి కథలు రాసింది. "మహిళా విముక్తిలోనే పురుష వ్యక్తిత్వ వికాసం ఇమిడి వుంది" అని ఆ లక్ష్యంతో స్త్రీ పురుషులకు స్వేచ్ఛా

స్వాతంత్ర్యాలు, సమానత్వ ప్రాతిపదికపై కావాలని విప్లవాత్మక సాహిత్యాన్ని కథలుగా రచించింది. వైవాహిక జీవితంలోని స్త్రీ పురుషసంబంధాలను విభిన్న కోణాల నుండి చర్చకు పెడుతూ పి.సత్యవతి అనేక కథలు రాసింది. 1964లో 'ఆదివారంకోసం' అన్న కథతో సత్యవతి కథా సాహిత్య ప్రస్థానం ప్రారంభమయింది. 1974లో రాసిన'భూపాలరాగం' కథలో పేద మధ్య ధనిక వర్గపు స్త్రీల గృహజీవన శైలిని చిత్రించింది. 1978లో 'మాఘ సూర్యకాంతి' కథరాసి స్త్రీల జీవితంలో కనిపించని హింసను, పోలీసింగ్‌ను గుర్తించి చూపడమే కాక ప్రతిఘటించి నిలిచే స్త్రీల చైతన్యాన్ని కూడా నిరూపించింది. తమ జీవితాన్ని తాము నిర్మించుకోవడానికి సిద్ధపడుతున్న ఆధునిక మహిళలను 'డాటర్స్ ఆఫ్ ఇండియా' వంటి కథల్లో చూపించింది.స్త్రీ తన అస్థిత్వాన్ని గురించి తెలుసుకునే క్రమంలో రాసిన కథ 'ఇల్లలకగానే పండుగేనా' – ఈ కథ స్త్రీవాద సాహిత్యానికి తలమానికం వంటిది. 'సూపర్ మామ్ సిండ్రోమ్' కథ స్త్రీలు ఇంటిచాకిరీలో పడి పరాయికరింప బడటమే కాకుండా కుటుంబాల కోసం చివరకు శరీరాలను కూడా సమర్పిస్తున్న విధానాన్ని, స్త్రీ గృహిణిగా, ఉద్యోగిగా రెండు వైపులా నలిగిపోతున్న తీరును తెలియజేస్తుంది. 'బదిలీ' అనే మరోకథ భార్యాభర్తలిద్దరూ ఉద్యోగస్తులైతే భార్యను ఇబ్బంది పెట్టే భర్తను గురించి చెబుతుంది.

1980 తర్వాత స్త్రీవాద దృక్పథం నుండి తెలుగు కథ వికసించింది. తెలుగులో స్త్రీల కథ తాత్విక అర్థంలో స్త్రీవాద కథగా రూపాంతరం చెందటం స్త్రీవాదంలో కీలకాంశం. స్త్రీ శరీరాన్ని స్త్రీది కాకుండా చేసిన అధికార లైంగిక రాజకీయాల బండారాన్ని బయట పెడుతూ ఓల్గా 'రాజకీయ కథలు' రాసింది. ఓల్గా రాసిన 'వెన్నెముక' కథ ఆడపిల్లలు సౌందర్యపోషణతో సన్నబడటం కాదు, తనను గురించి తాను నిర్ణయాలు తీసుకొనేటట్లు వెన్నెముకను ధృడతరం చేసుకోవాలని చెబుతుంది. 'సారీజాఫర్' కథలో మైనారిటీ వివక్షను ముందు పెట్టింది. ఉద్యోగం చేస్తున్నా ఆర్థిక స్వాతంత్ర్యం లేని స్త్రీల గురించి 'వెలుతురులోకి', 'ప్రయోగం' వంటి కథలను రాసింది. స్త్రీ నిర్ణయం పై కుటుంబ అధికారాల అణచివేతను, సంస్కృతీ స్వభావాన్ని చిత్రించిన కథ 'భిన్న సందర్భాలు'. 'ఓ పెళ్ళి' కథ ఆడపిల్లకు పెళ్ళి, మగపిల్లవాడికి చదువు అన్న వివక్షను ప్రశ్నించి తల్లిదండ్రుల, చెల్లెలి దృక్పథాన్ని మార్చిన సంస్కారవంతుడైన యువకుడిని గురించి తెలుపుతుంది. ఏడేళ్ళ పసి బాలికను అత్యాచారానికి గురిచేసి కామ విషయానికి సంబంధించిన యంత్రంగా మార్చిన ఉదంతం ఓల్గా రాసిన 'అయోని' కథకు కేంద్రబిందువు.

కుప్పిలి పద్మ ప్రపంచీకరణ దుష్పరిణామాల గురించి 'కుబుసం', 'సాలభంజిక', 'ఇన్‌స్టంట్ లైఫ్', '[ప్రకంపనం', 'కొత్తచూపు' వంటి కథలు రాసింది. స్త్రీలు చేస్తున్న వెట్టిచాకిరి ఎలా పనికి రాకుండా పోతుందో సమాజ వాస్తవాన్ని తెలుపుతూ 'మసిగుడ్డ', 'మమత', 'మూడు నిమిషాలు' వంటి కథలు రాసింది. అమ్మాయి స్నేహం మీద నియంత్రణ గురించి 'తలుపులు' కథను, భార్య ఉద్యోగం చేస్తే తనకు ఒక కొత్త ప్రపంచం ఎక్కడ ఏర్పడుతుందో అంటూ పెళ్ళి తర్వాత ఉద్యోగం మాన్పిస్తున్న భర్త ప్రవర్తన గురించి 'మంచుదీపం' కథను రాసింది. వివాహచట్టంలో ఒదగకుండా ఒంటరిగా జీవించగలిగే నిర్ణయాన్ని తీసుకున్న స్త్రీల పరిస్థితుల గురించి 'కేసు', 'ఇల్లీగల్', 'నిర్ణయం', 'వల', 'ముక్త' , 'పాత బంగారులోకం' కథల్లో చెప్పింది. యోని సంబంధమైన ఇన్‌ఫెక్షన్‌ల గురించి స్త్రీలు సతమతమవుతున్న పరిస్థితిని వివరిస్తూ 'ఎ.డి.ఆర్.ఎల్.' వంటి కథలను రాసింది. 'దిగులు మేఘం' కథలో నిరాశ్రయురాలైన వృద్ధతల్లిని గురించి చెప్పింది.

మహిళల జీవితాల్లోని వేదనను, అశాంతిని, పీడనను చిత్రిస్తూ స్త్రీ అస్తిత్వ వేదనకూ చైతన్యానికి రూపకల్పన చేస్తూ 1990ల తర్వాత అనేక కథలు వచ్చాయి. ఇవి పురుషాధిక్యతను నిరసిస్తూ అణచివేతపై తిరస్కారం చూపుతూ స్త్రీ స్వేచ్ఛను, వ్యక్తిత్వాన్ని ఉన్నతీకరించాయి.

స్త్రీలు తమ శ్రమకు గుర్తింపును, విలువనూ ఆశిస్తూ తమ ఉనికిని చెబుతూ కొత్త ఇతివృత్తాలతో, ఆలోచనా ధోరణితో కథానికలు రాశారు. ఇదేకాలంలో దళిత అస్తిత్వ, మైనారిటీ అస్తిత్వ, స్త్రీవాద చైతన్యంతో కథలు వచ్చాయి. విప్లవోద్యమ ప్రభావంలో కథలు రాసిన స్త్రీలు కూడా ఎందరో ఉన్నారు.

కొండెపూడి నిర్మల రాసిన 'మొద్దురాచ్చిప్ప(1989)' , 'ఎద్దుపుండు', 'జరీ అంచు తెల్లచీర' వంటి కథలు సంతోషంగా శృంగారానుభవాన్ని పొందే అవకాశం స్త్రీలకు నిరాకరింపబడుతున్న విషయాన్ని నిరసన స్వరంతో పలికాయి. 'అబద్ధం' కథలో ఒంటరిగా ఉన్న స్త్రీల పట్ల సమాజం చూపు, ప్రవర్తన నిరసింపబడ్డాయి.ఉమ్మడి కుటుంబ సభ్యుల ప్రవర్తనను, స్త్రీల ఘర్షణను ప్రతిమ 'మాక్కొంచెం నమ్మకమివ్వండి', 'ఈవ్ మళ్ళీ చచ్చిపోయింది' వంటి కథల ద్వారా చెప్పింది. దళిత స్త్రీ అస్థిత్వ నేపథ్యంలో 'గంగ జాతర', 'నీళ్ళు' అన్న కథలను, ఇల్లు విడిచి బయటి ప్రపంచంలోనికి వచ్చి తనకు నచ్చిన విధంగా జీవించాలను కునే స్త్రీకి అడుగడుగునా ఎదురయ్యే అవరోధాలను గురించి 'ఖండిత', 'కంకాళం' వంటి కథలను రాసింది. చంద్రలత కథల్లో టెక్నాలజీ, ప్రపంచాన్ని కుగ్రామం చేసి మనుషుల మధ్య దూరాన్ని పెంచుతున్న విధం కనిపిస్తుంది. 'కొలీగ్స్' కథ భార్యాభర్తలిద్దరూ ఒకే చదువు చదువుకొని, ఒకే వృత్తిలో ఉన్నప్పటికీ నిర్ణయాధికారం పురుషుడికి మాత్రమే ఉండటాన్ని ప్రశ్నిస్తుంది.

చుండూరు, కారంచేడు, నీరుకొండ మొదలయిన ప్రదేశాల్లో గతంలో జరిగిన కొన్ని దారుణాలు అగ్రవర్ణ దౌష్ట్యాన్నీ దళితుల పట్ల వైమనస్యాన్ని బట్టబయలు చేశాయి. జూపాక సుభద్ర దళిత అస్తిత్వ స్త్రీవాద చైతన్యంతో కథలు రాసింది. ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన దళిత వర్గాల వారిని ఊళ్ళోని ఆధిపత్యాల వర్గాల వాళ్ళు, పెత్తందారి శక్తులు అసలు అధికారాన్ని చలాయిస్తున్న సామాజిక స్థితిని అందుకు పరోక్షంగా సహాయమందిస్తున్న రాజ్యాధికార వ్యవస్థను విమర్శిస్తూ, ధిక్కరిస్తూ 'సర్పంచ్ ఎవరు?', 'ఒడువని దొరరికం', 'కలమ్మ కలకలం', 'క్రింద బడ్డ కిరీటాలు' మొదలైన కథలు రాసింది. దక్కలి స్త్రీ అనుభవాన్ని చొరవను ఆవిష్కరించి 'మాన్యం' కథ రాసింది. దళిత స్త్రీ కోణం నుండి 'శుద్ది చెయ్యాలె', 'ఆదర్శ విధ్వంసం' వంటి కథలను రాసింది, జాజుల గౌరి దళిత కుటుంబ జీవనచిత్రణ చేస్తూనే అందులోనూ ఆడపిల్లలకు, మగపిల్లలకు మధ్య ఉండే వ్యత్యాసాలను గురించి 'నీళ్ళ బాయి' కథను రాసింది. దళిత అస్థిత్వ చైతన్యం నుండి కులవివక్ష మీద ఎక్కుపెట్టబడిన కథ 'నేన్ నేన్ లెక్కనే', దళిత స్త్రీవాద నేపథ్యంలో 'మన్నుబువ్వ' వంటి కథలు రాసింది. చల్లపల్లి స్వరూపరాణి రాసిన 'భద్రం తల్లీ', 'ముసుగు', 'మా చిన్నత్త' మొదలైన కథలు పేదరికం, కుల వివక్ష, లింగ వివక్ష–మూడు వైపుల దాడికి గురవుతున్న స్త్రీల జీవన వేదనలను చిత్రించాయి. వినోదిని దళిత అస్థిత్వస్పృహ నుండి 'బ్లాక్', 'బ్లాక్ ఇంక్', 'బాలేదు జరమొచ్చింది' కథలు రాసింది. (స్త్రీ ప్రధాన బిందువు), గోగు శ్యామల – 'రడం', 'ఊరజెర్వు' వంటి కథలను దళిత స్త్రీవాద నేపథ్యంలో రాసింది.

ముస్లిం మైనారిటీ స్త్రీల జీవితాంశాలను వస్తువులుగా చేసుకొని షాజహానా, షహనాజ్, యాస్మిన్ బేగం, రుబేనా పర్వీన్ మొదలైనవారు కథలు రాశారు. షాజహానా రాసిన 'సిల్ సిలా' కథ ముస్లింసమాజంలో దూదేకులు ఎదుర్కొనే వివక్షను, స్త్రీలపై పడే పేదరికపు బరువును, భర్తల అధికార దౌష్ట్యాలను చిత్రించింది. ప్రాథమిక అవసరాలు కూడా ప్రాణాంతక సమస్యలుగా మారుతుంటే స్త్రీలు పడే అవస్థను 'సండాస్' కథలో చిత్రించింది. గీతాంజలి ముస్లింస్త్రీల జీవితాన్ని, బాధలను గుర్తిస్తూ విశ్లేషిస్తూ 'బచ్చేదాని', 'పహెచాన్' కథలు రాసింది.

విప్లవోద్యమ కథలను రాసిన వారిలో యం.రత్నమాల, లక్ష్మి, మయూరి, సహజ, షహీదా, భారతి, కరుణ, మిడ్కో, పి.వరలక్ష్మి, నిత్య, మైనా, సుజాత ఉన్నారు.

స్త్రీల కథాసాహిత్య ధోరణులను గురించిన అవగాహనలో, తెలుగులో అనేక మంది స్త్రీలు తమను తాము అన్వేషించుకుంటూ, తెలుసుకుంటూ తమకు కావలసిన దానిని నిర్ధారించుకుంటూ సమకాలీన, సాంఘిక, సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతులు ప్రతిఫలించేలా 1900 నుండి 2020 వరకు '120' సంవత్సరాల కాలం మీద కథలు రాసినవాళ్ళు వందల కొద్దీ ఉన్నారు. వాళ్ళు రాసిన కథలు వేల సంఖ్యలో ఉన్నాయి. స్త్రీల కథాసాహిత్య చరిత్ర నడిచిన దారులను తెలుసుకొనే ప్రయత్నం ఇది.

ఉపయుక్త గ్రంథసూచి:

1. తెలంగాణ తెలుగు కథ – వెంకటేశ్వర్లు పంతంగి(సం॥) – తెలుగు విభాగం, ఆర్ట్స్ &సైన్స్ కళాశాల, కాకతీయ విశ్వవిద్యాలయం, సుబేదారి, వరంగల్లు – ఫిబ్రవరి, 2011.
2. తెలుగులో స్త్రీల సాహిత్యం(1900–1950) – కాత్యాయనీ కె., కిషన్ ప్రసాద్ జి. – యు.జి.సి. మేజర్ రీసెర్చ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ – తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ – 2009–11 – అముద్రితం.
3. దిద్దుబాటు – దిద్దుబాటుకు ముందు కథలు 92 – మూర్తి వివిన(సం॥) – తానా ప్రచురణలు (కథానిలయం, శ్రీకాకుళం సహకారంతో) – జనవరి, 2015.
4. సాహిత్యాకాశంలో సగం – కాత్యాయనీ విద్మహే – స్త్రీ జనాభ్యుదయ అధ్యయన సంస్థ, వరంగల్లు – ద్వితీయముద్రణ, డిసెంబరు, 2013.

ఆధునిక తెలుగు కథ (2001-2010)-మధ్య తరగతి కుటుంబాల దీనస్థితి

డా. కోలా శేఖర్, తెలుగు శాఖాధిపతి, ఆంధ్ర లొయోల (స్వయంప్రతిపత్తి) కళాశాల, విజయవాడ. 9441441097

స్త్రీవాద రచయిత్రి కుప్పిలి పద్మ గారు రాసిన కథ 'సాలభంజిక'. ప్రజాతంత్ర వర్తమాన సాహిత్య ప్రత్యేక సంచికలో మార్చి, 2001 న ముద్రితము.పనిచేస్తున్న ఆడవారి జీవితాలకు అద్దం. పేద స్త్రీలు కుటుంబ పోషనలో ఎలా సమిదలుగా మారుతున్నారో విడదీసి చూపించిన కథ. సాలభంజిక అంటే బోమ్మ అని అర్థం. దేవుడు చేసిన బోమ్మ ఈ సాలభంజిక. ఈ కథకు ఆ పేరు సరిపోయింది. ఇద్దరు అమ్మాయిల దయనీయమైన జీవితాలపై రాయబడిన కథ ఇది. ఎవరూ చూడని, తెలియని జీవితాలను పద్మగారు చక్కగా ఒడిసి పట్టుకున్నారు. దాన్ని నడిపించిన తీరు కూడా బాగుంది. సామాజిక వాస్తవికతకు ఇది నిలువెత్తు నిదర్శం.

మాధురి, అంజలి ఇద్దరు అందమైన ప్రపంచాన్ని చూపించే కంపెనీలో ఉద్యోగులు. వివిధ ప్రదేశాలతో పాటు అతిథులకి కాలసిల ఏర్పాట్లు, శారీరక సుఖాలు చూడడం కూడ మీరి బాధ్యత. ఆ అమ్మాయిలు వాళ్లతో స్టార్ హొటల్ కో గెస్ట్ హౌస్ కో. వ్యాపార లావాదేవీలలో ఆటవిడుపు ఈ చిరునవ్వులు. వీరి మనస్సు ఎవరికీ అవసరంలేదు.

మాధురి పేదింటి పిల్ల. కుటుంబ పెద్ద కాని పెద్ద. తల్లికి ఒక రోజు ఈ ఉద్యోగం చేయనని చెపుతుంది ధైర్యంగా. కాని మీ బాస్ డిన్నర్‌కి రమ్మని సతాయిస్తున్నాడా? ఆడాళ్లని ఏదో వొకటి అలా అంటుంటారు. అందంగా వుంటావ్ కదా. ఇంకాస్త ఎక్కువ చికాకు ఉంటుంది. లౌక్యంగా మెసులుకోవాలి. అంతేగాని అలా బెంబేలు పడిపోతే ఎలా... నీది ఎలాంటి చికాకైనా కాస్త సర్దుకుపోమ్మా. నువ్విప్పుడు ఉద్యోగం మానేస్తే వీళ్ల చదువులకి చాలా కష్టం అవుతుంది. ఇంటి పరిస్థితి చికాకుగా అయిపోతుంది. కొన్నాళ్ళు కష్టపడితే అంతా వొక దారికి వస్తారు. నాలుగు డబ్బులు వెనకేసుకుంటే నీ పెళ్లి చెయ్యొచ్చు. పొరపాటున కూడా వుద్యోగం మానైకు. ఎక్కడైనా మగాళ్లతో ఏదో ఒక చికాకు వుంటుంది కద తల్లీ. కాస్త వోపిక పట్టు అంటూ తల్లి దాదాపు కూతురి కాళ్లు పట్టుకున్నంత బతిమాలుతుంది. సాటి స్త్రీ కష్టాన్ని అర్థం చేసుకొనే పరిస్థితి కూడా లేని పేదరికం. పాపం ఆమె మాత్రం ఎంచేస్తుంది.

మాధురి మనస్సు చాలా బాధపడుతుంది."డిన్నర్ కి పిలిచి చెయ్యి పట్టుకోవటమో కళ్లల్లోకి చూపులు జార్చటమో కాదమ్మా, ఇప్పుడే లొక్యాలు అక్కర్లేదు. ఏ ముసుగులూ లేవ్. అవసరాలే. మేధస్సు శరీరమూ పెట్టుబడి అంతే. అని చెప్పాలనుకుంది కాని అర్థంచేసుకోలేని తల్లి. ఆమెను జాలిగాచూడటం తప్ప ఏమి చేయలేని నిస్సహాయత. తరువాత పరిణామాలలో మాధురి ఆ ఉద్యోగం మానేసి, తనకు ఏ ఇబ్బంది లేని మరో ఉద్యోగంలో చేరుతుంది. పాత జీవితానికి స్వస్తి చెప్పి కౌశిక్ అనే అభ్యుదయ భావాలున్న యువకున్ని పెళ్లి చేసుకొని ఆనందంగా జీవిస్తుంది.

విధి వంచితురాలు అంజలి. ఆమెకు కూడా తెలుసు తాను చేస్తున్న ఉద్యోగం మంచిది కాదని. కాని ఆర్థిక పరిస్థితి తనను ఎక్కడికి కదలనీయదు. ఈమె బలహీనతను చూసి సురేష్ లోబరుచుకుంటాడు. అవసరాలను ఉపయోగించుకొని స్త్రీలను వసపరచుకోవటం ఈ దుష్ట సమాజంలో భారతకాలం నుంచి ఉన్న దుర్మార్గ నీతి. పెళ్లి చేసుకుంటాననీ, మంచి జీవితం ఉందని ఆశచూపి తన పని కానించుకుంటాడు. తను ఎదగటంకోసం అంజలిని ఉపయోగించుకుంటాడు. స్త్రీ తను మోసపోతున్నాని కూడా గ్రహించలేక పోవటం ఆధునిక సమాజంలో చాలా బాధకరం. "తోడేళ్ళున్నాయి జాగ్రత... అన్న సినీకవి మాటలు గుర్తుకు వస్తున్నాయి. సురేష్ ఇలాంటి బిజినెస్ ప్రారంభిస్తాడు. దానికి పెట్టుబడి అంజలి బంగారు నగల

డబ్బులు, తన అందం పెట్టుబడిగా వచ్చిన డబ్బు. బిజినెస్ నిలబడడానికి తొలిరోజులలో ఈమె అందమే ఆకర్షణ. సురేష్ ఆర్థికంగా బలపడినతరువాత షరామామూలే చెప్పకుండ వేరే అమ్మాయితో ఎఫ్లి. అంజలికి మాత్రం గిఫ్ట్లా ఎయిడ్స్ వ్యాధి. అంజలీకి కొవ్వొత్తి కర్రెక్ట్ ఎగ్జాంపుల్. తన యవ్వనమంత కుటుంబ పోషణకు, మోసగాడి ఎదుగుదలకు ఉయోగించింది. చివరికి నిజం గ్రహించే సరికి చేతులు కాలీ. ఉద్యోగం చేసుకునే స్త్రీల పట్ల సమాజం ఎన్నిరకాలుగా దాడిచేస్తుందో ఈ కథ చక్కని మాదిరి. పద్మగారు కథను నడిపిన తీరు పాఠకున్ని కంటతడి పెట్టిస్తుంది. ఇక్కడ కులం మతం కాదు స్త్రీ అయితే చాలు మోసం చేయటానికి సహస్ర కాలకూతనాగులు కాచుకుని ఉంటాయనే సామాజిక వాస్తవాన్ని మరోసారి ఎలుగేత్తి చాటింపేశారు.

'వ్యక్తులపై కాదు, ప్రేమపై విశ్వాసాన్ని నింపుకో. మనపై మనకి ప్రేమ, గౌరవం... చుట్టూ పరిస్థితులకి అందరం బందీలమే. అలా ప్రవర్తించడానికి సురేష్‌కి వుండే లాజిక్ సురేష్‌కి వుంటుంది. నేహకి వుండే సమర్థన నేహాకి వుంటుంది. వ్యక్తులు కుమ్మరించే ప్రేమ మెసాలబట్టే మన ఆనంద విషాదాలని నిర్ణయించే శక్తి వాళ్లకి ఇచ్చేస్తే మనం రోజూ ఛస్తూ బతుకుతూ వుంటాం... మాధురీ పలుకులు నిస్సహాయ స్త్రీలకు దిక్సూచి. ప్రాణవాయువు.

ఫ్యాక్షన్ రాజకీయాలలో ఛిద్రమవుతున్న జీవితాలు:

'వలస' కథను ఇనాయతుల్లా రచించారు. కథా నమయం కథల నంకలనంలో జూలై 2001లో ముద్రించారు. రాయలసీమ ఫ్యాక్షన్ రాజకీయాలు ఎలా ఉంటాయో కళ్లకు కట్టిన కథ. తక్కువ కులాల ప్రజలను పెద్ద కులాల వాళ్లు ఎంత హీనంగా, దుర్మార్గంగా హింసిస్తారో ఈ కథ మరోసారి చూపించింది. ఫ్యాక్షన్ పడగ నీడలో రాయలసీమ గ్రామాల ప్రజల కన్నీటి వెతల సజీవ చిత్రణ ఈ కథ. ఇనాయతుల్లా కథను నడిపించిన తీరు కొత్త సినిమా చూసినట్లు ఉంది. కథ చదివినంత సేపు అనేక భావచిత్రాలు రూపుదిద్దుకుంటాయి. ఒక మాటలో చెప్పాలంటే రాయలసీమ ప్రజల వలస బతుకులకు అసలైన కారణమైన ఫ్యాక్షన్ రాజకీయాల మీద ఎక్కుపెట్టిన కలం ఈ కథ.

కథ మొత్తం కర్నూలు జిల్లా కరిడికొండలోనే జరుగుతుంది. కథ అంతా విశ్వనాథం, కాశీల చుట్టూనే తిరుగుతుంది. కరిడికొండకు కనీసం బస్సుకూడ లేదు. కానీ జన్మభూమి కార్యక్రమంలోరాష్ట్రంలోనే ప్రథమ బహుమతి పొందిన గ్రామం. అంతే కాదు ఫ్యాక్షన్ వీడి బడిబాట పట్టిన గ్రామంగా పేపర్లో పతాక శీర్షిక ఎక్కిన ఊరు. ఆ వార్తలను చూసి ఆ గ్రామాన్ని ప్రజలను చూసి, ఇంత గొప్పగా గ్రామాన్ని నడిపిస్తున్న వారి నాయకుడు భైసాని వెంకట సుబ్బారెడ్డి గారితో ఒక ఇంటర్వ్యు కోసం కుదిరితే ఒక సెల్ఫీ కోసం కాశి ఆ గ్రామానికి బయలు దేరతాడు.

'కరిడికొండకు బస్సు రాదు సారూ. కొంచేపు కుచ్చో వ్యాను యిట్ల లోనికి పోయింది. మల్ల తిరిగొత్సాది. దానికి పోదువుగాని' అన్నమాటలు వినగానే ఉల్కిపడతాడు. రోడ్డంత బొక్కలిరిగి పోయేటంత గతుకులు. '24 గంటల్లో రోడ్డు నిర్మాణం' అనే పేపరు పతాక శీర్షిక వార్త అతని కళ్లముందు ప్రత్యక్షం. పేపరు వార్తలలోని నిజం నేతిబీరలోని నెయ్యి గుర్తుకు వస్తాయి కాశీకి.

కరిడికొండ ముఖద్వారం దగ్గరే కాశీకి సమస్యల స్వాగతం. హోటల్లో కూర్చున్న వాళ్లలో ఒకరిద్దరు తప్ప ఒంటి మీద అంగీలు తొడుక్కున్న వాళ్లు ఎక్కువమంది లేరు. ఒకాయన మాత్రం అక్షరమక్షరం అతి కష్టమ్మీద కలుపుకొని పేపర్లో వార్తలు చదువుతుంటే చుట్టూ కూచున్నవాళ్లు టీ చప్పరిస్తూ వింటున్నారు. కొంత మంది పిల్లలు పేపర్లలోని సినిమా పేజీల మీద పడి మాట్లాడుకుంటున్నారు." వ్యాను కోసం ఆగిన అతనికి కనబడిన దృశ్యాలు. '12 గంటల్లో అంగన్ వాడి పాఠశాల నిర్మాణం' మళ్లీ పేపర్ లోని వార్త

గుర్తుకు వస్తుంది. చదవటంరాని వీళ్లను, బట్టలు కూడ లేని పేదవారిగా చేసిన అక్కడి నీచ రాజకీయాల మీద ఛీత్కారం అతని మనస్సులో బుస్సుమంది.

కరిడికొండలో ఎక్కువ కురువ, బలిజ, బోయ, వడ్డె, మాదిగ కులాలున్నాయి. ఊర్లో అంతా 10, 15 ఎకరాల రైతులే. ఇద్దరో ముగ్గురో బావులు, బోర్లువున్న వాళ్లు. ఒకప్పుడు బోయ బీరప్ప నాయుడు కుటుంబం బాగా ఆస్తిగల కుటుంబం. రెడ్లతో ఫ్యాక్షన్ నడిపి ఇల్లు పొలాలు పోగొట్టుకున్నాడు. ఇప్పుడు ఊరిలో రెడ్ల పెత్తనమే. పెద రెడ్డికి ఎదురు తిరిగి వాళ్లెవరికీ ఊరిలో స్థానం ఉండదు. అలా చాలా బోయ కుటుంబాలు ఊరు వదిలి వెళ్లి పోయినాయి. ఊర్లో ఉండాలంటే పెద రెడ్డి కాళ్ల క్రింద ఉండాలి. ఇంతలో ఊరిలోకి వెళ్లటానికి వ్యానువస్తుంది. వ్యానులో నుండి దిగుతున్నవాళ్లలో సగం మందికి పైగా పెద్దపెద్ద మూటలతో సామాన్లతో దిగుతున్నారు. పెద్ద పిల్లల చేతుల్లో చేటలు, బిందెలు, బకెట్లు కనిపిస్తాయి. ఆ దృశ్యం కాశీని కదిలిస్తుంది. పుట్టిపెరిగిన ఊరు వదిలి వెళ్లటం ఎంత కష్టం. అతని కళ్లు అప్రయత్నంగా తడవుతాయి.

కాశీ తిన్నగా ఊరులోకి వెళతాడు. మిత్రున్ని కలిసి, వాస్తవాలు తెలుసుకుంటాడు. అసలు బడికట్టిన స్థలం రెడ్డిది కాదనే వాస్తవాన్ని తెలుసుకుంటాడు. దాతలనుండి డబ్బు, పలుకుబడి, బెదిరింపుల ద్వారా ఇసుక, సిమెంటు, ఇటుక వచ్చిన తీరుగుర్తిస్థాడు. అమాయక ప్రజల శ్రమదానం కలిసిరాగ స్కూలు, రోడ్డు నిర్మించినట్లు పేపర్లో వార్తలు రాయిస్తాడు. ఈ పనుల ద్వారా చాలా డబ్బు కూడబెట్టిన వాస్తవాన్ని తెలుసుకుంటాడు. శ్రమదానానికి రాకుండా కుటుంబ పోషణకోసం డబ్బుల పనికి పోయిన మాదిగ ఎర్రమద్ది కాళ్లు విరగగొట్టిన సత్యాన్నికనిపెడతాడు. బైసాని వెంకట సుబ్బారెడ్డి ముందు వుండలేక గ్రామం విడిచిపోతున్న మాదిగ కుటుంబాల దయనీయ గాదలను విని చలించి పోతాడు. ఫ్యాక్షన్ రాజకీయాలు ఎలా ఉంటాయో వినటమే కాని చూడని కాశీ ఆనాడు ప్రత్యక్షంగా చూచి చలించి పోతాడు. ఆ సాయంత్రమే పెద్ద రెడ్డిని కలుస్తాడు. అతను చెప్పె అసత్యాలను విని మౌనంగా గ్రామం నుండి బయలు దేరుతాడు. ఇంటర్వ్యూ చేయమని నన్ను పంపిన జనవాణి మేనేజ్‌మెంట్ నా రిపోర్ట్‌కు ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి అనుకుంటాడు కాశీ.

రాయలసీమలోని ఎక్కువ గ్రామాలలోని అమాయకపు ప్రజలు ఫ్యాక్షన్ వల్లనే 'వలస'లు జరుగుతున్నాయనే పచ్చినిజాన్ని 'ఇనాయతుల్లా' ఎంతో ధైర్యంగా ప్రపంచానికి చాటారు. ఇంత వరకు ఏ రచయితా రాయని నిజాన్ని, వారి సంకుచిత భావజాలాన్ని సాహితీలోకానికి తేటపరిచారు. రాయలసీమ ప్రజల కన్నీటికీ, కష్టాలకూ అసలైన కారణాన్ని లోకానికి బట్టబయలు చేసి, వారి సమస్య పరిష్కారానికి కొత్త బాటలు పరచినతీరు కొత్త పుస్తకం చదివినట్లుంది నాకు.

కౌలు రైతుల జీవితాలు:

'స్వేదఫలం' ఈకథ మొలకలపల్లి కోటేశ్వరరావు గారిది. వ్యవసాయం ఫలవంతంగా సాగుతున్న కాలంలోకూడా జీతగాళ్లను సరిగ్గా పట్టించుకోని విధానాన్ని వివరించిన కథ ఇది. మూడు తరాలను తన పనితనంతో మెప్పించి చివరికి గంజినీల్ల కూడా దొరకక కన్నీల్లు మ్రింగిన దావీదు కథ ఇది. మూడోతరం కోడలి చేత అవమానాలు పడ్డ 73 ఏళ్ల వృద్ధుడిగాధ ఇది. తన శ్రమతో రైతును ఆసామిగా మార్చి తాను ఇంకా జీతగాడి లాగానే ఉండిపోయాడు దావీదు. దావీదు తన యజమాని సౌఖ్యానికి ఎంతో సాయపడ్డాడు.కాని యజమాని మనవడి భార్య దగ్గరికి వచ్చేసరికి తన జీవితం మారిపోయింది.

నేటి తరంలో ఎంతోమంది యజమానులు వారి వారి జీతగాళ్లను పట్టించుకొవడం లేదని కవి ఈ కథ ద్వారా తన ఆవేదన వ్యక్తం చేసాడు.మనకి సాయం చేసిన వారిని పట్టించుకోని బాగా చూసుకొవడం యజమాని ధర్మం. అత్తా కోడళ్ల విషయంలో, పనివాళ్ల విషయంలో మనం ప్రవర్తించ

వలసిన తీరును వివరించారు.పనివాళ్లను సొంతవాళ్లలాగా చూసుకోవాలి. రెండు ఎకరాల భూమి, కౌలు రైతు యిలా మొదలైన యజమాని, జీతగాళ్ల బలంతో ఆసామి అవుతాడు.మరి వారిని మరిచి ఆసామి జీవించడం ధర్మం కాదు. నేటికీ నమాజంలో శ్రమదోపిడీ రాజ్య మేలుతుంది.దాన్ని రూపు మాపకపోతే దావీదు లాంటి వాళ్ల జీవితాలు మరిన్ని కష్టాల పాలు అవుతాయి.శ్రమ జీవులను యజమానులు నిర్లక్ష్యం చేయకూడదు.శ్రమ జీవుల నెత్తుటి ఫలమే నేటి సమాజానికి పునాది అన్న సంగతి అందరూ గుర్తించి నడుచుకోవాలని రచయిత కథ ద్వారా తెలియజేశారు.

ఆధునిక నాగరికతకు ధనమే మూలాధారం. ఆ ధనానికి మానవుడు తలవంచాడు. అందుకే డబ్బు మనల్ని ఆడిస్తుంది. ధనవంతుడు మరింత ధనవంతుడు అవ్వడం కోసం పేదవారి బ్రతుకుల్లో చీకటి నింపుతున్నాడు. దావీదు జీవితాన్ని తలుచుకుంటే నేటివారికి ఎంతో బాధ కలుగుతుంది. కాయకష్టంచేసి బ్రతికేవారిని మనం ఎప్పుడూ చిన్నచూపు చూడకూడదు. ఎప్పుడైతే మనం పేదవారిపట్ల అమర్యాదగా ప్రవర్తించామో అప్పుడే మన పెద్దరికం చులకన అవుతుంది. తరాలుమారినప్పుడు తలపులు మారటం సహజం. కుటుంబంలో అందరిని సమానంగాచూడాలి. అత్తాకోడళ్ళూ, మామఅల్లుళ్లు బావబావమరుదులు ఇలా ఎవరైనాసరే మర్యాద ఇచ్చిపుచ్చుకోవాలి. లేదంటే సంబంధాలు దెబ్బతింటాయి. యజమానులు సేవకులను ఎంతమంచిగా చూసుకుంటే వాళ్ళద్వారా మనకి అంత గొప్పస్థాయి లభిస్తుంది. యజమాని సంతానం ఎంతో జాగ్రత్తగా పనివాళ్ళతో మెలగాలి. ఎందుకంటే మన ఆదరాభిమానాలనుబట్టే పనివాళ్ళ పనితనం ఆధారపడి ఉంటుంది. రచయిత అభిప్రాయం ప్రకారం పల్లెటూరి వాళ్ల మనస్తత్వం అంతత్వరగా అర్థంకాదు. వాళ్ళ మనసు స్వచ్ఛతకు మారుపేరు. జీతగాళ్ళ సాయంలేనిదే యజమానులు ధనవంతులు అవ్వలేరు. మనుషులు సాటిమనుషుల్ని ఎప్పుడు తక్కువచూపు చూడకూడదు. భేదభావం కనపడితే మానవత్వం మరుగునపడుతుంది. అప్పుడు మనం మంచిపేరు సాధించలేము. అందుకే మనిషిని మనిషిగా చూడాలి.

మన జీవితం ఎదుగుదలకు కృషిచేసిన ప్రతిఒక్కరిని మనం మర్యాదించాల్సిన అవసరం ఉంది. అదేమనకి ప్రధాన కర్తవ్యం. మానవుని జీవితానికి పరమార్థం ఇతరులతో కలిసి జీవించడం ఇతరులను జీవింపచేయడం. అలా అన్యోన్య జీవనకార్యక్రమన్ని ఎలాచేయాలొ తెలిపింది ఈకథ.

దిగజారిన మానవ సంబంధాలు:

సం.వే.రమేశ్ 'ఊడల్లేని మర్రి' అనే ఈ కథ దిగజారిన మానవ సంబంధాలను వాస్తవరూపం. ఇందులో ఉన్న మర్రిమాను ఊడలు లేని మాను. ఒకప్పుడు మర్రిచెట్లు ఎందరికో నీడను యిచ్చాయి. వాటి ఊడలు విశాలమైన ప్రాంతాన్ని చల్లబరిచాయి. కొంతమంది మర్రిమాను లాగా ప్రజలకు సేవ చేసిన వాళ్ళు ఉన్నారు. వాళ్ళు తరాలు మారిన తరువాత ఒంటరిగా మిగిలిపోయారు. పట్టణం పోయిన కొడుకులు పల్లెతల్లిని మర్చిపోయారు. నీడనిచ్చిన మానును అభివృద్ధి పేరుతో మట్టికలిపారు. ధనమదంతో పట్టణాలు ధనలబ్దంలో పల్లెటూర్లు కొట్టుమిట్టాడుతున్నాయి. బాగా బ్రతికిన వాళ్లు నేడు కూటికేడుస్తున్నాయి. వరిబువ్వ లేక గువ్వలుగా ఎగురుతున్నారు. నిశాచర యంత్రాంగణం నిమిలీతాక్షులై సీతకంటచూపుతో పేదలను అణగ ద్రొక్కుతున్నారు. మసిబారిన చరిత్ర చదువుకొని మసక చీకటిలో ఒంటరితనం మురికిని వదిలించుకోటానికి నానా పాట్లు పడుతున్నారు. పేదల గూర్చిన సభల్లో పెద్దల మాటలు హద్దులు దాటినా బడుగు జీవుల జీవితాలలో ఆర్థిక రేఖ పైకి చేరటంలేదు. పని చేసే వారికింత మర్యాద లేని కాలం నేడు నడుస్తోంది. బతుకులన్ని భారంగా, గాలివాటు గాలిపటంలా, గమ్యం లేనిగువ్వలా రోధిస్తున్నాయి.

అర్ధం పద్ధం లేని ఆలోచనలతో వచ్చిన తిప్పలు అన్నీ ఇన్నీకావు. సాయం అందించే వ్యవసాయం లేక పంటలు పండగ పబ్బాల పిలుపులు లేక ప్రజలు అల్లాడుతున్నారు. చింతచెట్ల జాడలు లేవు. చింత లేని ఇల్లు లేదు. మర్రిచెట్టు లాంటి నీడ నిచ్చే ఇల్లు ఊడలు లేని మర్రిచెట్లు అయ్యాయి. పట్టనం మోజులో పల్లెటూర్లు మునిగిపోయాయి. రోడ్డుకు అడ్డువచ్చాయి అని చెట్లను కొట్టేస్తే నేడు నిలువ నీడ లేక జనాలు నానా అవస్థలు పడుతున్నారు. పెరిగిన సంతానం కంటికి రెప్పలా చూసుకుంటారని అనుకుంటే పెంచిన మమకారాన్ని కూడా మరచి వేరైపోయారు. తిండి పెట్టేవారు లేక, నా అనే తోడు లేక చాలామంది పెద్ద వాళ్ళు దీనంగా రోజులు వెల్లదీస్తున్నారు. ప్రభుత్వాల మాటలు కంటితుడుపు చర్యలే అయినా కొద్దిమందికైన కడుపు నింపుతున్నందుకు సంతసమే. పల్లెటూరి జీవితాలు ఇప్పుడు దుర్భర భరితాలే. బంధాలకు తలవంచి అనుబంధాలకు మొహం వాచిన వాళ్ళను ఎవరు పట్టించుకుంటారు.

చెట్లను ఎంత జాగ్రత్తగా చూసుకోవాలో మనుషులను అంతే జాగ్రత్తగా చూసుకోవాలి. అప్పుడే మానవ లోకం బాగుపడుతుంది. లేదంటే మృగాలకంటె ఘోరంగా తయారవుతాము. అందుకే మనకి మానవత్వం చాలా ముఖ్యం. మనలో దాగి ఉన్న అనేక భావాలను మంచికి ఉపయోగించాలి. మన అభివృద్ధికి వాడుకోవాలి. లేదంటే మన మనుగడే ప్రశ్నార్ధకం అవుతుంది. పల్లెటూర్లే దేశానికి పట్టుకొమ్మలు అన్న విషయాన్ని ఎప్పుడూ మరచిపోకూడదు.

ఆధార గ్రంథాలు

1. ఇనాక్, కొలకలూరి – సాహిత్య విమర్శసూత్రం
2. ఇనాక్, కొలకలూరి – సాహిత్య పరామర్శ
3. మధుజ్యోతి – గుప్పెడు తలపులు
4. రాములు బి.ఎస్., సమగ్ర సామాజిక కథ తాత్విక భూమిక– 50 ఏళ్ళ తెలుగు కథ తీరు తెన్నులు
5. నారాయణ, సింగమనేని – తెలుగు కథకులు కథన రీతులు
6. నవీన్ వాసిరెడ్డి, శివశంకర్ పాపినేని – పాతికేళ్ల కథ 1990–2014 (1–2)
7. మారుతిరావు, గొప్లపూడి (సం) – వందేళ్లకథకు వందనాలు
8. నాగేశ్వరరావు తాళ్ళూరి (సం) – శత వసంతాల తెలుగు కథ.

తెలుగు కవయిత్రుల కవిత్వం ఆనాటి స్త్రీల సామాజిక స్థితిగతుల చిత్రణ

Dr. N. SURYAKANTHI, Asst. Professor, Aurora's Degree & PG College, Chikkadapally, Hyderabad.

13వ శతాబ్దం నుండీ దాదాపు 19వ శతాబ్ది ప్రారంభం వరకు స్త్రీలు పూర్తిగా భక్తి కవిత్వాన్నే వ్రాశారు. భక్తితో పాటుగా, అక్కడక్కడా శృంగారం కన్పించినా, అది భగవంతుడిని కేంద్రంగా తీసుకొని తమ భావాలను వ్యక్తం చేయడం మాత్రమే అనుకోవలసి ఉంటుంది. గమనించ వలసిన ముఖ్య విషయం ఏమిటంటే వ్రాసింది సంపూర్ణంగా భక్తి కవిత్వమే అయినా, అందులోనే సమకాలీన సమాజ స్వరూపాన్ని సమాజంలో ఉండీలేనట్లుగా ఉన్న తమ అస్తిత్వాన్నీ, రూపుకట్టేందుకు ప్రయత్నించారు.

ఈ కవిత్వం వ్రాసిన స్త్రీలలో చాలాభాగం రాజాశ్రయంలో ఉన్నవారు. రాజకుటుంబంలోని స్త్రీలు, ఉన్నత వంశపు స్త్రీలు, ప్రభువులతో దగ్గర సంబంధం ఉన్న వేశ్యలు వ్రాశారు. ఏ ఒకరిద్దరో తప్ప సామాన్య మహిళలూ, సమాజం మధ్యలో బ్రతికేవాళ్లూ ఎక్కువగా రచనలు చేయలేకపోవడానికి కారణాలు. 1. స్త్రీలకు విద్య నిషేధింపబడటం. 2. గురుకులాలకు వెళ్లి విద్య నేర్చుకొనే అవకాశాన్ని సమాజం ఆడవాళ్లకు ఆ రోజులలో కల్పించకపోవడం. 3. కాస్తో, కూస్తో విద్యనేర్చుకొని, ఒకవేళ వారు కవిత్వం వ్రాసి ఉన్నదన్నట్లుగా మనం భావించినా బయటికి వెళ్ళి సభాముఖంగా వారి ప్రజ్ఞను చాటిచెప్పే స్వేచ్ఛా స్వాతంత్రాలు లేవు కనక, ఆ భావాలు ఏ కావడి పెట్టలోనే చెదలు పట్టి పోయి ఉండవచ్చు. ముఖ్యంగా చెప్పుకోవలసిన విషయం ఏమిటంటే పురుషాధిక్యతకు లోబడి సాంప్రదాయ బద్ధమైన జీవితాన్ని గడిపే సాధారణ స్త్రీలుకాక, తమ పరిధిని దాటి బయటకు వెళ్లిన స్త్రీల నుండే విలక్షణమైన రచనలు వెలువడ్డాయి. ముద్దుపళని సాధారణ గృహిణి అయి ఉన్నట్లైతే వివాదాస్పదమైన శృంగార భావాలను తన కవిత్వంలో జొప్పించగలిగి ఉండేది కాదు. అలాగే రంగాజమ్మ వేశ్య కనక, ఆనాడు వేశ్యలకు కళలను నేర్వగలిగే అవకాశం ఉన్నది కనుక, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, సాహిత్యంలోని కొత్త ప్రక్రియలను అనుసరిస్తూ కొంత శృంగారపరమైన కవిత్వం వ్రాసింది. తరిగొండ వెంగమాంబ – సమాజంలోని దురాచారాలకు ఎదురునిలిచి పోరాడి తన అస్తిత్వాన్ని నిలుపుకొంది. ఇక ఈ కవిత్వంలో మనకు కనబడే సామాజిక అంశాలు ఆనాటి ఆచార వ్యవహారాలు, పెళ్ళి, సీమంతం మొదలైన కుటుంబాల్లో వచ్చే శుభకార్యాల వర్ణన, స్త్రీల అలంకార, సౌందర్య వర్ణనలు, దైవభక్తి, స్త్రీల బేలతనం, ఈర్ష్యాసూయలు, నైతిక సూత్రాలు, వేదాంత ప్రబోధం, మంగళ హారతులు, లాలిపాటలు.

ఆనాటి కవయిత్రులు : సామాజిక స్థితిగతులు :

ఆంధ్రదేశంలో మొదటి నుంచీ వైదిక మత సంస్కృతులే ప్రబలంగా వేళ్లూనుకొని పోయినవి. బౌద్ధ, జైన మతాలు వ్యాపించినా అవి స్థిర స్థానాన్ని సంపాదించుకోలేక పోయాయి. వైదిక ప్రాబల్యమున్న ఆంధ్రదేశంలో క్రీ.శ. 12వ శతాబ్దంలో వీరశైవ భక్తిమతం ప్రవేశించి మొదటి సారిగా వైదిక మత సంస్కృతుల పునాదులను కదిలించింది. వీరశైవంలో ఉచ్ఛ నీచ కులాలనే భేదం లేదు. అది స్త్రీల స్వతంత్ర ప్రతిపత్తిని గుర్తించి వారికి ఆధ్యాత్మిక జ్ఞాన సంపాదనలో, లౌకిక వ్యాపారాలలో పురుషులతో సమానంగా స్వేచ్ఛను ప్రసాదించింది. స్త్రీలు ఆత్మజ్ఞానాన్ని సంపాదించి, దీక్షా సాధన చేసి ఆచార్య పీఠాన్ని కూడా అధిష్ఠించినారు.

శ్రీమతి ఊటుకూరు లక్ష్మీకాంతమ్మగారు తమ ఆంధ్ర కవయిత్రులు గ్రంథంలో 1230–40 సం. ప్రారంభమయిన బుద్ధరాజు కుమార్తె కుప్పమ్మ యనునామె యొకతె కవయిత్రిగా కనబడుతున్నది." అని సూచించి వదిలివేశారు. దీనినిబట్టి చూస్తే నిడదవోలు వెంకటరావు గారు

పేర్కొన్నట్లుగా కుప్పమాంబనే ప్రథమాంధ్ర కవియిత్రిగా అంగీకరించవలసిన అవసంర కనపడుతుంది. "పావన వంశంబు స్వతంత్ర్య మీయదు చెలీ" అన్న వాక్యంలో ఆనాటి కులీన వంశాల స్త్రీలకు స్వాతంత్ర్యం అసలు లేదన్న విషయం స్పష్టమవుతున్నది. యౌవనారంభంలోని ఊహలకు కవిత్వరూపం కల్పించి చెప్పేందుకు "నూతన బాల్యాదిక యౌవనంబు ధైర్యంబు రానీదు" అని వాపోతున్నది కవయిత్రి. ఇవన్నీ స్త్రీ మనోభావాలే. స్త్రీకి స్వాతంత్ర్యం లేదన్న ఆక్రోశమే.

వైష్ణవ భక్తి మత ప్రభావితులై చాలామంది కవులు కవిత్వాన్ని వెలువరించారు. వారిలో తాళ్ళపాక అన్నమాచార్యులు అద్భుతమైన కవితాధారతో తిరుపతి వేంకటేశ్వరుని కీర్తించి జీవితాన్ని ధన్యం చేసుకొన్నాడు. తాళ్ళపాక వారి వంశం వండిత కుటుంబం. అన్నమాచార్యుని పెద్ద బార్య తాళ్ళపాక తిమ్మక్క (1404-1503) వైష్ణవ భక్తి భావంతో పరవశించి "సుభద్రాకళ్యాణము" అనే మధుర కావ్యాన్ని మంజురీ ద్విపదలో వెలువరించింది. మంజరీ ద్విపద ఛందస్సు గేయానికి అతి సన్నిహితంగా ఉంటుంది. సుభద్రాకళ్యాణం చక్కగా పాడుకునేందుకు వీలైన ఒక జానపద గేయంగా నడిచింది. అప్పటి సమకాలీన సమాజ వాతావరణంలో గురుకులాలకు వెళ్ళి స్త్రీలు విద్య నేర్పే అవకాశం లేదు. అయినా తిమ్మక్క భావభరితంగా, సరళ మధురమైన శైలిలో కావ్యాన్ని వ్రాసింది. అందుకు వారి కుటుంబ వాతావరణం కారణమై ఉంటుంది.

తెలుగు సాహిత్యంలో తేనెవంటి తీయని పలుకులతో సరళమై, మృదుమధురమై భాసించిన శైలితో, లవలేశమైనా, భక్త్యావేశాన్ని తన కవిత్వంలో పొడగట్టనీయక సహజ సుందరంగా రామాయణాన్ని రచించిన మొల్ల, తెలుగు కవయిత్రులలో ప్రాతఃస్మరణీయురాలు. ఈమె 16వ శతాబ్దికి చెందిన కవయిత్రి. మొల్ల కాలంనాటి సామాజిక నేపథ్యాన్ని ఇక్కడ చెప్పుకోవలసి ఉంది. ఆనాటికి వీరశైవమతం తెలుగు నాట బాగా ప్రచారంలో ఉంది. తన తండ్రి గురులింగ మార్చనపరుడు, శివభక్తిరతుడు అని మొల్ల, చెప్పుకొన్న పద్యాలనుబట్టి పరిశీలిస్తే ఆమె వీరశైవ మత ప్రభావంవల్ల, నిమ్మజాతికి చెందిన కుమ్మరి కులంలో పుట్టినా, వీరశైవులు స్త్రీలకిచ్చిన స్వతంత్ర ప్రతిపత్తిని వినియోగించుకొని, విద్య నేర్చుకొని సాహిత్యంలో నిష్ణాతురాలైందని ఊహించు కోవచ్చు.

మోహనాంగి తరువాత విజయనగర రాజుల పరిపానలో శ్రీకృష్ణదేవరాయల భార్యయని చెప్పబడిన తుక్కాదేవి "వరదాంబికా చరిత్రమును" సంస్కృతమున కూర్చిన రాయ సోదరుడు అయిన అత్యుతరాయల భార్య తిరుమలాంబ, నాచీ విజయ నాటకకర్తి అయిన విదుషీమణి నాచీ, గణితశాస్త్ర కావ్యకర్తి లీలావతి, రఘునాధాభ్యుదయ కావ్యకర్తి రామభద్రాంబ, రామాయణసార తిలకమును రచించిన మధురవాణిలను పేర్కొనవచ్చు. ఈ కవియిత్రు లందరూ వారి కావ్య రచనలను సంస్కృతమున చేసి ఉ న్నారు.

రఘునాథ రాయల తరువాత ఆంధ్ర సీమను పరిపాలించిన విజయరాఘవుని ఆస్థానమున కళలు వెల్లివిరిసినవి, ఆ కాలమున ఆస్థానములనలంకరించిన విదుషీమణులలో కృష్ణాజి, రంగాజి అను వారిద్దరు ప్రసిద్ధ కావ్య ప్రక్రియలనన్నింటినీ చేపట్టినవారు.

నాయక రాజుల కాలంలో విరివిగా రచన చేసిన స్త్రీల కావ్యాలలో కూడా అతివల శృంగారమే కనబడుతుంది. 1740-1780 ప్రాంతంలో మధురాపురి ప్రభువైన ప్రతాపుని ఆస్థానంలోని విదుషీమణి ముద్దుపళని, ఈమె వ్రాసిన 'రాధికా సాంత్వనము'. కావ్యం దాదాపు రెండువందల సంవత్సరాల తర్వాత కూడా ఆంధ్రదేశంలో కవుల మధ్య వాద వివాదాలకు కేంద్రబిందువైందంటే ఆ తరంలో అది ఎంత సాహసంతో కూడిన రచనో మనం ఊహించవచ్చు. దక్షిణ నాయకుడుగా క్రీడించే పురుషుని స్త్రీలోలత్వాన్ని,

దానివలన ఆ స్త్రీలలో అంకురించిన అసూయద్వేషాలనీ వివరంగా చిత్రించింది ముద్దుపళని. ఈ కావ్యంలో రాధ కృష్ణుని కలవటం కోసం ఎన్ని అవస్థలు పడుతుందో వివరించిన పద్యాన్ని పరిశీలించినప్పుడు ఆనాటి ఉమ్మడి కుటుంబాలలోని పరివారమూ, వారి మధ్య కోడలిగా మసలే స్త్రీయొక్క అస్వతంత్ర స్థితీ, స్వేచ్ఛకోసమని ఆమె పక్కదారులు వెతుక్కోవటమూ కళ్ళకు కట్టినట్లు కన్పిస్తుంది.

కందుకూరి వీరేశలింగం 1886-1894 ఆంధ్రకవుల చరిత్రరాస్తూ, ముద్దుపళని 'రాధికా సాంత్వనం' కావ్యాన్ని తీవ్రంగా నిరసించారు.

ముద్దుపళనితో రాజుల ఆశ్రయంలో తమ కవితా గానాన్ని విన్పించి లబ్ధప్రతిష్టులైన వారి చరిత్ర అంతరించింది. ఒక్క మొల్ల తప్పించి గంగాదేవి మొదలుకొని ముద్దుపళని వరకు ఏదో విధంగా రాజులతో సబంధం ఉన్నవాళ్లే, నాయికరాజుల కాలంలో కవిత్వం చెప్పిన స్త్రీల నందరినీ ప్రభువుల ఉపకాంతలుగానే గమనించవచ్చు.

ఆనాటి సమాజమున షట్కర్మయుక్తమైన కులధర్మపత్ని ప్రాముఖ్యాన్ని తెల్పుతుంది.

వేంగమాంబ తరువాత ఆ కోవలో కవిత్వం చెప్పిన భక్త కవయిత్రి అవధూత జ్ఞానమాంబ. విజ్ఞానామృతం, దేవుడు, రంగావధూత, గార్గి, కాళీ ప్రసాదిని, సత్రుభు శతకాలు యీమె రచనలు. విజ్ఞానామృతం కావ్యాన్ని స్థలనచిత్త రహిత జ్ఞానమాంబ అనే మకుటంతో శతకంవలె రచించింది.

18వ శతాబ్దంలోనూ, 19 శతాబ్ది ఆరంభంలోనూ వచ్చిన స్త్రీల కవిత్వాన్ని పరిశీలిస్తే ఇంకా భక్తి కవిత్వాన్ని వ్రాసినవాళ్ళూ, స్త్రీ విద్యావశ్యకతను గురించి, కులస్త్రీలు నడుచుకోవలసిన రీతులను గురించి, పతిభక్తిని గురించి వ్రాసినవాళ్ళూ, ఆనాటి సమాజంలో చోటుచేసుకుంటున్న సంస్కరణలను గురించి వ్రాసినవాళ్ళూ, ఆనాటి సమాజంలో చోటుచేసుకొంటున్న సంస్కరనలను గురించి, కొద్ది కొద్దిగా ఆలోచించి ఆ భావాలను కవిత్వంలో ఛాయామాత్రంగా వ్యక్తం చేసినవాళ్ళూ, ఆనాటి సమాజంలో చోటు చేసుకుంటున్న సంస్కరణలను గురించి, కొద్ది కొద్దిగా ఆలోచించి ఆ భావాలను కవిత్వంలో ఛాయామాత్రంగా వ్యక్తం చేసినవాళ్ళూ, మూఢనమ్మకాలనూ, సనాతనాచారాలనూ సున్నితంగా ఎత్తిపొడిచిన వాళ్ళూ అక్కడక్కడా కనబడతారు. తమచుట్టూ ఉన్న సమాజాన్ని పరిశీలించి సమాజానికి సంబంధించిన కవిత్వం, అంటే ఆర్థిక, సామాజిక, రాజకీయ సమస్యలను గురించిన ప్రస్తావన అసలు కనబడదు. సాటి స్త్రీలకు సంబధించిన విషయాలను, వారు కుటుంబంలో ఎదుర్కొనే సమస్యలను అంటే కేవలం తమకు సంబంధించిన కవిత్వాన్నే వ్రాసినట్లుగా అనిపిస్తుంది. అయితే, ఆనాటి సమాజంలో ఉన్న కట్టుబాట్లు, అవిద్య, సనాతన సంప్రదాయాల మధ్య నిత్యం నలిగే మహిళలు అమాత్రమైనా సామాజిక చిత్రణ చేశారంటే అది అభినందించదగ్గ విషయమే. ఈ మార్పు రాబోయే స్త్రీల చైతన్యానికి సంకేతంగా గుర్తించవలసింది. వేమూరి శారదాంబ గారు 1898 ప్రాంతంలో వ్రాసిన కావ్యం 'మాధవ శతకం'లో నమకాలీన నమాజంలో విద్యావిహీనులైన స్త్రీల దుస్థితిని వివరిస్తూ.

"గొల్లది చల్ల వాదుకిడ గోడల గీతల గీచి లెక్కలన్
తెల్లము సేయు, జాకలిది తెచ్చిన బట్టలు వైచు బట్టలున్
బల్లవపాణి త్రాడునకు బాగుగ వైచుచు విప్పుముళ్ల దా
సల్లలితంబుగా చదువజాలని చిన్నియలెల్ల మాధవా"

అని వ్రాసింది.

19వ శతాబ్ది ఆరంభాన్ని వీరేశలింగంయుగంగా భావించినట్లయితే, ఈ యుగంలో ప్రథమంగా స్త్రీల కవిత్వానికి శ్రీకారం చుట్టిన కవయిత్రి శ్రీమతి కొటికొలపూడి సీతమ్మ గారు.

"స్త్రీలు విద్యనేర్వ జెడిపోవుదురను మాట
కల్లయనుచు దోప నెల్లరకును
విశదపరతునొక్క విద్యావతి చరిత్ర"

అంటూ కావ్య ప్రారంభంలోనే ఆనాటి సమాజంలో స్త్రీ విద్యపట్ల ఉన్న విముఖతను వివరించారు.

శ్రీ వీరేశలింగం పంతులుగారికి సర్వ సాంఘిక సంస్కరణోద్యమాల లోనూ సహధర్మచారిణి అయిన శ్రీమతి రాజ్యలక్ష్మమ్మగారు భక్తి కీర్తనల రచన చేశారు. వీరు 'హిందూ సుందరి' పత్రికను మెచ్చుకొంటూ 1904 ఏప్రిల్ నెల సంచికలో ఒక పాట వ్రాశారు.

"పలుమారు వింత సుద్దులను బల్కును ముద్దులుగుల్కు పద్దెముల్
జిలుకును సారెకును జిత్ర విచిత్రమైన యాటలన్
దెలుపును మోద వార్నిధిని దెప్పల దేలగ జేయు నిత్యమున్
దలపగకూర్మి పుత్రిక కదా! మరి పత్రిక యెందు జూచినన్"

అంటూ బాలాంత్రపు శేషమ్మ గారు హిందూసుందరి పత్రికను ప్రియపుత్రికగా అభివర్ణిస్తూ, ఆ పత్రికలో వింతలు, విశేషాలు, స్త్రీలకు మనోహ్లాదాన్ని కలిగించే అంశాలు ఎన్నో ఉండేవని పై పద్యంలో తెలిపారు.

1875 ప్రాంతంలో మన రాష్ట్రంలో 1సం నుండి 19 సంవత్సరాల లోపు ఉన్న బాలవితంతువుల సంఖ్య, 3,82,736. అందులో 1 సం నుండి 9 సం॥లోపు బాలవితంతువుల సంఖ్య చూస్తే హృదయం కరగక మానదు. అటువంటి దుస్థితిలో ఉన్న ఆడపిల్లలకు బ్రతుకు తెరువు చూపకుండా వారికి భర్త ద్వారా సంక్రమించిన ఆస్తిని స్వాహా చేసి, ఇంటిచాకిరి చేయించి, వాళ్లను చులకనగా చూడటం ద్వారా వాళ్లలో నూన్యతా భావాన్ని ఏర్పరచి జీవచ్ఛవాలలాగ తయారు చేసే బదులు వారికి విద్య చెప్పించిగానీ, మళ్లీ పెళ్లి జరపడం ద్వారాగానీ, వారికొక జీవనోపాధి చూపడం వల్లగానీ వారి జీవితానికొక మార్గం చూపాలిగానీ, అభం శుభం తెలియని పసి వితంతువులను బాధిస్తే ఏం ప్రయోజనం.

వరకట్న దురాచారాన్ని రూపుమాపకపోతే మన దేశానికి అభివృద్ధి లేదని వాపోయారు.

ఎప్పుడు? 1930 ప్రాంతాల్లో, కానీ 20వ శతాబ్దంలో కూడా ఇదే సమస్య అంతకంటే జటిలంగా తయారై అప్పుడులేని కిరసనాయిలు హత్యలు ఇప్పుడు అదనంగా తోడయ్యాయి. ఈ వరకట్నం విషయంలో మాత్రం ఎటువంటి సంస్కరణా ఎవరూ తీసుకురాలేకపోతున్నారనే చెప్పాలి.

ఆరోజుల్లో వెలువడిన భావకవిత్వచ్ఛాయలు ఎక్కువగా స్త్రీలను ప్రభావితులను చేశాయి. స్త్రీలు సహజంగా సున్నిత మనస్సులు కనుక, ప్రకృతిని చూసి పరవశించి వ్రాసే కవితలను ఎక్కువగా చదివేందుకుగానీ, వ్రాసేందుకుగానీ మొగ్గు చూపించారు. అందువల్ల, ఎక్కువగా స్త్రీలు భక్తి కవిత్వాన్ని, భావ కవిత్వాన్ని వ్రాయడం మనం గమనించవచ్చు. ఏదో ఇంట్లో పనీపాటా అయ్యాక ఓమూల కూర్చొని కనబడని భగవంతుడినీ, కనిపించే ప్రకృతినీ వర్ణించుకొంటూ కవిత్వం వ్రాస్తే ఏ గొడవా ఉండదని అనుకొని పలాయనవాద మనస్తత్వంతో ఊహాత్మక ప్రపంచంలోకి వెళ్ళి ఉండనూవచ్చు.

శ్రీ మద్దుకృష్ణ 1935లో చేసిన 'వైతాళికులు' సంకలనంలో శ్రీమతి చావలి బంగారమ్మ, శ్రీమతి బసవరాజు రాజ్యలక్ష్మి, శ్రీమతి తల్లాప్రగడ విశ్వసుందరమ్మ గార్ల కవిత్వాన్ని చేర్చారు. వీరిలో చావలి బంగారమ్మ గారు పూర్తి భావ కవిత్వచ్ఛాయలను అనుసరించి వ్రాశారు. బసవరాజు రాజ్యలక్ష్మమ్మ గారు భావ కవిత్వంలో ఒక అంశం అయిన అత్మాశ్రయత ఆధారంగా కవిత్వం వ్రాసారు. భావ కవిత్వయుగంలో చావలి బంగారమ్మగారు 'ఆకొండ, ఆగండి, చుక్కడలు, ఆగి చూడండి, కొత్తపాట, అన్న, నీడ, కప్పతల్లి, పెండ్లి, శ్రీమతి బసవరాజు రాజ్యలక్ష్మి గారి 'దురదృష్టము', వింజమూరి వెంకటరత్నమ్మ గారి 'ప్రేమ రాజ్యము' బాగా ప్రాచుర్యం పొందిన కవితలు.

స్వాతంత్రోద్యమ ప్రభావంతోనూ, సంస్కరణోద్యమ ప్రభావంతోనూ కవిత్వం వ్రాసిన కవయిత్రి శ్రీమతి తల్లావ్రగడ విశ్వసుందరమ్మగారు. స్వయంగా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని 1930లో జైలుకు వెళ్ళిన విశ్వసుందరమ్మగారు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న తన స్వీయానుభవాలను వివరిస్తూ, సర్కారు దొరతనం, స్త్రీల చెఱసాలలో, ఆంగ్లగౌరవం, లాఠీరాజ్యం మొదలైన వాటిపై పద్యాలను రచించారు. వీరు వ్రాసిన 'జైలు గడియారం' కవిత జైలు శిక్షను అనుభవస్తూ వ్రాశారు.

ఈ విధంగా జాతీయోద్యమ కాలంలో స్త్రీలలో వచ్చిన చైతన్యాన్ని, అంతకుముందు వీరేశలింగం మహనీయుడు తన సంఘ సంస్కరణోద్యమం ద్వారా స్త్రీలలో తెచ్చిన ప్రబోధాన్ని కమ్యూనిస్టు ఉద్యమం ఆధ్వర్యాన ఏర్పడిన మహిళా సంఘాలు మరింత ముందుకు తీసుకుపోయాయి. ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ స్త్రీలలో గొప్ప సాంఘిక, రాజకీయ చైతన్యాన్ని తీసుకురాగలిగినాయి. ఆనాటి మహిళా ఉద్యమం స్వాతంత్ర్యానంతరం ఆ తరువాత విద్యా విజ్ఞాన రంగాలలో వచ్చిన అవకాశాలను స్త్రీలు వినియోగించుకోవాడానికి, స్త్రీల అభివృద్ధికి ప్రాతిపదలకు ఏర్పడ్డాయి.

ఉపయుక్త గ్రంథాలు :

1. ప్రాచీనాంధ్ర కవయిత్రులు (వ్యాసం) శ్రీ నిడదవోలు వెంకట్రావు – ఆంధ్ర మహిళ 1958 జనవరి సంచిక.
2. ఆంధ్ర కవయిత్రులు – శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ
3. అహల్యాబాయి – శ్రీమతి కొటికల పూడి సీతమ్మ
4. గృహలక్ష్మి – 1929 డిసెంబరు సంచిక

వేయి పడగలు నవల – సామాజిక దృక్పథం

తురంగి విశ్వనాధము, తెలుగు ఉపన్యాసకులు, శ్రీ జి.సి.ఎస్.ఆర్. కళాశాల, రాజాం,
విజయనగరం, ఆంధ్రప్రదేశ్. సెల్ నెం: 9440550195

18, 19వ శతాబ్ధంలో పాశ్చాత్య సాహిత్య ప్రభావముతో కాల్పనిక, హేతువాద దృక్పదములతో తెలుగు నవలారంగమున సరికొత్త అధ్యాయమును ప్రవేశపెట్టి స్వతంత్ర ప్రతిపత్తి గల నవలలనెన్నింటినో ప్రసాదించి తెలుగు నవలా సాహిత్య చరిత్రను వేరొక మలుపునకు త్రిప్పి అది బహుముఖములుగా ప్రజలలో వ్యాపించుటకు అపార కృషిసలిపిన భాషా భగీరధులు శ్రీ విశ్వనాధ సత్యన్నారాయణ గారు, శ్రీ గుడిపాటి వేంకటచలం, శ్రీ అడవి బాపిరాజు గార్లు, వీరి ప్రభావంతో చేవగల స్వతంత్ర రచనలు తెలుగు రచయితల వ్యాసముల నుండి విరివిగా జాలువారినవి. ఈ మార్పునకు పైన తెలిపిన త్రిమూర్తులే ముఖ్యులు.

ఒక దివ్య తేజస్సు క్రమేపి మసకబారుతూ కనుమరుగు కాబోతున్న కాలంలో దానిని పునరజ్జీవింప చేయడం కొరకు విశ్వనాధ సత్యన్నారాయణ గారు తమ వైదగ్ధ్యమంతా చూపి ''వేయి పడగల''ను విశ్వ సాహిత్యానికి కానుకగా సమర్పించినారు.

18,19 శతాబ్దాలలో ప్రపంచ చరిత్రలో మానవ జీవిత విధానంలో అనూహ్యమైన మార్పులు వచ్చాయి. రాజకీయ, ఆర్థిక, సాంఘిక, మత రంగాలలో కొత్త కొత్త ఆలోచనలు, సిద్ధాంతాలు, సూత్రాలు భాష్యాలు వెలువడ్డాయి. వ్యక్తి స్వేచ్ఛ, వ్యక్తి వికాసం ప్రాధాన్యం పొందాయి. ఈ మార్పు 'రినైజాన్స్' అనే పేర ఇటలీలో ప్రారంభమై రాజకీయ ప్రాబల్యం వల్ల ప్రపంచమంతా విస్తరించింది.

1857 సిపాయీల స్వాతంత్ర్య సంగ్రామం భారతదేశంలో పునరుజ్జీవనానికి నాంది పలికింది. రాజకీయంగా విఫలమైనా మత సాంఘిక రంగాలలో ప్రజలను ప్రభావితం చేసింది. తెల్లదొరతనం తమ మతానికి, సంఘానికి చేటు చేకూరుస్తున్నదన్న భావం వ్యాపించి, వాటిని కాపాడుకోవాలన్న ఉద్యమం ప్రారంభమైంది. ఇందుకు సంపూర్ణ స్వరాజ్యం ఒక్కటే పరిష్కారమన్న భావన వ్యాప్తమై చివరకు భారత స్వాతంత్రోద్యమంగా రూపం దిద్దుకొన్నది.

రాజకీయోద్యమాన్ని మినహాయిస్తే మన దేశంలో ఆర్థిక, సాంఘిక మత ఉద్యమాలు రెండు వర్గాల వారిచేత ప్రభావితమయ్యాయి. ఒక వర్గం వారికి వేదవేదాంగాలు, పురాణేతిహాసాలు, శాస్త్రాలు భూమిక కాగా, మరో వర్గానికి పాశ్చాత్య విద్య విజ్ఞానం ప్రసాదించిన అధునాతన భావాలు వేదిక అయ్యాయి. వీరికి పాత విలువలు, సంప్రదాయాల పట్ల వైముఖ్యం ఏర్పడి కొత్త ఆలోచనలు ఆచారాలు అన్నీ గొప్పగా కన్పడసాగాయి. వీరికి వ్యతిరేకంగా తరతరాలుగా వస్తున్న భారతీయ సంస్కృతి నాగరికతలే గొప్పవని వాటిని పరిరక్షించుకోవడమే తప్ప పవిత్ర కర్తవ్యమని మొదటి వర్గం తలపెట్టారు. వీరిద్దరి మధ్య రాజారామ్మోహన రాయలు, దయానందసరస్వతి, అరవిందఘోష్, కందుకూరి వీరేశలింగం పంతులు, రఘుపతి వెంకటరత్నం నాయుడు మొదలైన వారు ప్రాచీనార్వాచీన విలువలలో మంచిని ఎంచుకొని సమాజానికి ఒక కొత్త మార్గం చూపించాలని శ్రమించసాగారు.

పాతను వదులుకోలేక, కొత్తను ఆహ్వానించలేక సంఘం అతలాకుతలం అవుతున్న సంధికాలంలో జన్మించారు. శ్రీ విశ్వనాధ సత్యనారాయణగారు సమగ్రమైన పాండిత్యం, సుమధురమైన కవితా హృదయం, గాఢమైన దేశభక్తి దృఢమైన జాతీయత రక్తి, ఏవిషయాన్నైన సమగ్రంగా విశ్లేషించి చూడగల నిశిత దృష్టి తనకు వచ్చినది, లేక తాను నమ్మినది ఏదైన నిర్మోహమాటంగా స్పష్టీకరించగల గుండెదిటవు ఆయన ప్రత్యేకతలు. ధర్మం, సంస్కృతి,

సాంప్రదాయం ఆయనకు పరమాదరణీయాలు ఆ ఆదరణకు అభిమానానికి ఫల స్వరూపం వేయి పడగలు అయితే ఆయన అభినివేశం కొందరికి కొరుకుడు పడలేదు. అందువల్ల ఆయన ఆధునికతకు వ్యతిరేకియని, అభ్యుదయ నిరోధకుడని, దేశాన్ని సమాజాన్ని వేయి సంవత్సరాలు వెనక్కు నడపడానికి ప్రయత్నిస్తున్నాడని విమర్శించడం ప్రారంభించారు.

వీరికి సమాధానంగా 1971లో శ్రీ ఏ.ఎస్.రామన్ గారికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఇలా అన్నారు. "నేను ఆధునికతకు వ్యతిరేకిని కాను. ఆధునిక విజ్ఞానం సమకూర్చిన రైలు, రేడియో, ఫోను లాంటి సుఖాలకు అంతకన్నా వ్యతిరేకినికాను. నా రచనలను సావధానంగా చదివి అర్థం చేసుకోంటే నేను రష్యా ప్రభుత్వం లాంటి ప్రభుత్వాన్ని కోరుకుంటున్నానని స్పష్టమౌతుంది. నేను గత విలువలను సమర్థిస్తున్న మాట నిజమే! అయితే వాటినలాగే పునఃప్రతిష్టించాలని అనుకోవడం లేదు. అది సాధ్యం కాదని కూడా నాకు తెలుసు. కొత్త మోజులో పాతదంతా పనికి రాదనే ఆధునికులను మాత్రమే నేను వ్యతిరేకిస్తున్నాను. సంస్కృతికి పుష్టిని సమాజానికి తుష్టిని చేకూర్చే పాత కొత్తల మేలు కలయిక నా గమ్యం. నా ధ్యేయం" (విమర్శని II నుండి అనుసరణ) ఒక వేయి పడగలేకాదు ఆయన సమస్త సాహిత్యం ఈ ఆలోచనా స్రవంతి యొక్క రూపాంతరమే.

ఆయన పల్లెటూళ్ళో పుట్టాడు. పల్లెటూళ్ళలో పెరిగాడు. అక్కడి ప్రకృతి శోభను, ఆ కృత్రిమ జీవితాన్ని, కుల విద్యలను, వృత్తి విద్యలను, జానపద కళాస్వరూపాలను అనుభవించాడు. పల్లెల శోభ తెలియని వారికి నా కావ్యాల పరమార్థం అర్థం కాదు అని సగర్వంగా చెప్పుకొన్నాడు. మధురమైన ఆ అనుభవాలను, అనుభూతులను జీవితాంతం గుండెలో పదిలపరచుకొని తన సాహిత్యం ద్వారా పంచిపెట్టాడు.

అది సుబ్బన్న పేట కావచ్చు, నందమూరు కావచ్చు. అది భారతదేశానికి గుండెలాంటి పల్లె పట్టు సంస్కృతికి ఊపిరివట్టు రాజకీయంగా తమ స్థానాన్ని పదిలపరచుకొనేందుకు బ్రిటిష్ పాలకులు అనుసరించిన సాంఘిక ఆర్థిక విధానాలు పల్లెజీవితంలో అలజడి సృష్టించాయి. ఇంగ్లీషు చదువులు, అవి ఎరచూపిన ఉద్యోగాలు, కొత్త ఆచారాలు, వేషభాషలు వినోదాలు ఆర్థికంగా లాభకారియైన వాణిజ్యపంటల మీద వ్యామోహం సనాతన గ్రామీణ వ్యవస్థను కలచి వేశాయి. గ్రామాల స్థానంలో బస్తీలు, పట్టణాలు తలెత్తాయి.

ఈ మార్పును వేయి పడగలు గుర్తించింది. అంతేకాదు అ మార్పు వెనకాల ఉన్న అసమగ్రతను అసంబద్ధతను కూడా గుర్తించింది. గుర్తించి కళాత్మకంగా వ్యక్తీకరించింది.

సుబ్బన్నపేటలో కుళాయిలు పెట్టారు. వేయిపడగలు వద్దనలేదు. కాని తాగడానికైనా సరిగా నీరు అందివ్వలేని ఆ కుళాయిలను నమ్ముకొని బావులు పూడ్చి కొంపలు తగలు బట్టపుడు నీరు లేక అసహాయంగా చూస్తూ నిలబడ్డ ప్రజల మోజును విమర్శించింది. విద్యుద్దీపాలు వద్దన లేదు కాని వాటి గుడ్డి వెలుతురులో బంగారు ఉంగరం వెతకడం నామోషిగా భావించిన మనస్తత్వాన్ని వెక్కిరించింది. పాతికమంది నోటిలో మట్టికొట్టి, పదింతల ఎక్కువ ఖర్చుతో ఇద్దరు ముగ్గురు ధనవంతులు మరింత డబ్బు సంపాదించే మార్గం చూపిన పారిశ్రామీకరణాన్ని అవహేళన చేసింది. పురపాలక సంఘం ఏర్పాటును కాని భవన నిర్మాణాన్ని కాని వ్యతిరేకించలేదు. కాని అందుకోసం సర్కారు వారు దయతో అప్పిచ్చారని, వరద వల్ల ఉప్పెనల వల్ల తినడానికి గింజకూడ లేక కటకటపడుతున్నరైతాంగం వాయిదా కూడా అడగకుండా అప్పు తీర్చాలిసిందే నన్న తీర్మానం ఔచిత్యాన్ని సవాలు చేసింది. ఆ సర్కారెక్కడిది? ఆ సర్కారుకు డబ్బెక్కడిది? అని నిలదీసింది. పురపాలక సంఘం అధ్యక్షుడు సర్కారు మనిషని, సర్కారుకు వ్యతిరేకంగా మాట్లాడరాదన్న స్వపరిపాలనా సిద్ధాంతం యొక్క బండారాన్ని బయట పెట్టింది. ఊరికి రైలు మార్గం రాకుండ అడ్డుపడలేదు. కాని ఆ అయోమయ మార్గం ఊరి

ప్రయోజనాలను కాదని ఊరి పంటను ఎక్కడికో ఎత్తుకొని పోవడాన్ని తూర్పార పట్టింది. పాశ్చాత్య విద్య భారతీయులలో భారతీయత పట్ల వెగటు పుట్టించడం సహించలేకపోయింది. ఆ విద్య నేర్చిన వారికి భారతీయ భాసలలో సాహిత్యమే కనిపించదు, మిల్టన్, బైరన్, షేక్స్పియరులు తప్ప ఇండియాలో కవులే కనుపించరు. ఇది మన సాహిత్యం వీరు మన కవులు అని ఎవరైనా చెపితే వాడు పూర్వాచార పరాయణుడు, తర్కానికి విలువలేనివాడు. ఛాందసుడు ఈ విద్యావంతులకు హామ్లెట్లోని గొప్పతనం తెలుసు. షైలాక్ వేషం కట్టడం తెలుసు. కాని దుష్యంతుడి ఆహార్యం తెలియదు. నారదుడి వాచికం రాదు. వారికి కణ్వాశ్రమము, యూరపులోని పల్లె రెండూ ఒకటిగానే కనపడతాయి. ఈ దోషాన్ని చూపినవాడు. వట్టినాటుసరుకు 50 సంవత్సరాల తర్వాత వేయి పడగలలో భూతదర్శనం చేయగలిగిన మూర్తులు ఈ అసంబద్ధతలను అసమగ్రతలను చూడలేక పోవడాన్ని వేయి పడగలు వర్ణించింది.

భారతీయ సంస్కృతి రెండు స్తంభాలమేడ. ఒకటి గ్రామీణ వ్యవస్థ, ఇది స్వయం పోషకమైన ఆర్థిక సిద్ధాంతం ప్రాతిపాదికంగా నిర్మించబడ్డ బాహ్య వ్యవస్థ. ఇది చెడిపోయింది. దీనిని మార్చడం, తిరిగి పునరద్ధరించడం సాధ్యం కాని పని.

రెండువది వివాహ వ్యవస్థ. దాంపత్య ధర్మం, సమాజంలో శాంతి, సుస్థిరత, పరస్పర ప్రేమ, అవగాహన మూల సూత్రాలుగా నిర్మించబడ్డ అంతరవ్యవస్థ. వ్యక్తి స్వేచ్ఛ పేర, స్త్రీ స్వాతంత్ర్యం పేర దానిని కూడా కలుషితం చేయడానికి విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రయత్నాలకు ఆదిలోనే చెలియలి కట్టవేయాలి. అది కూడా నశిస్తే జాతీయే నశిస్తుంది. అందుకే అందరూ పోయి, అన్నీపోయి "ఇంకనేమి మిగిలినది" అని అనుకొంటున్న చివరి క్షణాలలో భార్యను చూచి భర్త అవును! నీవు మిగిలితివి. ఇది నా జాతిశక్తి" అని తృప్తిపడింది. వేయిపగడలు, ఆ తృప్తిలోని రహస్యాన్ని వివరించడానికే దాంపత్య ధర్మాన్ని, స్త్రీ పురుషుల మధ్య ధర్మబద్ధమైన ప్రణయాన్ని బహుముఖాలుగా వర్ణించింది.

శశిరేఖ కిరీట ప్రేమించుకొన్నారు. వారికి వరుసకూడా ఉంది. అయితే ఉద్యోగ గర్వం చేతకావచ్చు. లేదా కిరీటికన్నా యోగ్యుడైన వరుడు కావాలని కావచ్చు. శశిరేఖ తండ్రి వారి పెండ్లికి ఇష్టపడలేదు. వారిద్దరూ సత్యాగ్రహం చేశారు. తిండి తిప్పలు మాని, మరణానికి చేరువై ఒప్పించి, మెప్పించి పెండ్లి చేసుకొన్నారు.

శ్యామల తల్లితో తగవులాడి కులాంతరుడు, మతాంతరుడైన కుమార స్వామిని పెండ్లి చేసుకొన్నది. ఆశ్చర్యమేమంటే పూర్వచారపరాయనుడు, ఛాందసుడు అని బిరుదులు పొందిన కథానాయకుడు ఈ వివాహాలను సమర్థించాడు. పవిత్రమైన ప్రేమకు వయస్సు అంతస్తులు, కులాలు, మతాలు అడ్డుకాకూడదని ప్రబోధించాడు.

వేయిపడగలు స్త్రీ విద్యకు స్వాతంత్ర్యానికి శత్రువని చెప్పడం జరుగుతున్నది. నిజానికి వేయిపడగలు స్త్రీకి విలక్షణమైన విద్యను ప్రతిపాదించింది. సంస్కృతి, సంప్రదాయం, జీవన విధానాల పట్ల సమగ్రమైన అవగాహన కలిగించగల విద్య కావాలన్నది. స్త్రీ వ్యక్తిగతంగాను, సామాజికంగాను తన పాత్రను, స్థానాన్ని గుర్తించి తన వ్యక్తిత్వాన్ని, ఆస్తిత్వాన్ని నిరూపించుకోగల విద్యను ప్రోత్సహించింది. విద్యకు డిగ్రీలు కొలమానం కాకపోతే వేయి పడగల్లో స్త్రీలంతా విద్యావంతులే! అరుంధతి ధర్మారావుతో శాస్త్ర చర్చ చేసింది. గిరిక కావ్యనాటకాలంకారాలు నేర్పింది. రాణి రుక్మిణమ్మా రావు గారు భారత భాగవత కథలు, పద్యాలు కంఠతా నేర్చిన విదుషీమణి సంఘం చెడిపోయిందని ఈ నడించిన మంగమ్మ పండితులైన కుమారస్వామికి పాఠాలు నేర్పింది. శ్యామల శశిరేఖలు డిగ్రీల చదువులు చదివినవారే!

ఇక స్త్రీ స్వాతంత్ర్యం మాటకొస్తే ఇంటిని వంటవాడి దయాదాక్షిణ్యాలకు వదలి క్లబ్బులలో విలాసాల కోసం పదులూ, పాతికలు ఖర్చుచేసే స్వాతంత్ర్యాన్ని విమర్శించింది. అలాంటి స్వాతంత్ర్యాన్ని పరిపోషించేందుకు భవనాలు కట్టిచ్చే దాతల మెరమెచ్చు దాతృత్వాన్ని నిరసించింది. ఏవో ఆకర్షణలకు లోబడి అపమార్గం పట్టికూడా తమ తప్పు తాము తెలుసుకొని మళ్ళీ మంచి మార్గంలో జీవించాలనుకొన్న మంగమ్మలను ఈసడించు కోవడం మహిలామండలి సభ్యురాండ్రకు తగదని చెప్పింది. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడ్డ సోదరీమణులకు చేయూతనిచ్చి తమతోపాటు సమాన గౌరవ ప్రతిపత్తులను కల్పించడమే స్త్రీ స్వాతంత్ర్యానికి నిజమైన లక్ష్యమని విడమార్చింది. ఈ వివరణ స్త్రీ స్వాతంత్ర్యానికి, విద్యకు వ్యతిరేకమని భావిస్తే అది మన వ్యక్తిత్వాల లోపమే కాని వేయిపడగల తప్పుకాదు.

వేయిపడగలు స్త్రీకి పాతివ్రత్యం, సహనం కావాలని చెప్పింది. అవి భారత స్త్రీకి అలంకారాలని కూడ చెప్పింది. ఐతే అంతటలో ఊరుకోలేదు. సూసానీ పాత్ర ద్వారా ప్రపంచంలో ఏ స్త్రీకైనా అవి కావలసిన వేనవి నిరూపించింది. సుసానీ ఉద్యోగం వెతుక్కొంటూ లండను చేరింది. ఐతే పొట్టకూటి కోసం శరీరం అమ్ముకోవాలని అనుకోలేదు. గౌరవంగా బ్రతకాలనుకొన్నది రంగారావు గారిని పెండ్లి చేసుకొనేముందు తన మతం, సంప్రదాయం మార్చుకోనక్కరలేకుండా ఒప్పందం చేసుకొన్నది. ఆయనతో ఉన్నన్నాళ్ళూ నిజాయితీగా అచ్చం హిందూ గృహిణిలా ఉన్నది. ఇంగ్లండు నుండి వచ్చినా ఆయన లాయికీ కాదన్న పనులను మానుకొన్నది. ఇందుకు విరుద్ధంగా బ్రియాట్రిస్ రంగారావు గారితో ఉంటూనే పాత ప్రియుడితో లేఖాయణం నడిపింది.

వేయి పడగలు ఆడదానికి మాత్రమే పాతివ్రత్యం మప్పిందనడం కూడా అబద్ధమే. ధర్మారావు తాను ఏకపత్నీ వ్రతస్తుడినని బల్లగుద్ది చెప్పాడు. మనస్సు చలించినా నియమించుకొని ఏకపత్నీవ్రతం జీవితాదర్శంగా, లక్ష్యంగా అనుష్టించాలని చెప్పాడు.

ఏ జాతి మనుగడ లేక అభివృద్ధికైనా ఆ జాతి జాతీయ విద్యా విధానం దోహదం చేస్తుంది. భారతదేశంలో అతి ప్రాచీన కాలం నుండి అమలులో ఉన్న విద్యావిధానం దేశంలో భాష, కులం, మతం, ప్రాంతం ఏదైనా అందరూ ఒకటేనని ఆసేతు హిమాచలం ఒకటే దేశం, ఒకటే సంస్కృతి, ఒకటే జాతి అన్న నమైక్యతా భావాన్ని పెంపొందింపచేసింది. అదొక అద్భుతమైన విద్యా విధానం. ఒక వంక గురు కులాల ద్వారా ప్రత్యేక శాస్త్ర విభాగాలలో నిష్ణాతులను చేస్తూనే మరో వంక దృశ్యశ్రవ్య విధానాల ద్వారా జానపద కళారీతుల ద్వారా భారతీయ ఆదర్శ జీవన విధానాన్ని ప్రచారం చేసింది. వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందచేసింది.

బ్రిటీష్ వారు ప్రవేశపెట్టిన విద్యా విధానం ఇందుకు పూర్తిగా విరుద్ధమైంది. విభజించి పాలించుచున్న వారి రాజనీతి సూత్రం పునాదిగా నిర్మించబడ్డది. వారి మాటల్లోనే "To create a class of persons Indians in blood and colour, but English in taste, in options, in morals and in intellect" అనేది ఆ విధానం యొక్క లక్ష్యం. అది ఎంత తొందరగా ఎంత తీవ్రంగా దేశీయులను సెడ్యూస్ చేస్తున్నదో వారి మనసులలోకి విషాన్ని ఇంజెక్టు చేస్తున్నదో వేయిపడగలు వేయి ముఖాలుగా వర్ణించి చెప్పింది. వేదాలు విద్వారణ్యుడికి అర్థం కాలేదన్న వామనరావులను సాక్షులుగా బోనెక్కించింది.

వేయిపడగల కాలేజీలో కనపడిన ఆశ్రిత పక్షపాతాలు, అధికారుల అహంకారాలు, వారి ప్రాపకం కోసం పాటుపడే కల్లబొల్లి కబుర్లు ఆ కాలేజీకి మాత్రమే పరిమితం కావు. ఆ నవల వ్రాయబడ్డ 50 సంవత్సరాల తర్వాత మనం రోజూ చూస్తున్న సజీవ చిత్రాలు. ఇన్ని లోపాల మధ్య భారతీయత ఏమూల ఏ రూపంలో ఉన్నారూ నశింప చేయడమే

ధ్యేయంగా కల ఆ విద్యకు వేలకు వేలు తగుల పెట్టి నేర్వడం ఏ మాత్రం సబబో ఆలోచించుకోమన్నది వేయి పడగలు.

వేయి పడగలు సూచించిన విద్యా విధానం తరతరాలుగా సాగివస్తున్న జాతీయ విధానం. పైసా ఖర్చు లేకుండా తాతమ్మ ఒడిలో, తాతయ్య ఒడిలో నేర్చుకొనే విద్య అది. అగ్గిపెట్టెలో చీరలు పెట్టారని చరిత్ర చెపుతున్న నైపుణ్యం. ఆ విద్య యొక్క ఫలితం. వ్యక్తి సుఖమే కాక సమాజం యొక్క హితం ఆ విద్య యొక్క ధ్యేయం.

ఈ విధంగా జాతి జీవన విధానం పట్ల సాధికారికమైన పరిశీలనతో సమాజం పట్ల విశ్లేషణాత్మకమైన దృక్పథంతో, వ్యక్తి సౌభాగ్యం సంఘ సంక్షేమం కోరి సమగ్రమైన స్వచ్ఛమైన సామాజిక దృక్పథంతో, స్నేహతో వ్రాయబడ్డ ఆధునిక ఇతిహాసం వేయి పడగలని అనడం మెచ్చుకోవడం కాదు. నిజాన్ని ఒప్పుకోవడం.

ఆధార గ్రంథాలు :

1) వేయి పడగలు

2) విమర్శిని – II అనుసరణ

3) తెలుగు నవలా సాహిత్య వికాసం

4) తెలుగు భాషా విమర్శ గ్రంథం

5) సాహిత్య దృక్పథాలు

భావకవి కృష్ణశాస్త్రి కవిత్వం

పై. విజయలలిత, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ ప్రభుత్వ డిగ్రి కళాశాల, ఖైరతాబాద్, హైదరాబాద్
సెల్ : 75698 94769

కృష్ణశాస్త్రి :

దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి భావకవులలో ముఖ్యుడు. భావ కవితోద్యమంలో ఎందరో యువకవులను ముందుండి నడిపించాడు. కృష్ణశాస్త్రి కృష్ణపక్షం, ప్రవాసము, ఊర్వశి అనే పద్యకృతులను వ్రాశారు. అప్పుడే పుట్టివుంటే, బహుకాళ దర్శనం, పుష్పలావికలు మొ।। వ్యాస సంపుటాలను వచన రచనలో నూతన వొరవడిని సృష్టించినాడు. తెలుగు అధ్యాపకునిగా, హైదరాబాదు ఆకాశవాణిలో కొంతకాలం పనిచేశాడు. ఎన్నో సినిమాలకు పాటలు వ్రాసినాడు.

కృష్ణశాస్త్రి సాహిత్యం భావకవిత్వంలోనే సాగింది. ఆంగ్ల సాహిత్యంలో 'Romantic Poetry'ని వర్డ్స్‌వర్త్, షెల్లీ, కీడ్స్ వ్రాసినారు. ఇది కాల్పనికసాహిత్య ప్రభావంతో, తెలుగులో భావకవిత్వంగా ఆవిర్భవించింది. కృష్ణశాస్త్రి సాహిత్యం షెల్లీ సాహిత్యం లాగ వుండటం వలన, కృష్ణశాస్త్రిని "ఆంధ్రషెల్లీ"గా పిలిచేవారు. భావకవిత్వంలో దశాబ్దాలపాటు సాహిత్యాన్ని కొనసాగించాడు. కృష్ణశాస్త్రి భావకవిత్వం తర్వాతి తరం వారికి బాటలువేయడం వలన కృష్ణశాస్త్రిని "భావకవి"గా పిలిచారు. మనసును హత్తుకునే విధంగా సాహిత్యం వ్రాశారు. భావకవి అనగా కృష్ణశాస్త్రిగారే ప్రేరణకు వచ్చును.

భావకవిత్వం :

ఆంగ్లసాహిత్యంలో సంప్రదాయ సాహిత్యం (Classical Poetry) పై తిరుగుబాటుగా క్రీ.వ. 18.వ.శ కాలంలో కాల్పనిక సాహిత్యం ఒక ఉద్యమంగా వచ్చింది. భారతదేశంలో కాల్పనికోద్యమ ప్రభావంతో వివిధ భాషల్లో భావకవిత్వం వచ్చింది. రవీంద్రనాథ్ గారు వ్రాసిన భావకవిత్వ ప్రభావం మన తెలుగు కవిత్వంపై ప్రభావం చూపింది. దీనినే ఆంగ్లమున (Romantic Poetry) అంటారు. ఆంగ్లమున కాల్పనికోద్యమ ప్రభావంతో వర్డ్స్‌వర్త్, షెల్లీ, కీట్స్, బ్లేక్, కోలరిడ్జ్ ప్రముఖులు సాహిత్యం వ్రాశారు.

క్రీ.శ. 20వ శ. కాలంలో నవ్యసాహిత్య చరిత్ర ఆంగ్ల కాల్పనికోద్యమమే తెలుగులో 'భావకవిత్వం''గా ఆవిర్భవించింది. తెలుగులో భావకవిత్వమును దేవులపల్లి కృష్ణశాస్త్రి, రాయప్రోలు సుబ్బారావు, దువ్వూరి రామిరెడ్డి, శ్రీశ్రీ, విశ్వనాథ సత్యనారాయణ, నండూరి సుబ్బారావు, సి. నారాయణ రెడ్డి మొ।। వారు భావకవిత్వం వ్రాశారు. తెలుగులో భావకవిత్వం అనుభూతి, ఆత్మాశ్రయ కవిత్వంగా కొనసాగింది. కవి మొదట తను అనుభూతి చెంది, మనస్సుకు హత్తుకునే విధంగా కవిత్వం వ్రాశారు. భావకవిత్వమును కవితా వస్తు స్వరూపము స్వభావమును బట్టి 6 శాఖలుగా విభజించినారు. అవి (1) ప్రణయకవిత్వం (2) దేశభక్తి (3) ప్రకృతి కవిత్వం (4) సంఘ సంస్కరణ (5) భక్తి కవిత్వం (6) స్మృతి కవిత్వం.

భావకవులు ముఖ్యముగా ప్రకృతి నుండి ప్రేరణ పొంది, మనస్సులో కల్గిన ప్రేమ భావనతో కవిత్వమును వ్రాశారు. భావకవిత్వమును కృష్ణశాస్త్రి "కాల్పనిక కవిత" అని దువ్వూరి రామిరెడ్డి 'గీత కవిత్వం' అని నీర నరసింహ శాస్త్రి 'నవ్యకవిత' అన్నారు. కాల్పనిక సాహిత్యంలో కవుల యొక్క భావ వ్యక్తీకరణకే ఎక్కువ ప్రాధాన్యత ఉండటం వలన దీనిని 'భావకవిత్వం" అని పిలువబడుచున్నది. భావకవిత్వం చందోబద్దంగా గేయముగా వెలుబడటం వలన 'భావగీతము' అని కూడా పిలువబడుచున్నది.

ఉద్దేశ్యము :

1. పాశ్చాత్యదేశములో 18వ శ. కాలంలో వచ్చిన (Romantic Poetry) (కాల్పనిక సాహిత్యం)కి

అనుకరణీయంగా తెలుగు భావకవిత్వం ఆవిర్భవించింది.

2. భారతదేశంలో వివిధ భాషలలో భావాకవిత్వం వచ్చింది. బెంగాల్‌లో రవీంద్రనాథ్ ఠాగూర్ గారు వ్రాసిన "గీతాంజలి" భావకవిత్వంలో వచ్చింది.
3. తెలుగులో క్రీ.శ. 20వ. శ. కాలంలో భావకవిత్వం 6 శాఖలుగా ఆవిర్భవించింది.
4. ప్రాచీన సాహిత్యంలో ప్రణమమును స్త్రీ పురుషుల శృంగారంగా తీసుకున్నారు. ఆధునిక కవిత్వంలో శృంగారముతో పాటు స్నేహమును కూడా తీసుకున్నారు.
5. ప్రణయ కవిత్వంలో స్త్రీని సహచారిగా, ప్రేయసిగా, ఇల్లాలుగా భావించి కవిత్వం వ్రాశారు.
6. ఇద్దరి వ్యక్తుల మధ్యగల సహజమైన ప్రేమకు చిహ్నముగా ప్రణయకవిత్వం వచ్చింది. ఈ కవిత్వంలో ప్రేయసిని పూజ్యస్థానము లభించింది. స్త్రీ యొక్క బాహ్యసౌదర్యాము కంటే అంతర్ సౌందర్యమునకు ప్రాముఖ్యత ఇచ్చారు.
7. ప్రకృతిని కావ్యవస్తువుగా భావించి కవిత్వం వ్రాశారు. ప్రకృతిలో కలిసిపోయినారు.
8. భావకవిత్వంలో కవే నాయకుడు, ఇంద్రియాలకు అతీతమైన ప్రేమను చూపించినాడు.

ప్రణయకవిత్వం :

ప్రణయకవిత్వం – ప్రణయ కావ్యము, ప్రణయభావన, ప్రణయ గీతములు అను పదములతో వాడబడుచున్నది. ప్రణయ కవిత్వమును ప్రాచీన కవులు స్త్రీ, పురుషుల మధ్య వున్న శృంగారముగా వాడినారు. ఆధునిక కాలంలో శృంగారమునకే కాక 'స్నేహము' అనే అర్థములో వ్రాడినారు. సంస్కృతంలో కాళిదాసు మహాకవి శకుంతలములో, కుమారసంభవములో ప్రణయమును శృంగారముగా, ప్రేమగా స్నేహముగా వాడినాడు.

కృష్ణశాస్త్రి – ప్రణయకవిత్వంలో తన ప్రేమసికి గౌరవస్థానము కల్పించినాడు.

'మఘవ మస్తక మకుట మాణిక్యరాజ్ఞి' – అన్నాడు.

స్త్రీ శిరస్సున ధరించిన కిరీటంలో మాణిక్యం వంటిది అని వర్ణించినాడు.

ఊర్వశి : కృష్ణశాస్త్రి వ్రాసిన 'ఊర్వశి' కావ్యము అద్భుతమైన కళాఖండము. ఊర్వశిని కావ్యములో నాయికా శృంగారమును అద్భుతంగా వర్ణించినాడు.

విశ్వసౌందర్యమూర్తిగా ఊర్వశి పాత్రను తీర్చిదిద్దాడు కాశిదాను కావ్యములో ఊర్వశీ వృత్తంతమును చిత్రీకరించాడు. ఋగ్వేదములలోనే ఊర్వశివిరహ వృత్తాంతము ఉన్నది. కృష్ణశాస్త్రి రచించిన ఊర్వశి కావ్యములే. ఊర్వశి – పురూరవుడు వీరి ప్రణయ వృత్తంతమును అద్భుతంగా వర్ణించినాడు. కృష్ణశాస్త్రి వర్ణించిన ఊర్వశి అద్భుత సౌందర్యరాశి. అందుకే కృష్ణశాస్త్రి "దివ్య మందార సుమము"గా వర్ణించినాడు. ఊర్వశి గంధర్వలోకము నుండి వచ్చి పురూరవుడిని ఇష్టపడి కొంతకాలం వుండి గంధర్వ లోకమునకు వెళ్ళిపోతుంది. కృష్ణశాస్త్రి ఊర్వశి – పురూరవుడు కలిసిన ప్రేమగాథను ఎంత అద్భుతంగా వర్ణించినాడు. అదే విధంగా పురూరవుడిని ఊర్వశి వదిలివెళ్ళినపుడు విరహమును కూడా అద్భుతంగా వర్ణించినాడు.

"కలుగునా నాకు నీ వియోగమ్ము సకియ"

"ప్రియతమా నిను వదలు కొనలేను"

అది పురూరవుడు విరహముతో వేడుకున్నాడు. ఊర్వశి లోకాతీత ప్రణయ దేవత. అమె ఎడబాటును పురూరవుడు భరించలేకపోతాడు. ఎంత విరహవేదనతో తన బాధను చెప్పుకుంటాడు. కృష్ణశాస్త్రి ప్రణయంలో ప్రేమకు ఎంతో ప్రాముఖ్యత ఇచ్చాడో విరహమునకు కూడా అంతే ప్రాముఖ్యతను ఇచ్చి ప్రణయ వేదనను తీరస్థాయికి తీసుకు వెళ్ళాడు. ఊర్వశిలో స్వచ్ఛంద ప్రియత్వము, భగ్నప్రేమ,

నిర్వేదము, విరహము, తాత్త్విక దృష్టి మొ॥ కన్పించును.

ప్రకృతికవిత్వం :

కృష్ణశాస్త్రి గారి ప్రకృతి కవిత్వం మనస్సును హత్తుకునే విధంగా హాయిగా ఉంటుంది. ప్రకృతిని తల్లిగా, దేవతమూర్తిగా ఆరాధించినాడు. కృష్ణశాస్త్రికి ప్రకృతియే కవితారచనకు ప్రేరణ కల్పించినది. మానవుని కంటే ప్రకృతియే ఎక్కువని భావించినాడు. కృష్ణశాస్త్రి ఎప్పుడు ఆనందలోకములో విహరించినాడో ఎటువంటి బాధలేకుండా ప్రకృతిలో భాగమై విహరించాడు.

పాట ఆకులో ఆకునై

పువ్వులో పువ్వునై
కొమ్మలో కొమ్మనై
నునులేత రెమ్మనై
ఈ యడవి దాగి పోనా హా

ఎటులైన ఇచటనే అగిపోనా ॥ఆకులో॥
గల గలనీ వీచు చిరుగాలిలో కెరటమై
జలజల నీపారు సెలపాటలో తేటనై
పగడాల చిగురాకు తెరచాటు తేటినై
పరవంపు విడిచేడే చిన్నారి సిగ్గునై
॥ఈ అడవి దాగిపోన॥

కృష్ణశాస్త్రి సమాజాన్ని విడిచి అడవిలో దాగిపోవాలని కోరుకున్నాడు. ప్రకృతిలో భాగమైన ఆకు, కొమ్మ, పువ్వు, గాలి, నీరు, కోకిలలు, తుమ్మెదలు మొ॥ అన్నిటిలో కలిసి పోవాలనుకున్నాడు. కృష్ణశాస్త్రి ప్రకృతిలో లీనమవుటయే కాక ఒక్కొక్కసారి ప్రకృతిగా తానెందుకు జన్మించలేదని బాధపడ్డాడు. ప్రకృతిలో అంతటిశక్తి వున్నది కాబట్టి కృష్ణశాస్త్రి ప్రకృతిని గురువుగా భావించాడు.

సమన్వయము :

భావకవిత్వమును సమకాలీన కవులందరు వ్రాసినారు. భావకవిత్వం మీద తిరుగుబాటుతో వచ్చిన అభ్యుదయ కవిత్వం వ్రాసిన కవులు. శ్రీశ్రీ, తిలక్ మొ॥ కవులు భావకవిత్వమును మొదట్లో అందరు వ్రాసిన వారే, భావకవిత్వంలో స్త్రీ బాహ్య సౌందర్యమునకు కాకుండ ఆత్మసౌందర్యమునకు ప్రాధాన్యత ఇచ్చారు.

భావకవిగా, అంధ్రషెల్లీ పేరు గడించిన కృష్ణశాస్త్రి గారిని భారత ప్రభుత్వం "పద్మభూషణ్"తో, ఆంధ్ర విశ్వవిద్యాలయం "కళాప్రపూర్ణ"తో సత్కరించింది. కృష్ణశాస్త్రి మహావక్త, కాని 1966లో ఈయన గొంతు మూగపోయింది. అయినా జీవితాంతం

"మూగవోయిన నా గొంతునందు కూడా
నిదురపోయిన సెలయేటి రొదలు గలవు"

– అంటూ తన సాహిత్య రచనను కొనసాగించాడు.

సాంప్రదాయ సాహిత్యం మీద తిరుగుబాటు వచ్చిన భావకవిత్వం సాంప్రదాయ బంధాలను తెంచుకోలేక పోయింది. కృష్ణశాస్త్రి పద్యం, గేయాలలో ఛందస్సుతో కూడిన సంప్రదాయాన్ని పాటించినాడు. భావ కవిత్వంలలో వస్తువు కొత్తది అయిన సాంప్రదాయ సాహిత్య పద్ధతిని విడిచి పెట్టలేక పోయినారు.

ఆధార గ్రంథాలు :

1. డా॥ సి. నారయణరెడ్డి – అధునికాంధ్ర కవిత్వం సంప్రదాయము – ప్రయోగములు
2. డా॥ బి. నాగయ్య – తెలుగు సాహిత్య సమీక్ష భాగము – 2
3. ద్వా.నా. శాస్త్రి – తెలుగు సాహిత్య చరిత్ర.

యిక్కుర్తి నరసింహారావు – "చైతన్య స్వరాలు" చదువు ప్రాధాన్యత గేయాలు

డా॥ జి.శ్రీనివాస్, తెలుగు శాఖాధిపతి, గవర్నమెంట్ డిగ్రీకళాశాల, చింతలపూడి, పశ్చిమగోదావరి జిల్లా.

శ్రీ యిక్కుర్తి నరసింహారావు గారు గుంటూరు పట్టణంలో 1949 ఏప్రిలఎ 23వ తేదీన వీరరాఘవరావు, శకుంతలమ్మ పుణ్య దంపతులకు జన్మించారు.

యిక్కుర్తి నరసింహారావు గారి "చైతన్య స్వరాలు" లో 48 గేయాలున్నాయి. ఇవన్నీ సామాజిక చైతన్య ప్రబోధకాలు. ప్రతిపాట సందేశాత్మకాలు.

చైతన్య స్వరాలు చక్కటి సాహిత్యపు విలువలతో కూడుకున్నాయి. తెలుగుభాష, దేశభక్తి, స్వచ్ఛభారతం, నైతిక విలువలు వంటి సమకాలీన అంశాలు ఎన్నో ఉన్నాయి. "చైతన్య స్వరాలు" అనే గేయ సంపుటిలో ప్రతిగేయం మనల్ని తడిమి చూసుకునే అనుభూతి కలిగిస్తుంది. సమాజాన్ని ప్రభావితం చేయడమే లక్ష్యంగా సందేశాత్మకంగా సాగే గీతాలు కొన్ని అయితే మన భాష, సంస్కృతి, సంప్రదాయాలను, మానవతా విలువలను చాటి చెప్పే గీతాలు ఉన్నాయి.

చైతన్య స్వరాలు – చదువు ప్రాధాన్యత గేయాలు

చదువు అవసరాన్ని, గొప్పదనాన్ని గురించి, చదువు వల్ల గౌరవం వస్తుందని కవి

"హాయి కదా చదువు అలసట సొలసట లేని చదువు
మనసుకు అందం తెచ్చే చదువు మాటకు మన్నన
ఇచ్చే చదువు
గేదెలు, మేకలు కాసేకంటే హాయి కదా చదువు
నారు మడులు నాటేకంటే మేలు కదా చదువు
రాళ్లు రప్పలు కొట్టే కంటే హాయి కదా చదువు
బడి బైట చేసే చాకిరి కంటే మేలు కదా చదువు"[1]

చదువు అనే మాట అనడానికి, వినడానికి ఎంతో హాయిగా ఉంటుందని, చదువుకుంటే కలిగే లాభాలను గూర్చి యిక్కుర్తి నరసింహారావు గారు ఈ గేయంలో చక్కగా వివరించారు. అలసట లేకుండా, శ్రమ లేకుండా చదివే చదువు వల్ల గౌరవం వస్తుందని, మనస్సుకు సంతోషం కలుగుతుందనీ, సుఖాన్ని ఇస్తుందని రచయిత తెలియజేశారు.

గేదెలు, మేకలు కాస్తూ, వరినాట్లు వేస్తూ, రాళ్ళు రప్పలు కొట్టుకొంటూ చాకిరీ చేసే జీవితం కంటే చదువు ఎంతో మేలైన జీవితాన్ని ఇస్తుందని రచయిత చెప్పారు. ఆ భగవంతుడు పిల్లల కోసం సృష్టించిన వరంలాంటి చదువును తల్లిదండ్రులు పిల్లలకు ప్రేమతో చెదరని కానుకగా అందించాలి. వారు మంచి చదువుతో భావితరాలకు మార్గదర్శకులు అవుతారని రచయిత చదువు యొక్క ప్రాముఖ్యతను తెలిపారు.

"నవ్వాలంటే చదువుండాలి – కిలకిల
నవ్వాలంటే చదువుండాలి – పకపక
నవ్వాలంటే చదువుండాలి – నవ్వులపాలు కాకుండా
నవ్వుండాలంటే చదువుండాలి – చదువుండాలి
బ్రతుకు బాటలో నడవాలంటే – గెలుపు బాటలో
నెగ్గాలంటే చదువుండాలి – చదువుండాలి"[2]

పసిపిల్లలా స్వచ్ఛంగా కిలకిల, పక పక నవ్వుతూ, నవ్విస్తూ వుండాలన్నా, బతుకు బాటలో విజయపథంలో దూసుకెళ్తూ నవ్వుల పాలు కాకుండా రక్షించేది చదువు అనీ 'విద్వాన్ సర్వత పూజ్యతే' విద్యావంతుడు ఎక్కడవున్నా, అన్నివేళల, అన్ని ప్రదేశాలలో పూజింపబడతాడు. ఇది జగమెరిగిన సత్యమనే విషయాన్ని రచయిత చక్కగా చెప్పారు.

"మంచి చెడుల తేడా చెప్పేఅమ్మేగా చదువు
లాభం నష్టం లెక్కలు నేర్పే నాన్నేగా చదువు
లోకజ్ఞానం నేర్పించే గురువు, మిత్రుడు చదువు
కోరిన కోరికలు తీర్చే దైవంరా చదువు"[3]

మంచి చెడూ తెలియచేసేప్పుడు తల్లిలా, లాభనష్టాలు బేరీజు వేసేటప్పుడు తండ్రిలా, లోకజ్ఞానం నేర్పేటప్పుడు

గురువులా, కోరిన కోర్కెలు తీర్చుకొనేటప్పుడు దైవంలా, సహాయం చేసేది చదువు ఒక్కటేనని జీవితసత్యాన్ని తెలిపారు. దొంగలెత్తుకు పోలేనిది, అన్నదమ్ములు పంచుకోలేనిది, ఎవరికయినా ఇస్తే, ఇచ్చిన కొద్దీ పెరిగేది చదువు ఒక్కటేనని రచయిత చెప్పారు.

ఎక్కడకు వెళ్ళినా మనతోపాటు వుంటూ, మనుషులను ఏకం చేసే శక్తి చదువుకు కలదు. మనిషిని మహనీయునిగా తీర్చిదిద్ది, ధర్మాన్ని అందిస్తూ మరు జన్మకు కూడా తోడ్పడేది చదువు ఒకేఒక్కటి అని రచయిత చదువు యొక్క ప్రాధాన్యతను తెలియజేశారు.

"నావెంట పడబోకురా ఓ నల్లనయ్య నా వెంట పడబోకురా
నాకేల పలక బలపమ్మలిచ్చేవు – పుస్తకాలిచ్చి ననువ్రాయవేధించేవు"[4]

ప్రతి మహిళా చదువుకోవాలని, వివాహం అయిన తర్వాత తన భర్తనే దైవంగా పూజిస్తూ, ఇంటి పనులు చేస్తూ వున్న మహిళలను రాధలా భావించి, మహిళలను ప్రోత్సహించే వారి భర్తలను కృష్ణుడిలా ఊహిస్తూ స్త్రీలను చదువుకోమని ప్రోత్సహించిన విధానం ఇందులో ఎంతో బాగుంది.

వివాహమయ్యాక స్త్రీ బయటకు వెళ్ళడం ఇష్టం లేదనీ, అందరూ ఈ వయస్సులో చదువేమిటని తలోరకంగా అనుకుంటారని జంకుతూ వుంటే భర్త రూపంలో వున్న పురుషులే ప్రోత్సహించాలనీ, నీకోసం పలకా, బలపం, పుస్తకాలు తెచ్చాననీ నేను నీవెంట వుంటాననీ, చదువుకు వయస్సుతో సంబంధం లేదనీ, రాత్రి పాఠశాలలు పగలు కుదరని వారి కోసమేనని ప్రోత్సహిస్తూ

ఇల్లాలి చదువు – ఇంటికి వెలుగు

మహిళ చదువు – జగతికి వెలుగు అనే నీతి వాక్యాన్ని రచయిత స్త్రీలలో మార్పును, పురుషుని బాధ్యతని తెలియజెప్పారు.

"అక్షరం" గూర్చి రచయిత ఇలా చెప్పారు. అక్షరం – జగత్తుకు ఆధారమనీ, సర్వజ్ఞానాన్ని అందిస్తూ, ప్రగతికి కారణమౌతుందనీ అక్షరం శుభప్రదం, శుభకరం, యశోకరం అనీ, అక్షరం విశ్వకళ్యాణ కారణమై వెలుగొందుతుందనీ చెప్పుతూ, సర్వేజనా సాక్షరోభవంతు అంటూ అందరూ విద్యావంతులు కావాలని దీవించారు.

"నేనందరితో.... హైహై.... నేనందరితో....
నేనందరితో చెప్పిమరీ చదువుల బడికి
మా అక్కా చెల్లితో కలిసి చదువుల బడికి
పలకా సేతా బట్టి – చదువుల బడికి
తందనానే తాన తందనానే"[5]

భారతదేశ వెన్నెముక పల్లెటూళ్ళు. పల్లె పిల్లలు – వారి చిన్న చిన్న ఆశలు ఇందులో కనిపిస్తాయి. సంప్రదాయానికి నిలయమైన భారతదేశంలో పల్లెపడుచులు బడికి బయలు దేరిన వైనాన్ని, వారి మనోభావాలను రచయిత 'నేనందంతో' అనే గేయంలో చక్కగా తన మనోభావాలను మేళవింపుతో చెప్పారు. పల్లెపడుచు చక్కని అంచు చీరకట్టి, పూల రవిక తొడిగి, కళ్ళకు కాటుక, నుదిటిన బొట్టు, తలలోపూలు పెట్టి, కాళ్ళకు చెప్పులు తొడుక్కుని చక్కగా తయారై, పలకా బలపం చేతబట్టి, అక్కా, చెల్లీ అంటూ చేయి చేయి కలిపి సంతోషంగా బడికి వెళ్ళాలనీ, వారిలో ఉత్సాహాన్ని, జిజ్ఞాసను గుర్తించి పంతులుగారు ఒకర్ని డాక్టరవుతావని ప్రోత్సహిస్తుంటే కాదు నేనుకూడా మీలాగ పంతులుగార్ని అవుతానని ఒకరు తమ లక్ష్యాన్ని వ్యక్తం చేస్తారని రచయిత చెప్పిన విధానం పల్లెపడుచులు బడికి వెళ్ళేతీరు కళ్ళకు కట్టినట్లు సహజసిద్ధంగా చెప్పారు. బడిలో చెప్పినవి చెప్పినట్లు వల్లెవేస్తూ, మాటలను రాసేస్తూ, పాటలను పాడేస్తూవుంటే ఇంటికి వెళ్ళి అన్నీ వినిపిస్తూ వుంటే విన్నవారు అందరూ ఉత్తేజితులవ్వడం, మరింత మంది బడికి బయలుదేరినట్లు రచయిత దీనిలో చెప్పారు.

" నేటి బాలలే రేపటి పౌరులు – బడికిపంపు బాలలను చిన్నారుల చిరునవ్వులే ప్రతి ఇంటనింపు వెలుగులను ప్రజలందరికీ విద్య – జాతి ప్రగతికే బంగరు మెట్టని ప్రతి ఒక్కరు భావించాలి – ప్రతి బిడ్డను చదివించాలి ఏడుకొండల వెంకన్నకు మొక్కులిచ్చే రామన్న.. ఓ రామన్నా
ఏసు ప్రభువు దివ్యవాక్కు పఠించేటి ఏసేబు.. ఓ ఏసేబు మక్కాలో మాదిరిగా ముపొద్దుల నమాజుచేయు రహీము... యా అల్లా..."

ఏడు కొండలు అనే గేయంలో రచయిత నేటి బాలలే రేపటి పౌరులనీ, భావిభారత సామ్రాజ్య నిర్మాతలనీ, భారత దేశాభివృద్ధికి పెట్టని గోడలా అడ్డుపడుతున్నది. బాలలు కార్మికులుగా మారడమేనని తన ఆవేదనను చక్కగా చిత్రీకరించారు.

హిందూ, క్రైస్తవ, ముస్లిం మతం అంటూ ఎంతో భక్తితో దేవుడిని పూజించే ఓ మానవుడా! నీకు దేవుడు గాని ఆయా మత గ్రంథాలలోగాని ఎక్కడైనా, ఎప్పుడైనా పసివారి స్వేచ్ఛను హరించి వారితో పనులు చేయించమని చెప్పబడినదా?

పనికి పిల్లల్ని పంపితే వారి వయస్సుకు మించిన పనులు చేస్తుంటే అవి సరిగా చేయలేదని పిల్లలకు వాతలు పెడుతుంటారు. వారి ఆరోగ్యం క్షీణించి అనారోగ్యం పాలవడానికి కారణమై మనం ఎంతో పాపాన్ని మూటగట్టుకుంటున్నాం.

అలా కాదు! అంటూ రచయిత ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించాలనీ, పిల్లల చదువు ఇంటికి వెలుగనీ, అలా భావించి అందరూ చదువుకొంటే జాతిప్రగతి బంగరు మెట్టు అవుతుందని రచయిత తన ఆశను, ఆశయాన్ని చెప్పారు.

"ఈ బస్సేడ కెళతాది బాబయా
ఈ సినిమా పేరేంటి అన్నయా
అని ఎన్నాళ్లు అడుగుతావు మామయా
మన బిడ్డనైన చదివిద్దాం రావయా"[7]

అక్షరాలు నేర్వండి – సంతకాలు చేయండి. దుర్భరమైనది చదువలేని జీవితం.

ఈ బస్సు ఏ ఊరు వెళ్తుంది, ఈ సినిమా పేరేంటి అని అడిగే రోజులు పోవాలి అని రచయిత కోరుకుంటూ తన భావనలను ఈ గేయంలో ఇలా వివరించారు.

సిటీ బస్సు మీద పేర్లు, ఆసుపత్రిలో రాతలు, ఆఫీసులో దరఖాస్తులు, బ్యాంకులలో సంతకాలు, పురుగు మందుల పేర్లు, ఏది తెలుసుకోవాలన్నా అక్షరజ్ఞానం కావాలనీ, అక్షరాలు రాని జీవితం పశువుతో సమానమైనది అని రచయిత సమాజానికి హితాన్ని అందించారు. మనలో మార్పు చదువుతోనే రావాలని డాబుసరిగా బట్టలు కట్టుకున్నంత మాత్రాన కుదరదనీ, నోటితో అక్షరాన్ని ఉచ్ఛరించి గుర్తించిననాడే నిజమైన మార్పు మొదలైనట్లన్నారు. "వయస్సుతో సంబంధం లేకుండా చదువుకుంటే సంతకాలు చెయొచ్చు, ఉత్తరాలు వ్రాయొచ్చు, చీటీలు పాడి డబ్బు దాచుకోవచ్చు, డబ్బువడ్డీకిస్తే చక్కగా నోటు చదివి డబ్బు లెక్కకట్టవచ్చు" అంటూ చదువు మాత్రమే మనిషిలో అతని జీవితంలో మార్పుకు పునాది పెద్దలు పిల్లల యెడల చూపాల్సిన శ్రద్ధను రచయిత చెప్పిన విధానం సమాజాన్ని మేల్కొపినట్లుగా ఉంది.

ఆధార గ్రంథాలు :

1. యిక్కుర్తి నరసింహారావు – చైతన్య స్వరాలు

శ్రీ ముప్పాళ్ళ రంగనాయకమ్మ గారి బలిపీఠం నవల – సామాజిక చిత్రణ

యం. భీమయ్య, తెలుగు అధ్యాపకులు, శ్రీ ఎ.బి.ఆర్. గవర్నమెంట్ డిగ్రీ కాలేజి, రేపల్లె. సెల్ నెం: 9705445036

ఆధునిక యుగంలో ఒక ప్రత్యేకమైన ప్రతిపత్తి కలిగిన సాహిత్య ప్రక్రియ నవల. మానవ జీవితాన్ని యదార్ధ దృష్టితో అధ్యయనం చేయగల గద్యరచన. ఆధునిక సాహిత్యంలో ఆధునిక సహజం కనిపిస్తుంది. సామాజిక స్పృహలేని సాహిత్యం నిలబడదు. ఎంతటి గొప్ప రచనైనా అందులో సమాజం వాటి తీరుతెన్నులు కనిపించాలి. అదే ఉత్తమ సాహిత్యం అనబడుతుంది. సమాజంలోని పేదరికం, అవిద్య, అంటరానితనం, కుటుంబ సంబంధాలు మొ॥గు సామాజిక దృక్పధం గల రచనలు చాలా వచ్చాయి. అలాంటివాటిలో నవలా ప్రక్రియలో శ్రీ ముప్పాళ్ళ రంగనాయకమ్మ గారి బలిపీఠం (సామాజిక దృక్పధం) ఒకటిగా చెప్పవచ్చు.

వ్యక్తిగా, కుటుంబసభ్యునిగా, సమాజంలోని వ్యక్తిగా బహుముఖపాత్రలు పోషిస్తూ, జీవిస్తూ మనిషి సమాజానికి ఆదర్శప్రాయుడౌతున్నాడు. రచయిత్రి మానసిక చైతన్యాన్ని కలిగించి, మనల్ని అలోచింపజేసిన రచన 'బలిపీఠం' నవల ఇది. 390 పేజీలు జీవమున్న నవల. మానవ జీవితంలో ఎదురైన సమస్యలను చక్కగా ఆవిష్కరించినది. సమాజం పట్ల, జీవితం పట్ల బాధ్యత కలిగి, పాఠకుల నాడి గమనించిన గొప్ప రచయిత్రి శ్రీ రంగనాయకమ్మగారు.

ఇందలి కథ:

విశాఖపట్నంలోని మహర్షిచే స్థాపించబడిన కరుణ సమాజంలో కార్యదర్శిగా హరిజనుడైన భాస్కరరావు. బాల్యం నుండే దయాగుణం కలిగి ఈ సమాజం పట్ల ఆకర్షితుడై యస్.యస్.యల్.సి. పాసై జిల్లా బోర్డులో ఉద్యోగం చేస్తూ, ఇంటర్ ప్రైవేటుగా చదివి, టైపురైటింగ్ నేర్చుకున్నాడు. క్రమంగా బి.ఎ. పాసై కరుణ సమాజం కార్యదర్శిగా అయ్యారు. తార అనే యువతితో పరిచయం ఏర్పడం ప్రణయానికి దారితీసింది. అనుకోకుండా హైదరాబాదు నుండి తనను అభిమానిచే రామనాధం చేనేత సహకార సంస్థలో వెంటనే ఉద్యోగంలో చేరమని ఉత్తరం రాగా సమాజాన్ని వదిలి హైదరాబాదు వెళ్ళాడు భాస్కర్.

హైదారాబాదులో కూడా అక్కడ ఒక విచిత్రమైన సంఘటనలతో భాస్కర్ జీవితం మలుపు తిరిగింది. చావుకు దగ్గరై రేపో మాపో అన్నట్లు అరుణ అనే బ్రాహ్మణ యువతి చిన్న వయసులోనే వివాహం చేసుకొని వైధవ్యం చెందిన అమె చివరి దశలో సుమంగళిగా సౌభాగ్యవతిగా మరణించాలని కోరిక అందుకొసం భాస్కర్‌ను తనను పెండ్లాడమంది. భాస్కరరావు ముందు తన గూర్చి, తన కులం గూర్చి చెప్పి వివాహం చేసుకుంటాడు.

ఈ విషయం తనకోసం నిరీక్షిస్తున్నతారకు తెలియ జేసాడు. తరువాత ప్రకృతి వైధ్యుల సహకారంతో ఆరోగ్యవంతురాలైంది. అరుణ అత్తమామలు జగదాంబ శాస్త్రులు దీనిని ప్రతిఘటించినా ప్రయోజనం లేకపోయింది. క్రమంగా వారి జీవితం సాఫీగా సాగింది. పాప పుట్టింది. జ్యోతి అనే పేరు పెట్టారు. పాపకు ఏడాది నిండకుండానే భాస్కర్‌కు ఉద్యోగరీత్యా బొంబాయి వెళ్ళివచ్చాడు. వారి ఆర్ధిక పరిస్థితి అంతంతగానే ఉంది. అరుణ టీచర్ ఉద్యోగం చేస్తూనే బి.ఎ. ప్యాసైంది. అలకలతో, స్వాంతనలతో వారి సంసారం సాగుతుంది.

ఇంతలో భాస్కర్ అక్క సీతమ్మ, కోడలు లక్ష్మీ రాకగాని అరుణకు గిట్టలేదు. దానికి తోడు జగదాంబ, శాస్త్రుల జోక్యం, చెప్పుడు మాటలు అరుణ మనసునే కాక సంసారాన్ని కూడా చిన్నాభిన్నం చేశాయి. కులభావం ఆమెలో కుట్మలించింది. భాస్కర్ డైరీ చదివిన అరుణ తార వృత్తాంతం తెలిసి భాస్కర్‌ను బాధపెట్టింది. లోపాలు ఆరోపించి అవమానించింది. క్రమంగా ఆమె ఆరోగ్యం క్షీణించింది. ఒక రోజు "నా బ్రతుకు నేను బ్రతకగలను"

అని ఉత్తరం వ్రాసి అత్తమామల ఇంటికి వెళ్లిపోయింది. అప్పటికే అరుణ పైన ప్రసవించే రోజులు దగ్గర పడ్డాయి. అరుణ మగపిల్లవాడిని అరుణకు చెల్లివరసైన అమల ద్వారా భాస్కర్ తెలుసుకున్నాడు. కష్టంమీద చూచి ఇకమీదట ఏ తప్పు చేయనని మాట ఇచ్చాక మరలా ఇంటికి వచ్చింది అరుణ. అనుమానాల వలన భార్యభర్తల మధ్య అవగాహన లోపించింది. పిల్లల్ని తీసుకుని అత్తమామలు దగ్గరకు వెళ్లింది. వైద్యుల ప్రయత్నాలు ఫలించలేదు.

అరుణ విడాకులపై కోర్టులో అబద్దాలు చెప్పడంతో కోర్టు హక్కులు భాస్కరరావు పొందాడు. అమల జేమ్స్ వివాహం పెద్దల సమక్షములో జరిగింది. ఇద్దరి అభిప్రాయాలు కలిసాయి. హాయిగా ఉన్నారు. వారిని చూచిన భాస్కర్ ఆనందించాడు. కరణ సమాజానికి వెళ్లిన భాస్కర్ పిల్లల ఖర్చుకై డబ్బులు పంపితే అరుణ తిరిగి పంపేది. ఆమె ఆరోగ్యము క్షీణించింది. అమల జేమ్స్‌ల దాంపత్యం చూచిన అరుణకు జ్ఞానోదయం అయింది. అత్తమామల ఇంట్లో అవమానాల భరించలేక చేసిన పొరపాటుకు బాధపడింది. అరుణకు తెలియకుండా భాస్కర్ కుటుంబాన్ని చూచుకుంటున్నాడని అమలు ద్వారా తెలుసుకుని భాస్కర్‌ను చూడాలనుకున్నది అరుణ.

భాస్కర్, వచ్చిన ఆమెను సముదాయించాడు. భావోద్వేగానికి లోనై తన బలిపీఠాన్ని తానే అవివేకముతో కట్టుకున్నానని పశ్చాతాపడుతూ భర్త ఒడిలో కన్ను మూసింది. ఇది కథ.

పాత్రలు:

కరుణ సమాజం, మహర్షి, భాస్కర్, అరుణ, అమల, జేమ్స్, జగదాంబ, శాస్త్రులు, రామనాధం, సీతమ్మ, లక్ష్మి, గోపి మొదలగునవి పాత్రలు. కుటుంబ నేపధ్యముగా ముఖ్యంగా దాంపత్య జీవితములో ఉన్న ఒడిదుడుకులు చక్కగా ఆవిష్కరించిన నవల బలిపీఠం. సంఘ సంస్కరణ భావజాలంతో వ్రాసినది రచయిత్రి.

ఈ నవలలోని భాస్కర్ అరుణల వంటి వ్యక్తులు జీవితంలో, కొంతమందైనా తటస్థిస్తూ ఉంటారు. భాస్కర్ సహృదయుడు. జాలి, దయ కలవాడు. కరుణ సమాజములో చేరాడు. పాత, కొత్తల మేలు కలయికను లోతుగా అవగాహన చేసుకోలేక సంకుచిత హృదయ అభాగ్యురాలు అరుణ. స్వార్థచింతన, అతి సున్నితత్వము కలిగి త్యాగ బుద్ధితో జీవితాన్నే పందెం పెట్టిన భాస్కర్. తాను ఓడిపోలేదని సత్యం చాలు అత్మశాంతికి అంటూ ఈ నవలలో ప్రధాన పాత్రల స్వభావాన్ని ఆవిష్కరించారు రచయిత్రి. హరిజన సమస్య, కులాంతర వివాహాలు కేంద్రంగా వ్రాయబడింది. వారి జీవనం, అభిరుచులు, అనురాగాలు, ఆలోచనలు, విశ్వాసాలు, వ్యక్తిత్వాలు చక్కగా చూపించింది రచయిత్రి ఈ నవలలో.

మానవ జీవితమే జీవన పోరాటం ప్రాధమికంగా. ఆ తరువాత ఆధ్యాత్మికం, విజ్ఞానం, మతం, వర్గాలు, కులం, పార్టీలు జీవితాలపై దండెత్తి ఆదిపత్యం చలాయిస్తాయి. పరిస్థితులను బట్టి వాటిలో ఏదోఒకటి అగ్రస్థానం వహించక తప్పదు. ఫలితంగా వైషమ్యాలు, వైరుధ్యాలు, వైమనస్యాలు జీవితాన్ని పంచబంగాళం చేస్తున్నాయి.

జీవన చిత్రణ–పాత్రల స్వభావం:

1) భాస్కర్ : హరిజనుడు, పట్టభద్రుడు, జాలి, దయ, జీవన సంగ్రామములో ఎదుర్కొనే జయాపజయాలు, వికాస వినోదాలు, మధురానుభూతులు, భాస్కర్‌కు చెందేటట్లు పునాది వేసింది రచయిత్రి.

2) అరుణ : ఈమెను చివరి స్థితిలో భాస్కర్ వివాహం చేసుకోవడం మంచి ఆలోచనే. కులం తెలియజేసి ఆమెకు ఆమోదం "నాగురించి ఎక్కువగా చెప్పుకోలేను కాని నేను చిన్నప్పటినుండి శాఖాహారిని. నాకు నా కులము ద్వారా ఎలాంటి అవలక్షణాలు లేవు. కష్టపడి బి.ఎ. పాసైయ్యాను. నేను నీ కంటికెదురుగానే ఉన్నాను. అరుణ నా జీవిత గమనంలో నా ధ్యేయం ఒకటే. నా శక్తి కొలది అనాధలకు

సేవ చెయ్యాలి. దుఖ:ములో ఉన్న వ్యక్తికి ఏ విధముగా సాయపడాలి. నా సహధర్మచారినిగా దానికి నీ సహకారం ఉండాలి. నన్ను పూర్తిగా అర్థం చేసుకోవాలి భాస్కర్.ఉ దాత్త భావాలు గల పాత్రను రచయిత్రి ఎంత నగిషిపెట్టిందో తెలుస్తుంది.

అరుణ– అత్తమామలు వల్ల మనస్సు సంకుచితమై ఆమెలో కులతత్వం పెరిగింది. గతాన్ని మరచి భాస్కర్ అక్కను, గోపిని, లక్ష్మి మేనకోడలును అవమానించింది. అరుణా భాస్కర్‌ల స్వభావాన్ని పరిశీలిస్తే అరుణలో దుందుడుకు లక్షణం, కులభావం, సంకుచితం, అసహనం గుణాలతో ఆమె వ్యక్తిత్వం కుంటితమైనది. భాస్కర్ అనురాగం, సామరస్యం ఆర్ధత, స్నేహం, రాజీతత్వం, ఉ త్తమ గుణాలు, ఉత్తమ శిఖరాలుగా కనిపిస్తాయి. అరుణ కన్నా భాస్కర్ సంస్కారాన్ని రచయిత్రి అద్భుతంగా చిత్రీకరించారు.

ఈ నవలలో అరుణ భాస్కర్‌ను ఎన్నిసార్లు అవమానించినా ఒకే మాట మాత్రం భాస్కర్‌లోని క్రోదం వెల్లువలా కనబడింది. ఇప్పుడు చెయకలిగేదేమి లేదు. నిన్ను పెళ్లిచేసుకుంటానని మాట ఇచ్చి బ్రతుకు మీద ఆశ కల్పించి తిరిగి బ్రతికించినందుకు బాధగానే ఉంది. మీ ఇష్టప్రకారం పెళ్లి చేసుకుని నీకా సౌభాగ్యం కలిగించినందుకు కంటగింపుగానే ఉన్నది. ఎప్పుడో రాలిపోవాల్సిన నిన్ను తల్లిని చేసి పవిత్రమైన పదవిని కల్పించినందుకు ద్వేషంగానే ఉంది. నీ చదువును ప్రోత్సహించి నీవు స్వతంత్ర్యంగా బ్రతకటానికి కారణమైనందుకు విచారంగా ఉంది. నువ్వు అనుభవిస్తున్న సుఖానికి కారణం ఏమిటి, కారకులు ఎవరో మరచి నిచ్చింతగా, నిర్లక్ష్యంగా రోజులు దోర్లిస్తున్నా నీవంటి కృతఘ్నురాలిని చూస్తే .....

రచయిత్రి భాస్కర్ పాత్రను వారి అక్క సీతను మృదు స్వభావాన్ని, సంస్కారాన్ని చూపింది. సీతమ్మకు మాటల సంస్కారం లేకపోయినా హృదయ సంస్కారం ఉన్న మనిషిగా సృష్టించారు. "నువ్వు సుఖముగా ఉంటే చాలు మాకు. ముందు మీ కాపురం చక్కబడని, తరువాత మేమెక్కడికి పోతాం. మనస్సులో ఏమి పెట్టుకోమాకు. రేపో మాపో అమ్మాయిని తీసుకొచ్చేయి. నలుగురు నోట్లుపడి పెళ్లిచేసుకున్నందుకు లక్షణంగా బ్రతికితేనే మరి, ఆవిడితోపాటు నువ్వు తొందరపడబోకు సుమ.

దానికి భిన్నంగా జగదాంబ శాస్త్రులు వాలకం చూస్తే వాచకము వింటే గుండెల్లో కంపరం. వీరి చిర స్థితిలో ఉండటం, స్వార్థం ఉన్న కఱకుపాత్రలుగా కనిపిస్తాయి. దాంపత్య జీవితం సుఖంగా ఉండాలంటే నమ్మకం, సద్దుకుపోయే ధోరణి, ఒకరిని ఒకరు అర్థం చేసుకోగలగడం. అలా కాక అనుమానాలకు తావిస్తే జీవితం అల్లకల్లోలం.

సామరస్యం, సానుభూతి, సహకారం, దంపతుల మధ్య ఉండాలి. ఈ నవల ద్వారా రచయిత్రి సమాజానికి ఇచ్చిన సందేశం. ఇవి లుప్తమైతే, సంఘర్షణతో బాధాతప్తులు కావల్సి వస్తుంది. ప్రేయసి ప్రియులు కులాంతర వివాహాలు చేసుకున్న కూడా వ్యక్తుల మానసిక ప్రవర్తనకంటే ఇతరుల ప్రమేయమే కుటుంబ కలహాలకు కారణము అని తెలుస్తుంది. చదువుకున్నవాళ్లే అర్థం చేసుకోలేక సంసారాన్ని చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. పచ్చని కాపురం పాడుచేసు కుంటున్నారు. ఈ నవల ద్వారా మనం గ్రహించకలిగినవి.

మొదటల్లో వారి మధ్య (భాస్కర్ & అరుణ) కలతలు లేవు. విబేధాలు లేవు. అన్యోన్యంగా ఉన్నారు. ఎప్పుడైతే 3వ వ్యక్తి జోక్యం కలుగచేసుకుంటాడో అప్పుడే కొంప మునిగింది.

ఆడవారి సహజమైన బలహీనత, ఆచార వ్యవహారాలు, మౌఢ్యం, ఆసహనం అరుణలో పెరిగి భర్తను దూరం చేసుకుంది. సంసారాన్ని విధ్వంసం చేసుకుంది. తన బలిపీఠాన్ని తానే నెలకొల్పుకుంది.

ఈ నవల ద్వారా అనురాగం, అభిమానం, ఆరాధనా భావం ఉన్నత మనస్సు, ఒకరిని ఒకరు అర్థం చేసుకోవడం,

ఆదర్శమైన జీవనానికి కలతలు లేని కాపురానికి సోపానాలు. సాహిత్యం బ్రతుకులను తీర్చుదిద్దగలవు అనడానికి ఈ నవల ఒక ఉదాహరణ. సామాజిక చిత్రణ మనల్ని ఆలోచింపచేసి చైతన్యపరచి సమాజాన్ని మార్చగల బలమైన నవల బలిపీఠం.

శాస్త్రులు–జగదాంబ :

అరుణకు గుండె నొప్పి వచ్చినప్పుడు భర్త అంటే తెలియని రోజుల్లో దాన్ని (అరుణను మన అబ్బాయికి ఇచ్చి చేసాం) కొడుకు చనిపోయాక ఏ సుఖానికి నోచుకోలేదు అని అంటాడు. అప్పుడు జగదాంబ దానికి పెట్టే ప్రతి పైసా దండగే ఉంటుంది. మానవ సంబంధాన్ని ఆర్థిక సంబంధాలే అంటారు ఒక మేధావి. విలువలు ఉండవు. స్వార్థం పెరుగుతుంది మనిషిలో.

డాక్టర్‌తో అరుణ:

భర్త అంటే ఎమిటో తెలియకపోయినా విదవ అంటే ఏమిటో తెలిసింది. పోయేటప్పుడు సుమంగళిగా ముత్తయిదువుగా ఉండాలని కోరిక. పుణ్యస్త్రీగా నా ఆశ తీరుతుందా అంటుంది. చివరి క్షణములో పాత్ర ఔచిత్యాన్ని అద్భుతంగా చెప్పారు రచయిత్రి స్త్రీ సహజ స్వభావాన్ని గూర్చి.

డాక్టర్ ఇలా అంటాడు ఈనాడు కందుకూరి నాటిన మొక్కలు మహా వృక్షాలై చిగురిస్తున్నాయి. ఆ బాటలో నడిచేవారున్నారంటాడు.

భాస్కర్‌తో అరుణ :

నా స్వార్థం కోసం బలైపోతారా అని అంటే లేదు నా ఆశయం నెరవేరుతుంది అని అంటాడు భాస్కర్.

చచ్చేదానికి పూల ముచ్చట, తాళి ముచ్చట కావాల్సి వచ్చింది అంటుంది. అత్త. ఈమెకు సనాతన భావాలు, స్వార్థం ఎక్కువ అవసరం. వారిలోని సామాజిక నేపధ్యం అలాంటింది.

ప్రాణం పోవడానికైన సిద్దమే కాని ఈ అనాచారం భరించలేను అంటుంది. డబ్బుకోసం ఏ ఎండకాగొడుగు పట్టే స్వభావం.

అరుణ చివరికి చెప్పుడు మాటలు విని భర్తను ఎదురించి సాధించాలనుకున్నానే కాని, ఆ భర్తను విడిచి బ్రతకలేను అని తెలుసుకోలేకపోయాను అంటుంది చివరికి. భార్యకు భర్త, భర్తకు భార్య తోడుంటేనే అది సంసారం. సాంసారిక జీవతంలో సమస్యలు బంధాన్ని ధృడపరచాలి.

ఆదర్శ జీవితానికి దంపతుల మధ్య సామరస్యం, అన్యోన్యత, మంచి హృదయం ఉంటే చాలు అని తెలిపే నవల. సామాజిక చిత్రణ కలిగిన ఈ నవల సమాజాన్ని ప్రగతి పథంలో నడిపించగలదు.

ఆధార గ్రంధాలు:

మహతి – విశాలాంధ్ర పబ్లికేషన్స్

తెలుగు నవల హరిజనాభ్యుదయం – భాస్వతి పబ్లికేషన్

బలిపీఠం – ముప్పాళ్ళ రంగనాయకమ్మ – స్వీట్ హోం పబ్లికేషన్.

కవితా ప్రక్రియలో 'సినీవాలి' నివాళులు

డా. యస్.బేబి రమణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట.

ఉపోద్ఘాతము:

సాహిత్యంలో కథ, కథానిక, నవల, కవిత్వం మొదలైన ఎన్నో ప్రక్రియలున్నాయి. కవితా ప్రక్రియలో ఆరుద్ర రచించిన కమనీయ కవిత్వం 'సినీవాలి'. సినీవాలి అంటే అమావాస్య తరువాత వచ్చే చంద్రకళ. అంటే చీకటి తరువాత వచ్చే వెలుగని అర్థం. శ్రీ శ్రీ, ఆరుద్ర మధ్య జరిగిన సంభాషణా రూపంలో ఈ కవిత్వం సాగుతుంది. ఈ కవితలలో వారు ఎన్నో అంశాలను స్పృశించారు.

కవిత్వం:

'కల నిజపరచడం కాదు కవిత్వం, నిజాన్ని కలగనడమే దాని తత్త్వం' అని ఆరుద్ర కవితా నిర్వచనాన్ని ఇచ్చారు. ఈ కవితలలో ఆరుద్ర, శ్రీ శ్రీ సంభాషణ మొదటిగా కవిత్వంపై జరిగింది. ఆరుద్ర శ్రీ శ్రీని నువ్వెందుకు రాస్తున్నావని ప్రశ్నిస్తే శ్రీ శ్రీ ఇలా సమాధానం చెప్పారు. చెప్పిందే మళ్ళీ మళ్ళీ చెప్పడం కొందరికిష్టమని, అదే కవిత్వం అనుకుంటానని, అదే నా ప్రయత్నమని, కవిత్వమనే మేకలే నాలోని పెద్దపులికి ఆహారమని, అనుకరణ చేస్తూ వచ్చిన కవిత్వాన్ని వ్యంగ్యంగా విమర్శించారు. ఆరుద్ర శ్రీశ్రీ ని స్వేచ్ఛాజీవియని సంబోధిస్తూ ఎవరూ చెప్పంది చెప్పడం, అలా చెప్పి మెప్పించడం అదేనన్నమాట కవిత్వమంటే, అయితే కొందరు మెచ్చనంటే అని ప్రశ్నించారు. ఆప్పుడు శ్రీ శ్రీ మెప్పుకి రుచీ, ఔచిత్యం కావాలికానీ, కవి కోరే మెప్పు గండపెండేరం కాదని, హృదయస్పందనం, శిర:కంపనం కవిత్వానికి అసలైన గీటురాయి అనీ, కొత్త భావాల బీజాలు అల్లాలనీ, కవిత్వం మేలుకొలపాలి గానీ జోకొట్టగూడదనీ పలికారు.

అందుకు శ్రీ శ్రీ వెలుగు చూపడమే కవిత్వమనీ, ఆప్పుడప్పుడు జనం కళ్ళకి పొరలు కప్పుతాయనీ, కవిత్వం ఆ పొరలను తొలగించాలని, అప్పుడప్పుడు అధికారులకి కామన్ సెన్స్ పోతుందని, అప్పుడు కవితా ధనుస్సును ఎక్కుపెట్టాలని, ఎడారిలో ఒయాసిస్సులా, అనుభవాల తేట సరస్సులా ఉండాలని పలికారు. కానీ కవిత్వానికి విలువ లేదని, అది ఎవ్వరూ మోయలేని సిలువ అని నిరాశతో నిట్టూర్చాడు.

మనిషిలోని దానవత్వాన్ని నిరసించడం: ఆదిలో మానవుడు భగవంతునివైపు ప్రయాణించాడని, కానీ ఇప్పుడు మానవునివైపు దానవుడు తరుముకుంటూ వస్తున్నాడని, మానవుణ్ణి నేడు భగవంతుడు వెతుక్కుంటున్నాడనీ, మానవుడు మానవుని మీద పగబట్టాడని, మారణాయుధాలు సిద్ధంచేసి తొడగొట్టాడని

ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ రోగానికి వైద్యమేదని ప్రశ్నించాడు.

అప్పుడు ఆరుద్ర వర్తమానకాలం గురించి కవిత్వం చెప్పందే ప్రవర్తనలు మార్చడం అసంభవమని, ముందు చూపు కవి ఒక్కడు చాలని, అప్పుడు రోగిష్టి మానవుడు మేలుకుంటాడని ఆశాభావం వ్యక్తం చేశాడు. రంజింపజేస్తూ సందేశమిచ్చేదీ, ప్రవాహంలా ఉంటూ ప్రభావంలో పడేసుకునేదీ, తనవేపు ఆలోచనల్ని లాక్కొనే సూదంటురాయి, హృదయాలని నిగనిగలాడించే ఆకురాయి అనీ ఈ గుణాలులేని కావ్యం కావ్యం కాదు బండరాయని కావ్యం ఔన్నత్యాన్ని తెలిపారు.

'మంచి రచన చదివాక బాగా భోంచేసినట్లుండాలి
కొంచెం బాధపడాలి చించుకొన్నట్టుండాలి
మనస్సుకి జ్వరం రావాలి ఒళ్ళు తిరగాలి
ఈ బాధలోంచి తేరుకొని బాగుపడాలి

నగర జీవితం:

ఆరుద్ర నగర జీవితపు లోతులను స్పృశించారు. మద్రాసులోని మధ్యాహ్నాలను మచ్చిక చేసుకొని చూడు,

బొంబాయిలో నీ సాయంత్రాలను బోరవిరుచుకు తిరుగు, కలకత్తా బీరువోని రాత్రులలో కల్మషాన్ని కలయచూడు, హైదరాబాధ పడుతున్న కాలాన్ని అనవరతం నువ్వు పరీక్షించు అని నగరాల దుస్థితిని తెలిపారు. నగరం నీ ధర్మపత్ని కాదని, ఉంపుడుగత్తె అంతకన్నా కాదని, వానలో తడిసి ముద్దయినా వలపించలేని పీలికలు కట్టుకున్న అనాకారి బికారి పేలవంగానైనా ప్రేమించలేని అణాకానీ వికారి యని సంబోధించారు.

బలవంతపు పెళ్ళిలోని ముదనష్టపు పెళ్ళికూతురు, మూగివాడి భావప్రకటన పేడివాడి మూడోపెళ్ళి, ఆడదాని మీసాల్లాగ, అసందర్భంగా మొలచిన పేటలతో, గూనివాడి వీపులాగ అసహ్యంగా పెరిగిన పేటలతో నగరం నిన్ను ఆహ్వానిస్తుందని తెలిపారు. నగరం ముందరికాళ్ళ బంధమని, కాలకూట మకరందమని, నగరం నీలి నైలాను చీరల తారురోడ్లు ధరించి, పానీయపు టంగళ్ళ ఖరీదైన శాఠీనులంగా ధరించి, షాపులగ్లాసు విండోల లోకట్ జాకెట్ తొడుక్కొని, నైటు క్లబ్బుల రమ్యమైన 'న్యూలుక్కుబా' బిగించి నగరం ఆకర్షిస్తుందని, ఆధునిక రంగేళీ యువతిలాగ నగరానికి మెదడు తక్కువ షోకులెక్కువని, ఆశయాలు లేక ఆశలూ విలాసాలు ఎక్కువని, ఇండియా కాఫీ హౌసులో పొగిడే మగాళ్ళముందు కూర్చొని నాజూకుగా సిగరెట్ కాలుస్తూ, సుతారంగా కాఫీ పీలుస్తూ, ముచ్చటిస్తూ ఆధునికనగరం కలలు కంటుందని పలికారు. అసమర్థుని పరిపాలనలాగ నగరాన్ని అంధకారం ఆవరించిందని, అంతదాకా మూసిన కన్నులను అర్ధరాత్రాన విప్పుతుందని, నగరం కుడికంట్లో పుసి, మలికంట్లో కసి, తొలికథలో ఆకలి, మలికథలో చీకటి.

'ఇది కఠిన వరకం, ఇది ప్రత్యక్ష నరకం'
'నగరంలో యామిని, నరకంలో ఆమని'
'ఘోరాటవి ఈ నగరం, పోరాడే శక్తిలేదు పోలేను ఎటూ'

ఆంటూ నగర జీవిత నరకాన్ని కళ్ళకు కట్టినట్లు వర్ణించారు.

యువకుల స్వేచ్ఛావిహారం :

కళాశాల నుండి నిష్క్రమించి కళ్ళు మూసుకొని నగరంలో ప్రవేశించాడు. కడుపుమంటతో కాలిపోతూ కన్నీళ్ళపై స్వారీచేస్తూ పేవ్‌మెంటుమీద పడుకోవడానికి సతమతమవుతూ

'ఎవరేనా నాకు తియ్యని విషమిస్తే బాగుండును
నను మంత్రిస్తే స్వప్నంలా కరిగిస్తే
బాగుండును బాగుండును
నా వేదన దగ్ధంచేసి నను సమ్మగ్ధను చేసి
నా కాళ్ళకి చక్రాలు
నా కళ్ళకి స్వర్గాలు
నా కలలకు రెక్కలిచ్చి
ఇంకో లోకంలోకి మరోతీరానికి
నన్ను ఎగరేసుకుపోతే బాగుండును'

అని మిధ్యానందాలను వెతికే యువకులను వర్ణించారు.

వేశ్యాజీవనం :

వేశ్యావృత్తిలో నున్న స్త్రీల బాధలను ఆరుద్ర వివరించారు. ఇరువురి స్త్రీలు వారి వేదనను తెలుపు కుంటున్న రీతిలో వారి మనస్సులను స్పృశించారు.

'పట్టాలి ఎవరికి వారే ఒంటరిబాట
పాడుకోవాలి లోలోపల చేదుపాట
అనుమానాలను చేతపట్టుకొని
పవమానాలను ఊతపట్టుకొని
పదపోదాం స్వప్నంలోకి
పదపోదాం నల్లని నరకంలోనికి'

అంటూ చీకటిలోకంలోకి నడిచిన వారి బ్రతుకులను గూర్చి వేదనపడ్డారు.

వృద్ధుల విలాస జీవనం :

నగరాలలో వృద్ధులు సైతం విలాసాలకు బానిసలవు తున్నారని ఆరుద్ర ఆవేదన వ్యక్తం చేశారు. విలాసానికి

దారి ఇదేనా, కులాసాకి దారి ఇదేనా? అని సరదాకి దారి వెతుకుతూ బాధ మరచిపోవడానికి మందొక్కటే, మనల్ని రక్షించగలిగేది చీకటే' ఆని చీకటిలోకి సాగే వృద్ధులను గూర్చి వేదన పడ్డారు. ఆ సమస్యకు పరిష్కారాన్ని కూడా సూచించారు. జీవితంలో సౌఖ్యం వాంఛనీయమైనా సౌఖ్యమే జీవితం కాదు. బతకడానికి తిండితినాలిగాని తినడానికే బతుకుతారు వీళ్ళు. వీరికి జీవనఫలమందదని పలికారు.

జీవనఫలం :

జీవనఫలం శాంతిలోనే ఉందని కవి తెలుపుతూ శాంతిని స్త్రీరూపంగా మలిచారు. ఆమె చల్లని దీవెనలు కోరిన జనులకు ఆమె నా దీవెనలు సులభసాధ్యములు కావని, జీవనఫలాన్ని సాధించి దేశానికందించి, నాకు నైవేద్యమిమ్మని పలికినది. జీవనఫలమును గూర్చి ఇట్లు తెలిపినది.

'సమిష్టి జీవన సౌఖ్యం–శ్రమైక జీవన సౌందర్యం, అందరికోసం ఒక్కడు–ఒక్కడికోసం అందరు నియమాలకి లోబడడం–నియంతకు కట్టుబడడం–ఇదే సంపూర్ణ జీవనఫలం'

అని పలికినది. ఆ ఫలమును అందుకున్న రాజకీయ నానంద ఆ ఫలమును నిర్భాగ్య జనులకు అందించాలని ఆశించి ఫలమునందుకొమ్మని ఎలుగెత్తి పిలిచినాడు. ఆ జనులు ఇది కష్టపడకుండా సుఖించే మార్గమా, మృష్టాన్న భోజన సమానమా, ఇష్టసిద్ధి కలిగించే విధానమా, ఇది ఎండిపోయిన ఎడారి పండించగలదా? అని ప్రశ్నింపగా రాజకీయనానందుడు ఇట్లు పలికినాడు.

'ఇది సార్థకజీవనానికి సంకేతం
మానవత్వానికి సచేతన కేతనం
మంచితనానికి మెదడున్న నికేతనం
ఇది ధర్మార్థ కామమోక్షాల సంక్షిప్తరూపం'

అని తెలుపగా జనులిట్లు పలికినారు. వేదాంతం మాకు వలదు. బాధ్యతలు లేని హక్కులు, చెల్లే బ్యాంకు చెక్కులు, నవయౌవనం మత్తు మాకు కావాలని కోరినారు.

ముగింపు:

ఇట్లు శ్రీ శ్రీ, ఆరుద్ర సంభాషణా రీతిలో సమాజంలోని వివిధ అంశాలను స్పృశించినారు.

ఆర్థిక దుస్థితి వికృత రూపం – ఆశాకిరణం

శ్రీకాంత్ నామ, తెలుగు అధ్యాపకులు, యస్.ఆర్.ఆర్. & సి.వి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వ) విజయవాడ
ఫోన్ నెం. 9985138335.

తెలుగు ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో కథానిక ఒక సామాజిక ప్రక్రియ.

అనాదిగా మన జీవితాల్లో భాగమైన కథ ఎన్నో విధాలుగా మన సమాజానికి దిశా నిర్దేశం చేసింది. 20వ దశాబ్దంలో తెలుగు సమాజంలోకి కథానికగా ప్రవేశించిన అంతకు ముందు నుండే మన సంస్కృతిలో కథ ఒక భాగంగా ఉంది.

నేడు కథ, కథానిక అనే పదాలు సమానార్థకాలుగా వాడటం జరుగుతుంది.

అయితే 18 – 19 శతాబ్దాల్లో ప్రపంచ వ్యాప్తంగా చోటు చేసుకున్న చారిత్రక, ఆర్థిక, సామాజికాది పరిస్థితుల వల్ల నేటి కథానిక పురుడు పోసకుంది. జన జీవితాల లోని భిన్న పార్శ్వాలను చిత్రించి సమాజ పరిణామ వికాసానికి సాక్ష్యులుగా కథానికలు నిలిచాయి.

మానవ కవిగా పేరుగాంచిన దేవరకొండ బాల గంగాధర తిలక్ వెలువరించిన సాహిత్యం అజరామరమైనది. కథ, కవిత, నాటకం ఇలా ఏది రాసిన అవి మానవ సమాజాన్ని మానవత వైపు నడిపించడానికి దోహదం చేశాయి.

కథానిక రచనలో తిలక్ కథను అరమరికలు లేకుండా చెప్పడంలోను, అనుభూతి ఐక్యత, క్లుప్తత, పాత్ర చిత్రణ వంటి అంశాలకు ప్రత్యేకత ఉందని చెప్పవచ్చు.

"నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు",

"నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయా పారావతాలు" అని తిలక్ చెప్పినట్లుగానె తన అనుభూతిని, భావోద్రేకాలను పాఠకునిలోకి ప్రవేశపెట్టగల మాజిక్ ఏదో తనలో ఉంది.

తిలక్ తనని ఒక తత్వానికో, ఒక సిద్ధాంతానికో పరిమితం చేయవద్దంటాడు.

"మానవాళి కథనంతటిని గుండె లోతుల్లోంచి తిలకించి వాళ్ల బలహీనతల్ని, లేకితనాన్ని, కలల్ని, కన్నీటినీ, సమగ్రంగా అవలోకించగల నిశితమైన దృష్టి తిలక్ ది" (అందాల తెలుగు కథ పుట 23)

వీరి కథలు రాసిలో తక్కువే అయినా వాసిలో ఘనమైనవి.

తిలక్ ఆశాకిరణం కథ బాగా బతికి ఉద్యోగం పోయిన ఒక మధ్య తరగతి బడి పంతులు పడే ఆర్థిక కష్టాలను చిత్రించింది.

ఈ కథానికలో భార్య, అయిదుగురు పిల్లలతో జీవించే వెంకటేశ్వర్లు స్కూల్ ఇనస్పెక్షన్‌కి వచ్చిన సమయంలో కునుకు తీయడంతో ఆమె ఆగ్రహించింది. స్కూల్ ఇనస్పెక్షన్ ఇంతకు ముందు ఇతనితో చనువుగా, సరదాగా ఉందనే ఉద్దేశంతో క్షమాపణ కోరదామని ఆమెను ఆపే ప్రయత్నంలో పైట పట్టుకోవడంతో అది కాస్తా ఊడింది. దాంతో అతని ఉద్యోగం కూడా ఊడింది.

కాలం కలిసి రానప్పుడు తాడు కూడా పామై కాటేసినట్లుగా మారింది వెంకటేశ్వర్లు పరిస్థితి.

కొన్నాళ్ళు ట్యూషన్ చెప్పినా అది సాగకపోవడంతో అప్పడాలు, సాంబారు పొడి ఇంటింటికి తిరిగి అమ్మినా వ్యాపార నైపుణ్యాలు లేని వెంకటేశ్వర్లు అందులోనూ రాణించలేకపోయాడు.

సాఫీగా సాగిపోయే జీవితం తలక్రిందులు అయినప్పుడు వ్యక్తి ఏ విధమైన మానసిక అవస్థకు లోనౌతాడని చెప్పేందుకు ఈ కథ ఒక నిదర్శనం.

ఎలిమెంటరీ స్కూల్ మాష్టారుగా ఉద్యోగం కోల్పోయిన తరువాత కూటి కోసం తనకు అలవాటు గాని, అనుభవం గాని లేని పనులు చేసినా పట్టేడు అన్నం తనను నమ్ముకున్న భార్య, పిల్లలకు పెట్టలేకపోయాడు.

భార్య ఇతరుల ఇళ్ళలో వంట చేసి సంపాదించినా కానీ వెంకటేశ్వర్లుని నలుగురూ తిట్టడమేకాక "ముష్టెత్తు, దొంగతనం చెయ్యి అంతేకాని ఆడదాన్ని వీధిలోకి తోస్తావా?" అని నిందా పూర్వక సలహాలు సైతం ఇచ్చారు. భార్య పైన ఆధారపడ్డ కుటుంబంలో మగవాడిని ఎలా సమాజం చూస్తుందనే విషయం ఈ సన్నివేశం వెల్లడి చేస్తుంది. తనను తన కుటుంబాన్ని ఆర్థిక దుస్థితి నుంచి బయటపడేయడానికి వెంకటేశ్వర్లు సినిమా టికెట్లు అమ్మాడు, దొంగతనం చేయబోయి తన్నులు తిన్నాడు, వేరే ఊరికి వెళ్లి అడుక్కోవాలని చేసిన ప్రయత్నం కూడా ఫలించలేదు. బతికి చెడిన వాడి పరిస్థితి సమాజంలో ఎలా పరిణమిస్తుందో వేంకటేశ్వర్లు పాత్ర మనకు తెలియజేస్తుంది.

కొట్టు వాణ్ణి బియ్యం అడగాలనుకొని ఆత్మాభిమానం వల్ల కాబోలు అడగలేడు, ఆర్థిక లేమి తనం వల్ల సంక్రమించిన ఆకలి విషవు కాలుకు వెంకటేశ్వర్లు మానసికంగా, శారీరకంగా దెబ్బతిన్న తీరును రచయిత....

"ఆకలికే ఏడవలేదు, బియ్యం దొరకలేదని ఏడవలేదు, అతను నిస్సహాయుడై ఏడ్చాడు, చాతకానివాడై ఏడ్చాడు. నీరసంగా నిశ్శబ్దంగా చచ్చిపోవడం లాంటి ఏడుపు, అసమర్థుడి అసహ్యమైన ఏడుపు"

అని వర్ణించడాన్ని బట్టి సమాజంలో ఆకలి తీర్చుకోలేని అభాగ్యుల బతుకు చిత్రం మన కళ్ళ ముందు సాక్షాత్కరించాడు.

తన కొడుకు కోసం దాచిన అన్నం వెంకటేశ్వర్లు దొంగతనంగా తినడం ఆకలి ముందు బంధాలు, బాంధవ్యాలు తర్వాతికి నిలవవని రచయిత సూచించినట్లయ్యింది.

వెంకటేశ్వర్లు ఆలోచన, చర్య రెండూ తనను స్వార్థపరునిగా మార్చివేయటంతో ఆకలి బాధతో తిండి కోసం తన వాళ్లు ఎదురు చూడకుండా తనని అడగకుండా ఉంటే బాగుంటుందని అందుకు వాళ్లు చనిపోయినా బాగని తలచిన వెంకటేశ్వర్లు మానసికంగా అనుబంధాలకు ఆమడ దూరంలో నిలిచాడని రచయిత ఉద్దేశం.

తన కొడుకు అనారోగ్యంతో ఉన్నప్పుడే వెంకటేశ్వర్లు భార్యను అన్నం పెట్టమని అడగటంతో భార్య అసహ్యించుకొని చెంబు విసుతుంది. దాని నుండి తప్పించుకున్న వెంకటేశ్వర్లు తన కొడుకుకి వైద్యం చేయించాలనే బాధ్యత నుండి తప్పించుకుంటాడు. రెండు రోజుల తరువాత ఇంటికి వెళ్లే దారిలో ఎదురైన వాణ్ణి ఆపిన వెంకటేశ్వర్లు "ఏరా మా చిన్నబ్బాయికి జబ్బు చేసిందట. బతికాడా చచ్చిపోయాడా" అని అడగగా బతికాడని వచ్చిన సమాధానంతో ఇంటికి వెల్లడం మానుకుంటాడు.

ఆర్థిక వెతలకి తోడు ఆనారోగ్య సమస్యలు వస్తే కుటుంబ విలువలు ఎలా అడుగంటుతాయో ఈ కథ చదివిన పాఠకుడు తెలుసుకుంటాడు.

తన బతుకు మోయలేని భావించి ఆర్థిక దుస్థితి అనే శరా ఘాతానికి విలవిల్లాడిపోయిన వెంకటేశ్వర్లు చని పోవాలనుకుంటాడు. చనిపోవడానికి వెళుతున్న అతనికి ఒక సహచర మాష్టరు ఎదురై నీ పెద్ద కూతురు ఏజెంట్‌కు 15 రూపాయలకు కుదిరిందని లార్జి దగ్గర చూశానని చెప్పడంతో నిర్ఘాంతపోయిన వెంకటేశ్వర్లుని నిందించి చనిపోమంటాడు.

ఆ మాటలకి క్రమంగా వెంకటేశ్వర్లు మొహంలో ఏదో ఆనందంలాంటి కాంతి కమ్మిందని, నడి సముద్రంలో కొట్టుకుపోతున్న అతనికి ఏదో నావ దొరికినట్టయిందని రచయిత వర్ణించడాన్ని బట్టి వెంకటేశ్వర్లు ఒక ఆకలి గల ఆటవిక జీవిగా మారిన తీరును ప్రకటించాడు.

ఇంటికి వెళ్లి భోజనం చేసిన తరువాత తన కూతురికి

కృతజ్ఞత చెప్పాలనుకొని కూతురు ఏడుస్తుండటం చూసి వెనుదిరిగిన వెంకటేశ్వర్లు ఒక కిరాతకుడైన తండ్రి కనిపిస్తాడు.

ఈ విధంగా కథ ప్రారంభంలో నిరాశగా ఇంటికి వెళ్లిన వెంకటేశ్వర్లు కథ ముగింపుకు వచ్చేటప్పటికి తన పెద్ద కూతురు ఆకలిని తీర్చే ఆశా కిరణంగా భావించి ఇంటికి వెళ్లాడు.

ఈ కథను ఒక అవాంచనీయ సన్నివేశంతో ముగించిన తిలక్ ఒక వ్యక్తి జీవితంలో అనుకోకుండా సంభవించిన ఆర్థికపరమైన కుదుపు ఎంతటి వికృత స్థితిలోకి కుటుంబాన్ని నెడుతుందో హెచ్చరించాడు.

ఇటువంటి సమస్యలను చూసి చూడనట్టు, విని విననట్టు నటించే సమాజ వైఖరిని ఈ కథ ద్వారా తిలక్ బహిర్గతం చేశాడు.

కాల్పనిక ప్రక్రియలో ఇది పాఠకుడు ఆశించని ముగింపే అయినప్పటికి వాస్తవ జగత్తులో మార్చుకునే అవకాశం మానవాళికి ఉందని చెప్పిన తిలక్ కథ చిరస్థాయిగా మిగిలి పోతుందనడంలో అతిశయోక్తిలేదు.

ఆధార గ్రంథాలు :

1. తిలక్ కథలు – దేవరకొండ బాలగంగాధర తిలక్.
2. అందాల తెలుగు కథ – కోడూరి శ్రీరామమూర్తి.
3. కథాశిల్పం – వల్లంపాటి వెంకటసుబ్బయ్య.
4. మన నవలలు మన కథానికలు – రాచపాళెం చంద్రశేఖరెడ్డి.

అలిసెట్టి ప్రభాకర్ వచనకవిత్వం

పిన్నోజి నరేశ్, తెలుగు ఉపన్యాసకులు, సెల్ :807437379

అక్షరాన్ని ఆయుధంగా చేసుకుని వేదనా భరితమైన హృదయాలను ఓదార్చడానికి ప్రజలకు అర్థమయ్యే భాషలో కవిత్వం రాసిన కవి అలిశెట్టి. అతని అక్షరం మండుతున్న అగ్నికణం. ఆయన కవితా వస్తువులుగా అణిచివేయ బడుతున్న వర్గాల కోసం కరవాలం లాంటి కలం పట్టి సమాజంలో ఉన్న అసమానతలను ఖండించి వేశాడు. ఈయన కవిత్వం సరళమైన పదాలతో, రక్తం ఉడికించే మాటలతో, మరతుపాకీలో బులెట్ వలె కవిత్వం చెప్పగలిగిన విప్లవ సూర్యుడు కష్టాలనే సిరాగా నింపుకుని సామాన్య ప్రజల పైన కవిత ఎర్ర మందారాలు కురిపించాడు.

ఆకాశంలో లోతుల్లోకి చూస్తూ చేతి వేళ్లను ఒకదానితో ఒకటి నిలువునా రాపిడి చేస్తూ ప్లాస్టిక్ పట్టీల చిన్న కుర్చీలో కాళ్ళు దగ్గరగా ముడుచుకుని కూర్చుని కవితా శిల్పం ఊహల్లో చెక్కుతూ స్టూడియో లో అడుగు పెడితే కనిపిస్తాడు. ఏమో అని ఇప్పటికీ చెక్కుచెదరని అక్షర శిల్పాలను తెలుగు మినీ కవిత్వానికి అందించిన ఇతడి స్వస్థలం జగిత్యాల జిల్లా, ఈయన మొదటగా ఆర్టిస్ట్‌గా పనిచేసేస్తూ పత్రికలలో బొమ్మలు వేసేవాడు. జీవన పోరాటంలో భాగంగా కరీంనగర్, సిరిసిల్ల, హైదరాబాద్ లాంటి ప్రాంతాలలో స్టూడియోను ఏర్పాటు చేశాడు. వృత్తిపరంగా ఫోటోగ్రాఫర్ అయిన ప్రవృత్తి కవిత్వం రాయడం. ఈ క్రమంలో జగిత్యాలలో సాహితీ మిత్ర దీప్తి సంస్థ పరిచయంతో కవితా రంగంలోకి ప్రవేశించాడు. ఈయన మొదటి కవితలో ఆంధ్ర సచిత్ర వార పత్రికలో వచ్చిన పరిష్కారం 1974 మొదటి కవిత.

వీరు తన మొదటి సంకలనం ఎర్రపావురాలు 1978. ఆ తరువాత మంటల జెండాలు చురకలు 1979, రక్తరేఖ 1985, ఎన్నికల ఎండమావి 1989, సంక్షోభ గీతం 1990, సిటీ లైఫ్ 1992 అచ్చయిన కవితా సంకలనాలు. తన కవిత్వం నిండా కష్టజీవి కన్నీళ్లను, శ్రామికుని చెమట విలువను పొందుపరచాడు. తన అక్షరాల అలజడితో పెత్తందారుల గుండెల్లో రైల్లు పరిగెత్తిస్తూ ఎర్రపావురాలు కవితాసంకలనాన్ని రచించాడు.

ఎర్ర పావురం కవితా సంకలనం:

తన రచనలలో ముందువరుసలో వచ్చిన సంకలనం ఇది. దీనిలో కవితల క్రమం చూసినట్లయితే ట్రీట్మెంట్, సమాధానం, పెయింటింగ్, బూడిద, క్యూలో దర్శనాలు, నా తపస్సు, బ్యాండేజ్ కట్లు, సమత కావాలంటే ప్రశ్న, తారతమ్యం, మినీ టానిక్, దర్పణం, భయం, ఫలితం ఒక్కటే, నా కవిత, వేశ్య చేయూత, వర్తమానం, మురికి చిత్రం, గుండె సంతృప్తి, సార్థకత, అమీబా, ఉదాహరింపు చిలుకు, సహృదయం, కళ్ళు తెరవండి, కరువు, నిర్మొహమాటం, హెచ్చరిక, జాగ్రత్త, తేడా అర్థం, సజీవ దేశం కోసం, ఆశయం, నిజం. సాధనే కావాలి, వాడి గుండెల్లో చరిత్ర హీనులు, ఉచ్వాసనిశ్వాసాల్లు, న్యాయం, సంఘర్షణ, ప్లాస్టిక్ సర్జరీ ఇలా ప్రజల కోసం వారి బతుకులు బాగు చేయడానికి వారి బాధలు ప్రపంచానికి తెలియ జేయడానికి ఎర్రపావురాలు కవిత్వం ఉపయోగపడుతుంది. తన భావాలతో పదునైన అక్షర సంపదతో వ్యంగం, పదును, విమర్శ, సామాజిక స్పృహ, ఆర్ద్ర హృదయం, ఆకలి విలువ అర్థమయ్యేటట్లుగా ఎర్ర కవితా సంకలనం వ్రాయబడింది.

ఎర్రపావురాలు కవితాసంపుటి ప్రారంభానికి ముందు తన కవితాక్షరాల్ని ఆప్యాయంగా నిమిరి ముసిముసిగా నవ్వుకుంటూ వాళ్ళ అమ్మ లక్ష్మిగారిని, తన భార్య భాగ్యానికి అడగకుండానే రక్తదానం ఇచ్చిన ఆప్తులైన వారిని, తన జీవితం మీద మమకారం పెంచుకున్న వారి ప్రాణమిత్రులకు ఒక్కసారి నమస్కరించి స్మరిస్తూ ఈ సంపుటిని ప్రారంభించారు. గుండె నిండా బాధ కళ్ళనిండా నీళ్ళు ఉన్నప్పుడు మాట పెగలదు. కొంత సమయం కావాలి. దట్టంగా కమ్ముకున్న మేఘాలు చెల్లాచెదురై హృదయం నిర్మల ఆకాశం కావడానికి కొంత వ్యవధి కావాలి. భారమవుతున్న ఉచ్ఛ్వాస నిశ్వాసాల మధ్య మృత్యువుతో పోరాడే సాహసం చేస్తూ ఉద్రేకమైన సన్నివేశాన్ని ఊహించుకుంటూ ఈ

సంకలనం ఉద్వేగభరితమైన సన్నివేశాలు చూపించే ప్రయత్నం చేసింది. దీనిలో ట్రీట్మెంట్ కవిత ఇండియాలో ఉన్న పరిస్థితిని కళ్లకు కట్టింది.

ఇండియా గుండెలమీద
స్టెతస్కోపు పెట్టిచూశాను
పరీక్షగా.....
నగ్నంగా ఉన్న చెవుల శరీరాలకు
ఇది రోగం కాదు ఘోరం
ప్లీజ్..... క్విక్
అందరూ ఒక్కొక్కరే
చుక్కాచుక్కాకలిపి
చైతన్యంటానిక్ తీసుకురండి...
ఈట్రీట్మెంట్ దీనికి కరెక్ట్ అడ్జిస్ట్మెంట్
నేను డాక్టర్నికాను బ్రదర్
మీలోని అజ్ఞానం సోమరితనం
బీడుభూముల్ని దున్నాలని
పరితపించే ట్రాక్టర్ని

ఇండియాలో ఉన్న పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించి, కన్నులతో చూసి, చెవులతో విని, అగ్గి చుక్కల్లాంటి అక్షర చైతన్యంతో మనదేశంలో ఉన్న కుళ్లు కుతంత్రాలను, కులమతభేదాలు, వర్గసంఘర్షణను చూసి చలించి నేను కవిత్వం ద్వారా ఈ సమాజానికి వైద్యం చేస్తాననే విశ్వాసాన్ని కనబరిచాడు. చివరి పంక్తులలో అజ్ఞానం సోమరితనం ఆవహించి ఉన్న సమాజాన్ని ఆలోచింపజేసే విధంగా బానిసలు, పీడితులకు పక్షాన తన అక్షర శంఖారావాన్ని పూరించాడు. మోడువారిన బతుకుల జీవితాలకు వెలుగును ఇచ్చేవిధంగా కష్టం ఒకరిది ఫలితం మరొకరిది కష్టం చేసిన వారికే ఫలితం ఉండాలని బీడు వారిన శ్రామిక కర్షక జీవులకు తన కవిత్వం బీడు భూములను దున్నే ట్రాక్టర్ అని నిర్భయంగా తన కవితాశక్తిని ప్రదర్శించారు.

ఈ సమాజాన్ని చూస్తూ తనను వేధిస్తున్న ఎన్నో ప్రశ్నలకు సమాధానంగా కన్నీళ్లు తప్ప మరొక జవాబు కనబడడం లేదని వేదన పడిన గుండెలను ప్రశ్నిస్తే ఎటు చూసిన బాధా తప్తహృదయాలతో తప్ప స్వేచ్ఛ సమానత్వం లేదనే సమాధానం 'సమాధానం' అనే కవిత చెప్తుంది.

ప్రశ్న అనే కవిత్వం ద్వారా కుటుంబం కోసం తండ్రి ఎన్నిత్యాగాలు చేస్తాడో దీనిలో చిత్రీకరించారు. సున్నితమైన ఎన్నో పువ్వులను మేము మోస్తున్నామని విర్రవీగే కొమ్మలారా..... అనుక్షణం కంటికి రెప్పలా తన పిల్లల్ని కాపాడుతూ తర్వాత రోజుల్లో వారిని అపార్థం చేసుకుంటే అహంభావం పెంచుకుంటే వారి త్యాగం వృధా అవుతుంది అంటూ ప్రశ్నించాడు. అంతేకాక స్వతంత్రం తెచ్చిన నాయకులను గౌరవించాలన్న ఉద్దేశాన్ని ప్రతిపాదించాడు. వారు చిరస్మరణీయులు.

'వేశ్య' మినీ కవిత్వం లో ఈ సమాజంలో ఆకలి ఎంతటి పనినైనా చేయిస్తుందని, ఆకలి తీర్చుకోవడం కోసం శరీరాన్ని తాకట్టు పెట్టి జీవిస్తున్న ఒక వేశ్యావృత్తిని వారి కష్టాన్ని ఎడారి బతుకులను చిత్రించాడు. స్వతంత్ర దేశంలో ఇలాంటి పరిస్థితి రావడం ఎంత వరకు సమంజసమని కన్నీరు కార్చాడు.

ఎర్ర పావురాలు సమ సమాజ స్థాపనకు, బానిసత్వ విముక్తికి, ప్రశ్నించేతత్వానికి సంకేతం. భయం లేకుండా ఒకరికి చేయూతనివ్వడం అనేది వర్తమాన వ్యవస్థలో లోపము. ఆ లోపాన్ని అధిగమించడానికి గుండె ధైర్యాన్ని నింపిన రచనగా ఎర్రపావురాలు నిలిచిపోతుంది. కరువును నిర్మొహమాటంగా ఎదుర్కోవాలని తేడా వస్తే యుద్ధానికి సిద్ధం కావాలని, పారదర్శకంగా చూడగలిగితే వివేకం సజీవంగా ఉంటుందని, కన్నుల చూపులు చీకటిని, బానిసత్వాన్ని ఒప్పుకుంటే సంకెళ్లు తప్ప మరేమీ మిగలదని, రాత్రి చీకటి ఉన్నప్పుడు చుక్క చుక్క కలిసి మెలిసి ఐక్యతతో ఉన్నట్లు దేశం కోసం, ఆశయం కోసం ఎంతకష్టం అయినా పడాలని అకాంక్షించాడు.

ఆధార గ్రంథాలు :

1. అలిశెట్టి ప్రభాకర్ కవిత

అమెరికా తెలుగు కథలు – స్త్రీ – పురుష సంబంధాలు

డా. పలివెల చిరంజీవిరావ్య, సహాయాచార్య (తెలుగు శాఖ), ఐఐఐటి శ్రీకాకుళం, ఆర్.జి.యు.కె.టి,
చరవాణి : 9666360983

భారతీయులలో పూర్వకాలం నుండి పురుషాధిక్యత కొనసాగుతూనే వచ్చింది. "స్త్రీ" అణచివేతకు కారణ మవుతూనే వచ్చింది. స్త్రీ, పురుషుల మధ్య అంతరాలు పెరుగుతూనే వచ్చాయి. అంతేకాక మన ప్రవాసాంధ్రులు తెలుగు అమ్మాయిలను పెళ్లి చేసుకొని అమెరికా తీసుకువెళ్ళి, అక్కడ కూడా భారతీయ "స్త్రీ"లు గృహ హింసకు, వరకట్న వేధింపులకు బలైపోతున్నారు. సమాజంలోని మానవ సంబంధాలు అనేక విధాలుగా ఉంటాయి. స్త్రీ పురుష సంబంధాలు, విభిన్న సంస్కృతుల మధ్య అంతరాలు, తరాల అంతరాలు, అమెరికన్ సంస్కృతిలో ఎదురయ్యే సమస్యలు ఇక్కడ మెచ్చిన కథలు.

అమెరికా తెలుగు కథల్లో స్త్రీ–పురుష సంబంధాలు సమాజంలో అనేకరకాలుగా ఉన్నాయి. భార్య భర్తల సంబంధాలు, అన్నా చెళ్ళెల అనుబంధాలు, బావ మరదళ్ళ సంబంధాలు, ప్రేయసి ప్రియుల సంబంధాలు ఇంకా ఇలాంటివి అనేక సంబంధాలున్నాయి. ఈ విధంగా సమాజ అవసరాలకు బహిర్గతంగా కనిపించే సంబంధాలు కొన్నయితే అంతర్గతంగా వారివారి నైతిక ప్రవర్తననుబట్టి పెరిగిన వాతావరణాన్ని బట్టి ఏర్పడేవి కొన్ని, ప్రకృతి సిద్ధంగా స్త్రీ, పురుషుల మధ్య ఆకర్షణ ఉంటుంది. ఈ ఆకర్షణ బాధ్యతాయుత సమాజావసారాలకు భంగం వాటిల్లకుండా ఉంటే ప్రమాదం లేదు. కాని ఈ సంబంధాలు కొన్నిసార్లు అదుపు తప్పి అరాచకాలకు గురికావచ్చు. దీనికి పరిస్థితులు, ఆనేక సంబంధాలు, పెరిగిన వాతావరణంఅనేవి కారణంగా ఉండవచ్చు. మానవుడు అరిషడ్వర్గాల ద్వారా నియంత్రించబడుతుంటాడు. వీటికి అతీతంగా ఏ వ్యక్తియైనా ఉంటే అతడు మానవుని పరంగా సమాజంలోని స్త్రీ, పురుష సంబంధాలను విశ్లేషిస్తూ, అమెరికా తెలుగు కథా సాహిత్యంలో ఏ విధంగా స్త్రీ, పురుష సంబంధాలు ప్రతిబింబించాయో పరిశీలిద్దాం. 20వ శతాబ్దం ప్రారంభం నుంచి అమెరికా తెలుగు కథలు ఒక రకమైన స్త్రీ, పురుష సంబంధాలను విభిన్న కోణాలతో ప్రతిబింబిస్తూ వచ్చారు అమెరికా రచయితలు.

1. ఎంగేజ్మెంట్:

పురుష ఆధిపత్యాన్ని ఎదుర్కొన్న స్త్రీ కథ ఇది. విదేశి వివాహ వ్యవస్థను తెలుపుతూ విప్లవ్ రాసిన కథ ఇది. చికాగోలో పనిచేస్తున్న అబ్బాయికి, న్యూయార్క్‌లోని అమ్మాయికి పరిచయం ఏర్పడుతుంది. న్యూయార్క్ అమ్మాయి ఇదివరకే ఒకతనితో బ్రేక్‌అప్ అయి ఉంటుంది. వీరిద్దరూ పెళ్లికి ముందు ఎంగేజ్మెంట్ చేసుకుంటారు. కానీ ఇద్దరికి నచ్చకపోతే విడిపోవచ్చు. ఇదొక వింత ఒప్పందం. చివరికి వారిద్దరూ విడిపోతారు.

ఈ కథ స్త్రీ వాదానికి సంబంధించినది. మగవాడి ఆధిపత్యాన్ని గురించి చక్కగా తెలియజేస్తుంది. తను ప్రేమించిన స్త్రీ తనకు నచ్చిన డ్రస్ వేసుకొని రావడం ఆలస్యం అయ్యిందని అనుమానిస్తాడు. ఆమెకు స్వేచ్ఛ లేదు. డబ్బుకోసం అతడు ఆమెను ప్రేమించాడు. నిన్ను నేను పెళ్లి చేసుకుంటే తనకు పైసా డబ్బు ఇవ్వరని ఆమె చెప్పినప్పుడు అతడు ఆమెను చెడాపెడా తిట్టి ఆమెనుండి దూరంగా వెళ్ళిపోతాడు. ఆమెకు ఇష్టమైన ప్రాంతం న్యూయార్క్ వెళుతుంది. అతడికి నచ్చిన చోటు చికాగో వెళతాడు. ఆమె అతడిని కాదంటుంది. ఇద్దరు విడిపోతారు.

ఒక స్త్రీ జీవితంలోకి ఇద్దరు పురుషులు వచ్చినప్పుడు వారిద్దరు కూడా పురుష ఆధిపత్యాన్ని ఆమె మీద ప్రదర్శించారు. తనకి కావల్సిన స్వేచ్ఛ లేదని ఇష్టాలు లేవని

తెలుసుకొని వారివురిని దూరం చేస్తుంది. స్త్రీ మానసిక సంబంధమైన కథ. స్త్రీ స్వేచ్ఛావాద కథ ఇది.

2. సంఘర్షణ:

వివాహ వ్యవస్థలో మనస్తత్వాల కలయిక ఆధారంగా నేపథ్యాన్ని ఎంచుకొని పూడిపెద్ది శేషుశర్మగారు రాసిన కథ ఇది.

గౌరి కూతురు గీత హిందూమతంలోని పూజారుల పట్ల ఆర్గనైజర్స్ సర్వెంట్ల భావనతో ఉన్నారని, అదే క్రిష్టియన్లలో ప్రీస్ట్లు పట్ల గౌరవం, ఆదరం ఉంటాయని, మానవులకి టెంపుల్ ద్వారా మనం సహాయపడక పోతే ఆ గుడికుండాల్సిన గౌరవం, భక్తి ఈ వెస్టరన్ కల్చర్లో పెరిగిన పిల్లలకి ఉండవని చెబుతుంది. పాల్ అనే క్రిష్టియన్ని పెళ్ళాడుటకు సిద్ధపడుతుంది. దాంతో గౌరి మనస్తాపానికి గురవుతుంది. కాని ఇండియా వెళ్ళొచ్చిన గీత హిందూ మత ఔన్నత్యం గురించి తెలుసుకుని హిందువుని పెళ్ళి చేసుకుంటుంది.

ప్రేమకు వయసుతో సంబంధంలేదు. పైగా చదువుకున్న వాళ్ళువాళ్ళ అభిప్రాయాలు, వాళ్ళ మనస్తత్వాలు, ఆలోచనా విధానాలు ఒకటైతే దాంపత్య జీవితం సాఫీగా సాగిపోతుందని తెలుపుతూ రాశారు ఈ కథ.

3. నందిని:

ప్రధాన పాత్ర నందిని, తన స్నేహితురాలు మాధవితో జరిపే మొదటి సంభాషణలో అప్పటి వరకు పెళ్ళి గురించి ఆలోచించలేదంటూనే, పెళ్ళి తంతు అన్యాయంగా తోస్తోందని, పెళ్ళికోసం మరీ ఇంత రాజీ పడాలా అని పెళ్ళి చేసుకోకుండా బ్రతకడమే నయం లాగుందని అంటుంది. తర్వాత అమెరికా వెళ్ళిపోయి ఎక్కువ డబ్బు సంపాదించి, తన సహవుద్యోగి మార్క్ అనే అతనితో అమెరికాలో ఒకే ఇంట్లో ఉంటూ కాపురం చేస్తూ తన ఇష్టపూర్తిగా అతనితో కలుసుకుంటూ గర్భవతి అవుతుంది. పెళ్ళి చేసుకోకుండా తల్లికూడా అవుతుంది. ఆమె తల్లిదండ్రులు వచ్చి చెప్పినా మార్క్ను పెళ్ళి చేసుకునేందుకు ఇష్టపడదు. కొడుకు పుట్టాక వాడితో ఒంటరి జీవితం గడపాలనుకుంటుంది. మార్క్ ఆమెతో "నిన్ను నిన్నుగానే పెళ్ళిచేసుకుంటాను. ఆ పైన నీ ఇష్టం" అని చెప్పి ఓ డైమండ్ రింగ్ని ఆమె వద్ద వదలి వెళ్ళిపోతాడు. అప్పుడు ఆమెకు అతడిపై నమ్మకం కుదిరి ప్రక్కన నిద్రపోతున్న కొడుకుని ముద్దు పెట్టుకొని, ఎన్ని చెలియలికట్టలు దాటేక దొరికిందో తెలుసా ఈ వజ్రం నాకు అంటుంది.

మగాడు తన అందం, డబ్బు, హోదాలకు ఆకర్షితుడైనా, దురవస్థకు జాలిపడినా గాని, వ్యక్తిత్వమున్న ఆడది అతణ్ణి భర్తగా ఆమోదించ లేదు. స్త్రీ వ్యక్తిత్వాన్ని ప్రేమించే స్థాయికి ఎదగమని పురుషుల్ని ప్రబోధించే ఈ కథలో మనకు మరో చలం గోచరిస్తాడు. "మా అన్న మగాడు అంటే తెలుసుగా ఇంజనీరింగుచేసి, పెసరట్టుప్మా చేసే ఐశ్వర్యారాయి కావాలి" అన్న వ్యాఖ్యకు నేటి యువకుల్లో ఎందరు అతీతులు? అప్పుడైనా ఇప్పుడైనా ఆడపిల్లను పెంచడమంటే పెళ్ళి కూతుర్ని తయారు చేయడమే? అన్న మాటను వ్యతిరేకించగల తల్లిదండ్రులెందరు? తోడుకోసం నిన్ను నువ్వే మర్చిపోతూ బతుకంతా ఈడ్వాలంటే ఒక్క మా దేశపు ఆడజాతికి తప్పా ఎవరివల్లా అవదు అంటే అందుకు భిన్నంగా ఉండాల్సిన అవసరాన్ని గుర్తించిన మహిళలెందరు? ఈ కథ చదవడం ఒక అనుభవం ఆ అనుభవాన్ని స్వానుభవంగా మార్చుకోగల వారికోసం నవసమాజం ఎదురు చూస్తుంది.

4. గట్టు తెగిన చెరువు:

సహనం స్త్రీ ఆభరణం. భర్తలు పెడుతున్న హింసలను మౌనంగా సహిస్తున్న మహిళాలోకం ఒక్కసారి కన్నెర్ర చేస్తే అది ఎంత భయంకరంగా ఉంటుందో విశదీకరించి చెప్పిన కథ ఇది. ఈ కథలో శారద వివాహానంతరం భర్త మాధవరావుతో పాటు అమెరికాకు వస్తుంది. మాధవరావు భార్యను అనేకరకాలుగా అవమానిస్తుంటాడు. శారద

అన్నింటిని మౌనంగా భరిస్తూ ఉంటుంది. ఇంతలో మాధవరావుకు ఉద్యోగం పోతుంది. దీంతో మాధవరావు మరింత రెచ్చిపోయి శారదను హింసిస్తూ ఉంటాడు. ఆ బాధలన్నింటినీ శారద భూదేవి వలె భరిస్తూ, ఉంటుంది. కొద్దిరోజులకు మాధవరావుకి మళ్ళీ ఉద్యోగం వస్తుంది. అయినా అతని ప్రవర్తనలో ఏ మార్పు రాదు. అతని నీచ ప్రవర్తన పరాకాష్ట దశను చేరుతుంది. దీంతో సహనం నశించిన శారద భర్తను హత్య చేస్తుంది.

ముక్కు-మొహం తెలియని వారికి తమ కుమార్తెలను ఇచ్చి వివాహం చేసి, అమెరికాకు పంపించి చేతులు దులుపుకొనే భారతీయ తల్లి దండ్రులకు ఈ కథ ఒక కనువిప్పు.

5. అయిదోగోడ:

అరవై సంవత్సరాల వయసులో ఉన్న ఒక "స్త్రీ" కి పునర్వివాహం చేస్తే ఆమెను కూతురుగాని, వేరే స్త్రీలుగాని ఎంతవేరుగా చూస్తారో తెలియజేస్తూ ఈ కథను కల్పన రెంటాల రాశారు.

శారద భర్తను పోగొట్టుకున్న తర్వాత తన వాస్తవ జీవితంలోకి అడుగు పెడుతుంది. ఒక క్షణం కూడా వృధా చేయకుండా తనకు నచ్చిన జీవితాన్ని మొదలుపెట్టడం కోసం "తోడుకావాలి" అని ప్రకటనిస్తుంది. అది పెళ్లిలాంటి ఫార్మాలిటిస్ లేకుండా కలిసి జీవితం పంచుకోవడానికి, సామాజిక కార్యకలాపాలు, సంగీతం, సాహిత్యం అభిరుచి ఉన్నవారికి ప్రాధాన్యత అని పేపర్లో ప్రకటన ఇస్తుంది. ఇది జీర్ణించుకోలేని కూతురు ఆర్తి తన అమ్మను ప్రశ్నిస్తుంది. బాధపడుతుంది. అమ్మా కోరికలతో రగిలిపోతున్నవా అని నిందిస్తుంది. తల్లి దానికి సమాధానంగా భార్య చనిపోతే పునర్వివాహానికి సిద్ధపడే పురుషుడిని సమర్థించే ఈ సమాజం, భర్త చనిపోతే పునర్వివాహానికి సిద్ధపడ్డ మహిళను మాత్రం సమర్థించలేకపోతుంది ఎందుకని కూతురిని ప్రశ్నిస్తుంది. పురుషునికైనా, స్త్రీ కైనా జీవిత చరమాంకంలో ఒక తోడు తప్పనిసరని అంటుంది. భర్తతో వివాహమైన నాటి నుండి తన అభిరుచులను ఎన్నింటినో తాను కోల్పోయానని, ఇకనైనా తన అభిరుచులతో ఏకీభవించే వ్యక్తితో తాను జీవితాన్ని పంచుకోవాలని ఆశిస్తున్నానని కూతురికి చెబుతుంది. చివరకు వాస్తవం తెలుసుకొని అమ్మ జీవితంలోకి తొంగిచూస్తుంది ఆర్తి.

స్త్రీ అణచివేతకు గురౌతూ తనకు నచ్చిన జీవితం గడపలేక పోతుందని రచయిత్రి ఈ కథలో తెలిపారు. పాత్రతో అంతర్మథనం జోడించి కథకు మరింత లోతును తీసుకొచ్చారు. ఒక స్టీరియో టైపును వ్యతిరేకిస్తూ మరో స్టీరియో టైపుని సృష్టించే పోకడమీద సునిశితమైన వ్యంగ్యం ఈ కథ. ఈ కథలో మోరల్ డైలమా గురించి, మనలో జీర్ణించుకుపోయిన విలువల హిపోక్రసీ గురించీ ఎంత చెప్పిన తక్కువే.

6. జోయాన్:

జోయాన్ అనే అమ్మాయి కెవిన్ చేతిలో మోసపోతుంది. ప్రేమించిన వ్యక్తిని ఏమిచేయాలో తెలియక భయపడుతున్న అమ్మాయికి కథా రచయిత ధైర్యంచెప్పి ఆమె ప్రమాదంలో ఉన్నా, ప్రేమించిన వ్యక్తి మోసం చేసినా క్షమించి బ్రతకనిచ్చి, పోలిసులకు చెప్పిన విషయం ఆధారంగా ఈ కథను సత్యం మందపాటి రాశారు.

ఏ దేశంలోనైనా, ఏ ప్రాతంలోనైనా ఓర్పు- సహనం- క్షమ-ప్రేమ తదితర లక్షణాలు స్త్రీలకు సహజ గుణాలుగా ఉంటాయని ఈ కథ తెలియజేస్తుంది. ఈ కథలో అమెరికన్ అయిన జోయాన్ తల్లిదండ్రులు ఆమె చిన్నప్పుడే విడిపోతారు. జోయాన్ తండ్రి దగ్గర ఉంటుంది. జోయాన్ తండ్రి మరొక స్త్రీని వివాహమాడతాడు. కానీ వారిద్దరి మధ్య ఎప్పుడు తగాదాలు జరుగుతూ ఉంటాయి. జోయాన్ కొంచెం పెద్దయ్యాక తండ్రి ఆమెను కూతురిగా గాక, మరొక రకంగా చూడటం మొదలు పెడతాడు. ఇది తట్టుకోలేని జోయాన్ ఇల్లు వదిలి వచ్చి సొంతంగా జీవించడం

మొదలుపెడుతుంది. జోయాన్ కెవిన్ అనే వ్యక్తిని ప్రేమించి మోసపోతుంది.

ఈ కథలో రచయిత, జోయాన్ ఒకే కంపెనీలో పనిచేస్తూ ఉండటం వల్ల వారిద్దరి మధ్య మంచి స్నేహం ఉంటుంది. జోయాన్ తన కష్టసుఖాలన్నిటినీ రచయితకు చెప్పుకుంటూ ఉంటుంది. అనుకోకుండా ఒకరోజు జోయాన్ ఉద్యోగం పోతుంది. ఆ బాధలో వున్న జోయాన్‌ను రచయిత ఓదార్చి, ఆమెకు మనోధైర్యాన్ని అందిస్తాడు. ఆ తర్వాత పని ఒత్తిడిలో ఉన్న రచయితకు జోయాన్ విషయాలు ఏమీ తెలియవు. జోయాన్‌ను తనను కలిసి చాలా రోజులు అవుతుండటంతో రచయిత ఆమెకు ఫోన్ చేస్తాడు. ఫోన్ కలవదు. జోయాన్ అపార్ట్‌మెంటు కూడా తాళంవేసి ఉంటుంది. ఒకవేళ జోయాన్ ఆత్మహత్య చేసుకుందేమోననే అనుమానం రచయితకు కలుగుతుంది.

ఒకరోజు అర్ధరాత్రి అనుకోకుండా రచయితకు జోయాన్ ఫోన్ చేస్తుంది. జోయాన్ తన వివరాలు చెబుతూ పాత ప్రేమికుడు కెవిన్ మళ్ళీ తనను కలిసాడనీ, మంచివాడిగా మారినట్లు నటించి మరొకమారు తనను మోసం చేసాడనీ, తనను హింసించే ప్రయత్నంలో అతని కారు ప్రమాదానికి గురైందని, కొద్దిపాటి గాయాలతో తాను ఆ ప్రమాదం నుండి బయటపడ్డాననీ, కెవిన్ ని అరెస్ట్ చేయించానని చెబుతుంది. జోయాన్ క్షేమంగా ఉందని తెలిసిన రచయిత ఎంతో సంతోషిస్తాడు. ఆమెను మరో ఉద్యోగ ప్రయత్నం చేయమని ప్రోత్సహిస్తాడు.

ఈ కథలో బలైపోయిన జోయాన్ జీవితం మనకు కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది. కెవిన్ అనే మగవాడి ఉచ్చులో మోసపోయిన జోయాన్ చివరికి వాడిని పోలీసులకు అప్పగిస్తుంది.

7. ఏడువారాలనెలవు:

అమెరికాలాంటి అభివృద్ధి చెందిన దేశాలలో నివసిస్తున్నప్పటికీ, ఏమాత్రం మారని కొందరి భారతీయ భర్తల దృక్పథాన్ని వెల్లడించిన కథ యిది. ఈ కథలో అమెరికాలో ఉద్యోగం చేసే శ్రీనాథ్, సుమతిని వివాహ మాడతాడు. భర్తతోపాటు అమెరికాకు వచ్చిన సుమతి తాను కూడా కోర్సులు నేర్చుకుంటూ, ఒక చిన్న ఉద్యోగంలో చేరుతుంది. కానీ శ్రీనాథ్‌కి భార్య ఉద్యోగం చేయడం ఏ మాత్రం నచ్చదు. ఇంతలో శ్రీనాథ్ ఉద్యోగరీత్యా వేరే ప్రాంతానికి వెళ్ళవలసి వస్తుంది. శ్రీనాథ్ తనతోపాటు సుమతిని కూడా రమ్మని ఆజ్ఞాపిస్తాడు. అందుకు సుమతి తాను ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాన్ని వదులుకుంటే మళ్ళీ తనకు ఉద్యోగం రావడం కష్టమని, కావున కొన్ని రోజుల తరువాత వస్తానని అంటుంది. అందుకు శ్రీనాథ్ రెండు వారాలలో సుమతి తన వద్దకు రాకపోతే విడాకులు ఇస్తానని బెదిరిస్తాడు. సుమతి ఎన్నో రకాలుగా భర్తకు నచ్చచెప్పే ప్రయత్నం చేసినా ఫలితం ఉండదు.

అంతేగాక, శ్రీనాథ్ అనేకరకాలుగా సుమతిని హింసించే ప్రయత్నాలు చేస్తాడు. ఆమెను చంపుతానని కూడా బెదిరిస్తాడు. ఇలాంటి క్లిష్ట సమయంలో అక్కడ భారతీయ స్త్రీల హక్కులకై పోరాటం చేస్తున్న ఉష ఆమెకు అండగా నిలుస్తుంది. ఈ విషయాలన్నింటిని సుమతి స్వదేశంలోని తన తండ్రికి లేఖ వ్రాస్తుంది. సుమతి కుటుంబం ఆమె నిర్ణయాన్ని స్వాగతించడమే కాక, ఆమెకు అండగా నిలవడంతో కథ ముగుస్తుంది.

8. అతను:

భార్య ఉద్యోగం చేయడం ఏమాత్రం ఇష్టంలేని ఒక భర్తకు, కనువిప్పు కలిగించడానికి. ఆ ఇల్లాలు ఎలాంటి నిర్ణయం తీసుకుందో తెలియజేసే కథ యిది. ఈ కథలో మెడిసిన్ చదివిన ఉత్పల వివాహానంతరం భర్త ప్రభాకర్ తో కలిసి అమెరికాకు వస్తుంది. ప్రభాకర్ భార్యను ఎంతో ప్రేమగా చూసుకుంటాడు. కానీ ఉత్పల ఉద్యోగం చేయడం మాత్రం ప్రభాకర్‌కు ఇష్టం ఉండదు. కష్టపడి ఎంతో ఇష్టంగా చదువుకున్న తన చదువు పనికిరాకుండా పోతున్నందుకు

ఉత్పల ఎంతో బాధ పడుతుంది. తమ వంశంలో ఆడవాళ్ళు ఉద్యోగాలు చేసే సంప్రదాయం లేదని, కావున ఉద్యోగం చేయవద్దని ప్రభాకర్ తీర్మానిస్తాడు. ఉత్పల ఉద్యోగం చేస్తే ఆమెకు వచ్చే సంపాదన తన కంటే ఎక్కువగా ఉంటుందని, అది తనకు పరువు తక్కువని, ప్రభాకర్ ఆలోచిస్తాడు. తనను ఎంతో ప్రేమగా చూసుకునే ప్రభాకర్ ఇలా సంకుచితంగా ఆలోచించడం ఉత్పలకు నచ్చదు. దీంతో తన మూడేళ్ళ కూతురు నేహను భర్త వద్దే వదలి, భర్తకు చెప్పకుండా ఉత్పల స్వదేశానికి ప్రయాణమవుతుంది. ఈ ప్రయాణంలో ఉత్పలకు వర్మ పరిచయమవుతాడు. ఉత్పల తన కథ అంతా వర్మకు చెబుతుంది.

వ్యక్తుల మధ్య దూరం ప్రేమను బలపరుస్తుందని, వ్యక్తుల ఆలోచనల్లో మార్పును తీసుకొస్తుందని, భావించే తాను భర్తకు దూరంగా వెళ్తున్నానని ఉత్పల– వర్మకు చెబుతుంది. భారతీయ భర్తల సంకుచిత ఆలోచనా దృక్పథాన్ని ఈ కథ చక్కగా వెల్లడించింది.

ముగింపు:

ఈ అణచివేతలను, హింసలకు ప్రధాన కారణం భారత స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడమే ఆధునిక సమాజంలో కూడా స్త్రీ ఉన్నత చదువులు. చదువు తున్నప్పటికీ, చక్కని ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ చాలా కుటుంబాలలో భర్తదే పైచేయిగా ఉంటుంది. సంసారంలో భార్యాభర్తల మధ్య వచ్చే చిన్నచిన్న అభిప్రాయ భేదాలకే భర్తలు స్త్రీలను శారీరకంగా హింసించడమనేది చాలా కుటుంబాలలో, సర్వసాధారణంగా కన్పించే విషయం. పురుషాధిక్య అహంకారమే చాలావరకు గృహహింసలకు కారణమని చెప్పవచ్చు.

భారతీయ వివాహవ్యవస్థలోని వరకట్న దురాచారం అనేక కుటుంబాలలోని స్త్రీల గృహహింసకు ప్రధానకారణం అమెరికాకు వెళ్ళిన భారతీయ కుటుంబాలలో కూడా ఈ హింసలకు గురవుతున్న స్త్రీలు ఉన్నారు. అక్కడి భారతీయ కుటుంబాలలో భర్తలు పెట్టే హింసలకు బలైన స్త్రీల వేదనలు వార్తా పత్రికల్లోను, టీ.వీ. ఛానళ్ళలోను గమనిస్తూనే ఉంటాం. కొత్తదేశంలో భార్యకు అండగా నిలవాల్సిన భర్త ఆమెను క్రూరంగా హింసించడమనేది హీనమైన చర్య. ఉన్నత చదువులు చదువుకొని, గౌరవ ఉద్యోగాలలో కొనసాగుతున్న వారు కూడా స్త్రీలను హింసించడం విచారకరం. లక్షల కట్నాలు కుమ్మరించి సంపాదించుకున్న భర్తలు తమకు రక్షణ ఇవ్వకపోగా, శారీరకంగాను మానసికంగాను హింసలకు గురిచేస్తుంటే, తమ బాధలను పంచుకునేవారు లేక, స్వదేశంలోని తల్లిదండ్రులకు చెప్పుకోలేక మౌనంగా మూగబాధను అనుభవిస్తున్న గృహిణులను కేంద్రంగా చేసుకొని అమెరికన్ తెలుగు సాహిత్యంలో కొన్ని కథలు వెలవడ్డాయి. గృహహింసలకు గురైన భారతీయ స్త్రీలకు అండగా నిలిచి వారికై పోరాడే సంస్థలను గూర్చి కూడా ఈ కథలు వివరిస్తాయి. స్త్రీలు తమ కాళ్ళమీద తాము నిలబడాల్సిన ఆవశ్యకతను ఈ కథలు నొక్కి చెబుతాయి.

ఆధార గ్రంథాలు :

1. అమెరికా తెలుగు కథానిక – సంకలనాలు 1 నుంచి 11
2. అమెరికా తెలుగు కథలు –సామాజిక విశ్లేషణ
3. సీతారామయ్య ఆరి: గట్టుతెగిన చెరువు కథలు
4. సాయి బ్రహ్మానందం గారి కథలు
5. ఈ మాట – వెబ్

కర్నూలు జిల్లా రైతు కథలు – కరువుచిత్రణ

పూలరాతి నరసప్ప, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయనశాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.
చరవాణి: 63025 44745

కరువుల వలన తిండి దొరక్క జీవరాశి మృత్యువాత పడుతుంది. మానవుడు కానివ్వండి, జంతువులు కానివ్వండి, పక్షులు కానివ్వండి, ఆకలి అనేది జీవరాశికి భరించరాని వేదనగా చెప్పవచ్చు. ఆకలి ఒక్కోసారి విచక్షణ మరచి కన్న బిడ్డల్ని కూడా కబళించడానికి వెనుకాడనివ్వదు. ప్రకృతి వైపరీత్యాలైన ఉప్పెనలు, భూకంపాలు, కరువులు ప్రజల్ని ముప్పతిప్పలు పెట్టివారి ఆర్థిక పునాదుల్ని కూల్చేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి వైపరీత్యాలవలన కరువులు వస్తూనే ఉన్నాయి. కరువులకు కారణాలు ఎన్నో ఉన్నప్పటికీ, ప్రధాన కారణంగా ప్రకృతివలనకలిగే నష్టాన్నే చెప్పుకుంటాము. భారతదేశం లాంటి వైవిధ్యభరిత భౌగోళిక స్థితిగతులున్న వ్యవసాయాధారిత దేశానికి కరువులు ప్రాచీన కాలం నుండి సుపరిచితమే.

భారతదేశ ఆధునిక చరిత్రలో అత్యంత భయంకరమైన కరువులు ప్రాణాంతకమై విలయతాండవం చేసిన దాఖలాలు కోకొల్లలు. నూటయాభై సంవత్సరాల క్రితం నాటి (1870–1878) ధాతుకరువు మొత్తం దేశాన్ని అతలకుతలం చేసి తన విశ్వరూపం చూపిందని, చరిత్రలోనే అత్యంత భయంకరమైన, తీవ్రమైన ప్రాణనష్టాన్ని కలిగించినదని నమోదు చేయబడింది. దేశవ్యాప్తంగా లక్షలమంది జనం తిండిదొరక్క ఆకులు, దుంపలతో కొంతకాలం, జంతువులను చంపి కడుపునింపుకొని కొంతకాలం గడిపారు. చివరికి మనిషిని మనిషి పీక్కుతినే హీనస్థితిలోకి నెట్టవేయబడ్డారని ఇటీవలి చరిత్ర చెబుతుంది. ఈ రోజుకు కూడా భారత దేశంలోని కొన్ని ప్రాంతాలు ఇంకా తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. అక్కడి ప్రజలు ఆస్తులు అమ్ముకుంటూ, అప్పులు తీర్చలేక ఆత్మహత్యల దారిలో ప్రయాణిస్తున్నారు. అటువంటి ప్రాంతాలలో రెండవ అతిపెద్ద ప్రాంతం రాయలసీమ ప్రాంతం స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలు దాటినా ఇంకా ఇక్కడ అప్పులు, బాధలు, కన్నీళ్ళు, మరణాలు, వలసలు తగ్గలేదు. కరువు రక్కసి ప్రతి ఏటా ప్రజలను పీల్చిపిప్పి చేస్తునే ఉంది. "భారతదేశంలోని కరువు పరిస్థితుల గురించి అధ్యయనం చేసిన రాయల్ కమీషన్ దాదాపు వందేళ్లక్రితమే పలు ప్రాంతాలతోపాటూ రాయలసీమలో 'వర్షాధార సేద్యం జూదం' లాంటిదని వ్యాఖ్యానించింది".

రాయలసీమ ప్రాంతంలో భాగమైన కర్నూల్ ప్రాంతం ప్రతిసంవత్సరం ప్రభుత్వం ప్రకటించే కరువులిస్టులో పేరును నమోదు చేసుకుంటుంది. కర్నూల్ ప్రాంతాన్ని రెండు భాగాలుగా చేసినట్లైతే మొదటి భాగం తూర్పుభాగం కొంతవరకు నీటి సౌకర్యం కలిగి ఉండి అభివృద్ధిగానే కనిపిస్తుంది. రెండవ భాగం పశ్చిమ భాగం ఈ ప్రాంతం నీటి సౌకర్యం లేక వెనకబడివుంది. ఈ పశ్చిమప్రాంత మండలాలు ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ, మంత్రాలయం, కోడుమూరు, గోనెగండ్ల, కౌతాళం, పెద్దకడుబూరు, ఆస్పరిమొదలైన ప్రాంతాలలో నీటి సౌకర్యం లేక కొన్నిసార్లు తాగటానికి నీళ్ళు దొరకని పరిస్థితి నేటికి కనిపిస్తుంది. అదేకాక రాష్ట్రప్రభుత్వం ప్రకటించే కరువు ప్రాంతాల లిస్టులో ప్రతి సంవత్సరం తప్పకుండా పేర్లు నమోదు చేసుకునే మండలాలు ఇవి. దానికి కారణం నీటి సౌకర్యం కాలువలు, ప్రాజెక్టులు లేకపోవడమే. ఈ పశ్చిమ ప్రాంత ప్రజలకు ఏటా ఒక పంటను పండించుకోవడమే కష్టంగా ఉంటుంది. ఈ ప్రాంత ప్రజలు అక్టోబరు రాగానే ఊరువదిలి వలసలకు వెళ్ళడం, మళ్ళీజూన్‌లో వర్షాలు ప్రారంభంకాగానే వలసల నుండి తిరిగి ఊర్లకు రావడం కనిపిస్తుంటుంది. అలాంటి ప్రాంత కరువును వివరించిన కథలలో నా పరిశోధన వ్యాసపరిమితిని దృష్టిలో ఉంచుకొని

రెండు కథలను తీసుకోవడం జరిగింది. అవి 1.కరువు దొంగలు 2.బతుకు యుద్ధం.

1. కరువు దొంగలు :

కరువు కాలంలో పశువుల గడ్డికోసం గవర్నమెంటు ఫారంలోకి వెళ్ళిన అమాయకపు రైతును లంచగొండి ప్రభుత్వ అధికారులు కలసి ఏవిధంగా దొంగను చేసి హింసించారో రచయిత 'మదార్‌సాహెబ్' ఈ కథ ద్వారా తెలియజేశాడు.

గత్యంతరంలేక వానపైన అనుమానంతోనే రైతులు ఆర్ధకార్తెలో ఓ మోస్తారు కురిసిన వానకు పొలాల్లో విత్తనాలు వేశారు. రామన్న కూడ తనకున్న ఐదెకరాల పొలంలో వేరుశెనగ వేసి అంతర పంటగా కందివేశాడు. రైతులు వేసిన విత్తనాలు పొలాల్లో మొలకలెత్తాయి. కానీ మొలకలు పెరగడానికి మాత్రం వర్షమేరాలేదు. మఖ కార్తిలో ఉరిమినా, పుబ్బకార్తిలో మెరిసినా ఒక్క చినుకు కూడా రాలలేదు. పొలాల్లో మొలచిన మొలకలు ఎండిపోయాయి. రోజులు గడుస్తున్న వర్షం రాలేదు. రైతులు వర్షంపైన పెట్టుకున్న ఆశలు ఆవిరైపోయాయి. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా కరువొచ్చిందని ఊరిజనం అనుకున్నారు. ఊర్లో బతకడం జనానికి రోజు రోజుకి కష్టంగా మారుతుండడంతో మూటముల్లె సర్దుకొని, ఇంటి దగ్గర పిల్లలను, ముసలివాళ్ళను వదిలి నీటివసతి గల ప్రాంతాలకు, పట్టణాలకు వలసలు వెళ్ళిపోయారు. రామన్న ఇంట్లో ఉన్న రెండెద్దులను వదలి వెళ్ళలేక ఉన్న ఒక్క కొడుకు ఈరిగాడిని పంపలేక ఊర్లోనే ఉండిపోయాడు. కాలం గడుస్తున్న కొద్ది గట్లు వెంబడి, గుంటలవెంబడి ఉన్న పచ్చగడ్డి ఎండిపోయింది. పశువులకు గడ్డిదొరకడం చాలా కష్టంగా మారింది. ఈరిగాడి ఇంట్లో ఎద్దులు గడ్డిలేక డొక్కలు ఎండిపోయి మౌనంగా రోదిస్తున్నాయి. వాటి రోదన చూడలేక ఈరిగాడు తన మిత్రులతో కలసి గవర్నమెంట్ ఫారంలోకి రాత్రి ఏడుగంటలు దాటిన తరువాత గడ్డి దొంగతనానికి వెళ్ళాడు.

ఫారం పొలాలు చుట్టూ ముండ్ల కడ్డీతో ఫెన్సింగ్ ఉంటే, ఫెన్సింగ్ కిందనుంచి దూరి లోపలికి వెళ్ళారు. మెల్లగా ఫారంగట్లువెంట ఉండే గడ్డిని కోయడం ప్రారంభించారు. అరగంటలోపు సగంమోపు కోసేసరికి కావలివాళ్ళు పరుగెత్తుకు వచ్చారు. వారిని గమనించిన ఈరిగాడు, ఈరిగాడి మిత్రులు చేతిలో ఉన్నవి వదిలేసి పరిగెత్తారు. అందరు ఫెన్సింగ్ దాటారు. ఈరిగాడు మాత్రం దొరికి పోయాడు. కావలి వాళ్ళు ఈరిగాడిని ఈడ్చికెళ్ళి ఫారం డిప్యూటి డైరెక్టర్ ముందు నిలబెట్టారు. డిప్యూటి డైరెక్టర్ కోపంతో ఈరిగాడిని నానాభూతులు తిట్టాడు. ఈరిగాడు వదిలిపెట్టండని వేడుకున్నా వాడి మాటలు పట్టించుకోకుండా డిప్యూటి డైరెక్టర్ పోలీసులకు అప్పగించాడు. పోలీసులు ఈరిగాడిని బూటు కాలితో నాలుగు తన్ని తీసుకెళ్ళి లాకప్‌లో వేశారు. ఈరిగాడి తండ్రి రామన్న బాధతో తన కొడుకును విడిపించుకోవడం కోసం ఊర్లో నలుగురి పెద్దలను తీసుకొని మొదట ఫారంకు వెళ్ళి, తరువాత పోలీసు స్టేషన్‌కు వెళ్ళాడు. పోలీసు స్టేషన్‌లో ఎస్.ఐ. "ఏరా! దొంగ ముండా కొడుకుల్లారా! ఎందుకొచ్చానార్రా" అని బెదిరిస్తూ అడిగాడు. రామన్న కొంచం ధైర్యం చేసుకొని పిల్లగాడి కోసం వచ్చినాం సార్ అన్నాడు. ఎస్.ఐ.గవర్నమెంట్ ఫారంలోనే దొంగతనం చేస్తారా, గవర్నమెంట్ సొమ్ము అంత ఎట్టుగొచ్చిందరా మీకు అంటూ కసురుకొని బయటకెళ్ళి నిలబడండి అని అరిచాడు. కనీసం కొడుకు ముఖమైనా చూడలేదే అనే బాధతో రామన్న బయటకొచ్చి నిలబడ్డాడు. సాయంకాలం అయినా ఎవ్వరు పట్టించుకోలేదు.

సాయంత్రం ఆరుగంటలకు ఒక పోలీస్ వచ్చి ఐదువందలు ఇస్తే ఎస్.ఐ. నీ కొడుకును విడిచిపెడతాడు అని చెప్పాడు. రామన్న బతకడమే కష్టంగా ఉన్న ఈ కరువు కాలంలో అంత డబ్బులు ఎక్కడి నుంచి తేవాలి అనుకొని, అంత ఇవ్వలేను అన్నాడు. పోలీస్ మళ్ళీ లోపలికి వెళ్ళి మూడు వందలకు బేరం కుదుర్చుకొచ్చాడు. రామన్నకు ఒప్పుకోక తప్పలేదు. చేతిలో చిల్లిగవ్వలేదు. ఇంటిలో పూట

గడవడమే కష్టంగా ఉంది. మూడు వందలు ఎక్కడి నుండి తేవాలి అని బాధపడుతూ ఏం చేయాలో అర్థంకాలేదు రామన్నకు. రామన్నతో వచ్చిన ఒక పెద్దమనిషి చెప్పిన సలహాతో కొడుకుకంటే ఎద్దులు అంత ముఖ్యం కాదనుకొని ఒక ఎద్దును అమ్మడానికి సంతకువెళ్ళాడు. సంతలో కరువును ఆసరగా తీసుకొని కటికోడు వెయ్యిరూపాయల ఎద్దును నాలుగువందలకే బేరమాడి తీసుకొన్నాడు. రామన్న వచ్చిన డబ్బుతో మూడువందలు పోలీస్‌స్టేషన్‌లో కట్టి కొడుకును బయటకు తెచ్చాడు. ఈరిగాడి వీపునిండా లాఠీవాతలను చూసి రామన్న బాధపడ్డాడు. ఈరిగాడు నిన్నటి నుండి ఉపవాసంగా ఉండటంతో శరీరం అంతా కాలిపోతూ ఉంది. రామన్న తన దగ్గర మిగిలిన వందతో ఈరిగాడిని హోటల్‌కు తీసుకెళ్ళి టిఫిన్ పెట్టించాడు. టిఫిన్ తింటున్న ఈరిగాడికి హోటల్ రేడియోలో ప్రభుత్వం గురించి గొప్పగ చెబుతున్న వార్తలు విని కడుపు మండిపోయి, తింటున్న టిఫిన్‌లోకి చేతులు కడిగి ప్రభుత్వాన్ని తిట్టుకుంటూ బయటకువచ్చాడు.

పశువుల కోసం గడ్డికి వెళ్ళిన నన్ను దొంగగా చిత్రించి హింసించారు. మా నాయన దగ్గర లంచం తీసుకొన్నారు. నన్ను దొంగ అని పోలీసులకు పట్టించిన డిప్యూటి డైరెక్టర్ పోయిన సంవత్సరం కరువు వచ్చినప్పుడు నాలుగు లారీల పశువుల మేతను, జొన్నను, వరిని అక్రమంగా అమ్ముకున్నాడు. కరువు పనులు చేపడతామని బయలుదేరిన ప్రభుత్వం మధ్యలో మంత్రులు, అధికారులు స్వాహా చేస్తే వారిని ఏమి చేయలేకపోయింది. తన తండ్రి దగ్గర లంచం తీసుకున్న పోలీసులు, తమ జీవనానికి ఆధారమైన ఎద్దును చవకగా కొన్న కటికోడు ఫారం డిప్యూటీ డైరెక్టర్. అందరూ తమను దోచుకునే దొంగలే. నేను ఆరాటపడింది నోరు లేని పశువులకు పిడికిడు గడ్డికోసమే గదా! అని ఈరిగాడు తనలో తాను మదనపడుతూ అధికారుల దోపిడిలను గుర్తు చేసుకున్నాడు. అసలు ప్రభుత్వమే పెద్దదొంగ "దొంగలు... అందరూ దొంగలు" అంటూ కోపంతో బస్సు ఎక్కి ఊరికి వెళ్ళిపోయాడు. ఇప్పుడు ఇంటికి చేరింది మునుపటి ఈరిగాడు కాదు అంటూ కథను ముగించాడు రచయిత.

నోరు లేని పశువుల కోసం పిడికెడు గడ్డికి వెళ్ళిన అమాయకపు రైతును లంచగొండి ప్రభుత్వ అధికారులు దొంగగా ముద్రవేసి, చిత్రహింసలకు గురిచేయడం. పోలీస్‌స్టేషన్ నుండి కొడుకును విడిపించుకోవడానికి ఒక తండ్రి పడిన ఆరాటం, పోలీసులకు లంచం ఇచ్చుకోవడానికి ఒక తండ్రి చేసిన పోరాటం. ఏ ఎద్దులకోసం అయితే గడ్డికి దొంగతనానికి వెళ్ళాడో ఆ ఎద్దులనే లంచం ఇచ్చుకోవడం కోసం అమ్మవలసి వచ్చినప్పుడు ఒక రైతు పడిన వేదన. ప్రభుత్వ సొమ్మును కాజేసి శిక్షల నుండి తప్పించుకొని దర్జగా తిరుగుతున్నారు. ప్రభుత్వ అధికారుల అహంకారానికి, లంచగొండితనానికి సామాన్య ప్రజలు ఎలా బలైపోతున్నారో రచయిత ఈ కథలో తెలియజేశాడు. ఎందరో దొంగలు, దోపిడీదారులు, మధ్యవర్తులు, దళారులు మాత్రం పెద్ద దొంగలను వదిలేసి ఇలాంటి అమాయకపు ప్రజలపై నేరం మోపి ప్రాణాలు తీస్తుంటారు. ఇలాంటి సంఘటనలు నిత్యం వార్త పత్రికలలో, టి.వి.లో చూస్తూనే ఉంటాం. అలాంటి సంఘటననే రచయిత తన కథ ద్వారా తెలియజేసే ప్రయత్నం చేశాడు. ప్రభుత్వాలు, ప్రభుత్వా అధికారులు నిజాయితిగా పనిచేసి, అమాయకపు ప్రజలకు శిక్షలు పడకుండా, అసలైన దొంగలకు శిక్షలుపడే విధంగా చూడాలి.

2. బతుకు యుద్ధం :

ఊరిలో రెండు సంవత్సరాల నుండి వర్షాలు రాకపోవడంతో పంటలు లేక, పనులు దొరక్క, బతకడానికి పట్టణం చేరితే, అక్కడ సరైన పనులు దొరక్క, చివరికి రైతులు దారిదోపిడి దొంగలుగా మారిన విధానం రచయిత డా॥ ఎం.హరికిషన్ ఈ కథలో తెలియజేశాడు.

రఘురాంకి మిలటరీలో ఉద్యోగం రావడంతో ఊరు వదిలి వెళ్ళిపోయాడు. కొన్ని రోజులకు తండ్రి చనిపోవడంతో, ఊరిలో ఉన్న భూమిని అమ్ముకొని వాళ్ళ

అమ్మను తనతో తీసుకెళ్ళిపోయాడు. మిలటరీ నుండి రిటైర్డ్ అయిన తరువాత కూడా ఊరికి రాలేదు. ఒక బ్యాంకులో ఉద్యోగం సంపాదించి సికింద్రాబాద్ డిఫెన్స్‌కాలనీలోనే నివాసం ఉన్నాడు. దాదాపుగా రఘురాంకి ఊరితో పది సంవత్సరాల నుండి సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. మళ్ళీ ఇన్ని రోజులకు తన మిత్రుడి కూతురి పెళ్ళి నందికోట్కూర్‌లో ఉండటంతో హైదరాబాద్ నుండి బస్సులో బయలుదేరి వస్తున్నాడు. రాత్రి పదకొండు గంటల సమయంలో దారి మధ్య దారిదోపిడి దొంగలు బస్సు అద్దాలను పగలగొట్టి, బస్సులోకి ప్రవేశించి జనాన్ని కత్తులతో బెదిరించి, ఎదురు తిగిరిన వారిని కట్టెలతో బాది నగలు, ఉంగరాలు, గొలుసులు, వాచీలు, డబ్బులను దోచుకొని బస్సునుండి వేగంగా దిగిపోతున్నారు. చివరిగా దిగిపోతున్న దొంగను రఘురాం వెనుకనుండి గట్టిగా పట్టుకున్నాడు. ఆ దొంగ విడిపించుకోవడానికి పెనుగు లాడటంతో దొంగ మొహానికి ఉన్న గుడ్డ తొలిగిపోయింది. మసక వెలుతురులో దొంగ మొహం చూసిన రఘురాం 'నువ్వా' అని ఆశ్చర్యంతో చేతి పట్టును సడలించాడు. దాంతో దొంగ విడిపించుకొని వేగంగా పారిపోయాడు.

రఘురాం నందికోట్కూరు పెళ్ళికి వెళ్ళిన ఆ పెళ్ళిలో కూడా ఆ దొంగ రూపమే పదేపదే గుర్తుకు రాసాగింది. ఆ రూపం తన చిన్ననాటి మిత్రుడు గోవిందయ్యది. అసలు వాళ్ళకి ఏమైంది? ఎందుకు ఈ విధంగా మారారు అనే ఆలోచనలతోనే పెళ్ళిని ముగించాడు. ఊరికి వెళితే అసలు విషయం తెలుస్తుందని నందికోట్కూరు నుండి డోన్ దగ్గర ఉన్న తన సొంతూరికి వెళ్ళాడు. ఊరిబయట పొలాలన్ని నిర్మానుష్యంగా కనిపించాయి. అక్కడక్కడ మనుషులు మాసిన గడ్డాలతో, నల్లబారిన ముఖాలతో, కరిగిన ఒంటితో కనిపించారు. పశువులు డొక్కలు ఎండిలోపలికి పీక్కుపోయి కనిపించాయి. ఊర్లో చాలా ఇళ్ళు తాళాలతో కనిపించాయి. ముసలివాళ్ళు, పిల్లలు తప్పా యువకులు ఎవ్వరు ఊర్లో కనిపించలేదు. రఘురాం ఊర్లో నడుస్తూ వెళ్తుంటే ఒకచోట తన చిన్ననాటి మిత్రుడు సుంకన్న కనిపించాడు. సుంకన్నతో పాటు నులకమంచంపై కూచోని ఊర్లో విషయాలు ఒక్కొక్కటి అడిగి తెలుసుకుంటున్నాడు రఘురాం. అదే సమయంలో కృష్ణారెడ్డి వచ్చి రఘురాంని పలకరించివెళ్ళాడు. సుంకన్న కృష్ణారెడ్డిని గురించి వీడు కులరాజకీయాలు ఉపయోగించి ఊళ్ళో కాంట్రాక్టులన్నీ కొట్టేస్తూ కరువుకాలంలో కూడా పచ్చగా ఉన్నాడు. అంతేకాదు వడ్డీల మీద వడ్డీలు వేస్తూ జనాన్ని పీక్కొని తింటున్నాడు. పాపం శంకరప్ప వీడి అప్పుకట్టలేక, అవమానంతట్టుకోలేక, పొలంలో చింత చెట్టుకు ఉరివేసుకొని చనిపోయాడు. ఇంకా ఎంతమంది ఉసురుతీస్తాడో వీడు అంటూ కృష్ణారెడ్డి దుర్మార్గాలను గురించి చెప్పాడు. ఆ మాటలు వినేసరికి రఘురాంకి మనసంతా అదోలా అయిపోయింది.

రఘురాంకి పదేపదే బస్సు సంఘటన గుర్తుకు వస్తుండటంతో సుంకన్నకు బస్సు సంఘటన చెప్పకుండా, అవును చిన్నప్పుడు మనతోపాటే చదువుకున్న బలిజగేరి గోవిందయ్య ఎలా ఉన్నాడు? చాలా రోజులయా చూడక అన్నాడు. దానికి సుంకన్న ఇంకెక్కడి గోవిందయ్య మూడు సంవత్సరాల కిందట ఊరివిడిచి వెళ్ళినోడు ఇంతవరకు ఇటువైపు తిరిగిచూడలేదు. "ఏం ఏమైంది" అని రఘురాం ఆత్రుతగా అడిగాడు. సుంకన్న నువ్వు ఊరు విడిచిన మూడు సంవత్సరాలకు వరసగా రెండు సంవత్సరాలు కరువు వచ్చి దెబ్బకొట్టింది. మూడో సంవత్సరం మొదట్లో వాన బాగా కురిసే సరికి గోవిందయ్య తన కూతురికి పెళ్ళి చేయాలని తన పదెకరాలతో పాటు మరో పదెకరాలను ముందస్తు గుత్త ఇచ్చి కౌలుకు తీసుకున్నాడు. అప్పుచేసి విత్తనాలు, ఎరువులు వేశాడు. కానీ అవసరమైన సమయంలో వర్షంరాకపోవడంతో, కండ్ల ముందు పంట ఎండిపోతుంటే చూడలేక మళ్ళీ అప్పుచేసి బోరు వెయించాడు. ఆ బోరు నీళ్ళు చిన్న పిల్లలు ఉచ్ఛపోసిన విధంగా కొన్ని రోజులు వచ్చి ఆగిపోయింది. గోవిందయ్యకు చేసిన అప్పులు తీర్చడం కష్టంగా మారడంతో తనకున్న పదెకరాల పొలంలో ఐదెకరాల పొలం అమ్మి, అప్పు తీర్చి, మిగిలిన డబ్బుతో

కూతురి పెళ్ళిచేశాడు. మిగిలిన ఐదెకరాల పొలం ఊరి బయట ఫ్యాక్టరీ రావడంతో అందులోకి వెళ్ళిపోయింది.

ఊరి బయట భూములన్ని ఫ్యాక్టరిలోకి పోగానే ఊరిలో భూముల రేట్లు కొండెకి కూచున్నాయి. గోవిందయ్య వచ్చిన డబ్బుతో భూమిని కొనలేకపోయాడు. కొడుకు చెప్పినట్లు వ్యాపారం చేశాడు. మొదట్లో వ్యాపారం బాగా సాగి డబ్బులు బాగారావడంతో ఉన్న ఒక్క కొడుకు జల్సాలకు మరిగి ఒకరోజు మందుతాగి బైకుతో ఎడ్లబండిని ఢీకొట్టాడు. నెలరోజులు ఆసుపత్రిలో ఉండి ఆఖరికి ఒంటికాలితో ఇంటికి వచ్చాడు. ఉన్న డబ్బులన్నీ ఆసుపత్రికే ఖర్చవడంతో గోవిందయ్య పరిస్థితి మళ్ళీ మొదటికి వచ్చింది. ఊర్లో భూమి లేకపోవడంతో గోవిందయ్యకు అప్పు కూడా పుట్టలేదు. ఊర్లో గంజినీళ్ళకు కూడా కష్టంగా మారడంతో పెండ్లాం, పిల్లలను తీసుకొని టౌన్‌కి వెళ్ళిపోయాడు. ఇంతవరకు వాడి మొహం చూసింది లేదు అని సుంకన్న గోవిందు గురించి రఘురాంకి చెప్పాడు. రఘురాంకి నెమ్మదిగా విషయమంతా అర్థంకాసాగింది. మాటల్లోనే సాయంకాలం కావడంతో రఘురాం బయలుదేరాడు. బస్సు సంఘటనను సుంకన్నకు చెప్పాలని నోటి దాకా వచ్చినా అది చెప్పకుండా వెళ్ళిపోయాడు. డోన్ రైల్వేస్టేషన్‌లో రఘురాంకి నగరానికి పనికోసం వెళ్ళిలోకల్ ట్రైన్‌లో తిరిగి ఇంటికి వస్తున్న జనాలు కనిపించారు. రఘురాంను ఊరి గురించే ఆలోచనలు వెంటాడుతునే ఉన్నాయి.

"మంచీచెడూ, నీతి అవినీతి, ధర్మం అధర్మం ---- ఇట్లాంటివన్నీ కడుపు నిండినోళ్ళ ఆలోచనలే ---- కానీ బతకడమే యుద్ధమైనచోట --- అనే ప్రశ్నలు రఘురాంను గోవిందయ్య, సుంకన్న, శంకరప్పలు చుట్టూమూగి అడుగుతున్నట్లు అనిపించింది అంటూ కథకు ముగింపునిచ్చాడు రచయిత.

ప్రజలు ఒక పక్క వర్షాలు లేక కరువులతో అల్లాడుతుంటే మరో పక్క రాజకీయనాయకులు దౌర్జన్యంతో ఫ్యాక్టరికి భూములను లాక్కోవడం, రైతులకు భూములు లేకుండా చేయడం, అప్పులు ఇచ్చినవారు వడ్డీలమీద వడ్డీలు వేసి రైతుల నడ్డి విరిచేయడం, చివరికి ప్రాణాలనే తీసుకునే విధంగా అవమానించడం ఈ కథలో కనిపిస్తుంది. మూడు సంవత్సరాల నుండి వర్షాలు సరిగపడక, ఊర్లో బతకలేక రైతులు పట్టణానికి వలసలు వెళ్ళిపోతే, అక్కడ కూడా పనులు దొరక్క, చివరికి దారిదోపిడి దొంగలుగా మారడం ఈ కథలో రచయిత తెలియజేశాడు. రైతులకు ఎప్పుడు ఒకరికి అన్నం పెట్టడమే తెలుసు, ఇంకొకరిని కొట్టి లాక్కోవడం తెలియదు. తమ డొక్కలు ఎండిపోతున్న పస్తులైనా ఉంటారు గానీ ఎలాంటి దొంగ పనులు చేయరు. కానీ ఈ కథలో రైతులు దారిదోపిడి దొంగలుగా మారిన విధానం కనిపిస్తుంది. వ్యవసాయం తప్పా మరే పని తెలియని రైతులు దారి దోపిడి దొంగలుగా మారడానికి ఎన్ని పరిస్థితులు దారితీశాయో అంటూ రచయిత తన కథలో తెలియజేశాడు.

ఈ రెండు కథలను చూసినప్పుడు మనకు రెండు కథల్లో వర్షాలు లేక కరువులు వచ్చి వలసలు వెళ్ళిపోవడం, ఆకలి బాధకు రైతులు దొంగలుగా మారడం కనిపిస్తుంది. మొదటి కథలో రైతు పశువుల ఆకలి తీర్చడంకోసం దొంగగామారితే, రెండవ కథలో తన కుటుంబ పోషణ కోసం దొంగగా మారడం కనిపిస్తుంది. వేరే ప్రాంతాలలో కరువు పిలిస్తే పలుకుతాది, రాయలసీమలో 'పిలవకున్నా పలుకుతాది' అనే నానుడికి ప్రత్యక్ష సాక్ష్యాలు ఈ కథలు. మెట్ట ప్రాంత రైతుల కష్టాలను, కరువులు వస్తే వారు పడే బాధలను తమవంతు బాధ్యతగా ఈ కథలలో రచయితలు తెలియజేశారు.

ఆధార గ్రంథాలు :

1.భారతదేశంలో కరువు, కాటకాలు – అనువాదం : ఈమని శివనాగిరెడ్డి, ఆంగ్లం : డా.వి.వి.కృష్ణశాస్త్రి
2.రాయలసీమ కరువు కథలు – డా॥ ఎం.హరికిషన్

****

ఒంటెద్దు రామలింగారెడ్డి గారి ఆధుని భారతం 'అవినీతి పర్వం' - సింహావలోకనం

యస్. విద్యాసాగర్, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆత్మకూరు, కర్నూలు జిల్లా
సెల్: 9441082599

కేంద్ర ప్రణాళికా సంఘం "అవినీతి మొత్తం సామాజిక జీవనంలో భాగమైపోయింది. అవినీతి ఉద్యోగులను గుర్తించి త్వరిత గతిన దోషులను శిక్షించే విధానాలు చేపట్టాలి" అని చెప్పడం చూస్తే అవినీతి ఏ స్థాయిలో వుందో, దాన్ని రూపుమాపేందుకు కఠినంగా వ్యవహరించాలన్న నిర్ణయానికి రాక తప్పదు. జాతీయ నాలెడ్జ్ కమీషన్ సైతం " ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధి పొందడం, జనన మరణాల ధృవపత్రాలు తెచ్చుకోవడం, నివాస ధృవీకరణ, పాస్‌పోర్టు, భూమిహక్కులు వంటి పత్రాలు పొందడం వంటివి తేలికగా, ముడుపులతో పనిలేకుండా సాగాలి" అని చెప్పడం అవినీతి నిర్మూలనకు ఒక పరిష్కారంగా భావించవచ్చు. సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న అవినీతిని చూడలేక, సమాజంలో మార్పు తీసుకురావడానికి చాలామంది సాహితీవేత్తలు ప్రయత్నాలు చేస్తూనే వున్నారు. అలాంటి సాహితీవేత్తల్లో కడపజిల్లాకు చెందిన విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు, అనంతపురం జిల్లాలో స్థిరనివాసం ఏర్పరచుకొన్న పద్యకవి ఒంటెద్దు రామలింగారెడ్డిగారు, పద్యసాహిత్యం ద్వారా అవినీతి వ్యవస్థపై తనదైన శైలిలో విమర్శా బాణాలను ఎక్కుపెట్టి, సంఘసంస్కరణకు తన భావాజాలాన్ని తోడు చేస్తున్నారు.

ఒంటెద్దు రామలింగారెడ్డిగారు కడప జిల్లా, లింగాల మండలం, మురారిచింతల గ్రామంలో ఒంటెద్దు చిన్నపరెడ్డి, ఒంటెద్దు లక్ష్మిదేవిగార్లకు జన్మించారు. ఆంధ్రసారస్వత విశారద, డిఓఎల్, బి.ఓఎల్. విద్యలను అభ్యసించారు. ప్రొద్దుటూరులోని శ్రీమలయాళస్వామి తెలుగు పండిత శిక్షణ కళాశాలలో తెలుగుపండిత కోర్సును పూర్తిచేశారు. తెలుగు పండితుడుగా ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించి ఉప్పలూరు, తాళ్ళప్రొద్దుటూరు, సింహాద్రిపురం, కోమనూతల, వెలిదండ్ల ఉన్నత పాఠశాలలో పనిచేసి పదవీ విరమణ పొందారు. 2010లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు.

నేటి ఆధునిక సమాజంలో ఉన్న సామాజిక రుగ్మత, సంఘంలో మందులు లేని చీడ అవినీతి అన్నది నిర్వివాదాంశం. సమాజంలో ప్రతి వ్యవస్థలోనూ వేళ్ళూనుకొని సమాజాభివృద్ధికి పెద్ద అవరోధంగా అవినీతి నిలుస్తోందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. మనదేశంలో దాదాపు మూడోవంతుమంది అవినీతిపరులేనని, సగం మంది మధ్యస్థంగా ఉన్నారని నివేదికలు తెలియజేస్తున్నాయి. ప్రజల్లో విలువలు కొరవడే కొద్దీ అవినీతి పెరిగిపోవడాన్ని నిస్సహాయంగా చూడాల్సి వస్తోంది. ఒకనాడు అవినీతిపరుల పట్ల సమాజానికి తృణీకార భావన వుండేది. అదిప్పుడు లేదు. సమాజం వారిని ఆమోదిస్తున్నది. డబ్బు వుంటే గౌరవంగా చూస్తున్నారు. ఆ డబ్బును ఏ విధంగా సంపాదిస్తున్నారన్నది ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. "మనదేశంలో ఇంకా నూటికి 20 శాతం మంది నిజాయితీ పరులున్నారు. వీరు ఏ ప్రలోభాలకు లొంగనివారు. వారికి అంతరాత్మ అంటూ వుంది" అని సెంట్రల్ విజిలెన్స్ కమీషనర్ ప్రత్యూష్ సిన్హాగారు పేర్కొనడం కొద్దిమంది అయిన నిజాయితీ పరులు వున్నారనడానికి సాక్ష్యంగా చెప్పవచ్చు. అయితే మన సమాజంలో విలువలతో బ్రతికే వాడిని రూల్స్ రామానుజం అంటూ గేలిచేస్తున్నారు. వారికి స్థైర్యాన్ని, మనో ధైర్యాన్ని కల్పిస్తే మరింతమంది నిజాయితీ పరులుగా మారే అవకాశం వుంటుంది.

ఒంటెద్దు రామలింగారెడ్డి రచనలు :

శ్రీజానకీ శతకము, శ్రీభద్రాద్రి రామ శతకం, శిష్యశతకం, ప్రబోధాశ్రమం, శ్రీమద్రామాయణ పాత్ర విశ్లేషణ ఇత్యాది మొదలుకొని 25 పుస్తకాలు వరకు రచించారు. అందులో 15 ముద్రణకు నోచుకున్నాయి. సమాజంలో రోజురోజుకు అధికమవుతున్న అవినీతిని చూసి, చలించిపోయి, అవినీతిని అంతమొందించడానికి ప్రజలను చైతన్యవంతం చేయడానికి పద్యకవిత్వాన్ని అస్త్రంగా ఎంచుకున్నారు. సమాజంలో అవినీతి విస్తరించ డానికి రాజకీయనాయకులే ప్రధానకారణమని, వారికి ఉద్యోగులు సహకరిస్తున్నారని ప్రస్తుతం ఈ జాఢ్యం అన్ని రంగాల్లోనూ విస్తరిస్తోందని, కానీ అన్నివర్గాల వారిని మార్చకపోయినా, కొద్దిమందినైనా చైతన్యవంతం చేసి అవినీతి నిర్మూలనకు సాహిత్యం ద్వారా తనవంతు సహకారం అందిస్తానని వినమ్రంగా చెబుతాడు శ్రీ ఒంటెద్దు రామలింగారెడ్డిగారు తన "ఆధునిక భారతం – అవినీతి పర్వం" పద్యకావ్యంలో.

శ్రీ ఒంటెద్దు రామలింగారెడ్డిగారి "ఆధునిక భారతం – అవినీతిపర్వం" నాలుగు ఆశ్వాసాల పద్యకృతి. సామాన్యం నుంచి అనేక అంశాలు ఇందులో వస్తువులుగా చేర్చి అవినీతి రంగాలను గురించి ఒక్కొక్కటిగా వివరించే ప్రయత్నం చేశారు. ప్రాచీన పద్యసాహిత్య విధానాన్ని అవలంబించినా ఎన్నుకున్న వస్తువు మాత్రం ఆధునికం. ఇష్టదేవతా స్తుతి, సుకవి స్తుతి చేసిన తర్వాత వస్తునిర్దేశాన్ని 12 పద్యాలలో సూటిగా చెప్పారు.

"పతనావస్తకు చేరిన వి
తత ప్రజాస్వామ్య స్థితికి వేదన దెలుపన్
మతిదలచితి నానేర్చిన
గతిజెప్పుదు కథ విధాన క్రమమెట్టిదనన్" అంటూ

అవినీతి రక్కసి లేని భారతం ఎలా వుందే మనకళ్ళ ముందుంచే ప్రయత్నం చేస్తూ, రాను రాను అవినీతి ఎలా తీవ్రరూపం దాల్చిందో వివరించారు.

"యథారాజా: తథా ప్రజ:" అన్న ఆర్యోక్తిని ఆవహించిన అవినీతిభూతంలో ఇలా వివరించారు.

"రాజకీయమెల్ల అంకయి సామాన్య
ప్రజలకెల్ల హేయ భావమయ్యె
నేతలందు లేని నీతి మాకేలని
ప్రజలు నీతిమాట మరచినారు" అంటూ పాలకులు

ఎలా వక్రబుద్ధితో ఆలోచిస్తూ, అవినీతికి పాల్పడుతున్నారో, వారిని అనుసరిస్తూ ప్రజలు కూడా ఎవరు ఏమైతేనేమి? నేను బాగుడపడితే చాలని, జనం–మనం అన్న మాటలను మరచి నేను అన్న స్వార్థానికి పరిమితమయ్యారంటూ ఆవేదన చెందారు.

రెవిన్యూకార్యాలయం గురించి మనందరికీ తెలిసిందే. మండలాల్లో అయితే తహశీల్దారు కార్యాలయం, నగరం లేదా మున్సిపాలిటీ అయితే మున్సిపల్ కార్యాలయాల్లో పుట్టిన దగ్గర నుంచి చచ్చేవరకు అన్ని రకాల జనన, కుల, ఆదాయ, మరణ ధృవపత్రాలకోసం వాటిచుట్టూ ప్రదక్షిణ చేసి, అంతో ఇంతో లంచం ఇవ్వందే పనులు జరగవని. ఇలాంటి వాటిని చాలా దగ్గరగా గమనించిన రామలింగారెడ్డిగారు "రెవిన్యూ విభాగం" శీర్షికలో చాలా కఠినమైన వాస్తవాలు చెప్పారు. ఇంటిపెద్దచనిపోయి భార్య పుట్టెడు దు:ఖంలో వుంటే, ఆ యజమాని చనిపోయినట్లు తహశీల్దారు కార్యాలయంలో ఇచ్చే ధృవపత్రంకోసం వెళితే ద్వార పాలకుడి (అటెండర్) దగ్గర నుంచి ఆఫీసరు వరకు ఏమాత్రం దయచూపకుండా తమకు చిక్కినంత దండుకుంటున్నారని, అది కూడా బహిరంగంగానే అంటూ రెవిన్యూ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిని కుండలుబద్ధలుకొట్టినట్లు అక్షరీ కరించాడు. ఇలాంటి వారిని గురించి ఆయన తన కావ్యంలో

"మనిషిబోయి బాధ మల్లడి గొనుచుండ
బ్రతుకవలయు గాన ప్రజల కొఱకు

బ్రతకలేక బ్రతుకు బడుగు జీవుల గూడ,

కాసుకొఅకు వేచు కఠిన మతులు'' అంటూ నిందించాడు.

ప్రభుత్వ వైద్యరంగంలో నానాటికీ దిగజారుతున్న ప్రమాణాలను, ప్రయివేట్ వైద్యశాలల్లో నానాటికీ పెరుగుతున్న ధనదోపిడీని మన కళ్ళకు కట్టినట్లు చూపాడు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి పనికి ఒక్కోరేటు. రోగి బాధలను ఏమాత్రం పట్టించుకోకుండా, మానవత్వం మంటగలిసి పోతున్నా, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది మారరంటూ...

"బాధతోడ వారు పలవించు చుండగ
మానవత్వ మనెడి మాటలేక
లంచమడుగుటకును లజ్జింపరా మీరు
కరుడ గట్టి నట్టి కర్కశులుగ"
"చేయి జూచిన డాక్టరు చేయి జాచు
సూదివేసిన నర్సును సుంకమడుగు
మూత్ర రక్త పరీక్షల ముడుపు కద్దు
వార్డుబాయికి తప్పది వ్వక నెటులను" అంటాడు.

ఇక ప్రయివేట్ ఆసుపత్రులను గురించి చెబుతూ... చిన్న చిన్న రోగాలతో ప్రయివేట్ నర్శింగ్‌హోమ్‌లకు వెళితే, దాన్ని పెంచి పెద్దది చేసి, తమ నర్శింగ్‌హోమ్‌లో వున్న టెస్టులన్నీ చేసి, కేవలం తమ ఆసుపత్రికి అనుబంధంగా వున్న మందులషాపులోనే మందులు తీసుకోవాలని సూచిస్తూ మందుల్లో అనేక లాభాలను పొందుతున్నారని, ఇక గర్భవతుల విషయంలో మరీ దారుణంగా ప్రవర్తిస్తున్నారని, ప్రతినెలా క్రమం తప్పకుండా ఆసుపత్రికి వచ్చి, పరీక్షలు చేయించుకొని, మాత్రలు, టానిక్కులు వాడితే కాన్పు కష్టం కాకుండా జరుగుతుందని నమ్మబలికి, తీరా నెలలు నిండి ప్రసవానికి దగ్గరకు వచ్చినప్పుడు సాధారణ కాన్పుకాదని, ఆపరేషన్ చేయకుంటే తల్లీ, బిడ్డ ఇద్దరికీ ప్రమాదమంటూ హడావిడి చేసి, సిజేరియన్ ఆపరేషన్లు చేస్తున్నారన్న నిష్ఠుర సత్యాన్ని కళ్ళముందుంచాడు.

విద్యావ్యవస్థ అన్ని వ్యవస్థలకు మూలం. దేశంలో మంచి పౌరులుగా మెలగాలంటే ముందు మంచి విద్యార్థులుగా తీర్చిదిద్దబడాలి. అలాంటి విద్యావ్యవస్థలో సైతం అవినీతి తన కోరల్ని సాచి, విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. శ్రీ ఒంటెద్దు రామలింగారెడ్డి గారు విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు. అందుకే విద్యారంగం గురించి పూర్తిగా ఆయనకు తెలుసు. అందులో ఉన్న లోపాల్ని కూడా నిర్భయంగా ఎత్తిచూపాడు. ఉపాధ్యాయుల కాళ్ళకు బంధనాలువేసి, వారికి అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారని, అలాకాక మంచి బోధన పరికరాలు, తగిన కనీస వసతులు, బోధనకు మంచి స్వేచ్ఛ ఇస్తే కాన్వెంట్ల మోతలుండవని, పరీక్షా విధానం క్రమపద్ధతిలో జరగాలని ఆయన ఆకాంక్షించారు. ప్రశ్నాపత్రాలను ముందుగానే లీక్ చేయించుకొని కాన్వెంట్లు ర్యాంకులు తెప్పించుకొని విద్యార్థులకు వలవేస్తున్నారని ఇలాంటి సంస్కృతి పోతే ప్రభుత్వ పాఠశాలలో ధీటుగా వుంటాయంటారు.

"ఒజ్జలందున సామర్థ్య ముట్టిపడును
నూరుశాతము ఫలితాలు మారుమ్రోగు
మెచ్చుకొనవలె అవకాశమిచ్చిచూడు
మూతబడవలె కాన్వెంట్ల మోతలెల్ల" అంటూనే, ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో కొంతమంది లోపభూయిష్టంగా వున్నారని, అందుకు పదవతరగతి మూల్యాంకనమే ఉదాహరణగా చెబుతారు.

"పదవ తరగతి విద్యార్థి ప్రతిభయంత
పేపరుల దిద్దువారల పెన్నులందు,
వారి దయ జాలిపైన నాధారపడెడి
దీనస్థితివచ్చె ననుట వమానకరము" అంటూ అందులోని లోపాల్ని ఎత్తిచూపారు.

ఇంకా సమాజంలోని అనేక అంశాలైన పాఠశాల క్రీడలు, ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ళు, రక్షకభట, న్యాయ

వ్యవస్థలు, అడవుల సంరక్షణ, బస్సులు, సంతలు, బ్యాంకులు –వడ్డీవ్యాపారులు, మద్యపానం, ఆనకట్టలు, సినిమాలు, టీవీలు, పత్రికలు, గుళ్ళుగోపురాలు, పూజార్లు, కరణాలు, గురువులు–స్వాములు–బాబాలు గురించి, కట్నాలు – ప్రేమలు, పెళ్ళిళ్ళ గురించి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి, ఆటవెలది, తేటగీతి, కందం, సీసాల్లో అద్భుతంగా వాటిలోని లోపాల్ని వివరించే ప్రయత్నం చేశారు. అవినీతి వ్యవస్థలను దునుమాడాడు.

ఇందుగలదు అందు లేదను సందేహం లేకుండా అన్నింటా అవినీతిమయమైన సమాజం హెచ్చు మీరుతోందంటూ...

"ఇందు గలదందు లేదను
సందేహములేక నన్ని స్థాయిల యందున్
గ్రందుకొనియె నవినీతియె,
ఎందున్నదొ నీతిగానుపించ దెవరికన్"
"తెల్లవారలు దోచిరీ దేశమనుచు
వెడల నడిపిరి దేశంబు విప్లవముల
నల్లవారలు దోపిడీ నడచుటెట్లు?
ప్రజల కేదోపిడీలైన ఫలితమెకటే అని నిట్టూరుస్తూ,

అరవై సంవత్సరాల స్వతంత్ర్య దేశంలో ఇంకా పేదవారు కష్టాలు పడతుండటం అన్ని రంగాల్లో పేరుకున్న అవినీతేకారణమణి వివరిస్తూ, ప్రతిఒక్కరు అవినీతి రహిత దేశంకోసం పాటుపడాలని పిలుపు నిచ్చారు. సమాజంలో ఇలాంటి రచనలు చేయడం మరి సాహసమే. అలాంటి సాహసం చేసిన శ్రీ ఒంటెద్దు రామలింగారెడ్డిగారు ఆధునిక కాలంలో అభినవ సంఘసంస్కర్తే అనడంలో ఎలాంటి సందేహం లేదన్నది మా భావన.

ఆధార గ్రంథాలు

1. ఆధునిక భారతం 'అవినీతి పర్వం' – ఒంటెద్దు రామలింగారెడ్డి.
2. ఆంధ్రదేశంలో సంఘసంస్కరణోద్యమాలు – వి. రామకృష్ణ.

బెజ్జంకి శ్రీ లక్ష్మీ నరసింహ శతకం- సమీక్ష

గూడూరి శైలజ, తెలుగు ఉపన్యాసకురాలు, సిద్దిపేట, సెల్: 9703817390.

సిద్దిపేట జిల్లా కేంద్రం నుండి సుమారు 30 కి.మీ. దూరంలో గల బెజ్జంకి గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి పై రాసిన మొదటి శతకం బెజ్జంకి శ్రీ లక్ష్మీ నరసింహ శతకం. దీనిని రచించింది డా. దాశరథుల బాలయ్య గారు. మధ్యాక్కర ఛందములో రాయబడిన ఈ భక్తి శతకములో 100 పద్యాలు ఉన్నాయి. ఈ శతకాన్ని 2004 లో ముద్రించారు.

కవి పరిచయం :

సంస్కృతాంధ్రములలో ఉద్దండ పండితులు అయిన బాలయ్య గారు జులై 4, 1956న మిట్టపల్లి (సిద్ధిపేట తాలుకా) లో జన్మించారు. వీరి తల్లిదండ్రులు శ్రీమతి భూదేవి నర్సయ్య గార్లు. వీరు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి తెలుగులో ఎం.ఏ పట్టా పొందారు. 'భక్త రామదాసు జీవితం – రచనలు' అనే అంశం మీద ఎం.ఫిల్ చేసారు. ఈ క్రమంలో 198 రామదాసు కీర్తనలు సేకరించారు. తదనానంతరం రామాయణ, యక్షగానములు అను అంశం మీద పిహెచ్.డి చేసారు.

వీరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిద్దిపే లో తెలుగు ఉపన్యాసకులుగా, తెలుగు శాఖ అధ్యక్షులుగా విశేష సేవలందించి 2014 లో పదవీ విరమణ చేసారు. తెలుగు సాహిత్యములో అరుదుగా వినియోగించబడిన మద్ధ్యాక్కర ఛందములో, ఉదాహరణ ప్రక్రియలో రచనలు సాగించడంలో బాలయ్య గారు నిష్ణాతులు...

రచనలు:

శ్రీ సంగమేశ్వర వినుతి, బాసర జ్ఞాన సరస్వతి మధ్యాక్కరలు, కోటిలింగేశ్వర శతకం,(దీనికే శివసాక్షాత్కారం అని నామాంతరము గలదు) బెజ్జంకి శ్రీలక్ష్మీ నరసింహ శతకము అను నాలుగు శతకాలు రచించారు. ఇవేగాక ఆర్యశతి, శ్రీ దుర్గస్తవః అనే సంస్కృత గ్రంథాలు; అశ్రు ఖడ్గం అనే వచన కవితల సంపుటి; ప్రణయోత్సవం అనే తెలుగు రుబాయి కావ్యం; శ్రీరామచంద్రోదాహరణం, యాదగిరి శ్రీ లక్ష్మీ నరసింహోదాహరణం అను 2 కావ్యాలు ఉదాహరణ ప్రక్రియలో రచించారు.

శతక లక్షణముల విశ్లేషణ :

శతకమునకు ఉండే మొదటి నియమం సంఖ్యా నియమం. ఈ నియమం ప్రకారంగానే ఈ శతకంలో 100 పద్యాలు ఉన్నాయి. అలాగే ప్రతి పద్యపాదాంతంబులో "బెజ్జంకి శ్రీ నారసింహ" అనే మకుటాన్ని ఉంచి కవి మకుట నియమాన్ని కూడా పాటించారు. అదే విధముగ ఈ శతకములో పద్యాలన్నీ మధ్యాక్కర ఛందములో రాయబడినందున ఈ శతకము ఛందో నియమాన్ని కలిగి ఉందని చెప్పవచ్చు. ఈ శతకంలో ప్రతి పద్యము దేనికది స్వతంత్రం అయినందున ఈ శతకము ముక్తక లక్షణాన్ని కలిగి ఉందని. తెలపవచ్చు. అలాగే భావ ప్రధానం అయిన ఈ శతకములో కవి తన ఆత్మానుభూతిని వ్యక్తీకరించాడు.

ఈ శతకమందలి ప్రత్యేకతలు:

1) ప్రాచీన కాలంలో నన్నయ, ఎర్రనాదులచే ప్రయోగించబడిన మద్ధ్యాక్కర ఛందాన్ని ఆధునికయుగంలో కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు విరివిగా ప్రయోగించి అరుదయిన ఈ ఛందానికి బహుళ ప్రాచుర్యాన్ని కల్పించారు. విశ్వనాథ గారి సొగసయిన మధ్యాక్కరలను చదివి ప్రేరణ పొందిన బాలయ్య గారు దాదాపు వారి రచనలన్నింటిలో ఈ ఛందాన్నే వినియోగించారు. అయితే నాద సౌందర్యము గురించి బాలయ్య గారు ఈ శతకము లోని మధ్యాక్కరలలో ఒక చిన్న మార్పు చేసారు. ఆ మార్పు గురించి విశ్లేషించే ముందు సాధారణ మధ్యాక్కర లక్షణాలను పరిశీలించవలసిన అవసరము ఉంది.

మధ్యాక్కర లక్షణాలు:

మధ్యాక్కర జాతిపద్యము. ఇందు నాలుగు పాదాలు ఉంటాయి. ప్రతి పాదం లో 2 ఇంద్ర గణాలు, 1 సూర్య గణం, 2 ఇంద్ర గణాలు, 1 సూర్య గణము వరుసగా ఉంటాయి. యతి స్థానము నాల్గవ లేదా అయిదవ గణాద్యక్షరం (శ్రీమదాంధ్ర మహాభారత రచనలో నన్నయ మద్ధ్యాక్కరలను ప్రయోగించినపుడు యతిగా 4వ గణాద్యక్షరాన్ని నిలిపగా, ఎర్రన 5వ గణాద్యక్షరాన్ని యతిగా నిలిపాడు. అందువల్ల వీరిరువురి యతి నియమాలలో దేనినయిన ఒక దానిని పాటిస్తున్నారు తదనంతర కవులు) ప్రాస నియమము కలదు.

బాలయ్య గారి మధ్యాక్కర:

వీరు సాధారణ మధ్యాక్కర లక్షణాన్ని పాటించారు. కానీ యతి స్థానాన్ని మాత్రం మార్చారు. మొదటి 3 పాదాలలో యతిగా 4వ గణాద్యక్షరం యతిగా వాడి చివరి పాదం లో మాత్రం అయిదవ గణాద్యక్షరాన్ని యతిగా వాడారు. ఈ మార్పు నాద సౌందర్యం గురి చేయబడిందని కవీంద్రుడు **'నా మాట**'లో వినయంగా పేర్కొనడం జరిగింది.

2) ఈ శతకములోని చాల వర్ణనలు వివిధ నృసింహస్వామి క్షేత్రములను కూడా అన్వయించుకొనుటకు వీలుగానున్నవి. కనుక శ్రీ యాదగిరి నరసింహ! శ్రీ వేదగిరి నరసింహ! శ్రీ సింహగిరి నరసింహ! శ్రీ అహోబిల నరసింహ! అని ఆయా క్షేత్రస్వాములకు అనుకూలముగా మకుటమును మార్చుకొని ఈ పద్యములను చదువుకొన వచ్చును.

శతక సమీక్ష:

1. పూర్వ కవుల నుండి 'కృతిని శ్రీ తో ప్రారంభించడం' సాంప్రదాయము. దీనికి కొనసాగింపుగా బాలయ్యగారు కూడా తన శతకాన్ని శ్రీ తో ప్రారంభించారు.

శ్రీరమా హృదయాబ్జ భృంగ! బుషి జనార్చిత సుందరాంగ!
కారుణ్య జలధి తరంగ! గంభీర గరుడ తురంగ!
నీర రాశీ గర్వభంగ! నిత్యమర స్తుతి రంగ!
శ్రీరమ్య శీతలాపాంగ! బెజ్జంకి శ్రీ నారసింహ!

ఇది వీరి శతకములో తొలి పద్యము. ఇందున తొలిపాదము అలాగే చివరి పాదము కూడా శ్రీ తో ప్రారంభించబడుట విశేషము. ఈ శతకమందలి తొలి 7 పద్యాలలో కవి నృసింహ స్తుతి చేసారు.

2. పూర్వ కవులు తమ కావ్య అవతారిక అందున తమ వంశక్రమము గూర్చిన వివరాలు పొందుపరిచేవారు. అట్లే బాలయ్య గారు తమ ప్రవర గురించి శతకమందలి 73 వ పద్యమందు తెలిపారు.

మా నాయనమ్మ సీతమ్మ మాతాత సీతయ్య గారు
మానాన్న పేరు నీపేరె మాయమ్మ భుదేవి గారు
శ్రీనాథ! మాదు గోత్రమ్ము – శ్రీ వాలఖిల్య నాబడును.
చీని చీనాంబర భుష! బెజ్జంకి శ్రీ నారసింహ!

ఈ పద్యాన్ని బట్టి ఈయన శ్రీ వాలఖిల్య గోత్ర సంజాతుడని, వీరి నాన్నమ్మ సీతమ్మ, తాత సీతయ్య గారని తెలుస్తుంది. ఇక కవిగారి తండ్రి పేరు నీపేరె అని పద్యమందున తెలిపారు. అనగా నర్సయ్య అని అర్థము. (నరసింహ అనే పేరును నర్సయ్య అని నాటి కాలంలో జన వ్యవహారమున వాడుకలో ఉంది) ఇక బాలయ్య గారి తల్లి పేరు భూదేవి అని తెలుస్తుంది.

3. కవిగారు తన రచనల గురించి కూడా ఈ శతకములో పేర్కొనడం జరిగింది. వారి రచనల గురించి ఈ శతకమందు గల 76 వ పద్యాన్ని పరిశీలించాలి.

రామదాసుల కీర్తనములు–రమ్యమ్ము–శోధించినాడ
రామచంద్రోదాహరణము రాణ మీరగ వ్రాసినాడ
నే మున్ను బాసరేశ్వరిని నిద్దంపు మధ్యాక్కరలను
శ్రీ మించి వినుతించినాడ–బెజ్జంకి శ్రీ నారసింహ!

ఇందులో కవిగారు రామదాను కీర్తనలను శోధించినట్లుగా తెలిపారు. అలాగే రామచంద్రోదాహరణము మరియు బాసర సరస్వతిమాతను స్తుతిస్తూ మధ్యాక్కరలు రచించినట్లు తెలిపారు. ఈ పద్యములో బాసర సరస్వతి మాతను బాసరేశ్వరి అని సంభోదించారు.

4. బెజ్జంకి నృసింహాలయ ప్రాంగణాన్ని గూర్చిన సహజ సుందర వర్ణన

సుందరంబైన గోపురము సుందర ప్రాకారములును
సుందర రత్న మండపము సుందర కుడ్య చిత్రములు.
సుందర శిల్ప వైభవము – సుందర మందిరంబిదిగో!
చిందించు కాంతులెల్లపుడు బెజ్జంకి నారసింహా!
(13 వ పద్యము)

అందమయిన గోపురము, ప్రాకారములతో రత్న మండపమును కలిగి ఉన్న ఈ ఆలయము రమ్యమయిన కుడ్య చిత్రములతో చక్కని శిల్పసంపదతో నిత్యము కాంతులను వెదజల్లుతున్నదని అద్భుతంగా వర్ణించారు. ఈ పద్యము సులభ సుందరంగా తీర్చిదిద్దబడినది. ఇందున సుందర అనే పదమును విరివిగా వినియోగించారు కవిగారు.

5. బెజ్జంకి నృసింహ ఆలయ ప్రాశస్త్యాన్ని గూర్చి వివరించు పద్యము

పూతమైనట్టి నీ విష్ణు పుష్కరిణిన్ జేరి యెవడు
స్నాతుడౌనో వాడు బ్రహ్మ సాయుజ్యమందగా గలడు!
ప్రీతితో నీ కొండపైన నిదుర సేసిన వాని – భూత
ప్రేతాది బాధలు తొలగు–బెజ్జంకి శ్రీ నారసింహా!
(6 వ పద్యము)

పవిత్రమయిన ఈ సృసింహాలయ విష్ణుపుష్కరిణిలో స్నానమాచరించిన వారికి బ్రహ్మ సాన్నిధ్యము అలాగే భక్తితో నృసింహుడు కొలువయిన ఈ బెజ్జంకి కొండపయిన నిదురించిన వారికి భూత ప్రేతాది పీడలు బాధలు తొలగుతాయని ఈ పద్యములో కవి వర్ణించాడు.

6. ఆలయ మూలవిరాట్ వర్ణన:

ధగధగ– మణికిరీటంబు – ధగధగ – శంఖ చక్రములు
నిగనిగ– పట్టినామములు– నిగనిగ పట్టు దోవతీయు
బుగ బుగ– గంధవాసనలు – బుగబుగ– కపంపుతావి
జిగిమించి వెలుగొందు వాడ– బెజ్జంకి శ్రీ నారసింహా!
(14వపద్యము)

ధగధగలాడే మణికిరీటము, శంఖచక్రములు, నిగ నిగ లాడే పట్టె నామాలు, పట్టు దోవతియు ధరించిన స్వామి బుగబుగ వచ్చెడి సుగంధకర్పూర వాసనల మధ్య నుండి మనకు దర్శనమిస్తాడని కవి పై పద్యములో వివరించడము జరిగింది. ఈ పద్యము చదువుతున్నపుడు నిజముగనే మన ముందు బెజ్జంకి నృసింహుని రూపము సాక్షాత్కరిస్తుంది. అటులనే కవి ఇందున చక్కని శబ్ద సౌందర్యాన్ని ప్రదర్శించారు.

7. ఉగ్ర నృసింహుని వర్ణన– శబ్ద సౌందర్యం :

కన్నాడ నుగ్ర వదనము – కన్నాడ నుగ్ర నేత్రములు
కన్నాడు నుగ్ర దంష్ట్రలును – కన్నాడ నుగ్ర రూపంబు.
కన్నాడ వజ్ర నఖముల – కన్నాడ నన్ను కన్నయ్య!.
చెన్నోందు సిరిని కన్నాడ – బెజ్జంకి శ్రీ నారసింహా!
(15 పపద్యము)

ఉగ్రమయిన ముఖము, ఉగ్ర నేత్రములును, ఉగ్రమయిన దంతములను, వజ్రమయంబయిన గోర్లను గల మహోగ్ర నారసింహుని దర్శించానని కవి ఈ పద్యములో తెలిపారు. ఈ పద్యమున కన్నాడ అనే పదాన్ని విరివిగా ఉపయోగించుట విశేషము.

8. ఉషోదయ వర్ణన – అచ్చతెలుగు పదాల పోహలింపు :

తొలుగట్టు యెరుపు వారినది – తొలుకోడి కూత కూసినది
తొలుమిన్కు సద్దు చేసినది – తొగసూడు మించు మించినది
తెలిదుమ్మి విరియ బూసినది – తెమ్మెర వీచసాగినది
చెలువార తెలవారె లేర! బెజ్జంకి శ్రీ నారసింహా!
(9 వ పద్యము)

తొలి గట్టు, తొలికోడి కూత, తొలి మినుకు సద్దు, తొగసూడు, తెలిదమ్మి, తెమ్మెర, తెలవరె అనే అచ్చ తెలుగు పదాలతో రూపొందించిన ఈ పద్యంలో ఉషోదయ వర్ణన అత్యంత సహజ సిద్ధంగా కనబడుతుంది. పద్యపాదాంతంలో తెలవారె లేదా! అనే పద ప్రయోగము చేత ఇది మేలు కొలుపుగా ధ్వనిస్తుంది. ఈ విధంగా సహజ సిద్ధమైన ఉషోదయ వర్ణన చేస్తూ నరసింహ స్వామిని మేలుకొలపడం చాలా హృద్యంగా ఉన్నది.

9. నృసింహనామౌన్నత్యం – పదాడంబర శైలి విన్యాసం :

త్వన్నామ పంచాననంబు దండించు మత్వాత గజము
త్వన్నామ ప్రళయానిలంబు తరలించు మత్సాత ఘనము
త్వన్నామ దావానలంబు దహియించు మత్వాత వనము
చిన్నదా!నీ నామ మహిమ – బెజ్జంకి శ్రీ నారసింహ!
(12 వ పద్యము)

నృసింహ నామమనే సింహము పాపమనే గజాన్ని అనచునని, నృసింహ నామమనే ప్రళయాగ్ని పాపమనే దట్టమైన మేఘాలను తరమునని, నృసింహ నామమనే దావానలాగ్ని పాపమనే వనాన్ని దహించునని చక్కని ఉపమలతో నృసింహ నామౌన్నత్యాన్ని తెలియజేసారు బాలయ్యగారు. ఇందులో త్వన్నామా, మత్వాత అనే పదాలు పలుమార్లు పునరావృతం అవడం, ఇందులోని పదాల కూర్పు కవి గారి పదాడంబర శైలికి తార్కాణము.

10. హరి వర్ణన– తాత్త్విక చింతన :

మచ్చిత్త వనిలో చరించు మాత్సర్య మదగజ మొకడు
నిచ్చలు మోహ మృగంబు నెమ్మది చీకాకు పరుచు
చిచ్చులా క్రోధమన్ పులియు చిర్రెత్తు! వీని చెండాడ
చెచ్చెర సింగమై రార! బెజ్జంకి శ్రీ నారసింహ!
(21 వ పద్యము)

ఇందున మానవుని చిత్తాన్ని వనముతో పోల్చడం జరిగింది. అట్టి వనములో మాత్సర్యాన్ని మద గజముతో, మోహాన్ని మృగముతో, క్రోధాన్ని పులితో పోల్చి అట్టి మృగాలను దునుమాడుటకు సింగమై రమ్మని ప్రార్థించాడు కవి.

పద్యములో ప్రయోగించిన సింగం / సింహము అనే పదానికి హరి అనే అర్థమున్నది. హరి అనే పదానికి శ్రీమహావిష్ణువు అనే మరొక అర్థమున్నది. ఈ విధంగా హరి అను శబ్దమునకు గల సింహము, శ్రీమహావిష్ణువు అనే అర్థాలను స్వీకరించి ఈ పద్యాన్ని పరిశీలిస్తే ఇందలి ధ్వనులు తెలుస్తాయి.

అడవికి రాజు సింహము (హరి). ఆ సింహమే అన్ని మృగాలపైన అధికారము చేయగల సత్తా గలది. కావున మదగజాన్ని (మాత్సర్యం) , మృగాన్ని (మోహము), పులిని (క్రోధము) దునుమాడగలదు. ఇక హరి అనే పదానికి శ్రీమహావిష్ణువు అనే అర్థాన్ని స్వీకరించిన హరి అను నామమునకు గల వ్యుత్పత్తి సహేతుకం సంసారం హరతీతి హరిః అనగా కారణముతో పాటు సంసారమును హరించువాడని అర్థము. ఇలా పరిశీలిస్తే హరి (సింగము), మాత్సర్యం (మదగజము), మోహం (మృగము), క్రోధం (పులి) తో నిండిన సంసారం నుండి తప్పించగలడని అంతరార్థము. ఇట్టి ధ్వని గల్గిన ఈ పద్యము భారతీయ తాత్త్వికతకు నిదర్శనము.

ముగింపు:

సంస్కృత పదాడంబరము, అచ్చతెలుగు పదాల పోహలింపుతో నాద సౌందర్యము ఉట్టి పడేలా ఉద్యమైనా శబ్దాలంకారాలతో, ఉపమలతో బెజ్జంకి నరసింహస్వామి పైన దాశరథుల బాలయ్యగారు రచించిన బెజ్జంకి నరసింహ శతకములో భక్తిభావన తాత్త్విక చింతన ప్రతి పద్యములో ప్రద్యోతమవుతూనే ఉన్నాయి. ఇట్టి బెజ్జంకి నరసింహ శతకం సిద్దిపేట జిల్లా శతక సాహిత్యంలో ప్రథమ శ్రేణిలో నిలవగలదనుటలో సందేహము లేదు.

సంప్రదింపు గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య చరిత్ర – ద్వానాశాస్త్రి
2. బెజ్జంకి నారసింహ శతకము – డా. దాశరథులు బాలయ్య

వర్ణవ్యవస్థను నిరసించిన 'దళిత సాహిత్యం'

డా॥ దార్లపూడి శివరామకృష్ణ, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల– చింతపల్లి.
చరవాణి– 8374131985

భారతదేశం ఎన్నెన్నో ప్రత్యేకతలను కలిగి ఉన్నది. నైసర్గిక, భౌగోళిక, కుల, మత, జాతి, రాజకీయ ఇలా ఎన్నో.. ఎన్నెన్నో విభిన్నతల మధ్య తన మిగిలిన సమాజాలలో లేని కులం, వర్ణం వంటివి ఇక్కడ మాత్రమే 'సహజం' అనే స్థితి గల సమాజమిది. ఈ వర్ణాలు కూడా శాఖోప శాఖలుగా విస్తరించి ఉన్నాయనేది సత్యం. ఈ కారణంగా అనేక అంతరువులు, అసమానతలు ఏర్పడ్డాయి. ఋగ్వేదం పదవ మండలంలోని పురుషసూక్తంలో కుల విభజనకు సంబంధించిన ప్రస్తావనుంది. రామాయణంలో నాలుగు కులాల వివరణ ఉంది. భారతకాలం నాటికి నాలుగుగా (చాతుర్వర్ణ్యం మయాం స్ృష్టం) ఉన్న కులాలు ఆ తరువాత అయిదుగా, తదనంతరకాలంలో అనేకానేక ఉపకులాలుగా విభజించబడ్డాయి. నాటి సమాజం ఈ 'అయిదవ కులం' (పంచమ కులస్థులు) వారిని ఊరికి దూరంగా నెట్టి, నీచమైన వృత్తులు అంటగట్టి, వారిపట్ల అస్పృశ్యతను పాటిస్తూ వారిని కనీసం 'మానవులుగా' కూడా గుర్తించకుండా 'అంటరాని వారిగా' ముద్రను వేసింది. మనుషుల మధ్యకు సాటి మనుషులు కూడా రానివ్వని పాపం, నేరం తామేమి చేసామో వారికే తెలియదు. దీనికి కారణం 'కర్మ'లేనని ఓ తాత్వికతో కూడిన 'కర్మ సిద్ధాంతం'ను తెర మీదకు తీసుకు రావటం జరిగింది. ఈ వర్ణాశ్రమ ధర్మాలను పదిలంగా పరిరక్షించ వలసిందేనని రామాయణం (శంభూకుని వధ) శూద్రునికి తపస్సు చేసే హక్కు లేదని (మనుధర్మశాస్త్రం) వంటివి నిర్ణయించిన గ్రంథాలుగా ఖ్యాతి గడించాయి. కాలంలో నిరంతరాయంగా మార్పులు చోటు చేసుకుంటూ వస్తాయి. చరిత్ర క్రమేపి 'మార్పు'లకు లోనవుతూ అంటుంది. కాని... అంతరాలలో నిలిచిన 'తరతరాల అంతరం' అలానే ఉండి పోయింది. ప్రాచీనకాలం నుంచి భారతీయ సాహిత్యంలో వర్ణవ్యవస్థను నిరసించిన కవులున్నారు. కాని ఈ నిరసన 'భక్తి' మార్గంలో కొనసాగింది వేమన, పోతులూరి వీరబ్రహ్మం, అన్నమయ్య వంటి వారు అస్పృశ్యతా దురాచారాన్ని ఖండించారు. వేమన–

"మాల మాలగాడు మహిమీదనే ప్రొద్దు
మాట తిరుగువాడు మాలగాక
వాని మాలయన్న వాడెపో పెనుమాల" అని కులం కంటే గుణం గొప్పదనే భావాత్మకంగా చెప్పాడు. వీరబ్రహ్మం సహితం–

"పంచముడని నిను కించ పరచిరని బాధపడకురా
కక్కా
తిట్టిన నోరే పొగడుతున్నప్పుడు వదిలేనురా వారి తిక్క" అని అన్నారు. వర్తమానంలో ఈ దృశ్యం ఆవిష్కరించబడినా.. దాని వెనుక 'వారి' కష్టం, శ్రమ గుర్తింపబడుతున్నదా అనేది ప్రశ్న....?

మనదేశంలో సంఘ సంస్కరణోద్యమం ఆవిర్భావానికి ముందే తెలుగులో అస్పృశ్యతా నిరసన కవిత్వం వెలువడింది. 1909 సం॥లో 'ఆంధ్రభారతి' పత్రికలో ఓ అపరిచిత కర్త (పేరు లేదు– తెలియదు) 'మాలవాంద్రపాట' అన్న గేయంలో ఈ నిరసన కనిపిస్తుంది.

"అందారు పుట్టిరి హిందమ్మ తల్లికి
అందారు ఒక్కటై ఉండాలి సక్కంగా
అమ్మోరు దీవించి అయిశర్యమిచ్చును" (ఉపయోగించిన భాష కూడా గమనించదగ్గదే.) నాటికాలానికి ఇదో గొప్ప ముందుచూపుగానే చెప్పాలి. 1910లో గురజాడ వారు తను రాసిన 'లవణరాజు' కల అనే గేయంలో–

"మలిన దేహులనుచు

మలిన చిత్తుల కధిక కులముల

నెలనొనసంగిన వర్ణధర్మ

మధర్మ ధర్మంచే" అంటారు. 'మంచి అన్నది మాల అయితే మాల నేనగుదున్' అని కూడా నినదించారు. 1915లో మరిగిపూడి వెంకటశర్మగారు తన 'విరుద్ధభారతం' అనే పద్యకావ్యంలో (ఇది 'తొలి నిరసన కావ్యం' అనే వారున్నారు)–

"మాలలన పంచములటంచు మాదిగలని

శ్వపచులని చెప్పగరాని వారటంచు

మరియు జండాలురని తోడి మానవులను

దరిమి వేయుట సాంఘిక ధర్మమగునే" అనే వేదనను వ్యక్తం చేసారు. గాంధీ రంగ ప్రవేశం తరువాత జాతీయోద్యమం, అస్పృశ్యతా నిరసన జోరందుకున్నాయి. గాంధీజి 'హరిజన' అనే పదాన్ని వాడుకలోకి తెచ్చారు. (ఇది కూడా నిరసనకు గురయింది) గాంధీ పిలుపుతో ఎంతో మంది కవులు అస్పృశ్యత నిరసన కావ్యాలు రాసారు. గరిమెళ్ళ వారు తన 'మాకొద్దీతెల్లదొరతనం' అనే గేయంలో 'అంటు దోషము మాకు లేదండీ పాపమంటూ చాటుదాము రండి' అంటూ ప్రసిద్ధి పొందారు. 1926లో గరిమెళ్ళ రాసిన ఖండకావ్యంలో–

"అస్పృశ్యులని యొక అసదృశంబగుజాతి

నాదరింపక బైటకంపినాము

తలచుకొను కొద్ది హృదయములో దద్దమగుచు" అని వేదనను వ్యక్తంచేసారు. 1930 నుంచి హరిజనులు రంగ ప్రవేశం చేసి తమ సమస్యలను తామే గానం చేసుకున్నారు. కుసుమ ధర్మన్న, గుఱ్ఱం జాషువా, జాలా రంగస్వామి, నక్కా చినవెంకయ్య, బోయి భీమన్న, కలేకూరి, కొలకలూరి ఇనాక్ వంటి ఎందరెందరో తమ కలాలకు తమ వేదనలే వస్తువులుగా మార్చుకున్నారు. వీరిలో జాషువాదో ప్రత్యేకమైన పంథా. ఆయన జీవితం అంతా ఇటువంటి 'అస్పృశ్యత'లోనే గడిచిపోయింది. కాని.. ఆయనకు సమాజంపైన కోపం, కసి, పగ వంటివి లేవు. కలంలో కూడా ఆయన తన వేదనను, సమాజం మారవలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. ఓ సుస్థిరమైన స్థానం సంపాదించుకున్నారు. 'గబ్బిలం', 'ఫిరదౌసి', 'ముసాఫరులు' వంటి రచనలు జాషువాకు ప్రత్యేక వేదికను నిర్ణయించాయి.

"నా కవితా వధూటి వదనంబు నెగాదిగాజూచి, రూపురే

ఖామనీయ వైఖరులగాంచి భళి భళి యన్నవాడె, నీ

దేకులమన్న ప్రశ్న వెలయించి చివుక్కున లేచిపోవుచో

బాకున గ్రువ్వినట్లగును పార్థివ చంద్ర వచింప సిగ్గగున్" అనే ఆవేదన వ్యక్తం చేస్తారు. అంతేకాదు అలాంటి దళితున్ని చూసి "కసిరి బుసకొట్టు నాల్గు పడగల హైందవ నాగరాజు" అని వర్ణవ్యవస్థ క్రూరత్వాన్ని వెల్లడిస్తారు.

దళిత సాహిత్యం గురించి చర్చించుకొనే సమయంలో అసలు దళితులంటే ఎవరు అనే ప్రశ్నకు కూడా చోటు కల్పించుకోవాలి. దళిత అనే పదానికి సూర్యారాయాంధ్ర నిఘంటువు ఇచ్చిన అర్థాలు..

– ఖండించబడినది, ఛేదించబడినది, చీల్చబడినది

– వికసింపబడినది, విసిరివేయబడినది

– అర్ధి కృతము, సగము చేయబడినది

– నిక్షిప్తము, అటునిటు చిమ్మబడినది.

అర్థాలన్నీ ఖండించబడిన అనే దానికి దగ్గరగా ఉన్నాయనేది వాస్తవం. మరి దళితులంటే ఎవరు? కె.కె.ఆర్ "తరతరాలుగా అస్పృశ్యతకు గురై, మతం పేరిట, సాంస్కృతికంగా హీనంగా చూడబడి విద్యాసౌకర్యాలు కరువై సమాజంలో ఉంటూ కూడా ప్రధాన జీవన స్రవంతికి దూరమై, ఆర్థికమైన అణచివేతకు, శ్రమదోపిడికి గురైన" వారుంటారు. 1920– 1930 నాటికి దళితులు పంచమ, హరిజన అనే పదాలను తిరస్కరించటం మొదలుపెట్టారు. తమని తాము 'ఆది ఆంధ్రులుగా' పిలుచుకోవడం

ప్రారంభించారు. 1927లో గూడూరు రామచంద్రరావు నాయకత్వంలో విజయవాడలో 'పంచమ మహాసభ'ను నిర్వహించారు. ఈ సభలో భాగ్యరెడ్డివర్మ పంచమ పదాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. దాంతో ఆసభను 'ప్రథమ ఆది ఆంధ్ర మహాజన సభ'గా మార్చి నిర్వహించారు. 1933లో కుసుమధర్మన్న 'హరిజన శతకం'లో

"ఆలకింపుమయ్య ఆది హిందు

ఆలకింపుమయ్య ఆదియాంధ్ర

ఆలకింపుమయ్య మాలవర్య" అని పేర్కొంటూ, అలా ఎందుకు రాసారో 'హరిజనులు ఆంధ్రదేశంలోని వివిధ ప్రాంతాల్లో ఆది హిందువులు, ఆదియాంధ్రులు, మాలలు మొదలైన పేర్లతో పిలువబడు కారణంగా ఆయా ప్రాంతాల వారికి అవసరమని తోచినచో అందుకు అనుగుణంగా మార్చి చదువుకోవడానికి అని సూచనలో పేర్కొన్నారు. బొజ్జాతారకం సలింద్ర, కత్తి పద్మారావు వంటి కవుల తొలి రచనల్లో దళిత చైతన్యం కంటే, విప్లవ, హేతువాద చైతన్యాలు ఎక్కువగా దృశ్యమానమవుతాయి. అసలు సాహిత్యంలో 'దళిత సాహిత్యం' యొక్క ప్రవేశం. ఆవశ్యకతలను గురించి కె.కె.రంగాచార్యులు అంచనా ప్రకారం 'ఇటీవలి కాలం వరకు తెలుగు సాహిత్యంలో దళిత చైతన్యం ఒక ప్రత్యేకమైన పాయగాకనిపించదు. బలమైన సామాజిక, రాజకీయోద్యమాలు రావటం, ఇతర సమస్యలతో పాటు అందులో భాగం కావటం దీనికి కారణం కావచ్చు' నంటారు. (ఆధునిక సాహిత్య దళిత స్పృహ). ఈ నేపథ్యంలో దళిత సాహిత్యాన్ని పరిశీలిస్తే క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్దంలో బుద్ధుడిలో ప్రారంభమయిందని, కొందరు, మరికొందరు మహాత్మా జ్యోతిరావుపూలే (1827–1890), ప్రొఫెసర్ ఎ.ఎస్.ఎం. మాలో (1886–1957) ఆరంభమయిందని మరికొందరు విభిన్నమైన అభిప్రాయాలను వెలిబుచ్చారు. "దళితుల సామాజిక, ఆర్థిక సాంస్కృతిక విముక్తి కోసం పోరాడే శాస్త్రీయమైన దళిత సాహిత్యాన్ని రగిల్చి దళిత సాహిత్యానికి ఒక వెలుగు భూమికను అమర్చి సమగ్రమైన తాత్విక దృక్పథాన్నిచ్చిన వాడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్' అంటారు కలేకూరి ప్రసాద్ తన 'దళిత సాహిత్యం'లో. అయితే అంబేద్కర్ ముందు వారు చేసిన సేవ తక్కువది కాదని కూడా ఆయన అంగీకరిస్తారు.

సాహితీ ప్రక్రియలలో దళితుల సమస్యలను మొట్ట మొదటిగా చిత్రించిన భారతీయ నవల ముల్క్‌రాజ్ ఆనంద్ రచించిన 'అస్పృద్దుల్'. ప్రేమ్‌చంద్, రాగోర్లు తమ అనేక రచనల్లో అస్పృశ్యతను నిరసించారు. మహారాష్ట్రలో 70 దశకంలో ఉవ్వెత్తున లేచి మొత్తం సమాజాన్ని ఓ కుదుపు కుదిపిన 'దళిత పాంథర్స్' ఉద్యమం దళిత సాంస్కృతికోద్యమానికి అవగాహనను అందించదనే ఒప్పుకోవాలి. ఈ ఉద్యమ నాయకులందరూ 'రచయిత'లే కావటం విశేషం. ఈ ఉద్యమానికి అంబేద్కర్' స్ఫూర్తి మూలసూత్రం. అస్పృశ్యతను ప్రధానంగా తీసుకుని రాసిన మొదటి తెలుగు నవల 'హేలావతి'. 1913లో శ్రీ తల్లాప్రగడ సూర్యనారాయణ దీని రచయిత 1919లో వెంకట కవులు 'మాతృమందిరం' 1922 ఉన్నవ వారు రాసిన 'మాలపల్లి' వంటివి వచ్చాయి. ఆ తరువాత కాలంలో 1936లో ఆచార్య ఎన్.జి.రంగా 'హరిజన గాయకుడు', అడవి బాపిరాజు 'వరుడు', అంతటి నరసింహం 'ఆదర్శం' (1946) ఇల్లందుల రంగనాయకులు 'మల్లిక' (1950), వట్టికోట ఆళ్వారు స్వామి 'ప్రజల మనిషి' (1952), రంగనాయకమ్మ గారు రాసిన 'బలిపీఠం' (1962) (ఇది చలన చిత్రంగా కూడా వచ్చింది) వంటివి దళిత సమస్యలను బలంగా చిత్రించినవే. మహీధర 'కొల్లాయి గట్టితేనేమి' నుంచి 1984 దడాల చంటబ్బాయి రాసిన 'అంతులేని అమావాస్య' వరకు ఉన్నాయి. కథ,

నవల, కవిత, పద్యం, గేయం ఇలా అనేక రూపాల్లో కవులు, రచయితలు, రచయిత్రులు 'దళిత సాహిత్యం'ను పరిపుష్టం చేసారు. కలేకూరి ప్రసాద్ అన్నట్టుగా "కాలం రాజహంస, కాలం చంద్రవంక. కాలం చీకటి వెలుగుల పెనుగులాట. లక్ష కరిమేఘాలు చీకటి కాటుకను వర్షించనీ, మనది వెలుతురు పాట. మనది ఓడిపోయిన మానవుల తుది విజయగీతం. కథలై గీతాలై, నవలలై, రకరకాల సాహితీ రూపాలై దళిత ఆకాంక్ష వెల్లువగా వ్యక్తం కావాలి. దళిత ప్రజల కలల సాఫల్యానికి మనతరం నడుం కట్టాలి." ఆ దిశగా దళిత సాహిత్యం మరింతగా వెలుగులీనాలి.

ఆధార గ్రంథాలు:

1. దళిత సాహిత్యం – కలేకూరి ప్రసాద్ – తంగిరాల సోనీ బుక్‌ట్రస్టు–1993
2. తెలుగులో కవిత్వోద్యమాలు– తెలుగు అకాడమీ –2003

దళిత వాదం – కవిత్వం

డా॥ బి. వెంకటయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ తెలుగు, యం.వి.ఎస్. ఆర్ట్స్ & సైన్స్ కళాశాల (ఏ),
మహబూబ్‌నగర్ జిల్లా.

భారత దేశంలో కులం అనేది ఒక ప్రత్యేకమైన అంశం. ఇతర దేశాల్లో సమాజం వర్గ విభజనతో ఉంటే భారత దేశంలో వర్ణ విభజనతో ఉన్నది. దీనిని డా॥ బి.ఆర్. అంబేద్కర్ భారత దేశంలో జరిగినది శ్రమ విభజన కాదు శ్రామికుల విభజన అనీ అన్నారు. ఆర్యులు ఈ దేశంలోకి వలస వచ్చిన తర్వాత వృత్తి విభజనను వర్ణ విభజనగా మార్చివేశారు. వర్ణ వ్యవస్థను సమర్థించడానికి వేదాలు, స్మృతులు, భారత రామాయణాలు ఆలంబనగా చేసుకున్నారు.

ఋగ్వేదంలో దశమ మండలం పురుష సూక్తంలో వర్ణవ్యవస్థకు సంబంధించిన పునాది కన్పిస్తుంది. సృష్టికర్త బ్రహ్మ ముఖం నుండి బ్రాహ్మణులు, బాహువుల నుండి క్షత్రియులు, ఊరువుల నుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు జన్మించారని బ్రాహ్మణులు వ్రాశారు. శూద్రులను ఆస్తి, విద్య, సామాజిక గౌరవానికి దూరం చేశారు.

రామాయణంలో శూద్రుడై ఉండి తపస్సు చేసినందుకు రాముడు శంబూకుడి శిరస్సును ఖండించాడు. భారతంలో ఏకలవ్యుడు ద్రోణుడు నేర్పని విద్యకు తన బ్రొటన వ్రేలును కోల్పోవాల్సి వచ్చింది. భగవద్గీతంలో శ్రీకృష్ణుడు చాతుర్ వర్ణాలను గుణ కర్మలను బట్టి తానే సృష్టించానని ప్రకటించాడు. మనుస్మృతి చాతుర్‌వర్ణాన్ని ఉల్లంఘించలేని చట్టంగా ప్రకటించింది. ఒకవేళ ఉల్లంఘించినచో దారుణమైన శిక్షలను విధించింది. రానురాను వృత్తులు చేసేవారిని, ఆదిమ తెగలను, వైదిక మతమును అంగీకరించనివారిని పంచమవర్ణంగా మార్చడం జరిగింది. పంచములకు అస్పృశ్యతను ఆపాదించడం జరిగింది. కులాన్ని, అంటరానితనాన్ని వ్యతిరేకించడం కూడా సమాజంలో ప్రారంభమైంది.

బుద్దుడు వర్ణ వ్యవస్థకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశాడు. బసవడు 12 శతాబ్దంలో ఏ వర్ణము వాడైన శివభక్తుడైతే చాలు అని ప్రకటించాడు. 17వ శతాబ్దాంలో వేమన కుల దుర్మార్గాన్ని ప్రశ్నించాడు.

"మాల మాలకాడు మహిమీదనే ప్రొద్దు
మాట దిరుగువాడు మాలగాక
వాని మాలయన్న వాడెపో పెనుమాల" అని వేమన అన్నాడు.

పోతులూరి వీరబ్రహ్మం

"పంచముడని నిన్ను కించపరిచిరని బాధపడకురా కక్క
తిట్టిన నోరే పొగుడుచున్నప్పుడు వదిలేనురా వారి తిక్క"

అని తన శిష్యుడైన కక్కన్ని ఓదార్చాడు. క్రీ.శ. 1909లో ఆంధ్ర భారతి పత్రికలో మాలవాంద్ర పాట అనే గేయంలో అస్పృశ్యత నిరసన కనిపిస్తుంది.

"అందారు పుట్టిరి హిందమ్మతల్లికి
అందారు ఒక్కటై ఉందారి సక్కంగా"

భారతీయులందరు ఒకటిగా ఉండాలని ఈ గీతం బోధించింది.

1933లో రెండు దళిత కవిత్వ సంపుటాలు వచ్చినవి. అవి

1) మంగిపూడి వెంకటశర్మ రాసిన నిరుద్ధ భారతం,

2) కుసుమ ధర్మన్న హరిజన శతకం

మంగిపూడి వెంకట శర్మ దళితులపై సానుభూతితో కవిత్వం వ్రాశాడు.

"కాపురంబులు చేయగా చుట్టు గుడిసెలే
కాని లోగిళ్లు లెక్కకును లేవు
చెలిగి కట్టంగ మాసిన చింపి గుడ్డలే
కాని వల్వలు కొంచెమైనా లేవు
త్రావగ నూకల జావయు, గంజియే
కాని అన్నమును, శాకములు లేవు
సొగసుగా దాల్చగాజులు, పూసపేరులే
కాని బంగరు నగల్ లేనేలేవు
అకటా! మాహోర దారిద్ర్యమొకరికైనా
జాలి పుట్టింపదాయె నా శ్రీలులారా!

పై కవితలో దళితుల తిండి, బట్ట, అలంకరణ సామగ్రి చాలా మామూలుగా ఉండి దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న దృశ్యాన్ని చిత్రించారు.

కుసుమ ధర్మన్న దళితుడు కావడం చేత ఆయన కవిత్వంలో ఆవేదనతో పాటు ప్రతిఘటన కూడా కనిపిస్తుంది.

"మాలవాడని యవమానమ్ము గావించి
పంచముడని పరువు పారద్రోలి
ఆదిమాంధ్రుడవని సోదిచెప్పిరిగాదె
ఆలకింపుమయ్య హరిజనుండ"

ఇట్లా కవులు దళిత స్పృహతో మొదట్లో కవిత్వం వ్రాయడం కనిపిస్తుంది.

మహారాష్ట్రలో 'పూలే' 1873లో సత్యశోధక సమాజ్ అనే సంస్థను స్థాపించాడు. శూద్రుడు, అతిశూద్రుల జీవితాలలో మార్పు తీసుకురావడానికి శాయశక్తులా ప్రయత్నించాడు. కుల వ్యవస్థ బానిస వ్యవస్థ వంటిదని విమర్శిస్తూ గులాంగిరీ అనే పుస్తకాన్ని వ్రాశాడు. శూద్ర, అతిశూద్రుల కోసం పాఠశాలలను స్థాపించాడు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పూలె నడిచిన బాటలో దళిత అభ్యున్నతి కోసం ఉద్యమం నడిపాడు. పూలే, అంబేద్కర్ భావాలు అంబేద్కరిజంగా ముందుకు వచ్చింది. జాతీయోద్యమంలో గాంధీజీ హరిజన సమస్యను మతంతో మిళితం చేశాడు. హరిజనులు అని మతదృష్టితో అస్పృశ్యులను పిలిచాడు. కాని అంబేద్కరిజం ఇచ్చిన చైతన్యంతో దళిత కవులు హరిజనులు అనే పదాన్ని తిరస్కరించారు. దళితులు అనే పేరునే తాము వాడడం ప్రారంభించారు.

1973లో మహారాష్ట్రలో దళిత ఫాంథర్స్ అనే ఉద్యమంలో సాహిత్యంలో ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్‌లో 1968లో కంచికచర్లలో కోటేశు అనే దళితుడిని సజీవ దహనం చేశారు. 1985లో కారంచేడులో దళితులపై మారణకాండ జరిగింది. దళిత మహాసభ పేరుతో కత్తి పద్మారావు, బొజ్జతారకం కారంచేడు దళితుల ఆత్మగౌరవ పోరాటం నడిపారు. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో తెలుగు సాహిత్యంలో దళిత చైతన్యం ముందుకు వచ్చింది. దళిత కవులు దళిత చైతన్య కవిత్వం వ్రాయడం ప్రారంభించారు.

తెలుగు సాహిత్యంలో కుల వ్యవస్థను కవిత్వంలో జాషువా గారు ప్రతిఘటించారు.

"ముసలివాడైన బ్రహ్మకు పుట్టినారు
నలువురు కుమారులనుట విన్నాము గాని
పసరమునకన్న హీనుడభాగ్యుండైన
యైదవ కులస్తుడెవరమామ సవిత్రి"

ఈ కవితలో కుల వ్యవస్థ బూటకమనీ పంచముడనేది ఇంకా బూటకమనీ జాషువా వ్యంగ్యంగా ప్రశ్నించాడు. ఇది బ్రాహ్మణుల కల్పితమని అర్థం చేయిస్తాడు.

ఈ విధంగా దళిత స్పృహ నుండి దళిత ప్రతిఘటన, దళిత ప్రతిఘటన నుండి దళిత చైతన్యం వైపుకు దళిత కవిత్వం ప్రయాణించింది.

1980లో బొజ్జా తారకం గారు 'నది పుట్టిన గొంతుక' అనే కవితలో చరిత్రలో ఎంతో శ్రమ చేసినప్పటికీ దళితుడికి జరిగిన గుర్తింపు లేని అన్యాయాన్ని ప్రశ్నించాడు.

"నా గురించి కథలు లేవు
గాథలు లేవు
నాకై కవిత లేదు
నాకు చరిత లేదు
నాలుగు వేదాలలోంచి
నాలుగు పాదాలలోంచి
నన్ను తొలగించారు
కట్టలో నుంచి జారిన కట్టెలా
ఒక్కణ్ణే ఎక్కడో ఎండిపోయాను"

1981లో విప్లవకవిగా సలంద్ర విప్లవ చైతన్యంతో కుల వ్యవస్థపై బలమైన తిరుగుబాటు కవితను వ్రాశారు. 'దళిత మేనిఫెస్టో' అనీ ఆ కవితకు పేరు.

"నన్ను
నీ దేవుడి గుళ్లోకి రావొద్దన్నావు
సరే ఎలాగైతేనేమి
నేను నాస్తికుడినవ్వడమే బాగైంది
నన్ను
చదువుకోవద్దన్నావు
చదివితే నాలుక కోసెయమన్నావ్
వింటే చెవుల్లో
వేడి వేడి సీసపు లోహం పోయమన్నావ్
సరే ఎలాగైతేనేమ్
నీవెంతటి మూర్ఖుడివో
నీవెంతటి విశాల హృదయుడివో
నాకు తెలిసిపోవడమే బాగైంది
నన్ను
చచ్చిన శవాల దహన సంస్కారాలే చూసుకోమన్నావ్
సరే ఎలాగైతేనేమ్
మీ ప్రాణాలను కూడా
ఎలా పాతెయ్యాలో
నాకు తెలియడమే బాగైంది"

బ్రాహ్మణులు "మనుధర్మం" ద్వారా సమాజాన్ని విభజించారు. ఎవరు ఏ పనినైనా చేయవచ్చు అనేది కాకుండా ఎవరు ఏ పని చేయాలో శాసించింది మనుధర్మం. వృత్తిని సామాజిక గౌరవం, సామాజిక న్యూనతను ఆపాదించారు. ఉత్పత్తి కులాలను అవమానించారు మరియు అణచివేశారు. ఈ సామాజిక దుర్మార్గాన్ని జూలూరు గౌరీశంకర్ "పాదముద్ర" అనే కవితలో తీవ్రంగా నిరసించారు.

"అసలు ఏ వర్ణానికైనా
జన్మస్థానమొక్కటే
మనుషులు మనుషులుగా పుట్టక
మనువులై పుడితేనే ప్రమాదం
కొందర్ని పాదాలనించి పుట్టించే ప్రమాదం
మనిషి మనువైనప్పుడే జరిగింది"

శివసాగర్ దళితులను అణిచివేసిన పురాణ పాత్రల్ని తిరగేసి బలమైన స్వరంతో దళిత కవిత్వం వ్రాశారు.

"శంబూకుడు పెదాలమీద చిరునవ్వుతో
రాముణ్ణి వధిస్తున్నాడు
ఏకలవ్యుడు ద్రోణుని బ్రొటన వ్రేలును
గొడ్డలితో నరుకుతున్నాడు
బలి తన చిరుపాదాలతో వామనుణ్ణి
పాతాళానికి తొక్కేస్తున్నాడు
మనువు కళ్ళలో సూదులు గుచ్చుకొని
నాలిక తెగ్గోసుకొని చెవిలో సీసం పోసుకొని
శ్మశానంలో దొర్లుతున్నాడు
కాలం కసాయికత్తిమీద నిలబడి గర్జిస్తున్న ఛండాలుడు
శంకరునిపై నాలుగు వేటకుక్కల్ని ఉసిగొల్పుతున్నాడు
ఓహో! ఇప్పుడు నడుస్తున్న చరిత్ర
పరమ ఛండాల చరిత్ర!"

ఒకప్పుడు శంబూకుడు శూద్రుడై ఉండి తపస్సు చేయడాన్ని ఆనాటి వర్ణ సమాజం అంగీకరించలేదు. ఆనాటి

శ్రీరాముడి చేత శంబూకుడి శిరస్సును ఖండింపజేసింది. కాలం మారిపోయినప్పుడు సామాజిక విలువలు కూడా మారిపోతాయి. కవి మారిన విలువలను సమాజంలో నెలకొల్పడానికి ఎండ్లూరి సుధాకర్ ఈ క్రింది కవిత వ్రాశారు.

"వజ్రాలు తాపడం చేసిన బంగారు గిన్నెలో మట్టికాళ్ళు
సీతాదేవి శ్రద్ధతో అర్ఘ్యమిస్తోంది
రాముడు కాళ్లు కడిగి నెత్తిమీద చల్లుకొని
సింహాసనం దాకా నడిపించాడు
.....
శంబూకుడు సింహాసనం మీద నుండి
నల్లసూర్యుడై నవ్వుతుంటే
వర్తమాన వాల్మీకి తన దళితాయణంలో
మొదటివాక్యం ఇలా రాశాడు
దళితయుగం శంబూకుని రక్తస్వప్నం"

సౌందర్యాన్ని దళిత దృక్కోణం నుండి చూడడం దళిత కవి ఎండ్లూరి సుధాకర్ చేశారు. శ్రమ సౌందర్యమే దళిత సౌందర్యం. ఇంత వరకూ శ్రమకు దూరమైన వాళ్ల సౌందర్యాత్మకత తెలుగు కవిత్వంలో వచ్చింది.శ్రమలో వెలిగిన సౌందర్యాన్ని ఎండ్లూరి సుధాకర్ గారు తన కవితలో ఆవిష్కరించారు.

"ఓ నా చండాలికా
నీ వెండి కడియాల నల్లకాళ్లముందు
వెయ్యేళ్ల కావ్యనాయికలు వెలవెలబోతున్నారు
అలంకార శాస్త్రాలన్నీ
నీ పాటి మట్టి మెరుపుల ముందు బలాదూరే
నా జాతి పుష్పమా! నా నీలమణీ!
నీ అందాన్ని బహిష్కరించిన క్షణాలను
ఇవాళ నేను వశీకరించుకున్నాను
.....
నీ నెత్తిమీది ఇనుప గమేళం
విశ్వసుందరి కిరిటాన్ని సైతం వెక్కిరిస్తోంది"

దళిత కవులు అణచివేత, అన్యాయం, అవమానాలను ప్రశినస్తూ వాటి పునాదిని ధ్వంసం చేస్తూ నూతన మానవీయ సమాతా సమాజాన్ని కవిత్వంలో ఆవిష్కరించారు.

ఆధారా గ్రంథాలు :

1) చిక్కనవుతున్న పాట – సంపాదకులు – జి. లక్ష్మినర్సయ్య, త్రిపురనేని శ్రీనివాస్.
2) నల్లద్రాక్ష పందిరి – డా॥ ఎండ్లూరి సుధాకర్
3) దళిత గీతాలు – సం॥ జయధీర్ తిరుమల రావు
4) కులం పునాదులు – కత్తి పద్మారావు
5) దళిత సాహిత్యం – నేపథ్యం – డా॥ ఎస్.వి. సత్యనారాయణ
6) దళిత ఉద్యమ చరిత్ర – యాగాటి చిన్నారావు

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 8, August 2022 (Spl. Issue)
ISSN No.2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
Under Arts and Humanities Category

తెలంగాన ఉద్యమంలో పాట – భాషా సాహిత్యాంశాలు

డా॥ ఎన్. టీపిక, సహాయాచార్యులు, తెలుగుశాఖ, నాగార్జున ప్రభుత్వ కళాశాల(స్వ), నల్లగొండ

ప్రపంచ స్థాయిలో జరిగిన ఏ ఉద్యమంలోనైనా వాఙ్మయం పాత్ర అనిర్వచనీయమైంది. రూసో, వాల్టేర్ల రచనల ప్రభావం వల్ల ప్రెంచి విప్లవం వచ్చింది. అలాగే మాక్సింగోర్కి, టాల్ స్టాయ్ రచనలు రష్యా విప్లవానికి కారణాలయ్యాయని తెలుస్తుంది. మన భారతదేశ జాతీయోద్యమంలో కూడ వందేమాతరంలాంటి ఎన్నో గేయాలు రాసి ప్రజలను చైతన్య పరచిన వైతాళికులున్నారు. ఇటువంటి వైతాళికుల రచనల ప్రభావంతో నేటికీ అనేక ఆధునిక ఉద్యమాలు జరుగుతున్నాయి. ఆవిధంగా వచ్చిన ఉద్యమమే తెలంగాణ ఉద్యమం. ఆధిపత్యధోరణికి వ్యతిరేకంగా తమ మస్తిష్కాలను మధించి తెలంగాణా జాతిని తమ వాఙ్మయంతో సమైక్యపరిచి, ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడేలా చేసి, చివరికి ఘనమైన విజయాన్ని సాధించారు. ఆవిధమైన సారస్వతంలోని ప్రక్రియనే పాట. పాట అనే ప్రక్రియ మిగతా ప్రక్రియలకంటే భిన్నమైంది. ఎందుకంటే ఇది ప్రజల జన జీవనంలో నుండి వచ్చినంటువంటిది. ఇందులో వ్యావహారిక పదజాలమే, భావజాలమే ఎక్కువగా కనిపిస్తుంది. అందుకే ఈ ప్రక్రియ అతి సామాన్య ప్రజలకు కూడా చేరువకాగలిగింది. మాటకు, పాటకు, ఆటకు ఒక అవినాభావ సంబంధం ఉందని పిస్తుంది. అసలు పాటలేనిదే ఉద్యమం లేదనిచెప్పవచ్చు. తెలంగాణాలలో జరుగుతున్న రాజకీయ, సామాజిక ఆర్థిక విషయాల్లోని అణచివేతల్ని పాటరూపంలో ఉద్యమాన్ని ప్రజ్ఞావంతంగా ప్రజలకందించారు మన ప్రజా కవులు. ఆ విధంగా ఉద్యమస్ఫూర్తినిచ్చి ప్రజలకు చేరువై వారి నాలుకల మీద నడయాడిన కొన్ని పాటలలోని సాహిత్యాంశాలని భాషాంశాలని చర్చించుకుందాం. యూనివర్సిటీలే ఉద్యమానికి పట్టుగొమ్మలు అవడానికి కారణం ఏ ఉద్యమమైన నడిచేది యువకులతోనే సామాజిక సమస్యలకు ముఖ్యంగా స్పందించేది యువకులే. అలాంటి యువకులు స్పందించి రాసిన, పాడిన పాటలెన్నో ఉన్నాయి.

తెలంగాణ ఉద్యమ పాటల్లో దరువు ఎల్లన్న రాసి **"వీరులారా వందనం..."** అనే పాటలో కవి చారిత్రక పోరాట ఘనతలను ఊదహరిస్తూ, అదే చైతన్యాన్ని నింపుకొని సమకాలీన అసమానతలను నిరసిస్తూ, ఉద్యమిస్తున్న వీరులకు వందనాలు అంటారు. **"పోరుదండం పెడతం/ అగ్గిపిడుగూలైతం/ నిప్పు కణికలు/ నెత్తుటి మడుగుళ్ళ ఎత్తిండ్రు పిడికిళ్ళు / పాలబుగ్గల పసిడి మొగ్గాలు/ పొద్దు పొడుపుల్లో.."** మొదలగు వాక్యాల్లో వీర రసాన్ని ప్రేరేపించే సాహిత్య పదబంధాలను ప్రయోగించారు దండం = సమస్కారం, సాగనంపడం = చివరిదాకా వెళ్ళి తోలేసి రావడం మొదలగు మాండలికాలను, అగ్గి పిడుగులు, నిప్పు కణికలు వంటి రూపక సమాసాలు, గుండెపగులు అనే జాతీయం, సదువు, సావు అనే పదాల్లో చ,సల వినిమయం అనే తెలంగాణ భాషాంశాలు కనబడుతాయి. సామాన్య జనాలు వాడే జూసిండ్రు వాడిండు జూసూకుంటం, చెప్పు కుంటం వంటి తెలంగాణ భాషాక్రియలను ఉపయోగించారు.

జయరాజు రచించిన **"వానమ్మ వానమ్మ ఒక్క సారన్న వచ్చిపోవే వానమ్మ..."** అనే పాటలో తెలంగాణ పల్లెలన్నీ ఎండిపోతున్నాయి / సక్కాని మొక్కజొన్న ఎక్కెక్కి ఏడ్వ సాగే" అనే వాక్యాలలో పంటకు మానుషారోపణ చేసి వర్ణించడం కన్పిస్తుంది. "కరువింట్ల పీనుగెల్లా / నెర్రబారిన బ్రతుకులు" మొదలగు జాతీయాలు, ఎదిగేటి అంటే ఎదుగుతున్న అనే అర్థంతో శత్రర్థక వాక్యం కనిపిస్తుంది. ఎక్కెక్కి చెంగు చెంగున మొదలగు ధ్వన్యనుకరణ పదాలు తెలంగాణ పల్లెలోని బతుకు చిత్రాన్ని ప్రతిబింబిపజేస్తాయి.

వరంగల్ శ్రీనివాస్ రాసిన **"ఓయమ్మ నాపల్లెసీమ ఈనాడు ఎందుకింత చిన్నవాయే"** అనే పాటలో పుట్టెడు,

దమ్మిడి, పిశ్కిల్లు, బుక్కి, టిక్కటిక్క, ఆముదపు బుడ్లు, తొక్కు, పావురంగా, గుడాలు, ఇసిరెలు, ఇడుపులు, ఏడుతంతెలు, దీవెనార్తె, ఇగురెక్కడం మొదలగు పదాలన్ని అచ్చమైన తెలంగాణ భాషని చూపిస్తాయి. ఇందులో పిల్లాజెల్ల అనే పదబంధం, టిక్కటిక్క అనే ధ్వన్యనుకరణ పదాలు సహజ సుందరంగా కనబడుతాయి.

మిత్ర కలంలో, విమలక్క గళంలో నుండి జాలువారిన **"ఛలో ధూంధాం..."** అనే పాటలో **"మత్తడి దుంకి అలుగు తన్నుకొని పారినట్లు/నగార మోగినట్లు/ శివసత్తులు ఊగినట్లు తెలంగాణ జాతరొచ్చింది"** అని ఉత్ప్రేక్షించడం కనిపిస్తుంది. మత్తడి దుంకడంలోని ప్రవాహ శీలత్వం, నగారా మోగడంలో ఉత్కృష్టమైన ధ్వని, శివసత్తులలోని తన్మయత్వం అనే ధర్మసామ్యం ఇందులో కనబడుతుంది. మున్నూట = మూడుసార్లు, మునుము = క్రమము, ఎగిలివాడే పొద్దు = ప్రాత:కాలం (మబ్బుల) ఎలిసిపోవడం = రంగుమారడం, బయిరంగం = బాహ్యారంగం, సింగిడి = ఇంద్ర ధనుస్సు, సద్దులనాడు = సద్దుల బతుకమ్మనాడు, లాడాయి = కొట్లాట, దండుగడదాం = గుంపు గడుదాం (సమైక్యంగా పోరాడు దామని భావం) మొదలగు అతి ప్రాచీన తెలంగాణ రూపాలు ఈ పాటలో వాడడం వలన పాటలో ఒక కొత్త వ్యక్తీకరణ విధానం కనిపిస్తుంది. అంతే కాక ఇందులో వాడిన రాంగా, పోంగా అనే అన్నంతక్రియలు తెలంగాణ భాషలో సర్వసాధారణం. ఈ పదాలన్నీ గూడా భాషా వైవిధ్యాన్ని తెలిపేవే.

కోడారి శ్రీను రాసిన **"అసైదుల్లా హారతి కాళ్ళ గజ్జెల గమ్మతి..."** అనే పాటలో పోరాటం పొద్దులై ఎర్రకళ్ళు పగుల్తై అనే వాక్యంలో "సూర్యుని లాగా పోరాటమనేది చైతన్యంతోని ముందుకెళ్ళాలని, ఎరుపు విప్లవానికి ప్రతీక కనుక ఎర్రకండ్లు అనగా విప్లవ దృక్కోణంతో కుట్రదారుల ఎత్తులను తిప్పి కొట్టాలని" ఈ పాటలో వ్యక్తమౌతుంది.

గూడా అంజయ్య రాసినటువంటి "రాజిగ ఓరి రాజిగ..." అనే పాటలో **"పుడితొక్కటి సత్తె రెండు..."** అనే సామెత తెలంగాణ పల్లె ప్రజలు తమకు కష్టాలొచ్చినప్పుడు, జీవితం మీద విరక్తి చెందినప్పుడు తమ అసహనాన్ని వెల్లిబుచ్చడానికి వాడతారు. ఈ సామెతలో తెగింపు భావం కూడా కనబడుతుంది. గాంధీగారు క్విట్ఇండియా ఉద్యమంలో చెప్పిన **"డూ ఆర్ డై"** అనే సిద్ధాంతం ఇందులో కనబడుతుంది. జానపదులలో నిగూఢంగా దాగి ఉన్న ఆధ్యాత్మిక సిద్ధాంతం ఇక్కడ అన్వయింప చేసుకోవచ్చు. జీవితంలో వచ్చే ఒడిదుడుకుల్ని ఎదిరించే శక్తి సామర్థ్యాలు ఈ మాటలకున్నాయి. జానపదులలో చావుకు భయపడని తత్వం, మొండి ధైర్యం ఈ పాటలలో ప్రస్ఫుటమవుతాయి. **"మోతుకు మూడాకులాయె చచ్చినోడి లగ్గానికి వచ్చిందే కట్నమాయె", "కాకులను కొడుతుండ్రు గద్దలకు పంచుతుండ్రు", "అందరు శాఖాహారులే మరి రొయ్యల మళ్ళేడవాయె"** అనే సామెతలో తెలంగాణ ప్రజల స్థితిగతులు దర్శనమిస్తాయి. గోడమీది వాటం, తోకదెగినకోతులు, పానుపండ్ల దానరి వంటి జాతీయాలు ఇందులో కనబడుతాయి. కవి తాను చూసి చలించి రాసినటువంటి మాటలు కనుక తాను పండితుడు కాకపోయినా భావాలకు ఒక రూపాన్నిచ్చే శైలిని ఏర్పరచుకున్న రచయితను చూస్తుంటే పూర్వపు అలంకారికుడైన రాజశేఖరుడు చెప్పిన కావ్యహేతువుల భావయిత్రి, కారయిత్రి జ్ఞప్తికి వస్తాయి. పాశ్చాత్యుల చేతా కొనియాడబడిన వర్డ్స్ వర్త్ యొక్క "పోయెట్రీ ఈజ్ ద స్పాంటెనియస్ ఆఫ్ ఓవర్ ఫ్లో **ఫవర్ ఫుల్** ఫీలింగ్స్ అనే భావన గుర్తుకురాక మానదు.

పసునూరి రవీందర్ గారు రాసిన తెలంగాణ లడాయి అనే పాటలో **"గోసులూడ దంచుతం/ వంగబెట్టి తన్నుతం/ అడ్డంగా నరుకుతం"** అనే పదాలు తెలంగాణాకు అడ్డెవ్వరో వారికి తగిలే విధంగా పదాలతీవ్రత ఉక్రోశం కోపం వచ్చినప్పుడు మన పల్లెల్లోని ప్రజలు ఏ పదాలనైతే వాడుతారో అదే పదాలనుపయోగిస్తూ చేసిన రచనా విధానం ఇందులో కనిపిస్తుంది. ఆధునిక సాహిత్యంలో వచ్చిన దిగంబరకవిత్వ ధోరణి కొంత ఇందులో వ్యక్తమౌతుంది.

ఉదమ్యంలోని పాట పదాల బరువును మోయలేదు కనుక పదాలలో పాండిత్యాన్ని ప్రదర్శించక భావనిర్మాణానికి, రూప నిర్మాణానికి అనుగుణంగా ఉద్యమకారులు సరళమైన భాషను ఎంచుకుని ప్రజలకు చేరువయ్యేలా వారి సాహిత్యాన్ని రాసారు.

నందిని సిద్దారెడ్డి రాసిన **"నాగేటి సాల్లల్ల నా తెలంగాణా నా తెలంగాణా..."** అనే ఈ పాట కవి అంతర్గత సంఘర్షణల ప్రతి రూపమే. ఊరుగాచే తల్లి ఉరిమి చూడంగా బువ్వలేక తల్లి బోనమండింది... అన్న వ్యాక్యాలు వినూత్న భావుకతతో కనిపిస్తాయి. సామాజిక వాస్తవాలే సామాజిక అస్థిత్వాలౌతాయి. కళకు, సామాజిక అస్థిత్వానికి అంతర్గత సంబంధం ఉంటుంది. అంటే సమాజం యొక్క సునిశిత అంతర్గత అధ్యయనమే కళలో నిర్మించబడుతుందని ఈ పాట ద్వారా తెలుస్తుంది.

డా॥ అందెశ్రీ రాసిన రాష్ట్ర గీతంగా ఎంపికైనన **"జయ జయహే తెలంగాణా...జనని జయ కేతనం"** అనే గేయంలో పంపన, బద్దెన, హాలుడు, గుణాఢ్యుడు, పాల్కురికి, మొదలైన తెలంగాణ ప్రాచీన కవులని, మల్లినాధసూరి, దిఙ్నాగుని వంటి ప్రజ్ఞాశాలిలని, పోతన, కంచెర్ల గోపన్నల వంటి రాజ్యాధికార వ్యతిరేక విప్లవకారులని, రుద్రమదేవి వంటి ధీశాలిని, కొమురంభీమ్ వంటి పోరాటయోధుని, సర్వంజ్ఞ సింగిభూపాలుని వంటి సాహిత్య పోషకుని, పిల్లలమర్రి వంటి సాహిత్య సాధికారకుని, సమ్మక్క లాంటి గిరిజన వీరవనితలని, సర్వాయి పాపన్న, మీరాసాహేబ్, పండుగోళ్ళ సాయన్న వంటి బహుజన వీరుల్ని కీర్తిస్తూ రచన చేసారు. తెలంగాణా గత చారిత్రక, కళా వైభవాన్ని కొనియాడుతూ తిరిగి పురావైభవాన్ని సంతరించుకోవాలని, బంగారు తెలంగాణయే మన లక్ష్యం అని ఆకాంక్షించారు.

నిస్సార్ రచించిన **"పండు వెన్నెలలోన పాడేటి పాటలేమాయె"** అనే పాటలో ఆశ్రిత కులాలకు సంబంధించిన సాహిత్యం, పీర్ల పండుగ పాటలలోని భాషావైవిధ్యం, బతుకమ్మ పాటల్లోని చారిత్రక సంఘటనల సమాహారాలు కనబడుతాయి. ఈ పాటలో తెలంగాణలోని పీర్ల, ఆటపాటలను, చిన్న బాగోతుల ఆటపాటలను, బుర్రకథలోని సాహిత్యంశాలను కొంత కొంత స్పృశించి, ఆయా ప్రక్రియలకు సంబంధించిన అంశాలను వర్ణిస్తూ, గతానికి వర్తమానానికి ఉన్న పరిస్థితుల తేడాను తెలియ జేసారు. విప్లవ కవి వరవరరావు రాసిన **"తెలతెలవారంగ తెలిరేకలై విచ్చి"** అనే పాటలో విప్లవ భావాన్ని ప్రదర్శించే ప్రతీకల్ని భాషను ఉపయోగించారు. **"గుండ్లకు గువ్వలై కూలింద్రు, రక్తాలు ఒడిసింద్రు, వేల ప్రాణాలు పూలవలె ఇచ్చిండ్రు"** అని విప్లవాత్మక భావజాలం కలిగిన పదాల కూర్పు ఈ పాటలో కనబడుతుంది.

గోరేటి వెంకన్న కుబుసం సినిమాకు రాసిన **"పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల నా తల్లీ బందీ అయిపొతుందో, కనిపించని కుట్రల"** గీతంలో ప్రపంచీ కరణ నేపథ్యంలో ఆధునికత పేరుతో గ్రామంలో ఉండాల్సిన చేతివృత్తులు, చేనేత పని కనుమరుగైపోయి వాటి స్థానంలో యంత్రాలు వచ్చి పర్యావరణానికి, ఆరోగ్యానికి హానిచేసే ఉత్పత్తులు వచ్చాయనే ఆవేదనను ఈ పాటలో వ్యక్తంచేసారు.

జయరాజు రాసిన **"ఇంకేం మిగిలిందిరా తెలంగాణ జిల్లేడు మొలిచిందిరా"** అనే పాటలో తీసుకున్న ప్రతీకలు కవి యొక్క భావాలను లోతుగా దర్శింపజేస్తాయి. కవి అంతర్గత భావాలను ప్రస్ఫుటీకరించడానికి బాహ్య ప్రతీకలు ఎంతగానో తోడ్పడతాయి. తెలంగాణలో జిల్లేడు మొలిచింది పల్లేరు గాసింది అని చెప్పడంలోనే తెలంగాణ పాడిపంటలు లేని బీడు భూమిగా మారిందని తెలుస్తుంది. వరిచేను కడుపుకే తిండిలేదని, మొక్కజొన్న సంకన బిడ్డనెత్తుకొని ఊరిడిసి పోయిందని, పత్తి చేనుకు ఒంటి మీద బట్టలేదని అనడంలోని వాక్యాలలో వాచ్యార్థాన్ని వదిలి లక్ష్యార్థం తీసుకొవలసి ఉంటుంది. అప్పుడే కవి యొక్క వేదన అర్థమౌతుంది. కవి తాను ఏ విషయాన్నైతే చెప్పదల్చు కున్నాడో, తనకి ఆ విషయం పట్ల ఉన్న సమగ్రావగాహన

ఎంతుందో అతను వాడే ప్రతీకల వల్ల వ్యక్తమౌతుంది. ఇక్కడ ప్రతీకలు సొంత అర్థాన్ని వీడి కవికి కావలసిన అర్థాన్ని తెలిపే విధంగా ఉండాలి. ఈ పాటలో మనకా విషయం తెలుస్తుంది. వరిచేనుకు కడుపుకు తిండి లేదంటే పండించే రైతుకు తిండి లేదని, పత్తి పండించే రైతుకు బట్టలేదని, మొక్కజొన్న పండించే రైతు బతుకుతెరువు కోసం వలసవెళ్ళాడని శ్రోతకు స్పష్టమౌతుంది.

ఉద్యమంలో వచ్చిన కొన్ని పాటల్లో సాహిత్యాంశాలు గౌణమే అయి భావతీవ్రతయే అధిక ప్రాధాన్యత వహించింది సమాజంలో ఉన్న ఆర్థిక వ్యత్యాసాలనేవి కృత్రిమమైనవనీ, అవి కొందరి స్వార్థపరుల సృష్టి అని వాటకి శాస్త్రీయమైన విధానాలని అనుసరించి నిర్మూలించ వచ్చని పాటల ద్వారా తెలుస్తుంది.

మన తెలంగాణ కవులు మాటలో ఆట ఉందని, పాటలో ఆట ఉందని, మాటలనే పాటలుగాజేసి ఆటలాడి ప్రజలను ఉర్రూతలూగించే జానపద కళారూపాల ద్వారానే ఎక్కువగా ఉద్యమ సాహిత్యన్నందించారు.

ఆధార గ్రంథాలు :

1. తెలంగాణ ఉద్యమ గీతాలు – S.V. సత్యనారాయణ
2. లదాయి – పసునూరి రవీందర్
3. నందిని సిద్ధారెడ్డి – నాగేటి సాల్లల్ల
4. అంబటి వెంకన్న పాటల సంకలనం

"పునశ్చరణం" – కవితా సంపుటిలో సమకాలీన సాహిత్యం

డా॥ జె.వి. సుధీర్ కుమార్, ఆంధ్రోపన్యాసకులు, టి.జె.పి.యస్. కళాశాల, గుంటూరు.

మంచి సాహిత్యాన్ని చదివినప్పుడు మంచి మనిషిగా, మానవత్వంతో గుబాళించే సంస్కారంగా మనం ఎదుగుతాం. ఆ క్రమంలో జీవన సుగంధాన్ని ఆస్వాదిస్తూ బ్రతకడాన్ని ఎరుకలోకి తెచ్చుకుంటాం. అటువంటి ఎదుగుదల శాశ్వతం కావాలంటే మనలో మనకు 'పునశ్చరణం' తప్పనసరి.

"నిజానికిప్పుడు సువాసనల్లో మనమున్నామా? మనలో సువాసనలు మిగిలున్నాయా? జీవన సౌరభంలో ఎన్ని పూలరేకుల్ని రాల్చుకున్నాం? ఈ బ్రతుకు మొనాటనీలో మెలంకలీ సంగతేమిటి? ఎడతెగని పరుగులో తొలకరి మట్టి వాసనలో, వాన మబ్బులో, వేప పూతలో, పాటల పుష్పాలో, కలల మామిడాకులో, ఇంటిముందు నేరేడు చెట్టు నెనలో – ఏవేవో కోల్పోయాం?" – డా॥ పాపినేని శివశంకర్ గారు.

సుప్రసిద్ధ సాహితీ విమర్శకులైన శివశంకర్ గారి "సౌగంధి సౌరభం" అనే ముందు మాటతో 'పునశ్చరణం' కవితా సంపుటిలో డా॥ వైదేహీ శశిధర్ గారు జీవన ఉన్నతీకరణ ఆత్మోద్ధరణ తప్ప, అన్యంకాదని చాటిచెప్పింది. సంపుటిలో మొత్తం 36 కవితలున్నాయి. మానవ సంబంధాల విలువను తెలియచెప్పిన కవితలవి. ఆధునిక మానవుడు ఆకాశహార్మ్యాలను దాటేంత ఎత్తుల్లోకి ఎదుగుతున్నాడు నాగరికంగా. మరి మానసికం మాటేమిటి? ఈ ప్రశ్న తలెత్తినప్పుడు మానవుడు పరాయికరణకు గురయ్యాడనే వాస్తవం అర్థమౌతుంది. ప్రకృతి నుండి, సమాజం నుండి, తననుండి ఎలీనేట్ అయినవాడు దాన్నుండి మళ్ళీ పునరుజ్జీవనం కావాలి. అందుగ్గాను కోల్పోతున్న వాటిని పట్టి చూపించి, కాపాడుకోవడం నీ బాధ్యత అని మృదువుగా హెచ్చరిస్తుంది పునశ్చరణ.

దేని విలువనైనా, ఎవరి విలువనైనా నిజమే... కోల్పోయాక మాత్రమే తెలుస్తుంది. అది గ్రహించాక గుక్కపెడతాం, వెక్కిళ్ళుగా మారుతాం, వెతుకుతాం, అనంత ఆవేదనకు రూపంగా మారి కొత్తగా చక్కబడతాం. అప్పుడుకదూ ప్రతి దృశ్యాన్ని, సందర్భాన్ని, సంఘటనని, ప్రతిమనిషితో, మనతో, మనకుండాల్సిన బంధాన్ని అపురూపంగా, ఆరాధనగా, నిసర్గంగా చూడగలుగుతాం. వచ్చిందాన్ని వచ్చినట్లుగా స్వీకరిస్తూ ముందుకు సాగుతాం. ప్రకృతి నుండి మానవీయ గుణాన్నుండి దూరమైనవాళ్ళు తల్లి వేరుల్ని వెతుక్కుని తాదాత్మ్యం చెందుతారు డా॥ వైదేహి గారి ఆంతరంగిక అన్వేషణ ద్వారా! సమాజాన్ని మరమ్మత్తు చేసేముందు స్వీయాన్ని మరమ్మత్తు చేసుకోమని అన్యాపదేశంగా కవితల్లో చెప్పారు.

'కచ్చేరీ' కవితలో కోలాహలపు అలలమీద ఆడిటోరియం అరటిదొన్నెలా తేలుతున్నప్పుడు, మొగ్గవిచ్చుకున్నంత నిశ్శబ్దంగా తెరలేస్తుంది. ఆమె రాగాలాపనలో చికాకులు మాయం.

"ఒక సుగంధద్రవ్యపు గాజుకుప్పె ఒలికినట్లు
గాఢమైన పరిమళం నన్ను ఉద్విగ్నంగా
చుట్టుముడుతుంది
పాటకీ పాటకీ మధ్య విరామం కంపిస్తున్న వాద్యమై
ఆ సంగీత సామ్రాజ్ఞి ముందు మునివేళ్ళ మీద
వినమ్రంగా నిలబడుతుంది"

మధురరాగాలాపన మనుషులకే కాదు, విరామ సమయానికి కూడ వినమ్రత నేర్పుతుందట. పాడడానికి కాదు, కనీసం సంగీతం వినడానికి కొంత సమయాన్ని కేటాయిస్తే, దివ్యౌషధమై అది మన చికాకుల్ని తొలగిస్తుంది.

రోజూ చూసే దృశ్యంలోంచి, రోజూ చూడని అనుభూతిని 'ఎండ' కవిత కల్గిస్తుంది. వడియాలు ఎండబెట్టుకోవడానికో, బట్టలు ఆరేసుకోవడానికో ఎండ ఉపయోగ

పడుతుందంటారు కొందరు. కానీ కవయిత్రి "ఏటినీటిపై, పాలపైరుపై ।।పిట్టలరెక్కలపై చిరునవ్వై జారిపోవడాన్ని", చీటికీ మాటికీ విసిగించే చిలిపి చెల్లిని, అలిగిన ప్రియురాల్ని ఎండలో దర్శించగల్గారు.

'అంధగీతం' ఖండికలో అంధుడైన యాచకుడొకడు రైలుపెట్టెలో పాటందుకుంటాడు. పెట్టెలోని వారంతో అనాసక్త శ్రోతలుగా మారినా అతని ఆకలి దాన్ని పట్టించుకోదు. చివరకు అతడు అందరినుండి నిర్లక్ష్యాన్ని, నిరసనను, హేళనను నాణాలుగా పోగుచేసుకొని దిగిపోతాడు. నిర్లిప్తంగా అతడెళ్ళాక పాటతాలూకు మాధుర్యం దిగులుగా వలయాలై అక్కడే తిరుగుతుందట. 'పెంపకం' అనే కవితలో డా॥ పాపినేని గారు "పెద్దగా నేర్పిందేమీ లేదంటూనే 'పలకమీద 'దయ' అనే రెండక్షరాలు రాసి దిద్దించాను అని చెప్పినట్లుగా, మానవ లక్షణమైన దయను కోల్పోయిననాడు అంధుడు యాచకుడు కాదు, కళ్ళున్న ప్రయాణీకులే అనే అర్థంలో కవయిత్రి ఈ కవిత రచించారు.

బాల్యంలో నాయనమ్మతో ముడివేసుకున్న మధుర జ్ఞాపకాల దొంతర 'నాయనమ్మ' కవిత తులసి మొక్క చుట్టూ కమ్ముకున్న చీకటి తెరలను అరటిదొన్నెల్లో వెలిగించిన కార్తీక దీపాలు రెపరెపలాడించటంతో పాటు "కొండెక్కకుండా నా కంటితడి ముప్పైమూడేళ్ళుగా కాపాడుతూనే ఉంది" అంటారు. నానమ్మ వత్తుల డబ్బా, గంధపుచెక్క, విభూది పండు, జీవితం పుటల్ని అప్యాయంగా మోసి అలసిన వ్యాసపీఠం, కృష్ణుడి కంచువిగ్రహం "ఎన్నిసార్లు శుభ్రం చేసినా నా తడి కళ్ళకి ఎప్పుడూ మసక మసకగానే కనబడుతాయని" గుర్తుచేసుకుంటారు. అయితే బామ్మతో అల్లుకున్న ప్రతిజ్ఞాపకం, కాలంగడిస్తే మరచేదికాకుండా మమతల మట్టి ఊడలతో ఆమె జీవితమంతా విస్తరించింది. కుటుంబంలో పెద్దదిక్కు సంప్రదాయాన్ని, సంస్కారాన్ని, వారసత్వసంపదగా ఇవ్వాలనే ధ్వని కవితనిండా పల్లె పందిరిలా అల్లుకుంది.

డా॥ వైదేహి గారి దృష్టికోణంలో ఆకాశం చుక్కల చెమ్కీల కుట్టుపూల చీరకట్టిన సొగసరి. అతలాకుతలం చేసిన వేనవి వగలు అందర్నీ నుడివడిపోనిస్తే, రాత్రయ్యేపాటికి ఆకాశం ఊరంతటికి ఉపశమనాన్నిస్తుంది.

తీవ్రమైన పని ఒత్తిడినుండి విముక్తిని ప్రసాదించే శక్తి సంతానానికుందంటారు 'గృహోన్ముఖంలో'. పొద్దుతిరుగుడు పువ్వులా ఊపిరిసలపని దినచర్యలో పడ్డా, మైళ్ళదూరంలో ఉన్న చిన్నారి మోములు రెండు కళ్ళలో మెదులుతూనే ఉంటాయి. పనిముగిశాక ఇంటిదారి పట్టిన ఆలమందలా, రహదారి రద్దీలో పగడపు పూసలా చిక్కుకున్నా "పొద్దు ఎర్రతామరలా ముకుళించేలోపు నా చిన్నారి తల్లులని చిరుగాలిలా చేరుకుంటాను" అని సంతోషిస్తారు.

"బెడ్‌టైం స్టోరీ" పిల్లలకు చెప్పే కథలా ఉన్న కవయిత్రి చిన్నప్పటి రూపం కళ్ళముందు నిల్పుతుంది. ఇక మాటల గురించి చెబుతూ మనుషుల మధ్య మాటలు "ఎప్పుడో ఒక క్షణంలో మాత్రం చందనపు పుష్పాల్లా" గుబాళిస్తాయంటారు. అటువంటి సందర్భంలో ఆకాశం, నక్షత్రాలు, చెట్లు, కొండలు అన్నీ ఆ మాటల్లో నిండిపోతాయట. మిగతా సమయాల్లో ఎవరి వలయాల్లో వాళ్ళు చిక్కుకుపోతారట. మళ్ళీ మంత్రధూళి రాలేవరకు ఆ యాంత్రికత నుండి బైటపడలేమని ఆర్ద్రంగా అంటారు.

"కవి ।।ఒక నిరంతర శిల్పి।। తన ఆలోచనల్ని అనుభూతుల్ని ఆరాటాల్ని।।పదాలుగా చెక్కుతుంటాడు. ఈ చెక్కడపు పనిలో జీవితంలోని అన్ని కోణాలను "స్త్రీ భావ బాలగంగాధర తిలక్" లా ఆవిష్కరించారు.

కవయిత్రి ప్రకృతి పిలుపుని మనసొగ్గి విన్నారు. వినిపించే ప్రయత్నంలో సఫలమయ్యారు. మన ఆలోచనలలో చూపుని సరిచేయగలిగారు. ఉద్యోగరీత్యా అమెరికాలో ఉంటూ వైద్య వృత్తిని నిర్వహిస్తున్న వీరు మానవ మస్తిష్కానికి శస్త్ర చికిత్సన అక్షరాలతో చేశారు. హృదయాన్ని నిర్మలంగా చేసుకుని, కారుణ్య వీచికగా బ్రతకాలని, స్నేహమాధుర్యాన్ని

నిలుపుకోవాలని, అర్ధ రహితంగా కన్పించినా జీవితానిది విచిత్ర సౌందర్యం, మహామోహజాలమని తెలుసుకుని మసలాలని, మన ప్రయాణంలో యాంత్రికతన అధిగమించి మంత్రపూర్వక శ్లోకంలా భాసిల్లాలని కోరారు. మనుషుల్లో, సంబంధాల్లో మానవత్వం లోపించడమూ అసలైన అంగవైకల్యమని తెలియజేశారు.

జర్మన్ దేశస్థుడైన 'ఎరిక్‌ఫ్రామ్' మనిషి సారాంశాన్ని సమాజంతో అతనికున్న సంబంధాన్ని, ప్రకృతితో మనిషికున్న సజీవ సంబంధాన్ని విపులంగా చర్చించారు. స్వేచ్ఛ, ప్రేమ, శ్రమ 'ఫ్రామ్' సిద్ధాంతానికి మూలధాతువులు. వీటిద్వారా మనిషి పరాయితనం తొలగిపోతుందని భావించారు. తల్లితో, ప్రకృతితో ఉన్న బంధాల్ని ప్రాధమిక బంధాలుగా ఫ్రామ్ భావించినట్లే, వైదేహి గారు పునశ్చరణంలో ఫ్రామ్‌తో భావసారూప్యం చెందారు.

కరెంట్ పోతే తప్ప ఆకాశాన్నంటే భవనాల్లో ఉన్న మనుషులకు నక్షత్ర దీపాలు, వెన్నెల మైదానాలు, చల్లని గాలి తెమ్మెరలు సెలవుల్లో తిరిగిన పల్లెటూళ్ళు అనుభవంలో కొచ్చే జ్ఞాపకాలవుతాయనడం ఈనాటి యాంత్రిక జీవనానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన మాటలు. సజీవస్మృతులను ఎప్పటికీ కాపాడుకోవలన్నదే డా॥ వైదేహిశశిధర్ గారు మనకందించే అక్షర సంస్కారం!

ఆధార గ్రంధాలు:

1. పునశ్చరణం (కవితాసంపుటి) – డా॥ వైదేహి శశిధర్
2. ఉన్నిమువ్వల కాగడా – శ్రీమతి వై. శ్రీరంగనాయకి.

"మెదక్ జిల్లా కథా సాహిత్యం : వస్తు విశ్లేషణ"

జి. దుర్గాప్రసాద్, పరిశోధక విద్యార్థి, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, ఫోన్ : 8499066485

పరిచయం:

దక్షిణాపథ తక్షశిలగా పేరుపొందిన మెదక్ జిల్లాకు ఎంతో ఘనమైన సాహిత్యం , చరిత్ర ఉంది. మెతుకుసీమగా ప్రసిద్ధి గల ఈ జిల్లా పేరులోనే గత వైభవం దిక్సూచిగా కనిపిస్తుంది. ఈ జిల్లా మంజీరానది పరివాహక ప్రాంతం కావడం వల్ల వరి పుష్కలంగా పండించడం వల్ల ఈ ప్రాంతాన్ని మెతుకుసీమగా పిలుస్తారు. ఈ జిల్లాను ఆనుకొని కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలు ఉండటం వల్ల ఇక్కడ తెలుగు, ఉర్దూ, కన్నడ, మరాఠీ, హిందీ భాషలు కనిపిస్తాయి. ఈ జిల్లా భిన్న సంస్కృతులకు కేంద్రంగా కలదు. ఉద్యమాలకు మెదక్ జిల్లా తెలంగాణలోనే ప్రత్యేకత సంతరించుకుంది. ఉద్యమాలకు కళలకు పుట్టినిల్లుగా భావిస్తున్న మెదక్ జిల్లా తెలంగాణ రాష్ట్రంలోనే ప్రత్యేకతను సంతరించుకుంది. మెదక్ జిల్లా సాహిత్య చరిత్ర చాలా ప్రాచీనమైనది. క్రీస్తుశకం 60-70లో మెదక్ జిల్లా కొండాపూర్ లో నివసించిన గుణాడ్యుడు బృహత్కథ రాశాడు. సంస్కృత ప్రాకృతాలను వదిలేసి గుణాధ్యుడు పైశాచీ భాషలో బృహత్కథ అనే గ్రంథం రాశాడు. భారతీయ కథా ప్రపంచానికి మూలమైన గ్రంథమిది. అనేక నాటకాలపై, కావ్యాలపై దీని ప్రభావం వుంది.

ఉమ్మడి మెదక్ జిల్లాలో 1930లో ఆంధ్ర మహాసభ అందించిన స్ఫూర్తితో బెల్లంకొండ సోదరులు సంఘసంస్కార సభ, సియాసి సభలు అనే కథలు రచించారు. ఆ తర్వాత యజ్ఞ కృష్ణదాసు ఇంద్రమాలిక కథ, వెల్దుర్తి మాణిక్యరావు ఒక్క నిమిషం కథ రాశారు. ఇవి ఈ జిల్లా తొలి తరం కథలు ఆ తర్వాత ఈ జిల్లా నుండి కథ సాహిత్యంలో గొప్ప పేరు సంపాదించిన వ్యక్తి ఐతా చంద్రయ్య అనేక కథా సంపుటాలు రాశారు. వీరేగాక చొప్పదండి సుధాకర్, నందిని సిద్ధారెడ్డి, ఎగుమామిడి అయోధ్య రెడ్డి మొదలైనవారు ఈ జిల్లా నుండి అనేక కథలు, కథా సంపుటాలు వెలువరిస్తున్నారు.

"ఆకర్షకమైన ఒక సంఘటనగాని, అద్భుతమైన సన్నివేశంగాని, అందమైన దృశ్యంగాని, చిత్రమైన వ్యక్తిత్వంగాని, చమత్కారమైన మాటగాని, అపురూపమైన అనుభూతిగాని, హృదయంలో స్పందన కలిగించి, ఆలోచనను రేకెత్తించి, ఊహను ఉద్దీపనం కావించినప్పుడు కలిగే ప్రేరణే రచయిత మనస్సులో కథా బీజంగా నాటుకొంటుంది. ఇది మనస్సులో నాని నాని చిన్నగా మొలకవేసినప్పుడు వస్తువుగా భాసిస్తుంది." (దక్షిణామూర్తి. 2009: పుట.181) అని దక్షిణ మూర్తి కథా వస్తువు ఏర్పడు విధానాన్ని నిర్వచించారు.

వస్తువు అంటే ఏమిటి అనే ప్రశ్నకు వల్లంపాటి వెంకట సుబ్బయ్య సరైన వివరణ ఇచ్చాడు. "కథ మనకు పూర్తిగా తెలిసిన తరువాత ఈ కథ ఏం చెబుతోంది? అన్న ప్రశ్న వేసుకుంటే వచ్చే సమాధానాన్ని స్థూలంగా కథ వస్తువు అనవచ్చు" (వెంకట సుబ్బయ్య. 1994: పుట. 21)

"కథకుడి మనోభూమికలో నాటుకున్న కథాబీజం నాని నాని చిన్నగా మొలక వేస్తుంది. ఉత్తరోత్తరా వికసించే కథారూపాన్ని సూక్ష్మరూపంలో నిక్షిప్తంచేసుకొన్న బీజానికి తొలి పరిణామమే. ఈ మొలక. బీజంలో జీవశక్తి ఈ మొలకవల్లనే తెలుస్తుంది. సాహిత్య పరిభాషలో దీన్ని కథావస్తువు అంటారు." (దక్షిణ మూర్తి. 2009: పుట. 164 – 165) ఈ విధంగా మన విమర్శకులు కథా సాహిత్యానికి సంబంధించిన కథా వస్తువు విషయంలో వివిధ నిర్ధారణలు చేశారు.

వస్తువు :

మెదక్ జిల్లా కథల్లో ఎక్కువ శాతం గ్రామీణ జీవితాన్ని చిత్రించినవే అయినా వస్తు వైవిధ్యం కథన రీతిలో భిన్నత్వం కలిగిన కథలు చాలా ఉన్నాయి. నిజాం నిరంకుశ పాలన నాటి పరిస్థితులు దొరల దౌర్జన్యాలు, దోపిడీల కింద నలిగిన బడుగు జీవుల బతుకులు, వివిధ ఉద్యమాల ప్రభావం, వలస బతుకుల వెతలు, స్త్రీల ఇక్కట్లు, వృత్తి జీవితంలోని సంక్షోభాన్ని, స్త్రీ పురుష సంబంధాలను, యువతపై వర్తమాన రాజకీయాల ప్రభావము, దళితుల్లో వర్గీకరణ చిచ్చు వంటివి ప్రధాన వస్తువులుగా మెదక్ జిల్లా కథా సాహిత్యంలో గమనించవచ్చు.

చొప్పదండి సుధాకర్ రాసిన వెన్నెల కుప్పలు కథ సంపుటిలోని వారసత్వం అనే కథలో వారసత్వంగా సంక్రమించిన అపూరూపమైన విద్య గంగిరెద్దుల్ని ఆడించటం గురించి చెప్తూ నేటి ఆధునిక జీవనంలో కనుమరుగైపోతున్న కళలు, కళారుపాలను ప్రధాన కథావస్తువుగా తీసుకొన్నాడు. ఈ కథలోని ప్రతి వాక్యమూ మనల్ని ఆలోచింప చేస్తుంది. అంతరించిపోతున్న జానపద కళారూపాల్ని కాపాడుకోవాల్సిన బాధ్యతను పరోక్షంగా మనపై ఉందని ఈ కథ గుర్తు చేస్తుంది.

ఐతా చంద్రయ్య గారు రాసిన అంకితం కథా సంపుటిలోని కలికి గాంధారి కథలో జోగినీ వ్యవస్థను వస్తువుగా తీసుకొని అది ఎంత నీచమైందో గాంధారి పాత్ర ద్వారా జోగినీ స్త్రీ ఎదురుకొన్న అనేక సమస్యలు, అవమానాలు ఆనాటి సామాజిక పరిస్థితిని చిత్రించాడు.

నందిని సిద్ధారెడ్డి రాసిన చిత్రకన్ను అనే కథ సంపుటిలోని పుల్లర కథలో గొర్ల కాపరులు అటవీ అధికారులను ఎదురించడమే ఇందులో ప్రధాన వస్తువు. వీరు నక్సలైట్ల అండతో తిరగడడం, నక్సలైట్ల పై సానుభూతితో మరికొన్ని ప్రతీకాత్మక కథలు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా నక్షత్రం వేణుగోపాల్ పర్యవసానం, అయోధ్యారెడ్డి ఆహోరయాత్ర, కె. అంజయ్య వరదలు కథ, నందిని సిధారెడ్డి పుల్లర, సి. హెచ్. మధు చెదలు, జ్వాలాముఖి 'మాఫలేషు కదాచను' కథలు ఇందులో ఉన్నాయి.

డప్పోల్ల రమేష్ గారు రచించిన దునియాల అనే కథలో దళిత స్త్రీ రోజు ఎట్లా పురుషధిత్యానికి బలైపోతుందో అనే అంశాన్ని ప్రధాన వస్తువుగా ఈ కథ చిత్రించాడు. అంతే కాకుండా చావడం పరిష్కారం కాదని బతికుండి కొట్లాడడమే ఏ సమస్యకైనా పరిష్కారం అని పోరాడి గెలవాలని హితం చెప్తాడు. అదే విధంగా పోలీసోల్ల చేతిలో దళిత స్త్రీ దగాపడ్డ తీరును అంతకంతే కథలో సిద్దంకి యాదగిరి వివరించాడు. అస్తిత్వ సోయి వచ్చిన తర్వాత స్త్రీల పట్ల వివక్ష, హింసకు సంబంధించిన అంశాలు సాహిత్యంలోకి ఎక్కువగా వచ్చాయి. అటువంటి కథలు మెదక్ జిల్లా కథా సాహిత్యంలో అనేకం కనిపిస్తాయి.

దళితవాద వస్తువు నేపథ్యంలో వర్గీకరణను సమర్థిస్తూ వచ్చిన సిద్ధంకి యాదగిరి పంచుకోండి కథలో మాదిగ అస్తిత్వాన్ని బలంగా చెప్పడమే గాకుండా, వర్గీకరణ ఎంత న్యాయమైన డిమాండో చిన్న చిన్న ఉదాహరణలతో అందరికీ అర్థమయ్యే రీతిలో అందించాడు. మెదక్ జిల్లా కథల్లో దళిత జీవితం బలంగా చిత్రించబడింది అంటే అతిశయోక్తి కాదు. పడాల రాములు బలి, మాస్టారీ అవసరమొస్తె కథలు దళిత జీవితాలని చిత్రించాయి.

మెదక్ జిల్లా కథల్లో వలస జీవితాలను కథా వస్తువుగా తీసుకొని చిత్రించిన కథలు కూడా చాలానే ఉన్నాయి. ఈ జిల్లావారు ఎక్కువగా వలస వెల్లేది హైదరాబాద్. అటు చదువుకుగానీ, ఆ తర్వాత ఉద్యోగ, ఉపాధి కోసం గానీ హైదరాబాద్ కు చేరుకొని అక్కడి జీవితాన్ని చిత్రించిన కథలు ఈ జిల్లా కథకుల సామర్థ్యాన్ని అంచనా వేయడానికి తోడ్పడతాయి. బాలసరస్వతి తన 'రామి' కథలో ఉన్న ఊళ్ళో బతుకుదెరువులేక హైదరాబాద్ వెళ్తూ రైలు

ప్రమాదంలో మరణించిన కొడుకు కొండడు గురించి చెప్తూ వలస బతుకుల్లోని బాధల్ని చెప్పింది. హైదరాబాద్లో ఉంటూ రోజుకు వందల వందల కిలోమీటర్లు అప్ అండ్ డౌన్ చేసే ఉద్యోగస్థుల బాధల్ని వేముగంటి మురళీకృష్ణ 'జాతర' కథలో పట్నం వచ్చిన కొద్ది రోజులకే మొగుడు మోసం చేసి పోవడంతో ఆర్నెల్ల బిడ్డతో అవస్థలు పడుతున్న తల్లిగాధను చలి కథలో బి.నర్సింగరావు చెప్పాడు. దారం మల్లారెడ్డి కథ కూడా హైదరాబాద్ అవస్థల జీవితాలను తెలిపాడు. ఎం. దేవేంద్ర కథ కొత్తపల్లి ఉన్న ఊరికి దూరమైన వారికి మట్టివాసనను పట్టినది. వలస కథల్లో దోర్బల బాలశేఖర శర్మ నీళ్లు లేని నది, ఇందులో అమెరికా, దుబాయి వలసలతో పాటుగా గ్రామాల నుంచి వలస పోతున్న బతుకుల్ని చిత్రించాడు.

ముగింపు:

కథ దేని గురించి అన్న ప్రశ్నకు సరైన సమాధానం మనకు కథా వస్తువులు స్పష్టంగా తెలియజేస్తాయి. కారణం కథల్లో కనిపించే వస్తువు యొక్క ప్రాముఖ్యత కథ యొక్క దిశ నిర్దేశాన్ని నిర్వర్తిస్తుంది. కథలన్నీ మనకు ఏదో ఒక విషయాన్ని తెలియజేయాలనుకుంటాయి. వాస్తవంగా చెప్పాలంటే సంఘసంస్కరణ, స్వతంత్ర పోరాటం, శ్రామికుల పోరాటాలు, స్త్రీల హక్కులు, మైనారిటీ హక్కులు, ప్రపంచీకరణ, ప్రాంతీయవాదాలు, సమకాలిక సమస్యలు తెలుగు కథా సాహిత్యంలో ప్రతిబింబించే కథా వస్తువులు. అంటే వస్తువు మీద ఎక్కువ శ్రద్ధ చూపిస్తే కథ ప్రచార సాధనంగా విషయాన్ని పాఠకులకు చేరవేస్తుంది మంచి విషయాన్ని చేరవేయాలంటే మంచి కథ వస్తువు కావాలి వస్తువు గురించి కథ ద్వారానే తెలియజేయాలంటే కొన్ని కథా మర్యాదలను, నియమ నిబంధనలను పాటించాలి. అప్పుడే మనం చెప్పదలుచుకున్న విషయానికి తగిన పాత్రను సృష్టించడం, తగిన సన్నివేశాలను కల్పించడం ద్వారా పాత్ర అనుభవాల నుంచి సమాజాన్ని పరివర్తన కోణానికి పాఠకునికి చేరవేయవచ్చు. కథలో ఎంత ప్రాముఖ్యత ఉందో తాను చెప్పదలుచుకున్న విషయాన్ని రచయిత కథనం ద్వారా చెప్పగలిగాడా లేదా అన్న విషయాన్ని కథ యొక్క భావ ఉద్దేశాన్ని, వస్తువు మూలాన్ని పరిశీలిస్తే తెలుస్తుంది.

ఆధార గ్రంధాలు :

1. మురళీ కృష్ణ. వేముగంటి, మెతుకు కథలు, మంజీరా రచయితల సంఘం, సిద్దిపేట: 2016.
2. వెంకట సుబ్బయ్య. వల్లంపాటి, కథాశిల్పం, హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2008.
3. దక్షిణామూర్తి. పోరంకి, కథానిక స్వరూప స్వభావాలు, హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2009
4. చంద్రయ్య. ఐతా, అంకితం (కథా సంపుటి) జాతీయ సాహిత్య పరిషత్తు, సిద్దిపేట: 2008.
5. సుధాకర్. చొప్పదండి, కుప్పలు కుప్పలు (కథా సంపుటి), అల్లిపురం ప్రచురణలు, సిద్దిపేట: 2011.

కాశీఖండాంతర్గత గుణనిధి పాత్ర ఔపదేశిక ప్రతిపత్తి

గోమార్ధ్య కవిత, పరిశోధక విద్యార్థి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. సెల్ : 95024 39748

తెలుగు సాహిత్యంలో ప్రౌఢమైనటువంటి రచనా శైలికి పెట్టింది పేరు శ్రీనాథుడు. ఈయన 14వ శతాబ్దానికి చెందిన కవి. బాల్యము నుండే రచనలు చేశాడు. వీరి రచనల్లో మరుత్తరాట్చరిత్ర, శాలివాహన సప్తశతి, శృంగార నైషధం, కాశీఖండం, భీమఖండం, పలనాటి వీర చరిత్ర మొదలైనవి ప్రసిద్ధములు. వీరు పెద కోమటి వేమారెడ్డి వద్ద విద్యాధికారిగా విశేష సేవలందించారు. విజయనగర ఆస్థాన కవీంద్రులైన గౌడ డిండిమ్మ భట్టు కంచు డక్కను పగలగొట్టి, విజయనగర చక్రవర్తి అయిన ప్రౌఢ దేవరాయల వారి చేత కనకాభిషేక గౌరవాన్ని పొందారు. ఈయన బ్రాహ్మీ దత్త వరప్రసాదునిగా, కవి సార్వభౌమునిగా పేరుపొందారు. ఇట్టి మహనీయుని రచనల్లో పేరెన్నిక గలది కాశీఖండం. అట్టి కాశీఖండములో వ్యసన లోలునిగా గుణనిధి పాత్ర కనిపిస్తుంది. ఈ పాత్ర నేటి సమకాలీన సమాజానికి ప్రత్యేకంచి యువతకు తగిన జీవిత పాఠాలను బోధిస్తుంది. అట్టి పాత్ర విశేషాలను గురించి నా వ్యాసంలో ప్రస్తావించదలచాను.

కాంపిల్య నగరంలో వేదవేదాంగ వేత్త, బ్రాహ్మణోత్ముడైన యజ్ఞదత్తుని కుమారుడే గుణనిధి. మన్మధుని వంటి అందగాడితడు. గుణనిధికి ఉపనయన సంస్కారాలు జరిపి అతన్ని గురుకులానికి పంపిస్తారు అతని తల్లిదండ్రులు. కానీ గుణనిధి జూద వ్యసనపరుడు. రాత్రింబవళ్లు జూదాన్నాడుతూ కాలాన్ని వృధా చేస్తుండేవాడు. బ్రాహ్మణుడైన గుణనిధి తమ ఆచారాలను పరిహాసం చేస్తుండేవాడు, నిత్యాగ్నిహోత్రము, సంధ్యావందనాలను వదిలి నిత్యము గీత వాయిద్య కళా వినోదాలతో కాలాన్ని గడిపేవాడు. ఈ విధంగా విద్యను అలక్ష్యం చేస్తాడు గుణనిధి. ఈ సన్నివేశాన్ని పరిశీలిస్తూ ఉంటే చదువుకోవలసిన సమయంలో అంతర్జాలము, చరవాణిల మోజులో పడి విద్యను అలక్ష్యం చేస్తున్న నేటి విద్యార్థులే గుర్తుకు వస్తారు. ఇలా గుణనిధి విద్యకు దూరమై, సదాచారాలను వదిలి దుర్వ్యసనాల బాటలో పయనిస్తుంటాడు. అలాంటి గుణనిధికి విటులు, జూదరులు, నాస్తికులు దగ్గరవుతారు. ఈ విధంగా దుష్ట జన సాంగత్యం చేత గుణనిధి రోజురోజుకీ దిగజారి పోతుంటాడు. ఇలా గుణనిధి పూర్తిస్థాయిలో అనాచారిగా మారుతాడు. ఈ సమయంలోనే జూదము ఒక మహావ్యసనమై గుణనిధిని బంధిస్తుంది. ఆ చిక్కు నుండి బయటపడలేకపోతుంటాడు గుణనిధి.

జూదంలో ఓడిపోయినప్పుడు తన తల్లి నగలను, ఇంట్లో విలువైన పాత్రలను అమ్మి తద్వారా వచ్చినటువంటి ధనంతో కోల్పోయిన ధనాన్ని చెల్లిస్తూ రోజురోజుకి దిగజారి పోతాడు. ఈ సన్నివేశాన్ని చూస్తుంటే విలాసాలకు అలవాటు పడి మత్తుకు, మద్యానికి బానిసలౌతున్న నేటి అధునాతన సమాజము మన కళ్ళ ముందు కదలాడుతుంది. ఇలాంటి అనాచారి అయిన కుమారుడిని సక్రమమైన మార్గంలో పెట్టడానికి అతని తల్లి అయిన సోమిదమ్మ హితబోధ చేస్తుంది. ఒక్కగానొక్క కొడుకవ్వడం వల్ల అతన్ని అల్లారు ముద్దుగా చూసుకుంటుంది ఆ తల్లి. కానీ వక్రమార్గంలో పయనిస్తున్న తన కుమారుడిని సక్రమమైన మార్గంలో పెట్టాలనే దృఢ నిశ్చయానికి వచ్చి తండ్రి చెప్పినట్టు నడుచుకొమ్మని, జూదరులతో సహవాసము మానుకొమ్మని, మంచి వాళ్లతో పరిచయాలు పెంచుకొమ్మని, సత్సాంగత్యము వలన మనసులో సద్భావము కలుగుతుందని, సత్పురుషులతో సహవాసము సదాచారవంతునిగా చేస్తుందని హితోక్తులు పలుకుతుంది. రాజమాన్యుడు, నిర్మలాచారవంతుడైన నీ తండ్రిని, పతివ్రతల్లో ఎన్నదగిన దాన్నయిన నన్ను, వేద పురాణాల్లో ఆరితేరిన నీ తోటివాళ్లని, పదహారేళ్ల నీ భార్యను తలచుకొనైనా ఈ చెడ్డపనులు మానుకొమ్మని చెబుతుంది.

నీ దుర్వ్యసనాల గురించి తెలిస్తే మీ తండ్రి కోపగించుకుంటారని, ఇక రాజుగారికి తెలిస్తే మీ తండ్రి పరువేమవుతుందని అంటూ కుమారునికి చేస్తుంది. కానీ గుణనిధి ఆ మాటలు పట్టించుకోడు. ఈ సన్నివేశాన్ని చూస్తుంటే మితిమీరిన పుత్రవాత్సల్యము కూడదని అర్థమవుతుంది. ఈ సన్నివేశాన్ని చూస్తుంటే నేటి సమాజంలో ఇలా సంతానాన్ని అతిగా గారాబం చేసి, వారి పిల్లల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న తల్లిదండ్రులు స్ఫురణకు వస్తారు. అలాగే "మొక్కై వంగనిది మ్రానై వంగునా" అన్న ఆర్యోక్తి జ్ఞప్తికి వస్తుంది. చిన్నతనంలోనే గుణనిధిని సక్రమ మార్గంలో పెట్టక యువకునిగా మారి దుర్వ్యసనాలలో మునిగినవాడిని సరి చేస్తాననుకోవడం కష్ట సాధ్యమే అవుతుందని తెలుస్తుంది. అదేవిధంగా అనాచారునికి, దుర్మతికి, మూర్ఖునికి హితము చెప్పిన వాటిని లెక్క చేయరని గుణనిధి పాత్ర ద్వారా తెలుస్తుంది. ఇది నేటి కాలానికి కూడా వర్తిస్తుంది.

ఒకానొక రోజు తనకు ఎంతో ఇష్టమైన, రాజుగారు తనకు దానంగా ఇచ్చిన ఉంగరం ఓ జూదరి వేలికి ఉండగా చూస్తాడు యజ్ఞదత్తుడు. ఇదెక్కడిది నిజం చెప్పమని నిలదీస్తాడు. అప్పుడు ఆ జూదరి నీ కొడుకు జూదంలో ఓడి ఈ ఉంగరాన్ని పణంగా పెట్టాడు. నీ పుత్రుడు మహా జూదగాడని అసలు విషయం చెబుతాడు. దిగ్భ్రాంతికి లోనైన యజ్ఞదత్తుడు ఉన్నఫళంగా ఇంటికి వెళ్లి భార్యను తానిచ్చిన నవరత్నమయమైన ఉంగరం ఉండాలి కదా తీసుకురా అంటాడు. ఆమె ఏవో సాకులు చెబుతుంది. ఆగ్రహం కట్టలు తెంచుకున్న యజ్ఞదత్తుడు భార్యతో గుణనిధి గురించి నాకు చెప్పినవన్నీ అబద్ధాలే. నీ మాటలు నమ్మి బంగారంలాంటి కొడుకును పాడుచేసుకొన్నాను. నువ్వూ నీ కుమారుడు కలిసి ఇల్లంతా భ్రష్టుపట్టించారు కదా! అని ఆవేదన చెందుతాడు. ఈ సన్నివేశంలో యజ్ఞదత్తుని పాత్రను పరిశీలిస్తుంటే నేటి ఆధునిక కాలంలో ఉద్యోగం పేరిట, ధనార్జన పేరిట సంతానం పైన పర్యవేక్షణ పెట్టని తండ్రులు గుర్తుకొస్తుంటారు. ఇలా సంతానము పైన పర్యవేక్షణ లోపం వల్ల పిల్లలు పెడద్రోవ పట్టే అవకాశం ఉందనే సందేశం కూడా ఇందులో ప్రతిధ్వనిస్తుంది. ఇంతవరకు గుణనిధి కథలో నేటి సమాజము ప్రతిబింబిస్తూనే ఉంటుంది. ఒక్కొక్క పాత్ర ఒక్కొక్క సందేశాన్ని ఇస్తూనే ఉంటుంది. ఇక గుణనిధి కథలోని ఆఖరి ఘట్టం భక్తి తత్వాన్ని అందునా ప్రత్యేకించి శివభక్తిని ప్రబోధించేదిగా ఉంటుంది.

ఇంట్లో జరిగిన విషయం తెలుసుకున్న గుణనిధి ఇంటికి తిరిగిరాడు. ఎక్కడెక్కడో తిరుగుతూ ఆకలికి తాళలేక తన గతాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ తెలతెలవారుతూ ఉండగానే గిన్నెలో పెరుగు, వడపిండెలు కలిపి కడుపునిండా తినబెట్టేది అమ్మ. ఎంతో కరుణ కలిగిన మనిషి. ప్రాణానికి ప్రాణం వంటిదైన తల్లిలాంటిది ఈ భూమి మీద ఇంకేదైనా ఉందా? ఇక నా ఆకలి తెలుసుకొని అన్నం పెట్టేదెవరు? హర హరా! అని బాధపడతాడు. తల్లిపేగు బంధం గొప్పదనాన్ని గుర్తుకు చేసుకుంటూ బాధపడతాడు. ఈ సన్నివేశంలో గుణనిధికి జ్ఞానోదయం అవుతున్నట్టుగా అనిపిస్తుంది.

ఒక రోజు గుణనిధికి కడుపు నకనకలాడుతుంటుంది. ఎక్కడా అన్నం దొరకదు. ఆరోజు శివరాత్రి కావడంతో ఒక శివ భక్తుడు నైవేద్యం తీసుకుని శివాలయానికి వెళుతుంటాడు. అతని తలమీదున్న పాత్రల్లోని వంటకాల ఘుమఘుమలు గుణనిధికి నోరూరించాయి. ఎలాగైనా వాటిని తినాలనుకున్న గుణనిధి భక్తులందరూ జాగారం చేసి నిద్రపోయే వరకు వేచి ఉండి, తర్వాత దొంగచాటుగా గర్భగుడిలోకి ప్రవేశిస్తాడు. దీపం కొండెక్కిపోతుంటే తన ధోవతిని చింపి వత్తిగా చేసి ప్రమిదలో వేస్తాడు. నైవేద్యపు పాత్రను తీసుకొని బయటకు వస్తుంటే గుణనిధి కాలు ఒకనికి తాకుతుంది. వాడు మేల్కొని దొంగ దొంగ అని అరుస్తాడు. గుణనిధి ఆ పాత్రతో సహా పరుగెత్తుతాడు. వెంట తరుముతూ వచ్చిన తలారులు గుణనిధిని చంపుతారు. అతన్ని తీసుకుపోవడానికి యమభటులు, శివకింకరులు ఇద్దరూ వస్తారు. యమభటులు గుణనిధి పాపాలన్నీ ఏకరువు

పెట్టి, వీడు కైలాసానికి వచ్చేందుకు అర్హుడు కాడంటారు. దానికి శివకింకరులు ఏదైనా పుణ్యకార్యం చేద్దామనుకొని చేయడం ఎంత పుణ్యమైందో– ఎంతటి పాపి అయినా అనుకోకుండా పుణ్యకార్యాన్ని చేయడమూ అంతే పుణ్యాన్నిస్తుంది. ఈశ్వర భక్తి తెలిసినట్లే ఉంటుంది. కానీ, దాని లోతు బ్రహ్మాదులకు కూడా అంతుపట్టదు. వీడు శివరాత్రినాడు అన్నం దొరకక పస్తులున్నాడు. శివాలయంలో మేల్కొని ఉన్నాడు. దీపాన్ని వెలిగించాడు. ఆ వెలుగులో శివున్ని చూశాడు. ఉపవాసం, జాగరణ, దీపారాధన, శివసందర్శన అన్నీ క్రమంలో– అదీ శివరాత్రి నాడే– జరగడం అతని పూర్వజన్మ ఫలితం కాక మరేమిటి? శివసాయుజ్యం పొందేందుకు ఇంతకంటే ఇంకేం కావాలి?" అని యమభటులను ప్రశ్నిస్తారు. చివరికి గుణనిధికి కైలాసప్రాప్తి కలుగుతుంది.

ఇలా గుణనిధి కథను భక్తి కోణంలో పరిశీలిస్తే శివుని అపార కరుణా కటాక్ష విశేషములు అవగతమవుతాయి. అంతేకాక భక్తి వల్ల తరించిన ఒక తామసునిగా గుణనిధి పాత్ర మన ముందు ఆవిష్కృతం అవుతుంది. ఇక నేటి కాలానికి సమన్వయం చేసుకుంటూ చూస్తే ఈ కథ మిక్కిలి సందేశాత్మకంగా కనిపిస్తుంది. ఇలాంటి సార్వజనీనమైన, సార్వకాలీనమైన రచన కాశీఖండంలో ఔపదేశిక ప్రతిపత్తి కలిగిన రసకందంగా గోచరిస్తుంది.

సంప్రదింపు గ్రంథములు:

1. ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యము
2. కాశీఖండం – శ్రీనాథుడు

గురజాడ కవిత్వం – సార్వజనీనత, సార్వకాలీనత

డా॥ కొయ్యా శ్రీనివాసులు, తెలుగు విభాగాధిపతి, యస్.టి.యస్.యన్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కదిరి.
ఫోన్ నెం. 9492625280

కవిత్వమెంతపురాతనమైనదో అంత ఆధునాతనమైనది. కవిత్వం ప్రధానముగా మానవుని అనుభూతులపై ఆధారపడిన కళ కాబట్టి మానవుడున్నంత కాలము కవిత్వం జనిస్తూనే వుంటుంది. లలిత కళలలో అగ్రపీఠము కవిత్వమునకే ఉన్నది. సంగీతము వినినంతసేపు, నాట్యము, చిత్రలేఖనము, శిల్పము చూసినంతసేపు మాత్రమే సామాజికునియందు రస నిష్పత్తి కలుగును. పై వాటిలో లేని స్థిరత్వం కవిత్వమున ఉన్నది. కవిత్వము వలన సామాజికునకు కలుగు రసానందం బ్రహ్మానంద సబ్రహ్మచారి. అందుకే ఋషులు, వేదాంతులు, సంఘసంస్కర్తలు సైతం నిగూఢ భావబోధనకు కవిత్వమును సాధనముగా స్వీకరించారు.

కవిత్వము రచించువాడు కవి. ఆ కవికి వర్తమానాన్ని, గతాన్ని, భవిష్యత్తును దర్శించు నేర్పుండవలెను. త్రికాల వేదిత్వము ఋషులకు సహజము. కవిలో ఋషిత్వమున్నది కాబట్టి ప్రజ్ఞావంతుడైన కవి భూత, వర్తమాన, భవిష్యత్తులను దర్శించగల నేర్పు కలిగి వుండును. ఈ మూడింటిలో గతము తెలిసికొనుట ఘనవిషయం కాదు. వర్తమాన దర్శనము కూడా దుర్లభం కాదు. కానీ భవిష్యత్తు దర్శనమే చాలా గొప్పది. దానిని ఏ కవి తన కవిత్వంలో దర్శింపజేస్తాడో అతడే మహాకవి. గురజాడ అప్పారావు (1862–1915) కవిత్వంలో భవిష్యదర్శనము కనిపిస్తుంది. ఆయన కవిత్వంలో దర్శనశక్తి, సృజనశక్తి ప్రబలంగా వుంటాయి. అందుకే ఆయన కవితలలో సార్వజనీన, సార్వకాలీన లక్షణం ఉంది కాబట్టి వంద సంవత్సరాలు పైబడ్డా కూడా నిత్యనూతనంగా వెలుగొందుతూనే ఉంది.

కందుకూరి సాంఘిక విప్లవాన్ని, గిడుగు భాషా విప్లవాన్ని తనలో సమన్వయించుకొని సరికొత్త సాహితీ మార్గాన్ని చూపిన నవయుగ వైతాళికుడు గురజాడ. వీరు తమ రచనల ద్వారా ఆధునిక తెలుగు సాహితీ వికాసమునకు వెలుగుబాట వేసినాడు. ఆధునిక కవిత్వములో వచ్చిన అన్ని కవిత్వోద్యమాలలోనూ అప్పారావు గారి ప్రభావం వెలకట్ట లేనిది. సంఘ సంస్కరణ లక్ష్యముగా సాహిత్యాన్ని సృజించుటయే గాక, ఆమోఘమైన కల్పనా చాతుర్యమును కూడా ప్రదర్శించినాడు. ఈయన తన సాహిత్యంలో అస్పృశ్యముగా పడియున్న వాడుక భాషకు అందల మెక్కించాడు. సాహిత్యము సామాన్యునికి దగ్గర చేసిన ఘనత గురజాడకే చెందుతుంది.

గురజాడ అప్పారావు మొదట సాంప్రదాయకమైన రీతిలో ప్రాచీన వృత్తములలో 'మాటల మబ్బులు' 'పుష్పలావికలు', 'మెరుపులు' అను ఖండకావ్యములను, 'సుభద్ర' అను కావ్యమును 'ముతుశతకము'ను రచించానడు.

సీ॥ కస్తూరి గన్నేరు కావి చీర మెఱంగు
మేని చాయకు వింతమిసిమి గొలుప
చెలరేగు ముంగురుల్ చేర్చికట్టిన జోతి
యిరులపై రిక్కల కరణి వెలుగ
పైటపై దూగాడు పచ్చల హారముల్
చలిదింద్ర చాపంబు చాడ్పు జూప
నిద్దంపు జెక్కుల దిద్దిన పత్రముల్
మకురాంకు బిరుదాల మాడ్కివఱల

తే॥ మెఱపు కెమ్మబ్బులోపల మెఱయునట్లు
వలిపమున మేల్మిమొలనూలు తళుకులీన
భద్ర నడతెంచె బంగరు పళ్ళెరముల
బండ్లు బూవులు గొనుచు సపర్యకారకు

సుభద్ర కావ్యము

ఈ విధంగా అప్పారావు గారు మొదట ప్రభంధ కవుల శైలిలో ప్రౌఢ కవిత్వాన్ని సృష్టించాడు. ఆ తర్వాత ప్రబంధ రీతులకు తిలోదకములిచ్చి వాడుక భాషతో చేతులు కలిపి, కవిత్వములో కొత్త బాట వేయాలనే సంకల్పముతో నవ్యకవిత్వానికి బాటలు వేశాడు. "క్రొత్త పాతల మేలు కలయిక క్రొమ్మెరుంగులు చిమ్మగా "తేటైన మాటల' ముత్యాల సరములు ఛందస్సు కూర్చుకొని నవ్యరీతులకు గురజాడ ఒరవడి పెట్టినారు.

గురజాడ వారు క్రీ.శ. 1910లో 'ముత్యాల సరాలు' అను సంపుటిలో ముత్యాల సరాలు, కాసులు, లవణరాజు కల, కన్యక, డామన్ పిథియస్, పూర్ణమ్మ, మనిషి, దేశభక్తి, దించులంగరు, లంగరెత్తుము, మిణుగురులు, ఇత్యాది గేయఖండికలు ముఖ్యమైనవి. ఈ గేయ ఖండికలలో వ్యావహారిక భాషా సౌలభ్యం, వాస్తవికత, సాంఘిక జీవన చిత్రణం ఛందస్సులో దేశితనము, అభ్యుదయ దృక్పథం, సమకాలీనత్వం, ఉపదేశం, భావతీవ్రత, భవిష్యదర్శనము మొ॥ గుణాలు ఉండడం మూలాన తెలుగు సాహిత్యంలో శాశ్వితకీర్తిని మూటగట్టుకుంది.

'కాసులు' అనుగేయము పవిత్ర దాంపత్యాను రక్తిని ప్రతిపాదించిన చక్కని కవిత్వము ఇందులో ఒక ఆలుమగల జంట ద్వారా అప్పారావు గారు ప్రణయమును గూర్చి, విశ్వమానవ ప్రేమను గూర్చి తనకున్న అభిప్రాయములను వ్యక్తము చేసినాడు.

"మరులు ప్రేమని మదిదలంచకు
మరులు మరలును వయసుతోడనె
మాయ మర్మములేని నేస్తము
మగువలకు మగవారి కొక్కటె
బ్రతుకు సుకమునకు రాజమార్గము
ప్రేమ నిచ్చిన ప్రేమ వచ్చును
ప్రేమ నిలిపిన, ప్రేమ నిలుచును.

అను చరణములలో అప్పారావు గారు, ప్రేమకు, కామమునకు గల బేధాన్ని నిరూపించారు. కామము వయసుతోనే చల్లారిపొతుంది. అచ్చమైన ప్రేమ ఒక్కటే దంపతుల సుఖజీవితానికి రాజమార్గము అని ప్రతిపాదించారు. నేటి యువతీ యువకులు ఆకర్షణకు లోనై అదే ప్రేమ అని భ్రమపడి పెళ్ళి చేసుకొని ఘరషణపడి ఏండ్లు గడవకముందే విడాకులు పుచ్చుకొండున్నారు. నేటి యువతకు మార్గదర్శకత్వం 'కాసులు' గేయములో కనపడుతుంది. తోటి మానవున్ని ప్రేమించుటకన్నా ఘనకార్యము లేదని అప్పారావు గారి అభిప్రాయం.

ఆనాటి సంఘాన్ని సంస్కరించాలనే దృక్పథము కలిగిన అప్పారావు గారు 1910 సం॥లో ఆకాశంలో హేలీ తొకచుక్క కనిపించినపుడు ప్రజల్లో కలిగిన భయాందోళనలను 'చన్న కాలపు చిన్న బుద్ధులు, బెదరి యెంచిరి కీడుగా' అంటూ కవిత్వీకరించారు. ఇదే గేయంలో

"యెల్ల లోకము వొక్కయిల్లె
వర్ణబేధము లెల్ల కల్లె
వేలనెరుగని ప్రేమబంధము
వెడుకలు కురియ
మతములన్నియు మాసిపోవును
జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును
అంత స్వర్గ సుఖంబులన్నవి
యవని విలసిల్లున్"

ఇరవైవ శతాబ్ది ప్రథమ పాదములోనే ఇంతటి విశాలమైన అభిప్రాయములు కలిగి వుండటం గొప్ప విషయం. మతము గుడిబండ వంటిదని, మానవులలో వైరుధ్యాలకు కారణమని, ఏదో ఒక రోజు ఈ భూమ్మీద మతము కనుమరుగై పోతుందని, దాని స్థానంలో విశ్వమానవ ప్రేమ వర్ధిల్లుతుందని విశ్వాసం వ్యక్తం చేశాడు.

గాంధీజీ దేశంలో హరిజనోద్యమము ప్రారంభించక ముందే అప్పారావు గారు 'లవణరాజు కల'లో

"మలిన దేహుల మాలలనుచును
మలిన చిత్తుల కథిక కులముల
నెల వొసంగిన వర్ణ ధర్మమ
ధర్మ ధర్మంబే"

అని 'మాల' అన్న భేదము కులమును బట్టిగాక, మనస్సును బట్టి కలగాలని ప్రతిపాదించి వర్ణవ్యవస్థను ఖండించారు.

"మంచి చెడ్డలు మనుజులందున
ఎంచి చూడగ రెండెకులములు
మంచియన్నది మాలయైతే
మాలనే అగుదున్"

అంటూ దళిత సమస్యను, భారతీయ సంస్కృతికి మచ్చలాంటి అస్పృశ్యతా సమస్యకు ఏనాడో కావ్య గౌరవం కల్పించాడు అందుకే కవి భవిష్యద్ద్రష్ట.

బాల్యవివాహముల మీద గురజాడ రచించిన కరుణ రసాత్మకమైన గేయము 'పూర్ణమ్మ' ఇందు కాసుల కోసం కక్కుర్తిపడి కన్యలను ముసలివారికి పెండ్లి చేయు సాంఘిక దురాచారమును ఖండించిరి. ఈ దురాచారమునకై బలియైన ఆత్మహత్య చేసుకున్న విషయము కరుణ రసార్ధపూరితంగా చిత్రించారు.

"కన్నుల కాంతులు కలువల జేరెను
మేలిమి జేరెను మేని పసల్
హంసల జేరెను నడకల బెడగులు
దుర్గను జేరెను పూర్ణమ్మ"

గురజాడ రచనలలో 'పూర్ణమ్మ' కవిత అత్యంత ప్రతిభావంతమైనది. ఈ గేయములో కనబరచిన భావనాశక్తి, శిల్పదృష్టి, శబ్ద మాధుర్యము గురజాడను మహాకవుల సరసన నిలబెట్టింది. గురజాడ రచనలను ముఖ్యంగా 'కన్యాశుల్కం' నాటకం రాయకున్నా కూడా ఈ ఒక్క పూర్ణమ్మ కథా గేయంతోనే గురజాడను మహాకవిగా ఎన్నవచ్చు. అంతగొప్ప రసప్లావిత కథాగేయం 'పూర్ణమ్మ'

గురజాడవారి 'దేశభక్తి' గేయము భారతీయ సాహిత్యంలోనే ఆణిముత్యము వంటిదని సాహితీ విమర్శకుల భావన ఇందులోని ఒక్కొక్క పాదం నిజంగా ఒక్కొక్క ఆణిముత్యంలాంటిది. బంకించంద్ర చటర్జీ 'వందేమాతరం', రవీంద్రనాథ్ ఠాగూర్ 'జనగణమన', మహ్మద్ ఇక్బాల్ 'సారేజహాసె అచ్చా' అను గేయములు గొప్ప జాతీయగేములే ఐనను, ఇవి భారతదేశ సంకీర్తనమే లక్ష్యముగా గలవి. అప్పారావు గారి 'దేశభక్తి' గేయం విశేషమేమంటే, స్వదేశీయులలో దేశభక్తిని నూరిపోయుచునే ప్రపంచంలోని సమస్త జాతులలో విశ్వమానవ ప్రేమను ఉద్బోధించు చున్నది. అందువలననే ఏ జాతీయ గీతానికి లేని విశిష్టత దీనికబ్బినది.

"దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
వొట్టి మాటలు కట్టిపెట్టోయ్
గట్టి మేల్ తలపెట్టవోయ్"

అంటూ దేశాభిమానాన్ని జాతి జనులలో నూరి పోశాడు.

"సొంతలాభం కొంతమానుకు
పొరుగు వాడికి తోడు పడవోయ్
దేశమంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుషులోయ్"
అంటూ కర్తవ్యాన్ని ప్రభోధించాడు.

గురజాడ దేశభక్తి గేయము కొందరి దృష్టిలో వాచక పుస్తకములోని నీతుల వంటిది మాత్రమే. కానీ శ్రీశ్రీ వంటి వారికది సమస్త ప్రపంచ మహాజనుల జాతీయగీతంగా కనిపించింది. 'అన్నదమ్ముల వలెను జాతులు–మతములన్నీ మెలగవలెనోయ్' అని హిందూ, ముస్లిం సోదరుల్లా మెలగాలని అప్పుడే దేశానికి క్షేమమని ఉద్బోధించాడు. గురజాడ వారి దేశభక్తి గేయం ఎల్లలకు అతీతమైనదని, విశ్వమానవ ప్రేమను కాంక్షించును అని తెలియుచున్నది. ఇది భారతజాతిని దృష్టిలో పెట్టుకొని అంతర్జాతీయ దృక్పథమునకు అనుగుణంగా రచింపబడిన జాతీయ రచన.

గురజాడ వ్రాసిన 'మనిషి' అను గేయము మానవతా వాదానికి చక్కని ప్రతినిధి.

"మనిషి చేసిన రాయిరప్పకి
మహిమకలదని సాగి మొక్కుతు
మనుషులంటే రాయి రప్పల కన్న కనిష్టం"

రాయిరప్పలను మొక్కుతూ మనుషులను హీనంగా చూడడం వారికి నచ్చదు. మనిషిలో ఉన్న దేవున్ని దర్శించవలెనని అతని ఉద్బోధ. మానవతావదమును 'మనిషి' గేయములో చక్కగా ప్రబోధించాడు. ఇక్కడ గురజాడ మరో యేగివేమన వలే హితబోధ చేస్తాడు.

ఎక్కడ మంచి ఉన్నా దాన్ని స్వీకరించాలనేది గురజాడ భావన. ఆంగ్లేయుల వివేచనాత్మక దృష్టిని ఈ విధంగా ప్రశంసించారు.

'కన్ను కానని వస్తుతత్త్వము
కాంచనేర్పరు లింగిరీజులు
కల్ల నొల్లరు వారి విద్యల
కరచి సత్యము నరసితిన్"

నూతన కవిత్వమును మెచ్చలేని సనాతన పండితులను ఈ సడించుచు గురజాడ

"మెచ్చనంటా వీవు, నీవిక
మెచ్చకుంటే మించిపాయెను
కొయ్య బొమ్మలె మెచ్చు కళ్ళకు
కోమలుల సారెక్కునా?" అని అవహేళన చేశాడు.

గురజాడ 'కన్యక' గేయములో రాచరికములోని అహంభావాన్ని, నియంతృత్వాన్ని నిరసిస్తూ, కన్యక అత్మాభిమానాన్ని హృద్యంగా ఆవిష్కరించాడు.

"పట్టపగలే, నట్టి వీధిని, పట్టబోరే జార చోరులు
పట్టదలచితి వింక నీవొక, పట్టమేలే రాజువట"
అని అంటూ

"పట్టమేలే రాజు పోయెను, మట్టి కలిసెను కోటపేటలు
పదం పద్యం పట్టి నిలిచెను, కీర్తులపకీర్తుల్"

గురజాడ గజపతుల సంస్థానంలో రీవా మహారాణి, అప్పలకొండమాంబ గారికి వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేశారు. రాజుల ఠీవిని స్వయంగా చూసినవాడు. కనుకనే ఎంతో భావనాబలంతో 'కన్యక' గేయాన్ని అక్షరబద్ధం చేశాడు.

గురజాడ రచించిన 'డామన్ పితియస్' అనునది గ్రీకు కథావస్తువును ఆధారముగా గ్రహించి వ్రాయబడిన కథాగేయము.

"వొకటి తలచును నరుడు మది, వే
రొకటి తలచును బ్రహ్మ వినమే?
పోకరాకల నడుమ నడ్డము
లెన్ని తలపడునో?"

ఇందులో 'డామను,పితియను'ల ఆదర్శమైత్రి రమ్యరీతిలో వర్ణితమైనది

గురజాడ కవిత్వం కాల పరీక్షకు నిలువదగిన సార్వజనీనతను, సార్వకాలీనతను సంపాదించుకొన్నది. కవిత్రయ మహాభారతం, పోతన భాగవతం, వేమన పద్యాలవలె గురజాడ కవిత్వం సార్వజనీనత్వం, శాశ్వతత్వమును సాధించినది. మానవత్వాన్ని ప్రబోధించి, విశ్వమానవ ప్రేమను రంగరించి మత మౌఢ్యాన్ని నిరసించి దేశభక్తిని ప్రబోధించి, వ్యావహారిక భాషకు పట్టం కట్టిన గురజాడ కవిత్వం తెలుగు సాహితీ లోకానికి ఎన్నటికీ వెలుగు జాడే!.

ఆధార గ్రంథాలు :

1. ఆధునికాంధ్ర కవిత్వం–సంప్రదాయాలు–ప్రయోగాలు – డా॥సి.నారాయణ రెడ్డి
2. తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటం) – జి.నాగయ్య
3. ముత్యాల సరాలు సంపుటి – విశాలాంధ్ర పబ్లికేషన్స్

భారతీయ సంస్కృతి-విశిష్టత

కె.యస్.సుందరేశ్వరరావు, ఆంధ్రోపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రొద్దుటూరు.

1) పరిచయం:

సంస్కృతి అనే పదానికి అభివృద్ధి, పురోగమనం, ఉత్పత్తి అని అనేకవిధాల అర్థాలు వాడుకలో ఉన్నాయి. దీన్నిబట్టి ఒక జాతి "సంస్కృతి"లో, ఆ జాతిజనులకు సంబంధించిన అన్ని విషయాలు చేరతాయని తెలుస్తుంది. ఒక ప్రత్యేకమైన అర్థంలో 'సంస్కృతి' అనేపదం మానవ శరీరం, ఆత్మ, మనస్సు మొదలైన విషయాలను కూడ చర్చించేదిగా వ్యవహరంలో ఉంది. మంచి సంస్కారం, నాగరికమైన ప్రవర్తన అనే అంశాలు ఆయా జాతిజనుల సంస్కృతిలోని భాగాలే. ఇందులో ఇంకా వారి కళలు, సామాజిక జీవనం, నృత్యరీతులు మొదలైన అంశాలు కూడా చేరతాయి. ఒక జాతికి చెందిన కళలు సాహిత్యం, మతము, సాంఘిక జీవనము వారి సంస్కృతిని ప్రతిబింబిస్తుంది.

నిజానికి 'సంస్కృతి' ఒక జాతి జనుల సమిష్టి సృష్టి. అది వారి సామాజిక విలువలకు, వికాసానికి సంబంధించిన అంశం. భారతీయ సంస్కృతికి ఒక ప్రత్యేకత ఉంది. కొన్ని వేల సంవత్సరాలుగా భారతీయ సంస్కృతి తనను తాను రక్షించుకొంటూ ఇప్పటికీ ఉనికిలో ఉంది. విదేశీయుల దండయాత్రలు, పాలన ప్రభావం భారతీయ సంస్కృతిని మార్చలేకపోయాయి. యూరోపియన్, ఇస్లామిక్ దేశాల సంస్కృతుల ప్రభావం ఉన్నా, అవి భారతీయ సంస్కృతిలో కలిసిపోయాయే గాని, దాన్ని తీవ్రంగా ప్రభావితం చేయలేకపోయాయి. కొన్ని శతాబ్దాలుగా ఎన్ని ప్రభావాలు, దాడులు భారతీయ సంస్కృతిపై విరుచుకుపడినా అది హిమాలయాలంత ఉన్నతంగానే నిలిచి, తన ప్రత్యేకతను చాటుకుంది. భారతీయసంస్కృతిని చతుర్వేదాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తులు సజీవంగా ఉంచగలిగాయి.

2) భారతీయ సంస్కృతి-భారతీయ ధర్మం-ఆధ్యాత్మికత:

భారతదేశ ఆధ్యాత్మిక వారసత్వం అపరిమితమైంది, అత్యంత సంపన్నమైంది. దీని జన్మస్థానం భారతదేశమే అయినా, సకల ప్రపంచమానవ జీవితానికి సంబంధించిన అన్ని పార్శ్వాలకు ఈ సంస్కృతి వర్తిస్తుంది. ఇది సార్వకాలికం, సార్వజనీనం. భారతీయ సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వం అందించే సందేశంలో మతపరమైన అంశాలకు గానీ, వర్గదృష్టికి గానీ చోటులేదు. కేవలం మానవ వికాసం, ప్రగతి, సర్వోత్కృష్ట కార్యసాధనే దాని లక్ష్యం. అది సార్వజనీన మానవతాభావం. మానవ సమాజం మనుగడకు, వికాసానికి అవసరమైన కొన్ని శాశ్వత విలువలను నిరంతరం పాటించడం భారతీయ ధర్మం. వాటిని ఉపేక్షిస్తే సమాజం విచ్ఛిన్నమై, క్షీణించి, పతనమవుతుంది. గతంలో వాటిని స్థిరంగా ఆచరించడంవల్లనే భారతదేశం ఒక మహోత్కృష్టమైన సాంస్కృతికజీవనాన్ని, వారసత్వాన్ని వేలాది సంవత్సరాలుగా నిలుపుకోగలిగింది.

సుదీర్ఘ చరిత్రలో ఎన్నోసార్లు విదేశీయ దండయాత్రల వల్ల, అంత:కలహాలవల్ల దేశ నాగరికత దాదాపు నాశనమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. గ్రీకులు, సిథియన్లు, పర్షియన్లు, మొఘలులు, ఫ్రెంచివారు, ఇంగ్లీషువారు ఈ దేశ సంస్కృతిని, నాగరికతను ధ్వంసం చేయడానికి తమవంతు ప్రయత్నం చేసినా అది పూర్తిగా విజయవంతం కాలేదు. కొత్త సంస్కృతులను ఎదుర్కోవాల్సి వచ్చినప్పుడు, ఒక్కసారిగా జ్ఞానవిస్తరణ జరిగినప్పుడు భారతీయుడు క్షణికమైన ఆకర్షణలకు వశంకాడు. తన సాంప్రదాయ విశ్వాసానికే బద్ధుడై ఉంటాడు. కొత్తదాన్ని వీలైనంతవరకు స్వీకరించి, పాత అంశాలతో చేరుస్తాడు. ఈ సాంప్రదాయ రక్షక ఉదారవాదమే భారతీయ నాగరికతా సంస్కృతుల విజయరహస్యం. ప్రపంచంలోని గొప్ప పురాతన నాగరికత,

సంస్కృతుల్లో భారతీయ సంస్కృతి, నాగరికతలే ఇప్పటికీ సజీవంగా ఉన్నాయి. ఈజిప్ట్ బాబిలోనియా, ప్రాచీన రోమన్ సంస్కృతులు గతకాలపు స్మృతులుగానే మిగిలిపోయాయి. దాదాపు నాలుగువేలఏళ్ళ ప్రాచీనమైన మన భారతీయ నాగరికత తన ముఖ్య లక్షణాలను ఇప్పటికీ నిలుపుకుంది.

భారతీయ సంస్కృతి విలక్షణమైనది. మనిషి జీవితం కఠోరమైన కులాచారాలకు కట్టుబడి ఉన్నప్పటికీ, అభిప్రాయాలను వెల్లడించడంలో అతనికి స్వేచ్ఛఉంది. ఇప్పుడిప్పుడే కులసంకెళ్ళు భారతీయ సమాజంలో కొద్ది కొద్దిగా విడిపోతున్నాయి. మరే దేశంలో లేని స్వేచ్ఛ ఇక్కడ ఉంది. దాశరథిరంగాచార్య గారి అభిప్రాయంలో – "భారత భూమిలో మతభ్రష్టుడు, సంశయాళువు, నమ్మకంలేనివాడు, హేతువాది, స్వతంత్ర ఆలోచనాపరుడు, భౌతికవాది, ఆనందవాది–అందరూ క్షేమంగా వర్ధిల్లుతున్నారు". అయితే ప్రాచీన భారతీయులు లోకోత్తర విలువల రహస్యాన్ని చేధించే మానవత్వాన్ని మాత్రమే పరిశీలించారన్న ఆరోపణ ఒకటి ఉంది. కానీ అది అపోహమాత్రమే. భారతజాతి సమిష్టి, వ్యష్టి జీవనాల వివిధాంశాలను శోధించి అభివృద్ధిపరచింది. సాంఘిక, రాజకీయవ్యవస్థలు, భౌతిక శాస్త్రాలు, కళలు, సాహిత్యం, సంతోషకరమైన జీవనం–ఇవన్నీ ఆ జాబితాలో చేరతాయి. ప్రజాజీవనం అన్ని విధాలా సంతోషకరంగా ఉండాలనేది భారతీయుల భావన.

3) ప్రపంచీకరణ–విషసంస్కృతి:

Globalization అనే ఆంగ్లపదాన్ని తెలుగులో 'ప్రపంచీకరణ' అంటున్నాం. స్వేచ్ఛావాణిజ్యానికి అవరోధాలు తొలగించడం, జాతీయ ఆర్థికవ్యవస్థలను మరింత సన్నిహితంగా ముడివేయడం దీని లక్ష్యాలు. వర్ధమాన దేశాలు దారిద్ర్యాన్ని అధిగమించి అభివృద్ధి సాధించాలంటే ప్రపంచీకరణను అనుసరించాల్సిందే. కానీ చాలా వర్ధమానదేశాలకు 'ప్రపంచీకరణ', తాను వాగ్దానం చేసిన లాభాలను తెచ్చిపెట్టకపోగా, ధనిక–పేద వ్యత్యాసం మరింత పెరిగింది. పర్యావరణం ధ్వంసమయింది. రాజకీయ అవినీతి పెరిగింది. వేగంగా చోటుచేసుకున్న మార్పులు, ఆ దేశాలు సాంస్కృతికంగా తగిన రీతిలో మారడానికి అవసరమైన సమయం ఇవ్వలేదు. ఈ మార్పుల ఫలితంగా తలెత్తిన సంక్షోభాలు విపరీతమైన నిరుద్యోగాన్ని తెచ్చిపెట్టాయి. ప్రైవేటీకరణ వల్ల లాభాలు రాకపోగా, విపరీత సమస్యలు వచ్చిపడ్డాయి. ఈ వైఫల్యాలవల్ల మొత్తం ప్రైవేటీకరణ భావానికే వ్యతిరేకత పెరిగింది.

ఐతే ప్రపంచీకరణవల్ల లాభాలు లేకపోలేదు. వర్ధమానదేశాలలో ప్రజల ఏకాకితనాన్ని ప్రపంచీకరణ చాలావరకు తగ్గించివేసింది. ఒక శతాబ్దం క్రితం ప్రపంచంలోని అతి సంపన్న దేశాల వారికి సైతం అందుబాటులో లేని విజ్ఞానం, నేడు వర్ధమానదేశాల్లోని ప్రజలకు అందుబాటులో ఉంది. అయినంత మాత్రన ఈ స్థాయిలో విధ్వంసాన్ని ఆహ్వానించడం మనదేశానికి శ్రేయస్కరం కాదు.

ప్రపంచీకరణ విష సంస్కృతి మనదేశానికీ పాకింది. రాజకీయుల జేబులు నింపుతోంది. ప్రజలను మరింత దుర్భర దారిద్ర్యంలోనికి నెడుతోంది. భారతీయ యువత ఈ రాక్షస నాగరికతవైపు పరుగులు తీస్తున్నారు.ఇది ప్రమాదకరసమయం. జాగరూకులం కాకపోతే తీవ్ర నష్టం జరగనుంది.

4) భారతీయ సంస్కృతి–విశిష్టత:

ఆధ్యాత్మికత భారతీయ సంస్కృతికి పునాది. కేవలం ప్రాపంచికమైన పునాదులు గల పాశ్చాత్య నాగరికతల కంటే భారతీయ సంస్కృతి భిన్నమైనది. భారతీయచింతనలో దేవునికి, మనిషికి మధ్య స్నేహపూర్వకసామరస్యం ఉంటే, పాశ్చాత్యచింతనలో వారి మధ్య వైరుధ్యం స్పష్టంగా కనిపిస్తుంది. పాశ్చాత్యదేశాల్లో పారిశ్రామికవిప్లవం వల్ల మతప్రోక్తమైన భావాలు, విలువలు నశించాయి. వాటి స్థానంలో తాత్కాలికంగా వచ్చిన సాంఘికదురాచారాలను

ఖండిస్తూ, మతంలో విశ్వాసాన్ని పునరుద్ధరించే ఉద్యమాలు విజృంభించాయి. ఆ పరిస్థితుల్లో తాము కోల్పోతున్న మతసంప్రదాయాలు, విలువలు భారతీయ సంస్కృతిలో వేళ్ళూనుకొని ఉండడం పాశ్చాత్యులకు ఆశ్చర్యం కలిగించింది. భారతీయ విజ్ఞానగనులైన చతుర్వేదాలను ప్రాచ్య, పాశ్చాత్యమేధావులందరూ లోతుగా పరిశోధించారు. ఈ గ్రంథాలను, ప్రపంచంలోని ఇతరదేశాల్లో వచ్చిన గ్రంథాలలో పోల్చిచూశారు. ఈ విధంగా వారు ప్రాచీన భారతదేశానికి చెందిన తత్వశాస్త్రం, విజ్ఞానం, సాహిత్యం మొదలైన వాటిని 'మతం' అనే తెర ఏదీ లేకుండా, వైజ్ఞానికంగా అధ్యయనం చేసే ఒక కొత్తశాఖను అభివృద్ధి చేశారు. మొదటగా ఈ పనిని జర్మనీ, తదితర ఐరోపా దేశాలే ప్రారంభించడం విశేషం. ఈ పరిశోధనల ఫలితంగా ప్రాచ్య పాశ్చాత్య మేధావులు "ప్రాచీన కాలంలో వర్ధిల్లిన వేరే ఏ ఇతర సంస్కృతికీ భారతీయ సంస్కృతి తీసిపోదు" అని నిర్ధారించారు.

కేవలం ప్రాపంచికవిలువలకు ప్రాధాన్యమిచ్చే పాశ్చాత్యప్రపంచం సార్వజనీన విలువలకోసం, పారమార్థిక విషయాలకోసం భారతదేశం వైపు చూస్తోంది. భారతీయ తాత్విక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని గూర్చి వినడానికి, తెలుసుకోవడానికి, నద్వినియోగం చేసుకోవడానికి కమ్యూనిస్టు దేశాలలో సహా యావత్ ప్రపంచం సిద్ధంగా ఉంది.

5) భారతీయ సంస్కృతిపై విషప్రచారం:

మానవుణ్ణి మంచివాణ్ణి చేయడానికి, మంచి మార్గంలో నడిపించడానికి అనాది నుండి అనేకసంస్థలు, ఆచారాలు, సాంప్రదాయాలు ఏర్పడుతూనే ఉన్నాయి. నిరంతరయత్నం వల్ల మహర్షులు, మహాత్ములు వాటిని ప్రచారం చేస్తూనే ఉన్నారు. అందులో భాగంగా ఏర్పడిన వేదాలకు కొందరు స్వార్థపరులు వక్రభాష్యాలు కల్పిస్తున్నారు. వర్ణవ్యవస్థను సమర్థించే కొందరు స్వప్రయోజనపరులను చూపిస్తూ, మొత్తం వేద సంస్కృతినే అవాస్తవంగా చిత్రించే ప్రచారం జరుగుతోంది. వేదకర్మలే ఉపాధిగా జీవిస్తున్న కొంతమందిని నెపంగా చూపి, భారతీయ సనాతనధర్మాన్ని పతనం చేయాలనే కుట్ర జరుగుతోంది. వేదంలో ఎక్కడా, వేదాధ్యయనం కొందరికి మాత్రమే పరిమితమైనట్లు గానీ, కొందరిని నిషేధించినట్లుగానీ ఆధారాలు కనబడవు. తాత్కాలికమైన ఆధిపత్యధోరణులు కొన్నిచోట్ల నడిచి ఉండవచ్చు. అయినంత మాత్రాన మొత్తం వ్యవస్థను ధిక్కరించడం ఉన్మాదమే అవుతుంది. భారతం ఒక నేల కాదు, ఒక దేశం కాదు – భారతం ఒక సంస్కృతి, ఒక విశ్వాసం, ఒక న్యాయం, ఒక సత్యం. దానికి రాజకీయ హద్దులు లేవు. అదొక జీవనవిధానం. వేదాల్ని దర్శించడానికి వేదదృష్టి కావాలి. హ్రస్వదృష్టి, అన్యదృష్టి చాలవు. భారతవేదాన్ని భారత కాలమానంలో కొలవాలి, పాశ్చాత్య కొలమానాలతో కాదు.

ఇలా భారతీయ సంస్కృతిపై జరుగుతున్న దాడిలో ప్రధాన ఉద్దేశం, భారతీయుల ఐక్యతను దెబ్బతీయడం. తద్వారా కుటుంబవ్యవస్థ పతనం, సామాజిక పతనం, వ్యక్తిపతనం సంభవిస్తాయి. వ్యాపార, కార్పోరేటుకంపెనీల లక్ష్యం పూర్తిగా నెరవేరే ప్రమాదం ఉంది. సామ్రాజ్యవాద ధోరణిలోని ప్రమాదకరమైన ఆలోచనావిధానం దీనికంతటికీ కారణంగా కనిపిస్తుంది.

దేశభక్తులు, ఉదారవాదులు మనసంస్కృతిలోని మానవత్వం మొదలైన విశిష్ట లక్షణాలున్నాయని చెబుతున్నా, అవి నవతరాలకు చేరడంలేదని చాలామంది అభ్యుదయవాదుల ఆరోపణ. ఇది కొంత నిజమేకావచ్చు, మన ప్రాచీన సంస్కృతిలో గొప్పవి, అభ్యుదయకరమైనవి, నిరంకుశమైనవి అయిన అంశాలను తెలుసుకున్నట్లే, అభివృద్ధి నిరోధకమైనవి, నిరంకుశమైనవి ఐన అంశాలను తొలగించుకోవలసిన అనంతరం కూడా ఉంది. ఈ ముసుగులో గతమంతా దోపిడీయే నడిచిందని, ప్రాచీన భారతీయ సంస్కృతిలో ఏ విశిష్టతా లేదని ఒక విషప్రచారం

నడుస్తున్న పరిస్థితి కనిపిస్తుంది. దీని వెనుక విదేశీ మతపెద్దల, విదేశీ సంస్థల హస్తం ఉన్నట్లు సాక్ష్యాలు కనబడుతున్నాయి.

'అస్పృశ్యత' అనే దురాచారం మనదేశ సంస్కృతిలో ఒక మచ్చగా మిగిలిపోయింది. నిజానికి అస్పృశ్యత అనే పేరు మనుస్మృతిలో గాని, భారతరామయణాల్లో గాని, మరే ఇతర స్మృతి గ్రంథాల్లోగాని లేదు. చండాలుడనే పదం ఉందిగానీ, అది ఈనాడు షెడ్యూల్డ్ కులాలుగా భావించే వర్గాన్ని ఉద్దేశించి చెప్పింది కాదు. బ్రాహ్మణస్త్రీకి శూద్రుడితో కలిగిన సంబంధంవల్ల పుట్టిన వాళ్ళను చండాలురని, వారిని దూరంగా పెట్టాలని స్మృతుల్లో ఉంది. వీరిని శూద్రుల్లో భాగంగానే చెప్పారు. క్రమక్రమంగా ఈపదం షెడ్యూల్డ్ కులాలకు ఎలా అన్వయించబడిందో పరిశీలించవలసి ఉంది. భారతఖండంలో ఒకే సంస్కృతి ఉన్నంతకాలం ఈ వర్గాలవారు అందులోనే ఉన్నా, ఇతర సంస్కృతులతో సంపర్కం కలిగిన తర్వాత మెల్ల మెల్లగా వారంతా మారిపోయారు. తర్వాతి కాలంలో అస్పృశ్యతకు, బ్రాహ్మణ వర్గాలకూ సంబంధాన్ని కల్పించడం, కేవలం బ్రాహ్మణ వర్గాన్ని మాత్రమే గురిపెట్టి నిందించడం మనం గమనించవచ్చు.

ముగింపు :

భారతీయవేద వాఙ్మయం, సంప్రదాయ సాహిత్యసారం అంతా ఒక్కటే. అది మనిషిని మనీషిగా మలుస్తుంది. వసుధైకకుటుంబభావనను ప్రచారం చేస్తుంది. భారతజాతి వేల సంవత్సరాలుగా ఇదే నాగరికతతో వర్ధిల్లింది. భారతీయ సంస్కృతిని, నాగరికతల ఔన్నత్యాన్ని విదేశీయులు సైతం కొనియాడారు. అయితే ఆధునిక కాలంలో ఆ సంస్కృతి నిర్లక్ష్యానికి గురైంది. పారిశ్రామికీకరణ, ప్రపంచీకరణ నేపథ్యంలో మనిషి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. మనిషి యంత్రంలా మారిపోయాడు. ఈ పరిస్థితుల్లో మానవతకు చోటే లేకుండా పోయింది. సంప్రదాయం, మార్క్సిజం – ఈ రెండూ మానవశ్రేయస్సునే కాంక్షిస్తాయి. కానీ వాటి మార్గాలు భిన్నం. వర్గవాదాన్ని ఆశ్రయించే మార్క్సిజం, భక్తిమార్గాన్ని ఆశ్రయించే సంప్రదాయం–ఈ రెండింటి నుంచి పరిణమించిన భారతీయ తాత్వికవిజ్ఞానం లోని అంతస్సారం, అంతిమలక్ష్యం– మానవాళి శ్రేయస్సే.

తెలుగు సాహిత్యంలో వైష్ణవ భక్తి ఉద్యమం

డా॥ కె. సుధాకర్, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

మానవులు తమ అవసరాలను, ఆలోచనలను బట్టి వారి మనస్సుల్లో చెలరేగే కోరికల్ని తీర్చుకోవడానికి ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటారు. వాటికి కొన్ని సిద్ధాంతాలను, నియమావళిని ఏర్పరుచుకుంటారు. తమ లక్ష్యసాధనకు ఆ లక్ష్యం ద్వారా పురోగతిని సాధించడానికి మానవులు కృషి చేస్తుంటారు. సామాజిక పరమైన ఏవిధమైన మార్పులకైనా ప్రయత్నం తప్పనిసరి. వ్యక్తి పరిణతకు, సమాజ పరిణామానికి ప్రయత్నం దోహదకారి అవుతుంది. ఆ ప్రయత్నం ద్వారానే వ్యక్తులు తాము అనుకున్నది సాధించగలుగుతారు. అదే ఉద్యమానికి స్ఫూర్తినిస్తుంది. ఆ లక్ష్య సాధనకు దృఢదీక్ష అవసరం. అది వ్యక్తిగత దీక్ష కన్నా సామూహిక దీక్ష అయి ఉండాలి. అప్పుడే అది ఉద్యమ స్వరూపాన్ని సంతరించుకుంటుంది. అది సమాజంలో ఏ విషయానికైనా సంబంధించింది కావచ్చు సమాజానికి మంచిని చేసేదిగా ఉంటే చాలు.

సమాజం ఎప్పుడూ పరిణామాన్ని కోరుకుంటుంది. 'కొత్తక వింత పాతొకరోత' అన్నట్లు పాత కొత్తల కలయికతో సమాజం సంఘర్షణకు లోనవుతుంది. ఈ సంఘర్షణల నుండే ఉద్యమాలు పుట్టుకొస్తాయి. అది సమాజాన్ని చైతన్యవంతం చేసి సామాజిక, రాజకీయ, మత, సాహిత్య విషయంలో పెనుమార్పులను కలుగచేస్తాయి. సాహిత్యపరంగా మన సమాజం ఏవిధమైన మార్పులకోసం ఉద్యమాలను నిర్వర్తించిందో తెలుసుకుందాము. వాటిలో మనం వైష్ణవ భక్తి ఉద్యమం గురించి విశ్లేషించుకుందాము.

వైష్ణవ భక్తి ఉద్యమం :

విష్ణువును పరదైవంగా భావించి అతనిని అనేక రూపాలలో కొలిచే మతం వైష్ణవం. ఇతర మత భావనల్లో భయానికి భక్తికి ఒకే దైవాన్ని ఆలంబనగా తీసుకున్నారు. మనదేశంలో మాత్రం రెండు వేరు వేరు దైవాలను విష్ణువు, శివులను భక్తికి భయానికి ఆలంబనగా చేసుకున్నారు. ఈ దైవ భావన ఆధారంగానే భారతదేశంలో శైవ వైష్ణవ మతాలు వర్ధిల్లాయి. క్రీస్తు పూర్వం నుండే వైష్ణవం ఆంధ్రదేశంలో ప్రచారంనందున్నది. విష్ణువు వేదాలలో పేర్కొన్నబడ్డ దేవుడే అయినప్పటికి ఋగ్వేదం అతడు సూర్యాంశతో ఉన్న దైవంగా పేర్కొన్నది. బ్రాహ్మణాలలో విష్ణువును త్యాగానికి మారు పేరుగా గ్రహించారు. భక్తి దయా భావాల కంటే త్యాగానికి ప్రాధాన్యత ఇచ్చారు. విష్ణువును అధిదేవతగా భావించే వైదికమతం తరువాతి కాలంలో అభివృద్ధి చెందింది.

పురాణాలు, ఇతిహాసాలు విష్ణువు, నారాయణుడు, వాసుదేవ, కృష్ణుడు అనే మూడు రూపాలను ఒక్కటిగానే పేర్కొన్నాయి. విష్ణు భక్తులను వైష్ణవులు, భాగవతులు, సాత్వతులు, ఏకాంతికులు, పాంచరాత్రకులు అన్న పేర్లతో పిలిచేవారు. కానీ, ఇవన్నీ మూడు వేరువేరు భక్తిశాఖలు కలిసి ఉపనిషత్తుల కాలం తరువాత రూపుదిద్దుకున్నాయి. కాలానుగుణంగా సామాజిక పరిస్థితుల ప్రభావంతో సర్వాంగీకార మతంగా వైష్ణవం ప్రచార ప్రాభావాలను పొందింది. వాసుదేవతత్వం పరిణామం చెందిన వైష్ణవ శాఖలలో ముఖ్యమైనది. ఈ తత్వం యాదవ నాయకుడైన వాసుదేవ కృష్ణుని ఆధారంగా రూపుదిద్దుకుంది. సాత్వతం దీనికి మరొక శాఖ. ఆ తరువాత వాసుదేవ కృష్ణుని నారాయణుని విష్ణువుగా భావించడం జరిగింది. వీరిద్దరిని బ్రాహ్మణులు పరమదైవాలుగా గుర్తించారు. కొంతకాలానికి వాసుదేవకులు పాంచరాత్రకులు కలిసి భాగవతులుగా రూపాంతరం చెందారు. ఆ తరువాత కొద్ది కాలానికే భాగవతుల దైవం విష్ణువు అవతారంగా భావించడం జరిగింది.

ఇదిలా ఉండగా నాస్తికతత్వంతో కూడుకున్న బౌద్ధ, జైన ప్రభావానికి అడ్డుకట్ట వేయుటకు ఈ భాగవతత్వం ఉపకరిస్తుందని బ్రాహ్మణులు గుర్తించారు. దీంతో బ్రాహ్మణవాదులు శ్రీకృష్ణున్ని దేవునిగా అంగీకరించి విష్ణు అవతారంగా ప్రచారం చేశారు. ఈవిధంగా భారత భగవద్గీతల కాలం నాటికి వేద మూలాలు కలిగివున్న విష్ణువు, మరొక రూపమైన నారాయణుడు, తాత్వికదైవ మూడవ రూపమైన వాసుదేవుడు పూర్తిగా ఒక్కటి కావడం జరిగింది. అదే వైష్ణవంగా రూపొందింది.

తరువాత వైష్ణవంలో 'యూహా' సిద్ధాంతం అవతార భావనలు అభివృద్ధి చెందాయి. యూహాసిద్ధాంతం కొంత కాలానికి సన్నగిల్లడంతో అవతార సిద్ధాంతం ప్రవేశం చేసింది. ఈ అవతార భావనలకు వాటి పుట్టుకకు మూలాలు ఋగ్వేదంలో ఉన్నాయి. వీటికి భగవద్గీత ప్రాచర్యం తెచ్చిపెట్టింది. గుప్తుల కాలం నాటికి ఈ అవతారాలు జనబాహుళ్యంలోకి ప్రవేశించాయి. క్రీ.పూ. 3వ శతాబ్దం ఆరంభ కాలానికి మత్స్యపురాణంలో దశావతారాలను పేర్కొనడం జరిగింది.

తొలి శాతవాహనులు వైష్ణవ భాగవతత్వంతో ప్రభావితులైనట్లు తెలుస్తుంది. మత్స్యపురాణం ప్రకారం శాతవాహనుల రెండవ రాజు కృష్ణుడు లేదా కన్హుడు అను పేరు వైష్ణవ ప్రభావంతో ఏర్పడినది అని భావించాలి. శాతవాహనుల 17వ రాజైన హాలుడు సంకలనం చేసిన గాథాసప్తశతి నందు పలు వైష్ణవగాథలున్నాయి. వాటిలో ముఖ్యమైనది క్షీరసాగరమధనం. రాధాకృష్ణుల గాథ, యశోదా గోపికా కృష్ణుల అంశాలు, వామనావతారం, త్రివిక్రముడు, లక్ష్మిదేవి వంటి గాథలు అందులో వున్నాయి. దీనిని బట్టి దక్షిణ భారతంలో శాతవాహనుల కాలం నాటి వైష్ణవం బాగా వ్యాప్తిలో ఉన్నదని తెలుస్తుంది. శాతవాహనుల తరువాత ఇక్ష్వాకులు కృష్ణానది పరివాహ ప్రాంతాన్ని పాలించారు. వీరి తరువాత వచ్చిన పల్లవులు వైష్ణవ మతాభిమానులు తొలిరాజు సింహవర్మ వంశంలో "కుమార విష్ణు", "విష్ణుగోప" సింహవర్మలు ఉన్నారు. వీరికి పరమ భాగవత బిరుదు ఉన్నది. సింహవర్మ తాను 'భాగవత పాదానుధ్యాత' అని పిలుచుకున్నాడు. దీనిని బట్టి పల్లవరాజులు విష్ణుభక్తులనే విషయం తెలుస్తుంది. కడప జిల్లాలోని "పెదముడియం" నందు లభించిన నరసింహ రూపం విష్ణుకుండుల కాలం నాటిది. విష్ణుకుండుల చెక్కించినవిగా అంగీకరిస్తున్న 'ఉండవల్లి' గుహాలు వైష్ణవమత చిహ్నాలే. కావున విష్ణుకుండలు వైష్ణవ మతావలంబుకలని తెలుస్తుంది. విష్ణుకుండుల కాలం నాటికి బుద్ధుడు భగవత్స్వరూపునిగా, విష్ణు అవతారంగా భావించడం జరిగింది. బౌద్ధమతం గుప్తుల కాలం నాటికి క్షీణదశకు చేరడంతో వారు బుద్ధున్ని విష్ణుఅవతార స్వరూపంగా భావించి పూజించడం ప్రారంభించారు.

తరువాత తూర్పు చాళుక్యులు వైష్ణవ మతాన్ని వ్యాపింపజేశారు. తూర్పు చాళుక్య వంశకుడైన కుబ్జవిష్ణు వర్ధనుడు పరమ భాగవత బిరుదు ధరించాడు. వైష్ణవ అవతారమైన వరాహాన్ని తన జెండాపై చిహ్నంగా స్వీకరించాడు. తూర్పు చాళక్యుల కాలంలో వైష్ణవధర్మం బాగా ప్రచారం చేయబడింది. క్రీ.శ. ప్రారంభం నుండి చాళక్యుల పరిపాలన అంతమగు వరకు తమిళదేశాన ఆళ్వారులు వైష్ణవాన్ని ప్రచారం చేశారు. పల్లవులు, చాళుక్యుల కాలంలో తిరుపతి ప్రధాన వైష్ణవ క్షేత్రంగా రూపుదిద్దుకుంది. తిరుపతి దగ్గర ఉన్న తిరుచానూరు 9వ శతాబ్దం చివరకు చిన్న తిరుపతిగా రూపొందింది. తిరుమల కొండ ఎక్కలేని వారికోసం తిరుచానూరులోని 'తిరుమల కోయిల్' తిరుమలకు ప్రతిరూపంగా రూపుదిద్దుకుంది.

వైష్ణవ చరిత్రలో ముఖ్యంగా దక్షిణదేశ వైష్ణవ మతంలో రామానుజచార్యులతో కొత్తరకం ప్రారంభమైంది. ఈయన శంకరుల అద్వైత సిద్ధాంతాన్ని ప్రేమకరుణలకు అనువుగా భక్తి సిద్ధాంతాన్ని రూపొందించాడు. వేదాంతసారం, వేదార్థ సంగ్రహం, వేదాంతదీపం వంటి గ్రంథాలు రచించాడు. బ్రహ్మ సూత్రాలు భగవద్గీతలపై వ్యాఖ్యానాలు రచించాడు.

బ్రాహ్మణ తత్త్వానికి భగవత్తత్వానికి మధ్య సఖ్యతకు కృషి చేశాడు. పాంచరాత్ర వ్యవస్థలోని వాసుదేవ భావనను నారాయణ విష్ణుతత్త్వాలతో కలగలపి భక్తి మార్గానికి బ్రాహ్మణ్య రూపానిచ్చాడు. ఆహార వ్యవహారాలలో, వర్ణవ్యవస్థ విషయంలో పట్టుబడుతూనే రామానుజులు శూద్రులను వైష్ణవమతంలోకి తీసుకున్నాడు. అంతేగాక కొన్ని దేవాలయాలలో శూద్రులకు ఏడాదికొకసారి ప్రవేశ అర్హత కల్పించాడు. అగ్రవర్ణాల వారికి "భక్తిని", శూద్రులకు "ప్రపత్తి" ని కల్పించాడు.

రామానుజుల కాలం నాటికి వైష్ణవులలో వికానస, పాంచరాత్ర, శ్రీవైష్ణవ అను మూడు శాఖలున్నాయి. వీరిలో వికానసులు అతి పూర్వికులు, రామానుజుల కాలం నాటికి తిరుపతి, తిరుచానూరులు విభానస వైష్ణవుల ఆధీనంలో వున్నాయి. వేదాంత, పాంచరాత్రకుల శాఖలను ఒక్కటిగా చేశాడు. కానీ, ఆ ప్రయత్నం ఎంతో కాలం నిలువలేదు. శ్రీ వైష్ణవులు రెండు శాఖలుగా విడిపోయారు. ఉత్తర ప్రాంతానికి చెందినవారు 'వడగలై' అని దక్షిణ ప్రాంతానికి చెందినవారు 'తెంగలై' గా విడిపోయారు.

రామానుజచార్యులు వైష్ణవ మత ప్రచారంలో నిర్వహించిన పాత్ర అద్భుతమైంది. జీవ బ్రహ్మ విభేద సిద్ధంతానికి ఒక క్రమ రూపాన్నిచ్చిన ఆచార్య ప్రముఖుడు రామానుజులు. జైన, బౌద్ధ, అద్వైత వాదములచే సడలిన మత విశ్వాసాలను వర్ణమత విభేదాలను నశింపచేయడానికి బ్రాహ్మణమత పునరుద్ధరణ చేయ నిశ్చయించి విశిష్టాద్వైతాన్ని ప్రతిపాదించాడు. అందుకు వివిధ వర్ణాలకు చెందిన ఆళ్వారుల ప్రబంధాలను తీసుకొని వాటికి వేదాలతో సమానమగు ప్రతిపత్తిని కల్పించపచేశాడు. ఆళ్వారుల విగ్రహాలను దేవాలయాలలో ప్రతిష్టించి పూజింపచేశాడు.

ఈ మహత్తర కావ్యం కేవలం తత్త్వ విచారణతో సాధ్యం కాదని భావించి గీతాశాస్త్రాన "శాధి మాంత్వం ప్రసన్నం" అని ప్రారంభింపబడి "మేయధామాం ప్రపద్యంతే", మా మేవయే ప్రపద్యంతే" "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణంవ్రజ" అని వివరింపబడ్డ ప్రపత్తి మార్గాన్ని గ్రహించారు. దీనికి ఆధారాలైన సాత్వత, భాగవత, పాంచరాత్రాలను వేదపురణాల నుండి పెకలింబి ఆళ్వారుల శరణాగతితో సమన్వయించి తత్త్వశాస్త్రాన్ని ఆధారంగా చేసుకొని 'భక్తి' మార్గాన్ని ప్రబోధించాడు.

రామానుజులకు ముందే వైష్ణవం బాపట్ల ప్రాంతాలలో ఉన్నప్పటికి రామానుజుల ప్రచారంతో అది మరింత వ్యాపించింది. తిరుపతిని కేంద్రంగా చేసుకొని వైష్ణవాన్ని ఆంధ్రదేశంలో ప్రచారం చేశారు.

రామానుజుల అనంతరం అతని శిష్యులు దెబ్భై నలుగురు వైష్ణవ భక్తి ప్రచారం చేశారు. బట్టారులు, కందాదికులు తిరుమలైలు అనే పలువైష్ణవ కుటుంబాల వారు ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాలలో వైష్ణవమత ప్రచారం చేశారు. మంగళగిరి, మాచర్ల, శ్రీకాకుళం, సింహాచలం, శ్రీకూర్మం, అహోబిలం శ్రీవైష్ణవానికి ప్రముఖ కేంద్రాలుగా అభివృద్ధి చెందాయి.

పై విధంగా వైష్ణవ భక్తి ఉద్యమాన్ని దేశ నలుమూలల వ్యాపింపచేశారు. వైష్ణవ మత ప్రచారకులు అలా రూపాంతరం చెందిన వైష్ణవ భక్తి ఉద్యమం ఇప్పటికీ సజీవంగానే ఉంది.

ఆధార గ్రంథాలు

1. తెలుగు సాహిత్య చరిత్ర
2. తెలుగు సాహిత్య సమీక్ష
3. వైష్ణవాంధ్ర వాఙ్మయం
4. తెలుగు సాహిత్యంలో భక్తితత్వం (సిద్ధాంత గ్రంథం)

ఒంద్రుమట్టి నవల – సామాజిక పరిశీలన

ఇనమల కళ్యాణి, శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మాచర్ల, పల్నాడు జిల్లా

ఒంద్రుమట్టి నవల కేవలం కాలక్షేపపు నవల కాదు. కాల్పనిత ఊహాజనిత జీవితాన్ని చిత్రించిన నవల కాదు. ఇది ఒక రాజకీయార్థిక నవల. చారిత్రక వాస్తవిక నవల. తెలుగు సీమలో కారంచేడు దళితుల మీద ఆ గ్రామ కమ్మకులస్థులు 1985 జూలై 17న దాడి చేసి దారుణ మరణకాండను జరిపినప్పుడు దేశదేశాల్లో పెట్టుబడులకు, పారిశ్రామకీకరణకు సాంస్కృతిక రంగానికి, సినిమా రంగానికి దోహదం చేసిన ఆ ప్రగతిశీల గ్రామం ఇంత వెనుకబడిన కుల దురహంకారానికి ఎలా నెలవైందని ఎందరో, సామాజిక శాస్త్రవేత్తలు ఆ గ్రామ చరిత్రను పునర్దరించడానికి ప్రయత్నించారు. ఆ వర్తమాన చరిత్ర చిత్రానికే ఒంద్రుమట్టి నవలకునాందిగా చెప్పుకోవచ్చు.

కీలక పదాలు :

భూమి, వ్యవసాయం, రైతులు, భూస్వాములు, సున్నకారుకులాలు, కుల దురహకారం అణచివేత, నరమేధం.

మద్రాసు రాష్ట్రంలోని, గుంటూరు జిల్లాలో కృష్ణాపురం గ్రామం ఈ నవలకు ప్రధాన కథాస్థలం కృష్ణాపురంలో రాయి నీడి కోటమ్మ సన్నకారు రైతు. ఐదేకరాల సేద్యం. ముగ్గురు మొగ పిల్లలు, ఎప్పుడు పొలాలోను బడి చాకిరీ చెయ్యడం తప్ప, అతనికి మరోధ్యాస ఉండదు. అతని భార్య పేరు గంగమ్మ, తిరుపతయ్య, పరమయ్య, వెంకయ్య ముగ్గురు కొడుకులు "నీ పిల్లలు బంగారం కోటయ్య! అట్టా మెరికల్లాంటి పిల్లలుంటే ఎంత ఎగసాయమైనా చెయ్యొచ్చు. అంటుంటే వూరి వాళ్ళ మెచ్చుకోలు కోటయ్యకి ఎంతో ఆనందంగా ఉంటుంది. ఉన్నదంతా పిల్లల సాయంతో భార్య చేదోడుతో సంసారాన్ని సమర్థవంతంగా నెట్టుకొస్తున్న కోటయ్య పన్నుల్లో ఇంకో మనిషి సాయం కావలంటున్న భార్య గంగమ్మకు దుగ్గోడు అనే పిల్లవాణ్ణి పనికి అమర్చినా ఇంట్లో మనిషికి ఉండాల్సిందే నన్న గంగమ్మ పట్టుదలతో పెద్దకొడుకు తిరుపతయ్యకు శేషమ్మని ఇచ్చి వివాహం చేస్తాడు. జొన్నలు, రాగులు, దనియాలు వంటి సాంప్రదాయ పంటలు మాత్రమే తెలిసిన కృష్ణాపురం గ్రామం కాలచక్రంతో పొగాకు పంటకు నాంది పలికింది.

పొగాకు పంటవల్ల డబ్బులు కనబడడంతో కృష్ణాపురం రైతులకు భూ వసతి సమస్యగా ముందుకు వస్తుంది. నీటి వసతి పెరిగి వరిసాగు మొదలుతో కృష్ణాపురం గ్రామంలో చలన శీలత మొదలు అవుతుంది. పొగాకు వరి సాగుతూ రాబడి పెరిగి జీవితం పట్ల నమ్మకం ధైర్యం ఏర్పడంతో కృష్ణాపురం గ్రామంలో రాజకీయ సృహ పెరుగుతుంది. ఫలితంగా పరమయ్య రాజకీయాల పట్ల, జాతియోధ్యమాల పట్ల ఆకర్షితుడయ్యి కాంగ్రెస్ ఉద్యమం మనస్సుకు పట్టి తిరుగుతుండడంతో పరమయ్యకు పెళ్ళి చేయడానికి నిశ్చయించుకొని కాంతమ్మతో వివాహం జరిపిస్తారు తల్లిదండ్రులు.

మార్పు దిశగా నింపాదిగా సాగుతున్న కృష్ణాపురం రైతుల జీవితాల్లో బ్రిటిష్ వారికి, జర్మనీకి జరిగిన యుద్ధ సంక్షోభం ఊహించడానికి విపత్కార పరిస్థితులకు కారణం అవుతుంది. పొగాకు కొనుగోళ్ళు ఆగిపోవడం ధాన్యం ధర సగానికి పైగా పడిపోవడం బ్రిటిష్ ప్రభుత్వం నూటికి 30% పన్ను పెంచడం ఈ పరిణామాలతో చిన్న చిన్న అవసరాలకు కాణీ కనపడని పరిస్థితి దబ్బుల ఇబ్బందిని కృష్ణాపురం రైతులు ఎదుర్కోవలసి వస్తుంది.

ఫలితంగా తక్కువలో భూమి దొరుకుతుందని చారెడు "నేల సొంతానికున్నాదే తమ ఊరు" అన్న భావంతో పరమయ్య కూడా పేరయ్య లింగయ్యతో పాటు నిజాంకు

తరలి పోతాడు ఆ ముగ్గురు అలా నిజాంకు ప్రమాణం అయిపోవడం కృష్ణాపురం భవిష్యత్ కొత్త మలుపుకు నాంది అవుతుంది.

నైజాం వెళ్ళిన పరమయ్య వాళ్ళ అయిదు ఎకరాల అటవీ భూమిని కొని సాగు చేస్తారు. తర్వాత తిండి గింజలకి ఇబ్బంది పడకూడదని ఒక ఎకరం సాగు భూమిని కూడా కొని వ్యవసాయం చేస్తారు.

ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన ఆర్థిక మాద్యం

రెండవ యుద్ధ ప్రభావం రష్యా అనుసరించిన సోషలిజం మొ॥ పరిణామాల ఫలితంగా మన దేశంలోనూ ఒలపడిన కమ్యూనిస్ట్ పార్టీ పట్ల పరమయ్య ఆకర్షించబడి పార్టీ కార్యకర్తగా పనిచేస్తుంటాడు. కొన్ని రోజులు అన్నా వదినలు అయిన తిరువతయ్య శేషమ్మ సాయంతో వ్యవసాయం చేసినా పరమయ్య మాత్రం నైజాం లోని రాకూరులో ఉండి పగలనక రాత్రినకు కష్టించి కుటుంబం సమాజంలో ఉన్నత పరిస్థితికి రావడానికి కారణం అయినప్పటికీ తన భాగానికి అక్కడి భూమే కావాలని తీసుకుని అక్కడే స్థిరపడి పోయాడు.

శుభ కార్యాల కని, పండుగలకో, పబ్బానికో సొంతూరికి వస్తున్న పరమయ్యకు తమ వ్యవసాయం పెరిగి, పిల్లలు వృద్ధిలోకి వచ్చిన తర్వాత కుటుంబంలో ముఖ్యంగా తన తమ్ముడైన వెంకయ్య కుటుంబంలో ఆర్థిక వసులు బాటుతో వచ్చిన మార్పులు చూచాయగా తెలుస్తుంటాయి. వెంకయ్య పెద్ద కొడుకు గంగాధరం మోకానికల్ ఇంజనీర్ చదివి ఉద్యోగరీత్యా లండన్ వెళ్ళడంతో ఆ ఊరిలో పరపతి పెరుగుతుంది. చిన్న కొడుకు భాస్కరం కలిసి వచ్చిన సంపదతో అన్న పరపతి, భాగ్యవంతుల ఇంటికి అల్లుడవడం, అత్తగారి అండ కూడా తోడవ్వడంతో కృష్ణాపురంలో కొత్త సంపన్న వర్గానికి ముఠా నాయకుడిగా తనని కను అందాల ఎక్కించుకుంటూ అహభావాన్ని ప్రదర్శిస్తుంటాడు.

నాణెనికి రెండో వైపులా ఆ ఊరిలో నిన్ను కులస్థులకు సమాజంచే ముద్రించబడిన మాల, మాదిగల జీవన దృశ్యాన్ని కూడా వాస్తవాలకు అనుగుణంగా చిత్రించారు నల్లూరి రుక్మిణి గారు. కృష్ణాపురం కమ్యూనిస్ట్ పార్టీ ప్రబలంగా ఉండడం. నిమ్మ కులస్థుడు అండగా ఉండడం చాలా మంది భూస్వాములకు కంటగెంపుగా ఉండుంత తిరువతయ్య పెద్దల్లుడు (శంకరం) కమ్యూనిస్ట్ కార్యాకలాపాలతో చురుగ్గా ఉంటాడు. ఆ ఊరి పల్లెలోని యువకులతో అతనికి సంబంధాలు ఉంటాయి. పొలం పనుల్లో ఉన్నా రహేలు అనే స్త్రీని ఆ ఊరి ఆసామి బూత్కరించడం, ఆ విషయాన్నే ఒప్పుకోక బుకాయించడం, సాక్షి కథనంతో తప్పుఒప్పుకొని క్షమాపణలు చెప్పడం మొదటి సారిగా తమ మాల మాదిగలు తమ ఆత్మాభిమానాన్ని బ్రతికించుకోవడం ఆ ఊరి సమాజ గమనంలో మార్పులకు కారణం అవుతుంది.

ఇలాంటి సంఘటనలు ఆ ఊరి పల్లె ప్రజలకు కొత్త కాక పోయినప్పటికీ వారు ఆత్మాభిమానం కొరకు పోరాటం చేయడం అనేది మాత్రం కొత్తే ఈ సంఘటన వారిలో ధైర్యాన్ని ఆత్మ విశ్వాసాన్ని నింపుతుంది దానికి తోడు కమ్యూనిస్ట్ కార్యకర్త అయిన మల్లయ్య ఆ ఊరి సర్పంచ్‌గా ఎన్నికవడమే కాక ఊరి ప్రజలతో పాటు పల్లె ప్రజలకు కూడా ప్రత్యేకంగా పంచాయితీ ధనాన్ని ఉపయోగించి ఓ చెరువును త్రవిస్తాడు. "దున్నేవానికే భూమి అనే నినాదంతో పనిచేసే కమ్యూనిస్ట్‌ల పట్ల ఆ ఊరి ఆసాయాలతో సానుకుల వైఖరి ఉండవు.

క్రిష్ణాపురంలో జమిందారున్నాడు కొత్తగా అభివృద్ధి చెందిన మోతుబరి పెత్తందార్లున్నారు. నన్నకారు రైతులున్నారు. చేతి వృత్తులవారు ఉన్నారు. ఆర్థికంగా సాంగికంగా అణచబడ్డ దళితులున్నారు. వెనుకబడిన కులాలతో పాటు యానాదులు, ఎరుకలు ఉన్నారు. భూమి ఆధిపత్యం, అణచివేత, ఆకలి, అంటరానితనం, అత్యాచారాలు, అన్నీ ఉన్నాయి. ఎదిగి వచ్చిన దోపిడి దార్లకు

ఎదుగు బాదగూ లేని సన్నకారు బతుకులకు అణిచబడ్డ అట్టడుగు జీవితాలకు దేశంతో ఉన్నా అనేక గ్రామాల్లోనే కృష్ణాపురం కూడా ఒక గ్రామం.

ఇటువంటి పరిస్థితులలో "ఎరుకుల బుచ్చయ్య కూతురిని చిన్న పిల్లని కూడా చూడకుండా బలాత్కరించి తుప్పల్లో పడవేస్తారు.

"మనం మనుషులం కామా? మనం ఆడవాళ్ళు ఎప్పటికి బలి పశువులు కావాల్సిందేనా" అంటూ ఈ తరం ఆత్మాభిమానంతో మోషే సాల్మన్ యాకోబు వంటి వాళ్ళు పెద్దల్ని ప్రశ్నలు వేసినా ఆ ప్రశ్నలు జవాబులు లేనిదిగా మిగిలిపోతాయి. ఆ సంఘటనలతో బుచ్చయ్య సంసారం ఎత్తి ఎక్కడికో వెళ్ళిపోవడం సన్నకారు కులాల్లో వారి మన ప్రాణాలకు రక్షణ లేదన్న సంగతి వారికి అవగతం అవుతుంది. ఊళ్ళ ఉన్న ఆసాములో కమ్యూనిస్ట్ అయిన శంకరం, గోపాల్ నాయుడు మొ॥ వాళ్ళు ఆ ..... ఎప్పుడూ జరుగుతూనే వున్నాయిగా ఏం చేయగలం అంటూ ఉదాసీనంగా ఉండడంతో పల్లె కుర్రాళ్ళ అసహనం, వారు మాట్లాడుతున్న మాటలు చూచాయిగా ఊరి వాళ్ళకు తెలుస్తుండడం వంటి పరిణామాలతో పైకి కనబడడానికి సన్నటి పగళ్ళు కృష్ణాపురం వూరికి మాదిగ పల్లెకూ మధ్య ఏర్పడుతాయి.

భారత గ్రామీణ సామాజిక చిత్రం చిత్రమైన సమ్మెళనంగా భూస్వామ్య వస్త్రానికి ఆధునిక రంగులద్ది నట్టుగా కనబడుతున్నప్పటికి పెట్టుబడి దారి ప్రవేశపు అంశాలు భూస్వామ్య ఆధిపత్యపు కత్తి అంచును మరింత పదు నెక్కించడానికే ఉపయోగపడుతున్నాయి.

గంభీరమైన రాజకీయోపన్యాసాలలో సమానత్వం, సమన్యాయం, కుల రాహిత్యం వంటి ఆదర్శ దృశ్యం నిండి ఉండగా సామాజిక వాస్తవంలో మాత్రం కులవ్యవస్థకు చెందిన నిర్బంధం, అణచివేత మరింత బలమైన కొనసాగింపు కనబడుతున్నాయి. అన్న వాస్తవాన్ని ప్రతిబింబించేలా రుక్మిణిగారు సామాన్యుల జీవిత సమరాన్ని చిత్రించారు.

నీటి ప్రవహం వెంట నాగరికత పెరగడం చరిత్ర పొడవున జరిగిందే! ప్రవహాన్నీ బరునుకుంటూనే ఆదిమానవుడు నడయాడాడు. అభివృద్ధి అయ్యాడు జ్ఞానం పెంచుకున్నాడు.

కాలంలో మార్పులు ఏ దిశగా జరిగినా మనిషి ఒక చోటి నుండి మరో చోటుకు కదలడంలోనే చైతన్యం ఉంది. అది మానవ సమాజాన్ని చలనశీలంగా ఉంచుంది. పూనూరు నుండి చౌరాలకు ప్రమాణ సాధానాలు ప్రారంభమై బస్సు ఆ గ్రామానికి రాడవం, బస్సులోకి ఎక్కడానికి తారతమ్యాలు లేకపోవడం, ఆసాములతో పాటు సన్నకారు జనాలు బస్సు ఎక్కడం, వాళ్ళ ప్రక్కనే కూర్చోవలసి రావడం, కుదపులకు తడబడి వారికే తగులుతుండడం, రవాణా సౌకర్యంతో యుగాలు కట్టుకొని బయటి ప్రాంతాలకే ఎక్కువగా పనులకు పోతుండడం ఈ పరిణామాలన్నింటికి ప్రభావంతో కృష్ణాపురం ఊరికి పల్లెకి కనబడని వైరుధ్యం కొనసాగుతుంది.

కృష్ణాపురం మళ్ళి జరిగిన పంచాయితీ ఎన్నికల్లో స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా పల్లె ప్రజలు విశ్వసించే మల్లయ్య భాస్కరం మీదగెలవడం మోషే, సాల్మన్, దినాకర్, ఏసు మొ॥ పల్లెలోని హుసారుగా ఉంటూ అన్యాయాన్ని ప్రశ్నించే కుర్రాళ్ళి పద్ధతి ఊళ్ళో కొత్తగా ఎదిగి వచ్చినా ఆసాములకు నచ్చదు. కాల చట్టం సాగిపోతున్న కృష్ణాపురం గ్రామంలో భూస్వాములకు అట్టహాసానికి రెండు సంవత్సరాలు కూడా నిండని చిన్నపాప వందనం అనే వ్యక్తి కూతురు ఎద్దుల బండి చక్రాల కింద పడి వికృతంగా చనిపోవడం, మాదిగపల్లె వాళ్ళు ఆ బండిని అక్కడికక్కడే ఆపివేయడం, బండిని ఆపారన్న కోపంతో పల్లె మీదికి ఆసాములు కర్రల్తో వెళ్ళడం మా బిడ్డను చంపేసింది కాక మా మీదే వస్తారా అని పల్లె ప్రజలు ఎదురుతిరగడం, చివరికి రైతులతో

తప్పు వప్పించి దండగ కట్టించామన్న ధైర్యం విశ్వాసం పల్లె ప్రజలకు ఏర్పడడం, రాటికల్ పార్టీ వాళ్ళకు కొమ్ము కాస్తుందని, రైతులు బండిని ఆపగలిగే ధైర్యం దమ్ము వాళ్లకు ఎక్కడిది అన్న ఆక్రోశం రైతుల్లో పెరిగి సన్నకారు కులాలను ఎలాగైనా ఎదుర్కొవాలన్న ఆలోచన ఊళ్ళో పెత్తనం దారులకు కలుగుతుంది. వాళ్ళలందరిని భాస్కరం అజమాయిషీ చేస్తూ పేదలను, సన్నకారు కులాలను తక్కువ చేస్తూ మాట్లాడడం, అర్థం చేసుకున్న పరమయ్య "డబ్బు ఉండవచ్చు, పోవచ్చు మనషుల్లో ముఖ్యమై వాళ్ళతో మంచిగా వుండడం, ఎన్న తగ్గ విషయం! న్యాయ అన్యాయాలను మంచి చెడూ తప్పినా వాడికి పుట్టగతులు లేకుండా పోవడం అనాదిగా ఎరిగినా సంగతులే అని హితబోధ చేస్తాడు. వర్గ పోరాట రాజకీయాలకు, అట్టడుగు కులాలవారికి ప్రాధాన్యం ఇచ్చే రాడికల్ పార్టీ ప్రభావంతో కులాల వాళ్ళు సంఘంలో చేరి ధైర్యంగా ఉండడం వారులే ఒకకట్టబాడు కిందకు వస్తే కష్టమన్న పెత్తనం దారులు భావిస్తాను. పల్లెలోని వాళ్ళను అదుపులో ఉంచడానికి ప్రయత్నిస్తారు. మంచిగా ఉన్న పౌరుడిని పీకారన్న నెపంతో ఆస్వామి బోయకుర్రాన్ని కొట్టి అవమానిస్తాడు.

ఈ విషయం మీద న్యాయం అడగడానికి వచ్చిన వాళ్ళను కులం తక్కువ అని వెక్కిరింతగా అంటారు. దానిలో పల్లె కుర్రాళ్ళు కోపం హద్దులు దాటి అతన్ని చిత్తక్కకొడతారు. ఆ ఊరి చరిత్రలో ఊర్లోకిపోయి ఆస్వామి మీద చెయ్యి చేసుకోవడం అదే మొదటిసారి అవుతుంది.

ఇవాళ్ళ వాళ్ళని కొట్టిన వాళ్ళు రేపు మనల్ని కొట్టరు అని ఏముంది? అని చూస్తూ ఊరుకుంటే అంతపని చేస్తారు అని ఆలోచనలో ఊరు ఆదమరచి ఉన్న సమయంలో పది, పదిహేను మంది కమ్మ కుర్రాళ్ళు, బోయ కుర్రాళ్ళు పల్లె మీద దాడి చేసి నడివయస్సు వాళ్ళందరిని విరగ్గొడతారు. ఈ విషయం పట్ల పల్లె కుర్రాళ్ళను పల్లె పెద్దలు మందలించడంతో పాటు ఆసాములను ప్రశ్నించడానికి ఒప్పుకోరు. పెద్దల సహాయ నిరాకరణ పల్లె కుర్రాళ్ళు అలా నిశబ్దంగా ఉండిపోవడం కమ్మ కుర్రాళ్ళకు ఉత్సాహాన్ని ఇస్తుంది. అప్పటి నుండి మరీ రెచ్చిపోతారు. క్రమంగా వారు మాలమాదిగలు సన్నకారు కులాల మీదకే కాక ఊళ్లో వారి చర్యలను సహించలేని వారి మీదకు, సమర్థించని వాళ్ళు మీదకు కూడా దాష్టికానికి దిగుతూ ఆస్తులు తగలబెట్టడం, వస్తువులను ఎత్తుకెళ్ళిపోవడం, అప్పు ఇవ్వకపోతే వారికి నష్టం కలిగించడం, అప్పు ఇస్తే తీర్చకపోవడం, ఆడపిల్లలని అమర్యాదగా మాట్లాడుతూ తిరుగుతూ ఉండే ఆ ముఠా శ్రీరామనవమి కళ్యాణం రోజున ఒంటరిగా ఉన్న చిల్లరకొట్టు కోమట శెట్టి భార్యని పట్టపగలు పాటు చేస్తారు. ఈ విషయం పట్ల న్యాయం జరగని శెట్టి "ఇది ఊరు అని అనుకున్నాం కానీ వల్లకాడు అని అనుకోలేదు" అంటూ వెళ్ళిపోవడం చూసి మోషే, యాకోబులు ఇప్పుడు మళ్ళీకావాలనే ఏయే, ఓరేయ్ అని వెనుకడిలా పిలుస్తారు. గౌరవంగా బతకలేకపోతే బతికేదెందుకు? అంటూ భాదపడతారు. ఈ పరిణామ క్రమంలో సాల్మన్ తల్లి ఎలీశమ్మ మంచి నీళ్ళ కోసం చెరువుకు వెళ్ళే సరికి చెరువులో గేదేలను దింపి కడుగుతుంటాడు సుబ్బారావు అనే ఆసాడు దాంతో ఎలీశమ్మ అయ్యా మేము కడుపుకి తాకే నీళ్ళలో గేదెలను దించావేందయ్య అని అడుగుతుంది.

ఏంటి నువ్వు చెప్పేది అంటూ మాట మాట నుండి గొడవకు దిగుతాడు. ఈ విషయం దూరం నుండి చూస్తున్న వందనం ఎందుకు ఆడదాన్ని వయస్సులో పెద్దదాని కొడుతున్నావు అని అడుగడంతో మొనగాడికి మద్యలో నువ్వేంటి అని వెటకారంగా మాట్లాడడంతో వందనానికి తన బిడ్డ పోయినప్పటి నుండి గూడుకట్టుకొని వున్న ఆవేదన కోపంగా మారి సుబ్బారావును రెండు దెబ్బలు కొడతాడు. దాంతో సుబ్బారావు ఆ రాత్రి నలుగురిని వెంట పెట్టుకొని వందనం ఇంట్లో కనపడ్డా వాళ్ళని అలా కొట్టివెళ్ళతాడు. అయినా పల్లె వాళ్ళు ఎవరూ ఎదురు తిరగరు. వందనంతో

ఆ గొడవ ముగిసిపోతుందని అనుకున్నారు. కాని ఆసాములు ఎలాగైనా ఈ మాదిగోళ్ళకు బుద్ధి చెప్పాల్సిందే అనుకుంటూ ఒక పథకం ప్రకారం ఒరిసెలు గొడ్డలతో 20 మంది దాకా ట్రాక్టర్ ఎక్కి ఇయ్యాల కమ్మోడో, మాదిగోడో తేలిపోవాలి అంటూ ఉన్నాదంగా కేకలు వేసుకుంటూ మాదిగపల్లె మీద పడి మొగవాళ్ళని, ఆడవాళ్ళని చూడకుండా కత్తులతో నరుకుతూ, బల్లెలతో పొడుస్తూ, నరమేధం సృష్టిస్తారు. శవాలు చల్లాచెదురుగా పడిపోయిన ఈ భీతావహ దృశ్యం "దళితుల ఊచకోత" పేరుకు పత్రిక శీర్షికలకు ఎక్కింది. ఆంధ్రదేశమే కాదు దేశ నలుమూలలకు ఈ వార్త చేరింది.

మొత్తం మీద కారంచేడు హత్యాకాండ కొట్టచ్చినట్టుగల చూపినేదేమంటే మన సమాజంలో అభివృద్ధి క్రమం సమాజం మొత్తం అభివృద్ధిగా సాగలేదని పాక్షిక అభివృద్ధిగా సాగిందని. అది వెలుగు వెంట నీడను తెచ్చిందని, ఒక వర్గపు సంపదనూ, అధికారాన్ని విపరీతంగా పెంచుతూనే, మరొక వర్గాన్ని నిరసిస్తూ అభాగ్యులను చేసిందని, కాలం చెల్లిన సాంప్రదాయాలను, దురాభిప్రాయాలను, కుల దురహంకారాన్ని తొలగించవలసిన అభివృద్ధి క్రమం వాటిని బలవంతం చేసిందని ముందుకు పోతున్నట్టు కనబడుతున్న సమాజం విలువ నేటి కుండలగా అగిపోవడం కొన్ని వెనక్కి పోవడమో కూడా జరుగుతున్న వాస్తవానికి కారంచేడు ఘటన ఒక ఉదాహరణ.

ఒంద్రుమట్టి నవలలో రక్త మాసాల మనుషులలో వారి సంబంధాలకు, సంభాషణలను విభిన్న సన్నివేశాలలో పాత్రాన్మిలనంలో కళాత్మకంగా రూపుకట్టినట్లు చిత్రించారు నల్లూరి రుక్మిణిగారు.

చరిత్రని, జీవితాన్ని, భూమిని, ఆధిపత్యాన్ని, అణచివేతని, తిరుగుబాటుని, మానవ సంబంధాల్లోని సంతోషాలని, సంక్షోభాలని, విషాదాలని విప్లవాలను చవిచూసిన కృష్ణాపురాన్ని ఒంద్రు మట్టి నవలలో సమాజం ముందు ఉంచారు.

ముగింపు :

చారిత్రక వాస్తవాల పునాది మీద కళాత్మకతకు హాని కలుగకుండా జాగ్రత్తగా నిర్మించిన జీవన దృశ్యపు నయారూపం ఇది. తెలుగు సీమ గత జీవన చిత్రంలోని ఒక ముఖ్యమైన పార్శ్వాన్ని చిత్రించిన నవల. కల్యాణరావు గారి మాటల్లో ఒంద్రుమట్టిని ఒకే వాక్యం ఇలా చెప్పొచ్చు. భూమి చుట్టూ అల్లుకున్న జీవితం చరిత్ర ఒకదానితో ఒకటి పెనవేసుకొని చెప్పిన వర్తమానం" ఇది బతుకు కథ. బతుకు చెప్పిన కథ.

ఆధార గ్రంధాలు:

1. నల్లూరి రుక్మిణి గారు ఒంద్రుమట్టి నవల
2. సి.వి. సుబ్బారావు గారి "అభివృద్ధి క్రమం కారంచేడు – రెండంచుల కత్తి" వ్యాసం

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 8, August 2022 (Spl. Issue)
ISSN No.2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
Under Arts and Humanities Category

తెలుగు సాహిత్యం – విభిన్న ప్రక్రియలు – ధోరణులు
సమకాలీన తెలుగు నవలలలో సంఘం – సామాజిక దృక్పథం

డా॥ హెచ్. కిషన్, అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు, బి.జె.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నారాయణగూడ, హైదరాబాద్.

ప్రారంభం:

తెలుగు నవలలో ఒక గిరిజన జాతి చైతన్యానికి అద్దం పట్టిన నవల సంఘం. ఇది గిరిజన జాతి సంఘానికి సంబంధించిన కథ. దీని కంటే ముందు వచ్చిన మొట్ట మొదటి నవల శ్రీరంగరాయ చరిత్రం (గోపాలకృష్ణమసెట్టి) 1842 మొదలుగా నాటి నుండి నేటి వరకు తెలుగులో కోకొల్లలుగా నవలలు వచ్చాయి. 1989లో సంఘం నవల నేటి సమాజంలో గిరిజనులు ఏవిధంగా అన్యాయాలకు, దోపిడీకి గురైతున్నారో వాటిని దృష్టిలో పెట్టుకొని, వారి ఆలోచనలతో ఈ నవలను ప్రధానంగా తీసుకొని, స్వీకరించి ఇందులోని పాత్రల పరిశీలనతోపాటు వర్తమాన సమాజంలో, సంస్కృతీకరించబడిన జాతుల చేతిలో కష్టాల పాలవుతున్న అణగారిన వర్ణాల, రాజకీయ, ప్రభుత్వ అధికారుల ఆర్తిని ఎత్తిచూపి, సామాజిక న్యాయసాధనలో మనదైన దృక్పథాన్ని విశ్లేషణతో కూడిన వివరాలు అందించడం అనే ఆలోచనే ఈ వ్యాసరచనకు ప్రారంభం.

ఉద్దేశ్యం:

గిరిజన జాతి ప్రజలకు ఉపయోగపడాలనే ఉద్దేశ్యంతో రానిన నవల సంఘం. ఆదివాని గిరిజనులకు సంబంధించిన సంఘానికి మేలు కలిగించే ఉద్దేశ్యంతో తెలుగులో రచించారు. ఒక జాతి చరిత్రను మానవీయ చరిత్రగా గుర్తించి సమాజానికి సంఘం అనే నవలలోని సందేశాన్ని అందించడమే ఉద్దేశ్యం.

సంఘం నవల నేపథ్యం:

పేరు: తెలుగు భాషలో ఈ నవలను రచించింది శ్రీ కె. చిన్నప్ప భారతి గారు. ఈ నవలకు వీరు పెట్టిన పేరు సంఘం. గిరిజనులు అందరు ఐక్యతగా ఉండడమే సంఘం. కుల పరంగా, మత పరంగా అన్యాయాలను ఎదిరించడం కోసమే, సమస్య వస్తే పోరాడి సాధించడం కోసమే సంఘంగా ఏర్పడుతారు. అంతేగాక తమ హక్కుల కోసం పోరాడటం గిరిజన జాతిలో అన్యాయం జరిగితే వాటిపైన అందరు సంఘంగా ఏర్పడి అందరిలో చైతన్యం తీసుకొచ్చి పోరాడేటట్లు చేయడమే ఈ సంఘం నవల యొక్క ఇతివృత్తం. ఈ వర్తమాన కాలంలో సమాజంలో సంఘం లేనిది ఏది సాధించలేము. ఈ ఆధునిక కాలంలో ఐక్యతగా సమాజంలో జరుగుతున్న సమస్యలను ఎదుర్కోవడం కోసం ఉపయోగపడుతుంది. కాబట్టి శ్రీ కె. చిన్నప్ప భారతి గారు విద్యార్థి దశ నుండి గిరిజన జాతి పడే కష్టాలను, అన్యాయాలను, అవినీతిపైన స్పందించి గిరిజన జాతిలో ప్రతి గిరిజనుడు పోరాడాలి అని సమయస్ఫూర్తితో చైతన్యం తీసుకురావాలనే దృక్పథంతో రచించిన నవలే సంఘం.

తమ హక్కుల కోసం సమాజంలో మోసం చేసే వాళ్ళు ఎక్కువైనారు. అందులో గిరిజన జాతి ప్రజల శ్రమను, వారి డబ్బును, సంపదను, వారి స్త్రీలను తమ సొంత ఆస్తులగానే భావిస్తున్నారు. వాటిని దోచుకోవడానికి వీరెటువంటి నైతిక సూత్రాలను లెక్కచేయటంలేదు. ఈ అక్రమాలను, అన్యాయాలను గిరిజనులు మౌనంగా భరిస్తూ లోలోపలే బాధపడుతున్నారు. వారి అభివృద్ధి కోసం కేటాయించిన డబ్బుతో ప్రభుత్వాధికారులు, రాజకీయ నాయకులు పంచుకొని మింగేస్తున్నారు. గిరిజనులకు తొంటి చెయ్యే చూపిస్తున్నారు. అందుకే వీటినన్నింటిని అరికట్టాలంటే గిరిజన జాతి ప్రజలలో ఒక సంఘంగా ఏర్పడి చైతన్యం

తీసుకురావాలనే దృక్పథంతో గిరిజన జాతి ప్రజలు అందరూ జాగృతి కావాలని రాసిన నవలే సంఘం. ఈ క్రింద ఇతర పాత్రలను తెలుసుకుందాం.....

ఇతర పాత్రలు:

1. కందన్-సావిత్రి రుమన్: కనుబొమ్మ వద్ద పెద్ద గాయంతో, వేటకుక్కకుండే పగ నిండిన దృష్టితో తిరుమన్ పక్కింటి వాడై కందన్ సభ ముందుకు వచ్చి నిలుచున్నాడు. అగ్ని సాక్షిగా దైవాల సాక్షిగా ప్రమాణాలు చేసి తర్వాత అతడు అన్నాడు "ఏరువాక ముహూర్తం రోజు" సావిత్రి రుమన్ తన చేనులో ముళ్ళు నరికి నిప్పు పెట్టి కాల్చిండు. ఇది నిజమే కాని తెలియక జరిగిపోయిందని ఒప్పుకొని మళ్ళీ తిరుమన్ ముళ్ళకంపలకు నిప్పుపెట్టి కాల్చేశాడు. ఇది తెలియక జరిగిన పొరపాటు అని ఒప్పుకున్నాడు.

2. వడవన్ పూజారి: యుగయుగాలుగా, తరతరాలుగా అముద్రిత రాజ్యాంగ చట్టంలా కొనసాగుతూ వస్తున్న ప్రతి గ్రామంలోను పురతన ఆచార సంప్రదాయాలను పరిరక్షించడానికనే కొన్ని కుటుంబాలుంటాయి. ఆ గ్రామంలో వడవన్ పూజారి కుటుంబం అటువంటిది.

3. కలశవెళ్ళయన్-కరుమాయి: కలశవెళ్ళయన్ భార్య కరుమాయి గ్రామ సంప్రదాయాన్ని ఉల్లంఘించింది. బహిష్టు సమయంలో ఇంటికి దూరమైన స్త్రీల ఇళ్ళలో ఉండరాదు. గ్రామ ఉమ్మడి గుడిసెలోనే నాలుగు రోజులు ఉండాలి. అలా ఉండలేదు కాబట్టి ఇరవై ఐదు రూపాయలు అపరాధం చెల్లించడానికి ఒప్పుకున్నాడు.

4. ఆండి: "మనం అడవిలో బంజరు భూమిని కష్టపడి చక్కచేసి, పైరు వేసిన దాన్ని నాశనం చేసి మనపై కేసుల్ని పెట్టి జైల్లో కుక్కు ఈ సర్కారోళ్ళు మీకు ఇది చేస్తాం, అది చేస్తాం అంటే నమ్మేదెట్లా" అనే ఆండి అనుమానం వ్యక్తం చేసారు. రెవెన్యు ఇన్‌స్పెక్టరు లంచాలు తీసుకొని బంజరు భూమిని దున్నుకోమంటారని అంటారు. మళ్ళీ రెండు మూడు సంవత్సరాలకు మరో ఇన్‌స్పెక్టరు వచ్చి సాగు చేసుకోమంటారు. దాని తర్వాత అటవీ శాఖ వారు పెరిగిన పైరునే నాశనం చేస్తారు. ఇలా నష్టం జరుగుతూ ఉంటుందని తెలియపరుస్తుంది.

5. రాజన్: "ఒరేయ్ వీళ్ళు మనల్ని ఎట్లా వలలో వేయజూస్తున్నారో చూసారా! డబ్బులు లేకుండా పండ్ల చెట్లనిస్తారట సగం వెలకే ఎరువులు, పురుగు మందులు ఇస్తారట అందుకు మన వేలి గుర్తులు వేయించుకుని తర్వాత మన భూముల్ని లాక్కొని మనందర్ని ఇక్కడి నుండి వెల్లగొట్టాలని చూస్తున్నారోయ్" వీరి అనుమానాలు భయపెడుతున్నాయి.

6. పళిని: తిరుమన్ ఉదయమే తన పొరుగు వాడైన పళినిని తల వెంట్రుకలు కత్తిరించి క్షవరం చేయించుకుని వెళ్ళిపోయాడు.

7. తిరుమి: ఆ పరిసర ప్రాంతానికంతటికి కాన్పులు చూసే మంత్రసానిగా ఆమె ఉంది. ఆమె ఏ శిక్షణ పొందలేదు. తరతరాలు వస్తున్న అనుభవం నుంచే మంత్రసాని విద్యను నేర్చుకుంది. తనంతట తానుగా స్వీకరించిన సాంఘిక సేవ అది. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా చేసే మానవ సేవ అది. కొడుకు గిరిజన సమస్యలపైన పోరాడుతున్నాడు. ప్రత్యర్థులు చంపాలని చూస్తున్నారు. అది విన్న తిరుమి భర్తతో బాధ పడుకుంటూ అంటుంది. "పది నెలలు మోసి కని పెంచడానికే బిడ్డ మమకారం తెలుస్తుంది. రెక్కలు విరిగిన గువ్వలా ఎట్లా పోతున్నారో చూడు" అని తిరుమి బిగ్గరగా ఏడ్చేసింది. సడయని తిరిగి చూడకుండా వెళ్తున్నాడు.

8. కాళి భార్య పొన్నమ్మాళ్: కాళి భార్య పొన్నమ్మాళ్ ప్రసవ వేదనతో అల్లాడుతుంది. పొన్నమ్మాళ్ బాగా అవస్థ పడుతుంది. తిరుమి ఎంత ప్రయత్నం చేసిన ప్రసవం కావడం లేదు. తిరుమికి ఒక అనుమానం వచ్చింది. పెళ్ళి కాకముందు ఎవరితోనైనా మాట్లాడినావా అని అడిగింది. ఒప్పుకుంటే తొందరగా ప్రసవిస్తుందని చెప్పింది. కొండ

ప్రాంత గిరిజనుల ఆచారాలు విచిత్రంగా ఉంటాయి. మైనర్ బాబుతో మాట్లాడినాను అని ఒప్పుకుంది. వెంటనే మగ బిడ్డకు జన్మనిచ్చింది.

9. మైనర్ బాబు: మైనరుబాబు బాగా ఆలోచించాడు. తన కారణంగా బాధపడకూడదని ధర్మకర్త అడిగిన ప్రశ్నకు సూటిగానే జవాబిచ్చాడు. తెలియక చేసిన తప్పు అని ఒప్పుకున్నాడు. వెంటనే ధర్మకర్త తప్పయిందని చెప్ప మన్నాడు. అతనూ అపరాధానికి ప్రశ్చాత్తాం చెందినవాడిలా, తలవంచుకుని "తప్పయిందండీ... తప్పయిందండీ" అని చెప్పాడు.

10. పిడారి: పశువులకు సడయన్, పిడారి అడవిలో మేపుకుని తోలుకొచ్చారు. వీరు చాలా ఆలస్యంగా వచ్చారు. అలసిపోయి ఆకలి దప్పికతో ఉన్నారు. సూర్యుని వేడిమిచేత చెమటపట్టి, ఎర్రబడ్డ కళ్ళను తన రెండు చేతులతోను మెల్లగా తుడుచుకుని "రెండు మూడు రోజుల్లో వాన వస్తే రావచ్చు" నిన్న రాత్రి కూడా తూర్పు దిక్కు ఆకాశాన మెరుపు మెరిసింది. ఇప్పుడు గద్దలు కూడా తిరుగుతున్నాయి. సీతాకోక చిలుకలు ఎగురుతున్నాయి అని జోష్యం చెప్పినట్లు చెప్పింది పిడారి. గిరిజన తెగలో వరుడు వధువుకు తాళికట్టే సంప్రదాయం, అతని బదులుగా కులపెద్దే తాళి కట్టేస్తాడు. ఈ తంతు కాస్తా పూర్తి కాగానే పిడారి చక్రవర్తి కరువన్‌కు భార్య ఐపోయింది. వీరిలో పెళ్ళి తంతు విలక్షణమైన పద్ధతిలో ఉంటుంది.

11. చక్రవర్తి కరువన్: పూలగుళం అనే ప్రక్క గ్రామస్థుడు చక్రవర్తి, సడయన్ స్నేహితుడు. తన ఆకలి చూపులను నియంత్రించుకుని "సడయన్ను చూద్దామని వచ్చినాను. ఇక్కడ నాకు తెలియకుండానే నిన్ను చూసినాను" అని చెప్పాడు పిడారితో. పిడారికి ఏనాడు లేని ఉత్సాహం ముంచుకొచ్చింది. ఆమె చూపులు చక్రవర్తి కరువన్ మీద వచ్చి వాలినై. అనగా ప్రేమిస్తుందని అర్థం. పేడ జాతరలో ఇద్దరు పాల్గొన్నారు. చక్రవర్తి బొగ్గు పొడిని చేతినిండా తీసుకొని పిడారి ముఖానికి రుద్దాడు. ఆమె తనతో పాటు కొంతమంది స్నేహితురాండ్రను చేర్చుకుంది. వారు చక్రవర్తిని చుట్టుముట్టి "నిన్ను గోచీ ఊడదీసి తరుమంటావా లేక పేడ నీళ్ళను తాగుతావా?" అని అడిగారు. ఈలాంటి అవమానం జరగకూడదని కోరుకున్నది అలాగే జరిగింది.

12. పేడజాతర: పేడజాతరను గ్రామస్థులందరు కలిసి జరుపుకుంటారు. యువతి యువకులు కూడా ఈ జాతరలో పాల్గొంటారు. ఈ జాతర యొక్క ప్రత్యేకత వానలు పడాలని మొక్కుకుంటారు.

13. శుక్రపళ్ళన్: ఇతన్ని మిట్టవీధి అల్లుడు అని పిలుస్తారు. ఇతను వడ్డీ వ్యాపారి. డబ్బులు ఇవ్వకుంటే గిరిజన అమ్మాయిల మీద కన్నేసి దుర్మార్గంగా ప్రవర్తించే వ్యక్తి శుక్రపళ్ళన్.

14. కరుమాయి: వెళ్ళయన్ తన పెళ్ళంతో ధీనంగా "మనమేమి చేయలేము నువ్వు బయలుదేరు. నేను తొందరలో వచ్చి నిన్ను పిలుచుకోవస్తాను" అని గద్గద స్వరంతో మెల్లగా అన్నాడు. కరుమాయి చాలా అందంగా ఉంటుంది. బాలెంతరాలు కూడా వడ్డీ వ్యాపారి శుక్రపళ్ళన్ ఆమెపైన కన్నువేశాడు. అన్న అని పిలిచినా కరుణించకుండా నెట్టుకుంటూ తీసుకెళ్తున్న మూర్ఖుడు.

15. బుడబుక్కలవాడు: బుడబుక్కలవాడు తిరుమన్ సడయన్‌లను ఓ ఇంటిలో కూర్చోబెట్టాడు. పూజ చేయడం వల్ల దుష్టశక్తులు ఇంటి నుండి పారిపోతాయని చెప్పాడు. తిరుమి కూడా మనసులోనే జపించింది.

ఒక్కో వస్తువును తీసుకొని వారి తలల చుట్టూ చుడుతూ, తాను చెప్పినట్లు చెప్పమని ఆజ్ఞాపించాడు.

పట్టి పీడించే దుష్టగ్రహం పంచెతో పోయింది
పట్టి పీడించే దుష్టగ్రహం కోడితో పోయింది
పట్టి పీడించే దుష్టగ్రహం కొడవలితో పోయింది
పట్టి పీడించే దుష్టగ్రహం చెంబుతో పోయింది

ఇంకా కార్యక్రమాలు ముగిశాయి. ఇక వెనుక తిరిగిచూడకూడదని భార్యభర్తలిద్దరికి చెప్పాడు. "పట్టిన పీడ దీంతో విరగడైంది... పట్టిన పీడ దీంతో విరగడైంది" అని చెబుతూ బుడబుక్కలవాడు అన్ని వస్తువులను తీసుకొని అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

16. సిలోన్ శ్రీరంగన్: సిలోన్ శ్రీరంగనికి వేటాడడం కొత్త అయినా సమయోచిత బుద్ధిగలవాడతను. వయస్సు ముప్పయి. ఆకర్షణీయమైన యువకుడు. శరీరం కాయకష్టం చేసేవాడు. అతని కళ్ళు ఎప్పుడు చురుకుదనంతోనూ, జ్ఞానంతోనూ, మిలమిలలాడుతుంటాయి. ఇతను శ్రీలంకలో(సిలోన్) చాలాకాలం తేయాకుతోట కార్మికుడిగా పనిచేసి వచ్చాడు. అక్కడ అనేక వర్గపోరాటాల్లో పాల్గొని తన్నులు తిని జైలు పాలైనవాడు. వీరందరికన్నా రాజకీయ అవగాహన ఉన్నవాడు. పౌరసత్వం నిరాకరించబడి తన కుటుంబంవారితో పాటు భారతదేశానికి శరణార్థిగా వచ్చినవాడు. ఇతని కార్మీకులు ఈ "కొల్లిమలై" పర్వత ప్రాంతానికి చెందినవారు. తమ పూర్వీకుల గడ్డపైన ఎలాగు బ్రతకవచ్చునని, తమకు ఉన్నా కొంత ఆస్తి జీవనాధారం అవుతుందని ఇక్కడికి వచ్చి చేరారు.

17. వేట: గిరిజనులకు వేటాడడం పుట్టుకతోనే వస్తుంది. రెండు గ్రూపులు ఏర్పడి వేటాడి పందిని తుపాకితో చంపాడు. ఒక గ్రూపు పూజారిది, రెండవ గ్రూపు ధర్మకర్తది ఇతని తుపాకి నుంచే వెలువడ్డది, ఆ అడవిపంది నాలుగు కాళ్ళను త్రాడుతో కట్టి, వాటి మధ్యన వెదురుగడను దూర్చి గ్రామంలో కాళికదేవి కోవెల కడకు మోసుకొచ్చారు. గుడి ముందు పచ్చటాకుతో పందిరి వేశారు. రేపు ఆ గ్రామస్థులకో జాతర! రాబోయే సంవత్సర సౌభాగ్యానికి ఈ ఫలప్రదమైన వేటను వారో శుభసూచకంగా భావిస్తారు.

18. సెల్లన్: గౌండన్ కర్తికారన్ మీరెంపనిగా వచ్చినారు అని అడిగారు, సెల్లన్‌ను పిలక జుట్టూ, కారెక్కిన పళ్ళతో వున్న సెల్లన్ పువ్వు, పిల్లా వుండే చోటున పిల్లనడగడానికి వచ్చినాను అని అన్నాడు.

19. అజీస్ సాహెబూ: అజీస్ సాహెబూ వడ్డీవ్యాపారి ఇతని బంటు శుక్రపళ్ళన్‌లపై బలాత్కారంగా కిడ్నాప్ చేసి ఎత్తుకెళ్ళారని పోలిసు స్టేషనులో ఫిర్యాదు చేశాడు. లంచం కూడా ఇచ్చుకున్నాడు. స్టేషన్ రైటర్‌కు ఇరువై ఐదు రూపాయలు ఇచ్చాడు. ఈ వడ్డీ వ్యాపారిని కఠినంగా శిక్షించమని ఇది గిరిజనుల అమాయకత్వం అని చెప్పవచ్చు. "విద్యలేని వాడు వింత పశువు" అన్నది నిజమేగా!

20. శాల్తీయే: లావుపాటి ఓ పొట్టి శాల్తీయే రెంజర్ వెనుక పారెస్టర్లూ, వాచర్లూ తల్లి కుక్కలను వెంటపెట్టుకొని వచ్చాడు. "ఈ పశువులన్నిటినీ మళ్ళించి ఆపండయ్యా" అని తన పరివారాన్ని ఆజ్ఞాపించాడు. ఫారెస్టర్లు, వాచరూ ఆ గిరిజనులను ''అయ్యగారు రమ్మంటున్నారు వెళ్ళిచూడండి" అని చెప్పారు. ధర్మకర్త అందరి తరుపున "ఏదో తెలియక తప్పయింది మన్నించండి" అని క్షమాపణ అర్థించాడు. రెంజర్ కోపంతో "అడవినిలా నాశనం చేసేశారే" పై అధికారులకు తెలిస్తే మా ఉద్యోగాలు పోతాయని బదులు ఇచ్చాడు. రెంజరు "గొడ్లకు ఒక్కదానికి ఇరవై రూపాయిలూ, ఒక్కో మేకకు పది రూపాయల లెక్కన ఇమ్మని చెప్పవయా" అని అన్నాడు శ్రీరంజన్ ఎదురు తిరిగాడు ఇతనితో పాటు కొంతమంది గిరిజనులు తిరిగి ఒక సంఘంగా నిలబడి ఫారెస్టూ రెంజర్‌ను తమ ఐక్యతను తెలియచేయడం జరిగింది.

21. వెంగన్: "మా కొండల్లో మా వాళ్ళు వీటిని చేతితో తాకనైనా తాకరు" అని అమాయకంగా సడయన్, వెంగన్ అసంతృప్తితో "బయట మనం దేన్ని తాకామో, దానిక్కడ తాకి తీరాల, బయట మనం దేన్ని తిన్నమో, దానిక్కడ తిని తీరాల అందువల్లే ఇది జైలయింది. అత్తవారిల్లు కాదు" అని అన్నాడు. శ్రీరంగన్ వెంగన్ ఉద్దేశించి "కక్కసులకాడ, భోజనాలకాడ ఎవరో నిరాహార దిక్ష సాగిస్తున్నారని చెప్పుకుంటున్నారే ఏమిటి సంగతి?" అని అడిగితే మౌనంగా ఉండు అది ఏమి లేదని చెప్పాడు.

22. కుమార్: జైలులో వెంగన్ సడయన్‌కు పరిచయం అయినాడు. "కష్టపడి బ్రతికేవాళ్ళు, చాలీచాలని బ్రతుకు బ్రతికేవాళ్ళూ ఒకటివ్వాలి. దెబ్బలు తింటున్నవాళ్ళు, అవమానాల పాలయే వాళ్ళు ఐక్యమవ్వాలి, గతిలేని వాళ్ళూ, దిక్కులేని వాళ్ళూ ధృడంగా నిలబడాలి" కుమార్ ఆవేశంగా అన్నాడు.

23. హర్తాహరుడు: తిరుమి కొద్దిసేపు ఆలోచించి, పిడారి మామగారు ఆత్మహత్య చేసుకుని ఉంటే తన కూతురుకు చెడ్డపేరు వస్తుంది కదా! అనగానే హర్తాహరుడు తలను బలంగా ఇటునటు ఆడిస్తూ "అట్లాంటిదేం జరగలేదు. ఆయనకు నూకలు చెల్లిపోయాయి. అంతే" అని చెప్పాడు.

24. రామస్వామి: రామస్వామి అనే గిరిజనుడు "నేనడుగుతున్నానని కోపం చేసుకోబాకండి" "కామ్రేడ్" అని చెప్పినాడే అది ఏమి ఉద్యోగమండీ? అని ప్రశ్నించాడు. కామ్రేడ్ అని అంటే దేశం, కులం, మతం, భాషాభేదాలు లేకుండా కష్టపడి పనిచేసి బతికే వాళ్ళందర్నీ ఒకే కుటుంబంగా భావించడం అవుతుంది. ఆ మాట బంధుత్వానికీ స్నేహంకంటే కూడా గొప్పదైన మాట అని కామ్రేడ్ వేలుస్వామి జవాబిచ్చాడు.

25. చిన్నముత్తు: "కొండజాతి వాడంటేనే అందరికీ చులకన! ప్రతి ఒక్కడూ మన మీద రాయివేసే వాడే దీన్ని అంతం చేయాలి!" అన్నాడు చిన్నముత్తు.

26. మొట్టయన్: మొట్టయన్ అనే గుండా ధర్మకర్తతో "సరే మేమింక బయలుదేరుతాము డబ్బునంతా వసూలు చేసుకొని వచ్చే సంత నాటికి తీసుకొచ్చెయ్" అని బయపెట్టించి వెళ్ళిపోయాడు.

27. పొన్నాన్: గుండూరు అనే గ్రామస్థుడు పొన్నాన్ లేచి "తరతరాలుగా ఈ కొండలపై మనిషి పుట్టినప్పటి నుంచి సంతకిందే గదా జరుగుతావుంది. ఇప్పుడు దాన్ని ఇక్కడకు తేవాలంటే అది అంత సులభమైన పనేనా అని అడగి ప్రారంభమే అడ్డంకిగా ఉంది" అని చెప్పాడు.

28. తంబివడయన్: తంబిడయన్ ఆ గిరిజనుల మనోధైర్యాన్ని కూల్చడంలో కృతకృత్యులయ్యారు. సిద్ధమై ఉన్న చిన్న గుంపు ఎదుట సిద్ధంగాలేని ఓ పెద్ద గుంపు ఓడిపోయే విధంగా ఆ కొద్దిమంది ద్రోహాలు ఆ జన సమూహం యొక్క గొప్ప లక్ష్యాన్ని ఓడించేశాడు.

29. వరదన్: మధ్య వయస్కుడైన వరదన్ "ఇప్పుడు దీనికన్నా మన బతుక్కే ఆపద వచ్చి ఉందే. దీనికేమి చెప్పబోతున్నారు. ఫారెస్టోళ్ళు అప్పుడు మనం చేసిన సంతకాన్ని ఉంచుకొని, భూములను వదిలిపోండని మా గ్రామాలలో నోటీసులు ఇచ్చినారే" అన్నాడు.

సేవి: సంఘ సభ్యుడైన సేవి భూమిని తీసుకోవాలనీ, తర్వాత దాన్ని డబ్బిచ్చి ఉమ్మడి ఆస్తిగా చేసుకోవాలనీ తీర్మానించబడి ఉందని చెప్పాడు. అందరు సంతోషంతో అట్లానే చేద్దాం అని వ్యక్తపరిచారు.

30. కట్టయన్: కట్టయన్ అనే వాడు శరీరాన్ని గోక్కుంటూ "వడయన్ చెప్పేదే సరి" అట్లాగే చేసేద్దాం! వంత పలికాడు.

31. కలెక్టరు: కలెక్టరు ఓ నిర్ణయానికి వచ్చి "నేను చెప్పేది మీకు అభ్యంతరం కాకపోతే ఇలా చేయండి! నా అధ్యక్షతన కొత్త సంత ప్రారంభమవుతుందని ప్రకటించండి" కలెక్టరుగారు వేలుస్వామితో అన్నాడు.

"మీరు మాత్రం ప్రతిఫలం ఆశించకనే ఈ పేద ప్రజలకు సేవ చేస్తున్నారు. మరి నేను మాత్రం కృతజ్ఞతల నెందుకు ఆశించాలి? సరే! నేను బుధవారం ఉదయమే అక్కడకు వచ్చేస్తాను. మీరు నిర్భయంగా వెళ్ళొచ్చు" లేచి నమస్కరించి వారికి సెలవిచ్చారు. ముగ్గురూ కలెక్టర్ గార్కి కృతజ్ఞతలు తెలిపి బయలుదేరారు.

32. తిరుమన్: తిరుమన్ మనసు పరిపరి విధాల బాధపడుతుంది. గిరిజనులు పుట్టిన నాటి నుండి భూమి కోసం పోరాటం కొనసాగుతూనే వస్తోంది. పర్వత ప్రాంతంలోని బంజరు భూములను వీరు చదనుచేసి

సాగుచేయడం, అటవీ శాఖాధికారులు ఆ పండుతున్న భూమిని స్వాధీనం చేసుకోవడం, వీరు తమ గ్రామ పెత్తందార్ల ద్వారా లంచాలు ముట్టచెప్పి తమ భూములను రక్షించుకోవడం తరతరాలుగా జరుగుతోంది. ఈ రోజూ అదే ఆరంభమై వుంది. చివరికి సంఘనాయకులు మొ॥లగు వారు ఏమి చేస్తారో జరుగుతుందోనని భయపడుతూ జరగబోయే దానిని ఊహించుకుంటూ భార్యాభర్తలిద్దరు ఆలోచించుకుంటూ తమ జీవితాన్ని ముందుకు తీసుకుపోతున్నారు చూద్దాం మరి....

33. అరియన్: "సింహం బక్కదైతే చిట్టెలుక కూడా పైన స్వారీ చేస్తుందంట" అని చెబుతూ వడ్డీ వ్యాపారి మనిషి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. అరియన్ అనేవాడు చెప్పాడు.

కామ్రేడ్ వేలుస్వామి – శ్రీరంగన్ – గిరిజన సమస్యలు పై చర్చ :

ప్రపంచం మొత్తంలోని అతడి లాంటి నిర్భాగ్య జీవులందరికీ వారు ఆశాజ్యోతులు. వారిలో నవోత్సాహాన్నీ, విప్లవ చైతన్యాన్నీ, భవిష్యత్తుపై విశ్వాసాన్నీ పూరించే విప్లవ మూర్తులు వారు! సౌభాగ్యవంతమైన జీవితాలకు మార్గదర్శకులు పేరు "వేలుస్వామి". ఇతను సంఘ నాయకులలో ఒకరు. శ్రీరంగన్ ఇతన్ని కలిసి గిరిజనుల సమస్యలను సంఘం నాయకుల ముందు పెట్టాలని వెళ్ళి కలిసాడు. చూసి "రండి కామ్రేడ్! కూర్చోండి" అని శ్రీరంగన్‌కు స్వాగతం పలికాడు.

శ్రీరంగన్ సంఘం నాయకుడు వేలుస్వామి ఎదురుగా కుర్చిలో కూర్చొని గిరిజనులు ఎదుర్కొనే సమస్యలను వివరించాడు.

"కొల్లిమలై కొండలో" ఆదివాసులను పోలీసువారు, ఫారెస్టు డిపార్టుమెంటు వాళ్ళు, అక్రమ వడ్డీ వ్యాపారులు అందరు పిల్చి పిప్పి చేస్తుంటారు. వడ్డీవ్యాపారికి డబ్బులు చెల్లించకపోతే పెళ్ళాల్ని తీసుకుపోవడం లాంటి దౌర్జన్యాలు ఆదివాసుల ప్రజలపై జరుగుతుంది. ఇవి అన్ని సమస్యలను విన్నా ప్రజా సంఘ నాయకుడు "ఇన్ని అక్రమాలనూ, దౌర్జన్యాలను ఆ ప్రజలు సహించుకుంటున్నారు" అని అడిగాడు. శ్రీరంగన్ బాధతో "వారికి ధైర్యమూ, నమ్మకము, కల్గించేవారు ఎవరులేరు" అని జవాబిచ్చారు.

"సమస్యలను ఆధారం చేసుకొని వాళ్ళను కూడ గట్టాలి. సంఘ పతాక నీడకు వారందరినీ చేర్చాలి. వ్యక్తులుగా సాధించలేనిది సమైక్యమై సంఘపరంగా సాధించి తీరుతారు. రాజకీయ, జనమూ, సంఘశక్తి లేనివాడెప్పుడు పిరికివాడుగానే ఉంటాడు. వాడే సంఘసభ్యుడిగా, మహావీరుడిగా రూపొందుతాడు. ఈ సమాజం ముందడగు వేయడానికి సాగిన ప్రతి సంఘర్షణలోనూ, పేద ప్రజల బలమూ, ఆత్మార్పణలే అన్నిటికి ముందుగా వెలువడి వున్నాయి. ఈవారం మన జిల్లాలోని రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళడానికి కార్యక్రమం తీసుకుంటున్నాం. కరపత్రాలు పంచడం, ప్లేకార్డులు రాయించి అక్కడక్కడ ఉంచడం, ప్రదర్శనా పోరాటం నడపడం చేస్తాం. అందులో మీ కొండ ప్రజల సమస్యలను కూడా చేరుస్తాం. వేలుస్వామి మాటలు విన్నది శ్రీరంగన్‌కు ఎక్కడలేని ఉత్సాహం పుట్టుకొచ్చింది. ఇతడి సంతోషంతో "ప్రదర్శనకు మేము తప్పక వస్తామండి" అని అరచినంత పని చేశాడు.

సంక్షిప్త కథనం :

కొల్లిమలై అనేది ఒక కొండ ప్రాంతం. ఇది మిట్టపల్లాలు, రాళ్లరప్పలతో నిండిన ప్రాంతమిది. ఆ కొండ దారిలో ఒక జీప్ మోటరు మెల్లగా పరిగెడుతూ ఒక అద్భుత దేవతలా వస్తోంది. దాన్ని చూసి గిరిజనులు బయపడ్డారు. మన పేరును వీరెందుకు అడగాలి. మన గుడిసెను వెదుక్కుంటూ వీరెందుకు రావాలి? ఇందులో ఏదో గూడు పుఠానీ ఉంది. ఆ ఎలుగుబంటి కారులో జీప్‌లో అనేకంగా పోలీసోళ్ళే వస్తారు. వీరు వారిలాగానే ఖాకీ బట్టలే వేసుకున్నారు. వీరు మన పేరు అడిగితే చెప్పుదామా! వద్దా!

అయిన వినన‌ట్లు న‌టించి చూద్దాం యువ‌కుడు బ‌య‌ ప‌డుతున్నాడు. "అయ్యా చేనుకాడ వున్నాడు" అన్నాడు యువ‌కుడు. తండ్రిపేరు అడిగినారు పోలీసోళ్ళు. మీ అయ్యపేరు ఓహో నీవు సావి తిరుమన్ కొడుకు సావిసడయన్ క‌దూ అవును దొరా! అని త‌న తండ్రిని గ‌ట్టిగా పిలిచాడు.

"స‌ర్కారోడు వ‌చ్చిండ‌య్యా" అని స‌డ‌య‌న్ అన్నాడు. స‌ర్కారోడంటే "కొండ‌మ‌ల్లై" కొండ ప్రాంత ప్ర‌జ‌ల‌కు పోలీసు గిరిజ‌నుల‌కు అట‌వీశాఖ‌లు మాత్ర‌మే తెలుసు. పోలీసులే వారు డ‌బ్బు అడ‌గ‌వ‌చ్చు, లేక‌పోతే యౌవ‌న‌మూ, అంద‌మూ, నిగ‌నిగ‌లాడే ఆడ‌పిల్ల‌లుంటే వారిని కోరుకోవ‌చ్చు. వారు ఏ కోరిక కోరినా వీరు నెర‌వేర్చాల్సిందే. త‌ప్ప‌దు. అందుకే వారు పుట్టారు. పోలీసుల‌ను ఎదిరించే ద‌మ్ము, ధైర్యం, అర్హ‌త సాహ‌స‌ము వారికి లేవు. ఎవ‌రైనా ఎదిరించి నిల‌బ‌డ్డారు ముళ్ళ‌పొద‌ల్లో దిక్కులేని శ‌వంగా మార్చాల్సిందే చింతిస్తున్నారు గిరిజ‌నులు.

తండ్రి కొడుకులు త‌ల‌కు చుట్టిన గుడ్డ‌ల‌ను తీసి చంక నుంచుకుని రెండు చేతులు జోడించి న‌మ‌స్క‌రించారు. పోలీసోళ్ళు ఆ న‌మ‌స్కారాన్ని స్వీక‌రించ‌లేద‌ని అలా చేయ‌డం వాళ్ళ గౌర‌వ‌ప్ర‌దం కాదు. త‌న పెంచి పోషించుకున్న తోట‌ను చూచి బాధ‌ప‌డ్డారు. ఈ చెట్ల‌కున్నా క‌ర్త‌వ్యం కొద్దిగా కూడా మ‌నుషుల‌కు లేద‌ని దుఃఖించారు.

అధికారి నిధానంగా "నిజమే!" క్రింది స్థాయి ప్ర‌భుత్వ ఉద్యోగి త‌న ఉన్న‌తాధికారి చెప్పిందానిక‌ల్లా త‌లూప‌ వ‌ల‌సిందే త‌ప్ప‌దు. అదే ఉద్యోగ ల‌క్ష‌ణం. బ్ర‌తికనేర్చిన వాడి సామ‌ర్థ్యం అని నిట్టూర్చాడు. ఇంకా వారిద్ద‌రు మాట్లాడుకోలేదు. అవ్య‌క్త శోక‌మేదో అవ‌హించింది. ఇలా గిరిజ‌నులు అమాయ‌కులు ప్ర‌భుత్వ ఉద్యోగి అంటే భ‌య‌ప‌డుతు బ్ర‌తుకుతార‌ని "కొండ‌మ‌ల్లె" ప్రాంతంలో జ‌రిగిన సంఘం న‌వ‌ల ద్వారా వ్య‌క్త‌మ‌వుతుంది.

సంఘం తెచ్చిన మార్పులు:

* సంఘ నాయ‌కులు కామ్రెడ్ వేలుస్వామి, స‌డ‌య‌న్, శ్రీరంగ‌న్, ఆండి, వెళ్ళ‌య‌న్, పెరియ‌స్వామి మున్న‌గువారు గిరిజ‌నుల జీవితాల్లో అనేక మార్పులు తీసుకొచ్చారు.

* సంఘ‌నాయ‌కులు స‌మావేశ‌మైనారు. న్యాయ‌కోసం నిల‌బ‌డ్డారు, నిజాయితీ కోసం పోరాడారు. అన్యాయాల‌కూ, అక్ర‌మాల‌కూ ఎదురు తిరిగేట‌ట్లు సంఘం చేసింది వీళ్ళ‌కు.

* మ‌నం ఇక్క‌డ సంత జ‌ర‌ప‌డానికి ప్ర‌య‌త్నించేట‌ప్పుడు దూరంగా ఉండి, వేదిక చూసిన వాళ్ళంద‌రు ఇప్పుడు సంత‌కు రెండు మూడు మోత‌ల నిమ్మ‌కాయ‌లు, జామ కాయ‌లు తెచ్చి అమ్ముకుని వెళ్తున్నారు అని ఒక‌డ‌న్నాడు. ఇది సంఘ ప్ర‌భావం.

* మ‌రొకడు ఈ కొండ ప్రాంతంలో ఇంత‌కు ముందు పెద్ద రౌడీలుండేవారు, వ‌డ్డీవ్యాపారులుండేవారు, సంత వేలందారులు ఉండేవారు వీళ్ళ‌ను ఎదిరించి నిల‌బ‌డ‌లేక పోయారు. కాని ఈ సంఘం వాళ్ళ‌ను ఎదిరించారు. గిరిజ‌నులు అనుకున్న‌ది సాధించుకున్నారు.

* ఇంకొక్క‌డు కొండ‌జాతివాడు వ‌సూలుకు వ‌చ్చిన వ‌డ్డీ వ్యాపారిని ఎదిరించాడు.

* మ‌రొక‌డి అభిప్రాయం అట‌వీశాఖ అధికార్లు మ‌నం అనుభ‌విస్తున్న భూముల‌ను లాక్కోవ‌డానికి వ‌స్తున్నారు మ‌నంద‌రం జాగ్ర‌త్త‌గా ఉండాలి. మ‌న భూమిలో ఎవ‌రైనా కాలు పెట్టితే న‌ర‌కుతామ‌ని కొడ‌వ‌లి చేత‌ప‌ట్టుకొని నిల‌బ‌డాలి అని చెప్పాడు.

* మ‌రొక‌డు ప్ర‌శ్నించాడు మ‌న భూముల‌ను కాపాడు కోవాలంటే, మ‌న‌మంతా ఒక‌ట‌వ్వాలి. మా భూముల్ని వ‌ద‌ల‌మ‌ని స‌త్యాగ్ర‌హం చేయాలి. ఆడోళ్ళూ, పిల్ల‌లూ కూడా స‌త్యాగ్ర‌హంలో పాల్గొనాలి. పోలీసులు కొడ‌తారు. జైల్లో పెడ‌తారు అయిన మ‌నం ప‌ట్టువ‌ద‌ల‌కుండా పోరాడాలి అని ప్ర‌శ్నించాడు.

* అప్పటికి కొండజాతి సమస్య తీరకపోతే మన సంఘం నాయకులు దగ్గరికి దేశమంతా వ్యాపించే విధంగా తీసుకెళ్ళుదాం, పోరాటం చేద్దాం, రాజకీయ నాయకుల దగ్గరికి వెళుదాం. వాళ్ళు దిగి రావాల్సిందే. ఇందుకు మనలో దృఢత్వం, ఓర్పు ఐకమత్యమే మనకు ముఖ్యంగా ఉండాలి.

* కొండపై సంత ప్రారంభించాం. దీనికి సంఘం వారికి అందరి అభిమానం విశ్వాసం పుష్కలంగా లభించాయి. వారి నిస్వార్థసేవ దృఢమైన పోరాటం ఆ గిరిజనులకు ఎంతగానో ఆకర్షించాయి.

* ఎవరు కూడా తమ భూములను వదులుకోవద్దు. పోరాటాలు, సత్యాగ్రహాలు, అరెస్టులు, జైలు శిక్షలు అనుభవించ వలసి వస్తే వాటిని ఓర్పుతో సాధించి, దాని ప్రతిఫలమును పొందుదాము. అని గిరిజనులకు సంఘనాయకులు వివరించి చెప్పారు.

* బంజరు భూములను సాగు చేసుకునే గిరిజనులకు సంఘం నాయకులు ధైర్యం ఇచ్చారు. ప్రభుత్వం పట్టాలిస్తామని అబద్దం చెప్పి, సంతకాలు మోసగించి తీసుకున్నారు. అయిన మీరు బయపడకుండా ఎదురు తిరగాలి మీవెంట మేమున్నాము సంఘం వాళ్ళు చెప్పడంతో కొండజాతి ఆదివాసి గిరిజనుల్లో ఏనుగు అంత బలం చేకూరింది.

* మితిమీరిన తాగుడు వల్ల రక్తహీనతతో బాధపడుతూ ఊరపందిలా లావెక్కిన అటవీశాఖాధికారుడు ఒకడు కొండజాతి గిరిజనులను నువ్వు దున్నుకుంటున్న ఈ భూమి ప్రభుత్వానికి సొంతం ఇంతకాలం ఆక్రమించి నీ దగ్గరుంచుకున్నావు, దాన్ని అంగీకరించి సంతకం కూడా చేశావు అన్నాడు. వాడికి గిగిజనులు తగినట్లు హెచ్చరించారు. ఇలా బయపడకుండా హెచ్చరించడానికి సంఘమే ప్రధాన కారణం.

* సంఘానికి చెందిన వారు గిరిజనుల భూమిని తొలగించడానికి వీలులేదు శ్రీరంగన్ నాయకత్వంలో కొండజాతి ఆదివాసులకు మరోకొండ అంత ధైర్యాన్ని తెచ్చిపెట్టింది.

* సంఘం గిరిజన ప్రజల్లో మౌలికమైన మార్పు తీసి కొచ్చింది. అందరు తమ హక్కులపై పోరాడేటట్లు చైతన్యాన్ని తీసుకొచ్చింది. అమాయకమైన గిరిజనుల్లో ఎదిరించి పోరాడే గుండె నిబ్బరాన్ని ఇచ్చింది. వారు నోరు విప్పి మాట్లాడైటట్లు నినాదాలు వారి చెవుల్లో ప్రతిధ్వనించాయి.

"పండించిన ఈ భూములు మావి
పండిన ఈ పళ్ళతోట మాకే సొంతం
లాకుంటే, నాశనం చేస్తే, చూస్తూ ఊరుకోము!
ప్రాణాలు మాకు తీపికావు, ప్రభుత్వం శాశ్వతం కాదు!
"సంఘం" జయిస్తుంది! ప్రజలు శాశ్వతంగా ఉంటారు"

* కొండ పర్వత ప్రాంతాన తొలిసారిగా సత్యస్వరం, ధర్మవేశశ్వాస, ఆత్మావేశ కంఠధ్వని, హక్కుల ప్రకటనా ప్రతిజ్ఞ పురుషుల ధ్వనిలా ఘోషించింది. నిద్రించేవాణీ, అలసి పోయిన వాణ్ణి అవి మేల్కొల్పినాయి. అతనికి యదార్థ పరిస్థితిని బోధపరిచాయి. చైతన్యవంతం చేసి కార్యాచరణకు పురికొల్పినాయి.

ఉపసంహారం

* ఐకమత్యంతో ఏదైనా సాధించవచ్చు కామ్రేడ్ వేలుస్వామి సంఘం నాయకులు శ్రీరంగన్ నడయన్ ఆండి మొదలగువారు కలిసికట్టుగా కొండజాతి గిరిజనుల భూమిని సాధించుకోగలం అని చెప్పి ఆచరించి, చైతన్యం తెచ్చి నిరూపించారు "ఐకమత్యమే బలం".

* ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవడంతో, బంజారు బీడు భూములను పోరాడి తమవిగా చేసుకున్నా కొండమలై కొండప్రాంత గిరిజన ప్రజలు వాటిని సంఘం ద్వారా నిలబెట్టుకున్నారు. మారుతున్న సమాజం అవసరానికి అనుగుణంగా మనం మారాలి. అలాగే ప్రభుత్వ పథకాలను మానమంతా సమిష్టిగా బాగుపడడం కోసం కష్టపడాలి. ప్రతిఫలాలను పొందాలి. వాటిని వినియోగించాలి.

* అన్నింటికన్నా ముఖ్యమైనది "నాది" ఈ తెగ, ఈ సంఘం అని ధైర్యంతో, గర్వంతో తలెత్తుకొని ఆత్మాభిమానంతో కలిసిమెలిసి ఒకే జాతి, ఒకే కులం, ఒకే మతం మరియు అందరిది ఒకే సమస్య దీన్ని సాధించి, మన రాబోయే భవిష్యత్తు తరాల వాళ్ళను తెలియపర్చాలి.

చివరగా మనందరం కలిసికట్టుగా ఉంటూ మనల్ని మనం గౌరవించుకుంటూ ఇతరుల పట్లా కూడా సమాన భావనలతో ఆదరణలతో కలిసిమెలిసి ఉండాలి. మారుతున్న సామాజిక దృక్పథం మనకు వివరిస్తున్న నిజం ఈ నిజాన్ని మనకు అనుక్షణం గుర్తుచేసే ఉత్తమ నవల సంఘం గిరిజన చైతన్యానికి అద్దం పట్టిన నవల.

''గిరిజన తెగలనే రివాల్వరు నుండి ఆధునిక సమాజంవైపు దూసుకొస్తున్న తుఫాకీ గుండు ఈ గిరిజన సంఘం నవల.

ఉపయుక్త గ్రంథసూచి

1. జానపద సాహిత్యం – నగరీకరణ, 2. సంఘం నవల.

వేమన పద్యాలలో మూర్ఖత్వ ఖండన

డా॥ ఇ. కోన ప్రభ, రీసెర్చ్ అసోసియేట్, మహిళా అధ్యయన కేంద్రం, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి

వరిచయం

తెలుగు సాహిత్యంలో వేమన శతకానికి ఒక ప్రత్యేక స్థానం వుంది. వేమన పద్యాలు వినని తెలుగు వారు లేరంటే అతిశయోక్తి కాదేమో. చదువుకోని వారికి సైతం సులభంగా అర్థమయ్యేలా, లోతైన భావాన్ని కూడా సరళమైన భాషలో, చక్కటి ఉదాహరణలతో హృదయానికి హత్తుకునేలా పద్యాలు చెప్పి ప్రజలను మెప్పించిన గొప్ప ప్రజా కవి వేమన. అనంతమైన విలువలతో కూడిన సలహాలు, సూచనలు, విలువలు, సంగతులను పద్యాలలో పొందుపరచి, ఆట వెలదుల్లో అలవోకగా లోకానికి తెలియజేశారు వేమన గారు.

సమాజంలోని అన్ని సమస్యలను భిన్న కోణాల్లోంచి దర్శించి ఆ దర్శన వైశిష్ట్యాన్ని వేమన తన పద్యాలలో ప్రదర్శించారు. వేమన స్పృశించని అంశం లేదు. వేమన పద్యాలలో లోక నీతులు, సంఘ సంస్కరణ, మానవతావాదం, వేదాంతం, జ్ఞానం, భక్తి, మోక్షం, మతం పేరిట జరుగుతున్న దోపిడీలు, ఆచారాల పై విసుర్లు, సామాజిక చైతన్యం ఇలా అనేక అంశాలు వున్నాయి. అంతేకాకుండా మానవ స్వభావాల్ని, మానసిక ప్రవృత్తుల్నీ సైతం లోతుగా పరిశీలించి జీవితపు పోకడల్ని, సత్యాల్నీ నిష్కర్షగా, స్పష్టంగా వివరించారు యోగి వేమన. ఈ నేపథ్యంతో వేమన పద్యాలలో మూర్ఖత్వ ఖండన అనే అంశాన్ని ఈ నా పత్ర సమర్పణకై ఎంచుకోవడం జరిగింది. మూర్ఖుడిలో మూర్ఖత్వం అనేది ఎప్పటి నుండి మొదలవుతుందో వేమన చెబుతూ

తుమ్మ చెట్టుకు ముండ్లు తోడనే పుట్టును
విత్తులోని నుండి వెడలునట్లు
మూర్ఖునకును బుద్ధి ముందుగా పుట్టును
విశ్వదాభి రామ వినురవేమ..!

తుమ్మ గింజలో నుండి మొక్కతో పాటు ముల్లు కూడా కలసి పుడుతుంది. కానీ మూర్ఖుడి విషయంలో మాత్రం ముందుగా మూర్ఖత్వం పుట్టి తర్వాత మూర్ఖుడు పుడుతాడు అని అన్నారు.

అలాగే మరొక పద్యంలో మూర్ఖుల స్వభావం గూర్చి తెలియజేస్తూ మూర్ఖులు మాట్లాడే మాటలు నీటి మీద వ్రాసిన వ్రాత వలె నిరుపయోగమైనవని, అలాంటి మాటలకు లోకంలో విలువ ఉండదు అంటూ

నీటిలోని వ్రాత నిలువక యున్నట్లు
పాటిజగతి లేదు పరము లేదు
మాటమాటకెల్ల మారును మూర్ఖుడు
విశ్వదాభిరామ వినుర వేమ..!

మూర్ఖుడు ఇది మంచి, ఇది చెడ్డ అని ఆలోచించక మాటలను మారుస్తూ ఉంటాడు. నీటిపైన వ్రాసిన వ్రాత నిలువక చెదిరిపోవునట్టుగా మూర్ఖుని స్వభావము కూడా నిలకడగా వుండక మాటి మాటికి మారిపోతూ వుంటుందని అన్నారు వేమన.

మూర్ఖుడు తానే అన్నింటికీ కారణమని భావించి గర్వపడుతూ వుంటాడు అంటూ మరొక పద్యంలో

జననమరణములకు దా స్వతంత్రుడు గాడు
మొదట గర్తకాడు తుదను కాడు
నడుమ గర్తననుట నగుబాటు కాదొకో
విశ్వదాభిరామ వినుర వేమ..!

మనిషి పుట్టుకకు గాని, మరణమునకు గాని తాను కర్త కాడు. అలాంటప్పుడు నడుమ మాత్రము తాను కర్త నని చెప్పుకోవడం నవ్వులచేటు అవుతుందని వేమన తెలియజేశారు.

మూర్ఖుడు మృగము కంటే గుణహీనుడని చెబుతూ మరొక పద్యంలో

మృగము మృగ మనుచును మృగముల దూషింత్రు
మృగముకన్న జెడుగు మూర్ఖు డగును
మృగముకన్న గుణము మూర్ఖునకే లేదు
విశ్వదాభిరామ వినర వేమ..!

లోకంలో మనుషులు ఎవరైనా తప్పులు చేసినప్పుడు వారిని మృగంతో పోలుస్తూ తిడుతుంటారు. వాస్తవానికి దాని కంటే దుష్టుడు మూర్ఖుడు. కొన్ని అడవి జంతువులలో వుండే సుగుణాలు కూడా మూర్ఖుడిలో ఏ మాత్రం కనిపించవు అన్నారు వేమన.

గొప్ప విద్యలు చదివినంత మాత్రాన మూర్ఖుడు గొప్పవాడు కాలేడు అంటూ

హీను డెన్ని విద్య లిల నభ్యసించిన
ఘనుడు గాడు మొఱకు జనుడె గాని
పరిమళముల గర్దభము మోయ ఘనమౌనే?
విశ్వదాభిరామ వినర వేమ..!

ఎంతటి ఉన్నత విద్యావంతుడైనా, బహు గ్రంథ పారంగతుడైనప్పటికీ మూర్ఖత్వాన్ని వీడక పోతే మూర్ఖుడే అవుతాడు గానీ గొప్పవాడు మాత్రం కాలేడు. సుగంధ పరిమళ ద్రవ్యాలను మోసినంత మాత్రాన గాడిద గొప్పదవదు కదా అని అన్నారు వేమన.

మూర్ఖుడిని మూర్ఖుడు మాత్రమే మెచ్చుకొంటాడని అంటూ వేమన మరొక పద్యంలో

ఓగునోగు మెచ్చు నొనరంగ నజ్ఞాని
భావ మిచ్చి మెచ్చు పరమలుబ్ధు
పంది బురదమెచ్చు పన్నీరు మెచ్చునా?
విశ్వదాభిరామ వినురవేమ..!

మూర్ఖుడు, మూర్ఖుడినే మెచ్చుకొంటాడు గాని మంచి వాడిని మెచ్చుకోడు. అలాగే అజ్ఞానికి మహా వివేకశూన్యుడే నచ్చుతాడు. పంది ఎప్పుడూ బురదలో ఉండటానికి ఇష్టపడుతుంది కాని పన్నీరును ఇష్టపడదు కదా అన్నారు.

మూర్ఖులను మార్చడానికి మనం ఎంత ప్రయత్నించినా, అదంతా కూడా వ్యర్థ ప్రయత్నమే కానీ మూర్ఖులు వారి మూర్ఖత్వాన్ని మాత్రం పోగొట్టుకోలేరని అంటూ

తనదు బాగు గోరి ధర్మంబు జెప్పిన
దిట్టుచుంద్రు మొఱకు లెట్ట యెదుట
గడ్డివేయ పోట్లగొడ్డు కొమ్మాడించు
విశ్వదాభిరామ వినురవేమ.. !

దయతలచి తినుటకు గడ్డి వేయగా పోట్లగొడ్డు పొడుచుటకు కొమ్ములను ఆడిస్తుంది. అదే విధంగా తన మంచి కోరి మంచి చెప్పినా సరే మూర్ఖులు వినక పోగా, పైగా మంచి చెప్పిన వారిని ముఖము ముందే తిడతారు అని తెలిపారు వేమన.

మూర్ఖునికి చెప్పుట ఎవరితరము కాదు అంటూ మరొక పద్యంలో

ఎడ్డె దెల్పవచ్చు నేడాదికై నను
మౌని దెల్పవచ్చు మాసముననె
మొప్పె దెల్పరాదు ముప్ప దేండ్లకు నైన
విశ్వదాభిరామ వినర వేమ..!

జ్ఞానశూన్యుడికి ఒక సంవత్సరం కాలంలో ఎలాగైనా జ్ఞానం కలిగింపవచ్చు. మంకుతనం చేసే వాడినైనా మంచి మాటలాడి మాసం తిరక్కుండా అర్థం అయ్యేలా చెయ్యచ్చు. కాని ముప్పై సంవత్సరాలు పాటు ఓప్పిగ్గా చెప్పినా మూర్ఖుడు మాత్రం తెలుసుకోలేడని అన్నారు. ఇలాగే మరొక పద్యంలో

పాముకన్న లేదు పాపిష్టి దగుజీవి
యట్టిపాము చెప్పినట్టు వినును
ఇలను మూర్ఖు దెల్ప నెవ్వరివశ మయా
విశ్వదాభిరామ వినర వేమ..!

పాము కంటే ప్రమాదకరమైన విష జంతువు మరొకటి లేదు. అలాంటి పాము కూడా పాములవాడు చెప్పినట్లు వింటుంది. కానీ మూర్ఖుడిని మార్చుట మాత్రం ఎవరి తరం కాదని అన్నారు.

మూర్ఖత్వంతో మనిషి సాధించేదేమి వుండదని వేమన చెబుతూ మరొక పద్యంలో

పుట్టుఫలము లేని పురుషాధములు భువి
బుట్టనేమి లేక గిట్టనేమి
పుట్టలోన చెదలు పుట్టదా? గిట్టదా ?
విశ్వదాభిరామ వినర వేమ..!

మానవుడు ప్రపంచంలో తాను పుట్టిన కారణమేమిటో, ఏ విధంగా ప్రవర్తిస్తే తన పుట్టుకకి సార్థకత కలుగుతుందో ఆలోచించక మూర్ఖత్వంతో తనకు నచ్చినట్లు ప్రవర్తించడం వల్ల ఎటువంటి ప్రయోజనం లేదని, అలాంటి వారున్నను లేకున్నను ఒకటేనని, పుట్టలో చెదలు పుడుతుంటాయి. మరణిస్తుంటాయి వానివలన ప్రయోజనమేమున్నది? అని అన్నారు.

ముగింపు

మూర్ఖత్వం అనేది మనిషిని వివేకశూన్యుడిని చేస్తుందని, మూర్ఖత్వం వల్ల మనిషి సాధించేదేమి వుండదని, మనిషిలో మూర్ఖత్వం వున్నప్పుడు సాక్షాత్తు దేవుడే తన ముందు వెళుతున్నా గుర్తించలేరని, గొప్ప చదువులు చదువుకున్నా మూర్ఖత్వం వుంటే గొప్ప వారు కాలేరని, మూర్ఖత్వాన్ని మనిషి విడిచిపెట్టి ప్రవర్తించినప్పుడే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరే అవకాశం ఉంటుందని తన పద్యాలలో వెల్లడించారు వేమన.

ఆధార గ్రంథాలు :

1. వేమన పద్యములు – వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్
2. వేమన పద్య రత్నాకరము – భాగవతుల సుబ్రహ్మణ్యం
3. వేమన శతకం – తెలుగు కిరణం

కోడూరి కౌసల్యాదేవి నవలలు-ఒక పరిశీలన

డా॥ దండెబోయిన పార్వతీదేవి, కెవిఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల, కర్నూలు, సెల్: 9440834017

1870-80 మధ్యకాలంలో నవల పుట్టినప్పటికీ 1960-70 మధ్యకాలంలో బాగా ఊపందుకొంది. మొదట పండితులకు ప్రతిభావంతులకు మాత్రమే పరిమితమైన నవల క్రమంగా పామరుల హృదయకవాటాలను కూడా బలవంతంగా తెరిచి లోపలికి ప్రవేశించింది. యువకులు, యువతులు, వృద్ధులు కూడా నవల చదవడం మొదలెట్టారు. పత్రికలు కూడా ధారావాహికంగా నవలను ప్రచురిస్తూ నవలకు పెద్దపీట వేశాయి. అటు నవలాకారులను ఇటు పాఠకులను బాగా ప్రోత్సహించాయి. పర్యవసానంగా కొత్త గొంతులు కొత్తకలాలు తెరమీదికి వచ్చాయి.

1960-1970 మధ్యకాలంలో చాలామంది నవలా రచయిత్రులు వెలుగులోకి వచ్చారు. కుటుంబ నేపథ్యాన్ని, సాంఘిక నేపథ్యాన్ని ప్రధానంగా తీసుకొని నవలలు వ్రాశారు. కుటుంబంమంటే ఇలా ఉండాలి. కుటుంబసభ్యులంటే ఇలా ఉండాలి. సామాజిక దృక్పథం ఇలా ఉండాలి అనిపించే విధంగా వారి రచన సాగింది. అలాంటి వారిలో ప్రముఖంగా పేర్కొదగ్గవారు కోడూరి కౌసల్యాదేవి, ముప్పాళ్ళ రంగనాయకమ్మ, లత, యద్ధనపూడి సులోచనారాణి, మాదిరెడ్డి సులోచన, ద్వివేదుల విశాలాక్షి మొదలైనవారు.

కోడూరి కౌసల్యాదేవి ఆదర్శభావాలతో అనేక నవలలు వ్రాశారు. జీవితమంటే ఏ విధంగా ఉండాలి, అనే విధంగా ఈ రచనలు సాగాయి. చక్రభ్రమణం అనే వీరి నవలకు 1962లో ఆంధ్రప్రభ వారి ఉగాది బహుమతి లభించింది. ఇదే తర్వాత డా. చక్రవర్తి చిత్రానికి ఆధారమైంది. వీరి నవలను ఆధారంగా చేసుకొని ప్రేమనగరు చిత్రం తీశారు. శంఖు తీర్థం, సూర్యముఖి, కళ్యాణమందిర్, ధర్మచక్రం, భాగ్యచక్రం వంటి 35 నవలలు వారి కలం నుండి వెలువడ్డాయి. అధిక సంఖ్యలో వీరి నవలల్లోని ఆదర్శ భావాలు ప్రతివారికీ అందుబాటులోకి రాదగినవి.

1935లో జన్మించిన కోడూరి కౌసల్యాదేవిగారు ఆనాటి సాంఘిక, రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులు వ్యక్తి జీవనంమీద చూపిన ప్రభావాన్ని, వస్తున్న మార్పును తమ నవలలలో ప్రత్యక్షంగాను, పరోక్షంగానువెల్లడి చేశారు. ఇలా ప్రతి నవలలోనూ ప్రతిబింబిస్తున్న వారి ఆకాంక్షను ప్రస్తావించాను. వారి నవలలోని ఆదర్శభావాలు ప్రస్తుత సమాజానికి అవసరమైనవని నిరూపించడానికి తగిన ఉదాహరణలతో వివరించే ప్రయత్నం చేశాను.

అన్నింటినీ మించి స్త్రీల ప్రగతికోసం, స్త్రీ సమాజ ఉన్నతి కోసం, వారిలో చైతన్యం కోసం, వారి హక్కుల పరిరక్షణ కోసం, స్త్రీని గౌరవించే సమాజనిర్మాణం కోసం, స్త్రీల బాధ్యత నెరిగించటం కోసం సంస్కరణా దృష్టితో ప్రతి నవలలోను రచయిత్రి చేసిన గొప్ప ప్రయత్నాన్ని విశ్లేషణా పూర్వకంగా వివరించాను. మహిళాభ్యుదయం సామాజికాభ్యుదయానికి, దేశప్రగతికి దోహదపడగలదన్న రచయిత్రి ఆకాంక్షను ఉదాహరణ పూర్వకంగా ఉటంకించాను. రచయిత్రి ప్రతిభను, ప్రగతిశీల చైతన్య భావజాలాన్ని గుర్తించి వారి నవలలలోని ఆదర్శభావాలు అందరికీ అందుబాటులోనికి రావలసిన అవసరమున్నదని నిరూపించదలిచాను.(కోడూరి కౌసల్యాదేవి ఇంటిపేరు వివాహానంతరం ఆరికపూడిగా మారింది. నేను ఎంచుకున్న శీర్షికలో కోడూరి కౌసల్యాదేవి అని పొందుపరచిన కారణంగా ఈ నా రచనలో వారి పేరును రెండు విధాలుగాను పేర్కొనడం జరిగిందని సహృదయ పాఠకులకు వినతి.)

'ఛందస్సునే గాక ఆలంకారిక శైలిని సయితము విసర్జించి, వర్ణనాచమత్కారమునకు, కథానైపుణికి, పాత్ర

చిత్రణకు మాత్రమే ప్రాధాన్యమునొసగిన ఆఖ్యానము నవలయైనది. ఇది వచన వాఙ్మయ నరస్వతికి శిరోభూషణము" – (పుట.212, సాహిత్య శిల్ప సమీక్ష) అని ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు అంటారు. అటువంటి విశిష్టమైన ప్రక్రియగా నవల సారస్వత క్షేత్రంలో విహరించింది.

1872లో నరహరి గోపాలకృష్ణ గారి శ్రీ రంగరాజ చరిత్రతో మొదలుగా భావించబడుతున్న నవలాప్రక్రియ మెల్లమెల్లగా ఊపందుకుంది. స్వాతంత్ర్యానంతరం వచ్చిన కాలపరిస్థితుల దృష్ట్యా తనదైన శైలిలో నిలదొక్కుకుంది. పాశ్చాత్య నవలా సాహిత్య ప్రభావం కూడా ఇందుకు ఎంతగానో దోహదపడింది. నిజానికి బ్రహ్మసమాజం ప్రభావం, వంగ సాహిత్య ప్రభావం కూడా ఆనాటి నవలాకారుల ఆలోచనలను ప్రభావితం చేసాయి. తత్ఫలితంగా సంఘ సంస్కరణాభిలాష, జాతీయతా భావము, ప్రజలను ఉద్దీపింపజేయాలన్న తపన అధికంగా కనపడే నవలలు ఆనాడు బయలుదేరాయి. వ్యక్తికి వ్యక్తికీ, వ్యవస్థకు వ్యవస్థకూ, సమాజానికి సమాజానికీ వున్న వైరుధ్యాలను ఈ నవలలు చర్చించాయి.

1935లో భారత ప్రభుత్వ చట్టం క్రింద రాష్ట్రాలకు స్వయం పరిపాలన వచ్చింది. అది ప్రజలపై కీలకమైన ప్రభావాన్ని చూపింది. "దేశ ప్రజలలో ఆత్మగౌరవాన్ని గురించిన ఆలోచనలు ఉదయించిన కాలంగా చరిత్రకారులు దీనిని గుర్తించారు" –(పుట.394, భారత స్వాతంత్ర్యోద్యమం – రాజ్యాంగ వికాసం 1998). ఆ కాలంలోనే అనగా 1936లో కోడూరి కౌసల్యాదేవి పుట్టారు. సమకాలీన పరిస్థితుల ప్రభావం సమాజం మీద ఎలావున్నదో ఈమె గ్రహించారు.

అదే తరుణంలో సామాజిక స్పృహ, ప్రతిభగల ఎందరో మహిళామణులు సాహిత్య రంగంలో అడుగుపెట్టారు. తమ చుట్టూ వున్న వ్యక్తులు, వ్యవస్థ, సంఘం వాటి స్వరూపాన్ని దగ్గరగా గమనించిన వీరు కలం పట్టారు. అందులోని లొసుగులను తద్వారా ఉత్పన్నమౌతున్న సమస్యలకు స్పందించారు. పరిష్కారాలను ఆలోచింపజేస్తూ పదునైన రచనలను చేసారు. ఫలితంగా నవలా ప్రపంచం విస్తారమైంది.

జాతీయోద్యమం మూలంగా దేశప్రజలలో పెరిగిన రాజకీయ, సామాజిక చైతన్యాలు రచయిత్రి కోడూరు వారిలోను ఆలోచనలను రేకెత్తించాయి. వీరి విశేష స్పందన 35 నవలల దాక అద్భుతమైన రీతిలో వెలువడింది.

"ఆ స్త్రీ శక్తిని ఆపటం ఎవరితరమూ కాదు" – (పుట.129, ఆకాశంలో సగం) అని ప్రసిద్ధ మహిళా రచయిత్రి ఓల్గా నేడు అన్నారు. కాని అంతకుముందే స్త్రీ స్వయంసిద్ధ కావాలి అని ఉత్తేజపరచడానికి పూనుకున్నారు కోడూరి కౌసల్యాదేవి.

రచయిత్రికి వున్న బెంగాలీ, ఆంగ్ల సాహిత్యాల పరిచయం శరత్‌చంద్ర ఛటర్జీ, షేక్స్పియర్, రవీంద్రుడు వంటి మహనీయుల రచనల ప్రభావం కారణంగా ఆమె రచనా వ్యాసంగం మీద పట్టును సాధించారు. సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం వంటి కళల సంస్కారం వల్ల ఆమె రచనల్లో సున్నితమైన లాలిత్యమైన భావజాలం సంస్కారవంతంగా, మరందబిందువుల్లా జాలువారింది. సంప్రదాయమైన భాష, పటుత్వమైన శైలి, పదగుంభనం, శిల్ప, వర్ణనా సౌందర్యములు ఆమెకే సొంతమన్నట్లుగా ఒప్పాయి.

"నవలా రచయిత ధ్యేయం కథ చెప్పడం కాని, మనల్ని ఆనందపరవశుల్ని చేయడం గాని కానేకాదు. అజ్ఞాంగా దాగివున్న సంఘటనల ప్రాధాన్యతను మనం అర్థం చేసుకొని ఆలోచించేటట్లు అతను చెయ్యగలగాలి....." (పుట.3) తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ'' అని Manpassant అనే ఫ్రెంచ్ నవలాకారుడు అన్న మాటలు ఇక్కడ గమనించదగ్గవి. అలాంటి పంథాలో కోడూరి

కౌసల్యాదేవి గారి నవలలు సమాజాన్ని ఆలోచింపజేసాయి. వారి రచనలను వరుసగా పరిశీలిస్తూ పోతే సమాజానికి వాటివల్ల ఒనగూరే ప్రయోజనం అవగతమవుతుంది.

కోడూరి కౌసల్యాదేవి నవలలు దాదాపు 35 దాకా సాహితీప్రచురణల సంస్థ విజయవాడ వారిద్వారా లభ్యమవు తున్నాయి. వాటన్నింటిని సేకరించి పరిశీలించటం జరిగింది. కుటుంబ ఇతివృత్తాలు, మానవ సత్సంబంధాలను ఆవిష్కరించేవి, మహిళాభ్యుదయాన్ని కాంక్షించేవి, సామాజిక, వైయక్తిక అభివృద్ధికి దోహదపడేవి, వ్యవస్థలోని విస్మరణకు, లేదా నిరాదరణకు గురౌతున్న సున్నితాంశాలను చర్చించినవి –ఇలా అనేక కథాంశాలు వీరి నవలలో మనకు కనిపిస్తాయి. ప్రేమసుధాభరితమైన నవలలు కూడా యువత కలలను, కాంక్షలను మేల్కొల్పేవై దర్శనమిస్తాయి. ప్రతి నవలలోనూ రచయిత్రి మానవ సత్సంబంధాలను చర్చించారు. మానవీయ విలువలను ఆవిష్కరించారు. ఇతివృత్తం ద్వారా, ఆయా కథా సన్నివేశాల ద్వారా, పాత్ర చిత్రణద్వారా కూడా రచయిత్రి ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ సమాజానికి అవసరమైన అనేక విషయాలను ప్రస్తావించటం అభినందించదగ్గ విషయం.

రచయిత్రికున్న సామాజిక శ్రేయోభిలాష, సున్నిత మనస్తత్వం, సంపూర్ణ వ్యక్తిత్వం, అవగాహనా పరిణతి గొప్పవి. వారి ప్రతి నవలలోనూ ఈ సుగుణాలు వెల్లడవుతాయి. ప్రతి సందర్భంలోనూ మానవులు ఎలా మసలుకోవాలో తీరైన రీతిలో తెలియజెప్పడానికి రచయిత్రి ఎంతో ప్రయత్నం చేశారు. అత్యంత సున్నితంగా సమస్యలను పరిష్కరించుకొని జీవితంలో ప్రశాంతతను ఎలా ఆవిష్కరించు కోవాలో తెలపడానికి శతవిధాలా ప్రయత్నించారని చెప్పవచ్చు. ప్రేమ, సహకారం, సమస్యలను అవగాహన చేసుకోవటం, సంకుచితత్వానికి తావివ్వని విశాల దృక్పథం, మానసిక పరిపక్వత ప్రతి ఒక్కరికీ అవసరమైన అంశాలుగా నొక్కి చెప్పారు. కుటుంబ వ్యవస్థలోని సాంఘిక, సామాజిక విశిష్టతలను, సంస్కారశైలిలో పరిరక్షించుకోవాలని ఉద్బోధ చేశారు. మనిషి మనశ్శాంతిగా బ్రతకటానికి మానసిక నైర్మల్యం అవసరమన్న విషయాన్ని పదేపదే గుర్తుచేశారు కౌసల్యాదేవి.

రచయిత్రి వ్రాసిన మనకు లభ్యమవుతున్న 35 నవలల్లోనూ ఇతివృత్తాన్ని గమనించినట్లయితే ఆనాటి సమకాలీన పరిస్థితులు అవగతమవుతాయి. పరిధులు దాటని స్త్రీస్వేచ్ఛ, మానసిక పరిపక్వత లోపం, ఛాందసాలు, కౌటుంబిక వ్యవస్థలోని అనాగరిక పద్ధతులు, ఆచారాలు సమస్యలను సృష్టిస్తున్న వైనాన్ని రచయిత్రి ఈ నవలలలో చర్చించారు.ఆనాటి రాజకీయ పరిస్థితుల కారణంగా స్త్రీవిద్య– హక్కులు అన్న అంశం తెరమీదికి రావటం జరిగింది. స్త్రీ పురుష సమానత్వం స్త్రీ సాధికారత భావజాలం వెల్లువెత్తింది. ఆ ప్రభావం మనకు కోడూరి వారి నవలలలో స్పష్టంగా వెల్లడవుతుంది. సమకాలీన పరిస్థితులకు చక్కటి దర్పణంలా వీరి ప్రతి నవల భాసించింది. రచయిత్రికున్న ప్రతిభ,సామాజిక స్పృహ, విజ్ఞానము, సమకాలీన పరిస్థితుల ఆకళింపులను ఈ నవలలు బుజువు చేస్తాయి.

రచయిత్రులు వంటింటి కథలు వ్రాస్తారు అన్న చందాన విమర్శలు ఒకనాడు పెల్లుబికిన మాట వాస్తవం. అయితే కౌసల్యాదేవిరచనలు మాత్రం ఇందుకు మినహాయింపు అని చెప్పాలి. 1935లో వారి జననం అనుకుంటే ఆమె రచనా వికసనం, వయస్సు వికసనం రెండూ సరిగ్గా 1955 ప్రాంతం నాటికి జరిగి ఉండాలి. కనుకనే ఆమె ఆంతరంగిక భావపరంపరలు వాస్తవాలను స్పష్టంగా వెల్లడి చేసాయని చెప్పవచ్చు.

ఆనాటి భారతదేశ రాజకీయ, సాంఘిక, సామాజిక పరిస్థితులను గమనించటం ఇక్కడ ఎంతైనా అవసరం. అనేక విధాలుగా వెనుకబడివున్న సమాజం, వ్యవస్థలోని లొసుగులు, అవగాహనారాహిత్యం, అవిద్య, ఆనాటి ఆర్థిక అసమానతలు గమనించదగ్గవి. అందునా స్త్రీ గౌరవం

మన్నింపబడని రోజులవి. ఆ దినాలలో రచయిత్రిని బాగా ఆలోచింపజేసినది తనచుట్టూ వున్న సమాజం కుటుంబాలు. అందులోని వ్యక్తులు. పరిధులకు లోబడి బ్రతుకుతున్న మహిళాలోకం. ఎదగటానికి ప్రయత్నిస్తున్నా తిరుగుముఖం పట్టిస్తున్న తోటి వ్యక్తులు. పరిణతిలేని ఆలోచనలు. ఇవన్నీ సమాజాభివృద్ధిని తిరోగమనం పట్టిస్తాయని భావించారు కౌసల్యాదేవి. వారి దేశాభివృద్ధి కాంక్ష, ప్రగతిశీల భావజాల నేపథ్యం, సౌశీల్యవంతమైన సంస్కరణాభిలాష ఆమెలో ఆలోచనలను రేకెత్తించాయి. సమస్యలను విశ్లేషించే కథనాలవైపు సృజనను ఆమెలో మేల్కొల్పాయి. అందుకే వారి కలం నుండి శాంతి సుమాలసుధాలాపనలు నవలా రూపంలో వెల్లువెత్తాయి. నవలలు, కథలుగా పరిఢవిల్లాయి. ఒక్కొక్క నవల ఒక ఆదర్శగ్రంథంలా అద్భుతమైన వైయక్తిక అభివృద్ధిని ఆకాంక్షించింది. సామాజికాభివృద్ధిని సాధికారంగా స్థాపించడానికి పూనుకుంది.

కౌసల్యాదేవి నవలలు ఆణిముత్యాలు. హృదయాలను చైతన్యపరిచే ఉదయకిరణాలు. చక్రభ్రమణాలై జీవితాన్ని రుచింపజేశాయి. ధర్మచక్రాలై ధర్మస్థాపనకు శంఖం పూరించాయి. ప్రేమనగరులై కలల లోకంలో ఊహల పల్లకిలో యువతను ఊరేగించాయి. తపోభూమిలా ఈ జగత్తును దర్శింపజేశాయి. పూజారిణిలా స్త్రీమూర్తి పవిత్రతను బాధ్యతను నొక్కిచెప్పాయి. కుబ్జనుద్ధరించిన మురళీకృష్ణునిలా సంస్కరణను అభిలషించాయి. చక్రవాకరాగమై బ్రతుకులోని బాధ, వేదనల సమతూకాన్ని చాటిచెప్పాయి. శంఖతీర్థమై పవిత్ర మనస్కులను ఆవిష్కరింపజేయ పూనుకున్నాయి. శిలలు – శిల్పాలుగా మారటంలో మాతృమూర్తి స్థానాన్ని మరువలేనిదిగా నిర్మించాయి. జనరంజని అయినా జన్మకు సార్థకతను అభిలషిస్తుందని తట్టి చెప్పాయి. స్వయంసిద్ధలై జగత్తులో మహిళలు చేవతో, నిర్భయంగా నడవాలని ప్రోత్సహించాయి. స్త్రీని కల్పవృక్షంలా భాసించమని హితవు చెప్పాయి. బ్రతుకును బృందావనంలా మార్చుకొమ్మని సూచించాయి. మురళీనాదంలా బ్రతుకును స్వచ్ఛంగా సాగించమని ఉద్బోధించాయి. బ్రతుకు నందనవనమై ప్రతి కుటుంబం శాంతినికేతనమై విశ్వమంతా దివ్య దీపావళులతో వెలుగొందాలని ప్రగాఢ కాంక్ష చేశారు. ఇలా ప్రతి నవలా ఒక సున్నితమైన మానవీయ కోణాన్ని దర్శింపజేసింది.

ఈ నవలలలోని ఆదర్శభావాలు పాఠకుడిలో చిత్తసంస్కారానికి బలమైన బాటలు వేయగలవు అని చెప్పడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. పైగా చదువుతున్న కొద్దీ పాఠకుని పట్టి ప్రతివాక్యాన్ని పదేపదే చదవాలనిపించే పఠనీయ లక్షణం ఈ నవలలకు ప్రాణమై భాసిల్లింది. ఎక్కడా విసుగుదల, అనౌచిత్యం అన్న భావన మనకు అగుపించదు. రచయిత్రికున్న సామాజికాభివృద్ధి కాంక్ష, బలమైన ఆశయ నిర్మాణకాంక్ష, ఆదర్శ సమాజం అభిలాష కారణాలు కావచ్చు. అక్కడక్కడా విశేషంగా ఇతివృత్తాన్ని ప్రక్కకు నెట్టి సందేశాన్ని ఇవ్వగోరినట్లు అనిపిస్తుంది. అయితే అదీ కూడా నిర్లక్షించదగ్గదే కానీ, లోపంగా మాత్రం మారకపోవటం గమనార్హం. రచయిత్రి రచనలో బైటపడటం సర్వసాధారణం. అందులో కౌసల్యాదేవి కూడా మినహాయింపు ఏమీ కాదు. అయితే ఆనాటి సమాజం ఈ భావాలను, ఆదర్శాలను బాగా ఆదరించింది అనటానికి ప్రత్యక్ష సాక్ష్యం వారి కలం నుంచి పుంఖాను పుంఖాలుగా వచ్చిన రచనలు. వాటికి కలిగిన ప్రాచుర్యం, ప్రసారములే.

కోడూరి కౌసల్యాదేవివారి రచనలలో ముఖ్యంగా స్త్రీ జనాభ్యుదయ కాంక్ష కనబడుతుంది. స్త్రీ చైతన్యంకోసం ప్రతి నవలలోని వీరి అభిభాషణ అద్భుతమైన ఉత్తేజాన్ని, స్ఫూర్తిని ఇచ్చేదిగా ఉన్నది. సమాజంలో స్త్రీలకు అడుగడుగునా ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొని రాణించటంలో ధైర్యం, నిర్భీతి, నిలకడ అవసరమని చెబుతాయి. హక్కులను సాధించుకుంటూనే బాధ్యతలను నిర్వహించాలని ప్రబోధిస్తాయి.

సంఘ సంస్కరణ, సామాజిక దృష్టిగల నవలలు, కుటుంబ కథాపరమైన నవలలు అన్నీ చాలావరకు స్త్రీ పైననే

దృష్టిని సారిస్తాయి. సామరస్యంగానే సమాజాన్ని గెలవాలని చెప్పే ప్రయత్నం చేస్తాయి. విప్లవాత్మకమైన స్త్రీవాద ధోరణి కంటే కొంత సౌమ్యత, స్వచ్ఛశీలత, బాధ్యతలపైనే రచయిత్రి ఈ నవలలలో దృష్టిని సారించారు. సున్నితమైన భావ జాలాన్ని వెల్లడి చేశారు. అడుగడుగునా వీరు వెలిబుచ్చిన అభిప్రాయాలు, ఆవిష్కరించిన చైతన్య ప్రబోధ సిద్ధాంతాలు అన్ని సమాజాలకు అవసరమైనట్టివే. ఆదర్శప్రాయమైనట్టివే.

కోడూరి కౌసల్యాదేవిగారి ఈ నవలలు ఆంధ్ర పాఠక లోకానికి, అభ్యుదయ కాంక్ష కలిగిన ప్రతి సమాజానికి ఎంతో మేలును చేకూరుస్తాయనటంలో సందేహం లేదు. వీరి నవలలపై మరింత పరిశోధన జరిగినట్లయితే ప్రస్తుత సమాజానికి అవసరమైన మానవీయవిలువలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. భారతీయ సంస్కృతికి పునాది అయిన కౌటుంబిక వ్యవస్థ బలపడే ప్రయోజనం నెరవేరుతుంది.

ఉపయుక్త గ్రంథసూచి :

1. అరికెపూడి (కోడూరి) కౌసల్యాదేవి: సాహితీప్రచురణలు, 35 నవలలు

2. వెంకటసుబ్బయ్య వల్లంపాటి : నవలాశిల్పం (1989)

3. వెంకటసుబ్బయ్య వల్లంపాటి : కథాశిల్పం (1995)

4. ఆచార్య జి. నాగయ్య : తెలుగు సాహిత్య సమీక్ష

5. డా॥ ద్వానా శాస్త్రి: తెలుగు సాహిత్య చరిత్ర

6. కాత్యాయినీ విద్మహే : 20వ శతాబ్ది రాజకీయార్థిక పరిణామలు – తెలుగులో స్త్రీల సాహిత్యం (2003)

7. కుటుంబరావు కొడవటిగంటి : సాహిత్య వ్యాసాలు

8. డా॥ మృణాళిని. సి : సాంఘిక నవల – కథన శిల్పం

9. డా॥ వి. మంజులత : తెలుగు కవిత్వోద్యమాలు

"నేటి సాంఘిక జనజీవనంపై ఇతిహాసాల ప్రభావం"

మూల్మాల్రి మూర్తాతి, పరిశోధక విద్యార్థి, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం – 533296.
చరవాణి : 9381582860

అనాది నుండి భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలకు, జనజీవన విధానానికి ప్రపంచ దేశాలన్నింటిలో కెల్లా అత్యంత సముచితమైన స్థానం, గౌరవం నేటికీ ఉన్నాయంటే, దానికి కారణం మన సాహిత్య సంపద అయినటువంటి ఇతిహాసాలే అన్నది జగమెరిగిన సత్యం.

భారతీయులు ఆచరించే ఆచార వ్యవహారాలు, సభ్యత, సంస్కారాలు, సంస్కృతీ సాంప్రదాయాలు, విలువలు, వ్యక్తిత్వాలు, హైందవ జీవన విధానాలు ప్రపంచ మానవాళికి ఆదర్శవంతము మరియు ఆచరణయోగ్యమైనవని మేధావులు, పండిత వర్గాలు ఇప్పటికీ ప్రశంసిస్తూనే వుంటాయి అంటే దానికి కారణం సాహిత్యంపై మనకున్న నమ్మకమూ, పట్టూ, ప్రభావం మరియు ఇతిహాసాలైనటువంటి రామాయణ, భారతాదుల వంటి ఉద్గ్రంధాల ప్రభావం అని నిస్సంకోచంగా చెప్పవచ్చు.

అసలు మనిషి జీవన విధానంలో సాహిత్యాన్ని మనం పెనవేసుకున్నంత గాఢంగా మరే విదేశీయులు కానీ, విభాషీయులు గానీ కనిపించరు. మనిషికి నిత్యావసరాలైన కూడు, గూడు, నీరు, నిప్పు వరుసలో భాగంగా సాహిత్యాన్ని కూడా మనం అలవాటు చేసుకున్న తీరు మిగతా వారందరూ ఆచరించి, అనుసరించాల్సిన ఆమోదయోగ్యమైన అంశమనే చెప్పాలి. అందుకనే సాహిత్యంలో ముఖ్యంగా ఇతిహాసాలలో ముడిపడిన మన జీవన విధానం ప్రపంచ జనజీవనానికి ఒక గొప్ప నమూనాగా నేటికీ సజీవంగా వర్ధిల్లుతుంది.

పంచభూతాల సమాహారము మనిషి. పంచభూతాలతో పాటు ఆరవ భూతంగా కళ కూడా మన జీవన విధానంలో ఒక భాగమయింది. ఆ కళే సాహిత్యం. సాహిత్యంలోని అంతర్భాగమే ఇతిహాసాలు. ఈ ఇతిహాసాలు భారతీయ జీవన విధానాన్ని నిరంతరం ప్రభావితం చేస్తూనే ఉంటాయి. ముత్యాలముగ్గు సినిమాలోని "మనిషన్నాక కాసింత కళాపోషణ ఉండాలి. లేకుంటే మనిషి గొడ్డుకి తేడా ఏముంది" అనే రావుగోపాలరావు గారి డైలాగ్ మనందరికీ సుప్రసిద్ధమే. కళను ఇంతగా మన జీవన విధానంలో పెనవేసుకున్న సంఘటనలు మరెక్కడా కానరావు.

పాశ్చాత్య జీవన విధాన పోకడలు ప్రపంచమంతా విస్తరిస్తున్న ఈ రోజుల్లో కూడా భారతీయుల జీవన విధానం ఇంకా తన నిజమైన ఉనికిని చాటుతుందంటే అది ఇతిహాసాల ప్రభావమే. త్రేతాయుగపు రామాయణం, ద్వాపర యుగపు భారతం, కలియుగంలోని 5వేల సంవత్సరాలు దాటిన తరువాత కూడా మనం వాటిని అనుసరిస్తూ, ఆచరిస్తున్నామంటే అది భారతీయుల యొక్క అంకిత భావానికి ఓ తార్కాణంగా చెప్పవచ్చు. ఇందుకు ఉదాహరణగా ఈ మధ్యే విడుదలై విజయదుందుభి మ్రోగిస్తున్న కార్తికేయ –2 చిత్రం ఒక నిదర్శనం. శ్రీకృష్ణుని ద్వారకానగర ఇతివృత్తం కలిగిన ఈ సినిమా భారతీయుల దైవభక్తిని మరింత చాటిందనే చెప్పాలి.

భారతీయుల జీవన విధానంలో భాగంగా కర్మ సిద్ధాంతాన్ని ప్రముఖంగా చెప్పవచ్చు. పూర్వజన్మ పాపపుణ్యాల ఫలితమే నేటి జీవన విధానము అని నమ్మే ఈ సిద్ధాంతానికి మూలకోణం ఇతిహాసాలే. మనం "కౌసల్య రామా పూర్వ సంధ్యా ప్రవర్తతే" అనే సుప్రభాతంతో నిద్ర లేస్తూనే భగవత్ భక్తిని చాటుతాము. దానికి కారణం ఇతిహాసాలైన రామాయణ, భారత, భాగవతాలపై మనకున్న నమ్మకమే. భగవంతుడు ఉన్నాడని గట్టిగా నొక్కి వక్కాణించే దేశం ప్రపంచంలో ఒక్క భారతదేశమే. ఇందుకు మూలకారణం రామాయణ, భారతాలపై మనం పెంచుకున్న ప్రేమే. పూజలు, పునస్కారాలు, శంకుస్థాపనలు, వ్రతాలు,

గృహప్రవేశాలు, యజ్ఞాలు, యాగాలు, ముహూర్తాలు, దానధర్మాలు, నోములు ఇవన్నీ భారతీయుల జీవన విధానంలో ఒక భాగం. ఇవన్నీ కూడా భగవత్ ప్రీతి కోసమే మనం చేస్తాము. వీటి మూలాలు మనకు ఇతిహాసాలలో కనిపిస్తాయి. ఇవన్నీ విదేశీయులకు మూఢ నమ్మకాలుగా కనిపిస్తే, ఒక్క భారతీయులకే అతి పవిత్ర సత్కార్యాలుగా అనిపిస్తాయి.

"చందమామ రావే జాబిల్లి రావే", "చిట్టి చిలకమ్మ అమ్మకొట్టిందా" అనే పాటలతో మొదలయ్యే మన బాల్యం "జో అచ్యుతానంద జోజో ముకుందా" అంటూ సాగుతూ రామాయణ, భారత, భాగవతాలలోని కథల ద్వారా పెరిగి పెద్దవై భక్తిని, ముక్తిని మన జీవితంలో ఒక భాగంగా స్థిరపరుస్తాయి. ఇది మన సాంస్కృతిక వారసత్వంలో నిత్యమూ జరిగే ఒక ప్రక్రియ. అందుకే ఇతిహాసాలు భారతీయుల నరనరాన జీర్ణించుకుపోయి వున్నాయి.

సీత, ద్రౌపది, సావిత్రి, సక్కుబాయి, అనసూయ వంటి సాధ్వీమణుల జీవిత గాథల ద్వారా తెలుసుకున్న స్త్రీల గొప్పదనాన్ని నేటి సమాజంలోని స్త్రీలను గౌరవించేలా చేసింది. అందుకనే ఏ దేశమూ చెప్పని విధంగా "స్త్రీలను గౌరవించడం మన సాంప్రదాయం" అని సగర్వంగా చాటుకున్నాము. నేటికీ ఆచరిస్తున్నాము. అన్ని అవకాశాలలోనూ, అన్ని వ్యవస్థలలోనూ స్త్రీలకు సమప్రాధాన్యం యిచ్చి వారిని గౌరవించుకుంటున్నాము. అమ్మగా, అక్కగా, చెల్లిగా, దేవతగా స్త్రీని నిరంతరమూ పూజిస్తున్నాము, ప్రేమిస్తున్నాము, గౌరవిస్తున్నాము.

అదే విధంగా గురువుల యెడ ఎనలేని భక్తిప్రపత్తులను చాటుకుంటున్నాము. గురు బ్రహ్మ, గురు విష్ణు, గురుదేవో మహేశ్వరః । గురుసాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురవేనమః ॥ అంటూ గురువులను గౌరవిస్తున్నాము. తల్లిదండ్రుల యెడ పూజనీయతనూ చాటుకుంటున్నాము. అన్నదమ్ముల అనుబంధాన్ని, అక్కచెల్లెల ఆప్యాయతలను, బంధాలను, బంధుత్వాలను, స్నేహాన్ని ప్రాణప్రదంగా భావిస్తున్నాము. స్వార్థానికి తావులేకుండా నిస్వార్థంగా బ్రతకాలనే సత్సంకల్పంతో శారీరక శ్రమకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నాము. శాంతి, సత్యము, అహింస, కరుణ, జాలి, దయ వంటి ఉత్తమ గుణాలతో జీవనాన్ని ఫలప్రదం చేసుకుంటున్నాము.

సాటి మనిషికి సాయం చేయాలనే ఆలోచన ఇంకా మనకు మిగిలే వుంది. అపకారికి సైతం ఉపకారం చేసే గొప్ప మనస్సు మనకుంది. అతిథులను, అభ్యాగతులను దైవంగా భావించే సంస్కృతి మనది. రక్త బంధం కన్నా స్నేహ బంధం ఇంకా పటిష్టమైనదిగా భావిస్తున్నాము.

పాపపుణ్యాలను బేరీజు వేసుకుంటూ గుణదోషాలను ఎంచుకుంటూ వీలైనంత వరకు జీవితాన్ని సక్రమమైన మార్గంలో పయనించేలా జీవితాన్ని ముందుకు తీసుకెళుతున్నాము. ఆధ్యాత్మికతను, వైరాగ్యాన్ని, తాత్త్వికతను అవగాహన చేసుకొని, వాటికీ మన జీవితంలో చోటిచ్చాము.

ఇలా చెప్పుకుంటూపోతే భారతీయులకున్న జీవ వైవిధ్యం మరే దేశీయులకు లేదని చెప్పవచ్చు. విపరీతమైన పాశ్చాత్య పోకడలు ప్రపంచాన్ని ఏలుతున్న ఈ సమయంలో, కలియుగం ప్రవేశించి 5వేల సంవత్సరాల పైచిలుకు కాలంలో కూడా ఇంకా మన జీవన విధానం మిగతా వారికి ఆదర్శప్రాయమైనదిగా కొనసాగుతుందంటే అందుకు మనపై రామాయణ, భారతాదుల ప్రభావమూ మరియు మన హృదయాలకున్న గొప్ప సంస్కారమని చెప్పక తప్పదు.

"మన జాతికి మూలాలు ఇతిహాసాలు"

"మన జీవన వైవిధ్యానికి సోపానాలు ఇతిహాసాలు"

"మన సంస్కృతీ సాంప్రదాయానికి కారణాలు ఇతిహాసాలు"

"మన ఆచార వ్యవహారానికి తోరణాలు ఇతిహాసాలు"

"మన సభ్యత సంస్కారాలకు సాక్ష్యాలు ఇతిహాసాలు"

"మన నీతి నిజాయితీలకు లక్ష్యాలు ఇతిహాసాలు"

బోయి భీమన్న రచనలు పరిశీలన

ఎల్లోబు. మమత, టి.యం.ఆర్.జె.సి., గజ్వేల్ , సెల్: 9000581848

సమాజంలో కుల వ్యవస్థ నిర్మూలనకు, అగ్రవర్ణాల అరాచకాలను తన రచనల ద్వార బయట్టబయలు చేసిన ప్రజ్ఞాశాలి బోయి భీమన్న గారు. 1911లో తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో జన్మించి సాహిత్యనికే తన జీవితాన్ని అంకితం చేసిన కళాప్రపూర్ణుడు బోయిభీమన్న గారు.

అస్పృశ్యత ప్రబలంగా ఉన్న కాలంలో ఎన్నో వ్యయ ప్రయాసలతో విద్యనభ్యసించారు. తన పదకొండవ ఏట నుండె రచనలు చేయడం ప్రారంభించారు. కవి, రచయితగా, పద్య, గేయ, వచన, రచనలతో పాటు నాటికలు, నాటకాలు, వచన కవితలాంటి ప్రక్రియతో తనకంటు సుస్థిరస్థానాన్ని సంపాదించుకున్న మహానీయుడు భీమన్నగారు.

పాలేరు :

కులనిర్మూలనను బలంగా వ్యతిరేకిస్తూ 1938లో రాసిన పాలేరు నాటకంలో వెంకన్న- వనబాలల ప్రేమ కథ, 1959లో వ్రాసిన "రాగవాసిష్ఠం" నాటకంలో అరుంధతి-వశిష్ఠుల ప్రయణగాథ, ఇలా ఇంకా కొన్ని రచనల్లో భీమన్న కులాంతర వివాహాల పేరుతో కులనిర్మూలన గురించి చర్చించాడు. సమాజంలో కులం వల్ల సమాజంలో అవమానాలకు గురేతున్న వెంకన్న ప్రేమించుకుంటారు. పాలేరుగా పని చేయవలసిన వాడు, అగ్రకులంలో ఉన్న అమ్మాయిను పెళ్ళిచేసుకోవాలటే ఎన్ని బాధలకు గురికావలసి వస్తుందో రచయిత మన కళ్లకుకట్టినట్టు వివరించడం జరిగింది.

గుడిసెలు కాలిపోతున్నె :

గుడిసెలు కాలి పోతున్నె 1973 లో తాను రాసిన కావ్యంలో ఏడాది కోసారి దళితుల గుడిసెలెందుకు కాలి పోతున్నె మరలా కొత్తగుడిసెలు మాత్రమే ఎందుకు వస్తుయి! ఓట్లు కోసం వచ్చే నాయకులను నిలదీసే ప్రశ్నించే చైత్యనం దళితుల్లో కలగాలనే ఆశయం కనిపిస్తుంది. చీమలను శ్రామిక దళితులుగా పాములను కులదోపీడీదారులకు ప్రతీకలుగా చేసి వర్ణించాడు దళితుల మధ్య ఉండాల్సి సమైక్యతను ప్రబోధిస్తారు. ప్రభుత్వాన్నితత్వం ప్రశ్నించేతత్వం, దళితులు అభివృద్ధి చెందకపోవడానికి కారణాలు ఇవన్ని కూడా గుడిసెలు కాలిపోతున్నె అనే రచనలో కనబడుతుంది.

కూలిరాజు :

1946 లో కూలిరాజు అనే నాటకంలో కులంతో పాటు ఆర్థికాంశాల్ని కూడ స్పర్శించారు. ధర్మంకోసం పోరాటంలో బహుజనులంతా రాజ్యాధికారదిశగా పయనించానికి సూచనలు చేశాడు. వాల్మీకి వేదవ్యాసుడు ధర్మవ్యాదుడు మొదలైన వాళ్ళు దళితులవేనని వాదిస్తూ వాళ్ళు వ్రాసిన భారత, రామాయణం భాగవతాలు మా దళితులవేనని చెప్పడంలో భీమన్న ధ్వక్పథాన్నిలోతుగా విశ్లేషించుకోవచ్చు.

పైరుపాట :

ఈ పైరుపాటకు రంగస్థలం భీమన్నగారి గోదావరీ తీరంలోని పైరుపొలాలు. ఈ రూపకంలో కథాయిక స్నేహ ఒకమాల పిల్ల పేదరికంలో పెరిగి పెద్దయిన యువతి ఆమె పైరుచేల గట్లలో పచ్చగడ్డి కోసుకొనేందుకు ప్రతి సాయంత్రము పొలలోకి వెళ్తుంటుంది ఆమె స్నేహితురాలు శీల స్నేహకి శ్రీవత్స అనే అగ్రకుల విద్యావంతుని పరిచయం అయి అది కాస్త ప్రేమగా మారుతుంది.ఇలా ఈ రూపకంలో ప్రేమ,పెళ్ళి ఎంతో చక్కగా వర్ణించడం జరిగింది.

జానపదుని జాబులు :

జానపదుని జాబులలో మనకు గ్రామీణ ప్రజల ఆర్థిక స్థితిగతులు కనబడుతాయి. ఒక్కొక్క లేఖలో ఒక్కొక్క అంశాన్ని తీసుకొని రాయడం జరిగింది. పగలు అంత రెక్కలు ముక్కలు చేసుకొని రక్తం నీరుగా మార్చుకొని శ్రమించి సంపాదించిన డబ్బులను కల్లు దుకాణంలో సమర్పించడం, ఇంట్లో పిల్లల ఆకలి, పిల్లలను,పెళ్ళన్ని కొట్టడం వంటి సంఘటలను చూపించారు.

ఆత్మ రక్ష :

భీమన్నగారు పాలేరు నాటకం కంటే ముందు ఆత్మరక్ష అనే నాటికను రాశాడు.అందులో కామాందుని చేతులో బలయిన తన భార్యను కాపాడలేక ఒక కూలీ మనిషి ఆత్మ హత్య ప్రయత్నం చేయడం కాని తన పొలంలోని నిత్య సాధనాలు, పనిముట్లు అతన్ని వారించి తిరుగుబాటు చేయమని పోత్సహించడం వంటి ఆసక్తికర కథనాలతో సాగుతుంది.

ఆధార గ్రంథాలు :

1. భీమన్న రచనలు

ఇతర రచనలు :

పిల్లి శతకం, కూలీ శతకం వంటి శతకాలు రాగవాష్ఠము, ఆది కవి వాల్మీకి, చండాలిక, ధర్మవ్యాధుడు మొదలైన నాటకాలు, జన్మాంతరవైరం, ఇదిగోఇదీ భగవద్గీత, ధర్మంకోసం పోరాటం, అంబేద్కరిజం వంటి వచన రచనలు, ఇవికాక ప్రబోధత్మక గేయాలు, మరెన్నో కవితలు రచించారు.

ముగింపు :

భీమన్న గారి రచనలలో సామాజిక జీవనం ప్రతిబింబిస్తుంది. అట్లే దళితుల పట్ల జరుగుతున్న అన్యాయలను తన రచనలలో చూపుతూ దళితులను జాగృతం చేశారు. అదే విధంగా తన రచనలలో కొంత హేతువాదాన్ని జోడించి ప్రజలను చైతన్యవంతం చేశారు.

మన నిత్యజీవితంలో వేమన పద్యాల ప్రాధాన్యం

కే.హరీష్ కుమార్, పరిశోధక విద్యార్థి (యుజిసి-జేఆర్ఎఫ్), తెలుగు మరియు తులనాత్మక సాహిత్య శాఖ,
శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం-515003, అనంతపురం. చరవాణి : 7893697347.

వేమన పద్యం నిత్యం తెలుగు నాలుకలపైన కదలాడే వేదం. అది ప్రజల అంతర్వాహిని. దేశ, విదేశీ సాహితీవేత్తలు, విమర్శకులు చాటిన సత్యం వేమన పద్యం. ఎందరో మహానుభావులు వేమన పద్యాలను సేకరించి, పరిశీలించి, పరిశోధించారు. అర్థ, తాత్పర్య విశ్లేషణలతో ప్రచురించి వేమన ఔన్నత్యాన్ని ప్రపంచం ముందుంచారు. వారిలో ముఖ్యులు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్, కట్టమంచి రామలింగారెడ్డి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, వంగూరి సుబ్బారావు, బండారు తమ్మయ్య, వేటూరి ప్రభాకరశాస్త్రి, ఆరుద్ర, మరుపూరు కోదండరామిరెడ్డి వంటి తదితర సాహితీవేత్తలు, విమర్శకులు, విశ్లేషకులు మరియు వేమనపై ఆధునిక పరిశోధకులు డా॥ ఎన్. గోపిగారి వంటి మరెందరో శారదమూర్తులు అందరినీ స్మరించడం, నమస్కరించడం మన కర్తవ్యం.

"తెలుగు భాష జీవము, పటుత్వము, ప్రాణశక్తి, మాధుర్యం, సంగీతమూ ఈతనికి పట్టుబడినట్లు మరియొకరికి బట్టలేదు... ఆటవెలది సొగసును వేమన్న యనుభవించినట్లు మరియొకరనుభవింపలేదు. అనుభవింపజేయలేరు. అది అనితర సాధ్యం. తెలుగుభాష జీవము-భావము సహజముగా పుట్టినది పుట్టినట్లు తడువుకొనకుండా రెండేసి యక్షరముల యచ్చు-వాదుక- తెలుగు పదముల అర్థవంతముగా, పొట్టిగా, అన్వయ క్లిష్టత లేకుండగా జెప్పిన కవి ఇంకొకడేడీ?" - అని వంగూరు సుబ్బారావుగారు వేమన సంపూర్ణ జీవిత చరిత్రము, బోధనలు అన్న గ్రంథంలో వివరించారు.

ముఖ్యంగా వేమన పద్యాలు ప్రస్తుత ఆధునిక అధునాతన జీవన శైలిని ప్రభావితం చేసేవిగా ఉన్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు. అందులో

"తేనె తెరల జాడ తేనెటీగ యెరుంగు
సుమ రసంబు జాడ భ్రమరమెరుగు
పరమయోగిజాడ భక్తుండెరుంగును
విశ్వదాభిరామ వినురవేమ"

తేనె ఎక్కుడ దొరుకుతుందో తేనె టీగలకు తెలుసు. పూల మకరందం గురించి తుమ్మెదలకు తెలుసు. నిజమైన గురువును భక్తుడే తెలుసుకోగలడు. అలాగే ఇలాంటి పద్యాల్లో స్ఫూర్తే కాబోలు జానపదులు కొన్ని పదాలను అళ్ళుకున్నారు, పాడుకున్నారు. ఉదాహరణకు,

"వనము సింగారంబు కోయిలకు ఎరుక
ఇట్ల కొంపలెమ్మడి తిరిగే కాకికేమెరుక
బాటా సింగారమ్ము అశ్వానికెరుక
ఇట్లా గరికెతుతొట్టెలు తినేగాడిదకేమెరుక..."

అని ఏది ఎక్కడ దొరుకుతుందో అని తెలుసుకునేవాడే జ్ఞాని కాగలడు.

"ఉత్తమోత్తముండు తత్త్వజ్ఞుడి
మహిమజూపువాడు మధ్యముండు
వేషధారి యుదర పోషకుడధముండు
విశ్వదాభిరామ వినురవేమ"

తత్త్వం తెలుసుకొన్నవాడు ఉత్తముడు. మహిమలు, కనికట్టు విద్యలు ప్రదర్శించేవాడు మధ్యముడు. కూటికోసం సాధు సన్యాసుల వేషాలు కట్టేవాళ్ళు నీచులు. అంటే ఆనాడే సన్యాసుల వేషాలు వేసుకొని ప్రజల్ని దోచుకుండేవారున్నారని అవగతమవుతోంది. ఈనాడు ఇంకా ఎక్కువగా కాషాయ సన్యాసులు వాడవాడలా భారతదేశం మొత్తం సూర్యుడు అస్తమించని సామ్రాజ్యాలు విస్తరిస్తున్నారనడంలో అతిశయోక్తి లేదు.

"స్వానుభూతి లేక శాస్త్రవాసనలచే
సంశయంబు చెడదు సాధకునకు
చిత్ర దీపమునను జీకటి జెడనట్లు
విశ్వదాభిరామ వినురవేమ"

జీవితానుభవం లేకుండా కేవలం శాస్త్రజ్ఞానంతోనే సందేహాలు పరిష్కారం కావు. చిత్రపటంలో చూపిన దీపం చీకట్లను తొలగించలేదు కదా! అంటే ఉదాహరణకు మనదేశంలోని వామపక్ష నాయకులు రష్యాను, చైనాను చూపించి మనదేశంలో కూడా కమ్యూనిస్టు భావజాలాన్ని వ్యాప్తి చేయాలని మొత్తం ఎర్రటి రంగులో నింపివేయాలన్న వారి కోరిక కూడా వేమన చెప్పిన చిత్రంలో దీపాన్ని చూపించి, చీకటి తొలగిపోయిందన్న చందంగా వుంది.

"కన్నులందు మదముగప్పి గానరుగాని
నిరుడు ముందటేడు నిన్నమొన్న
దగ్దులైనవారు తమకంటే తక్కువా?
విశ్వదాభిరామ వినురవేమ"

అహంకారంతో కళ్ళుమూసుకొని విర్రవీగుతారు కానీ, ఇంతకు ముందు తమలాగే ప్రవర్తించి గతించిపోయిన వాళ్ళకంటే తామేమీ గొప్పకాదని గ్రహించుకోరు. ఇలాంటిదే పోతనగారు కూడా "కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతిం బొందరే వారేమి రిమూటగట్టుకొని పోవంజాలరే..." అని ప్రస్తుతం వున్న రాజకీయ నాయకులకు, వివిధ హోదాల్లో పనిచేస్తున్న అధికారులకు మీ పదవులు శాశ్వతం కాదు, మీకంటే ముందు ఆ కుర్చీలో కూర్చొన్న గొప్పవారి కంటే మీరేమీ మహానుభావులు కాదు కదా? కాబట్టి అతి తగ్గించుకొని (అతి సర్వత్రా వర్జయేత్), అహంకారంతో మూసుకుపోయిన మీ కళ్ళను తెరచి మీ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించండి అని వేమన, పోతన వంటి పెద్దలు చురకలంటించారు.

"పని తొడవులు వేరు బంగారమొక్కటి
పరగ ఘటలు వేరు ప్రాణమొకటి
యరయ తిండ్లు వేరు యాకలి యొక్కటి
విశ్వదాభిరామ వినురవేమ"

పనితనాన్నిబట్టి ఆభరణాలు ఎన్నిరకాలుగా వున్నా, వాటికి వాడే బంగారమొక్కటే. దేహాలెన్నయినా జీవి ఒక్కటే. భుజించే పదార్థాలు ఏమైనా తీరేది ఆకలే అనే జీవిత సత్యాన్ని చెప్పాడు.

"చచ్చె చచ్చెననుచు చావుకు వగచెడు
దీన నరుల వెర్రి దెలుపరాదు.
ప్రాణమునకు మృత్యుబంధంబు లొండునా"

చనిపోయాడని ఏడ్చే మనుషులు వెర్రివాళ్ళు. వారి వెర్రితనం చెప్పనలవి కాదు. జీవికి చావు వుందా? అని మొత్తం పరమార్థాన్ని ఒక్క ముక్కలో వివరించాడు.

"తిరిగి తిరిగి నరుడు మరలు కొనుటెగాక
నందువలన నేని యాసలేదు
అంతరాత్మ నిల్పునతడెపొ బ్రహ్మంబు"

ఎన్ని యాత్రలు చేసినా మనిషి కోరిక తీరదు. ఎప్పుడైతే తన అంతరాత్మను నిర్మలము, నిశ్చలము చేసుకుంటాడో అప్పుడే మోక్షం సిద్ధిస్తుంది. ఇందులో నిన్ను నీవు తెలుసుకోక పోతే నువ్వు ఎన్ని యాత్రలు చేసినా యాత్రాబస్సువాడు బాగుపడతాడు కానీ, నీకేమీ ఉపయోగంలేదని ఆనాడే వేమన చెప్పాడు.

"తరువ తరువ బుట్టు తరువున ననలంబు
తరువ తరువ బుట్టు దధిని ఘృతంబు
తలప తలపు బుట్టు తనువున తత్వంబు
విశ్వదాభిరామ వినురవేమ"

రాపిడి చేయగా చేయగా చెక్కముక్కల్లో నిప్పు పుడుతుంది. పెరుగును చిలకగా చిలకగా వెన్న రూపంలో నెయ్యి

పుడుతుంది. శోధించగా, శోధించగా మనిషిలో తత్వం పుడుతుంది. పై పద్యంలో చెప్పినట్లు కేవలం శాస్త్రజ్ఞానంతోనే కాకుండా అనుభవంతోనే మనిషి తత్వవేత్తగా మారతాడు అని బోధించాడు.

"త్రాడు పాము యనుచు దాజూచి భయపడి
తెలిసి త్రాడటన్నతీరు భయము
భయము దీరినపుడె బ్రహ్మంబునంటురా"

మసక చీకటిలో తాడును చూసి పాము అనుకొని సహజంగానే భయపడతాము. తీరా తాడు అని తెలిశాక భయం పోతుంది. అలాగే జ్ఞానం అనే వెలుగులో భయం తీరినప్పుడే సత్యం గోచరిస్తుందంటాడు వేమన.

"మురికి కొంపలోన నిరికించి జీవుని
కర్మ పాశమునను గట్టి వేసె
నిట్టి కర్మజీవి కెట్లకో మోక్షంబు
విశ్వదాభిరామ వినురవేమ"

పూర్వ కర్మల వలనే జీవుడు ఈ మురికి దేహంలో ఇరుక్కొని వుంటాడు. అలాంటి జీవుడికి మోక్షం ఎలా కలుగుతుంది? ఇక్కడ వేమన శరీరాన్ని ఒక మురికి కొంప అని, మురికి దేహమని అన్నాడు. కానీ శంకరాచార్యులు "వివేకచూడామణి"లో "జంతునాం నరజన్మ దుర్లభం" అని అన్నాడు. అంటే ముక్తిని, మోక్షాన్ని పొందటానికి మానవ శరీరం ఎంతో అవసరమని శంకరాచార్యులు చెప్పినదానికి విరుద్ధంగా వేమన మాత్రం ఈ మురికి కొంపలో ఇరుక్కొని వుంటే మోక్షం ఎలా సిద్ధిస్తుంది? అని ప్రశ్నిస్తున్నాడు.

"తొమ్మిదికంతల తిత్తికి
నిమ్మగు సొమ్ములును కులము నేటికి జపుమా
నమ్మకు దేహము నాదని
బమ్మము నేననుచు దెలిసి పలుకరా వేమా!

తొమ్మిది రంధ్రాలు వున్న ఈ తిత్తి (శరీరం)కి అందమైన ఆభరణాలెందుకు? కులమెందుకు? ఈ దేహం నాది అన్న భ్రమ పెంచుకోకు. నీలో దైవం వున్నాడని తెలుసుకో. ఇలాంటిదే మరోపద్యం ఆధునిక కాలంలో వెలువడింది.

సీ॥ "గోలీల కనులద్ది గోలమంతయు జూచు
దృక్కుల నెవ్వాడు జక్కబరిచె
పశుపక్షులకు లేని పలుకులు గొంతులో
మాటలు తియ్యగా నాటెనెవ్వడు
నరుని రక్తము పొంగ నవరంధ్రములు యున్న
బొట్టుజారక మేని పెట్టెనెవ్వడు
బిసబెట్టి బిగియించి బిసిబిసి ప్రాణంబు
గుట్టుగా గుండెలో బెట్టెనెవ్వడు

తే.గీ॥ సైన్సుకర్తమవని సంగతుల్ కుదియించి
మానవులను జేసె మహిమరూపు
యట్టి శిల్పిదలచి యర్పింతు కైమోడ్పు
దేహమొసగె నాకు దేవుడతడు"

(సాహిత్యంలో ఏరిన ముత్యాలు)

అంటే నవరంధ్రాలు ఉన్నా ఎక్కడా ఒక్క చుక్క రక్తం బయటకు రాని శరీర నిర్మాణం చేయ సాధ్యం ఒక్క దేవునికి తప్ప మరెవ్వరికైనా సాధ్యమా అన్న వేమన వాదం ఈ పద్యంలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

ఇలా వేమన పద్యాలు నిత్యవేద పారాయణగా మన జీవితంలో ఒక భాగమయ్యాయి. అందుకే "మా మతమున వేమన పేరుమోసిన యాంధ్ర మహాకవి" అని పుట్టపర్తి నారాయణాచార్యులు అన్నారు. అలాగే "వేమన గొప్ప సంఘసంస్కర్త. సంఘదోష, దురాచారాలను ఇతని వలె నిర్భయముగా వెళ్ళడించిన కవి తెలుగువారిలో చాలా అరుదుగా కనిపిస్తారు. ఇతనికి కొన్ని అభిప్రాయములు నేటి కాలమునకు కూడా సరిపోవుచున్నవి" అని మల్లంపల్లి సోమశేఖర శర్మ అన్నారు.

ఇలా అనేకానేక వేమన పద్యాలను పరిశీలించిన పిమ్మట వేమన ఒక "యోగిమాత్రమే కాదు. వీరబ్రహ్మం వలే భవిష్యత్ కాలం చెప్పి, చెప్పని కాలజ్ఞాని కూడా అనడంలో ఆశ్చర్యం లేనే లేదని తెలియజేస్తున్నాను.

ఆధార గ్రంథాలు

1. వేమన్న ఏమన్నాడు! – కె. శరచ్చంద్ర జ్యోతిశ్రీ (సంపాదకత్వం), విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్.
2. వేమన శతకం – ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం ప్రచురణ
3. సాహిత్యంలో ఏరిన ముత్యాలు – టి.వి.కె. సోమయాజులు
4. వేమన ఎప్పటికీ... అందరికీ.... – ఆచార్య ఎలవర్తి విశ్వనాథరెడ్డి (సంపాదకత్వం), వేమన ఫౌండేషన్
5. ప్రజాకవి వేమన – ఆచార్య ఎన్. గోపి

సాక్షి 'ఫన్‌డే' కథల్లోని - మానవ సంబంధాలు

పరుసు మణి, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.
చరవాణి: 94922 08475

ఈ సమాజంలో అన్ని జన్మల్లోనూ మహోన్నతమైనది మానవ జన్మ. ఒక మనిషి మరొ మనిషికి ఏ విధమైన బంధుత్వం లేకపోయినా కేవలం మనుష్యులుగా పుట్టడం చేత ఉండే సంబంధమే మానవ సంబంధంగా చెప్పవచ్చు. ఈ మానవ సంబంధాలను పటిష్టంగా నెలకొల్పాలంటే ముందు కావలసినది ఒక మనిషి మరొ మనిషిని హృదయ పూర్వకంగా ప్రేమించగల్గడం. తోటి మానవుడిని మనిషిగా చూడలేని వాడు మనిషికాదు. దానవుడు. అందువల్ల ప్రేమ అనేది పునాది అయితే దానిపై నిర్మించబడిన ఒక సుందర భవనం మానవ సంబంధం. తనను తాను ఎలా ప్రేమిస్తాడో, గౌరవిస్తాడో అదే విధంగా ఇతరులను ప్రతివాడు ప్రేమించాలి. గౌరవించాలి. ప్రపంచంలో ఏ మతమైనా చెప్పేది ఒక్కటే. ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలి. ఎదుటి వ్యక్తిలో భగవంతుని చూడమని కూడా మత గ్రంథాలు చెబుతున్నాయి.

ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే ఒక జాతి మరో జాతి మీద, ఒక వర్గం మరొక వర్గం మీద, ఒక దేశం మరొక దేశం మీద అనవసరమైన ద్వేషాన్ని పెంచుకొని ఈర్ష్యతో, స్వార్థంతో యుద్ధాలు ప్రకటించుకున్నాయి. యుద్ధం అంటే ఒకరు గెలుస్తారు మరొకరు ఓడిపోతారు. ఒకసారి విశాలంగా పరిశీలిస్తే గెలిచింది ఎవరైనా ఓడింది మాత్రం మానవీయత. ఈ సమాజంలో స్వార్థం ఎంతగా పెరిగిపోతే అంతగా మానవ సంబంధాలు నశిస్తాయి. ఈ మితిమీరిన స్వార్థమే ఒకరి మీద ఒకరు ఆధిపత్యాన్ని సంపాదించి ఇతరులను బానిసలుగా చేసుకొని వారిని పీడించి బాధించడానికి ప్రధాన కారణం అవుతుంది. శ్రీశ్రీ తన "మహాప్రస్థానం"లో ఇలా అన్నాడు.

"ఏ జాతి చరిత్ర చూచినా ఏమున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం"

మానవుడు వైజ్ఞానికంగా ఎంతో ఎత్తుకు ఎదిగి పోతున్నాడు. తాను యంత్రాలను కనిపెడుతూ వాటి మధ్య ఒక యంత్రంగా తయారవుతున్నాడు. దానితో జీవితం ఒక యంత్రంగా మారిపోయింది. ఇంకా ఎదో ఒకటి సాధించాలనే తపన. ఈ ప్రయత్నంలో పడిపోయి తన చుట్టూ ఉన్న సమాజాన్ని మరిచిపోతున్నాడు. సమాజంలో ఎవరు ఏమైపోయిన ఫర్వాలేదు. కీర్తికాంక్ష, ధన కాంక్ష, అతని జీవిత లక్ష్యాలు, మానవునికి ఎక్కడికి తృప్తి కల్గుతుంది? ఎంత వరకూ కీర్తికావాలి? బంధువుల గురించి, మిత్రుల గురించి ఆలోచనలేదు. ఎంత సేపటికీ ఇల్లు, తన సంపాదన, తన కీర్తి ఇదే మానవుని లక్ష్యాలుగా కన్పిస్తున్నాయి. ఇది అవాంఛనీయమైన పరిణామం.

జీవితంలో సుఖదు:ఖాలు కష్టనష్టాలు ఉంటాయి. ఇద్దరు వ్యక్తులు వీటిని సమానంగా పంచుకుంటే మంచిదే. అంతేగాని "సుఖంనాకు కష్టంనీకు, మా ఇంట్లో మాటలు మీ ఇంట్లో భోజనాలు, నీ కంట్లో నేను వెలుపెడతా నానోట్లో నీవు వేలు పెట్టు" అనే వ్యక్తులకు మానవీయత ఎంత ఉంటుందో తెలియంది కాదు. ఇలా కాకుండా ప్రశాంతమైన సాంఘిక జీవనానికి ఈ సంబంధం పునాదిగా చెప్పవచ్చు. వర్తమాన సమాజంలో మారుతున్న మానవుల ప్రవర్తన కారణంగా స్వార్థం పెరిగిపోయింది. ప్రతి మనిషి సమాజంలో ఆర్థిక సంబంధాల మాటున ప్రభావితుడవు తున్నాడు. నగర జీవితం మరింతగా ఆర్థికమయం అయ్యింది. ఇలాంటి స్థితిలో మానవ సంబంధాలు గాడి తప్పుతున్న తీరును విశ్లేషిస్తూ మానవుల మధ్య ఉండాల్సిన మానవ సంబంధాలను ప్రబోధిస్తూ సాక్షి 'ఫన్‌డే' లో

రచయితలు కొన్ని కథలను రాశారు. ఈ క్రింది విధంగా పరిశీలిద్దాం.

పక్కింటి స్నేహం :

పుట్టుకతో మానవుడు సంఘజీవి. ఏ వ్యక్తి సంఘంలో జీవించలేడో ఆ వ్యక్తి జంతువై ఉండాలి (లేదా) భగవంతుడై ఉండాలి అన్నట్లుగా మనిషి సంఘజీవి. ఎవ్వరితోనూ మాట్లాడకుండా మనస్సు పంచుకోకుండా ఎక్కువకాలం ఉండలేడు. ఒంటరిగా జీవించే వాళ్ళకు మానవ సంబంధాలు చాలా అవసరం.

ఈ కథలో ముసలమ్మకి ఒక కుమారుడు అతనికింకా పెళ్ళి కాలేదు. ఉద్యోగ నిమిత్తం అస్తమానం సింగపూర్, వైజాక్, హైదరాబాదు అంటూ తిరుగుతుంటాడు. పదేళ్ళ పైనుంచి ముసలమ్మ ఒంటరిగా జీవిస్తుంది. ఒక రోజు నీళ్ళ పంపును వదిలి ఇంట్లో పనులు చేసుకుంటుంది. పక్కింట్లో ఉన్న రమణమ్మ రాత్రింతా ఆఫీసు పనిలో ఉండి వేకువజామున చల్లగాలికి మాగన్ను పడుతుండే సమయంలో ఎదో తెలియని చప్పుడు జలజల మంటు ఒకే శబ్దంతో హోరున పడుతున్నాయి. నన్ను పడుకొనికుండా ఇబ్బంది పెట్టింది ఈ ముసలమ్మ. ఆ పంపు కింద ఓ బకెట్టు అయినా వెయ్యదు నీళ్ళన్ని పోతున్నయంటు లేచి ఏవండి ముసలమ్మగారు అని స్వరం పెంచి పిలిచింది. ఆ అరుపులకి హడావుడిగా బయటకొచ్చి ఆ పంపుని చూసి అస్తమానం నాకేం చెప్పాల్సిన పనిలేదు. నేనేం చిన్న పిల్లనా అంటూ ముసలమ్మ పక్కింటి రమణమ్మ మాట్లాడక ముందే మాట్లాడి తప్పు తనది పెట్టుకొని కూడా సణుక్కొంటూ వెళ్ళిపోయింది. ఆమెలో ఎప్పుడు ఇలాంటి ధోరణి చూడలేదు. ఇంట్లో పూజ చేశాను. తాంబూలం తీసుకొమ్మా అన్న ముసలమ్మగారెనా ఈవిడ అంటూ ఆశ్చర్యపోతూ ఇలా అంటుంది. ఏదో ఒక రోజు బోర్లోలో ఉండే భూగర్భ జలం అడుగంటుకుపోయి ఆ వచ్చే కాసిన్ని నీళ్ళు రాకుండా పోతే అయిదు అంతస్తులు కిందికి దిగి వీధి కుళాయిల దగ్గర పట్టుకొని బిందె బిందెకు వంద మెట్లెక్కి దిగాలి రాబోయే కష్టం గురించి ఎవ్వరికి ఆలోచన లేదు. అలాంటి పరిస్థితి రాకుడదనే మాట్లాడి నందుకు పక్కింటి స్నేహానికి ఎసరొచ్చిందంటు రమణమ్మ ఆఫీసుకెళ్తుంది. కొన్ని రోజుల వారి మధ్య మాటలులేవు. ఆ సంవత్సరం ఎండలు మరీ ఎక్కువగా ఉన్నాయి. ఆఫీసుకెళ్ళే సమయంలో బాల్కనీలో పని చేసుకుంటున్న ముసలమ్మ మనస్సులో ఏ మనుకుందో గాని ఎప్పటిలాగే వంటగది కిటికీ దగ్గర నిలబడి ఆమెను ఉద్దేశిస్తూ కాస్తగట్టిగా ఎండలు మండిపోతున్నాయండీ అస్సలు ఉండలేక పోతున్నాను. మీకెలా ఉందోగాని నేనైతే తట్టుకోలేక పోతున్నానంటు నోరు విప్పి మాట్లాడింది. ఇన్నాళ్ళకు గ్రహణం వీడినట్లు నెల రోజుల తరువాత ముసలమ్మ మనస్సు మార్చుకొని మాట్లాడింది. వారిమధ్య అపార్థాల మంచు తెరలు తొలగి పిల్లతెమ్మర వీచినట్లైంది. ఆ మాటకి బదులుగా రమణమ్మ అవునండీ అస్సలు భరించలేకున్నాం నేనైతే ఆఫీసులో ఎక్కువసేపు ఏసి రూంలోనే గడుపుతున్నా నంటు ముసలమ్మ గారితో మాట్లాడనన్న ఆనందం ఎంతో ఉత్సహాపరిచింది. మనస్సులో ఇలా అనుకొన్నది నాకంటే మరో ప్రపంచం ఉంది. కాబట్టి పట్టించుకోలేదు గాని ఒంటరిగా ముసలమ్మ లాంటి వాళ్ళకు పొరుగింటోళ్ళ తోడు అవసరం. ఆమంటే నాకు కోపమేంటి ఆరోజు అలా విస్కుందని ఆమె వైపు చూడటం మానేశాను. ఏది ఏమైన మండు వేసవి ఎండల కారణంగా శిశిరం తరువాత వచ్చే వసంతంలా ముడుచుకున్న వారి స్నేహం తిరిగి చిగురించింది. బయట ఎండలు మండుతున్న పక్కింటి స్నేహం మాత్రం వెన్నెల్ని కురిపించింది.

ఈ మానవ సంబంధాలు అపురూపమైనవి అవి లేకపోతే మనిషికీ, పశువుకూ భేదం ఉండదు. అయితే ఈనాడు పొరుగు వారి మాట అటుంచి నేటి యువత కుటుంబ సభ్యులతోనే అనుబంధాలు సాగించడం లేదు. మనిషి సాటి మనిషిని ప్రేమించాలి అది కుటుంబంతోనే ప్రారంభంకావాలి. తల్లిదండ్రులు కష్టాలకు ఓర్చి తమ

పిల్లలను పెంచి పెద్ద చేస్తారు. అలాంటి తల్లిదండ్రులను వారి వృద్ధాప్యంలో గౌరవించకుండా నిరాదరణకు గురిచేయడం ధర్మం కాదు. ఈ కథలో ఒంటరి తనాన్ని అనుభవిస్తున్న ముసలమ్మ పరిస్థితి అదే ప్రేమ, ఆప్యాయత, అనురాగలకు దూరంగా జీవిస్తుంది. ఆ సమయంలో రక్తసంబంధం కాకపోయిన పక్కింటి రమణమ్మ స్నేహంతో అనేక సమస్యలను జయిస్తుంది.

వీధి పోకిరి :

వీధి పోకిరిగా తిరుగుతున్న ధనుంజయడు రక్త సంబంధం కాకపోయినా స్నేహ భావంతో తలకొరివి పెట్టి కొడుకు సాంగ్యం జరిపి ఆ ఊరి జనాన్ని ముక్కు మీద వేలేసుకొనేటట్లు చేశాడు. ఈ కథలో రచయిత మానవ సంబంధాలను కళ్ళకు కట్టినట్లు చూపాడు.

ధనుంజయడు స్నేహితులతో కలిసి బొంతాలమ్మ గుడి దగ్గర దాయాలాట ఆడుతూ కొంతసేపటికి ఆకలి అవుతున్న సమయంలో పరిగెత్తుకొచ్చి వీర రాఘవన్న వంటగదిలో దూరి అల్మారాలో ఉన్న ఊరగాయ ముక్కను నోట్లో వేసుకొని చప్పరిస్తూ ఊర్లోకి పోయిండు. అది చూసిన రాఘవన్న భార్య ఎవరిని ఎక్కడ పెట్టాల్నో మీకు తెలవకపోయె ఈ వీధి పోకిరి వాడ్ని నెత్తిన ఎక్కించుంటుటున్నారు. వారి గురించి మీకు ఎన్ని చెప్పినా ఉలకరు పలకరు. నాకేమో వాడు మన ఇంట్లో తిరుగుతుంటే ఒళ్లంతా జెర్రిలు పాకినట్లుందని నిష్ఠోరం ఆడుతూ వీధిలోకి అలా చూసింది. ముత్తబావ శవాన్ని టపాకాయలు పేలుస్తు డ్యాన్సులతో, పూలు బొరుగులు చల్లుతూ ఊరేగిస్తు పోతున్నారు అది చూసిన ధనుంజయడు వారి మధ్యకు వెళ్ళి చిందులు వేస్తున్నాడు. అది చూడలేక నరసమ్మ తలుపు వేసుకొని తిరుత్తణి కొండని చూస్తు మురగా-- నా కొడుకు అమెరికాలో రేయనక పగలనకా కష్టం చేసి పైసలు పంపిస్తున్నాడు. నా మొగుడెమో వీధి పోకిరి వాడ్ని ఏనుగును మేపినట్లు మేపుతుండు. నా బిడ్డ సొత్తంతా తింటుండు. నా మొగుడి బుద్ధి మార్చుస్వామి నీకు నెలనెలా ప్రతి కృతికకీ పిండి దీపం వెలిగించి దండం పెట్టుకుంటా మురగా అని చేతులెత్తి వేడుకొంది.

రోజు లాగే ధనుంజయడు రాఘవన్న ఇంటికొచ్చి నాలుగేసి రొట్టెల్ని ఎర్రకారం వేసుకొని తృప్తిగా తిని వెన్నెలకి మంచం వేసుకొని చల్లగా కబుర్లు చెప్పుకుంటు నిద్రపోయారు. అర్ధరాత్రి వీధి కుక్కలు మొరగడం వల్ల మెలుకువ వచ్చింది. ఈ కుక్కలు దొంగల్ని చూసి మొరిగేది మరచినాయిలే రాఘవన్నా అట్ల తిరిగి ఇట్ల తిరిగి మన ఊరి వాళ్ళనే చూసి మొరుగుతున్నాయి. ఇది ఒక దొంగని పట్టింది లేదు. దొంగలు దొరికింది లేదంటు రాగాలు తీస్తు చెప్పాడు ధనుంజయడు. అన్నట్టు సెప్పేది మరిచిన రాఘవన్న మొన్న చచ్చిన ముత్త బావ కొడుకు మునికిష్టడు నాయినపోయినాడని దొర్లి దొర్లి ఏడ్చినాడన్న పొయినోడితోనే పోతాడన్నంతగా పొర్లి పొర్లి ఏడ్చినాడంటు నిద్రలోకి జారారు. కొంత సేపటికి తెల్లారింది. నరసమ్మ రాఘవన్నకి కాఫీ ఇచ్చింది. ధనుంజయడికి లేదా అన్నట్లు ఆమెవైపు చూశాడు. నేనేమి కాఫీ కొట్టు పెట్టలేదు. దారిన పోయే దానయ్యలందరికి ఇవ్వడానికి అంటూ ఇంట్లో పని చేసుకుంటుంది. రాఘవన్న కాఫీ తాగుతూ తన కొడుకు అమెరికాలో ఒంటరిగా ఎలా జీవిస్తున్నాడో అంటూ ఆలోచనలో పడినాడు. ఆ రోజు ఆడినెల ఆదివారం సన్న సన్నగా చినుకులు రాలుతున్నాయి. కోమటోళ్ల బాయికాడ కలుపు తీస్తా ఉంది నరసమ్మ. అంతలో ఆ ఊరి పద్మ పెద్దగా నరసక్కా ఓ నరసక్కా అంటూ అరుస్తూ వచ్చి మన రాఘవన్న నిలబడినోడు నిలబడినట్లే కుప్పకూలి పోయాడే అని ఏడుస్తూ చెప్పింది. ఆ మాట విన్న నరసక్క కత్తి, కొడవలి పారేసి పరుగు తీసింది. తన భర్త శవాన్ని చూసి గుండెలు బాదుకుంటూ అమెరికాలో ఉద్యోగం చేస్తున్న కొడుకుకి వీడియో కాన్ఫరెన్స్ పెట్టి ఆ ఊరి పెద్దలు కొడుకుకి జరిగిన విషయాన్ని వివరించారు. తల్లికి ధైర్యం మాటలు చెప్పి తను

రావడానికి కుదరడం లేదని బోరు బోరునా ఏడ్చినాడు కుమారస్వామి.

అక్కడుండే అమ్మలక్కలంతా కొడుకు రాకపోతే తలకొరివి ఎవరు పెడ్తారంటు చెవులు కొరుక్కుంటున్నారు. ఇంతలో ఎక్కడ నుంచో తిక్కమేళంలాగా ఎగురుతూ రాఘవన్నకి తలకొరివి నేను పెడ్తానంటూ ధనుంజయడు శవం దగ్గరికొచ్చాడు. రాఘవన్న బతికున్నప్పుడే చెప్పాడు నా కొడుకు అమెరికా నుండి రాలేకపోతే నాకు తలకొరివి నువ్వు పెట్టాలని ఒకసారి కాదు చాలా సార్లు చెప్పిండు పెద్దాయన. అక్కడ చెయ్యవలసిన సాంగ్యలు చేస్తున్న ధనుంజయడ్ని కనులార్పకుండా చూస్తోంది. మొగుడు ముందస్తు ఒప్పందం తెలియక వీధి పోకిరి అనుకున్న ధనుంజయుడిలో తన కొడుకు కుమారస్వామి కనిపించాడు. చెతులెత్తి నమస్కరించింది నరసమ్మ.

మనసు ఉంటే మార్గం ఉంటుంది అన్నట్లు జీవితంలో ఎందరో స్నేహితులు దొరుకుతారు. ఆ స్నేహాన్ని నిలుపుకోవాలి. స్వార్థపూరితమైన స్నేహం ఎక్కువ కాలం నిలవదు. మంచి స్నేహితులు ఒకరు ఇద్దరున్న చాలు సుఖ దు:ఖాలను పంచుకోవడానికి మిత్రులను మించిన వారుండరని ఈ కథ ద్వారా రచయిత మానవ సంబంధాలను కళ్ళకు కట్టినట్లు చూపాడు.

సమాజంలో మానవ సంబంధాలు పెంపొందించడంలో సాహిత్యం తన వంతు కృషి చేస్తూనే ఉంది. "దేశమును ప్రేమించుమన్నా మంచి అన్నది పెంచుమన్నా" అని అన్నాడు గురజాడ. "దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్" అని చెప్పడంలోనే మరువలేని మానవీయత అంతర్లీనంగా దాగి ఉంది. సమాజంలో తొటివారిని ప్రేమించలేని వాడు దైవాన్ని ప్రేమించలేడు. సత్యం, ధర్మం, దయ ఇవి భూమిపై శాశ్వతంగా నిలవాలంటే మానవ సంబంధాలు పటిష్టంగా ఉండాలి.

ఉపయుక్త గ్రంథాలు

1. మహాప్రస్థానం – శ్రీశ్రీ
2. దేశభక్తి గేయం – గురజాడ అప్పారావు
3. సాక్షి ఫన్‌డే కథలు – వివిధ రచయితలు
4. కథానిక స్వరూప స్వభావాలు – పోరంకి దక్షిణామూర్తి
5. కథన రంగం – వేదగిరి రాంబాబు

నా వచన కవిత రూపాలలో – సమాజహితం

కవాడప్ప లలిత, తెలుగు ఉపన్యాసకురాలు, సెయింట్ జోసెఫ్స్ డిగ్రీ కళాశాల, కర్నూలు జిల్లా
చరవాణి : 9959806205

ప్రతి మనిషి వారి మనస్సులోని భావాలను ఏ కవిత రూపంలోనైన వ్రాసుకోవచ్చు, చెప్పుకోవచ్చు. కవిత్వం పండితుల, పామరుల, ధనవంతుల, పేద, ప్రాంత, దేశ అంటూ ఎవరూ సొత్తు కాదు ఇది అందరిని ఆదరించే కన్న తల్లిలాంటిది ఈ ప్రక్రియ.

"కవిత్వం శరీరమైతే
భావం ఆత్మ
భావంలో నుంచి పుట్టుకొచ్చేది కవిత్వం"

1981 నుంచి వచన కవిత్వం బహుముఖాలుగా విస్తరించింది. వస్తువైవిధ్యం,వైవిశిష్ట్యలతో పాటు శిల్పవైవిధ్యం కూడా కనిపించడం ప్రత్యేక లక్షణం. అభివ్యక్తిలో నూతనత్వం ఉంది. పదబంధాలలో నవ్యతతో పాటు కొత్త భావచిత్రాలుంటాయి. భాష విషయంలో స్వేచ్ఛ కనిపిస్తుంది. సొంత అనుభూతులు వ్యక్తీకరిస్తూ వాటిని సమాజపరం చేయడం ఉంటుంది. శ్రీ శ్రీ మహాప్రస్థాన కావ్యంలో "కవితా ఓ కవితా" పంక్తులు వచన కవితా వైభావానికి నిదర్శనం. వచన కవిత రచనకు మొగ్గుచూపిన మరోప్రతిభావంతుడు శిష్ట్లా ఉమామహేశ్వరరావు కలం పేర్లతో రచనలు చేశారు. సావిత్రి బందిపోట్లు కవితలో వచనకవితా శిల్పం అద్భుతం.

పాఠం ఒప్పచెప్పకపోతే పెళ్ళి చేస్తానని
పంతులు గారన్నపుడే భయమేసింది.

అంటూ కవితని చక్కగా వచనంలో వర్ణించారు.

ప్రపంచంలో ఏ భాషలోనైనా కవిత్వం ఉంది. ప్రపంచ ప్రకృతే కవిత్వం. ప్రకృతి ఒకసారి ఆనందం కలిగిస్తే మరోసారి భయాందోళనలకు గురిచేస్తుంది.కవిత్వం కూడా మనల్ని అనేక రకాల భావనలని గురిచేస్తుంది. ప్రపంచ మంతా కవిత్వ ప్రక్రియని ఒక ఆయుధంగా ఉపయోగించి సమాజసేవ,సాహిత్యసేవ, స్వాతంత్ర్యాన్ని కలిగించింది.

1. కవితా శీర్షిక – 'స్వార్థం' :

స్వార్థం అంటే కేవలం తన ప్రయోజనం, తన సుఖం, తన శ్రేయస్సు మాత్రమే చూసుకోవడం. ఏదైనా సరే తనకే దక్కాలని కోరుకోవడం. అందుకు ప్రయత్నించడం 'స్వార్థం' అంటారు. నాకు కావాలి అనుకోవడం 'ఆశ' . నాకే కావాలి అనుకోవడం 'స్వార్థం'.

"ఎవ్వరికి ఏది సొంతం కాదు
ఎవ్వరికి ఏది సొంతం కానప్పుడు
ఎందుకు స్వార్థం
ఎవ్వరికి ఏది శాశ్వతం కాదు
ఎవ్వరికి ఏది శాశ్వతం కానప్పుడు
ఎందుకు శరీరం పై అంత మక్కువ

అందుకే
బ్రతుకున్నంత వరకు హాయిగా నవ్వుతూ జీవిస్తూ
స్వార్థాన్ని మనస్సులో రానీయోద్దు
మితిమీరిన స్వార్థం మనస్సులో ఉన్నప్పుడు
శరీరం అణువనువు కుల్లుతుంది
కుల్లిన శరీరంతో బ్రతుకు ఎందుకు?
కడకు ఆ శరీరం మట్టిలో కలుస్తుంది
ఈ విషయాన్ని మరువకురా మానవుడా!"

నేటి సమాజంలో మితిమీరిన స్వార్థంతో మనిషి కృతజ్ఞతాభావం మరిచిపోతూ ఇతరుల నుండి ఆత్మీయతాను రాగాలు,స్నేహసంబంధాలు అందుకుంటూ తాను మాత్రం ఇతరుల విషయంలో స్వార్థపరుడుగా జీవిస్తున్నాడు. ప్రతి మనిషి వాస్తవాన్ని గుర్తించి ఈ శరీరం శాశ్వతం కాదు అని తెలుసుకొని స్వార్థం వదిలివేసి శాంత గుణం, సంతృప్తి, కృతజ్ఞత భావం మంచి గుణాలను పెంపొందించుకోవాలి.

2. కవితా శీర్షిక – 'మానవత్వం' :

సమాజం ఆర్థికంగా ఎంత ప్రగతి సాధించినప్పటికి మానవత్వం నశించిపోతే అశాంతి రాజ్యమేలుతుంది. మానవుడు తాత్కలిక సుఖంకోసం భావితరాల సుఖ సంతోషాలు, సహజమైన బంధాలు వదులుకొని క్రూరుడిగా, కఠినాత్ముడిగా మారిపోతున్నారు.నేటి సమాజంలో మానవ సంబంధాల స్థానంలో ఆర్థిక సంబంధాలు బలపడు తున్నాయి. నాగరికత అభివృద్ధి,సౌకర్యం అనే భ్రమలోపడి సంస్కృతి మరిచిపోతున్నాడు.

"తల్లి లేదు తండ్రి లేదు
బంధాలు మరిచె – బ్రహ్మకెరుక
ఆచారం లేదు సంప్రదాయం లేదు
సంస్కృతి మరిచె – విష్ణుకెరుక
శ్రమలేదు బాధ్యత లేదు
సహనం మరిచె – శివునికెరుక
మంచిలేదు మర్యాద లేదు
మానవత్వం మరిచె – జనులకెరుక "

మానవుడు సంఘజీవి.మనిషిలోని మాలిన్యాన్ని తొలగించే స్నేహం,సహనం,బాధ్యత,సేవ,సోదర భావం, దైవభక్తి, సహకారం ఇలా మనిషిలో మానవత్వ లక్షణాలను మదిలో చిగురింపజేస్తు పదిమందికోసం సమాజానికి పాటుపడేలా చేస్తుంది.

3. కవితా శీర్షిక – 'జెండలో గొప్పతనం ఏముంది?' :

"జెండలో గొప్పతనం ఏముంది?
జెండా వెనుక ఎందరో దేశభక్తుల త్యాగాలు
తలచుకోగానే శరీరంలో ఒక గగుర్పాటు
దేశభక్తులకు ఈ జెండానే ఆత్మబలం
తెల్లదొరల గుండెలో అగ్నిజ్వాల
జెండాలో గొప్పతనం ఏముంది?
దేశభక్తుల హృదయాలు దాగున్నాయి
బలిగొన్న దేశభక్తులు చిరునవ్వులతో దర్శనమిస్తారు
జెండాను చూడగానే మనలో కలిగే నూతనోత్తేజం
తెల్లదొరలలో కలిగే కోపోద్వేగం
జెండాలో గొప్పతనం ఏముంది?
మన భారతీయులను దేశభక్తులుగా మార్చింది
జెండాను స్మరించగానే మనలో వుట్టేధ్వని వందేమాతరం
తెల్లదొరులను తరిమింది ఈ ఆయుధం
ఓహో!నా జెండా
భళారే! నా జెండా
నీ గొప్పతనానికి నాజోహర్....."

ఎందరో మహానుభావులు దేశాన్ని రక్షించుకోవడం కోసం ప్రాణాలు అర్పించడం వలన మనకు స్వాతంత్ర్యం సిద్దించింది. సామాన్యులను వీరులుగా, పిల్లలు బాల భీములుగా, అబలలు సైతం స్త్రీ శక్తి స్వరూపిణిగా, దేశాన్ని ఏకంచేసి మనలో ఆత్మవిశ్వాసాన్ని కలిగించింది మన త్రీవర్ణపతాకమైన జెండా. ఆధునిక సమాజంలో మనల్ని మనమే పరిపాలించుకుంటున్నాము. దేశభక్తి అవసరం లేదనుకుంటే అది తెలివితక్కువతనం అవుతుంది. దేశాభివృద్ధిలో అంకితభావంతో భాగస్వాములుకావడం.దేశ గొప్పతనాన్ని పెంచే మన జెండాను గౌరవించడం బాధ్యతగల పౌరులుగా మన కర్తవ్యాన్ని సక్రమంగా ఆచరించడం కూడా దేశభక్తి అవుతుంది.

4. కవితా శీర్షిక: 'ఆడది' :

"ఆడది ఒక ఇంటి కూతురిగా పుడుతుంది
ఆమెను కొందరు మహాలక్ష్మీ పుట్టిందంటారు

ఆడది అంటే అక్కడిదే అత్తగారింటిదే అనే అర్థాన్ని ఇచ్చారు కొందరు అందరికోసం పాటుపడి తనకేమి మిగిల్చుకోలేనిది స్త్రీ ఆడదానికి ఒక మనస్సున్నది గ్రహించేదెవరు?

స్త్రీలేని జీవితం మగాడికి పరిపూర్ణం కాదు (ఒక తల్లిగా, సోదరిగా, గురువుగా, భార్యగా) ప్రపంచంలో స్త్రీలే లేకుంటే ఏమైయుండేది ఈలోకం?

ఊహించరానిది ఈ ఊహా!

ఈ ఊహకు అంతం లేదు!

ఈ నాకవిత్వానికి కూడా అంతంలేదు...! "

ప్రతి శిశువు జన్మస్థానం స్త్రీ గర్భం.నేటి సమాజంలో ఒక వ్యక్తికి ఎవరో స్త్రీ ద్రోహం చేశారని ప్రతి స్త్రీని దూషించే వ్యక్తులు సమాజంలో పెరిగిపోతున్నారు. స్త్రీల మాటలకు, వారి అభిప్రాయలకు విలువనిస్తు ఏది మంచి,ఏది చెడు అని వారికి తెలిపే విధంగా చెబుతూ దేశ పౌరులుగా, ధైర్యశీలవతులుగా తీర్చిదిద్దే బాధ్యత సమాజంలో అందరికి ఉంది.

5. కవితా శీర్షిక – 'జోహార్ భారతీయుడా జోహార్ ' :

"స్వాతంత్ర్య భారతి భారతీయులారా!
ఈ నేల నిన్ను నన్ను ధన్యజీవిని చెసెను
ఎన్ని పుణ్యాలు చేసి జన్మించివావో
నీ శ్రమలో అమృతమొలికించినావు
జోహార్ భారతీయుడా జోహార్!

సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా – సంఘ సంస్కర్త వైనావు
పేదల పాలిట పెన్నిధిలా – ఆపద్భాంధవుడివైనావు
నూతన విద్యావిధానంలో – బహుజ్ఞానివైనావు
జోహార్ భారతీయుడా జోహార్!
సాంకేతిక విజ్ఞానంలో – సృష్టి కర్తవైనావు
దాన్యరాసులను పండించే – నిత్యచైనత్యమూర్తివైనావు
సకల జీవుల పట్ల – దయామూర్తివైనావు
జోహార్ భారతీయుడా జోహార్!
నవ సమాజ నిర్మాణంలో – విజయుడవైనావు
కాలం విసిరే పెను సవాళ్ళు తిప్పికొట్టే – మార్గదర్శివైనావు
మరచిపోకు మరణించిన వీరులను –
మనబాధ్యతలో జీవించేవుంటారు అంటూ – ఆదర్శ మూర్తివైనావు
జోహార్ భారతీయుడా జోహార్!"

దేశానికి ప్రమాదం,కష్టం వచ్చినప్పుడు ఏదేశభక్తుడైన వారి దేశాన్ని ధైర్యంగా కాపాడుకోవాలంటే ముందు మనల్ని మనం ఏనాడు తక్కువ చేసుకొని నిరాశ,నిస్పృహలకు లోనైతె దేశానికి భారి నష్టం జరుగుతుంది కాబట్టి నా కవితలో భారతీయుడిని ఎన్నో మంచి కోణాలు చూపిస్తూ సమాజానికి ఉత్సాహాన్ని ప్రేరణను కలిగించే విధంగా వ్రాయడమైనది.

6.కవితా శీర్షిక: 'తెలుగు భాషలో – భాగస్వామి'

నా మత్భాష తెలుగు. తెలుగు భాష అనేక విధాలుగా అభివృద్ధి చెందుతున్న రాబోయో పరిస్థితులో మృతభాషగా మారకుండా ముందు జాగ్రత్తలు తీసుకొని రక్షించుకోవలసిన అవసరం ప్రతి తెలుగు –భాషాభిమానులకు ఉంది. నేటి ఆధునిక సమాజంలో ప్రజలు తెలుగు భాషలో భాగస్వాములై అనేక సాహిత్య ప్రక్రియలను అభివృద్ధి చేస్తూ,అనేక కార్యక్రమాలలో అందిరిని పాల్గోనేల ప్రోత్సాహం అందించాలి.దీని వలన మనిషికి భాష మీద మక్కువపెరిగి ప్రేరణ తగ్గకుండా వారిలో నూతన చైతన్యం అభివృద్ధి చెందుతుంది.

"ఎన్నెన్ని చెప్పను తెలుగు భాష అందాలు
పులకింతల గిలిగింతల నవకవితల తెలుగుదనం
లలిత కళల సంగీతం సాహిత్యమైంది
విదేశాలలో తెలుగు సభలు – విశ్వంలో తెలుగుదనం
ఆంధ్రుల లిపి వైభవం ప్రాచీనతను చాటునట్టిది
కస్తూరి కవితల గుభాళింపు – చైతన్యానికి ప్రతిబింబం

ఎన్నెన్ని చెప్పను తెలుగు భాష అందాలు
దివ్యమైన తెలుగు భాష విలువ తెలియక మరిచి పోదురెట్లు
తెలుగు రథం సాగిపోతుంది
సాగిపోయె క్రమంలో నీవొక భాగస్వామి కావాలి
నీలో విరిసిన తెలుగుదనం అక్షరక్రాంతికి ప్రతిరూపం రావాలి
తెలుగు భాష క్షీణించదు – క్షీణించింది మన సంకల్పమే
గుండెధైర్యంతో మన భాషను రక్షిద్దాం..!
ప్రగతి పథంలో నడిపిద్దాం..! ”

::: జై జై తెలుగు భాష :::

నేను కూడా తెలుగుభాషలో భాగస్వామియై అనేక కార్యక్రమాలలో పాల్గొంటున్నాను. ఈ వ్యాసంలో చిరు ప్రయత్నంతో సమాజానికి మేలుచేసే నా స్వీయ వచన కవితల ద్వారా అందించడం సంతోషదాయకం.

ప్రసన్నధర్మం సావిత్రోపాఖ్యానం తులనాత్మక పరిశీలన

పిండి నాగరాజు, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం, తూ॥గో॥జిల్లా, ఆంధ్ర ప్రదేశ్. చరవాణి : 86393 63515

ప్రసన్నధర్మమును గెడ్డాపు సత్యం గారు 309 పద్యాలతో రాసిన కావ్యం. ఇందు కథ మహాభారతంలోని సావిత్రోపాఖ్యానంలోని సావిత్రి దివ్య చరిత్ర. మహాభారతంలోని అరణ్యపర్వంలో సప్తమాశ్వాసంలో ఈ కథను 108 గద్య పద్యాలతో ఎఱ్ఱన గారు రచించారు. ఇది కథా కథన శైలిలో కొనసాగింది. కాని గెడ్డాపు సత్యంగారి ప్రసన్న ధర్మం వర్ణనాభరితంగా కొనసాగింది.

సావిత్రోపాఖ్యానంలో ఎఱ్ఱన గారు నేరుగా మద్రేశుని గురించి వివరించగా సత్యంగారు సూర్యోదయ వర్ణనతో ప్రారంభించి పూజా మందిరంలో సావిత్రీదేవి గురించి నిష్ఠతో కొల్చాడని చెప్పారు. అంతేకాక గాయత్రీ మంత్రమహిమను కొనియాడారు. సావిత్రిదేవి ప్రత్యక్షమయి "విధి నిర్ణీతము పుత్రికా జననమూర్వీనాథ" అని తెలపడంతో మూలంలో ఎఱ్ఱన గారు చెప్పిన బ్రహ్మ నిర్ణయాన్ని సూచన ప్రాయంగా తెలియజేశారు.

ఎఱ్ఱనగారు గాయత్రీ దేవి గురించి వర్ణన చేయలేదు కాని సత్యంగారు గాయత్రీ దేవి గురించి 11 పద్యాలలో వర్ణించారు. మద్రేశునికి గాయత్రీ దేవి ప్రత్యక్షమైన తీరు ఈ విధంగా కలదు అది ...

ముఖములైదు, కనులు మూడు శోభిల్లింగ
నంకుశంబు, కశయు, నరియు, సంకు
గదయు, తెల్లపునుక, కమలద్వయంబును
కరములందు దాల్చి మెఱయు దీపు
రత్నఖచిత మగుచు రంజిల్లు మకుటుంబు
నగ్రభాగమందు నలరు చంద్రు
డమృత కిరణ సేక మాచరింపగ, భక్త
చయము బ్రోతు వీవు సకల జనని!

ఈ విధంగా రూపాన్ని వర్ణిస్తూ ముగురమ్మలకు మూలంబగు మాత్రమేకాదు. సకల జగాలకు తల్లివి నీవే అంటూ అశ్వపతి కీర్తించాడు. ఎఱ్ఱనగారు అశ్వపతి సావిత్రి ప్రసాదంబన నిజధర్మ పత్ని అయిన మాళవికయందు సావిత్రి అను కూతురుని కని ఆమెను అతిగౌరవంతో పెంచెను అని వర్ణించగా సత్యం గారు. సంతానార్థ వరంబు రాజ్ఞి విని హర్షంబందె చిత్తంబునన్ తెలిపారు. ఇందు సత్యంగారు భార్యా భర్తలు సంతోషాన్ని పొందారు అని తెలిపారు. కాని ఎఱ్ఱన గారు ఈ విషయాన్ని తెలపలేదు సత్యంగారు. మాళవిక గర్భధారణ సమయం నుండి ప్రసవం వరకు దాదులు, పాచకులకు, పురోహితులకు, భిషయాలను గౌరవించిన తీరును విపులంగా వివరించారు. ఒక రాజు కుటుంబంలో ఎటువంటి విషయాలు జరుగు తాయో వివరంగా వర్ణించడం జరిగింది. సావిత్రి పెంపకాన్ని ఎదుగుదలకు ఈ విధంగా వర్తించాడు.

పసిబిడ్డల పెంపకమున
కుశలతగల పెద్దవారి కూరిమితో నా
శిశువును సంరక్షింపగ
శశిరేఖా క్రమ వికాస సరణిన్ బెరిగెన్"

ఆమెకు అశ్వపతి విద్యలను నేర్పినాడు.

కలిత విద్యలందు, లలిత కళల యందు
నీతి శాస్త్ర, రాజనీతి శాస్త్ర
ములగు నైపుణంబు గలిగిన యా యసా
మాన్య కన్య కితర కన్య లీదె!

ఎఱ్ఱన గారు సావిత్రీ యవ్వనాన్ని

ఆ వనజాక్షి పరిస్ఫుట
మౌవరమై సిద్ధ సాధ్యయక్షామరక

న్యావలిదన సౌందర్య
శ్రీ విలసన రేఖ పరిహసించుచు నొప్పెన్

అని అనగా .... సత్యంగారు....

కన్నె రూపు బాల్యమున రేఖా మనోజ్ఞ
చిత్రమును బోలి చూపఱు చిత్తము గోనె
నభినవంబగు యౌవనంబలము వేళ
వర్ణచిత్రంబు వలె పూర్ణ భావ మొందె

అని వర్ణించారు.

వరుని విషయంలో ఎఱ్ఱన గారు సావిత్రికి తగిన జోడు ఎవరని ఆలోచిస్తూ అన్వేషిస్తూన్నాడని తెలపగా సత్యంగారు చారుల ద్వారా సత్యవంతుని గూర్చి తెలుసుకొని రాజ్యం లేదని తెలిసి ఇతరులను వెతుకుతున్నాడని తెలియ జేశారు. కాని ఎఱ్ఱన వరుని పెరుగుతున్నాడని మాత్రమే తెలియ జేశాడు.

సత్యవంతుని గూర్చి విని అతనిపై ప్రేమను ఏర్పరుచు కొన్నదని ఎఱ్ఱన గారు తెలపగా సత్యంగారు సావిత్రీ కలలో చిత్రాశ్వనితో కలిసి (వనం) అడవిలో ఎంతో ప్రేమతో విహరించినట్లు అతనే తన భర్త అవు దూడని తెలిపింది. ఈ విషయం నారదుడు రాక ముందే తెలుపుతుంది. ఎఱ్ఱనగారు నీకూతురుకి పెళ్ళి చేయక ఇంకా ఎందుకున్నావు అన్నప్పుడు అశ్వపతి సావిత్రిని నీకు నచ్చిన వరుని కోరుకోమన్నప్పుడు తన కోరికను చెపుతుంది. సత్యంగారు నారదుడు రాకు పూర్వమే అశ్వపతిని వరుని గురించి అడిగించారు.

ఎఱ్ఱనగారు చిత్రాశ్వుడి గుణగణాలను సీస పద్యంలో చక్కగా తెలుపగా సత్యంగారు 9 చిన్న పద్యాలలో అతని అందచందాలు గుణగణాల గురించి వివరించాడు. సత్యంగారు

సత్యవంతుని గూర్చి
ఆశ్వినేయులు బోలిన యందగాడు
మన్మథుని బోలె యువతుల మరులు గొల్పు
గాని యువతుల చెల్లెండ్రుగా దలంచు
నుత్తమంబగు సంస్కార మున్నవాడు
విలువిద్యలోని మెలకువ
లలవోకగా బట్టువడియె నా తరుణునకున్
విలు నేర్పున నవ్విజయుని
తుల దూగెడు నంద్రు వాని తోయము వారల్

ఇరువురు కవులు చిత్రాశ్వుని గుణగణాలు తెలిపిన తరువాత నారుధుని చేత ఒక సంవత్సరం మాత్రమే బ్రతుకు తాడని చెప్పించారు.

ఎఱ్ఱనగారు 'కమలాసన చేసిన పుణ్య వంబున నయనం బ్రియుండు పరిపూర్ణ చిరాయురుపేతు డయ్యెడున్' అని చెప్పి దీవించి స్వర్గానికి వెళ్ళాడు.

మహతీ నాదము తోడుగ
మహితాత్ముడు నారదుడు సమాధి మునిందెన్
అహరహ మష్టాక్షరి జప
సహితాంతఃకరణనకు నసాధ్యము గలదే

అంటూ అంతర్ముఖంగా భావి సంఘటనలు తెలుసుకొని వారిరువురికి వివాహం చేయకుంటాడని చెప్పించారు. అంతా కాకుండా శ్రీహరియే సహాయుడై ఆమెకు మేలు కలిగేలా చేయును అని సెలవిస్తాడు.

వివాహ సమయంలో ఎఱ్ఱనగారు అశ్వపతి ద్యుమత్సేనుని దగ్గరకు వెళ్ళి తమ కూతురుని కోడలిగా స్వీకరించమని చెప్పగా ద్యుమత్సేనుడు సందేహించగా ఆ సందేహాన్ని తీర్చి సావిత్రి గుణగణాలను చెప్పి వారి నొప్పించి సావిత్రి సత్యవంతులకు వివాహం జరిగిందని ఎఱ్ఱనగారు చెప్తారు.

సత్యంగారు చిత్రాశ్వుడు ద్యుమత్సేనుని సందేహాన్ని వివరించి మీ కుమార్తె మాతో ఉండటానికి సమ్మతిస్తే

వివాహం చేసుకుంటానని చెప్పగా అందుకు అంగీకరిస్తారు మద్రేశు, మాళవికలు. వివాహ సమయంలో, వివాహానంతరం సత్యంగారు కొన్ని సుదీర్ఘవర్ణనలు చేశారు. హరిభక్తిని చాటి చెప్పారు.

వివాహ అనంతరం విష్ణువుని చిత్రాశ్వుడు తల్చుకుంటూ సావిత్రి తన తల్లిదండ్రులకు ఏక సంతానం (నావల్ల) నన్ను భర్తగా పొందడం వల్ల ఈమెకు కష్టాలు వచ్చాయని నొచ్చుకుంటున్నట్లు చెబుతూ తన గురించి వివరిస్తూ

శత్రు భయదమైన శౌర్య విక్రయములు
శస్త్ర సత్ప్రయోగ శక్తి గల్గి
తగిన తోడులేక, తగిన సైన్యము లేక
నిస్సహాయుడనయి నిల్చినాడ

అని విష్ణువునకు విన్నవించుకుంటాడు సుమారు 5 పద్యాలలో విష్ణువుని కీర్తించాడు. ఈ వర్ణన ఎఱ్ఱనగారి సావిత్రోపాఖ్యానంలో లేదు.

యముని దర్శనంలో ఎఱ్ఱనగారు సంస్కృత పదాలతో

"కనియెం గోమలి నీలమేఘవిలసత్కాలాంజనాకారు
ఘో
రనిశాతోత్కటదంష్ట్ర, నుజ్జ్వల చలద్రక్తాక్షు బ్రత్యగ్ర
కాం
చన వర్ణాంబరు, నంత్యకాల దహన జ్వాలా ప్రచండున్
జగ
జ్జన సంత్రాసను నొక్క దివ్య బటుపాశప్రౌఢ
హస్తోద్ధతున్"

అని కాల యముని భయంకరోకృతిని వివరించగా సత్యంగారు. నేటి చలన చిత్రంలో చూసిన విధంగా ఈ విధంగా వర్ణించారు.

ఇటు మొఱవెట్టు నాసుదతి వీక్షణ మార్గము నందు తేజ మొ
క్కటి గనవచ్చె నట్టె కనగన్పడె నొక్క మహానుభావు రూ
పట మహిషాధి రూఢుడయి యాతడు దోచెను చూడ జూడ నం
తట గననయ్యె పాశ సహితంబయి యాతని హస్త మొప్పగా.

యముడి నుండి వరాలు పొందిన వైనం అవి నెరవేరిన విధానం రెండూ ఒకే విధంగా ఉన్నాయి. సత్యంగారు కేవలం విష్ణు భక్తి మాత్రమే ఇడుముల నుండి గట్టెక్కించగలదని విష్ణు మహిమను కొనియాడటం జరిగింది. ప్రసన్న ధర్మములో అంతర్లీనంగా విష్ణుభక్తి మహిమను వివరించడం జరిగింది.

ఆధార గ్రంథాలు :

1. ప్రసన్నధర్మము – గెడ్డాపు సత్యం.
2. సావిత్రోపాఖ్యానం – మహాభారతం.

"పరదేశి రూతు హరికథలో స్త్రీ పాత్ర చిత్రణ"

పెరుమాళ్ళ దైవక్కపు, తెలుగు ఉపాధ్యాయిని, గవర్నమెంట్ ఉన్నత పాఠశాల, చేబ్రోలు.
చరవాణి : 9959120428

శ్రీ జాలాది జోసెఫ్ గారు 15-2-1929 వ సంవత్సరములో గుంటూరు జిల్లా తెనాలి తాలూకా, చిన పరిమి గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రులు జీవరత్నం, వజ్రమ్మ గార్లు. తురుమెళ్ళ హైస్కూలులో SSLC చదివారు. హిందీ విశారద వరకు చదివారు. ఇంగ్లీషులో మంచి ప్రావీణ్యం కలదు. సెకండరీ గ్రేడ్ టీచరుగా ఉద్యోగ జీవితం ప్రారంభించి, హెడ్ మాస్టర్‌గా మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, రేపల్లె నందు ఉద్యోగ విరమణ చేసినారు. ఎందరో విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పించి, విశేష కృషిచేసి, వారి భవిషత్తును తీర్చిదిద్దినారు.

మరియమ్మ గారిని వివాహం చేసుకున్నారు. వీరికి ఐదుగురు సంతానం కలిగారు. ముగ్గురు ఆడపిల్లలు, విద్య, అవని, మైత్రి మరియు ఇద్దరు మగపిల్లలు లవణం, పవనం. జాలాది జోసెఫ్ గారు నాస్తికులైన శ్రీ గోరా గారి శిష్యుల. అలానే భారత కమ్యూనిష్టు పార్టీలో జిల్లాస్థాయి కార్యకర్తగ ఎంతో సేవ చేశారు. అంతేగాక రాష్ట్ర టీచర్ ఫెడరేషన్ యూనియన్‌లో రాష్ట్రస్థాయి సెక్రటరీగా చాలా కాలం కొనసాగారు. విద్య, లవణం, అవని, పవనం, మైత్రి కుమార్తెల, కుమారుల ఉజ్వల అభివృద్ధికి కృషి చేసినారు. ప్రవృత్తి పరంగా రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తూ, 1963 క్రీస్తు చరిత్ర పాటలు – ముద్రణ, యోసేబు చరిత్ర హరికథ – అముద్రితము, రూతు కథ – హరికథ, మొత్తం 7 పుస్తకాలను రచించి తెలుగు భాషా సేవ చేసినారు.

హరికథ :

తెలుగు సాహిత్యంలో ఒక ప్రక్రియ. తెలుగు వారి సంప్రదాయ కళారూపం. మతపరమైన భక్తి కథలను సంగీత సాహిత్యాల మేలుకలయికగా చెప్పడం. ఈకళారూపంలో ఒకే ఒక పాత్రధారి అన్ని పాత్రల్లోను జీవించి, రసవత్తరంగా నటిస్తూ, కథాగానం చేస్తాడు. తెలుగుభాషలో ప్రత్యేకత కలిగి, ఏ ఇతర సాహిత్యంలోను లేని విశిష్టతను సంతరించుమన్న విచిత్రమైన కళ.

హరికి సంబంధించిన కీర్తనయే హరికథ అని సామాన్యార్థం. కాలక్రమేణా మార్పు చెందుతూ సంగీతాభి నయనాలతో కూడుకున్న కథా కథనం ఏదైనా హరికథగా చెప్పబడినది. కథ అనగా క – బ్రహ్మము, థ – ఉండునది అనగా దేనియందు బ్రహ్మ ఉండునో, తెలియబడునో, పొందునో దానిని కథ అంటారు. దానిని గానము చేయుటయే కథాగానము. గానము అనగా కీర్తనము.

గద్య, పద్య, గేయాత్మక, సంగీత, నృత్య కశా విశిష్టమగు ఒక రూపక ప్రక్రియ "హరికథా కాలక్షేపము" అని నిర్వచనము. హరికథా పితామహుడైన ఆదిభట్ల నారాయణదాసు గారి మాటల్లో "ఆస్తిక్యమును ధర్మా ధర్మములను, సర్వజన మనోరంజకముగా నృత్యగీత వాద్యములతో ఉపన్యసించుటయే హరికథ" అన్నారు. దైవభక్తి, సత్యము, భూతదయ కలిగి వుండుట హరికథలో ముఖ్యాంశములు. ఈ అంశములు 'రూతు' కథలో స్పష్టముగా చెప్పబడినవి. చేతిలో చిరతలు, కాలికి ముప్పలు, పట్టు దోవతి పంచెకట్టు, మెడలో పూలమాల, విగ్రహ పుష్టితో ఆడిపాడి, కథ చెప్పి సభారంజనం చేయుచూ, చందోబద్ధమైన సాహిత్యం, సంగీతాలతోపాటు, అభినయ పూర్వకంగా భక్తిని, విజ్ఞానాన్ని, వినోదాన్ని కూర్చగలదు చక్కటి హరికథ.

"పరదేశి రూతు" కథలో దేవుడు తన లక్ష్యాలను, ఉ ద్దేశాలను నెరవేర్చుకోవడానికి సాధారణ ప్రజలను సర్వకాల సర్వావస్థలలోను ఉపయోగించుకుంటాడు అనే విషయాన్ని భక్తిరస ప్రధానమైన ఈ హరికథలో చూడవచ్చు. ఇశ్రాయేలు ప్రజల యొక్క విముక్తి, మానవాళికి దేవుడు ఇచ్చే ప్రాయశ్చిత్తానికి చిహ్నంగా మారిన స్త్రీ రూతు.

పరదేశి రూతు సంక్షిప్త కథ :

ఈ 'హరికథ' యూదా దేశంలో తీవ్రమైన కరువుతో కథ ప్రారంభమవుతుంది. దేవాది దేవుడు, దీన జన పోషకుడు అయిన సృష్టికర్తను స్మరిస్తూ, స్తుతికీర్తనతో కథాగానం ఆరంభించి ఆయా కాలాల్లో, ప్రాంతాల్లో సంభవించిన కరువును, ఆ కడగండ్లను పద్యరూపలో వివరించారు, శ్రీ జోసెఫ్ గారు.

ఈ సందర్భంలో బుర్రకథా పితామహుడు నాజరు గారు కష్టజీవి బుర్రకథలో పాడిన పాటను సందర్భ సహితంగా ఉపయోగించారు. అలానే కరవు వచ్చినపుడు ప్రజలు ఎదుర్కొనే దయనీయ పరిస్థితిని తన పదాలలో వివరించారు. కరువు సమయంలో ముఖ్యంగా పసిపిల్లలు, ముదుసలి వాళ్ళు ఎలా బాధపడతారో చక్కగా వివరించారు. 'ఆకలి' అనే పదానికి ఎంతో విలువనిస్తూ తన హరికథను హృద్యంగ వ్రాశారు. కరవు వచ్చినప్పటి పరిస్థితులను తను జీవించిన కాలంలో ఎలా వుండేవో కళ్ళకు కట్టినట్లుగ పద్యాలలో వివరించారు.

ఆంధ్రక్రైస్తవ కీర్తన పుస్తకంలోని కొన్ని కీర్తనలను సందర్భ సహితంగ వాడుకోవడాన్ని విమర్శించలేము.

బేత్లెహేములో నివసిస్తున్న నయోమి ఆమె భర్తయైన ఎలీయెలెకు వారికి వచ్చిన కష్టానికి బాధపడుతూ, దైవం మీద భారం వేసి మోయాబు దేశములో కాపురముండుటకు వెళ్తారు. నిత్యకళ్యాణము పచ్చతోరణములా వున్న ఆ దేశంలో పోషణకర్త అయిన దేవుని స్తుతించుచూ, ప్రార్థిస్తూ జీవిస్తూ వున్న సమయంలో నయోమి భర్త మరణిస్తారు. ఎంతో బాధతో, దుఃఖంతో బతుకుతూ, కొంతకాలం గడచిన తరువాత తన ఇద్దరు కుమారులకు నయోమి వివాహం జరిగించినది. మోయాలు స్త్రీలైన రూతును మహ్లోనుకు, ఓర్పాను కిల్యోనుకు ఇచ్చి వివాహం చేసిన 10సం॥ తరువాత ఇద్దరు కుమారులు మరణిస్తారు.

కుటుంబములో జరిగిన విషాదాన్ని దీనాతిదీనంగ తన పద్యాలలో ప్రస్ఫుటంగ వ్రాశారు. భర్తను, పిల్లలను కోల్పోయిన నయోమి బాధ వర్ణనాతీతం. తన పద్యాలలో దీన్ని చక్కగ వ్రాశారు. కష్టకాలంలో సొంత వూరు వెళ్ళటం అనే ఆలోచన సహజం. ఈ విషయాన్ని చక్కగ తెలిపారు.

నిరాశాజనకమైన స్థితిలో నున్న నయోమి అండలేని చోట వుండరాదని తలచి తిరిగి యూదా బేత్లెహేమునకు ప్రయాణమై ఇద్దరు కోడళ్ళను ముద్దాడి, మీ తల్లుల ఇళ్ళకు తిరిగి వెళ్ళండి. "ప్రభువు మీకు దయచూపును గాక" అని అన్నపుడు ఓర్పా వెళ్ళి పోతుంది. కాని రూతు తన అత్తను హత్తుకుని వుంటుంది. భిన్నమైన విశ్వాసాలు, నేపధ్యాలు, సంస్కృతులు కలిగిన వారు లోతైన ప్రేమ, దయ, భావోద్వేగాలు కలిగి, కలిసి జీవించాలని కోరుకుంటారు. నయోమి విశ్వాసం రూతుకు బలమైన సాక్ష్యంగా, కష్టసమయాల్లో దేవుని ప్రేమించి, విశ్వసించే గొప్ప విశ్వాసం గల స్త్రీగా అయింది.

రూతు ఏవిధంగా తన అత్తను హత్తుకొని ఓదార్చు విధానం కూడా పాఠకుణ్ణి ఆకట్టుకుంటుంది. ఇది దృశ్యరూపంలో ఇంకా రక్తి కడుతుంది.

'నీ దేవుడే నా దేవుడు, నీ జనమే నా జనము' అని రూతు తన అత్తను అనుసరించి వసంత కాలంలో బార్లీ కోత ప్రారంభ సమయానికి ఇద్దరూ బేత్లెహేమునకు వస్తారు. సర్వం పోగొట్టుకొనిన నియోమిని చూసిన ప్రజలు బాధపడగా, తన దీనగాథను వారికి వివరిస్తుంది. కష్టపడి పనిచేసే స్వభావం కలిగిన రూతు, బోయజు పొలంలో ప్రవేశించి ధాన్యాన్ని సేకరిస్తూ, కుటుంబ బాధ్యతను నిర్వర్తిస్తూ, సత్ప్రవర్తన కలిగినదై యుండగా, ఆమె యొక్క మమత, మానవత్వం, సేవానిరతని గుర్తించిన బోయజు ఆమెకు రక్షణ, భద్రత కలిగిస్తారు.

ఇశ్రాయేలీయులలో నున్న బంధు దర్మమును నెరవేర్చి, వితంతువు స్వాస్థ్యమును స్థిరపరచునట్లుగా అప్పటి మర్యాద చొప్పున బోయజు రూతుకు సమీప బంధువుగా సమస్యను పరిష్కరించి, మోయాబీయురాలైన రూతును సంపాదించుకుని వివాహం చేసుకుంటాడు. వారికి ఓబేదను కుమారుడు జనిస్తాడు. రూతు యొక్క నమ్మకం, విధేయత యేసుక్రీస్తు వంశావళిలో చేర్చబడి, యేసు ప్రభువుకు బంధువుగా ఆమె

వారసత్వం చరిత్రలో సుస్థిరమైనది. విషాదంతో మొదలైన ఈ కథ విమోచనతో ముగుస్తుంది.)

ఏకాలంలోనైన స్త్రీల పట్ల వున్న ప్రతికూల వైఖరిని పరిశీలిస్తే, రూతు జీవితం నుండి నేర్చుకోవలసిన సుగుణాలు ఎన్నో వున్నాయి. ధైర్యసాహసాలు, విధేయత, ప్రేమ, విశ్వాసం, వినయం, నమ్మకత్వం, స్నేహపూర్వక సానుకూల వైఖరి ఇవన్నీ ఆమెకు ఆధ్యాత్మిక అలంకారాలు. ప్రతికూల పరిస్థితులలో ఆమె జీవిత నిర్ణయాలు, దేవుని ప్రణాళికను, సంకల్పం నెరవేర్చడానికి అందుబాటులోనున్న పాత్రగా, పరిపూర్ణమైన స్త్రీగా రూతు ఆదర్శనీయం. అనుసరణీయం. నమ్మకమైన కోడలిగా, అత్త సంరక్షణ బాధ్యత తీసుకొని, సహకారిగా నిలిచిన ధీరోదాత్తురాలు రూతు .

కథలో నయోమి బాధల కొరకే నన్ను బతికించావా అని విలపించడం, కుమారులు మరణించినపుడు మాయా లోకాన్ని సత్రశాలగా, మానవులు బాటసారులుగా ఎవరి దారిన వారు వెళ్ళవలసినదేనని ఎండమావుల నీరే జీవితమని, గాఢాంధకారపు లోయల వంటి పరిస్థితుల గుండా వెళ్ళినా ధైర్యంతో దేవుని వైపు చూడాలనే సందేశాన్ని ఇచ్చినది నయోమి పాత్ర. జోసెఫ్ గారు ఈ భాగాన్ని దీనంగా వివరించారు. ప్రతివారి గుండెకు హత్తుకునేలా వ్రాశారు.

దేవుని ప్రేమ ఒక దేశానికి లేదా ప్రాంతానికి, ప్రజలకు మాత్రమే పరిమితం కాదనీ, దేవుడు ఎవరినైనా వారి పరిస్థితులతో సంబంధం లేకుండా తన ఉద్దేశాలను, సంకల్పాన్ని నెరవేర్చుకోవచ్చని నిరూపించింది రూతు పాత్ర. పరదేశి అయినప్పటికే గొప్ప విశ్వాసాన్ని, ధైర్యాన్ని ప్రదర్శించింది. జీవితంలో ఏమి జరిగినా, మనం ఎల్లప్పుడూ, మన ప్రియమైన వారికి విశ్వాసంలో, ప్రేమతో కట్టుబడి వుండాలని తెలిపింది రూతు.

దేవుడు సార్వభౌమాధికారి, ఆయన మన జీవితాలపై నియంత్రణ కలిగి వున్నాడని, విచ్చిన్నకర పరిస్థితులలో కూడా మన పట్ల పరిపూర్ణ ప్రణాళిక కలిగివున్నాడని చెప్పడానికి రూతు జీవితం ఒక ఋజువు.

ముగింపు :

మోయాబీయులు ఇశ్రాయేలీయుల సమాజంలో చేరడానికి అర్హత లేదు (ద్వితీయోపదేశ కాండము 23:3 ప్రకారం) ఇశ్రాయేలుతో సమాన వారసత్వం లేని, వాగ్దాన నిబంధనలేని పరజనురాలిగా, పరదేశీగా, నిరీక్షణలేని, నిర్దేవులుగా నున్న రూతునకు (అన్యులకు) దేవుడు యేసుక్రీస్తు వంశావళిలో చేర్చబడిన అవకాశాన్ని, గొప్ప అధిక్యతను ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించి కథను రచయిత పొడిగించినట్లయిన బాగుండునని నా అభిప్రాయము.

బోయజు క్రయము చెల్లించి, రూతును సంపాదించిన రీతిగా పరలోకపు బోయజునకు సాదృశ్యంగా నున్న ప్రభువైన యేసుక్రీస్తు వారు కలువరి సిలువలో వధింపబడి, తన రక్తమిచ్చి మనుష్యులను కొని, సంపాదించిన సంఘమును రూతుగా అభివర్ణించిన యెడల బాగుండును.

బోయజు రూతుల వివాహము గొఱ్ఱెపిల్ల వివాహ మహోత్సవమునకు సాదృశ్యము. పవిత్రత, పరిశుద్ధత కలిగిన వధువు సంఘము రూతు. పెండ్లి కుమారుడు ప్రభువైన యేసుక్రీస్తువారు బోయజు, మహిమగల సంఘముగా తన ఎదుట నిలువబెట్టుకొనుటకు వాక్యముతో అనుదినము తన ప్రజలను పరిశుద్ధాత్మ దేవుడు పవిత్ర పరచుచు, సిద్ధ పరుస్తూ వున్నాడు అనే ఆధాత్మక సత్యాన్ని వివరించినట్లయిన పరిపూర్ణత లభించునని నా అభిప్రాయము.

గద్య, పద్య కీర్తనలతో రాగ, తాళ ధ్వనులతో అలరారిన రూతు హరికథ నేటి తరానికి, క్రైస్తవ ప్రపంచానికి పరిచయం చేయడం సర్వదా హర్షణీయము!

ఆధార గ్రంథాలు :

1. బైబిలు క్రొత్తనిబంధన
2. పరదేశి రూతు
3. అంతర్జాలం

తెలుగు కవిత్వంలో – మానవతావాదం

డా॥ పొందరి లక్ష్మణరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, డా॥ బి.ఆర్. అంబేద్కర్. యూనివర్సిటీ,
శ్రీకాకుళం. సెల్: 9550523641.

మానవుడు వ్యక్తి స్వేచ్ఛను ఆశిస్తాడు. తన వ్యక్తిత్వ వికాసాలకు ఆటంకాలు వున్నవాటిని తొలగించుకునే ప్రయత్నంలో సత్యాన్వేషణ చేస్తాడు. ఈ విధంగా వ్యక్తి వికాసానికి, సామాజిక పునర్నిర్మాణానికి ఆవశ్యకతను కలిగించే దానినే మానవతావాదం అంటారు.

మానవతావాదాన్ని ఆంగ్లములో హ్యూమనైజం అంటారు. ఈ ఆంగ్ల శబ్దానాకి మాతృక లాటిన్ భాషలో హ్యూమనిటస్ అనే పదం (లాటిన్ –ఇంగ్లీష్, హోమో – మాన్: హోమోనీస్ – మేన్ కైండ్ హ్యూమస్, హ్యూమన్, హ్యూమనిటాస్ – హ్యూమనిజం). హ్యూమనిజం అనే పదాన్ని మొదటిసారిగా ఆక్స్‌ఫర్డ్‌కి చెందిన ఎఫ్.సి.యస్. హిల్లర్ పేర్కొన్నాడు. హిల్లర్ ప్రతిపాదించిన వ్యవహారికవాద రూపాంతరమే మానవతావాదం. ఇది సంస్కృత శబ్ద నివృత్తి.

మానవతావాదాన్ని గురించి ఆవుల సాంబశివరరావు గారు మానవత్వం మానవతకు ఉండే సహజ లక్ష్మణమని, ప్రకృతిబద్ధంగా జన్మించి ప్రకృతిని అనుసరించి జీవిస్తూ, ప్రకృతిని అవగాహన చేసుకొని తమ జీవితానికి అన్వయించుకుంటూ, పరిజ్ఞానాన్ని సేకరించుకుంటూ ఉండే మానవుని లక్షణాలు సమూహానికి ఇవ్వబడిన పేరే మానవత్వం. మానవతా వాది సహజంగా సత్యం, ధర్మం, న్యాయం, అహింస, కర్మ అనే పంచ సూత్రాలకు లోబడి ఉంటాయి. ఇదే ప్రాథమికమైన విలువులుగా చెప్పవచ్చు. మానవతావాదం మతం కంటే సిద్ధాంతాల కంటే మనిషి సంక్షేమాన్ని మహోన్నత విలువుగా పరిగణించే విధానం.

పరతత్వం, ప్రభతత్వం స్థానములో మానవతానికి మకుటంపెట్టిన అంశము మానవతావాదము. మానవ మేధ, మానవ కృషి, మానవ స్వేచ్ఛ, సౌహార్ధం, సౌభ్రాతృత్వం, ఇవే ఈ మానవసమాజం. సుందరం, ఆర్ధవంతం కావటానికి ప్రధానమంటుంది. ఇదే మానవతాదృక్పదమని ఇంద్రగంటి శ్రీకాంత్ శర్మ అంటారు.

ఆధునిక సాహిత్యానికి తల్లివేరు మానవత్వం అని చెప్పాలి. తెలుగులోని ఆధునిక సాహిత్యం అంతా మానవ సాహిత్యమే. మానవ సంబంధ సాహిత్యం. మానవ సంబంధంలేని సాహిత్యం కూడా ఉంటుంది. అది తక్కువ. సాహిత్యం ఆధునిక కాలంలో మనిషిని మనిషిగా చూడటానికి అలవాటు పడింది మనిషి ఉన్నతిని కాంక్షించింది. మనిషి అధోగతిని నిరసించింది. మానవ విలువల పరిరక్షణకు పట్టుకొమ్మగా నిలిచింది. భావకత్వం నుండి ఈనాటి కవిత్వం వరకు మానవత్వం అనేక దశలను దాటి తన ఉనికిని చాటుకుంటూనే ఉంది. సమాజంలో కొన్ని మూడాచారాలు ఖండిస్తూ, మంచికోసం మానవత్వం కోసం కృషిచేస్తున్న కవులలో గురజాడని మనం మొదటిసారిగా చెప్పుకోవాలి.

గురజాడ **'మనిషి'** అనే గేయ ఖండికలో చక్కని ప్రబోదం చేస్తారు. జాతి మత వైషమ్యాలతో మానవత్వాన్ని మట్టిపాలు చేయడం మంచిదికాదని,

"అన్నదమ్ములు వలెను జాతులు
మతములన్నీ మెలగవలెనోయ్" (1935:పుట 2) అని ప్రభోదిస్తారు.

"యెల్లలోకము వొక్కయిలై
వర్ణ భేదము లెల్లకలై
వేల నెరుగని ప్రేమబంధము
వేడుకలు కురియ" అంటూ ముత్యాల సరాలులో వసుధైక భావాన్ని విశ్వమానవ ప్రేమాభావాన్ని చాటి చెప్పారు.

"స్వంత లాభం కొంతమానకు
పొరుగువారికి తోడు పడవోయ్
దేశమంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుషులోయ్ పరుల మేలును తన మేలుగా
భావించాలని పేర్కొంటారు.
రాయప్రోలు తనకవితలో
"దేశ ఋణమును దేవ ఋణమును
మాతృ ఋణమును మనిషి ఋణమును
తీర్చగలిగిన దీక్షితుడని
తెలిసి తెలిపే సమయమోయ్" అని అంటారు.
మరొకచోట
"కాలే కడుపుకు గరిటెడు గంజీ
జారే సిగ్గుకు మూరెడు పాత
ఎల్లర కందే చల్లని రోజులు
వెలిసే విధమును వెదకండీ"
(తారణవనమాట పుట-13)

అనడంలో మానవతావాద సందేశం కనిపిస్తుంది.

సమానత్వం చదువుకు పరమ ప్రయోజనం అని మానవతాతత్త్వం సర్వజనులకు హితాన్ని, సుఖాన్ని కోరుతుంది.

"దొరలుగారు ముక్తి నొసరించు ప్రభువులు
కూడు గుడ్డ కాదు కొరత మాకు
సమత లేని రిత్త చదువేల? పదివేల
మతములేల నూరు ప్రతములేల"

అంటూ చదువుకు మతానికి సమత ముఖ్యమని కవి అభిప్రాయం. ప్రముఖ పద్యకవి, విద్వత్కవి చూడామణి జ్ఞానానంద కవి 'ఆహ్వానం' కవితలో

"మతములన్ని మానవత జాటునని తెల్పి
మతము పేర నొరుల గతము సేయు
దొంగ సాధులన్న కొంగజపాలన్న
కట్టరాని యేవగింపు నాకు" అని స్పష్టం చేసారు.

దేవులపల్లి కృష్ణశాస్త్రి ఈ యుగాన్ని మానవతా యగంగా విశ్వసించారు. మానవతపై కృష్ణశాస్త్రి ఎన్నో గేయాలు రాశారు.

"మత మన్నది నా కంటికి మసకైతే
మతమన్నది నీ మనసుకు మచ్చైతే
మతం వద్దు గితం వద్దు
మాయా మర్మం వద్దు." అని మతాన్ని నిరసించారు.

బోయి భీమన్న మతము వద్దు, దేవుడు వద్దు నీతి బోధలూ వద్దు. మానవుణ్ణి మానవుడిగా గుర్తిద్దాం అంటూ..

"మానవ భావన నుంచి మతాన్ని తొలగించ గలిగితే చాలు.
విశ్వమానవ శ్రేయస్సు సర్వ మానవ సమతోషస్సు" (గుడిసెలు కాలిపోతున్నాయి)

కులవృత్తి విభేదాలకు అంత్య క్రియలు జరిపి మానవుడొకడే మానవత ఒకేటనని ప్రకటించాయి. కరుణశ్రీ, అబ్బూరి రామకృష్ణారావు, దువ్వూరి రామిరెడ్డి, తుమ్మల సీతారామ మూర్తి, కవి కొండల వెంకటరావు, నార్ల వెంకటేశ్వరరావు వంటి ప్రముఖ కవులు మానవత్వాన్ని పెంచుకునే విధంగా కవిత్వం రాసారు.

నార్ల కవిత్వంలో ...

"ఎన్ని పేర్ల తోడ నే యే మతములన్ని
మానవతను మించు మతము లేదు
మానవత ఫలితం మాధవుడే తరించు
వాస్తవంబు నార్లవారిమాట" (నవ మేథావి నార్ల పుట-103)

శ్రీశ్రీ... "నాయింటి పేరు ప్రపంచం
ప్రజలే నా కుటుంబం
వెదజల్లుతా దిద్దిగంతం

అపుడు నా జీవితమే ప్రబందం" అని శ్రీశ్రీ తెలుగు సాహిత్యాన్ని మానవ లోకంలో విశ్వ వీధుల్లో పయనింప జేశాడు.

దాశరధి :.. "గగనంలో చుక్కలు తోటలోని పూవులు
కలహించక కలిసుండును
మనుషులేల కలహించుట"

(కవితా పుష్పకం పుట – 409)

కుందుర్తి ఆంజనేయులు :

"మళ్ళీ నరజన్మ ఎందుకంటే
మనుషులంటే ఇష్టం నాకు
దేవుడి కంటే మనిషి ఇష్టం."

కాళోజీ సామాజిక శ్రేయస్సుని ఆశించే ప్రజాకవి. మమత గురించి 'నరుడ నేను నరుడ నేను' అన్న ఖండికలో...

"మాయ మమత లేని
వట్టి కాయము కట్టెల చేటు
మమతయున్న మనుషులోనే
సమతా భావము కలుగును
మన్ను కానె కను నేను
మనసున్న మానవుడను
మమతలేని బ్రతుకు బ్రతక
విమనస్కుడనే గాను " (నా గొడవ పుట – 65)

సినారె ప్రముఖ మానవతావాది. మానవతావాదం వీరి కవిత్వంలో అడుగడుగునా కనిపిస్తుంది. నారాయణ రెడ్డి కవితలో నూటికి తొంబైపాళ్ళు మానవతా ప్రబోధం కనిపిస్తుంది.

"మనిషి నశించినా
నశించదు మానవత్వం
అదే ఈ లోకానికి మణి సోపానం
అనంతం వైపు దాని ప్రస్థానం" అంటారు.

మానవతా పతాకాన్ని సినారె రెపరెపలాడిస్తూ వచన కవితా ప్రక్రియ అందించిన కావ్యం విశ్వంభరలో నాయకుడు మనిషే!

"సమత నా తల్లి, సహార్ధం నా తండ్రి,
విశ్వం నా ఊరు, శాంతి నా పేరు "

అంటూ శాంతి సౌహార్ధాలను సమతకు దగ్గరి బంధువులని చేస్తూ మంచితనం పచ్చగా ఉండాలి. మనిషి తనం పచ్చగా ఉండాలి. మంచినీ, మనిషినీ కాజేసే వంచన మాత్రం చచ్చుగా ఉండాలంటారు.

అభ్యుదయ కవులైనా, దిగంబర కవులైనా, విప్లవ కవులైనా, స్త్రీ వాదులైనా, ముస్లింవాద కవులైనా ఎవరైనా తమ కవిత్వంలో మానవత్వానికి పీఠం వేశారు. చెరబండరాజు నన్నెక్కనివ్వండి బోను' అనే కవితలో ....

"నా దేముడు చీమూ నెత్తురు వున్న మానవుడు
మానవత్వాన్ని తప్ప మరో మతాన్ని అంగీకరించడు"

(నన్నెక్కనివ్వండి బోను పుట–18)

మనుషులందరూ ఒక్కటేనని భావిస్తూ...

"దేశమేదయితే నేమి మట్టంతా ఒకటే కదా!
అమ్మ ఎవరైతేనేమి చుబాల తీపంతా ఒకటే" నని సమతకు ప్రాధాన్యమిచ్చారు.

మంచి మనసు పరిమళాలు విశ్వవ్యాప్తి కాకపోవు, భావితరం గుర్తించక పోదు అన్నట్టు –తెలుగు కవిత్వంలో మానవత్వం మల్లెలా పరిమళిస్తూ రానున్న తరాలకు ప్రబోధం చేస్తూ నిత్యం స్రవించే నదిలా మానవత్వం ఉందని ఆశిద్దాం.

ఆధార గ్రంథాలు:

1) 'మనిషి' గేయ ఖండిక (పుట –2) గురజాడ అప్పారావు

2) ముత్యాల సరాలు – గురజాడ ఆప్పారవు

3) రాయప్రోలు – తారణవనమాట పుట–13.

4) ఆహ్వానం – విద్వత్కవి చూడామణి

5) దేవునిపల్లి

6) బోయి భీమన్న

7) నవ మేథావి – నార్ల (పుట–103)

8) మరో ప్రస్థానం – శ్రీశ్రీ

9) కవితా పుష్పకం – కుందర్తి ఆంజనేయులు (పుట – 409)

10) నా గొడవ – కాళోజీ (పుట–65),

11) ఒకే ఒక్క దీపం – సినారె (పుట – 143)

12) నన్నెక్కనివ్వకండి బోను – చెరబండరాజు (పుట– 18)

తెలుగు సాహిత్యంలో అధివాస్తవికత ధోరణి – ఒక పరిశీలన

ఆర్. రమాదేవి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, డా. బి.ఆర్.ఆర్. ప్రభుత్వ కళాశాల, జడ్చర్ల, మహబూబ్ నగర్, తెలంగాణ.

వాస్తవికతను, ఆంగ్లంలో సర్రియలిజం అంటారు. వాస్తవాన్ని, ఊహని అనుసంధానిస్తూ రాసే ప్రక్రియను అదివాస్తవికత అంటారు. 1922లో యూరోపియన్ సాహిత్యంలో ఈ ప్రక్రియ మొదలైంది. సర్రియల్లిస్ట్ అనే పదం ' ఫ్రెంచ్' మాట.

సర్రియలిజమ్ అంటే 'వాస్తవానికి అవతల (వెనుక) తొంగిచూసే ప్రయత్నం చేయడం' అని అర్థం. వాస్తవికతను, కలను రెండింటినీ పైన పైనే చూస్తే పరస్పర విరుద్ధాలు. ఈ రెండింటిని మేళవింపచేసేదే అదివాస్తవికత అని సర్రియలిస్టులు ప్రతిపాదించారు.

అధివాస్తవికత యొక్క లక్షణం:

కళ మరియు సాహిత్యం ద్వారా, ఒక కలలో జరిగిన విషయం వలె మొత్తం సందర్భం అర్థవంతంగా చెప్పడం జరుగుతుంది. మరియు మన అపస్మారకస్థితి దానిని అర్థం చేసుకోగలిగేంతవరకు మనలో ఉన్న అసంబద్ధతను వ్యక్తీకరణ చేయడం.

సర్రియలిజం లక్షణం :

అధివాస్తవికత యొక్క ప్రధాన లక్షణం అపస్మారక స్థితిని వ్యక్తీకరించడం, పురాణాలు, కథలలో కూడా ఈ ప్రక్రియ లక్షణాలు ఉంటాయి.

సిగ్మండ్ ఫ్రాయిడ్ అనే మనస్తత్వ శాస్త్రవేత్త ప్రతిపాదించిన మనోవిశ్లేషణ సిద్ధాంతము, సర్రియలిజంనకు దారి తీసినది. మానవుడి యొక్క మనసు మూడు రకాలుగా ఉంటుంది అని ఫ్రాయిడ్ చెప్పడం జరిగింది. 1. ఒకటి కాన్షియస్ (వ్యక్తము), 2. రెండవది సబ్కాన్షియస్ (వ్యక్తా వ్యక్తము), మూడవది అన్కాన్షియస్ (అవ్యక్తము) అని మూడు రకాలుగా మనో విశ్లేషణ సిద్ధాంతంలో చెప్పడం జరిగింది.

ఈ సిద్ధాంతము మానవుని యొక్క తీరని కాంక్షలను, అణగారిన భయములను, అమితానుభూతి మొదలగు వాటిని నూతన వ్యాఖ్యానము చేసి సరికొత్త అర్థము అందించింది ఈ సిద్ధాంతము.

చేతనావస్థకు సుప్త చేతనావస్థకు మధ్య కాంట్రడిక్షన్‌ను అధిగమించే విధంగా ఈ అధివాస్తవికత ఉంటుంది.

చలంగారు రాసిన 'మైదానం', శ్రీశ్రీ రాసిన 'అభిసారికి కడసారి' అను గేయములో ఈ ప్రక్రియ కనిపిస్తుంది. అన్ కాన్షియస్ (అవ్యక్తము) అనేక అనుభూతులకు కూడలి.

పూర్వ సంవేదనలు అనేకముగా ఉంటాయి. అవ్యక్త దశలో అనుభూతులు నిగూఢముగా ఉంటాయి. తీరని కోరికలు, ఊహలు మానవుని యొక్క అవ్యక్తములో భుజంగమువలె ఉంటాయి. స్వప్నములో ఇవి అవ్యక్త దశ నుండి పడగలు విప్పుకొని పైకి వస్తాయని ఫ్రాయిడ్ వివరించెను.

ఈ విధంగా సరికొత్త వ్యాఖ్యానం చేసిన తత్వవేత్త ఫ్రాయిడ్. మానవులు కాన్షియస్ వ్యక్తస్థితిలో ఉన్నప్పుడు అతని వ్యక్తిత్వము సంపూర్ణముగా తెలియదు.

కృత్రిమత్వమునకు లోనై మహావాహినిలో తేలియాడు మంచుగడ్డ వలె కొంచమే పైకి కనిపించును. మిగిలిన భాగము పరిశీలించి చూస్తే అతని వ్యక్తిత్వము తెలుస్తుంది. మంచుగడ్డ క్రింది భాగము ఎక్కువశాతం కనిపించదో, అదేవిధంగా మంచుగడ్డ క్రింది భాగం కనిపించనట్లుగా మనిషి యొక్క అవ్యక్తరూపం కనిపించదు.

మానవుడు సంఘజీవి అతడు కొన్ని సాంఘిక నిబంధనలకు లోనై కొన్ని అనుభూతులను మాత్రమే జల్లెడ పట్టినట్లుగా ప్రకటించగలుగుతాడు. మిగిలినవన్నీ అనగ

ద్రొక్కుతాడు. ఆ విధముగా అణగద్రొక్కబడిన కోరికలు, ఊహలు అవ్యక్త దశలో యధాతదముగా బహిర్గతము చేసి చెప్పుతారు. అలా చెప్పటమే సమంజసమని అధివాస్తవికుల మతం. దీనినే వారు (ఫ్రీ అసోసియేషన్) స్వచ్ఛందానుబోధ అంటారు. పఠాభి 'ఫిడేలు రాగాల డజన్' అనే రచనలో అధివాస్తవికత స్పష్టంగా కనిపించుచున్నది. నారాయణబాబు గేయంలో కూడా స్వచ్ఛందానుబోధ ఉంటుంది. ఈ ప్రక్రియలో బీభత్సరసము ఎక్కువగా ఉంటుంది. శ్రీశ్రీ అదివాస్తవికత కవిత్వ సూత్రంలను దృష్టిలో పెట్టుకొని రచించెను. రుబాయత్తు, కొంటె కోణాలు, విధూశకుని ఆత్మహత్య అనే మూడు గేయములను రచించెను. ('ప్రతిభ' గిడుగు రామమూర్తి స్మారక సంచిక నాలుగవ సంపుటిలో చెప్పెను)

జీబ్రాకి ఆల్జీబ్రా చిహ్నాల
లాంగ్ కొట్టు పామ్ కోడ్లు తొడిగి, సాహిత్య
పౌరోహిత్యం ఇస్తే
వెర్రికాదు సర్రి నిజంరా సోదరా! శ్రీ శ్రీ అన్నారు.

పై గేయమ్‌లో

జీబ్రా వేరు, ఆల్జీబ్రా వేరు ఈ రెండింటికి శబ్ద సౌమ్యము మాత్రమే ఉంది. వాటికి లాంగ్‌కోర్టు తొడుగుట, అర్థం లేనిది. దానిని తొడుగుటకు సాహిత్య పురోహిత్యం చేయుటకు సంబంధం లేదు. కావున అసంబద్ధత, అనర్థకత, శబ్ద చమత్కారము లక్షణములని శ్రీశ్రీ చెప్పారు. నారాయణ బాబు 'లెండోయి ఋషులు', మౌన శంఖం, భావం, చిన్న, నీవెవరే, గేదిపెయ్యి, మొదలగు గేయములలో ఈ అధివాసవిక ధోరణి స్పష్టంగా కనిపిస్తుంది.

నారాయణబాబు రచించిన గేయం 'నీ వెవరే!' అనే కవితలో...

పాడే రేడియో!
నా చేతిని గడియారం
కనిపించని
కాలం గుట్టం
డెక్కల చప్పుడు
టిక్కు! టిక్కు!"
దరిద్రంతో
తాపత్రయాలతోవెంటాడిన
వెఱ్ఱికుక్క
దినానికి
తిలోదకాలు!
హాయిగ
అర్ధరాత్రి
ఆడామగా
తడిమినా తెలియని
తాండ్రపాపారాయుడు
తమస్సు!
బుద్ధి హృదయం
ధ్యానబద్ధులై
నిమీలిత నేత్రాలతో
నిద్రిస్తే
వ్యక్తావ్యక్త లోకంలోంచి
వెలుగుబాటలు
చూపించే
నీవెవరే!

పై గేయంలో అధివాస్తవికత స్పష్టంగా కనిపిస్తోంది.

ఈ కవిత్వం ఇస్మాయిల్ గారితో ఎక్కువ ప్రచారం పొందింది. శ్రీశ్రీ వ్రాసిన 'అభిసారికి కడసారి' అను గేయంలో ఆకాశం మీద రాకాసి కోర ఏడ కయ్యా పోతావు కోరచుట్టు నెత్తుటి చుక్కలు ఏడ కయ్య పోతావు అని అన్నారు.

ఒక స్త్రీ తన భర్తకు సుఖవ్యాధులు వస్తాయని పరోక్షంగా ఈ గేయంలో చెప్పడం జరిగింది. నారాయణ బాబు 'చిన్న' అనే గేయంలో ఈ క్రింది విధంగా చెప్పెను..

మన్ను తింటున్న చిన్న
మీ నాన్న నిన్ను కొడితే
.....
ఏమిటి
అల్లా చూస్తావు
నీ చూపులు
నాగమయ్య గొంతుకు
తడిపే చవితినాడు
చిమ్మిలి తిన్నావా
.....
మన్నుతింటే పాండు రోగం వస్తుందంట ఏం
ఏమంటాయి నీ చూపులు ?

నారాయణ బాబు 'కవి' అను గేయంలో జుగుప్సా బీభత్సరసములను వర్ణించను..

నల్లని త్రాచుకోరలు
తెల్లని మసూచి కుండలు
గగనమున చుక్కలు
ఒళ్ళు తెలియని పుల్ల బాధతో వెక్కివెక్కి రోధించినది
చుక్కల ఆకాశం

ప్రకృతిలో సౌందర్యం మాత్రమేకాక బీభత్స గుణమును దర్శించుట, అది వాస్తవికుల లక్షణములలో ఒకటి.

కేశవరెడ్డి గారు రచించిన 'మునెమ్మ' కవిత్వంలో మరియు యండమూరి గారి 'థ్రిల్లర్'లో కూడా ఈ ప్రక్రియ లక్షణాలు కనిపిస్తాయి. అంటే తెలుగు సాహిత్యం నన్నయ కాలం నుంచి నేటి వరకు ఎన్నెన్నో మార్పులు జరుగుతూ వస్తుంది. మార్పు సహజం. అంగీకరిస్తే ప్రశాంతంగా ఉంటాం.

ఆధునిక కాలంలో ఇతిహాస సంబంధ రచనలు– భిన్న దృక్పథాలు

సంపత్ కుమార్ బానోజి, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాల, స్వయంప్రతిపత్తి సిద్ధిపేట.
సెల్ : 9666085015

ఉద్దేశ్యము :

భారతావనిన రామాయణ, భారతాలు ఇతిహాసాలుగా భాసిస్తున్నాయి. రామాయణమున శ్రీరామచంద్రుడు మర్యాద పురుషోత్తమునిగా, మూర్తీభవించిన ధర్మ స్వరూపంగా దర్శనమిస్తారు. ఆయన నడవడిని ఆదర్శంగా తీసుకొని మానవులందరూ ఆ బాటలో నడవవలసి ఉన్నది. అట్లే రావణాదుల పాత్రల నుండి దుర్గుణాలను త్యజించాలనేటు వంటి నీతిని తెలుసుకోవలసి ఉన్నది. ఇలా రామాయణ సంబంధమైన ఒక్కొక్క పాత్ర ఒక్కొక్క నీతిని మనకు బోధిస్తుంది. అలాగే భారతమున పాండవాదుల నుండి ధర్మబద్ధమైన నడవడిని, ధార్తరాష్ట్రుల నుండి గుణపాఠాలను నేర్చుకుని, వివిధ సందర్భాలలో వచ్చే ఉపాఖ్యానాల నుండి జీవిత పాఠాలను, జీవన నైపుణ్యాలను నేర్చుకోవలసి ఉన్నది. ఇలాంటి ప్రయోజనాలను యథాతథంగా ప్రజలకు చేరవేయవలసిన రచయితలు, పరిశోధకులు తమ అభిరుచులకు అనుగుణంగా వివిధ కోణాలలో ఇతిహాసాలకు నూతన భాష్యం చెబుతూ ఇతిహాస ప్రయోజనాలను దెబ్బతీశారు.

ప్రాచీన కవులు తమ పాండిత్యం ఉట్టిపడేలా, సృజనాత్మకంగా ఇతిహాసాలలో కొన్ని మార్పులు చేర్పులు చేసి వివిధ ప్రక్రియలలో ఇతిహాసాలను వెలువరించారు. ఇక ఆధునిక కాలంలో పాశ్చాత్య ప్రభావం చేత నూతన ప్రక్రియలు భారతీయ సాహిత్యములో చేరాయి. ఇందులో భాగంగానే తెలుగునాట కూడా వివిధ నూతన సాహిత్య ప్రక్రియలు, అధునాతన భావజాలాలు ప్రవేశించాయి. అట్టి అధునాతన భావజాలాలను పునికిపుచ్చుకున్న కవులు, రచయితలు, పరిశోధకులు, విమర్శకులు తమ భావజాలానికి అనుగుణంగా, సమకాలీన పరిస్థితులకు అద్దం పట్టే విధంగా ఇతిహాసాలను మార్చి తమ రచనలను వెలువరించారు. అట్టి రచనల వలన ఇతిహాస గౌరవము దెబ్బతినడమే గాక ఆ మార్పులే వాస్తవములనుకునే దుర్గతి పట్టినది. ఇతిహాస పాత్రల ఔన్నత్యము దెబ్బతిన్నది. అట్టి ఉపద్రవములను కొనితెచ్చిన కొన్ని రచనలను పరిచయం చేయటం నా వ్యాసం యొక్క ఉద్దేశ్యము.

పరిధి :

సాధారణంగా ఇతిహాసాలకు సామాన్యార్థము, అంతరార్థము, శాస్త్రార్థముల పరంగా పరిశీలించవచ్చు. ఇవన్నీ ఇతిహాసానికి విధేయములే. అట్టి కోవలో వచ్చిన ఇతిహాస సంబంధ రచనలను గూర్చి కాక హేతు వాదం, నాస్తిక వాదం, దళిత వాదం, స్త్రీ వాదం, మానవతావాదం, చారిత్రక దృక్పథం, మార్క్సిస్ట్ దృక్పథం, మనస్తత్వ విశ్లేషణ, అనే అధునాతన భావజాలాలతో వచ్చిన రచనలను పరిచయం చేయడం ఈ వ్యాసం యొక్క పరిధి.

3. పరిశోధనా పద్ధతి:

i. మూల గ్రంథాలను ప్రాథమిక దశలో అధ్యయనం చేయడం.

ii. ఆధునిక కాలంలో మూల విరుద్ధమైన, మూలానికి భిన్నమైన అంశాలను ప్రతిపాదిస్తూ, భిన్న దృక్పథాలలో వెలువరించిన గ్రంథాలను పరిశీలించడం.అట్టి వానిలో ప్రధానమైన గ్రంథాలను ఎంపిక చేసుకోవడం.

iii. కాల క్రమాన్ని అనుసరిస్తూ అట్టి గ్రంథాలను వరుస క్రమంలో పరిచయం చేయడం.

విశ్లేషణ:

"హితేన సహితం సాహిత్యం" అనగా సమాజానికి హితాన్ని కూర్చునది సాహిత్యమని అర్థము. వివిధ ప్రపంచ

భాషలలో సాహిత్యము అంతర్భాగము. అందునా ఇతిహాస ప్రక్రియ కొన్ని భాషలలో మాత్రమే కనబడుతుంది. అట్టి ఇతిహాస ప్రక్రియకు పట్టము కట్టిన భాషలలో సంస్కృతాంధ్రములు ముందు వరసలో ఉన్నాయి. అసలు ఈ ఇతిహాస శబ్దాన్ని అర్థం చేసుకోవాలంటే ఇతిహాస ప్రక్రియకు మాతృక అయిన సంస్కృత సాహిత్యాన్ని పరిశీలించాలి. ప్రామాణిక సంస్కృత సాహిత్యాన్ని తెలుగువారికి అందించే ప్రయత్నం చేసిన మల్లాది సూర్యనారాయణ శాస్త్రి గారి మతాన్ని అనుసరించి సంస్కృత సాహిత్యము వైదిక సాహిత్యం, లౌకిక సాహిత్యం అని రెండు రకాలు. ఇందున వైదిక సాహిత్యమనగా వేద సంబంధమైన సాహిత్యమని అర్థము ఇందులో వేదాలు, వేదాంగాలు, బ్రాహ్మణములు, అరణ్యకములు, ఉపనిషత్తులు మొదలైనవి చేరుతాయి. ఇక లౌకిక సాహిత్యంలో ఇతిహాస, పురాణ,గద్య,చంపూ, నాటకాది ప్రక్రియలు చేరుతాయి. ఇది పరిశోధకులకు శిరోధార్యమైన విభజన. ఇట్టి విభజనను అనుసరించి ఇతిహాస ప్రక్రియ లౌకిక సాహిత్యానికి చెందుతుంది.

కానీ ఐతిహాసికులు అభిప్రాయం ప్రకారం గీర్వాణ సాహిత్యము ఆర్షము, లౌకికము అని రెండు రకాలు. స్థూలంగా వీటిని పరిశీలిస్తే ఉపదేశము సూటిగా కలిగినవి ఆర్షములు, ఉపదేశము స్ఫురణ మాత్రంగా కలవి లౌకికములని తెలుస్తుంది. ఆర్షశబ్దాన్ని విచారించగా ఆర్షమనగా ఋషి సంబంధమైనదని అర్థము. కవిః క్రాంతదర్శి అన్న ఆర్యోక్తిని అనుసరించి దివ్య దృష్టి కలిగిన వాడే కవి అని గ్రహించవలసి ఉన్నది. అట్టి దివ్య దృష్టి కలిగిన వాడు ఋషి అవుతాడు. అట్టి ఋషులు వేదాన్ని దర్శించి, తమ జ్ఞానదృష్టి చేత మానవాళి హితము గూర్చి రచనలు చేశారు. అట్టి ఋషులు చేసిన రచనలే ఆర్ష వాఙ్మయము క్రిందికి వస్తాయి.

ఈ విధంగా మల్లాది సూర్యనారాయణ శాస్త్రి గారి వైదిక సాహిత్యములోని శాఖలతోపాటు ఇతిహాస పురాణములు సైతము ఆర్ష వాఙ్మయము క్రిందికే వస్తాయి. దీనికి కారణము ఇతిహాస పురాణములను సైతం రచించిన వారు ఋషులేయగుట. ఇతిహాసమునకు ఇతిహ ఆస్తినే అస్తేతి ఇతిహాసః అనే వ్యుత్పత్తి కలదు. దీనిని అనుసరించి ఇతిహాసము అనగా పూర్వమిట్లు జరిగినదని పరంపరాగతంగా చెప్పబడినదని అర్థము. భారతీయ సాహిత్యమున ఇతిహాసములుగా రామాయణ భారతాలు విరాజిల్లుతున్నాయి. వేదశక్తి సమన్వితమైన రామాయణము ప్రథమేతిహాసం. దీనిని ప్రాచేతసులు వారు రచించారు. ఇందులో సూర్యవంశజుల చరిత్ర చెప్పబడింది. ప్రత్యేకించి ఇది శ్రీరామచంద్రుని ప్రాశస్త్యాన్ని, గాథను తెలుపునది కావున రామాయణమనే సార్థక నామధేయముతో జగత్ప్రసిద్ధమైనది. ఇక వేదప్రతిపాదకమైన భారతము మహేతిహాసం. దీనిని కృష్ణద్వైపాయనులవారు రచించారు. ఇది సోమవంశజుల చరిత్రను తెలియజేస్తుంది. ఇందులో కురుపాండవుల చరిత్ర విశేషించి చెప్పబడింది. ఈ రెండు ఇతిహాసములు ఉపదేశ ప్రధానములు. పైగా యథార్థముగా జరిగిన గాథలు. మానవుని సదాచారునిగా, ధార్మికునిగా తీర్చిదిద్ది మనిషిని మనీషిగా చేయగలిగిన ఉత్తమ గ్రంథములు, వివిధ శాస్త్రములకు ఆలవాలములు. మోక్ష ప్రదములు. ఇందులో గల ఒక్కో పాత్ర ఒక్కో పాఠాన్ని నేర్పిస్తుంది. ఒక్కో సంఘటన మానవ జీవితాన్ని ప్రతిబింబిస్తూ విలువైన సందేశాలనిస్తుంది. కావున అట్టి ఇతిహాసములను నిష్పక్షపాత ధోరణితో పరిశీలించి తరించవలసియున్నది. కానీ ఆధునిక యుగంలో పాశ్చాత్య ప్రభావము చేత, సంస్కరణోద్యమ ప్రభావము చేత విభిన్న రకములైనటువంటి ధోరణులు సాహిత్యములో కూడా ప్రవేశించాయి. అట్టి ధోరణులను ఆలంబనగా చేసుకుని ఎందరో కవులు, రచయితలు, నాటకకర్తలు, పరిశోధకులు, విమర్శకులు ఇతిహాసాలలోని కొన్ని పాత్రలను ఘట్టాలను మార్చి రచించడం జరిగింది. అట్టి భిన్న దృక్పథాలతో వచ్చిన ఇతిహాస సంబంధ రచనలను పరిశీలిద్దాం.

కురుక్షేత్ర సంగ్రామం (1925):

తెలుగునాట హేతువాద దృక్పథానికి ఆద్యులైన త్రిపురనేని రామస్వామి చౌదరి గారు రచించిన నాటకమిది. వీరి మతాన్ననుసరించి ధార్తరాష్ట్రులు ధార్మికులు కాగా, పాండవులు అనాచారులు. ఈ నాటకములో పాండవులు అధర్మంగా పంచగ్రామసంధిని కోరారని, పాండవులు రాజ్యానికి అనధికారులని, కుంతీ ద్రౌపదుల పాతివ్రత్యాన్ని హేళన చేస్తూ, ద్రోణాదులను అధర్మంగా పాండవులు మట్టుబెట్టారనే విషయాలను ప్రతిపాదించారు. ఈ రచన రారాజు దుర్యోధనునికి విధేయమని గుర్తించాల్సి ఉంది. ఈ నాటకము నాడొక సంచలనం. తరువాతి కాలంలో ఈ నాటకం ఆధారంగా చలనచిత్రములు వెలువడుట గమనార్హం. అట్టి చలనచిత్రములకు ప్రేక్షకులు నీరాజనం పట్టుట విడ్డూరం.

మహాభారత చరిత్రము (1928):

1921న ఇతిహాసాలను చారిత్రాత్మకంగా పరిశీలించాల్సిన ఆవశ్యకత ఉందని కట్టమంచి రామలింగా రెడ్డి గారు మద్రాసులోని గోఖలే హాలులో ప్రసంగించారు. వీరి అభిప్రాయాన్ని అనుసరించి ఎందరో విమర్శకులు, పండితులు ఆ బాటలో నడిచారు. వారిలో పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి గారు ప్రథమాగ్రగణ్యులు. వీరు భారతేతిహాసాన్ని చారిత్రక కోణంలో దర్శించి ఆవిష్కరింప జేసే ప్రయత్నం చేశారు. వీరి కృషి, కార్యదీక్ష అనితర సాధ్యములు. మహాభారతకాలీన భరతవర్షపు పటాన్ని రూపొందించిన ఘనులు. ఈ గ్రంథములో పాండవులు భారతీయులు కారని, టిబెట్ దేశీయులని, ద్రౌపది పంచ భర్తృక కాదని అర్జునుని పత్నిని, ఆమె అయోనిజ కాదని తీర్మానం చేసారు. కౌరవులలో అసూయ ద్వేషాలు మూర్తిభవించిన మాట నిజమే! కానీ అందుకు కారణం పాండవులు, ద్రౌపది, కృష్ణులు రెచ్చగొట్టే చర్యలేనని అభిప్రాయపడ్డారు. సర్పయాగం అంటే పాములను చంపడం కాదని నాగజాతి ప్రజల నిర్మూలనని సిద్ధాంతీకరించారు. ఇలా అనేకాంశాలను ప్రతిపాదించి భారతమున గల ధర్మసూక్ష్మాలను చారిత్రక కోణంలో దర్శించి అవి అనాచారాలని తీర్మానం చేశారు. ఐతిహాసిక దృష్టితో కాక పరిశోధనాత్మక దృష్టితో ఈ గ్రంథాన్ని దర్శించిన ఇందులో శాస్త్రి గారి పరిశోధనా పటిమ మనముందు సాక్షాత్కరిస్తుంది.

రామాయణ రహస్యాలు (1968) :

వివిధ రామాయణాలలో ఉన్న వైవిధ్యాన్ని ఆలంబనగా చేసుకుని ఆచార్య కొత్త సత్యనారాయణ చౌదరి గారు ఈ గ్రంథాన్ని వెలువరించారు. రామాయణమందలి ప్రక్షిప్తాలను గమనించి మూల రామాయణంలోని శ్లోకాలకు కొత్త అర్థాలను చెబుతూ రామరాజ్యాన్ని, రామాయణ పాత్రలను విమర్శిస్తూ అందులో లోటుపాట్లున్నవని వేలెత్తి చూపుతూ రామాయణము పైన ఈ సమీక్షా గ్రంథాన్ని రచించారు.

రామాయణ విషవృక్షం (1974) :

మార్క్సిస్ట్ భావజాలంతో రామాయణాన్ని విమూత్న కోణంలో ఆవిష్కరించిన వారు రంగనాయకమ్మ గారు. అట్టి కోవకు చెందినదే రామాయణ విషవృక్షం. రామాయణము భూస్వామ్య విధానాలకు పెద్దపీట వేసిందనే అభిప్రాయాన్ని వెలిబుచ్చుతూ ఫ్యూడలిస్టు భావజాలాన్ని, అణగారిన వర్గాల వారికి జరుగుతున్న అన్యాయాలను రామాయణ పాత్రలకు ఆపాదించారు. మార్క్సిస్ట్ దృక్పథంలో ఈ రచన గొప్పదైనను రామాయణముపై విషము చిమ్మినదనుటలో సంశయము లేదు.

సీత జోస్యం (1979) :

ఇతిహాసాలన్నీ కల్పితగాథలేనని, చారిత్రక ప్రాధాన్యం లేనివని హేతుబద్ధమైన వివరణలతో రచనలు చేసిన వారు నార్ల వెంకటేశ్వరరావు గారు. వీరి రచనల్లో పేరెన్నిక గలది సీత జోస్యం. ఈ గ్రంథ పూర్వభాగములో పీఠిక, ఉత్తర భాగములో నాటకములు గలవు. ఇందున రామాయణ గాథ చారిత్రకత, రాముడు వనవాసం చేసిన ప్రాంతము,

రాక్షసులు ప్రస్తావన, వారి స్థితిగతులు, ఋషులు ప్రసక్తి – వారు యజ్ఞయాగాది క్రతువులు చేయడానికి జనస్థానాన్ని ఎన్నుకోవడానికి కారణం, రామాయణ కాలమున ఎవరి ఆయుధములెట్టివనే ప్రధానమైన ప్రశ్నలను లేవదీస్తూ రామాయణంలోని పాత్రలను విమర్శించే ప్రయత్నంచేసారు ఇందులో భాగంగా దశరథునికి భార్యలెందరు? శ్రీరామ చంద్రుడు ఏకపత్ని వ్రతుడేన? లక్ష్మణుడు వివాహితుడా, అవివాహితుడా? సీతాపహరణం ఏ పరిస్థితుల్లో జరిగింది? లంకాదహన వృత్తాంతం విశ్వసించదగినదా? రామాయణ కాలీన సాంఘికాచారములేమిటి ? నాటి కాలములో ఆహార నియమాలేమిటి? సీతారామ లక్ష్మణులు మద్య మాంసములు ముట్టనివారా? అని ప్రశ్నిస్తూ సంస్కృత రామాయణము నుండే వాటికి సమాధానాలను రాబడుతూ ఈ గ్రంథాన్ని కూర్చారు. ఈ ప్రశ్నలన్నీ సామాన్య పాఠకుల మదిలో మెదులునవే కావున ఈ గ్రంథము పాఠకులలో మిక్కిలి పఠనాభిలాషను కలిగించి జనాదరణను చూరగొన్నది. కానీ నార్లవారు ఆ ప్రశ్నలకు సహేతుకమైన వివరణలివ్వక నాస్తిక దృక్పథంతో, ఆధునిక సమాజపు దృష్టితో నాటి కాలాన్ని అంచనావేసి రామాయణ మహత్వాన్ని దెబ్బతీసారు.

ద్రౌపది (2009) :

మనస్తత్వ విశ్లేషణ నేపథ్యంలో భారతేతిహాసము పై వచ్చిన తొలి విమర్శనాత్మక గ్రంథమే ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ గారు రచించిన ద్రౌపది నవల. రచనాపరంగా యార్లగడ్డ వారి సృజనాత్మకతకు నిలువుటద్దము. కానీ ఆధునిక స్త్రీ భావాలను పురాణపాత్ర అయిన ద్రౌపదిలో చొప్పించి ద్రౌపది పాత్రను దిగజార్చినారు. అట్లే పాండవాదుల పాత్రలలో సైతం ఆధునిక మానవుల మనస్తత్వమే గోచరిస్తుంది. తమ సృజనాత్మకతను వెలువరించి కీర్తి గడించిన యార్లగడ్డ వారు ఈ నవలలో ఉపదేశపు స్థాయిని మరిచారు.

వ్యవస్థను కాపాడిన రాముడు (2005) :

భారత పురాణ సాహిత్యమంతా అధికారం కోసం, భూమికోసం, చదువు కోసం జరిగిన పోరాటాల చరిత్రేనంటూ డా. బి. విజయభారతి గారు చేసిన రచనిది. సమాజాన్ని వర్గాలుగా విభజించి అందున కొన్ని వర్గాలను ఆధిపత్య వర్గాలుగా , కొన్ని వర్గాలను సేవక వర్గాలుగా స్థిరపరిచే ప్రయత్నంలో భాగంగా మను ధర్మశాస్త్రాన్ని లక్ష్యంగా చేసుకుని రామాయణ రచన జరిగిందనే సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ అట్టి ధర్మాన్ని నిలబెట్టడానికే రాముడు కట్టుబడ్డాడని ఈ రచనలో చూపారు. ఇట్టి వర్గవైషమ్యాలను దృష్టిలో ఉంచుకుని చేసిన రచనిది.

పౌలస్త్య హృదయం దాశరథి విజయం (2011):

ఆచార్య చతుర్ సేన్ శాస్త్రి గారు రచించిన వయం రక్షామః అనే హిందీ నవలను శోభిరాల బాల త్రిపుర సుందరి గారు తెలుగున పౌలస్త్య హృదయం దాశరథి విజయం పేరిట అనువదించారు. ఇందున రామాయణకాలీన భౌగోళిక స్వరూపమును చక్కగా వర్ణించారు. అట్లే భరతఖండమున నరజాతిలోనే దేవ, దానవ, యక్ష, రాక్షస, కిన్నెర, నాగ, గంధర్వాది జాతులున్నాయని ప్రతిపాదించి రావణుడు రక్షా సంస్కృతికి చెందినవాడని సిద్ధాంతీకరించారు. అట్టి జాతుల మధ్య వైరాన్ని, సఖ్యాన్ని, నాటి రాజకీయ, సామాజిక పరిస్థితులను, సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే విధముగా ఈ నవల రచించబడింది. ఇందున జాతుల మధ్య వైరమేర్పడి ఒక జాతి కనుమరుగైన తీరును సప్రమాణికంగా ఆవిష్కరించిన తీరును గమనించవచ్చు. ఈ రచనలో రావణౌన్నత్యము ప్రద్యోతమగును.

విముక్త (2015) :

ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా గారి కథా సంకలనమే విముక్త. ఇందులో సీత, ఊర్మిళ, అహల్య, రేణుక, శూర్పణఖ పాత్రలను వినూత్నమైన రీతిలో తీర్చి దిద్దుతూ స్త్రీ సాధికారతను బుజువు చేసే విధంగా స్త్రీవాద

ధోరణిలో ఈ రచన సాగింది. ఇందున పెక్కు కల్పితములు గలవు. స్త్రీవాద ధోరణిలో ఈ రచన పరమోత్కృష్టమైనదైనను రామాయణ ఇతిహాసముతో విభేదించినదనుట సత్యము.

ఇవిగాక కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి గారు రచించిన సూత పురాణము, శంబుక వధ, బోయి భీమన్న గారు రచించిన రాగ వాశిష్టము, నార్ల వెంకటేశ్వరరావు గారు రచించిన జాబాలి. నరకంలో హరిశ్చంద్రుడు, పంచరాత్రం, ముద్దు కృష్ణ గారి అశోకం, చలం గారి సీత అగ్నిప్రవేశం, బి. విజయభారతి గారు రచించిన సత్య హరిశ్చంద్రుడు, దశావతారాలు, షట్చక్రవర్తులు, నరమేధాలు నియోగాలు, రంగనాయకమ్మ గారు రచించిన ఇదండీ మహాభారతం మొదలైన రచనలెన్నో వాస్తవిక ఇతిహాసాల మహత్వాన్ని దెబ్బతీసాయి. వారి వారి భావజాలాలపరంగా ఆయా రచనలు ఉత్తమోత్తమమైనవే అయినా రామాయణ, భారతాలపై మాత్రం దాడి చేశాయనుట సత్యదూరము కాదు. వీరు కాక చర్ల నారాయణ శాస్త్రి గారు రచించిన భారత మీమాంస, సురవరం ప్రతాపరెడ్డి గారి రామాయణ విశేషములు, ఆరుద్ర గారి రాముడికి సీత ఏమవుతుంది అనే రచనలు రామాయణము పైన వచ్చిన పరిశోధనా గ్రంథములుగా అగుపిస్తాయి. ఈ రచనలు పరిశోధకులకు రుచించినను సామాన్య పాఠకులకు ఇతిహాసములు కల్పితములనే భావన కలిగించేలా ఉన్నాయనుట వాస్తవం. ఇక ఇటీవల కాలంలో వరిగొండ కాంతారావు గారు రచించిన ఇట్లు సుత అనే వచనేతిహాస కావ్యము కురుక్షేత్ర రహిత మహాభారత కథ. ఇది వీరి అపూర్వ సృజనాత్మక శక్తికి తార్కాణం. ఇది కల్పితమే అయినా పాత్ర చిత్రణలో మూలముతో విభేదించినది. ఇక కల్లూరి భాస్కరం గారు రచించిన మంత్రకవాటం తెరిస్తే మహాభారతం మన చరిత్రే అనునది వీరి బహుముఖ ప్రజ్ఞకు నిదర్శనం. విజ్ఞాన శాస్త్రాలను, సామాజిక పరిణామక్రమాన్ని, అపూర్వమైన భౌగోళిక విజ్ఞానాన్ని భారతానికి సమన్వయపరుస్తూ సాగిన ఈ రచన వలన వారి ప్రతిభాపాఠవములు భాసించాయి కానీ భారతేతిహాస విలువలు దెబ్బతిన్నాయి. అట్లే భిన్న భాషల నుండి తెలుగులోకి అనువదించబడ్డ ఏకే రామానుజన్ రాసిన మూడు వందల రామాయణాలు ఐదు ఉదాహరణలు అనే విప్లవాత్మక వ్యాసం, ఆనంద్ నీలకంఠన్ రచించిన అసుర అనే నవల తెలుగులో అనువాదమైనవి. ఇందులో రావణుని పరాజితునిగా చూపి అతని పట్ల మిక్కిలి కారుణ్యమేర్పడునట్లు రచన చేసిరి. ఇలా భిన్న భావ జాలాలతో వచ్చిన అనువాద రచనలు తెలుగులో కోకొల్లలు.

ఉపసంహారం :

ఇలా హేతువాదం, నాస్తిక వాదం, దళిత వాదం, స్త్రీ వాదం, మానవతావాదం, చారిత్రక దృక్పథం, మార్క్సిస్ట్ దృక్పథం, మనస్తత్వ విశ్లేషణ, అనే అధునాతన భావ జాలాలతో ఇట్టి రచయితలందరూ సాహిత్యరంగంలో తమదైన స్థానాన్ని పదిల పరుచుకున్నారు. తమ ప్రజ్ఞను చాటారు. కానీ అట్టి రచనల వల్ల పాఠకులలో భిన్నమైన ఆలోచన విధానము పెంపొందుతుంది కానీ నైతిక విలువలు, ధార్మిక భావజాలం అనే అంశాలు కొరవడతాయి. అన్నదమ్ములపై ఈర్ష్య అసూయలతో రగిలిపోయి స్త్రీలను అవమానించిన రారాజును నాయకునిగా చూపి సమాజానికి ఏ హితాన్ని కలిగించవచ్చు. స్త్రీలను చెరబట్టిన రావణుని రాజతంత్రమెరిగిన వాడని చూపి ఏ సుగుణాలను నేర్చుకోమని యువతకు చెప్పవచ్చు. ఇతిహాసములలోని ధర్మ సూక్ష్మాలను సక్రమంగా అర్థం చేసుకోక ఇతిహాసాలపై విపరీత వ్యాఖ్యలు చేస్తూ యువతలో ఎటువంటి నైతిక విలువలను పెంపొందించగలరు. ఇట్టి అంశములను బేరీజు వేసుకొని ఇటువంటి అధునాతన భావజాలాలను విజ్ఞాన మాత్రంగా స్వీకరించి మూలానికి ప్రాధాన్యం ఇవ్వవలసి ఉంది.

మున్ను మూల గ్రంథలను అధ్యయనము చేసిన పిమ్మట కవుల లౌకికరచనలను చదివి వాటిని అంచనా వేసే యుక్తాయుక్త విచక్షణను పాఠకులు కలిగి ఉండేవారు.

కానీ నేడు ఆధునిక కాలంలో పుస్తక పఠనము కావిస్తున్న వారి సంఖ్య తగ్గినది. అట్టి వారు యుక్తాయుక్త విచక్షణ లేక మూల గ్రంథాలను వదిలి ఈ గ్రంథాలను ప్రామాణికములని భావించిన, ఇట్టి గ్రంథములలోని అంశములే సమాజమున విస్తరించిన సమాజానికి కలుగునది ఉపద్రవమే! అదేవిధంగా అనిన ఉపదేశ ప్రాధాన్యము కలిగిన ఇతిహాసములను నేటి ఆధునిక దృష్టితో చూచి, ఇతిహాసములను చులకన చేసి అందలి ధర్మ ప్రబోధాన్ని పెడచెవిన పెట్టడం వల్ల ఉచితమైన సంస్కార బలము నశిస్తుంది. దీనివలన మానవ సంబంధాలు దెబ్బతినడమే గాక ఆరోగ్యకరమైన సమాజము నశిస్తుంది. అందువలన ఇటువంటి విమర్శనా గ్రంథములకు ఖండన గ్రంథములు రావలసిన ఆవశ్యకత ఉన్నది. తొలినాళ్లలో శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారు, వారణాసి సుబ్రహ్మణ్య శాస్త్రి గారు శాస్త్రీయంగా ఇట్టి విమర్శనా గ్రంథములను ఖండించి తమ రచనలను వెలువరించారు. కానీ నేటి ఆధునిక కాలమున ఇట్టి విష భావజాలాలను ఖండించగలవారు కనబడుట లేదు. పరిశోధకులందరూ జానపద, గిరిజన సాహిత్యాల వెంటపడటము. ఇతిహాసాల పైన నేటికే పెక్కు పరిశోధనలు వచ్చినవని మిన్నకుండడం వల్ల ఈ ఉపద్రవాలు తలెత్తుతున్నాయి. ఇతిహాసముల అధ్యయనము అనునది ఒక తరానికి, ఒక వయసు వారికి సంబంధించినది కాదు. ఇది సార్వకాలీనము, సార్వజనీనము కావున కాలానుగుణంగా ఇతిహాసాలను యువతకు అర్థమయ్యే రీతిలో ప్రామాణికంగా అందించి ఇట్టి వినూత్న భావజాలాలను ఖండించవలసిన ఆవశ్యకత ఆచార్యుల పైన, అధ్యాపకుల పైన, పరిశోధకుల పైన ఉన్నది.

సంప్రదింపు గ్రంథములు:

1. ఇతిహాసాలు పరిశోధన (పరిశోధన వ్యాసం) – శలాక రఘునాథ శర్మ గారు
2. మహాభారత చరిత్రము – పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి గారు
3. వాల్మీకి రామాయణం
4. వ్యాస భారతం
5. సంస్కృత వాఙ్మయ చరిత్ర – మల్లాది సూర్యనారాయణ శాస్త్రి గారు

పల్లెనీ, ప్రకృతినీ సత్కరించిన కవి గోరటి వెంకన్న

డా॥ చింతల రాకేశ్ భవాని, సహాయ ఆచార్యులు, తెలుగు శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్‌నగర్
సెల్: 9246607551

తెలుగు కవిత్వ ప్రపంచంలో గోరటి వెంకన్నది ప్రత్యేకమైన కంఠస్వరం. దాదాపు మూడు దశాబ్దాలుగా తన కవిత్వంతో తెలుగు వారందరికీ కవిత్వపు మహత్తును తెలియజెబుతున్నారు. కవిత్వం పండితులకి మాత్రమే పరిమితం కాదని అతని కవిత్వం నిరూపించింది. శిష్టవర్గాల వారిని అలరించే మాధ్యమం మాత్రమే కాదని తేల్చి చెప్పింది. ఎవరికోసం రాస్తున్నామో వారి భాషలో చెబితే జన బాహుళ్యంలోకి వెళుతుందని గోరటి వెంకన్న కవిత్వం నిరూపించింది. కనుకనే దేశదేశాల్లోని తెలుగువారిని కదిలించింది అతని కవిత. తెలుగు నేలమీద పల్లె పల్లెను తాకింది. పల్లె ప్రజల గొంతుకను వినిపించింది. పల్లెలు మారుతున్న తీరును చిత్రించింది. పల్లె కన్నీరు పెడుతున్న దైన్యాన్ని వ్యక్తం చేసింది. వాగులు ఎండిపోతున్న తీరును దృశ్యమానం చేసింది. పల్లెల సౌందర్యాన్ని, పల్లె ప్రజల అనురాగాన్ని, పల్లెని సజీవంగా ఉంచే ప్రాకృతిక వైవిధ్యాన్ని తనదైన శైలిలో కవిత్వం చేసిన గోరటి వెంకన్న మన కాలపు మేటి కవి.

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన 'వల్లంకి తాళం' గోరటి వెంకన్న కవితా ప్రతిభను అత్యున్నతంగా చాటింది. పదేళ్ళ కిందట వచ్చిన 'అలసెంద్రవంక'లో వెంకన్న విరాట్ స్వరూపం చూసి కవితా ప్రపంచం విస్మయానికి లోనయింది. వెంకన్న తొలి నుంచీ రాస్తున్నది కవిత్వమే. దానిని గేయం, పాట, జానపదం అనే పేర్లతో విభజించి చూపనక్కరలేదు. గోరటి వెంకన్నని కొందరు పాటగాడు, మరికొందరు మహాగాయాకుడు, వాగ్గేయకారుడు అని అంటారు. కానీ గోరటి వెంకన్న అచ్చమైన కవి. అతని కవిత్వాన్ని ఆలపించేవారు ఆలపిస్తారు. తను కూడా స్వయంగా గానం చేస్తాడు. అంతమాత్రాన అది గేయంగా పరిగణించడానికి వీల్లేదు. జవజవలాడే కవిత్వంగానే చూడాలి.

శ్రీశ్రీ 'మహాప్రస్థానం'లోని చాలా కవితల్ని ఇవాళ గేయాలుగా పాడుకుంటున్నారు. సినిమాల్లో పాటలుగా కూడా వచ్చాయి. వాటిలోని ఊపు చలన శక్తి, ఊగించే శాసించే గుణం వల్ల కవితా పాఠకుల నాలుకల మీద శ్రీశ్రీ రాసిన మహాప్రస్థానం కవితలు నిలిచిపోయాయి. అంతమాత్రాన శ్రీశ్రీని గేయకవి అనో, అతని కవితలను గేయాల కింద జమ కట్టడం లేదు. అలాగే శ్రీశ్రీని కవి గాయాకుడు అనో, వాగ్గేయకారుడనో అనడం లేదు. శ్రీశ్రీని కవిగా, మహాకవిగా పిలుచుకుంటున్నాం. అందుకని కవిత్వంలో లయ ఉన్నంత మాత్రాన గేయం కాదు. కనుకనే శ్రీశ్రీ 'మహాప్రస్థానం' ను కవితా సంపుటిగా చెప్పుకుంటున్నాం. గేయాల సామాహారం అని చెప్పడం లేదు. ఇదే సూత్రం గోరటి వెంకన్న కవిత్వానికీ వర్తిస్తుంది. గోరటి వెంకన్న పాటలు కూడా రాశాడు. సినిమాలకు పాటలే రాశాడు. కానీ కవిగా బలమైన కవిత్వం రాశాడు. అందుకే అతడు కవి. స్వయంగా గోరటి వెంకన్నకు సైతం తనని కవిగా గుర్తించటమే ఇష్టం. "కవి, గాయకులు, గాయక కవులు అనేవి ఉత్త మాటలు. కవి అనడమే ఇష్టం. నేను స్వతహాగా కవిని. పాడటం, ప్రదర్శనలివ్వటమన్నది నా వ్యావృత్తిలో భాగం" (గోరటి వెంకన్న తో పాలపిట్ట ఇంటర్వ్యూ, ఏప్రిల్ 200) అని చెప్పారాయన. అంతేగాక గోరటి వెంకన్న వెలువరించిన పుస్తకాలు 'ఏకునాదం మోత, రేలపూతలు, అలసెంద్రవంక, వల్లంకితాళం' వంటి పుస్తకాలని వరుసపెట్టి చదివితే అన్నిటా కవిత్వం వెల్లువెత్తి పొంగడం కనిపిస్తుంది.

కవి ఊహాశాలిత, వదచిత్రాల ప్రయోగం, భావచిత్రాల్లోని వైశిష్ట్యం కవిత్వ పాఠకులను విస్మయానికి లోను చేస్తుంది. మనం నిత్యం చూస్తూ కూడా అంతగా పట్టించుకోని అంశాల వెనుక ఉన్న లోతునీ, విస్తృతినీ గోరటి వెంకన్న దర్శించారు. ఈ క్రమంలోనే అతని కవితాభివ్యక్తి పదునెక్కుతూ వచ్చింది. కవితాశిల్పం నరికొత్తగా అభివ్యక్తమవుతూ మనకు నరికొత్త పఠనానుభవాన్ని అందించింది. 'వల్లంకితాళం' లో అక్షరాల, పదాల మధ్య దోబూచులాడే అనుపమానమైన సౌందర్యమే ఇందుకు దాఖలా.

ప్రకృతి - పల్లె

32 కవితలున్న 'వల్లంకితాళం' కు భూమిక పల్లె జీవనాడి. పల్లెని బతికించే ప్రకృతి, ప్రకృతిని అంటిపెట్టుకుని ఉండే మానవుని జీవవైవిధ్యం ఈ కవిత్వానికి ప్రేరణ. పల్లెల సౌందర్యాన్ని, మట్టిని నమ్ముకున్న వారి శ్రమైక జీవన సంస్కృతిని పల్లీయుల భాషలో చెప్పాడు వెంకన్న. వ్యవసాయమే జీవనాధారంగా అత్యధికులు బతుకు సాగిస్తున్నది వాస్తవం. కనుక పల్లెలు పచ్చగా ఉండాలి. ప్రకృతి క్షేమంగా మనుగడ సాగించాలి. ప్రకృతి-పర్యావరణం పచ్చగా మిగలాలి. ఈ పచ్చదనం మనిషికి మాత్రమే పరిమితమైంది కాదు. ఈ నేలమీద సకల జీవరాశికి ప్రాణప్రదం. అందుకే భౌగోళిక వైవిధ్యాన్ని, ఈ నేలమీద తారాడే జీవ వైవిధ్యాన్ని 'వల్లంకితాళం' లో దర్శింప చేసాడు వెంకన్న. 'వల్లంకితాళం' లోని ఈ కింది కవితా పాదాలు చూడండి:

"అందాల తనువెల్ల వంపుకున్న అడవి
అలరించి తలపించె ఆకు పచ్చని కడలి
నిడివన్నదె లేని గగనం కింద
పారుటాకుల వలువ పంచుతున్నది సలువ
.....
కావిరంగుతోని కనిపించె కొండలు
పైనవోయె దూది పడవల విడుదులు
గిరిమంద పొదుగుల జారె సెలయేరులు
శిలల నునుపగ తొలిసె అలల ఉలిమొనలు"

ఈ విధంగా ప్రకృతిలో అంతర్భాగమై వేలాది సంవత్సరాలుగా ఉనికిలో ఉన్న కొండలు, అడవులు, నదులు, సెలయేర్ల గురించి ఇవాళ ఈ కవి ఎందుకు ప్రత్యేకించి చెప్పాల్సి వచ్చిందో ఆలోచించాలి. అడవుల్లో బతికే పిట్టలు, తుమ్మెదలు, పులులు, పాములు, గొర్రెలు, నెమళ్ళు, కీటకాలు, చెట్లు అనేకం ఒకచోట జీవిస్తున్నాయి. వీళ్ళతో పాటు మనుషులూ అడవులనీ, కొండలనీ, నదులనీ అంటిపెట్టుకుని వాటి నడుమనే జీవిస్తున్నారు అనేకులు... అందుకే

"వెదురు తడకలతోని ఎంతందమీ ఇండ్లు
ఆవుపేడతోని అలికిన వాకిల్లు
చెంచులా నవ్వులే చెట్లకు పువ్వులు

రాలె పుప్పొడి వాన అడివి పూల వీణ" అని అడవుల్లో జీవించే చెంచుల, ఇతర ఆదివాసుల ప్రస్తావన, వారి జీవనశైలిని స్ఫురింపజేస్తాడు. ఇవాళ ప్రత్యేకించి వెంకన్న కవిత్వానికి ఈ అంశాలన్ని వస్తువులు కావడానికి పాలకుల విధానాలు కారణం. అభివృద్ధి కోసమంటూ నల్లమల అడవుల్లో యురేనియం తవ్వకాల ప్రతిపాదనల నేపధ్యంలో కవి ఈవిధంగా స్పందించారు. వేలాది సంవత్సరాలుగా సకల జీవులని బతికించే అడవుల్ని, కొండల్ని, నదుల్ని నాశనం చేసే దుర్మార్గంపై కవి ప్రతీకాత్మక నిరసన ఇది. మనం నివసించే నేల, మన పరిసరాలు, మన చుట్టూ ఉన్న ప్రాకృతిక వాతావరణం ఔన్నత్యాన్ని తన కవిత్వం ద్వారా గుర్తు చేస్తున్నారు. అడవులను, పల్లెలను, చెంచులను, నదులను కాపాడుకోవడానికి మనం సమాయత్తం కావాల్సిన అవసరాన్ని చెబుతున్నాడు వెంకన్న. అయినప్పటికీ ప్రజల ఆందోళనల్ని ఉక్కుపాదంతో అణిచివేసి, తాము అనుకున్నది చేయడానికి వెనుకాడని పాలకులు, ప్రభుత్వాలు ఉన్నాయి ఇవాళ. అందువల్లనే 'శివుడా...' అనే కవితలో

"శివుడా ఇగ నిన్ను నీవే కాపాడుకో
శివుడా నీ అడవి పుడమిపై నేలుకో" అంటాడు వెంకన్న.

అక్క మహాదేవి ఆగిన గుహలంట
అల్లమాప్రభు ఈడ పద్యమల్లినడంట
ఆది గురువాగిన హాటకేశ్వరం కోన
తపముకే గంగమ్మ తరలి వచ్చిందంట
యురేనియం వల్ల తిరిగి పోతాదంట'' అని హెచ్చరిస్తున్నాడు కవి. ఈవిధంగా ఈ కవితలో మరింత స్పష్టంగా అడవులు, అడవుల్ని అంటిపెట్టుకొని వుండిన చారిత్రక వారసత్వం ధ్వంసం కాబోతున్న వాస్తవాన్ని చెబుతున్నాడు కవి. ఈవిధంగా మానవ మనుగడకు కీలకమైన ప్రకృతి సంపదలు ధ్వంసం చేయడాన్ని ప్రశ్నించడం ఈ కవిత్వం విశిష్టత.

ఉత్తరాంధ్ర 'సిగమొగ్గ'

ప్రాంత రీత్యా తెలంగాణ నుంచి వచ్చిన కవి గోరటి వెంకన్న. కానీ అతని దృష్టి విశ్వజనీనమైంది. అందువల్లనే ఉత్తరాంధ్ర 'సిగమొగ్గ'గా సంభావిస్తూ ఆ ప్రాంత నేల విశిష్టతనీ, ప్రకృతి ప్రసాదించిన సంపదల గొప్పతనాన్ని ఈ కవితలో చెప్పారు.

"నాగావాళి వంశధార చంపావతి
గీస్తని తాండవ పంపశారద నదుల
పొంగేటి నవ్వుల గంగ మాయమ్మో
నింగి సాగర తీర అందమోయమ్మ"
....
బొర్రగుహల వింత ఇల పాలపుంత
దక్షిణాదిలోనే ఎత్తయిన కొండ మహేంద్రగిరి
తరగని ఖనిజాల సిరుల పూదండ
తెలుగుతల్లి నేల ఉత్తర వాకిలి
పంపాతీరంబు అన్నవర ద్వారంబు'' అంటారు.

ఈవిధంగా ఉత్తరాంధ్ర నిసర్గ సౌందర్యంలోని దీప్తిని మన కళ్ళముందు అతి సుందరంగా దర్శింపచేయడం వెంకన్న కవిత్వ విశిష్టత.

ఇదే కవితలో ఉత్తరాంధ్ర నేల ఖ్యాతిని చాటిన గురజాడ, గిడుగు, శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, చాసో, కోడి రామ్మూర్తి, కారా, రవిశాస్త్రి, వంగపండు, గాన గంధర్వుడు ఘంటసాల, హరికథా పితామహుడు ఆదిభట్ల, వయొలిన్ విద్వాంసుడు ద్వారము, బొబ్బిలి వీణ, గానకోకిల సుశీల వంటి వారిని గుర్తు చేసుకుంటూ ఉత్తరాంధ్ర నేలకు నీరాజనం పట్టడం వెంకన్నలోని విశాల స్వభావాన్ని చాటుతుంది.

అభివృద్ధి పేరిట ఉత్తరాంధ్రలో నదుల్ని, కొండల్ని ఛిద్రం చేసే పన్నాగాల, పథకాల నేపథ్యంలోనే ఆ ప్రాంత విశిష్టతను గుర్తుచేస్తూ గోరటి వెంకన్న రాసిన 'సిగమొగ్గ' విలక్షణమైనది. పుట్టింది ఎక్కడైనా కవి దృష్టి వైశాల్యానికి ఎల్లలు లేవని గోరటి వెంకన్న ఈ కవిత ద్వారా మరోసారి తెలియజెప్పారు. ఇదివరలో రాయలసీమ మీద కూడా అద్భుతమైన పాట(శ్రీరాములయ్య చిత్రం కోసంరాసింది) రాసిన సంగతి ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి.

మనిషి ఎంత ఎదిగినా ప్రకృతికి దగ్గరగా జీవించడంలోనే సార్థకత ఉంటుంది, ప్రకృతిని, పర్యావరణాన్ని నాశనం చేసి మనుషులు నింపాదిగా బతకలేరు. ప్రకృతి నుంచి మన అవసరాల మేరకు తీసుకోవచ్చు. కానీ ప్రకృతి సమస్తాన్నీ దోచుకునే రీతి మానవుడి జీవనానికి చేటు తెస్తుంది. ప్రకృతిని జయించామని మనుషులు విర్ర వీగుతున్నారు. కానీ కాలం కాని కాలంలో విరుచుకుపడే తుఫానులు, సునామీలు, భుగర్భజలాలు అడుగంటిపోవడం, కొండలు కూలడం, నదులు తరగడం చూస్తున్నాం. ఇవన్నీ అభివృద్ధి పేరుతో అనుసరిస్తున్న హేతురహిత విధానాల ఫలితమన్నది నిజం. (ఈ సందర్భంగా కొన్నేళ్ళ కిందట ఉత్తరాఖండ్‌లో జరిగిన వరదల విధ్వంసం గుర్తుకు తెచ్చుకోవాలి) అందుకని ప్రకృతిలో, పల్లె వాకిళ్ళలో,

వ్యావసాయిక జీవన సంస్కృతిలో ఉండే అందచందాల్ని గురించి చాలా కవితల్లో గోరటి వెంకన్న ప్రస్తావించాడు.

ప్రకృతికి దగ్గరగా ....

'వెన్నెల' అనే కవితలో వెన్నెల ఎలా ఉందో ఇలా చెబుతున్నారు:

"గగన దేవత నుదుట విబుది ఫలమోలె గంగమ్మ సిగలోన తామర దళమోలె

ఆరండ పడవుల్ల నీరెండ పూతోలె

కోరింత పొదనాలె కొంగమ్మ రెక్కోలె

కొబ్బరాకులల్ల వెన్నెల

సిబ్బి గంజోలె రాలింది వెన్నెల" అంటాడు.

పౌర్ణమి రాబోయే రోజుల్లోని చంద్రుణ్ణి 'పిడిలేని వెండి కొడవలి వోలె నెలవంక' అనడాన్ని చూస్తే వెంకన్నలోని ఊహాశాలిత గొప్పదనం తెలుస్తుంది. అలాగే–

'తెల్ల నువ్వుల పంట వెన్నెల

తెంపి నేలపై వోసింది వెన్నెల" అనడం అపురూపం. గ్రామీణ జీవితంలో గల గాఢమైన సంబంధమే ఇలాంటి కవిత్వం వెంకన్న నుంచి వచ్చింది.

నల్లతుమ్మ చెట్లను గ్రామాల్లో చూస్తుంటాం. కాని దానిని కవితా వస్తువుగా చేసుకుని మన ఊహకందని రీతిన కవిత రాయాడం వెంకన్నకే చెల్లింది.

"లేమిగల పిల్లల కనురెప్పలకు నీవు

కానులేమడగక కాటుక రాసేవు''అనడంలో సొగసుదనం ఉంది.

'సెరువు గట్టించిన రాజెవ్వరొ కాని

తన పేరు ఇలపైన కలకాలముండుటకు

రాతిఫలకము పైన రంజిల్లె కలతోని

ఇంటి పేరుతో సహా ఇంపొంద చెక్కించె

ఆ రాతిపై నున్న రాజు పేరేమాయె

నీ తావుతో అది తుమ్మల రేవాయె" అనడం కవి నిశిత పరిశీలనను జీవన దృక్పథాన్ని తెలియజేస్తుంది. అనేక శిలాఫలకాలు తుమ్మచెట్ల పొదల పాలవడం తెలిసిందే. మనకు తెలిసినట్టే వుండి తెలియని అంశాల వెనుక ఉన్న తాత్వికత, అంతరదృష్టి వెంకన్న కవితల్లో చూసి విస్తుపోతాం.

'కానుగనీడ' 'గునుగుకొమ్మ' 'బెడలగువ్వ, కావి కోవెల, సింగిడి బాణం' వంటి కవితలు మరల మరల చదవాలని పిస్తాయి. వీటిలో మన పల్లెలు, ప్రకృతిలోని సమస్త అంశాలు మాత్రమే కాదు, మన బతుక్కి, వాటి ఉనిక్కి మధ్యన గల సంబంధాన్ని తాత్వికంగా చెప్పడం కనిపిస్తుంది. అందువల్లనే తెలుగునాట వెంకన్నతో సరిపోలిన కవి మరొకరు కనిపించరు. వస్తువుని స్వీకరించడంలో, దానిని కళాత్మక రీతిన కవితామయం చేయడంలో దేశీ మార్గాన్ని అనుసరించిన వెంకన్న తెలుగు కవిత్వానికి అలంకారం.

ప్రకృతి–పర్యావరణం–పల్లెల గురించి మాత్రమే గాక మనుషుల్ని మధ్యపెడుతున్న మార్కెట్ల దాడి గురించి 'అద్దాల అంగడి'లో ప్రస్తావించారు. వ్యవసాయాన్ని జూదంగా మార్చిన ప్రభుత్వ విధానాల డొల్లతనాన్ని 'దిగులుగూడు' కవితలో ఎత్తిచూపారు. కులదురహంకారం, మతోన్మాదం, వల్ల దాపురిస్తున్న పెను ప్రమాదాలను 'కటుకావర' కవితలో చెబుతూ–

"ఏ జ్ఞానుల బోధలచే/భరతజాతి వెలిగిందొ

ఏ చేతుల సలువ వల్ల/ధరణి మైల తొలగిందొ

సేవ మరిసె బోధ మరిసె/కావరమై పైకి ఎగిసె

కులమతాల భూతముల/పెనుమంటకు అవనిజడిసె" అంటారు. ఈ భేదాలను విడనాడటం మానవునికి శ్రేయస్కరమని ఎరుక పరుస్తారు. మనుషుల్ని వెలివేసే రీతిని నిరసిస్తూ 'వెలి గుడి' కవితలో

సాటి మనిషి వెలివేసి / వేటికంత ఎగిసేవు

నీకు నీవె ఎక్కువని/ఏల పొంగిపొయ్యేవు'' అని దురహంకారం తగదంటారు.

గాలికి పొద్దుకు గింజకు
లేని అంటు రాని అంటు

తోటి మనుషులంటుకున్న తోవకెందుకుంటది" అని మనుషుల్ని వేరు చేసే కుట్రలపై ప్రశ్నలు సంధిస్తూ చైతన్యపరచడం వెంకన్న కవితల్లోని సుగుణం.

జీవన తాత్వికత

పల్లెల్లో ఉన్నా, పట్నాల్లో ఉన్నా స్వార్థం లేకుండా బతకడం మేలయిన పని, కొడవటిగంటి కుటుంబరావు ఒక సందర్భంలో మంచితనం గురించి చెబుతూ "ఇతరులకు వీలయినంత ఎక్కువ మేలు, సాధ్యమైనంత తక్కువ కీడు (ఇది కూడా తమకు తెలియకే జరిగే హాని)" చేకూరేలా ప్రవర్తించడం మంచితనం అన్నారు. మనిషి బతుకు ఈవిధంగా ఉండాలి. ఇదే రీతిన గోరటి వెంకన్న 'వీసె గాలి' కవితలో మనుషులు ఎలా జీవించాలో ప్రతీకాత్మకంగా చెప్పడం విశేషం.

'నాదానుకునే భావం/నరునికి పెనుభారం
స్వేచ్ఛగ విహరించె / సీతాకోకచిలుకను

పూతావి బంధించిన/అది నరకమె యోచింపగ" అంటారు వెంకన్న. కనుక ఈ ధోరణి మీద నడయాడే నాలుగు రోజులు స్వార్థచింతన వీడి బతకడం మేలనే జీవన తాత్వికతను హృదయానికి హత్తుకునేలా చెప్పడం గోరటి వెంకన్న కవిత్వంలోని విశిష్టత. చదివినకొద్దీ చదవాలనిపించే కవితలున్న పొత్తం 'వల్లంకితాళం'. ఈ కవిత్వం ద్వారా ప్రకృతినీ, పర్యావరణాన్ని పల్లెలనీ, పల్లెజనులు మాట్లాడుకున్న భాషను సత్కరించారు. మట్టిని నమ్ముకుని బతికే భాషతో తెలుగు కవిత్వాన్ని దీప్తిమంతం చేశారు, వస్తుశిల్పాల్లో వైవిధ్యం, భావంలో భాషలో, సారళ్యం, వ్యక్తీకరణలో హృద్యమైన కౌశలం ఈ కవిత్వాన్ని ప్రత్యేకంగా నిలబెట్టాయి. జనహృదయాల్ని తన అక్షరాలతో ఆకట్టుకున్న వెంకన్న కవిత్వం చదవడం అపురూప అనుభవం. సాహిత్య అకాడెమి పురస్కారం అందుకున్న గోరటి వెంకన్నకు అభినందనలు, అభివందనాలు.

ఆధారగ్రంథాలు:

1. అలసెంద్రవంక 2. వల్లంకితాళం
3. గోరటి వెంకన్న పాలపిట్ట ప్రత్యేక సంచిక 2010
4. గోరటి వెంకన్న కవితా పరామర్శ – పెన్నా శివరామకృష్ణ

శ్రీకాళహస్తీశ్వర శతకం

డా॥ వీ.వెంకటప్రసాదు, సహాయ ఆచార్యులు, ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల, వనపర్తి.చరవాణి – 9959994902.

తెలుగు సాహిత్యంలో శాఖోపశాఖలుగా వికాసమొందిన కావ్య ప్రక్రియలలో శతకము ఒకటి. శతకాలు తెలుగు సాహిత్యము నందు 12 వ శతాబ్దములో ఆవిర్భవించినవి. తదుపరి శతకాలు శాఖోపశాఖలుగా పెరిగి స్వరూప స్వభావాల్లో ఎంతో మార్పును పొందాయి. శతకము తెలుగు సాహిత్యములో బహుముఖ వికాసము పొందింది. ఈ నాటికి ఎక్కడో ఒకచోట శతకాలు వెలువడుతూనే ఉన్నాయి. తెలుగు లాక్షణికులలో విన్నకోట పెద్దన, అనంతామాత్యులు శతక ప్రక్రియను పేర్కొన్నారు.

"శతేనశతకం ప్రోక్తమ్" అనే నియమానుసారం శతకకర్తలు శతసంఖ్య గల శతకాలు రాశారు. వేమన ఈ సంఖ్యా నియమాన్ని పాటించలేదు. కాని తెలుగు శతక కర్తలంతా నూరు, నూటఎనిమిది, నూటపదహారు, అనే సంఖ్యా నియమాన్ని పాటించారు. శతకపద్యాల చివర ఒకే మకుటం ఉండటం శతక లక్షణం. తెలుగు శతకాలు ఏదో ఒక ఛందస్సుతో సాగుతాయి. తెలుగు శతకాలలో వృత్త నియమం పాటిస్తారు. వృత్తనియమం పాటించబడని శతకాలు తక్కువ. వేమన శతకాలు ఆటవెలదిలో సుమతిశతకాలు కందపద్యాలలో, దాశరథీశతకం, భాస్కరశతకాలు చంపక, ఉత్పలమాలల్లో రాశారు.

శతకాలల్లోని పద్యాలు ముక్తకాలు. శతకములు భావప్రధానంగా ఉంటాయి. కాబట్టి వీటిని భావగీతాలు అంటారు. శతకసాహిత్యం ద్విపద, గేయ, అన్యాపదేశ, అధిక్షేప, శ్లేష, అనుప్రాస శతకాలుగా వర్గీకరణ చేశారు. శతకాలలోని వస్తువు ననుసరించి భక్తిశతకాలు, నీతిశతకాలు, శృంగార వైరాగ్యశతకాలు, హాస్యశతకాలు, దేశభక్తి శతకాలు, రాజకీయశతకాలుగా విభజింపవచ్చు.

ధూర్జటి శ్రీకృష్ణదేవరాయల ఆస్థానకవి. అష్టదిగ్గజాలలో ఒకరు. ధూర్జటి రచించిన శ్రీకాళహస్తీశ్వర శతకం ఎంతో భక్తి నిర్మలత్వం, భావ గంభీరంతో మృదుమధుర పద ప్రయోగాలతో తెలుగు శతక వాఙ్మయానికి అలంకారమని చెప్పదగినది. ఈ శతకంలో కవి పశ్చాత్తాపం, వైరాగ్యం చక్కగా చిత్రించబడ్డాయి. ఇందులో శైలి ప్రౌఢంగా ధారాశుద్ధితో, హృదయానికి హత్తుకునేలా వుంటాయి. ధూర్జటి ఆత్మీయాంశ అనేక చోట్ల కనిపిస్తుంది. ఈ శతకంలోని పద్యాలన్నీ మత్తేభము, శార్దూలపద్యాలే.

ధూర్జటి ఈ శతకంలో మూడు ప్రధాన అంశాలు వివరించాడు.

1. ఐహిక సంపదలు మెరుపుతీగల వంటివి.

2. పరమేశ్వరుని కరుణే సంసార తరుణోపాయం.

3. అనుభవైకవేద్య మయిన జ్ఞాన ప్రకాశమే ముక్తి.

జీవనకూడలి లోతుపాతులు చూసిన గుండెతో ధూర్జటి రాసిన అక్షరసత్యాలే ఈ శతకం.

నీనాసం దొడ బాటు మాటవినుమా, నీచేత జీతంబునే
గానిం బట్టక సతతంబు మది వేడ్కన్ గొల్తు నంతస్సప
త్నా నీకంబున కొప్పగింపకుమున న్నాపాటియే చాలుదే
జీనొల్లం గరినొల్ల నొల్లసిరులన్ శ్రీకాళహస్తీశ్వరా !

నీనుండి ఎలాంటి జీతాన్ని ఆశించకుండా ఎంతో ఆదరంతో నీకు సేవలు చేస్తాను. నువు మాత్రం నన్ను అరిషడ్వార్గాల బారినుండి కాపాడు చాలు. మన మధ్య ఈ ఒప్పందం చేసుకుందాం సరేనా? అని ధూర్జటి భక్తి యోగాన్ని కోరుకున్నాడు. అరిషడ్వార్గాలను జయించనిదే భక్తిలేదు. మోక్షంరాదు. కాని (అణాలో నాల్గవవంతు), ఒల్ల వంటి పలుకుబడులను అర్థవంతంగా ప్రకటించాడు.

అంతా మిథ్యా తలంచి చూచిన నరుండటౌ టెరింగిన్ సదా

కాంతల్ పుత్రులు నర్థమున్ తనువు నిక్కంబంచు మోహర్ణవ

భ్రాంతిం జెంది చరించుగాని పరమార్థంబైన నీయందు తా

చింతా కంతయు చింత నిల్పదు గదా! శ్రీకాళహస్తీశ్వరా!

లోకంలో అంతా అశాశ్వతమని తెలసీకూడ మానవులంతా భార్య, పిల్లలు, ధనం, శరీరం అనే మాయా మోహంలో చిక్కుకుంటారు. అదే భ్రమలోపడి నిరంతరము తిరుగుతుంటారు. కాని ఈశ్వరా శాశ్వతమైన నీమీద చింతాకు అంతయిన భక్తిని కల్గియుండరు కదా! అంటూ ధూర్జటి నిరర్థకమయిన సంసారాన్ని ఎత్తి చూపిస్తాడు.

భగవంతుని ఆనందపరచి, కరుణా కటాక్షాలు ప్రసరించాలన్నా, మోక్షం కలగాలన్నా, యజ్ఞయాగాదులు, జపతపాలు, వేదశాస్త్ర పఠనాలు అవసరమా? అనే ప్రశ్నకు ధూర్జటి చెప్పిన సమాధానం

ఏ వేదంబు పఠించెలూత, భుజగంబే శాస్త్రముల్ చూచె తా

నే విద్యాభ్యాసనం బొనర్చె కరి, చెంచే మంత్రమూహించె బో

దా విర్భావ నిధానముల్ చదువులయ్యా! కావు! మీపాద సం

సేవాసక్తియె కాక జంతు తతికిన్ శ్రీకాళహస్తీశ్వరా!

సాలెపురుగు, పాము, ఏనుగు ఈ మూడు శివుని కొల్చి ముక్తిపొందాయి. భగవంతునికి భక్తి ముఖ్యం. వారు చిన్నవారా, పెద్దవారా అనికాదు. ఆ భక్తి కలిగి ఉండడానికి సాలెపురుగు ఏ వేదాన్ని చదివింది. పాము ఏ శాస్త్రాలు చదివింది, ఏనుగు ఏ విద్యనభ్యసించింది? కన్నప్ప ఏ మంత్రాన్ని చదివాడు? వారంతా నిర్మల భక్తితో సేవించారే తప్ప పెద్దవిద్యలేవి చదువలేదు. కేవలం నీ పాదపద్మాలపై వున్న అపార భక్తి శ్రద్దలే వీటికి మోక్షానిచ్చాయంటాడు.

జీవితం అశాశ్వతమని తెలసికూడ జనులు ధన వ్యామోహంలో కొట్టుమిట్టాడుతున్నారంటూ .....

తరగల్ పిప్పల పత్రముల్ మెరుగుటద్దంబుల్ మరుద్దీపముల్

కరికర్ణాంతము లెండమావుల తతుల్ ఖద్యోత కీట ప్రభల్

సురవీధి లిఖితాక్షరంబుల సుపుల్ జ్యోత్స్నా పయ: పిండముల్

సిరులందేల మదాంధు లౌదురు జనుల్ శ్రీకాళహస్తీశ్వరా!

జీవితం నీటిబుడగ లాంటిది, రాలిపడే రావిఆకు లాంటిది, మెరిసేఅద్దం లాంటిది. ఆకాశ దీపం లాంటిది. ఏనుగు చెవి చివరలు, ఎండమావులు దీపపు పురుగులు, ఆకాశవీధిలో వ్రాసిన అక్షరాల్లాంటివి ప్రాణములు. పదిహేను రోజులు మాత్రమే ఉండే వెన్నెలా రాత్రుల్లాంటివి. ఇది అశాశ్వతమైందని తెలసికూడ మదంతో జనులు గ్రుడ్డి వారివలె సిరిసంపదలతో తులతూగాలనుకుంటారు.

ధూర్జటి మొదట రాయల ఆస్థానంలో భోగాలు అనుభవించి చివరికి రాజుల స్వభావాలు పరిశీలించిన కొద్దీ చేదునిజాలు గ్రహించి వారిపై నిరసన బాణాలు ప్రయోగించాడు.

రాజుల్ మత్తులు వారిసేవ నరకప్రాయంబు, వారిచ్చునం

భోజాక్షి చతురంతయాన తురగీ భూషాదు లాత్మ వ్యథా

బీజంబుల్, తదపేక్ష చాలు పరితృప్తిం పొందితిన్ జ్ఞానల

క్ష్మీ జాగ్రత్ పరిణామ మిమ్ము దయతో శ్రీకాళహస్తీశ్వరా!

రాజులు ధన, కనక, వస్తు వాహనములనే మత్తులో మునిగి వుంటారు. వారికి సేవచేయడం నరకయాతన లాంటిదే. వారిచ్చే కాంతాకనకాలు, మేనా పల్లకీలు, వడిగల గుర్రాలు, ఆభరణాలు ఆత్మలో బాధను కల్గించే విత్తనాల్లాంటివి. వీటిమీద ఆపేక్ష యింకచాలు. సంతృప్తి

పొందాను. జ్ఞానలక్ష్మి నన్ను వాటినుండి జాగృతి కలిగించింది దయతో శ్రీకాళహస్తీశ్వరా!

ఇక్కడ ధూర్జటి నిర్వికార నిర్వికల్ప చిత్తవృత్తి కనిపిస్తుంది. జ్ఞానియైన ధూర్జటి కనిపిస్తాడు.

గడియల్ రెంటికో మూటికో గడియకో కాదేని డెల్లియో
కడనేడాదికో యెన్నడో యెరుగ మీ కాయంబులీ
భూమిపై
పడగా నున్నవి ధర్మమార్గ మొకటిం పాటింప రీమానవుల్
చెడుగుల్ నీపదభక్తియుం తెలియరో శ్రీకాళహస్తీశ్వరా!

ఈ శరీరం క్షణికం గంటకో, రెండు గంటలకో మూడింటికో లేదా ఏడాదికో ఎప్పుడు పోతుందో తెలియదు. ఈ భూమి మీద ఎన్నాళ్ళుంటామో తెలియదు ప్రాణం పోయాక వారి ధర్మమొక్కటే వారితో వస్తుందని తెలియక చెడు మార్గంలో పయనిస్తారు కాని నీ పదభక్తిని ఏ మాత్రం గ్రహించలేరు శ్రీ కాళహస్తీశ్వరా! అంటాడు.

ధూర్జటి శైలిలో స్వతంత్రత కనిపిస్తుంది. వ్యావహారిక పద ప్రయోగాలు చేశాడు. తద్వారా ధూర్జటి శతక పద్యాలు ప్రజలకు కంఠస్తం కావటం వీరి శైలి విశేషమే కారణము. వీరి ప్రతి పద్యంలో అనితర సాధ్యమయిన ప్రత్యాక్షానుభూతి తొణికిసలాడుతుంది.

ధూర్జటి తన కాలానికి ఎదురీది తన శతకాన్ని శ్రీకాళహస్తీశ్వరుడికే అంకితం జేసి జీవన్ముక్తుడయ్యాడు.

ఆధార గ్రంధాలు :

1. శతకాలలో రత్నాలు – డా॥ ఆర్ కమల.
2. తెలుగు సాహిత్య చరిత్ర – డా॥ ద్వా.నా.శాస్త్రి.

శ్రీనాథుని కవితా వైదుష్యము

కానాల రామచంద్రారెడ్డి, తెలుగు సహాయకులు, యస్.ఆర్.ఆర్. జిల్లా పరిషత్, ఉన్నత పాఠశాల, మాసాపేట, రాయచోటి, అన్నమయ్య జిల్లా.

13వ శతాబ్దాంతం నుండి 14 వ శతాబ్దాంతం వరకు సంస్కృతాంధ్ర కవితా పాండిత్యంలో బహుశాస్త్ర పాండితీ ప్రకర్షతో తేరిపారి చూడరాని రీతిగా వెలుగొందిన వారు సకల విద్యా సనాతుడైన శ్రీనాథ కవిసార్వభౌముడు అతని వైదుష్యానికి ఎదిరింప కల్గినవారు ఆనాడెవ్వరూ లేరని కాశీఖండ కావ్య అవతారిక యందు అల్లాడ వేమారెడ్డి పలికిన

శా॥ ఈక్షోణిన్ నినుబోలు సత్కవులు లేరీ నాటి
కాలంబునన్
ద్రాక్షారామ చాళుక్య భీమవర గంధర్వాప్సరో భామినీ
వక్షోజద్వయ గంధసార ఘుసృణ ద్వైరాజ్య భారంబున
ధ్యక్షీంచున్ కవి సార్వభౌమ భవదీయ ప్రౌఢ
సాహిత్యముల్

పద్యాన్ని బట్టి తెలుస్తుంది. అంతేగాక ద్రాక్షారామం, భీమవరంలోని గంధర్వ స్త్రీలు శ్రీనాథుని సౌందర్యానికి వశులై పోయారట. గంధసారము, చందనం, ఘుసృణం, కుంకుమ పువ్వు. శ్రీనాథుడు శృంగార పురుషుడని ప్రతీక గదా! అందుకే పద్యం పట్టపుటేనుగులా నడచింది.

శ్రీనాథుడు స్వయంగా బ్రాహ్మీదత్తవరప్రసాదుడు, మహా ప్రజ్ఞావంతుడు. నిష్కల్మషచిత్తుడు. బ్రహ్మాండాది పురాణ జ్ఞాన సంపన్నుడు, బ్రహ్మజ్ఞాన కళానిధి, దుగ్గుపల్లి దుగ్గన కవి తన నచికేతోపాఖ్యాన గ్రంథ అవతారికలో తెలిపిన

॥సీ॥ సంస్కృత ప్రాకృత శౌరసేనీ ముఖ్య
భాషా పరిజ్ఞాన పాటవంబు
పన్నగపతి సార్వభౌమ భాషిత మహా
భాష్య విద్యా సమభ్యాస బలము
నక్షపాద కణాద పక్షిలో దీరిత
న్యాయ కళాకౌశలాతి శయము
శ్రుతి పురాణాగమ స్మృతి సౌఖ్య సిద్ధాంత
కబళన వ్యుత్పత్తి గౌరవంబు

తే.గీ. పూర్వ కవి ముఖ్య విరచితా పూర్వకావ్య
భావ రస సుధా చర్వణ ప్రౌఢతయును
గందళింపగ గాశికా ఖండ నైష
ధ ప్రముఖ వివిధ ప్రబంధ లోనర్చి
అని పద్యాన్ని చెప్పెను.

శ్రీనాథుని బాల్యపు సోదరుడు, అనుంగు శిష్యుడు అయిన దగ్గుపల్లి దుగ్గన చెప్పిన పై పద్యాన్ని బట్టి అతడు షడ్విద ప్రాకృత భాషల యందు సాటిలేని పాండిత్యం కలవాడని తెలియుచున్నది. అంతేగాక భాష్యాంత వ్యాకరణవేత్త యనియు ప్రాచీన, నవీన న్యాయాలను అపోశం పట్టిన వాడనియు, వేదవిద్యాపారంగతుడు, పురాణ ఉపనిషత్తు జ్ఞాన సంపనున్నడనియు, సాంఖ్య సిద్ధాంత వేత్తయనియు, స్పష్టమగుచున్నది.

శ్రీనాథుడు పెదకోమటి వేమారెడ్డి ఆస్థాన విద్యాధికారియై ఉండి బహుదేశ కృతులతో, బహు శాస్త్ర సాహిత్య విషయాల్ని చర్చించుటను బట్టి ఆనాడు దుర్నిరీక్ష పాండితీ శోభితుడై, ప్రతిభా భయంకురుడై ప్రౌఢదేవరాయల ఆస్థానంలో ఉండిన గౌడడిండిమ భట్టును సకల శాస్త్ర వాదముల యందు, ప్రతిఘటించి ఓడించిన శ్రీనాథ మహాకవి పాండిత్యాన్ని గూర్చి చెప్పనక్కరలేదు.

శ్రీనాథ మహాకవి ప్రాచీనులను, సంస్కృతాంధ్ర మహాకవులను సంపూర్ణంగా ఆకలింపుచేసుకొన్న ప్రజ్ఞానిధి. వ్యాసుడు, భట్టబాణుడు, మయూరుడు, భవభూతి, శివభద్రుడు, కాళిదాసు, భారవి, హర్షుడు, బిల్హనుడు, దండి,

రాజశేఖరుడు మొదలైన సంస్కృత మహాకవుల బాటలో విసృంఖలంగా విహరించిన దిట్టయని భావించవచ్చును.

"నైషధమ్ విద్వదౌషధమ్", కాశీఖండమ్ అయఃపిండమ్"

అని మహాపండితులచేత పేర్కొనబడిన నైషధ, కాశీఖండ కావ్యాలను తన సరసకవితా నైపుణ్యాలతో విద్వత్ అమృతంగా తీర్చిదిద్దిన మహా ప్రతిభాశాలి. శ్రీనాథకవి సార్వభౌముడగుచే ఆతని కవితా భారతి అపూర్వ విన్యాసాలు ఒనర్చగల నేర్పరి అని తెలుసుకోవచ్చు.

కాశీఖండం నందు అల్లాడ వేమారెడ్డి చెప్పిన

సీ॥ వచియింతు వేముల వాడ భీమనభంగి నుద్దండ
లీల నొక్కొక్కమాటు
భాషింతు నన్నయభట్టు మార్గంబున నుభయ
వాక్రోధి నొక్కక్కమాటు
వాకృత్తు తిక్కయజ్వప్రకారము రసాభ్యుచిత
బంధమున నొక్కొక్కమాటు
పరిధవింతు ప్రబంధ పరమేశ్వరుని తేవసూక్తి
వైచిత్రి నొక్కొక్కమాటు

తే.గీ. నైషధాది మహాప్రబంధములు పెక్కు
చెప్పినాడవు మాకు నాశ్రితుడ వనఘ
ఇపుడు చెప్పుదొడింగిన యీప్రబంధ
మంకితము సేయు వీరభద్రయ్య పేరు
(కాశీ పీఠికం 1-18)

అనే పద్యాన్ని ఇట్టి శ్రీనాథుడు తనకు పూర్వులగు భీమన, నన్నయ, తిక్కన, ఎర్రనాది మహాకవుల కవితా వచోవిన్యాసాన్ని పరిపూర్ణంగా చూరగొన్నట్లు వేమారెడ్డి వంటి విద్వాంసుని మాటవల్ల తెలుస్తుంది. వాటికి నిదర్శనంగా కవితా రీతి వైవిధ్యాలు కవి సార్వభౌముని రచనలందు స్పష్టంగా కనిపిస్తాయి. ఇతడు బాల్యం నుండి కవితా సంపన్నుడుగా ఉండినట్లు కాశీఖండంలో చెప్పుకొన్న 'చిన్నారి పొన్నారి చిఱుత కూకటినాడు" అనే పద్యాన్ని బట్టి తెలుస్తుంది. ఇతడు రచించిన మరుత్తరాట్చరిత్ర, శాలివాహన సప్తశతి, పండితారాధ్యచరిత్ర, శృంగార నైషధం, హరవిలాసం, నందనందన చరిత్ర, మానసోల్లాసం, ధనంజయ విజయం, భీమఖండం, శివరాత్రి మహాత్మ్యం, పల్నాటి వీరచరిత్ర, క్రీడాభిరామం మొదలైన గ్రంథాలవల్ల శ్రీనాథుని అవిచ్ఛిన్నమగు కవితా వైదుష్యాన్ని తెలుసుకోవచ్చు. వీనిలో కొన్ని అలభ్యమైనను, లభ్యములైన గ్రంథాలు అతని కీర్తి ధ్వజాన్ని ఆచంద్రార్కముగా విరాజిల్ల చేయుచున్నవి. వానిలో నైషధ, కాశీఖండాలు అతని బహుముఖ శాస్త్ర పాండితీ ప్రకర్షకు నిదర్శనాలని చెప్పవచ్చు.

ముఖ్యంగా బెండపూడి అన్నయామాత్యుడు భీమేశ్వర పురాణం నందు శ్రీనాథుని కృతి గావింపమని కోరినపుడు,

"కల్పించినాడవు గాఢ పాకంబైన, హర్షనైషధ కావ్యమాంధ్ర భాష" అని పల్కినాడు. అట్లే కాశీఖండం నందు వేమారెడ్డిచేత "నైషధాది మహాప్రబంధములు పెక్కులు చెప్పినాడవని" పల్కింప చేసినాడు. మరియు సర్వజ్ఞ సింగభూపాలుని చూడడానికి వెళ్ళినప్పుడు ఆస్థానమండప ప్రాంగణమున నెలకొని ఉన్న శారదా విగ్రహాన్ని చూసి "పల్కుతోడైతి ఆంధ్రమహా కావ్యనైషధ గ్రంథ సందర్భమున" అని స్తుతించినాడు. ఆ స్తుతితో స్వయంగా నైషధ కావ్య ప్రశంస కావించి యుండుట గమనార్హం. చివరకు అవసాన కాలమునందు సైతం కవిసార్వభౌముడు నైషధాంధ్రీకరణంపై తనకు కల్గిన ప్రేమను

"ఆంధ్ర నైషధ యంధ్రి యుష్మంబున
తగిలి యుండెను గదా నిగళ యుగము" అని పల్కెను.

ఇట్లు ఆగర్భశ్రీమంతుడై ఆ బాల్య కవియై, బహు గ్రంథకర్తయై, బహుశాస్త్ర బుధులతో విద్వద్గోష్టి గావించి తన అపూర్వ పాండితీ పటిమతో ఆనాటి కవీశ్వరులను జయించి అనేకసార్లు దేశాటన చేసి సాహితీ సమరాంగన చక్రవర్తులగు భూపాల సార్వభౌముల ఆస్థానం నందు అపూర్వమైన కనకాభిషేకాది అనేక సన్మానాలను పొంది

నాటికి నేటికి అద్వితీయుడై వెలుగొందిన శ్రీనాథకవి సార్వభౌముని వైదుష్యం నిరుపమానమని చెప్పక తప్పదు.

కాశీఖండం నందలి వింధ్యపర్వత వర్ణన – నర్మదానది వర్ణన ఆయన వర్ణనాత్మక శైలికి, ప్రౌఢ శయ్యా సౌభాగ్యానికి నిదర్శనాలు. మొత్తంపై శ్రీనాథుని యందున్న కవితా లక్షణాలు మరి యే ఇతర ఆంధ్రకవి యందు లేవని చెప్పినా అతిశయోక్తి కాదు. బహుగ్రంథకర్తయై విలసిల్లిన శ్రీనాథ కవిసార్వభౌముడు ఆచంద్ర తారార్కముగా వెలుగొందుగాక.

పరిశీలనా గ్రంథాలు

1. తెలుగు సాహిత్య సమీక్ష – డా॥ జి. నాగయ్య.
2. తెలుగు సాహిత్య చరిత్ర – డా॥ ద్వా.నా. శాస్త్రి.
3. కాశీఖండం – పీఠిక – వావిళ్ళ ప్రతి 1958.

శ్రీరామ్మూర్తిగారి కథలు– సామాజిక చిత్రణ

బలరామమహంతి శశికళ, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం,
తిరుపతి. చరవాణి: 8500269783

మనిషి పరిణామక్రమంలో సంఘజీవనం అవసరమైంది. ఆ సమయంలో భాష అవసరమైంది. ఒకరి నుండి ఒకరికి సమాచారం చేరవేయడానికి చిన్నచిన్న కథలు ప్రాణం పోసుకున్నాయి. మౌఖికంగా కథ వేగం పుంజుకుంది. ముద్రణకు నోచుకున్న అనంతరం సామాన్యుల కందుబాటులోనికి వచ్చి, జీవితంలో కథ ఒక భాగమైంది.

'కథ్' అనే ధాతువునుండి కథ అనే పదం పుట్టింది. అగ్ని పురాణంలోని ఒక శ్లోకంలో పొందికగా ఉండడం, ఉదాత్తత కలిగి ఉండడం, సంభ్రమాశ్చర్యాలు కలిగించి కరుణ, అద్భుత రసాలను పోషించడం, ఆనందాన్ని కలిగించడం కథానిక లక్షణాలుగా చెప్పబడింది. పరిణామాన్ని బట్టి పెద్దకథ,దళితకథ, చిన్నకథ, కాలం కథ, కథ సామాజికతను ప్రతిబింబించే కథ. కుటుంబ కథ ఇలా ఎన్నోరకాలు ఉత్తరాంధ్ర రచయిత శ్రీ పి.వి.బి శ్రీరామ్మూర్తి గారు సమాజం పై అవగాహన కలిగిన వ్యక్తి, వృత్తిలో ఉపాధ్యాయుడు ప్రవృత్తిలో రచయిత. ఉత్తరాంధ్ర ప్రాంత సమస్యలను తన కథలలో ప్రతిబింబింప చేశారు. తెలుగులో వచ్చిన అన్ని పత్రికలలో 350 కథలకు పైగా ప్రచురించ బడ్డాయి. పాతిక కథలకు బహుమతులు వచ్చాయి. నాటికలు రాసి ప్రదర్శించేశారు. 50పైగా ప్రదర్శనల్లో నక్షత్రకుని పాత్ర ధరించారు. అరణ్యరోదనం కథాసంపుటి ఉత్తమకథా సంపుటి పురస్కారం పొందింది.

శ్రీరామ్మూర్తిగారు రచించిన కథలను పరిశీలిద్దాం.

అరణ్యరోదనం :

ఈ కథలో గిరిజన గూడేన్ని చక్కగా వర్ణించారు. గిజనుల సమస్యలను తేటతెల్లం చేశారు. వారి అమాయ కత్వాన్ని స్పష్టంగా చూపారు. ఈ కథలో అన్నలకోసం వెదకుతూ పోలీసులు గూడెంలోనికి జొరబడ్డారు. అన్నలకూ పోలీసులకు మధ్య పోరాటం జరిగింది. గూడెంవాసులు అడకత్తెరలో పోకచక్కలయ్యేరు. యువకులు రెచ్చిపోయారు. పోలీసులు విజృంభించారు. ఆడాళ్ళు తిరగబడ్డారు. రాళ్ళవర్షం కురిసింది. 'కత్తుల్ల' పండుగ చేయకపోవడం వలనే ఈ కష్టాలనుకున్నారు గిరికాంతలు. ఇంతలో ఏనుగుల గుంపు చొరబడి పంటను ధ్వంసం చేసింది. కొండమల్లి పైన కామందు కన్నుపడింది. మంచివాడిగా నటించి కత్తుల్ల పండుగ చేసుకోమని వారికి డబ్బిచ్చి వారంతా తాగిన మైకంలో ఉండగా కొండమల్లిని హత్యాచారం చేశాడు. అతడే కాదు పోలీసులు కూడా వచ్చి గిరికాంతల జీవితాలను నాశనం చేశారు. ఏనుగుల దాడిలో ధ్వంసమైన కందిచేనులా పులుల చేతుల్లో రక్తాలు కారుతున్న అడవి జింకల్లా మానవ మృగాళ్ల చేతుల్లో ఎందరో గిరి కాంతులు కన్నుమూశారు.

అమ్మే నా శత్రువా:

వెన్నెలకు పనులు చెయ్యడం రాదని భర్త, అత్తగారు అవమానిస్తుంటారు. ఇమె ఆత్మాభిమానం దెబ్బతినేలా మాట్లాడుతుంటారు. నీకు ఇంటిపని నేర్పని మీ అమ్మను అనాలి అంటూ తల్లిని వాళ్ళు తిట్టడం సహించలేకపోయింది. తన చిన్న తనం నుండి తన తండ్రి కూడా తల్లిని ఈ విధంగానే అనడం బాగా గుర్తు వెన్నెలకు. భర్త తిడుతున్నా కూతుర్ని బాగా చదివించింది. వెన్నెలవాళ్ళమ్మ. 'నేనింటి నుండి వెళ్ళిపొతున్నాను. నేను చదువుకున్నమ్మాయిగా ఉ ద్యోగం చేసుకుంటాను. నేను కూడా మీ అమ్మలాంటి ఆడదాన్నే నా విలువ తెలిసి మీరు నా వద్దకు వస్తే స్వాగతం

పలుకుతాను. అని చెప్పి ఇంటినుండి వెళ్ళిపోతుంది వెన్నెల. ఆత్మగౌరవాన్ని కాపాడుకునే అమ్మాయిని చక్కగా చూపెట్టారు రచయిత.

గర్భస్థశిశువు గుండె చప్పుళ్ళు :

ఈ కథలో గర్భస్థ శిశువు స్వగతంలో మాట్లాడినట్లు రచయిత అద్భుతంగా ఈ కథను రాశారు. తండ్రి తనకు కూతురే కావాలి అంటాడు. కొడుకైతే జులాయిగా తిరిగి చెడిపోతాడని భయం వ్యక్తం చేస్తూ సమాజంలో జరిగిన కొన్ని సంఘటనలు భార్యకు చెబుతాడు. తనకు కొడుకు కావాలనీ, ఆడపిల్లలకు సమాజంలో రక్షణలేదని తల్లి భర్తతో అంటుంది. అమ్మనాన్న కోరుకున్న కొడుకునైనా, కూతురైనా ఫర్వాలేదు కానీ పుట్టబోతున్న మేము దేశపరువు ప్రతిష్టలు పెంచేవాళ్ళం కావాలని, ఈ దేశం మానవత్వం నిండిన మనుషులతో పరిపాలింపబడాలని ఆ శిశువు ఆశించడం సమాజంలోనున్న రుగ్మతలను కళ్ళకు కట్టినట్లు చూపారు రచయిత.

యూజ్ అండ్ త్రో :

ఆమె ఒక అనాధను చేరదీసింది. ఆమె కొడుకు నవీన్ చాలా తెలివైన వాడు. త్రిబుల్ ఐఐటి చదివి పి.హెచ్.డి చదివి కోసం విదేశాలకు వెళ్ళాడు. పెంచిన కొడుకామెను ప్రాణ ప్రదంగా చూసుకున్నాడు. కన్నకొడుకు విదేశి సంస్కృతికి బలైపోయాడు. విదేశాల్లో ప్రేమవివాహం చేసుకోవడం, విడిపోవడం. ఈ విధంగా రెండు మూడు పెళ్ళిళ్లు చేసుకోవడం ఆ పెళ్లళ్లు పెటాకులై పిచ్చివాడైపోవడం, కొడుకు దూరమై తల్లి తనువు చాలించడం ఈ కథలోని వస్తువులు. విదేశాలపై మోజుతో భారతీయులు ఎన్నో విధాలుగా నష్టపోవడం ఈ కథలో చక్కగా చిత్రికపట్టారు శ్రీరామ్మూర్తిగారు.

అరణ్యంలో ఏడ్చినా ఎవ్వరూ పట్టించుకోరు. ఇది జాతీయం ఈ జాతీయాన్నే కథకు శీర్షికగా తీసుకున్నారు రచయిత. శీర్షిక చదవగానే మనకు శీర్షికగా చదవగానే కథ చూచాయగా అర్థమవుతుంది. ఏనుగుల గుంపు పంటను నాశనం చేయడం, పులుల చేతిలో జింకలు రక్తాలోడడం దృష్టాంతాలతో ఈకథకు ముగింపు పలికారు రచయిత. కోడల్ని కూతురిలా చూడదు అత్త అన్నట్లు అత్తపాత్ర. భర్త, అత్తగారు అనే మాటలకు ఆత్మాభిమానం కలిగిన మహిళ ఎలా ఉండాలో వెన్నెల పాత్ర ద్వారా తెలియజేశారు రచయిత. గర్భస్థశిశువు ఈ భూమిమీదున్న సామాజిక రుగ్మతలను అమ్మనాన్న నోటినుండి విని నేను పుట్టకుండా ఉంటే బాగున్ను ఒక వేళ పుట్టినా దేశప్రతిష్టను పెంచేవానిగా పుట్టాలని కోరుకోవడం అబ్బురమనిస్తుంది. విదేశీ సంస్కృతికి ఆకర్షితులవై మనం ఎన్ని విధాలుగా నష్టపోతున్నామో యూజ్ అండ్ త్రో కథ ద్వారా చక్కగా చెప్పారు రచయిత. కథలన్నీ సమాజాన్ని తట్టి లేపేలా ఉన్నాయి.

ఆధారగ్రంథాలు:

1. శ్రీరామ్మూర్తిగారి కథలు – వివిధ పత్రికలు
2. అరణ్యరోదనం కథాసంపుటి – పి.వి.బి శ్రీరామ్మూర్తి 02-01-2022
3. తెలుగు. వీకీపీడియా.ఒఆర్జి

రావిశాస్త్రి కథలు – శిల్పం – అనుభూత ఐక్యత

డా॥ ఆర్.యస్. రవికుమార్, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బుక్కపట్నం – అనంతపురం జిల్లా,
సెల్. 9959287794

అనుభూతి ఐక్యత:

మంచి కథను రెండవ లక్షణం అనుభూతి ఐక్యత, కథ చదివిన తరువాత పాఠకుడికి మంచి అనుభూతి కలగాలి. 1842వ సం॥లో నథానియల్ కథలమీద సమీక్ష చేస్తూ ఎడ్గర్ అరెన్‌పో అనుభూతి ఐక్యతను కథకు ఉండవలసిన ప్రధాన లక్షణంగా చెప్పాడు. అనుభూతి అంటే కథ పాఠకునితో కలుగజేసే భావ ప్రకంపనం.

ఏ రచనలోనైనా అనుభూతి అన్నది ప్రధాన లక్షణమైనా కథానికలో దానికి మరింత ప్రాముఖ్యం ఉంది. కథానికలో ఒక్క అనుభూతికే స్థానం, రాచమల్లు రామచంద్రారెడ్డి 'కథానికా' దాని శిల్పం లో అనుభూతి లేకుండా కథా సాహిత్యం లేనే లేదు. సమస్త సాహిత్యమూ హృదయ వ్యాపారమే అంటే అనుభూతి వ్యంజకమే అయితే 'అనుభూతి అనేది వెగటు కలిగించే మెలోడ్రామా స్థాయికి దిగజార కూడదు. వెలపరం కలిగించే చౌకబారు సెంటిమెంటు కాకూడదు. గాజుగ్లాసు పగిలిపోతే, మగడుచచ్చినంతగా మొత్తుకోవడం మెలోడ్రామా, పడమటి సూర్యుడు మునిగిపోతే శోకాలు పెట్టడం చౌకబారు సెంటిమెంటు. అనుభూతి అనేది కథకు తగినంతగా లేదా కథలోని ఇతివృత్తానికి తగినంతగా

రావిశాస్త్రి కథలు – అనుభూతి ఐక్యత :

వ్యక్తిని సమాజంనుంచి దాదాపుగా దూరంచేసి పరిశీలించే విధానం నుంచి సమాజంలోని వ్యక్తిని పరిశీలించే విధానం వైపుగా తెలుగు కథను సడిపించిన ప్రతిభావంతుడు రావిశాస్త్రి. తన కథలలో ఎక్కువగా సమాజంలో సామాన్యులు దోపిడీకి గురవుతున్న వైనాన్ని చిత్రించాడు. సారా కథలలో సమాజంలోని ఆర్థిక వ్యత్యాసాల కారణంగా పోలీసు వ్యవస్థ, న్యాయవ్యవస్థ మధ్య నలిగిపోయిన పాత్రలు ఎక్కువగా కనిపిస్తాయి. కలంకరి కథలలో ఆర్థిక పరిస్థితుల మధ్య చిక్కి శుల్యమైన పాత్రలు ఎక్కువగా కనిపిస్తాయి. సమాజ పరిస్థితుల మధ్య నలిగిపోయే ప్రజల యథార్థ జీవిత వ్యథార్థ గాధలను చిక్కని అల్లికతో పదునైన మాటలతో అనుభూతి లోకి తెస్తాడు రచయిత.

1960 ప్రాంతంలో ఆంధ్రదేశంలో మధ్య నిషేధ చట్టం అమలులో వుంది. అయినప్పటికి దొంగసారా రవాణా సాగుతూనే ఉంది. ఈ రవాణాలో అనేకమంది పేదవారు జానెడు పొట్టకోసం దొంగసారా అమ్ముతుంటారు. వాళ్ళద్వారా కొందరు తెరచాటు పెద్దమనుషులు ఈ వ్యాపారం చేయిస్తూ ఉంటారు. సారా అమ్మకంలో పోలీసులకు పట్టుబడిన వాళ్ళు షావుకార్లు కోర్టులో డబ్బులు కడితే బయటపడతారు. డబ్బులు కట్టకపోతే శిక్షలు అనుభవించడానికి కూడా సిద్ధంగా ఉంటాడు. కొంత మంది దొంగసారా అమ్ముకుంటూ వచ్చిన ఆదాయంలో కొంత పోలీసులకు ముట్టజెప్తూ మిగిలిన దానితో జీవనం సాగిస్తూ ఉంటారు. ఆ విధంగా పోలీసులకు డబ్బులు ఇవ్వలేని వారు పోలీసుల దొంగకాసు బనాయింపులకు బలైపోతూ ఉంటారు.

'న్యాయం' కథలో గేలం సారాతో పట్టుబడినట్లుగా కోర్టుముందు ప్రవేశపెట్టబడిన వేశ్యాస్త్రీ, 'మాయ' కథలో ముత్యాలమ్మ ఇలాంటి జనానికి ప్రతినిధులు, 'న్యాయం' కథలో పట్టుబడిన వేశ్యాస్త్రీని కేసు ఒప్పుకోవలసిందిగా పోలీసువారు నానారకాలుగా వత్తిడి చేస్తారు. అయినప్పటికీ ఆమె కేసు ఒప్పేసుకుంటాను గానీ నేరం చేయలేదందంటుంది. ఇది విని మేజిస్ట్రేటుకు పిచ్చెక్కి పోతుంది. కోర్టులో హెడ్డు చివరిసారిగా ఆమెను గురించి "దిక్కుమాలిన ముండల్ని ఎవరుచేర దీస్తారు బాబు? మరింక పోషించు కొందుకి ఈ పన్లుమానమంటే చస్తే మానరువీళ్ళు. అది వాళ్ళ బతుకు – ఏ బతుకు బతికే వాళ్ళు ఆ బతుకు బతకాలి గదా

బాబుగారూ!" అన్న హెడ్డు మాటలు విని 'బతుకు' అనే మాట ఆరేడు సార్లు వినేసరికి ఆ ముద్దాయి మనసు చలించి ఆమె హృదయాంతరాలలోని బాధను మేజిస్ట్రేటుముందు వెళ్ళగక్కుతుంది. "నాకొద్దీ బతుకు నన్ను చంపేయండి, కానీ బాబూ నా కొద్దీ బతుకు నేనింక బతకలేనసలు, ఇంత నీచం బతుకు హీనం బతుకు నేబతకలేను. ఇంత కష్టపడి తెచ్చుకున్న కూడయినా తిందానంటే సయిస్తుందా? అన్నంతింటే వాంతులు కడుపునొప్పి తలబాధ లేకపోతే మూర్ఛలు రాత్రల్లా నిద్దర్నేదు" అంటూ నన్ను గుమ్మానికి వేలాడదీసి చంపేయండి అంటూ ఆవేశంగా మెజిస్ట్రేటు గారివైపు పరిగెడుతుంది. ఈ సన్నివేశాన్ని ఈ సంఘటనను చదివిన పాఠకునికి మనం ఈ సమాజంలోనే ఉన్నామా? అటవిక నంప్రదాయంలో ఉన్నామా? అటవిక సంప్రదాయంలో ఉన్నామా? అన్న అనుభూతి కలుగుతుంది. ఈ కథలో ముద్దాయి చేత రచయిత కోర్టులో మాట్లాడించిన మాటలు పాఠకులకు అనుభూతి ముద్రను వేస్తాయి.

అదే విధంగా 'మాయకథలో" ముత్యాలమ్మ కోర్టులు, చట్టాలు, పోలీసులు, న్యాయవాదులు వారి చుట్టూ వున్న మాయని మూర్తి లాయరుకు అరటిపండు ఒలిచిపెట్టినట్లుగా చెబుతుంది. ఈ కథలో ముత్యామ్మ లాంటివారు ఎటువంటి నేరం చేయకపోయినా నేరం చేశారని పోలీసులు అరెస్ట్‌చేసి, మళ్ళీ కేసు లేకుండా తేలగొట్టినందుకు డబ్బులు తీసుకుంటారు. ఇటువంటి పాత్ర గురించి కథచివరలో మూర్తిలాయరు తన అభిప్రాయంలో ముత్యాలమ్మ గురించి ఆలోచిస్తూ కానీ ఈ మాయ మధ్య ఎంతటి బాధ ఉందో తెలుస్తుంది, అప్పడతనికి పెద్దప్లీడరు గారు గుర్తుకొస్తారు. "ఆయన మాయనే తెలుసుకున్నారు, కానీ బాధను తెలుసుకోలేదు" అనుకుంటూ ఈ మాయాప్రపంచంలో ముత్యాలమ్మ లాంటి అమాయకులు ఎంతమంది బలైపోతున్నారో అన్న అనుభూతి మూర్తిలాయరులో కలుగుతుంది. అదిపాఠకుడి అనుభూతిగా మారుతుంది. ముఖ్యంగా ఈ కథలో ముత్యాలమ్మ మూర్తి లాయరు వద్ద విన్న వించుకొన్న తనగోడు "పశువులు నోర్లేని సొమ్మల – ఆటికి నీతుంది. కాని మనకి నేదు. సదువు లేన్దాన్ని నాకూనేదు, సదువుకున్నోడిని నీకూనేదు. డబ్బుకి సదివిన సదువంతా నువ్వమ్ముతున్నావు. డబ్బుకి పోలీసోళ్ళు న్యాయ్యేన్యమ్ము తున్నారు. మందుకోసం పెద్దసువత్రి కెళ్తే అక్కడ మందులమ్ముతున్నారు. మంచాలమ్ముతున్నారు. లంజెలు రోడ్లంట, రిచ్చాలంట, కార్లంట తిరిగి ఒళ్ళమ్ముకొంటున్నారు. గుళ్ళోకెళ్ళి, కొబ్బరికాయసెక్కా కాన్దబ్బూ ఇస్తే, ఆ దేవుడి దయే అమ్ముతున్నారు. వోట్లొస్తే అమ్మకం! అమ్మకం! అమ్మకం! అమ్మకం తప్ప ఘరేట్నే దీలోకంలో నాను సదువుకో నేదుగాని, చూసిన సత్తెం మాత్తరం అది. తప్పయితే తప్పని సెప్పు! ఇంటాను" అంటూ రచయిత ముత్యాలమ్మ ద్వారా పలికించిన మాటలు పాఠకునిలో సమాజనగ్న స్వరూపాన్ని గురించిన అనుభూతి ముద్రను వేస్తాయి.

పైన సూచించిన సంఘటనలను చదివితే న్యాయ వ్యవస్థ, పోలీసు మధ్య ఎంతోమంది అమాయకులు నలిగి పోతున్నారనే అనుభూతి ప్రతి పాఠకునిలో కలుగుతుంది.

రావిశాస్త్రి కథలలో 'అరటితొక్క', 'హారతిపళ్లెం', 'ముగ్గురు గుమస్తాల కథ', 'ఎండ', 'జరీ అంచు తెల్లచీర', 'ఇద్దరు పిల్లలు' మొదలైన కథలలో దుర్భద దారిద్ర్యంతో కొట్టు మిట్టాడుతున్న పాత్రలు కనిపిస్తాయి. ఈ కథలను చదివిన పాఠకునితో దుర్భర దారిద్ర్యతంతో అట్టడుగు వర్గాలు ఏ విధంగా నలిగి పోతున్నాయో అన్న అనుభూతి కలుగుతుంది.

'హారతిపళ్లెం', 'ఎండ', 'ఇద్దరుపిల్లలు' 'జరీ అంచు తెల్లచీర' కథలలో చిన్న పిల్లలు ఆర్థిక ఇబ్బందులు, దారిద్ర్యం అనే విషయాలు వాళ్ళకు తెలియక దుర్భర దారిద్ర్యానికి గురయిన పాత్రలుగా కనిపిస్తారు. 'హారతిపళ్లెం' కథలో అయిదేళ్ళ శారద వినాయకుని విగ్రహం ముందు నిల్చొని ఆ విగ్రహానికి దీనాతి దీనంగా తన గోడు వెళ్ళబోసుకున్న వైనాన్ని రచయిత అద్భుతంగా చిత్రించాడు.

తన తల్లి, అన్న జబ్బుతో మంచాన పడితే, వారిని కాపాడుకోవడం కోసం, మందుకోసం సీసాపట్టుకొని బజారుకు వెళుతుంది. వచ్చీరాని మాటలు మాట్లాడే చిన్నపిల్ల బస్సులు, లారీలు, కార్లూ, జీపులు తిరుగుతున్న రోడ్డులో వాటిని తప్పించుకోబోయి, లారీక్రింద పడి చనిపోతుంది. అప్పుడు రచయిత విషాద వాతావరణాన్ని చిత్రించాడు. మగదిక్కులేని దరిద్ర బ్రతుకులలో ఐదేళ్ళ శారద తనకు చేతనయిన సాయం చేయడానికి కూడా ఆ సమాజంలో వీలులేదని ఈ కథ ద్వారా తెలుస్తుంది.

ఈ కథలో శారదతల్లి భగవంతునికి విన్నవించుకొనే గోడు "అమ్మో నాకు భయం వేస్తుంది. తండ్రీ పరాత్పరా ఎలా కాపాడతావో, నా కొడుకునెలా కాపాడతావో నువ్వే కాపాడాలి. మందు లేదు, మాకు లేదు ఎవరూ సాయం లేరు. శారద చిన్నపిల్లల నోర్లేని పక్షి. అదేం చెయ్యగల్దు? పండుగపూట అన్నంలేదు ఆకలేస్తే అదలా పడుకుంటుంది గానీ నాతోనయినా చెప్పాదు ఇంతసేపూ నీపూజ చేసింది. దానికి పట్టెడన్నం పెట్టలేక పోయాను నేనేతల్లిని" అంటూ కంగారు పడుతూ భగవంతునికి వెళ్ళబోసుకొనే ఈ బాధ, రచయిత చేసిన ఈ వ్యాఖ్యానం పాఠకునితో గాఢమైన అనుభూతి ముద్రను వేస్తుంది.

ఆధార గ్రంధాలు :

1. రామచంద్రారెడ్డి రాచమల్లు – అలసిన గుండెలు – పు – 139
2. వెంకటసుబ్బయ్య వల్లంపాటి – కథాశిల్పం – పు – 15.

స్త్రీవాద సాహిత్యం – సామాజికాంశాలు

తేలు వెంకట కుమారి, పరిశోధకురాలు, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం – 530003

సంక్షిప్త పరిచయం:

స్త్రీవాదం:

స్త్రీవాదం ఒక సామాజిక సిద్ధాంతం. ఇది మనుషుల అనుభవం నుంచి రూపొందింది. స్త్రీ పురుషుల మధ్య అసమానతలున్నాయి. అవకాశాలు వీరిద్దరికి సమానంగా అందుబాటులోకి రావడం లేదు. వీటన్నింటిని గుర్తిస్తూ వచ్చిన జనం ఇలా ఎందుకు ఉంది అని అన్వేషించే క్రమంలో స్త్రీవాద సిద్ధాంతం రూపొందింది. నిజానికి దానికి మూలాలు ఫ్రెంచి విప్లవకాలం నుండి ఉన్నాయి. ప్రపంచదేశాలలో చాలామంది మేధావులు ముఖ్యంగా ఆడవాళ్ళ నుంచి వుల్‌స్టన్ క్రాఫ్ట్, సైమన్ డిబౌరే మొదలనవాళ్లు దీనికి కావలసిన సిద్ధాంత బలము తయారు చేశారు. మానవహక్కుల ఉద్యమాలు, ప్రత్యేకించి స్త్రీల హక్కుల చైతన్యం వీటి నుంచి "స్త్రీ వాదం" రూపొందింది. 1960లో ప్రముఖంగా న్యూ ఫెమినిస్టు మూమెంటు అమెరికాలో వచ్చింది. ఆ న్యూ ఫెమినిస్టు మూమెంటు నుంచి స్త్రీవాదానికి ఒక స్పష్టమైన రూపురేఖలు వచ్చాయి. స్త్రీవాదం మూడు అంశాలను ముందుకు తీసుకొచ్చింది. అవి మానవ సంబంధాలను పరిశీలించడానికి, స్త్రీ పురుష సంబంధాలను పరిశీలించడానికి, లింగ వివక్ష పితృస్వామ్యం అనే రెండు ప్రాతిపదికలను ముందుకు తీసుకొచ్చింది. ఎన్ని అవకాశాలు కల్పించినా, దేశాలకు స్వాతంత్ర్యం వచ్చినా, ప్రభుత్వాలు రిజర్వేషన్లు కల్పించినా, ఇంకా ఏమి జరిగినా స్త్రీల అభివృద్ధి ఎందుకు జరగలేదు. అన్ని రంగాలలో స్త్రీలు ఎందుకు పురుషులతో సమానంగా భాగస్వామ్యం కావటం లేదు అనే దానికి సమాధానంగా దొరికిన సమాచారం ఏమిటంటే పితృస్వామ్యం దీనికి మూలం అని చెప్పింది. పితృస్వామ్యం అంటే తండ్రి అధికారం కలిగినటువంటి వ్యవస్థ. అది స్త్రీల ఆలోచనల్ని, అభిప్రాయాల్ని, వాళ్ళ చర్యలన్నింటినీ నియంత్రించేటువంటి ఒక వ్యవస్థ.

స్త్రీవాదం – నిర్వచనం :

స్త్రీవాదం రచయిత్రులు, విమర్శకులు స్త్రీవాదాన్ని అనేక రకాలుగా నిర్వచించారు. వీటిని వివరణ రూపంలో ఉన్న వ్యాఖ్యానాలుగా భావించవచ్చు.

"సమాజంలోనూ, కుటుంబంలోనూ, పనిలోనూ స్త్రీలు గురౌతున్న అణచివేత, దోపిడీకి సంబంధించిన అవగాహన కలిగిఉండి, ఈ పరిస్థితి మార్చడానికి స్త్రీలు పురుషులు చేపట్టే చైతన్యవంతమైన కార్యక్రమం" అని ఫెమినిష్టు స్టడీ సర్కిల్ స్త్రీ వాదాన్ని నిర్వచించింది.

పితృస్వామ్యం, ఇంటి చాకిరి, అణచివేత వంటి జెండర్ పరంగా ప్రస్తుత సమాజపు నిర్వచనాలను మార్చి స్త్రీలు తమకు తాము ఇచ్చుకునే కొత్త నిర్వచనం స్త్రీవాదం – నీలిమేఘాలు అనే గ్రంథంలో ముందుమాటలో ఓల్గా గారు నిర్వచించారు.

"స్త్రీ వాద దృక్పథం అంటే స్త్రీల జీవితాల్లోని సాంఘిక, ఆర్థిక, రాజకీయ అంశాలని పురోగామి దిశగా మలుపు తిప్పగల దృక్పథం" అని పద్మలత అన్నారు.

"ఫెమినిజం స్త్రీ పురుష సమానత్వాన్ని కాంక్షిస్తుందే గాని స్త్రీలనీ, పురుషులనీ విడదీయదు. ఇవాళ అన్ని రంగాల్లోనూ స్త్రీ పురుషుల మధ్య ఉన్నవి ప్రధానంగా అధికార బానిస సంబంధాలే. ఈ తత్వాన్ని ఫెమినిజం ప్రశ్నిస్తుంది, సరిచేస్తుంది. సామాజికంగా, ఆర్థికంగా, లైంగికంగా, స్త్రీలను దోపిడీ నుంచి విముక్తి చేసే రాజకీయ సిద్ధాంతమే ఫెమినిజం" అని జయప్రభ వెల్లడించింది.

"స్త్రీ వాదం కవిత్వం వ్యవస్థను ప్రశ్నించింది. పితృస్వామ్య వ్యవస్థ కారణంగా సమాజంలో అనాదిగా

పాతుకుపోయిన ద్వంద్వ ప్రమాణాల్ని స్త్రీ పురుషుల్ని అసమాన దృష్టితో చూచే ఆలోచనా విధానాన్ని ఈ కవిత్వం తీవ్రంగా నిరసించింది. ప్రస్తుత వ్యవస్థను ప్రశ్నించడం, ధిక్కరించడం, కొత్త దృక్పథాలను ప్రతిపాదించడం వంటి అంశాల్లో స్త్రీవాదం శక్తివంతంగా పనిచేసింది. జీవితాన్ని, సమాజాన్ని, ప్రపంచాన్ని, స్త్రీల దృక్పథం నుంచి చూడవలసిన అవసరాన్ని నొక్కిచెప్పింది.

స్త్రీవాద సాహిత్య నేపథ్యం:

1789లో ఫ్రెంచి విప్లవం ద్వారా స్వేచ్ఛ, సమానత్వం, సోదరత్వం అనే భావాలు ప్రచారంలోకి వచ్చాయి. ఆ నాటికీ ఫ్రాన్స్‌లో మహిళలు తమ హక్కుల కోసం పోరాటం సాగించారు.

- 1870 సంవత్సరంలో జరిగిన రష్యన్ విప్లవం స్త్రీ విముక్తికి ప్రాధాన్యత ఇచ్చింది.
- 1889 సం॥లో పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో స్త్రీ పురుషులకు సమాన హక్కుల్ని గూర్చి చర్చించడం జరిగింది.
- 1911 సం॥లో నాటి చైనా విప్లవంలో స్త్రీలు కార్మిక పోరాటాల్లో పాల్గొన్నారు.
- అమెరికాలో 1841 సం॥లోనే ఫ్యాక్టరీల్లో పనిచేసే స్త్రీలు సామాజికంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని గుర్తించారు. తిరిగి 1966 తర్వాత మాత్రమే స్త్రీల విముక్తి బృందాలు ఏర్పడ్డాయి. ఇంటి చాకిరీకి జీతం ఉండాలనే నినాదం కూడా 1870 తర్వాత అమెరికాలో ఉద్యమ రూపం దాల్చింది.
- భారతదేశానికి చెందిన 'పండిత రమాభాయి' హిందూ ఛాందస భావజాలాన్ని తీవ్రంగా వ్యతిరేకించి, స్త్రీల హక్కుల కోసం పోరాడింది.
- ఇండోనేషియా కు చెందిన 'కార్తిని' స్త్రీ విద్య కోసం కృషిచేసి, అక్కడి సంప్రదాయాలకు వ్యతిరేకంగా బాలికల పాఠశాలను ప్రారంభించి స్త్రీ విముక్తి ఉద్యమాలకు దారి చూపింది.
- 1942లో "సైమన్-డి-బోరా" వ్రాసిన 'The second Sex' అనే గ్రంథం స్త్రీ స్వేచ్ఛకు సంబంధించిన మౌలికమైన అనేక అంశాల్ని బయటపెట్టింది. వివాహ, కుటుంబ వ్యవస్థలు స్త్రీల అణచివేతకు ఎలా కారణమయ్యాయో ఆ గ్రంథంలో వివరించారు. దీన్ని ఆధారంగా చేసుకునే స్త్రీవాదం బాగా అభివృద్ధి చెందింది.
- ఓటు హక్కు, విద్యా హక్కు, ఎన్నికలలో పోటీచేసే హక్కు మొదలైన వీటన్నింటినీ ప్రపంచ స్త్రీలు పోరాటాల ద్వారానే సాధించారు.

స్త్రీవాదం చర్చకు పెట్టిన ప్రధానాంశాలు :

పితృస్వామ్య వ్యవస్థ స్త్రీ పతానానికి, అణచివేతకు కారణమైన పురుషాధిక్య భావజాలాన్ని చారిత్రక నేపథ్యంలో గుర్తించడం.

- స్త్రీల శరీరాలకూ, మనస్సుకూ, వివాహ వ్యవస్థకూ సంబంధించి తరతరాలుగా విశ్వాసాలుగా నిలిచి పోయిన ఎన్నో విషయాలను స్త్రీ వాదం భగ్నం చేసింది.
- స్త్రీ వాదులంటే స్త్రీలు మాత్రమే కాదని, స్త్రీ పురుషులిద్దరూ ఫెమినినిస్టులు కావాలనీ, ఫెమినిజం అంతిమ లక్ష్యం సమాజంలోని అన్ని దృక్పోణాల్లోనూ పునరాలోచన, పునర్మిర్మాణం జరగడమేనని స్త్రీవాదం చెబుతుంది.
- స్త్రీని ఆమె పోషించే రకరకాల పాత్రల ద్వారా కాక, ఒక వ్యక్తిగా గుర్తించవలసిన సమయం ఆసన్నమైందని ఈ ఉద్యమం భావించింది.

స్త్రీవాద ఉద్యమం ప్రపంచ వ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కుల పోరాటంగా ప్రారంభమై క్రమక్రమంగా వృద్ధిచెంది సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని పొందింది.

వస్తు వైవిధ్యం:

స్త్రీవాద కవిత్వంలోని ప్రధాన వస్తువును ఎనిమిది విధాలుగా విభజించారు. 1.వ్యక్తిగా, రచయిత్రిగా తమ ఉనికి 2.మాతృత్వం 3.లైంగిక వివక్ష 4. శారీరక స్పృహ 5.వివాహ వ్యవస్థ 6.కుటుంబంలో హింస, 7.సామజిక జీవితం 8.ప్రపంచీకరణ. స్త్రీవాద కవిత్వంలో వస్తు విభజన స్థూలమైనది మాత్రమే. ఇందులో మళ్ళీ అంతర్భాగాలు కూడా ఉండవచ్చు కానీ మొత్తంమీద స్త్రీ జీవితంలో పితృస్వామ్య వ్యవస్థ స్పృశించని భాగం కానీ, అంశం కానీ లేదని ఈ పితృస్వామ్య భావజాలం మూలాలు గుర్తించి, వాటి నుంచి తమ అస్థిత్వాన్ని పరిరక్షించుకోవడం, కొత్త విలువలను అన్వేషించడం, ఆ అన్వేషణను వ్యక్తిగతంకాక సామూహిక చేతనగా మార్చడం స్త్రీవాద కవిత్వ ఉద్దేశం. 1972లో ఓల్గా రాసిన "ప్రతి స్త్రీ ఒక నిర్మల కావాలి" అనే కవితతో స్త్రీవాదం ప్రారంభమైంది. ఇది 1977 తర్వాత ఉద్యమరూపం దాల్చింది.

ప్రసిద్ధ స్త్రీవాద కవయిత్రులు – రచనలు :

రేవతీదేవి, జయప్రభ, కొండేపూడి నిర్మల, ఈశ్వరి, విమలగార్లు స్త్రీవాద కవిత్వాన్ని బలంగా విన్పించారు.

రేవతీదేవి:

వీరు 1980లో 'శిలాలోలిత' అనే కవితా సంకలనం ప్రచురించారు. తాము చెప్పదలచుకున్న విషయాన్ని చెప్పనీయకుండా ఈ సమాజం అడ్డుపడుతున్నదని బాధపడ్డారు. స్త్రీలకు ఒక న్యాయం, పురుషులకు ఒక న్యాయం అనే ద్వంద్వ నీతిని వీరు తీవ్రంగా నిరసించారు. సమాజంలోని ప్రతి విషయాన్ని స్త్రీ పురుషులకు సమానంగా వర్తింప జేయాలని నొక్కివక్కాణించారు.

జయప్రభ:

వీరు 1980లో "సూర్యుడు కూడా ఉదయిస్తాడు". 1986లో "యుద్ధోన్ముఖంగా" "ఇక్కడ కురిసిన వర్షం ఎక్కడి మేఘానిది" 1988లో "వామనుడి మూడో పాదం" అనే కవితా సంకలనాల్ని ప్రచురించారు. స్త్రీలపై జరుగుతున్న అణచివేతను వ్యతిరేకించారు."నా దేశంలో స్త్రీ', 'ప్రతి చర్యగా', 'మానవి, 'విస్తరిస్తున్న ఎడారులం' పైటను తగలెయ్యాలి వంటి కవితా ఖండికలు వీరికి మంచి పేరును తెచ్చిపెట్టాయి. వీరి కవిత్వంలో సోషలిస్టు ఫెమినిస్టు ధోరణి కనిపిస్తుంది.

కొండేపూడి నిర్మల:

వీరు 1986లో 'సందిగ్ధ సంధ్య' 1990లో 'నడిచే గాయాలు' 'బాధా సప్తనది', 'మల్టీ నేషనల్ ముద్దు' అనే కవితా సంపుటాలను ప్రదర్శించారు. 'నడిచే గాయాలు' అనే కవితలో వేశ్యల శారీరక, మానసిక హింసను కన్నుల ముందు సాక్షాత్కరింపజేశారు. వీరు రాసిన 'ఆవిడెప్పుడూ సిద్ధంగా ఉంటుంది' 'మరణ వాగ్మూలం', 'యుద్ధ శిశువు', 'కప్పల తక్కెడ', 'గోడలు', 'వధూగీతం' మొదలైన కవితా ఖండికలు స్త్రీవాదానికి ప్రతిబింబంగా నిలిచాయి.

ఈశ్వరి:

సేల్స్‌గర్ల్ జీవితంలో ఎదురైన అనుభవాల్ని కళ్ళకు కట్టించారు. కదనం, మంచిరోజులు, నివేదన అనే కవితలో స్త్రీ ఆవేదనను, బాధను వివరించారు.

విమల:

1980–88 మధ్యకాలంలో విమల రాసిన కవితల్ని 'అడవి ఉప్పొంగిన రాత్రి' అనే పేరుతో విరసం వారు ముద్రించారు. స్త్రీ సమస్యలకి విప్లవోద్యమానికి ఉన్న సంబంధాన్ని అవగాహన చేసుకొని శాస్త్రీయమైన పరిష్కార మార్గాన్ని చూపించారు. సౌందర్యాత్మక హింస, వంటిల్లు కవిత వంటి కవితలు రాసారు. వీరి కవితలు 'నీలి మేఘాలు' కవితా సంకలనంలో చేర్చబడ్డాయి.

సావిత్రి:

సావిత్రి గారు 'బందిపోట్లు' కవితలో పురుషాధిపత్యాన్ని కుప్పపోసినట్లు చూపించింది. భారతదేశంలోని వివాహ వ్యవస్థని చీల్చి చెండాడింది. పాఠం చెప్పకపోతే 'పెళ్ళి చేస్తానని' పంతులుగారు అన్నప్పుడూ, 'ఆఫీసులో నా మొగుడున్నాడు' అని అన్నయ్య అన్నప్పుడూ, వాడికేం 'మగమహారాజు' అని ఆడామగా వాగినపుడూ, పెళ్ళంటే పెద్ద శిక్షని, మొగుడంటే 'స్వేచ్ఛా భక్షకుడ'ని కవయిత్రికి

అర్థమయింది. పెళ్ళి అనేది స్త్రీకి తప్పనిసరి అవుతుంది. పురుషుడికి పెళ్ళి జరగకపోతే 'పెళ్ళి చేసుకోలేదు' అంటారు. స్త్రీకి పెళ్ళి జరగకపోతే 'పెళ్ళి కాలేదు' అంటారు. స్త్రీ పెళ్ళి ఎన్ని కష్టాలతో కూడుకున్నదో అందరికీ తెలుసు. డబ్బు ఖర్చుపెట్టి చేసుకున్న పెళ్ళివల్ల స్త్రీకి ఒరిగిందేమిటి. తనను హింసించే పురుషునికి లైసెన్సు ఇవ్వటమే. పెళ్ళి వల్ల స్త్రీకి ఇంటి చాకిరీ, పిల్లల పెంపకం అనే రెండు సంకేళ్లు పడతాయి. నిర్బంధాలూ, ఆంక్షలూ ఎలాగూ ఉంటాయి.ఇంతకంటే పెద్ద శిక్ష ఏం ఉంటుంది. స్త్రీకి పంతులుగారు పెళ్ళి చేస్తాను అనటంలో ఇంత అర్థం దాగి ఉంది" అని వివరించింది.

స్త్రీవాద సాహిత్యం – సమాజం:

1960–70 దశకంలో రచయితలు, కవయిత్రులు అనేకమైన రచనలు చేశారు. వర్ణాంతర వివాహాలు, ప్రేమపెళ్ళిళ్లు, చదువు సంస్కారం వంటి ఇతివృత్తాలతో నవలలు, కథలు రాశారు. వరకట్న సమస్యలు, కుటుంబాల్లో స్త్రీల కష్టాలు, అత్తా కోడళ్ళ ఆరళ్ళు ఆరాట పోరాటాలన్నీ కథా వస్తువులయ్యాయి. 1978లో ముప్పాళ్ల రంగనాయకమ్మ గారు రాసిన 'జానకి విముక్తి నవల వచ్చింది. ఈ నవలలో స్త్రీ స్వేచ్ఛా రాహిత్యాన్ని చిత్రించారు. 1905లో బండారు అచ్చమాంబ 'అబలా సచ్చరిత్రమాల' నవలను రాసి స్త్రీల కష్టాలను, ఆత్మగౌరవ స్వేచ్ఛల ప్రస్థావన, ప్రాతివ్రత్య విషయం, పురుషాధిక్యతతో స్త్రీల బాధ్యతలు ఎట్లా ఉంటాయో అన్నీ చిత్రించారు.

అనిశెట్టి రజిత, హిమజ, ఐనంపూడి శ్రీలక్ష్మి, దేవులపల్లి వాణి, అడవాల సుజాత వంటి రచయిత్రులు, కవయిత్రులు ఎందరో తెలుగు సమాజాన్ని తట్టిలేపుతున్నారు. సమాజంలో స్త్రీల పాత్ర మహోన్నతమైన పాత్ర. ప్రేమ పేరుతోమోసం చేస్తున్న వారిని ఎట్లా పసిగట్టాలో చెప్పి, యువతను చైతన్యపరచాల్సిన బాధ్యత కవయిత్రులపైనే ఉంది. అలాగే అసభ్యకర సన్నివేశాలను చిత్రిస్తున్న సినిమా రంగాన్ని, బుల్లితెరను, అభ్యంతరకర కార్యక్రమాలు నిర్వహిస్తున్న సభ్య సమాజాన్ని నిలదీయాలి. ఉద్యమాల్లో స్త్రీలంతా ఎంత ధైర్యంగా పాల్గొన్నారో మరువకూడదు. స్త్రీ జాతిపై జరిగే ప్రత్యక్ష పరోక్ష దాడులను ఖండించాలి. అసమానతలు తొలగించాలి. తల్లిగా, చెల్లిగా, అక్కగా, భార్యగా, కూతురిగా స్త్రీని ఈ సమాజం ఎట్లా ఇబ్బందులకు గురిచేస్తుందో కవిత్వంలో తెలియజేయాలి. ఈ సమాజం స్త్రీని ఎట్లా చూడాలో కవితా గర్జనలో తెలియజేయాలి. ఇది మన బాధ్యత.

ముగింపు:

స్త్రీవాద కవిత్వం వ్యవస్థను ప్రశ్నించడంతో ప్రారంభమైంది. పితృస్వామ్య వ్యవస్థ కారణంగా సమాజంలో వేళ్ళూనుకున్న ద్వంద్వ ప్రమాణాలను, స్త్రీ పురుషుల అసమానత 'అతి సహజమని' పరిగణించే ఆలోచనా విధానం మారాలి. జీవితాన్ని, ప్రపంచాన్ని స్త్రీల దృక్పథం నుంచి చూడవలసిన అవసరం ఎంతైనా ఉంది. అన్ని రంగాలలోనూ స్త్రీ సమాన హక్కు, స్వేచ్ఛని కోరుకుంది. వైవాహిక జీవితంలో ఇద్దరికీ సమాన గౌరవం ఉండాలని ఆకాంక్షిస్తుంది.

ఆధార గ్రంథాలు:

1) డిగ్రీ రెండవ సంవత్సరం – స్పెషల్ తెలుగు–సెమిస్టర్–4
2) అంతర్జాల మాధ్యమం
3) జయప్రభ – పైటను తగలెయ్యాలి
4) వంటిల్లు – విమల

నిఘంటువులు:–

1) శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు 2) ఆంధ్ర శబ్ద రత్నాకరము – బహుజనపల్లి సీతారామాచార్యులు
3) తెలుగు పర్యాపద నిఘంటువు – ఆచార్య జి.ఎస్.రెడ్డి – ప్రగతి పబ్లిషర్స్ – 2016.

తెలుగు నాటకం – సామాజిక చైతన్యం

డాక్టర్ నేలటూరి అనిత మార్గరెట్, తెలుగు అధ్యాపకులు SRR & CVR ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అ), విజయవాడ

దశరూపకాలలో ఒకటైన నాటకానికి ఆర్యులు అగ్రస్థానాన్ని ఇచ్చారు. ప్రాచీనులు ''కావ్యేషు నాటకం రమ్యం'' అంటే, ''నాటకం కంటితో చూసే యజ్ఞం'' లాంటిదన్నాడు మహాకవి కాళిదాసు. ప్రపంచ నాటక కర్త విలియమ్ షేక్స్పియర్ ''జీవితమే ఒక నాటకం'' అన్నాడు. జీవితానికి అనుకరణ అయిన నాటకం కాల్పానిక భావంతో ప్రేక్షకులకు ఆనందాన్ని కలిగించే అద్భుతమైన కళాస్వరూపం, సర్వకళల సమాహారం. నాటకంలో ఇతర లలిత కళలన్నిటికి స్థానం ఉంది గనుక కళారంగం అంటే మొదట మనకు గుర్తుకు వచ్చేది నాటక రంగమే. సాహిత్యంలో అనేక ప్రక్రియలున్నప్పటికి నాటకం వాటన్నిటినీ ప్రక్కకు త్రోసివేసి విశిష్టస్థానాన్ని, అగ్రాసనాధిపత్యాన్ని పొందటానికి కారణం నాటకం దృశ్యరూపం కావటమే. నాటకం వ్యక్తి జీవితం, నాటకం వ్యవస్థరూపం, నాటకం సమస్త ప్రపంచం ఎవరెన్ని విధాలుగా నిర్వచించినా, విశ్లేషించినా, నాటక ప్రక్రియ ఎంత ఉన్నతమైనదో, విశిష్టత కలిగి ఉన్నదో భావితరాలకు తెలియజెప్పటం మన కర్తవ్యం.

సమాజంలో ప్రజల కష్టాలు, కన్నీళ్లు, ఉద్వేగాలు, సమస్యలు, సంఘర్షణలు, వైరుధ్యాలు, విభిన్న ప్రవృత్తులతో కూడిన సమగ్ర మానవుణ్ణి చిత్రించే దిశగానే తెలుగు నాటక రంగం ప్రయాణించింది. సాంఘిక సమస్యలను కళాత్మకంగా ప్రయోగించటంలో, వస్తు వైవిధ్యాన్ని చూపటంలో నాటక రంగం నిర్వహించిన పాత్ర ప్రశంసనీయం. ప్రజా జీవనంతో మమేకమవుతూనే కాలానుగుణమైన ఇతివృత్తాలతో నాటకం ప్రజా ప్రయోగ కళగా భాసిల్లింది.

కొంతమంది చరిత్రకారుల కథనం ప్రకారం మన నాటక కళను గ్రీసు దేశం నుంచి స్వీకరించామని అన్నారు. క్రీస్తు పూర్వం నాల్గవ శతాబ్దం నుండి గ్రీసు దేశస్తులు మన దేశానికి రాకపోకలు సాగిస్తూ వచ్చారు. రాజదర్బారులకు నాడు అపరిమితంగా చేరుకున్న గ్రీకులు మన నాటక కళకు ప్రాతిపదికలు వేసి ఉండవచ్చు. మన తొలి నాటకాలు భాసునితో అనగా క్రీస్తుపూర్వం దాదాపు రెండవ శతాబ్దంలో రచించబడ్డాయి. బాణుడు, భవభూతి, కాళిదాసు, శ్రీహర్షుడు, విశాఖ దత్తుడు, శూద్రకుడు నాటకాన్ని సుసంపన్నం చేశారు. ఆంగ్లేయుల ద్వారా నాటకం నూతన రూపాన్ని సంతరించుకొని భారతావనిలో స్థిరపడింది. 1847 లో కొంతమంది పార్శీవారు ఈస్టిండియా కంపెని ఆఫీసర్ల కొరకు బొంబాయి పోర్టులో నాటక ప్రదర్శనలు జరిపేవారు. తరువాత బాల్కొండ కంపెని దేశమంతా తిరుగుతూ నాటక ప్రదర్శనలు ఇచ్చేవారు. ధార్వాడి నాటక సమాజముల వారు ఆంధ్రదేశం నలుమూలలా పర్యటించి అన్ని పట్టణాలకు నాటకాన్ని పరిచయం చేశారు.

తెలుగు భాషలో మొదటి నాటక సాహిత్యం మంజరీ మధుకరీయం ను కోరాడ రామచంద్ర శాస్త్రి 1860 లో వెలువడించారు. మొదటి సాంఘీక నాటకంగా వావిలాల వాసుదేవ శాస్త్రి రాసిన నందక రాజ్యం 1880 లో ప్రసిద్ధి చెందింది. మొదటిసారి ప్రదర్శించబడిన నాటకంగా 1880లో కందుకూరి వీరేశలింగం పంతులు రచించిన 'వ్యవహార ధర్మబోధిని' వినుతికెక్కింది. ఆంధ్రనాటక పితామహుడిగా గుర్తింపు పొందిన వారు ధర్మవరం రామకృష్ణమాచార్యులు. ఈయన 1887 లో చిత్రనళీయం, విషాధ సారంగధర, 1914లో పాదుకా పట్టాభిషకం, ప్రమీలార్జునీయం మొదలైన ఇరవై మూడు నాటకాలు రచించారు.

ఆధునిక తెలుగు నాటకం ప్రారంభమైన తొలిదినాల్లో రచయితలు సంఘ సంస్కరణకు ప్రాముఖ్యమిస్తూ సాంఘిక దురాచారాలను, దుర్వ్యసనాలను ఖండిస్తూ రచనలు చేశారు. సామాజిక జీవనాన్ని దెబ్బతీసే దురాచార నిర్మూలన కోసం,

దుర్వ్యసనాల నివృత్తి కోసం గురజాడ అప్పారావు, కాళ్లకూరి నారాయణరావు, కందుకూరి వీరేశలింగం పంతులు రాసిన నాటకాలు ఈ కోవలోకే వస్తాయి. నాటికి, నేటికి ప్రామాణికంగా చెప్పబడుతున్న గురజాడ వారి 'కన్యాశుల్కము' (1892) నాటకం కన్యాశుల్క దురాచారానికి వ్యతిరేకంగా రాయబడింది. కాళ్లకూరి వారి చింతామణి (1921) వర విక్రయము (1926) మధుసేవ (1926) నాటకాలలో చింతామణిలో వ్యభిచారము, వరవిక్రయంలో వరకట్న దురాచారం, మధుసేవలో మద్యపానం ప్రధాన సమస్యలుగా ప్రస్తావించబడ్డాయి. ఆధునిక నాటక ప్రదర్శనకు ఆరంభకులైన కందుకూరి వీరేశలింగం పంతులు 1880 ప్రాంతాలలో బ్రాహ్మ వివాహము, వ్యవహార ధర్మబోధిని మొదలగు పదహారు నాటకాలు రాశారు. వీటిలో ప్రధానంగా బాల్యవివాహాలు, వృద్ధవివాహము, కన్యాశుల్కము మొదలైన దురాచారాలు ఎత్తిచూపుతూ, సంఘ సంస్కరణాభిలాతోనే రచనలు చేశారు.

మహాత్మాగాంధి 1920లో భారత జాతీయ పోరాటానికి నాయకత్వం స్వీకరించి, దేశమంతటా సంచారం చేయటం మొదలైన తర్వాత ఆ ఉద్యమానికి ప్రభావితులైన రచయితలు దేశభక్తితో స్వాతంత్ర్య సాధన ధ్యేయంగా ప్రజలను చైతన్య పరచటానికి నాటకాలు రాయటం ప్రారంభించారు. అట్టివారితో ముఖ్యులు దామరాజు పుండరీకాక్షుడు, ఈయన రాసిన 'గాంధీమహోదయం', గాంధీ విజయం, పాంచాల పరాభవము (1921-22) నాటకాలు ప్రాచుర్యం పొందాయి. డి. సీతారామయ్య, 'స్వరాజ్య ధ్వజము' (1921) శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రి 'గాంధీ విజయధ్వజం' నాటకం (1924) శ్రీ శ్రీనివాస చక్రవర్తి 'దేశబంధు' మొదలైన నాటకాలు చెప్పుకోదగినవి.

1913 లో ప్రారంభమయిన ఆంధ్రోద్యమ ప్రభావం కూడా నాటక రచయితల మీద పడింది. ఈ సమస్య మీద వెలువడిన మొదటి నాటకం 'ఆంధ్రమాత' ను గ్రంధి వెంకట సుబ్బరాయ గుప్త రచించారు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సమస్యను స్వీకరించి కవులూరు హనుమంతరావు 'ఆంధ్ర పతాకం' (1939), గుళ్లపల్లి నారాయణ మూర్తి 'ఆంధ్రజ్యోతి' (1941), మలిపాక రామశాస్త్రి రాసిన 'ఆంధ్రమహానాటకము' మొదలైనవి చెప్పుకోతగినవి. హరిజన సమస్య, వివాహ సమస్య, స్త్రీ స్వాతంత్ర్య సమస్య మొదలగు సంఘ సమస్యలు కూడా నాటక రచనలకు ఇతివృత్తాలయినాయి. ఆ కాలంలో అంటరానితనాన్ని రూపుమాపాలన్న సంకల్పంలో రాసిన నాటకాలలో ఏ. నీలకంఠశాస్త్రి 'హరిజనుడు', ధర్మవరం గోవిందాచార్యుల 'అస్పృశ్య విజయం' మొదలయినవి ఆ కోవలోనివే.

ఆర్థిక అసమానతలు, రైతు-కూలి సమస్యలను ప్రతిబింబిస్తూ వెలువడిన నాటకాలలో ముఖ్యంగా చెప్పుకోదగినవి దువ్వూరివారి 'కృషీవలుడు' (1919), సి. సత్యనారాయణరావు స్వేచ్ఛాజీవులు (1937) సబ్బవీసు రామారావు 'రైతు బిడ్డ' (1939), మంధా సూర్యనారాయణ 'కృషీవల విజయం' (1935), శేషాద్రిశర్మ 'హాలికోద్ధారము' (1935) మొదలయినవి.

వివాహ సమస్యల గురించి చెప్పాలంటే వర్ణాంతర మతాంతర వివాహములు, ప్రేమ వివాహం, విధవా వివాహములు, దేవదాసి సమస్య మొదలైనవి నాటకాలకు వస్తువులయ్యాయి. సి. వెంకట రామ శాస్త్రి 'ఇతడు-ఈమె' నాటకంలో విధవ వివాహ సమస్య ప్రధానము. టేకుమళ్ల కామేశ్వరరావు 'కోపదారి మొగుడు' లో స్త్రీ స్వాతంత్ర్యం, విధవా వివాహం ప్రధాన సమస్యలు. ఇంకా బళ్ళారి రాఘవాచార్యుల 'సరిపడని సంగతులు' (1933), మల్లాది అవధాని 'గాలివాన' (1938) ఆ కోవకు చెందిన రచనలే. స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం ఉన్నప్పుడే సమాజంలో సముచిత స్థానం లభిస్తుందని నొక్కి చెప్పటం ఆ కాలంలో పెద్ద గాలివానే సృష్టించింది. దేవదాసి సమస్యను ఇతివృత్తంగా స్వీకరించి కె. కృష్ణారావు 'మంచివాళ్ళెవరు', పి.వి. రాజమన్నారు 'మనోరమ' వంటి నాటకాలను ప్రతిభావంతంగా రాశారు.

భారతదేశ విభజన తర్వాత హిందూ, ముస్లింల అంత:కలహాల నేపధ్యంలో వెలువడిన ' ఈనాడు' (1947) నాటకాన్ని ఆచార్య ఆత్రేయ రచించారు. మధ్యతరగతి కుటుంబాల మనస్తత్వం, లేని గొప్పలకు పోయి వారు పడే అగచాట్లు నేపధ్యంలో యన్.జి.ఓ. (1949) నాటకాన్ని కూడా ఆత్రేయ రచించారు. ఇదే ఇతివృత్తాలతో అనిశెట్టి సుబ్బారావు ' గాలి మేడలు ', (1953) గ్రామ రాజకీయాలను వేదికగా చేసుకొని ' మావూరు ' (1954), రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత శాంతిస్థాపన లక్ష్యంగా ఆత్రేయ ' విశ్వశాంతి' (1953) అనిశెట్టి ' శాంతి ' (1955) లో రాశారు. సుంకర, వాసిరెడ్డిల ' ముందడుగు ' (1945) నాటకంలో జమీందారీ విధానంలో రైతులు, కూలీలు ఏ విధంగా అణచివేతకు గురవుతున్నారో, తెలుపుతూ, ధనిక, భూస్వాములకు వ్యతిరేకంగా భూమి కోసం పేదరైతు కూలీలు చేస్తున్న పోరాటానికి పరాకాష్టగా 'మాభూమి' (1947) నాటకాన్ని రచించారు. రైతులు, కూలిలు హరిజన సమస్యలు స్వీకరించి బోయి భీమన్న 'పాలేరు' (1942) కూలిరాజు నాటకాలు రాశారు. నార్లవారు 'కొత్తగడ్డ' (1947), 'పై పంట' నాటకాలలో రైతు జీవితాన్ని గొప్పగా చిత్రించారు. కణ్వశ్రీ 'ఇదా ప్రపంచం' (1950) కొడాలి గోపాలరావు 'పేద రైతు' (1952) కూలి (1953), 'తిరుగుబాటు' (1954) షేక్ నాజర్ రాసిన 'ఆసామి' (1954) నాటకాలలో రైతు సమస్యలు భూస్వాముల ఆగడాలు వివరించబడ్డాయి.

విశేషంగా ప్రజాదరణ పొందిన భమిడిపాటి 'కీర్తి శేషులు', మోదుకూరి జాన్సన్ ' నటనాలయం' (1966), సంజీవి 'సమాధానం కావాలి', యం.వి.యస్. హరనాధరావు 'యక్షగానం' (1990) నాటక కళాకారుల దుర్భర పరిస్థితులు వెల్లడించగా, నడిమింటి నరసింగరావు 'బొమ్మలాట' నాటకం సత్యానంద్ దర్శకత్వంలో మన తెలుగు నాటకాన్ని జాతీయస్థాయిలో నిలబెట్టింది. రాజకీయ నాయకుల దుర్మార్గాలను వివరిస్తూ పరుచూరి వెంకటేశ్వర రావు 'సమాధికడ్తున్నాం–చందాలివ్వండి' (1975) నిరుద్యోగ యువకుల మేధాశక్తిని ఉపయోగించుకోలేని సమాజ దౌర్భాగ్య స్థితిని చూపుతూ ' మనుషులొస్తున్నారు జాగ్రత్త ' (1976) యండమూరి వీరేంద్రనాథ్‌ల నాటకాలు సమాజాన్ని ప్రశ్నించే చైతన్యాలు. ఇలా అనేక నాటకాలు సమాజం లోని ప్రతి అన్యాయాన్ని వేలెత్తి చూపుతూ ప్రజలను ఉత్తేజపరుస్తూ సామాజిక చైతన్యానికి తమవంతు కృషి చేశాయి.

సమాజాన్ని చైతన్యపరచటానికి కళలు శక్తివంతమైన సాధనాలు, కళలు రెండంచుల కత్తివంటివి. మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దగలవు. అధ:పాతాళానికి నెట్టగలవు. పాశ్చాత్య సంస్కృతి ప్రభావంతో నేడు పక్కదోవ పట్టిన మన ఆధునిక కళల ప్రేరేపణతో ప్రస్తుతం మన సమాజంలో పెరుగుతున్న దుర్ఘటనలు చూస్తుంటే కళల యొక్క ప్రభావమేమిటో మనకు బాగా అర్థం అవుతుంది. కాబట్టి కళలన్ని ప్రయోజనాత్మకంగా ఉండాలి. జన చైతన్యానికి, సమాజాన్ని మేల్కొల్పటానికి ఆయుధాలుగా ఉపయోగపడాలి.

చలనచిత్రం, టెలివిజన్ ప్రభావం వల్ల నేడు నాటక రంగం ప్రజాదరణ విషయంలో బాగా వెనుకబడింది. వ్యాపార ధోరణులతో బాగా ప్రాచుర్యంలోకి వచ్చిన చలనచిత్ర, టెలివిజన్ రంగాలు రెండూ జీవనవాస్తవికతను, సామాజిక సమస్యలను పట్టించుకోవటం మానేసి సమస్త మానవ విలువలను కలుషితం చేస్తున్న పాశ్చాత్య విష సంస్కృతిని పెంచి పోషించటానికి పోటీపడుతున్నాయి. తెలుగుభాషకు, సంస్కృతికి తెలుగువాళ్లను దూరం చేస్తున్నాయి. అయితే తెలుగు నాటకం మాత్రం ఏనాడు ఆ స్థాయికి దిగజారలేదు.

తెలుగు నాటకం జాతీయ స్థాయిలో ప్రయోగాల విషయంలో వెనుకబడిందన్న అభియోగం ఎప్పటినుండో ఉన్నదే. అయితే మన తెలుగు నాటకానికి ఆడంబరం

లేకపోవచ్చు. ఆహా, ఓహో అనిపించుకోగలిగే అట్టహాసం చేతగాకపోవచ్చు. ఎంత నిరాడంబరంగా కనిపిస్తేనేం తన చుట్టు ఉన్న సమాజాన్ని తనలో ఇముడ్చుకోవటంలో మాత్రం నిజాయితీగా వ్యవహరించింది నిర్భయంగా నిలబడింది. ముక్కు సూటిగా సాగింది. 'నాటకానికి ప్రయోగం కన్నా ప్రయోజనం మిన్న 'అనుకోగలిగితే ఈ వందేళ్లలో నాటక రంగం ఎంతో సామాజిక స్పృహను ప్రదర్శించిందనటానికి సాక్ష్యం అనేక సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా స్పందిస్తూ, సామాజిక సమస్యలను చర్చిస్తూ, పరిష్కారాలు సూచిస్తూ, సమాజ అభ్యున్నతికి పాటుబడిన వేలాది నాటకాలే నిలువెత్తు నిదర్శనం.

ఉపయుక్త గ్రంధాలు

1. ఆధునిక భారతి – తెలుగు టెక్స్ట్ బుక్, సెమిస్టర్–2
2. తెలుగు సాహిత్య చరిత్ర – డా.ద్వా.నా. శాస్త్రి
3. తెలుగు సాహిత్య సమీక్ష – డా.జి. నాగయ్య
4. దృశ్యం – గుంటూరు కళా పరిషత్ ప్రత్యేక సంచిక
5. నాట్యకళ – ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమి దశాబ్ద ప్రగతి
6. రూపిక – నాటకరంగ విశేష సంచిక.

'తెలుగు సాహితి ప్రక్రియలలో శతకాలు, ప్రాధాన్యత:ఒక అవలోకనం'

డా॥ డి.సహదేవుడు, చరిత్ర ఉపన్యాసకులు, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (ఎ), అనంతపురము.

డా॥ యం.హరిప్రసాద్, చరిత్ర ఉపన్యాసకులు, వై.వి.ఎన్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కైకలూరు, కృష్ణా జిల్లా.

శతకము – పరిచయము :

శతకం జనాదరణ పొందిన శక్తివంతమైన సాహితి ప్రక్రియ రసనియమం, చంధోనియమం, మకుట నిమయం, ఆత్మాశ్రయ కవితాధర్మము అను లక్షణాలు తెలుగు శతకాలలో కనిపించే సామాన్య అంశాలు. సామాన్యముగా శతకములలో వందకి బదులు నూట ఎనిమిది పద్యాలు ఉండుట సాంప్రదాయంగా వాడుకలో వస్తున్నది. తొలిదశలో భక్తి ప్రధాన శతకాలు వచ్చిన తదుపరి అనేక విభిన్న అంశాల శతకాలు, రచనలు కొనసాగాయి. శతక పద్య సంఖ్యా నియమాలు కూడా సడలించారు. కవులు పద్య ఆరంభమున లేక పద్యం చివర మకుటాలు కూడా ప్రయోగించారు.

ఆంధ్ర సాహిత్యారామములో శతకములు నిత్యసౌరభముల వెదజల్లు కుసుమములు. ఆంధ్ర వాఙ్మయములో నన్నయకు వంద సంవత్సరముల తర్వాత శతక రచన. ఆరంభమైనదని తెలియుచున్నది. అంతకు ముందుగూడ శతకములున్నవని మన పెద్దలు చెప్పు చున్నారు. కాని అవి యిపుడు లభించక కాలగర్భములో గలసిపోయినవి. అవి మన దురదృష్టము.

ఆంధ్రవాఙ్మయము నందు భారత, భాగవత, రామాయణాది కావ్యములను, ప్రబంధములను మించ లేకున్నను వానితో సమానముగ విరాజిల్లినవి శతకములే యని చెప్పవచ్చును. ఇవి పండిత పామర హృదయ రంజకముగ నున్నవి. మిక్కిలిగా ప్రజాదరణను బొంది యున్నవి. ప్రాచీన కవుల లేఖిని నుండి వెలువడిన అమృత బిందువులీ శతకములు.

శతక పరిణామము :

ప్రప్రథమమున శతకము మత పద్ధతులను చక్క జేయుటకు కొందరు శైవకవులు ప్రారంభించిరి. 11వ శతాబ్దములోని మతపరిస్థితులు మనకందరకు విదితమే. అప్పటి పరిస్థితులను పురస్కరించుకొనియే భారత రచన సాగినదని యెల్లరకు తెలియును. మొట్టమొదట శివుని సంబోధించుచు వ్రాయబడినది పండితారాధ్యము. దీనిని మల్లికార్జున పండితారాధ్యులు రచించిరి. ఇదే మొదటి శతకమని శ్రీ కొమఱ్ఱాజు లక్ష్మణరావు గారును తలచిరి. ఆనాడు యవన, మహమ్మదీయుల చేత పడుచున్న బాధలకు, మతభ్రష్టతకు కవియాత్మ విలపించి శతకరూపముగా వెలువడినట్లు మనకు వానిలోని పద్యములు తెలుపుచున్నవి. ఇతడు భక్తి, స్వమతాభిమానము "భక్తి మీది వలపు బ్రాహ్మ్యంబుతో పొత్తు బాయ లేను నేను బసవలింగ" దీనితో తెలియుచున్నది. ఇందులో లోకోక్తులు మిక్కుటము. శతకములలో కవులయనుభవము ఘనీభవించినట్లు వారి కావ్యముల వలన తెలియును.

శతక లక్షణాలు :

శతకమనగా నూరు లేక 108 పద్యములు గలిగి యుండు కావ్యము. సంఖ్యార్థమునే శతకము సూచించుట తెల్లమగుచున్నది. కాలాంతరమున నితర కవులు వారి సొంత పద్యములను జేర్చుటయు, శతకము లందలి సంఖ్యా భేదమునకు గారణమై యుండును. ప్రతి శతకమునకు ప్రత్యేక మకుట ముండుటయు, నదియే శతక నాయమును దాల్చుచుండుటయు విశదము. అందుకు కవులు వారి వారి యిష్టదైవముల పేర్లనే మకుటము నుంచుట విశేషముగ గలదు. కావ్యమును కవులు మానవార్పణ చేయక భగవ దర్పణ గావించుట యిందు విశిష్టము.

కొందరు లాక్షణికులు శతకములను కావ్య గ్రంథములుగ గ్రహించక పోయిననునవి వాఙ్మయములో విశిష్ట స్థానమును, ప్రజాదరణను పొందినవి. కొందరు విమర్శకులు పామర జనుల కొఱకే శతకములు రచింప బడినవని తలంచిరి. అది సత్యమే. కాని పండితైక వేద్యములు గూడయని చెప్పవలసియున్నది. అందుకు నిదర్శనము వృషాధిప శతకము. దీని కర్తపాలకుఱికి సోమనాథుడు. ఇతడష్ట భాషా కవి. ఈ శతకము భక్తి సంభరితమై శతక కుసుమములలో పారిజాతము వంటిది. శతక సంఖ్యను శతక కవులే తెల్పినట్లు గలదు. "కొండల వంటి కవీశ్వరుల్ శతకముల్ గూర్పంగ కోటాన కోట్లుండన్" అని దేవకీనందన శతకములోని పద్యపాదమున తెల్లమగు చున్నది.

శతకములు – రకములు :

శతకములలో పెక్కు రీతులు గలవు. కొన్ని నీతి బోధకములు, భక్తి బోధకములు, వేదాంత బోధకములు లేక వైరాగ్య శతకములు, శృంగార శతకములు, సమాజము నందలి క్రుళ్ళును, రాజుల మదాంధతను వ్యక్తము చేయు నిందాగర్భ సూచకము గా నుండు శతకములును గలవు. ఇవి భావమందును, రచనయందును సాటిలేనివి. కొన్ని శతకము లకారాది పరముగ నున్నవి. ఉదా :– భాస్కర శతకము. నేడు శతకములలోని పద్యములు పాఠ్య గ్రంథములుగ లేని పుస్తకము లరుదు. అందును శతక పద్యములు రాని యాంధ్రుడుండడు.

భక్తి జ్ఞాన వైరాగ్య నీతిబోధకములే గాక శతకములు హాస్యరసముతో గూడి యున్నవి. సంఘ సంస్కరణకు, బ్రజల బహిరంగ జీవితమునకు మంచి మేలును గూర్చుచున్నవి. 13వ శతాబ్దమున రచింపబడిన సర్వేశ్వర శతకము పై మూడింటిలో నుత్తమమని బలువుర విజ్ఞుల యభిప్రాయము. పై మువ్వురు శతక వాఙ్మయ బ్రహ్మలు, చిరస్మరణీయులు. వీరివి ప్రాచీన శతకములు.

ఇంకను శతకము లనేకములు గలవు. అందు ధూర్జటి విరచితమగు కాళహస్తీశ్వర శతక మగ్రతాంబూల మందుకొనినది. ఇతడు సాహితీ సమరాంగ సార్వభౌముడైన కృష్ణదేవరాయల ఆస్థాన కవులలో నొక డనుట సుప్రసిద్ధము.

ఈ గ్రంథము భక్తికి, ప్రపత్తికి సాటిలేనిది. ఇతడు నిర్భయముగ నాటి రాజులను తెగదిట్టినట్లు తెలియుచున్నది. ఇతడు భక్తుడుగా, యోగిగా, జ్ఞానిగా, విరాగిగా, కవిగా, పండితుడుగా నున్నట్లు తెలియును. రనజ్జుడు, "నీ పంచఁబడి యుండగాఁ గల్గిన భిక్షాన్నమే చాలు" యని భక్తి తాదాత్మ్యమును వ్యక్తీకరించెను. ఇట్టి శతక కవులు తమ కావ్యములచే ముల్లోకములందు కీర్తికాయులై సూర్యచంద్రులున్నంత వరకు ప్రకాశించుచున్నారు.

సుమతి శతకము, కుక్కుటేశ్వర శతకము, వేణుగోపాల శతకము, మదనగోపాల శతకము, మల్లికార్జున శతకము, రామలింగేశ్వర శతకము, బాలగోపాల శతకము, నందనందన శతకము, ఆంధ్రనాయక శతకము, హంసల దీవి గోపాల శతకము, మానస బోధ శతకము, పార్థసారథి శతకము, లక్ష్మీదేవి శతకము, నారాయణ శతకము, కృష్ణ శతకము, కుమారీ శతకము, నరసింహ శతకము, దాశరథీ శతకము, భాస్కర శతకము, ఏకామ్రలింగ శతకము, రామతారక శతకము, సరస్వతీ శతకము, సుబుద్ధి శతకము, కుమార శతకము, వీరభద్ర శతకము, వేమన శతకము మొదలగు గ్రంథము లెన్నో కోకొల్లలు. స్త్రీలు గూడ శతకములు రచించినట్లు తెలియుచున్నది.

మదిన సుభద్రమ్మ యను నామె రఘునాయక శతకము, కేశవ శతకము రచించెను. కాపురము విశాఖపుర మండలము. కాలము 18వ శతాబ్దము. పూర్తి గ్రంథము దొరకలేదు. రత్నమాంబ యను నామె వేంకటరమణ శతకమును వ్రాసెను. కాలము తెలియదు. పోతనాది కవులును శతకములు వ్రాసిరని వాడుక. కాని వారి గ్రంథముల లభ్యములు. ఇంకను ఒకే పేరు గల శతకములు

రెండును గలవు. ఆయా కవుల సమకాలికుల పోకడలు, పోలికలు శతకములలో గలవు. ఇంకను ఒక్కొక్క శతకమున కొకటి రెండు పద్యములు లభించునవియు నెన్నో గలవు. "లక్షణ పరాయణుండ నారాయణుండ, భైరవా, నారాయణా, శరభాంక, లింగమా" యను మకుటములు గల పద్యములు కన్పించుచున్నవి. వీనియన్నింటికి శైలికి వద్యము లుదహరించవలెనన్న నీ చిన్న వ్యాసమున కష్టము. కావున ముఖ్యమని తోచిన కొన్నింటిని మాత్ర ముదహరించు చున్నాను.

కొన్ని శతకముల యెడ కర్త ృత్వమును శంకా స్పదముగ నున్నది. సుమతి శతకము భీమకవి కృతమనియు, సుమతియను జైనముని విరచితమనియు, బద్దెన కృతమనియు పలువురు పలు విధములుగ భావించుచున్నారు. అందులకు కొన్ని వద్యములు శతకములలోను, చాటువులుగాను మకుట భేదముతోఁగన్పించుచున్నవి. కొన్ని ప్రాచీన సంస్కృత శ్లోకముల కనువాదములుగా గన్పట్టు చున్నవి. అయినను స్వతస్సిద్ధముగ, సహజములై మనోహరముగ నున్నవి. జాతి ప్రతిబింబము సారస్వతము.

శతకములు చదివిన ఆనాటి సంఘములోని వ్యక్తుల కుటిల ప్రవృత్తి, రాజుల యవినీతి, మూఢభక్తి కన్పించును. ఆంధ్ర సాహిత్యము సంస్కృత సాహిత్యావలంబనమును విడిచి స్వయం ప్రకాశముతో వికసింపగల విధమును శతక వాఙ్మయము విశదీకరించుచున్నది.

ముగింపు :

శతక కవులు అనేక కథ వస్తువులు దృష్టాంత రూపమున వర్ణించారు. శతకములందు రసపోషణకు అవకాశం తక్కువ. భక్తిభావాలు శతకాలలో అగ్రస్థానం గైకొని తర్వాత శతకాలంలో సాంఘీక, కాలాది పరిస్థితులు వర్ణించారు. కవులు తమ ఆత్మనుభూతి వర్ణించుటకు శతకం మిక్కిలి సాహితిప్రక్రియగా చెప్పవచ్చు. కవి తన హృదయ భావాలు నేరుగా పాఠకునితో వంచుకోవడానికి ప్రయోజనాకారిగా ఈ సాహితి ప్రక్రియను విమర్శకులు తెలుపుతారు. విషయ వ్యక్తీకరణ, వ్యవహార భాష ప్రయోగం, సరళ జనరంజక శైలి శతక లక్షణలుగా ఆకర్షించడం వల్ల సామాన్యులకు కూడా శతకాలుతో దగ్గర సంబంధం ఏర్పడ్డాయి.

ఉపయుక్త గ్రంథాలు :

1) శతక కవుల చరిత్ర – వంగూరి సూబ్బారావు
2) ఆంధ్ర వాఙ్మయ చరిత్రము – దివాకర్ల వెంకటావధాని
3) ఆంధ్ర సాహిత్య సంగ్రహ చరిత్ర – వారణాసి వెంకటేశ్వర్లు
4) విశ్వధాభిరామ వినురవేమ – త్రిపురనేని వెంకటేశ్వరరావు
5) సాహిత్యంలో దృక్పథాలు – ఆర్.యస్. సుదర్శనం

దేవరకొండ బాలగంగాధర తిలక్ 'అమృతం కురిసిన రాత్రి' కవితా సంపుటి : సామాజిక జీవన చిత్రణ

రామకృష్ణ ఇడుకుల, సహాయ ఆచార్యులు, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ అండ్ కామర్స్ డిగ్రీ & పీజీ కళాశాల, (వాసవి ఫౌండేషన్) ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్. చరవాణి: 9885521904

పరిచయ పలుకులు:

సంకుచితమైన జాతి మతాల హద్దుల్ని చెరిపిస్తున్నాను నేడు

అంకురితమైన మానవీయ పతాకను ఎగురవేస్తున్నాను చూడు

చరిత్ర రక్త జలధికి స్నేహ సేతువును నిర్మిస్తున్నాను రండి...

అంటూ బలమైన కంఠంతో విశ్వమానవ సౌభ్రాతృత్వానికి నిబద్ధుడై మానవతా కేతనాన్ని ఎగురవేయడమే ధ్యేయంగా, కరుణ కలికితురాయిగా తన అపురూపమైన అనుభూతుల్ని అక్షరబద్ధం చేస్తూ , అమృతమయమైన కవితా ఝరిని ప్రవహింపజేసిన కవితా తపస్వి దేవరకొండ బాలగంగాధర తిలక్.

సమాజం సమస్యలమయం. నిరంతరం ఏవో సమస్యలతో సమాజం సంఘర్షిస్తుంది. వైయక్తిమైనవి, సామూహికమైనవి అనే రెండు రకాలుగా సమస్యలుంటాయి. ఈ రెండు రకాల సమస్యలకు సంఘానికి అనివార్యమైన సంబంధం ఒకటి ఉంటుంది. ఎవరికి ఏ సమస్య వచ్చినా అది సంఘం నుండే వచ్చిందని అనుకోవచ్చు. కొన్ని సమస్యలపై సంఘంది ప్రత్యక్ష ప్రభావం ఉంటుంది. కొన్నిటిపై పరోక్ష ప్రభావం ఉంటుంది. ఆధునిక కాలంలో, ముఖ్యంగా 20వ శతాబ్దంలో ధనిక, పేదలు అనే రెండు వర్గాలను గుర్తించారు. కారల్ మార్క్స్ దీనికి ఒక సైద్ధాంతిక రూపమిచ్చి ప్రపంచ వ్యాప్తంగా వర్గవ్యవస్థ ఉంది అంటూ సూత్రీకరించారు. పారిశ్రామిక విప్లవ ఫలితంగా ఉద్యోగస్వామ్యం రావడం జరిగింది. నెలనెల ఉపాధి, స్థిరమైన ఆదాయం కలిగిన ఉద్యోగులందరూ మధ్య తరగతి వర్గంగా స్థిరపడ్డారు. ఈ దోపిడి వ్యవస్థకు అన్ని విధాలుగా రక్షణగా ఉండేది వీరే. ఈ మధ్య తరగతి వారే మహారాజ పోషకులు, మర్యాద, మప్పిదం, ఆచార వ్యవహారాలు, సంస్కృతి, భక్తి మొదలైన చట్రం నుండి బయట పడలేని వారు. వీరే వర్గ వర్ణవ్యవస్థకు రక్షణ కవచంగా ఉంటారు.

శ్రీశ్రీ మొదటిసారి తెలుగు కవిత్వంలో ఈ వర్గ వ్యవస్థ గురించి చెప్పాడు. శ్రీశ్రీకి ముందు ఉన్న తెలుగు కవిత వీటిని గుర్తించినా, వీటి నిర్మూలనకు ఏదో ఒక సైద్ధాంతిక మైన ఆధారం చూపలేకపోయారు. ఆ సమస్యలు పుట్టినట్లు గానే వాటికి అవే గిడుతాయని అనుకొని ఉంటారు. శ్రీశ్రీ కవిత్వం అభ్యుదయ పూరకమైంది కనుక సంఘంలో సమస్యలను గుర్తించడం వాటి పరిష్కారానికి ఒక దృక్పథాన్ని ఎంచుకోవడం జరిగింది. ఆ తరువాత వచ్చిన అభ్యుదయ కవులంతా శ్రీశ్రీ మార్గంలోనే నడిచారు.

కానీ, తిలక్ స్వతంత్రమైన అభిప్రాయం ఉన్నవాడు. శ్రీశ్రీ లాగానే సంఘంలో సమస్యలున్నాయని గుర్తించినా.. పరిష్కారానికి శ్రీశ్రీ దృక్పథాన్ని స్వీకరించలేదు. ఆ పరిష్కారాన్ని మానవతా దృక్పథం నుంచి చూసాడు తిలక్, **'నా కవిత్వంలో నేను దొరుకుతాను'** అన్న తిలక్ నా కవిత్వమనే ఖండికలో **'నా కవిత్వం కాదొక తత్వం'** అని మొదటి పంక్తిలోనే స్పష్టం చేసాడు. తిలక్ కవిత్వంపై ఏ ఆధునిక రాజకీయ సిద్ధాంతం ప్రబలమైన ముద్ర వేయలేదు. ఒక రాజకీయ సిద్ధాంతాన్ని ప్రతిపాదించడానికి కవిత్వాన్ని వాడుకుంటే, అది దోషంగా భావించి ఉంటాడు

తిలక్. ఆ కవిత సిద్ధాంత బలం వల్ల రక్తికట్టక పోవచ్చు లేదా సిద్ధాంతాన్ని కవిత్వానికి వాడుకుంటే సాహిత్యం సంకుచితమై పోవచ్చునని అనుకొని ఉండాలి. దృక్పథం మేధోపరమైనది. కవిత్వం హృదయగతమైంది. కవిత్వానికి సిద్ధాంతాన్ని జోడిస్తే పఠితుల మేధస్సును తృప్తి పరవచ్చునేమో కాని, వారి హృదయాన్ని రంజింపజేయలేదు కదా! అనే నిశ్చితమైన అభిప్రాయాన్ని తిలక్ కలిగి ఉండవచ్చు.

"ఈ కాలంలో బ్రతుకు, యీ ప్రపంచాన్ని ప్రతిఫలించు ఇంటికున్న కిటికీలన్నీ తెరిచి అన్ని పథనాల్ని ఆహ్వానించు, నువ్వు చెప్పేదేదైనా నీదై ఉండాలి, నీలోంచి రావాలి, చించుకు రావాలి" అని 'నవత– కవిత' అనే కవితలో కవికి ఏ పరిమితులూ ఉండకూడదని స్పష్టంగా తెలియజేసాడు. మానవ జీవితంలోని అన్ని కోణాల చిత్రీకరణ కవిత్వంలో ఉండాలని కవి సూచించాడు. కవి స్వయంగా వాటిని అనుభవించి పలకరించాక కవితా సృజన చేయాలనేది తిలక్ అభిప్రాయం. ఆయన కవిత ఈ విశాల పరిధిలోనే నిర్మితమైనట్లు చెప్పవచ్చు. తిలక్ సామాజిక కవిత్వమును స్థూలంగా రెండు భాగాలు జేయవచ్చు. ఒకటి అభ్యుదయవాద కవిత్వం, రెండు మానవతావాద కవిత్వం.

అభ్యుదయవాద కవిత్వం:

భావత – అభ్యుదయ కవిత సంధియుగంలో సాహితీలోకంలోకి ప్రవేశించిన తిలక్ ఊహా ప్రపంచం నుండి నింపాదిగా దిగివచ్చి సామాజిక అవగాహనను పెంచుకొన్నాడు. తన చుట్టూ ఉన్న సామాజిక పరిస్థితులను అర్థం చేసుకున్నాడు. సామాన్యులను నిత్యం వేధించే సమస్యలేమిటో అవగాహన చేసుకున్నాడు. ఆకలి, దారిద్ర్యం, రోగాలు, బాధలు మధ్యతరగతి జీవితాన్ని పట్టి ఎట్లా పీడిస్తున్నాయో సునిశితంగా పరిశీలించాడు. తాను దర్శించిన దయార్ద్ర దృశ్యాలన్నీ కవిత్వీకరించాడు తిలక్. అంతే కాకుండా ప్రపంచ పరిణామాలను వీక్షించి సామ్రాజ్యవాదం యుద్ధకాంక్షను వ్యక్తం చేయడం, యుద్ధంలో అనేక రకాల నష్టం వాటిల్లడం తద్వారా మానవతకు విఘాతం కలగడం ఆయనను కలచివేసిన సంఘటనలే. అందుకే యుద్ధాన్ని నిరసిస్తూ శాంతిని కాంక్షించడం ఆయన సామాజిక కవితలో భాగంగానే చూడాలి..

మాగ్నా కార్టా, అదృష్టాధ్వగమనం, నీడలు, గొంగళి పురుగులు, తపాలబంట్రోతు, సైనికుడి ఉత్తరం, యుద్ధంలో రేవు పట్టణం, వెళ్ళిపోండి వెళ్ళిపోండి. అమ్మానాన్న ఎక్కడికెళ్ళాడు. టులాన్, ప్రకటన మొదలైన కవితలను అభ్యుదయ కవితలుగా చెప్పవచ్చు.

'మాగ్నా కార్టా' ఇది లాటిన్ భాషలలోని పదబంధం. గ్రేట్ చార్టర్ గా పేరు పొందినది. దీన్నే మహాస్మృతి, ప్రసిద్ధచట్టం అని కూడా పిలిచారు. 1215 సంవత్సరములో జరిగిన ఒకానొక చారిత్రక సంఘటన ఇది. ప్రజలను పాలించే రాజు (మోనార్క్)ను అదుపులో పెట్టే శాసనమిది. ప్రజాభిప్రాయానికి అనుగుణంగానే పరిపాలన కొనసాగాలి. ఇదే ప్రపంచంలోని ప్రజాస్వామ్యదేశాలకు మార్గదర్శమైనది. మానవుడికి కూడు, గుడ్డా సహజమైన హక్కు. ఆ హక్కు పేరు ఇంగ్లీషు చరిత్ర పరిభాషలో "'మాగ్నాకార్టా" అంటారు. ఈ పేరునే తన కవితకు తిలక్ పెట్టారంటే ఆయన అభ్యుదయ కామనకు, సామాజిక దృష్టికి ఇంతకంటే వేరే నిదర్శనం అక్కరలేదు..

"మేం మనుష్యులం/ మేం మహాన్పులం / గుండెలోవలి గుండె కదిలించి / తీగలోవలి తీగ నవరించి / పాటపాటకి లేచు కెరటంలాగా/ మాటమాటకి మోగు కిన్నెరలాగ / మేం అడుతాం / మేం పాడుతాం" అంటూ సాగిన ఈ కవిత గతకాలపు రాచరిక, భూస్వామ్య వ్యవస్థలో సామాన్యుడికి చోటు లేదు. వాళ్ళకు ప్రత్యేకమైన వ్యక్తిత్వమే లేదు. శ్రమచేసి పాలకులకు ఫలితానివ్వడానికి వారు పుట్టినట్లు భావించబడేది. ప్రజల్లో చైతన్యం రాకుండా ఉండేందుకు శాస్త్రాలు, చట్టాలు రూపొందించి వారిని నిర్వీర్యులను చేసారు. పాతకాలంలో

దోపిడికి గురైన ప్రజలు తరువాత మేల్కొని ఆ చీకటి యుగాలకు స్వస్తి పలకదలచారు. అందుకే "భూమి అందుకు వెలుగు తెరలు గెట్టి" "పాతలోకపు గుండెల్లో శతఘ్ని పగిలించి, భావి కాలపు చంద్రశిలలను కరిగించి" భువినే భూతలస్వర్గం చేయడానికి సింహంలాగా ముందుకు దూకుతున్నారు.

"మాకు దాస్యం లేదు / మాకు శాస్త్రం లేదు/ మాకు లోకం గీటురాయి. మాకు కరుణ చిగురు తురాయి / మేం పరపీడన సహించడం / దివ్యత్వం నటించం" అంటున్నారు.

ఆధునిక కాలమంతా ప్రజావెల్లువతో నిండినదే. ఎక్కడా దోపిడి, దాస్యం ఉంటే దాని అంతానికి కంకణ బద్ధులైనవారు ప్రజలు. బూజు పట్టిన దోపిడీ సిద్ధాంతాలు, అభూతకల్పనతో కూడుకున్న శాస్త్రాలకు ఈ లోకంలో స్థానం లేదు. నియంతృత్వపు పాలనకు, పీడనకు చోటు లేని వ్యవస్థ కావాలి. అది కరుణ పూరితంగా ఉండాలి. **"పూలవర్షం భువిని కురిపించాలి"** అన్నదే ప్రజాలక్ష్యంగా సాగిన ఈ చరిత్రాత్మక కవిత అభ్యుదయ భావనకు ఎత్తిన పతాకం.

'అదృష్టాధ్వగమనం' అనే కవిత, ఇద్దరు మిత్రుల అంతరాలు, వ్యత్యాసాలను తెలిపేది. ఈ మిత్రులు ఈ అసమాన వ్యవస్థలో చెరో మార్గంలో ఒదిగారు. ఒకతనికి జీవితంలో అన్నీ అమరినాయి. మరొకతనేమో ఒంటరి కాకిలా దారి తెన్నులేక స్థూలమైన ఆకృతి, అస్తిత్వం పొందలేని జీవితాన్ని మోసుకు తిరుగుతున్నాడు. జీవితంలోని అన్ని పార్శ్వాలని తడిమాడు అయినా లాభం లేదు. అన్నీ పోగొట్టుకున్నాడు. అయినా ఆనందం తరగలేదు. ఎక్కడో బతకాలనే ఆశమాత్రం మిగిలే ఉంది. ఒకరి జీవితమేమో! –

"ఇల్లు వాకిలీ. డబ్బూ హోదా పేరు ప్రతిష్టా/ వెండినిచ్చెన లెక్కుతున్న వేళ" మరొకరి జీవితమేమో! – **"కొమ్మమీద ఆహారం దొరకని కృకాలానం కంగారు చూపులో / ఊరవతల నందులలో / దుమ్ముకొట్టుకు పోయిన పిల్లల కళ్ళలో ఆరిపోతున్న వెలుగులో"**

ఇలా రెండు జీవితాల వైవిధ్యాన్ని చూపాడు కవి. నవలోకానికి ప్రతీక అయినవాడు కష్టాలు పడుతున్నాడు. తప్పకుండా సమాజంలో మార్పు వస్తుందనే 'వెలుగు వజ్రం' ఆశతో జీవిస్తున్నాడు. వుట్టకతో దరిద్రుడు ఎందుకయ్యాడంటే–

"నే పుట్టినప్పుడు / ఏ పిచ్చి పొగడ పూవులు గాలి సోకిందో / ఏ పండు వెన్నెల మత్తు కమ్మిందో / ఏ పికిలి పిట్ట కిటికీలోకి వ్రాలి నాకేసి చూసి నవ్విందో!" అంటూ ఇంద్రధనుస్సుల్ని , అదృశ్య స్వర్గాల్ని అశ్రుత గాంధర్వాన్ని అన్వేషించుకుంటూ, మామూలు దారుల్ని మర్యాదల్ని మంచి చెడ్డల్ని రాత్రిం దివామధ్యరహఃకిర్మీర రథ్యపడిపోతున్నాను ఆశతో, విశ్వాసంతో బలంతో అంటాడు.

జీవితంలో గాయపడ్డవాడికే మరిన్ని గాయాలు తాకుతాయి. ఎన్నో అఖాతాలు, అడ్డంకులు, గుండెలో ఎన్నో గాయాలు, సల సల కాగే మానవాశ్రుజ్వాలాలు అయినా అంతర్గత సంగీతం అనుపమ సుందరగీతంను తనలో తానే వింటూ సృష్టి అర్థాన్ని, జన్మ రహస్యాన్ని, జననమరణాల కతీతమైన సురచిత రహస్యాన్ని వెదుకుతున్నాడు. జీవితం "కోరికల కోణాకారుల కొత్త చెట్లను నాటుతుంది." జీవితం కొత్త చెట్లలాంటిది. కొత్త చెట్లు నిరంతరం పెరుగుతాయి. మానవుడిలో కోరికలు కొత్త చెట్ల కోణాకారంగా పెరుగు తాయి. ముందుకు పొడుచుకు వచ్చే కోరిక కోణాకారపు కొత్త చెట్లనే అభ్యుదయభావన చేసాడు కవి.

'నీడలు' కవితలో మధ్యతరగతి జీవితాల మనస్తత్వాన్ని తెలుపుతాడు. ఈ వర్గం అట్టడుగు వర్గాలతో సమానమైన అవకాశాలను పొందుతూ, నిత్యావసరాలను అనుహ్యంగా పెంచుకుంటూ, అవి తీర్చుకోలేక మధన పడుతూ ఉంటారు.

పైన వర్గాలను చూసి ఆపుకోలేని కోరికలు పెంచుకుంటూ వారిని అనుసరించే ప్రయత్నం చేస్తారు; అనేక రకాల ఇబ్బందులకు లోనౌతారు. సర్వవైద్యాలకూ, సంప్రదాయ మూఢ విశ్వాసాలకు అన్నింటికి ఈ వర్గాన్ని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. కంపు కొడుతున్న ఒక సంస్కృతి భ్రష్టతకు వీళ్ళే నిలయాలు. ఇలాంటి మధ్య తరగతిని ఈ కవితలో చూపాడు కవి.

తెలుగుభాషా సంప్రదాయంలో చిన్నమ్మా అంటే లక్ష్మీదేవి, పెద్దమ్మా అంటే దరిద్రదేవత అనేవి రూఢ్యర్థాలున్నాయి.

"చిన్నమ్మా / వీళ్ళ మీద కోవగించకు/ వీళ్ళ సనహ్యించుకోకు/ నిన్నెన్నెన్నో అన్నారు అవమానాల పాల్చేశారు / అవినీతి అంటగట్టారు / ఆడదానికి సాహసం పనికిరాదన్నారు".

లక్ష్మీ ఉన్న వాడింట్లోనే తిష్ట వేస్తుంది. మధ్య తరగతి వాళ్ళు లక్ష్మీదేవిని నిందిస్తారు. అయినా వీళ్ళను అసహ్యించుకోకు అంటాడు కవి. మధ్య తరగతి వాళ్ళు సంఘపు కట్టుబాట్లను రక్షించేవారు. వీళ్ళంతా గతకాలంలో కూరుకుపోయిన మనుష్యులు. గతించిన కాలపు నీడలు. శిథిలాలయాలకు పూజారులు మధ్య తరగతి వాళ్ళు. ఏ పనిని ధైర్యంగా చేయలేరు. ధైర్యం లేదంటే ఒప్పుకోరు. వీళ్ళందరు సగం సగం మనుష్యులు, మరో సగం మరుగున పడిన భయస్తులు, బాధగ్రస్తులు. సంప్రదాయాన్ని జాగ్రత్తగా కాపాడుతారు. వర్తమానానికి అది పనికి రాదని తెలిసినా ఊరుకోరు. భారత, భాగవతాన్ని చదువుతారు. వీళ్ళంతా ముక్కులైన గాజు పెంకులు, చెల్లాచెదురైన మూగముత్యాలు, కల్లాకపటం తెలియని కబోదులు, తమను తామే మోసగించుకునే విద్యాధికులు, విదూషకులు, తాము కూర్చున్న కొమ్మనే నరుక్కున్న అమాయకులు, సంప్రదాయజ్ఞులు అని కవి చిన్నమ్మకు విన్నవిస్తాడు.

"చిన్నమ్మా/ వీళ్ళను విడిచి వెళ్ళిపోకు/ వీళ్ళందరు నీ బిడ్డలు / ఆకలి అవసరం తీరని కష్టాల గడ్డలు / వాచకాలలో నీతుల్ని వల్లిస్తూ / దరిద్రంలో హరిద్ర శోభల్ని గుర్తిస్తూ " ఉంటారు. ధైర్యం లేని వీళ్ళ స్వభావాన్ని ధైర్యం అనుకుంటారు. ఈ మధ్య తరగతి మనస్తత్వం మారేదాక వీళ్ళలో మార్పు రాదంటూ, దాన్ని నామరూపాలు లేకుండా చేస్తేనే అభివృద్ధి అంటాడు కవి. అందుకే బరువుగా బెదురుగా బతుకుతున్న వీళ్ళమధ్య **"డైనమైట్ పేలాలి / డైనమోలు తిరగాలి"** అని మార్పును కోరుకుంటాడు కవి.

'నీడలు' కవిత మధ్యతరగతి జీవిలోని ఒక కోణాన్ని చిత్రిస్తే 'గొంగళిపురుగులు' మధ్యతరగతి జీవితాలకు మరొక కోణం. మధ్యతరగతి మనస్తత్వం, ఊగిసలాట డోలాయమానస్థితి, ధైర్యం లేకపోవడం, జీవితంలో స్థిర నిర్ణయాలు తీసికోకపోవడం, కలల సౌధం నిర్మించుకోని ఆ ప్రపంచంలో విహరించడమే మధ్య తరగతి వాళ్ళ మనస్తత్వం, వీళ్ళని గొంగళి పురుగుతోనే ఎందుకు కవి పోల్చాడంటే, గొంగళిపురుగు ఎప్పుడు చురుకుగా ఉండదు. ఏమీ చేతగాని తనం, చెయ్యలేని తనం, కలల మత్తులోనికి వెళ్లిపోతుంది. అసమర్థతకు గొంగళి పురుగు ప్రతీక, మధ్య తరగతి జీవులు అసమర్థులని కవి భావన.

"విని కూడా కదలకుండా గొంగళి పురుగు / నగం నగం తిన్న కలల్ని నెమరేస్తూ నిద్రపోతుంది. /చాటుగుండా చూసుకొని, నవ్వుకొని, మీసం మెలేసుకుని / మాట్లాడకుండా జంటిల్మన్ మత్తుగా వడుకుంటుంది గొంగళివురుగు / ముడుచుకు పోయిన గొంగళి పురుగు/ తన్నితనే తీసుకొని గోడ అవతలికి / తన్ని తనే గిరవాటునుకుంది." ఇలా మధ్యతరగతి వాళ్ళుంటారని కవి చెబుతున్నాడు. సమాజంలో ఎవరు ఈ మధ్య తరగతి వారంటే గుమస్తాలు, రిక్షావాళ్ళు, టీచర్లు, లక్షోపలక్షలున్నారు. వీళ్ళే కోటేశ్వర్రావులు, వీరేశ్వరావులు, నీలేశ్వర్రావులు ఎందరో ఎందరో ఉన్నారు. భార్యను చూస్తే భయం, బాస్ ను చూస్తే భయం, డబ్బున్న

వాడిని చూస్తే గౌరవం ఈ చిన్న సంసారులకు ఈ మధ్యతరగతి వాళ్ళకు.

'తపాల బంట్రోతు' ను కవితా వస్తువుగా స్వీకరించడం అనూహ్యం, అపూర్వం. వస్తువులో అభ్యుదయ కవిత తెచ్చిన మార్పు ఇదే. ఉద్యోగం చేసినా ఉపాధిలేని వాడు పోస్ట్ మ్యాన్. నెలనెలా వచ్చే జీతం డబ్బులు తన అవసరాలు, కుటుంబ అవసరాలే తీరవు. ఊరిలో వారందరికి ఏదో వార్తను అందిస్తాడు. వారందరికి అతను చిరపరిచితుడే కాని, అప్తుడు కాదు. ఈ చిన్న సైజు జీతగాడిని ఎవరూ పట్టించుకోరు. తపాల బంట్రోతు–

"ఎండలో వానలో/ ఎండిన చిలికిన / ఒక చిన్న సైజు జీతగాడు / చెవిలో పెన్సిల్ / చేతిలో సంచీ / కాకీ దుస్తువులు/ అరిగిన చెప్పులు / ఒక సాదా పేదవాడు / ఇంటింటికీ / వీధి వీధికీ / ప్రతిరోజు తిరిగేవాడు" ఇలా సామాన్యంగా కన్పించే ఈ చిరు ఉద్యోగి ఎదురుచూసే వాళ్ళకు మాత్రమే ఆయన విలువ తెలుసు. అయితే తానిచ్చే ఉత్తరం తీసికున్నాక పోస్టుమాన్ వైపు కూడా చూడకుండా వెళ్ళిపోతాడు. ఆయన కన్పించగానే కళ్ళల్లో వెల్తురు, ఉత్తరం ఇవ్వగానే చాలా విలువైనవిగా భావిస్తాడు కాని, ఆ తరువాత ఎంత ఆనందంలోనో, విషాదంలోనో ఆయన వైపుకే చూడరు అంటాడు కవి.

ఈ పోస్టుమాన్ కోసం ప్రియుడి దగ్గర నుంచి ఉత్తరం వస్తుందని ఎదిరిచూసే యువతి, మిల్టరీలో ఉన్న కొడుకు కార్డుముక్క రాస్తాడోనని గుడిసె ముందు కూర్చుండి చూసే ముసలితల్లి. ఇలా ఒక వర్తకుడు, నర్తకుడు, ఖైదీ, దొంగా, హంతకుడు, చిరుద్యోగి ఎదురుచూస్తుంటారు. వీరందరికి శుభాశుభాలు తెలియజేస్తాడు. ఎందరికో ఎన్నో రకాల వార్తలను అందించే పోస్ట్‌మాన్ గురించి, ఆయన యోగక్షేమాల గురించి ఎవ్వరూ పట్టించుకోరని కవి అంటాడు. ఈ కవిత ద్వారా సంఘంలో చిన్న ఉద్యోగులపై గౌరవం పెరిగింది.

'సైనికుడి ఉత్తరం' కవిత ఉత్తరం (Letter) రూపంలో ఉంటుంది. ఉత్తరాల రూపంలో కవితకు ఒక నిర్దిష్టమైన రూపాన్నిచ్చి ప్రారంభించినవాడు తిలక్. ఆ తరువాత ఇలాంటి కవిత్వం చాలా వచ్చింది.
ఆత్మాశ్రయ రీతిలో సాగిన ఈ కవిత సైనికుడిలోని నిరాశ నిస్పృహల్ని తెలియజేస్తుంది. సైనికుడు ఊరిలో ఉన్న భార్యకు రాస్తున్న ఉత్తరమే ఈ కవిత.

కనిపించే ఈ యూనిఫారం క్రింద/ ఒక పెద్ద నిరాశ, ఒక అనాగరికత/ బ్రిడ్జికింద నదిలాగ రహస్యంగా వుంది/ వదలలేని మోనవు ఊబిలాగ వుంది/ నేనంటే నాకే అసహ్యం/ అందుకే మరీ మరీ చంపుతాను, మరీ మరీ తాగుతాను/ ఇంకేం చేసిన ఎవరూ ఒప్పుకోరు

సైనికులు బార్డర్ పైన రేయింబవళ్ళు ఉండి, దేశాన్ని రక్షస్తుంటారు. శత్రువు నుండి నిరంతరం ప్రాణభయం ఉంటుంది. ఏ క్షణంలోనైనా ఎదుటివాడి ప్రాణం తీస్తాడో తెలియదు; తన ప్రాణం గాలిలో కలుస్తుందో తెలియదు. చంపడం, చావడం మీసం దువ్వడం' తప్ప ఏ విలువలు, అనుభూతులు ఆయనకు ఉండవు. పై నుండి ఎవరో ఒకరు ఆదేశిస్తే వెనకాముందు చూడకుండా యుద్ధరంగంలోకి దిగాల్సిందే. అంతా యాంత్రికమైన బతుకే.. అందుకే "కీ యిస్తే తిరిగే అట్టముక్క సైనికులం'' అంటాడు. మంచుకురుస్తున్న అర్ధరాత్రిలో భార్యకు ఉత్తరం రాసుకుంటూ ముసలి తల్లిని, పిల్లవాడిని, భార్య నవ్వును, ఊరి చెరువును, చెర్వులోని కొంగను గురించి తల్చుకోవడం కన్పిస్తుంది. ఇంకా తాను ఉన్న యుద్ధ భూమిలోని భయంకర ఆ వాతావరణాన్ని ఉత్తరంలో రాస్తాడు. సైనికుడు యుద్ధం చేసి అలసిపోయి అర్ధరాత్రిలో మునిగిన సైనికుల గురక చచ్చిన జీవుల మొరలాగుందంటాడు. పైన ఎరోప్లేన్, చేతిలో స్టెన్ గన్ పట్టుకొని ట్రెచెస్ లో దాగాలి. భయంతో ఎడార్లు, నదులు, అరణ్యాలు దాటాలంటూ ఆ భయానక వాతావరణాన్ని ఉత్తరంలో భార్యకు రాస్తాడు సైనికుడు.

ప్రపంచవ్యాప్తంగా, స్వార్థమే యుద్ధానికి కారణమంటూ తెలుగపుతాడు కవి.

"యుద్ధంలో రేవు పట్టణం" ఖండికలో యుద్ధం జరుగుతున్న రోజులు నగరం ఎలా ఉంటుందో కవి తెలిపాడు. రాత్రి పగళ్ళూ భయం భయంగా ఉంటాయి. పైన విమానాలు తిరుగుతాయి. సముద్రంలో ఓడలు యుద్ధానికి సిద్ధమన్నట్లుంటాయి. నగరంలోని మనుష్యులందరిలో యుద్ధ భయమే. మృత్యువు గురించి తలుపే ఉంటుంది. సైరన్ కూతలు, ఫిరంగిమోతలు ట్రెంచెస్ లో దాగడం మొత్తం చీకట్లో వ్యాపించిన మృత్యువు ఎక్కడకెళ్ళినా ఎదరవుతుంది. "మనుష్యుల జేబుల్లో భయాలు బొద్దింకల పరుగులు" అంటూ యుద్ధం వలన ప్రజలు ఎంత భయానక స్థితిని అనుభవిస్తున్నారో తెలుపుతాడు.

"నగరం టవరు మీద ఎక్కి ఎర్రగా చూస్తోంది. నగరం భయంతో గుండె బరువెక్కి నల్లగా చస్తోంది / లైట్ హౌస్ రాక్షసి తలచుట్టూ ఒకే కన్ను తిరుగుతోంది/ నగరం నరాల మీద తుపాకీల వరసలు/ గగనంలో విమానాల విరసని తెల్లని రెక్కలు / రెక్కల మధ్య ఆకాశం ఎర్రని ఎరుపు/ చుక్కల మధ్య ఆకాశం చితికిన కురుపు/ఆకాశం మీద పేలిన కాలిన విమానాలు / సముద్రంలో అంటుకున్న మునుగుతున్న ఓడలు/ అంటుకున్న ఓడల్లోంచి అరుపులు/ఇళ్ళల్లో నన్నని ఏడ్పులు"

యుద్ధం జరుగుతున్న రోజుల్లో నగరం ఎంత బీభత్సంగా, దుఃఖ పూరితంగా ఉంటుందో పై పంక్తులే ఉదాహరణ.

'వెళ్ళిపోండి, వెళ్ళిపోండి' కవిత యుద్ధంలో ప్రాణనష్టం జరిగాక, ప్రాణాలు పోయిన కుటుంబాలు ఎంత దుఃఖంతో ఉంటాయో చిత్రించాడు కవి. యుద్ధసమాధుల చుట్టూ తిరుగుతూ దుఃఖంతో తమ వారిని వెదుక్కుంటున్న స్మశాన దృశ్యం కరుణపూరితంగా ఉంది. తల్లులూ, భార్యలూ, అక్కాచెల్లెండ్లూ ఈ దుఃఖబారిన

పడ్డవారు. తమవారిని కోల్పోయిన వారిలో ఉన్నారు...

యుద్ధాలు ఈ కాలంలోనే ప్రారంభమైనవి కావు. ప్రాచీనకాలం నుండి జరుగుతున్నాయి. ప్రతి యుద్ధం వెనక ఒక వ్యక్తో, దేశమో, ఒక నమ్మకమో ఉందనే విషయాన్ని కవి తెలుపుతాడు.

"కురుక్షేత్రమయితే కృష్ణుడి అడుగు/ పానిపట్టుయితే పీష్వాల నడుగు/ బొబ్బిలయితే బుస్సీ నడుగు / క్రిమియా యుద్ధం కొరియా యుద్ధం/ప్రథమ ద్వితీయ ప్రపంచ యుద్ధాలు/ బిస్మార్క్ నడుగు హిట్లర్ నడుగు/బ్రహ్మ దేవుణ్ణి అడుగు" యుద్ధంలో పాల్గొన్న వీరులు చనిపోతే వారి కుటుంబంలోని స్త్రీలు ఒంటరులై, అనాధలై దుఃఖంతో, భయంతో జీవించి విషాద సన్నివేశాలన్నీ ఈ కవితలో కన్పిస్తాయి.

మానవతా వాద కవిత్వం:

తిలక్ కవిత్వంపై మానవతావాద ప్రభావం అమితంగా ఉంది. సామాన్య మానవుడికి జరుగుతున్న అన్యాయం, వారి జీవన స్థితిగతులు కవిత్వంలో వస్తువులైనాయంటే కవికి మానవతవాద దృక్పథం ఉంది అనుకోవాలి. తిలక్ మానవతావాద దృక్పథానికి అమితంగా లోనైనాడు.

మానవుని సమస్త ప్రవర్తనలతో సంబంధం ఉండి, మానవజాతి శ్రేయస్సును కోరే సిద్ధాంతం, దైవికమైన సహాయం లేకుండా మానవజాతి శ్రేష్టమైనదిగా రూపొందే సిద్ధాంతం మానవతా దృక్పథంగా చెప్పవచ్చు. ఈ దృక్పథం మానవజాతి వికాసానికి, అభ్యుదయానికి అడ్డుగా నిలిచే అసమానత్వం నశించాలి. సమసమాజం ఏర్పడాలి. వీరి దృక్పథంలో మానవుడే పూజ్యుడు, మానవుడి సమస్తమైన అభివృద్ధి ఇందులోని ప్రధానమైన అంశం .

'అమృతం కురిసిన రాత్రి'లో మానవతాదృక్పథంతో ఉన్న కవితలు ఆర్తగీతం, వసుధైక కుటుంబం, ముసలివాడు. ప్రార్థన మొదలైన కవితలను చెప్పవచ్చు.

'అర్తగీతం' ఈ దేశ వాస్తవికతకు నిలువుటద్దం. ఈ కవితలో కఠిన వాస్తవాలని కరుణాత్మకంగా కవి చిత్రించాడు. వర్తమానకాలం దైన్యాన్ని, విషాద స్థితినంతా ఈ కవితలో చూడవచ్చు. ప్రారంభం నుండి ముగింపు వరకు ఈ దేశవాసుల దీనస్థితిని చెప్పడం జరిగింది.

"నా దేశాన్ని గూర్చి పాడలేను/ నీ అదేశాన్ని మన్నించలేను/ ఈ వివంచికకు శ్రుతి కలుపలేను / ఈ రోజు నాకు విషాద న్మృతి" – అంటూ కవి దుఃఖితుడైతాడు. కారణం ఆకలితో దిక్కులేక మర్రిచెట్టుకింద మరణించిన ముసలివాడు, వర్షంలో వంతెన క్రింద ప్రసవించి మూర్ఛపోయిన స్త్రీ, తల్లిలేక, తండ్రిలేక, తిండిలేక ఏడుస్తూ ముంజేతో కళ్ళను తుడుచుకుంటూ మురికి కాల్వ పక్కన నిద్రపోయిన మూడేళ్ళ బాలుడు, పిల్లలకు గంజిపోసి తాను ఉపవాసంతో ఆఫీసు కెళ్ళిన ప్యూన్ వీరన్న, క్షయవ్యాధితో మరణించబోతున్న భార్యను తల్చుకొని వణికిపోతున్న గుమాస్తా ఇలాంటి దైన్యమైన, హైన్యమైన దృశ్యాలను చూసిన కవి. దుఃఖించకుండా ఎలా ఉండ గలడు? ఆధునిక కాలంలో, నాగరిక దేశంలో, విజ్ఞానం విస్తరిస్తున్న కాలంలో సామాన్యులు ఇన్ని బాధలు పడడానికి కారణం ఏమిటి? కరుణను బోధించిన బుద్ధుడి దేశమేనా ఇది? ఇలాంటి దేశాన్ని చూసి గర్వపడాలా. అని కవి వాపోతున్నాడు. ఇన్ని విషాద దృశ్యాలను చూసాక మనం గౌరవంగా బతుకుతున్నామన్నది నిజమేనా! లేక ఇది కృత్రిమ వేషమా? మనం జీవిస్తున్నామా? నటిస్తున్నామా? అనే సందేహం కలుగుతుంది. మానవత్వం ఉన్న లోకంలో ఇవి ఉంటాయా? మనిషనే వాడు ఈ దీనదృశ్యాలను తలెత్తి చూడగలడా? మనం నాగరికులమా? అరణ్యంలో జీవిస్తున్నామా? స్వార్థంతో నిండిన ఈ లోకమంతా 'నాగరికతారణ్యం'లో జీవిస్తుందని కవి వేదన చెందుతాడు. ఈ దీన హీనమైన, విషాద భరితమైన దృశ్యాలు ఏ రాజకీయ నాయకుడి గుండెలను స్పృశిస్తాయి? ఏ భోగవంతుడుని కదలిస్తాయి? ఏ భగవంతుడికి నివేదించుకోవాలి? అని కవి వేదన పాఠకుడి వేదనగానే కన్పిస్తుంది.

"ఒక్క నిరుపేద ఉన్నంతవరకు / ఒక్క మలినాశ్రుబిందు వొరిగినంతవరకు / ఒక్క ప్రేగు ఆకలి కనలినంతవరకు / ఒక్క శుష్క స్తన్య సన్నిధి క్షుధార్తి నేడ్చు / పసిపాప ఉన్నంతవరకు / ఒక్క తల్లి నీరవాక్రోశరవమ్ము విన్నంత వరకు"

'ఈ సిగ్గులేని ముఖాన్ని' చూపించలేను అంటూ కవి విషాద సన్నివేశాలకు కదిలిపోయాడు. కన్నులు కన్నీటి వరదలై, కలలు కాగితంపు పీలికలైన విధానం కన్పిస్తుంది. ఈ కవితలోని ప్రతిపాదం భాష్పభాండంగా తొణకిస లాడుతుంది. కరుణరస స్రవంతి చిప్పిల్లుతుంది.

'వసుధైక గీతం' విశ్వమానవాళి శ్రేయోగీతం. సరిహద్దు లెరగనిది మనిషిని, మనిషి ఆదుకునే తత్వం. అర్థం చేసుకునే విశాలమైన వేదిక. వానికి కులాలు, మతాలతో పనిలేదు. అందుకే తిలక్ "భూమధ్యరేఖ" నాగుండెల్లోంచి పోతుంది. భ్రుకుటి లోపల నక్షత్రగోళం తిరుగుతుంది." అనడంలో ఈ భావన వ్యక్తమవుతుంది. అందుకే మనో నిబ్బరంగా కవి ఇలా అంటున్నాడు..

"సంకుచితమైన జాతి మతాల సరిహద్దుల్ని / చెరిపివేస్తున్నాను చూడు / అంకురితమైన మానవీయ వతాకాను ఎగురవేస్తున్నాను చూడు / చరిత్ర రక్త జలధికి స్నేహసేతువు నిర్మిస్తున్నాను రండి" అంటూ మానవాళినంతా ఆహ్వానిస్తున్నాడు. సంకుచిత మనస్తత్వాన్ని వదిలి, విశాల హృదయులుకండి అనే ఉద్బోధ దీనిలో ఉ ంది. అందుకే "ఉత్తర ధ్రువాన ఒకపాదం, దక్షిణ ధ్రువాన మరోపాదం వేసి" సర్వం సహాచక్రవర్తిగా మనిషి ఎదగాలని చెబుతున్నాడు. మానవుడిని హిందోళ, పాల్లస్ సంగీతంలో జాలిగా పలకరించాలంటాడు.. 'ఆఫ్రికా అంధకారాటవుల సింహ గర్జనిరోషవలె' అనడంలో దిగువస్థాయి మానవుల ఎదుగుదలను కాంక్షించినట్లు కన్పిస్తుంది.

సర్వమానవాళి కోసం కవి ఎంతగా దుఃఖిస్తున్నాడో ఈ కవితలోని చివరి పాదాలు తెలుపుతున్నాయి. ఆర్ద్ర హృదయాలకు అభయహస్తాన్ని నిస్సంకోచంగా అందించడం కూడా దీనిలో కన్పిస్తుంది.

"ఎంత కన్నీరు మున్నీరుగా కురిశాను మీకోసమై / ఎంత మిన్నేరు వన్నీరుగా దింపాను మీ కోసమై/ వర్తమానం నేడు నుందరాభి సారిక వోలె నిలిచి హేలగా / అగామికాల గంభీరస్వామి కంఠాన వేయబోయే మాలగా / నిలిచింది నేను, పిలిచింది నేను, దశదిశల కలిపింది నేను" అంటూ తన మానవతా దృక్పథం ఎంత విశాలభిత్తికపై నిర్మితమైందో కవి తెలుపుతాడు.

'ముసలివాడు' కవితలో వృద్ధాప్యం దీనావస్థను చిత్రించాడు. ముసలితనం అనేది మానవుడి జీవిత ప్రస్థానంలో రెండో బాల్యం లాంటిది. ఈ దశలో అతనికి అవసరాలు తక్కువగా ఉంటాయి. ఎవరి మీదనో ఆధారపడడం ఎక్కువగా ఉంటుంది. కరుణతో అర్ధం చేసుకునే మనుష్యులు కావాలి ఈ దశలోనే. ఆర్ద్ర హృదయం లేని చోట ముసలివాళ్ళు జీవచ్ఛవాలుగా బతుకుతారు.

"కను గూడలు నల్లనయి / పెనుబ్రోదులు చల్లనయి/కీలు కీలుగా బాధగా/నాడులు నాడులుగా లాగగా../కర్రనానుకు సాగిపోయే/ ఎముకల గూడుని అరిగిపోయిన జోడుని" అంటూ వృద్ధాప్యం శారీరక అవస్థను సూచించాడు కవి. ఈ వృద్ధుడు జీర్ణదేహం కలవాడు. ఆకలితో అరుస్తున్న వాడు. తనను ఒదిలి పోయిన భార్యను తల్చుకుంటూ ఆమె వయ్యారాన్ని స్మరిస్తూ గతజీవితాన్ని నెమరువేసుకుంటాడు. ముసలివాడు తనకు మిగిలింది నడుమునొప్పి, పక్షపాతం, మెతుకును కూడా గతకలేని నిస్సహాయత, బతుకుపై ఆశ వదలదు. చావురాదు. ఈలాంటి విచిత్రమైన స్థితి వృద్ధాప్యానిది.

ముసలివాడంటే మాజీ యువకుడే కదా! వృద్ధాప్యమంటే పొంగి చల్లారిన పాలలాంటిది. ఎన్నో అనుభవాలు,మరెన్నో అనుభూతులు ఆయన జీవితంలో ఉన్నాయి. యవ్వనం రంగురంగుల కల. ముసలితనం 'గది మూలమూలలోని సాలిగూడు, గది గోడల గబ్బిలాల లాంటిది.'

ఈ ముసలివాడు యువకుడిగా ఉన్న రోజుల్లో వ్యవస్థను క్షుణ్ణంగా అధ్యయనం చేసి భావికి మార్గదర్శనం చేసిన ఒక ప్రొఫెసర్ కావచ్చు. సామ్యవాది కావచ్చు, గ్రంథకర్త కావచ్చు.' ఇలా గతమంత అద్భుతమైనది; వర్తమానం విషాదమయంగా ఉంది. ముసలితనం వలన వయస్సు మళ్ళిన ఈ దశలో వైరాగ్యంతో చెదబట్టిన 'భాగవతంను బిలహరి రాగంతో చదువుతూ' మృత్యువు కోసమై ఎదురు చూస్తాడు. ఒకప్పటి జీవితం నాగరికతా వైభవంలో వెలిగిపోయింది. నేడు శిథిలమైనది. జీవితం అంతే చరిత్ర సారమంతా ఇంతే అనే వైరాగ్యం ముసలివాడు కవితలో కన్పిస్తుంది.

'ప్రార్థన' కవిత ఈ దేశ ప్రజలు వేటి వలన ఇబ్బందిని ఎదుర్కొంటున్నదో తెలుపుతాడు. ప్రజా సమస్య లేమిటో వివరిస్తాడు. అవి ఉద్భవించుటకు కారకులు ఎవరో జెప్పుతారు కవి. "చావు పుట్టకల మధ్య సందేహంలాంటి జీవితంలో నలువైపులా అంధకారం" ఉందని కవి అంటాడు. ఈ అంధకారం పోవడానికి మానవత్వం. మణిదీపంలా వెలగాలని కవి ఆకాంక్ష. మానవత్వమే ఒక అలంకారం కావాలంటాడు కవి.

"దేవుడా/రక్షించు నా దేశాన్ని/ పవిత్రుల నుండి వతిత్రవతల నుండి /పెద్ద మనుష్యుల నుండి పెద్దపులుల నుండి/లక్షలాది దేవుళ్ళ నుండి వారి వూజారులనుండి వారి వారి వ్రతినిధుల నుండి శ్రీ మన్మద్దుర వరంవరనుండి"..

పైవారి నుండి రక్షిస్తే కాని ప్రజా సమస్యలకు విముక్తి ఉండదు. ఈ దేశంలో ఆకలీ, బాధలూ, ఆందోళనలూ, సమస్యలూ విరివిగా ఉన్నాయి. ఇవి అన్నీ మాయమైన రోజు

మావన చరిత్రలో రక్తం మరకలుండవని కవి భావిస్తాడు.

తిలక్ "అమృతం కురిసిన రాత్రి" కవితా సంపుటిలోని కొన్ని విశిష్ట కవితా పంక్తులు:

1. చీకటిలోకి దీపాన్ని తీసుకురాగలం. కానీ చీకటిని వెలుతురుగా చేయలేము .

   దీపానికి దగ్గరగా ఉంటే, వెలుగును అధికంగా పొందగలం.

   అలాకాక దూరంగా ఉండి, వెలుతురు చాలదని నిందించటంలో అర్థం లేదు.

   కవిత్వం కూడా, చీకటిలోకి తీసుకురాబడిన దీపం లాంటిది.

   ఆ దీపానికి దగ్గరగా చేరి, అందులోని సారాంశాన్ని అందుకోగలగాలి, ఆనందించాలి.

   చీకటిని చీల్చుకుంటూ వచ్చే ప్రభాత కిరణం లాంటిది తిలక్ కవిత్వం.

2. అమృతం కురిసిన రాత్రిలో కవిత్వం గురించి ఇలా చెబుతాడు తిలక్.

   కవిత్వం అంతరాతర సీమలను బహిర్గతం చేయాలి, విస్తరించాలి, చైతన్య పరచాలి,

   అగ్ని జల్లినా అమృతం కురిసినా అందం, ఆనందం దాని పరమావధి అని.

   అలానే అంత్యప్రాసలు వేసినంతమాత్రాన, ప్రొసైక్ భావం కవిత్వం అవదు అంటూ,

   కవిత్వం ఒక అరెక్మీ, దాని రహస్యం కవికే తెలుసు.

3. ఆశ ఉత్తర ధ్రువం విధి దక్షిణ ధ్రువం

   మనిషి రెండిటీ మధ్యా బంతిలా ఎగిసిపడే ప్రహసనం

   ఇజంలో ఇప్రిజన్ అయితే ఇంగితజ్ఞానం నశిస్తుంది

   ప్రిజంలాంటిది జీవితం వేర్వేరు కోణాలు ప్రదర్శిస్తుంది.

   ప్రస్తుత సమాజంలో జరుగుతున్న పరిణామాలకు దర్పణం లాంటిది.

   ఆల్ఖేదా నుండి ఆర్ యస్ యస్ వరకు వారి వారి విధి విధానాలవల్ల

   ఇంగిత జ్ఞానం కోల్పోవటం మనం చూస్తున్నాం వాటి పరిణామాలు చూస్తున్నాం

   "త్రిభుజాకారంలో బిగించబడిన మూడు అద్దం ముక్కల ప్రిజం మధ్య, ఏ వస్తువు అయినా

   వేరువేరు రకాలుగా కనిపిస్తుంది. జీవితం కూడా త్రిభుజాకార గాజు గొట్టం లాంటిది" అని చెబుతాడు తిలక్ 4. ఇదే కవితలో

   గజానికొక గాంధారి పుత్రుడూ గాంధీ గారి దేశంలో అంటాడు. దీనిలోని నిజమెంతో మనం చూస్తున్నాం.

5. మరో ఉదాహరణ "కాస్మోపాలిటన్" అన్న కవితలో

   సకల సిద్ధాంతాలు, మతాలు, ఇజాలు, సైటిఫిక్ నిజాలు

   అన్ని కలబోసి రంగరించి ఒకే ఒక రహస్యం కనుకొన్నారు.

   దేవుడూ, మానవుడూ వీరు ఇద్దరె ఈ అనంత విశ్వములో మూర్ఖులు

   ఏ కోణం నుండి చూచినా వీరు మిజరబుల్ ఫైల్యూరర్స్

   పురాణపురుషుల నుండి చరిత్ర మహానీయుల వరకు ఎవరు ఏ నిజాన్ని ప్రవేశపెట్టిన

   ఏదీ సంపూర్ణంగా సాధించలేకపోయారు.

అని తిలక్ వ్యక్తపరుస్తాడూ కేవలం తిలక్ మాత్రామే రాయగల కవితలు (ప్రార్థన) (ఆర్తగీతం) ఆచరణ లేకుండా సుభాషితాలను వల్లె వేస్తూ ఉండే పెద్దమనుషులు, పవిత్రులు, పతివ్రతలు, భక్తులు, సిద్ధాంత కర్తలు మొదలగువారి దేశానికి జరిగే కీడు గురించి తిలక్ ఆక్రోశమే ఈ ప్రార్థనా గీతము.

6. దేవుడా రక్షించు నా దేశాన్ని

   పవిత్రుల నుండి పతివ్రతల నుండి

నీతులు రెండూ నాల్కలదాచి బుసలు కొట్టే
నిర్హేతుక క్రుపా సర్పాల నుండి
లక్షలాది దేవుళ్ల నుండి వారివారి పూజారులనుండి
దేవుడా
కత్తి వాదరకు తెగిన కంఠంలో హటాత్‌గా
ఆగి పోయిన సంగీతాన్ని వినిపించు
మానవ చరిత్ర పుటలలో నెత్తురొలికి
మాసిపోయిన అక్షరాలను వివరించు
రహస్య సృష్టి సానువుల నుండి జారిపడే
కాంతి జలపాతాన్ని చూపించు అంటూ చావూపుట్టుకల మధ్య సందేహంలాంటిది జీవితం
అని ప్రార్థించటమే ఈ ప్రార్థనాగీతం అలాగే తనెంత, మానవతావాదో ఈ ఆర్తగీతంలో తెలుస్తుంది.

7. నేను చుశాను నిజంగా మూర్తీభవించిన దైన్యాన్ని, హైన్యాన్ని
క్షుభితాస్రు కల్లోల నిరధుల్ని గచ్చత్ శవాకారవికారుల్ని
ఇది ఏనాగరికతకు ఫలస్రుతి ఏవిజ్ఞాన ప్రకర్షకు ప్రకృతి
ఏ బుద్దదేవుని జన్మభూమికి గర్వస్రుతి

అంటూ ఈ నాగరికతారణ్యవాసాన్ని భరించలేను అంటాడూ తిలక్ తన కవిత ద్వారా మరో కవిత శిఖరారోహనలో

8. "కాలానికి ఒక రూపం లేదు దానికిపాపం కూడా లేదు.
కాలం అలాంటిది అంధయుగమైనా, స్వర్ణయుగమైనా, అది మన ప్రతిబింబము అంటూ
సంప్రదాయబరువుకి, అస్వతంత్ర వితంతువుకి వసంతం లేదు.
సాహసి కాని వాడూ జీవనసమరానికి, స్వర్గానికికూడా పనికిరాడూ
హిమసుందర సుగమైన ఎవరెస్ట్ ను ఒక్క టేన్సిగె ఎక్కగలడూ
సుమన సుందరమైన వసంతగీతంతో ఉగాదిని ఆహ్వానించ గలడూ" ఇలాంటి మధురమైన,మరపురాని కవితలు ఎన్నో తిలక్ ఆమృతం కురిసినరాత్రిలో చూడవచ్చు.

9. గతమంతా, తోలుబొమ్మలాడిన, ఒకతెర.
వర్తమానం నీ కన్నులు కప్పిన పొర
పాము కోరా, డేగరెక్కా, ఈ కాలానికి చిహ్నం
పూలతెనా, నెమలిరెక్కా, ఒక మిధ్యా ప్రమాణం
అందుకే నేస్తం జీవితమే ఒక జూదం
ఖేదానికి మోదానికి లేదులె భేదం.

ముగింపు పలుకులు :

"నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయాపారావతాలు / నా అక్షరాలు ప్రజాశక్తుల వహించే విజయ ఐరావతాలు / నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు" అని ప్రకటించిన తిలక్ గురించి చాలా మంది ఇలా అనుకుంటారు తిలక్ భావకవా? అభ్యుదయ కవా? సంప్రదాయ కవా? మానవతా వాద కవా? లేక అన్నీ కలగలిసి ఉన్న కవా?అని కానీ కవిగా తిలక్ సాహితీ ప్రపంచంలోకి వచ్చేనాటికి తెలుగు కవిత భావకవిత్వం చివరిదశ, అభ్యుదయ కవిత్వం ప్రారంభదశలో ఉంది. తిలక్ తనకు తానుగా 'అనుభూతి కవిని' అని చెప్పుకొన్నాడు. అందుకే చాలా మంది తిలక్ గురించి అనేక ప్రశ్నలు వేస్తారు. పాఠకుల అభిరుచిని బట్టి తిలక్ కవిత్వం అన్ని వాదాల కవులకు నచ్చుతుంది. 1941 నుండి 1966 వరకు రాసిన తిలక్ కవిత్వంలో శృంగార ప్రణయాలు, మానవుని

దైన్య విషాదాలూ, సాంఘిక రాజకీయ పరిస్థితులు, చిక్కనైన అనుభూతి ఆయన కవిత్వంలో కన్పిస్తుంది. భావ అనుభూతి, అభ్యుదయ మానవతా వాదాల సమ్మేళనమే ఆయన కవిత్వం. ఇవ్వన్నీ ఆయన కవిత్వానికి గొప్ప సొగసును చేకూర్చాయి. వీటిని గుణాలుగానే పరిగణించాలి కాని దోషాలుగా చూడకూడదు. భావకవితా ప్రభావం చేతనే లలితమైన సుందరమైన భావననీ, శైలినీ తిలక్ అలవర్చుకున్నాడు. అభ్యుదయ కవిత్వం వలన సామాజికమైన కవితా వస్తువులను స్వీకరించాడు. భావన చేసినా, సామాజికతను వస్తువుగా స్వీకరించినా వాటిని అనుభూతిలో తాదాత్మ్యం చెందేలా రాసాడు. వీటన్నింటికి మానవతా పరిమళాన్ని తాడించి తన దైవ ముద్రను తెలుగు కవిత్వంపై వేసాడు తిలక్ భావనలో అపురూపత, అనుభూతిలో లాలిత్యం, అభ్యుదయంలో సామాజిక సమస్యలు చిత్రణ, ఆర్ద్రతను నింపడం, మానవత్వానికి సౌందర్యతను జోడించి ఆయన కవితా విలక్షణతను చాటుకున్నాడు.

పరిశీలనా గ్రంథాలు :

1. "అమృతం కురిసిన రాత్రి" కవితా సంపుటి

కూచిమంచి తిమ్మకవి శతకాలలో సమాజం – భాష – సంస్కృతి

తంత్రవహి శ్రీరామమూర్తి, ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలుగు అధ్యాపకులు,

సమాజ జీవనాన్ని ప్రతిబింబించే సాహిత్యంలో ఒక ప్రధాన శాఖగా ఉన్నది శతక సాహిత్యం. పాల్కురికి సోమనాథుని వృషాధిప శతకము మొదలు ఈ నాటికి వెలువడుతున్న శతకాలలో నీతి, భక్తి, అధిక్షేప శతకాలు ఉన్నాయి. ఈ మూడింటి మిశ్రమంగా వచ్చినా అధిక్షేప శతకంగానే ప్రముఖంగా భావించే శతకాలు కూచిమంచి తిమ్మకవి మరియు జగ్గయకవుల శ్రీభర్గ శతకం, కుక్కుటేశ శతకం, భక్త మందార శతకం. వీరి వ్యక్తిగతమైన అధిక్షేపధోరణి సామాజిక రూపముపొంది, క్రమముగా సాంఘికముగా పరిణమించిది. ఇది అత్యంత ప్రౌఢ కవితా రీతిలో సాగుట గమనించవచ్చు. వీనిలో తిమ్మకవి శ్రీభర్గ, కుక్కుటేశ శతకాలలో సమాజాన్ని, సంస్కృతిని, భాషను పరిశీలించటమే ఈ వ్యాస ఉద్దేశం.

కవిపరిచయం:

తిమ్మన పిఠాపురం దగ్గరలోని కందరాడ గ్రామకరణం. క్రీ.శ 1700–1760 మధ్యకాలములో జీవించాడని శతక వాఙ్మయ చరిత్రకారుల అభిప్రాయము.లచ్చమ్మ, గంగన తల్లిదండ్రులు..కుక్కుటేశ్వర కారుణ్య కటాక్ష కవితా సామ్రాజ్య ధౌరేయుడు. దెందులూరి లింగన సద్గురుని శిష్యుడు. ఇతడు అశేష కవితా విలాస భాసురుడని, నవీన శబ్ద శాసనాభిధానుడని జగ్గకవిచే ప్రశంస పొందాడు. నీలాద్రి మాధవరాయనిచే కవిసార్వభౌముడని బిరుదు పొందాడు. రుక్మిణీ పరిణయం, సారంగధర చరిత్ర, రసికజన మనోభిరామము, నీలాసుందరీ పరిణయం, అచ్చతెనుగు రామాయణము, అను కావ్యములను కొన్నిశతకములను రచిం. రాజులచే సన్మానము పొందినా వారికి కృతులను అంకితము ఈయకుండా పిఠాపుర కుక్కుటేశ్వర స్వామికే అంకితమిచ్చాడు. క్రీ.శ 1729లో భర్గశతకము తరువాత రోజులలో 1760 ప్రాంతంలో చంద్రమాంపాలెం గ్రామంలో ఉండి కుక్కుటేశ శతకమును రచించినట్లు తెలుస్తోంది. శైవధర్మాభిమాని అయిన తిమ్మన గ్రామాధికారిగా వివిధ వ్యవహారములు నిరహించి, రాజసభలో కీర్తిపొంది, లోకరీతులను గ్రహించి, వాటిలో లోపాలను గర్హించి, ఈశతకములను రచించాడు. భర్గశతకములో బీజప్రాయముగావున్న అంశమే కుక్కుటేశ తకముకు ప్రధాన ఇతివృత్త మైంది. కుక్కుటేశ శతకము బహుళప్రచారము పొందినదని తెలుస్తున్నది. ఉక్తివైచిత్ర్యము సరసాలంకారములు కుక్కుటేశ శతకములో కనిపిస్తున్నాయి.

1. అచ్చ తెలుగు ముచ్చట:

అచ్చతెనుగులో రామాయణం, నీలాసుందరి పరిణయం వంటి కావ్యాలను రాసిన ముచ్చట తిమ్మనలో తీరక ఈ శతకంలో వినాయక స్తుతి చేసే పద్యాన్ని అచ్చతెనుగులోనే రచించాడు. ఆనాటి కవులకు, పండితులకు ఒక క్రీడగా, గౌరవసూచకంగా భావించే విధంగా ఉండటమే కాక దానిని అర్థంచేసుకొనే పాఠకులు లేదా శ్రోతలు ఉండి ఉండవచ్చు. లేదంటే కవులు దానిజోలికి వెళ్లలేరు కదా!

సీ. కొక్కుఁజొక్కువయాళి జక్కి నెక్కెడి వేల్పు; మినుసిక యెకిమీని యనుగుఁబట్టి
మేల్కడాని పసిండి మేని జేజే మిన్న; యిద్దఱుతల్లుల ముద్దుఁ గొడుగు
గుజ్జు దేవర వ్రేలు బొజ్జ మేటి మగండు; మొలక పూవుల పూజ వలఁతి
చిలువ జన్నిదముల చెలువుండు సికను లేఁదొగ విందుతనె పూను సొగసు కాడు

ననుఁ గజాననుఁ డెపుడు నిన్ బొగడు కృతులఁ
జిర కృపాస్ఫూర్తి సంపూర్తి సేయుచుండు, భూనుత....
(కు.శ-ప. 2)

కొక్కుఁజొక్కువయాళి=ఎలుక, మినుసుక యెకిమీడు= గరళకంఠుడు, మొలక పూవులు=గరిక, చిలువజన్నిదము =నాగజందెము, లేఁదొగ విందుతునె=కలువలతోడు ఐన చంద్రుడు, జేజేమిన్న=దేవతా శ్రేష్ఠుడు. గుజ్జుదేవర=పొట్టి దేవుడు,మేల్కడాని పసిండిమేని= మెరిసే బంగారపు రంగుకల శరీరం.

2. రాజుల దుష్ప్రవర్తన:

అన్యాయవర్తులైన రాజుల దుష్ప్రవర్తనను తిమ్మకవి ధైర్యంగా అధిక్షేపించాడు. కడుపార నేతితో చేసిన మాంసపు ముక్కలు తిని, అరగటానికి తాంబూలం కుక్కుకొని, బలంతో గృహస్థుల మెడలు నొక్కిమరీ ధనాన్ని గ్రహించి, డబ్బుపెట్టెలో కుక్కుతూ, ప్రజలను విసుగుకుంటూ, పల్లకీలో తిరిగే రాజులకు కీర్తి దక్కుతుందా?అంటాడు. (కు.శ ప. 53) బాహ్మణ మాన్యములు దిగ మ్రింగాలనుకొనేవారు అల్ప ప్రభువులని తిమ్మన నిరసించాడు. భూమి అంతా తన సొమ్మని బ్రాహ్మణుల మాన్యములు చూసి ఓర్వలేక మింగడానికి అవి వెన్నప్పములా? బూరెలా? వడలా? బొబ్బట్లా? అని దుమ్మెత్తి పోస్తాడు.ఆనాటికి ఈనాటికి తెలుగువారి వంటకాలు మారలేదని పద్యం చూస్తే తెలుస్తుంది.

శా. మన్నెల్లం దనసొమ్మటంచు పసుధా మర్త్యోత్తమ క్షేత్రముల్
కన్నారంగని యౌర్వలేక దిగమ్రింగంజూతు రల్పప్రభుల్
వెన్నప్పంబులో బూరెలో వడలొ భావింపంగ బొబ్బట్లోకో
యన్నా! యెన్నగ వారి పాలి కవి? భర్గా పార్వతీ వల్లభా!
ప. 71

ఆనాటి రాజులలో ఉండే దుర్గుణాలను తిమ్మన పరిశీలించాడు వాటన్నింటిని ఒక చోట చేర్చి పద్యంగా కూర్చి ఇలాంటివారివల్ల లాభము ఏముందని నిరసించాడు. కోపము ఎక్కువ, సహనము తక్కువ. శౌర్యము, స్థిరత్వము, దయాగుణం, సత్యం,పరహిత చింత, ధర్మగుణము లేవు. దుర్నీతి, మాత్సర్యము, కపటము, అహంకారము, ద్రోహబుద్ధి, పరధనాపేక్ష, మదము మాత్రం నిండుగా ఉన్నాయి. వీరు ఎవరికి ఏమి ఇవ్వగలరు అంటాడు.

కోప మొక్కువ తాల్మి కొఱంత శౌర్యము సున్న ;
నిలుకడ నా స్తి దుర్నీతి ఘనము
కనికరం బిల్ల దుర్గర్వ మగ్గము ; సత్యశౌచముల్ కల్ల
మచ్చరము హెచ్చు
కాపట్య మురు వహంకారంబు గాటమ్ము; పొగరు
దట్టము ద్రోహబుద్ధి దళము
పరధనాపేక్ష నిబ్బరము లోభము పెల్లు; పరహిత చింత
నిప్పచ్చరమ్ము
ధర్మమతి తొట్టు నీ యిల్లి దుర్మదాంధ; నృపకులాధము
లేరి కే మియ్యఁ గలరు? భూనుత.... ప. 58

ఇటువంటి భావాలనే భర్గ శతకంలోను కవి వెల్లడించాడు (ప. 77) ఇటువంటి రాజులు రాజ్యాంతమున నరకము ధృవమని స్మృతులు చెబితే వినలేదా హరిశ్చంద్రుడు మొదలైన రాజేంద్రులు పుణ్యాత్ములై వెళ్లిపోయారు అన్న కథలు వినలేదా? యముడు దురాత్ములను పట్టుకొని కష్టాలను పెడతాడనే మాటను వినలేదా? పుట్టినవాడికి మరణం తప్పదని పండితులు చెప్పిన మాటలు చెవికి ఎక్కించుకోలేదా? దుర్మతులయి ప్రజలను బాధించి ధనం కూడబెట్టుకోవాలనేవారు కూళదొరలే అంటాడు. (కు.శ-పద్యం. 54)

3. రాజుకువుండవలసిన సుగుణాలు:

శిబి, మాంధాత, భరతుడు, పృథువు, శశిబిందుడు, గయుడు, జామదగ్నుడు, దిలీపుడు, అంబరీషుడు,

యయాతి, శ్రీరాముడు, సుహోత్రుడు, పురూరవుడు, నాభాగుడు, కార్త్యవీర్యార్జునుడు, దుష్యంతుడు, భరతుడు, నలుడు, పురుకుత్సుడు వంటి వారి ధర్మవద్ధతి తెలుసుకోకుండా ఉండకూడదు అని కవి అంటాడు. ఎలాంటి సుగుణాలు ఉంటే రాజ్యం బాగుంటుందో కవి చెబుతూ.....

భోగియై ప్రతిదిన త్యాగియై పుణ్య సంయోగియై సుజనానురాగి యగుచు

దాతయై బుధజన త్రాతయై నిఖిల విజ్ఞాతయై కుశలసంధాత యగుచు

ధీరుఁ డై రణరంగ వీరుఁడై నిర్మలాచారుఁ డై నిరుపమోదారుఁడగుచు

శాంతుడై నదమల స్వాంతుడై కీర్తిదిగంతుడై పటుబలవంతుడగుచు

రాజ్య మేలంగఁ గలవాఁడె రాజు గాక హీనమతి యై చరించువాఁ డేటి రాజు? భూనుత..... ప.56

ఇంకా క్రింది సుగుణాలు ఉంటే అతడే నిజమైన రాజు అంటూ న్యాయాన్ని తప్పక కాపాడాలి. దుర్మార్గులను శిక్షించి సన్మార్గులను రక్షించాలి. తనను సేవించే వారికోరికలు నెరవేర్చాలి. శరణు వేడిన శత్రువునైనా ఆదరించాలి. అంతేకాని తనపొట్టకోసం ప్రజలను పీడించే పాపాత్ముడు తక్కెడ గాక రాజవుతాడా? (కు.శ.ప.61)అని ప్రశ్నిస్తాడు. యుద్ధంలో వీరుడుగా, యాచకులకు భోజునిగా ఉండి ప్రజలకు శ్రేయస్సు కూర్చేవాడే రాజుగాని కానివాడు తరాజే అవుతాడు అంటాడు. (భ-ప74)

4. వ్యసనపరులకు ధనలాభం:

జారులకు, చోరులకు, గంజాయి, కల్లు సేవించేవారికి, గారడీ విద్యలు చేసేవారికి, దొంగలకు, వేశ్యలకు, ధనం కోసం ఆడవారిని తార్చేవారికి, నల్లమందుకు, రాజులకు, తప్పు చేసిన వారినుండి అపరాధ రుసుము వసూలు చేసేవారికి, మోసగాండ్లకు కోడి పందాలు వేయడానికి, వశీకరణకై మందులు పెట్టేవారికి, మాల)ర్లకు, వీధులలో ఆడి పాడే వారికి ధనం లభిస్తుంది కానీ సుకవులకు, దేవాలయాలకు, పండితులకు ధనం లభించదు అంటాడు. తిమ్మనపైన పేర్కొన్న వారంతా ఆనాటి సమాజంలోనే కాదు ఈనాడు గౌరవించబడని వర్గంగా భావించటం కనిపిస్తుంది. సమాజానికి కీడు కలిగించే వారికే ధనం లభిస్తున్నదనే ఆక్రోశం, కవి పండితులకు నిర్ధనులుగానే ఉంటున్నారనే సానుభూతి తిమ్మనకు ఉందనిచెప్పవచ్చు.

జార చోరులకు గంజాయి కల్లులకును; దొత్తుల కగ్గికి దొమ్మరులకు

కుంటెన కత్తెలకును వెలయాండ్రకు; నల్లమందునకు భూవల్లభునకు

తప్పు దండుగలకు దబ్బర గాండ్లకు; నంజుటికొని గోడి పుంజులకును

మందుల వాండ్రకు మాల దాసర్లకు; నాటపాటల వాండ్ర కౌను గాని

సుకవి జన దేవతాగృహ సూరివరుల! జేర దింతయుఁ దులువ కూర్చిన ధనంబు, భూనుత... ప.19

5. సమాజంలో పరిణామం:

గొప్ప విద్యలకన్నా అల్పవిద్యలను ప్రదర్శించేవారికి ధనం సమకూరుతుంది. గొప్ప విద్యలన్ని పనికిరాని విద్యలుగా పరిగణించబడడం పట్ల తిమ్మన ఆవేదన చెందాడు.

వేద శాస్త్ర పురాణ విద్య లక్కఱగావు; పరిహాస విద్యలు పనికి వచ్చు

గద్య పద్యవిచిత్ర కవితలు కొఱ గావు; గొల్ల సుద్దుల కతల్ వెల్లు మీఱు

దేవతా భాషల తీరు లేమియుఁ గావు; పారసీకోక్తులు ప్రణుతి కెక్కు

శైవ వైష్ణవ మతాచారంబు లొప్పవు; పాషండ మతములు బాళి నలరు

నౌర! యిక్కలికాల మహత్మ్య మెంతొ; వింత యైతోఁచుఁ గద ధరాభ్యంతరమున! భూనుత....ప.21

సామాజికపరంగా విశ్లేషిస్తే తిమ్మన కల ఆనాటికా గొల్లసుద్దులవంటి జానపద కళలు, పారశీక భాషాసూక్తులు, నాస్తికవాదాలు ప్రచారానికి వచ్చి ప్రజలచేత గౌరవించబడు తున్నాయనే విషయం తేటతెల్లమవుతుంది. ఇంతేకాకుండా అగ్రకులాల వారు కాకుండా ఇతరకులస్తులు కవిత్వం చెబుతున్నారని, నకిలీయోగులు, వైష్ణవ సిద్ధాంతములలో హింసప్రబలి మద్యమాంసములు తీసుకునే సాతానివైష్ణవులు పెరిగారని, సాలెలు తమ వృత్తిని విడిచి భటులుగా చేరుతున్నారని అంటాడు. రాజులు, బ్రాహ్మణులు పేదలై, కోమటి దాతలు పెరిగారని, భాగవతులు నైతికంగా దిగజారిపోయారని చెబుతాడు. బోయలు మావటీలుగా గొల్లవారు పౌరాణికులుగా చలామణి అవుతున్నారు. బానిసలు వేశ్యలుగా మారిపోయారు, జైనబ్రాహ్మణులు తీర్పులు చెప్పే న్యాయాధికారులయ్యారు, యవనులు రాజులై పరిపాలిస్తున్నారు. ఇదికలిదోషమని తన ఆవేదనను ఈశ్వరునితో కవి చెప్పాడు. (ప.22)

వర్ణాశ్రమ ధర్మాలయందు తిమ్మకవికి ఆసక్తివున్నా సాంఘికాచారములపట్ల విశాల దృక్పథం కూడావుంది.

శా. డాయన్రాద యటంద్రు మాదృశులు చండాలాదుల న్దాసినన్

బాయుం బుణ్యచయంబు లంచుఁ జదువు ల్పల్కంగనీ వయ్యయో

బోయండెంగిలి మాంసమిచ్చుటకు లోబుల్పాని చేకాంటివే

ప్రాయశ్చిత్తము కద్దు దీని కిక? భర్గా! పార్వతీవల్లభా!

మావంటివారు చండాలాదులను తాకితే పుణ్యం పోతుందంటారు. వారు విద్యకు దూరమయిపోతున్నారు. కానీ బోయడైన కన్నప్ప ఎంగిలిమాంసం పెడితే తిన్నావు. మరి దీనికి ఏమి ప్రాయశ్చిత్తమేముందయ్యా? అని కవి ప్రశ్నించడంలో సాంఘికాచారములలోని దురాచారం పట్ల వ్యతిరేకతను ప్రకటించే విశాల దృక్పథం కనిపిస్తుంది.

సమాజంలో పాదుకొన్న నమ్మకాలు, తన అనుభవంలో నుండి వెలికివచ్చే ప్రశ్నలకు సంఘర్షణ జరిగినపుడే కవి ఇలాంటి అభిప్రాయాలను వ్యక్తంచేయగలడు. అందుకే తిమ్మన కేవలం కవిగానే గాక మానవసమాజాభ్యుదయం కోరే మహోన్నత మూర్తిగా దర్శనమిస్తాడు.

6. సప్తసంతానాల ప్రసక్తి:

సంతానాన్ని పొందడం, ధనాదులను నిక్షేపించడం, దేవతా వివాహాలు చేయడం, దేవాలయాలు, సరోవరాలు నిర్మించడం, కావ్యాలను అంకితం పొందడం, వనాలు నిర్మించడం; ఈ సప్త సంతానాలను పొందితే పుణ్యం వస్తుందని ఆనాటి సమాజంలో భావించేవారు. ఇవన్నీ చేయడం వలన కలిగే పుణ్యం శివనామం పలకడం ద్వారానే కలుగుతుందని భర్గశతకంలో చెబుతాడు.(భ.శ-ప64) కానీ కుక్కుటేశ శతకంలో ఇవి ఇహపర సౌఖ్యాలను కలిగిస్తాయని అంటాడు. భక్తి మార్గం ఎంత గొప్పదయినా అది అతనికి మాత్రమే లాభాన్నిస్తాయి. శివనామాన్ని జపించడంతో పాటు సప్త సంతానాలను ఆచరించడం వ్యక్తిగత లాభంతో పాటు సమాజానికి, పర్యావరణానికి కూడా హితం కలిగిస్తాయని తిమ్మన ఆలోచించి వీటి ఆచరణ ఆవశ్యకమే అనుకుని చెప్పినట్లు అనిపిస్తుంది.(కు.శ-ప64)

7. లోభగుణ తిరస్కారం:

నాడు లోభగుణము సర్వసాధారణమైన దుర్గుణముగ వ్యక్తులను ఆశ్రయించింది. వితరణ గుణవిహీనులైనవారిని నిశితముగ విమర్శించాడు. బ్రాహ్మణులకు స్వయంపాకం కూడా ఈయని వాడు, చుట్టాలకు అన్నం పెట్టని వాడు, పిడికెడు బిచ్చం పెట్టనివాడు, తన కడుపారా అన్నం కూడా తిననివాడు, మంచిబట్ట కట్టలేని వాడు, అవసరమైనపుడు

కూడా ధనం ఖర్చు పెట్టనివాడు, బియ్యం కడిగిన నీళ్లు, తవుడు కూడా విడిచిపెట్టడానికి మనసొప్పని వాడు, మాడిపోయిన పదార్థాలైన కక్కుర్తి పడేవాడు కూడబెట్టిన ధనం రాజులచే అపహరించ బడడమే కాదు వారి మరణానికి కూడా కారణమవుతుంది అంటాడు(కు.శ 18) ఆకలిగా ఉన్నవానికి వంటకమైన, బియ్యమైన, జావైన, కూరాకైన, పండైన, చివరికి నీరైన ఇవ్వాలి. పరదేశులను ఆదరించాలి. అలా చేయకపోతే అవి ఇల్లనిపించుకుంటాయా? అని చీదరించుకుంటాడు.

8. కుకవుల దుశ్చర్యలు,విద్వాంసుల దైన్యం:

రాజులను ఆశ్రయించి ధనముకొరకు సత్యాన్ని విడచి వారి ప్రాపకము కోసము ఆరాటపడే కుకవులను అవివేకులని నిరసించాడు తిమ్మన.పరమ పినారిని కర్ణుడని, అసత్యప్రలాపిని హరిశ్చంద్రుడని, దయలేని వానిని శ్రీరామచంద్రుడని, కురూపిని మన్మథుడని, పాపిని ధర్మరాజని, పిరికిపందను అర్జునుడని, బీదవాడిని మండలేశ్వరుని మతిలేనివానిని ఆదిశేషుడని కవులు కక్కుర్తితో తమ పొట్టనింపుకోవడం కోసం అవివేకంతో పొగుడుతున్నారని నిరసిస్తాడు.

సీ. పరమలోభిని దివాకర తనూభవుఁ డంచు; భద్మ చిత్తుని హరిశ్చరద్రుఁ డనుచు
నిర్దయాత్ముని రామనృపశిఖామణి యంచుఁ; గడుకురూపిని రతికాంతుఁ డనుచు
పాప కర్మునభంగ పాండవాగ్రజుఁడంచు; సమర భీరుని సవ్యసాచి యనుచు
కుండ బీదను మరున్మండలేశ్వరుఁ డంచు; మతివిహీనుని భోగిపతి యడంచు
కవులు కక్కూర్తి నిసుమంత కడుపు కొఅకు; పొగడు చుండుదు రవివేక బద్ధ లగుచు, భూనుత....ప. 46

రాజులనాశ్రయించిన కవి, పండితుల స్థాయిని కూడా వాస్తవిక దృష్టితో పరిశీలించిన తిమ్మన, కవితా సామ్రాజ్యమును ఏలేవారు,మహా ప్రబంధ నిర్మాణ దక్షులగు విద్వాంసులు దైన్యముతో రాజులనాశ్రయించుట తగదని 'సుకవితా యద్యస్తి రాజ్యేన కిం' అను భర్తృహరి సూక్తిని ఉదాహరించాడు (భ.ప.82) సత్కర్మలను ఒదిలి జిత్తెడు పొట్టకై దుష్కవటులైన రాజులనాశ్రయించి వారి ఆస్థానములో కవులుగా ఉండవలదని హెచ్చరించాడు. ఈసందర్భములో పాండిత్యములేని పండితులు మరియు కుకవుల దుశ్చర్యలను ఖండించాడు. దీనివలననే వివిధ వృత్తులవారు, జాతివారు కవితా రచనకు ఉద్యమిస్తున్నారని, కుకవుల దుర్వర్తనము కవితలు కాసుకు గంపెడయ్యాయని బాధాపూర్వకముగా విమర్శించాడు. (భ–ప.85,86,87)

8. వాడుకభాష:

మిగతా కవులకంటె ఈకవి స్వతంత్ర భావాలు కలవాడు. అందుకే వ్యాకరణ సాధువులు కాని 'పేదర్కము' వంటి ప్రయోగాలు చేసాడు. భర్గశతకములో కంటె ఎక్కువ వ్యవహారిక భాషా ప్రయోగాలు కుక్కుటేశ శతకంలో కనిపిస్తాయి. కేవలవముకల్పనాకాశాములో విహరించకుండా సామాజిక స్పృహ కలిగి సంఘసంస్కరణాభిలాషతో రచన చేసిన సత్కవీశుడు తిమ్మన. భాషా పరిణామానికి సాక్ష్యంగా ఇందులో కొన్ని పద్యాలను రచించాడు. సల్లగా, సల్లబొట్టు, మానెడూద, కూసుగాడు, సాలరచ్చింపవలె, యేంచేసె, దిగయేసి, మాలయ్య పచ్చాలు, సతుకుకుంట, సేతులుసాపు, సాకలిసెల్లిగాడు, మొదలైన గ్రామ్య పదాలతో ప్రత్యేకంగా కొన్ని పద్యాలను రచించడం ద్వారా ఆ భాష పట్లఉన్న మక్కువను వ్యక్తపరచడమే కాక హేళన, అధిక్షేపాలకు సాధనంగా కూడా ఉపయోగించుకున్నాడు. ఈ విధముగా సమాజము లోని చెడును పరిహరించి, మంచినిపెంచుటకు

తన రచనల ద్వారా ప్రజల మనస్సులలో చైతన్యము కలిగించుటకు ప్రయత్నించిన సుకవిశేఖరుడు కూచిమంచి తిమ్మన. భాషలోను, భావములోను కొత్తదనము కావాలన్న కందుకూరి, గిడుగు, గురజాడలకు ప్రేరణ కలిగించాడా అన్నట్లుగా విలసిల్లిన ప్రతిభామూర్తియై తెలుగుజాతి ఉన్నంత కాలం ప్రాత:స్మరణీయ స్థానంలో నిలిచాడు.

ఆధారగ్రంధాలు:

అధిక్షేప శతకములు; ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ; 1982.

తెలుగు సాహిత్య చరిత్ర–పంచమభాగము; శ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తి 1998.

శబ్ద రత్నాకరము; శ్రీ బి. సీతారామాచార్యులు; 2001.

ఆధునికతకు అద్దం – గురజాడ కన్యాశుల్కం

డా॥ వొలుప్ప కనకరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, సాహిత్య పీఠం,
రాజమహేంద్రవరం. చరవాణి: 94402 29189

మన దేశంలో పంతొమ్మిదవ శతాబ్దపు ద్వితీయార్ధంలో ప్రారంభమైన సాంస్కృతిక పునరజ్జీవనం ఆధునిక యుగ ఆరంభానికి దారి తీసింది. వ్యవహారిక భాషావాదం, పాశ్చాత్య కవితా ధోరణుల ప్రభావంతో సాహిత్యంలో అనేక నూతన ప్రక్రియలు వెలుగు చూసాయి. వస్తువులో, భాషలో, అభివ్యక్తిలో అనేక మార్పులు చోటు చేసుకుని తెలుగు కవిత్వం అపూర్వ సౌందర్యాన్ని సంతరించుకున్నది. క్రమంగా సంప్రదాయ కవులు నూతన మార్గాలవైపు పయనించ సాగారు. సహృదయ పాఠకుల ఆదరణ ఆధునిక కవిత్వానికి మెండుగా లభించింది. నవ్యకవిత్వాన్ని ఆధునిక కవిత్వం, అభినవ కవిత్వం అని పిలిచేవారు. ఆధునికమైన భావాలలతో రాసింది మాత్రమే ఆధునిక కవిత్వం అనిపించుకుంటుంది. దీనిపై ఫ్రెంచి, ఇంగ్లీషు మొదలైన కవితా ధోరణుల ప్రభావం కనబడుతుంది. ఆంగ్ల విద్య, సంఘసంస్కరణ ఉద్యమం, శాస్త్ర విజ్ఞానం, పత్రికలు, వ్యవహారిక భాష, స్వదేశీ ఉద్యమం, దేశభక్తి మొదలైన అంశాలు ఆధునిక కవిత్వానికి ప్రధాన హేతువులుగా చెప్పవచ్చు.

తెలుగు సాహిత్యమునకు వెలుగు రేఖలా 1862 సంవత్సరములో విశాఖ జిల్లా, రాయవరం గ్రామంలో జన్మించిన గురజాడ అప్పారావు కవి భాస్కరునిలా ఆధునికతకు ఆధ్యక్ష్యం వహించారు. "సాహిత్యం ఏ కొందరి సొత్తోయనుకొన్న కాలములో అది ప్రజల సొమ్ముని ఉదారముగా పంచి పెట్టిన సౌమ్యశీలి ఆయన. కందుకూరి సాంఘిక విప్లవమును, గిడుగు భాషా విప్లవమును తనలో సమన్వయించుకొని, సరికొత్త సాహిత్య విప్లవమును లేవనెత్తిన నవయుగ వైతాళికుడాయన. ఆయన చేతి చలువతో అస్పృశ్యముగా పడియున్న వాడుక భాష అందలమెక్కినది. మెత్తని తెలుగు పలుకు కత్తెవాదర వలె మెరిసినది." అని డా॥ సి. నారాయణ రెడ్డి గారు గురజాడను శ్లాఘించారు.

ఆధునిక యుగకర్త, కవిశేఖర, మహాకవి, అభ్యుదయ కవితాపితామహుడు, సంఘసంస్కర్త, గొప్ప దేశభక్తుడు, మానవతావాదిగా కీర్తించబడిన, వ్యవహారిక భాషోద్యమ కారకుడు అయిన అప్పారావు తెలుగు సాహిత్యానికి ధ్రువ తారగా నిలిచారు. ఆధునిక భావాలతో, ప్రజల భాషలో, సరికొత్త రీతులలో సంఘ సంస్కరణకు దారి చూపుతూ ఆయన చేసిన రచనలు తెలుగు సాహితీ వికాసమునకు బాటలు వేసినవి. గురజాడ రాకతో నూతన చైతన్యము అంకురించినది. నవ్య కవితోద్యమానికి నాంది పలికిన గురజాడ కూడా మొదట తన సమకాలిక రచయితలవలె కేవలం సాంప్రదాయకమైన రీతిలో ప్రాచీన వృత్తములతో "మాటలు మబ్బులు, పుష్ప లావికలు, మెరుపులు మొదలైన ఖండకావ్యములు సుభద్ర అను కావ్యమును, ఋత శతకమును రచించాడు. తన ఇరవై ఒకటవ యేట ఆంగ్లములో 'సారంగధర' అను శీర్షికలో రాసిన పద్యములు 'ఇండియన్ లీజర్ అవర్' అను పత్రికలో ప్రచురితమైనవి. దీనిపై కొన్ని నిరుత్సాహకరమైన విమర్శలు వచ్చినప్పటికి ప్రముఖ వంగ విద్యావేత్త అయిన శంభు చంద్ర ముఖర్జీ గారు గురజాడను మెచ్చుకొని లేఖద్వారా చేసిన సూచనలు, నైతిక ప్రోత్సాహం గురజాడ మనోఫలకముపై బలమైన ముద్ర వేసి ప్రతిభను వెలికితీయుటకు పరోక్షకారణ ములయినవి.

ఆదికవి నన్నయ "గతకాలము మేలు వచ్చుకాలము కంటెన్" అని అంటే ప్రజాకవి గురజాడ "మంచిగతమున కొంచెమేనోయ్, మందగించక ముందు కదుగేయ్" అంటారు.

కవిత్రయ భారతంలోని తిక్కన జీవితానికి, గురజాడ వారి జీవిత అనుభవాలకు మధ్య కొన్ని పోలికలు కనిపిస్తున్నవి. తిక్కన మనమసిద్ధి ఆస్థానంలో మంత్రిగా ఉంటే గురజాడ విజయనగరం రాజావారి దివాణంలో దివాన్‌గా పని చేసారు. తిక్కన భాష దేశీయంతో శోభీస్తే, గురజాడ భాషలో వ్యవహారిక శైలీ సౌందర్యం గుబాళిస్తుంది. తిక్కన నాటకీయతను సాధించగా గురజాడ కన్యాశుల్కమనే అపూర్వ నాటకాన్ని రచించాడు.

సాహితీ మర్మజ్ఞుడైన గురజాడ రచనలు సాంఘిక సంస్కరణాత్మకమైనట్టి వట్టి ఉద్బోధలుగా మిగిలి పోలేదు. ఆయన కలం నుండి జాలువారిన పలు రచనలు ఈ వాస్తవాన్ని బుజువు చేస్తున్నవి. ఆధునికాంధ్ర కవిత్వమునకు గురుపాదులు గురజాడ. భాషను సంకెళ్ళతో బంధించిన వారిని ధిక్కరించి వీరు మొట్టమొదట నవ్యకవితను తెలుగు వారికి రుచి చూపించారు. సంఘ సంస్కరణ, భాషా సంస్కరణ, ఉత్తమ రూపక నిర్మాణము, అనే ప్రయోజనము లతో 'కన్యాశుల్కం' నాటకమును రచించారు. సామాన్య జనుల భాష, సునిశిత హాస్యము, పాత్రపోషణవైచిత్రి, సాంఘిక జీవన చిత్రణము, గుండెను బలంగా తాకే వ్యంగ్య వైభవం కన్యాశుల్కం నాటిక ప్రత్యేకతలు. ఇందులో అడుగడుగునా ఆధునికత ప్రతిబింబిస్తుంది.

తెలుగులోనికి నాటక ప్రక్రియ ప్రవేశించిన తొలినాళ్ళలో సంస్కృతం, ఆంగ్లం నుండి అనువాదంగా వచ్చిన రచనలు ఎక్కువగా ఉన్నాయి. యక్షగానముల ప్రభావం, మరాఠీ, బెంగాలీ నాటకముల ప్రభావం మనపై అధికంగా ఉన్నది. సాంప్రదాయిక సంస్కృత నాటకంలోని నాందీ ప్రస్తావన, అంకరంగ విభజన, పంచసంధి నిర్మాణం, భరత వాక్యం, విష్కలంభం, ప్రవేశిక మరియు ఆంగ్ల నాటకాలలో అనుసరించే వివిధ పద్ధతులు ఇలాంటివేమీ కన్యాశుల్కంలో కనిపించవు.

గురజాడ ప్రాచీన నాటక నిర్మాణ చట్రాన్ని బద్దలు కొట్టి దానికి భిన్నంగా కన్యాశుల్క నాటక రచన కావించారు. క్లిష్ట సమాసాలు, పద్యాలు, గేయాలు ప్రక్క పెట్టి సజీవమైన, సరళమైన వ్యవహారిక భాషలో సంభాషణలను రచించి కొత్త, ప్రక్రియలతో బాటలు వేసారు.

వేదం వేంకటరాయ శాస్త్రి గారు "పాత్రోచిత భాషగా వ్యవహారిక భాషను ప్రవేశపెట్టడాన్ని ఆనాటి పండితులు తీవ్రంగా నిరసించారు. కాని అప్పారావు కన్యాశుల్కం నాటకం మొత్తాన్ని పూర్తి వ్యవహారిక శైలిలో భాషలోని మాండలికతను కూడా యథాతథంగా ప్రతిఫలించేటట్లు రచన చేసి ఆ ధోరణి మీద తిరుగుబాటు చేసారు. అంతేకాదు ఇంగ్లీష్ నాటకాల వలె విషాదాంతం, భారతీయ నాటకాలవలె, మోదాంతం కాకుండా చేసి ఆ రెండు నమూనాలను తిరస్కరించారు. ఇందులో నాయకుడు, నాయిక, ప్రతి నాయకుడు ఎవరూ లేరు. కథ ఒక నియత ఆరంభంతో మొదలుకాదు. ఒక నియతమైన స్పష్టమైన ముగింపు లేదు. నియత నిర్మాణ చట్రాన్ని తిరస్కరించేందుకు గురజాడ ఈ విధంగా తీర్చిదిద్దారు. సంప్రదాయానికి భిన్నంగా నడచినప్పటికి ఆయన సాధించిన కళానైపుణ్యం వల్ల అపూర్వమైన జనాధారణా సాఫల్యాన్ని పొంది చారిత్రక, పౌరాణిక నాటకాల నుంచి సమాజం సామాజిక నాటకాల వైపు మరలింది. తరువాత కాలంలో వెలువడిన అనేక నాటకాలకు కొత్త బాటలు వేసింది. నిర్మాణంలోనే కాకుండా తాత్విక భూమికలో కూడా 'కన్యాశుల్కం' ఆధునికతను సంతరించుకుంది. మూఢనమ్మకాలకు వ్యతిరేకమైన హేతువాద ధోరణి కన్యాశుల్కం నాటకంలో అడుగడుగునా కన్పిస్తుంది. కన్యాశుల్కము, బాల్యవివాహాలు, సతీసహగమనం వంటి దురాచారాలన్నీ మూఢనమ్మకాల పునాదులపై వ్రేళ్ళూనుకొన్నవి. అందువల్లనే గురజాడ ఈ సామాజిక రుగ్మతల చుట్టూ అల్లుకున్న సమస్యలను నాటకంలో చిత్రించాడు.

కన్యాశుల్కం అంటే కన్యలకు ఖరీదుకట్టి అమ్మడం. డబ్బు కోసం ఆశపడి కన్నబిడ్డలను పసిప్రాయంలోనే ముసలివాళ్ళకు ఇచ్చి పెండ్లి చేయడం, తర్వాత వారు

వితంతువులై బాధలు పడటం ఇంకా వేశ్యావృత్తి, వితంతు పునర్వివాహం, భ్రష్టు పట్టిన విద్యా వ్యవస్థ, అబద్దపు న్యాయ వ్యవస్థ ఇటువంటి అనేక అంశాలను ఈ నాటకంలో కళ్ళకు కట్టినట్లు చూపించడం జరిగింది. నిత్య నూతనంగా వెలుగొందే ఈ నాటకంలోని పాత్రలు నేటికీ సజీవంగానే ఉన్నాయి. ఇందులో ప్రస్తావనకు రాని సాంఘిక దురాచారాలు గానీ, రుగ్మతలు గాని లేవు.

కన్యాశుల్కం నాటకానికి ఆయా విలక్షణ పాత్రల వల్ల కొత్త సొబగు వచ్చింది. సమకాలీన వాస్తవికత సమగ్రంగా ఇందులో ప్రతిబింబిస్తుంది. ఈ నాటకంలోని గిరీశం పాత్రను కవి ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. ఈ పాత్రను వివిధ కోణాలలో అధ్యయనం చేస్తే దీని విశిష్టత అవగతమవుతుంది. ఆంగ్లేయుల పాలనా కాలంలో సంఘ సంస్కరణ పేరుతో ఎంతో మంది రంగ ప్రవేశం చేసారు. కాని వీరిలో ఉన్న అనేక మంది నకిలీలకు 'గిరీశం' ప్రతినిధిగా కనిపిస్తాడు. అతనిలో పాశ్చాత్య సంస్కృతిని జీర్ణించుకున్న ఒక ఆరాచకవాది కనిపిస్తాడు. అతని మాటల చమత్కారం వెనుక కుటిలత్వం దాగి ఉంటుంది. పరిస్థితులను బట్టి మనుష్యులను బట్టి ప్రవర్తించే వ్యక్తి. జీవితాన్ని పూర్తిగా అనుభవిస్తూ జీవితానికి లొంగి పోకుండా పై చేయిగా ఉండటం అతని ధ్యేయం.

హాస్య దృష్టితో సమయ స్ఫూర్తితో వ్యవహరించడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. తన పూట బత్తెం గడవడానికి రకరకాల టక్కుటమారాలు చేసే గిరీశం చివరకు 'డామిట్ కథ అడ్డం తిరిగింది' అంటూ రంగం నుంచి నిష్క్రమిస్తాడు. మేధాశక్తి, విజ్ఞానం, లౌక్యం, చురుకుదనం వంటి లక్షణాలున్నా పెడత్రోవపట్టాడు. అందువల్లనే మధురవాణి గిరీశాన్ని "పాపం ఆయన్ను బతకనివ్వండి" అంటుంది. మహాకవి గురజాడ చేతిలో రూపు దిద్దుకున్న గిరీశం పాత్ర రసజ్ఞ పాఠక హృదయ లోకంలో చిరకాలం విరాజిల్లుతూనే ఉంటుంది.

గిరీశానికి సరిజోడు 'రామప్పంతులు'. ఇతడు కూడా నిత్య అసత్య భాషణా చతురుడే. గిరీశం వలె తరచూ మధురవాణి ఇంటిని సందర్శిస్తుంటాడు. తన పబ్బం గడుపు కోవడానికి దేనికైనా వెనుకాడడు.

ఈ నాటకంలోని పాత్రల ద్వారా నాటి వైవాహిక వ్యవస్థ, కన్యాశుల్కం వల్ల కలిగే దుష్పలితాలు స్పష్టంగా ఆవిష్కృతమైనవి. "అగ్నిహోత్రావధానులు" మా తండ్రి మేనత్తల్ని కూడా అమ్మడమే జరిగిందట అంటాడు. దీనిని బట్టి ఈ దురాచారం చాలా కాలం నుండి పాతుకు పోయిందని, దీన్ని వారు సాంఘిక దురాచారంగా భావించడం లేదని అర్థమవుతున్నది. అగ్నిహోత్రావధానులు పెద్దకూతురు బుచ్చమ్మ బాల వితంతువు అయినందుకు తండ్రి బాధ పడక పోగా "అల్లుడు చనిపోయినాడంటే అందువల్ల ఎంత లాభం కల్గింది? భూముల కోసం దావా తెచ్చావా? లేదా? అని వాదిస్తాడు. బాల్య వివాహాల వలన బాల్యంలోనే వితంతువులై అక్రమ సంబంధాలను ఏర్పరచుకొన్న పూట కూళ్ళమ్మ, మీనాక్షి పాత్రలు ఈ వివాహ విషాద పర్యవసానాన్ని వెల్లడిచేస్తాయి.

ఆంగ్ల విద్యావిషయంలో ఆనాడు ప్రజల్లో ఉన్న వెర్రివ్యామోహం ఈ నాటకంలో దర్శనమిస్తుంది. మరో వైపు ఈ ఇంగ్లీషు చదువు వల్ల ఉంటే ద్వేషము కనిపిస్తుంది. ఇంగ్లీషును వ్యతిరేకిస్తూ అగ్నిహోత్రావధాన్లు చెప్పిన దృష్టంతాలు అనేకం ఉన్నాయి. ఇప్పటి వలె ఆనాటి సమాజంలో కూడా తల్లిదండ్రులకు నూతన విద్యావ్యవస్థ పట్ల ఉన్న వ్యామోహంను పిల్లలపై బలవంతంగా రుద్దేవారు. ''ఈ వెధవ ఇంగ్లీష్ చదువు నుంచి బ్రహ్మచర్యం చెడిపోతుంది. సంధ్యావందనం, శ్రీసూక్త, పురుష సూక్తులు తగలబడి పోతున్నాయి'' అని అగ్నిహోత్రావధానులు పలికిన పలుకులు ఆంగ్ల విద్య గురించి ఆనాటి కొంత మందిలో ఉన్న వ్యతిరేకతకు అక్షరరూపాలు.

ఇందులో మరో ముఖ్యమైన మధురవాణి పాత్ర సృష్టిలో గురజాడ ప్రతిభ కనబడుతుంది. మధురవాణి సానబట్టిన

వజ్రం వంటిది. ఈ నాటకంలోని పాత్రలన్నీ మధురవాణి చుట్టూ తిరుగుతాయి. ఈమె సానులలో సంసారి. చిన్నప్పుడు ఆమె తల్లి చేసిన ఉపదేశం వలన వేశ్య అయినప్పటికీ నీతి, నిజాయితీగా జీవితం కొనసాగించింది. మధురవాణి సహజసుందరి. పూజారికి ఆమె పుత్తడి బొమ్మ, కరటక శాస్త్రికి ఆమె త్రిలోక సుందరి. సంగీతంలోను, సాహిత్యంలోను ఆరితేరినది. కరటక శాస్త్రి దగ్గర సంస్కృతం, గిరీశం దగ్గర ఇంగ్లీషు నేర్చుకుంది. "మృచ్ఛకటికంలోని 'వసంతసేన' జీవితాన్ని బాగా జీర్ణించుకున్న వేశ్య మధురవాణి. వ్యక్తి స్వాంతంత్ర్యాన్ని, పట్టుదలను ఎటువంటి సందర్భంలోనూ కోల్పోని స్త్రీ మధురవాణి. దేశకాల పరిస్థితుల వల్ల పడుపువృత్తిని అవలంబించిననూ ఆమెలో మానవత్వం ప్రతి సన్నివేశంలోనూ కనిపిస్తుంది. నాటకారంభంలో సామాన్యవేశ్యగా కనబడిన మధురవాణి నాటకాంతానికి మహావ్యక్తిగా దర్శన మిస్తుంది. "మనం చెడ్డయని అనుకున్న దానిలో కూడా మంచిది ఉండవచ్చును అను ప్రాథమిక సత్యాన్ని మధురవాణి చరిత్ర నుండి నేర్చుకొంటిని" అని సౌజన్యారావు అనడంతో మధురవాణి గొప్పతనం అర్థమవుతుంది. మధురవాణి జీవితం ఆనాటి వేశ్యావ్యవస్థకు ప్రతిబింబంలా కనిపిస్తుంది.

నేటి ఆధునిక కాలంలో కూడా అమాయక ప్రజలను భైరాగులు, సిద్దులు, గురువులుగా చెప్పుకొనే కొందరు మహిమలు, అద్భుతాల పేర్లతో బంగారం రెట్టింపు చేస్తామని, గుప్తనిధులున్నాయని, పరలోకానికి పంపుతామని, భూతవైద్యం చేస్తామని, రోగాలు నయం చేస్తామని నమ్మించి మోసం చేస్తూనే ఉన్నారు. ఇటువంటి సంఘటనలను గురజాడ తన రచనలలో కళ్ళకు కట్టినట్లు చూపించారు. ఈ నాటికలతో భైరాగి, పూజారి గవరయ్య, సారా దుకాణుదారు రామదాసు, హవల్దారు అచ్చన్న, మునసబు నాయుడు, ప్లీడరు, డిప్టీ కలెక్టర్, పోలిశెట్టి, పోలీస్ హెడ్ మొదలైన పాత్రలలో సహజత్వం, సజీవత్వం తొణికిస లాడతాయి.

నాటకం జీవితానికి దర్పణం వంటిది. "జీవితంలో ఉన్నవన్నీ కన్యాశుల్కంలో ఉన్నవి" అని శ్రీశ్రీ చెప్పడం ఇక్కడ గమనించాలి. నిజ జీవితంలో కుహనా సంస్కర్తనో, తిమ్మిని బమ్మిని చేసే వకీలునో, రాజకీయ నాయకుడినో, అధికారినో కలిసినప్పుడు కన్యాశుల్కం నాటకం మన కళ్ళముందు కదలాడుతుంది.

కన్యాశుల్కం నాటకంలో ప్రారంభం నుంచి ముగింపు వరకూ అనేక స్త్రీ, పురుష పాత్రలు వచ్చిపోతుంటాయి. మొత్తం నలభైతొమ్మిది పాత్రలు. వాటిలో స్త్రీ పాత్రలు ఏడు. ఆనాటి సమాజంలో స్త్రీ జీవితం, ఆమె పంచుకున్న బాధ్యతలు, ఆమె ఉదాత్తత మొదలయినవన్నీ మనకళ్ళముందు నేటికీ యథాతథంగా కనిపిస్తాయి. నాటకం ప్రారంభం నుంచి అంతం వరకూ కన్యాశుల్కం పేరు వినిపిస్తూనే ఉంటుంది. అన్నీ పాత్రలు కన్యాశుల్కం గురించే మాట్లాడుతాయి. కాని కన్య మాత్రం కనిపించదు. అదీ ఈ నాటకం విశిష్టత. స్త్రీ పాత్రల పట్ల అవగాహన ఉన్న గురజాడ వివిధ అంతస్థులకు చెందిన వనితలను మనకళ్ళముందుంచారు. మధురవాణి, వెంకమ్మ, బుచ్చమ్మ, సుబ్బమ్మ, మీనాక్షి, పూటకూళ్ళమ్మ, యోగిని మొదలయిన వారు మనకు సాక్షాత్కరిస్తారు. "ప్రజలకు సన్నిహితంగా ఉన్నటువంటి భాషలో, సమకాలీన సమాజంలో ఉన్న దైన్యాన్ని, హైన్యాన్ని, కుట్రల్ని, కుహకాల్ని, ఆశను, నిరాశను చిత్రించడంలో ఈ నాటకాన్ని మించింది ఇంకొకటి లేదు. నేడే కాదు రేపటికి కూడా ఇది ఆడదగినదే, చూడదగినదే" అని అబ్బూరి రామకృష్ణారావుగారు అనడంలో అతిశయోక్తి లేదు.

వాడుక భాషలో సర్వజనానుమతిని పొందిన ఒక కొత్త రచనా శైలిని గురజాడ ధైర్యంగా ప్రవేశపెట్టారు. సహజమైన సంభాషణలతో, హాస్యరసస్ఫోరకంగా మానవ ప్రవృత్తికి, వాస్తవిక జీవితానికి అద్దం పట్టే బహువిధ పాత్రలను సృష్టించడంలో గురజాడ ఆయనకు ఆయనే సాటి.

శ్రీశ్రీ అన్నట్లు "కన్యాశుల్కం నాటకం గొప్పది. జీవితమంత గొప్పది"

ఆధార గ్రంథాలు :

1. మన గురజాడ – శ్రీశ్రీ.
2. గురజాడ రచనలు – శెట్టి ఈశ్వరరావు.
3. సమగ్రాంధ్ర సాహిత్యం – ఆరుద్ర.
4. ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు – ప్రయోగము – సి.నా.రె.
5. తెలుగు సాహిత్య సమీక్ష – జి. నాగయ్య.
6. భాషా, సాహిత్య విమర్శకుడిగా గురజాడ – తాటితోటి కిరణ్‌బాబు.

కావ్యప్రక్రియలో గంగుల శాయిరెడ్డి "కాపు బిడ్డ" విశిష్టత

డా॥ మామిడాల రమేశ్ బాబు, సహాయ ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్ పల్లి, మేడ్చెల్ జిల్లా తెలంగాణ,
ఫోన్: 9652813779

భారతదేశం మొదటి నుండి వ్యవసాయం ప్రధాన జీవికగా కలిగిన దేశం. నేటికీ దేశ ఆర్థిక వ్యవస్థకు రైతునే వెన్నెముకగా చెప్పవచ్చు. 'జైకిసాన్', 'రైతే రాజు' అంటూ అన్నదాత రైతును గౌరవిస్తున్నాం. నిజానికి రైతు యొక్క శ్రమ వల్లనే దేశం సౌభాగ్య వంతం అవుతుంది. అలాంటి రైతు జీవితాన్ని ప్రధానాంశముగా తీసుకొని తెలుగు కవులు గొప్ప కావ్యాలను రచించారు. కావ్యాలే కాక తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియలలో కూడా రైతు జీవితంపై గొప్ప సాహితీ సృష్టి జరిగింది. మన ప్రాచీన 'గాథాసప్తశతి' నుండి నేటి వరకు అనేక సందర్భాలలో రైతును స్మరించుకుంటుంది మన సాహిత్యం.

ఆధునిక తెలుగు సాహిత్యంలో రైతు జీవితంపై అనేక కావ్యాలు వచ్చాయి. దువ్వూరి రామిరెడ్డి గారి (కృషీవలుడు -1919 లో), ఏటుకూరి వేంకట నర్సయ్యగా 'క్షేత్రలక్ష్మీ' (1938 లో) తెలుగులెంక తుమ్మల సీతారామమూర్తి చౌదరి గారి "సంక్రాంతి తలపులు", "పెద్దకాపు", "రైతు జీవితం" (1955) అలాగే వానమామలై జగన్నాథాచార్యులు "రైతు రామాయణం" (1980 లో) వంటి కావ్యాలు పూర్తిగా రైతు నేపథ్యంగా వచ్చినవే. ఈ కోవలోనిదే మరో ఆణిముత్యం లాంటి కావ్యం గంగుల శాయిరెడ్డి గారు రచించిన "కాపుబిడ్డ". 1937లో వెలువడిన ఈ కాపుబిడ్డ కావ్యం తెలంగాణ తొలి రైతుకావ్యంగా ప్రసిద్ధికెక్కింది. తెలుగు భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వాలు ప్రధానంగా సాగుతున్న కాలంలో రైతు జీవితంపై వెలువడిన విశిష్ట పద్యకావ్యం గంగుల శాయిరెడ్డి గారి 'కాపుబిడ్డ'.

1890 లో వరంగల్ జిల్లా జనగామ సమీపంలోని రామాచంద్రగూడెంలో జన్మించారు శాయిరెడ్డిగారు. తన తాత, తండ్రి లనుండి వారసత్వంగా వచ్చిన వ్యవసాయాన్ని తన వృత్తిగా మలచుకొని, ఆ వ్యవసాయంలోని లోటు పాట్లను అక్షరబద్ధం చేశారు. వ్యవసాయంలో కొత్త పోకడలను, పశు, పర్యావరణ వృద్ధికై కృషి చేస్తూ శాయిరెడ్డి గారు తన చుట్టు ఉన్న సమాజానికి మార్గదర్శిగా ఉండే వారట. తైత్తరీయోపనిషత్ లోని "అన్నం బ్రహ్మేతి వ్యజనాత్" అన్నట్లు, అన్నదాత ఐన రైతును కావ్యనాయకుడిగా చేసి రచించిన కావ్యం ఈ కాపుబిడ్డ. శాయిరెడ్డి గారి దృష్టిలో భూమిని నమ్ముకున్న వారంతా కాపుబిడ్డలే. అందుకే దీనిని వ్యవసాయ పద్యకావ్యమని పేర్కొన్నాడు.

కాపుబిడ్డ 1927 – 35 మధ్య కాలం నాటి తెలంగాణ గ్రామీణ సమాజాన్ని మైక్రోస్కోపిక్‌గా చిత్రించిన సాంఘిక కావ్యం. స్వయంగా రైతు కూడా ఐన శాయిరెడ్డి రైతు జీవితాన్ని, ప్రకృతితో ముడిపడిన రైతు కుటుంబం ఎలా ఉంటుందో ఈ కావ్యం లో మనకు ప్రత్యక్షంగా చూపాడు. కేవలం 147 పద్యాలున్న ఈ కావ్యం రైతు జీవితంలోని ప్రతి అంశాన్ని స్పృశించిందని చెప్పవచ్చు. తన రచన ఉద్దేశ్యాన్ని కూడా ఏ ఎంతో ఆర్ద్రంగా

తల్లిదండ్రుల్‌అమాయికుల్, దార ముగ్ధ
వనములను బట్టి పసులందు బెనగుచుండి
కపట రహితుల సహవాస మేప్పుడు గలిగి
యున్న కాపుల కెప్పుడు తెన్ను గలదో

అంటాడు. ఇప్పటికి కూడా రైతు పరిస్థితి ఇలాగే ఉంది. అందుకే

అని విచారించి ఆర్తిచే హాలికచర్య
పరుల కెరిగింప సరళమౌ భావములను
కలముచే వ్రాయ కన్నీరు గారుచుండ
నశ్రువుల చేత భారతి కర్ణమిడితి

సహృదయంలో రైతు పరిస్థితిని లోకమునకు తెలియజేయడానికే కన్నీటితో ఈ కావ్యమును రచించాను అంటారు శాయిరెడ్డి గారు. రైతుకు సమాజం కన్నా ప్రకృతే ఆప్త బంధువు అంటాడు.

మేఘమార్గమం దుఱుముచు మెఱసి మెఱసి
మిన్ను వానల గుఱిపింప మన్ను పండ
పంచభూతములు ఇట్టుల బంటులగుచు
సేద్యమున గాక నింకెందు సేవజేయు
గుట్టలు కుల పర్వతముల్
చెట్టులు పుట్టలును నదులు చెఱువులు వాగుల్
పిట్టలు పశువులు కనకపు
గట్టుల వలె కర్షకులకు కల్ప వృక్షముల్

అంటూ ప్రకృతే తనను కాపాడే కల్పవృక్ష మంటాడు

రైతు కష్టానికి పంచ భూతములే కాదు ఆ పరమ శ్రేష్టులైన దేవతలు కూడా తన వెంటే ఉంటారని చెబుతూ

విధివలె బీజముల్ విత్త, నాగలి గట్ట
చదువుల పడతి నీ సరసనిలుచు" అంటాడు.

బ్రహ్మవలె నీవు వ్యవసాయం చేస్తుంటే రైతుకు చదువుల తల్లి సరస్వతీ ఏ కాలములో ఏ విత్తులు చల్లాలె, ఎప్పుడు నాటాలో అనే జ్ఞానాన్ని అందిస్తుందట

"హరివలె సస్యాదు లరయించు బోషింప
కలుముల చెలియ నీ కడను నిల్చు"

విష్ణువులాగా నువ్వు కష్టపడి పంటను కాపాడుకుంటే కలుముల చెలియ ఐన లక్ష్మీదేవి ఎప్పుడూ నీ వెంటే ఉంటుంది అంటాడు

"ప్రళయ కాలుని వలె పైరులు గోయింప
బలిమిచ్చు శక్తి నీ ప్రక్కనిలుచు"

రుద్రుని వలె నీవు చేతికి వచ్చిన పంటను కోయించే టప్పుడు నీకు కావల్సిన శక్తిగా (పార్వతి) నీ ప్రక్కనే ఉంటుంటుంది అంటు అటు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల వలె రైతు ఉంటే, రైతు వెంట సరస్వతీ, లక్ష్మీ, పార్వతులు కూడా నడిచి వస్తారంటాండు – ఇలా ప్రకృతి, దేవతలు అందరూ సహకరించే నిన్ను

కర్మయోగంబు చేత నిష్కామ వృత్తి
సేయుచుండగా నీకెల్ల సాయపడగ
జగతి సతతము నీ కర్మ సన్నుతింప
కర్షక చేతులెత్తి నే గౌరవింతు
అంటాడు

"గిరుదావ అరుదెంచి బురదనేలను గని
చెఱువు నీరని వ్రాసి చెఱుచు నిన్ను
చేచక్బరారులు కీచర బాచర
లాగంబుచే డబ్బుగాగుకొనుచు
అబుకారీ దొర హాలాహలం బిచ్చి
వూరి మెసవనిచ్చి బ్రోచునిన్ను
గహనసీమోద్యోగి కాననములలోన
మెకమయి యెప్పుడు విసువు నిన్ను".

అంటూ నిజాం కాలం నాటి రైతుల దయనీయ పరిస్థితిని వివరిస్తారు. రైతును పై ఉద్యోగులందరూ మృగాలవలె హింసిస్తారట. సురవరం ప్రతాపరెడ్డి గారి కథతో "గ్యారాకద్దూ బారా కొత్వాల్" ఇక్కడ మనకు స్ఫురణకు వస్తుంది. నేటికీ అధికారుల పేర్లు, రూపాలు మారాయి కాని, రైతును మృగాల వలె కబలించే వ్యవస్థ నేటికీ అలాగే ఉంది.

కాపుస్త్రీ, తన భర్తకు చేదోడుగా ఉంటూ అన్ని పనులలో భాగం పంచుకుంటుంది అంటూ...

పెనిమిటి యరకతో వెను వెంట చెలి యేగ
సావిత్రిదేవి యే స్మరణవచ్చు
ఉభయులు దున్నగా నువిద విత్తులు వేయ.
సీతామహాదేవి స్మృతికి వచ్చు.
పిల్లడు వెంటాడ వల్లభుతో జన

చంద్రమతీ దేవి జ్ఞప్తికై వచ్చు.
కాంతారమున బోవు కాంతను జూడగా
ద్రౌపది నడకలే తలపువచ్చు.
అడవిలో నొపి నిద్రింప నతడు పనికి
వెడల నలదమయంతులు విధము దోప
గడియకొక మనోభావంబు బొడముచుండ
కర్షకా కనుబండువు కాదె నీకు .

కాపుస్త్రీ తన భర్తతో ఉన్నపుడు ఆమె ఒక సావిత్రిగా, సీతగా చంద్రమతిగా, ద్రౌపదిగా, దమయంతిగా అండగా ఉంటుందంటాడు.

ఆరు ఋతువులలో రైతు దిన చర్య ఎలా ఉంటుందో ఈ కాపుబిడ్డలో మనం చూడవచ్చు. అలాగే కర్షకున్ని కర్ణునితో పోలుస్తాడు శాయిరెడ్డి గారు. కర్ణపర్వములో

అడిగిన వస్తువు లర్థుల కిడుటచే
త్యాగమందున కర్ణదాత యనియు
ధర్మపాలన సీయు ధర్మాత్ముజుండని
బలమందు భీముని పగిది యనియు
రెండు చేతులు పని నిండుగా చేసెడి
సాధుపోషణ సవ్యసాచి యనియు
దుర్మార్గులంగొట్టి దుడుకుగిత్తల పట్టి
పొగరణంచే మాద్ర పుత్రులనియు
కుంతి కొడుకుల నల్గురి గుణము బొగడి
చిన్న తమ్ముల నిద్దఱి జేర్చి చెప్ప
షడ్గుణైశ్వర మూర్తివి సాధువనగ
కర్షక! కర్మ పర్వము గాదె నీకు.

అంటాడు శాయిరెడ్డి గారు. అన్నీ దానములు చేసి చివరకు రిక్త హస్తములతో నిలిచి దాన కర్ణుడిగా పేరు పొందేవాడు కర్షకుడు. ఎన్ని కష్టములు వచ్చిన తను నమ్మిన భూమి తల్లిపై గంపెడాశతో మళ్లీ వ్యవసాయానికే సిద్ధమౌతాడు రైతు.

ఇంటిలోపల సతీ సుతులు ఈసడింప
బైట పగతురు బంధించి బాధపెట్ట
నయనములు మూసి పరులను నమ్మియుండ
హాలికా నిన్ను నే లెడి యాప్తులెవరు.

అంటూనే

కర్షకా నీకు శుభములు కలుగుతాయి
కర్షకా నీకు భద్రములు కలుగుతాయి.
కర్షకా నీకు సౌఖముల్ కలుగుతాయి
కర్షకా నీకు మంగళాల్ కలుగుతాయి

అంటూ దీవేనలిస్తాడు శాయరెడ్డిగారు.

ఉపయుక్త గ్రంథసూచి

1) ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు – ప్రయోగములు – డా॥. సి. నారాయణరెడ్డి.
2) దువ్వూరి రామిరెడ్డి కృతులు– కృషీవలుడు.
3) తెలుగుతో ఋతువర్ణ కావ్యములు – ఒక పరిశీలన
4) కాల స్థలాలకతీతం "కాపుబిడ్డ కావ్యం" (వ్యాసం) అమ్మంగి వేణుగోపాల్– మన తెలంగాణ
5) తెలంగాణ – మాసపత్రిక (నవంబర్–2017) (వ్యాసం) – దహగం సాంబమూర్తి.

భావకవిత్వం – ఎంకి పాటలు

డా॥ సూరపరాజు వసంత కుమారి, తెలుగు అధ్యాపకురాలు,, యస్.జి.యస్. ఆర్ట్స్ కళాశాల,
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

ఇరవయ్యో శతాబ్ది ప్రారంభంలో తొలిసారిగా "తెలుగు సాహిత్యం" లో ప్రబంధ కవితా ధోరణిపై తిరుగుబాటుగా వచ్చిన కవిత్వం "భావ కవిత్వం". ఆధునిక తెలుగు కవితా ధోరణుల్లో "భావకవిత్వం" ఒకటి. భావకవిత్వ ఉద్యమం తెలుగుదేశంలో మూడు దశాబ్దాల పాటు (1910–1940) సాగింది. భావ కవిత్వాన్ని "కాల్పనిక కవిత్వం" అని కూడా అంటారు. భావమే ప్రధానంగా సాగే కవిత్వమే భావ కవిత్వం. స్వేచ్ఛా ప్రియత్వం, ఆత్మాశ్రయత్వం, మానవ ప్రాధాన్యం, ఖండ కావ్యత్వం, ఆరాధనాతత్వం, మానవతావాదం, సంక్షిప్తత ఇవన్నీ కూడా భావకవిత్వ లక్షణాలు. ప్రణయ కవిత్వం, ప్రకృతి కవిత్వం, ఆధ్యాత్మిక కవిత్వం, దేశభక్తి కవిత్వం, సంఘ సంస్కరణ కవిత్వం, మానవతావాద కవిత్వం, స్తుతి కవిత్వం, స్మృతి కవిత్వం, బాలగేయ కవిత్వం ఇవన్నీ భావకవిత్వం యొక్క విభాగాలు.

తెలుగులో రాయప్రోలు, గురజాడ, అబ్బూరి, కృష్ణశాస్త్రి, విశ్వనాథ, నాయని, నండూరి భావ కవిత్వాన్ని సృష్టించారు. భావకవులు ఎందరో వున్నా వారిలో ప్రముఖంగా పేర్కొనదగినవారు అడవి బాపిరాజు, వెంకట పార్వతీశ్వర కవులు, వేదుల సత్యనారాయణశాస్త్రి, బసవరాజు అప్పారావు, దువ్వూరి రామిరెడ్డి, కొడాలి ఆంజనేయులు, కవికొండల వెంకటరావు, తుమ్మల సీతారామమూర్తి చౌదరి, చింతాదీక్షితులు, దీపాల పిచ్చయ్య శాస్త్రి, పురిపండా అప్పలస్వామి, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, బొడ్డు బాపిరాజు, శ్రీరంగం నారాయణ బాబు, దేవరకొండ బాలగంగాధరతిలక్, బాలాంత్రపు రజనీకాంతరావు, శ్రీమతి తల్లా ప్రగడ విశ్వసుందరమ్మ, శ్రీమతి చావలి బంగారమ్మ, శ్రీమతి బసవరాజు రాజ్య లక్ష్మమ్మ, శ్రీమతి పుట్టపర్తి కనకమ్మ మొదలైనవారు.

భావకవిత్వంలో ప్రణయ కవిత్వాన్ని వ్రాసిన ప్రముఖ భావకవుల్లో దేవులపల్లి కృష్ణశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, తల్లా వజ్జల శివశంకరశాస్త్రి, నాయని సుబ్బారావు, నండూరి సుబ్బారావు, అడవి బాపిరాజు ముఖ్యులు. భావకవిత్వంలో వీరందరు వారివారికిష్టమైన ఊహాసుందరులను సృష్టించి కవిత్వం వ్రాశారు. కృష్ణశాస్త్రి "ఊర్వశిని", విశ్వనాథ "కిన్నెరసానిని", శివశంకరశాస్త్రి "హృదయేశ్వరిని", నాయని "వత్సలను", నండూరి "ఎంకిని", బాపిరాజు "శశికళను" వారి ఊహాప్రేయసులుగా భావించి తమ భావకవిత్వాన్ని వ్రాశారు.

అందులో నండూరి సుబ్బారావుగారు వ్రాసిన ఎంకి పాటలు భావకవిత్వంలో ఎంతో ప్రముఖమైనవి. 1925లో ఎంకి పాటలు మొదటిసారి ప్రచురించబడ్డాయి. ఈ భావకవిత్వాన్ని నండూరి వారు వ్రాసి ఇప్పటికి సుమారు వందసంవత్సరాలు కావస్తూవుంది. వందసంవత్సరాల తర్వాత కూడా ఆ కవిత్వంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించే విధంగా ఈ ఎంకిపాటలు అత్యంత అద్భుతంగా రచింప బడ్డాయి. వంద సంవత్సరాల క్రితం రచింపబడ్డ ఈ ఎంకి పాటలకు పారుపల్లి రామకృష్ణయ్య మొదట బాణీలు కట్టారు. ప్రథమంగా నండూరి వారి నోటివెంట ఈ పాటలను ప్రజలు విన్నారు. తర్వాత ఆ పాటలు ప్రజలందరి నాలుకలపై నాట్యం చేసి ఎంతో ప్రాచుర్యాన్ని పొందాయి. మంగళంపల్లి బాలమురళీకృష్ణ లాంటి ప్రముఖ సంప్రదాయ శాస్త్రీయ సంగీత విద్వాంసులు కూడా ఎంకిపాటలు పాడారు. బసవరాజు అప్పారావు, కళాభాస్కర్, బాపు ఈ పాటలకు చిత్రాలు గీసారు. నేడు ఎంకి పాటలకు బాణీలు కూర్చి అంతర్జాలంలో యూట్యూబ్ ద్వారా అందరూ వీక్షించి రసానుభూతిని పొందేలా ప్రముఖ సంగీత డైరక్టర్ ఆర్.పి.

పట్నాయక్ చేశారు.

వందసంవత్సరాల తర్వాత కూడా నండూరి ఎంకి పాటలు చెక్కు చెదరకుండా వుండడం, ప్రజల నోట ఆ పాటలు వినపడడం, వాని గురించి చర్చించడం ఇవన్నీ కూడా అలనాడు గుఱ్ఱం జాషువా తెలిపిన క్రింద మాటలను స్ఫురింపచేస్తాయి.

రాజు మరణించెనొక తార రాలిపోయె
కవియు మరణించెనొక తార గగనమెక్కె
రాజు జీవించు రాతి విగ్రహములందు
సుకవి జీవించు ప్రజల నాలుకలయందు

అలతి అలతి పదాలతో అనంతమైన భావాన్ని అత్యంత అందంగా రచించిన ఎంకి పాటలు సంఖ్య పరంగా 42. జానపద సుందరిగా తెలుగు సాహితీ సౌధంలో అడుగుపెట్టి సాహితీప్రియులు మనుసులను దోచిన పవిత్ర ప్రణయ దేవత నండూరి వారి ఎంకి.

గుండె గొంతుకలోన కొట్లాడుతాదీ
కూకుండ నీదురా కూసింతసేపు!
నాకాసి సూస్తాది నవ్వు నవ్విస్తాది,
యెల్లి మాట్లాడిస్తే యిసిరికొడతాదీ!

(పాటపేరు: ముద్దుల నా యెంకి)

ఒకరోజు నండూరి సుబ్బారావు ట్రాంబండిలో ఇంటికి వస్తుండగా గొంతుకలో ఒక సన్నని రాగం బయలుదేరింది. క్రమంగా గుండె గొంతుకలోన కొట్లాడుతాదీ అనే పల్లవి రూపుదిద్దుకుని ఇంటికి చేరే సమయానికి ఎంకిపాటల్లో మొదటిపాట రచన పూర్తయింది. ఇలా ఎంకిపాటల సృష్టి ప్రారంభమైంది.

మెల్లంగ వస్తాది నా యెంకీ!
సల్లంగ వస్తాది నా యెంకీ!
పచ్చన్ని సేలోకి పండు యెన్నెల్లోన
నీలి సీరాగట్టి నీటు గొస్తావుంటె
వొయ్యార మొలికించు నా యెంకీ!
వొనలచ్చి మనిపించు నా యెంకీ!

(పాటపేరు: వొనలచ్చిమి)

పచ్చని చేలు, పండువెన్నెల, ప్రకృతి అందాలు, నీలిరంగు చీరకట్టుకొని సలక్షణంగా లక్ష్మీదేవిలా కనిపించే వయ్యారాలు చిందిస్తూ వచ్చే ఎంకి అందాలు నండూరి పై పాటలో తెలిపాడు.

యెంకి వొంటి పిల్ల లేదోయి లేదోయి!
యెంకి నా వొంకింక రాదోయి రాదోయి!
మెళ్ళో పూసలపేరు,
తల్లో పూవులసేరు,
కళ్లెత్తితే సాలు
కనకాబిసేకాలు!
సెక్కిట సిన్నిమచ్చ,
సెపితే సాలదులచ్చ!
వొక్క నవ్వే యేలు
వొజ్జిర వొయిడూరాలు!

(పాటపేరు: నమిలి మింగిన నా యెంకి)

తెలుగువారి ఆడపడచు ఎంకి, స్వచ్ఛమైన జానపదపిల్ల ఎంకి. కల్లాకపటం తెలియని పల్లెటూరి అమ్మాయి ఎంకి. ఎందరో కావ్యనాయికల మధ్య తనకంటూ ఒక ప్రత్యేక స్థానంలో పుష్పించిన అడవిమల్లె ఎంకి. అందుకే తెలుగు సాహిత్యంలోనే ఎంకివంటి పిల్లలేదు, ఇక ఉండబోదు అని చెపుతూ, ఆమె మెడలో వేసుకొన్న పూసలదండ, తలలో పెట్టుకొన్న సేరు పూవులతో ఆమె ఎంత అందంగా వుందంటే కళ్ళుఎత్తి చూస్తే చాలు బంగారు అభిషేకం చేసినంత అమూల్యంగా వుందని, బుగ్గమీద వున్న ఆ చిన్న మచ్చ ఎంతో అద్భుతంగా వుందని, ఆమె అందం గురించి

చెప్పడానికి లక్ష మాటలైనా చాలవని, ఆమె ఒక్క నవ్వుకు వజ్రవైడూర్యాలు కూడా సాటిరావని, ఆమె హంసలాగా, తీర్చిదిద్దిన బొమ్మలా, అందాల బరిణిలా, ఆకాశంలోని నక్షత్రంలా ఎంతో అందంగా వుందని నండూరి వర్ణించాడు.

ఎంకి వూగెను కొమ్మ వుయ్యాలా! చంద్ర
వంక వూగెను బొమ్మ వుయ్యాలా!
దీపమై, తిలకమై
పీఠమై – ఎంకికి – కి
రీటమై. నెలవంక !
(పాటపేరు: ఉయ్యాల)

ఎంకి, నాయుడు బావలకీ ప్రకృతే నేస్తం. పల్లె ప్రణయ స్థలం. ఎంకి కొమ్మకు వూయల కట్టి దానిపై వెన్నెల్లో ఊగుతూ వుంది. క్రింద యేరు, ఆ యేటి నీళ్ళల్లో చంద్రవంక ప్రతిబింబం. ఎంకి వూయల ఊగుతూవుంటే ఆ చంద్రవంక ఎంకికి తిలకంగా, పీఠంగా, కిరీటంగా అమరుతూ అత్యంత అందంగా కనిపిస్తూవుందన్న భావుకతను ఈ పాటలో నండూరి వ్యక్తీకరించాడు.

"యెంతసే పున్నాను యిడిసి పెట్టాలేవు
తగువోళ్ళలో మనకి తలవొంపు" లంటాది!
యెన్నాని సెప్పేది యెంకి ముచ్చట్లు
యేటి సెప్పేది నా యెంకి ముచ్చట్లు?
యెన కెనక సూత్తానె యొల్లుతా వుంటాది
(పాటపేరు: యెంకి ముచ్చట్లు)

నాయకీ నాయకుల ప్రేమ గాఢత ఎంతో తెలిపే ఈ పాటలో ఎంతసేపు ఎంకి తన బావతో వున్నా ఆయనకు తనివి తీరకుండా ఆమె తిరిగి వెళ్ళడానికి అనుమతించకపోతే తమతోటివాళ్ళలో తలవంచుకునే పరిస్థితి వస్తుంది అని సుతిమెత్తగా ప్రియుడిని వొప్పించి, అతనిని వదిలి వెళ్ళడం తనకూ ఇష్టంలేక తిరిగి తిరిగి చూస్తూ వెళుతూ వున్న ఎంకి గురించి అద్భుతంగా యెంకి ముచ్చట్లు అనే పాటలో అద్భుతంగా నండూరి వివరించాడు.

యెం కొక్క దేవతై
యెలిసె నంటారు –
యింటింట పెడతారు
యెంకి నీ పేరు!
సాటేలా! నీకు మాటేలా? సిన్నతనమేలా? సిగ్గేలా?
(పాటపేరు: సాటేలా?)

అనే పాటలో నాయుడు బావ ఎంకితో మనది పవిత్రమైన ప్రేమ. నీకు ఎలాంటి చిన్నతనము లేదు. ఏవిధమైన మాటలు రావు. నిజమైన ప్రేమకు మంచితనానికి నీవు ప్రతిరూపమని అందరూ పొగడటమే కాదు, వాళ్ళ పిల్లలకు కూడా నీ పేరే పెట్టుకొంటారని చెపుతాడు.

నీ తోటె వుంటాను నాయుడు బావా!
నీ మాటె యింటాను నాయుడు బావా!
నీ నీడలోనే మేడ కడతా నాయుడు బావా!
(పాటపేరు: సతైకాలపు యెంకి)

ఎంకి నాయుడు బావలు ప్రేయసీ ప్రియులు. ఏమీ ఆశించకుండా ప్రేమను మాత్రమే కోరుకునే ఎంకి స్వచ్ఛమైన మనసు, ప్రియురాలికి ఏమి కావాలన్నా ఇవ్వాలనే ప్రేమతో కూడిన తపన కలిగిన ప్రియుడి భావాలు ఈ పాటలో మనకు దర్శనమిస్తాయి.

ఆవుల్ని దూడల్ని అత్తోరి కాడుంచి
మూటముల్లే గట్టీ ముసిలోల్లతో సెప్పి
యెంకీ నాతోటి రాయే – మన
యెంకటేశరుణ్ణి యెల్లి సూసొద్దాము
(పాటపేరు: యెంకితో తిరుపతి)

పడవెక్కి బద్రాద్రి పోదామా
బద్రాద్రి రాముణ్ణి సూదామా
గోదారి గంగలో కొంగు కొంగూగట్టి
కరువు తీరా బుటక లేదామా!
(పాటపేరు: యెంకితో బద్రాద్రి)

వివాహానంతరం కొత్త దంపతులు చేసే యాత్రల ప్రస్థావన పైపాటల్లో వర్ణింపబడినది. విహారయాత్ర, స్వామి అనుగ్రహం, పనుల నుండి విశ్రాంతి, దంపతుల మధ్య మరింత సాన్నిహిత్యం పెరిగే విధంగా ఎంకి నాయుడు బావలు తిరుపతిలో వేంకటేశ్వరస్వామిని బద్రాద్రిలోని శ్రీరాముడిని దర్శించుకొని, ఆనందంగా జీవనయానం సాగించే మధురమైన విషయాలను, నండూరి ఈ పాటలో రచించాడు.

ప్రకృతి, ప్రణయమే కాదు సరసమూ మరియు విరహము, అల్లరి, జానపదాల అందాలు, జానపదుల స్వచ్ఛత, వివాహబంధపు దివ్య అనుభూతులు, ఇలా ఎన్నో భావాలు, అద్భుతమైన తేట తెలుగు పదాలతో, తెలుగు ఏస, తెలుగు నుడి, తెలుగు నాదం, తెలుగు రుచి తెలుసుకునేలా రచింపబడ్డాయి. భావకవిత్వంలో విశిష్ఠ స్థానాన్ని పొందిన ఎంకిపాటలు నాటికీ నేటికీ పాఠకులకు ఎంతో రసానుభూతిని అందిస్తూ వున్నాయి.

భాగవతం - అంబరీషుని వైష్ణవభక్తి

కె.మహేష్, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.
చరవాణి: 88978 93650

మానవాళి శ్రేయస్సు కోరి పరమాత్మ తత్త్వాన్ని ప్రతిపాదించే మహానుభావులు, మహర్షులు, ప్రవక్తకులు బోధనలు ఈ పవిత్రమైన భరతఖండంలో నిరంతరం వినిపిస్తూనే ఉన్నాయి. పరమాత్మను చేరుటకు కర్మ, జ్ఞాన, భక్తి మార్గాలు మోక్షసాధనాలుగా చెప్పబడ్డాయి. ఇందులో ప్రధానంగా భక్తిమార్గం, సులభతరమైనదిగాను, అందరికీ ఆచరణ సాధ్యమైనదిగాను గుర్తించబడినది. అటువంటి భక్తి మార్గ విశిష్టతను గురించి తెలుసుకోవలసిన అవసరం ఉంది.

భక్తిపదనిరుక్తి :

'భజసేవాయాం' సేవార్థకమగు 'భజ్' అను ధాతువునకు 'క్తిన్' ప్రత్యయం చేరి 'భక్తి' అను పదం ఏర్పడినది. దీనికి సేవించుట అని అర్థం. ఈశ్వరుని ఉపాసించుట లేక సేవించుట అన్న అర్థంలో 'భక్తి' అను పదం రూఢి కెక్కినది.

పోతన రచించిన భాగవతంలో నవవిధ భక్తి మార్గాలను గురించి శ్లోక రూపంలో చెప్పడం జరిగింది. భారతీయ సాహిత్యంలో మహాభారత, రామాయణ, భాగవతాలు ఒక ఎత్తు అయితే సాహిత్య పరిజ్ఞానం మరొక ఎత్తు, సమస్తం ఈ ఇతిహాసాలలోనే దాగి ఉన్నది అనే మర్మాన్ని మానవులు తెలుసుకోగలగాలి. భక్తి వైపు పయనించిన భక్తులు భాగవతంలో ఎంతో మంది ఉన్నారు. వారిలో విష్ణు భక్తుడైన అంబరీషుని వైష్ణవ భక్తి గురించి తెలుసుకోందాం.

రాజా మను వంశానికి చెందిన రాజులలో నాభాగుని కొడుకు అంబరీషుడు. విష్ణుభక్తిలలో అగ్రగణ్యుడు. ఎంత విక్రమవంతుడో అంత శాంతపరుడు మనసులో మాధవునకు పీఠం ఇచ్చి, మాటలతో శ్రీహరి కీర్తికే ప్రాధాన్యత కలిగించుకొన్న ఘనుడు. నారాయణుని ఆలయాలను స్వయంగా తన చేతులతో దుమ్ము దులిపి శుద్ధిచేయడం విష్ణు కథా విశేషాలు వింటూ ఆనందంగా కాలం గడపడం అంబరీషుకి బాల్యం నుంచే అలవాటయింది. మహర్షులు వచ్చారంటే దిగ్గునే లేచి వెళ్ళి గాఢాలింగనం చేసుకొని తోడిచ్చి మన్నిస్తాడు. పుణ్యాత్ములతో తప్ప ఇతరులతో అంబరీషుడు కలలనైనా స్నేహం చేసి ఎరగడు. అటువంటి అంబరీషుడు ఒక వైపు రాజ్యపాలన మరొవైపు భక్తిని ఏవిధంగా అమలు పరుచుకొంటున్నాడో ఈ పద్యంలో తెలిపాడు.

సప్తద్వీప విశాల భూభరము దో:స్తంభంబునం బూని సం
ప్రాప్త శ్రీయుతుడై మహీవిభవ సంపచ్చాతురిం గల్గి దు
ర్వ్యాప్తిం జెందక వైష్ణవార్చనల మేరం గాలముం బుచ్చుచున్
సుప్తిం బొంద యొప్పె సద్గుణ గరిష్ఠుండంబరీషుం డిలన్.

(పోతన భాగవతం, నవమ స్కంధం, ప-81)

శ్రేష్ఠుడైన ఆ అంబరీషుడు ఏడు దీవులతో కూడిన భూమండల భారాన్ని తన భుజస్తంభాల మీద మోపి సమస్త శుభాలనూ పొంది, రాజ్య సంపదను కలిగి చెడునడతకు లోనుకాకుండా, విష్ణుపూజలతోనే కాలాన్ని వెల్లబుచ్చుతూ ఏమరుపాటు పొందక ఈ లోకంలో ప్రశస్తిగాంచాడు. రాజ్యపాలన చేసిన కొంత కాలానికి ఐహిక సుఖాలన్ని తెగగోసుకున్నాడు. పరమభక్తుడైన విష్ణుసేవా విషయకంగా కాలం గడిపేవాడైపోయాడు. ఆ భక్తుని భక్తితత్పరతకు మెచ్చి

శ్రీహరి వచ్చి ఒకనాడు శత్రు శిక్షకం, జగద్రక్షా సుక్రమయిన సుదర్శన చక్రాన్ని అంబరీషునికి ప్రసాదించాడు.

తన తోడ నీడ కైవతి
నను రూప గుణాధ్యయైన యాత్మ మహిషితో
జనవిభుడు ద్వాదశీవ్రత

మొనరగ హరి గూర్చి చేనేనొక యేడథిపా: (పోతన భాగవతం, నవమ స్కంధం, ప-90)

ఓ రాజా! గుణవంతురాలై తనకు తోడునీడలాగా ఉన్న పట్టపురాణి కలసి ఆ అంబరీషుడు ఒక సంవత్సరంపాటు శ్రీహరిని గురించి ద్వాదశి వ్రతాన్ని చేశారు. ఆరు వందలకోట్ల పాడి ఆవులను ఆ రాజు వైదిక శ్రేష్ఠులకు దానం చేశాడు.

పెక్కుంద్రు విప్రవరలకు
గ్రక్కున నతిభక్తితోడ గడుపులు నిండం
బొక్కపు టన్నంబిడి విభు

డొక్కెడ బారణము సేయు నుద్యోగించెన్. (పోతన భాగవతం, నవమ స్కంధం, ప-93)

మహర్షులందరికీ భోజనం పెడుతున్న సమయానికి దుర్వాసుడు ఆ అంబరీషుని విడిదికి వెళ్ళాడు. ఆ మునీంద్రుని చూసి అంబరీషుని తన ఇంట దేవతార్చన చేయవలసినదిగా ప్రార్థిస్తాడు. అంబరీషుని ప్రార్థన మన్నించి దుర్వాసుడు స్నానం చేసి వస్తానని యమునకు వెళ్ళాడు. అలా వెళ్ళినవాడు అక్కడే ఉండిపోయాడు. అంబరీషుడు నియమం ప్రకారం పారణ చేయడానికి అర ముహూర్తం మాత్రం మిగిలి ఉన్నది. అది దాటిపోతే ద్వాదశి తిథి ఘడియలు దాటిపోతే వ్రతం భంగం కలుగుతుందన్న అంబరీషుడు ఎదురుచూస్తున్నడు అప్పటికి దుర్వాసుడు రాలేదు. బ్రహ్మణోత్తముడు భుజించకుండా తాను భుజిస్తే ఎంగిలి పెట్టినట్టు అవుతుందని, అది మహాదోషంగా భావించి రాజుకు ఏమి చేయాలో తోచక విద్వాంసులైన బ్రహ్మణులను రప్పించి మహాత్ములారా! మహాముని స్నానంచేసి వస్తానని వెళ్ళి ఇప్పటికి రాలేదు. అతని కోసం కూర్చుంటే వ్రతభంగం అవుతుంది. ఇప్పుడు ఏమి చేయాలో ధర్మం విచారించి సెలవియ్యండి అని అభ్యర్థించారు. అప్పుడు విద్వాంసులు-

మునినీరు సొచ్చి వెడలడు
చనియెడు ద్వోదశియు నెంత సవియెన్నిలో
నన హారణచేయవలయు

వినివింపురి దర్వమైన విద మెట్టిది యోజ. (పోతన భాగవతం, నవమ స్కంధం, ప.98)

రాజా అతిథి కోసం ద్వాదశి పారణ విడిచిపెట్టుట మంచి పని కాదు ఒక పని చెయ్యి ఇంత మంచినీరు తీసుకొని శ్రీహరిని స్మరిస్తూ నీరు త్రాగు అది భుజించినట్టు కాదు. పారణ చేసినట్టు అవుతుంది అని ధర్మ సందేహం పోగొట్టారు. సరే అని అంబరీషుడు మనసులో హరిని ధ్యానించి మంచినీరు త్రాగి, అతిథి కోసం వేచి ఉన్నాడు. అప్పటికి స్నానం, ధ్యానం పూర్తి చేసుకొని దుర్వాసుడు వచ్చాడు. రాగానే ఆహార పదార్థాలు వడ్డించాడు. రాజు నీరు త్రాగాడన్న విషయాన్ని దుర్వాసుడు అంతర్ దృష్టితో గ్రహించి మండిపడ్డాడు. కోపిష్టి అయిన దుర్వాసుడు బ్రాహ్మణుడికి చేసే మర్యాద యిదేనా? అని అంబరీషున్ని నిందించి అతని పైకి ఒక శక్తిని పంపాడు. ఆ దుష్ట శక్తిని నాశనం చేయమని అంబరీషుడు సుదర్శన చక్రాన్ని పంపాడు. ఆ సుదర్శన చక్రం ఆ శక్తిని నాశనం చేసి దుర్వాసుని పైకి వెళ్ళింది. దుర్వాసుడు కాళ్ళకి బుద్ధి చెప్పి పరుగెత్తుకెళ్ళి మేరు పర్వతం గుహలో ప్రవేశించాడు. పాము వెంట కార్చిచ్చులాగ ముని వెంట వెళ్ళి గుహలో ప్రవేశించింది. ముని అక్కడ నుండి భూగర్భంలోకి ప్రవేశించిన చక్రం వెంబడిస్తున్నది. అక్కడ నుండి లకుముకి పెట్టలా ఆకాశానికి పయనించారు. చక్రం నిర్వ క్రమంగా వెంటపడినది దానిని చూచి దుర్వాసుడు పరుగులు తీసి ముల్లోకాలను తిరిగితే రక్షించేవారు కనబడలేదని

దుర్వాసుడు బ్రహ్మను దర్శించాడు. విధాతా! విష్ణుచక్రం బారి నుండి నన్ను రక్షించు అని ప్రాధేయపడ్డాడు. దుర్వాసుని అవస్థను చూచి బ్రహ్మ శివుని వేడుకోమని హితువు పలికాడు. ఆలస్యం చేయక దుర్వాసుని శివుని వద్దకు చేరుకొన్నాడు. శివుడు "దుర్వాసా! విష్ణువంటే యెవరో నీకు తెలియదా! బ్రహ్మాండాలన్ని ఆయన కల్పించిన బొమ్మరిల్లు, అతని ఆయుధాన్ని ఎదిరించడం అంటే మాటలతో అయ్యేపని కాదు. అయినా ఒక ఉపాయం చెప్తాను విను నీవు బుద్ధిమంతుడవై తిన్నగా వైకుంఠానికి వెళ్లి అతనినే ప్రార్థించే దయానిధి కనుక ఆయన రక్షిస్తాడు అని పలికాడు.

'దిక్కులేని వారికి దేవుడే దిక్కు' అన్నట్టుగా దుర్వాసుడు వైకుంఠానికి పయనించాడు. ఆ శ్రీహరి దర్శన భాగ్యాన్ని కల్పించి నిన్ను రక్షించేది అంబరీషుడే కానీ నేను కాదనుకో! ఆ పుణ్యాత్ముడు నాకు నచ్చిన భక్తుడు, బుద్ధిమంతుడు కనుక వెళ్ళి అతని మనస్సు సంతోషించేటట్టు శరణు వేడుకో అభయమిచ్చి రక్షిస్తాడు అని మహావిష్ణువు హితువు పలికాడు. అప్పటికి గానీ దుర్వాసునికి బుద్ధిరాలేదు. అంబరీషుడున్న చోటికి వెళ్ళి అతని పాదాల మీద పడి "శరుణు శరణు భక్తరేవణ్యా! రక్షించు రక్షించు అపరాధిని" అని ప్రార్థించి అంబరీషుని కాళ్ళపై సాగిలపడ్డాడు. ఒక బ్రాహ్మణుడు తన కాళ్ళు పట్టుకున్నాడు.

ఇది ఏమి ప్రమాదానికి దారి తీస్తోందో అని భయపడి పాదాలను వెనక్కు తీసుకొని ముందున్న సుదర్శన చక్రాన్ని శాంతించమని ప్రార్థించారు. అంబరీషుని స్తుతికి చక్రం శాంతించింది. 'బతుకు జీవుడా' అనే పెదవులు నాలుకలు తడుపుకుంటూ, గొంతు సవరించుకొని మెల్లగా రాజుని ఇలా దీవించాడు.

నరనాథోత్తమ! మేలుసేని కదా! నా తప్పు మన్నించు శ్రీ
హరి పాదాబ్జము లింత ముట్టు గొలుతే? యాశ్చర్యమ
నెన్నుచో
నరుదండ్రే నినుబోటి సాధులకు దానైయిచ్చుటల్
గాచుటల్
సొరిదిన్ నైజ గుణంబులై సరసవచ్చుం గాదె
మిత్రాకృతిన్

(పోతన భాగవతం, నవమ స్కంధం – 140)

ఓ రాజ శ్రేష్ముడా! నా తప్పులను మన్నించి మేలు చేశావు. శ్రీహరి పాదా పద్మాలను ఇంతగాఢంగా నమ్మి సేవించావా! ఇది ఆశ్చర్యం కానీ నీవంటి సాధవుకు సహజ గుణాలై మైత్రి భావంతో సరసంగా సంప్రాప్తిస్తాయి కదా! అని దుర్వాసుడు పలికాడు. అంబరీషుడు మందహాసం చేసి తాపసోత్తమా నన్ను నీవింతగా పొగడనక్కరలేదు. సర్వమయం అయిన శ్రీహరికి ఎప్పుడేది చేయాలో తెలియదా! సరేగానీ తన ఆతిథ్యాన్ని స్వీకరించి వెళ్ళవలసిందిగా కోరుతాడు. దుర్వాసుడు ఆతిథ్యాన్ని స్వీకరించి "నీ చరిత్రములో కాలలో కీర్తి నీయము ఆగుగాక! పోయివస్తాను" అని అంబరీషుణ్ణి దీవించి ఆకాశ మార్గంలో సత్యలోకానికి వెళ్ళిపోయాడు.

తనకు సదృశులైన తనయులరావించి
ధరణి భరము వారి దాల్ప బంచి
కాననంబు సొచ్చెగా మాది విజయుడై
నరవిభుండు హరిసనాథుడగుచు (పోతన భాగవతం, నవమ స్కంధం, ప–152)

ఈ విధంగా విరక్తుడై కామాది అరిషడ్వార్గాన్ని జయించిన అంబరీషుడు తనకు సాటి వచ్చే కొడుకులను పిలిపించి రాజ్యభారాన్ని వారికి అప్పగించిన పిమ్మట శ్రీహరి కటాక్షాన్ని పొంది తపస్సుకోసం అరణ్యానికి వెళ్ళిపోయాడు.

యీయంబరీషు చరితము
తీయంబున విన్న జరువ ధీసంపన్నుం
డైయుండును భోగపరుం
డైయుండును నరుడు పుణ్యుడై యుండునృపా (పోతన భాగవతం, నవమ స్కంధం, ప–153)

ఓ రాజా అంబరీషుని చరిత్రను ఆసక్తితో విన్నా, చదివినా నరుడు బుద్ధిమంతుడై, భోగపరుడై ఉంటాడు అని 'అంబరీషోపాఖ్యానం'లో పేర్కొనబడింది.

మానవుడు తనలోని అహన్ని వీడి అంబరీషునిలా భక్తిని పెంపొందించుకోవాలి. నేటి సమాజంలో దుర్వాసుడు లాంటి వారికి తగిన బుద్ధి చెప్పి భక్తి మార్గం వైపు పయనించే విధంగా హితవు చెప్పాలి. ముఖ్యంగా నేటి యువతలు మంచి మార్కులు రాలేదని, అనుకున్నది సాధించలేదని చావే శరణ్యం అని ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. ఇకనైన కుటుంబ పెద్దలు చదువు చదువు అని కాకుండా చదువుతో పాటు కొంత భక్తి మార్గం వైపు వారిని పయనింప జేయవలసిన బాధ్యత నాటి సమాజంపై ఎంతైనా ఉంది.

ఆధార గ్రంథాలు :

1. శ్రీమహాభాగవతం (నవమ స్కంధం) – బమ్మెర పోతన
2. శ్రీమహాభాగవతం (వచనం), (ద్వితీయభాగం) – శ్రీయామిజాల పద్మనాభస్వామి.

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 8, August 2022 (Spl. Issue)
ISSN No.2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
Under Arts and Humanities Category

తెలుగులో కరోనా వ్యాధిపై వచ్చిన సాహిత్యం – పరిశీలన

ముత్తినేని సంతోషి కుమార్, మంచిర్యాల్. చరవాణి: 9492845912

పరిచయం

తెలుగు సాహిత్యంలో కరోనా మరో కొత్త విప్లవానికి తెర తీసింది. రాజకీయం, వ్యాపారాలకే పరిమితమైన జూమ్/ గూగుల్ మీట్ సమావేశాలు తెలుగు సాహిత్య సమావేశాలకు వేదికైంది.

"చీకటి రోజుల్లో గానాలు ఉండవా... ఉండకేం.. చీకటి రోజుల్లో గానాలు ఉంటాయి.. అన్నాడు ప్రపంచ ప్రఖ్యాత నాటక కర్త బేరస్తోచ్ బ్రెస్ట్. అలాగే కరోనా రోజుల్లో కరోనా గురించి గానాలు ప్రపంచవ్యాప్తంగా పోటెత్తాయి. కరోనా పుట్టింది అనుకుంటున్న చైనా లోని వుహాన్ కు కవి దగ్గర నుండి తెలంగాణాలోని జమ్మికుంటకు చెందిన అదేశ్ రవి వరకూ ఉన్నారు. తెలుగు కవి జాతీయోద్యమం నుండి అస్తిత్వ ఉద్యమాల కవిత్వం వరకూ ముందుండి గొంతు నినదించాడు. ప్రపంచ యవనిక మీద ఎక్కడ చీమ చిటుక్కు మన్నా అది తనకే జరిగినట్లు కలవరపడిపోయాడు. దానికి ఉదంతాలు కోకొల్లలు.

కరోనా అనే పేరు ఒక ప్రాంతానికో, రాష్ట్రానికో, దేశానికో సంబంధించినది కాదు. పపంచవ్యాప్త పదం అయింది. ఈ పదం మొత్తం ప్రపంచాన్ని అతలాకుతలం చేసింది. ఇప్పటివరకూ వ్యాధి అనేది కొన్ని ప్రాంతాల వారికి పరిమితమై ఉండేది. ఇతర ప్రాంతాల వారికి పరిచయం ఉండేది కాదు. కొన్ని రోజులు కొంత మందిపై మాత్రమే ప్రభావం చూపేది. ఈ మహమ్మారి వ్యాధి ఊహించని రీతిలో ఎన్నో కుటుంబాలను చిన్నా భిన్నం చేసింది. ఈ క్రమంలో తెలంగాణా ప్రాంతంలో కవులు, రచయితలు తమ కవిత్వం ద్వారా రచనల ద్వారా ప్రజలకు ధైర్యం చెప్పారు.

హైదరాబాద్ ఆకాశవాణి ఉద్యోగి అయినంపూడి శ్రీలక్ష్మి 'రిటర్న్ గిఫ్ట్ టు కరోనా' పేరుతో రాసిన కవిత తెలంగాణా ముఖ్యమంత్రి దృష్టికి రావడం, ఆయన మీడియా సమావేశంలో ప్రముఖంగా ప్రస్తావించి కవులందరూ కరోనా పై కలాలు ఝళిపించాలని పిలుపునివ్వడంతో కరోనాపై కవిత్వం ఊపందుకున్నది. రాత్రికి రాత్రే కరోనాపై శతకాలు వెలువడ్డాయి. 'రిటర్న్ గిఫ్ట్ టు కరోనా' పేరుతో యూట్యూబ్ గ్రూపును తయారు చేసి అందులో వందల సంఖ్యలో కవుల వీడియోలను, కవితలను పొందుపరిచారు. ఇటువంటి సందర్భాల్లో రాశి వాసిని మింగేస్తుందన్న విషయం మన అందరికీ తెలిసిందే. ఒక దశలో తెలుగు నాట నాలుగు చెరుగులా పోటెత్తిన కరోనా కవితలు చూస్తుంటే కరోనా కంటే కవిత్వమే వేగంగా వ్యాపించిందేమో అనిపించింది.

కరోనా సమయంలో తెలుగులో అన్ని దినపత్రికలు సాహిత్యానికి ఒక పూర్తి పేజి కేటాయించారు. సాహిత్యానికి దూరంగా ఉన్న అన్ని పత్రికలు కరోనా సాహిత్యాన్ని ప్రచురించాయి. కొన్ని పత్రికలు నగదు బహుమతులతో సహా కరోనాపై కవితల పోటీని నిర్వహించాయి. ఈ పోటీల్లో ప్రముఖ కవుల నుండి కొత్తగా కలం పదుతున్న వారి వరకూ పాల్గొనడం విశేషం.

కవిత్వ ప్రక్రియలైన వచన కవిత, గేయం, పద్యం వంటి అన్ని ప్రక్రియల్లోనూ ప్రజల రచనలు తామర తంపరగా వెలువడ్డాయి. సినిమా సెలబ్రిటీలు సందేశాలు ఇచ్చారు. కొన్ని టీవీ చానళ్ళు యధాశక్తి పాటలను రూపొందించి చైతన్య పరిచాయి.

ఖమ్మం నుండి తోట సుభాషిణి గారి సంపాదకత్వంలో 'క్రిమి సంహారం', బిల్ల మహేందర్ గారి సంపాదకత్వంలో 'వలస దు:ఖం' కరోనా కవితా సంకలనాలు వెలుగు చూసాయి. అనేక సాహిత్య సంస్థలు సాహిత్య కవితా సంకలనాల కూర్పుకు నడుము కట్టాయి. తెలంగాణ ప్రభుత్వ రాష్ట్ర సాంస్కృతిక శాఖ తరపున ఒక కవితా సంకలనం రూపొందుతుందని తెలిసింది. కరోనా తెలుగు సాహిత్యంలో కొత్త పోకడలకు దారి తీయగా పాత ప్రశ్నలే కొత్త రూపంలో ముందుకు వచ్చాయి. కరోనా వ్యాధికి సంబంధించిన ఆంగ్ల పదజాలం, తెలుగు అనువాదాలపై ఉపయోగకరమైన చర్చ జరిగింది. క్వారంటైన్, ఐసొలేషన్, సానిటైజర్, మాస్క్ వంటి పదాలకు తెలుగు అనువాదాలను ఆన్వేషించే పనిలో అనువాదకులు ఉన్నారు. మరి ముఖ్యంగా సోషల్ డిస్టెన్స్ వంటి పదానికి రూపొందించిన సామాజిక దూరం పదంపై దళిత, స్త్రీవాద సమూహాల నుండి తీవ్ర అభ్యంతరాలు వెలువడ్డాయి. ఇది ఈ దేశ కళంకమైన అంటరానితనాన్ని గుర్తు తెచ్చేలా ఉందని, దాని స్థానంలో భౌతిక దూరం వంటి పదాలు వాడడం మంచిదని సూచనలు వచ్చాయి. ఈ సాందర్భంలో కొందరు రాసిన పద్యాలు, పాటలు స్త్రీవాదుల నుండి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది.

కరోనా వ్యాధి నివారణ చర్యలు, మరణాలు ఒక ఎత్తయితే, దేశవ్యాప్తంగా ప్రత్యక్షంగా నరకం అనుభవించిన లక్షలాది వలస కూలీల వ్యధలు వర్ణించలేనివి. సామాజిక మాధ్యమాల్లో ప్రసారం అయిన వారి వలస కూలీల వెతలు అందరికీ కంటనీరు తెప్పించాయి. కవుల కవితలు, చిత్రకారుల బొమ్మలు, వలస కూలీల పాదాల కింద హృదయాలను వ్యక్తపరిచాయి.

ఈ సందర్భంలో తెలంగాణకు చెందిన సినీ సంగీత కళాకారుడు అదేశ్ రవి గారు రాసిన పాట:

పిల్లా జెల్లా ఇంటి కాడా ఎట్లా ఉండ్రో ... నా ముసలి తల్లి

ఏమి వెట్టి సాదుతుందో ....

.....

దేశమేమో గొప్పదాయే ...

మా బతుకులేమో చిన్నవాయే .....

బస్సులొద్దు.... బండ్లు వద్దు ....ఆయ్యా సారూ ...

ఇడిసిపెడితే ... నేను నడిసి...పోతా సారు..

ఈ గేయం లాక్‌డౌన్ వలన కూలీల వ్యధలకు ఆర్ద్రత నిండిన డాక్యుమెంటరీ రూపం. ఈ పాటపై పత్రికా సంపాదకీయం రావడం విశేషం. ఇంకా అనేకమంది ఔత్సాహికులు కరోనా నేపధ్యంలో వీడియో పాటలను విడుదల చేసారు.

ప్రముఖ కవి ఎన్.గోపి గారు ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న కరోనా వైరస్‌పై ఓ కవిత రాసారు.

రోగాన్ని దాచుకోవద్దా అదేమన్నా అపరాధమా..

పాములు అంతటా తిరుగుతుంటాయి..

అవి ఎవరినైనా కాటేయవచ్చు ...

.....

డా.ఎం.దేవేంద్ర అనే కవయిత్రి కరోనాపై యుద్ధం చేయాల్సిన విషయాన్ని గుర్తు చేస్తూ దేవేంద్ర గారు కవిత రాసారు.

ఒక రాష్ట్రమని కాదు..

దేశ దేశాల రోడ్లన్నీ

నిర్మానుష్య వైనం ..

మానవుల ప్రయాణాలకు అడ్డుకట్ట పడిన దైన్యం..

కరోనాపై యుద్ధం చేయాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నారు.

ముగింపు:

ఈ సందర్భంగా తెలుగు భాషలో వెలువడిన కరోనా కు సంబంధించిన సాహిత్యాన్ని పరిశీలించాలని అనుకుంటున్నాను. సాహిత్య ప్రక్రియలు అయిన కవిత, కథ, పద్యం, శతకాలను, మొదలైన ప్రక్రియలను సమగ్రంగా పరిశీలించాలని నిర్ణయించుకున్నాను. అందువల్ల తెలుగు భాషలో వచ్చిన కరోనా వ్యాధికి సంబంధించిన సాహిత్యం గురించి పరిశోధన కొనసాగించాలని అనుకుంటున్నాను.

ఉపయుక్త గ్రంథ సూచి:

1. అంతర్జాలం
2. వివిధ పత్రికలు

HISTORY OF JOURNALS IN NELLORE AND BAPATLA DURING COLONIAL PERIOD IN INDIA; 1882-1947

Dr. Seelam Srinivasa Rao, Assistant Professor of History, Sri Sathya Sai University for Human Excellence, Kalaburagi.

Abstract :

Press is an important component in the colonial period and played a key role in society. The past decades have seen the impact of the press in the Telugu region. However, those changes are having a serious effect on Telugu Society. In many researches the role of the press was taken but at a micro level, it was not studied at Nellore and Bapatla. The research to study has tended to focus on the press in Nellore. The paper will focus on the historical origin of the modern press in Telugu and various kinds of journals during the colonial period.

Key Words:

Press, Society, Culture, Printing, Social Capital.

Introduction :

The journals in colonial India are introduced by the colonial powers and slowly it was observed by the British provinces and princely states with their own social, political, religious, and cultural economic motives in British India. As part of that the development and cultural counters, religious counters, rational thoughts, and western philosophy are spread in the Telugu region. As of that journals are started in the *Nellore and Bapatla* in the fields of Political, Literature and Language, Agriculture, Economy, Industry, Trade and Law, Caste and Religion. The Nellore is part of the madras presidency located in central Andhra Pradesh. It played a vital role in social reformation and freedom movement during the colonial period through Journals.

Objective

The objective of the study is to understand the patterns of origin, growth, and development of the press in *Nellore and Bapatla*. To discover the status and role of the press in *Nellore and Bapatla* during the colonial period, find out the different types of newspapers and magazines along with the impact of the press on the socio-economic development of *Nellore and Bapatla*.

Review of Literature

Rabindranath Manukonda in his book "History of Telugu journalism print and electronic media" in his study almost covered various aspects of Telugu press and its patterns, and the different personalities of editors ship. Venkateswara Rao Telluri and Maluguri Srinivas both wrote Research articles in which they explored the role of the press: the mobilization of masses in

Telangana armed struggle. This study revealed the role of the press in Telangana region. B.Samamurthi, "the press under Nizam rule" mentioned the role of the press in Salar Jung period. Bellary Shamanna Kesavan (1984) "History of Printing and Publishing India". This volume deals with the origin of printing in India and almost covers the historical background and development of printing and publications in South India. Iyengar A.S (2001) "Role of Press and Indian freedom struggle" according to this book the writes explain about press's role in a political point of view was presented. Report of the Second Press Commission (1982), Publication Division, Ministry of Information and Broadcasting, Govt. of India, New Delhi, Volume 1 are available.

Hypothesis :

The paper is designed for empirical research of the historical evolution of the press in *Nellore*. No hypothesis is formulated here. The finding of this study generates criticisms.

Data and Methodology :

The study is descriptive and based on historical and empirical data about the press in *Nellore*. Sources of data and method of analysis dealing with the origin, growth, and development of the press in *Nellore and Bapatla* is mainly historical research-based. The works in this field of the press have been used by applying the document analysing method. Used secondary data from facts and figures from available books, journals, different websites and official records.

Nellore:

Nellore is one of the districts in Present Andhra Pradesh. During the colonial period, it was under the Madras presidency. "The name of Nellore district has been changed as Sri Potti Sriramulu Nellore District on 4th June 2008. The District is one of the nine Coastal districts of Andhra Pradesh and it is the Southernmost one. It lies between 13o 25' and 15o 55' N of the Northern Latitude and 79o 9' and 80o 14' of the Eastern Longitude. It spreads over an area of 13,076 sq. Kms and these account for 4.75% of the total area of the State.

Boundaries of the district are East; Bay of Bengal, West: Veligonda Hills which separate it from Kadapa district North: Prakasam District, South: Chittoor District and Tamilnadu"

Bapatla:

Bapatla is also one of the districts in Present Andhra Pradesh The District is bounded on the North by Guntur District, on the West by Palnadu or Narasaraopet and Prakasam Districts, on the South by the Bay of Bengal, on the East by Krishna Western Delta.

Journals from Nellore and Bapatla

The Nellore and Bapatla played a vital

role in publishing journals from the year 1899 with the effect of the Madras provenience Christian missionaries and social reformers under British India. The earliest journal was Sribharati monthly was started by Vavilikolanu Subba Rao in the year 1899 and journals are published in various fields like Political, Literature and Language, Agriculture, Economy, Industry, Trade and Law, Religion and Caste. Most journals are from the area of the political aspect.

Political Journals

The effect of the colonial rule in India and the efforts of the emergence of the educated elite social classes in British India paved the path for the freedom struggle and Nellore also played a significant role in the freedom struggle through political journals. The first political journal was Andhradeso pakari started as a Fortnightly in the year 1918 by Nelaturi Raghavacharyulu. The journal Nellore Patrika journal was a Weekly started in the year 1920 by a group of people Birudavolu Jagadiswara Prasadarao, Rebala Sundararamireddy, Amancharla Krishnarao, B.J. Prasadarao and it was also published under the association of 'Jnana Pracharini Sangham'. It was continued only for 9 months only, but due to the differences between the association members on 'Non cooperation Movement it was discontinued. Paturu Subbaramayya started the Simhapuri Weekly journal in the year 1923, after some period the editorship was given to Nyapathi Narayanamurthy who was the editor of the journals Andhra Prabha, Vauhini, Prabhatam, Vijayaprabha, Kalinga, Jayabharat and other journals. Dhurjati Subbarao started the journal Andhraranjani as a Fortnight journal in the year 1925. Tangirala Ramanatha Sarma started the weekly journal Andhramata in the year 1928, Mungara Subba Reddy started Swatantra weekly journal in the year 1928, and Nelluri Venkatrama Naidu started the journal Jamindari Raitupatrika as a Weekly in the year 1930. M.S.Murthy started a weekly journal Andhrapraja in the year 1941

Literature and Language

The madras presidency consists of various languages with Tamil, Telugu, Odiya, Kannada and the Tamil and Telugu regions are majorly dominated population. With the effect of British education and rationality, the press in the Madras presidency was also influenced and contributed to literary works through journals. As part of that, the literary journal was started in Nellore by Pundla Ramakrishnayya under the name of the Amudrita Grandhachintamani as a Monthly in the year 1885. The journal gave priority to the past literature works which are not available in print form and started publishing in book forms. Most important of those works are Bhogini Dandakam, Chandragada Charitra, Harischandra Nalopakhyanam,

Mitravinda Parinayam, Vasundhara Vijayamu, Yadava Raghava Pandaviyamu. The journal was continued up to the year 1904 and it was discontinued.

The journal Vagvalli was started as Monthly in the year 1899 by Komanduru Venkata Ramanuja Sarma. This played a vital role as a contradiction between the orthodox and rationality writings and a new way of thought in various forms and arguments on literature forms are published and even criticism are found on writings of his Vedam Venkataraya Sastri and Pundla Ramakrishnayya. It was continued up to the year 1903.

Agriculture, Economy, Industry, Trade and Law :

There are various associations in Nellore involved with the Agriculture, Economy, Industry and Trade laws. To enlighten their issues and expose their ideas and share the journal Sahakara Patrika was started as a Monthly In the year 1928 by Mannepalli Ramakrishnarao. Later on, the publication was moved into the hands of 'The Nellore District co operative Federation'. Later, it was run by Nellore District Banking Union under the editorship of Mamidipudi Venkata Rangayya and from 1933 onwards under the editorship of Vennelakanti Apparao, it was continued.

Purely based on Agriculture the journal Zamin Ryot was started as a weekly in the year 1930 under Nellore Venkatramanai. Among all the journals of the colonial period, this is the one which served for the longest period in Telugu. It was started in 1930 as a weekly to protect the rights of the farmers who are under Zamindars under the peasant's movements. This was started in 1930 when the peasant movements were rising in India.

Religion :

The religious journals played actively with the press and Christian missionaries in all entire British India. It influenced the Telugu region and from Nellore also one journal was published under the name of 'Arcot Mission' as a Monthly started in the year 1921 under the editorship of J. W Warshin. While compare with the other regions of Telugu, from Nellore only one journal was published.

Caste

The is one of the important components of Indian society by the end of the 19th and beginning of the 20th century several journals are stated in Telugu region to protect their superiority and social capital, as part of that the journal Deccan Vaishya was started as a fortnight to protect the rights of the Vaishya community in Nellore district by Juvvadi subbaraya Gupta

Journals from Bapatla :

The Bapatla also played important role in publishing journals during the colonial rule in India. The first Telugu journal from Bapatla

was Udyogasthudu a Monthly started in the year 1899 by Easuratnamu by the Christian missionary Salvation Army. In Literature and Language two journals were published the Vivekavardhani a Weekly started in the year 1912 by T. Kesavarao, The third journal was Jayalakshmi Monthly started published in the year 1935 by Somayya.

Conclusion :

The effect of the press and colonial rule influenced the Nellore and Bapatla region to publish the journal in various fields. Among all the journals most of them are in the field of politics to fight against the British and protect the political rights, and political issues of Local and British India. The Nellore Journalism influenced the public to participate actively in the freedom struggle and contributed to hundreds of freedom fighters. The journals also propagated the mahatma Gandhi Philosophy to lead the political movements in Nellore and bapatla.

References

1) Bellary Shamannakesav, (1984),'' History of printing and publishing in India: origin of printing and publishing in Karnataka, Andhra, Kerala, national book trust, the university of California.
2) Iyengar A.S, role of press and Indian freedom struggle ,New Delhi, A.P.H publishing corporation,2001.
3) Mangamma J, origins of Telugu printing,: Pub, Narla Shashtyabdapurti Celebration Committee; Andhra Pradesh Book Distributors, Secunderabad, Delhi,1968.
4) Nidathavoluvenkatarao, '' literary journalism'' in K.R Seshagirirao, Rashmi Publications, Delhi, 1968
5) Partha Sarkar, ''the press in India'', New Delhi, Akansha publishing house 2012.
6) Rabindranath Manukonda ''history of Telugu journalism print &electronic media, Kiran publications, 2003.
7) Seshagiri Rao K.R., Ed, Studies in the history of Telugu journalism; presented to V.R. Narla on the occasion of his Shashtyabdapurti, Pub, Narla Shashtyabdapurti Celebration Committee, Delhi,1968.

Websites

1) https://bapatla.ap.gov.in/about-district/
2) https://shodhganga , Genesis of the press in Madars.
3) https://shodhganga, the emergence of the press in Madras state.
4) https://spsnellore.ap.gov.in/nellore-district-profile/
5) https://www.vaishyasamaj.com

POET-SAINT FUSION: ANALYSING THE WORKS OF THE MEDIEVALINDIAN BHAKTI POETS

Dr. Ratnottama Das, Associate Professor, Department of M.I.L. & L.S., Faculty of Arts, University of Delhi, Delhi-110007

In the history of India, *Bhakti* is an epoch-making movement which started in Southern India and slowly spread to the North during the medieval period. *Bhakti* as a movement also has its bearings in the Indian Literature produced from different parts of the country during that time. In the period between 14th and 17'h centuries, the momentous *Bhakti* movement swept through the Central and Northern India, which was initiated by a loosely associated group of saint-poets without having much connection among them. The movement having its beginning in the South, under the initiation of the reformers, mystics and poets, a great wave of reform swept throughout India. Its exponents in the north were Ramananda and his followers like Kabir, Dadudayal, Nanak and others, in the west, Namadeva and others and in the east, Sankaradeva, Chaitanyadeva, the *Pancha-sakha*s of Orissa and their followers. Though they did not get a common platform to discuss and exchange their philosophical ideas, yet their philosophical thoughts were well understood because of their commonness in approach and the mode they selected for propagation. Nothing could have been a better mode than literature and the use of simple language and style were added advantage to their distribution of ideas to the followers. Hence the poet-saint fusion has a different effect in their endeavours.

There is a saying in old Hindi that,

bhakti dravidaupaji
fayeramananda
pargatkiyokabir ne
saptadweepnaukhanda

(Bhakti was born in South and brought by Ramanada, propagated by Kabir everywhere.) But it is surprising that how come the 'Dravid upaji' or the 'Dravid or south born' *bhakti* spread all over India and succeeded in reaching the common people, winning their hearts and reforming the society simultaneously. Only the philosophical ideas, thoughts and principles can never convince people to follow a particular path or religion which will lead to social reformation as well. Definitely there were some other reasons behinds this. And if the chord of the movement and the role of the torch-bearer saint-poets are studied in depth, it is felt that the reason of their success lies on the following features:

I. Humanism and secular ethics.

II. Significance of simplicity.

III. Use of easily understandable regional languages.

There is a saying in English, which may be quoted here-"Birds of a feather flock together". Without having any direct connection or interaction, all these great medieval Vaishnava

saints were like "birds of a feather" or likeminded, who "flocked together" in the vast sky of philosophy, religion and culture. But, their thoughts were beyond any particular religion. Even though most of them have never met one another in their whole life span, or even there was huge gap of decades or centuries between one and the other, their thoughts and philosophica l ideas were almost the same. Even though they were from different regions, different cultures or different languages, the essence of their thinking is one. Almost all of them adopted, more or less, the same way to reach the mass. And of course, above all, all of them were 'vaishnavas', the devoted lover of the supreme soul, be it *saguna or nirguna*. All of them were the seekers of the same nectar, the eternal ' Vaishnavite bhakti' .

During the Bhakti movement, the medieval saint poets did not renounce the path of their predecessors. On the other hand, they tried to show off their originality by appending their ideas to those of their predecessors. If their philosophies are analysed superficially, it may raise confusions and contradictions between *saguna*bhakti and *nirguna bhakti*, between the *advaita and dvaita* philosophy. But a close reading to their works would reveal that, the ultimate aim of all those saint-poets was to seek the eternal *Vaishnavite bhakti*. To end up such confusions of accepting different paths by the saint poets, few lines from Oriya saint-poet Achyutananda's*Gurugovindagita*, are cited here. He projects the two are complimentary to each other through the lines cited below:

dui se denarepakshiudikariyai
dui se chakshuresehu samsara sai
yekanathile kana dui gale andha
yenukarinirgunasagunapasehandha

(The bird flies with its two wings to see the world with its two eyes, without which one is blind, thus, like two eyes *nirguna*and *saguna*are chained together.)

Without discussing much about the differences on their ideas or the different paths the preachers took to spread their ideas, the focus will be on the striking commonness among them, which no doubt, were some of the main reasons behind the overwhelming response of the common people towards the gurus' preaching and teachings.

Humanism and secular ethics:

There is a not even slightest doubt that all the torch bearers of medieval bhakti movement were great humanists whose philanthropic philosophy was based on secular ethics and universal morality. Although they were the helmsmen of the great revolution, yet none of them was rigid systemiser. Neither they were dogmatic nor conventionally orthodox. To the contrary, those philanthropists were pragmatic ideologists who never criticised others' religion or never forced anyone to follow their religious path.

Rejecting all sorts of discriminations in order to see the whole world equally was the root motto of those preacher-reformers. The great saint SrimantaSankaradeva even advised to treat all beings as one 'self. According to him, among all the ways to emancipation, this is the best. The God is imminent even in the dog, the fox/ the untouchable;; and the donkey. Knowing this, one should respect all creations. Sankaradeva said:

sakalopranikedekhibekaatmaram
kukurasrigla/ chandala
gardabharoatmaram
janiyasabakoparikariya pranam

Secular ethics need to be distinguished from customs. Perhaps, right from the beginning of the creation of caste system , religious thinkers were not in support of this practice. But it took some time to react on the prevailing system and whenever the revolutionary saint poets got the opportunity, they did not mind to pin-point such discriminations. Same is true to Sankaradeva, who considering the negative aspects of such practice tried to alert the common mass to a keep a distance from the prevailing practices. While protesting against such thinking of the so called prominent and influential people of the society, who were projecting themselves as belonging to the higher caste, he has shown them the actual path for someone to move. His advice, *Hari nam* as the only way to achieve emancipation, comes in the '*pasanda mardana'* of *Kirtan Ghosa* as follows:

Krishnarakathatajitorasika
brahmana janma tara lagayakika
smatrokamatrahari dine rati
nabasayabhakatijatiajati

(If one person has deep interest in discussing about Lord Krishna and devotion, he does not need to aspire to be a *brahmana* or higher caste by birth. Let him just recall Hari day and night. Devotion makes no distinction between castes.)

Similarly the north Indian saint poet, Kabir, who was a weaver by profession, did not accept any sort of communal discrimination. According to him, there is only one God. Kabir considered himself as the child of Allah and Rama. Kabir said:

ek niranjanalahmera
Hindu turakduhunahimera
... sahib mera ek hain, duja kaha nehijaye

Narasimha Mehta (14 14-1480), the saint poet from Gujrat, also did not support the idea of distinguishing the people on the basis of their class, creed or colour. Narasimha Mehta went to the remote hamlets of the Pariahs and sang the bhajans along with them the whole night. Where he said:

Where from come in God departs
To the eyes of the dispassionate, all are equal

The founder of 'pranami sect', saint Prananath also echoed the same way by saying:

jat ek khusam ki, aur na koi jat

ek khusam ek duniya, aur udgayideji vat

(There is no other caste except that of the Lord. There is only one Lord and his universe. Others pale into insignificance.)

Significance of simplicity:

In the ideology of the medieval saint poets, 'simplicity' was always a major component. The significance of simplicity in their religious sect and moral teachings comes out even in brief revelation. By nature they were simple from tip to toe and to keep everything simple was their deliberate attempts so that philosophical ideas of religion could be easily understandable. SimplifYing the rituals also helped them to get mass support in short span of time. The abandonment of all ritualistic complexities, excessive, rigorous and banal formalities was common features of neo-Vaishnavism. All saint preachers of vaishnavite movement gave importance in recalling God's name. They were deadly against all sort of idol worship. Sankaradeva even said:

murtikonasaibaprasadonakhaiba

bhakti hoibobyabhichar

Saint Kabir also raised the question in the same tone as: why to worship the lifeless stone, "*pahinkukapujiye*", which never answers throughout life, "*jo janamnadeijabab!*"

Sankaradeva's worthy disciple Madhabadeva also made the bhakti simpler by saying that in singing in the praise of God, there are no rules, place, time, qualifications, and rituals:

Harinamakirtananahideshakalapatra

Niyama samajaekopbidhi (Namghosha)

It is to be noted that one of the prime aims of the bhakti movements was to reach the common/ downtrodden people of the society. So simplicity was a basic need for the religious revolution as the poor and downtrodden people were not in a position to accept a religion, which demands money to spend in the name of rituals. Then again, simplifying the complex philosophies of religion also made them popular among common mass.

Use of understandable regional languages:

India is such a country, where-

koshkash par bad/e pani

char kosh par bad/e bani

(In every two miles the water/weather changes and the language changes in every four miles.)

All the medieval poet-preceptors understood the problems of language very well. Perhaps that is why they always preferred a *'desi bhasa*' or a regional language to express their philosophical ideas and religious preaching. Some of the genius saint poets like Kabir, Surdas, Bhimaboi and Sarala Das were illiterate. In their case, using beautiful words and creating amazing verses was an innate quality, which always makes any reader or listener spell-bound. But other saints like Sankaradeva, who were scholars, used regional language deliberately

with the intention that it would reach the common people easily and they would be able to get the right sense out of it. It is needless to mention that they also used the artificial literary language, *brajabuli* for the same purpose. Whenever the saint poets translated some Sanskrit text or derived some stories from such texts, they always made a point to make the work as a piece of trans-creation, not a blunt and mere translation. For instance, when pre-Sankaradevavaishnavite poet Madhab Kandali translated the original *Ramayana*, he took the liberty to paint his work with local colour. According to Madhab Kandali,

kabisabanibandhayalokobyabahare
katonijakatolambha katha ansure

But when it comes to explain some complex some philosophical ideas in simple and easy language, obviously it becomes a herculean job, which the great genius saint poets of medieval India made it possible with their astonishing efficiency.

Another example of such composition is the Nabakshari by Oriya saint poet Atibadi*Jagannath Das'* Oriya *Bhagavata*, the entire Oriya *Bhagavata* is written in *nabksharibrutta*, where every line has nine letters. It is a perfect example of the use of simplest and easiest language. Jagannath Das, who is one among the *Panchasakhas* of medieval Bhakti movement of Orissa, composed the whole Bhagavata in nine syllabic verses. It starts with:

namainrusimhacharana
anadiparamakarana

Then it goes like this on the same rhythmic expression:

govindaGovindaGovinda
padugaluchimakaranda
se makarandapanakari
anande bola harihari
se harinam bandh bhela
parikaribechakadola
se chakadolakapayare
chitamothaunirantare
chitamonirantarethau
ha krushnabolijibajau
ha krushnabolijaujiba
mote udharabasudeva

The simple language and harmonious rhythm make it so easy to understand that it needs no explanation. Interestingly, in these lines in *Nabakshari*, the second line of a verse starts with the last word ofthe previous line. Like:

padugaluchimakaranda
se makarandapanakari

We can notice the proper repetition of the word 'makaranda '. Each and every line is connected with the previous line.

This composition reminds us of Sankaradeva's famous *'totaya'*. Though the *totaya* is in Sanskrit, it is as easy as old Assamese. In the totaya, the last word repetition

is maintained in each line. The expression follw a systematic pattern like this:

madhudanavadarana deva varang
varavarijalochana chakra dharang
dharanidhar dharana dhyeya parang
paramarthavidyasubhanashakarang
karchurnitasedipabhuribhagang
bhagabhushanakorchitapadajugang

These two are the representative examples from Orissa and Assam respectively. Other saint poets also applied similar poetic tricks in presenting their ideas through their writings. All of them represent the medieval literary as well as religious and philosophical traditions. Some of them are first poets and then, the philosophers and some of them are the reverse. The tradition of saints in India conceives the role of independent poets in their own unique ways with deep ethno-poetic significance. *Bhakti* is found in a universal fellowship where the basic principle is sharing. They represent the vital link in the mutation of the literary tradition into religion and culture. The dimensions of their works are so monumental that not only their contemporaries, the future generation will also be inspired. In a sense their stature, as poets belong more to the future than to a historically bound specific past. Thus, the poet-saint fusion gives us a unique view of their poetry itself. The moral integrity and the spiritual greatness are critical characteristics of both the poetry and poets of medieval India.

Panchasakha refers to the five associates of medieval Oriya bhakti literature. They are: Balaram Oas, Jagannath das, Achyutananda Das, Ananta Das (known as Shisu Ananta also) and Jasowanta Das. They are the believers of same philosophy and hence, they are also referred as panch sakhas (five branches).

Bibliography

Barua, Girish. Ed. *Srimanta Sankaradeva and His Philosophy*, Assam: Srimanta Sankaradeva Sangha. 2008.

Bhattacharyya, N.N. Ed., *Medieval Bhakti Movements in India*, 2nd ed, New Delhi: Munchiram Manoharalal Publishers Pvt. Ltd. 1999.

Borkakati, Sanjib Kumar. *Unique Contribution of Srimanta Sankaradeva in Religion and Culture*, Nagaon: Srimanta Sankaradeva Sangha. 2006. 2nd

Chaliha, Bhaba Prasad. Ed. *Sankaradeva Studies in Culture, 2nd* ed, Assam: Srimanta Sankaradeva Sangha. 1998.

Hess, Linda and Sukhdev Singh. *The Bijak of Kabir*, Reprint ed., New Delhi: Motilal

Banarsidass Publishers Pvt. Ltd. 2001.

Keay, F.E. *Kabir and his Followers,* New Delhi: Aravali Books International. 1997.

Mohanty, Jatindra Mohan. *History of Oriya Literature.* Bhubaneswar: Vidya. 2006.

Neog, Dimbeswar. *Jagat-Guru Sankardew The Founder of Mahapurusism*, 2nd ed, Assam: Srimanta Sankaradeva. 1998.

Sharma, Krishna. *Bhakti and the Bhakti Movement A New Perspective, 2nd* ed, New Delhi: Munchiram Manoharalal Publishers Pvt. Ltd. 2002.